ప్రాచ్యగాథాలహరి

294.592
74649

పూర్వగాథాలహరి

Donated by
Sri T. Madhusudana Rao

[అష్టాదశపురాణములందలి పూర్వగాథలకు సంబంధించిన ప్రతివ్యక్తియొక్కయు, ప్రతివిషయముయొక్కయు వివరము తెలిపెడి యాంధ్రనిఘంటువు.]

కృతికర్త:
శ్రీ వేమూరి శ్రీనివాసరావు, బి. ఏ., బి. ఎల్.,
అడ్వొకేట్, తణుకు

పబ్లిషర్సు:
వేంకట్రామ అండ్ కో.,
విజయవాడ - ఏలూరు - హైద్రాబాదు
1986

[సర్వస్వామ్య సంకలితము]

[మూల్యము రు 45-00

సాంకేతికములు

అగ్ని.	అగ్నిపురాణము	భాగ.	భాగవతము.
అరు.	అరుంధతీచరిత్ర.	భవి.	భవిష్యత్పురాణము.
ఉ. రా.	ఉత్తరరామాయణము.	భార.	భారతము.
ఉ. హ.	ఉత్తరహరివంశము.	భీమే.	భీమేశ్వరఖండము
కల్కి.	కల్కిపురాణము.	మత్స్య.	మత్స్యపురాణము.
కాశి.	కాశీఖండము.	మార్కం.	మార్కండేయపురాణము.
కూర్మ.	కూర్మపురాణము.	రఘు.	రఘువంశము.
ఛాన్దో.	ఛాన్దోగ్యోపనిషత్తు.	రామా.	రామాయణము.
జై. భా.	జైమినీ భారతము.	లింగ.	లింగపురాణము.
తు. కా.	తులాకావేరిమాహాత్మ్యము.	వరా.	వరాహపురాణము.
దే. భా.	దేవీభాగవతము.	వామ.	వామనపురాణము.
దేవా.	దేవాంగపురాణము.	వాయు.	వాయుపురాణము.
నార.	నారదీయపురాణము.	వేంక.	వేంకటాచలమాహాత్మ్యము.
పద్మ.	పద్మపురాణము.	వి. రా.	విచిత్రరామాయణము.
బ్రహ్మ.	బ్రహ్మపురాణము.	విష్ణు.	విష్ణుపురాణము.
బ్రహ్మాం.	బ్రహ్మాండపురాణము.	శివ.	శివపురాణము.
బ్ర. వై.	బ్రహ్మవైవర్తపురాణము.	స్కాంద.	స్కాందపురాణము.
బ్రహ్మో.	బ్రహ్మోత్తరఖండము. స్కాందపురాణము	హర.	హరవిలాసము.

294.5925 / బ్రి

Printed by Photo Offset Process at
VEMKATRAM PAPER PRODUCTS (P) Ltd.,
Narayanguda, Hyderabad-500029.

తొలిపలుకు

ఈ పుస్తకము ప్రథమమున బ్రకటించినపుడే యది యసమగ్రముగ నుండుట నాకుఁ దెలియును. ఐనను విద్యార్థుల పఠనగ్రంథములందు సూచితములగు గాథలు బాహుళ్యమున నందుండుటచే దానిఁ బ్రకటింప వెనుదీయలేదు; కాని లోపము నెఱింగినవాఁడ నగుటచే సారస్వతమునకు సంబంధములేని లౌకిక వ్యాపారమునందు మునిఁగియున్నను నద్దానిపై నొక కన్నుంచి యవకాశము చిక్కినపు డా లోపమును తీర్చుటకే యత్నించుచు వచ్చితిని. అట్లగుటనే యీ ముద్రణమునందు గొన్నిపుటలు పెరిఁగినవి. ఇప్పటికిని నిది సంపూర్ణగ్రంథమని యొక్కనాటి కనను. తెనుఁగుభాషయం దభిమానమున్న యే సంస్థవారలో, యే పరిషత్తువారో దీని ప్రాతిపదికగఁ గైకొని పెంచుకొని వచ్చుచో బాగుండెడిదని యనుకొనువాఁడను గాని యెవ్వార లట్టిపనిని దలపెట్టరైరి. నే నెవ్వరిని వేఁడఁబోవుదును !

పూర్వగాథాలహరి ప్రథమముద్రణముతోడనే నా తలపెట్టిన కార్యము సఫలమయ్యెను. ఈ గ్రంథనిర్మాణ సంకల్పము నేఁ జెన్నపట్టణములోఁ జదువుకొనుచుండఁగఁ గలిగెను. సంకల్పించినకార్యము సాధింపఁగల్గితిని. తెనుఁగున నపూర్వమైన గ్రంథము నందముగ నచ్చువేయించితిని. అది బాగుండని, ఓగుండని, ఒరుల కుపయోగించని, ఉపయోగించకపోని యీ విషయ మప్పుడు నా మనస్సులోలేదు. నా యౌవనపు టుత్సాహముతో నేఁ జేయగోరినపనిఁ జేసితిని. కాని పుస్తకమును బ్రచురింపఁగనే పలువురు కొనియాడుటయు, హిందీలోని కనువదించుట కొకరును, కన్నడభాషలోని కనువదించుట కింకొకరును అనుమతి గోరుటయుఁ దటస్థించెను. దానితో లోకమున గ్రంథమును బ్రవర్తింపఁ జేసినవానిపై గొంతబాధ్యత యున్నదని నామనస్సున నాటెను.

అన్యభాషలలోని కనువదించుటకు నాకెట్టి యభ్యంతరములేదని చెప్పి ఇతరభాషలలోను, నితర రాష్ట్రములలోను బ్రవర్తిల్లు గాథలకును, వీనికిని

వచ్చుటచ్చుట భేదముండుటఁ జూచితినని తెలియఁజేసితిని. వార లా కార్యము తలపెట్టినట్లు కనఁబడదు. అది మంచిదే.

పురాణగాథ లటుండ ఆధునికమైనవానిని సేకరించియుంచుట యవసరమని తోఁచును. మన తెనుఁగునకు బ్రాధాన్యము వచ్చినది. రసవంతములగు తెలుఁగురచనలు పూర్వకథలతోఁ బాలుపారుచుండును. కవు లుపయోగించు కొన్నివాక్యములు ప్రసిద్ధికెక్కి బహువ్యాప్తమగును. 'రెంటికిం జెడిన రేవడి నైతి' మొదలగునవి విరివిగ నుపయోగింపఁబడుచున్నను నందలి పూర్వకథ ఇదమిద్ధమని చెప్పుట కింకను బరిశోధన యవసరమగుచున్నది.

పుస్తకము కావలెనని నాకు వ్రాసినవారిలో నుపాధ్యాయులు, గ్రంథాలయమువారలు తమకుఁ బుస్తకము సగమువెలకే యిమ్మని వ్రాసిరి. ఉపాధ్యాయుల జీతములు తక్కువ. నాకుఁ దెలియును. కాని బహుజనపోషితములైన గ్రంథాలయము లేల సగమువెలకుఁ గోరవలెనో? ఇదివఱకుఁ బుస్తక ప్రచురణములోఁ గాలముతోఁబాటు ధనమును వ్యయమగుటచేతను, బుస్తక మసంపూర్ణమనుభావము దిగలాగుచుండుటచేతను, వీనికితోడు కాగితము కఱవగుటచేతను, దీని ద్వితీయముద్రణము నేను తలఁపెట్టలేదు. కాని యీపుస్తకము కావలెనని యింకను నుత్తరములు వచ్చుచుండుటచేతఁ గేవల గ్రంథప్రచురణకర్తలేగాక సారస్వతాభిమానులు, కవిజనపోషకులు వేంకట్రామ కంపెనీవారని విని యీ ముద్రణభారము వారికప్పగించితిని. ఈ పుస్తకమునకుఁ దగినట్లు మంచికాగితముపై చక్కని యచ్చు వేయించమని కోరితిని. ఇప్పటిధరల ననుసరించి నలుగుర కందుబాటులో నుండులాగుననే ధర నిర్ణయింతురని నా నమ్మకము.

తణుకు
15-1-1952

ఇట్లు
వేమూరి శ్రీనివాసరావు

శ్రీరస్తు

పూర్వగాథాలహరి

అ

అంగదపురము:-లక్ష్మణుని కుమారుఁడగు అంగదునిచే నిర్మింపఁబడిన పట్టణము. రామా.

అంగదుఁడు:-లక్ష్మణుని కుమారుఁడు. ఇతనిని, ఇతని సోదరుఁడగు చంద్రకేతునిఁ బశ్చిమదేశములకు రాజులుగఁ జేసిరి. ఇతని నగరము అంగదపురము. రామా.

అంగదుఁడు:-ఒక వానరుఁడు. వాలి పుత్త్రుఁడు. ఇతని తల్లి తార. (మండోదరియందు గూఢముగ వాలివలనఁ బుట్టినవాఁడనియు నొక ప్రతీతి గలదు.) రామునిచే వాలి చంపఁబడిన పిదపఁ గిష్కింధకు సుగ్రీవుఁడు రాజయ్యెను. అప్పుడితనికి యౌవరాజ్యపట్టము గట్టిరి తన తండ్రికిని, సుగ్రీవునకును శత్రుత్వముండినను, వీనిమూలముననే తనతండ్రి చంపఁబడినను నితఁడు పూర్వపువైరమును దలఁపక సుగ్రీవుని గొలిచియుండువాఁడు. సీతను వెదకుటకై యంగదుఁడు కొందఱు వానరులతోఁ గలిసి దక్షిణమునకు వెళ్లెను. అచ్చట సంపాతి సీతను రావణుఁ డెత్తుకొని లంకకుఁ బోయెనని చెప్పెను. అంగదుఁడు శతయోజనములుమాత్రము దాటఁగలుగుదుననియు, లంకకుఁ బోయినను తిరిగి వచ్చుధైర్యము లేదనియుఁ జెప్పెను. మఱియు సీతను జూడకుండ వెళ్ళినయెడల సుగ్రీవుఁడు దండించునని చింతించి యంగదుఁడు ప్రాయోపవేశము చేయఁబోయెను. జాంబవంతుఁ డది కూడనిపని యని మాన్పించి సముద్రమును హనుమంతుఁడు దాటఁగలడని చెప్పెను. అంగదుఁడుగూడ రామునిపక్షమునఁ బోరాడెను. రాముఁడు సేనతో లంకలో ప్రవేశించినపిమ్మట నంగదునిచే రావణునకు రాయబార మంపెను. సీతను రామున కప్పగించుమనియు, నతనితో యుద్ధము మానుమనియు నంగదుఁడు చెప్పెను. కాని రావణుఁ డీతని మాటలు వినలేదు. యుద్ధములో నితఁడు రావణుని సేనాధిపతియగు మహాకాయుని జంపెను. పటుతర దివ్యశక్తితోఁ బోరాడుటకై రావణుఁడు హోమము చేయుచున్నాఁడని రాముఁడు విని యా హోమము పూర్తికాకుండ భగ్నము సేయుటకై అంగదాదులను బంపెను. అంగదుఁడు రావణుని యంతఃపురమునకుఁ బోయి దుఃఖించుచుండిన మండోదరిని దలపట్టి రావణుని యెదుటకు నీడ్చుకొనివచ్చెను. రావణుఁడు హోమము చేయుట మాని తన భార్యను రక్షించుటకై వానరులతోఁ బోరాడెను. సుగ్రీవుఁడు రామునితో నయోధ్యకు వెళ్ళిన పిమ్మట నంగదుఁడే కిష్కింధకు రాజయ్యెను. రామా.

రామాజ్ఞవలననే యితఁడు కృష్ణావతారకాలమున బోయవాఁడై జన్మించెను. ఇతఁ డేసిన శరములే కృష్ణుని పాదములకుఁ దగిలి యితని మరణమునకుఁ గారణమయ్యెను. వాలిని నిష్కారణముగ సంహరించిన పాప మీరీతిగఁ బోయెను. జగన్నాథమాహాత్మ్యము.

అంగదేశము:- సరయూ గంగా నదులు కలియు చోటులనున్న దేశము. పూర్వము శివునిచే కాల్పఁబడిన మన్మథుని యంగములు బూడిదయై యచ్చటఁ బడియెను. కావున ఆ దేశమునకీ పేరు వచ్చెను. రామా.

అంగదేశము:- (చూడు అంగరాజు.)

అంగన:-ఉత్తరపుదిక్కున నున్న ఆఁడుఏనుగు.

అంగరాజు:-బలియను రాజుకుమారుఁడు. ఇతని తల్లి సుధేష్ణ. ఈమె భర్తృవియోగముచేత దీర్ఘతమునివలన నితనిని బడసెను ఇతఁడు రాజై రాజ్యము నేలెను. ఇతఁడు పాలించిన దేశమే అంగదేశము. (చూడుము సుధేష్ణ)

అంగరాజు:-కర్ణుఁడు. (చూడు.)

అంగారకుఁడు:-ఏకాదశరుద్రులలో నొకఁడు.

అంగారకుఁడు :- నవగ్రహములలో నొకఁడు. భూదేవి విష్ణుమూర్తిని కామించి స్త్రీ రూపము దాల్చి యాతని దన కోర్కెతీర్పుమని కోరెను విష్ణుమూర్తి అనుగ్రహించెను. భూదేవి పవడపు రూపమున నొక బీజమును విడిచెను. దాని నుండియే అంగారకుఁడు పుట్టెను. బ్ర. వై.

ఒకపారి విష్ణువుయొక్క స్వేదబిందు వొకటి భూమిమీదఁబడెను. అందుండి లోహితాంగుఁడను పురుషుండు జన్మించెను. అతఁడు తపస్సు చేసి బ్రహ్మను మెప్పించి గ్రహమయ్యెను. ఇతఁడే అంగారకుఁడు. పద్మ.

దాక్షాయణినిబాసినవిరహముచే శివుఁడు చింత నొందుచుండఁగ నతని శరీరమునుండి స్వేదబిందు వొకటి రాలెను. దానినుండి లోహితాంగుఁడను కుమారుఁ డొకఁడు పుట్టెను. వీనిని బుత్త్రభావమున భూదేవికూడ గ్రహించెను. ఇతఁడే అంగారకుడు.

అంగారపర్ణుఁడు:-ఒక గంధర్వుఁడు. కుబేరుని మిత్రుఁడు. ద్రుపదునగరమునకుఁ బోవుచున్న పాండవుల పాదములచప్పుడు విని, ఎవరు మీరు ? ఈరాత్రి నాకాననమున నిర్భయముగఁ జనుచున్నవారు ? ఈ కాననమును, ఈ గంగానదియు నంగారపర్ణునిదని యెఱుఁగరా ? అని కేకలు వేసెను. ఈ నది, ఎవరు స్నానము చేయుదురో వారిదిగాని నీదగునా ? నీవు వలదనినను నిట్లు పోవుట మానుదుమా ? అని యర్జునుఁడు ప్రత్యుత్తరమిచ్చెను. అంత నంగారపర్ణు డర్జునుని బాణములతోఁ గొట్టెను. అర్జునుఁడు వానిపై బాణములు వేసెను. వారిరువురకును జరిగిన పోరాటములో నర్జునుఁడు నంగారపర్ణుని నోడించి వానిజుట్టుపట్టి యీడ్చుచు ధర్మరాజు కడకుఁ దీసికొని వచ్చెను. అంగారపర్ణుని భార్య నాకుఁ బతిదానమిండని యేడ్చుచు ధర్మరాజునొద్దకు రాఁగా నతఁడు జాలిపడి యాగంధర్వుని విడిపించెను. అంగారపర్ణుఁ డర్జునుని బల పరాక్రమములకు మెచ్చుకొని వానిచెలిమి నపేక్షించి వానికిఁ జాక్షుషియను గంధర్వవిద్య నుపదేశించి కొన్ని గంధర్వ హయములను గూడ నిచ్చెను. అర్జునుని బాణాగ్నిచే నితని రథము దగ్ధమైనను దన గంధర్వశక్తిచే రత్నయుతమైన రథమును జేసికొనియెను. మఱియు నర్జునునిచే నోటువడెను గాన నంగారపర్ణుఁడను పేరుతో నుండలేక తాఁ జేసికొనిన రథమునుబట్టి చిత్రరథుఁడను పేరు పెట్టుకొనెను. ఇతఁడే ధౌమ్యునిఁ బురోహితునిగఁ గైకొనుఁడని పాండవులతోఁ జెప్పెను. భార.

అంగిరసుఁడు:- ఆగ్నేయీ యూరువుల కుమారుఁడు. మత్స్య.

అంగిరసుఁడు:-పథ్యుని శిష్యుఁడు, అథర్వ వేదమును బఠించెను. భాగ.

అంగిరసుఁడు:-(చూడుము అంగిరుఁడు.)

అంగిరసుఁడు:-ఒకముని. ప్రసిద్ధోపాస్యభూతమైన ముఖ్యప్రాణమును ఆత్మదృష్టిచే నుపాసన చేసెను. అందువలన ముఖ్యప్రాణమును ఆంగిరసముగ ఋషులు తలంచుచున్నారు. ఛాన్దో.

అంగిరసుఁడు:-బ్రహ్మమానసపుత్త్రుఁడు. ఒకపారి అగ్నికిఁ గోపమువచ్చి తనరూపముపసంహరించుకొని తపసు చేయ నారంభించెను. కాని, తనస్థాన మెవ్వరైన నాక్రమించుకొందురేమో యని భయపడి యచిరకాలములోనే తపసు మాని వచ్చెను. అగ్ని భయపడినట్లే బ్రహ్మ యంగిరసుని నగ్నిస్థానమున నిల్పెను. తన పదవి పోఁగొట్టుకొనినందు కగ్ని మిక్కిలి చింత నొందె. అంగిరసుఁ డదిచూచి యగ్నిస్థానము నాతనికిచ్చివేసి తానగ్నికిఁ బుత్త్రుఁడుగనుండుట కంగీకరించెను. అంగిరసునిభార్య శివ (శ్రద్ధ). ఇతనికి బృహత్కీర్తి, బృహజ్జ్యోతి, బ్రహ్మద్బ్రహ్మ, బృహన్మనసుఁడు, బృహస్పతి, సంవర్తనుఁడు, ఉతథ్యుఁడు, . అంగిరసుఁడు, బృహన్మంశుఁడు, బృహద్భానుఁడు అను పుత్త్రులును; భానుమతి, రాక, సినీవాలి, కుహువు, అర్చిష్మతి, మహిష్మతి, మహామతి, యోగసిద్ధి అను పుత్త్రికలును బుట్టిరి. భార.

అంగిరసులు :-మనులు సత్త్రయాగముచేయుచు నారవదినంబున నర్హకర్మములు దోఁపక మూఢులైరి. వారికినాభాగుఁడు వైశ్వదేవ సూక్తంబుల

రండెఱింగించెను. వారు సంప్రీతులై స్వర్గంబునకుఁ బోవుచు సత్త్రిపరిశేషిత ధనం బాతని కిచ్చిరి. భాగ.

అంగిరసులు:-అంబరీషుని మనుమలు. హరితుని కుమారులు. వీరు నాగలోకమునకుఁ బోయి పాములను బాధపెట్టుచుండువారు. నాగులు పురుకుత్సుని వేఁడుకొనఁగ నతఁడు వీరిని నాగలోకమునుండి వెడలఁగొట్టెను. విష్ణు.

అంగిరుఁడు:-(అంగిరసుఁడు) ఉల్ముకుని కుమారుడు. అంగుని తమ్ముఁడు. ఇతనిభార్య స్మృతి.

అంగుఁడు:-ఊరుని (ఉల్ముకుని) కుమారుఁడు. ఒకరాజు. ఇతనిభార్య సునీథ. అంగుఁడు కాంచనాలంకారములతోఁ గూడిన యేనుఁగులను గుఱ్ఱములను దానములుచేసి, యర్థులకు బంగార మొసఁగి యనేక యాగములు చేసెను. ఇతనికి దైవభక్తియు, బ్రాహ్మణభక్తియు మెండు. విష్ణు. భార.

అంగుఁడు:-దివిరథ తనయుఁడగు దధివాహనుని పుత్త్రుఁడు. పరశురాముఁడు క్షత్రియులనువధించు నపుడు ఇతఁడు యాగము గావింపగ దేవతలు ఆహూతులయ్యు యజ్ఞభాగములఁ బుచ్చుకొనరైరి. అది అపుత్త్రకుఁడైన కారణమునవని గ్రహించి పుత్త్రేష్టిచేసెను. ఇతనికి బ్రాహ్మణ వైదిక కర్మద్వేషియగు పుత్త్రుఁడు వేనుఁడను వాఁడు జన్మించెను. వేనుఁడు క్రూరుఁడైఅందఱిని బాధపెట్టుచుండువాఁడు. వాని వలన వచ్చు అపకీర్తి సహింపలేక ఒకనాటిరాత్రి అంగుఁడు రాజ్యమును, భార్యను, పుత్త్రుని విడిచి యెవ్వరికి కనబడకుండఁ బోయెను. భాగ.

అంజన:-వానరస్త్రీ. కుంజరుఁడనువాని కూఁతురు. కేసరియొక్క భార్య. ఈమె విహరించుచుండగ వాయుదేవుఁడు చూచి మోహించి తన తలపు దెలిపి నీకుఁ గామరూపుఁడును, బలసంపన్నుఁడు నగు కుమారుఁడు పుట్టును. నీపాతివ్రత్యమునకు భంగము కలుగదు. నీ వొడంబడుమని చెప్పఁగ నామె సమ్మతించి యాతనితో సంగమించెను. ఆమెకు ఆంజనేయుఁడు పుట్టెను. రామా.

జగన్మోహనావతారము చూచిన శివునకు రేతఃపతనమయ్యెను. దానిని వ్యర్థముగఁ బోనీయరాదని యొక పత్రమున భద్రముచేసి యంజన కర్ణమందుఁ బోసిరి. దానివలన ఆంజనేయుఁడు జన్మించె. శివ.

అంజన:-అహల్యా గౌతముల కుమారిత. గౌతముఁ డెచ్చటకేని యరుగునపు డీమెను నహల్యయొద్దఁ గాపుంచువాఁడు. ఒకనాఁడు గౌతముఁడు లేని సమయమున సూర్యుఁడు వచ్చెను. అతని తేజస్సున కామె గ్రుడ్డిదయ్యె. సూర్యుఁడు అహల్యతో రమించెను. అతనివలన కుమారుఁడు కూడఁ గలిగెను; కాని గౌతముఁడు వాఁడు తన కుమారుఁడె యనుకొనుచుండెను. అహల్యకు మఱియొక కుమారుఁడుకూడఁ బుట్టెను. ఒకనాఁడు గౌతముఁడు కుమారుల నెత్తుకొని కూఁతుని నడిపించుచు సముద్రతీరమునఁ దిరుగుచుండఁగ "తండ్రీ! నీకుమార్తెను నడిపించి పరుల బిడ్డల నెత్తుకొనెదవా?" యని కూఁతురు గౌతము నడిగెను. గౌతముఁడు సందేహించి వీరు పరుల బిడ్డలయిరని వీరి ముఖములు వానరముఖములగునని శపించి వారిని సముద్రములోఁ బడఁద్రోసెను. వారివి వానర ముఖములయ్యె. వారే వాలిసుగ్రీవులు. తనగుట్టు బయల్పెట్టినది గావున నహల్య యీమెను గ్రుడ్డిదానవైయుండుమనియు నీయందు వానరుఁడు జన్మించుననియు శపించెను. వి. రా.

అంజనపర్వుఁడు:-ఘటోత్కచుని కుమారుఁడు. భారతయుద్ధమం దశ్వత్థామవలనఁ జచ్చెను. అశ్వత్థామ రాఁబోవు సూర్యసావర్ణికమన్వంతరములో నొకఁడగును. భాగ.

అంజనము:-పడమటిదిక్కున నుండు నేనుఁగు.

అంజనావతి:-ఈశాన్యదిక్కున నుండెడు నాఁడు ఏనుఁగు.

అంతరిక్షుఁడు:- మురాసురుని కుమారుఁడు. కృష్ణునిచేఁ జంపఁబడెను.

అంతర్ధానుఁడు:-(అంతర్ధి) పృథువు కుమారుఁడు. ఇతఁడే విజితాశ్వుఁడు. ఈ రాజకుమారుఁడు గంగాతీరమున గౌతమమునీంద్రునిచే రక్షణ సేయఁబడిరి. భార.

శిఖండి, నభస్వతి ఇతని భార్యలు. నభస్వతి యందు హావిర్ధానుఁడను పుత్త్రుని బడసెను. విష్ణు.

అంతినారుఁడు:-పూరుని వంశమువాఁడు. ఇతని భార్య మనస్విని, సుమతి, అప్రతిరథుడు ఇతని పుత్త్రులు.

అంధకాసురుఁడు:-ఒక దనుజుఁడు. సింహికా విప్రచిత్తుల కుమారుఁడు. ఇతఁడు బ్రహ్మను గూర్చి తపసుచేసి వరములు పొందెను. ఆ గర్వముచే స్వేచ్ఛగ విహరించుచు నీతి దప్పి యెచ్చట సుందరాంగులున్నను వారిని బట్టి తెప్పించువాఁడు. పార్వతి సౌందర్యమును గురించి విని యామెనుగూడ తెండని భటులను బంపెను. శివుఁడు భూలోకమున కరిగినపుడు అంధకాసురుఁడు పార్వతికడకుఁ బోయి యామెను బెదరింపఁజొచ్చె. నంది కాలభైరవు లాతనితోఁ బోరిరిగాని యోడిరి. అపుడు స్త్రీ రూపమునఁ బార్వతిని గొలుచుచుండిన విష్ణుమూర్తి శక్తినిబంపి యంధకుని శిక్షించెను. వీనిని శివుఁడు సంహరించెను. విష్ణు. బ్రహ్మ

అంధకుఁడు:- సాత్వతి కుమారుఁడు. భజమానుఁడు, కింకరుఁడు, శుచి, కంబళబర్హి, ఇతని పుత్త్రులు. భాగ.

అంధుఁడు:-ద్రుహ్యుని వంశమువాఁడు.

అంధ్రుఁడు:-పృథుకుమారుఁడైన దృషదశ్వుని తనయుఁడు. ఇతనికుమారుఁడు యువనాశ్వుఁడు. బ్రహ్మ.

అంబ:- హోత్రవాహనుఁడను కాశిరాజు పెద్ద కూఁతురు (హోత్రవాహనుని దౌహిత్రి), అంబిక, అంబాలిక లీమె చెల్లెండ్రు. అంబ సాళ్వుని వలచియుండి యతనిని వివాహమాడఁ గోరుచుండెను; కాని స్వయంవరమువేళ భీష్ముఁడు వచ్చి యచ్చట కేతెంచిన రాజుల నోడించి తన తమ్మునకు వివాహము సేయుటకై అంబ, అంబిక, అంబాలికలను గొనిపోయెను. వీరు హస్తినాపురము చేరిన పిమ్మట, తాను సాళ్వుని వలచియున్నది కావున వానికడకుఁ బంపుమని అంబ భీష్ముని వేఁడుకొనియె. భీష్ముఁడామెనుబంపెను. కానిసాళ్వుఁడంబను గైకొనకుండెను. భీష్ముఁడు తమ్మునికై నన్నుఁ గొనిపోయినాఁడు. నీపై మక్కువ కలదని యాతనితోఁ జెప్పి వేఁడితిని. కాన నన్ను విడచెను. నాకలన దోషములేదు. నన్నుఁ జేపట్టుమని యంబ సాళ్వుని వేఁడుకొనియెను; కాని యతఁడు నీకన్యాత్వము దూషితమైనది కాన నిన్నుఁ బరిగ్రహింపను పొమ్మని యంబను నిరాకరించెను. అంబకుఁ బట్టరాని దుఃఖము వచ్చెను. తన దురదృష్టమునకంతకును భీష్ముఁడే కారణమని తలఁచి తపసు చేసి భీష్ముని సమరములో గెలువవలెనని నిశ్చయించి యంబ తపసు ప్రారంభించెను. కాని కొందఱు మునులు నీవు సుకుమారవు. తపఃక్లేశముభరింపఁజాలవు. నీతండ్రికడ కేగుమనిరి. వారిమాటలు వినక యామె యన్యులకంటఁబడకుండఁ దపముచేయఁదలఁచుకొని యరణ్యమునకు వచ్చెను. అచ్చట నామెకు హోత్రవాహనుఁడు కనఁబడియె. ఒకరి నొకరు చూచుకొనిరి. అంబ తనకుఁగలిగిన భంగపాటు చెప్పుకొని మిక్కిలి విచారించెను. పరశురాముని జూడుము. నీకు భయముండదని తండ్రిచెప్పెను. అచ్చటకుఁ బరశురాముఁడు మఱునాఁడు వచ్చునని యకృతవ్రణునివలనఁ దెలిసికొనిరి. వారచ్చటఁగి మఱునాఁడు పరశురామునిఁ జూచిరి. హోత్రవాహనుఁడు తన కుమారిక దుర్దశను బరశురామునకుఁ దెలియఁజెప్పెను. సాళ్వుని వంచింతునా ? భీష్ముని వంచింతునా ? యని పరశురాముఁ డడిగిన భీష్మునే వంచించుమని వారనిరి. పరశురాముఁ డంబను భీష్ముని కడకుఁ దీసికొనివచ్చి ఈమెను తన తమ్మునిఁ బరిగ్రహింపుమని కోరెను. పరపురుషుని వలచిన యామెను నే గ్రహింపనని భీష్ముఁడు నిరాకరించెను. అంతఁ బరశురాముఁడు భీష్మునితోఁ బోరెను. ఇరువదినాల్గుదినము లొక్క విధముగ వీరిరువురుయుద్ధము చేసిరి. దేవతలు,ఋషులువచ్చి యుద్ధము మానుడని వారిని బ్రతిమాలిరి. పరశురాముఁడు యుద్ధముమాని యిఁక నేఁజేయవలసినది లేదని వెడలిపోయెను. భీష్ముని జయించి తీరవలెనని యంబ పట్టుదలకలిగి తీవ్రముగఁ దపస్సు చేయుచుఁ గౌశికునాశ్రమము మొదలగు సిద్ధాశ్రమములందు చరించుచుండెను. ఈదుష్కర నియమము లేల పూనితి ? వని గంగ యడుగఁగ భీష్ముని జయించుటకై చేయుచున్నదాన నని యంబ ప్రత్యుత్తర మిచ్చె. నీవు కుటిల ప్రచార

వగుట ఏత్తై పారెదవుగాని నీవలన నంతకంటె నెక్కువ కాదని గంగ పలికెను. అయినను నామె తపస్సు మానలేదు. ఆమె తపస్సులో సగము మత్స్యదేశమున నదియై ప్రవహించెను. అంబ ఘోరతపస్సు చేసెను. గావునఁ శివుఁ డామె తపమునకు మెచ్చుకొని ప్రత్యక్షమై వరము వేఁడుకొనుమనియె. భీష్మునిఁ జంపు నట్లుగ నాకు వరమిమ్మని యామె గోరెను. జన్మాంతరమున నీవు ద్రుపదరాజునకు శిఖండి యను నామమునఁ గూఁతురవై పుట్టి కుమారుఁ డవై భీష్మునిమరణము కలిగింతువని శివుఁడు చెప్పెను. ఆమె వెంటనే చితి పేర్చి శరీరము దహించుకొనెను. తరువాతజన్మమున ద్రుపదు నకు జన్మించెను. (చూడు శిఖండి) భార.

అంబరీషుఁడు:-నాభాగుని కుమారుఁడు. ఇతఁడు అశ్వమేధము లొనరించెను. రాజ్యమేలినపుడు ఎల్లపనులు హరిపరములుగఁ దలంచి చేయు వాఁడు. బంగారును, మట్టిని సమముగఁ జూచు వాఁడు. ఇతఁడు భక్తిపరవశుఁడై యుండు వాఁడు. ...అప్రతిహతంబగు బ్రాహ్మణశాప మితనియెడ నిరర్థకమయ్యెను. ఇతఁడు మిక్కిలి భక్తిగలవాఁడు. ఇతఁడు ద్వాదశీవ్రతముచేసి బ్రాహ్మణుల కిష్టాన్నంబులిడి తాను భోజనము నకుఁ గూర్చుండఁబోవు సమయమున దుర్వాసుఁడు వచ్చెను. అతనిని భోజనమునకు రమ్మని పిలిచి యంబరీషుఁడు వానికై వేచియుండెను. దుర్వాసుఁడు స్నానమునకు వెళ్లి యెంతకుఁ దిరిగి రాఁడయ్యె. ద్వాదశి ఘడియలు మించి పోవుచుండెను. మించినపిమ్మట భుజించిన యెడల వ్రతఫలితము పోవును. ముందుగ భుజించినయెడల నతిథి రాకుండఁ గుడిచిన దోషము వచ్చును. ఏదోషము రాకుండ నేమి చేయవలె? నని పెద్దల నాలోచన యడుగఁగ వా రుదకపారణము గావింపుమనిరి. దాన వ్రత ఫలితము వచ్చును. అతిథి రాకుండ భోజనము చేసినట్లును గాదు అని ఆలోచనచెప్పుటచే నంబరీషుఁ డట్లు చేసెను. పిమ్మట దుర్వాసుఁడు వచ్చెను. అతనికి నంబరీషుఁ డపుడే యుదక పారణము చేసినట్లు తెలిసి కోపమువచ్చి తన జటనుండి మహాకృత్యను సృజించెను. అది అంబరీషునిపైఁ బడఁబోయెను. ఇంతలో విష్ణు మూర్తి చక్రమువచ్చి కృత్యను సంహరించి దుర్వాసుని దఱుముకొని వెళ్ళెను. దుర్వాసుఁడు బ్రహ్మకడకు, శివునికడకుఁ బరుగెత్తెను. వారు రక్షింపలేకుండుటచే విష్ణుమూర్తికడకుఁ బోయి శరణువేఁడెను. నేను నా భక్తుల స్వాధీనముం దున్నవాఁడ. నిన్ను నేను రక్షింపఁజాలను. అంబరీషునినే శరణువేఁడుమని విష్ణుమూర్తి యనియె. దుర్వాసుఁడు అంబరీషునికడకు వచ్చి యితనినే క్షమింపుమని ప్రార్థించెను. అంబరీషుఁడు సదయుఁడై చక్రము వానిపై రాకుండ ప్రార్థించెను. విరూపుఁడు, కేతుమంతుఁడు, శుభుఁడు అంబరీషుని కుమారులు. భాగ.

అంబరీషుఁడు:-బిందుమతీ మాంధాతల పెద్ద కుమారుఁడు. వీని ఇతని తాత యనఁగా యువనాశ్వుఁడు పుత్రునిగా గైకొనియె. ఇతని కుమారుఁడు యౌవనాశ్వుఁడు ఈ యౌవనాశ్వుని పుత్రుఁడు హారితుఁడు. అది కారణముగ మాంధాతృగోత్రమున అంబరీష యౌవనాశ్వ హారితులు ప్రవరులైరి. భాగ.

అంబరీషుఁడు:-ఒకరాజు. అనేక యజ్ఞములు చేసెను. ఇతఁడింద్రలోకమునకుఁ బోవునప్పటికి ఇతని భటుఁలు సుదేవుఁడనువాఁడు ఉజ్జ్వల విమానారూఢుఁడై యుండుట చూచి నేను అనేక యజ్ఞములు చేసితిని. వీడు నాభటుఁడు. ఒకయజ్ఞమును చేయలేదు. ఎట్లుఇక్కడకురాఁగలిగెను? అని అడిగెను. (చూడుము. సుదేవుఁడు.)

అంబరీషుఁడు:-అయోధ్యరాజు. ఇతఁడుయజ్ఞము చేయుచుండఁగ రాక్షసుఁ డొకఁడువచ్చి యజ్ఞ పశువు నపహరించెను. యాజకుం డితనితో 'నీవు యజ్ఞపశువు సరిగా గాపాడకుంటివి. యజ్ఞము భంగమైనచోఁ గ్రతుకర్త వినాశన మొందును. నరపశువునైనఁ దెచ్చి యాగము పూర్తిచేయుము అని చెప్పెను. అంబరీషుఁడు యాగార్హమైన పశువునకు తిరిగి తిరిగి యెచ్చటను గానలేక ఋచికునికడకు వచ్చి నా యాగ పశువు నెవ్వఁడో యపహరించెను. అన్యపశు వెచ్చటను లభింపదయ్యె. నీకు లక్ష గోవుల నిచ్చెదను. నీ కుమారుని నొక్కని యాగపశు వుగ నిమ్ము అని కోరెను. పెద్దకుమారునియందు నాకుఁ బ్రీతి; వాని నేనీయజాలనని ఋచికుఁడు పలికెను. కడగొట్టుబాలునందు నాకుఁ బ్రేమ.

వాని నే నీయజాలనని వానిభార్య చెప్పినది. మధ్యవాఁడు శునశ్శేఫుఁ డనువాఁడు. నేను వచ్చెద నన్నుఁ గొనిపొమ్ము అని వచ్చెను; అంబరీషుఁడు ఋచికునకు లక్ష గోవుల నిచ్చి వీనిని వెంటబెట్టుకొని పోయెను. మార్గమందు విశ్వామిత్రుఁడు శునశ్శేఫుని జూచి వాని కథ యారసి వానికి మంత్రోపదేశము చేసెను. శునశ్శేఫుఁడు యజ్ఞశాలయందు యూపస్తంభమునకుఁ గట్టఁబడెను. అతఁడు విశ్వామిత్రుఁ డుపదేశించిన మంత్రమునే పఠించుచుండెను. అపు డింద్రుఁడు వచ్చి యంబరీషునకు యాగ ఫలము నొసంగి శునశ్శేఫుని విడిపించెను.
రామా.

అంబరీషుఁడు:-ఇక్ష్వాకువంశపురాజు. పద్మావతి కుమారుఁడు. ఇతఁడు విష్ణుమూర్తిని గుఱించి తపముచేసెను. విష్ణుమూర్తి యింద్రునిరూపమున వచ్చి వరము వేడుకొను మనియె. నీవు నాకు వర మియ్యనక్కఱలేదు. విష్ణుమూర్తిని బ్రార్థించుచుంటిని నిన్నుఁ గాదనెను. అపుడు విష్ణువు నిజరూపముతోఁ బ్రత్యక్షమయ్యె. నాకుఁ గావలసినపుడు చక్రమువచ్చి నన్ను రక్షించుచుండుఁ గాక యని యితఁడు కోరెను. ఇతనికి శ్రీమతి యను కూఁతురు గలదు. ఈమెను నారదుఁడును, పర్వతుఁడును జూచి తమ కిచ్చి వివాహము చేయుమని యంబరీషుని గోరిరి. వారిలో నొక్కని కిచ్చెదనని యంబరీషుఁడు పలికెను. ఆమె స్వయంవరము నాఁడు విష్ణుమూర్తి వచ్చి యామెను దీసికొనివెళ్ళెను. పర్వతుఁడును, నారదుఁడును మాకిచ్చెదనని కన్యను నన్యుని కేల యిచ్చితివి? నీవు తిమోమయుఁడవు కమ్ము అని యంబరీషుని శపించిరి. వారట్లు పల్కఁగనే చక్రము వచ్చి వారిని దఱిమెను. వారు విష్ణులోకమునకుఁ బరుగెత్తిరి.
లింగ.

అంబష్ఠుఁడు:-కంసుని ఏనుఁగులను గాచువాఁడు. కంసుని జూచుటకుఁ గృష్ణ బలరాములు వచ్చుచుండఁగ వారిమీఁదకు వీఁడు కువలయాపీడ మను నేనుఁగును దోలెను. దానిని మఱలింపు మని వారు చెప్పిరి. కాని వాఁడు వీరిమీఁదకే తోలెను. కృష్ణుఁడు కువలయాపీడమును, వీనిని గూడ వధించెను.
భాగ.

అంబాలిక:-కాశిరాజు కూఁతురు. అంబ, అంబిక లీమె తోఁబుట్టువులు. వారి స్వయంవరసమయమున భీష్ముఁడేతెంచి వారినిగొంపోయి ఈమెను, అంబికను విచిత్రవీర్యునకు వివాహముచేసెను. ఈమె సంతానముఁ బడయకపూర్వమే భర్త మణించెను. వంశము నిల్పుటకై వ్యాసునివలన కుమారుని బడయుమని అత్తయగు సత్యవతి నియోగించెను. ఈమె వ్యాసుని జేరి వాని రూపముఁ జూచి వెలవెలబోయి వానితో సంయోగము నొందెను. కావునఁ బాండుదేహుఁ డగు కుమారుఁడు పాండురాజు పుట్టెను. ధృతరాష్ట్రి పుత్త్రులకును పాండుపుత్రులకును వైరము కలుగుననియు, దానివలన పెగులు పుట్టుననియు, నదివారు చూడఁజాలరని తపోవనమునకు పొండని వ్యాసుఁడు చెప్పెను. ఈమెయు సత్యవతి, అంబికలతోఁబాటు తపముచేసికొనుటకుఁ గానవముల కేగెను. భార.

అంబిక:-కాశిరాజుకూతురు. అంబ, అంబాలిక లీమె తోఁబుట్టువులు. వీరి స్వయంవరసమయమున భీష్ముఁడేగి వీరి మువ్వురనెత్తుకొని వచ్చి, ఈమెను, అంబాలికను విచిత్రవీర్యున కిచ్చి పెండ్లిచేసెను. ఈమెకు సంతానము కలుగక పూర్వమే భర్త చనిపోయెను. వంశము నిల్పుటకై వ్యాసునివలనఁ బుత్త్రిని బడయుమని అత్తయగు సత్యవతి నియోగించెను. ఈమె వ్యాసుని జేరి వాని రూపమునకు భయమొంది కన్నులు మూసికొని సంయోగము నొందెను. ఆ కారణమున నామెకుఁ బుట్టంధుఁడగు కుమారుఁడు ధృతరాష్ట్రుఁడు పుట్టెను. ధృతరాష్ట్రుని కుమారులు వంశనాశనకరు లగుదురని వ్యాసుని వలన విని యీమెయు సత్యవతితోఁ గాననముల కేగెను.
భార.

అంశుమంతుఁడు:-సగరునిమనుమఁడు. అసమంజసుని పుత్త్రుఁడు. సగరుని పుత్త్రులు మృతి నొందినపిమ్మట యాగాశ్వమును వెదకితెమ్మని సగరుఁ డితనిని గపిలునొద్దకుఁ బంపెను.

తండ్రులుపోయిన మార్గమునఁజని కపిలుని, వాని ప్రక్కనున్న అశ్వమును, ప్రక్కను బడియుండిన భస్మరాసులను జూచి కపిలుని ప్రార్థించి అశ్వమునిమ్మని యడుగగ, తండ్రులు

నిలుచుండెను. వీనిపై గపిలునకుఁ గరుణగలిగి గుఱ్ఱమును విప్పుకొని పొమ్మని సగరపుత్త్ర మరణవృత్తాంతముకూడ సగరునకుఁ దెల్పుమనియె; మఱియు నంశుమంతుని భక్తికి మెచ్చుకొని వరము వేఁడుమనియెను. తన తండ్రులకు స్వర్గము వచ్చు మార్గము దెల్పుమని అంశుమంతుఁడు కపిలుని గోరెను. ఇతనికిఁ దండ్రులయందుఁగల భక్తికి సంప్రీతుఁడై, వారు పాపులగుటవలన నింకను జన్మంబు లెత్తుదురనియు, అయినను అంశుమంతుని పౌత్త్రుఁడగు భగీరథుని వలన వారు ముక్తిఁబడయుఁ గల్గుదురనియుఁ జెప్పెను. అంశుమంతుఁడు యాగాశ్వమును దెచ్చి సగరున కిచ్చెను. యజ్ఞము పూర్తిచేసి సగరుఁ డీతనికి పట్టాభిషేకము చేసెను. ఇతఁడు తండ్రులు మ్రగ్గినచోటునకు గంగను దెప్పింతునని అరణ్యమునకేగి తపసు పూర్తిగావింపలేకయే మరణించెను. భాగ.

భస్మమై పడియుండిన పినతండ్రులఁ జూచి అంశుమంతుఁడు వగచుచుండగ గరుత్మంతుఁడు వాని నూరడించి గంగను ఆటకు దెప్పింపుమని, వారికి సద్గతి కలుగునని బోధించెను. రామా.

అంశుమంతుని పుత్త్రుడు దిలీపుఁడు. దిలీపుఁడు పెద్దవాఁడైన పిమ్మట వానికి రాజ్యమిచ్చి అంశుమంతుఁడు తపోవనమున కరిగెను. భాగ. బ్రహ్మ.

అంశుమంతుఁడు:–అదితికశ్యపుల కుమారుఁడు. ద్వాదశాదిత్యులలో నొక్కఁడు.

అకంపనుఁడు:–సుమాలి పుత్త్రుఁడు. ఖరదూషణులు రామునిచేఁ జంపఁబడుట నీతఁడు రావణునకుఁ దెల్పెను. ఇతఁడు సీతాపహరణము శ్రీరామవధ కుపాయమని చెప్పెను. రామా.

అకంపనుఁడు:–ఒకరాజు. ఇతని కుమారుఁడు యుద్ధములోఁ జనిపోయె; ఇతనికా యుద్ధమందు జయమే కలిగెను; కాని పుత్త్రశోకముచేఁ గుందుచుండెను; నారదుఁడు వచ్చి మృత్యువు ప్రకారం బెఱింగించి దుఃఖము పోగొట్టెను. భార.

అకృతవ్రణుఁడు:–శాంతుఁడను మునిపుత్త్రుఁడు. ఇతఁడు బాల్యముననే తీర్థయాత్రలు చేయుచు మార్గముతప్పి యరణ్యములోఁ దిరుగులాడుచుండఁగఁ బులియొకటి భీకరముగ నార్చుచు వీనిపైఁ బడఁబోయెను. ఆసమయముననే పరశురాముఁ డటకు వచ్చుట తటస్థించెను. అతఁడు పులిని జంపి యీ బాలుని గాపాడెను. అప్పటి నుండియు నకృతవ్రణుఁడు పరశురామునకు శిష్యుఁడును, స్నేహితుఁడును నయ్యెను. ఇతఁడు సదా పరశురామునితోడనే యుండువాఁడు. ధర్మరాజునకుఁ బరశురాముని మాహాత్మ్య మీతఁడె యెఱుకచేసెను. ఒకనాఁ డతఁడు దాహము తీర్చుకొనుటకై కొలనులో దిగెను. అందులోనున్న మొసలి వీని పాదమును బట్టుకొనెను. ఇతఁ డట్లో పెనుగులాడి వచ్చి యెవ్వ రీకొలనులో దిగుదురో వారు పులులగుదు రని శపించెను. ధర్మరాజు యాగాశ్వ మందులో దిగి పులి యయ్యెను. దానిని మఱలఁ గృష్ణుఁడు గుఱ్ఱముగ జేసెను.

బ్రహ్మ. జై. భా.

అక్రూరుఁడు:–శ్వఫల్కుని కుమారుఁడు. ఇతని తల్లి గాందిని. ఇతఁడు కంసునినగరములో నుండువాఁడు. బలరామకృష్ణులను జంపదలఁచి వారిని దననగరమునకు రావించుటకై తాను ధనుర్యాగము చేయుచుంటిననియు, దానిని జూచుటకుఁ దన మేనల్లుండ్రను దోడ్కొని రమ్మనియె ననియును జెప్పి వారిని దీసికొని వచ్చుటకు వారివద్దకుఁ గంసుఁ డీతనిని బంపెను. గోవింద సందర్శనము కలుగునని యితఁడు సంతోషించెను. కాని కృష్ణుఁడేమనునో యను భయము కూడఁ గలిగెను. అందువలన ముందుగఁ దాను వచ్చిన కార్యమును, గంసుఁడు చేయఁదలఁచు కొనినదియు నెఱుకపఱచెను. సత్రాజిత్తు తన కుమార్తెను శతధన్వున కిత్తునని చెప్పి కృష్ణున కిచ్చి వివాహము చేసెను. అక్రూరుడు శతధన్వుని కడకుఁ బోయి. యీ యపకృతి నైపకుము; సత్రాజిత్తును సంహరింపుమని ప్రోత్సాహము చేసెను. శతధన్వుఁడు సత్రాజిత్తును జంపెను. సత్రాజిత్తును జంపుటచేఁ గృష్ణుఁడు శతధన్వునిమీఁదకు దండెత్తెను. అపుడు శతధన్వుఁ డితని సహాయము కోరెను. కాని యితఁడు కృష్ణునకు భయపడి దూరముగఁ బాఱిపోయెను. అక్రూరుఁడు దూరముగఁ బోవుటచే ద్వారకయందు వర్షములు లేకపోయెను. అక్రూరుఁడు వచ్చినయెడల వర్షములు కురియు

వని చెప్పిరి. కావునఁ గృష్ణుఁడు అక్రూరున కభయమిచ్చి వానిని ద్వారకకు రప్పించెను. అక్రూరుఁ డితనికిఁ దనకు శతధన్వుఁ డిచ్చిన శ్యమంతకమణి నిచ్చెను. దేవలుఁడు, అనుప దేవ్యుఁడు ఇతని కుమారులు. భార.

అక్రోధనుఁడు:- అయుతానీకుని పుత్త్రుఁడు. ఇతని భార్య కరంభ. దేవాతిథి ఇతని పుత్త్రుఁడు. భార.

అక్షయకుమారుఁడు:- రావణాసురుని కుమారుఁడు. హనుమంతుఁడు లంకలోఁ జేరి వనము లను బాడుచేయుచు రావణాసురుని భటులను సంహరించుచుండఁగ హనుమంతుని బంధించుటకై వచ్చెను. ఇతనితోఁగూడ హనుమంతుఁడు పోరాడెను. తుద కితఁడు హనుమంతుని చేత సంహరింపఁబడియె. రామా.

అక్షయపాత్ర:- అరణ్యవాసము చేయుచుండిన ధర్మరాజాదుల వెంబడి పలువురు బ్రాహ్మణులుకూడ చనిరి. వారికి భోజనము పెట్టవలసి యుండెను. ఎట్లు సమకూర్చుట యని ధర్మజుఁడు చింతించుచుండ ధౌమ్యుఁడు సూర్యునారాధించు మనియె. ధర్మజుండు సూర్యుని ప్రార్థింప నతఁ డొక తామ్రస్థాలి నొసఁగెను. దానియం దేకొంచెము ద్రౌపది వండినను నది యక్షయ మగును. దానితో బ్రాహ్మణుల కందఱకు భోజనము పెట్టగలుగు చుండెను. భార.

అక్షసూత్ర:- ఆపస్తంభుని భార్య. ఈమె కుమారుఁడు కర్కి. బ్రహ్మ.

అక్షహృదయము:- ఒక విద్య. ఈ విద్య నెఱిఁగినవాఁడు సంఖ్యావిదుఁడగును. కళంక విముక్తుఁడగును. ఋతుపర్ణున కా విద్యవచ్చును. దీని వలన లెక్క పెట్టకయే ఒక చెట్టు ఆకులు, కాయలు ఎన్ని యున్నవో అతఁడు చెప్పగలఁడు. దానిని అతఁడు నలున కుపదేశము చేసెను. ఈ విద్య నేర్వఁగ నలుని ప్రవేశించియుండిన కలి బైటకు వచ్చెను. భార.

అక్షుఁడు:- (చూడుము. అక్షయ కుమారుఁడు).

అగస్తి:- ఒక ముని, బ్రహ్మశిరమను నస్త్రప్రయోగమును అగ్నివేశునకు నేర్పెను. భార.

అగస్త్యభ్రాత:- అగస్త్యుని సోదరుఁడు. ఇతనికిఁ దల్లిగర్భమందే జ్ఞానము కలిగెను; అరణ్యవాసము చేయుచున్న రామలక్ష్మణులు ఇతని యాశ్రమముఁ జూచిరి. ఇతని పేరు రామాయణమునఁ జెప్పఁబడలేదు. పురా. నా.

అగస్త్యుడు:- ఒక ఋషి. మిత్త్రవరుణులు వచ్చుచు మార్గమం దూర్వశినిజూచి మోహించి స్ఖలనమును బొందిరి. వారి వీర్యములను దీసి యూర్వశి యొక కుంభమం దుంచెను. అందుండియే యగస్త్యుఁడును, వసిష్ఠుఁడును బుట్టిరి. ఉ. రా.

అగస్త్యుఁడు చాలకాలము బ్రహ్మచర్యవ్రతమునే సలుపుచుండెను. ఒకనాడు వనములో సంచరించుచుఁ దలక్రిందుగ వ్రేలాడుచున్న వారిని జూచి ఇదేమి మీరిట్లుండిరి ? యని యడిగెను. మా వంశమువాఁ డగస్త్యుఁడనువాఁడు సంతానములేక యుండుటచే మందుగతులు లేక మే మిట్లుంటిమని వారనిరి. అగస్త్యుఁడు వారు తన పితరులని గ్రహించి వారి నుద్ధరించుకొఱకు వివాహమాడ నిశ్చయించుకొనెను. తన తపః ప్రభావమువలన విదర్భరాజునకు లోపాముద్ర యను కుమారిత పుట్టినట్లు చేసెను. మఱియు నా రాజుకడ కేగి లోపాముద్రను దనకిచ్చి వివాహము సేయుమని కోరెను. నారలుకట్టుకొని కందమూలములను భక్షించువానికిఁ దన తనయ నిచ్చుటకు రాజు సందేహించుచుండగ లోపాముద్ర వచ్చి తాను మునిని వివాహ మాడుట కంగీకరించెదననియె. రాజామెను నగస్త్యునకిచ్చి వివాహము చేసెను. ఒకనాఁడు అగస్త్యుఁ డామెనుజూచి మన్మథప్రేరితుఁడై సంయోగము పొందఁగోరినపుడు పతి కది యుచితమే; కాని నేను మలినవస్త్రము. ముందుగ నాకు మంచి వస్త్రములను, అలంకారములను నిమ్మని లోపాముద్ర కోరెను. ధనమునకై తన తపము వ్యయపెట్టలేక అగస్త్యుఁడు శ్రుతపర్వుఁడను రాజుకడ కేగి, రాజా! నీకు సరిపోవగ ధనము మిగిలెనేని

వా కిమ్మని కోరెను. వానికడ ధనము మిగులదు. ప్రధ్నశ్వుని యొద్దకుఁబోయి వేఁడుదమని యిరు వురును ప్రధ్నశ్వుని కడకు వచ్చిరి. ఇతనికడను నితనికి సరిపడిన ధనమే యుండెను గాని యంతకు నెక్కువ లేదు. వారు ముగ్గురు త్రసదస్యుఁడను రాజునొద్దకు వచ్చి యడిగిరి. ఇతని కడను ధనము మిగులకుండెను. వ ల్వలుని యొద్ద విశేషధన ముండునని విని వానియొద్దకు వెళ్ళిరి. ఇల్వలుఁడు వారిని గౌరవించి భోజనము పెట్టెను. అందు యథాప్రకారము వాతాపిని మేఁకను జేసి దానిని వండి పెట్టెను. ఈ యుపాయమువలన నిల్వలుఁడు బ్రాహ్మణులను జంపుచున్నాఁడని యగస్త్యుఁడెఱిఁగి, జీర్ణము, జీర్ణము, వాతాపి, జీర్ణము అనియె. అగస్త్యుని గర్భమందున్న వాతాపి జీర్ణించెను. ఇల్వలుఁడు దీని నెఱింగి, విచారించి యేమియు నెఱుఁగని వానివలె నటించి మునిని, రాజులను వచ్చిన కారణమడిగి వారికి ధనమిచ్చి పంపెను. అగస్త్యుఁడు ధనము, భూషణములు భార్యకునిచ్చి యామెతో రమించెను. అతనికి దృఢస్యుఁడను (ఇధ్మవాహుఁడు) పుత్త్రుఁడు, తేజస్వి (ఇతడే ఇధ్మవాహుఁడనఁబరిగెను.) అనుపౌత్త్రుడు గల్గిరి. భార.

బ్రహ్మ అగస్త్యునికడకువచ్చి శివునిగూర్చి కవేరతనయ తపస్సు చేయుచున్నది. ఆమెను వివాహమాడుమని చెప్పెను. అగస్త్యుఁడీమెకడకు వచ్చి తనను బరిణయముకమ్మని కోరెను. ఆమె నదిని కాఁబోవుచున్నానని చెప్పెను. అయినను నగస్త్యుఁడు సమ్మతించి వివాహము చేసికొని యామెను దన కమండలమునం దుంచుకొనెను. వింధ్యగర్వ మణఁచుటకుఁ బోవుచుఁ దన కమండలమును నగస్త్యుఁడు శిష్యుల కప్పగించెను. వారు భద్రముగఁ గమండలమును గొనిపోవుచుండిరి. ఈ పడఁతియొక్క యొక యంశము లోపాముద్రయయ్యెను. వారు సహ్యపర్వతముఁజేరఁగనే కవేరతనయ తన కార్యము తీర్పికొఁ దెచ్చుకొని నదియయ్యెను. ఈమెయే కావేరినది. స్కా. ఖ.

వింధ్యపర్వతము విశేషముగఁ బెరిగి సూర్యచంద్రుల మార్గమున కవరోధము కల్గించెను. కావున రాత్రింబగళ్ళు దెలియకుండెను. మునులు వచ్చి నీరూపముపసంహరింపుమని వింధ్యనుగోరిరి. గాని వింధ్య వినదయ్యె. అంత వారు అగస్త్యునితోఁ జెప్పికొనిరి. ఇతఁడు వింధ్యకడకు వచ్చి నేను దక్షిణమునకుఁ బోవలయును. మార్గమిమ్మని కోరఁగ వింధ్య తన రూప ముపసంహరించుకొనియె. నేను తిరిగి వచ్చువరకు నిట్లేయుండుమని యగస్త్యుఁడు చెప్పిచనియె. అతఁడు తిరిగి యా మార్గమున రాలేదు. అప్పటినుండియు వింధ్య యట్లేయుండెను. భార.

కాలకేయులు మునులను బాధించుచుండిరి. దేవతలు కూడఁ గాలకేయుల నేమియుఁ జేయలేకుండిరి. వారు కొట్టవచ్చిరేని కాలకేయులు సముద్రమధ్యమందు దాగికొందురు. వీరిబాధ పడఁజాలక మునులు వచ్చి యగస్త్యుని ప్రార్థించి సముద్రజలమును పానము చేయుమని వేడిరి. అగస్త్యుఁడు జలమంతయు త్రాగెను. కాలకేయులు బైటపడిరి. దేవత లపుడు వీరిని సంహరించిరి. పిమ్మట సముద్రమునుజలపూరితము చేయుమని మునులు వేడిన జలమువంతను జీర్ణించుకొంటినిగాన నాకది సాధ్యము కాదని యగస్త్యుఁడు చెప్పెను. అది భగీరథుఁడు తెచ్చిన గంగాజలముచే నింపఁబడియె. భార.

యమునాతీరమునఁ జేతులెత్తి ఘోరముగ తపస్సును చేయుచుండెను. కుశవతీ నదియొద్ద అమరులు సత్త్రియాగము చేయుచుఁ గుబేరునిఁ బిలువగ నితఁడు విమానమెక్కి మిత్త్రుఁడగు మణిమంతుని వెంటబెట్టుకొని పోయెను. మణిమంతుఁడు చూడక ఉమిసిన నది అగస్త్యునిపై బడియె. మణిమంతుఁడు ఒకమనుజునిచే మరణించునట్లు ఇతఁడు శపించెను. కుబేరుఁడు వానిని జూచినపుడు ఆపాతకము పోవుననియె. (చూడుము సువర్ణముఖీనదిని దెచ్చెను). భార.

వృత్రాసురుఁ డింద్రునకు భయపడి సముద్రములో దాగికొనెను. కావున వానిని వధించుట కింద్రునకు సాధ్యము కాకపోయెను. ఆ సంగతి యింద్రుఁడు బ్రహ్మతోఁ జెప్పుకొనియెను. బ్రహ్మ తానేమియుఁ జేయలేనని యగస్త్యుని కడ కరుగుమనియెను. ఇంద్రుఁ డగస్త్యుని ప్రార్థింపఁగ నతఁడు సముద్రోదకమును హస్తమం దుంచుకొని పానముచేసెను. అంత వృత్రాసురుఁడు బయల్పడెను. స్కాంద.

రాముఁ డరణ్యవాసము చేయుచున్నప్పు డీతని యాశ్రమమునకేగి యితనిని జూచెను. వచ్చిన యతిథిని బూజించుటకై దివ్యఖడ్గయుగమును, శరాసనమును రామునకితఁ డిచ్చెను. మణిమయ మగు దివ్యాభరణము నొకటిచ్చెను. మఱియు శ్రీరాముఁడు దానిని కుశున కిచ్చెను. రఘు.

రావణునితో యుద్ధము చేయుచు నతని బాణపరంపరలకు దిగులొంది యధైర్యుఁడై రాముఁడుండఁగ నగస్త్యుఁ డతని చెంగటకు వచ్చి యతఁడు మహానుభావుఁ డగుట జ్ఞాపకము చేసి యాదిత్యహృదయ మను మంత్రమును పఠనము చేయుమనియెను. రామా.

నహుషుఁ డింద్రుఁడై మిక్కిలి గర్వముతో నుండెను. ఒకనాఁడు గర్వాంధముచే నగస్త్యాది మునులను బిలచి తా నెక్కిన యందలమును మోయుఁడనెను. ఈ పరిభవమును నహుషుని దుష్కార్యములను జూచి సహింపలేక వానిని సర్పమవై పడియుండుమని యగస్త్యుఁడు శపించెను. భార.

అగ్ని:- ఒకవసువు. శాండిలీప్రజాపతుల పుత్త్రుఁడు.

అగ్ని:- ఆగ్నేయీ యూరవుల కుమారుఁడు. మత్స్య.

అగ్ని:- విశ్వానరుఁడను బ్రాహ్మణుడు పుత్త్రార్థియై కాశియందుఁ దపస్సుచేయఁగ శివుఁడు ప్రత్యక్షమై నీకుఁ బుత్త్రుఁడు కలుగునని వరమిచ్చెను. వరప్రసాదమున నతనిభార్య శుచిష్మతి గర్భవతియై పుత్త్రుని బడసెను. ఈ పుత్త్రుఁడే వైశ్వానరుఁడు. వీనికి దేవతలే నామకరణము చేసిరి. ఒకనాఁడు నారదుఁడు వచ్చి వీనిని విలోకించి వీనికిఁ బండ్రెండవ యేట ప్రాణభయము కలదని చెప్పెను. తలిదండ్రులు మిక్కిలి వగలొందిరి. వైశ్వానరుఁడు వారికి ధైర్యము చెప్పి తాను శివునుగూర్చి తపస్సు చేయుటకై కాశికిఁ బోయెను. అచ్చట తీవ్రమైన తపస్సు చేయఁగ నింద్రుఁడు వచ్చి నీకు వరమిచ్చెదను వేడుకొమ్మనియె. నేను శివుని ప్రార్థించుచుంటిని. నీవరము నాకు వలదని వైశ్వానరుఁడు నిరాకరించి శివుని ధ్యానించు చుండెను. ఇంద్రుఁడు తన వజ్రాయుధ మీతనిపై జళిపించెను. ఇతఁడు మూర్ఛపోయెను. అంత శివుఁడు వచ్చి వత్సా! లెమ్ము. దీర్ఘాయుష్మంతుఁడ వగుదువు. అగ్నిలోకమున కధిపతివి కమ్ము. అని వరములిచ్చి చనియె. వైశ్వానరుఁడు మూర్ఛ దేరి లేచి నిజగృహమునకు వెళ్ళెను. స్కా.కా.

శివుని వరము చొప్పున వైశ్వానరుఁ డాగ్నేయమూల కధిపతియయ్యె. అతఁడే యగ్ని. అగ్ని అష్టవసువులలోఁ గూడ నొకఁ డయ్యెను. ఇతఁడు దేవతలకై హవ్యములను మోసికొని పోవువాఁడు. ఇతనికి మేషము వాహనము. ఇతనిభార్య స్వాహా.

దేవాసురుల యుద్ధములో దేవతలు గెలిచిరి. తమ జయమునకు దామే కారణ మనుకొనిరి. వారు పరబ్రహ్మము నెఱఁగినవారు కారు. వారి యెదుట పరబ్రహ్మము గోచరించెను. అతఁ డెవరో తెలిసికొని రమ్మని దేవత లగ్నినిబంపిరి. అగ్ని పరబ్రహ్మము సమీపమున కేగెను. నీ వెవరవని యగ్నిని బ్రహ్మ ప్రశ్నించెను. నేను అగ్నిని. సర్వమును దహింపఁజేయు శక్తి నాకుఁ గలదు అని యగ్ని ప్రత్యుత్తరమిచ్చెను. ఈ తృణమును దహింపఁ జేయుమని పరబ్రహ్మ మొక తృణమును వాని చేతికిచ్చెను. అగ్ని యెంత యత్నించినను నది కాలలేదు. ఒక తృణము కాల్చలేకపోవుట కాశ్చర్యమొంది, యా తృణము నిచ్చిన మహానుభావు నెఱుఁగ జాలనని యగ్ని మఱలివచ్చెను. పరబ్రహ్మము నెఱుఁగకపోయినను వాని సమీపమునకేగెను. కాన నగ్ని దేవతలలో శ్రేష్ఠుండయ్యెను. కేన.

బ్రహ్మ రతినిగాంచి మోహితుండయ్యెను. అప్పుడతనికి రేతఃపతనంబయ్యె లజ్జచే బ్రహ్మ దానిని వస్త్రముచేఁ గప్పెను. అది ప్రజ్వలించునట్టి యగ్నియయ్యెను.

ఆ యగ్ని జ్వాలాభీలంబగుచుఁ బైకి లేచెను. కృష్ణుఁడు నిశ్వాస వాయువుతో ముఖమున నుండు జలబిందువు నుమియఁగ ఆ బిందుజంబు సమస్తప్రపంచము నావరించెను. ఆ జలమందలి యొకబిందువు ఆ యగ్నిని చల్లార్చెను. అప్పటి నుండియు అగ్ని జలంబుచే నిర్వాణము నొందు చున్నది.

అగ్ని వామపార్శ్వమునుండి యొక కన్యక యావిర్భవించె. ఆమె పేరు స్వాహాదేవి. అగ్ని కామె భార్య యయ్యెను. బ్ర. వై.

ఒకమాటు దేవతలపైఁ గోపమువచ్చి యగ్ని తన రూప ముపసంహరించుకొని వనమునకేగి తపస్సు చేసికొనుచుండెను. కొంతకాల మైన పిదపఁ దనస్థానమున నింకొవరినైన బ్రహ్మ నిలుపునేమోయని భయపడి తపము చాలించి తిరిగి వచ్చెను. కాని యంతలోనే బ్రహ్మ యంగిరసునకు నగ్నిస్థానమిచ్చెను. అగ్ని తన స్థానమున నంగిరసుఁ డుండుటచూచి వెలవెలఁ బోయెను. అంగిరసుఁడు తానరిగదవనియును నగ్నిని రమ్మనియును గోరెను. తుదకు అగ్ని తన పూర్వపదవిని పొందుటకును నంగిరసుఁ డగ్నికిఁ బ్రథమ పుత్త్రుఁడుగ నుండుటకును వా రొడంబడిరి. భార.

భృగుఁడను ముని యభిషేచనార్థ మరుగుచు భార్యను నగ్నిహోత్రునకు నప్పగించి విచారింపు మని నియమించెను. ఆమె యగ్నిగృహమున నున్న సమయమునఁ బులోముఁడను రాక్షసుఁ డటకు వచ్చి యీమె యెవ్వరిసతి? యని యగ్నినడిగెను. నిజము చెప్పినయెడల భృగుడు తనను శపించు నేమోయని భయపడియుఁ, దా నెఱిఁగిన విషయము చెప్పకుండినచో నసత్య దోషమువచ్చుననియు నగ్ని భయపడి తుదకామె భృగుని పత్నియగు పులోమ యని చెప్పెను. పులోమ నాకుఁ దొల్లి వరియింపఁబడిన భార్య. కాని భృగుఁడు వివాహమాడెనని పలుకుచుఁ బులోముఁడు వరాహ రూపమై యామె నెత్తుకొని పోయెను. ఆమె సుతుని వలన రాక్షసుఁడు భస్మమైపోయినపిమ్మట నామె గృహమునకువచ్చి జరిగినవృత్తాంతము భర్తతోఁ జెప్పెను. ఈ విపత్తునకు నగ్నియే కారణమని భృగున కగ్నిపైఁ గోపమువచ్చి వానిని క్రూరుఁడవు, సర్వభక్షకుఁడవును గమ్మని శపించెను. నే నెఱిఁగినవిషయము చెప్పకపోవుట దోషమని యడిగినప్పుడు చెప్పితిని. నన్ను శపించు టేల? యని యగ్నికిఁ గోపమువచ్చి తన మూర్తిని నుపసంహరించుకొనెను. అందుచే దేవతలకు కార్యము లంద కుండెను. వారు విష్ణుమూర్తి యొద్దకువెళ్ళి యగ్ని యుపసంహరించుకొను టయుఁ దమకు హవ్యములు రాకుండుటయు నెఱిఁగించిరి. విష్ణుమూర్తియు దేవతలును నగ్ని కడకువచ్చి వానిని స్తుతించి నీవు సర్వభక్షకుఁడ వైనను నత్యంత శుచివై యుందువని చెప్పి వానిని శాంతపరచిరి. అందుపై నగ్ని మఱలఁ దనపూర్వపు రూపము దాల్చి వచ్చెను. భార.

శ్వేతకియను రాజర్షి చేసిన నిరంతర హవనములచే నగ్నికిఁ గాంతి మాంద్యమై శరీరము చెడి నందున బ్రహ్మకడకుఁబోయి దేహ మనారోగ్య మయ్యె నని మొఱపెట్టుకొనెను. దివ్యౌషధయుక్తమైనయటవిని భక్షించినఁగాని యీవ్యాధి పోదనియు, ఖాండవవనమును భక్షింపుమనియు బ్రహ్మ చెప్పఁగ దానిని భక్షించుట కగ్ని వచ్చెను. వన మింద్రసంరక్షిత మగుటచే నగ్నికిది వలనుపడినదికాదు. తిరిగి బ్రహ్మకడకుఁ బోయి మీ రానతిచ్చినట్లు వనమును భక్షింపఁ బోతిని. కాని సాధ్యముకాలేదు. దాని కుపాయము చెప్పుఁడని యగ్ని వేడఁగఁ గృష్ణార్జును లటకు వత్తురు. నీకు ఖాండోపయోగము ప్రసాదింతురని బ్రహ్మ చెప్పెను. కృష్ణార్జునులుఖాండవ వనప్రాంతముల సంచరించు చుండఁగ నగ్ని వృద్ధ బ్రాహ్మణరూపమున వచ్చి నే నాహారములేక యుంటి, నాకిష్టాన్నము పెట్టింపుఁడని వారిని గోరెను. నీకెద్ది భోజనమని వారడిగిరి. ఈఖాండవ వనము భుజింపఁగడగితిని గాని తక్షకుఁడు దానిని రక్షించుచుండుటచే నది వీలుకాదయ్యె నని తన వృత్తాంతము చెప్పెను. మాయొద్ద శస్త్రములు లేవే. నిన్నెట్లు రక్షింపఁగలవారము? మని వారనిరి. అంత నగ్ని, వరుణునిం బ్రార్థించి శస్త్రంబులు దెప్పించి చక్రమును, గౌమోదకిని గృష్ణునకును గాండీవమును, రథమును, నర్జునునకును నిచ్చెను. వారా యాయుధములను గ్రహించి యింద్రుఁ డెదుర్కొనినను మేము నిన్ను సంరక్షించెదము. నీవి వనమును భక్షింపుమని యభయమిచ్చిరి. వారి సహాయమున నగ్ని ఖాండవవనమును దహించెను. భార.

అగ్ని నీలధ్వజుని కుమారితయైన స్వాహాను బరిణయంబయ్యె. ధర్మజుని యాగాశ్వమును నీలధ్వజుఁడు కట్టిపెట్టెను. అంత నర్జునుఁ డతనితో యుద్ధమునకుఁ గడఁగెను. తన మామ

యోటువడునని భయపడి యగ్ని యర్జునుని సేనలను గాల్చివేసెను. అర్జునుఁడితనిని బ్రార్థింపగ వాని సేనలను బ్రతికించి యుద్ధము జరుగకుండ నగ్ని వారిద్దఱకును సఖ్యము గావించి యాగాశ్వమును విడువుమని నీలధ్వజునితోఁ జెప్పి విడిపించెను. జై. భా.

మును లమావాస్యయందు హోమములు చేయునపుడు వారి పత్నులు భర్తలకుఁ బరిచర్యలు చేయుచుండిరి. వీరిని జూచి యగ్ని కామపీడితుఁడై యరణ్యమున కేగి విచారముతోఁ గాలము పుచ్చుచుండెను. ఇది యగ్ని భార్య స్వాహాదేవి యెఱింగి, అంగిరసుని భార్యయైన శివరూపము దాల్చి యగ్నికడకుఁ బోయి అయ్యా, నేను మునిపత్నిని. నిన్ను మోహించి వచ్చితిని అని వేఁడగ నగ్ని మిక్కిలి ప్రీతినొంది యామెతో సంగమించెను. ఆమె యగ్ని శుక్లమును శ్వేత పర్వతముపై నొక కనకభాండమునఁ బెట్టెను. పిమ్మట స్వాహా మఱియొక మునిపత్ని వేషముతో వచ్చి యట్లే చెప్పి యట్లే చేసెను. స్వాహ యీప్రకారమే యరుంధతి వేషము తప్ప అందఱు మునిపత్నులయొక్క రూపములను దాల్చి యగ్నితో సంగమించి యాశుక్లమును శ్వేత పర్వతముపైఁ బెట్టెను. ఆ శుక్లము నుండియే కుమారస్వామి జన్మించెను. భార.

దుర్యోధనుఁ డను మనువంశపు రాజు కుమారిక సుదర్శన యనునది తండ్రియొక్క యగ్నిగృహంబునఁ బనులు చేయుచుండెను. ఆమె సౌందర్యము చూచి మోహించి యగ్ని బ్రాహ్మణరూపమున వచ్చి తనను వివాహమాడుమని కోరెను. తల్లిదండ్రులు తనకిచ్చి వివాహము చేయవలయును గాని స్వతంత్రముగఁ బరుని జేపట్టనని యామె తెలియఁజెప్పెను. అగ్ని బ్రాహ్మణ రూపముననే దుర్యోధనునికడకుఁ బోయి సుదర్శనను దనకిచ్చి వివాహము చేయుమని కోరెను. అన్యకులములవారికి నాకుమారిత నే నెట్లిత్తునని రాజు పలికెను. అగ్నికిఁ గోపము వచ్చి తన రూప ముపసంహరించుకొనెను. తన వలన నేదో దోషము వచ్చెనని భయపడి దుర్యోధనుఁ డగ్నిని బ్రార్థించెను. అగ్ని తన కోరిక దేవతలకుఁ దెలియపఱచెను. దేవతలు రాజునకుఁ దెలియఁజేసిరి. అగ్ని తన కల్లుఁడగుటకు సంగసించి దుర్యోధనుఁడు తన కుమార్తె నిచ్చి వివాహము చేసెను. ఈమెయం దగ్నికి సుదర్శనుఁడు అను పుత్త్రుఁడు పుట్టెను. భార.

అగ్ని బ్రాహ్మణ రూపమును ధరించి మాహిష్మతీపురమునఁ బరదారపరుఁడై తిరుగుచుండెను. వానిని రాజభటులు పట్టుకొని తమ రాజగు నిషధునికడకుఁ దెచ్చిరి. అతఁడు శిక్షింపఁబోఁగా అగ్ని విజృంభించెను. రాజు భయపడి యగ్నికి నమస్కరించె. నీవు కోరిన వర మిత్తు నడుగుమని యగ్ని యనెను. పరరాజులు తన నగరము ప్రవేశించిరేని వారిపై నగ్ని పడునట్లు నిషధుఁడు వరము వేఁడెను. అగ్ని యా వరము నొసంగి యందుకు ప్రత్యుపకారముగ నచ్చటి స్త్రీలు జారిణులైనను దోషులుగారని శాసింపుమని రాజును గోరెను. భార.

ఒకనాఁడు పార్వతీ పరమేశ్వరులు రతిక్రీడ సలుపుచుండఁగ నింద్రుఁ డితనికడకు వచ్చి స్తుతించి యెట్లైనను వారి రతిక్రీడ మాన్పుమని కోరెను. ఇంద్రుని స్తోత్రపాఠమున కుబ్బి అగ్ని గబగబ పోయి క్రీడించుచున్న పార్వతీ పరమేశ్వరుల కెదురుగా నిలచెను. వీనిని జూచి శివుఁడు దూరముగఁ బోయెను. అతని వీర్యము క్రిందఁ బడియె. అగ్నిని జూడఁగనే పార్వతికి దుఃఖమును, గోపమును వచ్చెను. భార్యాభర్తలేకాంతమునఁ గ్రీడించుచోటునకు రాఁగూడదని యెఱిఁగియు నీవు వచ్చితివి గావున ఈ మహేశ్వరుని వీర్యము నీవు ధరింపుమని యామె శాసించెను. పార్వతి వచన మమోఘము గావున అగ్ని గర్భము ధరించెను. కాని యాభార మతఁడు ధరింపఁజాలక గంగను జూచి శివుని వీర్యము నీవు గైకొని నన్ను గర్భభారవిముక్తుని జేయుమని వేఁడెను. గంగ యాగర్భమును ధరించెను. ఆవీర్యమువలననే కుమారస్వామి పుట్టెను.
బ్రహ్మ.

మరుత్తమరాజు సంవర్తుని ఋత్విజునిగఁ బిలిచి యాగము చేయఁబోవుచుండెను. ఇంద్రుఁడు వానియాగము కొనసాగకుండఁ జేయఁదలఁచుకొనెను. అతఁడగ్నిని బిలిచి నీవు మరుత్తుకడకు పోయి ఋత్విజునిగ సంవర్తు నేల పిలిచితివి ? వానిని వదలవంపి బృహస్పతిని బిలువుము. అని

చెప్పుమని యగ్నిని బంపెను. అగ్ని వెళ్ళి యింద్రుఁడు చెప్పినట్లు చెప్పెను. నీవిచ్చటకు వచ్చినచో మాడ్చివై చెదనని సంవర్తుఁ డగ్నితో జెప్పెను. అగ్ని భయపడి యింద్రుని కడకుఁ బరుగిడి వచ్చి యీ మాటలు చెప్పెను.
భార.

అగ్నితీర్థము:-గంగానదియం దొకతీర్థము. అగ్ని యగ్రజుఁడగు జాతవేదుఁడు గౌతమీతీరమున నుండి దేవతలకు హవ్యములను దీసికొని పోవువాఁడు. వీనిని మధువు అను రాక్షసుఁడు సంహరించెను. అది యగ్ని తెలిసికొని గంగానదిని బ్రవేశించియుండెను. లోకమున నగ్ని లేకపోయెను. అపుడు దేవతలు వీనిని స్తుతించి నీ మూలమున దేవతలు హవ్యములను బొందువారని చెప్పిరి. అగ్ని మరల వచ్చెను. ఆచోటు అగ్నితీర్థము.
బ్ర. వై.

అగ్నిదైవత్యము:- (కృత్తిక) ఒక నక్షత్రము. మునిపత్నులారుగురు అగ్నితో వ్యభిచరించిరనియుఁ గుమారుని గనిరనియు లోకాపవాదము విని వారి భర్తలు వారిని విడిచిపెట్టిరి. వారు కుమారస్వామి యొద్దకు వచ్చి మేము పుణ్యలోకంబును బాసి యుంటిమి. మమ్ము పుత్త్రిభావదృష్టి వెలయఁ బుణ్యస్థానమున నిల్పుమని కోరిరి. వారికి దగిన తావెద్దియని కుమారస్వామి యింద్రు నడిగెను. రోహిణి ప్రక్కనుండు అభిజిత్తు నక్షత్రము చంద్రునకుఁ దానే యొక్కత మక్కువగల పత్నియగుటకుఁ దపము చేయుచున్నది. ఆస్థానము రిత్తయై యున్నది. అచ్చట నుంచుమని ఇంద్రుఁ డనియె. కుమారస్వామి వీరిని అగ్నిదైవత్యమను నక్షత్రముచేసి యచ్చట నిలిపెను.
భార.

అగ్నిద్యోతనుడు:-ఒక బ్రాహ్మణుఁడు. రుక్మిణి తనను వివాహమాడుమని కృష్ణున కితనిచే వర్తమానము నంపెను.

అగ్నిమిత్త్రిడు:-పైలుని శిష్యుఁడగు బాష్కలుని శిష్యుఁడు. ఋగ్వేదసంహిత నుపదేశమొందెను.
భాగ.

అగ్నిమిత్త్రిడు:-శృంగుఁడను రాజకుమారుఁడు. ఇతని కుమారుఁడు సుజ్యేష్ఠుఁడు. భాగ.

అగ్నివర్ణుఁడు-: కల్మాషపాదుని పౌత్త్రిఁడగు సుదర్శను పుత్త్రిఁడు. రామా.

అగ్నివర్ణుఁడు:- పుష్యుని పౌత్త్రిఁడగు సుదర్శనుని కుమారుఁడు. రఘువంశపురాజు. సదా స్త్రీలోలుఁడై భోగపరాయణుఁడై యున్నవాఁడు. రాజ్యము మంత్రులక ప్పగించెను. ఇతని పుత్త్రుఁడు శీఘ్రుఁడు. భాగ.

ఇతఁడు చనిపోవునప్పటికి ఇతని భార్య గర్భవతిగ నుండెను. ఇతని యనంతర మితని పుత్త్రునికి మంత్రులు పట్టము గట్టిరి. రఘు.

అగ్నివేశుఁడు:- అరిష్యుని వంశస్థుఁడైన దేవదత్తుని కుమారుఁడు. ఈతడు కానీనుఁడై జాతకర్ణుఁడను మహర్షియై వెలసెను.

ఇతనివలన అగ్నివేశ్యాయనం బను బ్రహ్మకులము కలిగెను. భాగ.

అగ్నివేశుఁడు:- ఒక ముని. బ్రహ్మశిరమను నస్త్రప్రయోగము నేర్చుకొనెను. ద్రోణున కితఁడస్త్రవిద్య నేర్పెను. భార.

అగ్నిష్టుతుఁడు:- (అగ్నిసోముఁడు) చాక్షుష మనువు కుమారుఁడు.

అగ్నిష్వాత్తులు:- మరీచి పుత్త్రులు. ఒక పితృదేవతాగణము.

అగ్రయాయి:-గాంధారి ధృతరాష్ట్రుల పుత్త్రుడు.
భార.

అఘమర్షణము:-ఒక తీర్థము. ఇచ్చటఁ దపస్సు చేసికొనుచున్న దక్షునకు విష్ణువు ప్రసన్నుఁడై అసిక్నిని భార్యగ నిచ్చెను. భాగ.

అఘాసురుఁడు:-బకాసురుని తమ్ముడు. సర్పరూపము దాల్చి కృష్ణుఁడు బకుని జంపెనన్న కోపముతో వీనిని హింసింప వచ్చెను. గోపకుమారులు కృష్ణుఁడు పశువులను మేపుచుండగ గోపకులను పశువులను మ్రింగెను. కృష్ణుని మ్రింగెను. కాని కృష్ణుఁడు అతని కంఠములో నడగకే తనశరీరము పెంచెను. ఆపాముని కూపిరి

ఆడకవచ్చెను. వానిగర్భమున నున్న గోపకులు, పశువులు మరలి వచ్చిరి. భాగ.

అచ్ఛోదము:-ఒక కొలను. సోమపులనువారి మానస పుత్రిక. పితరులను బాలకాలము నుండి జూడకుండుటచే వారిని జూడ నామె వేడుక పడుచుండెను. ఒకనాఁ డమావసు డను వాఁడును, నతని భార్య అద్రికయు విమాన మెక్కి పోవుచుండగ వారే తనపితరులను భ్రాంతిచేత వారిని గలిసికొనుటకై యచ్ఛోదము పైకెగిరెను. ఇట్లు వ్యత్యయమగు కార్యము చేయుటచేతఁ బాపమువచ్చి యామె క్రిందఁ బడఁబోయెను. అప్పు డామె తండ్రులను దలఁచుకొని ప్రార్థింపగ "నీవు భూమిపైఁ బడవు. భయములేదు. కాని నీ కర్మఫల మనుభ వింపక తప్పదు. నీవు అమావసుని, నద్రికను తల్లిదండ్రులుగ భావించితివి గావున వారి కడుపుననే పుట్టుదువు. మత్స్యయోనిం బుట్టి పరాశరునివలనను శంతనుని వలనను బుత్త్రిలను బడసి తిరిగి యీ లోకమునకు వచ్చెదవు. అని పితరులు చెప్పిరి" ఈమెయే మత్స్యగంధిగ బుట్టెను. బ్రహ్మ.

అజకుడు:-జహ్నుని పుత్త్రుడైన సునహుని తన యుఁడు. ఇతని కుమారుఁడు బలకాశ్వుఁడు. బ్రహ్మ.

అజకుడు:- ప్రద్యోతు లనఁబడు రాజులలో నొకడు; ప్రద్యోతుని పుత్త్రుడైనవిశాఖయూపుని తనయుఁడు. ఇతని కుమారుఁడు నందివర్ధనుఁడు. బ్రహ్మ.

అజగరుఁడు:-ఒక ఋషి. ప్రహ్లాదునకుఁ బరమ హంసధర్మము బోధించెను. కావేరీ తీరమున నితని యాశ్రమము.

అజగరుఁడు:-ఒక బ్రాహ్మణుఁడు. ఇతనిని తన ప్రకారమును దెల్పుమని ప్రహ్లాదుఁడు కోరెను. ఇతఁడు సల్పు వ్రతమును ప్రహ్లాదునకుఁ దెల్పెను. నిత్యతృప్తి, కామవిరతి, శాంతి, సమతయు, గలిగి యుండవలయును; మేలు రావలెనని కాని, కీడుపోవలెనని కాని కోరరాదు. ఏది వచ్చినను తూష్ణీభావముతోనే యుండ వలెను. నారచీరలుకట్టినను, పీతాంబరముకట్టినను నొక్కటే. ఇట్లుండుటచే శమము కల్గును అని చెప్పెను. భార.

అజనాభము:-భరతవర్షము యొక్క పూర్వపు పేరు. ఈ దేశమును భరతుఁడు పాలించుటచే భరతవర్షమను పేరువచ్చెను. భాగ.

అజపార్శ్వుఁడు:-జనమేజయుని వంశమువాడైన శ్వేతకర్ణుని పుత్త్రుఁడు. శ్వేతకర్ణుఁడు హస్తినా పురమేలి, సంతానము కలుగకపోవుటచే రాజ్యము మంత్రుల కప్పగించి తపోవనమున కరిగెను. గర్భవతియై యుండిన వాని భార్యయు భర్త ననుగమించె. వనమున భర్తకుఁ బరిచర్యలు చేయుచున్న వాని భార్యయగు మాలిని దైవయోగమున గర్భవతియై శిశువును ప్రసవించెను. శ్వేతకర్ణున కతివైరాగ్యము కలుగక మహాప్రస్థానము చేయ దలచి చనియె. ప్రసవించిన బిడ్డను విడిచి అతని భార్యయు నతనితోఁ జనియె. ఈపుట్టిన బిడ్డయే అజపార్శ్వుఁడు. ఈ శిశువును పిప్పలాదుఁడు, కౌశికుఁడు అను వారలు చూచి యెత్తికొని కొండకాలువ బండమీదపెట్టి దానిని కడిగిరి. ఆ రాతి రాపిడికి వానికి ప్రక్కలు నల్లబాఱి అజపార్శ్వము లట్లయ్యెను. వానికి అజపార్శ్వుఁ డను పేరు పెట్టి పుత్త్రులులేని యొక కాంత వేమక అను నామె కిచ్చిరి. ఆమె పెంచెను. తన తండ్రి రాజ్య మితఁ డేలెను.

భవిష్యపర్వము.

అజమీఢుఁడు:-వికంఠనుని పుత్త్రుఁడు. వీనికిఁ గైకేయి, గాంధారి, ఋక్షయను ముగ్గురు భార్యలు కలరు. వీరివలన నూటయిరువదిమంది పుత్త్రులు కలిగిరి. సంవరణుఁడు వీరిలో నొకఁడు. భార.

అజమీఢుఁడు:- హస్తియొక్క కుమారుఁడు ఇతనిపుత్త్రుఁడు బృహదిషుఁడు. ఇతని వంశంబున ప్రియమేధాదులు పుట్టి బ్రాహ్మణులైరి.

ఇతనికి నళినియనుభార్యయందు నీలుఁడు అను కుమారుఁడు కలిగెను. ఇతని పుత్త్రులలో ఋక్షుఁడు ఒకఁడు. భాగ.

అజముఖి:-సురసకుఁ గశ్యపుని వలన జన్మించిన కూఁతురు. శూర పద్మాసురాదు లీమె తోఁబుట్టువులు. అందముగానున్న పురుషులను బట్టుకొని బలాత్కారమున వారితో నామె రమించుచుం

దును. ఆమె దుర్వాసునితోఁగూడ రమించె. అతనివలన వాతాపి యిల్వలులు పుట్టిరి. స్కాంద.

అజముఖుఁడు:-(దక్షుఁడు. చూడుము)

అజయుఁడు:- శిశునాగుల వంశములోని రాజు. దర్భకుని కుమారుఁడు. ఇతని కుమారుఁడు నందివర్ధనుఁడు. భాగ.

అజహ్నుఁడు:- జహ్నుఁడను రాజకుమారుఁడు. వీని కుమారుడు పల్లవ్యుఁడు. భార.

అజాతశత్రుఁడు:- శైశునాగులలో ఆఱవ రాజు. విధిసారుని పుత్త్రుఁడు. ఇతని కుమారుఁడు దర్భకుఁడు. భాగ.

అజామిళుఁడు:- ఒక బ్రాహ్మణుఁడు. వేదశాస్త్రములనుజదివి ధర్మంబు జరుపువాఁడు. తండ్రి పంపున పుష్పాదులు తెచ్చుటకు వనమునకుఁ బోయి వచ్చుచు లతాగృహంబున విటుఁ డొకఁడు కాంతనుగూడి రమించుటచూచి మన్మథబాణంబులచేఁ గొట్టబడి ఇల్లును వాకిలిని మరచి శూద్రస్త్రీని గూడియుండి ధర్మము వీడి ఆమెతో రతియే ప్రధానముగఁ జూచుచు పాప కర్మంబులు వెఱపులేక చేయుచుండెను. అతని కామెయందు సంతానము కలిగినది. నారాయణుఁ డను పుత్త్రునియందు అతనికి మక్కువ. ముదుసలి తనమున రోగపీడితుఁడై మృతినొంద నుండెను. ఇతఁడు పెక్కు పాపములుచేసి యుండెను. గాన యమదూతలు వచ్చిరి. ఆ సమయమున నితఁడు కుమారుని నారాయణా ! అని పిలచెను. ఆమాట పలుకుటతోటనే అది విష్ణునామము గావున విష్ణుదూతలు వచ్చిరి. అజామిళుఁడు పుత్త్రు నుద్దేశించినను పలికినది విష్ణునామము గాన యమదూతల కచట చోటులేదనిరి. అట్లు అజామిళుఁడు నరకమునకుఁ గొనిపోఁబడకుండ విడువఁబడెను. అజామిళుఁడు విష్ణుదూత లగుపడుటయును, మఱియు వారంద అంతర్ధానంబు నందుటయు తెలిసికొని పూర్వపుణ్యవశమున నారాయణా! అని అనగల్గితి నని చేసినపాపములకు పశ్చాత్తాపమునొంది పిమ్మట గంగాముఖద్వారంబున కేగి యోగంబుచే దేహము చాలించి పుణ్యలోకమున కేగెను. భాగ.

తరువాత జన్మమున మందకుఁడను బ్రాహ్మణుఁడుగాఁ బుట్టెను. బ్రహ్మ

అజిత:- ఒక వనిత. కోశలపతి కన్యక. ఈమె సాల్వేయుఁడు, శూరసేనుఁడు, శ్రుతసేనుఁడు, బిందుసారుఁడు, అతిసారుఁ డను నైదుగురను నొక్కసారి వివాహమాడెను. వీరు అన్నదమ్ములు. భార.

అజితుఁడు:- విష్ణుమూర్తి చాక్షుష మనుకాలమున వైరాజునకును, సంభూతికిని జన్మించి అజితుఁ డన నొప్పెను. భాగ.

అజీగర్తుఁడు:- శునశ్శేపుని తండ్రి. మిక్కిలి పేదవాఁడు. క్షామము వచ్చినపుడు తినుటకుఁ దిండిలేక తన కుమారుని శునశ్శేపుని విక్రయించెను. ఈ పాపముచేత వానికిఁ బిశాచత్వము వచ్చెను. అతఁడు యమకింకరులవలన బాధలు పడుచుండెను. శునశ్శేపుఁ డది విని తనవలనఁ దండ్రికి బాధకలిగెను గావునఁ దానే నివారణ చేసెదనని గౌతమీతీరమునఁ గూర్చుండి తపస్సు చేసి యితని పిశాచత్వమును బోఁగొట్టెను. బ్ర. వై.

అజుఁడు:- రఘువు కుమారుఁడు. ఇతఁడు బ్రహ్మ ముహూర్తమునఁ బుట్టుటచే అజుఁడని పేరు పెట్టిరి. ఇతఁ డిందుమతీ స్వయంవరమునకుఁ బోయి యామెచే వరియింపఁబడెను. స్వయంవరమునకు వచ్చిన రాజులు కొందఱీర్ష్యచే నితనిపైఁబడిరి. ఇతఁడు వారితో యుద్ధముచేసి యోడించి యిందుమతిని తీసికొనివచ్చి నిజనగరోద్యానవనమునఁ బ్రవేశించి యందు విహరించుచుండెను. అంతలోనే నారదుని వీణె నుండి సురపుష్పమాలిక యొకటివచ్చి ఈమెపైఁ బడియె. ఈమె వెంటనే ప్రాణములను విడచెను.

అజుని కుమారుఁడు దశరథుఁడు. రఘు.

అజుఁడు:-ఒక కపి. శండుని తమ్ముఁడు. జంతుధన తండ్రి. ఇతఁడును, శండుఁడును వీరి కుమార్తెలును వనములో సంచరించుచుండిరి. ఆహారమునకై యా వనములో సంచరించుచుండిన రాక్షసుఁ డొకఁడు గట్టిగా నఱచెను. జంతువులన్నియు భీతిల్లెను గాని వీరి కుమార్తెలు ధైర్యముకల్గి ఆ యఱచినవానిని జూడఁబోయిరి. వాఁడు వీరిని భయపెట్టఁబోయె. వీరు వానిని గెలువఁ దలఁచిరి. అజుఁడును శండుఁడును తమ కుమార్తెలను వాని కొసంగిరి. కాని వానిని

వివాహమాడుటకుఁ గుమారిక లంగీకరింపలేదు. తండ్రులు వీరిని బుజ్జగించి ధనమొసఁగి భర్తతో బంపిరి. బ్రహ్మ.

అజుఁడు:- స్థాణుని మానసపుత్రుఁడు. ఏకాదశ రుద్రులలో నొకఁడు. భార.

అణుహుఁడు:- విభ్రాజుని కుమారుఁడు. శుకుని కూఁతురగు కీర్తిమతిని వివాహమాడెను.

అతికాయుఁడు:-ధాన్యమాలియందు రావణునకు బుట్టిన కుమారుఁడు. వీనిని రావణుఁడే పెంచి తన సేనాధిపతిగఁ జేసికొనియె. ఇతఁడు మిక్కిలి బలశాలి. వీనిని యుద్ధములో లక్ష్మణుఁడు బ్రహ్మాస్త్రమువేసి చంపెను. రామా.

అతిధన్వుఁడు:- ఒకఋషి. శునకఋషి వంశములోనివాఁడు. తన శిష్యుఁడైన ఉదర శాండిల్యుఁడను వానితో నీసంతతివారు ఉద్గీథ విద్యను నెంతవఱకు నేర్చియుందురో, అంతవఱకు మహైశ్వర్యముతో నుందురని చెప్పెను.

ఛాన్దో. ఉ.

అతిథి:-కుశుని కుమారుఁడు. ఇతని కుమారుఁడు, నిషధుఁడు. ఇతనికి పట్టాభిషేకమప్పుడు చెరసాలలలో బంధింపఁబడినవారినేకాక పంజరము లందుంచబడిన పిట్టలను గూడ విముక్తులను చేయించెను. జనరంజకుఁడగు రాజు. రఘు

అతిబల, బల:- మంత్రములు, బ్రహ్మయొక్క సుతలు. వీనిని జపించిన ఆకలి, దప్పి, మార్గాయాసము ఉండదు; జ్ఞానము కలుగును. వీనిని విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులకు ఉపదేశించెను. రామా.

అతిరథుఁడు:-సత్యకర్ముని కుమారుఁడు. ధృతరాష్ట్రుని మిత్రుఁడు. ఇతఁడే నదిలోఁ గొట్టుకొనివచ్చుచున్న కర్ణునిఁ జూచి తీసి పెంచినవాఁడు. ఇతని భార్య రాధ. భాగ.

అతిరాత్రుఁడు:- చాక్షుషమనువు కుమారుఁడు మత్స్య.

అతిసారుఁడు:- నితంతుని పుత్త్రుఁడు. ఇతఁడును నితని సోదరులు సార్వేయాదులును నొక్క కాంతనే అజిత యనుదానిని వివాహమాడిరి. భార.

అత్రి:- బ్రహ్మమానసపుత్త్రుఁడు. ఒక ఋషి. ఇతని భార్య అనసూయ. ఇతఁడు సంతానార్థ మతి దీక్షతోఁ దపస్సు చేయఁగఁ బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురు ప్రత్యక్షమైరి. నేనొక్కనినే ప్రార్థింపఁగ ముగ్గురేల వచ్చితిరని యత్రి యడిగెను. మా ముగ్గురకును నభేదము. మేము ముగ్గురము ఒక్కటే గాని వేరుకాదు. నీవు కోరిన వరమిత్తుము. మా కళలతో నీకుఁ పుత్త్రులు పుట్టుదురు. అని చెప్పి వారు వెడలిరి. అత్రికి బ్రహ్మాంశమునఁ జంద్రుఁడును, విష్ణ్వంశమున దత్తాత్రేయుఁడును, శివు నంశమున దుర్వాసుఁడును బుట్టిరి. భాగ.

అత్రి భార్యతోఁ గ్రీడించుచుండ శుక్లం బామె గర్భమునఁ బడు సమయమున వాయు వద్దానిని మూఁడు భాగములుగఁ జేసెను. ఒకటి పైకిఁ బోయి యతని కంటియందుఁ బడుటచే నందుండి చంద్రుఁడు పుట్టెను. తక్కిన రెండు భాగములును ననసూయ గర్భములోఁ బడెను.

మార్కం.

బ్రహ్మావర్తదేశమున సరస్వతీ నదీతీరమందు పృథువు యాగములు జేయునపు డీతఁ డుండెను. పృథుని యాగాశ్వమును మాయచేసి యింద్రుఁ డపహరించుట యితఁడే చూచి పృథుని కుమారునితోఁ జెప్పెను. భాగ.

అత్రి తపస్సునకు బోవుచుండగ నతనిభార్య యెదురుగ వచ్చెను. నీవు నాతోఁ దపస్సునకు వచ్చెదవా? గృహమునుండి పుత్రసంరక్షణము చేయుదువా? యని యత్రి, భార్య నడిగెను. కుటుంబ పోషణమునకు మార్గము చూపక నీవు పోవుట ధర్మముకాదని భార్యపలికెను. క్షత్రియుఁడు భూభారమెల్ల మోసి యెల్లవారలను గావను, బ్రోవను బ్రభుఁడు :అనెను. ఆమె వచనము ధర్మయుక్తమగుట యెంచి యత్రి పృథువు కడకుఁబోయి యితనిని నీవు విధాతవు, నింద్రుఁడవు అని స్తుతించెను. గౌతముఁ డచ్చట

నుండి యేల యిట్లితనిని నింతగ స్తుతించెద? వని యాక్షేపించెను. వారిద్దఱకును జరిగిన వాదము సనత్కుమారుఁడు గాని తీర్పలేడని వానికడకు వెళ్లిరి అత్రి చెప్పినది యుక్తమే యని యతఁడనియె. అతని నిర్ణయమును పృథునకు తెల్పిరి. పృథువు అత్రికి విశేషధన మిచ్చెను.

భార.

రాహువు చంద్రుని మ్రింగుటను సూర్యుఁడు చూచి భయపడి వణకుఁచు క్రిందఁ బడిపోవుచుండెను; లోకములందుఁ జీఁకటి క్రమ్మఁ జొచ్చెను. అపు డత్రి సూర్యుఁడా! నీకు భయములేదు. శుభమగు నని బలికెను. అపుడు సూర్యుఁడు యథాస్థానమును జేరెను.

బ్రహ్మ.

అరణ్యవాసము చేయునపుడు సీతారామలక్ష్మణు లీతని యాశ్రమము దర్శించిరి.

రామా.

అత్రి యొకసారి బ్రహ్మకూడ నయ్యె.

బ్రహ్మ.

అదితి:- ధరణీదక్షుల కుమారిత. కశ్యపుని భార్య. ఈమెకు దితి, వినత, కద్రువ మొదలగు సవతులు కలరు. కాని యీమెపుణ్యము వారికి లేదు. ఈమె గర్భమున జన్మించినవారు సద్వర్తనులును, దేవతలునే యగుదురు. విష్ణుమూర్తి యవతరించిన నీమె గర్భమందే జన్మించునుగాని దిత్యాదులయందుఁ గాదు.

ఒకనాడు కశ్యపుఁడు సమాధి చాలించి యీమె కడకు వచ్చి అతిథిపూజయు, దేవతాపూజయు జరుగుచున్నవా? యని యడిగెను. దితి సంతానమువారు బాధపెట్టుటచే జరుగుట లేదని యామె చెప్పెను. విష్ణుమూర్తి నారాధింపుమని కశ్యపుఁడు బోధించెను. మఱియు నామెకు "పయోభక్షణ" మను మంత్రమును కశ్యపుఁ డుపదేశించెను. విష్ణుమూర్తి ప్రసన్నుఁ డయ్యె. బలిచక్రవర్తి యింద్రలోకము నాక్రమించి యుండెను; వానిని తొలఁగింపుమని యీమె కోరెను. నీవు కశ్యపుని సేవింపుము. నీగర్భమందునే జన్మించెదను. నీ కుమారుల బాధలు తొలఁగించెదనని విష్ణుమూర్తి చెప్పి యంతర్ధానుఁడయ్యెను. అదితిగర్భమందు విష్ణువే వామనుఁడుగ జన్మించెను.

దితి గర్భముదాల్చి యుండెను. ఆమె గర్భమున బలసంపన్నుఁడగు పుత్త్రుఁడు పుట్టినచోఁ దనకే శత్రువగును; కావున నట్టివానిని బుట్టకుండఁజేయవలయునని తలఁచి తనపుత్త్రుఁడగు నింద్రుని బిలిచి యామె తలం పెఱిఁగించెను. ఇంద్రుఁడు దితిగర్భము ప్రవేశించి గర్భమందున్న బాలుని తునియలు గావించె. (మూడుము మరుత్తులు.) ఇట్లగుట అదితివలననని దితి తెలిసికొని అదితిని భూలోకమున నరజన్మ మెత్తుమనియె. ఈమె దేవకిగఁ బుట్టెను. దే. భా.

దైత్యులు హవిర్భాగములను హరించుచు దేవతలను బీడించుచుండిరి. తన పుత్త్రు లార్తి నొందుటకు విచారించి యదితి సూర్యు నారాధించెను. అతఁడు ప్రసన్నుఁడు కాగ సూర్యునంశను దనకుఁ గుమారుఁడు, దేవతలను గావఁగలుగువాఁడు పుట్టవలయునని యీమె వేఁడెను. సూర్యకిరణములలో సుషుమ్నయనురశ్మి యదితి గర్భములోఁ బ్రవేశించెను. అదితి గర్భవతియైనను నుపవాసములు చేయుచుండెను. ఏల యుపవాసములు చేసెదవు? నీ గర్భమందలి యండమును మారణము చేయుదువా? యని కోపపడిన నదితికిని గోపమువచ్చి దీనివలన నండము మారణము కాదని యండమును బైటకు వెడలఁ ద్రోసెను. దాన బాలఁ డేర్పడె. ఆ బాలఁడే మార్తాండుఁడు. మార్క.

ఈమె కుమారులు ద్వాదశాదిత్యులు. ఒకసారి యీమె కశ్యపునితో రమింపఁగోరి వెళ్ళగ నతఁడు కద్రువను గూడియుండెను. ఈమెకు గోపమువచ్చి మీరు నరులై పుట్టుఁడనియె. కద్రువ ప్రతిశాప మిచ్చెను. దాన నీమె దేవకియై జన్మించెను. బ్ర. వై.

అదృశ్యంతి :- వసిష్ఠుని పుత్త్రుఁడైన శక్తి భార్య. ఈమె గర్భిణిగ నుండగ భర్తను రాక్షసుఁ డొకఁడు మ్రింగివేసెను. పిమ్మట నీమెకుఁ బరాశరుఁడు జన్మించెను. అతఁ డొకనాఁడు తల్లినిజూచి యేల నీవిట్లమంగళముగ నున్నావు?

వా జనకుఁ డేడి? యని యడిగెను ? రాక్షసుఁడు మ్రింగినాఁడని యామె చెప్పెను. లింగ.

అద్భుతుఁడు:- అగ్ని. ఆపుఁడను వహ్నికి ముదిత యందుఁ గల్గిన కుమారుఁడు.

అద్రిక:- ఒక అప్సరస. అమావసుఁడు అనువాని భార్య. భార్యాభర్త లిరువురును విమాన మెక్కి సంచరించు చుండగ, అచ్ఛోదను చూచి వీరినే తల్లిదండ్రులుగ భావించి వైకగిరి క్రిందఁ బడుచుఁ బితరులను ప్రార్థించెను. వీరిని పితరులుగా భావించుటచే వీరి కడుపుననే పుట్టుదువని యామె తండ్రు లనిరి. బ్రహ్మ.

ఈమె యొక మునిపాదముపైఁ బడుటచేఁ నాఁడు చేఁపవై పుట్టుమని బ్రహ్మ శపించెను. దే. భా.

ఆ శాపముచే మీనమై యమునానదిలోఁ జరించుచుండెను. ఉపరిచరవసువు రేతస్సును గిరికకై డేగ పట్టుకొని పోవుచుండగఁ బట్టుజారి యమునానదిలోఁ బడినపు డా రేతసును ఈ మత్స్యము భక్షించెను. ఈమత్స్యము గర్భమును దాల్చి మత్స్యరాజను పుత్త్రుని, మత్స్యగంధియను పుత్త్రికను బడసెను. అంతట శాపవిమోచనమై యీమె అమరలోకమున కరిగెను.

భార.

అధశ్శిరస్సు:- లంచము పుచ్చుకొనెడు వారనుభవించు నరకము.

అధిరథుఁడు:- చైత్రున కుమారుఁడు. ఇతని కుమారుఁడు సురథుఁడు. బ్ర. వై

అధిరథుఁడు:- కర్ణునిఁ బెంచిన తండ్రి. సూత కులజుఁడు (చూడుము కర్ణుఁడు)

అధిష్ఠానపురము:- చేదిదేశమునకు రాజధాని.

భాగ.

అనంత:- పురూరుని కుమారుఁ డగు జనమేజయుని భార్య. ప్రాచీనుని తల్లి. భార.

అనంగుఁడు:- కర్దముని పుత్త్రుఁడు. నీతిశాస్త్రము పుట్టినతర్వాత దానిని భూలోకమున నడుపుటకు విష్ణువు మానసపుత్త్రుఁడు విరజుఁడనువాని నియోగించెను. అతఁడు భూలోకమునకు రాననియె. ఈవిరజుని కుమారుఁడు కర్దముఁడు. అనంగుఁడు భువిని పాలించెను. అనంగుని కుమారుఁడు [illegible]

అనంతముని:- విద్రుముఁ డను బ్రాహ్మణునకు లేక లేక వార్ధక్యమునందుఁ బుట్టిన పుత్త్రుఁడు. కాని వాఁడు షండుఁడయ్యె. వానికిఁ బుంస్త్వము కొఱకై విద్రుముఁడు శివుని ప్రార్థించెను. శివుని ప్రసాదమునఁ గుమారుఁడు పురుషుఁ డయ్యెను. ఇతఁడు సముద్రములో స్నానము చేయుచుండఁగ మొసలి యొకటి లాగుకొని వెళ్ళెను. ఎట్టకేలకు నొడ్డుకువచ్చి పడియుండగ వృద్ధశర్మ యను బ్రాహ్మణుఁడు తీసి పెంచి చారుమతి యను తన కూతు నిచ్చి పెండ్లి చేసెను.

కల్కి.

అనంతవిజయము:- ధర్మరాజు శంఖము.

భార.

అనంతి:- స్వాయంభుని భార్య. ప్రియవ్రతోత్తానపాదుల తల్లి. మత్స్య.

అనమిత్రుఁడు:- యుధాజిత్తు కుమారుఁడు. నిమ్నుఁడు, శిని, పృశ్ని ఇతని కుమారులు.

భాగ.

అనరణ్యుఁడు:- ఒక రాజు. చాల యాగములు చేసెను. ఒక నాఁడితఁడు మానససరోవరమునకు స్నానమునకుఁ బోయి యచ్చట బంగారుపద్మమును జూచి దానిని గోసికొని రమ్మని మంత్రి కాజ్ఞ యిచ్చెను. తోడనే రాజునకుఁ గుష్ఠరోగము వచ్చెను. వసిష్ఠుఁ డితనిని జూచి బ్రహ్మ గర్భము నుండి వచ్చిన దాని నపేక్షించుటచే నష్టైతివి. ఆరోగ్య వ్రతము చేయుము. నీ జబ్బుపోవునని చెప్పెను. ఇతఁ డాచరించి దేహారోగ్యము నందెను. వరా.

అనరణ్యుఁడు:- సూర్యవంశపు రాజగు బాణుని కుమారుఁడు. ఇతని కుమారుఁడు పృథుఁడు.
రామా

అనరణ్యుఁడు:-రావణుఁ డందఱురాజులమీఁదకు యుద్ధమునకు వెళ్ళుచుండెను. అతనిని జూచి రాజులు భయపడుచుండిరి. కాని అనరణ్యుఁడు నీతో యుద్ధము జేయుదునని రావణునిపైకి వెళ్ళెను. ఇతఁ డోడిపోయెను. రావణుఁడు హేళన చేసెను. వీనితల ఖండించెను. "ఇది నీ ప్రతాపముగాదు. చేయించువాఁడు భగవంతుఁడు కలఁడు. కాలము వచ్చుటచేఁగూలితివి మా వంశమునఁ బుట్టువాఁడు రాముఁడనువానిచే నీవు సంహరింపఁబడుదువని శపించె" అని యా శిరస్సు పలికెను. రామా.

రావణునకుకోపమువచ్చి శిరమును ముక్కలు ముక్కలుగఁ గొట్టెను. ఉ. రా.

అనరణ్యుఁడు:-త్రసదస్యునికుమారుఁడు. ఈతని కుమారుఁడు హర్యశ్వుఁడు. భాగ.

అనలుఁడు:-అష్టవసువులలో నొకఁడు. ఇతని భార్య శివ. మనోజవుఁడు, అవిజ్ఞాతగతి ఇతని పుత్త్రులు. మత్స్య

అనశ్వుఁడు:-విదూరథునికుమారుఁడు. ఇతనిభార్య అమృత. ఇతనికుమారుఁడు పరీక్షిత్తు. భార.

అనసూయ:-దేవహూతీ కర్దముల కుమార్తె. అత్రిభార్య; పరమపతివ్రత. భర్తనే దైవముగ నెంచి యుపచారములను జేయుచు నతని వలన జ్ఞానోపదేశము నొందెను.

బ్రహ్మ, విష్ణు మహేశ్వరులు తమవాహనము లెక్కి మేరుపర్వతములకుఁ బోవుచుండఁగ గొంత దూరమఱిగినపిమ్మట వాహనములు కదలినవి గావు. వారెంత ప్రయత్నించినను నిష్ఫలమేయయ్యెను. అపుడుగరుడుఁడు విష్ణువుతో స్వామీ! ఇచ్చట నే యత్రి యాశ్రమ మున్నది. అతని భార్య కడు పతివ్రత. ఈ యాశ్రమముమీఁదుగ నెవ్వరును బోరాదు అని చెప్పెను. వారు వేఱుమార్గములను పోయిరి. పిదప ననసూయ ప్రభావమెట్టిదో పరిశీలింపఁగోరి ముగ్గురును బ్రాహ్మణులుగ యత్రి యాశ్రమమునకుఁబోయిరి. అతఁ డాతిథ్యమిచ్చెను. వీరు తమకొక వ్రతము కలదనియు, దాని వలన ఆనాఁడు వారికి వడ్డించు వనిత దిగంబరిగ నుండవలెననియుఁ జెప్పిరి. అత్రి యేమాటయుఁ జెప్పలేక తనభార్యవైపుఁ జూచెను. ఆమె సరే. అట్లే కానిండనియె. బ్రాహ్మణులు ముగ్గురు స్నానముచేసి పీటలమీదఁ గూర్చుండిరి. అనసూయ వారిమీఁద మంత్రాక్షతలును, జలమును జల్లెను. వారు శిశువులైరి. అంత నామె దిగంబరియై వడ్డించి చని వస్త్రధారిణియై వచ్చి వారిమీఁద మఱల జలము చల్లెను. వారు పూర్వపు రూపును జెంది భుజించిరి. అనసూయ మఱల వారిని శిశువులుగఁజేసి తనయొద్ద నుంచుకొనెను. తమ భర్తలకొఱకై వెదకుకొనుచు వచ్చిన ఉమా లక్ష్మీ సరస్వతులకు వారి భర్తల నిచ్చెను. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు మెచ్చుకొని నిజస్వరూపములను జూపి వరము వేడుకొను మనిరి. అనసూయ వారివంటి కుమారులను గోరెను. వారి యంశమునఁ బుత్త్రులు బుట్టుదురని చెప్పిరి.

కౌశికునిపత్ని యుదయింపకుమని సూర్యుని శాసించుటచే లోకమంతయుఁ దమోమయమయ్యెను. ఇంద్రాదు లపుడు చీకటిని బోఁగొట్టుమని బ్రహ్మను బ్రార్థించిరి. అనసూయయే దానిని జేయఁగలిగినదని బ్రహ్మ చెప్పెను. వారనసూయకడకు వచ్చి యామెను వేడిరి. సూర్యు డుదయింపకుండుటకుఁ గారణ మా మహాపతివ్రతయగు కౌశికుని పత్ని శాపమని యనసూయ గ్రహించి యామెకడకుఁ బోయి సూర్యు నుదయింపనిమ్ము. అతఁ డుదయించుటచే నీపతి మరణించినను బ్రతికించుదాననని చెప్పి యొప్పించెను. కౌశికుని పత్ని సూర్యు నుదయింపు మనగ సూర్యుఁ డుదయించెను. కౌశికుఁడు మృతి జెందెను. వానిని మఱల అనసూయ బ్రతికించెను. అనసూయవలన లోకమందిలి తమము పోయెను. కాఁబట్టి బ్రహ్మ విష్ణు మహేశ్వరులు వచ్చి యామెను మెచ్చుకొని వరము వేడుకొనుమనిరి. వారల యంశంబునఁ దనకుఁ బుత్త్రులు కలుగునట్లామె వరము వేడెను.

అనసూయ భర్తతోఁ గలసి యున్నపుడు శుక్లమామె గర్భమునఁ బడు నవసరమున వాయువు దానిని మూడు భాగములుగఁజేసెను. ఊర్ధ్వభాగ మత్రికంటియందుఁ బడుటచే వాని కంటినుండి చంద్రుఁడు పుట్టెను. తక్కిన రెండు భాగములును ననసూయ గర్భమునఁ బడెను.

ఆమె గర్భవతియై యుండఁగ హైహయుఁడను రా జామె గర్భనిరోధనము గావించెను. దాని నెఱింగి వాని దగ్ధుం జేయఁ దలంచి శివుఁ డామె గర్భముం బ్రవేశించి జన్మించెను. ఇతఁడే దూర్వాసుఁడు. విష్ణువంశమున నామెకు దత్తాత్రేయుఁడు పుట్టెను. మార్కం.

అత్రితపస్సునకుఁ బోవుచు నెదురుగవచ్చిన భార్యను దపమునకు వచ్చెదవా? ఇంటనుండి పుత్త్రసంరక్షణము చేయుదువా? యని యడిగెను. కుటుంబపోషణమునకు మార్గము చూపక నీవు పోవుట ధర్మముకాదని ఈమె చెప్పెను. అత్రి పృథువు కడకుఁ బోయి ధనము తెచ్చి యిచ్చెను. భార.

పూర్వమొకప్పుడు క్షామము సంభవించినపుడనసూయ గంగాతీరమందుఁ దపస్సుగావించి వృక్షములు ఫలించునట్లు చేసెను.

దేవకార్యములకొఱ కీమె పది రాత్రులను నేకరాత్రముగఁ జేసెను.

వనవాసము చేయుచుండిన సీతా రామలక్ష్మణులు అత్రి యాశ్రమమునకు వెళ్ళిరి అనసూయ సీతకు సతీధర్మములు బోధించి యామె కెన్నడు వాడని పువ్వులను, సర్వమంగళముగఁ జేయు మైపూతను చీరను నిచ్చెను. రామా.

అనాధృష్యుఁడు:- గాంధారి ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

అనామిక:- వ్రేలు. శివుఁడు బ్రహ్మ యొక్క పంచమ శిర మీ వ్రేలితో నఱికెను. కాన నది యపవిత్ర మయ్యెను. అందువలననే యజ్ఞాది కర్మలందు ఆ వ్రేలునకుఁ బవిత్రమును బెట్టుదురు.

అనాయువు:- ధాణీదక్షుల కుమారిత. కశ్యపుని భార్య. విక్షరుఁడు, బలుఁడు, వృత్రుఁడు, వీరుఁడు ఈమె కుమారులు. భార.

అనిరుద్ధుఁడు;- ప్రద్యుమ్నుని కుమారుఁడు; మిక్కిలి రూపవంతుఁడు. మొదట రుక్మి మనుమరాలును మేనమామ కుమార్తెయు నగు రుక్మలోచనను వివాహమాడెను. బాణాసురుని కుమార్తె యుష యీతని రూపమును గలలోఁ జూచి కామించెను. ఉష యీతని నెఱుఁగదు. ఆమె చెలికత్తె చిత్రరేఖ సర్వరాజకుమారుల పటముల వ్రాసి యుషకుఁ జూపఁగ ననిరుద్ధుని పటము చూచి యీతఁడే కలలోఁ గనఁబడినవాఁడని చెప్పెను. అంత చిత్రరేఖ యాకాశమార్గమున వచ్చి రాత్రి నిద్రించుచున్న ననిరుద్ధుని నెత్తుకొనిపోయి యుషయంతఃపురమున నుంచెను. అనిరుద్ధుఁడు మేల్కొని యుషను జూచెను. ఇరువురును మోహపరవశులై యొకరి నొకరెఱింగి కాముక క్రీడలఁ దేలిరి. అనిరుద్ధుఁ డామె యంతఃపురములోనే యుండెను. ఉష గర్భవతి యయ్యెను. పరపురుషుఁడు తన కుమారిత యంతఃపురములో నున్నట్లు విని బాణాసురుఁ డనిరుద్ధుని బంధింపఁ జేసెను. ఈ వృత్తాంతము అనిరుద్ధుకొఱకు వెదకుచుండిన ప్రద్యుమ్నాదులు నారదునివలన వినిరి. కృష్ణుఁడు సేనాసమేతుఁడై వచ్చి బాణునితో యుద్ధము చేసెను. బాణుఁ డోడి, అనిరుద్ధుని విడిచి ఉష నతనికిచ్చి వివాహము చేసెను. అనిరుద్ధుఁడు భార్యతోడను, పుత్త్రునితోడను ద్వారకకు వచ్చెను. ఇతనికి ఉషయందుఁ బుట్టిన కుమారుఁడు వజ్రుఁడు. ప్రజుఁడను మఱియొక కుమారుఁడు గలఁడు. భాగ.

అనిలుఁడు:- అష్టవసువులలో నొకఁడు. శాఖ, విశాఖ, నైగముఁడు ఇతని పుత్త్రులు. మత్స్య.

అనిలుఁడు:- శ్వసాప్రజాపతుల కుమారుఁడు. ఒక వసువు. ఇతనిభార్య శివ. మనోజవుఁడు, అవిజ్ఞాతగతి యితని పుత్త్రులు. భార.

అనీకుఁడు:- వసుదేవుని తమ్ముఁడు.

అనీలుఁడు:- కద్రువ కుమారుఁడు.

అనుకంపనుఁడు:- ఒక రాక్షసుఁడు. రావణుని సేవకుఁడు. రాముఁడు ఖరదూషణాదులను జంపినదియు, శూర్పణఖను బరాభవించినదియు రావణున కితఁడే తెల్పెను. మఱియు సీత నపహరించి తెచ్చినయెడల దుఃఖముచే రాముఁడు చనిపోవుననియు, నితఁడు పోవుటచే లక్ష్మణుఁడుకూడఁ బ్రాణములు విడుచుననియు నీ యాలోచన చెప్పెను. రామా.

అనుపదేవుఁడు:- అక్రూరుని రెండవ కొడుకు.

అనువిందుఁడు:-గాంధారీధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

అనావు-: యయాతికి శర్మిష్ఠయందు బుట్టిన కుమారుఁడు. భాగ.

అనుసాల్వుఁడు:-సాల్వుని తమ్ముఁడు. సాల్వుని గృష్ణుఁడు చంపుటచేఁ గృష్ణునిపై నితఁడీర్ష్య వహించి వానిని జంపుట కదను వేచియుండెను. ధర్మజుని యాగాశ్వమును బట్టుచో దానిని విడిపించుటకుఁ గృష్ణుడు వచ్చుననియు, నపుడు వానిని జంపవచ్చుననియు నూహించి యాగాశ్వమును గట్టివేసెను. దీనిని విడిపించుటకు వృషకేతుఁడును, ప్రద్యుమ్నుఁడును వచ్చిరి. వీరిద్దఱితోడను అనుసాల్వుఁడు పోరాడి యోడిపోయెను. వీనిని వారు బంధించి కృష్ణునికడకుఁ గొంపోయిరి. అట వీనిచేఁ గృష్ణునకు మ్రొక్కించిరి. భాగ.

అనుహ్లాదుఁడు:- హిరణ్యకశిపుని కుమారుఁడు ఇతని భార్య సూర్మి. వీరికి బాష్కలుఁడు, మహిషుఁడు అను కుమారులు కలిగిరి. మత్స్య. భాగ.

అనూదరుఁడు:-గాంధారీధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

అనూరుఁడు:- వినతాకశ్యపుల కుమారుఁడు. కద్రువయొక్క యండములు పగిలి శిశువులు బైటకువచ్చిరిగాని తనయండములు పగులకుండుటచే వినత యోపికపట్టలేక తన యండములలో నొక దానిని బొడిచి చూచెను. అందుండి శరీరము యొక్క క్రిందిభాగమేర్పడని కుమారుఁడు బైటకువచ్చి తన శరీరము పూర్తిగ నేర్పాటుగాక పూర్వమే వేగిరించి గ్రుడ్డును విచ్చెనుగావఁ దల్లిపైఁ గోపించి వేయేండ్లు తన సవతికి దాసియై యుండులాగునఁ దల్లిని శపించి, రెండవ గ్రుడ్డునైన నందుండి కుమారుఁడు వచ్చువఱకు దానిని ముట్టుకొనకుండుమని యానతిచ్చి తాను సూర్యుని రథసారథిగ వెడలిపోయెను. ఇతని భార్య శ్యేని. సంపాతి, జటాయువు లితని పుత్త్రులు. భార.

అనేనసుఁడు:- కకుత్థ్సుని కుమారుఁడు. పృథుని తండ్రి. భార.

అనేనసుఁడు:- స్వర్భానవీ ఆయువుల పుత్త్రుఁడు. నహుషుని సోదరుఁడు. ఇతని కుమారుఁడు శుద్ధుఁడు భార.

అన్నపూర్ణ:- కాశీవిశ్వేశ్వరుని భార్య.

అపర్ణ:- ఈమెయే పార్వతి. ఏకవర్ణ ఏకపాటల లీమె తోఁబుట్టువులు. వీరు ముగ్గురు తపస్సు చేసిరి. అపర్ణ ఆహారమే మానివేయుటచే తల్లి సస్నేహంబున ఉమా! అని నివారణార్థంబగు వాక్యం బుగ్గడించుటచే "ఉమ" అను పేరు వచ్చినది. హరి.

అపరాజితుఁడు:- చాక్షుషమనువు కుమారుఁడు. మత్స్య.

అపరాజితుఁడు:-గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

అపవుఁడు:- ఒక ముని. ఇతఁడుండిన వనమును హైహయుఁడు సూర్యున కాహారముగ నిచ్చెను. ఆతని యాశ్రమము కాలిపోయెను. అందువలనఁ గోపగించి హైహయుని బాహుసహస్రమును బలరాముఁడు ఖండించి వధించునని శపించెను. మత్స్య.

అపరాజితుఁడు:-కద్రువ కుమారుఁడు. భార.

అపాంతరతముఁడు:- విష్ణు మానసపుత్త్రుఁడు. బ్రహ్మ ముఖములనుండి వేదములు పుట్టిన పిదప వానిని బ్రసరింపఁ జేయుట కితనిని విష్ణువు పుట్టించెను. సావధానుఁడవై వేదములు విని వానినంచితవ్యాస మొందింపుము పుత్త్రా! వేదవ్యాసా! నాకట్లు సంతోషము కలుగఁజేయుమని విష్ణువు చెప్పెను. ఇతఁడే వేదవ్యాసుఁడు. భార.

అప్రతిరథుఁడు:-రంతినారుని కుమారుఁడు. ఇతని కుమారుఁడు కణ్వుఁడు. భాగ.

అప్సరసలు:- బ్రహ్మ జఘనమునుండి యసురులం బుట్టినతరువాత ఆ దేహము విడిచెను. పిమ్మటఁ [illegible] అప్సరసలు పుట్టిరి.

74649

క్షీర సముద్రమును మథింప నందుండి యప్సరసలు పుట్టిరి. భాగ.

అప్సరస లింద్రుని కొలువులోనుండి నృత్తగీతాదులచే దేవతలను రంజింపఁ జేయుదురు. రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమ, ఘృతాచి మొదలగు వారు వీరిలో ముఖ్యులు. వీరికి వివాహములు లేవు. మునులు చేయుతపమునకు విఘ్నముగలుగఁజేయుటకై తఱచుగ నింద్రుఁడు వీరిని బంపుచుండును.

అభిజిత్తి:- ఒక నక్షత్రము. రోహిణి ప్రక్కనుండునది. దక్షుని కూతురు. చంద్రుని భార్య. అందఱికంటెఁ దానే చంద్రునకుఁ గూరుచుపత్ని కాఁదలఁచి తపస్సున కేగెను. ఆమె స్థానమున కుమారస్వామి యగ్నిదైవత్యమను నక్షత్రమును నిల్పెను. భార.

అభిప్రతారి:- ఒక ముని. కక్షసేనుని వంశమువాఁడు. (చూడు. శౌనకుఁడు.)

అభిమన్యుఁడు:-చాక్షుషమనువు కుమారుఁడు. మత్స్య.

అభిమన్యుఁడు:-సుభద్రార్జునుల కుమారుఁడు. ఈ బాలుఁ డర్జునునితో వనవాసమునకు వెళ్ళలేదు. బలరాముని కుమారిత శశిరేఖ యితనిని ప్రేమించుచుండె. ఇతఁడును నామెను వలచి యుండెను. కాని బలరాముఁడు శశిరేఖను దుర్యోధనుని పుత్త్రుఁడగు లక్ష్మణునకిచ్చి వివాహము సేయుచుండఁగ ఘటోత్కచుఁడు శశిరేఖను నెత్తుకొని వచ్చి నభిమన్యునకిచ్చి వివాహము చేసెను. శ. ప.

తండ్రుల యజ్ఞాతవాసము ముగిసిన పిమ్మట గోగ్రహణ మప్పుడు కౌరవులను బాండవులోడించిన పిమ్మట దల్లితోఁ గలసి యభిమన్యుఁడు విరాటనగరమున కేగెను.

విరాటు పుత్త్రిక యుత్తరకు నర్జునుఁడు నృత్త సంగీతములు నేర్పెను; ఉత్తరునకు సారథిగావెళ్ళి యర్జునుఁడు కురువాహినుల నోడించివచ్చెను. కావున నతనితో బాంధవ్యము చేయఁగోరి విరాటుఁడు తన పుత్త్రికను నర్జునున కిచ్చెద ననెను. అర్జునుఁడు తన కుమారున కిచ్చి వివాహము చేయుమని చెప్పెను. అభిమన్యునకు నుత్తర నిచ్చి వివాహము గావించిరి.

వివాహమైన యచిరకాలములోనే యుద్ధము తటస్థించినది. ఇతఁడు రంగమధ్యమునఁజేరి విజృంభించు చుండెను. దుశ్శాసన, వికర్ణ, చిత్రసేను లందఱు కలసి వచ్చినను వారి నుక్కడంచుచుండెను.

ద్రోణుఁడు తన సేనను బద్మవ్యూహంబుగఁ జేర్చెను. ఆసమయమున నర్జునుఁడు వేఱొకనితో యుద్ధము సల్పుచుండెను. పద్మవ్యూహంబును భేదింప నర్జునునకును గృష్ణునకును బ్రద్యుమ్నునకును నభిమన్యునకును దప్ప నెవ్వరికిఁ దెలియదయ్యెను. అర్జునుఁ డిచ్చటకు వచ్చులోపలనే కౌరవవ్యూహంబు భేదింపవలెనని ధర్మజుఁడును భీముఁడును దలచిరి. అభిమన్యుని దానిపైఁ బనుపఁగోరి. అర్జును కుమారుఁడు తనకుఁ బద్మవ్యూహముఁ జొచ్చుటే తెలియునుగాని శత్రువులు చుట్టుముట్టిన బైటకు వచ్చు మార్గము తెలియదనియె. నీ కాభయమురాదు. నీవెంటనే మేమెల్లరము వచ్చెదమని వారు ప్రోత్సహించిరి. ఇతఁడు ప్రవేశించెను. ఈబాలునిపైఁ గురువీరులెల్లరు - ద్రోణుఁడు, కృపుఁడు అశ్వత్థామ, కృతవర్మ, కర్ణుఁడు, దుర్యోధనుఁడు మొదలగు వారొక్కసారిగ గవిసిరి. ఇతఁ డొక్కసారి యందఱి తోడను యుద్ధము సల్పుచుండెను; అన్నిరూపములుగలవానివలె నిటు ద్రోణునిపై నటు కర్ణునిపై నాయా ప్రక్కను కృతవర్మపై బాణములు వేయుచుండెను. ఈతని బాణములు దగిలి దుర్యోధనుని కుమారుఁడు లక్ష్మణుఁడు మరణించెను. దుశ్శాసనుఁడు పాఱిపోయెను. వృషసేనుఁడు మూర్ఛితుఁడయ్యె. ఇట్లజేయుఁడై శరవర్షము కురిపించుచున్న నభిమన్యుని వంచనచే జంపఁ దలచుకొనిరి; కర్ణుడు వెనుక నుండివచ్చి విరథునిజేసెను. కృపుడశ్వములను గూలనేసెను. అభిమన్యుఁడు నేలపై కురికి యుద్ధము చేయుచుండెను. ఎంతకాల మల్లెదురొక్కనినను నతఁ డొంటివాఁడేయయ్యె; వానికి సహాయము రాకపోయె. సైంధవుఁ డడ్డువచ్చుటచే ధర్మజాదులెవ్వరును వీరిం జేరలేకపోయిరి. అభిమన్యుఁ డలసిపోయె. వ్యూహమునుండి బైటకు రాలేకపోయెను. పాపము తుదకుఁ గురువీరుల బాణములచే హతుఁడయ్యెను.

ఇతనికి నుత్తరయందుఁ బరీక్షిత్తు అను కుమారుఁడు జన్మించెను.

అభిమన్యుఁడు పూర్వమున వర్చఅనువాఁడు. సోమపుత్త్రుఁడు. ఇతఁడు చంద్రుఁడు. దేవ కార్యార్థమీతని నిమ్మని దేవతలుసోమునుగోరిరి. ఆమె యిర్వ్రేలననియె. ఆతఁడచిరకాలములోనే వచ్చునని చెప్పి ఈతనిఁ దీసికొనివచ్చిరి. భార.

అమరబాహువు:-సూర్యవంశపు రాజు. అన రణ్యుని కుమారుఁడు. అనరణ్యుని రావణుఁడు వంచనచేసి చంపెను. అమరబాహువు రావణుని వధింపఁగోరి నారాయణుని ప్రార్థింపగ, నారా యణుఁడు ప్రత్యక్షమై రావణునిజంపుట నాకుఁ దప్ప నన్యులకు సాధ్యముకాదు; కావున నీ వంశంబున జన్మించి వానిని సంహరించెదనని చెప్పి పంపెను. వి. రా.

అమరుకుఁడు:-శుక్రుని కుమారుఁడు. రాక్షసుల యాజ్ఞికుఁడు. భార.

అమర్షణుఁడు:-సంధి కుమారుడు. ఇతని పుత్త్రుఁడు మహస్వంతుఁడు.

అమావసువు:-(అమవసువు) పురూరవునకును, ఊర్వశికిని బుట్టిన కుమారుఁడు. భార.

అమావాస్య:-ఒక పర్వదినము. అచ్ఛోద అను నామె పితరుల మానసపుత్త్రిక. ఈమె అచ్ఛోదమను కొలనుదగ్గఱఁ దపస్సుచేసెను. ఈమె తండ్రులు దివ్యాలంకార భూషితులై యీమె కొకనాఁడు కనఁబడిరి. తండ్రులలో నొకఁడగు మావసుఁడు అను వాని నీమె వలచెను. కాని యతఁడు చలింపలేదు. అందువలన ఆ దినము అమావాస్యయై పర్వదినమాయెను. ఆమెమాహాత్మ్యముచెడి క్రిందఁబడి పితరులను వేడెను. వారు నీవు మత్స్యయోనినిజన్మించి పరాశరుని వలన వ్యాసుని గని, పిమ్మటఁ జిత్ర విచిత్ర వీర్యులఁగని పుణ్యలోకము నొందుదువని చెప్పిరి. పు. వా.

అమృత:-అనఘ్వునిభార్య. భార.

అమృతము:-పృథువు చక్రవర్తియైనపుడు భూమి గోరూపధారిణియయ్యెను. పృథువింద్రునివత్సగ జేసి యాగోవును బిదుకఁగ నమృతము వచ్చెను. కాని యది దుర్వాసుని శాపమువలన సముద్రములోఁబడిపోయెను. అది మఱలక్షీరసాగరమును మథించినపిదప నందుండి పుట్టెను. దేవతలుదానవులు కలసియే సముద్రమును మథించిరి గాని మొదట దేవతలే యమృతమును గ్రహించి దానవుల కందకుండఁగఁ జేసిరి. అమృతమంతయు దేవతల కిచ్చివేయులోపున దానవులువీరిపైఁబడి లాగికొనకుండ నారాయణుఁడు దానవులను సమ్మోహితులను గావింప జగన్మోహినీరూపము దాల్చెను. అమృతము గ్రోలినవారికి మృత్యువు లేదు కావున నింద్రుఁడు దాని నతి జాగరూకతతోఁ గాపాడుచుండును. భాగ.

అమృతలింగము:-(చూడుము. శ్రీకాళహస్తి)

అయాస్యుఁడు:-ఒక ఋషి. ముఖ్యప్రాణమునే ఉద్గాతృ స్వరూపభావనచేసి కర్మాంగముగ నుపాసించెను. ఛాందో. ఉ.

అయుతానీకుఁడు:-మహాభౌముని పుత్త్రుఁడు. కాముక యితని భార్య. వీరి పుత్త్రుఁడు అక్రోధనుఁడు. భార.

అయుతాయువు:-రథికుని కుమారుఁడు.

అయుతాయువు:- సింధుద్వీపుని కుమారుఁడు. ఋతుపర్ణుని తండ్రి. విష్ణు.

అయోధ్య:-కోసలదేశమునకు రాజధాని. సూర్య వంశపు రాజులు పలువురు పాలించిన నగరము.

అయోబాహువు:- గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

అయోముఖి:-ఒకరాక్షసి. వనములో సీత-వెదకుచుఁబోవు లక్ష్మణుని బట్టుకొని నేనునీకు భార్యనగుదును. నాతో నిచ్చట నుండుము అనెను. ఈమె ముక్కు చెవులుకోసి కురూపను జేసెను. రామా.

అయోముఖుఁడు:-దనువు పుత్త్రులలో నొకఁడు.

అరజ:-శుక్రునికూఁతురు. ఈమె వనములోఁజరించుచుండఁగ దండుఁ డనువాఁడు చూచి కామించి బలవంతముగ నీమెతోరమించెను. జనకునియుపదేశమున నీమె యచ్చటనే తపస్సు చేసికొనుచుండెను. శుక్రుని శాపమువలన దండుని దేశ

యూపైఁ గురిసిన మట్టివాన యామెను, నామె దగ్గఱనున్న జంతువులను బాధించలేదు. ఉ.రా.

అరిందముఁడు:-ఒకరాజు. దముని తండ్రి. శివ.

అరిష్టనేమి:-ఒక ప్రజాపతి. సగరునకు మోక్ష ధర్మము లుపదేశించెను.

అరిష్టుఁడు:-ఒక రాక్షసుఁడు. వృషభరూపమున వచ్చి గోవులను బాధించుచుండుటచేఁ గృష్ణుఁడు వానిని బొడిచి చంపెను. విష్ణు.

అరిహుఁడు:-అవాచీనుని పుత్త్రుఁడు. వీని భార్య ఆంగి. వీరిపుత్త్రుడు మహాభౌముఁడు. భార.

అరుణాస్పదము:-గంగానదియొడ్డున నొక పట్టణము. అనగరమందే ప్రవరాఖ్యుఁడు కాపుర ముండెను. మార్క.

అరుణాశ్వుఁడు:-బర్హిణాశ్వుని రెండవ కుమారుఁడు.

అరుణి:-ఒకముని. ఇతఁడుతపస్సుచేసికొనుచుండగ భిల్లుఁడొకఁడు వచ్చి నిన్నుఁజంపెద ననియె. ఆ మాటలువిని యీశ్వరునిమాత్రము తలఁచుకొని యరుణి యించుకేనియుఁ గదలక మెదలక యుండెను. భిల్లుఁ డాశ్చర్యపడి నే నెందఱినో చంపితిని; ఎందఱినో చూచితినిగాని నీవలె స్థిరుఁడై యున్నవానిని, చావునకు భయపడని వానిని, నీయంత తపశ్శాలిని జూచియుండలేదు. నేనిఁక పాపములుచేయను. నాకును ముక్తివచ్చు మార్గము చెప్పుమని కోరెను. అరుణి వానితో మాటాడక యచ్చటనుండి వెడలిపోయెను. వానితోఁగూడ భిల్లుఁడు వెళ్ళి శిష్యుని పగిది సేవచేయుచుండెను. అట్లు వీరు పోవుచుండగ మార్గమధ్యమునఁ బులి యడ్డమై యరుణిని జంప వచ్చెను. భిల్లుఁ డా పులిని జంపివేసెను. దానికి శాపవిమోచనమై దీర్ఘబాహుఁడను రాజై వెడలెను. ఈభిల్లుఁడు చేసిన యుపకారమునకుఁ గృతజ్ఞుఁడై యరుణి భిల్లునకు నీ వెన్నడసత్యమాడకుము. శకలఫలము నెప్పుడు భక్షింపకుము అని యుపదేశించెను. ఆభిల్లుఁడే సత్యతపుఁడయ్యెను. (చూడు, సత్యతపుఁడు.) వరా.

అరుణి:-బ్రహ్మకు నాసారంధ్రమువలనఁ బుట్టిన కుమారుఁడు. బ్ర. వై.

అరుణి:- ఉద్దాలకుని తండ్రి.

అరుణుఁడు:- అనరణ్యుని కుమారుఁడైన హర్యశ్వుని కుమారుఁడు. ఇతని కుమారుఁడు త్రిబంధనుఁడు భాగ.

అరుణుఁడు:-బ్రాహ్మణుఁడు; శ్వేతకేతునితండ్రి. కుమారునకు వేదములను, వేదాంగములను నేర్పెను. శ్వేతకేతుఁడు ప్రవహణుఁడను పాంచాలరాజు సభకు వెళ్ళెను. వీనికి తాను విద్వాంసుఁడ నను భావము కలదు. ఆ భావము పోఁగొట్టదలఁచి ఆరాజు కేవల సత్కర్మల చేసి మరణించినవారు ఈ లోకమునుండి ఎటకేగెదరు? లోకాంతరమునకు భోగార్థమై పోయిన జనులు ఏప్రకారము తిరిగి ఇటకు వత్తురు? సత్కర్మల చేసినవారు, ఉపాసన చేయువారు పరలోకములకుఁ బోవునపుడు మొదట నొక త్రోవనే పోవుదురుకదా, వారి మార్గము లెచ్చట భేదించును? ఇచ్చటనుండి అనిశము పోవువారిచే పితృలోక మేల నిండఁబడుటలేదు? అను మొదలగు ప్రశ్నల వేసెను. శ్వేతకేతుఁడు జవాబు చెప్పలేక, తన తండ్రితో నాకు విద్య నేర్పితినంటివి. ఈ ప్రశ్నలకొక్కదానికి నుత్తరము చెప్పలేకపోతిని. నాకేల చెప్పితివికావు? అని అడిగెను. నాకుఁ దెలిసి యుండినచో నీకు జెప్పెడివాడనే అని తాను కూడ ఆరాజుకడకుఁ బోయెను. ఆ రాజు వీనికి ధనమీయబోయెను. అరుణుఁడు ధనము కోరక, అతఁడు వేసిన ప్రశ్నల కుత్తరము దెల్పు విద్యను నుపదేశింపుమని ఆవిద్య నేర్చెను. ఛాన్దో. ఉ.

అరుణుఁడు:-మురాసురుని కుమారుఁడు.

అరుంధతి:-(ఆకూతీ కర్దమప్రజాపతుల కుమారిత) బ్రహ్మ పుత్రికయైన సంధ్యాదేవి శివుని యొద్ద సెలవు తీసికొని తన కుపదేశము చేయఁగలట్టి బ్రహ్మచారికై వెదకుచు వసిష్ఠుని జూచి యీతనివలన నుపదేశమును బొందెను. పిమ్మట నామె శరీరమునే పురోడాశముగా నగ్నికి వేల్చెను. ఆయగ్నినుండియే ప్రాతస్సంధ్యయు, సాయంసంధ్యయు, నొక కాంతయుఁ బుట్టిరి. ఆమెకే యరుంధతి యని పేరు పెట్టిరి.

అరుంధతి దేవహూతీ కర్దముల పుత్రిక. ఆమెను వసిష్ఠుఁడు గైకొనెను. మును లందఱు ఆమెకు సౌభాగ్యమును, పాతివ్రత్యమును గలుగు నట్లుగా వరము లిచ్చిరి. ఈమెకు శివశక్తి మొదల లగు కుమారులు పుట్టిరి.

వసిష్ఠుఁడు వివాహ మాడఁదలఁచి తగిన బాలికకై వెదకుచు ఇసుక నిచ్చెదను దానిని వండి పెట్టగలవా రెవరైనా నున్నారా? యని యడుగుచు వచ్చెను. ఎవ్వరును బదులు పలుక లేదు. కాని యొక మాలపల్లెలో నొక కన్య నేను వండిపెట్టెదనని వచ్చెను. ఆమెయే యరుంధతి. ఆమె యిసుక పుచ్చుకొని భాండ మునఁ బోసి భగవంతుని ప్రార్థించెను; అది యుడికి అన్నమయ్యెను. అయినను వసిష్ఠుఁడు నేను నిన్ను పరిణయముకాకపూర్వము నీవువండిన దానిని దిన నని యాపె తలిదండ్రుల నామెను దన కిమ్మని యడిగెను. వారామెను నిచ్చిరి.

వసిష్ఠుఁ డీమెచేతికిఁ దన కమండలము నిచ్చి నేను తిరిగివచ్చెదను; అంతవఱకు దీనిని జూచు చుండు మని చనియె. ఆమె దానిని బుచ్చుకొని తదేకనిష్ఠతో దానినే చూచుచుండెను. ఏండ్లు పూండ్లు గడచెను గాని వసిష్ఠుఁడు మరలి రాలేదు. ఆమెయును గమండలమునుండి దృష్టి మరల్పలేదు. ఆ యేకాగ్రతకు లోకము తహ తహ లాడెను. బ్రహ్మాదులు వచ్చి యామెను చూపు మరలింపుమని కోరిరి. కాని యామె విని పించుకోలేదు. అంత వీరు వసిష్ఠుని దీసికొని వచ్చిరి. అపు డీమె దృష్టి మరల్చెను. అరు.

అగ్ని మునిపత్నులను జూచి మోహించెను. అతని భార్య స్వాహా వారల రూపము దాల్చి రాగ, నిజముగ మునిపత్నులే యనుకొని యామెతో నగ్ని రమించుచుండెను. అగ్నిని భ్రమింపఁజేయుట కరుంధతీ రూపమైనను స్వాహా ధరింపలేకపోయెను. అరుంధతి పాతి వ్రత్య మహిమ యిట్టిది.

ఈమెయు నక్షత్ర మయ్యెను. వసిష్ఠుని ప్రక్క నేయుండును. వివాహకాలమందు వధూ వరుల కీమెను జూపుచుందురు. మరణం బాసన్న మైనవారు అరుంధతిని జూడఁజాలరు.

అర్థపతి:-ఒక నిషధదేశపురాజు. ఇతని కుమార్తెను రఘువంశజుఁడగు అతిథికి ఇచ్చి వివాహము చేసెను. ఆమె కుమారుఁడు నిషధుఁడు.

రఘు.

అర్ధనారీశ్వరి:- భృంగియను గణనాథుఁడు పార్వ తిని ప్రార్థింపక శివునినే యారాధించెను. పార్వ తికిఁ గోపమువచ్చి వానిని బీల్చి పిప్పిచేసెను. శివున కతఁడు భక్తుఁడు గావున శివుఁ డాతనికి దండ మాధారముగ నిచ్చి లేవదీసెను. భక్తునికై నున్న గౌరవ మామెపై లేకపోయెఁగదా! యని పార్వతికి శివునిపైఁ గోపమువచ్చి కేదారమను క్షేత్రమున కేగి యచ్చట గౌతముఁ డను ఋషి వలన నుపదేశింపఁబడి కేదారేశ్వరుని ప్రార్థిం చెను. శివుఁడు సాక్షాత్కరించెను. అచ్చట పార్వతి భర్తయొక్క యర్ధాంగమును బొందెను.

పు. వా.

శివుఁడు జ్యోతిర్లింగముగ నున్నపుడు విష్ణు వునకుఁ బ్రసన్నుఁడై వరము వేఁడుకొనుమనియె. విష్ణువుగర్వముతో నీవు నాకు సేవచేయుమనెను. ఆ దోషముచే విష్ణువే శివునకు నర్ధనారిగఁ బుట్టెను. శ. పా.

అర్ధనారీశ్వరుఁడు:-ప్రజాభివృద్ధి పరిగఁ గాకుండు టచే బ్రహ్మ దుఃఖమునొంది యర్ధనారీశ్వరుని గూర్చి తపస్సుచేసెను అతఁడు ప్రత్యక్షమై 'నీ మనోరథము తీర్చెద'నని తన నారీభాగమును విడిపొమ్మనెను. వీడి వచ్చిన శక్తిరూపమునకు బ్రహ్మనమస్కరించెను. ఆమెను దక్షపుత్రికగఁ బుట్టుమని శివుఁడాజ్ఞ యిచ్చెను. శివ.

అర్యముఁడు:- అదితి కశ్యపుల కుమారుఁడు. ద్వాదశాదిత్యులలో నొకఁడు. భార.

అర్వావసుఁడు:-రైభ్యుని పెద్దకుమారుఁడు. పరా వసుఁ డితని సోదరుఁడు. వీరు వేదాధ్యయన సంపన్నులు; బృహద్యుమ్నుఁడను రాజునకు ఋత్విజులుగ వెళ్ళిరి. పరావసుఁడు తెలియక చీఁకటిలోఁ దండ్రిని జంపెను. వానికి వచ్చిన బ్రహ్మహత్యా పాతకము పోవుటకై యర్వా వసుఁడు హోమములు చేసెను. బ్రహ్మహత్యా వ్రతము సలిపి మరల బృహద్యుమ్ని యాగము

నకుఁ బోయెను. అట యాగము చేయించుచున్న పరావసువు రాజుతో అర్వావసుని యాగశాలకు రానీయఁదగదు. బ్రహ్మహత్యకుఁ దగిన ఉగ్ర కర్మలు చేసి వచ్చినఁవాడు అని చెప్పెను. బ్రహ్మఘాతకుఁడు పరావసుఁడే కాని తాను గాననియు, వాని పాతకముఁబోఁగొట్టితి ననియు వాఁడు దెల్పెను. ఇతనిసత్యమునకు దేవతలు మెచ్చుకొని వరము వేడుకొనుమనిరి. రైభ్యుని, రైభ్యునిచేతఁ జచ్చిన నవక్రీతుని, అవక్రీతుని తండ్రియగు భరద్వాజుని బ్రతికించుఁడని యర్వావసుఁడు వేడెను. దేవత లట్లనుగ్రహించిరి.
భార.

అర్చి:- వేనునిభుజములు మర్దింపఁగబుట్టిన యువతి. ఈమె లక్ష్మియంశతో జన్మించెను. ఈమెను బృథువు పరిణయ మయ్యెను. విజితాశ్వుఁడు, ధూమ్రకేశుఁడు, హర్యశ్వుఁడు, ద్రవిణుఁడు, వృకుఁడు - ఈమె కుమారులు. భార.

అర్థి:- పృథుచక్రవర్తి కుమారుఁడు. ఇతని భార్య శిఖండిని. ఆమెయందు హవిర్ధానుఁడను పుత్త్రునిఁ బడసెను. బ్రహ్మ.

అర్ష్టిషేణుఁడు:- ఒకముని. ఇతని యాశ్రమమునఁ బాండవులు కొంతికాల ముండిరి. భార.

అర్జునిక:- ధర్మవ్యాధునికుమారిక. ఈమెనుమతంగముని కుమారుఁడైన ప్రసన్నున కిచ్చి వివాహము చేసెను. అత్తగా రొకనాఁడు పిలువగ నీమెకు వినఁబడక పోవుటచేఁ బలుకలేదు. అత్తగారికిఁ గోపము వచ్చి దూషించి మృగములను జంపి తినువాని కుమార్తెవు, నీ కింతకంటె బుద్ధి యుండునా? యని నిందించెను. దానితో నర్జునికిఁ గోపమువచ్చి తండ్రి యింటికిఁబోయి తండ్రితోఁ దన నట్లు నిందించిరని చెప్పెను. తండ్రియుఁ, దల్లియు నీమెను మరలఁ దీసికొనివచ్చి యత్తవారింటఁ దిగబెట్టిరి. ధర్మవ్యాధుని భోజనము చేయుమనగ నేమి పెట్టుదురని యతఁ డడిగెను. మతంగునిభార్య కందులు,గోధుమలు చేటలో వేసితెచ్చి చూపించెను. ధర్మవ్యాధుఁడు ఛీ ఛీ ఇన్ని వేల జీవుల ననుదినము చంపుదురా? వీని నేను తినను అని యాక్షేపించి,తన కూఁతును నిందించుటపాడి గాదని, ఆమెను వారి కొప్పగించి వెడలెను.
వరా.

అర్జునుఁడు:- ధర్మవ్యాధుని కుమారుఁడు ఒక బోయవాఁడు. గౌతమి యను బ్రాహ్మణ స్త్రీ యొక్క పుత్త్రుని నొక పాము కరువగ ఆ పామును చంపుమననియె (చూడుముగౌతమి.)

అర్జునుఁడు:-పాండురాజు ధర్మజ భీములను పుత్త్రులను బడసినపిమ్మట నింద్రునిగూర్చి తపస్సుచేసి యా దేవుని వలనఁ బుత్త్రునిఁబడయుటకై తన భార్య కుంతిని నియోగించెను. ఇంద్రునివలనఁ గుంతియందుఁ బుట్టిన కుమారుఁడే యర్జునుఁడు. అతఁడు కార్తవీర్యునికంటెను వీరుఁడగుటచే నర్జునుఁడను నామమునఁ బరగువాఁడని యాకాశవాణి పలికెను. పాండురాజు మరణించినపిమ్మటఁ గుంతి తన పుత్త్రులను హస్తినాపురమునకుఁ దీసికొని వెళ్లెను. అచ్చట వీరు దుర్యోధనాదులతోఁ గలసి విద్యల నేర్చుకొనుచుండిరి. ఇతనికౌశలమునకు నస్త్రవిద్యాచార్యుఁడు ద్రోణుఁడు మెచ్చుకొని బహువిధ వ్యూహ భేదనోపాయములు నేర్పుచుండెను. అర్జునునియందుఁ గర్ణునకును, నశ్వత్థామకును గూడ నీర్ష్య కలిగెను. ఇతని కన్నఁడును చీకటింట నన్నము పెట్టకుమని యన్నసాధకునితో నశ్వత్థామ చెప్పెను. ఒకనాఁ డర్జునుఁడు భోజనము చేయుచుండగ దీప మారిపోయెను. అతఁడభ్యాసముచొప్పునఁ జీకటిలోనే భోజనముచేసి యే కార్యమైనను నిట్లే యభ్యాసముచొప్పునఁ జేయవచ్చునుగదా! యని నిశీథసమయమందును బగలు కన్నులుమూసికొనియు బాణము వేయ నభ్యసించెను. అర్జునుఁడు చిన్నతనమునను నస్త్రకౌశలము విశేషముగఁ జూపువాఁడు. ఒక చెట్టుపై మాయపక్షిని బెట్టి దాని తలను గొట్టుఁడని ద్రోణుఁడు తన శిష్యుల నియోగించెను. దుర్యోధన ధర్మరాజాదులు పక్షిని గురిపెట్టి కొట్టఁబోవునప్పుడును దమ యెదుట నున్నవారలు గనఁబడుచున్నారని చెప్పిరి. అర్జునుడుతదేకదృష్టితోఁ జూచుటచేతఁ బక్షిశిరము తప్ప నితరమేదియుఁ దనకుఁ గనఁబడుట లేదని చెప్పెను. స్నానము చేయుటకై నీటదిగిన ద్రోణునికాలు మొసలి పట్టుకొనఁగ నర్జునుఁడే వదలింప గలిగెను.

ద్రోణుఁడు తనకుగురుదక్షిణగ ద్రుపదరాజుబట్టి తెండని శిష్యులతోఁ జెప్పెను. దుర్యోధనాదు లిది యెంతపని యని వెళ్ళిరిగాని ద్రుపదునిచే నోటువడివచ్చిరి. అర్జునుఁ డెదిరిబలమును బరిగణించి భీముని దన సేనానిగను, నకుల సహదేవులను జక్ర రక్షకులగను గైకొని వెళ్ళి ద్రుపదు నోడించి ద్రోణునిసన్నిధికిఁదెచ్చెను. ద్రోణుఁడు దానికి సంతోషించి బ్రహ్మశిరమను నస్త్ర ప్రయోగమును నేర్పి తనతో మాత్రము ప్రతి యుద్ధము సేయకుండుమని కోరెను.

అర్జునుడు తల్లి, యన్నదమ్ములతో వారణాసి నగరమున కేగి వారలతోడనే లక్కయింటను, నరణ్యములోను గష్టపడుచుండెను. అడవిలో నడ్డువచ్చిన యంగారపర్ణునితో యుద్ధము చేసివాని నోడించి వానికి మిత్రుఁడయి వానివలన గంధర్వ హయములను బుచ్చుకొనెను. పిమ్మటఁ బాండవులు బ్రాహ్మణవేషమున ద్రుపదునగరమునకుఁ బోయిరి. అట మత్స్యయంత్రమును గొట్టుటకు వచ్చినవారిని జూచి యర్జునుఁడు బ్రాహ్మణ సమూహములోఁ జేరి నిలుచుండెను. రాజపుత్త్రులోడి మరలినపిదప ధర్మజుని యనుమతిపొంది యర్జునుఁడు మత్స్యయంత్రమునుగొట్టెను. ఇతని మెడలో ద్రౌపదిపుష్పహారము వేసెను. ఈర్ష్యచే నర్జును నెదిరించిన రాజుల నోడించి ద్రౌపదిని తమయింటికిఁ దీసికొనివచ్చి వాకిలిలోనుండియే సంతోషముతోఁదల్లితో మేమొకభిక్షనుదెచ్చితిమని యర్జునుఁడును, భీముఁడును బల్కిరి. మీ రేవురును నుపయోగింపుఁడని యామె పలికెను. అర్జునుఁడు విస్మితుఁడయ్యెను. తుదకు వ్యాసుని వాక్యములను దలఁచియేవురును ద్రౌపదినివివాహమాడిద్రుపదునగరమున నేయుండిరి. ఈవివాహౌచిత్యమును గుఱించి ధర్మరాజు తర్కించెను గాని యర్జునుఁ డా భారము పెట్టుకొనలేదు.

పిమ్మట ద్రౌపదీసహితులైపాండవులు హస్తినాపురమున కేగిరి. ధర్మరాజును యువరాజును జేసిరి. వానికిఁదోడునీడయైయర్జునుఁడు మెలంగుచుండెను. ద్రౌపదిగూర్చిసోదరులెవ్వరు తగవులాడకుండుటకై నారదుఁడువచ్చి యొక్క నియమము చెప్పెను. అట్లొక్కొక్క సంవత్సర మొక్కొక్క రామెకు భర్తగ నుండుచుండిరి. ధర్మరాజు ద్రౌపదితో నుండునపు డొకనాఁడు బ్రాహ్మణుఁ డొకడువచ్చి తన యాగపశువులను దొంగలు హరించిరని మొఱలిడియె. వానినిదెచ్చుటకై యర్జునుఁ డాయుధాగారమునకుఁ బోయి యందు ద్రౌపదీ ధర్మరాజులను జూచెను. వారిరువురుండిన తావునకుఁ బోయెను గావున నారదుఁడు చెప్పిన వ్రతప్రకార మొక సంవత్సర మర్జునుఁడు తీర్థయాత్ర చేయవలసియుండెను. బ్రాహ్మణుని యజ్ఞపశువులనుదెచ్చి యర్జునుఁడు తీర్థయాత్రకుఁ జనియె.

అరునుఁడు గంగానదిలో స్నానము చేయుచుండగ నులూచి యను నాగకన్యక వీనినిజూచి మోహించి తనభవనమునకుఁగొనిపోయె. ఆమెచే నిర్బంధింపబడి యతఁ డామెకోర్కెదీర్చివచ్చి యాత్రసేయుచు మణిపూరుపురము ప్రవేశించి యచ్చట రాజకూతురగుచిత్రాంగదను వివాహమాడెను. ఆమెయందు బభ్రువాహనుఁ డను కుమారుఁడు కలిగెను. అర్జునుఁడు పంచాప్సరసములో స్నానము చేసి యందలి మొసలిని బైటకుఁ దీసి దాని శాపవిమోచనము చేసెను. పిమ్మట కృష్ణునిజూచుటకై ద్వారకకు వెళ్ళెను. కృష్ణుని చెలియలగు సుభద్రపై మక్కువగలిగి యామెను జూచుటకై యతివేషముతో రైవతకపర్వతము మీఁద నిలిచియుండెను. బలరాముఁ డీతనిని నిజమగు యతియని తలంచి యీతనికిశుశ్రూషచేయుటకై సుభద్రను నియోగించెను. కృష్ణుఁడు వీరల భావము లెఱింగి బలరాముఁ డూర లేనపుడు సుభద్రార్జునుల వివాహముచేసి వారిని ఇంద్రప్రస్థమునకుఁ బంపెను. సుభద్రయం దర్జునునకు నభిమన్యుఁడు జన్మించెను.

ఒకనాఁడు కృష్ణార్జునులు ఖాండవవనసమీపమున విహరించుచుండఁగ నగ్ని యొక వృద్ధ బ్రాహ్మణరూపమునవచ్చి తన కాహారము పెట్టుడనికోరిఖాండవవనమును భక్షింపనభిలషించుటఁ దెల్పెను. ఇంద్రుఁ డడ్డమువచ్చినను వానినోడించుటకై యగ్ని వరుణుని బ్రార్థించి గాండీవము దెచ్చి యర్జునున కిచ్చెను. కృష్ణునకుఁ గొన్ని యాయుధములిచ్చెను. అగ్ని ఖాండవవనమును దహించెను. దానిని గాపాడుటకు వచ్చిన యింద్రుని కృష్ణార్జును లోడించిరి. ఇంద్రుఁడు వారికి మిత్రుడయ్యెను. మఱియు వనములో

నుండి రాలేకపోయిన మయుఁడను దనుజుని నర్జునుఁడు కాపాడెను.

అర్జునుని రథము:- ఖాండవవనభక్షణమపుడు అర్జునుఁ డగ్నికి సహాయము చేసెను. అగ్ని సంప్రీతుఁడై వానికి రథమునిచ్చెను. ఈరథము నెక్కియే యర్జునుఁడు యుద్ధమునఁ బోరెను. ద్రోణ కర్ణాదులు వేచినయస్త్రములీ రథమును గూల్చకుండ కృష్ణుఁడు వాని నదిమియుంచెను. యుద్ధము ముగియుటతోడనే రథము దిగుమని కృష్ణుఁడు చెప్పఁగ నర్జునుఁడు దానినుండి దిగెను. అతఁడు దిగుటతోడనే వెనుక వచ్చియున్న అస్త్రములచే నది దహింపఁబడియె.

అర్జునుని సారథి రుక్మ (రుక్మి) యనువాఁడు. యుద్ధమున కృష్ణుఁడు సారథ్యము చేసెను. ఇతని ధ్వజము కపిధ్వజము. శంఖము దేవదత్తము.

భార.

ధర్మరాజు రాజసూయము చేయఁబోవునపుడితఁడు దిగ్విజయార్థ మరిగి పులింద, బర్బర, గాంధార, కాంభోజ, తురుష్కాధిపతుల నోడించి ధనరాసుల దెచ్చెను. దుర్యోధనాదులు తమ్మును జూచి యీర్ష్య జెందియుండిరనిగాని, తమ్మును వంచించుటకై యత్నించుచుండిరనిగాని యెఱుఁగడు. కుచ్చితపుటూహ లితనికిఁ గలుగవు సాధారణముగఁ గార్యాకార్యములను గురించి యితఁడు విచారింపక ధర్మజు నాజ్ఞానుసారము చేయుచుండును. కాని భీమునికన్న సూక్ష్మబుద్ధిగలవాఁడు; శాంతుఁడు. ధర్మరాజును మాయాజూదమునకుఁ బిలుచుచున్నారనియర్జునుఁడు తెలుపఁడు. తనను, రాజ్యమును, ద్రౌపదిని నోడినను ధర్మరాజును నొక్కమాటయేని యనఁడు. సభలో తమపట్టపుదేవియగు ద్రౌపదిని నవమానపఱచినను పౌరుషవంతుఁ డయ్యుఁ బ్రతిజ్ఞాబద్ధుఁడు గావున నర్జునుఁడు తలవాల్చుకొని నిలువఁబడెను గాని దుశ్శాసనుని దూషింపనైన లేదు.

రాజ్యమును గోలుపోయి పాండవు లరణ్యములలోనికిఁ బోయిరి. రాజ్యనష్టమును గురించి యర్జునుఁడు దిగులొందఁడు. ద్రౌపదీ భీములవలె ధర్మరాజుతో రాజ్యప్రాప్తిని గూర్చి వాదింపఁడు. అర్జునుఁడు ప్రతిస్మృతి యను విద్య నేర్చుకొని ధర్మరాజు చెప్పఁగ నీశ్వరునిగూర్చి తపస్సు చేయుచుండెను. ఈశ్వరుఁడు కిరాత రూపముతో నొక సూకరమును దఱుముకొని యర్జునుఁడున్న యాశ్రమముకడకు వచ్చెను. అతఁ డర్జునుని బరీక్షింపఁగోరి యా పందిని దనదిమ్మని మిష కల్పించి యతనితో యుద్ధము సేయ నారంభించెను. అర్జునుఁడు ధైర్యసాహసములతో శివుని ధిక్కరించె. శివుఁడు మెచ్చుకొని యతనికిఁ బాశుపతాస్త్రము నిచ్చి చనియె. తన పుత్త్రున కింతటి గౌరవము జరుగుటచే నింద్రుఁడు సంతోషించి తనరథములో నెక్కించి తన నగరమునకుఁ దీసికొని వెళ్లెను. దేవతలును, మహర్షులును నర్జునుఁడు పూర్వపు జన్మమున నరుఁడను మహర్షియని యెఱిఁగి గౌరవించిరి. ఇంద్రుఁ డస్త్రము లిచ్చి పంపెను. అర్జునుని జూచి యూర్వశి కామించి తనకోర్కె తీర్పుమనియె. అర్జునుఁడు నిరాకరించుటచే నామె కోపగించి నీవు షండుడవు కమ్మని శపించెను. అర్జునుఁడు సురలోకమును వీడి వచ్చుచు మార్గమందలి యసురులను సంహరించి యరణ్యమును జేరెను. వీరున్న కాననమునకువచ్చిన దుర్యోధనునిఁ జిత్రాశ్వుఁడను గంధర్వుఁడు బంధింపఁగ నర్జునుఁడు గంధర్వునోడించి దుర్యోధనుని విడిపించెను. అరణ్యములో వచ్చుచుండిన ద్రౌపదికి సైంధవుఁడపకృతి సేయఁబోవఁగనర్జునుఁడు సైంధవుని మర్దించి ద్రౌపదిని గాపాడెను. అరణ్యములో నడచివచ్చిన సోదరులకు దాహమగుటచే నకుల సహదేవులు జలము తెచ్చుటకుఁ గొలనునకు వెళ్ళిరి. వారు మరలి రాకపోవుటచే నర్జునుఁడును వెళ్లెను. అచ్చట నశరీరవాణి వేసిన ప్రశ్నలకు సమాధానము చెప్పలేకపోవుటచే నితఁడును స్మృతితప్పి యచ్చటనే పడిపోయెను. వానిని ధర్మరాజు వచ్చి లేవదీసికొని వెళ్లెను. పంద్రెండేం డ్లరణ్యవాసము ముగిసినపిమ్మట నజ్ఞాతవాసము సల్పుటకై యర్జునుఁడు విరాటనగరమున కేగెను. ఊర్వశియిచ్చిన శాప మితనికిపు డుపకరించెను. ఇతఁడు పేడియై యుండి, బృహన్నల యను పేరుతో విరటుని కుమారితయైన యుత్తరకు నాట్యము నేర్పుచుండెను. విరాటుఁడు నగరమున లేనపుడు పాండవులజాడ యెఱుంగుటచే కౌరవులు విరటుని గోవులనుబట్ట వచ్చిరి; ఇతఁ డుత్తరునకు సారథియై యుద్ధమునకు వెళ్లెను. ఉత్తరుఁడు కౌరవసేనను జూచి

భంగపడి రథ మింటివైపు మరల్పు మనియెను. కాని యర్జునుఁడు వానికి ధైర్యము చెప్పి, తన గాండీవము తీసికొని కౌరవులతోఁ దానొక్కఁడు పోరాడి యా కడిందివీరుల నోడించెను. అప్పటి కజ్ఞాతవాసము గడువు ముగిసెను. భీష్ముఁడీతని పౌరుషమునకు మెచ్చుకొనియె. అజ్ఞాతవాసము ముగియఁగనే పాండవులకుఁ దమ నిజరూపములు వచ్చెను. విరాటుఁడు వీరి నెఱింగి, కొనియాడి తన కూతురగు నుత్తరను నర్జునున కిత్తుననియె. అర్జునుఁడు తన కుమారుఁడగు నభిమన్యుని, బంధువులను రావించి యుత్తర నభిమన్యున కిప్పించి యాతనికి వివాహము చేసెను. ఆ సమయమందే వచ్చిన బంధువు లెల్లరు చేరి పాండవు లటుపైఁ జేయవలసిన కార్యము నాలోచించిరి. ధర్మరాజు సంధిచేసికొనుటే యొప్పని చెప్పెను. అర్జునుఁడు దానికిని సమ్మతించెను. కాని కౌరవులు పాండవులను సరకుగొనకుండిరి. యుద్ధము తప్పనట్లుండెను. కావునఁ గృష్ణుని సహాయము కోరుటకై యర్జునుఁడేగెను. తత్పూర్వమే దుర్యోధనుఁడు వచ్చి నిదురించుచుండిన కృష్ణుని శిరముప్రక్కఁ గూర్చుండెను. అర్జునుఁడు వాని పాదముల చెంత జేరి కూర్చుండెను. కృష్ణుఁడు లేచుచు ముందుగ నర్జునుని జూచెను; పిమ్మటదుర్యోధనుని జూచెను. వారిని కుశలమడిగి, వచ్చిన కార్య మడిగి తానొక్కరుని గోరుదువా? తన సేననంతను గోరుదువా? యని ముందుగ నర్జునునడిగెను. అర్జునుఁడు కృష్ణునే కోరెను. దుర్యోధనుఁడు కృష్ణుని సేనను గోరెను. పాండవులు యుద్ధసన్నద్ధులై కురుక్షేత్రమును జేరిరి. కృష్ణుఁ డర్జునునకుఁ సారథి యయ్యె. కురుసేనయుఁ గురుక్షేత్రమున వచ్చి చేరెను. ఆ సేనలను జూచి రాజ్యమునకై యందఱు బంధువులను, మిత్రులను జంపుటా యని యర్జునునకు విషాదము కలిగెను. కృష్ణుఁడు తన విశ్వరూపమును జూపి భగవద్గీతను బోధించి యతనిఁ గార్యశూరుని జేసెను.

యుద్ధము ప్రారంభమయ్యెను. కౌరవపక్షమున ముందఱ భీష్ముఁడు సేనల నడుపుచుండెను. అతనితోడను నర్జునుఁడు యుద్ధము చేసెను. భీష్ముఁ డస్త్రసన్యాసము చేసి శిఖండిచేఁ గొట్టఁబడి శరతల్పగతుఁడయ్యె. అర్జునుఁ డాతనికి నమస్కరించి యాతని దాహముదీర్చుటకై తన బాణముతో భూమిని భేదించి నిర్మలోదకమును రావించెను. పిమ్మట సంశప్తకులతోడను, భగదత్తునితోడను పోరాడెను. మఱునాఁడు మఱల సంశప్తకులతోఁ బోరి వారి నోడించి వచ్చుచు దుర్నిమిత్తములఁ జూచి విచారముతో నన్నలను జేరి యభిమన్యుఁడు హతుఁడగుట విని మిక్కిలి చింతనొందెను. వాని మరణమునకు సైంధవుఁడు కారణమని వానిని మఱునాఁడు సూర్యుఁ డస్తమించులోపునఁ జంపకుండినయెడలఁ బ్రాణములు విడుతునని శపథము చేసెను. సైంధవుని దుర్యోధనాదులు రక్షించుచుండిరి. కృతవర్మ మొదలగు వారితోఁ బోరి శ్రుతాయువు మొదలగువారిని జెండాడి యర్జునుఁడు విజృంభించి యుద్ధము సేయుచుండెను గాని సైంధవుఁడు కనఁబడఁడయ్యె. కృపాశ్వత్థామ శల్యవృషసేనులు వానికడ్డుపడుచుండిరి. అపుడు కృష్ణుఁడు మాయాతిమిరము గావించెను. సూర్యుఁడు గ్రుంకెననియు, నిక నర్జునుఁడు తన శపథము చొప్పున మేనువిడుచు ననియుఁ గురువీరులు విచ్చలవిడిగఁ దిరిగిరి. అపుడు కృష్ణుఁ డర్జునునకు సైంధవుని జూపించెను. అర్జునుఁడు వాని మస్తకము దునిమెను. ద్రోణునిగూడ మాయోపాయముననే చంపిరి. దండధారుఁడను రాజును, గురుకుమారులను బదుగురను, వృషసేనుఁడు మొదలగువారిని నర్జునుఁడు సంహరించెను. పిమ్మటఁ గర్ణుఁడు సేనాధిపతి యయ్యె. అతనికి మొదటి నుండియు నర్జునుని నతిక్రమింపవలెనని తలంపుండెను. వారిఱువురకు ఘోరసంగ్రామమయ్యెను. కర్ణుని జంపక పూర్వము ధర్మజాదు లెటులుండిరో చూచుట కర్జునుఁడు శిబిరమునకు వచ్చెను. కర్ణుని జంపక వచ్చితివా యని ధర్మజుఁ డర్జునుని దూషింపగ నతనికిఁ గోపమువచ్చి ధర్మజుపైఁ గత్తియెత్తె కృష్ణుఁడు వారించి యర్జునుని ప్రతిభంగము కాకుండ ధర్మజుని దూషింపుము; అదియు సంహరించుట వంటిదే యనియె. ఆ కోపమున నర్జునుఁడు సోదరుం దిట్టి, శాంతుఁడై పిమ్మటఁ దాను చేసినది యక్రమమని యెఱింగి యాత్మహత్య చేసికొనఁబోయె. కృష్ణుఁ డది చూచి యది కార్యము కాదనియు, ఆత్మస్తుతియు నాత్మహత్యవంటిదనియు నట్లు చేసికొనుమనియును చెప్పెను. పిమ్మట యుద్ధమునకుఁ బోయి యింద్రాదు లిచ్చిన దివ్యాయుధముల సహా

యముతోడఁ బోరుచుండఁ గర్ణుఁ డీతనికంఠము గుఱిపెట్టి సర్పముఖాస్త్రము ప్రయోగించెను. కృష్ణుఁడు రథమును నేలకు నదిమెను ఆ యస్త్ర మీతని కిరీటము మాత్రము నేలపైఁ బడ గొట్టెను.

ఆ కిరీటము ఇంద్రుని తపస్సునకు మెచ్చి బ్రహ్మ వానికిచ్చెను. నివాతకవచుల నర్జునుఁడు సంహరింపఁగ మెచ్చి యింద్రుఁడు కిరీటము వీనికిచ్చె. ఇతఁడీ కిరీటము శిరమునఁ దాల్చిన పిమ్మట నెవ్వరును దానినిఁ బడగొట్టలేదు. కిరీటమును బడవేసి మరల సర్పముఖాస్త్రము ఇతనిపైరాఁగ (అది అశ్వసేనుఁడు చూడుము) దీని నితఁడు సంహరించెను.

కర్ణున కుండిన శాపము చేతను శల్యుఁడు కలుగఁజేయు నడ్డంకుల చేతను గర్ణుని జవను తగ్గుచు రథము క్రుంగుచుండఁగ, నర్జునుఁడు కర్ణుని సంహరించెను. యుద్ధమంతయు ముగిసి పాండవులు రణరంగమునుండి మఱలినపిమ్మట నర్జునుని రథము దిగుమని కృష్ణుఁడు చెప్పెను. ఇతఁడు దిగఁగనే యది దగ్ధంబయ్యె.

పాండవులు విజయులైనపిమ్మట ధర్మరాజు రాజయ్యె. అతఁ డశ్వమేధయాగము చేసెను. ఆ యశ్వము వెంటఁ నర్జునుఁడు వెళ్ళి దానిని బంధించిన రాజులఁ ద్రిగర్త, గాంధార, సింధు దేశాధీశుల నోడించెను.

యాగాశ్వము వెంటఁ దనతండ్రి యర్జునుఁడు వచ్చుచున్నాఁడని విని బభ్రువాహనుఁడు ఆదరముతో తండ్రి కెదురేగెను. కాని యర్జునుఁ డనాదరముగఁ జూచెను. రాజగువాఁడు యాగాశ్వమును బట్టవలయునుగాని నిర్వీర్యుని వగిది యిట్లాడంబడ రాదనియె. బభ్రువాహనుఁడు చిన్నపుచ్చుకొని గృహమునకుఁ బోవుచుండ నాగలోకమునుండి యులూచి వచ్చి తన నెఱింగించుగొని వానితో యుద్ధము సేయుటే అర్జునన కిష్టమనియె. ఆ మాటలు విని బభ్రువాహనుఁడు తండ్రిపై బాణము వేయగ నర్జునుఁడు గతప్రాణుఁడై నేలంగూలెను. అటకు చిత్రాంగదయు, నులూచియు వచ్చిరి. చిత్రాంగద మిక్కిలి విలపించి వానిని బ్రతికించుమని యులూచిని బ్రార్థించెను. ఆమె సంజీవనిని గొనివచ్చెను. దానిని బభ్రువాహనునకిచ్చి అతని గుండెలదగ్గర పెట్టగ నతఁడు లేచెను.

భీష్ముని యెదుట శిఖండిని బెట్టి యాతని జంపుటచే ఇతనికి నరకము కలుగునట్లు శపింపఁ దలఁచిరి. ఆమాటలు ఉలూచి విని తండ్రితో జెప్పఁగ తండ్రి వసువులను మెప్పించి ఆ దోషము పోవుట కది మార్గమని చెప్పుటచే బభ్రువాహనున కాబుద్ధి పుట్టించి బలముకల్గించి అట్లు చేసితినని యులూచి చెప్పెను.

అశ్వమును బంధించిన ప్రమీలను వివాహ మాడెను; తుదకు యాగాశ్వమును సురక్షితముగ హస్తినాపురమునకుఁ దెచ్చెను. ధర్మరాజు యాగము చేసి పెక్కేండ్లు రాజ్యమేలెను. అర్జునుఁ డాతనికి సహాయుఁడై యుండువాఁడు. అట్లుండఁగ యాదవ కులమున ముసలము పుట్టెను. వారు క్షయ మందిరి. కృష్ణుఁడదిచూచి సహింపలేక కాననమునకుఁ బోయి నిష్ఠతో నుండదలచుకొని యర్జునునకుఁ గబురు పంపెను.

అర్జునుఁడు ద్వారకకు వెడలునప్పటికి బలరామకృష్ణులు నగరము విడిచి వెళ్ళిరి. అర్జునుఁడు వచ్చి కాపాడఁ గలడని కృష్ణుఁడు చెప్పి చనియె నని వసుదేవుఁ డితని కెఱింగించి కలిగిన యాపత్తులకుఁ జింతనొంది తానును బ్రాణమును విడచెను. వానికిని మృతులైన యాదవులకును నర్జునుఁ డగ్ని సంస్కారములు చేసె; కృష్ణుఁడు లేక తాను ద్వారకయందుండ జాలఁడు; మఱియు ద్వారక సముద్రములోఁ గలయఁ గలదని దివిజు లెఱింగించిన మాట వారికిఁ జెప్పి వారి నెల్లరను నింద్రప్రస్థమునకు రమ్మని రామకృష్ణులను జూచుటకై వారు వెళ్ళిన మార్గమునఁ దానును వెళ్ళెను. ఒక బోయవాఁడు కృష్ణుని దాఁజూచెనని యర్జునునకు మార్గము చూపుచుఁ దీసికొనివెళ్ళెను. రామకృష్ణులు విగతప్రాణులై యుండుట నర్జునుఁడు చూచి మూర్ఛితుఁడై కొంత సేపటికి లేచి మిక్కిలి చింతనొంది, వారి కగ్ని సంస్కారములుచేసి ద్వారకకేగి యచ్చటివార నందఱను నింద్రప్రస్థమునకుఁ దీసికొని వచ్చుచుండెను. మార్గములోఁ గొందఱు బోయలు వీరి నాటంకపరచి ధన మపహరించిరి. అర్జునునకు వారి నెదిరింపఁ బూర్వపుశక్తి లేదు. పిమ్మట

రామ కృష్ణుల నిర్యాణము రుక్మిణీదేవి మొదలగు వారల కెఱింగించెను. వారగ్నిప్రవేశము చేసిరి. అర్జునుఁడు కృతవర్మ పుత్త్రునకును, సాత్యకిపుత్త్రునకును, వజ్రునకును యాదవబలము పంచి యిచ్చి వారిని రాజ్యాభిషిక్తులనుజేసి తాను వేదవ్యాసునొద్దకుఁ బోయి, యాదవ క్షయము నెఱింగించెను. కృష్ణుఁడు అవతారము ముగించి చనియెనని వ్యాసుఁడు చెప్పి యర్జును నోదార్చెను. ఇతఁ డింద్రప్రస్థమునకు మఱలి వచ్చి ధర్మజునితో వ్యాసుఁడు చెప్పిన తెఱఁగు జెప్పెను. వారు కలియుగము ప్రవేశించిన లక్షణములను జూచిరి. పరీక్షిత్తునకు రాజ్యమప్పగించి మేరుపర్వతమునుగూర్చి చనిరి. ఉలూపి నాగలోకమున కేగెను. చిత్రాంగద తన పుత్త్రుఁడగు బభ్రువాహనునికడకుఁ జనియె. తక్కిన భార్యలు పరీక్షిత్తుయొద్దనే యుండిరి. పాండవు లేగుచుండగనే ముందు ద్రౌపదియుఁ, బిదప సహదేవ నకులులును, పిమ్మట నర్జునుఁడును విగతప్రాణులై పడిరి. ఎల్లకోదండధరుల నాక్షేపించుటచేతను, కౌరవుల నెల్లర నొక్కనాఁడు యుద్ధములోఁ జంపుదునని యట్లు చేయలేకపోవుటచేతను నర్జునుఁడట్లు పడిపోయెను. భార.

అర్జునుఁడు:-మూడుము తిన్నఁడు.

అర్జునుఁడు:-మూడుము కార్తవీర్యార్జునుఁడు.

అర్థి:-పృథుని కుమారుఁడు. ఇతనిభార్య శిఖండిని; ఈమెయందు హవిర్ధానుఁడను పుత్త్రునిబడసెను. బ్రహ్మ.

అలంబస:-తృణబిందుని కుమార్తెయైన యిలబిల యొక్క కుమారిత. ఈమె తృణబిందునే కామించి వివాహమాడెను. ఈమెకు ఇలబిలయను కూఁతురును; శూన్యబంధుఁడు, ధూమ్రకేతుఁడు, విశాలుఁడు నను కుమారులును గలిగిరి. విష్ణు.

అలంబుస:-ఒక అప్సరస; దధీచి నియమంబులకు విఘ్నము సేయుటకై యింద్రునిచేఁ బంపఁబడెను. ఈమెను జూడఁగా దధీచికి స్ఖలనమయ్యెను. భార.

అలంబుసుడు:-అలంబుసుఁడు ఒక దనుజుఁడు. జటాసురుని తనయుఁడు. బకుని, కిమ్మీరుని తమ్ముఁడు, అలంబుసుఁడు పాండవులతో బూర్వవైరముండుటచే దుర్యోధను నడిగి భారత యుద్ధములో దుర్యోధనునితోఁ గలిసి పోరెను. ఇతఁ డర్జునుని కుమారుఁడైన ఇరావంతుని జంపెను. పిదప ఘటోత్కచునితోఁ బోరి యతనిచేఁ జంపఁబడియె. భార.

అలక:-కుబేరుని పట్టణము.

అలర్కము:-పరశురాముఁడు కర్ణుని యంకమందు శయనించి యుండగఁ కర్ణుని గఱచిన కీటకము. పరశురాముఁడు దానిని జూడఁగనే దానికి శాపవిమోచనమై ప్రాగ్దంశుఁడను దనుజుఁడై చనియె. రామా.

అలర్కుడుఁ:- మదాలసా కువలయాశ్వుల పుత్త్రుఁడు. ఇతని కన్నలుండిరి గాని తండ్రి తరువాత నితఁడేరాజై రాజ్యమేలెను. ఇతఁడు భోగపరాయణుఁడై రాజ్యము దుష్పరిపాలనము చేయుచున్నందున నితని సోదరుఁడు సుబాహువు వానిబుద్ధి మఱలింపఁదలఁచుకొని యతని శత్రువగు కాశిరాజు కడకుఁబోయి యలర్కుఁడేలుచున్న రాజ్యము తనకిప్పింపుమని కోరెను. కాశిరాజు చరుఁడను దూతను బంపెను. మా యన్నవచ్చి యడిగిన నిచ్చెదనుగాని నీ భయమున్న నీకువెఱచి యిచ్చువాఁడను గానని యలర్కుఁడు ప్రత్యుత్తర మిచ్చెను. కాశిరాజు వాని దేశముపై దాడివెడలెను; అలర్కుఁడు యుద్ధము చేసి హీనబలుఁడయ్యెను. అప్పుడు తల్లియిచ్చిన యంగుళీయమును జూచుకొని తను వస్థిర మగుటయు, శాశ్వత సుఖంబులం బొందుటకు మార్గము లితరము లగుటయుఁ దెలిసికొని దత్తాత్రేయుని కడకుఁబోయి యతనివలన జ్ఞానమును బడసి రాజ్య మన్నకునిచ్చివేసి, తా నరణ్యములకుఁ బోయి తపస్సుచేసికొనియెను. మార్క.

అలాయుధాసురుఁడు:-బకాసురుని సోదరుఁడు. భీమునిపై క్రోధము గలదు గావున, దుర్యోధనుని కడకువచ్చి తన్నెఱింగించుకొని యుద్ధములోచేరి దుర్యోధనుని పక్షమున బోరెను. ఘటోత్కచుఁడు వానిని జంపెను.

అలోలుఁడు:-గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

అవంతి:-ఉజ్జయినీదేశపు రాజధాని. మోక్షదాయకములగు పట్టణములలో నొకటి.

అవక్రీతుఁడు:-భరద్వాజుని పుత్త్రుఁడు. విద్వత్పూజ్యులైన రైభ్యునిని, నతని కుమారులను జూడఁగ నితని కసూయజనించెను. వారికంటెను గొప్ప విద్వాంసుఁ డగుటకు నితఁడు తపస్సు చేయఁ బ్రారంభించెను. ఇంద్రుఁడు వచ్చి యేల తపస్సు చేయుచున్నా వని యడిగెను. చదువకయే నాకు సర్వవేదములుఁ, శాస్త్రములుఁ వచ్చుటకుఁ దపస్సు చేయుచున్నానని అవక్రీతుడు పలికెను. విద్య గురువులకు నేర్చుకొన వలయును. తపస్సువలన నేర్వవచ్చునా? తపస్సు వలన బడసిన విద్యవలన మదము, మత్సరము పుట్టును. నీవీ తపము మానుము అనియె. అవక్రీతుఁడు వానిమాటలువినక యట్లే తపము చేయుచుండెను. పదపడి యింద్రుఁడువృద్ధబ్రాహ్మణ రూపమునవచ్చి గంగయొడ్డున నిలిచి గుప్పెళ్ళతో గంగలోకి నిసుకఁ జల్లుచుండెను. అవక్రీతుఁ డదిచూచి నీవేమి చేయుచుంటి వనియె. సేతువు కట్టుటకై యిసుకఁ జల్లుచుంటినని యా కపటబ్రాహ్మణుఁడు పలికెను. ఈ ఇసుకవలన గంగపూడునా? యని యవక్రీతుఁడు నవ్వెను. నీవు చేయుచున్నదిమాత్ర మసంభవ కార్యము కాదా? తపస్సువలన విద్యవచ్చునా? దానిని మానుమని బ్రాహ్మణుఁడనియె. నాకు విద్య వచ్చువఱకుఁ దపస్సు మాననని యవక్రీతుఁడు పలికెను. ఇంద్రుఁడు నిజరూపము చూపించి యవక్రీతునకు విద్యనొసంగెను. అట్లు లబ్ధంబైన విద్యను సంతోషించుచుఁ దాను విద్య నేర్చిన ప్రకార మవక్రీతుడు తండ్రి కెఱింగించెను. 'నీకు గర్వమున్నది. అది తగదు. రైభ్యుని పుత్త్రులతో నిర్మత్సరుఁడవై యుండుము. అని తండ్రి చెప్పెను. అవక్రీతుఁడు రైభ్యుని యాశ్రమమునకుఁ బోయెను. అచ్చట వాని కోడలిని జూచి కామించెను. ఇతఁడు శపించునేమో యని భయపడి యవక్రీతునితో నామె పరేయని మామగారితో నవక్రీతుఁడు తనను గామించి పల్కుచున్నాడని చెప్పెను. రైభ్యునకుఁ గోపమువచ్చి హోమముచేసి యొకసుందరాంగిని నొక రాక్షసుని సృజించెను. ఆమె యవక్రీతుని చెంతకుఁబోయి కమండల మడిగెను. ఈమె రూపము చూచుటతోడనే మోహించెను. గాన నతఁడు కమండలము నిచ్చెను. దానిని విడువఁగనే రాక్షసుఁడువచ్చి మీఁదఁ బడఁబోయె. అవక్రీతుఁడు పరుగెత్తి సముద్రములో దాగుకొనియె. ఇతఁడు ప్రవేశించఁగనే సముద్రజలమింకిపోయెను. అచ్చటినుండి వెడలి తండ్రి యొక్క యగ్నిహోత్రమున దాగెను; అది చల్లారిపోయెను. అపుడు రాక్షసుఁ డవక్రీతుని బట్టుకొని సంహరించెను. బృహద్ద్యుమ్నుఁడను రాజుసేయు యాగముకడకు వచ్చుచున్న అర్వావసువు కోరగ దేవతలు అవక్రీతుని బ్రతికించిరి. (చూడు అర్వావసుఁడు)

నేను సర్వవిద్యలను నేర్చితినిగదా! నన్నుఁ జంపఁగలిగినశక్తి రైభ్యున కెట్లు వచ్చెనని యవక్రీతుఁడడుగ, రైభ్యుఁడు గురుముఖమునవిద్యలు పడసెను గాన నతని కాశక్తి గలిగెనని చెప్పిరి.

భార.

అవాచీనుఁడు:- జయత్సేనుని కుమారుఁడు. ఇతని భార్య మర్యాద. వీరి పుత్త్రుడు అరిహుఁడు.

భార.

అవింధ్యుఁడు:-ఒక వృద్ధరాక్షసుఁడు. త్రిజటచేత సీతకు రాముఁడు సుగ్రీవునిగూడి యున్నవాఁడనియు, లంకకువచ్చి సీతను గాపాడుననియు నెఱింగించెను. ఇంద్రజిత్తు సంహరింపబడిన పిదప రావణుఁడు దుఃఖక్రోధముచేత సీతను జంపుదుననుచు నశోకవనమునకువచ్చెను. నీకు మగటిమియున్న శ్రీరామునిజంపుము. స్త్రీని వధించుట నీకుఁబౌరుషమా? అని అవింధ్యుఁడు వానిని మరల్చెను.

భార.

అవిజ్ఞాతగతి:-అనలుఁడను (అనిలుఁడను) వసువు కుమారుఁడు.

భార, మత్స్య.

అవీక్షిత్తు:-కరంధముని కుమారుఁడు. ఇతని తల్లి వీర. ఇతఁడు పుట్టఁగనే జ్యోతిష్కులనురావించి వాని జాతక మెట్లున్నదని తండ్రి యడిగెను; బుధుఁడు, గురుఁడు మంచి యిండ్ల నుండియే వీక్షించుచున్నారు. దుష్టగ్రహ వీక్షణము లేదు

అని వారు చెప్పిరి. శుభగ్రహములచేత వీం డవీక్షింపఁబడెనుగాన అవీక్షిత్తుఅని తండ్రి పేరు పెట్టెను. ఇతఁ డఖిలాస్త్రశస్త్ర విద్యా విశారదుఁడై స్వయంవరములందు వర, గౌరి, సుభద్ర, లీలావతి, దారిక, మాల్యవతి, కుముద్వతి యను వారలను బరిణయ మయ్యెను. పిమ్మట విశాల రాజపుత్రియైన విశాలయొక్క స్వయంవరమునకు వెడలెను. అచ్చటికివచ్చిన రాజకుమారులు వీనిని జూచి యోర్వలేక యందఱుఁ జేరి యధర్మయుద్ధమున వీని నోడించి బంధించిరి. విశాల యితరరాజకుమారులను వరింపదయ్యెను. ఆనాటికి స్వయంవర మాపివేయఁబడెను. తన పుత్త్రుఁ డిట్లధర్మ యుద్ధమున బంధింపఁబడినట్లు కరంధమునకుఁ దెలిసినది. అతఁడు సేనాసమేతుఁడై వచ్చి శత్రువులను జయించి కుమారుని బంధవిముక్తుని గావించెను. విశాల యాతనిం బరిణయ మయ్యెదననియెను. కాని, ఆమెమూచుచుండఁగ దా నోటువడియెను గాన నామెను వివాహమాడనని యవీక్షిత్తుపట్టుపట్టెను. కరంధముఁడు తన నగరమునకుఁ బుత్త్రుని దీసికొని వెళ్ళెను. అవీక్షిత్తు బ్రహ్మచర్య వ్రతమునే పూని యుండెను. ఇట విశాల యవీక్షిత్తునికంటె నితరునిఁజేపట్టనని, తరువాతి జన్మంబునందైన నవీక్షిత్తే భర్తయగుటకు గోరి, తండ్రియనుజ్ఞగైకొని యటవికేఁగి తపస్సుచేయుచుండెను. కరంధముఁడు వృద్ధుఁ డగుచుండెను. అతని యేకపుత్త్రుఁడగు నవీక్షిత్తు బ్రహ్మచర్యము పూనియుండెను. వీనిని సంసారోన్ముఖునిగఁ జేయవలయునని వీని తల్లిదండ్రులు గోరుచుండిరి. ఇతని తల్లి యితనిఁజేరి, "కుమారా! నేను కిమిచ్ఛక వ్రతము పట్టితిని. దానిని నీవు కొనసాగింపుము. ఎవ్వరేమి వేడినను నీ విచ్చుచుండవలయును" అని చెప్పిన నతండంగీకరించెను. ఆమె వ్రతము ప్రారంభించెను. ఎవ్వరేమి కోరుదురో వారువచ్చి యవీక్షిత్తుని వేడుఁడని పురోహితుఁడు పలికెను. నీవు సత్యము తప్పని రాజపుత్త్రుఁడవు కదా! నేను గోరిన దానినిమ్ము అని చెప్పి, నాకుపౌత్త్రుఁడు గావలయునని యతని తండ్రి కోరెను. ఆడిన మాట తప్పలేక యవీక్షిత్తు కుటుంబి యగుట కంగీకరించెను. ఇతఁడొకనాఁడు వేటకై యరణ్యమున కేఁగఁగనే "యవీక్షిత్తుని భార్యను, నన్నురక్షింపు" డను నార్తనాదములు వినఁబడియె. అతఁ డావాక్యముల కాశ్చర్యమునొంది, యిది దనుజమాయకానోపునని తలంచెను. కాని యంతలో నొక దనుజునిచేఁ బట్టుకొనఁబడిన నారీలలామను జూచి, యామెను విడిపించుటకై దనుజుని సంహరించెను. వానిని సంహరించినందుకు సురలు మెచ్చుకొని వరము వేడుమనిరి. ఇతఁడు తన తండ్రి కోరిన కోర్కె నెరవేర్చుటకై నాకుఁ గుమారుఁడు కావలెననియెను. ఈ కాంతయందే నీకుఁ బుత్త్రుఁ డుద్భవించునని దేవతలు చెప్పిరి. నేను విశాలనువరించి యుంటిని. ఆమెను దక్క నితర వనితను గైకొననని యవీక్షిత్తు పల్కఁగ, నీమెయే విశాల యని దేవత లెఱింగించిరి. అంత వారొకరి కథనొక రెఱింగి యథాశాస్త్రముగ వివాహము జరుపఁ దలఁచుకొని నగరమునకు పోవుచుండిరి. అపుడు విశాలకుఁ బూర్వజన్మమునఁ దండ్రియైన గంధర్వరాజు వచ్చి తన కూఁతురగు భామినియే శాపవశమున నట్లు జన్మించెనని చెప్పి వారిఱువురను దన నగరమునకుఁ దోడ్కొని పోయి యచ్చట వివాహము గావించెను. అవీక్షిత్తునకు విశాలయం దొక పుత్త్రుఁడు జన్మించెను. ఉత్తర మరుత్తును, దక్షిణమరుత్తును, తూర్పుమరుత్తును, పశ్చిమమరుత్తును నితనికి శుభములిచ్చునని చెప్పుటచేత మరుత్తుఅని పుత్త్రునకుఁ బేరుపెట్టిరి. భార్యాపుత్త్రులతో నవీక్షిత్తు తండ్రికడకేగెను. వారందఱు ఆమోదము నొందిరి. కరంధముఁడు తపోవనమున కేఁగదలచుకొని రాజ్యము పుత్త్రుని గైకొమ్మనియెను. కాని, తానువెనుక రాజపుత్త్రులతో నోటువడియెను గాన భూమిని పాలించుట కర్హుఁడు కాఁడని, తండ్రి యెంత చెప్పినను రాజ్యము గైకొన నిచ్ఛలేక యుండెను. ఇతని కుమారుఁడైన మరుత్తునకే పట్టముకట్టి యితఁడును దపోవనమునకేగెను. మరుత్తు రాజ్యము చేయుచుండఁగ నాగలోకమునుండి పన్నగములు వచ్చి మునులను బాధించుచుండెను. మరుత్తు సంవర్తాస్త్రము వేసి నాకలోకమును దపింపఁజేసెను. విశాలకడకుఁ బాములు వచ్చి యామె పూర్వము చేసిన ప్రతిన జ్ఞాపకముచేసి యామె సుతునిచేఁ బన్నగహననము మానిపించుమని వేడెను. ఆమె యవీక్షిత్తునితోఁ జెప్పెను. ఇతఁడు కుమారుని కడకువచ్చి సర్పఘాతము మానుమని కోరెను గాని కుమారుఁడు మానఁడయ్యెను. ఇతం డెంత చెప్పినను వినకపోవుటచేఁ గుమారునితో యుద్ధ

మునకు దిగెను. కాని మునులువచ్చి "మృతులైన మునులు సంజీవితులైరి. సర్పములకును ప్రాణభయము పోయెను. మీరు యుద్ధముమానుఁ"డని మాన్పించిరి. పిమ్మట మరుత్తు తండ్రికి నమస్కరించెను. అవీక్షిత్తు కుమారుని దీవించి తపోవనమునకుఁ జనియె. మార్క.

అశన:- బలిచక్రవర్తి భార్య. ఈమె కుమారుఁడు బాణుఁడు. భాగ.

అశిలోముఁడు:- మహిషాసురుని సేనానాయకులలో నొకఁడు. వానికి పూర్వము దేవితో యుద్ధముచేసి మరణించెను. దే. భా.

అశోకవర్ధనుఁడు:-(అశోకుఁడు) చంద్రగుప్తుని పుత్త్రుఁడైన వారిసారుని కుమారుఁడు. నిష్కంటకంబుగ ధరను పాలించెను. ఇతనికుమారుఁడు సుయశస్సు. భాగ.

అశ్మ:-ప్రాచీనుని భార్య. సంయాతి తల్లి. భార.

అశ్మంతకుఁడు:-మగధరాజుకుమారుఁడు యుద్ధములో అభిమన్యునిచేఁ జంపబడెను. భార.

అశ్మకుఁడు:-ఒక బ్రాహ్మణుఁడు. జనక మహారాజున కొకప్పుడు బంధువియోగము వాటిల్లగ విషాదంబునొంది గృహంబువదలిపోఁదలఁచెను. అప్పుడు వానికడకు అశ్మకుఁడురాగ జనకుఁడిట్లడిగెను. అర్థము, బంధువులు కలిగి పదపడి తద్వియోగమైనప్పుడు ఏతలఁపు మనస్సులో నుండినయెడల నరునకు వారిమీఁద విషాదము కలుగును. అవి రెండును కాష్ఠంబులుకలసుకొని మరలఁబాసిన చందంబున జరుగును. కాలాధీనత నవికలుగునని యెఱింగినవానికి సుఖదుఃఖములు చరింపవు, అని యుపన్యసించెను. భార.

అశ్మకుఁడు:-కల్మషపాదుని కుమారుఁడు. ఇతని తల్లి మదయంతి. కల్మషపాదుఁడు వసిష్ఠునివలనఁ గుమారునిబడయుమని మదయంతిని నియోగించెను. మదయంతి గర్భముదాల్చి యేడేండ్లు మోసెను. ఎంతకును ప్రసవము కాకుండుటచే అశ్మముతో (ఱాతితో) గర్భము కొట్టుకొనెను. అపుడు పుత్త్రుఁడుజన్మించె. అతఁడే అశ్మకుఁడు. అశ్మకునికుమారుఁడు మూలకుఁడు. భాగ. విష్ణు.

అశ్వతరుఁడు:-ఒక నాగేంద్రుఁడు. ఇతని కుమారులు ఋతధ్వజుని(కువలయాశ్వుని) స్నేహితులు. వారు తమతండ్రియొద్దఁ దమమిత్త్రునిగుణగణంబులను బొగడువారు. కువలయాశ్వుఁడు భార్యను గోలుపోయి కడుదుఃఖితుఁడైయున్నవాఁడని కుమారులవలన విని వానిని బ్రతికింపఁదలఁచి యత్నమువలన సాధ్యముకానిది లేదని యశ్వతరుఁడు సరస్వతినిగూర్చి తపస్సుచేసెను. ఆమె ప్రత్యక్షమై యతఁడు కోరినట్లు గానవిద్యనిచ్చి యతని తమ్ముని కంబళునిగూడ బ్రతికించి వీనికిని గానమును నేర్పెను. అట్లుగానము నేర్చుకొనిన పిదప నశ్వతరుఁడు కైలాసముమీఁదకేగి యచ్చట సుస్వరముతో గానము చేయుచుండెను. శివుఁడు గానము విని మెచ్చుకొని వరము వేడుకొనుమనెను. కువలయాశ్వుని భార్యయైన మదాలస పూర్వరూపముతోడను, పూర్వజ్ఞానముతోడను బుట్టునట్లు వరము వేడెను. పితరులకుఁ దర్పణములిచ్చి పూజించి, మధ్యపిండమును భుజించుము. అట్లు చేసిన నీమధ్యఫణమునుండి మదాలసజన్మించునని చెప్పెను. అశ్వతరుఁ డట్లొనరింపఁగ మదాలస జన్మించెను. అప్పుడు కువలయాశ్వుని రావించి యశ్వతరుఁడు వానికి మదాలసను నిచ్చెను. మార్క.

అశ్వతీర్థము:-కన్యాకుబ్జము సమీపమున నుండు నొక తీర్థము. గాధికి సత్యవతి యను నొక కూఁతురు కలదు. ఆమెను దనకిచ్చి వివాహము చేయుమని ఋచీకుఁడు గాధిని గోరెను. ఒక చెవి నలుపును, శరీరము తెలుపును గల వెయ్యి గుఱ్ఱములను దెచ్చి యుంకువగా నిచ్చితివేని సత్యవతి నిత్తునని గాధి చెప్పెను. ఋచీకుఁడు వరుణుని బ్రార్థింపఁగ నీవు తలఁచినచోట నట్టి యశ్వములు ప్రభవించునని వరుణుఁడు చెప్పెను. ఋచీకుఁడు గంగానదికి ఉత్తరమున నొక్కచోట అశ్వములు కావలయునని యడిగెను. నీవు తలఁచినపుడే యవివచ్చునని చెప్పెను. అంత గుఱ్ఱములుకావలెనని తలఁచెను. కన్యాకుబ్జ సమీపమునుండి వేయి గుఱ్ఱములు వచ్చెను. కావున ఆప్రదేశము అశ్వతీర్థమనఁబడును. భార.

అశ్వత్థవృక్షము:- పార్వతీ పరమేశ్వరులు రతిక్రీడ సలుపుచుండఁగ నగ్ని వెళ్ళి వారిక్రీడకు భంగము కలుగఁజేసెను. పార్వతికి దేవత లందఱిపైనను గోపమువచ్చి వారిని వృక్షము లగునట్లు శపించెను. విష్ణుమూర్తి యశ్వత్థవృక్షమయ్యె. పద్మ.

అశ్వత్థామ:- దుర్యోధనుపక్షమునఁ బోరిన మాళవేంద్రుఁడగు నింద్రవర్మయొక్క యేనుఁగు దానిని భీముఁడు చంపి యశ్వత్థామ చచ్చెనని యఱచెను. ద్రోణుఁడు దీని నించుక విచారించి భీముని మాటయం దనాదరణచేసి యుద్ధము చేయుచుండెను. భీముఁడు బలవంతపెట్టఁగ ధర్మజుఁ డీయేనుఁగునెపమున అశ్వత్థామ చచ్చెనని బిగ్గఱగనని యేనుఁగు అని మెల్లగఁ బలికె. ద్రోణుఁడు తన పుత్రుఁడగు నశ్వత్థామయే చనిపోయెనని దుఃఖముతో నస్త్రసన్యాసము చేసి శత్రువులచే హతుఁడయ్యెను. భార.

అశ్వత్థామ రాఁగల ద్వాపరంబున వ్యాసుఁడు కాఁగలఁడు. దే. భా.

అశ్వత్థామ ద్రోణుని పుత్రుఁడు. ఇతఁడు పుట్టఁగనే ఉచ్చైశ్శ్రవమువలెఁ బెద్ద రావముచేసెను. ఆకారణముచే నాకాశవాణి ఇతనికి నశ్వత్థామ యను పేరు పెట్టెను. ఇతఁడు చిన్ననాట నుండియుఁ దనతండ్రి శిష్యులైన కౌరవ పాండవులతోఁ గలసి విలువిద్య మొదలు సకలవిద్యలు నభ్యసించెను. ఇతఁడును నస్త్రప్రయోగ నిపుణుఁడు. అర్జునుఁడు తనను మించునేమో యను భయముకూడ నీతనికిఁ గలదు. ఇతఁడు చీకటి యందు బాణమువేయ నేర్పుకొనవాఁడు. అట్టిది అర్జునునకుఁ గలుగకుండుటకై యన్నసాధకునితో నర్జునుని కెన్నఁడుఁ జీకటింటఁ గుడువఁ బెట్టకుమని చెప్పెను. కాని యొకనాఁ డర్జునుఁడు భుజించుచుండఁగ దీపమారిపోయెను. అయినను జీకటిలోనే యన్నము భక్షించి యభ్యాసవశమున నిట్లే చీకటియందును బాణము వేయవచ్చునని యర్జునుఁడు గ్రహించెను.

ద్రోణుఁడీతనికి బ్రహ్మశిరోనామ కాస్త్రం బిచ్చెను. అది అమోఘమైనది. తొలుత దాని నగస్త్యుండు ద్రోణున కిచ్చెను. ఆ యస్త్రము ద్రోణుఁడు అర్జునున కుపదేశించె. దానినెన్నఁడు మనుజులపై బ్రయోగింపవలదని అశ్వత్థామకుఁ దండ్రి చెప్పెను. ఈయస్త్రమును బడయు గర్వ మీతనికిఁ గలదు. ఒకనాఁడితఁడు కృష్ణుని జూడఁ బోయి నాయస్త్రము నీకిచ్చెదను, నీ చక్రము నాకిమ్ము అని యడిగెను. నాకత్యంత ప్రియుం డైన అర్జునుఁడే దీనినడుగలేదు. నీవడిగితివి; నా ఆయుధములలో నీకుఁగావలసినది దీసికొనుము. మిత్రుఁడు కోరినదిచ్చుచు మరల నతని కడనుండి వేరొకటి గ్రహింపవచ్చునా? నీయస్త్రము నాకక్కరలేదు అని కృష్ణుఁడని తన యస్త్రముల వానిముందుఁ బెట్టెను. అతఁడు ఎడమచేతితోను, కుడిచేతితోను లేవకుండుటచే రెండు చేతులను కలిపి చక్రమును ఎత్తబోయెను. కాని దానిని కదల్పలేకపోయెను. నీవెవరితో యుద్ధమును గోరి దీనివేడితివని కృష్ణుఁడడుగ నీతోఁబోరి యోటువడకుండ నుండఁగోరి దీని నడిగితిని అని చెప్పి పుచ్చుకొనలేకపోయెను.

కురుపాండవుల వైషమ్యములం దితఁడేమియుఁ గల్పించుకొనలేదు. కాని దుర్యోధనునింటనుండి యాతని యన్నమును దినుచుండెను గాన ధర్మమయినను, నధర్మమైనను నాతని కార్యము చేయ సంసిద్ధుడై పాండవుల కెదురుగ నిలువఁబడి యుద్ధముచేసెను. తొడలు విఱుఁగ గొట్టబడిన దుర్యోధనునిజూచి యాతనితోఁగలసి మిక్కిలి దుఃఖించెను. పాండవులపైఁగల్గిన కోపముచేతను దుర్యోధనుఁడు ప్రాణములు విడుచుటకుఁ బూర్వము వానిని సంతోషపెట్టుటకును నితఁడు పాండవులను దునుమాడివత్తునని శపథముచేసి వచ్చెను. ఆరాత్రి యతఁడు చెట్టుక్రింద నిలిచి యుండఁ జెట్టుమీఁద నిదురించుచుండిన కాకులను గుడ్లగూబలు పొడిచి చంపుచుండుటను జూచి యిట్లే పాండవులు నిద్రించునపుడు చంపవచ్చునని యెంచి యా యాలోచనను గృపాచార్యునకుఁ దెల్పెను. కృపుఁడది నీతి గాదనియె. కాని యితఁడు వినక భీష్ముని, దనతండ్రిని నట్లధర్మమునఁ జంపిరిగానఁ బాండవులను నిదురించుచుండగఁ జంపవచ్చునని నిశ్చయించుకొని పాండవశిబిరమునుగూర్చి పోవుచుండెను. మార్గమందు శివుఁ డొక పెనుభూతమువలె నిలిచి యుండి యెన్ని బాణములు వేసినను దిగమ్రింగుచుండెను గాని కదలుటలేదు. అంత నదియొక దైవమని తలఁచి యశ్వత్థామ నమస్కరించి

యగ్నిహోత్రము గావించి యందుఁ దనశరీరము హవ్యముగఁజేయుటకై వంగుటకెను. అపుడు శివుఁడు నిజరూపముచూపి యాతని కొక ఖడ్గము నిచ్చెను. శివునిశక్తి యితనియందుఁ బ్రవేశించెను. అశ్వత్థామ పాండవశిబిరమును బ్రవేశించెను. నిద్రపోవుచుండిన ధృష్టద్యుమ్నుని, శిఖండిని ఖండించి, యుపపాండవులనునిద్రించువారిని జంపి వారి శిరములు దుర్యోధనునకుఁజూపుటకై తెచ్చెను. పాండవుల కీతఁడు చేసిన ద్రోహము తెలిసికొనిరి. ద్రౌపదిమిక్కుటమగు నాగ్రహము నందుచు వానిని విడువరాదని భీమునితోఁజెప్పుకొనెను. అశ్వత్థామ కరిపురము వీడి భాగీరథీ తీరమునఁ దపస్సు చేసికొనబోయెను. వానిని వెదకుచు భీముఁడువెళ్ళెను. భీముని గాపాడుటకు ధర్మజ కృష్ణార్జునులును వెడలిరి. భీముఁడు అశ్వత్థామను నిందించుచుండగా "అపాండవమగుగాక" యని అశ్వత్థామ బ్రహ్మశిరోనామకాస్త్రము ప్రయోగింపఁబోయెను. వలదని కృష్ణద్వైపాయనుఁడు చెప్పి నీశిరోరత్నము వీరికిమ్ము. నిన్ను హానిచేయక విడుతురనియెను. కాని యతఁడు వినలేదు. ఆ యస్త్రము అన్యనస్త్రము చేనుపశమించెడేని ఆదేశమున పంద్రెండేండ్లు అనావృష్టి దురితము కలుగును. వలదన్నను వినడు.

"నీవు గర్భములనుగూడ దునుముచుంటివి. ఒక్కదానినైన నిలుపుము" అని కోరెను గాని అశ్వత్థామ వినలేదు; తాను ఆ గర్భస్థశిశువును రక్షించెదనన్నను అతఁడు మానలేదు. అంత కృష్ణుడు అర్జునునిఁగూడ ఆ యస్త్రమే ప్రయోగించుమనిచెప్పి బాలఘాతివగు నీకాహారము దుర్లభమై యొంటిగాఁదిరుగుచు దుర్గంధ రక్తంబున లోకంబున దిగ్గటంబులందు మూఁడు వేలేండ్లు తిరుగుమని శాపమిచ్చెను. "నా మాటయు విననైతివి. కృష్ణుఁడు శపించునట్లే యగుఁగాక" అని వ్యాసుఁడనియె. నీవు నరుల మధ్యనే యుందువుగాక యని వ్యాసున కితఁడు ప్రతిశాప మిచ్చెను.

ఇతఁడు భయపడి పాఱిపోయి బ్రహ్మశిరోనామకాస్త్రమును ప్రయోగించెను. అర్జునుఁడు కూడ నాయస్త్రమునే ప్రయోగించెను. దాని వలన లోకము జ్వాలామయమయ్యెను. మునులు అస్త్రములను క్రమ్మరింపుఁడని ప్రార్థించిరిగాని, యశ్వత్థామ కది చేతగాదయ్యె. అతని శిరోమణిని బాండవులకిచ్చి వారితో సంధిగావించుకొనుమని మునులు చెప్పిరి. అశ్వత్థామ దాని కొడంబడియె. ద్రౌపదికూడ నశ్వత్థామను జంపవలదని చెప్పుటచేఁ బాండవులు వానిని జంపక శిరోమణిని బుచ్చుకొని యతని నవమానించిరి. అతఁడు ప్రయోగించిన యస్త్ర మూరకపోదుగానఁ బాండవేయుల గర్భములకు హానిచేసి ప్రతిశాంతి పొందునని యతఁడనియె. కృష్ణద్వైపాయనుఁ డట్లే కానిమ్మనియె. ఆయస్త్రము ఉత్తరగర్భమున నున్న శిశువును బాధించెను. కృష్ణుఁ డా శిశువును గాపాడెను. పాండవులచే ప్రాణమాత్రావశిష్టుఁడుగఁ జేయఁబడిన యశ్వత్థామ విరాగియై కృష్ణద్వైపాయను నాశ్రమమునకుఁ దపస్సునకుఁ బోయెను. భార.

రాఁబోవు సూర్యసావర్ణిక మన్వంతరములలో సప్తర్షులలో నితఁడొకఁ డగును. భార.

అశ్వత్థుఁడు:- ఒక రాక్షసుఁడు. గౌతమీతీరమున వృక్షరూపము ధరించియుండి తన నీడలోనికి వచ్చిన బ్రాహ్మణులను భక్షించుచుండువాఁడు. అచ్చటి బ్రాహ్మణులు భయపడి శనైశ్చరుని బ్రార్థించిరి. అతఁడు తన తపము పూర్తియగుటకుఁ గదలననియె. బ్రాహ్మణులు తమ తపస్సునంతయు వాని కిచ్చెదమని చెప్పిరి. వీరి తపోమహిమను శని గ్రహించి యశ్వత్థవృక్షము నీడకువెళ్ళెను. వీనిని వృక్షము భక్షించె; శనైశ్చరుఁడు చెట్టులోపలకుబోయి దానిని సంహరించి బైటకు వచ్చెను. దానితో నశ్వత్థుఁడు మరణము నొందెను. అశ్వత్థునితోఁ బిప్పలుఁడను మఱియొక రాక్షసుఁడు తిరుగుచుండువాఁడు. వీనినిగూడ శని సంహరించెను. బ్రహ్మ.

అశ్విని:- భరణీదక్షుల కూతురు. చంద్రుని భార్య. భార.

అశ్వపతి:- కేకయదేశపు రాజు. ఇతని కుమారిత కైకేయి. కుమారుఁడు యుధాజిత్తు.

అశ్వపతి:- మద్రదేశపురాజు. ఇతనికి సంతానము లేకపోవుటచేసావిత్రీదేవినిబ్రహ్మదేవునిఁబ్రార్థించెను. ఆమె ప్రత్యక్షమై పుత్రిక నిచ్చెదననియె.

అతఁడు పుత్త్రినిమ్మని కోరెను. బ్రహ్మ నీకుఁ బుత్త్రికనే యిత్తుననియె. ముందునీకుఁగుమార్తెయే జన్మించును; పిమ్మటఁ బుత్త్రులు కలుగుదురు. అని చెప్పి యామె అంతర్ధానము నొందెను. ఇతని భార్య మాళవి. ఇతనికిఁ గూఁతురు పుట్టెను. ఆమెకు సావిత్రి యను పేరు పెట్టి యతి గారాబముతోఁ బెంచుచుండెను. ఆమెకు యుక్తవయస్సు రాఁగా నామె వరించినవారిని వివాహము చేయుఁడనని తండ్రి యనెను. యామె సత్యవంతుని వరించినట్లు తండ్రి కెఱింగించెను. పిమ్మట నారదుఁ డితని గృహమునకు రాఁగ సత్యవంతుఁ డెట్టివాఁడని? యశ్వపతి యడిగెను. వాని కింక యాయుష్కాల మొక సంవత్సరము మాత్రము కలదని నారదుఁడు చెప్పెను. అశ్వపతి తన కూఁతును వేఱొకనిని వరింపు మనియెను గాని యామె తనమనస్సు వరలించుకొన ననుటచే నతనికే యిచ్చి పెండ్లి చేసెను. సావిత్రికి యముఁడిచ్చిన వరమువలన నశ్వపతికిఁ బుత్త్రులు పుట్టిరి. భార.

అశ్వపతి:-కేకయ దేశపు రాజు. ఇతని కడకు ఉద్దాలకుఁడు, ప్రాచీనశాలుఁడు, సత్యయజ్ఞుఁడు అను బ్రాహ్మణులు వచ్చిరి. వారల కాతఁడు ధన మీయఁబోయెను. గాని వారు దానిం గైకొన లేదు. వారు గ్రహింపకుండుటకుఁ దనయెడ నెట్టిదోషము లేదని, తన రాజ్యమున దొంగలుగాని, దాతగాని, ధనవంతుఁడుగాని, అధికారియై యజ్ఞము చేయనివాఁడుగాని, స్వైరిగాని, స్వైరిణిగాని లేరు. వీరు ఏల గ్రహింపరు? అని తానిచ్చు ధనము చాలక వారు నిరాకరించిరేమో యని తాను చేయఁబోవు యజ్ఞము పూర్తియగునఱకు వారి నుండుడని యాతని ఋత్విజుని కెంత ధన మిత్తునో యంతయు వారికిత్తు ననియె. వారు ధనార్థులు కాక బ్రహ్మస్వరూపము నెఱుఁగుటకై యతని వద్దకు వచ్చుట తెల్పిరి. సమిత్పాణులై వచ్చిన వీరికి నశ్వపతి బ్రహ్మను, ఆత్మస్వరూపమును బోధించెను. ఛాన్దో. ఉ.

అశ్వమేధదత్తుఁడు:-శతానీకుని పుత్త్రుఁడు. భార.

అశ్వలాయనుఁడు:-ఒక ఋషి. శౌనకుని శిష్యుఁడు. గృహ్యసూత్రములను జేసెను.

అశ్వశిరుఁడు:-ఒక రాజు. సర్వదేశములనుగెలిచి యాగము చేయుచుండెను. యజ్ఞశాలకుఁ గపిలుఁడు, జైగీషవ్యుఁడు నను మునులు వచ్చిరి. వారిని సత్కరించి విష్ణుమూర్తి నేవిధమునఁ గొలిచిన నతఁడు వశుఁడగునో తెల్పుఁడని నృపుఁ డడిగెను. మేమే నారాయణులము. మమ్ములనే కొలువు మని వారు పల్కిరి. వీరి కింత యహంభావమా? యని రాజునకుఁ గోపమువచ్చెను! కాక కోప మాపుకొని విష్ణుమూర్తిని నే నెఱుఁగకపోలేదు. అతఁడు పక్షివాహనుఁడు. శంఖ చక్రములు గలవాఁడు. మీరేల ఇట్లు పల్కెదవని? యడిగెను. అంతఁ కపిలుఁడు విష్ణురూపము దాల్చెను. జైగీషవ్యుఁడు ఖగేంద్రుఁ డయ్యె. రాజు జూచి యిది మీ మాయాప్రభావము. నిజముగ విష్ణువయితేని బొడ్డునందుఁ బద్మమేది? అందు బ్రహ్మయేఁడి? యని యడిగెను. కపిలుని నాభియందుఁ గమల మేర్పడెను. జైగీషవ్యుఁడు బ్రహ్మ యయ్యెను. ఇదియు మీ మాయయే యని రాజు పలికె. అంత మును అంతర్ధానము నొందిరి. యజ్ఞశాల యంతయు దుష్టమృగములతో నిండెను. రాజు భయపడి యా మునుల ప్రభావమే యని యెఱింగి వారిని ప్రార్థించెను. వారు ప్రత్యక్షమై కరుణించి మృగబాధ నివారణచేసి, ఓ రాజా! భగవంతుఁ డెట్లువశుఁడగు? నని యడిగితివి. సమస్త పదార్థములందును భగవంతుఁడు కలఁడని యెఱుఁగుము. నీ కది తెల్పుటకే, యిన్ని రూపములు దాల్చితిమి. అని చెప్పిరి మఱియుఁ గపిలుఁడు సుజ్ఞానము కలిగి స్వజాతీయ ధర్మము చేసినవాఁడు ముక్తుఁ డగునని బోధించెను. అశ్వశిరుఁడు తన కుమారుఁ డగు స్థూలశిరునకు రాజ్యమిచ్చి తపోవనమున కరిగెను. వరా.

అశ్వసేనుఁడు :-తక్షకుని కుమారుఁడు. తక్షకుని సోదరుఁడైన యైరావతుఁ డితనిని బెంచెను. ఇతఁడు ఖాండవవనము రక్షించుచుండువాఁడు. కృష్ణార్జునులు ఖాండవవనమును నగ్నిహోత్రున కర్పించునపు డితఁడు భయపడి తల్లినోటిలోఁ దన తోఁకను బెట్టి దివమునకుఁ గొంపొమ్మనియె. అర్జునుఁ డదిచూచి తల్లి శిరమును, వానితోఁకను ద్రుంచెను. దానినిగూడ సంహరింపఁబోఁగా ఇతఁడు తక్షకుఁ డనుకొని "తన మిత్త్రుఁడగు తక్షకుని అర్జునుఁడు చంపుచున్నా"డనుకొని,

యింద్రుఁడు మోహిని యను మాయ గావించి అర్జునుని కశ్వసేనుఁడు కనఁబడకుండటఁ జేసి యితనిని గాపాడెను. ఇతఁడు సర్పముఖాకారమునఁ దాల్చి కర్ణునొద్దనుండువాఁడు. కర్ణుఁడితనిని బూజించుచుండెను. అర్జునుని తల తెగవేయుటకై కర్ణుఁ డితనిని బ్రయోగించెను. కృష్ణుఁడు రథమును క్రింద కణచెను. అప్పుడు ఇతనివలన నర్జునుని కిరీటము మాత్రము క్రిందఁ బడెను. మరల నర్జునునిపైకి సర్పము వచ్చెను. వీని నర్జునుఁడు సంహరించెను. భార.

అశ్వినులు :-సంజ్ఞాదేవి సూర్యతేజస్సునకు సహింపలేక బడబరూపమున నుత్తర కురుదేశమున నుండఁగ వచ్చుటకు అశ్వరూపమున సూర్యుఁడు వెళ్లెను. ఆమె తన భర్తను గుర్తించెను. సూర్యుఁ డశ్వరూపముతోడనే యామెతో సంయోగము నొందెను. అపుడు వానికిఁ బుట్టిన సంతానమే అశ్వినులైరి. నాసత్యుఁడు, దస్రుఁడు అని వారి పేర్లు. వీరు వైద్యవిద్యయం దసమానులు. బ్రహ్మ.

అశ్వినులు దేవతలకు వైద్యులు. వీరు యుద్ధములోఁ గాలు విరిగిపోయిన ఖేలనకు నినుపకాలు పెట్టిరి.

ఒక షండుని భార్య యగు వధ్రీమతికి హిరణ్యహస్తుఁ డను పుత్త్రుని బ్రసాదించిరి. జలమగ్నులైన రేభుని, వదనుని బ్రతికించిరి. సముద్రములోఁ గొట్టుకొని పోవుచుండిన భుజ్యునిఁ గాపాడిరి.

అశ్వినీ శాస్త్రమునకై దేవతలందరు పన్నిదములు వేసికొనిరి. ఎవరు ముందుగ వచ్చెదరో వారు పుచ్చుకొనునట కొడంబడిరి. అశ్వినులు గార్దభముచే లాగఁబడు రథములో వచ్చుచుండిరి. వీరు గెలిచినపందె మింద్రాగ్నులకుఁ బంచి యిచ్చుటకు వీ రొడంబడుటచే నింద్రాగ్నులు వీరి రథమునకు మార్గమిచ్చి తొలఁగిరి. అశ్వినులు పందెము గెలిచిరి. అశ్వినుల గాడిద తోఁడేలు రూపమున నుండగ ఋజ్రాశ్వుఁడు తండ్రియొక్క గొఱ్ఱెలను జంపి దానికిఁ బెట్టెను; తండ్రికిఁ గోపమువచ్చి వీని నంధుని జేసెను. అశ్వినులు వీని యంధత్వము బోఁగొట్టిరి.

సూర్యుని పుత్త్రిక మిక్కిలి రూపవతి యగుటచే దేవత లందరామెను బడయఁ గోరుచుండిరి. అశ్వినులు ముందుగ సూర్యుని జేరిరి. ఆమె వారి రథములోనికే వచ్చెను.

వీ రొకనాఁడు చ్యవనుని భార్యయగు సుకన్య స్నానము చేయుచుండఁగఁ జూచి యామె చెంత కరిగి సుగాత్రీ! నీ యీ రూప సంపద కా వృద్ధుఁడా భర్త! మాతో రమ్ము, నీకుఁ దగువానిని జూపెద మనిరి. ఆ మాటలకుఁ గోపము వచ్చి సుకన్య భర్తతో జెప్పెను. అతఁడు వారియిష్టము వచ్చినట్లు చేయుమని యామెతోఁ జెప్పెను. ఆమె మరల వారి కడకు వచ్చి యౌవనవరు నిండని వేడెను. అప్పటికిఁ జ్యవనుఁడు కూడ వచ్చెను. అశ్వినులును, చ్యవనుఁడును కొలనులో దిగి స్నానముచేసి బైటకు వచ్చిరి. అందరును సమాన యౌవన రూప లావణ్యములతో మెఱయుచుండిరి. వీరిలో మరల చ్యవనునే సుకన్య వరించెను. అశ్వినుల మూలమునఁ దనకు యౌవనము వచ్చెను గాన చ్యవనుఁడు వారికి కృతజ్ఞుఁడై శర్యాతి చేసిన యజ్ఞమున వారికి హవిర్భాగము లిప్పించెను. భార.

అష్టకుఁడు:- విశ్వామిత్రునకు మాధవియందుఁ బుట్టిన కుమారుఁడు. (చూడుము మాధవి) విశ్వామిత్రుని నూర్గురు పుత్త్రులలో మొదటివాఁడు శునశ్శేఫుని అన్నగ నెంచుటకు నిరాకరించెను. భాగ.

అష్టకుఁడు :-యయాతి దౌహిత్త్రుఁడు.

అష్టావక్రుఁడు:- ఏకపాదుని పుత్త్రుఁడు. ఏకపాదుఁడు శిష్యులచే విశేషముగఁ జదివించువాఁడు. అష్టావక్రుఁడు తల్లి గర్భములోనుండి నపుడే తండ్రితో నిట్లనియె. ఏల యింతగ శిష్యులచేఁ జదివించెదవు ? వారు నిద్రాహారములు లేక బాధపడుచున్నారు ఈ మాటలకు దండ్రికిఁ గోపమువచ్చి నీవు అధ్యయనమును గూర్చి వక్రముగ బలికితివి గావున నెనిమిది వక్రములతోఁ బుట్టుము అని వానిని శపించెను. అతఁ డష్ట వక్రములతోఁ బుట్టెను. అష్టావక్రుఁడు జన్మింపక పూర్వము తండ్రి ధనసంపాదనమునకై జనకరాజుసభ కరిగియుండెను. అష్టావక్రుఁడు మేనమామ యగు ఉద్దాలకుని గృహమునఁ బుట్టెను. ఉద్దాలకునకును శ్వేతకేతుఁడను పుత్త్రుఁడు కలిగెను.

వీరిద్దఱుసమానవయస్కులగుటచే వేదాధ్యయనము గలసియే చేయుచుండిరి. ఒకనాఁడష్టావక్రుఁడు ఉద్దాలకునితొడపైఁగూర్చుండెను. శ్వేతకేతుఁడు వచ్చి మాతండ్రితొడపై నీవేల కూర్చుండుదువు? నీవు పోయి మీతండ్రితొడ యెక్కుము అనెను. దానితో నష్టావక్రుఁడు చిన్నపోయి తల్లికడకుఁ బరుగెత్తి నాతండ్రియెచ్చటనున్నాఁడు? చెప్పుమని యడిగెను. ధనసంపాదనముకై జనకుని సభ కేగినాఁడని తల్లి చెప్పెను. అష్టావక్రుఁడు వెంటనే జనకుని పట్టణమున కేగెను. అచ్చటఁ దనతండ్రి వరుణపుత్రుఁడగు వందిచే నోటువడి నీటను ముంపఁబడియున్నాఁడని తెలిసికొనియె. తానే యావందితోఁ దర్కించుటకు రాజసభకు బోయెను. సభలో వంది నోడించి తనగెల్పునకు బహుమానముగఁ దనతండ్రిని, ముంపఁబడిన వారినందఱిని బైటకుఁ దీయించెను.

అష్టావక్రుఁడు వదాన్యుని పుత్రికను సుప్రభ యనుదానిని వివాహము కాఁగోరి యతని నడిగెను. వీనిని బరీక్షింపఁగోరి వదాన్యుఁడు 'నా కుమారితను నీకిత్తును. ముందుగ నుత్తర దిశకుఁ బోయిరమ్ము' అని చెప్పెను. నే నెట్లు పోవలయును? అట్లెంత దూర మేగునని యడుగఁగఁ గుబేరునినగరము దాటిపోఁగ హిమగిరిమీద గౌరికి శివుఁడు సంప్రీతిచేసిన స్థలముండును. దానిని దాటిపోఁగ; నీకొక ముదిత కనఁబడును. ఆమెను జూచిరమ్ము. అప్పుడు నాసుత నిచ్చి వివాహము చేసెదనని వదాన్యుఁడు నుడివెను అష్టావక్రుఁ డా యాత్రకై బైలువెడలెను. కుబేరుని పట్టణముఁజేరఁగ నతఁడెదురువచ్చి యాతిథ్యమిచ్చి తనభవనమునకుఁ గొంపోయెను. అచ్చట రంభ, ఊర్వశి, తిలోత్తములుచేయు నృత్తగానములు చూచుచు నొక సంవత్సరముండి కుబేరుని యొద్ద సెలవుపుచ్చుకొని యష్టావక్రుఁడు హిమాలయమును గూర్చి పయనమయ్యెను; హిమవత్పర్వతముపైన శ్రేమాకులయడవి ప్రవేశించెను. అందు దివ్యభవనములను జూచెను. హేమమయమగు నొకభవనమును బ్రవేశించెను. అందుసుందరీనికాయంబెదురువచ్చి యాబ్రాహ్మణుని లోనికిఁ గొంపోయె. ఇతనిరాక తెలుపఁగనే యభ్యంతర మందిరమున నున్న ముదవతి యొకతె వచ్చి యాతిథ్యమిచ్చి రాత్రియగుడు నతని సెజ్జఁ జేరి గవయం గోరెను. నే నస్ఖలిత బ్రహ్మచారిని. పరసతిని గూడుట తగదు. నన్ను విడువుము. నా దారిని బోనిమ్ము అని అష్టావక్రుఁడు వేడెను. ఆ మఱునాఁడతని కభ్యంగనము కావించి తనను బరిణయముకమ్మని యామె కోరెను. బాలవు, తండ్రిగాని సోదరుఁడుగాని యిచ్చి వివాహము చేయవలయును గాని నిన్ను నీవ యిచ్చుకొందువె? నీ వెవరవో నిజముగఁజెప్పుమని వ్యాకులపడి యతఁడడుగ నామె నే నుత్తరదిశను, నీనిష్ఠపరీక్షించుటకై వదాన్యుఁడు నన్నుఁ బంపెను. పరీక్ష కాఁగితివి; పొమ్ము. సుప్రభను బెండ్లిచేసికొమ్ము అని యామె చెప్పెను. ఇతఁడు మఱలివచ్చి సుప్రభను వివాహమయ్యెను.

అష్టావక్రుఁడుజలమధ్యమునుండిచిరకాలము తపస్సుచేసెను. రంభాది అప్సరసలు వానికడకు వచ్చి తమ నృత్తగానములచే వానిని సంతృప్తి పరచిరి. అతఁడువారిని వరము వేఁడుకొనుఁడనియె. విష్ణుమూర్తి భర్తయగుటయే వారు కోరిరి. విష్ణుమూర్తి కృష్ణుఁడుగ నవతరించినపుడు మీరువానికి భార్యలయ్యెదరని ఇతఁడు చెప్పెను. పిమ్మట నితఁడు జలమునుండి బైటకురాఁగ నితనినిజూచి నవ్విరి. తన నాక్షేపించినందుకుఁ గినిసి కృష్ణుని పరోక్షమున మీరు బోయలచే నవమానింపఁ బడుదురని వారిని శపించెను. విష్ణు.

అసమంజసుఁడు:- సగరుని కుమారుఁడు, ఇతని తల్లి కేశిని. పూర్వజన్మమున నొకయోగీశ్వరుఁడు సంగదోషమువలన యోగభ్రష్టుఁడై సగరునకు జన్మించెను. ఇతఁడు పూర్వజన్మమున నొక వైశ్యుఁడు. కార్యార్థమరణ్యములోఁ జరించుచు నొక ధనరాశిని జూచి దానిని స్వీకరింపఁ బోయెను. కాని దానిని గాచుచుండిన యొక భూతమువచ్చి "ఈధనము నాది. నే నాఁకలిచే బాధ నొందుచున్నను దీనిని గాచుచుంటిని. ఒక గోవును జంపి నా కిచ్చితివేని యీ ధనము నీ కిచ్చెదను" అనెను. ఆ వణిజుఁడు తప్పక గోవునువధించి తెచ్చియిచ్చెదనని చెప్పి ధనము గొనిపోయి పిమ్మట నాభూతముమాట తలఁపఁ డయ్యెను. అతఁడా యరణ్యమందే మరణించెను; తరువాతజన్మమున సగరునకుఁ బుట్టెను. ఇంకను ఆ భూతమునకుఁగోపము తీరలేదు; అసమంజసుని

నావేశించి యతనిచేబాలురను వృద్ధులను నదిలో బడవేయించుట మొదలగు పిశాచకార్యములను జేయించుచుండెను.పట్టణములోఆడుకొనుచుండిన బాలురనునదిలోముంచి తనయోగబలముచేఁగొన్ని దినములకు వారిని బైటకుఁదెచ్చుచుండె. ప్రజలు వానినిగూర్చి సగరునితోఁ జెప్పుకొనిరి. సగరుఁ డీతనిని నగరమునుండి వెడలఁగొట్టెను. ఇతనికి అంశుమంతుఁ డను కుమారుఁడు కలఁడు. అసమంజసుఁడు తుదకుఁ పిశాచబాధచేతనే మరణించెను. బ్రహ్మ.

అసిక్ని:- పంచజన ప్రజాపతి కుమార్తె. దక్షుని భార్య. అఘమర్షణతీర్థముకడఁ దపస్సుచేసికొను చుండిన దక్షునకు విష్ణువు ప్రత్యక్షమై సృష్టి చేయుటకై భార్యగఁ నైకొమ్మని యీమె నిచ్చెను. ఈమెయందుహర్యశ్వులు,శబలాశ్వులు అను పుత్రులను, భానువు, లంబ, కకుద్దేవి, విశ్వ, సాధ్య మొదలగు నలువదిమంది కుమార్తె లను జన్మించిరి. శివునిభార్యయైన సతి యీమె కుమారిత. భాగ. శివ.

అసితుఁడు:- సగరునితండ్రి. (చూడు. బాహువు) రామా.

అసితుఁడు:- భైరవ్యులలో నొకఁడు. (చూడుము భైరవులు)

అసితుఁడు:- ఒక ఋషి.

అసితుఁడు: సూర్యవంశమువాఁడైన భరతుని పుత్రుఁడు. శత్రువులకు భయపడి భార్యల తోడను, బుత్రులతోడను పాఱిపోయి భృగునా శ్రమమున నుండెను. ఇతని భార్య యొకతె కళింది. ఈమె గర్భిణిగనుండగ ఈమెసవతి సగరమైన (విషముతోఁగూడిన) భక్ష్యముపెట్టెను. అటకు వచ్చిన చ్యవనఋషినిజూచి ఈమె తనకుఁ బుత్రుఁడు కలుగున ట్లనుగ్రహింపు మనియె. గరసహితుఁడైన పుత్త్రుఁడు పుట్టుననియె. ఇతఁడు సగరుఁడు.

అసిలోముఁడు:- ఒకదనుజుఁడు. దేవాసురయుద్ధ మందు వాయువుతోఁ బోరాడెను. పిమ్మట విష్ణువుతోఁబోరి చంపఁబడియె.

అసురులు:- బ్రహ్మ జఘనమునుండి పుట్టి వాని తోడనే మిథునకర్మ మపేక్షించిరి. బ్రహ్మ నారాయణునికడకుఁ బరుగెత్తి రక్షింపుమని ప్రార్థించెను. బ్రహ్మను ఆదేహము విడువుమని నారాయణుఁడు చెప్పెను. బ్రహ్మ దేహమును విడువఁగ నందుండి సంధ్యారూపంబున లలనా రత్నము పుట్టెను. ఆమెను మోహించి యసురు లందఱును నామెను బట్టుకొనిరి. భాగ.

అస్తి-: జరాసంధుని కూఁతురు. ఈమెయు నీమె సోదరి ప్రాప్తియు కంసునిభార్యలు. కృష్ణుఁడు కంసునిజంపుట వీరు జరాసంధునితోఁ జెప్పు కొనిరి.అతఁడునుమధురపైకియుద్ధమునకువచ్చెను. విష్ణు.

అస్త్రములు:- భృశాశ్వునికుమారులు (చూడుము భృశాశ్వుఁడు)

అహంయాతి.- సంయాతి కుమారుఁడు. ఇతని భార్య భానుమతి. కుమారుఁడుసార్వభౌముఁడు. భార.

అహల్య:-(ముద్గలునికుమారిత) బ్రహ్మ అహల్యను సృజించి యీమె రూపమునకుఁ దగినవానికిచ్చి వివాహము చేయఁదలఁచి యుండెను. ఇంద్రాది దేవతలందఱువచ్చి నాకిమ్ము నాకిమ్ము అని కోరిరి. భూమిని ప్రదక్షిణము చేసి యెవఁడు ముందు వచ్చునో వాని కిచ్చెదనని బ్రహ్మ చెప్పెను. దేవతలు భూప్రదక్షిణము చేయుటకై పయనమయిరి. గౌతముఁ డొకచో సగ మీనిన గోవునుజూచి దానికిఁప్రదక్షిణముచేసి ముందుగ వచ్చెను. అయ్యది భూప్రదక్షిణమునకు సమాన మని యెంచి బ్రహ్మ అహల్యను గౌతమున కిచ్చెను. బ్రహ్మ.

అహల్యకు గౌతమునివలన నొకకూఁతురును, సూర్యేంద్రుల వలన నిరువురు కుమారులును బుట్టిరి. ఆ కుమారులు గౌతమునిసంతతి కాదని కూఁతురు తండ్రితోఁ జెప్పెను. అతఁడు పుత్త్రు లను సముద్రములో వేసి భార్యను శపించెను. తనగుట్టుబయల్పెట్టుటచేఁగోపమువచ్చి కూఁతుని నీవు గ్రుడ్డిదానివై యుండుము. నీయందు వానరుఁడు జన్మించునని యీమె శపించెను. వి. రా.

అహల్యయొక్క రూపముచూచి కామపీడితుఁడై యింద్రుఁ డీమె పొందును గోరుచుండువాఁడు. ఒక నాటిరాత్రి యింద్రుఁడు కోడి రూపమునవచ్చి కూసెను. ఆ కూఁతవిని తెల్లవారుచున్నదనుకొని కాలోచిత కృత్యములను దీర్చుకొనుటకై గౌతముఁడు గృహమును వెడలెను. ఇతఁడు వెళ్ళగనే యింద్రుఁడు గౌతముని రూపముతో వచ్చి యహల్య శయ్యాయందుఁ జేరెను. ఆమె వీనిని నిజముగఁ దన భర్తయే యనుకొనియె. అప్పుడర్ధరాత్రమే యగుటచే గౌతముఁడు తిరిగి వచ్చెను. గృహమునందు దన భార్య యింద్రుని జేరియుండుటఁ జూచి పాషాణమవై (శుష్క నదివై) యుండుమని యీమెను శపించి యింద్రునకును శాపమిచ్చెను. ఆమె యేపాపమెఱుఁగనని ప్రార్థించుటచే శ్రీరాముని పాదరజము తగిలినపుడు నీ రూపము మఱలఁ బొందుదువని గౌతముఁడు చెప్పెను.

వచ్చినవాఁడు తన భర్త కాఁడని యెఱుఁగకయే యీతని కోర్కెకియ్యకొనెను. ఇంతలో గౌతముఁడు వచ్చి ఆమెను అన్నము లేక గాలి మాత్రము భక్షించుచు నెవ్వరికిఁ గనఁబడకుండ నుండునట్లు శపించెను.

విశ్వామిత్రుఁడు యాగరక్షణమునకై శ్రీరాముని దీసికొనివచ్చి వానిని మిథిలకుఁ గొంపోవుచు ఈ ఱాతిని త్రొక్కుమనియె. అతని పాదరజము తగులఁగనే యహల్యకు శాపవిమోచన మయ్యెను. ఈమె లేచి రామలక్ష్మణులకు నమస్కరించి చనియె. ఈమెకు శతానందుఁ డను కుమారుఁడు కలఁడు. రామా.

అహీనుఁడు:-దేవానీకుని కుమారుఁడు. పారియాత్రుని తండ్రి. ఒక సూర్యవంశపురాజు. భాగ.

అహుఁడు:-శతాప్రజాపతుల కుమారుఁడు. ఇతని కుమారుఁడు జ్యోతి.

ఆ

ఆంగిరిష్ఠుఁడు:-ఒకరాజు. ధర్మార్థకామ విషయములను గురించి కామందకుఁడను ముని నడిగి తెలిసికొనెను. భార.

ఆంగి:-అరిహుని భార్య. మహాభౌముని తల్లి. భార.

ఆంగిరసి:-ఒక బ్రాహ్మణవనిత. పుత్రార్థినియై భర్తతో ఋతుకాల ప్రవర్తనములో నుండగ రాక్షస తనయున నున్న కల్మాషపాదుఁ డామె భర్తను మ్రింగివైచెను. శోక సంతప్తయై నీవు నీ భార్యను గూడినప్పుడు నీతల పగులునని వానిని శపించి, వసిష్ఠునివలన నీ కులము నిలుచునని యనుగ్రహించి తాను అగ్నిఁ బ్రవేశించెను. భాగ.

ఆంగిరసులు:-రథీతరుని భార్యయందు అంగిరసు మునివలనఁ బుట్టిన కుమారులు. వీరు రథీతర గోత్రులై తేజోనిధులైన బ్రాహ్మణులై వెలసిరి. భాగ.

ఆంజనేయుఁడు:-హనుమంతుఁడు. (చూడు.)

ఆంధ్రుఁడు:-సుతపుని కుమారుఁడైన బలి తనయుఁడు. అంగుఁడు, వంగుఁడు, కళింగుఁడు, సింహుడు, పుళింద్రుఁడు ఇతని సోదరులు. వీరు తూర్పు దేశములను పాలించిరి. ఆంధ్రుఁడు. పాలించిన దేశమున కతని పేరును బట్టియే యాంధ్రదేశమని పేరు వచ్చినది. భాగ.

ఆకర్కరుఁడు:- కద్రువ కుమారుఁడు. భార.

ఆకాశరాజు:- సుధర్ముని కుమారుఁడు. ఈతని కుమారిత పద్మావతి. ఈమెను వేంకటేశ్వరుఁడు చూచి వలచెను. ఆకాశరాజు పద్మావతిని వేంకటేశ్వరున కిచ్చి వివాహము చేసి తిరుపతిలో వేంకటేశ్వరునకు గుడి కూడ కట్టించి యిచ్చెను. వేం. మ.

ఆకూతి:-స్వాయంభువుని కూఁతురు; రుచి ప్రజాపతి భార్య. ఈమెకు (విష్ణుఁడు) యజ్ఞుఁడను కుమారుఁడును (లక్ష్మి) దక్షిణయను కుమారితయు జన్మించిరి. భాగ.

ఆకూతి:-విభుని కుమారుఁడైన పృథుషేణుని భార్య. ఈమెకుమారుఁడు నక్తుఁడు. భాగ.

ఆకూపారుఁడు:-ఒక వృద్ధతాఁబేలు. మార్కండేయునికంటెను పెద్దది. ఇంద్రలోకమునుండి భూలోకమునకు వచ్చిన ఇంద్రద్యుమ్నుఁ డను రాజును నిదియే పోల్చఁగలిగెను. భార.

ఆగ్నీధ్రుఁడు:-కుక్షిప్రియవ్రతుల పుత్త్రుఁడు. ఇతఁడు జంబూద్వీపమును నేకచ్ఛత్త్రముగ నేలెను. ఆగ్నీధ్రుఁడు పుత్త్రులకై తపస్సు చేయుచుండగ నతనియొద్దకు బ్రహ్మ పూర్వచిత్తియను నప్సరసను బంపెను. ఇతఁడామెను జూచి వలచి యామెనే భార్యగ గైకొనియె. నాభి, కింపురుషుఁడు, హరివర్షుఁడు, ఇలావృతుఁడు, రమ్యుఁడు, హిరణ్వంతుఁడు, కురుఁడు, భద్రాశ్వుఁడు, కేతుమాలుఁడు అనువార లితని కుమారులు. ఇతఁడు జంబూద్వీపమును తొమ్మిది ఖండములుగఁజేసి వానికిఁ దన కుమారులను రాజులుగఁ జేసెను. విష్ణు. భాగ.

ఆగ్నేయి:-ఊరుని భార్య. మత్స్య.

ఆటకి:-ఉషస్తి యనువాని భార్య. భార్యాభర్తలు కురుదేశమున నుండువారు. ఆదేశమున నొకసారి పాషాణవర్షము కురిసి పైరులు నశించెను; క్షామము మిక్కుటముగ నుండెను. ఆహార మలభ్యమగుటచే నీమె కృశించి యుండెను. ఉషస్తి యొక మావటివాని నడిగి యులవలను దెచ్చి యీమె కిచ్చెను. అంతకుఁ బూర్వమే యీమె యించుక భుజించి యుండుటచే వానిని భక్షింపక దాచి యుంచెను. మఱునాఁ డుదయమున నుషస్తి రాజుకడకుఁ బోవుటకైన నాకు శక్తి లేకయున్నది; నా కాహార ముండుచో దానిని భుజించి కొనిచెంతకేగి ధనము సంపాదించుకొని వచ్చియుందును గద! అని యనుకొనెను. ఆ మాట లాటకి విని తాను దాచి యుంచిన యులవలను భర్తకు దెచ్చి యిచ్చెను. ఛాన్దో. ఉ.

ఆణి మాండవ్యుఁడు:-చూడు. మాండవ్యుఁడు.

ఆత్రేయుఁడు:-వామదేవుఁడను ముని శిష్యుఁడు. శలుఁడను రాజునకు ఎఱవుగఁ దన గురుఁడిచ్చిన గుఱ్ఱములను మఱలఁదీసికొని రమ్మని గురువు పంపగ నితడు వెళ్ళెను; కాని రాఁజేయలేదు.

ఆదిగదాధరుఁడు:-మొదట గదధరించిన వాఁడు. విష్ణువే. గయాసురుని స్థిరీకృతునిఁ జేయుటకై గదను ధరించెను. వాయు.

ఆదిత్యకేతువు:-గాంధారీధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

ఆదివరాహము:-భూమి రసాతల మగ్నమై యుండగ విష్ణు వెట్టిరూపము దాల్చి యుద్ధరించెదనని యాలోచించి వరాహరూపము దాల్చి దంతములచే భూమిని బైకెత్తి నిల్పెను. అదియే ఆదివరాహరూపము. విష్ణు.

ఆధూర్తరజురజసుఁడు:-కుశుని కుమారుఁడు. ధర్మారణ్యమును పాలించెను. రామా.

ఆనందుఁడు:-చాక్షుషువు విక్రాంతు నింటఁ బెరుగుచున్నపు డతనికి విక్రాంతుని భార్య పెట్టిన పేరు. (చూడు చాక్షుషువు)

ఆనకదుందుభి:-వసుదేవుఁడు. కృష్ణుఁడు జన్మించినపు డితని గృహమున దుందుభులు మ్రోగెను. హరి.

ఆనకుఁడు:-వసుదేవుని తమ్ముఁడు.

ఆనర్తము:-యవనసముద్ర తీరమున ద్వారకకు సమీపముగ నున్న యొక దేశము. దాని నానర్తుఁడను రాజు పాలించుటచే నీ పేరు వచ్చెను.

ఆనర్తుఁడు:-శర్యాతికుమారుఁడు. భాగ. మత్స్య.

ఆనర్తుఁడు:-సంయాతి కుమారుఁడు. ఇతఁడు పాలించినదే యానర్తదేశము. ఇతని కుమారుఁడు రోచమానుఁడు (రైవతుఁడు.) భాగ. మత్స్య.

ఆపస్తంబుఁడు:-ఒక ఋషి. యజుర్వేద విహిత కర్మలను సూత్రములుగఁ జేసెను.

ఆపుఁడు:-అష్టవసువులలో నొకఁడు. ఇతని కుమారులు శాంతుఁడు, దండుఁడు, మణివక్త్రుఁడు. మత్స్య.

ఆపుఁడు:-ఒక యగ్ని. ఇతని భార్య సుదితి. వీరి కుమారుఁడు అద్భుతుఁడు. ఇతడు దేవతలకు హవ్యములను మోసికొని వెళ్ళువాఁడు. కొంత కాలమైన పిదప నాపని చేయలేక దాని నథర్వుఁడనువానికి నప్పగించి తాను సముద్రములో దాగి యుండెను. దేవతలు వీనికై వెదకఁ జొచ్చిరి. ఇతఁడు దాగి యుండినచోటు చేపలు చెప్పినవి. అందుకుఁ జేపలపైనాపునకుఁ గోపమువచ్చి మిమ్ము జనులు వధింతురని వానిని శపించెను. పూర్వపుఁ గార్యము

చేయుచుండునని దేవతలు వీనిని గోరిరి గాని యాతఁ డిష్టపడక మేను విడచెను.

అతని శరీరము నుండియే గంధకము మొదలగునవి పుట్టెను. భార.

ఆప్రవానుఁడు:- చ్యవనుని పుత్త్రుఁడు. ఇతని భార్య ఋచి. ఈమెయందు ఔర్వుఁడను పుత్త్రుఁడు జన్మించెను. బ్రహ్మ.

ఆయతి:- మేరువు కుమారిత; ధాతభార్య. ఈమె కుమారుఁడు ప్రాణుఁడు. బ్రహ్మ.

ఆయువు:- ఊర్వశియందుఁ బురూరవునకుఁ బుట్టిన కుమారుఁడు. పురూరవుని మరణకారకులైన మునులను వధించుటకై యితని సోదరులు బైలు వెడలిరి. ఇతఁడు వారిని మందలించి వారితోఁ బోరాడి వారియత్నమును మాన్పించెను. ఇతని భార్య స్వర్భానవి. నహుషుఁడు, వృద్ధశర్మ, గయుఁడు, అనేనసుఁడు ఇతని పుత్త్రులు. బ్రహ్మ.

ఆయువు:- నహుషుఁడు, క్షత్త్రవృద్ధుఁడు, రజి, రంభుఁడు, అనేనసుఁడు అనువారు పుత్త్రులు. భాగ.

ఆయువు:- ఒక మండూకరాజు. ఇతనికి సుశోభన యను పుత్త్రికకలదు. ఆమె నారీరూపముదాల్చి రాజులను మోహింపఁ జేయుచుండును. ఆమె కొంతకాలము పరీక్షిత్తు అను రాజునకు భార్యయై యుండె. ఈదంపతులొకనాడాయువుండిన కొలనులో దిగిరి. అంతసుశోభన యదృశ్యమయ్యె. ఆమె నా కొలనులోనున్న కప్పలు హరించెనని పరీక్షిత్తు కప్పలను జంపింపఁజొచ్చెను. అంతట వాయువు వృద్ధబ్రాహ్మణ రూపమున వచ్చి సుశోభన తన కుమారిత యని చెప్పి కప్పలను బాధింపవలదని వేడెను; సుశోభనను దెచ్చి తనకిచ్చినగాని మాననని పరీక్షిత్తు చెప్పఁగ వాయువు తన పుత్త్రికనుదెచ్చి రాజునకిచ్చెను. అట్లు పలురాజులను వంచన చేసినందుకు తన కుమారితను ఆమె పుత్త్రులు కపటవర్తనులగుదురని శపించెను. భార.

ఆయుష్మంతుఁడు:- ప్రహ్లాదుని కుమారుఁడు. మత్స్య.

ఆర్యకుఁడు:- ఒక భుజంగరాజు. ఇతని కుమారుఁడగు చికురుఁ డనువానిని గరుడుఁడు సంహరించి యితని మనుమఁడగు సుముఖుని గూడఁ జంపుదునని యార్యకుని భయపెట్టెను. ఆర్యకుఁ డా దుఃఖములో నుండగనే మాతలి వచ్చి తన కూఁతుని సుముఖునకు భార్యగ గ్రహింపుమని కోరెను. సుముఖుఁడు చిరకాలము జీవింపఁడనియు, గరుడుఁడు వానిని జంప నున్నాఁడనియును గావున వానికి వివాహముచేయుననియును నార్యకుఁడు ప్రత్యుత్తరమిచ్చెను. సుముఖునకు హాని రాకుండఁ జేయుమని మాతలి యింద్రుని వేడుకొనియె. ఇంద్రుఁడు విష్ణువుతోఁ జెప్పెను. ఇంద్రుఁడును, విష్ణువును సుముఖుని చిరాయువుగఁ జేసిరి. పిమ్మట నార్యకుఁడు సుముఖునకు మాతలికూఁతు నిచ్చి వివాహము చేసెను. భార.

ఆర్ష్టిషేణుఁడు:- ఒక రాజు. ఇతని భార్య జయ. ఆమెయందితనికి భరుఁడను కుమారుఁడు జన్మించెను. పుత్త్రుఁడు పెద్దవాఁడైనపిమ్మట రాజ్యమాతని కప్పగించి యార్ష్టిషేణుఁడు భార్యాసహితుఁడై గంగాతీరమున కేగెను. అచ్చట యాగము చేయుచుండగ, నితనిని నితనిభార్యను, ఋత్విజుని గూడ మిథువను రాక్షసుఁడు రసాతలమున కెత్తుకొని పోయెను. వీరి నందఱను ఋత్విజుని కుమారుఁడైన దేవాపి యనువాఁడు బైటకుఁదీసికొని వచ్చెను. బ్రహ్మ.

ఆషాఢభూతి:- దేవశర్మయను సన్న్యాసి యొకఁడుండెను. వాఁడు కడు లుబ్ధుఁడు. వాని కెవ్వరే మిచ్చినను దానిని విక్రయించి యా సొమ్మును నొక బొంతలోఁ బెట్టి యా బొంతను సదా తన యొద్దనే యుంచుకొనువాఁడు. వీనియొద్ద నంత ధనముండిన ట్లాషాఢభూతియనువాని కొకనికే తెలియును. వాఁ డెట్లయినను అధనముపహరింపఁ దలఁచుకొనెను. దానిని దస్కరింపయత్నించెను గాని యది వీలుకాకుండెను. ఉపాయముచే దాని నపహరింపనిశ్చయించుకొని యాషాఢభూతి దేవశర్మదగ్గఱకు వెళ్ళి, అయ్యా, న న్నుద్ధరించు భారము మీదే. సంసారబాధలకు రోసి దానిని విడిచి వచ్చితిని. శరీరసౌఖ్యములు బుద్బుద ప్రాయములుగదా! ధనమా చంచలము. వానితో

నాకుఁ బనిలేదు. నన్ను మీ శిష్యునిగాఁ గైకొనుఁడు మీ సేవచేసి తరింపనిండు అని వేడెను. దేవశర్మ వీనినినమ్మి శిష్యుఁడుగ గైకొనెనుగాని బొంత వీనికిచ్చుటలేదు. ఆషాఢభూతి యితరుల చీపురుముక్కైనను దనబట్టలకంటుకొనుచో దేవశర్మ చూచుచుండగ దానిని దీసి యిచ్చివేయువాఁడు. ఇట్లు వర్తించుటచే నీతనియందు దేవశర్మకు నమ్మకము కుదిరి ప్రయాణములో నొకసారి బొంతను బట్టుకొనుమని యిచ్చెను. అది పుచ్చుకొనినవెంటనే యాషాఢభూతి పరుగెత్తుకొనిపోయెను. పంచ.

ఆసందివ్రుఁడు:- ఒక బ్రాహ్మణబాలుఁడు. వీనికిఁ దండ్రి పెండ్లిచేయ నేర్పాటులు గావించి ముహూర్తనిశ్చయముకూడఁజేసెను. కాని పెండ్లి మఱునాఁ డనగ రాక్షసి యొకతె వచ్చి వీని నపహరించి గొంపోయె. అదియు బ్రాహ్మణ స్త్రీవేషము వేసికొని యీ బాలుఁడు తన కుమారుఁడేయని చెప్పుచుండును; మఱియుఁ దనయిష్టము చొప్పున వర్తింపడేని మ్రింగివేసెదనని యీ బాలుని భయపెట్టుచుండును. ఆరాక్షసియే యొక బ్రాహ్మణబాలికను దెచ్చి యాసందివున కిచ్చి వివాహముచేసెను. ఆసందివుఁడు భార్యనుజూచి యేడ్చెను. నీవేలయేడ్చెదవని భార్యయడుగఁగ నీమె నాతల్లిగాదు. ఇది రాక్షసి నన్ను మ్రింగి వేయుదునని భయపెట్టు చుండును. నీవును భక్షింపఁబడుటకే తేఁబడితివిగదా! యని విచారించుచుంటినని యాసందివుఁడు చెప్పెను. గౌతమీతీరమున కేగి యచ్చట విష్ణువును బ్రార్థించుచో నెట్టిభయమును గలుగదని యామెచెప్పెను. ఈదంపతులు గౌతమీతీరమును జేరిరి. ఆసందివ్రుఁడు విష్ణువునుగూర్చి తపస్సు చేసెను. వీనికి విష్ణువు ప్రసన్నుఁడై వరములిచ్చి యా రాక్షసిని జంపెను. బ్రహ్మ.

ఆసురి:- ఒక బ్రాహ్మణుఁడు. విష్ణుఁడు కపిలావతారమున నితనికిఁ దత్త్వగ్రామ నిర్ణయంబుగల సాంఖ్యంబు నుపదేశించెను. భాగ.

ఆస్తీకుఁడు:- జరత్కారుఁడను మునిపుత్త్రుఁడు ఇతనితల్లి జరత్కారువను నాగకాంత. ఇతఁడు ప్రమతియొద్ద వేదశాస్త్రము లభ్యసించి చిన్నతనములోనే సకల విద్యాపారంగతుండయ్యెను. జనమేజయుఁడు చేయుచుండిన సర్పయాగమును మాన్పించుట కితఁడే సమర్థుఁడని యెఱిఁగి జరత్కారు వీతనిని జనమేజయునొద్దకుఁ బోయి యాగము మాన్పించుమని కోరెను. ఆస్తీకుఁడు యాగము చేయుచుండినట్టి జనమేజయునొద్దకేగి తన విద్యాబుద్ధులచే వానిని మెప్పించెను. జనమేజయుఁడు సంప్రీతుఁడై యీ బ్రాహ్మణుని సత్కరింప దలఁచుకొనెను. ఆస్తీకుఁడు సర్పయాగము సేయుట పాడిగాదని బోధించి జనమేజయుడుచేయు యాగము మాన్పించెను. భార.

ఆహుక:-ఆహుకునిభార్య. (చూడు. ఆహుకుఁడు)

ఆహుకుఁడు:-భిల్లవంశజుఁడు ఇతనిభార్య ఆహుక. వీరు శివభక్తులు. వీరిభక్తి పరీక్షించుటకై శివుఁడొకనాఁడు యతిరూపమునవచ్చి వారిచోటును దనకిమ్మని కోరెను. తమకున్న స్థల మతిస్వల్పమగుటచే నివ్వలేనని యాహుకుఁడు పలికెను. యతికిఁ గోపమువచ్చి వెళ్ళిపోవుచుండెను. ఆహుక దానిఁజూచి యతని నాదరింపవలెఁగాని యిట్లనాదరణ సేయరాదని వానిం బిలిపించెను; తాను వీథిలోఁ బరుండెదననియు, దమ గుడిసెయందలి స్వల్పస్థలమును యతి కిమ్మనియు నామెభర్తతోఁ జెప్పెను. ఇతఁడు తానే బైటఁ బరుండెదనని చెప్పి యతికి స్థానమిచ్చి తాను వీథిలోఁ బరుండెను. ఆ రాత్రి పులి యొకటి వచ్చి యాహుకుని మ్రింగివేసెను. మఱునాఁ డుదయ మాహుక భర్త మరణించియుండుట చూచి వాని కగ్నికార్యములు చేసి తాను చితి పేర్చుకొని యగ్నిముట్టించి దానిపై నెక్కబోయెను. అపుడు శివుడు ప్రత్యక్షమై నీ పాతివ్రత్యమునకును భక్తికిని మెచ్చుకొంటిని. వరము వేడుమనియెను. నీకుఁదోఁచినదే యనుగ్రహింపుమని యామె యనియె. ఈ భిల్లుఁడు నలుఁడను రాజైపుట్టును. నీవు దమయంతివగుదువు. నేను హంసనై మీ యిద్దఱకును సమాశము చేసెదనని శివుఁడనుగ్రహించి యంతర్ధానుఁడయ్యె. శివ.

ఇ

ఇందీవరాక్షుఁడు:- నలనాభుఁడను గంధర్వరాజు కుమారుఁడు. వరూధినికిఁ దోడఁబుట్టినవాఁడు. బ్రహ్మమిత్రుఁడను ముని శిష్యులకు నాయుర్వేదము చెప్పుచుండఁగ నితఁడును దనకుఁ జెప్పుమనియె. ముని చెప్పననినందున నితఁడు మాయ చేసి యదృశ్యుఁడై యుండి నేర్చుకొని తుదకు మునిని బరిహసించెను. మాయచేసి నేర్చుకొంటివి గావున నసురుఁడవుకమ్మని బ్రహ్మదత్తుఁడు శపించెను. ఇతఁడు రాక్షసియై నిజకుమారిక మనోరమనే భక్షింపఁ బోయెను. ఆమెయాలాపములు స్వరోచివిని యామెను గాపాడుటకై రాక్షసునితో యుద్ధముచేసెను. వీనిపై నాగ్నేయాస్త్రము ప్రయోగింపఁగ నితఁడు రాక్షస రూపము విడిచి తన పూర్వరూపము ధరించెను. మార్కం

ఇందుమతి:- భోజునికుమారిత. ఈమె స్వయంవరమునం దజుని వరించెను. అజుఁ డీమెను నిజనగరమునకుఁ గొనివచ్చుచుండఁగ స్వయంవరమునకు వచ్చిన యితరరాజకుమారు లజుని నెదుర్కొనిరి. వారితో యుద్ధముచేసి గెలిచి యజుఁ డిందుమతీసహితుఁడై నిజనగరోద్యానవనము ప్రవేశించెను. అందు దంపతులు ముచ్చటగ విహరించుచుండిరి. అంతలోనే దేవలోకమునుండి వచ్చుచున్న నారదుని వీణనుండి సురపుష్పమాల యెగిరి వచ్చి యామె కంఠమునఁబడెను. అది పడఁగనే యామె నిశ్చేష్టురాలై పడిమృతినొందెను. ఈమెకై పరితపించుచుండిన యజునియొద్దకు నారదుఁడువచ్చి రాజు నోదార్చియామెవృత్తాంతమిట్లు చెప్పెను. ఈమె పూర్వజన్మమున హరిణియను దివ్యాంగన. తృణబిందుఁడను ఋషి తపస్సుచేసికొనుచుండగ వానితపస్సునకుభంగముచేయఁదలఁచి యింద్రుఁ డీమెనుబంపెను. ఈమె వచ్చి తన నృత్తగానాదులచే మునియాశ్రమమున సందడిగావించెను. ఆతనికిఁగోపమువచ్చి నీవుమనుష్యభామినివికమ్మని శపించెను. ఆమె శాపవిమోచనము ప్రసాదింపుమనిప్రార్థింపఁగ సురకుసుమదామము నీమెడపైఁబడుదాక యుందువు; అది పడఁగనే నీరూపము నీవు పొందుదువని యనుగ్రహించెను. సురకుసుమమాల పడెను గాన నామె యిపుడు పూర్వపురూపునొందెను. రఘు.

ఇంద్రజిత్తు:- రావణుని పెద్ద కుమారుఁడు. ఇతని పేరు మేఘనాథుఁడు. ఇతఁడు మాహేశ్వర క్రతువు చేసెను. తండ్రితో నితఁడును నింద్రుని మీఁదకు యుద్ధమునకు వెళ్ళెను. ఇంద్రుఁడు రావణు నోడించి వానిని బంధించెను. మేఘనాథుఁడు విజృంభించి రాక్షసమాయలు పూని యదృశ్యుఁడై యుద్ధము చేయుచు నింద్రు నోడించి తన తండ్రిని విడిపించెను. మఱియు నింద్రుని బంధించి తనతో లాగికొనిపోవుచుండఁగ, బ్రహ్మవచ్చి బ్రతిమాలి యింద్రుని విడిపించెను. ఇంద్రు నోడించుటచే నింద్రజిత్తు అను పేరు వచ్చినది. ఇతఁ డమరత్వమును గోరను గాని బ్రహ్మయివ్వలేననియె.

సీతను రామునకిచ్చి యాతనితో మైత్రిచేయుమని విభీషణుఁడురావణునితోఁ జెప్పెను. ఆమాటలకు నింద్రజిత్తాక్షేపణచేసి యుద్ధము సేయుటే మంచిదనియె. యుద్ధము ప్రారంభించినతోడనే యితఁడు రణరంగమునకు రాలేదు; కొందఱు రాక్షసవీరులు తెగినపిమ్మట గురూపదేశముగైకొని హోమము చేసెను. హోమగుండమునుండి పసిడి రథము వచ్చెను. దాని నెక్కి యింద్రజిత్తు రణరంగమునకు వచ్చెను. వచ్చినప్పటినుండియు నొక్కపెట్టున యుద్ధము చేయఁజొచ్చెను. మొదట నంగదునితోఁబోరాడి యోడెను గాని యప్పటినుండి తనరాక్షస మాయలను బ్రయోగించెను. తన మాయాయుద్ధముచేఁ గపిసేనలను నొప్పించెను. మఱియు నితఁడునాగాస్త్రము వేసి రామలక్ష్మణులను బంధింపఁ జేసెను. హనుమంతుఁడు మందుతెచ్చి యిచ్చిన వారు మరల లేచి యుద్ధమునకు వచ్చిరి. వీరిని గెల్చుట దుస్తరమగుచుండెను. కావున వీరిని గలత నొందింపవలెనని మాయాజానకినిసృజించి, ఇదిగోజానకినిఖండించుచున్నాను, చూడుఁడని ఖండించెను. రాముఁడు నిజమే యనుకొని దుఃఖము నొందెను. తరువాత నిజము తెలిసికొని వీనితోడనే బోరెను. ఇంద్రజిత్తెక్కుడు బలముతోఁబోరాడుటకై యాగము

చేయఁబోయె. విభీషణుఁ డదియెఱింగి, యాగము పూర్తియగుచో నింద్రజిత్తజేయుఁడగును గాన నది పూర్తికాకుండనే వానిం జంపుడని రామ లక్ష్మణులకుఁ జెప్పెను. మఱియు నింద్రజిత్తుండిన చోటును లక్ష్మణునకు విభీషణుఁడే కనపరచెను. వానరవీరు లింద్రజిత్తు సేనలతోఁ బోరాడిరి. లక్ష్మణేంద్రజిత్తులు దివ్యాస్త్రములతోఁ బోరాడిరి. తుద కింద్రజిత్తు లక్ష్మణునిచే వధింపఁబడియె. రామా.

ఇంద్రద్యుమ్నము:-ఒక కొలను. ఇంద్రద్యుమ్నుడనురాజు దానముచేసిన గోవుల త్రొక్కుళ్ళచే నది యేర్పడియెఁ గాన నీపేరు వచ్చెను. భార.

ఇంద్రద్యుమ్నుఁడు:- అవంతిరాజు. ఇతఁడు రాజ్యము విడచి పరమ భాగవతోత్తముఁడై భగవత్ప్రీతిమను సంపాదింప స్థిరసంకల్పముతో దక్షిణాపథముగ వచ్చెను. ఇతఁడు సదా విష్ణుమూర్తినే ధ్యానించుచుండుటచే విష్ణు వీతని కలలోఁ బ్రసన్నుఁడై భగవత్ప్రీతిమలు పొందు నుపాయము చెప్పెను; ఆప్రకార మింద్రద్యుమ్నుఁడు సముద్రతీరమునకేగెను; అచ్చటనశ్వత్థ వృక్షముక్రింద విప్రవేషముతో నున్న యిరువురిను జూచెను. త్రిమూర్తుల ప్రతిమలనుజేసి యిమ్మని యింద్రద్యుమ్నుఁడు వారిని గోరెను. వారిలో విశ్వకర్మ యొకడుండెను గాన నతఁడు దివ్యమంగళ సుందర విగ్రహములను జేసియిచ్చె. ఇతఁడావిగ్రహములను బూజించి విగ్రహములు చేసిన వారిని భగవత్స్వరూపులుగ నెఱింగి ప్రార్థించి స్వర్గమును బొందెను. బ్రహ్మ.

ఇంద్రద్యుమ్నుఁడు:-ఒకరాజు. ఇంద్రలోకమున నుండువాఁడు. ఇతనికీర్తి మాయుటవలన దేవతలు వీనిని నీవిట నుండఁదగవు. భూలోకమునకు బొమ్మనిరి. ఇతఁడు భూలోకమునకు వచ్చె. అంతయుఁ గ్రొత్తగనుండెను. ఇంద్రద్యుమ్నుఁడు మార్కండేయునొద్దకుఁ బోయి నన్నెఱుఁగు దువాయని యడిగెను. నేనెఱుఁగను, నాకంటె పెద్దవాఁడు ప్రావారకర్ణుఁ డనువాఁడు (గుడ్లగూబ) కలఁడు. వానినడుగుమని మార్కండేయుఁ డనెను. వీరు వెళ్ళి ప్రావారకర్ణుని నడిగిరి. అది నిన్ను నే నెఱుఁగను. నాకంటెఁ బెద్దది నాళీజంఘుఁడను కొంగగలదు. దానినడుగుదమనియె వారు ముగ్గురును కొంగదగ్గఱకువెళ్ళి యట్లేయడిగిరి. అదియు, నిన్ను నే నెఱుఁగను. నాకంటె బెద్దవాఁడుఅకూపారుఁడనుతాఁబేలుకలదు. దాని నడుగుదమనియె. వీరంఱును దాఁబేలుకడకుఁ జనిరి. ఆ తాఁబేలు నిన్ను నే నెఱుఁగుదును. నీ వింద్రద్యుమ్నుఁడను రాజవు. నన్నుఁ బెక్కుసారులు కాపాడితివి. నీ వనేక యజ్ఞములు చేసితివి. నీవు దానమిచ్చిన గోవుల త్రొక్కుడు చేతనేగదా ఈకొలను ఏర్పడినది అని చెప్పెను. అతఁ డట్లు పలుకుటతో నీకీర్తియింకను ఈలోకమున నున్నది కావున నీవు ఇంద్రలోకవాసమునకర్హుండవు రమ్మని దూతలువచ్చిరి. మార్కండేయుఁడు నెక్కడివారిని అక్కడనే దిగవిడచి పిమ్మట వెళ్లెను. భార.

ఇంద్రద్యుమ్నుఁడు:- ఒక బ్రాహ్మణుఁడు. మోహిని స్వరూపమును జూచి నీ వెవ్వరవని యడిగెను. ఆమె మాయనని తెల్పెను. మాయను దాటుట కుపాయము చెప్పుమని యితఁడుకోరగ నీశ్వరారాధనమే సాధనమని యామె తెల్పెను. కూర్మ.

ఇంద్రద్యుమ్నుఁడు:-ద్రవిడదేశాధీశుఁడు. ఇతని కడ కొకసారి అగస్త్యుఁడు రాఁగా నితఁడు కూర్చుండి లేవలేదు. అందువలన నీవు గజమవై పుట్టుమని ముని శపించెను. ఇతఁడే మొసలిచేఁ బట్టుకొనఁబడిన గజేంద్రుఁడయ్యె. భాగ.

ఇంద్రప్రమితి:- పైలుని శిష్యుఁడు. ఇతఁడు ఋగ్వేద సంహితను బాష్కల యాజ్ఞవల్క్యాదులకు బోధించెను.

ఇంద్రప్రమితి:- పైలుఁడు ఋగ్వేదమును చతుర్విధంబులుగా విభజించి తనశిష్యులగు ఇంద్రప్రమితి మొదలగువారి కుపదేశించెను. ఇంద్రప్రమితి తన సంహితను మాండుకేయునకుపదేశించెను. భాగ.

ఇంద్రప్రస్థము:- పాండవుల కర్ధరాజ్య మిచ్చిన తరువాత ఖాండవప్రస్థమున వారు నిర్మించుకొనిన పట్టణము. ఈ పట్టణము నిర్మాణమునకై కృష్ణుఁ డింద్రునితోఁ జెప్పెను. ఇంద్రుఁడు విశ్వకర్మను రావించెను. విశ్వకర్మ దేవతలపట్టణముతో సమానముగ దీనిని నిర్మించెను. భార.

ఇంద్రమాల:-ఒక కమల మాలిక. ఎన్నడును వాడదు. దీని నెవరు ధరించినను వారిని ఆయుధములు తాకవు. ఈమాలికను ఇంద్రుఁడు ఉపరిచరవసువున కిచ్చెను. భార.

ఇంద్రవర్మ:-మాళవదేశాధీశుఁడు. భారతయుద్ధములో దుర్యోధనుని పక్షమునఁ బోరెను. ఇతని యేనుఁగే అశ్వత్థామ. దీనిని భీముఁడు చంపెను. భార.

ఇంద్రవాహనుఁడు:-ఇతఁడే కకుత్స్థుఁడు. ఇంద్రుని వాహనముగాఁ గొనుటచే ఈపేరు వచ్చెను.

ఇంద్రసావర్ణి:-పదునాల్గవ మనువు. ఇతని కాలమున నింద్రుఁడు శుచి యనువాఁడు. దేవతలు పాక్షుపాద్యులు.

ఇంద్రసేన:- నలదమయంతుల పుత్త్రిక. భార.

ఇంద్రసేన:-మౌద్గల్యుఁడను మునిభార్య. ఈమె భర్త కుష్ఠవ్యాధిబాధితుఁడైనను, దుర్గంధవదనుఁడైనను వాని సేవగింపక పతిభక్తి కలుపునుండెను. ఒకనాఁడు భర్త యుచ్ఛిష్టము దినుచుండఁగ నన్నములో వ్యాధిచే నూడిపడిన భర్త వ్రేలు వచ్చెను. అయినను నసహ్యమునొందక దానిని దీసివేసి యా యన్నమునే భుజించెను. మౌద్గల్యుఁడామె భక్తికి మెచ్చుకొని నీవేమికోరినను నిచ్చెదను కోరుకొనుమనియె. నాకు గామభోగేచ్ఛ మెండుగాఁగలదు. నీ తపఃప్రభావమున మనోహరంబైన రూపంబునఁ బంచధా విభక్తుండవై నన్నురమించి కామభోగములను దనుపుమని యామె కోరెను. మౌద్గల్యుఁ డామె కోరినవిధమున నైదుదేహములుదాల్చి మర్త్యదేవలోకములను నామెను ద్రిప్పుచుఁ బెక్కేండ్లామెతో విహరించి తుదకామెను విడచి తపస్సుచేసికొనుట కరిగెను. ఈమె కింకను భోగేచ్ఛ తగ్గినదికాదు. కాలవశమున శరీరము విడచి కాశిరాజునకుఁ గుమారితగఁ బుట్టెను. కన్యాత్వమునఁ బెద్దకాలముండి తన దౌర్భాగ్యమునకుఁ జింతించి యీశ్వరునిగూర్చి ఘోర తపస్సు చేసెను. ఆమె తపమునకు బ్రీతులై యముఁడు, వాయువు, ఇంద్రుఁడు, అశ్వినులు వచ్చి చూచి యామెను బత్నిగాఁ గోరిరి. ఆమె యింకను ఘోరతపస్సు చేయఁగ నీశ్వరుఁడు ప్రత్యక్షమయి వరము వేడుకొనుమనియె. నాకుఁ బతి కావలయును. నాకుఁ బతి కావలయునని యైదుమారు లడుగుటచే నీకేవురు భర్తలగుదురని ఈశ్వరుఁడు వచించె. భర్తకు భార్యలు పెక్కండ్రుండుట సంభవముగాని యేవురు భర్తలకు నేనొక్కతెను భార్యనగుట యెట్లని? యామె యడిగెను. నావచనమున నీవు ధర్మమెడపక యుందువు. కావున నిట్టివరము నీ కిచ్చితిని అని శివుఁడుపలికె. శివుఁ డామెకుఁ గౌమారంబును బతిశుశ్రూషాసిద్ధియు నొసంగి గంగానదికడనున్న యింద్రుని దనకడకుఁదోడి తెమ్మని పంపెను. ఈమె వానిం గొనిపోయె. ఈశ్వరుఁ డింద్రునిఁ బంచేంద్రులను జేసెను. (చూడు పంచేంద్రులు) ఈమెయే ద్రౌపదిగఁ బుట్టెను. భార.

ఇంద్రసేనుఁడు:- నల దమయంతుల పుత్త్రుడు. వీని పుత్త్రుడు చంద్రాంగదుఁడు.

ఇంద్రసేనుఁడు:- శర్యుఁడను రాజకుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు వీతిహోత్రుఁడు. భాగ.

ఇంద్రుఁడు:- దిక్పాలురలో నొకఁడు; తూర్పు దిక్కున కధిపతి. ఇతఁడొక దిశను బాలించువాఁడైనను దేవలోకమున కంతకును నాథుఁడే. ఇంద్రుఁడనునది యొకని పేరుగాదు. ఇంద్రపదవియందున్న ప్రతివాఁ డింద్రుఁడనఁబడుచుండును. ఆ పదవి మన్వంతరములను బట్టియు, వారువారు చేయుపనులను బట్టియు మారుచుండును. నూరు క్రతువులు చేసినవాఁ డింద్రుడు కాఁగలఁడు. ఉత్తమమన్వంతరమున సుశాంతుఁడనువాఁ డింద్రుఁడయ్యెను; రైవత మన్వంతరమున విభుఁడనువాఁ డింద్రుఁడు; చాక్షుష మన్వంతరమున మనోజవుఁడింద్రుఁడు. నహుషుఁ డింద్రుఁడై యచిర కాలములోనే భ్రష్టుఁడయ్యెను.

ఇంద్రుఁ డదితిపుత్త్రుఁడు. విష్ణువితని తమ్ముఁడుగ నదితి గర్భమున జన్మించెను. ఇంద్రుని భార్య శచీదేవి. ఇతనికి జయంతుఁడను పుత్త్రుఁడును జయంతి యను పుత్త్రికయుఁ గలరు. ఇంద్రుని వాహన మైరావత మను యేనుఁగు. ఇదియు నితనిగుఱ్ఱమగు నుచ్చైశ్శ్రవమును బాల

సముద్రమునుండి పుట్టినవి. వజ్రాయుధ మితని యాయుధము.

దేవాసురులకు యుద్ధమైనపుడు దేవతలు గెల్చిరి ఈజయము వారిమాహాత్మ్యమే యనుకొనిరి; వారు పరబ్రహ్మము నెఱింగినవారుకారు. వారికిఁ బరబ్రహ్మము గోచరించెను; అదిచూచి యెవ్వరో యనుకొనిరి. వానిని దెలిసికొనుటకై యగ్నిని బంపిరి; వాయువునుబంపిరి కాని వారు తెలిసికొనలేకపోయిరి. అపు డింద్రుఁడు వెళ్ళెను. ఆ స్వరూపము అదృశ్యమయ్యెను అచ్చటనే యొకశోభనగాత్రి, ఉమ యుండెను. ఆమెను నింద్రుడు ఆయదృశ్యమైన యక్షుఁ డెవరని? యడిగెను. అతఁడే పరబ్రహ్మము. అతని వలననే మీరు గెల్చితిరి అనియామె తెలియపఱచెను. పరబ్రహ్మ సమీపమునకేగుటచే నింద్రాగ్నివాయువులు దేవతలలో శ్రేష్ఠులైరి. మఱియు బ్రహ్మమును నింద్రుఁ డెఱింగెను గావున నతఁడు దేవతలలో నగ్రగణ్యుఁ డయ్యెను. కే. ఉ.

ఇంద్రుఁడమృతమును దేవలోకమునఁ బెక్కుకాపులుపెట్టి యతిజాగరూకతతోఁ గాపాడుచుండెను. గరుత్మంతుఁడు వానినన్నిఁటిని దాటి యమృతము నపహరించిపోవుచుండఁగ వానిపై వజ్రాయుధము వేసెను. దానివలన గరుత్మంతుని ఱెక్కయీఁకలలో నొకటి మాత్రము రాలెను. గరుత్మంతుని శక్తి ప్రభావములకు మెచ్చుకొని వానితో నింద్రుఁడు సఖ్యముచేసి యమృతమును నొరుల కీయవలదని వేడెను. కాని గరుత్మంతుఁడు తనతల్లి దాస్యము వాపుటకు నమృతము కాద్రవేయుల కియ్యవలసియుండెను గాన నితఁడు వారికిఁ గొంపోయి యిచ్చెను. వారు దానిని గ్రోలుటకు స్నానము చేసి వచ్చులోపున నింద్రుఁడేగి యమృతమపహరించి దాని యథాస్థానమునసుంచి కాపాడుచుండెను. భార.

నైమిశారణ్యమున వైవస్వతుఁడు సత్రయాగము చేయుచున్నపుడు మనుజులు మరణము లేక యుండిరి. అపు డింద్రుఁడును, దేవతలును బ్రహ్మకడకుఁబోయి మనుజులకును, నమరులకును భేదములేకుండఁ బోయెనని చెప్పికొని విచారించిరి. యముఁ డతని పని నతఁడు నెరవేర్చును; మీ వీర్యమున నైదుగురుపుట్టి యమునకుఁ దోడ్పడుదురు; విచారింపకుఁడని బ్రహ్మ చెప్పెను. వారు తిరిగివచ్చుచు గంగానదిలో నేడ్చుచుండిన యొక యువతిని జూచిరి. ఆమె బాష్పములు బంగారుకమలము లగుచుండిన నింద్రుఁడాశ్చర్యమొంది నీ వెవ్వరవని? యామె నడిగెను. నన్నెఱుఁగవలతేని నాతోఁగూడ రమ్మని యామె ఈశ్వరుఁడు తన దేవితో జూదమాడుచున్న చోటునకుఁ దీసికొని పోయెను. అపు డీశ్వరుఁడు వరుణరూపమున నుండఁగ నతనిని వరుణుఁడే యని తలఁచి యింద్రుఁడు నాముందట సింహాసనారూఢుఁడవై జూదమాడెదవా? యని కోపముతో నీశ్వరుని ప్రశ్నించెను. ఈశ్వరుఁడు రౌద్రాకారముతో 'వాఁడు గర్వముగఁ బల్కుచున్నాఁడు. వాని నిటుతోడి తెమ్మని యా యువతితోఁ జెప్పెను. ఆమె యింద్రుని స్పృశించినమాత్రముననే యితఁడు భూమిపైఁ బడెను. ఈ పర్వతవివరము చూడు మిందేమి యున్నదో యని యీశ్వరుఁ డాజ్ఞాపించె. ఇంద్రుఁడందుఁ దనవంటివారిని నల్గురను గాంచె. ఇట్లేర్పడిన పంచేంద్రులు ధర్మార్జున భీమనకుల సహదేవులై పుట్టిరి. భార.

ఇంద్రుఁడు విశ్వకర్మపుత్రుని సంహరించెను. ఇంద్రుని సంహరించుటకు వృత్రాసురుని బుట్టింపఁగ మొదట నీతనితోఁ జెలిమిజేసి, తరువాత నింద్రుఁడు వీనిని సంహరించెను. ఈ బ్రహ్మహత్యవలన నింద్రుఁడు దుర్బలుఁడై యుండెను. అహల్యయెడఁ జేసిన దోషమువలన మఱికొంచెము నీరసుఁడయ్యెను. ఆ సమయమున దానవులు భూమిపై జన్మించి యజ్ఞములు కానివ్వకుండ భంగపెట్టుచుండిరి. దానవుల బాధ పడజాలక భూదేవి సురలతోఁ జెప్పుకొనియెను. దేవతలందఱు భూమిపై జన్మించిరి. ఇంద్రుఁడే యైదురూపములుగఁ బుట్టెను. వీరే ధర్మార్జున భీమ నకుల సహదేవులు. మార్క.

కుంతి పుత్రుని బడయఁగోరి తనకు దుర్వాసుఁ డుపదేశించిన మంత్రము పఠించి యింద్రునారాధించెను. ఇంద్రుఁడు ప్రసన్నుఁడయ్యె. ఇతని వలన నర్జునుఁడు పుట్టెను. ఇంద్రుఁడు తనకుమారున కుపకారము చేయుచుండెడివాఁడు. దివ్యాస్త్రములకై తపస్సుచేసి యర్జుననకుఁ బ్రత్యక్షమై నీకు దివ్యాస్త్రము నీశ్వరుఁడిచ్చెను. వానిని

ప్రార్థింపుమని బోధించెను; అర్జునుని నమరావతికి రావించి గౌరవించెను; అచట నూర్వశి యర్జునుని శపింపఁగ, ఆ శాప మర్జునున కజ్ఞాతవాసంబున లాభించు విధము దెల్పెను. భార.

మఱియుఁ గర్ణున కతని సహజకవచకుండలము లుండెనేని యర్జునున కజేయుఁడగుఁ గాన వానిని గర్ణుకడ లేకుండఁ జేయుటకై తాను బ్రాహ్మణ వేషమునవచ్చి కర్ణుని కవచకుండలములను యాచించెను. కర్ణుఁడు లేదనలేకయిచ్చెను; ఇంద్రుఁడు తన దివ్యశక్తిని గర్ణున కిచ్చెను. కాని దానినొక్కసారియే ప్రయోగింపుమనియె. భార.

ఇంద్రుడు దేవతలలో శ్రేష్ఠుఁడయ్యు, సురలోకమునకు నాథుఁడయ్యు నది యేమిచిత్రమో కాని యితఁడు చేసినట్టి పనులన్నియు స్వార్థపరమైనవియు, నమాయత, పిఱికితనములతోఁ గూడినవై యుండినవే; దేవతలకడనుండు సుగుణ మొక్కటియుఁ గనఁబడదు. ఏయే కార్యముల నేమే యింద్రుఁడు చేసెనో చెప్పుట కష్టము గాని ప్రతివాఁడు చేసినవియు గర్హ్యముగనే యుండెను. ఇతఁ డెవరెక్కడఁ దపస్సు చేసికొనుచున్నను వారికి భంగము కలుగఁజేయ యత్నించువాఁడు; శరద్వంతుని తపస్సు చెడఁగొట్టుటకై జానపదిని బంపెను. విశ్వామిత్రుని తపోభంగము చేయుటకై మేనకను బంపెను. కంఘుఁడనువాఁడు తపస్సు చేసికొనుచుండఁగ భంగము చేయుటకై ప్రమోచనను బంపెను. బలసంపన్నులగు దనుజులు దండెత్తివచ్చిరా, విష్ణుమూర్తికడకుఁ బరుగిడును.

ఇంద్రుఁడు దితికుమారులను వధించుచుండెను గాన నింద్రుని వధింపఁగలుగు కుమారు ననుగ్రహింపుమని దితి తనపతిని వేఁడెను; కశ్యపుఁ డనుగ్రహించెను. దితి గర్భవతి యయ్యెను; ఇంద్రున కీవార్తతెలిసి తనకు శత్రువు పుట్టకుండఁగనే చేయఁదలఁచుకొని యొక బాలకునివలె దితియొద్దకు వచ్చెను. వచ్చి, అమ్మా! నీకు దాసుఁడనై పరిచర్య చేయుచుండ గోరెదను; అంగీకరింపుమని కోరెను. ఆమె వీనిని విశ్వసించి పరిచర్యలు గొనుచుండెను. ఇంద్రుఁడు తన కార్యము నెరవేర్చుకొనుటకు సమయము వేచియుండెను. ఒకనాఁడు మధ్యాహ్నము దితి తన పాదములపైఁ గేశములుంచుకొని నిద్రించుచుండెను. ఆ సమయమున నింద్రుఁ డామె గర్భచ్ఛేదనము చేయదలంచెను గాని యది మహాపాతకమని మాని యామె గర్భమందున్న శిశువునే అదితికోరికపై సంహరించుటకు గర్భముప్రవేశించి శిశువును నేడు ముక్కలుగఁ గోసెను. ఆ యేడుముక్కలును యేడువసాగె. ఇంద్రుడు తిరిగి యొక్కొక్కదాని నేడేసి తునకలుగఁ గోసెను. అవన్నియు నేడువసాగెను. ఇంతలో దితి మేల్కాంచి పుత్రులను సంహరింపవలదని బ్రతిమాలెను. ఇంద్రుఁడు బైటకువచ్చి పుట్టబోవువాఁడు తనకు శత్రువగుటచే నట్లుచేసితినని నుడివి చేసిన దానికి క్షమింపుమని వేడెను. వారు నీకు శత్రువులుగారు. మిత్రులే యగుదురు. వీరిని నీవే గావుమని దితి వారిని నింద్రున కప్పగించె. వారే మరుత్తులనబడు దేవగణము. ఇంద్రుఁడు వారితో సఖ్యము చేసియుండెను. బ్రహ్మ.

ఇంద్రుఁడు పార్వతీ పరమేశ్వరులు రతిక్రీడ సల్పుచున్నారని వినెను. వారికిఁ బుట్టుపుత్రుఁడు తనకంటె తేజోవంతుఁడు, బలవంతుఁడు నగునని భయపడి యట్టివాఁడు పుట్టకుండఁ జేయ నూహించుకొని యింద్రుఁ డగ్నికడకుఁ బోయి వానిం బొగడి పార్వతియుఁ బరమేశ్వరుఁడును నిపుడు రతిక్రీడ సలుపుచున్నారు. నీవెటులైనను దాని నివారించి రావలయునని చెప్పెను. వీని వచనానుసారముగ అగ్నిపోయి రతిసల్పుచున్న పార్వతీ పరమేశ్వరుల కెదురుగ నిలిచెను. వారు క్రీడించుట మానిరి. బ్రహ్మ.

కుమారస్వామిదర్పంబుచూచి దేవతలు భయపడి యింద్రునిదగ్గఱకుఁ బరుగిడి, కుమారుఁడు నిన్నుఁబరిమార్చి నీపదవిగైకొనును; నీవేముందుగ వానిని వధింపుమని చెప్పిరి. వారి మాటలు విని యింద్రుఁడు భయపడి కుమారస్వామినిసంహరింపుడని సప్తమాతృకలను బంపెను. వీరుకుమారుని తేజముచూచి భయపడి వాని శరణు జొచ్చిరి. అపు డింద్రుఁడే యుద్ధమునకు వచ్చెను. తన వజ్రాయుధము ప్రయోగించెను. అది కుమారుని దక్షిణపార్శ్వముదాకినది. దాన మేషవదనుఁడైన విశాఖుఁ డనువాఁడును; కుమారగణంబును పుట్టెను. వీరినిఁ జూచి ఇంద్రుఁడు భయపడి శరణు వేడెను. తన యింద్రపదవికూడఁ బుచ్చు

గాని తన్ను సేవించుకొనుమని కోరెను. కుమారుఁడు నవ్వి యితనిచే యింద్రునిగ నుండుమని యితని కోరిక ననుసరించి తానుదేవసేనకునధిపతియయ్యె.

సగరపుత్రులు మునులను, బ్రాహ్మణులను బాధించుచుండిరి. దేవతలకు హోమమును లేకుండఁబోయె. దేవతలు బ్రహ్మతో మొఱ పెట్టుకొనిరి. సగరపుత్రులు కపిలుఁడను ముని వలన నశింతురు. వారతని యోగభంగము గావించిరేని యది వారికి మరణహేతు వగునని బ్రహ్మ దెల్పెను. ఇంద్రుఁడు సమయమునకై వేచియుండెను. సగరపుత్రులు సగరుని యాగాశ్వము వెంట నరిగిరి. అది సముద్రములో నడుగిడగనే నీ రెండిపోయెను. అదే సమయమని ఇంద్రుఁడు వాయువును బిలిచి సగరుని యశ్వమును గపిలుని యాశ్రమములోఁ గట్టుమని చెప్పెను. వాయువుక్షణములో దానిం గొంపోయె. అశ్వమునకై సగరపుత్రులు సముద్రమును ద్రవ్విరి; రసాతలమునఁ గపిలునియాశ్రమమున దురఁగమును జూచిరి. కపిలుఁడే యపహరించి కపటవేషమున మునిగ నటించుచున్నాడని వానిని బరుషములాడి వాని యోగమునకు భంగము చేసిరి. కపిలుఁడు కన్నులు తెరచిచూచెను. వాని నేత్రాగ్నిచే వీరు భస్మమైపోయిరి. బ్రహ్మ.

పృథుచక్రవర్తి నూఱు అశ్వమేధయాగములు చేయదలఁచుకొని బ్రహ్మావర్తదేశమున సరస్వతీ నదీతీరమునఁ బ్రారంభించి తొంబది తొమ్మిది యాగములు ముగించెను; నూఱవది చేయుచుండెను. శతమఖములు గావించనవాఁడు రెండవ వాఁడుండుటకు సహింపలేక యింద్రుఁడు పృథుచక్రవర్తి యాగాశ్వము నపహరించెను. పృథువు కుమారుఁడింద్రునినోడించితురంగమునుదెచ్చెను. మఱల నింద్రుఁడు మాయచేసి దాని నెత్తుకొని పోయెను. పృథుచక్రవర్తి బాణములు పుచ్చుకొని యింద్రుని గొట్టుటకై బయలుదేరెను. యాగదీక్షయం దున్నవారు బాణములు ముట్టరాదు; కావున నింద్రు నాహ్వానముచేసి వాని నగ్నికాహుతిగఁ వేల్చెదమని ఋత్విజు లనిరి. పృథు వగ్నికడఁ గూర్చుండెను. అంత బ్రహ్మ వచ్చి యింద్రుడు భగవదంశ కలవాడనియు, వధార్హుఁడు కాఁడనియు వారికి బోధించెను; పరమేశ్వరుఁడుకూడవచ్చి యింద్రుఁడుక్షమింపుమని వేఁడుచున్నాఁడని తెల్పెను. పృథువునకు నేకోనశతమఖముల ఫలము నిచ్చిరి. పృథువు చింత మాని, యా నూఱవయజ్ఞము మాని, యింద్రునితో బద్ధసఖుఁడై యుండెను. భాగ.

భంగాస్వనుఁడను రాజు పుత్రులను గోరి యాగము చేసెను. అతనికి నూర్వురు పుత్రులు కల్గిరి. కాని యా యాగ మింద్రున కప్రియమైన దగుటచే నింద్రునకుఁ గోపముగ నుండెను. ఒక నాఁడు భంగాస్వనుఁడు వేటకేఁగఁగ నింద్రుఁడు వానిని వంచించుటకై దిగ్భ్రాంతి కలుగఁజేసి దూరముగఁ బోవునట్లు చేసెను. రాజునకు నడకవలన దాహముకలుగఁగ జేరువనున్న కొలనులో నతఁడు దిగి జలము త్రాగి పైకి వచ్చెను. అంత నతఁడు స్త్రీయయ్యెను. భంగాస్వనుఁ డారూపముతో నగరమునకు బోవుటకు సిగ్గుపడి యచ్చటనే యుండెను. ఈ వనములో నీమెకుఁ బుత్రులు కల్గిరి. వీరును, భంగాస్వనుని మొదటి పుత్రులును గలసి రాజ్యముచేయుచు దేశములను గెలుచుచుండిరి. తా నపకారము చేయఁబోఁగ నది యుపకారమే యయ్యెనని చింతించి యింద్రుఁడు బ్రాహ్మణవేషమున వచ్చి యిఱు తెగల కుమారులకును వైరము పెట్టెను. వా రొకరి నొకరు కొట్టుకొని చచ్చిరి. స్త్రీ రూపమునున్న భంగాస్వనున కీ వార్త తెలిసి, వెళ్ళి యా బ్రాహ్మణుని పాదములమీఁదఁ బడి మ్రొక్కెను. అతఁడింద్రుడగుట తెల్పి పుత్రుల నందఱిని బ్రతికించెను. భార.

ఇంద్రుఁడు అప్సరసలను జూచుచు వారి నాట్యమున కానందించుచు గురువును గౌరవించుట మఱచెను. ఆదోషముచే దానవులతోడి యుద్ధమందు దేవతలపజయమునొంది బ్రహ్మతోఁ జెప్పుకొనిరి. గురువును నిరసించుటచే నిట్లుసంభవించినది. త్వష్ట్రప్రజాపతి పుత్రుఁడను విశ్వరూపుని గురువుగఁ గొలువుఁడని బ్రహ్మ చెప్పెను. దేవతలట్లేచేయుచుండిరి. విశ్వరూపుఁడు దానవులకుఁ గూడ దాయాది గావున వారివలనను బూజలనందుకొనుచుండెను. వారికియజ్ఞ భాగము లిచ్చుచుండెను. ఇంద్రుఁ డది యెఱింగి సహింపలేక విశ్వరూపునిశిరములు నఱికెను. ఒక శిరము కపింజలపక్షియయ్యె. మిగిలిన రెండును తిత్తిరి పక్షులయ్యెను. స్కాంద.

త్వష్ట్రప్రజాపతిచే సృజింపఁబడిన విశ్వరూపుఁ డింద్రపదవిని గోరి తపస్సు చేయుచుండెను. అది యింద్రుఁడెఱింగి వాని తపోభంగము చేయఁగోరి రంభాది అప్సరసలను బంపెను. కాని వీరికి విశ్వరూపుఁడు లొంగక తపస్సు చేసికొనుచుండెను. అంతట నింద్రుఁడేవచ్చి వీని శిరములు మూడును నరకి వేసెను. దాన బ్రాహ్మణహత్యాదోషము చుట్టుకొనియె. విశ్వరూపునిజంపుటచే వచ్చిన బ్రహ్మహత్యాపాతకమును స్త్రీలకును, సముద్రజలమునకును, వృక్షములకును, భూమికిని బంచిపెట్టియింద్రుఁడుపాతకరహితుఁడయ్యె. తన బ్రహ్మహత్యా పాతకమును బంచుకొనుమని నప్పుడు భూమి తనయందుఁజేయఁబడిన ఖాతము తనంత పూడునట్లును, జలము తనయందుఁ బ్రక్షాళితమైన సర్వము పావనమగునట్లును, వృక్షములు ఛేదింపఁబడి పునః ప్రరోహంబు గలుగునట్లు, స్త్రీలు కామసుఖమును వరముగ గోరి. ఇంద్రుఁ డాకరముల నొసంగెను. ఆ పాతకమును భూమి యిరిణి విధమునను, జలము ఫేనబుద్బుద విధమునను, వృక్షములు నిర్యాసభావమునను, స్త్రీలు రజో వికారమునను బొందిరి. భాగ.

తన పుత్త్రుని సంహరించినందుకై త్వష్ట్రునకు రోషమువచ్చి యింద్రవధ గావించుటకై హోమముచేసి యందుండి వృత్రాసురుని బుట్టించెను. ఈ వృత్రాసురుఁడును, నింద్రుఁడును బోరిరి. ఇంద్రుఁడే భయపడి పాఱిపోయి విష్ణుమూర్తిని శరణువేఁడెను. వృత్రాసురుఁడు బలాఢ్యుఁ డనియు, వీని నుపాయముచేతనే సంహరింపవలె ననియు, నంతవఱకు నతనితో సఖ్యముచేసియుండు మనియు విష్ణుమూర్తి చెప్పెను. మునులు వృత్రునకును, నింద్రునకును స్నేహముగావించిరి. ఇంద్రుఁడు స్నేహభావము తోడనే యుండినట్లు వర్తించుచుండెను. వారిఱువు రొకనాఁడు సంధ్యాసమయమందు సముద్రతీరమందు జరించుచుండఁగ సముద్ర జలముయొక్క నురుగుతో నేమరియున్న వృత్రుని నింద్రుఁడు గొట్టి సంహరించెను. వృత్రుని జంపిన పాతకము వికారపు ముదుసలిరూపమున వచ్చి నింద్రుని దరిమెను. ఇంద్రుఁడు భయపడి పాఱిపోయి యొక కొలనులోఁ గమలనాళములో మారి దాగియుండెను. అపుడు నహుషుని నింద్రునిగఁజేసిరి. కాని యచిరకాలములోనే నహుషుఁడు పదభ్రష్టుఁడయ్యె. ఇంద్రస్థానము మఱల రిక్తమై యుండెను గాన మును లింద్రునకై వెదకి యతఁడు దాగియుండిన చోటెఱింగిరి. అతనిని రమ్మని పిలచిరి; అతని పాతకము పోగొట్టుటకై యశ్వమేధము చేయింపుడని యగస్త్యుఁడు చెప్పఁగ నింద్రునిచే నశ్వమేధము చేయించి వానిని యథాస్థానమున నిల్పిరి.

మరుత్తు సుగుణాఢ్యుఁడై సకలసంపదలతో శోభిల్లుచుండెను. అతనిఖ్యాతి దిగంతములు వ్యాపించెను. ఇంద్రుని కతనిపై నీర్ష్య కలిగెను. మరుత్తుయజ్ఞము చేయఁదలఁచుకొని బృహస్పతిని నధ్వర్యునిగఁ బిలచునని విని యింద్రుఁడు ముందుగ బృహస్పతికడకుఁ బోయి తాను యాగము చేయనున్నాఁడనియు, నతని కధ్వర్యునిగ నుండవలసినదనియు, మనుజులు కోరిన బృహస్పతి వెళ్ళుట తగదనియుఁ జెప్పెను. మరుత్తు సంవర్తుని బిలిపించి యాగమును చేయుచుండెను. దానిని భంగముచేయుటకై 'నీవు బృహస్పతినే ఋత్విజునిగఁ దెచ్చుకొను' మని చెప్పుట కింద్రుఁ డగ్నిని బంపెను. అగ్ని వెళ్ళి యట్లు చెప్పెను. సంవర్తుని మాని యాగమధ్యమం దింకొకని దెచ్చుకొనెనేని శపింతునని సంవర్తుఁడుమరుత్తుతో నదివఱకే చెప్పియుండెను. అతనికి శాపము గలుగఁజేయుటకై యింద్రుఁ డిట్లు కబురుపంపెను. కాని మరుత్తు సంవర్తుని తోడనే యాగము పూర్తిచేసెను. మంత్ర ప్రభావముచే నింద్రాదు లందఱు మరుత్తు యజ్ఞ భాగములను గైకొనిరి. భార.

గోపకులింద్రోత్సవము చేయుచుండెడివారు. ఇంద్రు నేల పూజించవలెను? గోవులను, బ్రాహ్మణులను, బర్వతములను సత్కరింపుఁడని కృష్ణుఁడు చెప్పి గోపకులచే నింద్రోత్సవము చేయుట మాన్పించెను. ఇంద్రునకుఁ గోపము వచ్చి వారలపై రాళ్ళవానను గురిపించెను. కృష్ణుఁడు గోవర్ధన పర్వత మెత్తి దాని క్రిందకు గోపకులను, గోవులను జేర్చి వారిపై రాళ్ళు పడకుండఁ గాపాడెను. ఇంద్రుఁడు కృష్ణుని మాహాత్మ్య మెఱిఁగి యాతని బ్రార్థించెను. ఇంద్రుఁడు గర్వము వీడుటకై [illegible] సమ్మానించెను కృష్ణుఁ [illegible] భాగ.

[illegible library stamp]

ఇంద్రుఁడును, బృహస్పతియు మునివేషములం వేసికొని శివుని జూచుటకై కైలాసమునకు వెళ్ళుచుండిరి. శివుఁడు వీరిని బరీక్షింపఁగోరి యుగ్రరూపము ధరించి దిగంబరుఁడై మార్గమధ్యమందు నిలుచుండెను. వానిని మార్గము నుండి తొలఁగుమని యింద్రుఁ డాజ్ఞాపించెను. వాఁడు ప్రత్యుత్తరమీయలేదు. మఱల నింద్రుఁడు గదిమెను. వాఁడు కదలలేదు. ఇంద్రుఁడు తన వజ్రాయుధ మెత్తెను. కాని శివుఁ డితని హస్తము స్తంభింపఁజేసి యింద్రుని భస్మము చేసెను. అతఁడే శివుఁడని బృహస్పతి గ్రహించెను. ఇతఁడు వానిని స్తుతించి యింద్రుని రక్షింపుమని వేడెను. శివుఁడు కరుణించి ఇంద్రుని బ్రతికించెను. శివ.

దానవులతో యుద్ధము చేయుటకు సహాయము రమ్మని పురంజయుఁడను రాజును నింద్రుఁడు కోరఁగ రాజు వృషభముపై నెక్కి వచ్చెద ననియె. అపు డింద్రుడు వృషభ మయ్యెను. ఈ వృషభ కకుత్స్థలమున నారాజు కూర్చుండి యుద్ధము చేసెను. విష్ణు.

ఇంద్రలోకముపై రావణుఁడు యుద్ధమునకు వచ్చి దేవతల నోడించెను. అపుడింద్రుఁడు వచ్చి యుద్ధముచేసి రావణు నోడించి బంధించెను. అంతట రావణుని కుమారుఁడు మేఘనాథుడు విజృంభించి రాక్షసమాయలచే యుద్ధముచేసి యింద్రుని బంధించెను. అందువలననే యతనికి నింద్రజిత్తని పేరువచ్చెను. బ్రహ్మవచ్చి ఇంద్రుని విడువుమని కోరగ వాఁడు విడిచెను. ఉ. రా.

ఇంద్రుఁడహల్య రూపముచూచి యామెను దనకిచ్చి వివాహము చేయుమని బ్రహ్మను గోరెను. కాని బ్రహ్మ ఆమెను గౌతమునకిచ్చి వివాహముచేసెను. ఇంద్రుఁ డామెతోఁ గవయ గోరుచుండువాఁడు. ఇతఁడొకనాటి యర్ధరాత్రి కోడియై గౌతముని యాశ్రమము చెంగటఁ గూసెను. ఆ కూతవిని గౌతముఁడు తెల్లవాఱుచున్నదనుకొని స్నానాదికృత్యములఁ దీర్చుకొనుటకై యాశ్రమము విడిచి బైటకువచ్చెను. ఆ వెంటనే యింద్రుఁ డహల్య శయ్యపై జేరెను. అతఁడు గౌతముఁడే యని యహల్య యనుకొనియె. గౌతముఁడు నక్షత్రములుచూచి యర్ధరాత్రియే యగుట నెఱింగి తన యాశ్రమమునకు మఱలి వచ్చెను. తన భార్యతో నింద్రుఁ డుండుటచూచెను. ఇతఁడు గావించిన యకార్యమునకుఁ గోపగించి (ఇతని యండము లూడి పోవునటుల శపించెను. అవి యూడఁగ మేషాండములను దెచ్చి వీని కతికించిరి.) ఇతని శరీరమంతయు యోనులగునట్లు శపించెను. తనను క్షమింపుమని యింద్రుఁడు, గౌతముని బ్రార్థించెను. గౌతముఁడు కరుణించి యాతని శరీరమందలి యోనులు పరులకు నేత్రములవలెఁ గనఁబడును గాక యని యనుగ్రహించెను.

ఒకనాఁడు సాయంకాల మింద్రుఁడు బహ్మ దర్శనము చేసి వచ్చుచు మార్గమందు స్త్రీయైన ఋక్షవిరజుని జూచెను. ఈమెను జూడఁగనే యింద్రుని డెందమున మన్మథుఁడు సందడి చేసెను. ఇతని తేజస్సు ఋక్షవిరజుని వాలము కడఁబడెను. ఆమెయందు వాలి జన్మించెను. ఉ. రా.

దేవసేనను కేశి యను రాక్షసుఁ డెత్తుకొని పోవుచుండఁగ నింద్రుఁ డారాక్షసుని సంహరించి యామెను గాపాడి వరము వేడుకొను మనెను. ఆమె తనకుఁ దగిన వరు నిమ్మని కోరెను. ఇంద్రుఁ డామెను బ్రహ్మకడకుఁ గొనిపోయి యీమెకు దగిన భర్తను జెప్పుమనియె. అప్పటి నుండియు నింద్రుఁడే యామెను బెంచి కుమారస్వామి కిచ్చి వివాహము చేసెను. భార.

శూరపద్మాసురుఁడను రాక్షసుఁడు దేవతలను బాధించుచుండెను. వీనిని కుమారస్వామి సంహరించెను. అందుకు మెచ్చుకొని యింద్రుఁడు తాను బెంచిన దేవసేనను వాని కిచ్చి వివాహము చేసెను. స్కాంద.

మాంధాత పుట్టినపు డితఁడువచ్చి తన వ్రేలుబెట్టి యా శిశువునకుఁ గుడిపెను. విష్ణు.

మేధాతిథి చేయు యజ్ఞమున కింద్రుఁడు గొఱ్ఱియ రూపమునఁ బోయి హవిర్భాగము అందుకొనెను.

శర్యాతి యజ్ఞముచేయునపు డశ్వినులకుఁ గూడ యజ్ఞభాగము లిత్తుమని చ్యవనుఁడు చెప్పెను. వారు హవిర్భాగమున కర్హులు

కారు; ఇవ్వకూడదని యింద్రుఁడు పలికె. అశ్వినులను సోమపీథులను జేసెదనని చ్యవనుఁడు మాఱుపలుకఁగ నింద్రుఁడు వానిని గొట్టుటకై వజ్రాయుధ మెత్తెను. అంత చ్యవనుఁడు హోమకుండమునుండి మదుఁడను రాక్షసుని బుట్టించెను. వానినిజూచి యింద్రుఁడు భయపడి చ్యవనుని శరణువేడి యశ్వినులు సోమపానార్హులగుదురని యొప్పుకొనెను. భార.

ఇంద్రుఁడు:-వృత్రాసురుని హతమార్చుటచే నీవు ఇటుకరాయివై యుండుమని వృత్రాసురుఁడు ఇంద్రుని శపించెను.

ఇటుకరాయియగు (ఇంద్రుఁడు) విష్ణుమూర్తిని ప్రార్థించెను. విష్ణుమూర్తి పుండరీకునికొఱకు దర్శనమిచ్చునపుడు నీకు శాపవిమోచనమగునని యనుగ్రహించెను. ఇంద్రుఁడు ఇటుకరాయియై పుండరీకుఁడు వసించు గృహముకడ నుండెను. పుండరీకునికడకు విష్ణుమూర్తి రాఁగ నతఁడు తల్లిదండ్రులకు సేవచేయుచు, వారిసేవ ముగియువఱకు ఆ యిటుకమీద నిలువుమని దానిని వేసెను. దానిపై అతనికి వరములిచ్చిన పుండరీకవరదుఁడు నిలుచుండెను. భార.

జంభాసురుఁ డింద్రుని బాధించుచుండెను. ఇతఁడు వజ్రాయుధముచే వానిని జంపలేక యుండెను. ఇంద్రుఁడు విష్ణుమూర్తి కడకుఁ బోయి వానిజంపు నుపాయము చెప్పుమనియె. వజ్రాయుధము మాని, యగ్నిని వేడి శస్త్రములు పుచ్చుకొనుమని విష్ణువు చెప్పెను. ఇంద్రుఁడవి పుచ్చుకొని, విశ్వావసుఁడను గంధర్వుని వలన రథమునుబొంది, శమీకపుత్త్రుని సారథిగఁ జేసికొని జంభాసురుని సంహరించెను. వామ.

ఇంద్రుఁ డైరావతము నెక్కి దేవతలతో వచ్చుచుండగ దుర్వాసుఁ డెదురుగవచ్చి పుష్పమాలిక నిచ్చెను. ఇతఁడు దానిని తనయేనుఁగుపై వేసెను. ఆ యేనుఁగు దానిని క్రిందఁబడవేసెను; దేవతలు నవ్విరి. తానిచ్చిన దండను గ్రహింపక యిట్లవమానము చేసెనని దుర్వాసునకుఁ గోపము వచ్చి నీసిరులన్నియు సముద్రములోఁ గలయుఁగాక యని యింద్రుని శపించెను. అమృతము, ఐరావతము మొదలగునవన్నియు సముద్రములోఁ బడెను. ఇంద్రుఁడు భయపడి విష్ణుమూర్తి కడకుఁబోయి యాతనితోఁ జెప్పుకొనియె. నీవు సముద్రమును మథింపుము. నీసిరులు నీకు మఱల వచ్చునని విష్ణుమూర్తి చెప్పెను. సముద్రమథనము చేయఁగ నందుండి మఱల నైరావతాదులు పుట్టెను. విష్ణు.

ఇంద్రుఁడు రాజ్యముఁ బోగొట్టుకొనెను. ప్రహ్లాదుఁడు మూఁడులోకము లేలుచుండెను. ఇంద్రున కెటులైనఁ దనపదవి సంపాదించుకొనవలయునను కోరిక కలదు. దేవగురునికడకుఁ బోయి యేమిచేసిన నారాజ్యము నాకు వచ్చునని యడిగెను; భార్గవు నడుగుమని గురుఁడు చెప్పెను. ఇంద్రుఁడు భార్గవు నడిగెను. ప్రహ్లాదుని నడుగుమని భార్గవుఁడు చెప్పెను. ఇంద్రుఁడు బ్రాహ్మణవేషమునఁ బ్రహ్లాదుని కడకుఁబోయి యతనిఁ గొలుచుచుండెను. ఒకనాఁ డీ బ్రాహ్మణుఁడు నీకీ త్రిలోకరాజ్యమెట్లు వచ్చెనని ప్రహ్లాదునడిగెను. ప్రహ్లాదుఁడు సుశీలమువలన వచ్చినదని శీలమాహాత్మ్యము నెఱింగించెను. అట్లయినచో నీశీలము నాకిమ్ము అని ఇంద్రుఁడు కోరెను. ప్రహ్లాదుఁడు సరే యనియె. ఇంతలో నతనిశరీరమునుండి యొక పురుషుఁడు వెడలెను. నీవెవరవు? అని ప్రహ్లాదుఁ డడుగఁగ నేను నీశీలమును; ఇంద్రుఁ డడుగ నిచ్చితివి గాన బోవుచుంటినని యతఁ డనియె; వానివెనుక మఱియొక పురుషుఁడు వచ్చి తాను బలము ననియు, శీలముతోఁ బోవుచున్నాననియుఁ జెప్పెను. వీరి వెనుక నొకయువతి పుట్టెను. ఆమె సిరి. శీల మెచ్చట నుండునో యచ్చటకుఁ బోవుదునని యామె చెప్పెను. ఈ మూఁడును లభింపగ నింద్రుఁడు తనరాజ్యము సంపాదించుకొనఁగలిగెను. భార.

ఇక్ష్వాకు:-వైవస్వతమనువు కుమారుఁడు. శ్రీరాముని వంశమునకు మూలపురుషుఁడు. ఒకనాఁడు మనువు తుమ్మఁగ నతని ముక్కునుండి ఇక్ష్వాకు పుట్టెను. ఇతని నూర్గురు కుమారులు కలరు. వారిలో వికుక్షి, నిమి, దండకుఁడు అనువారు పెద్దవారు. ఇక్ష్వాకు అష్టకాశ్రాద్ధ మొనరింపఁ దలఁచి విశుద్ధమైన మాంసఖండము తెమ్మని పెద్దకుమారుని బంపెను. ఇతఁడు వేటాడి యలసియుండుటచే నొక శశమును భక్షించి శేషమును గొనివచ్చెను. ఆ యెంగిలిమాంసము శ్రాద్ధము

నకుఁ బనికిరాదని వసిష్ఠుఁడు దానిని నిరాకరించెను. ఇక్ష్వాకునకుఁ గుమారునిపైఁ గోపము వచ్చి వానిని దేశమునుండి వెడలఁగొట్టెను. సువర్ణ ఇక్ష్వాకు కుమారిత.

ఇక్ష్వాకుఁ బిమ్మట వికుక్షియే రాజ్యమేలెను. భాగ.

ఇక్ష్వాకు:-కృతయుగమున మనువుయొక్క మనమఁడైన క్షుతాని పుత్త్రుఁడు. వీనికి నూర్గురు పుత్త్రులు. వీరిలోఁ బెద్దవాఁడు వింశుఁడు. భార.

ఇక్ష్వాకు:-అయోధ్య నేలిన రాజు. ఇతనికడ దేహమంతయు ధవళవర్ణమును, ఒక్క చెవి నీలవర్ణమునుగల యశ్వములు రెండువందలుండెను. ఇతనికడకు గాలవుఁడను మునిపుత్త్రుఁడు మాధవియను యయాతిరాజు పుత్త్రికను దీసికొనివచ్చి యామెను బుచ్చుకొని యీ యశ్వముల నిమ్మనికోరెను. మాధవి సంతానము కలిగినను నామె కన్యాత్వము దూషితముగాదు. కావున నిక్ష్వా కామెనుగ్రహించి యశ్వములను గాలవున కిచ్చెను. ఇక్ష్వాకునకు మాధవివలన వసుమనస్సుఁడను కుమారుఁడు కలిగెను.

ఇడ:-మును పరమేష్ఠి లోకనికరములు పుట్టింపఁదలఁచుకొనినపుఁడు వ్రతాధ్వరము చేసెను. అపుడు ఇడ అతని భార్యయయ్యె. బ్రహ్మ.

ఇతర:-ఒక ఋషిభార్య. ఈమెకుమారుఁడు ఐతరేయుఁడు. ఈమెకు సవతులు కలరు. వారియందును, వారిపుత్త్రులందును నీమెభర్తకుఁ బ్రీతి. ఇతరకుమారుఁడు తండ్రితొడపైఁ గూర్చుండఁగ వానిని తండ్రి లేవఁగొట్టెను. ఇతర తనపుత్త్రునకైన యనాదరణమునకు దుఃఖించి భూదేవిని బ్రార్థించెను. భూదేవి ప్రత్యక్షమై ఐతరేయుని సింహాసనారూఢునిగఁ జేసెను.

ఇధ్మజిహ్వుఁడు:-ప్రియవ్రతుని పుత్త్రుఁడు. ప్లక్షద్వీపమునకు రాజు. ఇతనికి శివుఁడు యశస్యుఁడు, సుభద్రుఁడు, శాంతుఁడు, క్షేముఁడు, భయుఁడు, అమృతుఁడు అను నేడ్వురు కుమారులు గలరు. ఇతఁడు ప్లక్షద్వీపమును నేడు భాగములు చేసి యొక్కొక్కదాని కొక్కొక పుత్త్రుని రాజుగఁ జేసెను. భాగ.

ఇధ్మవాహుఁడు:-లోపాముద్రయం దగస్త్యునకుఁ బుట్టిన కుమారుఁడు. ఇతఁ డగ్నివలెనే తేజరిల్లువాఁడు. ఇతఁడు తండ్రి కిధ్మములు తెచ్చి యిచ్చుచుండును.

ఇధ్మవాహుఁడు:-లోపాముద్ర కుమారుఁడైన దృఢస్యుని తనయుఁడు. ఇఁతడే తేజస్వి. భార.

ఇనుపభీముఁడు:-కురుక్షేత్ర యుద్ధానంతరమున ధర్మజాదులు ధృతరాష్ట్రుని జూడఁబోయిరి. భీముని పేరు చెప్పఁగనే ధృతరాష్ట్రునకు వచ్చిన కోప మింతింతగాదు. ఈ సంగతిని ముందుగనే కృష్ణునకుఁ దెలియును. కానఁ నతఁడు ఇనుములో భీముని ప్రతిరూపమును జేయించి యెవరికిని దెలియకుండ నటకుఁ దెప్పించెను. ఆ గ్రుడ్డిరాజు ఆ యినుపవిగ్రహమునే పైకి ప్రేమించునట్లు రెండు చేతులఁ గౌఁగిలించుకొని తన కసిదీర నట్లు నొక్కెను. అట్లు నొక్కఁబడిన విగ్రహము ముక్కలయ్యె. ధృతరాష్ట్రుఁడు లోలోన సంతోషించుచు అయ్యో భీముఁ డట్లయ్యెనే అని విచారించెను. అప్పుడు కృష్ణుఁడు నీవు విచారింప నక్కరలేదు. ఇప్పుడు భంజింపఁబడినది ఇనుపవిగ్రహము. నీ బలమునకు సమానులెవరు ? ఇది యెఱిఁగియే ఇనుపభీముని చేయించి చ్చితినని చెప్పెను. భార.

ఇర:-కశ్యపుని భార్య. ఈమెయందు వృక్షలతాదులు జన్మించెను. గరు.

ఇరావంతుఁడు:-ఉలూచియం దర్జునునకుఁబుట్టిన కుమారుఁడు. కురుపాండవయుద్ధమునం దితఁడు అలంబసునిచేఁ జంపఁబడెను. భార.

ఇరావతి:-ఉత్తరుని కుమారిత. పరీక్షిత్తు భార్య. భాగ.

ఇల:-వాయువు పుత్త్రిక. ధ్రువునిభార్య. ఈమె కుమారుఁడు ఉత్కళుఁడు. భాగ.

ఇల:-వైవస్వతమనువు కూఁతురు. వైవస్వతుఁడు పుత్త్రులను గోరి యజ్ఞముచేసెను. అతనిభార్య కుమార్తెను గోరి హోత నాశ్రయించెను. యజ్ఞమపుడు హవిస్సునందుకొని కూఁతు రయ్యెడునని వషట్కారంబులు పలుకఁబడియె. ఆమెకు ఇల యను కూఁతురుపుట్టెను. వైవస్వతుఁడు వసిష్ఠుని కడకు వెళ్ళి నేను పుత్త్రుని గోరగఁ బుత్త్రికయెల

పుట్టెనని యడిగెను. అతఁడు హోత గావించిన దతిక్రమించి తానే యీశ్వరుని బ్రార్థించి యిలను మగవానిఁగఁ జేయుమని కోరెను. ఈశ్వరుఁడు ఇలను మగవానిఁగఁ జేసెను. అతఁడే సుద్యుమ్నుఁడు. ఉత్కళుఁడు, గయుఁడు, విమలుఁడు సుద్యుమ్నుని కుమారులు.

ఈ సుద్యుమ్నుఁడు రాజ్యము చేయుచుఁ బార్వతీ పరమేశ్వరులుండుఁ గుమారవనమునకు వెళ్ళెను. అచ్చటఁ జేరినతోడనే పార్వతీ శాపవశమున స్త్రీ యయ్యె. అప్పుడు తిరిగి ఇలయే యయ్యెను. అట్లు స్త్రీయైన యిల వనములోనే సంచరించుచు బుధుఁడు ఉన్న చోటును జేరెను. ఒకరి నొకరు కామించిరి. ఈమెకు బుధునివలన బురూరవుఁడను పుత్త్రుఁడు కలిగెను. భాగ.

ఈ ఇల తా నెవ్వరో, అచ్చటకేల వచ్చెనో తెలిసికొనలేక తిరుగుచుండఁగ బుధుఁడు చూచి ఆమెను గామించి నా యాశ్రమము వదలి యచ్చట కేల వచ్చితివని ధైర్యముతోఁ బ్రశ్నించెను. ఇల తాను బుధునిభార్యయే యనుకొని యతనితో నతిగి యతనిసేవ చేయుచుండెను. ఆమె గర్భవతియై పురూరవుఁడను పుత్త్రుని బడసెను. అట్లు కొడుకునుగని స్త్రీయై యుండుట కా పసిఁడి చింతనొంది వసిష్ఠునిగూర్చి మనస్సులో భావించుకొనఁగ అతఁడు వెంటనే వచ్చెను. వచ్చి ఈశ్వరు నారాధించ సుద్యుమ్నుఁడు తిరిగి పురుషుఁ డగునట్లు కోరెను. ఈ తపసి ప్రయాసమునకు ఈశ్వరుఁడు మెచ్చి తాను మున్నాడినమాటయు నిజమగు నట్లు వసిష్ఠుని ప్రీతియగునట్లు ఇల ఒక నెల స్త్రీగను ఒకనెల పురుషుఁడుగను నగునట్లు అనుగ్రహించెను.

ఇలబిల:- తృణబిందుని కుమారిత. ఈమెకు అలంబుస అను కుమారిత జన్మించెను. ఈ యలంబుసను తృణబిందుఁడే మరల వివాహమాడెను. ఈమెకు ఇలబిల యను కూఁతురు, విశాలాది కుమారులను బుట్టిరి. విష్ణు.

ఇలబిల:- దేవకన్య అగు అలంబుసయందు తృణబిందునకుఁ బుట్టిన కుమారిత. ఈమెను విశ్రవసుఁడు పొందఁగ వీరికి కుబేరుఁడు జన్మించెను. భాగ.

ఇలబిల:- పౌలస్త్యునివలన నీమెకుఁ గుబేరుఁడు జన్మించెను.

ఇలబిలుఁడు:- మూలకుని కుమారుఁడు ఇతని పుత్త్రుఁడు ఖట్వాంగదిలీపుఁడు. విష్ణు.

ఇలావృతుఁడు:- ఆగ్నీధ్రుని కుమారుఁడు. ఇతఁడు జంబూద్వీపములో నొక వర్షమును పాలించెను. ఇతని పేరటనే యా వర్షమునకు ఇలావర్షమని పేరు వచ్చెను. విష్ణు.

ఇలావృతవర్షము:- జంబూద్వీపమునం దొక దేశము. నిషధహేమకూట హిమవత్పర్వతముల కుత్తరమున నున్నది. ఆగ్నీధ్రుని కుమారుఁడైన నిలావృతుని పేరిటఁ బరగుచున్నది. భాగ.

ఇలుఁడు:- కర్దముని కుమారుఁడు. మృగయార్థము అరణ్యమంతయు దిరిగి ఈశ్వరుఁడు పార్వతితో క్రీడించుప్రదేశమునకుగూడ బోయెను. ఈశ్వరుఁడు స్త్రీరూపమునను అపుడు క్రీడించుచుండె. ఇలుఁ డదిచూడఁగ తాను, తనభృత్యులు స్త్రీలైరి. ఇతఁడు శంకరుని బ్రార్థించెను. పురుషుఁడగుట తప్ప అన్యవరము కోరుకొనుమనియె. అతనిని బ్రార్థించిన లాభములేదని పార్వతిని వేడెను.

ఆ పార్వతి ఒకనెల స్త్రీయు, ఒకనెల పురుషుఁడు అగునట్లు కరుణించెను. స్త్రీయైన యిలుడును, భృత్యులును జలకమాడుచుండ బుధుఁడు చూచి కామించెను. అతనివలన పురూరవుఁడు జన్మించెను. ఇలునకు శాశ్వతముగ పురుషత్వము సంపాదించుటకు యాగము చేయించి శాశ్వత పురుషత్వ మిప్పించెను. రామా.

ఇల్వలుఁడు:-ఒకరాక్షసుఁడు. విప్రచిత్తికి సింహిక యందుఁ బుట్టిన కుమారుఁడు. (అజముఖియందు దూర్వాసునివలనఁ బుట్టిన కుమారుఁడు. సురస యందు దూర్వాసునివలనఁ బుట్టిన కుమారుఁడు.) ఇతనికి వాతాపి యను సోదరుఁడు కలఁడు. ఇల్వలుఁడు సకలకామసిద్ధికరమైన యొక మంత్ర ముపదేశింపుమని యొక బ్రాహ్మణుని గోరెను. (ఇంద్రసముఁడైన పుత్త్రుని నీయుఁడని బ్రాహ్మణులను గోరెను.) కానివిఫలమనోరథుఁడయ్యెను. అప్పటినుండియు బ్రాహ్మణులను బాధింపఁ జొచ్చెను. ఇతఁడు బ్రాహ్మణులను భోజనమునకుఁ బిలుచుచుఁ దన సోదరుఁడగు వాతాపిని (వాతాపికామరూపుఁడుగాన) మేఁకగఁ జేసి యా మేఁకనువండి బ్రాహ్మణులకుఁ బెట్టుచుండును.

ఆ బ్రాహ్మణుల భోజనము కాఁగనే, వాతాపీ! రమ్మని పిలుచుచుండును. వాతాపి యాబ్రాహ్మణుల పొట్టచీల్చుకొని వచ్చుచుండును. అట్లను దినము వాతాపీల్వలులు బ్రాహ్మణులను జంపుచుందురు. వాతాపీల్వలు లిట్లు బ్రాహ్మణులను వంచనజేసి చంపుచున్నారని బ్రాహ్మణులగస్త్యునితోఁ జెప్పుకొనిరి. ఇల్వలునియొద్ద విశేషధనమున్నదనివిని యగస్త్యుఁడును, ముగ్గురురాజులును వీనియొద్దకు వచ్చిరి. ఇల్వలుఁడు వారిని గౌరవించి యథాప్రకారము వాతాపిని మేఁకనుజేసి వండి వీరికిఁ బెట్టెను. భోజనముకాఁగానే అగస్త్యుఁడు పొట్ట రాచుకొనుచు జీర్ణము - జీర్ణము వాతాపిజీర్ణముఅనియె. లోపలనున్న రాక్షసుఁడు జీర్ణమయ్యెను. ఇల్వలుఁడు పిలిచినను వాతాపి రాఁడయ్యె. వాతాపి జీర్ణమగుట నిల్వలుఁ డెఱింగి, విచారించి యేమియు నెఱుఁగనట్లు నటించి యగస్త్యునకు నమస్కరించి వారు కోరిన ధన మిచ్చెను. భార.

ఈశానుఁడు:- అష్టదిక్పాలకులలో నొకఁడు. ఈశ్వరుని మూర్తి.

ఈశానుఁడు:- కృష్ణుఁడు గోలోకమున నుండఁగ నతని వామనేత్రమున భయంకరుఁడు, త్రినేత్రుఁడు, వ్యాఘ్రచర్మపరిధానుఁడు అగు ఈశానుఁడు పుట్టెను. బ్ర. వై.

ఈశ్వరుఁడు:- (చూడు శివుఁడు.)

ఉంఛవృత్తి:- ఒక బ్రాహ్మణుఁడు. ఇతఁడు ధర్మనిరతుఁడు. సత్యవ్రతుఁడు. కలిగినదానితోఁ దృప్తిపొంది యుండునుగాని యొకరినియాచించువాఁడు కాఁడు. కొంతకాలము పయో వాయు భక్షణముతోడ నేకాలముగడపెను. ఈబ్రాహ్మణుఁడు మహాజ్యోతియై సూర్యునిఁ గలసెను. భార.

ఉక్కు-భీముఁడు:- (చూడుము ఇనప భీముఁడు.)

ఉగ్రకుఁడు.- కద్రువ కుమారుఁడు. భార.

ఉగ్రపాండ్యుఁడు:- మధురానగరము నేలినరాజు. ఇతని తండ్రిసుందరేశ్వరుఁడుతల్లితటాతక. ఇతని భార్యకాంతిమతి. వీరపాండ్యుఁ డితని కుమారుఁడు. ఉగ్రపాండ్యుఁడు తొంబది తొమ్మిది యజ్ఞములు చేసెను. నూఱవయజ్ఞము కూఁడ జేసినచో నింద్రపద వీతనికే వచ్చునని యింద్రుఁడు భయపడి యితనినగరము ముంచివేయుమని సముద్రునితోఁ జెప్పెను. ఈ వార్త ఉగ్రపాండ్యునికిఁ గలలో సుందరేశ్వరుఁడు చెప్పెను. ఒకనాఁడు రాత్రి ప్రళయమువలె సముద్రము పొంగివచ్చెను. గాని సుందరేశ్వరునకు భయపడి వెనుకకుఁ బోయెను. పిమ్మట ఉగ్రపాండ్యుని దేశముపై వర్షము కురియకుండఁగ నింద్రుఁ డాజ్ఞాపించెను. ఇది యుగ్రపాండ్యునకుఁ దెలిసి పుష్కలావర్తకములను మేఘములను బంధించెను. అపు డింద్రుఁ డితనితో యుద్ధమునకు వచ్చెను. ఉగ్రపాండ్యుఁ డింద్రునితోఁ బోరాడి వాని నోడించెను. స్కాంద.

ఉగ్రశ్రవసుఁడు:- గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుడు భార.

ఉగ్రశ్రవసుఁడు:- సూతుఁడు; రోమహర్షణి పుత్త్రుఁడు. వైశంపాయనునివలనఁ బుణ్యకథలను నేర్చుకొని శౌనకాది ఋషులకుఁజెప్పెను. భాగ. భార.

ఉగ్రసేనుఁడు:- ఒక గంధర్వుఁడు; మునియను దాని కుమారుఁడు. భార.

ఉగ్రసేనుఁడు:- గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

ఉగ్రసేనుఁడు:- అనిరుద్ధునివంశమువాఁడు. సుబాహుని పుత్త్రుఁడు. ఇతనికుమారుఁడు శ్రుతసేనుఁడు. భాగ.

ఉగ్రసేనుఁడు:- జనమేజయుని తమ్ముఁడు. సత్త్రయాగము చేయు చోటునకు సారమేయము రాఁగ దాని నితఁడు గొట్టెను. సరమ జనమేజయునియొద్దకు వచ్చి యితఁడిట్లు కొట్టెనని చెప్పుకొనియె. ఇతఁడు పూర్వజన్మమున స్వర్భానుఁడు. భార.

ఉగ్రసేనుఁడు:- పునర్వసువు కుమారుఁడైన యాహుకుని తనయుఁడు. దేవకుఁ డితని సోదరుఁడు. ఇతనికిఁ గంసుఁడు, న్యగ్రోధుఁడు, సునానుకుఁడు, సుభువు అను కుమారులును; శ్రుతదేవి, కంస, రాష్ట్రపాలిక యను కుమార్తెలును గలరు. కంసుఁ డితనిని బంధించి తానే పట్టము గట్టుకొని రాజయ్యెను. కృష్ణుఁడు

కంసుని వధించి యితనిని చెరనుండి విడిపించి రాజ్యాభిషిక్తునిఁ జేసెను. దేవకి యితని సోదరుని కుమారిత. కంసుఁ డితని క్షేత్రజ కుమారుఁడే గాని యౌరసపుత్త్రుఁడు కాఁడు. (చూడుము కంసుఁడు.) భాగ.

ఉగ్రాయుధుఁడు:- ఒక రాజు. మిక్కిలి శౌర్యవంతుఁడు. ఇతఁడు యుద్ధములు చేసి బహువురు రాజులను గెలిచి గర్వించియుండెను. శంతనుఁడు మరణించిన పిదపఁ గొన్ని దినముల కితఁడు భీష్మునిదగ్గఱకు నతని సవతితల్లి యగు సత్యవతిని దాను వలచియుండెననియుఁ, గావున నామెను దన కిమ్మనియు, లేనియెడల భీష్ముని వధించెదననియుఁ జెప్పుమని యొక దూతను బంపెను. అవి యశుచిదినము లగుటచే భీష్ముఁ డస్త్రములు దాకఁగూడదు గావున నుగ్రాయుధునకు నీతి చెప్పుమని మాత్రము వచ్చిన దూతతోఁ జెప్పెను. ఉగ్రాయుధుఁడు నీతిదప్పి భీష్మునిపైఁ జక్రము ప్రయోగించెను. కాని యది వానివైపే యెదురుతిరిగెను. అశుచి గడచిన పిమ్మట భీష్ముఁ డుగ్రాయుధునితో మూఁడు దినములు యుద్ధముచేసి తుదకు వీనిని సంహరించెను. హరి.

ఉగ్రాయుధుఁడు:- గాంధారి ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

ఉగ్రుఁడు:- గాంధారి ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

ఉగ్రుఁడు:- బ్రహ్మపుత్త్రుఁడు. బ్రహ్మ క్రీడింపఁగ ననేకవేల రాక్షసులు జన్మించిరి. వారు లోకమును బాధింపఁజొచ్చిరి. లోకస్థులు బ్రహ్మతోఁ జెప్పుకొనఁగ రాక్షసులపై నతనికిఁ గోపము వచ్చెను. అపుడే బ్రహ్మకు నుగ్రుఁడు పుట్టెను. రాక్షసులను సంహరింపుమని వీనితో బ్రహ్మ చెప్పెను.

ఘోరయుద్ధంబున రాక్షసులను దునుమాడి యాప్రకారంబు బ్రహ్మకు విన్నవింప పుత్రవధవిధ మాకర్ణించిన బ్రహ్మ శోకానలదందహ్యమానసుండై మండిపడుచు నుగ్రుని జూచిన నితఁడు భస్మమయ్యె. ఇట్లు జరిగిన పుత్రహత్యకు బ్రహ్మ మిక్కిలి విచారింప దక్షిణకాశికిపోయి తపస్సు చేయుమని శివుఁడు చెప్పెను. బ్రహ్మ యట్లుచేయ వానికి సరస్వతియందు బుభుఁడు జన్మించెను. కాశ.

ఉచథ్యుఁడు:- సోమునియల్లుఁడు. ఇతఁడు యమునావనికి స్నానమునకు వెళ్ళియుండినపుడు వరుణుఁ డితని భార్య నపహరించెను. ఈవార్త నితనితో నారదుఁడు చెప్పెను. దిక్పతియగువానికది తగని పనియని చెప్పుమని యుచథ్యుఁడు నారదునే పంపెను. వరుణుఁడీతని మాటలు లక్ష్యపెట్టలేదు. అంత నుచథ్యుఁడు వరుణునినగరమునకు వెళ్ళి యచట నుండు జలమునంతయు నింకిపోఁజేసెను. మఱియు నితని ప్రభావమున వరుణునిపురము ధూళిమయమాయెను. అద్దానికి వరుణుఁడు వెఱచి యుచథ్యునిభార్యను నతనికిచ్చెను. భార.

ఉచ్చైశ్శ్రవము:- ఇంద్రుని యశ్వము; క్షీరసాగరమును మథించినపిమ్మట నందుండి పుట్టెను. ఇది యొకనాఁడు సముద్రతీరమున నుండఁగ కద్రూవినతలు చూచిరి. వినత యీ యశ్వము ధవళముగ నున్నదనియె. కద్రువ దాని వాలము కడ నలుపుగలదనియె. అట్లీ యశ్వ మిఱువురి వైరమునకు గారణమయ్యెను. భార. భాగ.

ఉతథ్యుఁడు:- బృహస్పతిసోదరుఁడు. ఇతనిభార్య మమత. దీర్ఘతముఁ డీతని పుత్త్రుఁడు. ఇతనిభార్యతోడనే బృహస్పతి బలవంతముగ రమించెను. భార.

ఉత్కలుఁడు:- సుద్యుమ్నుఁడు స్త్రీయై, బుధుని వలనఁ బడసిన కుమారుఁడు. భాగ.

ఉత్కలుఁడు:- వాయుపుత్త్రికయైన ఇలయందు ధ్రువునకుఁ బుట్టిన కుమారుఁడు. ఇతఁడు మిక్కిలి భక్తిపరుఁడు. సదాభక్తిపరవశుఁడై యుండుటచే నీతని నున్మత్తునిగాఁ దలఁచి ప్రథమపుత్త్రుఁడైన వత్సరునికిఁ బట్టముగట్టిరి.

ఉత్తముఁడు:- ఉత్తానపాదునకు సురుచియందుఁ బుట్టిన కుమారుఁడు. ధ్రువునకు సవతిసోదరుడు. ఉత్తానపాదునకు సురుచియం దెక్కుడు ప్రేమ యుండుటచే నీతనియందు నెక్కుడు మక్కువ కలిగి యుండువాఁడు. ఉత్తానపాదుఁడు రాజ్య మితనికే యిచ్చెను.

ఉత్తముఁడు బహుళయను సుందరిని బెండ్లియాడెను. ఆమె నితఁడు ప్రేమించుచుండినను నీమె వానియెడ నుపేక్షాభావము కలిగి యుండె

తిది. ఒకనాఁ డుత్తముఁడు బహుళకు మధురసము నొసఁగ నామె నలుగురిలోను భర్తను దిరస్కరించినది. అంత నుత్తమునకుఁ గోపమువచ్చి యామెను గాననముల విడువుఁడని భటులకాజ్ఞ నిచ్చెను. ఆమెయు సుఖపడితి ననుకొని వనముల కేగెను.

పిమ్మట గొంతకాలమునకొకనాఁడు సుశర్మ యను బ్రాహ్మణుఁడితని కొలువులోనికి వచ్చి, రాజా! నాభార్య నెవ్వఁడో యెత్తుకొనిపోయెను. నీవువచ్చి నాభార్యను నాకిప్పింపుము అని ప్రార్థించెను. ఆమె యెట్లుండునని రాజు ప్రశ్నించెను. పొట్టదియు, నల్లనిదియు, ముసలదియుఁ, గురూపి యనియు సుశర్మ చెప్పెను. అట్టి దానికై నీకు విచారమేల? వేఱొకదానిని బరిణయము కమ్మని యుత్తముఁడు బోధించెను. కాని యెట్టిదైనను భార్య రక్షింపఁబడవలయునని యాబ్రాహ్మణుఁడు ప్రత్యుత్తరమిచ్చెను. అంతట నుత్తముఁడు రథ మెక్కి యామెను వెదకుటకై కాననముల కేగి త్రికాలజ్ఞుఁడను మునియాశ్రమము చేరెను. ముని శిష్యుని బిలచి రాజున కర్ఘ్యము తెమ్మని చెప్పెను. కాని యర్ఘ్యము తీసికొనిరాక చక్కగ నాలోచించి యాజ్ఞనిమ్మని శిష్యుఁడు పలికె. రాజు భార్యావిహీనుఁడగుట మనమువం దారసి ముని యాతని కర్ఘ్యమియ్యక యతఁడు వచ్చినపని యేమని యడిగి తెలిసికొని తన దివ్యదృష్టివలన సుశర్మ భార్యను బలాకుఁడను దనుజుఁ డపహరించెనని యెఱిఁగించెను. నాకేల యర్ఘ్యమీయ వని రాజడుగఁగ భార్యావిహీనులర్ఘ్యమందుటకు నర్హులుకారని ముని బదులుపలికెను. అచటనుండి యుత్తముఁడు వెదకుకొనుచు బలాకుఁడుండిన తోటువకుఁబోయి బ్రాహ్మణస్త్రీని జూచెను. దనుజుఁడామెను దెచ్చియు నామెనుభక్షింపక, నామెతో భోగింపకయు నామె వచ్చుట దాచియుంచెనని యా వనిత రాజుతోఁ జెప్పెను. రాక్షసుఁడట్లుంచుటకుఁ గారణమేమని యతఁడు విస్మయపడి దనుజునివద్దకుఁ జేరెను. వాఁడాతిథ్య మిచ్చి, సుశర్మ రాక్షసవధమనమునఁ దలఁచి క్రతువులు చేయుచున్నాఁడనియు, నతనిని భార్యాహీను నిగచేసినయెడలఁ గర్మలొనరించుటకధికార మతనికి లేకుండబోవుననియు నందులకే యామెనుదాచి యుంచెననియుఁ జెప్పి రాజానతి యయ్యెనేని యామెను బ్రాహ్మణున కిత్తుననియు. మఱియు నుత్తముఁడు తలఁచినపుడు వచ్చి యతనిపంపు సేయుదుననియు; ఉత్తముని యాజ్ఞచొప్పున నామె దౌశ్శీల్యము మ్రింగివేసి సుశీలనుజేసి యామెభర్త యింటికడ దించెను. అచ్చటినుండి యుత్తముఁడు త్రికాలజ్ఞునికడకు మరల వచ్చి తన భార్య యున్నచో టెఱింగింపుమని ప్రార్థించెను. ఆమె పాతాళకుఁడను సర్పరాజుచే హరింపఁబడి యతని కూఁతురగు నందచే రక్షింపఁబడుచున్న దని ముని తెల్పెను. ఉత్తముఁడు బలాకునిఁదలఁచు కొని తనభార్యయున్న తావెఱింగించి యామెను దోడ్కొనిరమ్మని యానతిచ్చె. బలాకుఁ డామెను దీసికొనివచ్చెను. సుశర్మయు వచ్చి మిత్రవిందేష్టిగావించియామెను పావనిగఁజేసెను. అప్పటినుండియు నుత్తముఁడును, బహుళయు సుఖముగ నుండిరి. వారికి ఉత్తముఁడను కుమారుఁడు జన్మించెను. ఇతఁడే ఉత్తమ మనువయ్యెను. మార్క.

ఉత్తముఁడు వివాహము లేకుండ మృగయార్థము హిమగిరి ప్రాంతమున సంచరించు చుండఁగ యక్షులు సంహరించిరి. భాగ.

ఉత్తముఁడు:- ఉత్తమునకు బహుళయందుఁబుట్టిన కుమారుఁడు. ఇతఁడు మనువయ్యెను. ఇతని మన్వంతరమున సుశాంతి యనువాఁ డింద్రుఁడు. వసిష్ఠపుత్త్రులు సుతేజనుఁడు, సుతపుఁడు మొదలగువారు సప్తఋషులు. ఇతని మన్వంతరము డెబ్బదియొక్క మహాయుగములు. మార్క.

ఉత్తముఁడు:- మూడవమనువు - ప్రియవ్రతుని కుమారుఁడు. పవనుఁడు, సృంజయుఁడు, యజ్ఞహోత్రుఁడు మొదలగువారితని కుమారులు. సత్యజిత్తు అనువాఁడు, ఇంద్రుఁడు, ప్రమదుఁడు మొదలగు వసిష్ఠపుత్త్రులు సప్తఋషులు. భార.

ఉత్తమౌజుఁడు:- ద్రుపదుని (దృష్టద్యుమ్నుని) కుమారుఁడు. అశ్వత్థామ వీనిని నిద్రించుచుండఁగ సంహరించెను. భార.

ఉత్తర:- విరాటరాజకుమారిక. విరటునొద్దనజ్ఞాతవాసము చేయుచున్నపు డర్జునుఁడీమెకు నృత్తాది విద్యలను నేర్పెను. ఈమెను నర్జునుని సుతుఁ డభిమన్యునకిచ్చి వివాహముచేసిరి. వివాహమైన యచిరకాలములో గర్భిణిగ నుండగనే యామె

పతి యుద్ధమందు మరణించెను. అశ్వత్థామచేఁ బ్రయోగింపఁబడిన బ్రహ్మశిరమను నస్త్రమీమె గర్భస్థుఁడైన శిశువును బాధించెను. ఈమె కృష్ణుని బ్రార్థింపఁగ నాతఁడు బాలుని రక్షించెను; ఈమె కుమారుఁడే పరీక్షితు.

ఉత్తరకుమార ప్రజ్ఞలు:-(చూడుఉత్తరుఁడు.)

ఉత్తరుడు:- విరాటరాజుకుమారుఁడు. పాండవు లజ్ఞాతవాసము చేయుచు విరాటనగరమునందుండు నప్పటి కితఁడు యుద్ధములు చేయఁగల్గిన వయస్సు కలవాఁడై యుండెను. గోగ్రహణమునకై సుశర్మ సేనతో రాఁగ నతని నెదుర్కొనుటకు విరాటుఁడేగెను. అప్పుడే కొందఱు గోపాలకులు వచ్చి మఱియొకదిశనుండి కొందఱు శత్రురాజులువచ్చిరనియు, వారు గోవులంబట్టుకొని పోవుచున్నారనియు నుత్తరునితో మొఱపెట్టుకొనిరి. 'సారథి లేఁడుగాని, యున్నచో నే బోయి శత్రువుల నందఱను దునుమాడి యొక్క నిమిషములో జయమొంది రానా!' యని కోటలోని స్త్రీల యెదుట నుత్తరుఁడు బీరములు పలుకుచుండెను. ఈ మాటలు వినుచుండిన సైరంధ్రి (ద్రౌపది) బృహన్నల రథమును నడుపఁగలఁడు; అతనిని గొనిపొండని చెప్పెను. తోడనే యుత్తరుఁడు బృహన్నలను రావించెను; రథమును సిద్ధపరపించెను. తాను రథాసీనుఁడయ్యె; బృహన్నల యుద్ధభూమికి రథముపై తోలెను. అచ్చట నుత్తరుఁడు భీష్మాదిరాజులను జూచెను; భయమందెను. తాను యుద్ధము చేయఁజాలనని, రథమును మరల్పుమని బృహన్నలను వేడెను. కాని సారథి రథము త్రిప్పలేదు. ఉత్తరుఁడు రథమునుండి యుఱికి పాఱిపోయెను. బృహన్నల (అర్జునుఁడు) తానును రథము దిగి యుత్తరుని బట్టుకొని వానికి ధైర్యము చెప్పి యతనిని సారథిగ నుండుమనియుఁ, దాను యుద్ధము చేసెదననియు బోధించెను. పిమ్మట నర్జునుఁడు తాను శమీవృక్షముపై దాఁచి యుంచిన గాండీవమును జూపి, చెట్టునెక్కి దానిని దీసి యిమ్మని చెప్పెను. శవమువలె గనుపించుచున్న దానిని దాకుటకు నుత్తరుఁడు సందేహించె. అది గాండీవమను నస్త్రమనియుఁ, బాండవులు దానిని దాచినటువంటి విధమును నర్జునుఁడు చెప్పెను. అప్పుడైన నుత్తరుఁడు బృహన్నలయే యర్జునుఁడని యూహించలేకపోయె. తానే యర్జునుఁడనని స్పష్టముగ నర్జునుఁడు చెప్పెను. అంత నుత్తరుఁడు ధైర్యము పూని సారథియయ్యెను. యుద్ధమునకుఁ బూర్వమే యర్జునుఁడు దేవదత్తమును బూరించెను. ఆ నాదమునకు నుత్తరుఁడు స్మృతి లేక పడిపోయెను. వానిని దీసి రథముపైనుంచి యర్జునుఁ డొక్కఁడే యుద్ధముచేసి గెలిచెను. వీరు మఱల నగరమునకు వచ్చినపిమ్మట నుత్తరుఁడు పాండవుల నెఱింగి వారియెడ మిక్కిలి భక్తియు, విధేయతయుఁ గలవాఁడైయుండెను. భార.

ఇతని పుత్త్రిక యగు ఇరావతినిఁ బరీక్షిత్తున కిచ్చి వివాహము చేసెను. భాగ.

ఉత్పలావతి:-దృఢధన్వుని కుమారిత. ఒకనాఁడు మృగములు రెండు క్రీడింపఁబోవుచుండగ నీమె మృగిని బెదిరించెను. అది పాఱిపోయెను. ఆమృగము తన నిజరూపమైన మనుష్యరూపము ధరించి (అతఁడు సుతపుఁడనువాఁడు) నా భోగమునకు భంగము కల్పించితివి. నన్ను బతిగా నెమ్ము. లేనా నిన్ను శపించెద ననియె. ఆమె వానిని నిరాకరించెను. ఆ నరుఁడు నీవు మృగివగుమని శపించెను. అంత నుత్పలావతి దీనయై ఆర్యా! నీ వెఱుఁగనిది గలదా? కన్యను దలిదండ్రులీవలయుఁగాని తనంతఁ దా నిచ్చుకొనునా? నాకు శాప విమోచనము ప్రసాదింపుమని వేడగ, ఈ జన్మమునఁగాక, జన్మాంతరమున మృగివగుదువు; పూర్వజన్మ వాసన నీ కుండును; లోలుఁడను మునీంద్రుఁడు నీ గర్భమునఁ బ్రవేశించును; అపుడు నీకు మనుష్య భాషయుఁ గల్గును; అతఁడు జన్మించిన పిమ్మట నీకు శాపవిమోచన మగునని చెప్పెను. ఉత్పలావతి సురాష్ట్రుఁడను రాజును బతియయ్యెను. భర్తృకంటె నామెయె ముందు చనిపోయి శాపవశమున మృగియై చరించుచుండెను. సురాష్ట్రుఁడు రాజ్యము పోగొట్టుకొని కాననములలోఁ దిరుగుచు నొక నదియేఱు దాటఁబోవుచు నందీమృగమును జూచి, దానివాలము పట్టుకొని యీఁదుచు దాని పుచ్ఛమూలమును గరముతో స్పృశించెను. దానివలన మృగము గర్భము ధరించెను. ఆ మృగికి మనుష్యవాక్కుగూడ వచ్చి నీ వంవరాజాచే నేల కొఱికెను పొందెదవని రాజానడిగెను. సురాష్ట్రుఁడు విస్మ

కుఁడై నీవృత్తాంతము చెప్పుమని కోరఁగ నీమె చెప్పెను. ఆమెకుఁ బుత్త్రుఁడు కలిగె. మును లందఱు వచ్చి పుత్త్రుని దర్శించి వానికిఁ దామసుఁడని పేరుపెట్టిరి. అతఁడే తామసుఁడను మనువయ్యె. మార్క.

ఉత్పలావతి:- ఒక అప్సరస.

ఉత్తానపాదుఁడు:- అనంతా స్వాయంభువుల కుమారుఁడు. ఇతనిసోదరుఁడు ప్రియవ్రతుఁడు. ఉత్తానపాదునకు సునీతి (సూనృత), సురుచియను నిఱువురు భార్యలు గలరు. సునీతి (సూనృత) యందు ధ్రువుఁడును, సురుచియందుత్తముఁడును నను కుమారులు జన్మించిరి. ఇతనికి రెండవ భార్యయైన సురుచిపై ప్రేమ మెండు. బాల్యమున ధ్రువుఁ డీతని తొడపైఁ గూర్చుండఁగ సురుచి వానిని దింపివేసి తనకుమారుఁడే తండ్రి యొడిలోఁ గూర్చుండనర్హుఁడనెను దానికితఁడు సైచి యూరకుండెను. భాగ. మత్స్య.

ఉదంకుఁడు:- భృగువంశమువాఁడు. గౌతముని శిష్యుఁడు. గౌతముఁ డితరశిష్యులకు వరము లిచ్చి పంపి యితని దనఁ జూడకున్నను నుదంకుఁ డసంతుష్టిఁ బొందక భక్తితో గురువును గొలుచుచుండెను. ఒకనాఁడు కట్టెలమోపు తెచ్చుచుండఁగ నతని జడ మోపులోఁ జిక్కుకొని యూడి పోయెను; అది నెరసియుండుట చూచి ఉదంకుఁ డేడ్చుచుఁ గూర్చుండెను. అతని యశ్రుధారలను గ్రిందఁబడనీయకుము. నీదోసిటఁ బట్టుమని గౌతముఁడు తన పుత్త్రికను బంపెను. ఆమె దోసిలొగ్గి యుదంకుని కన్నీటి వేడికిఁ దాళలేక నేలపై వానిని విడచెను. దానికిఁ బృథ్వియుఁ దహతహలాడెను. గౌతముఁడు శిష్యునికడకు వచ్చి యేల యేడ్చుచున్నాఁవని యడుగఁగ నితర శిష్యులపై నీ వచ్చుదయ నాపైఁ నేల రాదని యుదంకుఁ డడిగెను. నీ కెల్ల ప్రాయ మిచ్చెదను. మఱియు నాకూఁతురు నట్లొక తన్విగఁ జేసి నీకిచ్చెదను. దీనిం బరిణయము కమ్ము అని గౌతముఁడు చెప్పెను. ఉదంకుఁ డామెను బెండ్లియాడి సంప్రీతుఁడై నీకేమి కావలయును చెప్పుము. కొని వచ్చెదనని గౌతముని భార్య యగు నహల్యతోఁ జెప్పఁగ నామె, మిత్త్రసహుఁ డను రాజు దేవి మదయంతి యనునది కలదు. ఆ దేవికుండలములను దెచ్చియిమ్మని కోరెను. ఉదంకుఁడు బయలుదేఱి వనములో రక్తము పూసిన వంటితోనున్న రాజును జూచెను. వీనిని చూచి యారాజు నాకాఁకలి యగుచున్నది; నీవు మంచిసమయమునకు వచ్చితివి. నిన్ను భక్షించెదనని వీనిమీదకు వచ్చెను. నేను గురుకార్యమున నేగుచుంటిని; ఆ పని ముగిసినపిమ్మట నన్ను భక్షింపుమని యుదంకుఁడు చెప్పి, నీభార్య కుండలములే మాగురుపత్ని గోరినది. వానినిప్పింపుమని వేడెను. రాజు సరే యని వాని కానవాలిచ్చిన నుదంకుఁడు మదయంతికి దానిం జూపి యామె కుండలములను బుచ్చుకొనెను. నీ వశుచివిగ నుండినను, వానిని నేలపైఁ బెట్టినను నివి పోవును. వీనిని సురలు, గంధర్వులు, ఉరగములు నపహరింతురు. జాగరూకుఁడవై గొనిపొమ్మని యామె చెప్పెను.

ఉదంకుఁడు వచ్చుచు మార్గమున మిత్త్రసహుని జూచి, ఇవిగో కుండలములు; పుచ్చుకొంటిని. వీనిని మాగురుపత్నికిచ్చి వచ్చెదను. అప్పుడు నన్ను భక్షింపవచ్చునని పల్కెను. ఇతని గురుకార్యాపరత్వమునకును, సత్యసంధతకును మెచ్చుకొని రాజు విప్రులు పటుసమర్థులు. నాకు విప్రశాపమువలననే యీ దురవస్థ కలిగినది; దానిం బాపుమని చెప్పుకొనఁగ నుదంకుఁడు వానిశరీరము స్పృశించెను. దాన మిత్త్రసహుఁడు శాపవిమోచనుఁడయ్యె. మార్గమున వచ్చుచుండ నుదంకున కాఁకలి యగుటచేఁ గుండలము లొక చెట్టునకుఁ దగిల్చి యతఁడు చెట్టెక్కి పండ్లు కోసికొనుచుండెను. ఇంతలోఁ గాలికి చెట్టు కదలి కుండలములు క్రిందఁబడియె. వెంటనే పన్నగ మొకటి వచ్చి వానిని గైకొని నాగలోకమునకు బోయెను. దానిని దలుమటకై యుదంకుఁడు కఱ్ఱతో నేలను త్రవ్వ నారంభించెను. ఇంద్రుఁడు వచ్చి కఱ్ఱతో త్రవ్విన నాగలోకమునకుఁ బోవుదువే యని యడిగిన నాగలోకమున కరుగువఱకుఁ ద్రవ్వుచుందును; నాప్రాణములనైన విడచెదను గాని యత్నము మాననని యుదంకుఁడు ప్రత్యుత్తర మిచ్చె. అందుల కింద్రుఁడు మెచ్చుకొని యా కఱ్ఱను వాడిశూల మగునట్లు చేసెను; భూమియు వానికి వెఱచి మార్గమిచ్చెను. ఉదంకుఁడు నాగలోకమును జేరెను. అచ్చట నొక తురఁగము గోచరించి నా యపాన మొత్తి

యూదుము. నీకార్యము సిద్ధించునని చెప్పెను. ఆ యశ్వము తాను గౌతముని గురువగు నగ్ని యగుట నెఱింగించెను. ఉదంకుఁడట్లు చేసిన నశ్వముయొక్క ప్రతి రోమకూపమునుండి పొగ వెడలెను. దానికిఁ దాళజాలక యుదంకునికుండలములు సర్పములు తెచ్చి యిచ్చెను. వానిం దెచ్చి యుదంకుఁ డహల్య కిచ్చెను.

ఉదంకుఁడు తన యాశ్రమములోఁ దపసు చేసికొనుచుండఁగ భారతయుద్ధము ముగిసిన పిదపఁ గృష్ణుఁ డాతనియాశ్రమము ప్రక్కనుండి పోవుచు నితనిఁ జూడవచ్చెను. కౌరవులకును, పాండుపుత్రులకును యుద్ధము కల్పించి వారిని నాశనము చేసినవాఁ డితఁడని యుదంకునకుఁ గోపమువచ్చి కృష్ణుని శపించెదననియె. భారతయుద్ధకథ యించుక తెల్పి కృష్ణుఁడు తా నీశ్వరుఁ డగుట తెలియజేసి యతనికి విశ్వరూపముఁ జూపి వరము వేడుకొను మనెను. నిదర్శనము తప్ప వేఱొకవరముగలదే యని యుదంకుఁడన నీకోరిన దిచ్చెద నడుగుమని కృష్ణుఁడు పలుకుటచే నిది మరుదేశము; జలమున కిక్కట్లు కలదు. కోరినప్పుడు జలముండునట్లు వరమిమ్మని వేడెను. కృష్ణుఁడు నల్లెయని తనను దలఁచుటతోడనే జలము వచ్చునని చెప్పెను. ఒకనాఁడుదంకునకు దప్పికలిగి కృష్ణుని దలఁచుకొనెను. అంత నొక మాలవాఁడు ఒడలునిండఁ గుక్కలు గలవాఁడు వచ్చి నీవు జలము గోరితివి కాఁబోలు త్రాగు మిచ్చెదననియె. వీని రూపు చూచి యేవగించి యుదంకుఁడు నాకక్కఱలేదని చెప్పెను. అపుడు కృష్ణుడు వచ్చి వచ్చినవాఁ డింద్రుఁడనియు, నుదంకున కమృత మిమ్మని యతనిని బంపగ మనుజుల కమృతి మివ్వలేక, కృష్ణునిమాట దీసి వేయనులేక యట్లు చేసెనని చెప్పి తనవరము తప్పకుండ జలమిచ్చెదనని చెప్పెను. భార.

ఉదంకుఁడు:-పైలుని శిష్యుడు. గురుపత్నినియోగంబునఁ బౌష్యమహాదేవి కుండలములను దేరఁ బోవుచు వనములో వృషభము నెక్కి చను వానిఁ జూచి వాని పన్నిన వృషభగోమయ భక్షణము చేసి త్వరితగతిని బౌష్యమహారాజు కడకుఁ జని కుండలముల నడిగెను. అతఁడు తన భార్య నడిగి తీసికొని పొమ్మనియె. ఉదంకుఁ డంతఃపురమునకు వెడలెను. కాని యచ్చట దేవి గానఁబడలేదు. మునిశిష్యుఁడు మరఁడ రాజుకడకు వచ్చి దేవి నాకుఁ గానవచ్చుటలేదు. నీవే యిప్పింపుమని యడిగెను. నీ వశుచివై యుంటివి కాఁబోలు. అందువలననే నాదేవి నీకుఁ గనఁబడుట లేదు. శుచివై పొమ్మనిన నుదంకుఁడు కాళ్ళు చేతులు కడుగుకొని యాచమించి తిరిగి యంతఃపురమునకుఁబోయి యామెను దర్శించి కుండలముల నడిగి తెచ్చుకొనెను. వానిని దక్షకుఁ డపహరింపఁ జూచును. భద్రముగ నుంచుమని యామె చెప్పెను. రాజాతనిని దనయింట భుజించి వెళ్ళుమనియె. భుజించుచుండగ నుదంకునకు నన్నములోఁ దలవెంట్రుక వచ్చెను. అతనికిఁ గోపమువచ్చి నీ వంధుఁడవు కమ్మని రాజును శపించె. రాజు నీ వపుత్రకుఁడవు కమ్మని బ్రాహ్మణునకుఁ బ్రతిశాప మిచ్చెను. శాపము మరలింపు మని యితఁడు రాజును గోరెను. కాని రాజు తన కది యసాధ్యమనియె. స్వల్పకాలములోనే రాజు శాపవిముక్తుఁ డగున ట్లితఁడనుగ్రహించె. కుండలములు పట్టుకొని వచ్చునపుడు జాగరూకుఁడవై యుండుమని రాజుబోధించెను. ఉదంకుడు వానిని దెచ్చుచు నొకచోఁ గొలను గట్టున వానినుంచి యాచమించుటకుఁ దానందు దిగెను. ఇంతలో తక్షకుఁడు వచ్చి కుండలముల నపహరించెను. ఉదంకుఁడు వచ్చి చూచుకొని తక్షకుం డపహరించుట గ్రహించి యురగలోకమునకు వానిని దఱిమి యచ్చట నాగపతులను స్తుతించెను. ఒక దివ్యపురుషుఁడు ప్రత్యక్షమైన వానివలన నురగకులము తనకు వశమగునట్లు వరము పుచ్చుకొని నాగలోకమున మహాక్షోభము గావించె. దాన దక్షకుఁడు భయపడి కుండలములను దెచ్చి యిచ్చెను. ఆ దివ్యపురుషుఁ డితనికిఁ దన గుఱ్ఱ మివ్వఁగ దానినెక్కి యతిరయమున వచ్చి గురుభార్యకుఁ గుండలము లిచ్చి ధన్యుఁడయ్యె. తాను వనములోఁ జూచిన పురుషుఁ డింద్రుఁడనియు, వాని వాహనము ఐరావతమనియుఁ, దాభక్షించిన గోమయ మమృతమనియు నెఱింగి దాను నాగలోకమునఁ జూచిన విశేషములను గురువు వలనఁ దెలిసికొనియె. ఉదంకుఁడు తక్షకుఁడు చేసిన యపరాధము మఱచిపోలేదు. సత్త్రయాగము చేయుచున్న జనమేజయు నొద్దకువచ్చి రాజా! నీ తండ్రి మరణమునకుఁ

దక్షకుఁడే కారణము. వానిపగ నీవు సాధింప వలయును. తక్షకవంశ నాశన కరమైన సర్పయాగము చేయుమని ప్రోత్సహించి జనమే జయునిచే సర్పయాగము చేయించెను. భార.

ఉదంకుఁడు:-ఒక ముని. విష్ణుమూర్తినిగూర్చి తపసుచేయుగ నతఁడు ప్రత్యక్షమై వరము వేడుకొనుమన, నీరూపుమాచితి నిదియె చాలు. ఇంతకంటె వరమేది? నామనస్సు సత్యధర్మంబు లందు శమంబునందు దక్షిణమై నీయందు భక్తి కలిగియుండునట్లు వరమిమ్ము అనియె. విష్ణు విచ్చి నీకు పరమ యోగజ్ఞానంబు కలుగు. నీవలన నొక్క మహాకార్యంబు గావలయు. ధుంధుఁ డను రాక్షసుఁడు లోకంబుల కుపద్రవంబు చేయువాఁడు. వీనిని సంహరింప కువలయాశ్వుని ప్రోత్సహించు వాఁడవు. నా ప్రసాదంబైన యోగబలంబునను, నీయోగబలంబునను రాక్షసుని జంపగలవాఁడు అని చెప్పెను. ఇతని ఆశ్రమము కడనే ఆ రాక్షసి బిలము చేసికొని యుండెను. అతని నిశ్వాసములచే కాననము వడకుచుండెను. అచ్చట నివాస యోగ్యము కాకుండెను. ఇతఁడు అయోధ్యరాజు బృహదశ్వుని కడకు బోయి దనుజుని సంహరింపు మనియె. అతఁ డపుడే రాజ్యము తన పుత్రుఁడైన కువలయాశ్వుని కప్పగించి అరణ్యమునకుఁ బోవనుండె. కావున తిరిగి యస్త్రము పట్టనని తన కుమారుని గోరుకొనెను. ఇతఁడు కువలయాశ్వుని దీసికొని వచ్చెను. అతఁడు ధుంధుని జంపెను.

భార.

ఉదరశాండిల్యుఁడు:-ఒక ఋషి. ఉద్గీథవిద్య నేర్చినవాఁడు. అతిధన్వునిశిష్యుఁడు. ఛాన్దో.ఉ.

ఉద్దాలకుఁడు:-అరుణికుమారుఁడు. ప్రాచీనశాలుఁ డును, సత్యయజ్ఞుఁడును వేదముల సాంగముగఁ జదివియు, బ్రహ్మస్వరూపము నెఱుఁగక దానిని తెలిసికొనగోరి యతని యాశ్రమమునకు వచ్చుచుండిరి. వీరిని దూరమునుండియె చూచి వారు వచ్చిన పని తెలిసికొని, ఉద్దాలకుఁడు వారు సమీపింపఁగనే మీరడుగు నంశమును నేను పూర్ణముగ నుపదేశింపఁజాల. కేకయాధిపతియగు అశ్వపతి మీరు తెలిసికొనఁగోరిన బ్రహ్మస్వరూపము బాగుగ నెఱుఁగును. వాని కడకుఁ బోయి నేర్చుకొందము అని ఇతఁడును వారి వెంబడి వెళ్ళెను. ఆ రాజు వీరికమిత ధన మొసంగెను గాని వీరు ధనార్థులము గామని సమిత్పాణులై వానిం జేరి బ్రహ్మస్వరూపమును వానివలనఁ దెలిసికొనిరి. ఛాన్దో. ఉ.

ఉద్దాలకుఁడు:- ఒక బ్రాహ్మణుఁడు. బ్రహ్మచర్యము ముగిసినపిదపఁ జండికయను కన్యను వివాహమాడెను. ఆమె మిగుల దుష్ప్రవర్తనతో నుండెడిది; ఉద్దాలకుఁ డేమి చెప్పినను దానికి వ్యతిరేకముగ నడచుచుండెడిది. పాపము; ఉద్దాలకుఁడు బ్రహ్మచర్యమునకును, గార్హస్థ్యమునకును గూడఁ జెడితినని విచారించుచుండువాఁడు. ఒకనాఁడు తన యవస్థనంతను కౌండిన్యమునితోఁ జెప్పుకొని యేడ్చెను. 'చేసికొనిన భార్యను విడిచిపెట్టరాదు; నీవు చెప్పినదానికి వ్యతిరేకముగఁ జేయుచుండునంటివి కనుక నీకుఁ గావలసినదానికి వ్యతిరేకముగఁ జెప్పుచుండుమని కౌండిన్యుఁ డుపాయము చెప్పెను. ఉద్దాలకుఁ డట్లే చేయుచుండి తన కార్యసాఫల్యము నొందుచుండెను. ఒకనాఁ డతనియింటఁ బితృకార్యము వచ్చెను. నేఁడు పితృకార్యము; నేను బ్రాహ్మణులను భోజనమునకుఁ బిలచెదను. నీవు స్నానము చేయకుండ యశుచివై వంటచేయుము అని యుద్దాలకుఁడు చెప్పెను. ఆమె ప్రొద్దుటనే లేచి, స్నానము చేసి, మడిగ వంటచేసెను. బ్రాహ్మణులు భోజనమునకుఁ గూర్చుండిరి. నీవు వడ్డించకుమని భర్త చెప్పఁగ, నామెవచ్చి వారలకు గావలసినవి వడ్డించెను. ఎట్టిభంగము రాకుండఁగ దనకార్యము లన్నియు జరుగుచుండుట చూచి యుద్దాలకుడుబ్బిఆనందముపట్టజాలక, యిచ్చట పాఁణమున్నది; దానిని జాగ్రత్త పెట్టుమని చెప్పెను. ఆమెవచ్చి దానిని బెంటమీఁద పారవేసెను. ఉద్దాలకునకుఁ గోప మాగినది కాదు. నీవు వింధ్యపర్వతమందు శిలవై పడియుండుమని యామెను శపించెను. ఆమె శాపవిమోచనము చేయుమని యేడ్చెను. ధర్మజుని యాగాశ్వము త్రొక్కఁగ నీకు శాపవిమోచనము కలుగునని యితఁడు చెప్పెను. జై. భా.

ఉద్దాలకుఁడు:- ఒక ముని. శ్వేతకేతుని తండ్రి అష్టావక్రుని మేనమామ. ఇతని గృహమునకు

వచ్చిన యతిథి యొకఁడీతని భార్యను గామించి యామెతో రమించెను. భార.

ఉద్ధవుఁడు:-దేవభాగుని కుమారుఁడు. వృష్ణి వంశమువాఁడు. కృష్ణునకు మిత్రుఁడు. కంసుని సంహరించిన పిదప నందాదిగోపకుల కితనిచే సందేశ మంపెను. కృష్ణుని నెడబాసి గోప కాంతలు నిలువలేకపోవుట నితనితోఁ జెప్పి కొనిరి. ఇతఁడు మఱల కృష్ణుకొద్దకు వెళ్ళెను. వారిరువురు కుబ్జ గృహమునకును, నచ్చటినుండి యక్రూరునికడకును వెళ్ళిరి. భాగ.

ఉద్ధవుఁడు:-అయిదేండ్ల బాలుఁడై యున్నపుడే తనతో ఆడుకొను ఒక బాలుకనే కృష్ణుఁడుగ తలంచి వానికి పరిచర్యలుచేయుచు తల్లి అన్నము నకు పిలిచినను వెళ్ళలేదు. తీర్థయాత్ర చేసి వచ్చినవారి కితఁడే కృష్ణనిర్యాణ మెఱింగించెను. భార.

కృష్ణుఁడుచేసిన జ్ఞానబోధ తనకు తెల్పుమని విదురుఁ డితని నడిగెను. మైత్రేయునికడ తెలిసి కొనుమని ఇతఁడు చెప్పెను.

యాదవులు, వృష్ణులు పరస్పరహతులై మర ణించినను ధరపై జ్ఞానము విస్తరింపజేయుటకు, మరణించకుండ ఉద్ధవుడు మిగిలి, ఆవల బదరికా వనమున కేగె. భార.

ఉన్నాభుఁడు:-శలునికుమారుఁడు; ఇతని కుమా రుఁడు వజ్రనాభుఁడు. రఘు.

ఉన్మత్తుడు:-మాల్యవంతుని కుమారుఁడు.

ఉపకీచకులు:-కీచకుని (సింహబలుని) తమ్ములు. విరాటరాజు బావమఱుఁదులు. కీచకుని మరణము నకు ద్రౌపదియే కారణమని పీ రాచెంతఁ దిరుగు లాడు చుండిన సైరంధ్రిని (ద్రౌపదిని) బట్టి కీచ కుని శవమునకుఁ గట్టి దహనముచేయుటకై తీసి కొని వెళ్ళిరి. ద్రౌపది యేడ్పువిని భీముఁడు దాపుననున్న వృక్షమును బెఱికి యుపకీచకుల మీఁదకు వెళ్ళెను. వారు వీనిని జూచి భయపడి శవమును, ద్రౌపదిని విడిచి పాఱిపోయిరి. కాని భీముఁడు తఱిమి వారిని బట్టుకొని సంహరించెను. భార.

ఉపకోసలుఁడు:-కమలుని పుత్త్రుఁడు; సత్యకాముని శిష్యుఁడు. వీనితోడి యితరశిష్యులకు వివాహ మున కనుజ్ఞ యిచ్చి వీనికి బ్రహ్మవిద్య నేర్పగోరి సత్యకాముడు వీనిని దనయింటనే యుంచెను. అందఱికంటెను నెక్కువ శ్రద్ధాభక్తులు కలవాఁ డీతనికేల గృహస్థాశ్రమమున కనుమతి నీయవని సత్యకాముని భార్య తనభర్త నడిగెను. గురు వనుజ్ఞ నీయకుండుట యుపకోసలునకును గష్టము గానే యుండెను. గురు వీతనితోఁ గారణము చెప్పకయుండె. మఱియు నతఁడు గ్రామాంతర మేగుచు నగ్నులకుఁ బరిచర్య చేయుచుండుమని వీనినే నియోగించెను. ఉపకోసలుఁడు గురు వనాదరణమునకు దుఃఖించుచు నన్నము తినుట మాని యగ్నులకు బరిచర్యలు చేయుచుండెను. అగ్నులు సంప్రీతులై వీనికి బ్రహ్మజ్ఞానము నెఱుకచేసెను. సత్యకాముఁడు మఱలివచ్చి శిష్యుని జూచి నీముఖమున బ్రహ్మజ్ఞాన చిహ్న ములు గలవు. నీ కెవరు నేర్పిరి? అని యడిగెను. అగ్నులు నేర్పెనని యతఁడు చెప్పి బ్రహ్మ జ్ఞానము గురువులవలన నేర్చుకొనవలయును గాని సత్యకామునిగూడ దాని నుపదేశింపుమని కోరి యతనివలన నుపదేశము నొందెను. ఛాన్దో. ఉ.

ఉపచిత్రుఁడు:-గాంధారీ ధృతరాష్ట్రులపుత్త్రుఁడు. భార.

ఉపదానవి:-వైశ్వానరునికుమారిత. హిరణ్యాక్షుని భార్య. భాగ.

ఉపనందుఁడు:-గాంధారీధృతరాష్ట్రుల పుత్త్రుడు. భార.

ఉపపాండవులు:—ప్రతివింధ్యుఁడు, శ్రుత సోముఁడు, శ్రుతకీర్తి, శతానీకుఁడు, శ్రుతసేనుఁడు ననువారలు; వీరు ద్రౌపదియందుఁ గ్రమముగ ధర్మజ, భీమార్జున, నకుల, సహదేవుల వలనఁ బుట్టిరి. భార.

వీరు పూర్వజన్మమున విశ్వులను దేవతలు. వీరు తమ మార్గమునఁ బోవుచు హరిశ్చంద్రుని భార్యయగు చంద్రమతిని విశ్వామిత్రుఁడు త్వరగ నగరము వెడలిపొమ్మని దూషించుచు బాధించుచుండుటఁ జూచి యిట్లు నిర్దయుఁడైన మునికిఁ బుణ్యలోక మెక్కడిది యని విశ్వా మిత్రునిగూర్చి తమలోఁదాము చెప్పుకొనిరి. ఆ మాటలు విశ్వామిత్రుఁడు వినెను. అతనికిఁ గోపమువచ్చి యా దేవతలను నరులై పుట్టుఁడని

శపించెను. దేవతలు శాపమును గ్రమ్మరింపుమని కోరిరి. విశ్వామిత్రుని శాపము తప్పదుగావున మీరు భూమిపైఁ జిరకాలముండక బ్రహ్మచారులుగనే మరణించి యట్లు శాపవిముక్తి నొందుదురని యతఁడు చెప్పెను. మార్క.

ఉపపాండవులు రాత్రి నిద్రించుచుండఁగ నశ్వత్థామ సంహరించెను. అట్లు వా రవివాహితులై మరణించిరి. భార.

ఉపప్లావ్యము:-అజ్ఞాతవాసానంతరము యుద్ధము బూర్వము పాండవులు కొంతకాల ముండిన ప్రదేశము. భార.

ఉపబర్హణుఁడు:-ఒక గంధర్వుఁడు; సుందరులకుఁ బ్రియుండై క్రీడించుచుండువాఁడు. విశ్వస్రష్టలైన బ్రహ్మలు దేవసత్రమను యాగము చేయుచు నారాయణకథలు గానము చేయుటకై గంధర్వులను, నప్సరసలను బిలచిరి. ఉపబర్హణుఁడు గంధర్వగణముతో గలిసి వెళ్ళి కొంతసేపు పాడి యప్సరసలను జూచి మోహితుఁడై తొలఁగి చనియెను. అందువలన శూద్రయోనిం బుట్టుమని బ్రహ్మ వీని శపించెను. ఇతఁ డొక దాసికిఁ బుట్టి తరువాత భవంబున నారదుఁ డయ్యెను. భాగ.

ఇంద్రసభయందు రంభ నాట్యము చేయుచుండఁగ నుపబర్హణుఁడు చూచెను. అతనిమనసు చలించి రేతఃపతనమయ్యెను. ఆ సమయముననే బ్రహ్మ వీనిని జూచి నీవు శూద్రయోనిం బుట్టుదువని శపించెను. ఇతఁడు కళావతి యను గోపకామినికిఁ బుత్త్రుఁడుగఁ బుట్టెను. పిమ్మట ఉపబర్హణుని భార్యయగు మాలావతి బ్రహ్మను బ్రార్థించుటచేఁ గొంతకాలమున కాతనికి శాపవిమోచన మయ్యెను. బ్ర. వై.

ఉపమన్యువు:-ఒక బ్రాహ్మణబాలుఁడు. ఇతని బాల్యమునఁ దల్లియు, నితఁడును నడవిలోనే ఉండిరి. ఇతఁడు శైశవమున నొకనాఁడు పాలకొఱకేడ్వఁగఁ దల్లి నీటిలో బిండికలిపి త్రాగుమని యిచ్చెను. ఇతఁడు త్రాగి పాలుకావని గ్రహించి మఱల ఏడువసాగెను. ఈ యడవిలోఁ బాలు నేనెట్లు తెచ్చియివ్వఁగలనని తల్లి యడుగఁగ నేను సంపాదించెదనని యుపమన్యువు శివునిగూర్చి ప్రార్థించుట కేగెను. అతఁడు కొంతకాలము తపముచేసినపిమ్మట శివుఁడు వీనిం బరీక్షించుటకై యింద్రుని రూపమున వచ్చి నీ వేమి కోరుదువని యడిగెను. నిన్నేదియుఁ గోరను. శివునిగూర్చి ప్రార్థించుచుంటినని యితఁడు చెప్పెను. నీవు పసివాడవు. అంత తపము చేయలేవు. నీకు గావలసినది నేనిచ్చెదనని యాయింద్రుఁడనెను. కాని వాని నేదియుఁ గోరక యుపమన్యువు వానిపై మంత్రపూతమైన విభూతి చల్లెను. అంత శివుఁడు తన నిజరూపమును జూపి, యుపమన్యువు కోరినపుడెల్ల యాహారము లభించుటకై దధిక్షీరాంబుధులు సృజించెను. శివ.

ఉపయాజి:-ఒక బ్రాహ్మణుఁడు. యాజి తమ్ముఁడు; తపోమహిమ సంపన్నుఁడు. అనవరత తపోవ్యాసక్తుఁడు కాశ్యప గోత్రుఁడు. ద్రుపదుఁడు ద్రోణుని సంహరింపఁగల పుత్త్రుని బడయగోరి యీతనికడకువచ్చి అయ్యా! నీకు లక్షధేనువుల నిచ్చెదను. నాచేఁ బుత్త్రకామేష్టి సేయింపుమని వేడెను. నేను ప్రతిఫల మపేక్షింపను; దాని గోరువారికడ కరుగుముపొమ్మనెను. కాని ద్రుపదుఁ డీతని నే మఱియొక సంవత్సర మారాధించెను. శుచియగునో కాదో యెఱుఁగబడక చోటఁబడిన ఫలమును గ్రహించి మా యన్న దానిఁ గైకొనియె. ఫలార్థియైనవాఁడు తత్ఫలానుబంధంబులైన దోషంబు పరికింపఁడు. నీవు వాని నడుగుము అని పంపెను. పదపడి అన్న పిలువ నితఁడును యాగము చేయించెను. అతఁడు తన యన్నయగు యాజికడకువెళ్ళి యాతనిఁ బురోహితునిగాఁ గైకొనుమని చెప్పెను. భార.

ఉపరిచరవసువు:- ఒకరాజు; చేది దేశాధిపతి. ఇతఁడు గావించిన తపస్సునకు మెచ్చి యింద్రుఁడు తనయొద్దకు వచ్చుచుండుమని యతఁడు వచ్చుటకు వీలుగ నొక దివ్యవిమానమును, నొక కమలమాలికను, నొక వేణుయష్టిని నిచ్చెను. ఆ దివ్యవిమాన మెక్కి తఱచుగా నుపరిలోకమునఁ జరించుటచే నితనికి నుపరిచరుఁడను పేరుకూడ వచ్చినది. శుక్తిమతి యనునది ప్రవహించుటకుఁ గోలాహలమను పర్వత మడ్డు వచ్చెను. ఈ వసు వా పర్వతమును గాలితో

దన్ని చేసి నదికి మార్గము కలుగఁజేసెను. శుక్తిమతి దానికిఁ బ్రత్యుపకారముగ వసుపదుఁడను తన కుమారుని, గిరికయను తన కూఁతును నుపరిచరున కిచ్చెను. వసువు వసుపదుని దన సేనానాయకునిగఁజేసి గిరికనుదనభార్యగస్వీకరించెను.

ఋతుమతియైన తనభార్యకు మృగమాంసము తెచ్చియిచ్చుటకై వసు వొకనాఁ డడవికేఁగి, యచ్చటఁ గూడఁ దన మనోహారిణిని గూర్చియే తలఁపోయ నతనికి రేతఃపతనమయ్యెను. దానిఁ బోనివ్వరాదని యొక దొప్పలోఁ జేర్చి యొక డేగ కిచ్చి గిరిక కిమ్మని వసువు పంపెను. డేగ పట్టుకొని వచ్చుచుండఁగఁ బట్టుజారి యాదొప్ప యమునానదిలోఁ బడెను. ఆ రేతస్సును, నొక మీనము ద్రావి గర్భముదాల్చెను దీనికి మత్స్యరాజను కుమారుడును, మత్స్యగంధి యను కుమారితయుఁ బుట్టిరి బృహద్రథుఁడు, మణివాహనుఁడు, సౌబలుఁడు, యదువు, రాజన్యుఁడు ఇతనికి గిరికను వివాహమాడుటకుఁ బూర్వము గల్గిన కుమారులు. భార.

ఉపరిచరవసువు:-ఒకప్పుడు దేవతలకును, ఋషులకును "అజేన యష్టవ్యం"అను వాక్యములోని అజశబ్దమునకుఅర్థము మేకయా? లేక బీజములా? అని వాదువచ్చెను. ఋషులు పశువధ తగదనిరి. అంతరిక్షమున వచ్చు ఉపరిచరుని వారు తీర్పు చెప్పుమనిరి ఇతఁను దేవతలయభిప్రాయ మెఱిగి మేకయని యర్థముచెప్పెను. పక్షపాతముగఁ దీర్పుచెప్పుటచే గోతిలోపడుమని శపించిరి. ఇతఁడు నారాయణుని భక్తివలన మరల పైకి వచ్చెను. భార.

ఉపరిచరుఁడు:-చూడు (ఉపరిచరవసువు.)

ఉపశ్లోకుఁడు:-త్రివక్త్రయందుఁ గృష్ణునకుఁ బుట్టిన కుమారుఁడు. ఇతఁడు కృష్ణ పాదారవింద సేవారతుఁడగుచు నారదునికి శిష్యుఁడై అఖండితదివ్య జ్ఞాన బోధాత్మకుఁడయ్యెను. స్త్రీశూద్రదాసజన సంస్కారుఁడై శీఘ్రముగ ముక్తి నొసఁగఁ గలుగు సాత్యతతంత్రంబను వైష్ణవ స్మృతిని కల్పించెను. భాగ.

ఉపసుందుఁడు:-నికుంభుఁడను రాక్షసుని కుమారుఁడు. సుందునితమ్ముఁడు. (చూడుసుందుఁడు.)

ఉమ:-(చూడు అపర్ణ.)

ఉరుక్రముఁడు:-విష్ణుమూర్తియే నాభికి మేరుదేవియందు ఉరుక్రముఁడను పేరున జన్మించి విద్వజ్జనులకుఁ బరమహంసమార్గ మెఱింగించెను. భాగ.

ఉరుశ్రవుఁడు:- సత్యశ్రవుని కుమారుఁడు. ఇతనిపుత్త్రుఁడు దేవదత్తుఁడు. భాగ.

ఉర్మిళ:-యముని భార్య.

ఉర్వి:- భూమి. పరశురాముఁడు భూమినంతను కశ్యపునకు దానముచేసెను. పిమ్మటఁ గొంత కాలమునకుఁ బుడమిపైఁ బాతకము హెచ్చెను. ఆ పాపభారమున భూమి పాతాళలోకమునకుఁ గ్రుంకెను. దానిని మఱల కశ్యపుఁడు తన యూరువులతో పైకెత్తెను; ఊరువులతో నెత్తబడినది గావున భూమి ఉర్వి యను పేరు వచ్చెను. భార.

ఉలూకము:-బృహంతుఁ డను రాజు పాలించిన యొక దేశము. భార.

ఉలూకుఁడు.-హిరణ్యాక్షుని పుత్త్రుఁడు. మత్స్య.

ఉలూకుఁడు:-శకుని కుమారుఁడు. యుద్ధసన్నద్ధులైన పాండవులతోఁ దన మాటలుగాఁజెప్పుమని దుర్యోధనుఁ డీతనికి గొన్ని పరుషపు వాక్యములు చెప్పి పంపెను. వానిని గౌరవించి దుర్యోధనుఁడు చెప్పుమనిన తులువపలుకులను విశ్వాసముగఁజెప్పఁగావిని, ధర్మజుఁడు వానికిఁ బ్రత్యుత్తరముగఁ దమ వచనములను జెప్పుమనిచెప్పిరి. యుద్ధమం దితఁడు సహదేవునితోఁ బోరాడెను. సహదేవుడే యితనిని సంహరించెను.

ఉలూచి:-(ఉలూపి) నాగకన్యక. కౌరవ్యుఁడను వానికుమారిత. తీర్థయాత్రాపరుఁడైచనుచునొక కొలనులో స్నానముచేయుచున్న యర్జునుని నీమె చూచి మోహించి తన ప్రభావమువలన నతనికి దెలియకుండగనే నాగలోకమునకు వానిని గొని పోయి తన హర్మ్యమును జేర్చెను. అర్జునునిగుణరూపములను గుఱించి విని యతనిని బెద్దకాలము నుండి వలచి యుండె ననియుఁ, దన కోర్కెయీడేర్చి పొమ్మనియు నీమె కోరెను. వ్రతము సల్పుచు నిష్ఠాపరుఁడై యుండుటచే నామెతో

భోగింపఁజాలనని యర్జునుఁడు చెప్పెను. ఆమె తన పట్టును మానక, నీవు నా యాప్సితము నెరవేర్పనివాఁడు 'మనోజానలముచే నాకుఁ బ్రాణ పరిత్యాగము] సంభవించును. నీ నిష్ఠలు నీ వ్రతములు ప్రాణదానముకంటె నెక్కుడా? యని యతనితో వాదించి తుదకు వానిని వశ పఱచుకొని వానితోఁ గ్రీడించెను. ఈమెకు నర్జునుని వలన ఇరావంతుఁడను పుత్త్రుఁడు పుట్టెను. ఈమె వెంటనే యర్జునునితో వెళ్ళ లేదు; చాలకాలము తండ్రియింటనే యుండెను; కాని యర్జునునిపై ప్రేమతగ్గలేదు.

ఈమె గంగానదిలో స్నానము చేయుచుండఁగ వచ్చుటవసువులు, "అర్జునుఁడు శిఖండి మఱుఁగున దాగి భీష్ముని జంపెను గాన" నతనిని నరకమునఁ బడునట్లు శపింతమనుకొనుట విని విచారము నొంది యామాటలు తనతండ్రితోఁ జెప్పెను. ఆమెతండ్రి వసువులకడకుఁ బోయి యర్జునునకు నరకము తప్పు మార్గము చెప్పుడని కోరెను; అర్జునుఁడు తన పుత్త్రునితో యుద్ధము చేసినయెడల నది తప్పునని వారనిరి. ఆ సంగతి కౌరవ్యుఁడు తన కుమారిత కెఱింగించెను. ఆమె దానిని మఱువకయుండి యాగాశ్వము వెంట నర్జునుఁడు వచ్చుచుండఁగ నశ్వమును గట్టుమని యర్జునుని పుత్త్రుఁడగు బభ్రువాహనుని ప్రోత్సాహము చేసెను. ఇతఁడును, నర్జునుఁడును నొండొరులతోఁ బోరిరి; అర్జునుఁడు మూర్ఛితుఁ డయ్యెను. అంత నులూచి నాగలోకమునకు వచ్చి సంజీవనిమణియౌషధము తెచ్చియిచ్చి వీ రిఱువురను లేవఁదీసెను. భార. జై. భా.

ఉల్ముకుఁడు:-చాక్షుషుని కుమారుఁడు. ఇతని భార్య పుష్కరిణి. అంగుఁడు. సుమనసుఁడు, ఖ్యాతి, క్రతువు, అంగిరసుఁడు, గయుఁడు ఇతని కుమారులు. భాగ.

ఉశన:-భృగువు భార్య. భాగ.

ఉశన:-శుక్రునితల్లి.

ఉశనసుఁడు:-భృగువు పుత్త్రుఁడు. రాక్షసుల పురోహితుఁడు. భార.

ఉశీనరుఁడు:-ఒక వృష్ణివంశపు రాజు.

ఉశీనరుఁడు:-పౌరవవంశపు రాజు. మహామనుని పుత్త్రుఁడు. ఇతనిని పరీక్షించుటకై యింద్రుఁడు శ్యేనరూపమును, నగ్ని కపోతరూపమును ధరించిరి. కపోత మెగిరివచ్చి ఉశీనరుని చెంగట భయపడుచు, వణఁకుచు వ్రాలి వీనిని శరణు వేడెను. రాజు దానిని దీసి యభయ మిచ్చెను. ఇంతలో శ్యేనివచ్చి నా కాహారమగు దానిని నీవేల తీసికొందువు. నా కపోతమును నాకిమ్ము. నీ వివ్వనిచో నేనును, నాభార్యయు, బిడ్డలును క్షుద్బాధచే మరణింతుము. ఆ పాపమునీవేల యొడిగట్టుకొందువు? అని వాదించెను. శరణాగతులైనవారిని ప్రాణమైననిచ్చి రక్షింతుననియు, నా డేగ యాఁకలి దీర్చుకొనుటకై తన శరీర మందలి మాంసమిత్తు ననియు రాజనియె. ఆ కపోతమెత్తుగల మాంసమును గోసి యిమ్మని డేగకోరెను. ఉశీనరుని మాంసమును గోసి తక్కెడయందుంచిరి గాని యెంతవేసినను గపోతమే బరువుగ నుండెను. ఉశీనరుఁడు విచారమొందక తన శరీరభాగములు గోయుచుండెను. వాని ధీరత్వమునకును, శరణాగత రక్షణమునకును మెచ్చుకొని యింద్రాగ్నులు నిజరూపములు చూపి రాజునకు వరములిచ్చిరి. హ-రి.

ఉష:-బాణాసురుని కుమారిత. (ఈమె పూర్వజన్మమునఁ దిలోత్తమ. చూడు తిలోత్తమ.) ఈమె తనకుఁ దగిన భర్తకై పార్వతీ. పరమేశ్వరుల నారాధించెను. ఒక సుందరాకారుని గూడినట్లొకరేయి కలఁ గని సిగ్గుపడుచు నుష తన చెలికత్తెయగు చిత్రరేఖతోఁ దన కలతెఱంగెఱింగించెను. ఉషకలలోఁ జూచినవానిం బోల్చుటకై చిత్రరేఖ సర్వరాజకుమారుల పటములు గీసితెచ్చెను. అందనిరుద్ధుని పటము చూచి యాతఁడే తనకలలోఁ గనబడినవాఁడని యుష చెప్పెను. చిత్రరేఖ ద్వారకకుఁబోయి నిద్రించుచుండి యనిరుద్ధుని నెవ్వ రెఱుఁగకుండఁ దీసికొనివచ్చి యుషయంతఃపురములోఁ జేర్చెను. ఉషానిరుద్ధులొకరి నొకరెఱింగి కామక్రీడలఁ దేలిరి. ఉష గర్భవతి యయ్యెను. బాణుఁడు తనకుఁ దెలియకుండ నెవ్వఁడో యంతఃపురము చేరెనని విని యనిరుద్ధుని బంధించెను. అనిరుద్ధుని విడిపించుటకై కృష్ణుఁడు వచ్చెను. బాణుఁడు కృష్ణునితోఁ బోరి యోడి తన కుమారితయగు

యుషను ననిరుద్ధునకిచ్చి వివాహము చేసెను. ఉష కుమారుఁడు వజ్రుఁడు. భాగ.

ఉషస్తి:- అనఁగ చిన్నవయస్సుది.

ఉషస్తి:- ఒకఋషి. ఇతనిభార్య ఆటకి. ఈ దంపతులు కురుదేశమున నుండువారు. ఆ దేశమున పాషాణవర్షము కురిసి పంటలు లేకపోవుటచేఁ గాటకము వచ్చెను. తినుట కాహారము లభ్యమయ్యెడిది కాదు. ఇతఁ డాహారము లేక కృశించి యాకలిచే మిక్కిలి బాధపడుచు నొక మావటీవాని గృహమున కేగి వాని యెంగిలి కుండలో నలచంద లుండుటఁ జూచి వానిం దన కిమ్మని వేడెను. కాని యా బ్రాహ్మణున కిచ్చుటకుఁ దగినవి లేవని మావటీఁవాడు చెప్పెను. ఉన్నవే యిమ్మని యా యెంగిలివానినే యుషస్తి పుచ్చుకొని తినెను. పిమ్మట నా మావటీఁడు జలము నివ్వఁగ నీచేతి జలము నేఁ దాగరాదని యుషస్తి చెప్పెను. మావటీఁడు నివ్వెరపడియట్టి నహో నాయెంగిలియులచంద లెట్లు తింటివని యడిగెను. నా ప్రాణములు నిల్పుకొనుటకై తింటిని; ప్రాణములు నిల్పుకొనుట కచ్చటి యాహారమైన భుజింపవచ్చును. ఇఁక నాశరీరము నిలుచును గనుక నీ జలము ద్రాగనని యుషస్తి చెప్పెను. ఉషస్తి కొన్నియులచందలను దిండిలేక మాడుచుండిన తన భార్యకై కొంపోయి యిచ్చెను. వీనినే మఱునాఁడును భుజించి ధనార్జనకై యతఁడు రాజుకడకు వెళ్ళెను. రాజు తాఁ జేయుచుండిన యాగములో నార్త్విజ్య కృత్యము లితని యధీనముచేసి యతనికి ధనమిచ్చి పంపెను. ఛాన్దో. ఉ.

ఉష్ట్రకర్ణికః:- దక్షిణమున నొకదేశము. దిగ్విజయార్థ మరిగిన సహదేవుఁ డీ దేశపురాజుకడనుండియు ధనము పుచ్చుకొనెను.

ఊ

ఊరుఁడు:- చాక్షుషమనువు కుమారుఁడు. ఇతని భార్య ఆగ్నేయి. అగ్ని, సుమనసుఁడు, అంగుఁడు, ఖ్యాతి, గయుఁడు, క్రతువు, అంగిరసుఁడు అనువార లితనికుమారులు. మత్స్య.

ఊర్జ:- వసిష్ఠుని భార్య. చిత్రకేతుఁడు, సురోచి, విరజుఁడు, మిత్రుడు, ఉల్బణుఁడు, వసుబృద్ధ్యానుఁడు, ద్యుమంతుఁడు ఈమె కుమారులు. భాగ.

ఊర్జస్వతి:- ప్రియవ్రతుని కుమార్తె. శుక్రుని భార్య. ఈమె కుమార్తెయే దేవయాని. భాగ.

ఊర్ణనాభుఁడు:- గాంధారి ధృతరాష్ట్రుల పుత్రుఁడు. భార.

ఊర్ణనాభుఁడు:- విశ్వకర్మ కుమారుఁడు. ఇతఁడు తన శివపూజాప్రభావమున బ్రహ్మసృష్టికిఁ బ్రతిసృష్టి చేయుచుండెను. బ్రహ్మకుఁ గోపము వచ్చి నీ పేరునఁ బరగు పురుగువు కమ్మని శపించెను. ఊర్ణనాభి అనగా సాలెపురుగు. ఊర్ణనాభుఁడు తన శాపవిమోచనము ప్రసాదింపుమని వేడగ నీవు గుజారణ్యమున నుండుము. అచ్చట ఆవిర్భవించు శివలింగముకడకుఁ గొనిపోఁబడి, ఆలింగమును పూజించి నీవు ముక్తి నొందెదవు అని చెప్పెను. చూడుము శ్రీ. భార.

ఊర్మిళ:- ఒక గంధర్వాంగన. సోమదయొక్క తల్లి. రామా.

ఊర్మిళ:- సీత పినతండ్రి కుమారిత. లక్ష్మణుని భార్య. లక్ష్మణుఁడు రామునితో వనవాసమున కేగి యున్నంతకాలము నీమె నిదుర చెందియే యుండెను. అతఁడు తిరిగి వచ్చిన తరువాత నీమెను లేపి లక్ష్మణుని యానవాళ్ళు చెప్పి యాతని నీమెకుఁ జూపిరి.

ఊర్వశి:- ఒక అప్సరస. పూర్వము నరనారాయణులు తపస్సు చేసికొనుచుండఁగ వారి తపస్సును భంగము చేయునిమిత్త మింద్రుఁ డప్సరసలను వారి చెంగటకుఁ బంపెను. అప్సరసలు తమ నృత్తగానాదులతోఁ గొంత సందడి గావించిరి. నారాయణుఁడు కన్నులు తెఱచి వీరిని జూచి గోరుతోఁ దన యూరువును గీఱెను. అందుండి వారికంటెను సుందరాకారయైన యువతి జన్మించెను. ఊరువునుండి జన్మించుటచే నామెకు నూర్వశి యను పేరు వచ్చెను. ఈమెను జూచి యింద్రునిచేఁ బంపఁబడిన యప్సరసలు మరలిపోయిరి. దే. భా.

వరుణుఁడును, సూర్యుఁడును వచ్చుచు మార్గమం దూర్వశిని జూచిరి. మిత్రునకుఁ జిత్త విభ్రమము కలిగి రేతఃపతనమయ్యెను. ఊర్వశి యారేతస్సునదీసి యొక కుంభమందు భద్రము చేసెను. వరుణుఁడుగూడ నీమెను మోహ దృష్టితోఁ దిలకించెను. "మొదట సూర్యుఁడు నన్నుఁగామించెను; నీకుఁ దగునేని నీవును నాదేహము తిలకించి భోగము నందుమని వరుణునితో నూర్వశియనియె. వరుణునకును రేతఃపతనమయ్యె. ఈరేతస్సునుగూడ నూర్వశి యాకుంభమందే యుంచెను. అందుఁడియే వశిష్ఠుఁడును, అగస్త్యుఁడును జన్మించిరి. సూర్యునకుఁ గోపము వచ్చి నన్ను ముందఱఁ జెందియు వరుణునిఁ జేరితివి గావున భూలోకమునకుఁ బోయి పురూరవునకు భార్య వగుమని శపించెను. ఉ. రా.

పురూరవుఁడను చక్రవర్తి యూర్వశినిజూచి మోహించి యీమె సాంగత్యమును గోరెను ఊర్వశి సమ్మతించెను గాని యాతఁ డామెకు దిగంబరుఁడై కనఁబడినచో మాత్ర మాతనిని వీడి వెళ్ళి పోవుదు ననియె. వారిరువురును గొంత కాలము కాపురముచేసినపిమ్మట నొకనాఁడీమె లేడిపిల్లలను గంధర్వుఁ డొకఁ డపహరించెను. మంచముపై దిగంబరుఁడై యుండిన పురూరవుఁ డాగంధర్వుఁ డపహరించుటచూచి, తన శపథము మఱచి, వానింబట్టుకొనుటకై దిగంబరుఁ డయియే గంధర్వుని వెంట తఱిమెను. అపుడేతఁ డూర్వశి కంటఁబడియె. ఆమె దేవలోకమునకుఁ బోయెను. పురూరవుఁడు మరలి వచ్చి యామెకై వెదకి వెదకి దేవతలను బ్రార్థించెను. వారి యనుగ్రహమున నూర్వశి మరల నితనిని జేరెను. ఆతనివలన నీమెకు ధీమంతుఁడు, ఆయువు, శతాయువు, దృఢాయువు మొదలగు కుమారులు పుట్టిరి.

దుర్జయుఁడను కార్తవీర్యవంశపురాజు తన భార్యను విడచి చాలకాల మీమెతో విహరించెను. అతఁడీమెకిచ్చిన హారము నీమె యొక గంధర్వున కిచ్చెను. దుర్జయుఁడు గంధర్వుని కడనుంచి దానిని లాగికొని యీమె యొద్దకు వచ్చి తనతోఁ గలియుమని బలవంతము చేసెను. ఆమె యిష్టములేకపోయెను. కాన వానికిఁ దన కామయుక్తమైన దేహమును, బింగళవర్ణములైన నేత్రములను జూపెను. వానిని జూచి రాజేవగించుకొని విరక్తిచెంది మరలిపోయెను. భవి.

ఇంద్రుఁ డర్జునుని నమరావతికిఁ బిలచిన నతఁడు వెళ్ళెను. ఆనాఁడు సంజకాలమునఁ జంద్రోదయమైనపిదప నూర్వశి సింగారించుకొని యర్జునునికడకు రాఁగా నతఁడు తల్లీ! నమస్కార మనియె. అంతట నూర్వశి, నీ గుణములు నారదునివలన విని నిన్ను వలచి నీతోఁ గూడుటకు వచ్చితి; నన్నుఁ దల్లియని యిట్లు పలుకుట న్యాయమా? అమరవేశ్యలకు వావియా; అందఱును నిచ్చటఁ గ్రీడింతురు. నీవును నాకోరికఁ దీర్పుమని వేడికొనియె. కాని యర్జునుఁడు, నీవు మావంశకర్తయైన పురూరవునకు భార్యవగుటచే నాకుఁ దల్లివంటిదానవే నరుఁడనైన నాకు దివ్యాచారములు చెల్లవని యామెను దిరస్కరించుటచే నామెకుఁ గోపమువచ్చి నీవు షండుఁడవు కమ్మని యాతనిని శపించెను. భార.

వ్యాసుఁ డొకనాఁ డరణి మథించుచుండఁగ నీమె యతని కంటఁబడియె. వ్యాసునకుఁ రేతఃపతనమయ్యెను. ముని తనను శపించునేమో యని భయపడి యూర్వశి శుకరూపమును దాల్చెను. వ్యాసుఁ డీ శుకమును జూచెను. అప్పుడే వ్యాసునకు శుకుఁడు జన్మించెను. భాగ.

ఋ

ఋక్ష:– అజమీఢుని మూఁడవ భార్య. భార.

ఋక్షవిరజుఁడు:– ఆదిమ వానరుఁడు. కాంచనాద్రి మధ్యశృంగముకడ బ్రహ్మ తపస్సు చేసికొనుచుండఁగ నతని కన్నులనుండి యశ్రులు రాలెను. వానిని బ్రహ్మ దోసిటం బట్టెను. అందుండి వానర రూపుఁడు ఋక్షవిరజుఁడు పుట్టెను. అచ్చటి కాననమందలిఫలములనుదినుచు నాఁకలిచల్లార్చుకొమ్మని యాతనికి బ్రహ్మ చెప్పెను. ఆవానరుఁ డందేసంచరించుచు నొకనాఁడుతూర్పుశృంగము కడనున్న కొలనునకుఁ బోయి యందుఁ దనప్రతిబింబమును జూచి యది మఱియొక వానర మనుకొని నీటిలో దిగెను. అందేమియు లేకపోవు

టచే ఋక్షవిరజుఁడు బైటకు వచ్చెను. వచ్చిన తోడనే స్త్రీయయ్యెను. సాయంకాలము మరలి వచ్చుచున్న సూర్యుఁడును, బ్రహ్మను దర్శించి వచ్చుచున్న యింద్రుఁడును ఈ స్త్రీని జూచి మోహించిరి. సూర్యుని తేజస్సు ఈమె కంఠముపై బడెను; దాన సుగ్రీవుఁడు పుట్టెను. ఇంద్రుని రజస్సామె తలపైఁబడి వాలమున్నచోటికి దిగెను. దాన వాలి పుట్టెను. మఱునాఁడు ఋక్షవిరజుఁడు తన పూర్వపురూపము నొందెను. ఆ మార్పుల కాశ్చర్యము నొంది వానరుఁడు బ్రహ్మకడకుఁ బోయి, యిటేమి ఇట్టి రూపములను బొందితి నని యడిగెను. అతఁడు దిగిన కొలనులోఁ బూర్వము పార్వతి స్నానము చేయుచుండఁగఁ గొందఱు రాక్షసులు స్త్రీరూపములతో దిగుట పార్వతి తెలిసికొని యందు దిగినవారలు స్త్రీలగుదురని శపించెననియుఁ స్త్రీరూప మొక దినమే యుండుననియుఁ జెప్పి ఋక్షవిరజుని కిష్కింధకుఁ బోయి యచ్చట రాజ్యమేలుమని బ్రహ్మ యానతిచ్చెను. ఇతఁడు తన పుత్త్రులైన వాలి సుగ్రీవులను దీసికొని వెళ్ళెను. అచ్చటఁ గొంతకాలము రాజ్యమేలి పెద్ద కుమారుఁడైన వాలికిఁ బట్టముగట్టి సుగ్రీవుని యువరాజును జేసి తాను తపోవనమునకరిగెను. ఉ. రా.

ఋక్షుఁడు:- ఋచీకుని పుత్త్రుఁడు. వీని పుత్త్రుఁడు మతినారుఁడు భార.

ఋక్షుఁడు:-అజమీఢుని పుత్త్రుఁడు. ఇతనిపుత్త్రుఁడు సంవరణుఁడు. భాగ.

ఋచి:- ఆప్తవానుని భార్య. ఔర్వుని తల్లి. బ్రహ్మ.

ఋచీకుఁడు:- దేవాతిథి పుత్త్రుఁడు. ఇతని భార్య సుదేవ. వీరి కుమారుఁడు ఋక్షుఁడు. భార.

ఋచీకుఁడు:- ఔర్వుని (భృగు) పుత్త్రుఁడు. ఇతఁడును తండ్రివలెఁ దపస్సంపన్నుఁడు. ఋచీకుఁడు గాధియనురాజుకడకేగి యతని పుత్త్రికయగు సత్యవతిని దనకిచ్చి వివాహము సేయుమని కోరెను. ఒక చెవి నీలవర్ణమును, శరీరమంతయుఁ దెలుపు రంగునుగల వేయి యశ్వముల నంకువగ నిచ్చిన యెడలఁ దన కూఁతు నిత్తునని గాధి చెప్పెను. వరుణుని బ్రార్థింప నీవు తలఁచినచోట నట్టి యశ్వములు ప్రభవించునని యతఁడు చెప్పెను. గంగానదికి నుత్తరమున కన్యాకుబ్జమునకు సమీపమున ఋచీకుఁ డట్టియశ్వములు కావలయునని తలంచెను. అవి కలిగెను ఋచీకుఁ డట్టియశ్వములను సంపాదించి గాధికిచ్చి సత్యవతిని వివాహమయ్యెను. ఇతని యెడల సత్యవతి మిక్కిలి భక్తిప్రేమలతో నుండెడిది. ఆమెభక్తికితఁడు మెచ్చుకొని వరము వేడికొనుమనియె. తనకొక కుమారుఁడును, దన తల్లి కొక కుమారుఁడును గలుగునట్లు వరమిమ్మని సత్యవతి కోరెను. ఋచీకుఁడు వల్లెయని యామెను మేడిమ్రానును, ఆమె తల్లిని రావిమ్రానును గౌఁగిలింపుఁడని చెప్పెను; కాని సత్యవతి యది మఱచి తానే రావిమ్రానును గౌఁగిలించెను. ఆమెతల్లి మేడిమ్రానును గౌఁగిలించెను. (సత్యవతికిని, దల్లికిని చెరియొక మంత్రపూత జలకలశము, చరువును నిచ్చెను. పొరబాటున సత్యవతికిచ్చిన యుదకము సత్యవతితల్లి త్రాగెను.)

వారట్లు విపరీతము గావించిరని ఋచీకుఁ డెఱిఁగి సత్యవతికిఁ బుట్టువాఁడు బ్రాహ్మణుఁడైనను క్షత్త్రియ స్వభావము కలవాఁడును, గాధికిఁ బుట్టినవాఁడు బ్రాహ్మణ స్వభావము కలవాఁడును నగునని చెప్పెను. సత్యవతి యింతక విచారించి తన కుమారునందుఁ గాక తన పౌత్రునందట్టిమార్పు కలుగునట్లను గ్రహింపుమని వేడఁగ ఋచీకుఁ డట్లగునని యనుగ్రహించెను. ఋచీకునకు సత్యవతియందట్లు పుట్టినకుమారుఁడే జమదగ్ని. భార. విష్ణు.

ఋచేయువు:- అతిసారుని తండ్రి.

ఋతధ్వజుఁడు:-శత్రుజిత్తు కుమారుఁడు. ఇతఁడే కువలయాశ్వుఁడు, (చూడు కువలయాశ్వుఁడు)

ఋతధ్వజుఁడు:-శత్త్రుజిత్తుఅనియు, ఋతధ్వజుఁడనియు కువలయాశ్వుని తండ్రియైన ప్రతర్దనుని పేరులు. భాగ.

ఋతుపర్ణుఁడు:- అయుతాయువు పుత్త్రుఁడు. అయోధ్యకు రాజు. ఇతని యొద్దనే నలుఁడు బాహుకుఁడను పేరున వంటలవాఁడుగనుండెను. అక్షహృదయము నలునకిచ్చి అతనివలన అశ్వవిద్య నితఁడు నేర్చెను. భాగ.

దమయంతికి రెండవస్వయంవరము జరుగునని ప్రచురింపఁగ నితఁడును వెళ్లెను. ఇతని పుత్త్రుఁడు సర్వకాముఁడు. ఋతుపర్ణుని కీర్తనము కలినాశనము. భార. విష్ణు.

ఋతువంతుఁడు:- ఒక ముని. ఇతనికి సంతానము లేక లేక వార్ధకమున నొక సుతుఁడు కలిగెను. వాఁడు మిక్కిలి దుర్మార్గుఁడయ్యెను. పుత్త్రుఁడు చేయు దుష్కృత్యములను జూచి విచారము నందుచు తా బెంగచే రోగపీడితుఁ డయ్యెను. ఋతువంతుఁడు గర్గుడనుమునికడకేగి మహాత్మా! నేను సచ్చీలుండను. నాభార్య సచ్చీల. మాకు జన్మించిన పుత్త్రుఁడు దుర్మార్గుఁ డయ్యెనేమి? అని యడిగెను. రేవతీనక్షత్ర చతుర్థపాదమునఁ బుట్టుటచే నట్లయ్యెననిగర్గుఁడుచెప్పెను. రేవతి నాకిట్లపకారము చేసెను గావున నది క్రిందఁ బడుఁగాక యని ఋతువంతుఁడు రేవతిని శపించెను. అతని శాపమున రేవతి నక్షత్ర మండలము విడిచి కుముదగిరిమీఁద బడెను. మార్క.

ఋభుమహర్షి:- ఒకఋషి. ఒకరాజేనుఁగునెక్కి పోవుచుండుటఁజూచి వీరిలో నెవరు రాజు? ఎవరు ఏనుఁగు? అని యతఁడు ప్రశ్నించెను. అతనిప్రక్కను నిలుచుండిన నిదాఘుఁడను వాఁడు ఈమునిని దలఁబట్ట వంచి వానిపైనెక్కి నీవలె నడుగున నున్నది యేనుఁగు, నావలె పైనున్నవాఁడు రాజు అనిపల్కెను. ఋభుమహర్షి కోప మణుమాత్రము తెచ్చుకొనక, నీవు, నేను అనుభేదములేదని వానికి నద్వైతము బోధించెను. నిదాఘుఁడు తాను చేసిన యపరాధమును క్షమింపుమని ప్రార్థించి వీనికి శిష్యుఁడయ్యెను. విష్ణు.

ఋభువు:- బ్రహ్మ కుమారుఁడు. (చూడుము ఉగ్రుఁడు.) కాశ.

ఋష్యమూకము:- కిష్కింధ సమీపముననున్న యొకపర్వతము. దీనిపై మతంగుడనుముని తపస్సు చేసికొనువాఁడు. వాలి దుందుభిని జంపి యాతని శరీరమెగురవేయఁగ రక్తము మతంగునిపైఁ బడెను. అందువలన వాలిఋష్యమూకపర్వతము నెక్కుచో మృతుఁడగుఁగాక యని యతడు శపించెను. వాలికి వెఱచిన సుగ్రీవుఁ డీపర్వతముపై నుండువాఁడు. రామా.

ఋష్యశృంగుఁడు:- విభాండకుఁ డనుముని పుత్త్రుఁడు. విభాండకుఁడు నదిలో స్నానము చేయుచు నూర్వశిని జూడఁగ నతనికి రేతఃపతన మయ్యెను. అప్పుడే యా నదిలో మృగమొకటి జలము త్రాగుచుండెను. జలముతో విభాండకుని వీర్యముకూడ మృగిగర్భములోనికి వెళ్ళెను. (చూడు చిత్రరేఖ) అది గర్భము దాల్చె. ఆ మృగియందు జన్మించిన పుత్త్రుఁడే ఋష్యశృంగుఁడు. ఇతఁడు తన పుత్త్రుఁడే యని విభాండకుఁడు దివ్యదృష్టివలన దెలిసికొని వీనిని గొనివచ్చి తన యాశ్రమములోనే పెంచెను. ఋశ్యశృంగుఁ డధ్యయనాది క్రియలతోఁ గాలము గడుపుచు నాశ్రమమును, వైదికక్రియలను దప్ప నన్య మెఱుఁగకుండెను; ఎన్నడును నారీముఖము చూచినవాఁడు కాఁడు. ఈ తపస్సంపన్నుఁ డెచ్చటనుండిన నచ్చట సువృష్టి కలుగును. కావున రోమపాదుఁడను రాజు తన దేశమున వర్షములులేకుండుటచే నికనినిరావించుటకై యత్నించెను. ఇతఁడు సాధారణముగ నాశ్రమము విడిచి నగరమునకు రాడు గావున వాని నుపాయమునఁ దీసికొనివచ్చుటకు రోమపాదుఁడు వేశ్యలను బంపెను. వచ్చిన వేశ్యలను జూచి ఋశ్యశృంగుఁడు వారిరూపములకచ్చెరువంది వారిని మునిపుత్త్రులుగను, వారు తెచ్చిన భక్ష్యము లపూర్వఫలములుగను, భావించి, వారి పాలిండ్లు వింతశృంగము లని భ్రమపడి యా సుందరాకారుల యాశ్రమ మెంత రమ్యముగ నుండునో చూడగోరి వారితో వెడలెను. వారు రోమపాదుని నగరమునకుఁ దీసికొని వచ్చిరి. ఇతఁడు వచ్చుటచే వంగదేశమున సువృష్టి కలిగెను. రోమపాదుఁ డితనికి శాంతనిచ్చి వివాహము చేసెను. ఋశ్యశృంగుఁడు కొంతకాలము రాజనగరమందే యుండెను. పిమ్మట విభాండకుఁడు వచ్చి యితనిని, శాంతను గూడఁ దన యాశ్రమమునకుఁ గొంపోయె. శాంతయందు ఋశ్యశృంగునకుఁ జతురంగుఁడను పుత్త్రుఁడు జన్మించెను.

రాబోవు సూర్యసావర్ణికాలమున నితఁడు సప్తఋషులలో నొకఁడగును. భాగ.

దశరథుఁడు ఋష్యశృంగుని నయోధ్యకు రావించి పుత్త్రికామేష్టి చేసెను. దశరథునకుఁ బుత్త్రులు కలిగిరి. భార: హరి. రామా.

ఋషభుఁడు:-(వృషభుఁడు) నాభి కుమారుఁడు. నాభి పుత్త్రునికై తపస్సుచేయఁగ విష్ణువే యతని పుత్త్రుఁడుగఁ బుట్టెను. ఋషభుని ప్రభావమున కీర్ష్య చెంది యింద్రుఁడు నాభిరాజ్యమున ననావృష్టి కలుగఁజేసెను కాని ఋషభుఁడు తన ప్రభావముచే వర్షము కురిపించెను. ఋషభుని భార్య జయంతి. వీరికి నూర్గురు పుత్త్రులు. పెద్దవాఁడు భరతుఁ డను కుమారుఁడు. ఈ భరతుని నామమునుబట్టియే మనదేశమునకు భరతవర్షమని పేరు వచ్చినది. భరతుఁడుకాక, కుశావర్తుఁడు, ఇలావర్తుఁడు, బ్రహ్మవర్తుఁడు (బ్రహ్మవర్తుఁడు), ఆర్యావర్తుఁడు, మలయకేతువు, భద్రసేనుఁడు అను కుమారు లితనికిఁ గల్గిరి. వీరి నామములనుబట్టి వీరు పాలించిన దేశములకుఁ బేరులు వచ్చెను. భాగ.

ఋషభుఁడు:-ఒకముని. హేమకూటమునఁదపస్సు చేసికొనుచుండెను. ఇతఁడు అతికోపనుఁడు. అచ్చట ఎవరు పలికినను ఆ ముని యుగ్రానలాకాయుఁడై రాళ్ళనుండి వెలువడు మేఘములను బిలచి ఆపలికినవారిని వారించు. దానఁజేసి తపోదాన ధర్మ శమ దమ రహితులగు వారటకేగరు. దేవతలు, వారిని దర్శించినమునులు ఆ మునిని జూడవత్తురు. భార.

ఋషభుఁడు:-కుశాగ్రుని పుత్త్రుఁడు. ఇతని కుమారుఁడు సత్యహితుఁడు. భాగ.

ఋషభుఁడు:-ఇతనికిఁ దొమ్మండుగురు పుత్త్రులు. వర్షాధి పతులు. తొమ్మండుగురు భాగవతధర్మ ప్రకాశకులు. బ్రాహ్మణోత్తములైరి. భాగ.

ఋషభుఁడు:-తన దేశము కర్మదేశముగ నెరింగి తనకుఁ దెలిసినను బ్రాహ్మణులవలన వేదము నెఱింగి కర్మతంత్ర మెరుకపరచి అతఁడు సమస్త కర్మలను జేసెను. పుత్త్రులకు రాజ్య మిచ్చుచు ఇహసౌఖ్యములందు వాంఛ యిడక ధర్మంబున పాలనంబు సేయవలయుననియు, మఱియు కర్మరూపమైన, అవిద్యా జన్మరూపమైన హృదయబంధనాదులను అప్రమత్తయోగమను ఛురికచే ద్రెంపవలయు ననియు, బోధచేసె. పిమ్మట ఋషభుఁడు యోగయుక్తుఁడై ద్వంద్వాతీతుఁడై దేహాభిమానములేక సంచరించుచు దక్షిణకర్ణాటకమునఁ గుటకాచలోపవనంబున సంచరించుచు నందు దావానలంబున దగ్ధుఁడయ్యెను. అచ్చటి రాజు అర్హతుఁ డనువాఁడు ఇతనికృత్యము విని నిజధర్మములు మానిన తన జనులను పాషండమతాభివేత్తలను జేసెను. భాగ.

ఋషభుఁడు:-ఒక ముని. తీర్థయాత్రలు చేసెను. అతని కడకు వేఁటాడవచ్చి ఒక మృగమును దఱుముచు అలసిన రాజు సుమిత్త్రుఁ డనువాఁడు వచ్చెను. అతఁడు వచ్చినపని విని ఆశవలననే దుఃఖము కలుగుననియును, ఆశ చెంతకు పోకుండుట సుఖమనియును, తాను "పూర్వము తనుఁడను ఋషివీరద్యుమ్నుఁ డను రాజునకు జెప్పిన సంగతి" చెప్పెను. భార.

ఏ

ఏకచక్రపురము:-ఒకపురము. ఆ నగరవాసులను బకాసురుఁడు బాధించుచుండువాఁడు; వాడూరి మీఁదఁ బడకుండ దినమున కొక్కయింటి మనుజుఁడేగి వాని కాహారమగుటకు వారేర్పరచుకొనిరి. పాండవులు లక్కయిల్లు దాటివచ్చిన తర్వాత బ్రాహ్మణవేషములతో నా పురము చేరిరి. ఇచ్చటనే భీముఁడు బకాసురుని సంహరించెను. భార.

ఏకతుఁడు, ద్వితుఁడు, త్రితుఁడు:-సోదరులు. ప్రజాపతికుమారులు. బృహస్పతి ఉపరిచరవసువు యొక్క యాగము చేయించుచుండఁగ విష్ణువే స్వయముగ వచ్చి పురోడాశము నందుకొనెను. అతఁడెవ్వరికి నగుపడలేదు. అందులకు బృహస్పతికిఁ గోపమువచ్చెను. అపుడు ఈ సోదరులు శ్వేతద్వీపములో నుండు నారాయణుఁడు ఏకాంతభక్తులకేగాని కనబడడని చెప్పి శమింపఁజేసెను.

ఏకపర్ణ:-మేనాహిమవంతుల పుత్త్రిక. ఈమె నిరాహారయై పెక్కేండ్లు తపస్సుచేసెను. ఈమె

అసితుని వివాహమై దేవలుఁడను పుత్రుని బడసెను. హరి.

ఏకపాటల:- మేనాహిమవంతుల పుత్త్రిక. ఈమె పెక్కేండ్లు తపస్సుచేసి జైగీషుఁడను మునిని బెండ్లియాడెను. శంఖ లిఖితు లీమె కుమారులు. హరి.

ఏకపాదుఁడు:- ఒక బ్రాహ్మణుఁడు. ఇతని భార్య సుజాత. ఇతఁడు సదా శిష్యులచే వేదములను జదివించువాఁడు. చాలకాలమునకు సుజాత గర్భిణి యయ్యెను. ఆమె గర్భములో నున్న కుమారుఁడు తండ్రితో ఏల యిట్లు శిష్యులను నిద్రాహారములు లేక చదివించుచుంటివి? వారి శరీరారోగ్యము చెడుచున్నది యని పల్కెను. ఏకపాదునకుఁ గోపమువచ్చి నీవు అధ్యయనమునకు వక్రముగఁ బలికితివి కావున నష్ట వక్రములతోఁ బుట్టుమని గర్భస్థుఁడగు శిశువును శపించెను. ఇతనిభార్య ప్రసవకాలమున కింట తిలఘృత ధాన్యములు లేకపోయెను. వాని నార్జించుటకై ఏకపాదుఁడు వెళ్ళెను. ఇతఁడు జనకునిరాజ్యమున కేగి యచ్చట వరుణపుత్త్రుఁడైన వందితోఁ బన్నిదము వేసి వాదమునకు దిగెను. కాని, యోటుపడి జలమునందు ముంపఁబడియె. ఇతఁడింట లేనపుఁడే కుమారుఁడు అష్టావక్రుఁడు పుట్టెను. అష్టావక్రుఁడు విద్యావంతుఁడై జనకుని రాజ్యమున కేగి వందితో వాదించి వాని నోడించి యేకపాదుని దీసికొని వచ్చెను. భార.

ఏకలవ్యుఁడు:- జరాసంధుని సేనాధిపతి. బలరామకృష్ణులు గోమంతంబుననుండఁగ నితఁడు ముట్టడించి యాపర్వతముచుట్టు నెండుటాకులు వేసి తగులఁబెట్టెను. కాని బలరామ కృష్ణులు దానిని దప్పించుకొని బైటకు వచ్చిరి.

ఏకలవ్యుఁడు:- ఒక నిషాదరాజు. పౌండ్రక వాసుదేవునకు సహాయుఁడై ద్వారకకు యుద్ధమునకు వెళ్ళెను. ఉ. హ.

ఏకలవ్యుఁడు:- హిరణ్యధన్వుఁడను ఎఱుకల రాజు కుమారుఁడు. ఇతఁడు ద్రోణుని ఖ్యాతి విని ధనుర్విద్య నేర్చుకొనుటకై యతనికడకు వచ్చెను. కాని నిషాదపుత్త్రుఁ డగుటచే ద్రోణుఁ డితనిని శిష్యునిగా గ్రహింప ననియె. అంతట నేకలవ్యుఁడు ద్రోణునికడ సెలవుదీసికొని యరణ్యమున కేగి మట్టితో ద్రోణు నాకారముచేసి యా విగ్రహమునందు గురుభావ ముంచి ప్రదక్షిణము చేసి స్వయంకృషివలన నస్త్రవిద్య నేర్చుకొనెను. కురుపాండవు లొకసారి యీతఁడున్న యరణ్యమునకు వేటకు వచ్చిరి. వారికుక్క యేకలవ్యుని జూచి మొఱుగఁగ దాని నితఁడు బాణముతోఁ గొట్టెను. ఈకుక్క ఏడ్చుచుని పాండవులు వచ్చి యచ్చట నేకలవ్యునిజూచి యతని విద్యాప్రభావమునకచ్చెరువందిరి. అర్జునుఁడు తనకంటె ఘనుఁడొకఁడు గలఁడని వగచుచుండెను. తమకంటె నిపుణుఁడొకఁ డరణ్యమునందున్నవాడని పాండవులు ద్రోణునకుఁ జెప్పిరి. అతఁడును వీనింజూడవచ్చెను. ఏకలవ్యుఁడు ద్రోణునకెదురేగి గౌరవించి, నమస్కరించి తానేర్చినవిధము చెప్పెను. ద్రోణుఁడు వానిని గురుకట్నమిమ్మని కోరెను. నాదేహము. నాసర్వస్వమునీయధీనమే. నీవు కోరినదాని నిత్తునని యేకలవ్యుఁడు చెప్పఁగ నీకుడిచేతి బొటనవ్రేలిమ్మని ద్రోణుఁ డడిగెను. ఏకలవ్యుఁడు వ్రేలు తెగఁగొట్టుకొని ద్రోణున కిచ్చి విలువిద్య కలిమికి హీనుఁడయ్యెను. భార.

ఏకవీరుఁడు:- ఇతఁడే హయహయుఁడు. వీనిని హరివర్మ పెంచి ఏకవీరుఁడని పేరుపెట్టెను.

ఏకాదశ రుద్రులు:- సనకసనందనాదులూర్ధ్వరేతస్కులై చనిరి. పిమ్మట సృష్టి పెరుగుటలేదయ్యె. అపుడు బ్రహ్మకుఁ గోపమువచ్చి సృష్టి పెంచుటకై స్త్రీ పురుష రూపము గలవాఁడై నిలచెను. పిమ్మట రెండు శరీరములను నేర్పఱచెను. ఆ పురుషుఁ డేకాదశరూపములనుదాల్చెను. వారే ఏకాదశ రుద్రులు. మార్క.

ఏకాదశ రుద్రులు:- సురభికి మార్తాండునివలన జన్మించిరి. వీరు అజపాదుఁడు, అహిర్బుధ్న్యుఁడు. త్ర్యంబకుఁడు, వృషాకపి, శంభుఁడు, జపాలి, రైవతుఁడు, హరుఁడు, బహురూపుఁడు, ఉగ్రుడు, విశ్వరూపుఁడు అనువారలు. భార.

ఏకాదశ రుద్రులు:- బ్రహ్మ మానసపుత్త్రులను సృష్టి సేయుఁడనియె. వారు నిరాకరించి చనిరి. బ్రహ్మకుఁ గోపము వచ్చెను. అతని లలాటము

నుండి యేకాదశ రుద్రులు జన్మించిరి. వారు మహాత్ముఁడు, మహాత్మ, మతిమంతుఁడు, భీషణుఁడు, భయంకరుఁడు, ఋతధ్వజుఁడు, ఊర్ధ్వకేశుఁడు, పింగళాక్షుఁడు, రుచి, శుచి, కాలాగ్ని రుద్రుఁడు. బ్ర. వై.

ఏకావళి:- రభ్యుఁడను రాజునకు లేకలేక పుట్టిన కుమారిత. ఈమెను హైహయున కిచ్చి వివాహము చేయుదునని తండ్రి చెప్పుచుండువాఁడు. ఈమెను గాలకేతుఁ డపహరించి పాతాళలోకమునఁ బెట్టి తనను బరిణయము కమ్మని నిర్బంధించెను. హయహయున కిచ్చెదనని తండ్రి చెప్పువాఁడు గావున నీమె యసురుని నిరాకరించెను. ఈమె చెలియగు యశోమతి దేవిని బ్రార్థించి, హయహయుని దీసికొనివచ్చెను. అతఁడు కాలకేతుని సంహరించి యీమెను వివాహమయ్యెను. దే. భా.

ఏలాపుత్త్రుఁడు:- కద్రువ కుమారుఁడు. జనమేజయుఁడు చేయు యాగమున దగ్ధులు కండని తల్లి యిచ్చిన శాపమునుగూర్చి దేవతలకును, బ్రహ్మకును జరిగిన సంభాషణమును నితఁడు వినెను. ఆస్తీకునివలన జనమేజయుఁడు సర్పయాగము మానునని తాను వినిన మాటలను శాపమును గుఱించి విచారించుచున్న వాసుక్యాదుల కితఁడు దెలిపెను. భార.

ఐ

ఐరావతము:- కద్రువ కుమారుఁడు. ఇతఁడు తక్షకుని కుమారుఁడైన అశ్వసేనుని బెంచెను. భార.

ఐరావతము:- ధవళవర్ణమైన తూర్పు దిక్కున నుండు నేనుఁగు. ఇది క్షీరసాగర మథనము చేయుఁగ నందుండి పుట్టెను. ఇంద్రుని కిది వాహనము. భాగ.

ఐతరేయుఁడు:- ఇతరయొక్క కుమారుఁడు. ఒక ఋషికి ఇతర యను నామెయు, నింకను భార్యలును గలరు; వీరి పుత్త్రులం దాతనికిఁ బ్రీతి. యజ్ఞశాలయం దైతరేయుఁడు తండ్రి తొడపైఁ గూర్చుండఁగ నతఁడు వెళ్ళఁగొట్టెను. తల్లి విచారించి భూదేవిని బ్రార్థించెను. ఆమె వానిని సింహాసనమునఁ గూర్చుండఁ బెట్టెను. ఐ. బ్ర.

ఓ

ఓఘరథుఁడు:- ఓఘవంతుని కుమారుఁడు. భార.

ఓఘవంతుఁడు:- సుదర్శనుని పుత్త్రుఁడు. ఇతని కుమారుఁడు ఓఘరథుఁడు; ఓఘవతి యితని కుమారిత. ఈమెకుఁ దగిన వరునికై వెదకి యెచ్చటను గానక తన తండ్రియగు సుదర్శనున కిచ్చి పెండ్లి చేసెను. భార.

ఓఘవంతుఁడు:- వైవస్వతమనువు పుత్త్రుఁడైన, నృగునివంశమువాఁడైన ప్రతీకుని పుత్త్రుఁడు. ఇతని పుత్త్రిక ఓఘవతిని సుదర్శనుఁడు వివాహమయ్యెను. భాగ.

ఓఘవతి:- ఓఘవంతుని కూఁతురు. ఈమెకుఁ దగిన భర్తకై తండ్రి యెల్లయెడల వెదకెను. కాని యెచ్చటను గానలేక తుదకుఁ దన తండ్రయగు సుదర్శనున కిచ్చి వివాహము చేసెను. సుదర్శనుఁడు గృహస్థాశ్రమము నుండియే మృత్యువును జయింతునని యతిథిపూజ చేయుచుండువాఁడు. అతిథిసత్కారమే ముఖ్యమనియు, నతిథి తుదకుఁ దన పొందును గోరినను వాని కోర్కె తీర్పవలయు ననియు ఓఘవతితో నతఁడు చెప్పెను. సుదర్శనుని బరీక్షింపఁదలఁచెనని ధర్మదేవత యతఁడు స్నానమునకు వెళ్ళిన సమయమున వాని గృహమునకు నతిథిగ వచ్చెను. వీనికి ఓఘవతి సమస్తోపచారములు చేసెను. కాని యతఁడు తృప్తి పొందలేదు. ఇతఁ డామెను గవయఁగోరెను. ఓఘవతి యేమాటయుఁ జెప్పలేకుండెను. పరపురుషునిఁ గూడుట దోషమనియు వాని నిరాకరించుచో నతిథికిఁ గోపము వచ్చునవనియుఁ, దనభర్త యానతి దాటరాదనియుఁ దలంచి యోఘవతి వచ్చినయతిథితో నొక రహస్యస్థలమునఁ జేరెను. అప్పుడే సుదర్శనుఁడు వచ్చి భార్యను బిలచెను. అతిథి యామెను బలుకకుండు మని చెప్పెను గావున నామె

పలుకలేదు. సుదర్శనుఁడు తొంగిచూచెను. నీభార్య నా కాతిథ్య మిచ్చుచున్నదని యా యతిథి పలికెను. అదియే నాకుఁ బరమ సంతోష మని సుదర్శనుఁడు పలికె. అపుడు ధర్మదేవత నిజస్వరూపమునుదాల్చి నిజముగా నీవు మృత్యువును జయించితివని మెచ్చుకొనెను. భార.

ఔ

ఔద్దాలకి:- ఒకముని. స్నానముచేసి నదియొడ్డుననే దర్భలను,కలశమునుమఱచిగృహమునకువచ్చెను. అపుడువానినిజ్ఞప్తికిఁదెచ్చుకొని నాచికేతుఁడను తన పుత్రునిఁ బంపి వానిని గొనిరమ్మనియె. నాచికేతుఁడు వెళ్ళునప్పటికి నదిపొంగుటచేదర్భలును, కలశమును నదిలోఁ గొట్టుకొనిపోయి కనఁబడకుండెను. అవి కనఁబడలేదని నాచికేతుఁడు తండ్రితోఁ జెప్పెను. వానిని దీసికొనిరానందున ఔద్దాలకికిఁ గోపమువచ్చి నీవు పోయి యముని దర్శింపుముఅని కుమారునిదిట్టెను. తోడనేకుమారుఁడు స్పృహతప్పి నేలపైఁ బడియె. ఔద్దాలకుఁడు మిక్కిలి పశ్చాత్తాపమునొందెను; పుత్రునికై విలపించెను. మఱునాఁడు పుత్రుఁడు నిద్రవోయినవానివలె లేచెను. భార.

ఔద్దాలకి:- ఆ పుణ్యలోకంబులందలి యధికవిభవములైన ప్రదేశములు గోదానము చేసినవారికి లభ్యములగునని యముఁడు చెప్పిన సంగతులు తండ్రికిఁ జెప్పెను. భార.

ఔనికుంభుఁడు:- కాశీనగరములో నుండు నొక బ్రాహ్మణుఁడు. ఇతని కలలో నికుంభుఁడు కనఁబడి విశ్వేశ్వరునకు గుడికట్టింపుమని చెప్పెను. ఇతఁ డా సంగతి దివోదాసునితోఁ జెప్పెను. అతఁడు కట్టించెను. బ్రహ్మ.

ఔర్వానలము:- ఔర్వుఁడు ఘోర తపస్సు చేయుచుఁ బితృదేవతల యానతిపైఁదపము మాని తత్తపోఽనలము తనను దగ్ధము చేయకుండుటకై తపస్సును సముద్రమున విడచిపెట్టెను. అదే ఔర్వానలమైయశ్వరూపమునుదాల్చియుండెను.

సంతానము వడయుటకై ఔర్వుఁడు ఘోర తపము చేయుచుండఁగ మునులువచ్చి పుత్రులకై యిట్టి తపస్సు చేసెదవేల? సతీసంగమమునఁ బుత్రుఁడు కలుగునుగదా యనిరి. బ్రహ్మదులకుఁ దపోమహిమవలన మానసపుత్రులు పుట్టుచుండలేదా? నేను నట్లేకనియెదనని యౌర్వుఁడు తన యూరువును మథించి యగ్నిని రావించెను; అగ్నియే పుత్రుఁడుగాఁ బుట్టెను. ఈ పుత్రుని తేజస్సు దిగంతములు వ్యాపించెను; లోకములు తాళఁజాలకపోయెను. బ్రహ్మవచ్చి యీతఁడు నీ పుత్రుఁడే యగును. నీపుత్రుఁడు సముద్రములో నౌర్వానలముగ నుండును. ప్రళయకాలమందు నా తేజస్సుకూడ నీతనియందుఁ బ్రవేశించు నని చెప్పి యౌర్వుని సమ్మతింపఁజేసి యాయగ్నిని సముద్రమునందుంచెను. అది ఔర్వానలమయ్యె. హరి.

ఔర్వుఁడు:- ఒకముని భృగువంశజుఁడు. చ్యవనుని పుత్రుఁడు (అప్రవానుని పుత్రుఁడు.) కృతవీర్యుని వంశమువారలు ధనమునకై భార్గవులను బాధింపఁ జొచ్చిరి; గర్భవతియైయున్న చ్యవనుని పత్నిని గూడఁ జంపుటకుఁ దఱుముకొనివచ్చిరి. అపుడామె గర్భమును దన యూరుప్రదేశమున ధరించెను. అచ్చోటునుండియితఁడు పుట్టెనుగాన ఔర్వుఁడను పేరువచ్చినది. ఇతనిని జూచిన తోడనే తల్లిని దఱుముకొని వచ్చుచున్న కృతవీర్యవంశజులెల్లరు గ్రుడ్డివారైరి. వారపుడు తమ యంధత్వమును బోగొట్టుమని యావనితను బ్రతిమాలఁగ, నావలన మీకన్నులుపోలేదు. ఔర్వుని తేజస్సుచే మీరంధులైరి అని యామె చెప్పెను. వారతనిని బ్రార్థించి తిరిగి దృష్టిని బడసిరి. కాని యారాజులు తన వంశమువారిని నొక్కపారిగఁ జంపిరి గావున నౌర్వుఁడు తన తపస్సుచే మూఁడు లోకములను దహింపఁజేయఁ దలఁచి తపమారంభించెను. అంత వాని పితృదేవతలువచ్చి "అయ్యా! నీ వీ తపము చాలింపుము. మేము భూమిపైఁ బెద్దకాలముండలేకయు నాత్మహత్య కావించుకొనుటచే స్వర్గమురాదు గావునను నట్లు నిమిత్తము కల్పించుకొని ప్రాణములను విడచితిమి. మమ్ముల నా క్షత్రియులు చంపినట్లు తలఁపకుము. నీ తప ముడుగుము" అని వేడిరి. ఔర్వుఁడు వారి మాట యంగీకరించెను. కాని సర్వలోకములు

దహింపఁజేయుటకు సంపాదించిన యగ్నిని నిగ్రహీతముచేసి యుంచిన నతని నేదగ్ధునిఁజేయును కావున దానిని సముద్రమున విడువుమని వారు చెప్పిరి. ఔర్వుఁ డట్లు కావించెను. అతని తపః ప్రభావమే ఔర్వానలమై యశ్వరూపమును దాల్చి యుండెను. ఔర్వునిపుత్త్రుఁడు ఋచీకుఁడు. ఔర్వునకుఁ గందళి యను అయోనిజ యగు కుమారిత గలదు; ఆమెను దుర్వాసున కిచ్చెను. భా. బ్ర. వై.

ఔశీనరపతి:—అజితయొక్క తండ్రి. ఈమెను స్వయంవరమున నన్నదమ్ములు లేవును. వివాహ మాడిరి.

ఔశీనరి:—ఒక శూద్ర స్త్రీ. గిరివ్రజమునం దుండెను. ఈమెకు గౌతమునివలనఁ గాక్షీవాదులు జన్మించిరి. భార.

క

కంక:—ఉగ్రసేనుని కుమారిత. వసుదేవుని భార్య.

కంకణుఁడు:—నిమ్రోచి తమ్ముఁడు.

కంకుఁడు:—అజ్ఞాతవాసమున ధర్మరాజు పెట్టుకొనిన పేరు. భార.

కంకుఁడు:—ఒకపక్షి. ప్రలోలుపుని కుమారుఁడు. విద్యుద్రూపుఁ డను రాక్షసుఁడు భార్యతోఁ గ్రీడించుచుండఁగ నితఁడు వారిసమీపమునకుఁ బోయెను. విద్యుద్రూపుఁడు వీనింబట్టికొని చంపెను. మార్క.

కండ:—(చండ) సప్తఋషులను గొలిచియుండు దాసి. ఈమెభర్త పశుసఖుఁడు. (చూడుము కౌటకము, సప్తఋషులు.)

కండుఁడు:—ఒక ముని. ఇతఁడే కంథుఁడు. (చూడు కంథుఁడు.)

కంథుఁడు:—ఒకముని. ఇతఁడు గోమతీతీరమునఁ దపస్సు చేసికొనుచుండువాఁడు; ఇంద్రుఁ డీతని తపస్సునకు భంగము కలుగఁజేయుటకై ప్రమ్లోచయను నప్సరసను బంపెను. ఆమెచే మోహపెట్టఁబడి కంథుఁడు తపస్సు మాని పెక్కేండ్లామెతో రతిసుఖములఁ దేలెను. ప్రమ్లోచవ గర్భవతికూడ నయ్యె. కంథుఁడు తన పతనము చూచుకొని దుఃఖించి ప్రమ్లోచనపైఁ గోపగించెను. ఆమె మిక్కుటముగ భయపడియె; కంథుని వీర్యమామె శరీరముపైకిఁ జెమటవలె వచ్చెను. దాని నామె చెట్లచిగుళ్ళతోఁ దుడిచివేసెను. అందుండియే మారిష పుట్టెను. విష్ణు.

కందరుఁడు:—ఒక పక్షి. సంపాతివంశమువాఁడు. ప్రలోలుపుని పుత్త్రుఁడు. ఇతని సోదరుఁడగు కంకుని విద్యుద్రూపుఁ డను దనుజుఁడు సంహరించెను. అందువలన నితఁడు విద్యుద్రూపుని సంహరించెను. ఈ దనుజునిభార్య మదనిక యను నామె పక్షియై కందరుని డాయవచ్చెను. కందరుఁ డీమెను భార్యగఁ గైకొనియె. ఈమె యం దీతనికిఁ దార్క్షి జన్మించెను. మార్క.

కందళి:—ఔర్వునియొక్క యయోనిజయగు కుమారిత. తిలోత్తమయు, సాహసికుఁడును రమించుచుండుట దుర్వాసుఁడు చూచి తానును సంసారసుఖములను బొందఁగోరెను. ఆ సమయమునకే యౌర్వుఁడు తన కుమారితను దీసికొని యితనికడకువచ్చి యితని కామెనిచ్చెను. దుర్వాసునివలె నీమెకును గోపమెక్కువయే. ఈమెతోఁ గొంతకాలము విహరించి విసుఁగుఁ జెంది యీమెను విడచి దుర్వాసుఁడు తపస్సున కేగెను. ఒక బ్రాహ్మణబాలుఁడు దుర్వాసుని కడకువచ్చి భార్యను విడచుట నీతి కాదనియును, నీమెయే యతనికి జన్మజన్మముల భార్య యగుననియు, నీమె కోపము పోవుననియును జెప్పెను.

ఈమెవలననే భూలోకమందుఁ గదళీజాతి యేర్పడెను. బ్ర. వై.

కంబళుఁడు:—ఒక పన్నగరాజు. ఇతఁడు చనిపోయినపిమ్మట నితనిసోదరుఁడు అశ్వతరుఁడు మదాలసను బ్రతికింపఁగోరి సరస్వతిని బ్రార్థించెను. ఆమె ప్రసన్నయై యితనిం గూడ బ్రతికించి యితనికిని గానవిద్య నేర్పెను. మార్క.

కంస:-ఉగ్రసేనుని పెద్దకూఁతురు దేవభాగుని భార్య.

కంసవతి:- ఉగ్రసేనుని కుమారిత. దేవశ్రవసుని భార్య.

కంసుఁడు:- ఉగ్రసేనుని క్షేత్రజకుమారుఁడు. ఉగ్రసేనుని భార్యయును, కొందఱు యాదవ స్త్రీలును యమునానదికి స్నానమునకును వెళ్ళిరి. అచ్చట నుగ్రసేనునిభార్య రజస్వలయయ్యెను. ఆమె చిత్తము రాగాయత్తము కాఁగ భర్తను దలఁచుకొనెను. ఇదంతయు ద్రమిళుఁడను దానవుఁ డెఱింగి తన మాయచే నుగ్రసేనుని రూపమును దాల్చి యామెతో రమించెను. ఆమె వంచింపఁబడినట్లు తెలిసికొని నీ వెవ్వఁడ? వని వానినడిగెను. వాఁడు నేను ద్రమిళుఁ డను వాఁడను; ఎందఱు వ్యభిచారమువలన సంతానమును బడయరు? పుట్టినవారు బలాఢ్యులు కారా? అని పలికెను. ఆమెకుఁ గోపమువచ్చి నీ దుర్బీజమువలనఁ బుట్టినవాఁడు హరివంశమునఁ బుట్టినవానిచేఁ జచ్చునని నుడివెను. ఆ ద్రమిళుని వలనఁ బుట్టిన కుమారుఁడే కంసుఁడు. అందువలననే యితనికి రాక్షసలక్షణములు కలవు. కంసుఁడు తండ్రియగు నుగ్రసేనునిఁ జెఱయందుంచి తాను రాజయ్యెను. ఇతఁడు జరాసంధుని కుమార్తెలగు అస్తి, ప్రాప్తియనువారిని వివాహమయ్యెను. శిశుపాలాదు లితని మిత్రులు. దేవకి యితని పినతండ్రి కుమార్తె. ఆమె యష్టమగర్భమునఁ బుట్టినవాఁ డీతని సంహరించువాఁడని నారదుఁ డితని కెఱింగించెను. అట్టి యాపత్తు రాకుండుటకై యితఁడు దేవకినే చంపఁగోరెను; కాని యామె బ్రతిమాలి తనకుఁ బుట్టు కుమారులను జంపుట కిచ్చెదనని చెప్పుటచే నామెను, నామె భర్తయగు వసుదేవునిఁ గారాగారమందుంచి వారికిఁ బుట్టుబిడ్డలను జంపుచువచ్చెను. దేవకికిఁ బుట్టిన కృష్ణుని యశోదయొద్దకుఁ గొంపోయి, యామెకుఁబుట్టిన కుమార్తెను వసుదేవుఁడు తీసికొనివచ్చి తన భార్యచెంత నుంచెను. ఈ శిశువును జంపుటకుఁగూడఁ గంసుఁడు వచ్చెను. కంసునిఁ జంపగల్గువాఁడు రేపల్లెలోఁ బెరుగుచున్నాఁడని యీ మాయాదేవి పలికెను. ఆ బాలుని జంపించుటకై కంసుఁడు పలువుర దనుజులను బంపెను. కృష్ణుని సంహరించుటకై యనేక పన్నాగములు పన్నెను. ప్రేమగలవానివలెఁ దన గృహమునకు రాఁబిలిచి కృష్ణునిపై నేనుఁగును దోలించియు, వానితో ముష్టియుద్ధము సేయఁగొందఱ నేర్పఱచియు ననేకవిధముల యత్నించెను. కాని కృష్ణుఁడు వారి నందఱను, తుదకుఁ గంసునిఁగూడ వధించెను. ఇతఁడు పూర్వభవమున కాలనేమి.

హరి. భాగ. భార.

కకుత్థ్సుఁడు:-(చూడు పురంజయుఁడు.)

కకుద్మి:-రేవతుని కుమారుఁడు. ఇతని కుమార్తె రేవతి. కకుద్మి తనకుమార్తెకుఁ బెండ్లిసేయఁ దలఁచుకొని తగినవరునికై తిరిగితిరిగి యెచ్చటను గానక యామెను బ్రహ్మదగ్గఱకుఁ దీసికొని వెళ్ళెను. అచ్చట దివ్యాంగనలు నాట్యము చేయుచుండఁగ నితఁడు మాటాడక నిలువఁబడియె; నీవు వచ్చినపని యేమని బ్రహ్మయే యడిగెను. తనకుమారితకుఁ దగినభర్తను జెప్పుమని కకుద్మి కోరఁగ నీవు బయలుదేరినపుడున్న మనుజులందఱును గతించిరి; మరియు నీవు వచ్చినతరువాతఁ గొన్నియుగములే గతించినవి. ఇపుడు భూలోకమున బలరాముఁ డున్నాఁడు; వానికిచ్చి వివాహము చేయుమని బ్రహ్మ చెప్పెను. అతఁడట్లు గావించెను. ఇతఁడు మనువు కాఁగలఁడు. విష్ణు.

కక్కయ్య:-ఒక శివ భక్తుఁడు. ఇతని ప్రసాదము పొందవలెనని బసవన్న పండ్రెండేండ్లు ప్రయత్నించినను లభ్యము కాలేదు. ఒకనాఁడు కబీరు ప్రసాదకణమును గొనిపోవుట చూచి బసవ ఆకణమును గొంపోయి తలపాగలో మూటకట్టి తాను స్నానమునకుఁ బోయెను. ఆ సమయమున అతని సోదరి కన్య తినెను. దాన నామెకు గర్భమై చెన్నబసవఁడు పుట్టెను. చె. బ.

కక్షీవంతుఁడు:- కళింగదేశాధీశుఁడు. తన భార్యయగు సుధేష్ణను దీర్ఘతమునివలనఁ బుత్రుని బడయుమని నియోగించెను. ఆమె మునిని డాయరోసి తన దాసిని బంపెను. ఆదాసియందు దీర్ఘతమునివలనఁబుట్టిన పుత్రుఁడే కక్షీవంతుఁడు.

కచుఁడు:-బృహస్పతి పుత్త్రుఁడు. మృతసంజీవని విద్య రాక్షస గురువైన శుక్రునకుఁ దెలిసి దేవతలకుఁ దెలియకుండుటచే దేవతలు కచుని శుక్రునొద్దకేగి యతనికి శుశ్రూష గావించి అతనికిని, అతని కూతునకును బ్రీతిచేసి యావిద్యఁ బడసి రమ్మనిపంపిరి. కచుఁడు శుక్రునొద్దకేగి యాతనిని, నతని పుత్త్రికయగు దేవయానిని గొలుచుచు వారి యనుగ్రహము వడయుచుండెను. దేవతల గురువైన బృహస్పతిపుత్త్రుఁడు తమ గురువునకుఁ బ్రియశిష్యుఁడుగా నుండుటసహించలేక దానవులొకనాఁడు శుక్రుని హోమధేనువులనుగాచుచు నొంటరిగానున్న కచునిఁ బట్టి చంపి యొక వృక్షమునకుఁ గట్టిరి. సాయంకాలము ప్రొద్దువోయినను గచుఁ డింటికి రామికై దేవయాని చింతించుచుఁ గచుఁడు తిరిగి రాలేదని తండ్రి కెఱింగించెను. శుక్రుఁడు దివ్యదృష్టివలనఁ గచునకు సంభవించిన విపత్తుఁ దెలిసికొని మృతసంజీవనిని బంపెను. అది వానిని సజీవునిగఁ జేసి తీసికొని వచ్చెను. దానవులకు నీర్ష్య యెక్కుడయ్యె. మఱియొకనాఁ డరణ్యమునఁ గచుఁ డొంటరిగ నుండుటఁ జూచి, రాక్షసులు వానినిబట్టి చంపి కాల్చి భస్మముచేసి యాభస్మమును సురలోఁ గలిపి శుక్రాచార్యునకా సురను ద్రాగనిచ్చిరి. శుక్రుఁడు దానిని పానముచేసెను. ఆనాఁడును గచుఁడు కనఁబడక పోవుటచే దేవయాని తిరిగి తండ్రితోఁ జెప్పెను. నీకేల విచారము? అతఁడు చంపఁబడినను దేవలోకమునకే యరుగును అని శుక్రుఁడు పలికెను. కాని కచునిఁ జూడక తా నాహారము గైకొనని దేవయాని యనుటచే నామె యందున్న ప్రేమచేఁ గచుని రావింపఁ గోరి శుక్రుఁడు తన యోగదృష్టిని జూచి రాక్షసులు చేసిన మాయనంతను గ్రహించెను. సురాపానముచేఁ దనకైన మోసము తెలిసికొని సురాపానము మహాపాతకమని శపించెను. పిమ్మట మృతసంజీవనిచేఁ దన గర్భమందున్న కచుని బ్రతికించెను. కాని యతఁడు బైటకు వచ్చుటకుఁ దన యుదరము చీల్చుకొని రావలెను; తన యుదరము చీల్చినఁ దానే మృతుఁడగును. కావున మృతుఁడైనను బునర్జీవితునిగఁ జేయుటకుఁ దన గర్భమున నున్న కచునకు మృతసంజీవని నుపదేశించెను. పిమ్మట గచుఁడు శుక్రుని యుదరము చీల్చుకొని బైటకువచ్చి శుక్రుని బునర్జీవితునిఁ జేసెను. కచుఁడట్లు విద్య నేర్చుకొనిన పిమ్మట శుక్రుని యనుజ్ఞ వడసి దేవలోకమున కేగఁ బోవుచుండె. అంత దేవయాని వచ్చి తనను బరిణయముకమ్మని కోరెను. "నీవుగురుపుత్త్రికవు. కావున సోదరివంటిదానవు. నిన్నుఁ బరిణయము కాఁదగదు" అని కచుఁడు తిరస్కరింపఁగ దేవయానికిఁ గోపమువచ్చి నీవు నేర్చుకొనిన విద్య నీకుఁ బనిచేయకుండుఁ గాక యని శపించెను. నాకుఁ బనిచేయకుండినను నావలన నేర్చుకొనినవారికి బనిసేయుఁగాక యని, నీవు ధర్మ విరోధమునచేసి శాపమిచ్చితివి. కావున నిన్ను బ్రాహ్మణుఁడు వివాహము కాకుండెడిగాక యని కచుఁడు ప్రతిశాపమిచ్చి యరిగెను. భార.

కచ్ఛపి :-సరస్వతియొక్క వీణె.

కణికుఁడు :-భారద్వాజ వంశజుఁడు. శత్రుంజయుఁడను సౌవీరాధిపతికి హితము బోధించెను. భార.

కణికుఁడు :-దుర్యోధనుని మంత్రి. ధర్మరాజును యౌవరాజ్య పట్టాభిషిక్తునిం జేసిన పిమ్మట దుర్యోధనుఁడు దుఃఖించుచు నతనియొద్దకువచ్చి తానపుడు చేయవలసిన పని చెప్పుమని యడిగెను. కణికుఁ డతనికి రాజనీతి నేర్పుచు శత్రువులైనవారిని, వారు బంధువులైనను వారిని దూరంబుచేసి దూషించునది. ఎటులైనను వారిని వధించుటే రాజనీతి యని చెప్పెను. ఇతఁ డట్లు చెప్పినమీఁదటనే దుర్యోధనుఁడు పాండవుల నిమిత్తము లక్కయిల్లు కట్టించెను. భార.

కణ్వుఁడు :-అప్రతిరథుని కుమారుఁడు. ఇతని కుమారుఁడు మేధాతిథి. భా. గ.

కణ్వుఁడు :-ఒకఋషి. తనసామమునకు నిదానము తోఁచక యాలోచించుచుండఁగ నొక పిల్లి కుమ్మెను. ఆ శబ్దమునే యతఁడు నిదానముగఁ గైకొని సామఋక్కు చెప్పెను. బ్రాహ్మ.

కణ్వుఁడు:-కాశ్యపగోత్రుఁడు ఒక ముని. పక్షులు తమ ఱెక్కలను విప్పి యెండ తగులకుండఁ గాపాడుచుండిన యొక శిశువును జూచి తన యాశ్రమమునకుఁ గొనివచ్చి పెంచి శకుంతల యని పేరుపెట్టెను. శకుంతల కణ్వునే తండ్రిగ భావించుచుఁ బెరిగి పెద్దదయ్యె. ఇతఁ డొక నాఁడు సమిధలకై వనమున కేగినసమయమున దుష్యంతుఁ డితని యాశ్రమమునకు వచ్చెను. శకుంతలయు దుష్యంతుఁడును గాంధర్వవిధిని వివాహమయిరి. ఇకఁ జేమగునో యని శకుంతల భయపడెను. కాని యోగదృష్టిగలవ జరిగిన వృత్తాంతము తెలిసికొని యామెవివాహమునకు సమ్మతించి శకుంతలకుఁ గలుగు భయమును బోఁగొట్టెను. ఎంతకాల మఱిగినను దుష్యంతుఁ డీమెను దీసికొనివెళ్ళకుండుటచేఁ బడతులకుఁ బెద్దకాలము పుట్టినింట నుండుట తగదని కణ్వుఁడు తన శిష్యుల నిచ్చి శకుంతలను దుష్యంతుని కడకుఁ బంపెను. భార.

కదలీజాతి :—కందళివలన నేర్పడెను. (చూడు కందళి.)

కదుఁడు:-వీని వలననే తీర్థయాత్రలు సేయుచున్న యర్జునుఁడు సుభద్రనుగూర్చి వినెను. భార.

కద్రువ:-ధరణీదక్షుల పుత్రిక. కశ్యప ప్రజాపతి భార్య; ఈమె వేయిమంది పుత్రులను(సర్పములను) బడసెను. వినత యీమె సవతి. వీరిద్దఱొక నాఁడు సముద్రతీరమున సంచారముచేయుచు నుచ్చైశ్శ్రవ మను గుఱ్ఱమును జూచిరి. "ఎంత నిర్మలమై ధవళముగ నున్నదీ ఈ గుఱ్ఱ!" మని వినత పలికినఁ గద్రువ నవ్వి "అదేమే! అట్లను చుంటివి, దాని శరీరముపై నుండిన నలుపు కనఁబడుట లేదా నీకు?" అని ప్రశ్నించెను. దానిని గూర్చి వారిద్దఱకును వాదము జరిగెను. తుదకు, గుఱ్ఱముశరీరముపై నలుపున్నయెడల వినత కద్రువకు దాసియై పరిచర్యలు చేయుటకును, లేని యెడల వినతకుఁ గద్రువయే దాసియైపరిచర్యలు చేయుటకును వారు పన్నిదములు వేసికొనిరి. ఆ నాఁడు "ఇంకఁ బతిసేవకు వేళయయ్యెను. పోవలె నని నెపము పెట్టుకొని మఱునాఁడు వచ్చిచూత" మని యింటికి వెళ్ళిరి. ఆ రాత్రి కద్రువ తన కుమారులకుఁ దన పందె మెఱింగించి యాయశ్వ వాలమునుబట్టి వ్రేలాడుచు నది నల్లగఁ గనఁబడునట్లు చేయుఁడని కోరెను. "తల్లి చెప్పినను మే మధర్మమున కొడంబడుదుమా? మేము వ్రేలాడము" అని పలువురు పుత్రులు నిరాకరించినందునఁ దానుపందె మోడిపోదునని భయపడి కుమారులను దయమాలి జనమేజయుఁడు చేయు సర్పయాగమున మీరు నశించి పొండని శపించెను. ఆ వాక్యములు కర్కోటకుఁడను కుమారుఁడు విని శాపమునకు వెఱచి, తల్లీ! నీవు చెప్పినట్లు నేను గుఱ్ఱముతోఁక నంటి పెట్టుకొని యుందును అని చెప్పి యశ్వవాలముపైఁ జేరి యుండెను. మఱునాడు వినతా కద్రువలు పోయి గుఱ్ఱమును జూచిరి. వాలముకడ నల్లగనే కనఁబడియె. వినత తానే యోడితినని కద్రువకు దాసియయ్యె. శేషుఁడు, వాసుకి, ఐరావతము, తక్షకుఁడు, కర్కోటకుఁడు, ధనంజయుఁడు, కాళియ, మణినాగము, పూరణుఁడు, పింజరకుడు, ఏలాపుత్రుఁడు వామనుఁడు మొదలగువా రీమె పుత్రులు. ఈమె పుత్రిక జరత్కారువు. భార.

అదితి కశ్యపునితోరమింపగోరి వచ్చినపుడు కద్రువ కశ్యపునితోఁ గూడి యుండెను. ఆమెకు గోపమువచ్చి మీరు నరులైపుట్టుఁడని వీరిని శపించెను; ఈమె ప్రతిశాప మిచ్చెను. ఆ శాపముచేఁ గద్రువ రోహిణిగఁ బుట్టెను.

బ్ర. వై.

కనకధ్వజుఁడు :— గాంధారీ ధృతరాష్ట్రుల పుత్రుఁడు. భార.

కన్నప్ప:—వీఁడే తిన్నఁడు. చూడుము.

కన్యకాంబ :-వైశ్యుల కులదేవత. ఈమె కుసుమశ్రేష్ఠి కుమార్తె. ఈమె పేరు వాసవాంబ. ఈమెతల్లి కుసుమాంబ. కుసుమశ్రేష్ఠి పుత్రకామేష్టి చేయగ నీమెయు, విరూపాక్షుఁడను పుత్రుఁడును బుట్టిరి. వీరి నివాసస్థలము పెనుగొండ. విష్ణువర్ధనుఁ డను రాజు నగరసమీపమునకు వచ్చెను. వైశ్యులాతని కెదురుగ వెళ్ళి

యాతిథ్య మిచ్చి తమ నగరమునకుఁ దీసికొని వచ్చి సత్కరించిరి. విష్ణువర్ధనుఁడు వారు చేసిన మర్యాదలను గైకొని వారి కొక్కొక్కరికే తాంబూలము లిచ్చుచుండెను; ముందు కుసుమాంబ కిచ్చెను; పిమ్మటఁ దాంబూలము గైకొనుటకు వాసవాంబను దీసికొని వచ్చిరి ఈమెను జూచుటతోడనే రాజు మోహపరవశుఁడై యామెను దన కిమ్మని నిర్బంధించెను. వా రివ్వ మనుటచే వారి నందఱిని యుద్ధములో నోడించి యామెను గైకొందునని రాజు పలికెను. ఎట్టకేలకుఁ గుసుమశ్రేష్ఠి తనకూతును విష్ణువర్ధనున కిచ్చుట కంగీకరించెను; కాని వివాహ ముహూర్తము రెండు నెలలు దాటించి పెట్టెను. రాజు దానికి సమ్మతించి తన నగరమున కేగెను. ఈలోపున వైశ్యులెల్లరునుగూడి సభచేసి వాసవాంబను రాజున కీయరాదని తీర్మానించుకొనిరి. విష్ణువర్ధమనితో నట్లు చెప్పుటకును గొందఱు వెళ్ళిరి. అచ్చట వాద ప్రతివాదములు జరిగెను; ఏమైనను రాజునకుఁ దమ బాలిక నీయమని చెప్పిరి. రాజు వారి నందఱిని బంధించుఁడని యాజ్ఞచేసి పెనుగొండపై యుద్ధమునకుఁ బయలుదేఱెను. ఈ వెళ్ళిన వైశ్యులు రాజభృత్యులకు లంచము లిచ్చి తమపట్టణము చేరిరి; వారు తిరిగి యాలోచించుకొనిరి. వాసవాంబ సోదరుఁడైన విరూపాక్షుఁడు 'మన మందఱ మగ్నిలోఁ బడి కాలిపోవలెనుగాని మన కన్య నివ్వరా' దని చెప్పెను. దానికిఁ బలువు రంగీకరించిరి; అంగీకరింపనివార లచ్చటనుండి వెళ్ళిపోయిరి. విష్ణువర్ధనుఁడు రాకపూర్వమే వారు చితిపేర్చి వాసవాంబనే ముందుగఁ జితి నెక్కించుట కేర్పాటు చేసిరి. పాపము! పెండ్లి పేరంటము చెయ్యకయే యా కన్య నిట్లు నిప్పులలోఁ ద్రోయుటకుఁ గంటఁదడిపెట్టనివారులేరు. కాని, అప్పుడామె తన నిజస్వరూపమునుజూపి తాను శాపవశమున నిట్లు పుట్టిన శచీదేవి నని తెల్పెను. వా రామె దివ్యరూపమును జూచి ధైర్యము తెచ్చుకొని వారును నామె వెంబడి చితినెక్కిరి. ఈమె కన్యగ నుండియే రూపము చాలించుకొనుటచేఁ గన్యకాంబ యను పేరువచ్చెను.

కన్యకాంబ శాపవశమున నట్లుపుట్టినశచీదేవి.

శతజిహ్వుఁడను రాక్షసుఁడు యజ్ఞములను బాధ చేయుచుండఁగ. బ్రహ్మ జయంతునికడకు వచ్చి నీ వా రాక్షసునితో యుద్ధముచేసి వానిని జంపుమని చెప్పెను. కాని శచీదేవి తన పుత్త్రుని రాక్షసునితో యుద్ధమునకుఁ బంపుటకు వెఱచి వలదనెను. బ్రహ్మకుఁ గోపము వచ్చి నీ వింత భయపడితివి, వైశ్యకాంతవై పుట్టుమని శపించెను. ఇంద్రుఁ డపుడు బ్రహ్మను బ్రార్థించెను. "నీవు భయపడకుము. ఆమె భూలోకమున నెవ్వరిని బెండ్లియాడకుండగనే తిరిగివచ్చు"నని బ్రహ్మ చెప్పెను.

శచీదేవి యట్లు పుట్టుటకు మఱియొక కారణముకూడఁ దోడ్పడియెను. సోమకాంతుఁడను యక్షుని భార్య సుశీల శచిని బ్రార్థించి తనకుఁ బుత్త్రికగఁ బుట్టుమని వేడెను. శచి యట్లు జన్మించెను. ఆ కన్యను చిత్రకంఠుఁడను గంధర్వుఁడు వలచెను. ఈమె నిరాకరించుటచే నీవు భూలోకమునఁ బుట్టుమని యతఁడు శపించెను. ఆ శాపమువలన శచీదేవి వాసవాంబగఁ బుట్టెను.

కన్య.

కన్యాకుబ్జము:- ఒక దేశము. కుశనాభుని కుమార్తెలు వాయుశాపముచేతఁ గుబ్జలైరి. వీరి నూర్గురను బృహదత్తుఁడు వివాహమయ్యెను. ఇతఁడే వారి కుబ్జత్వమును బోఁగొట్టెను. వారు నివసించినప్రదేశము కన్యాకుబ్జము.

కపాలమోచనము:- కాశిలో నొక తీర్థము. పూర్వము బ్రహ్మయును, శివుఁడును నే నధికుఁడను, నే నధికుఁడనని తగవులాడుకొనుచుండిరి. బ్రహ్మ పంచమశిరము నొకటి కల్పించుకొని శివుని దూషించెను. శివుఁడు భైరవుని సృజించి వానిచే బ్రహ్మ పంచమశిరమును ఖండింపఁ జేసెను. ఆ శిరఃకపాలము భైరవునిచేతి కంటుకొని యూడివచ్చినది కాదు. ఆ కపాలముతో విష్ణువొద్ద కేగుమని శివుఁడు చెప్పఁగ భైరవుఁ డంగెను. కాని వాకిటనున్న విష్వక్సేనుఁడు భైరవుని విష్ణువొద్ద కేగనీయలేదు. అంత భైరవుఁడు విష్వక్సేనునిఁ జంపి లోనికేగి విష్ణుని దర్శించెను. విష్ణువు తన కనుబొమలమధ్యఁ బొడుచుకొని, కారుచుండిన రక్తమును ఆ కపాలములోఁ బట్టు

మని చెప్పెను. ఒక సంవత్సర మట్లు రక్తము కారెను గాని కపాలము నిండలేదు. ఆ కపాలమును గాలిలోఁబాతిపెట్టుమని విష్ణువు చెప్పెను. భైరవుఁడు దానినిగొనివచ్చి గాలిలోఁ బాతెను. అది పాఁతఁబడిన ప్రదేశమే కపాలమోచన తీర్థము. భవి.

ఇది సరస్వతీనదియందొక తీర్థము. ఈతీర్థము యొద్దనే పూర్వము శుక్రుఁడు తపస్సుచేసెను. రామరావణయుద్ధమందు శ్రీరాముఁడు మహోదరుఁడను రాక్షసునిశిరము తెగవేసెను. ఆ శిర మెగిరిపడి మహోదరుఁ డను మునిచేతి కంటుకొనెను; ఎంత యత్నించినను నూడివచ్చినది కాదు. పూర్వము శుక్రుఁడు తపస్సుచేసిన యీతీర్థములో స్నానముచేసి రమ్మని మును లామహోదరునితోఁ జెప్పిరి. అతఁడు వచ్చి స్నానము చేయఁగ నంటుకొనిన కపాల మూడి వచ్చెను. అందువలన నా తీర్థమునకుఁ 'గపాల మోచన' మను పేరువచ్చెను.

కపిల:- ధరణీవత్సుల కుమారిత; కశ్యపుని భార్య. ఘృతాచీ మేనక లీమె పుత్రికలు. భార.

కపిలుఁడు:- ఒక ముని. దేవహూతీ కర్దముల పుత్త్రుఁడు. విష్ణ్వంశమునఁ బుట్టినవాఁడు. ఇతఁడు సాంఖ్యము నెఱిఁగి దానినుపదేశించెను. వేదములే ప్రమాణములని స్యూమరశ్మి యను మునితో వాదించి బోధించెను. కపిలుని భార్య శ్రీమతి. భాగ. భార.

కపిలుఁడు పాతాళలోకమునఁ దపస్సుచేసి కొనుచుండఁగ సగరపుత్త్రులు యజ్ఞాశ్వమునకై వెదకుచు నితని ప్రక్కను గుఱ్ఱ ముండుటఁ జూచి యితఁడే గుఱ్ఱమును హరించి వచ్చెనని యితనిని బంధింపఁ బోయిరి. కపిలుఁడు కన్నులు తెఱచి చూడఁగనే వారు భస్మమై పోయిరి. పిదప అంశుమంతుఁ డితనిని ప్రార్థించి గుఱ్ఱము నిమ్మని యడుగక, తండ్రులమాట తల పెట్టక మ్రొక్కుచు నిలుచుండెను. కపిలుఁడు సంప్రీతుఁడై గుఱ్ఱమును విడిపించుకొమ్మని చెప్పి, సగరపుత్త్రు లట మరణించుటయును, నటకు గంగాజలమును గొనివచ్చుటచే వారికి శుభమగుటయును దెల్పెను. బ్రహ్మ.

కపిలుఁడు:- ఇతఁడే నారాయణుఁడు (నరనారాయణులు) అను ఆదిముని యయ్యెను. భార.

కపిలుఁడు జైగీషవ్యుఁడను మునిని వెంట బెట్టుకొని యశ్వశిరుఁడను నొక రాజు చేయు క్రతువుచూడవెళ్లెను. రాజు మునులను సత్కరించి, యేవిధమున సేవించిన విష్ణుమూర్తి వశుఁ డగు? నని ప్రశ్నించెను. నేనే విష్ణుమూర్తిని. నన్నే సేవింపుమని కపిలుఁడు పలికె. ఏమి! యీ ముని యహంభావమని రాజునకుఁ గోపము వచ్చెను. కాని కపిలునిఁబరుషములు పలుకలేక, విష్ణుమూర్తిని నేనెఱుఁగుదును. అతఁడు పక్షివాహనుఁడు, శంఖచక్రములు గలవాఁడు అని రాజనియె. వెంటనే కపిలుఁడు శంఖచక్రములు ధరించి విష్ణుస్వరూపుఁడయ్యెను. జైగీషవ్యుఁడు ఖగేంద్రుఁడయ్యెను. రాజు వీరిని జూచి యివి మీ మాయలు; మిమ్ము నేను నమ్మను. విష్ణుమూర్తికి నాభియందుఁ గమలమును, నందు బ్రహ్మయు నుండునని నెను. కపిలుని నాభియందు గమలము కనఁబడెను. జైగీషవ్యుఁడు బ్రహ్మ యయ్యెను. ఇదియు మాయయే యని యశ్వశిరుఁడు పలికెను. మును లంతర్ధానము నొందిరి. అంతట యజ్ఞభూమి దుష్టమృగ భూయిష్ఠ మయ్యెను. ఈ మునుల ప్రభావముననే యిట్లయ్యెనని యశ్వశిరుఁడు వీరిని దలఁచుకొని ప్రార్థించినఁ గపిలుఁడు మరల ప్రత్యక్షమై మృగబాధలేకుండఁజేసి యిట్లనియె. "రాజా! నీవు భగవంతుని నెట్లు వశము చేసికొనుట? యని యడిగితివి. సర్వ పదార్థములయందును భగవంతుఁ డున్నాడని యెఱింగితివేని నీకు వశుఁడగును. నీకది తెల్పుటకే యిట్లు చేసితి" మని నుడివి స్వజాతీయకర్మను సుజ్ఞానముతోఁ జేసిన మోక్షము వచ్చునని బోధించెను. వరా.

కపోతతీర్థము:- గౌతమియందొకతీర్థము. లుబ్ధకుఁ డొకఁడు సుఖముగాఁ గాపురము చేయుచున్న కపోతములలో నాఁడుదానిని బట్టుకొని పంజరమునఁ బెట్టెను. మగపక్షి యా పంజరము చుట్టు దిరుగుచువిలపించుచుండెను. ఆఁడుపక్షి దుఃఖము నొందియు భర్తకుధైర్యము చెప్పి నీవు విచారింపకుము. చావెప్పటికైనను తప్పనిదిగదా! నీవు బాగుండఁగ, నేను ప్రాణములు విడుచుటయే

నా కోరిక యని కంటఁ దడిపెట్టుకొనెను. కాని మగపక్షి యగ్నిహోత్రము తెచ్చి మంట చేసి దానిలోఁబడియె. లుబ్ధకుఁడు జాలినొంది యాఁడుపక్షినిగూడ విడచెను. అదియుభర్తతోఁ జితినెక్కెను. లుబ్ధకుఁడు విస్మయమంది యా మిథునమునకు నమస్కరించి తనకు సన్మార్గమును జూపుఁడని వేడెను. అవి గౌతమిలో స్నానము చేసి దైవమును ధ్యానించి యా మలిన దేహమును వదలుమని చెప్పెను. ఆ లుబ్ధకుఁ డట్లు చేయఁగ వానికి విమానమువచ్చి స్వర్గమునకు వానిని గొనిపోయెను. లుబ్ధకుఁడు కపోతములచేఁ జెప్పఁబడి స్నానముచేసి ముక్తినొందిన తీర్థమే కపోతతీర్థము. బ్రహ్మ.

కపోతలోముఁడు:-విలోమతనయుని పుత్త్రుడు.

కబంధుఁడు:-ఒక దనుజుఁడు. వీనికిఁ దలయును, గాళ్ళునులేవు. యోజనము విస్తీర్ణమైన పొట్టయును, దానిని మించిన చేతులును మాత్రము కలవు. ఇతఁడు చేతులను ద్రిప్పుచుఁ జిక్కిన వారిని బొట్టలో వేసికొనును. సీతనుగూర్చి వెదకుచు రామ లక్ష్మణులు వీనికిఁ జిక్కిరి. వీరి నితఁడు తన దగ్గఱగ లాగుకొని వచ్చెను. వారు భయపడిరి, కాని తుదకు రాముఁడు ఖడ్గముతో వీనిని నఱికెను. దనుజుఁడు హతుఁడైపడి మీ రెవ్వరని యడిగి వారికిఁ దాను పూర్వము దనువనువాఁడగుటయు, శాపవశమున నిట్లగుటయుఁ జెప్పి వానిశరీరము దహింపుఁడని కోరెను. రామలక్ష్మణు లచ్చటి కాష్ఠములు మథించి యగ్ని పుట్టించి యా వికృతశరీరమును దహింపఁ జేసిరి. అతఁడపుడు తన దివ్యరూపము నొంది రావణుఁడు సీతనెత్తుకొనిపోయెనని యెఱిఁగించి సుగ్రీవునితో సఖ్యము చేయుఁడని చెప్పెను. రామా.

కమలపాలిక:-హిడింబి పేరు అని వ్యాసుఁడు పాండవులకుఁ జెప్పెను. (చూడుము.హిడింబి.) భార.

కమలాక్షుఁడు:-త్రిపురాసురులలో నొకఁడు. (చూడుము. త్రిపురాసురులు.)

కరంధముఁడు:-(కరంధనుఁడు) ఖనీనేత్రుని (ఖనిత్రుని. అతివిభూతియొక్క) పెద్దకుమారుఁడు. ఇతని మొదటిపేరు కర్దముఁడు (బలాశ్వుఁడు). ఖనీనేత్రుఁడు మంత్రులను, ప్రజలను బాధించుటచే వానిని రాజ్యభ్రష్టునిం జేసి కరంధమునకుఁ బట్టము కట్టిరి. తన తండ్రికి వచ్చిన చేటు తనకు రాకుండుటకై కరంధముఁడు మంత్రులకును, ప్రజలకును విశేషముగ ధనము లిచ్చివేసి తాను ధనహీనుఁడై యుండెను. ఆసమయమున శత్రురాజులు వానినగరమును ముట్టడించి వానినోడించి నగరము వెడలనంపిరి. ఇతఁడు వనములకేగి తపస్సుచేసి తన కరము మథింపఁగ నందుండి తురగములు, రథములు, భటులు, ధనము దినదిన ముద్భవింపఁజొచ్చెను. అట్లు కరము మథించుటచే నితనికిఁ గరంధముఁ డను పేరువచ్చెను. అట్లు లభించిన సేనతోఁ దన శత్రురాజుల నెల్లర నోడించి కరంధముఁడు మరల తన రాజ్యమును గెలిచెను.

కరంధముఁడు వీర్యచంద్రుని కుమారితను వీరను బరిణయమై యొక పుత్త్రుని బడసెను. పుత్త్రుఁడు జన్మించిన తోడనే జ్యోతిష్కులను రావించి పుత్త్రుని జాతక మెట్లున్నదని యడుగఁగ వారు మంచిగ్రహములు వీక్షించుచున్నవనియుఁ జెడుగ్రహము లేవియు వీక్షించుట లేదనియుఁ జెప్పిరి. మంచి గ్రహములచే నావీక్షింపఁబడెనని చెప్పిరిగానఁ గరంధముఁడు పుత్త్రునకు నావీక్షిత్తు అని పేరు పెట్టెను. అవీక్షిత్తు సకలవిద్యల నభ్యసించెను. ఇతఁడు విశాలతనయ స్వయంవరమునకుఁ బోయినపు డచ్చటకు వచ్చిన రాజకుమారు లొక్కటై వీనిని బంధించిరి. కరంధముఁడు వారి నోడించి పుత్త్రుని విడిపించెను. అప్పటినుండియు నావీక్షిత్తు బ్రహ్మచర్యము పూనెను. కరంధముఁ డెంత బ్రతిమాలినను నతఁడు వివాహమువలేదు. తన తల్లి చేయుఁ కిమిచ్ఛక వ్రతమున నెవ్వరేమి కోరిన దాని నిత్తునని యావీక్షిత్తు పలికెను. కరంధముఁడు వచ్చి నేను పౌత్త్రుని గోరితి నిమ్మనియె. అవీక్షిత్తు తనమాట చెల్లించి తండ్రి కోరిక తీర్పుటకై విశాలతనయను బరిణయమయ్యెను.

కరంధముఁ డంగిరసుని నుపద్రష్టఁగఁ జేసికొని పెక్కు యాగములు చేసి స్వర్గమును బొందెను. మార్క. భార. విష్ణు.

కరంభ:-అక్రోధనుని భార్య. దేవాతిథి తల్లి. భార.

కరంభుఁడు:- దనువు అనువాని పుత్త్రుఁడు, రంభుని సోదరుఁడు. ఈ సోదరులు సురలను గెలువఁగలుగు పుత్త్రులనుగోరి హ్రదమునుజొచ్చి తపము చేయుచుండిరి. ఇంద్రుఁడు మకరమై యా మడువుఁజొచ్చి వారిని సంహరించెను. దే. భా.

కరటకదమనకులు:- పంచతంత్రములలో మిత్రభేదకథయందుఁ జెప్పఁబడిన జంబుకసోదరులు. ఈ నక్కలు రాజనీత్యాదివిజ్ఞానము నెఱింగి మృగరాజు కొలువులో నుండెడివి. ఇవి తమలోఁ దాము వితర్కించుకొనుచుఁ గలిసిమెలసి యెంతటి కార్యమైనను జేయుచుండెడివి. వనములో సంచరించుచున్న వృషభమునందు మృగరాజునకు వలపు పుట్టించి వీని రెండింటికిని మైత్త్రిగావించెను. ఆ వృషభము కొలువులోఁ జేరినపిమ్మట వీని ప్రాముఖ్యత తగ్గెను. మృగరాజు వృషభముతోడనే యాలోచించుచు, దాని నెక్కువ గౌరవించుచుండెను. అదిచూచి సహించలేక వృషభముపైఁ గొండెములు సింహముతోఁ జెప్పి యా సింహ మన్యాయముగ నెద్దును జంప నున్నదని యెద్దుతోఁజెప్పి, యీ రెండింటికిని వైరముపుట్టించి సింహముచే వృషభమును జంపించెను. పంచ.

కరవీరుఁడు:- కద్రువ కుమారుఁడు. భార.

కరుషుఁడు:- ఇతఁడే పృషధ్రుఁడు. (చూడుము పృషధ్రుఁడు.)

కరూశదేశము:- ఇంద్రుఁడు వృత్రాసురుని జంపుటచే నతనికి బ్రహ్మహత్యాపాతకమున ఆఁకలి, మలము వచ్చెను. మును లా పాతకమును గడిగి వేయఁగ నింద్రుఁడు నిష్కరుశుఁ డయ్యె. మలినమంతయు నతఁడు కడుగఁబడిన దేశము దాల్చెను. కావున నా దేశమునకుఁ గరూశదేశమని పేరువచ్చెను. ఆ దేశము మొదట ధనధాన్యములతో నుండెను గాని, తాటక అచ్చటి వారిని బాధపెట్టి ధ్వంసము చేసెను. రామా.

కరూశుఁడు:- వైవస్వతమనువు కుమారుఁడు. ఇక్ష్వాకు తమ్ముఁడు. ఇతఁడు కరూశదేశము పాలించెను. ఇతనినిబట్టియే యాదేశమున కా పేరు వచ్చెను.

కరూశదేశము:- దంతవక్త్రుఁ డేలిన దేశము.

కరేణువతి:- నకులుని భార్య. భార.

కరోటకుఁడు:- కద్రువ కుమారుఁడు. భార.

కర్కురుఁడు:- కద్రువ కుమారుఁడు. భార.

కర్కి:- ఆపస్తంభునిపుత్త్రుఁడు. ఇతని తల్లి అక్షసూత్ర. బ్రహ్మ.

కర్కోటకుఁడు:- కద్రువ కుమారుఁడు. వినతాకద్రువలు పన్నిదము వేసికొనినపుడు ఉచ్చైశ్శ్రవముయొక్క శరీరమును నల్లఁగఁ గనఁబడునట్లు చేయుఁడని కద్రువ తన పుత్త్రులను గోరెను. అట్టి యన్యాయమున కొడిగట్టమని వాసుక్యాదులు పలికిరి. అంతట నామె కుమారులను శపింపఁగ నితఁడు శాపమునకు వెఱచి తల్లిచెప్పినట్లుచ్చైశ్శ్రవమును నంటిపెట్టుకొని యుండెను.

రాజ్యము పోఁగొట్టుకొని యడవిలో సంచరించుచున్న నలునిఁ బిలచి, అయ్యో! అగ్నిలోఁ బడిపోవుచుంటిని. నన్ను బైటకుఁ దీయుమని కర్కోటకుఁడు వేడెను. నలుఁడు వీని నగ్ని నుండి తీయఁగ వానిని గఱచి వికృతరూపునిఁగఁ జేసెను. నీవు విషపీడితుఁడవైతినని దుఃఖింపకుము. నావిషము నీ శరీరములో నున్నంత కాలము విషోరగ పిశాచ రాక్షసాది భయము నీకుఁ గలుగదు. నీవీ రూపమున బాహుకుఁడను పేరుతో ఋతుపర్ణునియొద్ద సూతవృత్తి సేయుచుండుము. నిన్నిపుడు పరులు గుర్తింపఁజాలరు. నీవు కోరినపుడు నన్నుఁదలంపుము. ఈవస్త్రంబు నీవద్దకు వచ్చును, దానిని ధరింపుము. నీపూర్వపు రూపము వచ్చును. నీభార్యను, రాజ్యమును మరలఁ బొందెదవు అని చెప్పి నిజరూపమును జూపి కర్కోటకుఁడు చనియె. ఇతని కీర్తనము కలినాశనము. భార.

కర్ణికారవనము:- మేరుపర్వతము దగ్గఱ నున్న యొకవనము.

కర్ణికారుఁడు:- జటాయువు పుత్త్రుఁడు. మత్స్య.

కర్ణుఁడు:- పరీక్షిత్తు మనుమఁడు. జనమేజయుని కుమారుఁడు. భార.

కర్ణుఁడు పాండురాజభార్యయైన కుంతికన్యాత్వమున దుర్వాసునకుఁబరిచర్యలు చేయఁగనతఁడు

ప్రీతుఁడై యొకమంత్ర ముపదేశించెను. ఆ మంత్రమువలనఁ గుంతి యేదేవత నాహ్వానించి నను నతఁడు వశుఁడగునని యతఁడు చెప్పెను. ఆ మంత్రప్రభావము పరీక్షించుటకై కుంతి కన్యాత్వముననే సూర్యు నారాధించి యతని వంటి పుత్రునిఁ గోరి వరించెను. ఆమెకు సూర్యుని వలనఁ బుట్టిన కుమారుఁడే కర్ణుఁడు. కర్ణుఁడు పుట్టుకతోడనే కవచకుండలములతో నొప్పారెను. ఆమె యీవృత్తాంతమంతయు బయల్పెట్ట వెఱచియును, సిగ్గుపడియు శిశువు నొక తొట్టె యందుంచి దానిని అశ్వనదిలో విడచెను. అది క్రమమున గంగను చేరి గంగలో స్నానముచేయు చుండిన యతిరథుఁడను సూతుఁడు తొట్టిలోని బాలునిఁజూచి తనకుఁ బుత్రులు లేకపోవుటచే వీనిని దనగృహమునకుఁ గొనిపోయెను. అతని భార్య రాధయు వానిని గన్నబిడ్డవలెనే గారాబముతోఁ బెంచెను. సహజకుండల భూషిత కర్ణుఁడగుటచేఁ గర్ణుఁడని పేరు పెట్టిరి. కర్ణుఁడు వసువర్మధరుఁడు గావున వసుసేనుఁడను పేరు బెట్టిరి. భార.

కర్ణుఁడు సూతునింటఁ బెరుగుచుండినను రాజలక్షణములతో నొప్పువాఁడు. ద్రోణుఁడు హస్తినాపురమునకు వచ్చి రాకొమరులకు నస్త్రవిద్య నేర్పుచుండుటవిని తానును నటకుఁబోయి ద్రోణునకు శిష్యుఁడయ్యె. విలువిద్యయందుఁ దనకంటె నధికుఁడు కాని యర్జునుని ద్రోణాదు లెక్కువ సమ్మానించుటఁజూచి రోషము నొందియుఁ దానుతక్కువ కులమువాఁడగుటచే వారితో సమహితత్వము నొందలేకయు బాలుఁడు గావున లోలోపలనే గుందుచుండువాఁడు. అచిరకాలములోనే పాండవులపై దుర్యోధనునకు ద్వేష ముండుటెఱిఁగి యాతనితోఁ జెలిమి చేసెను.

భీష్మ ధృతరాష్ట్రాదులు కుమారుల యస్త్రవిద్య చూచి మెచ్చుకొనుచుండిరి గాని కర్ణు నెవ్వరు పల్కరింపరు; ఇతనికి రోషమువచ్చి భుజాస్ఫాలనము గావించుచు నర్జును నాక్షేపించుచుఁబలికె. మఱియును వీనిని దనతో ద్వంద్వయుద్ధమునకుఁ బిలచెను. పాండవమధ్యము నెదిరింపఁగలవాఁ డొకఁడుకలఁడని దుర్యోధనునకు మదమై తనను, దన రాజ్యమును నుపయోగించు కొమ్మని కర్ణునితో ననియె. ద్వంద్వయుద్ధమున నొకరి కొకరు తీసిపోకుండఁ బోరుచుండిరి; అయ్యవసరంబునఁ గృపుఁడు రణరంగమున నిలచి పార్థుఁడు కురుకులజుఁడు, రాజధర్మబంధుర చరితుఁడు; ఈతనితోఁ బోర నెంచితివేని నీ కులము తెల్పుమని కర్ణు నడిగెను. కర్ణుఁడు తాను సూతకులజుఁడే యనుకొనుచుండెను. గావునఁ బ్రత్యుత్తర మీయలేక తల వంచుకొనియె. ఆ సమయములోఁ దుర్యోధనుఁ డితనికిఁ దోడ్పడియెను; కర్ణున కంగరాజ్యమిచ్చి రాజును జేసెను. గాన నితఁడును వారితో సమానుఁడయ్యె.

కర్ణుఁడు తనకు బ్రహ్మాస్త్రంబుపదేశింపుమని ద్రోణునడిగెను. వ్రతసమన్వితుఁడగు బ్రాహ్మణునకును, తపఃపుణ్యానృపతికినిదప్ప నన్యులకు దెల్పరాదని ద్రోణుఁడు చెప్పిన నితఁడు పరశురామునియొద్దకుఁబోయి బ్రాహ్మణుఁడనని చెప్పి తదస్త్రప్రయోగము నేర్చుకొనెను.

ద్రౌపది స్వయంవరమున కితఁడును వెళ్ళెను. మత్స్యయంత్రము నేయ యత్నించి యోటువడెను. దుర్యోధనుఁడును నోడి యీర్ష్యచే ద్రుపదునితోఁ బోరెను. కర్ణుఁడును బ్రాహ్మణవేషముతో యంత్రమును గొట్టిన యర్జునునితో నతనిని గుర్తెఱుంగకయే పోరాడి యోడి బ్రాహ్మణతేజ మజేయమని మరలెను. పిమ్మట ద్రౌపదిని జేపట్టినవారు పాండవులని యెఱింగెను. వారిని రాజ్యభ్రష్టులను జేయుటకై దుర్యోధనునితోఁ గలసియాలోచించుచుండెను. కాని యతని యూహలకును, నితని యూహలకును భేదము కలదు; ఒక సుందరాంగిని బంపి, పాండవులలో నొకరి కొకరికి వైషమ్యము పుట్టించుటే యుపాయమని దుర్యోధనుఁడు చెప్పెను. ఏకపత్నియం దనురక్తులైన వారాయుపాయము వలన నన్యోన్యశత్రువులు కారనియు, నైన నట్టి కుతంత్రములవలనఁ గాక, పాండవులను బహిరంగముగ యుద్ధములోనే తమ బాహుబలము వలన గెలువవలయుననియుఁ గర్ణుఁడు క్షత్రియ పౌరుషముమీరఁ బలికెను. వీరికోర్కె తీర్పఁ దలఁచియు సాధనము నిర్ణయింపఁజాలక ధృతరాష్ట్రుఁడు భీష్మాదులను రావించి పాండవ సంహారమున కద్ది యుపాయమని యడిగెను. అట్టితలఁపే కూడదని యీ పెద్దలు బుద్ధిచెప్పి

పాండవుల కర్ధరాజ్య మిమ్మనిరి. ఇట్లు పలకగఁ గర్ణునకుఁ బట్టరాని కోపమువచ్చి భీష్మాదులను దూలనాడెను.

పాండవు లితని సంపర్కము లేకయే యుండెడివారు. వారు హస్తినాపురమున నున్నపుడుగాని, యింద్రప్రస్థమున నున్నపుడుగాని, రాజసూయమపుడుగాని యితని జోక్యములేకయే యుండిరి. అయినను గర్ణుఁడు దుర్యోధనునితో గలియుటచే వారిపై ద్వేషము హెచ్చుచునే యుండెను; వారిని యుద్ధములోఁ జంపఁగోరుచుండెను. మాయజూదముచే వంచించు నాలోచన మంతగ నితఁ డెఱిఁగినట్లులేదు. మఱియు నరణ్యవాసము చేయుచుండిన పాండుపుత్రులకు నగ్ని విష జలంబులచే నపకారము చేయ దుర్యోధనుఁ డెంచెనుగాని యాయుపాయముల నితఁడు హర్షించలేదు. కాని పాండవు లరణ్యములో మునివృత్తినుండి యిడుములు పడుచుండ వారిని జూచి హేళనచేసి తాము సుఖమొందుటకు ద్వైతవనమునకుఁ గర్ణదుర్యోధనాదులు వెళ్ళిరి. తానొకటి తలఁచిన దైవమొకటి తలంచెను. ఆ యరణ్యములోఁ గర్ణుఁడు గంధర్వులచే నెదిరింపఁబడి యోడింపఁబడియె. దుర్యోధనుఁడు బంధింపబడగఁ బాండవులే బంధవిముక్తునిజేసిరి. ఈయవమానము సహింపలేక దుర్యోధనుఁడు ప్రాయోపవేశము చేయఁబోగఁ గర్ణుఁడు వాని కెన్నియో యుక్తులు చెప్పి, ధైర్యముచెప్పి నగరమునకుఁ దీసికొనివచ్చెను.

ఇమ్మటఁ బాండవు లజ్ఞాతవాసము చేయునపుడు వారినిగుర్తెఱుఁగుటకై విరటునిగోవులను బట్టుట నుపాయముగ నెంచి దుర్యోధనుఁడు ముందుగ సుశర్మను బంపెను. పిదప భీష్మ ద్రోణ కర్ణాదులు సేనలతో వెళ్ళిరి. వారితో నర్జునుఁడు పోరెను ఆతని శౌర్యమును ద్రోణాదులు మెచ్చుకొనిరి. శత్రుని శౌర్యము కీర్తించుటచేఁ గర్ణునకుఁ గోపమును, రోషమునువచ్చి వారిని దూఱనాడెను. తానర్జునునితోఁ బోరియు నోడెను. దుర్యోధనుని పక్షమువారెల్లరు నోటుపడి మగిడివచ్చిరి.

పాండవులు సంధిచేసికొనుటకు రాయబారమంపిరి. సంధిసేయుటే యుక్తమని భీష్మాదులు చెప్పిరి. కాని కర్ణుఁడు నిండుసభలో వారిని దూషింప మొదలుపెట్టెను. సంధి కొడంబడకుమని దుర్యోధనుని ప్రోత్సాహము చేయుచుండెను. భీష్ముఁడు కర్ణుని నిష్ఠురములాడెను; ఆతని కుతంత్రములకు నిందించెను. కర్ణునకును కోపమువచ్చి భీష్మునకు యుద్ధములో సహాయము చేయననియు, నతఁడు తెగువఱకుఁ దానస్త్రము పూననియు శపథము చేసెను. ఆ కోపమునఁ దన శపథముచేఁ దన మిత్రునకే నష్టమని యాలోచింపలేదు. అప్పటినుండియుఁ గర్ణుఁడించుక తూష్ణింభావముతోడనేయుండెను.

హస్తినాపురమునకుఁ గృష్ణుఁడు రాయబారిగ వచ్చి దుర్యోధనాదులతో సభలోఁ బ్రసంగించినపిమ్మటఁ గర్ణుని తన రథమెక్కించుకొని యేకాంతముగఁ దీసికొనివెళ్ళి యతఁడు ధర్మరాజాదుల కగ్రజుఁడగుటదెల్పి పాండవులతోఁ జేరుమని కోరెను. ధర్మజునికంటె నతఁడు పెద్దవాఁడగుటచే నతనినే రాజ్యాభిషిక్తుని జేయుదురని చెప్పెను; ఆతని కగు గౌరవమును, మహోన్నత పదవియుఁ గనఁబరచెను, కాని కర్ణుని చిత్తము చలింపలేదు; మహారాజపదవి కాతఁడాశింపలేదు; తాఁబెఱిగిన సూతకులమును దక్కనగఁదలఁపలేదు. తన కన్యాయము చేసిరని కుంతినిగాని, పాండవులనుగాని దూషింపలేదు. పాండవులయెడ దుర్యోధనుఁడును, దానును జేసిన యకార్యములను మఱువలేదు. యుద్ధమునఁ బాండవులే జయింతురని యెఱుంగక పోలేదు. అయినను చిరకాలమునుండి దుర్యోధనునితోఁ జెలిమిచేసి వానివలన నంగరాజ్యము పొంది, వానిని యుద్ధమునకుఁ బ్రోత్సాహము చేసి యిపుడు పాండవులఁ జేరుట నతఁడు హర్షించలేదు. ఓడినను, గెల్చినను దుర్యోధనునితోడనే యుండవలయునుగాని స్వలాభమును జూచి యిపుడు వానిని విడువఁ జాలఁడు. మఱియు భూభారము తగ్గించుటకు యుద్ధమవసరమనియు, ధర్మజుఁడగు యుధిష్ఠిరుఁడే రాజ్యపాలనమునకుఁ దగినవాఁడనియు నుదారస్వభావముతోఁ బలికెను.

ఇమ్మటఁ గుంతియు నితఁడు భాగీరథీతీరమున నాచమించుచుండఁగ బోయి యితఁడు తన పుత్రుఁడగుట నెఱింగించి ధర్మరాజాదులతోఁ

గలసి యుండుమనెను. ఇంతకాలమును వారితో వైరము పూనియుండి యిపుడు చెలిమి చేసిన యెడల వారికి వెఱచినాఁ డను నపవాదము వచ్చుననియు నేమైనను నర్జునునితో యుద్ధము చేసి తీఱుదుననియును గుంతితో నితఁడు చెప్పెను. తక్కిన నల్వురుసోదరులకు హాని చేయకుండుట కితఁ డంగీకరించి వినయమున నామెకు మ్రొక్కి చనియె.

పదపడి కొన్ని దినములలోనే యుద్ధము ప్రారంభమయ్యెను. కాని భీష్ముని యాధిపత్య మున్నంతకాల మితఁ డందుఁ బాల్గొనలేదు. పది దినములు యుద్ధమైనపిమ్మట భీష్ముఁడు శర తల్ప గతుఁడైనట్లు విని కర్ణుఁ డాతని చెంతకుఁ బోయి తనయెడ నలుకఁదక్కి సాదరముగఁ జూడుమని వేడెను. భీష్ముఁడును గర్ణునిపైఁ గినుక లేదని యెఱింగించి యితఁడు సూతసుతుఁడు కాఁడని తెల్పి కృష్ణార్జునులకే జయమనియును, వారితో సంధియే యుప్పవనియును బోధించెను.

పిమ్మటఁ గురుసేనకు ద్రోణుఁ డధిపతి యయ్యె. వానికిఁ దోడై కర్ణుఁడు శక్తివంచనలేక పోరుచుండెను. పార్థునితో ద్వంద్వయుద్ధమునకుఁ గడంగుచుండెను. భీముఁడు మొగ్గరంబు సొచ్చినపుడు వాని నోడించి సంహరింపఁగలిగియును గుంతివచనములు తలఁచి వానిని జంపక యవమానము మాత్రము చేసి విడచెను. అట్లే ధర్మజుఁడును, సహదేవుఁడును వీని చేతిలోఁ జిక్కినను వారిని జంపక విడిచెను. ఇంద్రుఁ డిచ్చిన దివ్యశక్తి యర్జునునిపైఁ బ్రయోగింపుమనియును, కృష్ణునిపైఁ బ్రయోగింపుమనియును నితనికి రేయెల్ల దుర్యోధనాదులు చెప్పువారు. కర్ణుఁ డాలకించి వల్లెయని యుద్ధములో మాత్ర మది మఱచుచుండెను. ఘటోత్కచుఁడు తన రాక్షసబలముతో యుద్ధము సేయుచుండగఁ దుద కాతనిపైఁ గర్ణుఁ డా శక్తిని బ్రయోగించి వానిని సంహరించెను.

కర్ణునకు సహజముగ నుండిన కవచకుండలము లాతనికడనే యుండుచో నతఁ డెవ్వరికిని నజేయుఁడే యగును. దాని నింద్రుఁ డెఱింగియే తన సుతుఁడగు నర్జునునకుఁ గర్ణునిచేఁ బరాభవము కలుగకుండఁ జేయుటకై బ్రాహ్మణరూపమున వచ్చి కర్ణునిఁ గవచకుండలముల నిమ్మని యాచించెను. తత్పూర్వము వాని నెడఁ బాయకుమని సూర్యుఁడు తన పుత్త్రున కెఱింగించినను యాచించిన వానికి లేదనలేఁడు గావునఁ గర్ణుఁ డా బ్రాహ్మణునకుఁ దన సహజ దివ్య కవచకుండలముల నిచ్చివేసెను.

సూర్యుఁ డిదివఱకు అడుగుమని చెప్పి యుండుటచేఁ దనకు రక్షణమగు సహజ కవచమును తెచ్చియిచ్చెఁ గావున, నింద్రుని శక్తి నిమ్మని వేడెను. ఇతని దానపరత్వమునకు మెచ్చుకొని యింద్రుండు దివ్యశక్తి నిచ్చెను. అది యెవ్వనిపైఁ బ్రయోగింపఁబడునో వాఁడు హతుఁడై తీరును. కాని యాశక్తి యొక్కని మీఁదనే ప్రయోగింపుమని యింద్రుఁ డానతిచ్చెను. ఆ శక్తిని అర్జునునిపైఁ బ్రయోగింపఁ గర్ణుఁడు తలఁచెను. (కాని అర్జునునకు నారాయణుఁడు సంరక్షకుఁడై యున్నాడనియును, నితనిచే మరణింపడనియును జెప్పెను.) ప్రతి దినము నిశాసమయమున ఆశక్తిని అర్జునునిపై ప్రయోగింపుమని చెప్పుదురు. అర్జునుని సంహరించిన పాండవులలో మఱియొకనికిఁ గృష్ణుఁడు పట్టము గట్టును. కావునఁ గృష్ణునే ఈ శక్తితో సంహరింపుమని దుర్యోధనుఁడు చెప్పువాఁడు. కాని ఉదయమున యుద్ధభూమిని జేరఁగనే కర్ణుఁ డీ సంగతియే మఱచును. దైవయోగముననే ఆ మరపు కలుగుచుండెను. తుదకు దీనిని ఘటోత్కచునిపైఁ బ్రయోగించెను. ఈ యింద్రశక్తి యున్నంతకాలము కృష్ణుఁడు భయపడుచునే యుండెను. దానిని ఘటోత్కచునిపై వ్యయపరుపగనే కర్ణుని జయింపవచ్చునని యతనికి ధైర్యము కలిగెను.

భీష్మద్రోణులు హతులైన పిమ్మటఁ గర్ణుఁడే సర్వసేనాధిపతియయ్యెను. అర్జునునకువలెఁ దనకును నేర్పరియగు రథచోదకుఁ డవశ్యము గావున శల్యుని సారథిగ నుంచుమని దుర్యోధనుని గోరెను. దుర్యోధనుఁ డడుగ శల్యుఁ డద్దాని కంగీకరించెను. కాని కర్ణునకు సహాయము సేయుటకు మారుగ నతని కెదురాడువాఁడు; కర్ణుని యుపాయముల నాక్షేపించుచు శత్రువులను బొగడువాఁడు. ధర్మరాజుతోఁ దాను జేసిన ప్రతిన జ్ఞాపక ముంచుకొని కర్ణుని సర్వదా వ్యాకుల పెట్టెడివాఁడు. పాపము! కర్ణుఁ డీ ద్రోహ మెఱుఁగక శల్యుని సారథిగఁ గోరెను.

శల్యుని పరుషవాక్యములు విని నపుడాతనికుండిన శాపములుకూడ జ్ఞప్తికివచ్చి యాతని చిత్తము మఱింత కలఁత పెట్టుచుండెను.

కర్ణున కొక బ్రాహ్మణునివలనను, పరశురామునివలనను శాపములు కలిగెను. ఇతఁడస్త్ర విద్యా విశారదుఁ డగుటకుఁ బరశురాముని గొలుచుచుండెను. ఆతఁడు నీ వే కులమువాఁడవని? యడుగఁగ బ్రాహ్మణుఁడనని కర్ణుఁడు బొంకి పరశురామునివలన బ్రహ్మాస్త్ర, భార్గవాస్త్రముల ప్రయోగము నేర్చుకొనెను. ఒకనాఁడతని యంకమునఁ బరశురాముఁడు శయనించి యుండఁగఁ గీటక మొకటి కర్ణునిఁగఱచెను. దాన రక్తము వచ్చె; అయినను భార్గవునకు మెలఁకువ రాకుండుటకై యితఁడు కదలక మెదలక యుండెను. కాని పరశురాముఁడు లేచి రక్తము కారుచున్నను గాలు కదపని వీనిం జూచి బ్రాహ్మణుం డింత సహించి యుండలేఁడు. నీ వెవ్వఁడవో నిజముగ దెల్పుమనియె. అపుడు కర్ణుఁడు తాను సూత కులజుఁడగుట చెప్పెను. భార్గవునకుఁ గోపమువచ్చి వంచనచే విద్య నేర్చుకొంటివి గాన బ్రహ్మాస్త్రము వలయు కాలమునఁ దోపదనియు, మృత్యువాసన్నంబైనయెడఁ దోఁచు ననియు, నాపద ముట్టినయెడ భార్గవాస్త్రంబు దోపకుండు ననియు శపించె.

మఱియుఁ గర్ణుఁడు పరశురామునొద్దఁ బరిశ్రమంబు చేయుచుఁ దెలియక బాణమేయఁగ నది ధేనువత్సంబునకు తగిలి అది చచ్చెను. అంత నొక బ్రాహ్మణుఁడు నా యాగధేనువత్సంబును శరముతోఁ గొట్టితివి కావున నీ వుత్సాహంబుతో యుద్ధము సేయునపుడు రథచక్రము భూమిలోఁ గ్రుంకి నీ వెవ్వరిని జంపగోరెదవో వారివలననే మడసెదవుగాక యని శపించెను.

ఈ శాపభీతి బాధించుచున్నట్లే శల్యుఁడు గూడ దుర్నిమిత్తములు చూచితి ననుచు నమంగళవాక్కులే పల్కుచుండెను. ఇతఁని, నితని దేశమువారినిఁగూడఁ గర్ణుఁడు దూషించి బల ధైర్యములు తెచ్చుకొని యుద్ధముసేయుచుఁ బాంచాలకుమారులఁ బరిమార్చుచు ధర్మరాజు నోడించి యర్జునునితో ద్వంద్వయుద్ధము సేయుచుండెను. కర్ణార్జునులద్వంద్వయుద్ధమును దేవదానవులు చూడవచ్చిరి. ఒకరికొకరు తీసిపోకుండఁబోరుచుండిరి. ఒకరిబాణము నొకరు ప్రతిహతము చేయుచుండిరి అర్జునునకుఁ బురాణపురుషుఁ డగు కృష్ణుఁడే సారథి; కర్ణునకో, యతని నెగ్గాడు వంచకుఁడు శల్యుఁడు సారథియయ్యె. ఇతఁడేసిన సర్పముఖశరముచే నర్జునుని కిరీటము మాత్రము క్రిందఁబడియె. బ్రాహ్మణశాపముచేఁ గర్ణునిరథము క్రుంకెను; ఆతఁడు రథము డిగ్గి దాని నెత్తఁబోవుచు భూమిపై నున్నవానితో రథారూఢుఁడైనవాఁడు యుద్ధముసేయుట పాడిగాదని తెల్పి తాను రథమెక్కువఱకు నాగుమని కోరెను. కాని యర్జునుఁడాగక శాపహతుఁడైనవానిని దివ్యాస్త్రమేసి సంహరించెను.

సత్యసేనుడు, సుషేణుఁడు, చిత్రసేనుఁడు, సుశర్ముఁడు, వృషసేనుఁడు కర్ణుని కుమారులు.
భార.

కర్ణుఁడు పూర్వజన్మంబున సహస్ర కవచుఁ డనువాఁడు. వానికి సహస్రకవచము లుండెను. ఒక్కటి తక్క మిగిలినవానిని నరనారాయణులు భేదింపగల్గిరి. శేషించిన కవచముతో నితఁడు జన్మించెను. వీనిని జంపుటకై నరనారాయణులు కృష్ణార్జునులుగఁ బుట్టిరి.

కర్దముఁడు:-త్రేతాయుగమునాటి యొక మౌని; విష్ణుభక్తి కలవాఁడు. సరస్వతీ నదీతీరమునుండి విష్ణువును స్తుతింపఁగ నతఁడు ప్రత్యక్షమయ్యెను. సంతానము వడయుటకై సద్భార్యను గర్దముఁడు కోరగ, స్వాయంభువు తనకూఁతురగు దేవహూతిని తీసికొనివచ్చి కర్దమున కిచ్చుననియు, నామెను బరిగ్రహింపవలసినదనియుఁ దానేయొక యంశతో నామె గర్భమునఁ బుట్టుదుననియును విష్ణువు చెప్పెను. కర్దముఁ డచ్చోటనే యుండి వెనుకటియట్లె విష్ణునామ సంకీర్తనము చేసికొనుచుండెను. విష్ణుమూర్తి చెప్పినట్లు స్వాయంభువు దేవహూతిని దీసికొనివచ్చి భార్యగ గ్రహింపుమని యితనిని గోరెను. కర్దముఁ డామెను బరిగ్రహించె. దేవహూతి భర్తకుఁ బరిచర్యలు సల్పుచుండి, సంతాన మపేక్షించి భర్తను వేడెను. కర్దముఁడు తనశక్తిచే విమానమును సృజించి దేవహూతి నందెక్కించి నానా దేశములు చూపించి తీసికొనివచ్చెను. ఈ దంపతులు సరస్వతీ నది

యందు స్నానము చేసెను. దేవహూతికిఁ దొమ్మండ్రు పుత్రికలు కళ, అనసూయ, శ్రద్ధ, హవిర్భువు, గతి, క్రియ, ఖ్యాతి, అరుంధతి, శాంతి అనువారలు పుట్టినపిమ్మటఁ గర్దముఁడు సన్యసించెదననియె. కుమార్తెలకుఁ బెండ్లిండ్లు చేసి నాకొక పుత్రు ననుగ్రహించిన పిమ్మట సన్యసించుమని దేవహూతి ప్రార్థించెను. కర్దమునకు దేవహూతి గర్భమునఁ గపిలుఁడు జన్మించెను. కర్దముఁడు ప్రజాపతులలో నొకఁడు. భాగ.

కర్దముఁడు:- విష్ణుమానస పుత్త్రుఁడగు విరజుని కుమారుఁడు. ఇతఁడు రాజ్య మొల్లక చనియెను. వాని పుత్త్రుఁడు అనంగుఁడు. భార.

కర్దముఁడు:-(చూడు కరంధముఁడు)

కలశపోతకుఁడు:-కద్రువకుమారుఁడు. భార.

కలి:- కృశుని కుమారుఁడు. ఇతని తల్లి హింస. ఇతని తల్లియుఁ దండ్రియుఁ దోఁబుట్టువులే. లోకమందంత చెడుగు నీతని మూలముననే వచ్చుచుండెను. అన్నిపాపములకు దుష్కార్యముల కితఁడే కారణము. వీనిబాధ ,సహింపఁ జాలక భూదేవి విష్ణుమూర్తితో మొఱపెట్టుకొనెను. అతఁడు కల్కిగా నవతరించి వీనిని సంహరించెను.

శ్రీకృష్ణుఁడు నిర్యాణము చెందుటచే భూదేవి విచారించుచుండఁగ ధర్మదేవుఁడుగూడ విచారము నొందుచు నొంటికాలిని నడచుచుండెను. అపుడు కలి ధర్మదేవుని దన్నెను. అది పరీక్షిత్తుచూచి కలిని దండింతునని పల్కనఁ గలి భయపడి పరీక్షిత్తునకు మ్రొక్కెను. పరీక్షిత్తు గలిని దన రాజ్యమునుండి వెడలఁగొట్టి ధర్ముని నాల్గుపాదముల నడిపించెను.

కలి:- నలుఁడు ఋతుపర్ణు నొద్దనుండి అక్షవిద్యాహృదయ మను విద్య నేర్చినపిదప, ఆతని యందు దాగియున్న కలి కర్కోటకవిషమును గ్రక్కుచు బైటకువచ్చి భయపడుచుఁ దనను దెల్పుకొనెను. నలుఁడు వీనిని శపింపబోయె. కర్కోటకవిషముచే బాధపడుచుంటిని; నన్ను శపింపకుము. నిన్ను కీర్తించిన జనులకు నావలని భయము కలుగదు. అని చెప్పి ప్రక్కనున్న తాండ్రచెట్టును జేరెను. అప్పటినుండి తాండ్ర చెట్టు అపవిత్రంబయ్యె. భార.

దమయంతి స్వయంవరము జరుగుచున్నదని విని యారాకొమరిత తనను వరించునను నాశతో గలి వచ్చుచుండెను. స్వయంవరమునుండి మరలి వెళ్ళుచున్న యింద్రాదిదేవత లీతనికిఁ గనఁబడి యెచ్చటకు బోవుచుంటివని ? యడిగిరి; అతఁడు స్వయంవరమునకని చెప్పెను. నలుఁడను రాజు నామె యీవఱకే వరించెనని దేవతల వలన విని కలికిఁ బట్టరానికోపము వచ్చెను. ఆ దంపతుల కపకారముచేయ నిశ్చయించుకొనియె. వారికి రాజ్యనష్టమును, తుదకు ఎడబాపునుగూడ కలుగఁజేయుటకై సమయము వేచియుండెను. నలుఁడొకసమయమున నేమఱి యశుచిగ నుండగఁ గలి వానియందుఁ బ్రవేశించెను; అది మొదలాతని కపకృత్యములే సేయుచుండెను. కలి బ్రాహ్మణవేషమునఁ బుష్కరుని కడకుఁ బోయి నలునితో జూదమాడి రాజ్యమును బుచ్చుకొమ్మని చెప్పెను. కలి పుష్కరుని పక్షమందుండి నలుఁ డోడునట్లు చేసెను. నలుని రాజ్యము పోఁగొట్టి నలదమయంతుల కెడబాటు కూడఁ గలుగఁజేసెను.

కల్పుఁడు:- భ్రమియందు ధ్రువునకుఁ బుట్టిన కుమారుఁడు. భాగ.

కల్మాషపాదుఁడు:- (చూడు మిత్రసహుఁడు, సుదాసుఁడు)

కల్మాషుఁడు:- కద్రువ కుమారుఁడు.

కల్యాణమిత్త్రుఁడు:- సుతపుని కుమారుఁడు (చూడుము సుతపుఁడు) బ్ర. వై.

కల్యాణి:- ధరుఁడను వసువుభార్య. మత్స్య.

కల్కి:- శంబళపురమున విష్ణుయశుఁడు. సుమతి యను దంపతులకుఁ బుట్టిన కుమారుఁడు పరశురామునియొద్ద విద్యలు నేర్చుకొనెను. ఈతఁడు చిన్ననాటనుండియు మిక్కిలి భక్తిపరుఁడుగా నుండెను. ఇతని భక్తికి మెచ్చుకొని శివుఁడు కరవాలము, గుఱ్ఱము. చిలుకయు నిచ్చెను. కల్కియొద్ద విశాఖయూపుఁడు ధర్మములు నేర్చుకొనెను. కల్కికిఁ జిలుక సింహళద్వీపమున కరిగి యచ్చటఁ బద్మావతి స్వయంవరమున భంగపాటునొంది విలపించుటఁ దెలిసికొని యామెకంటెఁ దగినభార్య యుండ బోదని కల్కితోఁ జెప్పి యామెపై నతనికి

వలపు పుట్టించెను. ఇతఁడు చిలుకతో సింహళ ద్వీపమునకు వెళ్ళెను. అచ్చట నుద్యాన వనమునలో స్నానమునకు వచ్చిన పద్మావతి యితనిని జూచి పలికరించి తత్పూర్వమే యితనినిగుఱించి చిలుక చెప్పెను గాన నతనినే వివాహమునఁగోరి తండ్రితో జెప్పెను. కల్కి పద్మావతిని వివాహమయ్యెను. అంతకుఁ బూర్వము పద్మావతి స్వయంవరమునకు వచ్చి పడతులైనవారలు కల్కికి నమస్కరించి తమ పూర్వరూపముల నిమ్మని వేఁడిరి. వారిని రేవా నదిలో స్నానముచేసి రమ్మని కల్కి చెప్పెను. వారు స్నానముచేసి పురుషులై కల్కి యొద్ద సెలవుపుచ్చుకొని వెళ్ళిరి. కల్కి కలిని సంహరించుటకు నవతరించిన విష్ణుమూర్తి. కలిలోకమును మిక్కిలిఁ గలుషయుతముగఁ జేయుటచే శివుఁ డిచ్చిన గుఱ్ఱమునెక్కి కరవాలము బూని కలితో యుద్ధముచేసి, వానిని వాని సేనలను దెగటార్చెను.

విష్ణువే కలియుగాంతమందు కల్కావతారుఁడై విష్ణుయశుఁడను పేరునఁ బుట్టును. ఆతడు సకల ధర్మములను నిలుపును. అధర్మములను మ్లేచ్ఛులను సంహరించును. కల్కి.

కళ:- కర్దమప్రజాపతి కుమారిత; మరీచి భార్య. కశ్యపుఁడను కుమారుఁడు, పూర్ణిమ అను కూఁతురు పుట్టిరి. భాగ.

కళావతి:- తుంబురుని వీణె.

కళావతి:- మలయకేతుని భార్య. ఈమెకుఁబూర్వ జ్ఞానము కలదు. పూర్వజన్మంబున దీమె సుశీల యను పడఁతి. (చూడుము సుశీల.)

కళావతి:- కన్యాకుబ్జదేశమందున్న ద్రమిళుఁడను గోపకుని భార్య. ఈమెకు సంతానము లేక పోవుటచే భర్త యనుజ్ఞను దీసికొని యరణ్యములో సంచరించుచుఁ గశ్యపునిఁ జూచి పుత్త్రు ననుగ్రహింపుమని కోరెను. కశ్యపుఁ డిష్టపడ లేదు. కాని యా మార్గమునఁ బోవు మేనక రూపము చూడఁగ నతనికి రేతఃపతన మయ్యెను. దాని నీమె గ్రహించెను. ఆ వృత్తాంతము భర్తకుఁ జెప్పెను. అతఁడు సంతోషించి యామె గర్భమున భక్తుఁడు పుట్టునని చెప్పి యామెను బ్రాహ్మణునియింటికడ నుండుమని పంపెను. ఆవీర్యమువలన నీమెకుఁ గుమారుఁడు జన్మించెను. ఈ కుమారుఁడే బ్రహ్మచే శపింపఁబడిన సుపర్ణుఁడు.

కళావతి:- ఆమె బ్రాహ్మణునింటదాసియై చెప్పిన పనులు చేయుచుండెను. ఒకనాఁటిరాత్రియామె సర్పదష్టయై మరణించి విష్ణులోకమునకుఁ బోయెను. బ్ర. వై.

కళావతి:- పారుఁడను మునికి బుంజకస్థలయందుఁ బుట్టిన కుమారిత. ఈమె మనోరమకుఁ జెలికత్తె. దేవాపి యను గంధర్వుఁడు కళావతిని దన కిమ్మని కోరెను. ఆమె తండ్రి యివ్వననుటచే వానిని గంధర్వుఁడు సంహరించెను. అంతఁ గళావతియు నాత్మహత్య చేసికొనఁ బోయెను. అపుడు పార్వతి ప్రత్యక్షమై యాత్మహత్య చేసికొనవద్దనియు స్వరోచి యామెకు భర్త యగుననియుఁ దెల్పెను. ఈమెను స్వరోచి పెండ్లియాడె. మను.

కళావతి:- కాశిరాజు కూఁతురు. ఈమెకు దుర్వాసుఁడు పంచాక్షరీ మంత్రమును నేర్పెను. ఈమెను దాశార్హుఁడను రాజు వివాహమయ్యెను. ఇతఁడు శయ్యాగారము ప్రవేశింపఁగ నీమె యీతనిం జేరక యుండెను. పతి యీమె శరీరమును దాకఁ గాగిన యినుమంత వేడిగ నుండెను. ఇదేమని పతియడుగ నేను మంత్రోపదేశము పొందితిని. నీవు సదాచారుఁడవు. నిన్ను జేరఁ దగదని చెప్పెను. దాశార్హుఁ డీమెను దన కుపదేశము చేయుమని యడిగెను. భార్య భర్త కుపదేశము చేయరాదు. గర్గుఁడను ముని కలఁడు; వానివలన నుపదేశము పొందుమని చెప్పి భర్తను పంపెను. దాశార్హుఁ డుపదేశము నొంది వచ్చినపిమ్మట నీమెభర్తను జేరెను. బ్రహ్మో. స్కా.

కళావతి:-దక్షుని మనుమరాలు; స్వధ కుమారిత (బ్రహ్మమానసిక పుత్త్రిక). మేనక, ధన్య ఈమె తోఁబుట్టువులు. వీరు విష్ణుమూర్తిని దర్శించుటకు వెళ్ళిరి. అచ్చటికే సనత్కుమారులుకూడ వచ్చిరి. వీరిని జూచియుఁ గళావతి లేవలేదు. ఈ పడఁతులు తమ్ముల నగౌరవపఱచిరని మునులకుఁ గోపమువచ్చి నరస్త్రీలై జన్మింపుఁడని శపించిరి. ఈమె వారిపాదముల పైఁ బడి వేడెను. నీవు వృషభానుని భార్య వగుదువు. నీకు రాధ కుమారితగఁ బుట్టును.

ఆమె వలన స్వర్గలోకమును బొందఁగలవని వారు చెప్పిరి. ఈమెను సుచంద్రుఁ డనువాఁడు వివాహమయి చాలకాలమీమెతోఁ గ్రీడించెను. అతఁడు సంసారముపై విసుగుజెంది యీమెను విడచి యగస్త్యుని యాశ్రమమునకుఁ బోయి తపస్సుచేసెను. కళావతి భర్తచే విడువఁబడిన దగుటచే నేడువ నారంభించెను. ఈమె కడకు బ్రహ్మ వచ్చి నీ వేడువకుము. నీకు వరము నిచ్చెదను. నీ భర్తను, ముక్తినిదప్ప మఱియొక వరమును వేడుకొను మనియె. పతిలేని జీవనము గతి కేల? యని బ్రహ్మను బ్రార్థింపఁగఁ గొంత కాలము మనుజలోకమున భర్తతో నుండుము. పిమ్మట నీకుఁగృష్ణుఁడు ముక్తినిచ్చునని చెప్పెను. ఈమె కన్యాకుబ్జమందు ధనందనుఁ డను రాజు కూఁతురుఁగ బుట్టెను. ఈమె పుట్టినపు డాకాశ వాణియే యీమెకుఁ గళావతి యను పేరు పెట్టెను. ఈమెను హరివంశమందుఁ బుట్టిన వృషభానున కిచ్చి వివాహము చేసిరి. వీరికి రాధ జన్మించెను. శివ. బ్ర. వై.

కవి:- భృగుని పుత్త్రుఁడు. శుక్రునితండ్రి. భార.

కవి:- వైవస్వతమనువు కుమారుఁడు. ఇతఁడు రాజ్యము విడిచి తపస్సునకుఁ బోయెను. భాగ.

కవేరుఁడు:- ఒక రాజర్షి. హిమాలయ పర్వతము పైనఁదపస్సుచేయఁగ శివుఁడు ప్రత్యక్షమయ్యెను. ఇతఁడు తనకు ముక్తి నిమ్మని శివునిఁ గోరెను. ముక్తి నివ్వఁగలవాఁడను నేను కాను. బ్రహ్మ యివ్వవలయును అని శివుఁడు చెప్పెను. కవేరుఁడింకను దపస్సుచేయుచుండెను. బ్రహ్మ వచ్చి నాకుమారిత విష్ణుమాయ కలదు. ఆమెయే నీకుఁ గుమారితగ జన్మించి నీకు ముక్తి నొసఁగ గలదు అని చెప్పి వెడలెను. కవేరుఁడు తపస్సు చాలించి వచ్చెను. ఇతనికిఁ బుత్త్రిక జన్మించి, నేను తపస్సుచేసి నదినై నీకు ముక్తి నొసఁగుదు నని చెప్పి తండ్రి యనుజ్ఞ తీసికొని వెడలెను. ఈమెయొక్క యొక యంశము లోపాముద్ర గను, నొక యంశము కావేరీనదిగను నయ్యెను. కావేరీనదియందు స్నానము చేసి కవేరుఁడు ముక్తినొందెను. కు. కా. అగ్ని.

కశ్యపప్రజాపతి:- మరీచిని పుత్త్రుఁడు. (సూర్యని మానసపుత్త్రుఁడు) ఇతఁడు పుత్త్రార్థియై కళమును (మద్యమును) పానము చేసెను. దానిని త్రాగి నందువలన దక్షుఁ డీతనిని శపించెను. ఇతనిని శపించుటచేఁ బరమేష్ఠికిఁ గోపమువచ్చి దక్షునిఁ దనపుత్త్రికలను గశ్యపునకిమ్మని నియోగించెను. ఇతఁడు దక్షపుత్త్రికలగు అదితి, దితి, దనువు, కాల, అనాయువు, సింహిక, క్రోధ, పృథ విశ్వ, వినత, కపిల, కద్రువ అను వివాహమయి సృష్టిని బెంపొందించెను. దేవతలు, దానవులు, నరులు, మృగములు, వృక్షములు కూడ వీరని సంతానమే. భార.

ఇతనితో రమింపఁగోరి యదితి వచ్చెను. అప్పటి కితఁడు కద్రువను గూడి యుండెను. అదితికి దుఃఖమువచ్చి మీరు నరులై జన్మింపుఁడని శపించెను. ఆ శాపవశమున నితఁడు వసుదేవుఁ డుగ జన్మించె. అదితి దేవకి యయ్యెను. బ్ర.వై.

కశ్యపుఁడు:- వరుణుని యాగధేనువులను అదితి కోరెను. ఆమెకై కశ్యపుఁడు వాని నపహరించె. వరుణుఁ డడిగినను మరల నీయలేదు. భూలోక మునఁబుట్టుమని వరుణుఁడు శపించి బ్రహ్మతోఁ జెప్పెను. వరధనాపహరణము చేసినందుకు బ్రహ్మయును వల్లె శపించెను. కశ్యపుఁడు బ్రహ్మకాళ్ళపైఁ బడఁగ, నీవు విచారింపకుము. విష్ణువు నీ కుమారుఁడుగఁ బుట్టఁ గలఁడని చెప్పెను. దే. భా.

విష్ణు వవతరించినపు డీతని కుమారుఁడుగనే పుట్టుచుండును. వామనుఁడితని పుత్త్రుఁడే. రామావతారమునఁ గశ్యపుఁడే దశరథుఁ డయ్యె.

కశ్యపుఁడు:- ఒక బ్రాహ్మణుఁడు. విషవైద్యము తెలిసినవాఁడు. తక్షకుఁడు బ్రాహ్మణవేషము ధరించి పరీక్షిత్తునిఁ గఱచుటకై పోవునపు డామార్గముననే యీతఁడును బోవుచుండెను. అయ్యా! నీ వెవ్వరవు? ఎచ్చటికిఁబోవుచుంటివి? అని యా కపటబ్రాహ్మణుఁ డీతనిఁ బ్రశ్నించెను. నేను కశ్యపుఁడను వాఁడను. ఈ దినము పరీక్షిత్తుని తక్షకుఁడు తన విషముచేఁ జంపునని విని వానిని నా శక్తిచేఁ బ్రతికించి ధనము పొందఁగోరి పరీక్షిత్తునిహర్మ్యమునకుఁ బోవు

చుంటి వని యితఁడు ప్రత్యుత్తరమిచ్చె. నేనే తక్షకుఁడను. నీ శక్తి యనఁగ నెంతటిది? ఏల వృథాశ్రమ పడియెదవు? మఱలిపొమ్ము అని తక్షకుఁడు పలికెను. వారిలో వారికి వాదము జరిగెను. నేనీ వృక్షమును కఱచి భస్మము చేసెదను. నీవు బ్రతికింపుము అని తక్షకుఁడు దాపున నున్న వృక్షమును కఱచెను. తోడనే యా వృక్షమును, దానిపై నున్న బ్రాహ్మణుఁడును భస్మమయిరి. కశ్యపుఁడు తన ప్రజ్ఞచే నా వృక్షమును, బ్రాహ్మణునిఁగూడఁ బునర్జీవితులను గావించెను. తన కార్యమునకుఁ గశ్యపుఁడు ప్రతీకారము చేయునని తక్షకుఁడు భయపడి నేనే నీకు ధనము నిచ్చెదను. నీకుఁ గావలసినది కోరుకొనుము అని బ్రతిమాలఁగఁ దక్షకునివలన విశేషధనమును గైకొని కశ్యపుఁడు వెనుకకు మఱలిపోయెను. భార.

కా

కాంచనమాల:- శూరసేనుని పుత్త్రిక; మలయధ్వజుని భార్య. ఈమెకు లేక లేక యొక కుమారిత కలిగెను. ఆమెకు మూఁడు కుచము లుండె. శివుఁడు కాంచనమాలకుఁ బ్రత్యక్షమై కూఁతునకుఁ దటాతక యని పేరు పెట్టుమనియె. కాంచనమాల పూర్వజన్మమున విద్యావతి యను కాంత; విశ్వావసుఁ డను గంధర్వరాజు కుమారిత. స్కాంద.

కాంచి:- ముక్తిదాయకము లగు క్షేత్రములలో నొకటి. ఇది తొల్లి సత్యవ్రతక్షేత్రం బనఁ బడునది. ఇచ్చటనే బ్రహ్మ విష్ణువునుగూర్చి యశ్వమేధయాగము చేసెను. ఆ యాగము చూడవచ్చువారి సదుపాయమునకై బ్రహ్మ విశ్వకర్మను రావించియట నొకపట్టణమునిర్మింపుమనియె. అతఁడు నిర్మించిన పట్టణమే కాంచి.

కాంతిమతి:- ఉగ్రపాండ్యుని భార్య. వీరపాండ్యుని తల్లి. స్కాంద.

కాంతిమతి:- సుప్రతీకుఁ డను రాజు భార్య. సుద్యుమ్నుఁ డనువాని తల్లి. వరా.

కాంపిల్యము:- ఒక నగరము. ద్రుపదుని రాజధాని.

కాంభోజకటకుఁడు:- ఒక రాజు. దిగ్విజయార్థ మరిగిన యర్జునుని బూజించెను. భార.

కాకకర్ణుఁడు:- శిశునాగుఁడను రాజుకుమారుఁడు. ఇతని తర్వాత నితనికుమారుఁడైన క్షేమవర్ముఁడు రాజ్యమేలెను. భార.

కాకాసురుఁడు:- ఒక రాక్షసుఁడు. మందాకినీ తీరమున సీత నిద్రించుచుండఁగఁ గాకాసురుఁడు గాకియై వచ్చి సీత పయ్యెద తొలఁగించి స్తనములను గోళ్ళతో గీరెను. రాముఁడది చూచి యాకాకిని బాణముతోఁ గొట్టెను. అసురుఁ డాబాధకుఁదాళఁజాలక రాముని పాదములపైఁ బడి రక్షింపుమని మ్రొక్కెను. తనబాణ మమోఘము గావున నొక్క యంగమైన నిచ్చినఁగాని దానిబల మాగదని రాముఁడు చెప్పెను. కాకాసురుఁడు తన నేత్రమిచ్చెను. రామా.

కాక్షీవదాదులు:- సుధేష్ణయొక్క దాది కూఁతువందు దీర్ఘతమునకుఁ బుట్టిన సంతానము.
(చూడుము సుధేష్ణ)

కాటకము:- సప్తఋషులు.

ఒకప్పుడు మహాకాటకము సంభవించెను. ప్రాణులు రక్షించుకొనుట దుర్ఘటమగుచుండెను. సప్తఋషులు, అరుంధతి, వారి పరిచారిక చండ(కండ) ఆమెపతి పశుసఖుఁడు ఆహారార్థమై వనమునఁ దిరుగుచు నీలుఁడను వానిశవము చితిపై నుండగ దానిని భక్షింపఁగోరి దానిచుట్టును జేరిరి. వృషాదర్భియను రాజామార్గమునవచ్చుచు వారిని జూచి నమస్కరించి మీకు భోజనమును, సంపదలనొసంగెదను; రండని కోరెను. మేమేదియుఁ బ్రతిగ్రహము చేయమని వీరు పల్కిరి. ఆ రాజు గృహమునకుఁ బోయి కృత్రిమఫలములలో హిరణ్యము పెట్టి మంత్రులచేత వీరికిఁ బంపెను. దానిని వీరు గైకొనలేదు. రాజునకుఁ గోపము వచ్చి హోమముగావింపఁజేసికృత్తిని సృజించిపంపెను.

వీరలు ఆహారమునకై తామరతూడులను దీసికొనుట కొక చెర్వులోనికిఁ బోయిరి వారితో శునస్సఖుఁ డనువాఁడును జరిగెను. వీరలు తామరతూడులకై చెర్వులోనికిఁ బోవుచుండఁ గృత్తి ఈ చెఱువు నాది, మీరలెవ్వరో చెప్పు డనియె. తమ్ము హింసించుటకు వచ్చినదని యెఱిఁగి మునులు చెప్పిరి శునస్సఖుఁడును చెప్పెను. అయిన నీ పేరేల చెప్పవని కృత్తి పలుకఁగ, చెప్పినఁ గాదందువు. ఇదియును జిత్రమాయని యితఁడు తనదండముతోఁ గొట్టి కృత్తిని జంపెను. మునులు తామరతూడులను దెచ్చి కట్టకట్టి గట్టున బెట్టిరి. తమకమునదిగి తమ జపము గావించి యివి తినుటకు గట్టునకు రాఁగా నవి కనబడవయ్యెను. ఇవి నేను దాచిన నాకింక పాపము వచ్చును. ఇంక పాపము వచ్చునని ఒట్టుబెట్టుకొనిరి. శునస్సఖుఁడు; తామర తీగలకట్ట తీసినవాఁడు, తన కూఁతును అధ్వరధురీణునికిచ్చి వివాహము చేసినట్టివాఁడని పలికెను. నీవే తీసితివి వానినిమ్మని వారు పలికిరి. ఆతఁడు ఇంద్రుఁడగుటయును, కృత్తి వారిని బాధింపవచ్చి తిరిగి తాను కాపాడ వచ్చి దానిని జంపుటయును జెప్పి వారి అప్రతిగ్రహమును మెచ్చుకొని, తన లోకమునకుఁ దీసికొనిపోయెను. భార.

కాణాచి:- ఒక యక్షుఁడు; కుబేరుని బంటు. ఇతఁడు స్థూలశిరుఁడను రాక్షసునితోఁ జెలిమిచేయుటచే వింధ్యాటవిలోఁ దిరుగుచుండు మని కుబేరుఁడు శపించెను. ఇతనిసోదరుఁడు శాపవిమోచనము ప్రసాదింపుమని వేఁడఁగ నితఁడు పుష్పదంతుని వలన వినిన కథను మాల్యవంతునకుఁ జెప్పిన పిమ్మట శాపవిమోచనమగునని కుబేరుఁడనియె. ఆప్రకారమే యితఁడు శాపవిముక్తిఁ బొందెను. క. పా

కాత్యాయని:- యాజ్ఞ్యవల్క్యుని భార్య.

కాత్యాయనుఁడు: (చూడు వరరుచి)

కాత్యాయనుఁడు:- గోభిలుని పుత్త్రుఁడు.

కాత్యాయనుఁడు:- విశ్వామిత్త్రునివంశమువాఁడు.

కాదంబరి:- చిత్రరథుఁడను గంధర్వరాజు కుమారిత. ఈమె సఖియగు మహాశ్వేత వివాహము చేసికొనని వ్రతము పూనియుండుటచే నీమెయు సంప్రాప్తయౌవనయై యుండియు వివాహము కానొల్లక యుండెను. తల్లిదండ్రు లెంత చెప్పినను నీ విషయమున వారి కెదురాడు చుండునది. తారాపీడుని కుమారుఁడైన చంద్రాపీడుఁడు మార్గమునఁ బోవుచు మహాశ్వేతను జూచి యామెవలన నాతిథ్యమును గైకొనెను. ఆతనిని మహాశ్వేత కాదంబరికడకుఁ గొనివచ్చెను. ఈ రాకొమరుని జూచినప్పటినుండియు కాదంబరి చిత్తము చంచలమయ్యె. వీనిపై మోహము పొడమెను. వీనికిఁ దన మనోభావ మెఱింగించెను. ఆతఁ డీమెను విడచి నిజనగరమున కేగి మరల రాకపోవుటచేఁ గాదంబరి మహాశ్వేత కొఱ కేగెను. మార్గమందుఁ జంద్రాపీడుఁడు మృతుఁడై యుండుటఁ జూచి యీమెయు నాత్మహత్య చేసికొనఁబోయెను. అపుడాకాశవాణి యతఁడు జీవించు ననియుఁ నాత్మహత్య చేసికొనవ ద్దనియును జెప్పెను. తుదకీమె చంద్రాపీడునే వివాహమయ్యెను. కాదం.

కాపవ్యుఁడు:- ఒక బోయవాఁడు; అస్త్రవిద్య యందు నేర్పరి. ఇతని సమీపమున నివసించు చుండిన దస్యులు నీవు మాకుఁ బ్రభువవై మమ్ముఁ బాలింపుమని వేఁడిరి. ఇతఁ డుపదేశించిన ధర్మములప్రకారమే వారు వర్తించిరి. భార.

కాపిలేయుఁడు:- (చూడుము పంచశిరుఁడు)

కామందకుఁడు:- ఒక ముని. అంగరిష్ఠుఁడను రాజునకు ధర్మార్థ కామములను గుఱించి బోధించెను. భార.

కామక:- పృథుశ్రవసుని పుత్త్రిక. అయుతానీకుని భార్య. అక్రోధనుని తల్లి. భార.

కాముఁడు:- ధర్ముఁ డను మనువు పుత్త్రుఁడు. శముఁడు, హర్షుఁడు ఇతని సోదరులు. ఇతని భార్య రతి. భార.

కామ్యకవనము:- ఒక యరణ్యము. వనవాసము చేయు పాండవులు కొంతకాల మీ యడవిలో వసించిరి. భార.

కారంధమ:- నారీతీర్థములలో నొకటి (చూడుము నారీతీర్థములు)

కార్తవీర్యార్జునుఁడు:- ఒక హైహయవంశపు రాజు. కృతవీర్యుని పుత్త్రుఁడు. భాగ.

ఇతని రాజధాని వింధ్యపర్వతముల సమీపమున నున్న మాహిష్మతీపురము. గర్గుఁ డితని పురోహితుఁడు. గర్గుని బోధవలన నితఁడు దత్తాత్రేయుని గొలిచియుండువాఁడు. దత్తాత్రేయుని యపానవాయుజనితానలము వలన నితని బాహువులు మాడిపోయెను; అయినను నితఁడు మానక యతనినే సేవించు చుండెను. "నేను భార్యాసక్తుఁడను. నన్నేల గొలిచెద" వని దత్తాత్రేయుఁడితని నడిగెను. నీవు విష్ణుమూర్తి వగుట నెఱుఁగుదునని కార్తవీర్యుఁడు ప్రత్యుత్తరమిచ్చి వానిని స్తుతించెను. దత్తుఁడు సంప్రీతుఁడై వరము వేడుకొనుమనియెను. కార్తవీర్యుఁడు తనకు వేయిబాహువులు కలుగునట్లును, యుద్ధమందు గెలుపే కలుగునట్లును, రాజ్యము కలుగునట్లును వరములు గోరెను.

ఒకసారి యగ్ని తన కాహారము కావలెనని కార్తవీర్యునికడకు వచ్చి యడిగెను. గీనగరారణ్య మంతయును భక్షింపుమని యితఁడనుమతి నిచ్చెను. ఆ యరణ్యమందు మైత్త్రావరుణుని (వరుణుని సుతుని) యాశ్రమముకూడఁ గలదు. దాని నగ్ని కాల్చివేసెను. మైత్త్రావరుణుని (వరుణుని సుతుని) సుతునకుఁ గార్తవీర్యునిపైఁ గోపమువచ్చి యతనిబాహువులుఁపరశురాముఁడు ఖండించునుగాక యని శపించెను.

ఆ శాపము వలన భయపడి, విచారించి అప్పటి నుండియు ధర్మకార్యములే చేయుచుండెను. కాని ఆతని పుత్త్రులు అవినీతులు. సుబలాటోపాత్ములు. వారు చెడ్డపనులు చేయుచుండిరి. భార.

కార్తవీర్యుఁడు మిక్కిలి బలాఢ్యుఁడని రావణుఁడు విని యతనితో యుద్ధముచేయఁగోరి వచ్చెను. అప్పటి కితఁడు నర్మదాతీరమందు స్త్రీలతోఁ గేళీవిలాసములతోనుండెను. స్త్రీలలోఁ నుఁడగువాఁడు నాతో యుద్ధము చేయుగలఁడా? యని రావణుఁడు నవ్వెను. ఈవార్తవిని కార్తవీర్యుఁడు వచ్చి రావణునితో యుద్ధముచేసి వానిని బంధించెను. అపుడు పులస్త్యుఁడు వచ్చి కార్తవీర్యుని బ్రతిమాలి రావణుని విడిపించెను.

ఈ రాజుపుత్త్రులు జమదగ్ని యాశ్రమమునకుఁబోయి అతఁడును, నతని కుమారులును లేని సమయమున వారికామధేనువును, దూడను నెత్తుకొనివచ్చిరి. పరశురాముఁడు కోపముతో వారి నగరమునకువచ్చి కార్తవీర్యునిఁజంపెను. భార.

కార్తవీర్యార్జునుఁడు వేఁటకుఁబోయి జమదగ్ని యాశ్రమమునకుఁ జూడవెళ్లెను. ఇతనిని ముని గౌరవించి యాతిథ్యమిచ్చి తన ధేనువు వలన సమస్తపదార్థములను గల్పించి రాజునకును, వాని పరివారమునకును విందుచేసెను. ఇతఁడా ధేనువును తనకిమ్మని కోరెను. జమదగ్ని యివ్వననియె. రాజు తన సేనను బంపి మునిని జంపించెను; ఆధేనువుమాత్రముఁ బట్టువడినది కాదు. ఆ గోవువలన భటులు జన్మించి రాజు సేనను చెల్లాచెదరుచేసిరి జమదగ్నిని జంపిన వార్త పరశురాముఁడు విని కార్తవీర్యుని నగరముపై దండెత్తి వానితో యుద్ధములుచేసి, వాని నోడించి చంపి నగరము తగులఁబెట్టెను.

ఉ. రా. భార మార్క.

కాలంజనము:-ఒక గిరి. అచ్చట దేవళ మొకటి కలదు. అందలి పూజారి దేవబ్రాహ్మణ ధనమపహరించి శునకమై పుట్టెను. ఈ శునకమును భిక్షుఁడు కొట్టఁగ నది శ్రీరామునితో మొఱపెట్టుకొని యా భిక్షుని నాదేవళమునకుఁ బంపుటయే తగినశిక్షయని చెప్పెను. ఉ. రా.

కాల:- ధరణీధక్షుల పుత్త్రిక. కశ్యపునిభార్య. వినాశన. క్రోధ యీమె సంతానము. భార.

కాలక:- ఒక రాక్షసస్త్రీ. వైశ్వానరుని కూఁతురు. కాలకేయులతల్లి. ఈమె బ్రహ్మను బ్రార్థించి తనపుత్త్రు లెన్నడు నోడిపోకుండునట్లు వరము వేడెను. ఈమెసోదరి పౌలోమ. విష్ణు. భార.

కాలకలి:- విరోచనుని పుత్త్రుఁడు. బలికంటెఁ పెద్దవాఁడు. ఇతఁడు దేవతలకు భయపడివచ్చి కపిత్థవృక్షమై యుండెను. ఆచెట్టుకాయలు,పండ్లు దుర్గంధము గొట్టుటచేఁ బశువులకు రోగములు వచ్చుచుండెను. వానిని నివారణ చేయుటకై నందాదులు శివపూజచేసిరి. చెట్టువృత్తాంతము చెప్పి దానిని నిర్మూలము చేయించుమని శివుని శంఖకర్ణుఁ డనువానిని బంపెను. నందాదులు

రామకృష్ణులే యావృక్షమును నఱికివేయువలయు నని వారిచేతనే కొట్టివేయించిరి. హరి.

కాలకవృక్షీయుఁడు:—ఒక ముని ఇతఁ డొక కాకిని బంజరమునఁ బెట్టుకొని క్షేమదర్శియను రాజుకడకుఁబోయి యీ కాకము త్రికాలవేది. నీచేఁ బట్టుపడని చోరుల నిది యెఱింగి చెప్పును. దీనిని గైకొనుమని యిచ్చెను. క్షేమదర్శిభటు లామాటలు వినిరి. తమగుట్టు నది బయలుపెట్టు నని భయపడి యా నాటి రాత్రియందే యా కాకిని జంపిరి మఱునాడు ముని రాజుకడకు వచ్చి కాకినిజంపుట చెప్పి తాను క్షేమదర్శికి మిత్త్రుఁడననియు, నితని నియుక్తులగు నధికారు లందు వంచకు లున్నారని విని యిది రాజునకుఁ దెల్పుటకై యొక కాకిని పెట్టుకొని వచ్చితి ననియును, ఆ కపటవర్తనులలో పరస్పరము వైరము కల్పించి యొక్కొక్కరినే దండింపు మనియును జెప్పెను. ఆరాజు అట్లుచేసి, ఇతనిని మంత్రిగఁ జేసికొని సుఖంబుననుండెను. తన రాష్ట్రమునఁ జోరు లున్నారనుట కిదియే దృష్టాంతమని వారినిబట్టి దండింపు మనియుఁ జెప్పెను. భార.

కాలకేతుఁడు:—రావణుని సారథి. రామా.

కాలకేయులు:—రాక్షసులు. మరీచిపుత్రులు. వీరి తల్లి కాలక. వీరు మునులను, దేవతలను బాధించు చుండిరి. వీరు దేవతలకందకుండఁ బగలు సముద్రముయొక్క యడుగున దాగికొని యుందురు. వీరిబాధ తొలఁగింపుమని దేవత లగస్త్యుని వేడఁగ నతఁడు సముద్రజలపానము గావించెను. కాలకేయు లపుడు బయటపడిరి. అంత దేవతలు వారిని సంహరించిరి. భార.

కాలకౌశికుఁడు:—కాశీపట్టణమందలి యొక బ్రాహ్మణుఁడు. విశ్వామిత్త్రప్రేరితుఁడై హరిశ్చంద్రుని భార్యయగు చంద్రమతిని గొని యామెచేఁ బనులు చేయించి చాల బాధపెట్టెను. మార్క.

కాలనేమి:—మారీచుని కుమారుఁడు. ఇతఁడు సముద్రుని మిత్త్రుఁడు. ఇతని కూఁతురగు బృందను జలంధరునకిచ్చి వివాహము చేసెను. ఇతఁడు రావణునకును మిత్త్రుఁడు. రావణుఁడు రామలక్ష్మణులతో యుద్ధము చేయునపుడు లక్ష్మణుఁడు మూర్ఛపోయెను. వానికై సంజీవిని దెమ్మని హనుమంతుని రాముఁడు పంపెను. అది రావణుఁ డెఱింగి కాలనేమికడకువచ్చి "హనుమంతుఁడు సంజీవికై వచ్చుచున్నాఁడు. వాని నెట్లైనను జంపు" మని చెప్పెను. ఇతఁడు సరియని ముని వేషము వేసికొని మార్గమందుఁ గూర్చుండి హనుమంతుని జూచి ఓయీ! నీకు శుభమగును; అచ్చటనున్న కొలనులోదిగి స్నానముచేసి రమ్మనియె; అందున్న మొసళ్ళు హనుమంతుని జంపునని యితఁడు నమ్మెను. కాని యా మొసళ్ళను జయించి హనుమంతుఁడు సంజీవిని దెచ్చుట కేగెను. హనుమంతునకు కాలనేమి మఱల నడ్డుపడెను. అపు డాంజనేయుఁడు వానిని దన్ని వానితోఁ బోరాడి వానిని జంపెను. ఇతఁడే కంసుఁడుగ బుట్టెను. భార. శివ. రామ.

కాలభైరవుఁడు:—శివునివలనఁ బుట్టిన మూర్తి. బ్రహ్మ తన పంచమశిరముతో శివుని దూలనాడుచుండఁగ నితఁడుపుట్టి బ్రహ్మ పంచమ శిరమును ఖండించెను. ఆ కపాల మితని చేతి కంటుకొని యూడివచ్చినదికాదు; విష్ణుమూర్తిని దర్శించుమని శివుఁడు చెప్పెను. ఇతఁడు విష్ణువు కడ కరిగెను. విష్ణువు తన భ్రూమధ్య భాగమును బొడిచి యారక్తమును గపాలమునఁ బట్టుమనియె. ఒక సంవత్సర మట్లు రక్తము కారెను గాని కపాల మూడివచ్చినది కాదు; కాశికిఁ బోయి యాకపాలమును బాఁతి పెట్టుమని విష్ణువు చెప్పఁగ భైరవుఁ డట్లు చేసెను. అతఁడు కపాలమును బాఁతినచోటే కపాలమోచనతీర్థము అయ్యెను. భైరవుఁడు దక్షయజ్ఞ ధ్వంసము చేయునపుడును శివునకుఁ దోడ్పడియెను. శివ.

కాలయవనుఁడు:—యవనుని పుత్త్రుఁడు. యాదవులు గర్గుని నాక్షేపణ చేసిరి. కాన గర్గుఁడు సకల యాదవులకు భయంకరుఁడగు కుమారుని గోరి శివుని బ్రార్థించెను. గర్గుఁ డిట్లు ప్రార్థించుట యవనుఁ డెఱింగి యాతని గొంపోయి తన యాలమందలో నుంచెను. ఒక యప్సరస గర్గుని జూచి కామించి యతని వలన నొక పుత్త్రుని బడసెను. ఈ పుత్త్రుని యవనుఁడు పెంచెను. ఇతఁడే కాలయవనుఁడు. ఇతఁడు మిక్కిలి బలాఢ్యుఁడు

కృష్ణుఁడు జరాసంధు నోడించిన పిమ్మట నారదుఁడు కాలయవనునికడకువచ్చి కృష్ణుఁడు కంసాదులను జంపెను. జరాసంధుసంతటివాని నోడించె. నీవు వాని నెఱుఁగక నా భయపడియా యిట్లూరకుంటివి అని కృష్ణునిపై దండెత్తఁ బ్రోత్సాహము చేసెను. అతఁడు మ్లేచ్ఛ సేనలను దీసికొని విధిరపైఁ బడియె. వీనికిఁదోడు అసమయమునసే జరాసంధుఁడుకూడ వచ్చెనేని ఒక్కసారి యిర్వురతోడ నటపోరుట కష్టమని విశ్వకర్మను బిలిచి సముద్రమధ్యమున దనకు నగరము నిర్మించి యిమ్మని కోరి మధురానగరవాసుల నందఱను బలరామునితో నటకుఁబంపి తా నక్కడ నిరాయుధుఁడై నగరముదాటి నడచి వచ్చుచుండెను. తాను నగరమును ముట్టడించి నను యుద్ధమునకు రాలేదని చింతించుచు యవనుఁడు ఇట్లు నడచివచ్చువానిం జూచి యితఁడే కృష్ణుఁడగునని వానిని బరువములాడి పట్టుకొనఁ జనియె. కృష్ణుఁడు పరుగిడ నారంభించెను.

కృష్ణుఁడు ద్వారకానగరము నిర్మించునపుడు దానిపైబడుమ నగరము ధ్వంసము చేయుచుండెడువాఁడు. కృష్ణుఁడు వీనిని గెలువలేక పోవుచుండెను. వీని నుపాయముచే సాధింపవలయునని కృష్ణుఁడు వీని యెదుటకు వచ్చి నన్నుఁ బట్టుకొనఁగలవేని పట్టుకొనుమని పరుగెత్తెను.

కాలయవనుఁడు కృష్ణుని వెనువెంటఁ దఱిమెను. కృష్ణుఁడు ముచికుందుఁడు నిద్రించుచున్న గుహలోనుండి పరుగిడి చనియె. కాలయవనుఁడును ముచికుందుని గుహలోనికేగి నిద్రించుచున్న ముచికుందుని జూచి కృష్ణుఁడే యనుకొని వానిం దన్నెను. ముచికుందుఁడు లేచి వీనిని జూచెను. అంతఁ గాలయవనుఁడు భస్మమైపోయెను. విష్ణు. భాగ.

కాలాంతకుఁడు:-ఘంటాకర్ణుని సోదరుఁడు; కుబేరుని బంటు. హరి.

కాలుఁడు:-ధ్రువుఁడను వసువు కుమారుఁడు. భార.

కాలుఁడు:-భైరవులలో నొకఁడు. (చూడుము భైరవులు.)

కాళము:-శివుని యలంకారములైన సర్పములలో నొకటి. శివుఁడొకనాఁడు కైలాసమున సభచేసి దేవతలనెల్ల సభకు రమ్మనెను. ఈ సర్పము వచ్చినదికాదు. భార్యను గూడియుండెను. శివుఁ డీతనిని కైలాసమున నుండరాదు పొమ్మనియె. ఇతఁడు శివుని వేఁడుకొనఁగ గజారణ్యమున నేను లింగమై యావిర్భవింతును. నీవు పాతాళమునుండి మణులను దెచ్చి పూజింపుము. నీ పూజ నొక హస్తి పాడుచేయును. మీరిరువురుతగవులాడి తుదకు నా సాయుజ్యము పొందుదురు అని చెప్పెను. దీనినిబట్టి శ్రీ కాళహస్తిఅను పేరువచ్చెను. (చూడుము కాళహస్తి)

కాళింది :-సూర్యునికూఁతురు విష్ణుమూర్తిని బెండ్లియాడఁగోరి తపస్సుచేసెను. ఈమెను కృష్ణుఁడు బరిణయమయ్యె.

కృష్ణార్జునులు యమునకు స్నానమునకేగినపుడీమె గోచరింప నీ వెవరవు? వివాహవాంఛతో వచ్చినజాడ కనబడియెను అని అర్జునుఁడు ప్రశ్నించెను. ఆమె తన వృత్తాంతము చెప్పఁగ కృష్ణుఁ డామెను రథముపై నెక్కించుకొని తన నగరమునకుఁ గొనిపోయి వివాహమయ్యెను. భాగ.

కాళింది :-మడుపు. దాని సమీపమున సౌభరి యను ముని తపము చేసికొనువాఁడు. గరుత్మంతుఁడు వచ్చి యా మడుపునందలి మత్స్యరాజును భక్షించెను. మత్స్యము దుఃఖముతో ముని చుట్టుఁ జేరెను. మత్స్యములపై జాలిగొని యా మడుపులోనికి గరుడుఁడు వచ్చెనేని యతఁడు మరణించునని సౌభరి శపించెను. ఆ శాపభీతిచే గరుఁడు డచ్చటకు రాఁడని యెఱింగి కాళియు యా మడుపు సొచ్చి యందుండెను. భాగ.

కాళి:-దేవి. చండముండులను సంహరించుటకు వచ్చిన చండికకుఁ గోపమువచ్చి ముఖము నల్లపడెను. ఆముఖమునుండి ఖడ్గహస్తయై వ్యాఘ్రచర్మాంబర ధారిణియైన దేవి జనించెను. ఈమెయే కాళి. ఈమె రాక్షససేనలను దునుమాడెను. శుంభ నిశుంభులను జంపినదీమెయే. దే. భా. మార్క.

కాళి:-భీముని భార్య. సర్వగతుఁడు అను కుమారుని గనెను. భాగ.

కాళీయుఁడు:- కద్రువకుమారుఁడు; సర్పము. రమణక ద్వీపమున నుండువాఁడు. అచ్చట సర్పములకు వెఱచి జనులు భక్ష్యములను జెట్ల మొదళ్ళయందుఁ బెట్టెడివారు. వారిలోఁ గొంత గరుడునకు సర్పము లిచ్చెడివి. కాళీయుఁడు ఇవ్వక దాను భక్షించెను. ఇవ్వకుండుటచే గరుడుఁడు వీనిని దఱిమెను. ఇతఁడు గరుత్మంతునకు భయపడి కాళిందిమడువున నుండువాఁడు. గరుడుఁడు ఆ మడువునకు వచ్చెనేని అతఁడు చచ్చునట్లు శాపముకలదు. ఆసంగతి కాళీయుఁ డెఱుఁగును గాన నిందు వచ్చి డాగెను. ఇతఁ డుండుటచే మడువులోని జలమంతయు విష సంకలితమయ్యెను. అందలిజీవరాసులు మరణించె; జలము పానార్హము కాకుండెను. ప్రజ లా మడువులోదిగుటకు భయపడుచుండిరి. కృష్ణుఁడు దాని సమీపముననున్న చెట్టునెక్కి కాళియ సర్పముపై నుఱికెను. వీనిని గఱచుటకుఁ గాళియ యత్నించెను గాని సాధ్యము కాలేదు. కృష్ణుఁడు దానిపైఁ జిందులు త్రొక్కుచుండెను. అతని పదభారముచే దాని శిరము వంగిపోవుచుండెను. కాళియభార్యలు నాగకన్యలువచ్చి తమభర్తను రక్షింపుమని కృష్ణుని వేడిరి. కృష్ణుఁడు కాళియను జంపక వానిని బాతాళమునకుఁ బోయి యుండుమనియె. అట్లు కృష్ణునిచే విడువఁబడి గరుడుఁ డింక జంపఁడని కృష్ణుఁ డభయమీయ మరల కాళిని విడిచి రమణక ద్వీపమున కేగెను. భాగ.

కావేరి:-కవేరుఁ డను రాజర్షి తపముచేయఁగ బ్రహ్మ యనుగ్రహమున విష్ణుమాయ కవేరుని పుత్త్రికగ జన్మించెను. ఈమెయొక్క యొక యంశమే లోపాముద్ర. కవేరపుత్త్రి శివుని గూర్చి తపస్సుచేసి నదియై జనులకు ముక్తి నిచ్చెదనని చెప్పి యతని సెలవు పుచ్చుకొని తపోవనమున కరిగి తపస్సు చేయుచుండెను. ఇట్లుండఁగ నగస్త్యునికడకు బ్రహ్మవచ్చి శివుని గూర్చి కవేరతనయ తపస్సు చేయుచున్నది. దానిని బెణయముకమ్మని చెప్పెను. అగస్త్యుఁడు తపము చేయుచున్న యీ కన్యను జూచి తనను వివాహముకమ్మని కోరెను. ఆమె నదికాఁబోవు తెలింగించెను. అయినను నగస్త్యుఁడు సమ్మతించి యామెను వివాహమయి తన కమండలమునం దుంచుకొనియె.

వింధ్యగర్వమణఁచుటకుఁబోవుచు నగస్త్యుఁడు తన కమండలమును, గావేరిని శిష్యుల కప్పగించి జాగరూకతతోఁగాపాడుచుండుఁడని చెప్పెను. శిష్యులు కమండలమును భద్రముగఁ గొనివచ్చుచుండిరి. వారు సహ్యపర్వతమును జేరఁగనే కావేరి తనకార్యము జ్ఞప్తికిఁదెచ్చుకొని నదియై పాఱెను. శిష్యులు అగస్త్యునకుఁ గోపము వచ్చునని భయపడి యామెను ప్రార్థించిరి కాని యగస్త్యున కిదివఱకే తాను నది యగుట నెఱింగించితి నని యామె చెప్పెను. కావేరి దక్షిణగంగ యని ప్రసిద్ధిగాంచెను. కావేరి సాగరసంగమమునొందెను. అపుడు బ్రహ్మయు, శివుఁడును వచ్చి యామెకు వరము లొసఁగిరి. తు.కా.అ.

కాశి:-కాశ్యుని కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు రాష్ట్రుఁడు. భాగ.

కాశి.-గంగానదియొడ్డున నున్న పుణ్యక్షేత్రము. పార్వతి పుట్టినింట నుండఁగ మా యల్లునకు ధనము లేదు, రూపము లేదు, గృహము లేదు అని మేనక యాక్షేపణగఁ బలికెను. ఆమాటలకుఁ బార్వతికిఁ గష్టముతోఁచి యచ్చటనుండి వెడలిపోదమని భర్తతోఁ జెప్పెను. కాశీనగరము బాగుండునని శివుఁ డాలోచించి గణనాథుఁ డగు నికుంభుని బిలచి యుపాయంబునఁ గాశిరాజగు దివోదాసుని వెడలఁగొట్టి పురము గైకొనుమని చెప్పెను. ఇతఁడు కాశిలో నొక కుంభుఁ డను బ్రాహ్మణునికలలోఁ గనఁబడి యిచ్చట విశ్వేశ్వరునికిఁ గుడి కట్టింపుమని చెప్పెను; బ్రాహ్మణుఁడు రాజుతోఁ జెప్పెను. దివోదాసుఁడు ఆలయము కట్టించి యనుదినము దేవుని బూజించుచుండెను. ఈశ్వరుఁడు ప్రార్థించినవారి కెల్లరకును గోరిక లిచ్చుచుండెను గాని యెంత వేడినను దివోదాసునకు మాత్రము కుమారు నిచ్చుటలేదు. ఒక్కమారు వేడిన పురజనులకుఁ గోరికలిచ్చి, యీశ్వరప్రతిష్ఠ చేసి యనుదినమును బూజచేయు తనకుఁ గోరిక తీర్పకున్నాఁడని దివోదాసునకుఁ గోపము వచ్చి గుడిని పగులగొట్టించెను. అందువలన నికుంభునకుఁ గోపమువచ్చినది. అతఁడు కాశీనగరము జనహీనం బగునట్లు శపించి పిమ్మట పార్వతీ పరమేశ్వరులను వచ్చుటకుఁ దీసికొని వచ్చెను.

ఇది ముక్తిదాయకములగు పట్టణములలో నొకటి. బ్రహ్మ.

శాశ్య:-జనమేజయుని భార్య. చంద్రాపీడుఁడు, సూర్యాపీడుఁడు కుమారులు. భవిష్యపర్వము.

శాశ్యపి:-భూమి. ఇరువదియొక్కమారులు క్షత్రియులను వధించిన పిమ్మటఁ బరశురాముఁడు భూమినంతను కశ్యపునకు దానము చేసెను. కశ్యపుఁడు నీ భూమిని విప్రవరులకు బంచి యిచ్చి తాను తపస్సునకుఁ బోయెను. దానివలన శాశ్యపి అను పేరువచ్చెను. భార.

శాశ్యపుఁడు:-ఒక బ్రాహ్మణుఁడు. పృథుచక్రవర్తియొద్ద వాదములాడుచుండిన అత్రి గౌతముల వాదము సత్యమారుఁడుగాని నిర్ణయించలేఁడని వానికడకుఁ బోవుదమని చెప్పెను. భార.

శాశ్యుఁడు:-సుహోత్రుని కుమారుఁడు. ఇతని పుత్రుఁడు కాశి. భాగ.

శాసారుఁడు:-బాష్కలి శిష్యుఁడు. వాలఖిల్యాఖ్య సంహితము నేర్చెను. భాగ.

కి

కిందముఁడు:-ఒకముని. ఇతఁడును, నితనిభార్యయును మృగరూపములు ధరించి రతికేళిఁ దేలుచుండఁగ వేఁటకు వచ్చిన పాండురాజీ మృగరూపధారులను బాణములోఁ గొట్టెను. ముని శరహతుఁడై ప్రాణము విడుచుచు, పాండురాజు భార్యతో సంయోగము పొందునపుడు మరణింతువని శపించెను.

కింపురుషుఁడు:-ఆగ్నీధ్రుని కుమారుఁడు. ఇతని పేరిటనే యితఁడు పాలించిన కింపురుషవర్షము పరగుచున్నది. విష్ణు

కింపురుషులు:-దేవతలలో నొక తెగవారు. వీరి శరీర మశ్వశరీరమువలెను, ముఖము నరముఖమువలెను నుండును.

కిన్నరులు:-దేవతలలో నొక భేదము. పులస్త్యుని పుత్రులు. వీరి శరీరము నరశరీరమువలెను, ముఖమశ్వముఖమువలెను నుండును.

కిమ్మీరుఁడు:- ఒక రాక్షసుఁడు. బకాసురుని తమ్ముఁడు. కామ్యకవనమునందు నివసించుచుఁ బ్రజలను బాధించువాఁడు. పాండవులు వనములోఁ బోవునపుడు కిమ్మీరుఁడు మార్గమధ్యమందు నిలచి బెదరించెను. మేము పాండవులము, ధర్మార్జున భీమ నకుల సహదేవులమని వానికి ధర్మరాజెఱింగించెను. కాని యా రాక్షసుఁ డట్టహాసము చేయుచు నాయన్న బకాసురుని జంపినవారి నూరకపోనిత్తునా యని వీరిపైఁబడఁ బోయెను. భీముఁడును, కిమ్మీరుఁడును వృక్షయుద్ధము, శిలాయుద్ధము చేసిరి. తుదకుఁ గిమ్మీరుఁడు భీముని చే సంహరింపబడియె. భార.

కిరాతుఁడు:-మాయా—(చూడుము శివుఁడు.)

కిష్కింధ:-పంపానదీతీరమునకు సమీపమునయున్న దేశము. దీనిని మొదట ఋక్షవిరజుఁడును, పిమ్మట వాలి సుగ్రీవులును పాలించిరి. రామా.

కీ

కీచకుఁడు:-విరాటరాజు బావమఱఁది. ఇతని పేరు సింహబలుఁడు. (చూడుము సింహబలుఁడు.)

కీర్తిమతి:-ధరణీదక్షుల కుమారిత. ధర్ముఁ డను మనువు భార్య. భార.

కీర్తిమతి:-అణుహుని భార్య.

కీర్తిమతి:-ఒక స్త్రీ. శివరిపుత్రుల నేవురను భూరిశ్రవుఁడు, ప్రభువు, శంభుఁడు, కృష్ణుఁడు, గౌరుఁడు అనువారలను వివాహ మయ్యెను. ఈమెకు బ్రహ్మదత్తుఁడను కుమారుఁడు జన్మించెను.

కీర్తిమాలిని:-చంద్రాంగదుని కుమారిత. భద్రాయువుని భార్య. ఈమె పూర్వభవమున పింగళయను వేశ్య. బ్రహ్మ.

కీర్తిరథుఁడు:-ప్రతిరథకుని కుమారుఁడు.

కీర్తిరాతుఁడు:-మహాధ్రకుని కుమారుఁడు.

కు

కుంచములింగమయ్యో:- బల్లేసు మల్లయ్య అను శెట్టి లింగార్చనము చేసిఁగాని భుజింపని నియమము కలవాఁడు. అతఁ డితర వర్తకులతోఁ గలసి వ్యాపారమున గ్రామాంతర మేగెను. అట శివాలయము లేదు. అంత లింగస్పర్శనము లేక యీ శెట్టి చచ్చుననుచు హేళనగ నందఱు పూరిగడ్డితో గుడిగఁగట్టి యందు గుంచము పెట్టి దానిపైఁ గొండగోగుపువ్వులువేసి యిదే శివాలయమని మల్లయ్యకుఁజూపిరి. మల్లయ్య దానికిఁ ప్రదక్షిణముచేసి, మ్రొక్కి పిమ్మట భుజించెను. అంతట తోడివర్తకులు యీ మల్లయ్య కుంచమునకు మ్రొక్కి కుడిచెను. ఆఁకటి కక్కఱి రైనదే దైవము అని నవ్వి, ఆ కుంచము మేకు కొలుచుకొనుటకుఁ గావలయును, దానిని దీసికొనిరండు అనిరి. మల్లయ్య ఆ మాటలు విని చెవులు మూసికొని హర హర ఇట్లేల యనెదరు. అది శివలింగము. నేను చూపెదను రండు అని ఆ గుడికి తీసికొనివెళ్లెను. ఆ పూరిగుడి యుండిన చోట చక్కని ఆలయము, నందికేశ్వరుఁడు, వాని కెదురుగఁ గుంచము పెట్టినచోట లింగము నేర్పడియుండెను. ఇది బల్లేశ్వరుఁడు. బస.

"శా. నిన్నేరూపముగా భజింతు మదిలో?
నీరూపు మోఁకాలో? శ్రీ
చన్నో? కుంచమొ? మేకపెంటికయొ? యీ
సందేహముల్మాన్పి నా
కన్నారన్ భవదీయ మూర్తి సగుణా
కారంబుగాఁ జూపవే
చిన్నీరేజ విహారమత్త మధుపా!
శ్రీ కాళహస్తీశ్వరా!"

కుంజరుఁడు:-కద్రువ కుమారుఁడు. భార.

కుంజరుఁడు:-ఒక వానరుఁడు. అంజనతండ్రి. రామా.

కుండధారుఁడు:- గాంధారి ధృతరాష్ట్రుల పుత్రుఁడు. భార.

కుండధారుఁడు:-ఒక దేవానుచరుఁడు. బ్రాహ్మణుఁ డొకఁడు ధనముగోరి తపస్సుచేయఁగ నితఁడువచ్చి నీకేమి కావలయునని అడిగెను. ఇతఁడు ధనమును గోరగ, కుండధారుఁడు కుబేరునిభటుఁడైన మణిభద్రుని దలఁచికొనెను. అతఁడు రాఁగ, ఇతని ధనసమగ్రునిఁ జేయుమనియె. నీ కెంతధనము కావలయునని మణిభద్రుఁడడుగ, వీనికి ధనమేటికి? మనస్సు ధర్మమార్గమున నుండునట్లు చేయుము దానివలన సర్వసంపదలు కలుగు ననియె. మణిభద్రుఁడు దేవతల సహాయమున నాతని మనస్సు తపస్సుపై వర్తిలునట్లు చేసెను. ఆ బ్రాహ్మణుఁడు ధనమక్కరలేదనియెను. తపస్సుచేసి తేజము నొందెను. భార.

కుండభేది:-గాంధారి ధృతరాష్ట్రుల పుత్రుఁడు. భార.

కుండల:-వింధ్యవంతుని కుమారిత. పుష్కరమాలి భార్య. ఈమెకుఁ గామగమనము కలదు. ఈమె భర్త చనిపోయినపిమ్మటఁ దీర్థయాత్రలు చేయుచుండెడిది. ఒకచోఁ గువలయాశ్వుఁడు, వరాహరూపమున నున్న దనుజుని దఱుముటయు, వాఁ డొకబిలమును బ్రవేశించుటయుఁ జూచి యీమెయు దనుజునివెంట బిలముప్రవేశించెను. అందీమె చెలికత్తెయగు మదాలసను జూచి యామె వృత్తాంతము కువలయాశ్వున కెఱిఁగించెను. కువలయాశ్వుఁడు దనుజుని సంహరించినపిమ్మట నీమె మదాలసా కువలయాశ్వులకు వివాహమును గావించి యామెకు పతీధర్మము తెఱిఁగించి తాను తీర్థయాత్రలకై చనియెను. మార్క.

కుండశాయి:-గాంధారీధృతరాష్ట్రులపుత్రుఁడు. భార.

కుండాశి:-గాంధారి ధృతరాష్ట్రుల పుత్రుఁడు. భార.

కుండినగరము:-భీష్మకుని పట్టణము. భాగ.

కుంతి:-పాండురాజుభార్య. ధర్మరాజాదుల తల్లి. వసుదేవుని తోఁబుట్టువు. ఈమె శూరుఁడను యాదవరాజు కుమారిత. ఈమె పేరు పృథ. శూరుని మేనమత్త కుమారుఁడు కుంతిభోజుఁడను రాజునకు సంతానము లేకపోవుటచే నతఁ

డీమెను బెంచెను. అతనియింట బెరుగుటవలననే యీమెకుఁ గుంతియను పేరువచ్చె. ఈమె చిన్ననాటి నుండియు నతిథిసేవ చేయుచుండెడిది. ఒకనాఁడు కుంతిభోజునింటికి దుర్వాసుఁడు వచ్చెను. ఈ మునికిఁ గుంతియే పరిచర్య లొనరించెను. దానికి ముని సంతుష్టాంతరంగుఁడై యామెకు నొకమంత్ర ముపదేశించెను. ఆ మంత్రము పఠించినచోఁ గోరినదేవుఁడు వచ్చి వశుఁడగును. దుర్వాసుఁ డుపదేశించి వెళ్ళినపిమ్మట నా మంత్రబలము పరీక్షింపవలెనని కుంతికిఁ దలఁపు గలిగినది. ఆమెపఠించి సూర్యు నారాధించి, అతనివంటి పుత్త్రునిఁ గోరెను. తోడనే సూర్యుఁడు వచ్చెను. కుంతి భయపడియె. ఆమె కన్య. పుత్త్రునిఁ గోరలేదు. మంత్రమును మాత్రము పరీక్షింపఁదలఁచినది. కాని సూర్యుఁ డాహ్వానము చేయఁబడినపిమ్మట నూరకపోఁడు. కుంతికిఁ బుత్త్రుని బ్రసాదించి యామెకుఁ గన్యాత్వము మాసినది కాదని యభయ మిచ్చెను. ఆమెకుఁ గర్ణుఁడు పుట్టెను. ఇదెవ్వరికిఁ దెలియకుండుటకై యా పసిబాలుని నొక తొట్టెయందుఁబెట్టి నదిలోవిడిచి యామె యథాప్రకారము గృహములో వర్తించుచుండెను.

కుంతిని బాండురాజు వివాహమయ్యెను. వీరికి సంతానము కలుగకపూర్వమే పాండుఁడు శపింపఁబడెను. శాపవశమున నతనికి భార్యతో సంభోగించుట యసంభవ మయ్యెను. అతఁడు హస్తినాపురమున నుండనొల్లక తపస్విగ నుండ గోరి యరణ్యములకేగెను. వానితోఁ గుంతియు నేగెను. పాండురాజు తనవంశము నిలువఁ బెట్టుకొనుటకై సంతానమువడయఁగోరి భార్యను నియోగించెను. అపుడామె తనకుఁ బూర్వము దుర్వాసుఁడిచ్చిన వరము నెఱుకపరచెను. భర్త యనుమతిని బొంది. మంత్రము పఠించి ధర్ముని, వాయువును, ఇంద్రుని నారాధించి ధర్మరాజు భీమార్జునులను బడసెను. తన సవతియగు మాద్రికై యశ్వినుల నారాధించెను. వారివలన మాద్రియందు నకుల సహదేవులు జన్మించిరి.

మాద్రితో సంభోగించ యత్నించి పాండురాజు మరణము నొందినపుడు కుంతికూడ సహగమనము చేయఁగోరెను గానిబిడ్డలను బెంచుటకై యట్లొనర్పలేదు. ఈమె నకుల సహదేవులను గూడఁ దనబిడ్డలవలెనే చూచుకొనుచుఁ బిల్లల నందఱను దీసికొని ధృతరాష్ట్రుని సదనమున కేగెను. దుర్యోధనాదులతోఁబాటు ధర్మరాజాదులను బెరుగుచుండిరి. కాని కొంతకాలమైన పిమ్మట ధృతరాష్ట్రుఁడు పాండుపుత్త్రులను వారణాసికిఁ బొమ్మనియె. వారిని వెంటఁబెట్టుకొని కుంతి బయలుదేరెను. మార్గమందు దుర్యోధనునిచేఁ గట్టింపఁబడిన లక్కయింట నొకనాఁడు పుత్త్రులతో వసించి దానినుండి వెల్వడి యరణ్యమార్గమునఁ బోవుచుండెను. హిడింబి యను రాక్షసి భీమునిపై వలపుగొనివచ్చుటయు, నీతనిచేఁ దిరస్కరింపఁబడుటయును జూచెను. ఆ రాక్షసిపై జాలిగొని దానికోర్కె యీడేర్పుమని యీమె పుత్త్రునితోఁ జెప్పెను.

కుంతియుఁ బుత్త్రులును నేకచక్రపురము చేరిరి. అందొక బ్రాహ్మణునియింట వాసము చేసిరి. ఒకనాఁ డా యింటివారు పెద్దపెట్టున నేడ్చుచుండుట విని కారణమారసి యానాఁడు బకాసురున కాయింటి బాలుఁ డాహారమై పోవుట తెలిసికొనెను. ఈమె వారికెట్టులైన నుపకారము చేయఁదలచుకొనియె. బ్రాహ్మణబాలుఁ డట్లు పోవుచుండఁగఁ జూచుచు నూరకుండుట రాజధర్మము కాదనుకొనెను. తన పుత్త్రుఁడగు భీముని బలమునం దామెకు నమ్మకము గలదు. ఆ బ్రాహ్మణబాలకునికి బదులుగ, రాక్షసుని యాహారముగఁ దన కుమారుని భీము నేపంపెను. ఈమె తలఁచినట్లే భీముఁడు రాక్షసుని జంపి వచ్చెను.

ఏకచక్రనగరమునుండి బ్రాహ్మణవేషముననే కుంతియుఁ బుత్త్రులును ద్రుపదునగరమునకు వచ్చిరి. పుత్త్రులు భిక్షాటనము చేసితెచ్చిన యన్నము వారికిఁబెట్టి శేష మీమె భుజించుచుండెడిది. రాజభార్య యిట్లు బిచ్చమెత్తి భుజింపవలసి వచ్చినను దుఃఖమించుకయు బయల్పడ నీయలేదు. సుగుణ సంపన్నులు, బలాఢ్యులగుపుత్త్రు లభివృద్ధిలోనికి వచ్చుటయే యీమె మనస్సునందున్నది. వారికై యెట్టి యిడుములు పడినను గణనసేయదు. అర్జునుఁడు మత్స్యయంత్రమును గొట్టెను. పన్నిదమును గెలిచెను. ద్రౌపదిని వివాహమునకు నర్హుఁడయ్యెను. అపుడువారుతల్లికడకువచ్చి "అమ్మా! పండు తెచ్చితి"మనిరి. ఆమె నిజముగ ఫలమే యనుకొని మీరేవురు సమానముగఁ బుచ్చు

కొనుఁడు అనియె. వారు విస్మితులైరి. వారు తెచ్చినది ద్రౌపది ఒక్క కాంతను నైదుగురు పురుషులు గైకొనుట యపూర్వము. అయినను దల్లిమాట జవదాటరాదు. ఆమెమాటయందు వారికుండిన గౌరవప్రేమ లట్టివి. వారేవురును ద్రౌపదిని బరిణయమైరి.

పిమ్మటఁ బాండుపుత్త్రులను ధృతరాష్ట్రుఁడు హస్తినాపురమునకు రావించెను. వారికి నింద్రప్రస్థపురము నిర్మించి యిచ్చెను; వారికిఁ గొంత రాజ్యముకూడ నిచ్చెను. ధర్మజుఁడు రాజసూయము చేసెను. తనపుత్త్రు లట్లభివృద్ధి నొందుటఁజూచి కుంతి సంతోషముతో నుండెను; కాని యిది చిరకాలములేదు. దుర్యోధనునకు నీర్ష్య హెచ్చెను; ద్రౌపది తనను బరిహసించెనని దుఃఖము వచ్చెను. ఎటులైనను వారిని బరిమార్పఁ దలఁచుకొనియె. శకుని వీనికిఁ దోడయ్యెను. ధర్మరాజును జూదమునకుఁ బిలిచిరి. ఆ జూదములో ధర్మజుఁడు సర్వస్వము నోడిపోయి సోదరులతోడను, ద్రౌపదితోడను గానవముల కేగెను. అప్పుడుమాత్రము కుంతి పుత్త్రులతో నరుగలేదు. ఆమె హస్తినాపురమందే పుత్త్రులను దలఁచుకొనుచుఁ గాలము గడుపుచుండెను.

పాండవుల యజ్ఞాతవాసము ముగిసినపిమ్మట సంధికై యత్నము చేయుటకుఁ గృష్ణుఁడు హస్తినాపురమునకు వచ్చి కుంతిని జూచెను. అతనివలన నామె పుత్త్రుల క్షేమము తెలిసికొనియె. వారికిని, కర్ణునకును మైత్రి సేయఁగలయునని కోరి కర్ణుఁడు నదిలో స్నానము చేయుచుండఁగ నతనియొద్దకుఁ బోయి యతఁడు తనపుత్త్రుఁడగుట నెఱింగించి ధర్మజాదులతో స్నేహంబున నుండుమని కోరెను. కాని యింతవఱకువచ్చిన పిమ్మట నర్జునునితోఁ జెలిమి సేయుట కతఁ డిష్టపడలేదు. తానైనను, నర్జునుఁడైననుండవలెఁ గాని యిరువురును జీవించియుండుట యసంభవమని చెప్పెను. అర్జునుఁడుతప్ప మిగిలినవారు చేఁ జిక్కినను వారిని జంపఁడు నని కర్ణుఁడీమెకుఁ జెప్పెను. అట్లే కానిమ్మని కుంతి సమ్మతించి చనియె. యుద్ధములోఁ బాండవులు జయించినను గుంతి చిరకాలము సుఖపడ లేదు. యుద్ధమంతయు ముగిసినపిమ్మటఁ గుంతియు గాంధారీ ధృతరాష్ట్రులతోఁ గలసి పాండవులు వేఁడినను తన నిశ్చితమును మానక వనవాసమున కేగెను. వారిని జూచుటకు వ్యాసుఁడును వచ్చెను. ధృతరాష్ట్రుఁడు మృతులైన పుత్త్రాదులను జూడ గోరెను. ధర్మజాదులగు పుత్త్రులు వీరిని నరణ్యములోఁ జూడవచ్చిరి. ఆమెను విడిచియుండ నొల్లనని ధర్మజుఁడు విలపించెను. రాజ్యపాలనమున కతని బంపి, ధృతరాష్ట్రగాంధారులతో నీమె చనియె. ఆ యరణ్యములలో పుట్టిన దావాగ్ని తప్పించుకొను వెరవులేక వేదవ్యాసుని దర్శించి మృతులైన బంధువులను, హితులను జూడఁగోరెను. అపుడు కుంతికిఁ గర్ణునిగూడఁ జూడ మదిలోఁ గుతూహలము పుట్టెను. కుంతియుఁ దనకుఁ గర్ణుఁడు జన్మించినప్రకారం బెఱింగించి దుఃఖించెను. ఆమె దోష మేమియు లేదని వ్యాసుఁడు తెలియఁ జెప్పి యోదార్చి మృతులైన వారిని జూపించుటకు గంగానదియొద్దకుఁ గొంపోయి యచ్చట వీరికి మృతులైన వారిని గోచరింపఁ జేసెను. భార.

కుంతిభోజుఁడు:- ఒక యాదవరాజు. శూరుఁడను వాని మేనయత్తకుమారుఁడు. ఇతనికి సంతానము లేకపోవుటచే శూరునికుమార్తెయగు కుంతిని బెంచెను. భార.

కుంభకర్ణుఁడు:- కైకసియందు విశ్రవసునకుఁ బుట్టిన కుమారుఁడు. (పుష్పోత్కటయందు విశ్రవసునకుఁ బుట్టిన కుమారుఁడు.) రావణుని తమ్ముఁడు. ఇతఁడు పుట్టఁగనే జంతుజాలమును మ్రింగ యత్నించెను. అప్పుడే యింద్రుఁడు బాణములతోఁ నితనిం గొట్టెను. వీని చేష్టలు చూచి యింద్రుఁడు భయపడి బ్రహ్మతోఁ జెప్పుకొనియె. మఱియుఁ గుంభకర్ణుఁడును రావణునితోఁ దపస్సునకు వెడలి బ్రహ్మను గూర్చి రావణునికంటె ఘోరమగు తపస్సు చేయఁగ దేవత లందఱు భయపడిరి. వారు బ్రహ్మకడకుఁ బోయి కుంభకర్ణుని తపస్సునకు మే మాఁగలేక పోవుచుంటిమి. వానికి లోకము లణఁగఁద్రొక్కు శక్తి యిదివఱకే కలదు. తపోబలము కూడఁ గల్గెనేని సృష్టి నిలువఁగలుగునా? వంచన చేసి వానికి నల్పవరముమాత్ర మిమ్ము అని బ్రహ్మను వేడిరి. అతను సరేయని సరస్వతిని బిలచి నీవు కుంభకర్ణుని నాలుకపైనుండి యాలు

ఆఱు నెలలు నిద్రయు, నొకదినము భోజనము నతఁడు కోరునట్లుచేయుమని చెప్పెను. సరస్వతి కుంభకర్ణుని జిహ్వ నాశ్రయించి యతఁ డట్లే యడుగునట్లు చేసెను. బ్రహ్మ యా వరములు ప్రసాదించెను. పిమ్మట తాను కోరిన వర మంతయేనా యని కుంభకర్ణుడు విచారించెను. విశ్రవసు నీ వరముల వృత్తాంతము విని బ్రహ్మయొద్దకు వెళ్ళి తన కుమారుని యీ వరములు మార్పుమని కోరెను. ఆఱు నెలలు నిద్రించి యొకనాఁడు మేల్కని యాహారము దినుననియు, ఆ నాడు మహాబలసంపన్నుఁడై యుండుననియు, నతఁడు నిదురించుచుండగ నెవ్వరేని లేపినయెడల బలహీనుఁ డగుననియు బ్రహ్మ వానితోఁ జెప్పెను.

కుంభకర్ణుఁడు నిద్రించుటకై రావణుఁడు ప్రత్యేకభవనము నిర్మించెను. ఇతఁడు బలి మనుమరాలగు వజ్రజ్వాలను వివాహ మయ్యెను. ఇతనికి నికుంభుఁడు, కుంభుఁడు నను కుమారులు గల్గిరి. వీరు యుద్ధములో మరణించిరి. రాముఁడు లంకకు వచ్చి యుద్ధము చేయునప్పటికి నితఁడు నిద్దురపోవుచుండెను. రావణుని సేనానాయకులు పలువురు తెగిరి. మహాకాయుఁడుకూడ మరణము నొందెను. అపుడు రావణుఁడు వీనిని లేపించెను. కుంభకర్ణుఁడు లేచివచ్చి యిట్లనియె; "నే నొకసారి మేరుపర్వతము దగ్గఱనుండి వచ్చుచుండగ విష్ణుమూర్తి యవతరించి రాక్షస సంహారము చేయునని వింటిని. రాముఁడు విష్ణుమూర్తి కావచ్చును. వానితో యుద్ధము మానుము" అని. ఈ మాటలు వినఁగనే రావణునకుఁ గోపమువచ్చి నీకుఁ బౌరుష ముండి యుద్ధము చేయఁగల్గితివేని చేయుము; లేదేని పోయి నిద్రించుము యని పలుకఁగ కోపము వచ్చి కుంభకర్ణుఁడు యుద్ధము చేసెను. ఆయుద్ధములో రామునిచేతను, లక్ష్మణునిచేతను జంపఁబడెను. రామా. భార.

కుంభకర్ణుఁడు తొలిజన్మమున విష్ణుమూర్తి ద్వారపాలకుఁడు. విజయుఁ డనువాఁడు. (చూడు విజయుఁడు.)

కుంభకుఁడు:- విదేహదేశమందలి యొక గొల్లవాఁడు. వీనియింటఁ గాలనేమి పుత్త్రులేడ్వురు ఆఁబోతులుగఁ బుట్టియుండిరి. ఈ యాఁబోతులు ప్రజలకుఁ బ్రాణహాని చేయుచుండుటచే వానిని బంపుమని రా జానతిచ్చెను. వానిని జంపుట సాధ్యము కాకుండెను. ఆ యాఁబోతులతోఁ బోరాడి వానిం జంపువానికి తన కూఁతురగు నీల నిచ్చి వివాహము సేయుదునని కుంభకుఁడు ప్రకటించెను. కృష్ణుఁడువచ్చి యాఁబోతులను జంపెను. కుంభకుఁ డీతనికి నీల నిచ్చి వివాహము చేసెను.

కుంభాండుఁడు:- బాణాసురునిమంత్రి. ఉష చెలికత్తెయగు చిత్రలేఖ యితని కుమారిత. విష్ణు.

కుంభీనస:- మాల్యవంతుని కుమారిత యగు అనల యొక్క కూఁతురు. రావణుని చెలియలు. రావణుఁ డింటలేనపుడు మధువను రాక్షసుఁడు వచ్చి యీమెను బలాత్కారమున నెత్తుకొని పోయి వివాహ మయ్యెను. ఈ వృత్తాంతము విభీషణునివలన రావణుఁడు విని మధువును జంపనేగెను. కుంభీనస యడ్డుపడి మధువామెను గొనివచ్చుట చేతనే తనకు భర్తయయ్యెను గాన నతనిఁ జంపవలదని వేడెను. రావణుఁడు వానిని జంపుటమాని మధువుతో స్నేహము చేసెను. కుంభీనసకు లవణుఁ డను కుమారుఁడు జన్మించెను. ఉ. రా.

కుంభీనస:- సుమాలికుమార్తె. కైకసి తోఁబుట్టువు.

కుంభీనస:- అంగారపర్ణుఁ డను గంధర్వుని భార్య. వానిని అర్జునుఁడు సంహరింపఁబోవునపుడు తనకుఁ బతిభిక్ష నిమ్మని అర్జునుని వేఁడెను. (చూడుము అంగారపర్ణుఁడు) భార.

కుంభుఁడు:- కుంభకర్ణుని కుమారుఁడు. వీఁడు యుద్ధములో సుగ్రీవునిచేఁ జంపఁబడెను.

కుక్కుటముని:- ఒక ముని తల్లిదండ్రులకు సేవ చేయుటయే ఇతని తపస్సు. దానివలననే ఇతనికి మహాత్మ్యము కలిగెను. గంగ, యమున, సరస్వతి నదులు, "అందఱు తమలో మునిగి స్నానముచేయుటచేఁ గలిగిన మాలిన్యమును బోగొట్టుకొనుటకు ఇతని యాశ్రమమునకువచ్చి వానియాశ్రమములో సేవచేసి వెళ్ళుదురు." (చూడుము పుండరీకుఁడు.)

కుక్షి:- కర్దమప్రజాపతి కూఁతురు. ప్రియవ్రతుని భార్య. విష్ణు.

కుక్షి:- ప్రియవ్రతుని పుత్త్రిక. బ్రహ్మ.

కుచేలుఁడు:- ఒక బీదబ్రాహ్మణుఁడు. ఇతఁడు శ్రీకృష్ణుని చెలికాఁడు. వీరిద్దఱు సాందీపునొద్దఁ జదివిరి. కుచేలునిభార్య పరమసాధ్వి. ఇతనికి సంతానము మెండు. వీరొక్కొక్కపుడాహారములేక మాడుచుండెడివారు. అయినను కుచేలుఁ డొకరిని యాచింపక లభ్యంబైన దానితోడనే కాలము గడుపుచుండెను. ఇతని భార్యయే కృష్ణునిఁ జూచిరమ్మనియు, నతఁడు సహాయము చేయుననియుఁ జెప్పఁగఁ గృష్ణుని జూచుట కేఁదరిగెను. కృష్ణునకుఁ గానుకగఁ దనభార్య మూటగట్టి యిచ్చిన యటుకులనుఁ మాత్రము పట్టుకొని వెళ్ళి యంతఃపురవాసుఁడైన కృష్ణుఁడు తనకు దర్శన మిచ్చునో యివ్వడోయని కుచేలుఁడు సందేహించెను గాని కుచేలునిరాక తెలియఁగనే కృష్ణుఁడు లోపలకు రావించి తనపాన్పుపైఁ గూర్చుండఁ బెట్టెను. కుచేలుఁ డిచ్చిన యటుకు లత్యాదరముతోఁ గృష్ణుఁడు గుప్పెడు తినెను. రెండవ గుప్పెడు తినఁబోవుచుండఁగ లక్ష్మి వాని నాపెను. కుచేలుని నాదరించి కృష్ణుడు కొన్నిదినములు తన యొద్ద నుంచుకొని పంపెను. ధనము కావలెనని కుచేలుఁ డడుగలేకపోయెను. ధనమిచ్చెదనని కృష్ణుఁడును చెప్పఁడాయెను. కుచేలుఁడు మరలి వచ్చుచుఁ దనకు ధనమిచ్చినయెడలఁ గృష్ణుని మఱతునని తలఁచియే కృష్ణుఁడు ధనమివ్వలేదని వితర్కించుకొనుచు సంతుష్టిచెందెను. ఇతఁడు గృహమునకు వచ్చునప్పటి కితని యిల్లు మేడ యయ్యె; బహు ధన ధాన్య సంపదలతోడను, దాస దాసీ జనంబులతోడను నొప్పారుచుండెను. కుచేలుఁ డదియంతయుఁ గృష్ణుని దయవలననే గల్గెనని సంతోషించి యుండెను. భాగ.

కుజభుఁడు:- ఒక దనుజుఁడు. జంభాసురుని సోదరుఁడు. ఇతని నింద్రుఁడు సంహరించెను. రామా.

కుతరుఁడు:- కద్రువ కుమారుఁడు భార.

కుబేరుఁడు:-గుహ్యకులలో మొదటివాఁడు.(చూ గుహ్యకులు) అతని వామపార్శ్వమువలన నొక కన్యపుట్టె. ఆమెపేరు మనోరమ. ఈమె కుబేరునికి భార్యయయ్యెను. బ్ర. వై.

కుబేరుఁడు:- తొలిజన్మమందు యజ్ఞదత్తుఁడను బ్రాహ్మణునికుమారుఁడు; గుణనిధియనువాఁడు; కడు దుర్మార్గుఁడు. చోరత్వము, జారత్వము, క్రూరత్వముకూడ నితనికడ నుండెను. వీనిని తండ్రి తన యింటినుండి పొమ్మనియె. వీనికిఁ దుదకుఁ దిండికూడ లేకపోయెను. ఒకఁడు శివారాధనచేసి ప్రసాదమొకచోఁ బెట్టుకొనఁగ దాని నితఁడు తస్కరించి మ్రింగెను. భటులు వీనిని బట్టుకొనఁబోయిరి. అప్పటికే శివప్రసాదము భక్షించెను. కానఁ జీకటులువచ్చి ఇతనిని భటుల కన్నులకుఁ గనఁబడకుండఁ జేసెను. ఇతఁడు మరణించిన పిమ్మట యమదూతలును, విష్ణుదూతలును వచ్చిరి. కాని శివప్రసాద భక్షణము చేసెనుగాన విష్ణుదూతలే వీనిని గొని పోయిరి.

కుబేరుఁడు పిమ్మటఁ గళింగదేశాధీశుఁడగు అరింవముఁడను రాజునకు దముఁడను పేరుతో బుట్టి రాజ్యము చేసెను. ఇతఁడు గుడులయందు దీపారాధన చేయించువాఁడు. కాశీపట్టణమున విశ్వేశ్వరుని గూర్చి యితఁడు ప్రార్థించెను. పార్వతీపరమేశ్వరులు ప్రత్యక్షమయిరి. ఇతఁడు వారి తేజము చూడలేక దేవా! నిన్నుఁ జూచు శక్తి నాకిమ్మని ప్రార్థించెను; శివుఁడొసంగెను. ఇతఁడు ముందుగాఁ బార్వతిని జూచి, యామె సౌందర్యమును వర్ణించెను. పార్వతికిఁ గోపము వచ్చెను. అందువలన దముని నేత్రమొకటి పగిలిపోయెను. నన్ను క్రూరదృష్టితోఁ జూచెను. వీఁడెవఁడని పార్వతి శివునడిగెను. వీఁడు నీకుఁ బుత్త్రునివంటివాఁడు; మన భక్తుఁడు. వానిపై [illegible]మని శివుఁడామెతోఁ జెప్పెను. [illegible] దృష్టి చెడకుండ వరమిచ్చెను.

అతనికి శివుఁ డలకాపట్టణమును, ఉత్తరదిశ కాధిపత్యమును నిచ్చెను. ఇతఁడు శివునకు [illegible] శివ.

AC No. 74649

కుబేరుఁడు:- విశ్రవో బ్రహ్మ కుమారుఁడు. ఇతనితల్లి ఇలబిల. ఇతని సవతి తమ్ముఁడే రావణుఁడు. ఇతఁడు వైశ్రవణుఁడు. పులస్త్యుని కుమారుఁడు. ఇతఁడు తండ్రినిమాని తాతయగు బ్రహ్మనుగూర్చి తపస్సుచేసెను.

బ్రహ్మవలన నలకూబరుండను కొడుకును, లోకపాలకత్వంబును, ధనేశ్వరత్వంబును, శంకరునితోడి సఖ్యమును, లంకయను పురంబును వరంబులుగాఁ గైకొనియె.

పులస్త్యునకుఁ గోపమువచ్చి తన శరీరము నర్ధభాగంబున విశ్రవసుండనువానిని సృజించి వీని కహితము సేయుమనియె. కుబేరుం డిది యెఱింగి విశ్రవసుపాలికింబోయి మహాత్మా! నేను నీకుఁ గుమారుఁడ నగుదు నని వానికిఁ బరిచర్యలుచేయ నృత్యగీతాది విద్యలు నేర్చిన మువ్వుర యువతులఁ బుష్పోత్కట, మాలిని, పాక (రాక) యనువారల నొసంగెను. దాన విశ్రవసు సంప్రీతుఁడయ్యె. పుష్పోత్కట యందే రావణ కుంభకర్ణులు జన్మించిరి. కుబేరుఁడు పుష్పకము నెక్కి విహరించుచుండఁగ రావణుని తల్లి కైకసి యాపుష్పకమును గైకొనుమని తన పుత్రునితోఁ జెప్పెను. దానికంటె నెక్కువదాని నే గైకొందునని రావణుఁడు తపస్సున కేగెను. రావణుఁడు తపస్సు నుండి వచ్చినతరువాత సుమాలివచ్చి లంకలో బూర్వము మేముండువారము. మమ్ము దేవతలు వెడలఁగొట్టిరి. ఇప్పుడందుఁ గుబేరుఁ డున్నాఁడు. లంకను మరల రాక్షసులకిప్పింపుమని చెప్పెను. వెంటనే రావణుఁడు లంకను విడిచి పొమ్మని కుబేరునకుఁ దెలియఁ జేసెను. కుబేరుఁడు తండ్రితోఁ జెప్పుకొనియె; తనకు నివాసయోగ్యమైన పట్టణము చూపుమని కోరెను.

తండ్రి కైలాసమునకు వెళ్ళుమని చెప్పెను కుబేరుఁడు వెళ్ళి యచ్చట శివునితో స్నేహము చేసెను. శివుఁ డీతని కలకాపట్టణ మిచ్చెను. శివుని తొడయందుఁ బార్వతి కూర్చుని యుండఁగ, ఏమి! యాపెయదృష్టమని కుబేరుఁడు ఈర్ష్యతోఁ గుడికంటితోనీమెను జూచెను. అందువలన నాతని కన్ను పగిలిపోయెను. కుబేరుఁడు దుఃఖమునొంది తపసుచేసెను. శివుఁడు మెచ్చి యాతనికి దృష్టినిచ్చి పగిలినకంటికిఁ బింగళచి వచ్చుననియె. ఇతఁడు పింగాక్షుఁడయ్యెను.
ఉ. రా.

లంకనుండి వెళ్ళిన కొంతకాలమునకుఁ గుబేరుఁడు రావణుని చేష్టలకు లోకములు గర్హించుచున్నవనియు, వానిని మానుమనియుఁ జెప్పుటకొక దూతను బంపెను. కుబేరుఁడు నాకు నీతి బోధించునాయని యా దూతను జంపి రావణుఁడు కుబేరునితో యుద్ధముచేసి వీని పుష్పకము లాగుకొనియెను.

కుబేరునకు నలకూబరుఁడు, మణిగ్రీవుఁడు అను కుమారులు గలరు. (చూడుము త్రివక్ర)

కుబ్జ:- కంసుని దాసి. అతనికి గంధముతీసి యిచ్చుచుండునది. కృష్ణుఁడును, నుద్ధవుఁడును నీమె యింటికేగిరి. కృష్ణుఁ డీమె శరీరము తాకుటతోడనే యీమె కుబ్జత్వముపోయెను. భాగ.

కుమందాక్షుఁడు:- కద్రువ కుమారుఁడు. భార.

కుమారతీర్థము:- గంగానదిలో నొక తీర్థము. కుమారస్వామి విషయాసక్తుఁడై దేవతాస్త్రీలను గలచి పోఁగఁ బార్వతి వారి రూపములను ధరించి వచ్చెను. పార్వతియే యిట్లు వచ్చినదని కుమారస్వామి తెలిసికొని స్త్రీలందఱు తల్లితో సమానులే యని గ్రహించి యా బుద్ధి మాని యీ తీర్థములో స్నానముచేసి పుణ్యమును బొందును. కుమారస్వామి స్నానముచేసిన దగుటచే నీ పేరువచ్చెను. బ్ర. వై.

కుమారవనము:- ఒక వనము. అది మనోహరమగునట్టియు, రహస్యమైనట్టియు ప్రదేశమని పార్వతీపరమేశ్వరులచ్చటఁ గ్రీడించుచుండిరి. పార్వతి విగతవస్త్రయై యుండెను. ఆ సమయముననే కొందఱు మునులటకు వచ్చిరి. పార్వతికిఁ గ్రీడాభంగము కలిగెను. ఆమెకు మిక్కిలి కోపమువచ్చి ఆవనమునకువచ్చువారు స్త్రీలగుదురని శపించెను. ఇటకు వచ్చుటచేతనే సుద్యుమ్నుఁడును, అతని పరివారమును స్త్రీలయిరి.

కుమారస్వామి:- శివుని పుత్రుఁడు. పార్వతియు, నీశ్వరుఁడును మన్మథక్రీడ సలుపుచుండుట యింద్రుఁ డెఱిఁగి తనను మించు ప్రభావవంతుఁ

డగు పుత్త్రుఁడు వారి కుదయించునేమో యని భయపడి వారి క్రీడకు భంగము కలుగఁజేయ నిశ్చయి మకొని యెట్టులైనను వారి క్రీడ కంత రాయము కల్పించుమని యగ్నితోఁ జెప్పెను. అగ్ని క్రీడించుచున్న పార్వతీ పరమేశ్వరుల కెదురుగ వెళ్ళి నిలచెను. అగ్నిని జూచుట తోడనే శివుఁడు పార్వతినివిడిచి దూరముగఁ బోయెను. అతని వీర్యము భూమిపైఁబడెను. పార్వతి కారణము తెలిసికొనలేక నలుమూలలఁ జూచెను. దగ్గఱనే ఆమెకు నగ్ని కనఁబడియె; దుఃఖమును, గోపమునువచ్చి భార్యాభర్త లేకాంతమునఁ గ్రీడించు చుండఁగ నటకుఁ బోఁగూడదని యెఱిఁగియు నీవిటకు వచ్చితివి; నిన్ను క్షమింపరాదు. ఈ మహేశ్వరుని వీర్య మూరకపోదు. నీవు ధరింపుము అని పార్వతి శాసించెను. అగ్ని చేసినదానికి విచార మొందుచుఁ బార్వతివచన మనుల్లంఘనీయము గావున గర్భము ధరించెను. కాని యా భారము సహింపలేక యొకనాడు గంగను జూచి "గంగా! ఈ గర్భమును నేను ధరింపలేకుంటిని. ఈశ్వరునివీర్యము నీవును ధరింపవచ్చునుగదా! ఈ గర్భము నీవుధరించి నన్ను రక్షింపుము" అని వేడెను. గంగ సమ్మతించి యా గర్భము తాను ధరించెను. కొంత కాలమైన పిదప గర్భము మోయుట ఆమెకును దుర్భరమయ్యెను. కావున దానిని రెల్లుగడ్డియందు విగవిడచెను. అందుండి సూర్యరశ్మికిఁ బెరిగి బాలుఁ డుద్భవించెను. అతఁడే కుమారస్వామి. ఇతఁడు పుట్టగనే దానవులు తెల్లబోయిరి. ఈ బాలుని గృత్తికలు పెంచిరి. బ్రహ్మ.

భర్తలను గొలుచుచుండిన మునిపత్నులను జూచి యగ్ని కామపీడితుఁడై బాధపడుచు నడవి కేగెను. ఈ సంగతి యతని భార్యయగు స్వాహాదేవి యెఱిఁగి యొక్కొక్క ఋషిపత్ని వేషమున నొక్కొకమారు వచ్చి యగ్నిని జేరి వానితో రమించెను. అట్లు వసిష్ఠునిభార్యయగు నరుంధతి రూపము తప్ప తక్కిన యార్గురు మునిపత్నుల రూపములను వచ్చి రమించి యీ వీర్యమును నొక్కచోఁ బెట్టెను. అందుండియే కుమారస్వామి పుట్టెను. అతని కాఱుమొగము లేర్పడియె. త్రిపురాసురులను గొట్టిన విల్లు అచ్చట నుండఁగ దాని త్రాడును లాగి ధ్వనిచేసెను. అపుడు దిగ్గజములు రెండు వీనిపైఁబడెను; వాని రెండింటిని బట్టుకొని బాలక్రీడగఁ ద్రిప్పుచు నాడుచుండె.

కృత్తికాఖ్యలైన మునిపత్ను లారుగుర రూపంబులు గైకొని ప్రియాసంగమంబు సలిపి శ్వేతశైలంబున రేతస్కందంబు సేయుటచేఁ బ్రభవించినవాఁడు గావున నతనికి కార్తికేయుఁడు, స్కందుఁడు అను పేర్లువచ్చెను. భార.

బ్రహ్మ కుమారస్వామిని నభినందించి, సన్నిహితులై యున్న పార్వతీపరమేశ్వరులను జూపి, వీరు నీకుఁ దల్లియును, దండ్రియును నిజయోగబలంబున అగ్నిదేవునందును, వాని భార్యయందును ఆవేశించి లోకహితార్థము నిన్ను గన్నారు అని చెప్పెను. భార

అపుడు ఇంద్రుఁడు ఐరావతభూషణమైన రెండు గంటలు నితని కిచ్చెను. ఇతఁ డొకటి పుచ్చుకొని, రెండవదానిని విశాఖున కిచ్చెను.

ఇతఁడు పుట్టుటతోడనే కృత్తిక లార్వురును నా కుమారుఁడు నా కుమారుఁ డని పాలివ్వవచ్చిరి. ఇతఁ డందఱివద్దఱ పాలు త్రావుట కాఱుముఖములుదాల్చెను. మఱియు నితనిని చూచుటకై పార్వతి, శివుఁడు, దేవత లునువచ్చి బాలచేష్టల ముద్దుచే నెవరివద్దకు వచ్చునో, ఎవరి వద్దకు వచ్చునో యనిరి. ఇతఁ డందఱివద్దకు నన్నిరూపులను వచ్చెను. ఇతని ప్రభావమున కాశ్చర్యము నొంది యితనికి సేనాధిపత్యము నిచ్చిరి.

కుమారస్వామి పుట్టినపుడు లోకమంతయు సంక్షోభించెను. మునిపత్నులభార్యలకు నగ్ని వలనఁ బుట్టిన పుత్త్రుఁ డింత యనర్థము చేయుచుండెనని వదంతి పుట్టెను. మునులు వారిభార్యలను వదలివేసిరి. మునిపత్ను లితనికడకు వచ్చి తమ్ముఁ గాపాడుమనివేడిరి. వానిని కుమారుఁడు అగ్నిదైవత్యం బను నక్షత్రముగఁ జేసెను. స్వాహాదేవి మునులకడకరిగి నిజవృత్తాంత మెఱింగించి వారి మనస్సునందు శంక పోఁగొట్టెను.

మునులును, దేవతలును గుమారస్వామిదర్పంబునకు భయపడి యింద్రునిదగ్గఱకుఁ బరుగిడి దారుణ శౌర్య ధుర్యుండగు కుమారుఁడు

నీ పదమును గైకొనుటకువచ్చుచున్నాఁడు. రాక పూర్వమే వానినిజంపుమని చెప్పిరి. ఇంద్రుఁడు సప్తమాతృకలను బిలచి కుమారుని జంపి రండని పంపెను. వారు వచ్చి కుమారస్వామిని జూచి వాని తపోవిశేషమునకు భయపడి శరణుఁజొచ్చి మేము లోకమాతలము; మాయందు మాతృభావ ముంచుమని వేడుకొనిరి. వీని కుమారుఁడు బాలగ్రహంబులుగఁ జేసెను. వీరి క్రోధంబునఁ బుట్టిన లోహితాస్యయను భామిని కుమారునకు దాదియయ్యె. ఇదంతయు విని యింద్రుఁడు వీనిపైకి యుద్ధమునకు వచ్చెను; తన వజ్రమును బ్రయోగించెను. అది కుమారుని దక్షిణ పార్శ్వంబును దాకెను. దాన మేషవదనుం డైనవాఁడు విశాఖుఁ డనువాఁడు పుట్టెను. మఱియుఁ గన్యాకుమారగణంబు లనేకము పుట్టె. వీనినిజూచి భయపడి యింద్రుఁడు కుమారుని శరణువేడెను. ఇంద్రునిని జేయవలసిన పనులేమని కుమారుఁ డడిగెను. అతఁడు నీకును నాకును నెవ్వరేని వైరము కల్పింతురు. నీవు కుపితుఁడవైన నాకు శరణ్యములేదు; కావున నీవే యింద్రపదమును గైకొనుమని కుమారుని గోరెను. కుమారుఁడక్కఱలేదనియె. ఇంద్రుని కోరిక చొప్పున సేనానాయకుఁ డగుటకుమాత్ర మంగీకరించెను.

శూరపద్మాసురుఁడను రాక్షసుఁ డీతనిపైకి యుద్ధమునకు వచ్చెను; వాని నవలీలగ నితఁడు సంహరించెను. ఇంద్రుఁడీతనిని మెచ్చుకొని తన కుమారితయగు దేవసేన నిచ్చి వివాహము చేసెను. స్కాంద.

కుమారస్వామినిజూచుటకుబ్రహ్మవచ్చెను. ప్రణవముయొక్క యర్థమేమి? మని కుమారుఁడు బ్రహ్మనడిగెను. నేనే ప్రణవమును, నేనే ప్రణవార్థమును అని బ్రహ్మ చెప్పగ వీనికిఁ గోపము వచ్చి బ్రహ్మను బంధించెను. ఇంద్రాదులు శివునితోఁ జెప్పుకొనిరి. బ్రహ్మను విడువుమని శివుఁడు నందీశ్వరునిచేఁ గబురుపంపి తానుగూడ వచ్చి కుమారునకుఁ జెప్పెను. అప్పు డితఁడు విడిచెను. భూలోకమున శివభక్తి వ్యాపకము చేయుటకై భూమియందుఁ బుట్టుమని శివుఁ డనియె. ఇతఁడు చెన్నబసవడుగఁబుట్టెను. చె. బ.

కుమారస్వామి విషయాసక్తుఁడై దేవతా కామినులను వలచెను. పార్వతి వారిరూపములు ధరించివచ్చె. పార్వతియే యిట్లు వచ్చెనని కుమారుఁడు తెలిసికొని, స్త్రీలందఱు తల్లితో సమానులని గ్రహించి యావాంఛ మాని పుణ్యమును బొందెను. బ్రహ్మ.

తారకాసురుఁడు లోకము లన్నిఁటిని క్షోభింపఁ జేయుచుండెను. అతఁడు బ్రహ్మను బ్రార్థించి వరముగొన్న బలాఢ్యుఁ డగుటచే నింద్రాదిదేవతలుకూడ వానికి గజగజ వడకుచుండిరి. బ్రహ్మయు వారికెట్టి సహాయమును చేయలేకపోయెను. శివుని కుమారుఁడుతప్ప యన్యులు వానిని జయింపలేరని చెప్పుటచేఁ కుమారోద్భవమునకై దేవతలు వేచియుండిరి. కుమారస్వామినే దేవతలు సేనాధిపతిగఁ జేసికొనిరి. తారకాసురునితో యుద్ధమున కితనిని బంపిరి. మహాఘోర యుద్ధము జరిగెను. రాక్షసులు హతులైరి. తారకాసురుఁడుకూడ కుమారస్వామి వలనఁ జచ్చెను. శివ.

మహిషాసురుఁడు,అంధకాసురుఁడు మొదలగు రాక్షసులు దేవతలను బాధించుచుఁ గ్రౌంచ పర్వతమున దాగియుండిరి. క్రౌంచపర్వతము రాక్షసులకు ముఖ్యస్థానమయ్యెను. కావున కుమారుఁడు క్రౌంచపర్వతమును భేదించెను. ఇతఁడు మహిషాసురునిగూడ సంహరించెను. వామ.

కుమారిక :-భీమసేనుని భార్య, ప్రతిశ్రవసుని తల్లి. భార.

కుమారీ (శంఖమువలె) :-ఒక కన్యకను పెండ్లివారు చూడవచ్చిరి. అప్పుడు ఇంట్లో బియ్యము లేవు. ఆకన్య దంచుకొనవలసి వచ్చెను. దంపుచుండగ చేతిగాజులు చప్పుడగుచుండెను. వచ్చినవారు అది వినిన సిగ్గుచేటు. కాబట్టి ఆకన్య చేతిగాజులు ఒక్కొక్కటే తీసివేసెను. రెండున్నను అవి చప్పుడు చేసెను. అపుడు ఒక్కొక్కటే ఉంచుకొనెను. అపుడు చప్పుడు లేదు. అట్లు ఏకాకిగనుండినయెడల పరసంభాషణము లేకుండును.

కుముదుఁడు :-పథ్యుని శిష్యుఁడు. అథర్వవేదము పఠించెను. భాగ.

కుముదుఁడు:-ఒక నాగరాజు. తక్షకునకు ఆయిదవ తరమువాఁడు. సరయూనదిక్రిందనుండువాఁడు.

శ్రీరాముని కుమారుఁడైన కుశుఁడు అంగనా సహితుఁడుగ ఆనదిలో జలకము లాడుచుండఁగ, అతని భుజమునుండిఁ తనతండ్రి ఇచ్చిన) యాభరణము జారిపడెను. దీని నాకుముదుని చెలియలు కుముద్వతి తీసికొనిపోయెను. కుముదుఁ డాఁగ నపహరించి యుండునని కుశుఁడు తెలిసికొని గారుడాస్త్రము సంధించెను. అంతఁ గుముదుఁడు వచ్చి కుశునకు ఆభరణమిచ్చి ఆ కుముద్వతి నిచ్చి వివాహము చేసెను. రఘు.

కుముద్వతి:- నిషాదదేశాధీశ్వరుఁడైన దాశరాజు భార్య. బ్రహ్మాం. స్కా.

కుముద్వతి:- కుముదుఁ డను నాగరాజు చెలియలు. సరయూనది క్రింద వీరి నివాసము. ఈమె బంతి నెగురవేసి పట్టుకొనుచు నాడుకొనుచుండెను. బంతికై చేయిపైకెత్తగ సరయూనదిలో స్నానముచేయుచుండిన కుశమహారాజు బాహువలయము (అగస్త్యునిచే శ్రీరామున కొసఁగబడి యాతఁడు కుశునకిచ్చినది) జారి యీమె చేతులలోఁ బడెను. కుశుఁడు దానికై వెదకించెను గాని కనఁబడలేదు. కుముదుఁ డపహరించి యుండునని తెలిసికొని గారుడాస్త్రము సంధించెను. కుముదుఁ డాతని కీ యాభరణమిచ్చి ఈమెనిచ్చి వివాహము చేసెను. ఈమెయందుఁ గుశున కతిథి అను కుమారుఁడు కలిగెను. వీనికే పట్టముకట్టెను. ఈమె భర్తతో సహగమనము చేసెను.

కురుక్షేత్రము:- పాండవులును, కౌరవులును యుద్ధముచేసిన ప్రదేశము. పూర్వ మచ్చటనే పరశురాముఁడు శత్రువులనుజంపి వారి రక్తముతో మడుగులు నింపెను. అపుడు దానికి శమంతపంచకమని పేరు. మను వచ్చట సత్త్రయాగము చేయుటచేఁ గూడ నది పవిత్రమయ్యెను. మఱియుఁ గురుడను రాజు దానిని దున్నించెను. అందువలననే కురుక్షేత్రమని పేరువచ్చెను. భార.

కురుక్షేత్రము:- కురుఁ డను రాజు దానిని దున్నుటచే ఆ పేరు కలిగెను. అందుఁబుట్టిన జనులెల్ల స్వర్గమును జేరగలరని కోరి యతఁడు దున్నుచుండఁగ నింద్రుఁడు వచ్చెను. ఏల దున్నెదవని యడుగ నతఁడు చెప్పెను గాని యింద్రుఁడు గేలిచేసెను. అయినను మానక దున్నుచుండెను. అతఁడు పలుమారువచ్చి యుల్లసము చేయుచుండినను విడువక దున్నుచుండుటచే మెచ్చుకొని యింద్రుఁడు వచ్చి అచ్చట నిరాహారులై శరీరము విడుచువారును, యుద్ధమున మృతినొందువారును స్వర్గమున కేఁగునట్లు వరమిచ్చెను. పూర్వము విష్ణు వటఁ దపస్సుచేసెను. శాండిల్యాదులు యోగసిద్ధి పొందిరి. భార.

కురుఁడు:- సంవరణునకుఁ బుత్త్రుఁడు. ఇతఁడు యాగమునకై దున్నించిన క్షేత్రమున కితని పేరునుబట్టియే కురుక్షేత్రమని పేరువచ్చెను. ఇతని భార్య శుభాంగి. విదూరథుఁ డితని తనయుఁడు. భార.

పరీక్షిత్తు, సుధనువు, జహ్నువు, నిషధుఁడు అను నలువురు కురుని కుమారులు. భాగ.

కురుఁడు:- తపతియను సూర్యకన్యయందుఁ గల్గిన పుత్త్రుఁడు. ఇతని వంశమువారే కౌరవులు (పాండవులును).

కురుఁడు:- ఆగ్నీధ్రుని కుమారుఁడు. ఇతని పేరటనే కురువర్షము పరగుచున్నది. విష్ణు.

కురుధాముఁడు:- దుష్యంతుని కుమారుఁడు.

కులశేఖరుఁడు:- మధురానగరమును నిర్మించిన రాజు. ఇతని కుమారుఁడు మలయధ్వజుఁడు. స్కాంద.

కులిందకుఁడు:- చందనావతీనగరాధీశుఁడు. ఇతనికి సంతానములేదు. ఒకనాఁడు వేటకై యరణ్యమునకేగి యటవ్రేలు తెగగొట్టబడి యేడ్చుచుండిన బాలునిజూచి వానింగొనివచ్చి పెంచి చంద్రహాసుఁడను పేరుపెట్టెను. జై. భా.

కువలయాపీడనము:- కంసుని యేనుఁగు. కంసుని జూచుటకు వచ్చుచుండిన కృష్ణుని మీఁదకు నాయేనుఁగును మావటీడుతోలెను. కృష్ణుని కటులైన సంహరించు నుద్దేశముతోడనే యాయేనుఁగటులఁదోలింపఁబడియె. కాని కృష్ణుఁ డీయేనుఁగును, మావటీనిని గూడ సంహరించెను. భాగ.

కువలయాశ్వుఁడు:- శత్రుజిత్తుకుమారుఁడు. ఇతని పేరు ఋతధ్వజుఁడు. గాలవుఁడను ముని కువలయాశ్వము నితని కిచ్చెను గాన దానినిబట్టి ఋతధ్వజున కీ పేరు వచ్చెను. అశ్వతరుఁడను నాగ

ద్రుని పుత్త్రులితని స్నేహితులు. గాలవుఁడు తపము చేసికొనుచుండఁగఁ దనుజుఁ డొకఁడు వివిధరూపములవచ్చి తపోభంగము కావించుచుండువాఁడు. రాక్షసుని శపించినయెడలఁ దపోవ్యయమగునని తలఁచి యాకసమువంకఁ జూచుచుండఁగ నాకాశవాణి యశ్వమును బంపి దానిని శత్రుజిత్తుకుమారున కిమ్మని చెప్పెను. గర్గు డశ్వమును దెచ్చియిచ్చె; రాక్షసుని సంహరింపుమని రాజపుత్త్రుని గోరెను. ఆ గుఱ్ఱమునే వాహనముగఁ జేసికొని కువలయాశ్వుఁడు రాక్షసుని వెంటఁ దఱుముకొని వెళ్ళెను. ఆ దనుజుఁడు వరాహరూపమై భూమియం దొక బొరియలో దూరెను. కువలయాశ్వుఁడును నందుఁ బ్రవేశించెను. అచ్చట లావణ్యవతులిరువురు కాన్పించిరి. వారిని జూచి యితఁడు విభ్రమము నొందెను. అందు 'కుండల' యనునది తాను పుష్కరమాలియొక్క భార్యననియును దన చెలియలు మదాలస పాతాళకేతుఁడను దనుజునిచే బలాత్కారముగఁ దేబడి యచ్చట దాచఁబడెననియును, దన్నును రక్షించి మదాలసను బరిగ్రహింపుమనియును జెప్పెను. మదాలసయు నాతని మోహించెను. కువలయాశ్వుఁడు పాతాళకేతుని సంహరించి మదాలసను వెంటఁబెట్టుకొని నిజనగరమునకు వచ్చెను.

పాతాళకేతుని సంహరించెను గాన నతని సోదరుఁడు తాళకేతుఁడు క్రోధము కలిగి కువలయాశ్వు నెట్టైనను వంచన చేయవలయునని తలఁచుచుండెను. ఒకనాఁడు కువలయాశ్వుఁడు జనపదములను రక్షించుటకు గుఱ్ఱమెక్కి తిరుగుచుండెను. తాళకేతుఁడు మునిరూపముగ వచ్చి తాను జేయఁబోవుచుండిన క్రతువునకు సహాయముగ రాజు కంఠమందున్న హారమిమ్మని వేఁడెను. కువలయాశ్వుఁడు వానిని నమ్మి యిచ్చెను. తాను స్నానము చేసి వచ్చెదననియు, నంతవఱకును దన యాశ్రమముకడ నుండవలసినదనియును గపటముని చెప్పి రాజును గూర్చుండఁజేసి తాను రాక్షస మాయాబలమున నిమిషములోఁ గువలయాశ్వుని నగరము చేరి రాజు హతుఁడయ్యెనని చెప్పి యందు కానవాలుగ రాజు కంఠమందుండెడు హారమును వారికిచ్చెను. ఆమాటలు విని మదాలస ప్రాణములు విడిచెను. నగరమంతయు శోకములో మునింగె. అచిరకాలములోనే కువలయాశ్వుఁడు తన నగరము చేరెను. 'ఇతనిని జూచి ప్రజలు విస్మయమును, సంతోషమును బొందిరి. అతని వృత్తాంతము విని రాక్షసుఁడు చేసిన మాయను దెలిసికొనిరి. కాని మదాలస నెడఁబాసినందుకు రాజు దుఃఖము నొందుచు రాజ్యమైన నొల్లక విరాగియై యుండెను. ఈ మాట యతని స్నేహితులు నాగకుమారులు తమ తండ్రి కెఱింగించిరి. యత్నముచే సిద్ధింపని దేదియు లేదని చెప్పి నాగరాజు సరస్వతినిగూర్చి ప్రార్థించి గానము నేర్చుకొని, ఆ గానముచే శివుని మెప్పించి మదాలస మఱల బ్రతుకునట్లు వరము పొందెను. మదాలస అశ్వతరుని కుమార్తెగఁ బుట్టెను. అశ్వతరుఁడు కువలయాశ్వుని రావించి మదాలసను నతనికిచ్చెను. విక్రాంతుఁడు, సుబాహువు, శత్రుమర్దనుఁడు, అలర్కుఁడు కువలయాశ్వుని కుమారులు. మార్క.

కువలయాశ్వుఁడు:-కువలాశ్వుఁడు. మార్క.

కువలాశ్వుఁడు:- బృహదశ్వుని కుమారుఁడు. ఇతఁడే దుంధుమారుఁడు. (చూడుము. దుంధుమారుఁడు.)

కుశధ్వజుఁడు:-వేదవతి తండ్రి. ఉ. రా.

కుశధ్వజుఁడు:-జనకుని తమ్ముఁడు. హ్రస్వరోముని కుమారుఁడు. జనకుఁడు సుధన్వుని సంహరించి యా రాజ్యము నీతని కిచ్చెను. ఇతని పుత్త్రిక ఊర్మిళ. ఈమెను లక్ష్మణునకిచ్చి వివాహము చేసెను. రామా.

కుశధ్వజుఁడు:-హంసధ్వజుని కుమారుఁడు. ధర్మధ్వజుఁ డితని సోదరుఁడు. కుశధ్వజుని భార్య మాలావతి. వేదవతి యితని కుమార్తెయే. బ్ర. వై.

కుశనాభుఁడు:-కుశుని కుమారుఁడు ఇతఁడు మహోదయమను రాజ్యమున కధిపతియయ్యెను. కుశనాభునకు ఘృతాచివలన నూర్గురు కూఁతులు కలిగిరి. వీరు వనములో సంచరించుచుండఁగ వాయుదేవుఁడు చూచి కామించి మీరు నన్నుఁ బెండ్లియాడుడని కోరెను. మా తండ్రి యెవ్వరికిచ్చునో వానినే చేసికొనెదమని వారు ప్రత్యుత్తరమిచ్చిరి. కుశనాభుఁడు వీరినందఱను బ్రహ్మదత్తున కిచ్చి వివాహము చేసి తీసికొని వెళ్ళుచుండగఁ గుశుఁడు కనఁబడి కుమారుఁడా! నీవు

యజ్ఞము చేయుము. గాధియను కుమారుఁడు పుట్టునని చెప్పి వానిచే యజ్ఞము చేయించెను. కుశనాభునకు గాధి జన్మించెను. రామా.

కుశలవులు:- శ్రీరాముని పుత్త్రులు. మహారాజ పుత్త్రులైనను నరణ్యములోనే జన్మించిరి. గర్భిణిగ నున్న సీతను లక్ష్మణుఁ డరణ్యములో విడచి వచ్చెను. ఆమెను వాల్మీకి తన యాశ్రమమునఁ గాపాడుచుండెను. సీత యచ్చటనే ప్రసవించెను. వాల్మీకి కుశసంఘము చేతను, లవజలంబుచేతను మంత్రించి యా జలముచే శిశువులను మార్జనము చేయించుమని యిచ్చెను. కుశమార్జితుఁ డగువానికిఁ గుశుఁడు అనియు, లవజలములచే మార్జితుఁ డగువానికి లవుఁడు అనియు వాల్మీకియే నామకరణము చేసెను. తానే వానిఁ బెంచి విద్యావంతులను జేసెను. వారితండ్రి శ్రీరాముఁడని వాల్మీకిచేఁ జెప్పఁబడిరి గాని వానిని జూచి యుండలేరు.

రాముఁడు చేయుచున్న యశ్వమేధ యాగమునకు వాల్మీకి కుశలవులను గూడఁ దీసికొనివెళ్ళెను. వీరిచే నచట రామాయణమును గానము చేయించెను. వీరు రూపమున జానకిని బోలియుండిరి. వీరిని జూచియు, జానకికిఁ గవలుద్భవించిరని వినియుండుటచేతను వీరు తన పుత్త్రులే యగుదురని యనుమానించుచు సీతను దలఁచుకొని రాముఁడు దుఃఖింప నారంభించెను. అప్పుడు వాల్మీకి వీరి వృత్తాంతమెఱింగించెను. రాముఁడు వీరలకు బట్టముగట్టి చనియెను. కుశుఁడు సరయూనదిలో స్నానము చేయుచుండఁగ బాహువలయము నదిలోఁబడెను; వెదకిరిగాని కనఁబడలేదు. కుముదుఁడను సర్పరాజు దాని నెత్తుకొనిపోయి యుండునని చెప్పిరి. వానిని జంపుటకుఁ గుశుఁడు గారుడాస్త్రము నెత్తెను. కుముదుఁడు భయపడి వలయమును, తన కుముద్వతియను చెలియలను గుశున కిచ్చెను. ఆమెవలన అతిథి యను కుమారుఁడు పుట్టెను. రామా.

కుశస్థలి:-(కుశావతి) శ్రీరాముని తనయుఁడగు కుశుఁడు నిర్మించిన పట్టణము. జరాసంధుఁడు మధురానగరమును గాల్చిన పిమ్మటఁ గృష్ణుఁడీ నగరమునఁ గాపురముండెను.

కుశస్థలి:-ఆనర్తుని కుమారుఁడైన రైవతుఁడు సముద్రములో నిర్మించిన పట్టణము. భాగ.

కుశాంబుడు:- పూరుని వంశములోనివాఁడైన అజకుని పుత్త్రుఁడగు కుశుని కుమారుఁడు. ఇతని కుమారుఁడు గాధి. ఇతఁడు కౌశంబిపట్టణమునకు రాజయ్యెను. భాగ.

కుశాశ్వుఁడు:- ఇక్ష్వాకువంశమువాఁడైన సహదేవుని పుత్త్రుఁడు. విశాలదేశమురాజు. ఇతని పుత్త్రుఁడు సోమదత్తుఁడు. రామా.

కుశికుఁడు:-ఒకరాజు. ఇతని వంశములో భృగు వంశము కలయునని చ్యవనుఁడు విని యట్లు కలయుట కిచ్ఛగింపక పోవుటచే నెటులైనను గుశికవంశము నిర్మూలము చేయదలఁచుకొని కుశికుని భవనమునకువచ్చెను. ఈమునికిఁ గుశికుఁడును, నతని భార్యయును బరిచర్యలు చేయుచుండిరి. అతఁ డంతఃపురములో శయనించి యుండఁగ వానికిఁ బాదము లొత్తుచుండిరి. అతఁడు భవనము విడచి వెళ్ళఁగ వారతని వెంబడించిరి. అతఁ డదృశ్యుఁడయ్యెను. కుశికుఁడును, భార్యయును గృహమునకు మరలివచ్చునప్పటికిఁ జ్యవనుఁడు యథాప్రకారం శయనించి యుండెను. వాని కాదంపతులు మరల పాదము లొత్తుచుండిరి. ముని కోరికప్రకార మాతనికి భోజనము పెట్టిరి. వానిని రథమునఁ గూర్చుండఁ బెట్టి తామే రథమును లాగిరి. అపుడు చ్యవనుఁడు వారిని గోలతోఁ గొట్టుచు బాధపెట్టుచుండెను. కుశికుని శపించి వానివంశము నిర్మూలము చేయుట కవకాశమునకై చూచుచుండెను. కాని యెంత బాధపెట్టినను గుశికుఁడును, వాని భార్యయు సైచియుండిరి. తుదకుఁ జ్యవనుఁడు వీరి పరిచర్యలకు మెచ్చుకొని కుశికునకు వరమిచ్చెను.

కుశికుఁడు:-జహ్నుని మనుమఁడగు పల్లవుని కుమారుఁడు. ఇతఁడింద్రుని మెప్పించి గొప్పవాఁడగు పుత్త్రుని బడయవేడెను. ఇతని పుత్త్రుఁడే గాధి. భార.

ఇతని వంశమున బ్రహ్మతేజస్సు కలవాఁడు జన్మించుననియుఁ జ్యవనుఁడు చెప్పెను. ఇతని వంశమువాఁడే విశ్వామిత్త్రుఁడు ఇతని కుమారుఁడు కుశనాభుఁడు. కుశనాభుఁడు తనకుమార్తెలను వివాహముచేసి తీసికొని వెళ్ళుచుండఁగ వానితో యజ్ఞము చేయుమనియు, నతనికిఁ గుమా

రుఁడు పుట్టునని యనుచు జెప్పెను. కుశకుని కుమారుఁడే గాధి.

కుశుఁడు:- క్షత్త్రవృద్ధుని రెండవ కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు ప్రీతియనువాఁడు ప్రీతికుమారుఁడు సంజయుఁడు. భాగ.

కుశుఁడు:-పూరుని మనుమఁడగు అజుని కుమారుఁడు. భాగ.

కుశుఁడు:-సుహోత్రుని కుమారుఁడు. గృత్సమదుని సోదరుఁడు. భాగ.

కుశుఁడు:-ఒకముని. వసువు, అమూర్తరజసుఁడు, కుశాంబుఁడు, కుశనాభుఁడు నితనికుమారులు. రామా.

కుశుఁడు:-కుశుని పేరననే కుశావతి (కుశస్థలి) అను పట్టణము నిర్మింపఁబడెను. దాని నితఁడు పాలించుచుండెను. రాముఁడు చనినపిమ్మట అయోధ్యానగరము పాడుపడి యున్నదనియు, నచటకువచ్చి పాలింపుమనియు, ఆ నగరదేవత రూపుదాల్చి కుశునిమందిరముఁజొచ్చి యతనికిఁ గానంబడి చెప్పి చనియె. ఇతఁడంతట నయోధ్య కేతెంచెను. ఇతఁడు అర్థశాస్త్రవేత్తలలో అగ్రగణ్యుఁడు. కుశుఁడు ఇంద్రునకు సహాయముగా దుర్జయుఁడను రాక్షసునిపై యుద్ధమున కేఁగి, వానిని జంపి తాను వానిచేత నిహతుఁడై మరణించెను. రఘు.

కుసుమశ్రేష్ఠి:-కన్యకాంబతండ్రి. ఇతఁడు తన గృహమునకు విష్ణువర్ధనుఁడను రాజును దీసికొని వచ్చి సత్కరించెను. అతఁడు శ్రేష్ఠికూఁతురు కన్యకాంబను జూచి, మోహించి యామెను దనకిమ్మనికోరెను. అది తగదని కుసుమశ్రేష్ఠి చెప్పఁగ రాక్షసవివాహమున నామెను గైకొందు నని రాజనియె. దాన భయపడి శ్రేష్ఠి తన కుమార్తె నిచ్చుట కంగీకరించెను కాని పెద్దల నాలోచన యడిగి రాజునకుఁ దన కుమార్తె నివ్వనని వర్తమానము చేసెను. రాజు యుద్ధసన్నద్ధుఁడై రాకపూర్వమే చితిపేర్చి యందు దనకూఁతును, కుమారుని, భార్యను ప్రవేశపెట్టి తానును జితినెక్కెను.

ఇతఁడు పూర్వభవమున నలకూబరుఁడు. శతజిహ్వుఁడను రాక్షసుఁడు యజ్ఞములు పాడుచేయుచున్నందున బ్రహ్మ నలకూబరునియొద్దకు వచ్చి రాక్షసునితో యుద్ధముచేసి వానిని సంహరింపుమనియె. నలకూబరుఁడు నేను వానితో యుద్ధము చేయఁజాలననియెను. కుబేరుని కుమారుఁడవై యుండియు నిట్లు భయపడితివి గావున వైశ్యుఁడవై పుట్టుమని బ్రహ్మ శపించెను. కన్య.

కూ

కూర్మావతారము:- దేవతలును, దానవులును గలసి మంథరపర్వతమును గవ్వముచేసి వాసుకిని త్రాడుచేసి సముద్రమును మథించుచుండిరి. కొంతయైనపిమ్మటఁ బర్వతము సముద్రములోఁ గూరెను. అపుడు దేవతలు విష్ణుమూర్తిని ప్రార్థింపఁగ నతఁడుకూర్మంబై మంథరపర్వతముయొక్క యడుగునఁజేరి దానిని లేవనెత్తెను. భాగ.

కృ

కృతకృత్యుఁడు:- త్రికకుత్తుని కుమారుఁడు.

కృతద్యుతి:- చిత్రకేతువను రాజుయొక్క పెద్ద భార్య. ఈమెకు జాలకాలము సంతానములేక యుండెను. చిత్రకేతువు పుత్త్రకామేష్టిచేసి యజ్ఞశేషమీమె కిచ్చెను. దానిచే నీమెకుఁ బుత్త్రుఁడుకలిగెను. అందువలన భర్త యీమెపై నధికప్రేమకలిగి యుండెను. సవతులు దానిని సహింపఁజాలక యీమె కుమారునకు విషము పెట్టి చంపిరి. భాగ.

కృతవర్మ:-హృదికుని తనయుఁడు. దేవమీఢుని తమ్ముఁడు. భోజదేశమున కధిపతి. ఇతఁడు దుర్యోధనునకు మిత్త్రుఁడు. యుద్ధమందాతని

పక్షమునఁ బోరెను; ఇతర వీరులతోఁ గలసి యభిమన్యునితో యుద్ధముచేసెనుగాని యితఁడు ప్రత్యేకముగఁ బాండవవీరులతోఁ బోరినట్లు కనఁబడదు. మడుగునదాగియుండిన దుర్యోధనుని జూచుటకితఁడును వెళ్ళి వాని నోదార్చెను. నిశయందుఁ బాండవేయుల సంహరించెద నని యశ్వత్థామ వీనితోడను జెప్పెను.

కృతవీర్యుఁడు:–ధనకుని పుత్త్రుఁడు. కార్తవీర్యార్జునుని తండ్రి. ఇతని కుమార్తెయగు భానుమతిని సహంయాతి వివాహమయ్యెను. భార.

కృతాయువు:–అరిష్టనేమి పుత్త్రుడు.

కృతాశ్వుఁడు:–(కృశాశ్వుఁడు) బర్హిణాశ్వుని కుమారుఁడు. యువనాశ్వుని తండ్రి. తాత భాగ

కృతి:–సన్నతిమంతునికుమారుఁడు; హిరణ్యనాభుని వలన యోగమార్గ మెఱింగి శోకమును విడచి తూర్పుదేశమున నివాసముచేయుచుండెను. ఇతఁ డచ్చట సామసంహిత పఠించెను. పు. నా.

కృతి:–చ్యవనుని పుత్త్రుడు.

కృతి:–బహుళాశ్వుని పుత్త్రుడు.

కృతిమంతుఁడు:–యవీనరుని కుమారుఁడు.

కృత్తిక:–ఒక నక్షత్రము. (చూడుము అగ్నిదైవత్యము.)

కృత్తివాసేశ్వరుఁడు:–కాశియం దొక శివలింగము. కాశికివచ్చు భక్తులను రాక్షసుఁ డొకఁడు గజరూపమున బాధించుచుండెను. శివుఁడు వానిని జంపి వానిచర్మమును ధరించెను. అందువలన శివుని కాపేరు వచ్చెను. లింగ.

కృత్స్నమదుఁడు:–సుహోత్రుని పుత్త్రుఁడు; శునకుని తండ్రి.

కృధుఁడు:–సదస్యుని తనయుఁడు.

కృపావతి:–ఒక గొరువంక కుక్కలచేతఁ దఱుమఁబడి క్రిందఁబడెను. దానిని సురథుఁడను రాజర్షి తీసి కాపాడెను. అతని యంగయష్టి వలనఁ గుమారిక జన్మించె. ఆమెకు 'కృపావతి' యని సురథుఁడు పేరుపెట్టెను. ఈమె చెలికత్తెను గూడి వసిష్ఠు నాశ్రమము కడ నాడుకొనుచుండ వీరి యల్లరికిఁ గోపమువచ్చి వసిష్ఠుఁ డీమెను వైశ్యబాలికవై జన్మింపు మని శపించెను. శాపవిమోచనమునకై ఈమె మునిని వేఁడుకొనఁగ నీకుఁ గుమారుఁడు పుట్టి యతఁడు యుద్ధము చేసిన తరువాత నీ వైశ్యత్వముపోవునని చెప్పెను. ఈమెయే సుప్రభయై జన్మించెను. మార్క.

కృపి:–కృపాచార్యుని చెలియలు. శరద్వంతుని (సత్యధృతి) కుమారిత. శరద్వంతుని తపస్సు భంగము చేయుటకై యింద్రుఁ డొక యప్సరసను బంపెను. ఆమెను జూచి ముని మోహపరవశుఁ డయ్యెను. అతనికి రేతఃపతన మయ్యెను. అంత నతఁ డాచోటు విడిచివెళ్ళెను. ఆ వీర్యము శరస్తంభమున ద్వివిధంబుగఁ బడి పెరిగెను. అందుండియే కృపుఁడును, కృపియును బుట్టిరి. అచ్చటకు వేఁటకై వచ్చిన శంతనుఁడు వీరినిజూచి కృపాయత్తచిత్తుఁడై వీరిని దీసి పెంచెను. ఆ కారణము వలననే వీరి కా నామములు కలిగెను. ఈమెను ద్రోణునకిచ్చి వివాహము చేసిరి. ఈమె కుమారుఁ డశ్వత్థామ. భార.

కృపుఁడు:–సుచ్ఛాయాశిష్టులకుమారుఁడు. మత్స్య.

కృపుఁడు:–శరద్వంతుని (సత్యధృతి) కుమారుఁడు. శరద్వంతుఁ డను ముని ధనుర్వేదమును బడసి తపస్సుచేసికొనుచుండఁగ నింద్రుఁడు వాని తపస్సునకు వెఱచి తపోభంగము చేయుటకై యొక యప్సరసను పంపెను. ఆమెను జూచి ముని కామపరవశుఁ డయ్యె; మఱియును రేతఃపతనమును గలిగెను. అతఁ డాచోటు విడిచి మఱియొక చోటునకుఁ బోయెను. అతని వీర్యము శరస్తంభమున ద్వివిధం బయి పడెను. అందొక కొడుకును, కూఁతురును బుట్టిరి. వేఁటకై వచ్చిన శంతనుఁడు వీరిని జూచి కృపాయత్తచిత్తుఁడై వీరినిదీసి పెంచెను. ఆ కారణముననే వీరికి కృపుఁడు. కృపి యను పేరులు వచ్చెను. పిమ్మట శరద్వంతుఁడు శంతనునికడకు వచ్చి వారు తన సంతానమని యెఱింగించి, కృపున కుపనయనము గావించి

వానికి ధనుర్వేదమును నేర్పెను. కృపుఁ డస్త్రవిద్యావిశారదుఁ డయ్యెను. భీష్ముఁడు కృపుని రావించి ధర్మజాదులకు విలువిద్య వీనిచే నేర్పించెను.

పాండవులకుఁ గౌరవులుచేసిన యపకృతి నితఁడు సహించలేఁడు. సమయము వచ్చినపుడు దుర్యోధనుఁడు చేసినది నీతిగాదని చెప్పువాఁడు. అదియును భీష్ముఁడు చెప్పినపుడే యితఁడును జెప్పెను. గాని ధైర్యముచేసి పలుకువాఁడు గాఁడు. తన యేలికలైన భీష్మ ధృతరాష్ట్ర దుర్యోధనులతో నుండి వారి యన్నమును దినుచుండెను గాన ప్రభుభక్తిని మాత్రమే తలఁచి న్యాయాన్యాయములు ఏమాత్రము విచారింపక కౌరవులకుఁ బాండవులను బరిమార్చుట కాలోచనలు చెప్పెను. అజ్ఞాతవాసముల నున్న పాండవుల నెఱుఁగుట ముఖ్యమని యితఁడే యాలోచన చెప్పెను. గోగ్రహణమునకు నితఁడును వెళ్ళెను గాని యర్జునునిచే నోటుపడి యతని శక్తిని మెచ్చుకొనియె.

భారతయుద్ధమందు భీష్ముఁడు దుర్యోధనుని పక్షము చేరినట్లే యితఁడును జేరి శక్తి వంచనలేక యుద్ధముచేసి చేకితాన సుకేతాదులతోఁ బోరెను. తమశక్తిని బొగడుచు వీరములు పలుకుచుండిన కర్ణు నాక్షేపణచేసి పాండవ బలము దుర్యోధనున కితఁ డెఱింగించెను. కర్ణుఁడు కూడఁ దెగినపిమ్మట నింకనైన యుద్ధము మాని పాండవులతోఁ బొత్తుచేసికొనుమని కృపుఁడు చెప్పెను. గాని దుర్యోధనుఁడు వినలేదు. రణరంగమం దోడి దుర్యోధనుఁడు జలాశయమున దాఁగఁగఁ గృపుఁడును మిక్కిలి విచారము నొంది దుర్యోధనునకు మనశ్శాంతి కలుగునట్లు సంభాషించెను. వానికిఁ బ్రీతి సేయుటకై యశ్వత్థామ పాండవులను 'నిశి యందుఁ జంపుదు'నని తెల్ప నది పాడిగాదని కృపుఁడు చెప్పెను గాని యతఁడు వినలేదు. తుదకుఁ గృపుఁడు ధృతరాష్ట్రు నొద్దకుఁ బోయి యాతని నోదార్చుచు నతఁడు తపోవనమున కేగఁగ వాని వెంట నరిగెను. భార.

రాఁబోవు సూర్యసావర్ణిక మన్వంతరములో సప్తఋషులలో నితఁ డొకఁడగును.

కృశాశ్వుఁడు:- విశ్వామిత్రుని యస్త్రగురువు. భాగ.

కృశాశ్వుఁడు:- సహదేవుని కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు సోమదత్తుఁడు. భాగ.

కృశుఁడు:-ఒకముని. శమీకునిమెడపై సర్పశవమును పరీక్షిత్తు వేసెనని యితఁడే శమీకుని పుత్త్రుఁడగు శృంగితోఁ జెప్పెను. భార.

కృష్ణ:-పరావసుని భార్య. రైభ్యుని కోడలు. రైభ్యునియొద్దఁ జదువవచ్చిన యవక్రీతుఁడీమెను గామించెను. తిరస్కరించుచో నతఁడు శపించు నేమోయని భయపడి వానితో సరేయని, ఈమె యవక్రీతుని చేష్టలు రైభ్యున కెఱింగించెను. అతఁ డవక్రీతుని జంపించెను. భార.

కృష్ణ:-ద్రౌపది. (చూడుము ద్రౌపది.)

కృష్ణద్వైపాయనుఁడు:-ఆదియుగమందలి బ్రహ్మఋషి. ఇతఁడే వ్యాసుడు. యమునానదియందు నావ దాటించు సత్యవతియను కన్యయందుఁ బరాశరునివలనఁ బుట్టిన పుత్త్రుఁడు. ఇతడు పుట్టఁగనే కపిలజటలతోడను, దండ కమండలముల తోడను నొప్పారుచుఁ దల్లిముందరనిలచి తల్లీ! నీపనిగలయప్పుడు నన్నుఁ దలఁచుమనది; నేను వచ్చెదనని చెప్పి వనమునకేగి తపస్సుచేసికొనియె.

సత్యవతి కుమారులు చిత్రాంగద, విచిత్రవీర్యు లపుత్త్రకులైచనిపోవుటచే శంతను వంశము నిలుపఁబెట్టుటకై విచిత్రవీర్యుని భార్యలగు నంబిక యంబాలికలయందుఁ బుత్త్రులఁ బడయుటకై సత్యవతి కృష్ణద్వైపాయనుని దలఁచెను. ఇతనివలన నంబిక యంబాలికలయందు ధృతరాష్ట్రుఁ పాండురాజులు జన్మించిరి. అప్పటి నుండియుఁ గృష్ణద్వైపాయనుఁడు వీరియంచి పెద్దల నారయుచుండువాఁడు. గాంధారి గర్భవతి యగునట్లు వరమిచ్చెను. ఆమె యొకసంవత్సరము గర్భము ధరించి గర్భతాడనము గావించుకొనఁగ నీతఁడేగి యాపైఁబడిన మాంసపుముద్దను నూఱు తును

కలు చేయించి నూర్గురు పుత్త్రులను, నొక పుత్త్రికయుఁ బుట్టుదురని చెప్పి వారిని రక్షించు మార్గము నెఱుకపఱచెను.

అట్లు కృష్ణద్వైపాయనుఁ డవసరము వచ్చినపుడెల్ల ధృతరాష్ట్రు నొద్దకును, ధర్మజాదుల యొద్దకును వచ్చి హితవు చెప్పుచుండువాఁడు. ద్రౌపదిని పాండవుల కిచ్చి వివాహము చేయుటకు సందేహించుచుండిన ద్రుపదునకుఁ బంచేంద్రోపాఖ్యానము చెప్పి పాండవు లేవు రొక్కటియే యని తెల్పెను. పాండవులతోఁ జెలిమి చేయుటయే యుక్తమని దుర్యోధనునకును జెప్పుమని ధృతరాష్ట్రునకుఁ జెప్పెను. ఇతని నిమిత్తమై సంజయునకు రహస్యభాషణమును విను నేర్పును, యుద్ధభూమియందు నెవ్వరికిని గోచరింపకయే సంచరింపఁగలుగు శక్తినినిచ్చెను. అభిమన్యునిమరణమునకు ధర్మజుఁడు విలపించుచుండఁగ వ్యాసుఁడు వచ్చి వానికి నితిహాసములు చెప్పి యోదార్చెను. ధర్మరాజునకుఁ బలుమారులు గోచరించి యితఁడు నీతులు చెప్పుచుండెను; ధర్మాధర్మము లెఱింగించుచుండెను. మరణించిన బంధుమిత్త్రులకై విలపించుచుండిన గాంధారీ ధృతరాష్ట్రులకుఁ దనదివ్యశక్తిచే గతించినవారిని జూపి ధృతరాష్ట్రుఁడు తపోవనమున కేగుట కనుమతి నిచ్చెను. ధర్మజుఁడు పట్టాభిషిక్తుఁడైనపిదప నాతనిచే రాజసూయము చేయించెను. ధర్మరాజీతనికే భూమినంతయును దానముచేసెను. ఇతఁడు మరల ధర్మజునకు భూమిని విక్రయించి యాధనముచే విప్రులకుఁ బ్రీతి చేయించెను.

ప్రాణరక్షణకై పరుగిడి వచ్చుచున్న కీటకమును జూచి యితఁడు దానివృత్తాంత మడిగి తన మహిమచే దాని కీటకత్వంబు పోఁగొట్టెను.

తొల్లి వేదము లేకీభూతములై యున్నపుడితని శిష్యులగు పైల, వైశంపాయన, సుమంత, జైమినులచేఁ జతుర్వేద సూత్రముల వేర్పఱిపించెను. జనమేజయునకు భారతకథ తెల్పుటకై వైశంపాయనుని బంపెను. వేదముల వంచిత వ్యాసం బొనరించుటచే నితనికి వేదవ్యాసుఁడను పేరు వచ్చెను.

వ్యాసుఁ డరణిని మధించుచుండ నచ్చోటున నూర్వశి వచ్చెను. ఇతఁడు శపించునేమోయని భయపడి యామె శుకరూపమును దాల్చెను. ఇతఁ డా శుకమును జూచెను. అపుడితని రేతస్సు వలనఁ బుట్టిన పుత్త్రుఁడే శుకుఁడు. శుకున కితఁడు బ్రహ్మవిద్య నేర్పెను.

కృష్ణుఁడు:–దేవకీవసుదేవుల పుత్త్రుఁడు. దేవకియొక్క యష్టమ గర్భమున నితఁడు జన్మించెను. ఇతనిని గురించియే యామెకును వసుదేవునకును వివాహమయినప్పటి నుండియును కారాగారవాసము ప్రాప్తమయ్యె. అయినను దేవకీ వసుదేవులు దుఃఖము నొందలేదు. తమకు బంధమోక్షణము చేయఁగలవాఁడు పుట్టునని ధైర్యముతో నుండిరి. శ్రీకృష్ణుఁడు జన్మించగనే వారు ముక్తులైనట్లు సంతోషించిరి. శ్రీకృష్ణుని భగవత్ప్రభావ మప్పటినుండియును గోచరించుచుండెను. దేవకి సోదరుఁడు కంసుఁడు దేవకి ప్రసవించఁగనే తనకుఁ జెప్పుఁడని భటులను గావలియుంచెను. అష్టమపుత్త్రుఁడే తనకు హంతకుఁ డగునని యాకాశవాణి పలికెను. కావున వీనిని దప్పక సంహరింప మనోనిశ్చయముతో నుండెను. కాని కంసుని ప్రయత్నములు వ్యర్థము లయ్యెను. దేవకి ప్రసవించి కృష్ణుఁడు జన్మించినపుడామెకడఁ గావలిగాచు కంసుని భటులు గాఢనిద్ర పొందిరి. వసుదేవుఁ డా శిశువును గంసున కందకుండఁగఁ జేయుటకై యచ్చట నుండి కొనిపోయి వ్రేపల్లెలో నపుడే ప్రసవించిన యశోదప్రక్కను బెట్టి యామె కనిన స్త్రీ శిశువును దీసికొనివచ్చి దేవకిదగ్గఱ నుంచెను. పిమ్మట దేవకి ప్రసవించినదని విని కంసుఁడు వచ్చి శిశువును ఖండించుటకుఁ గత్తినెత్తి శిశువును పై కెగురవేసెను గాని యామె యచ్చటనే నిలువఁబడి నిన్నుఁ జంపువాఁడు వ్రేపల్లెలోఁ బెరుగుచున్నాఁడని చెప్పి యంతర్ధానము నొందెను.

వసుదేవుఁడు చేసిన మార్పు యశోదకును దెలియదు; కృష్ణుఁ డామె కుమారుఁడే యనుకొనియె. ఆమెయింటనే కృష్ణుఁడు పెరుగుచుండెను. ఈబాలుని జూచివచ్చుటకై వసుదేవుఁడు తన పురోహితుని గర్గునిఁ బంపెను. గర్గుఁడు కృష్ణుని పెంపుడుతండ్రియైన నందుని గృహమునకు వచ్చి బాలుని జూచి యీ శిశువు తొల్లి

ధవళారుణపీతవర్ణుఁడై యిపుడు నల్లనైన కతంబునఁ గృష్ణుండయ్యెననియు. అప్పటినుండియు నతనికిఁ గృష్ణుఁడను నామము వచ్చెను.

ఆ మాయాకన్యవలనఁ దనను జంపువాఁడు వ్రేపల్లెలోఁ బెరుగుచున్నాఁడనివిని కంసుఁడు భయపడి తనకెవ్వరివలనను నాపద రాకుండుటకై పెరుగుచుండిన బాలుని జంపుట కనేక యత్నములు చేయుచుండెను. దేవకీకుమారుని గుర్తింపలేక శిశువులందఱిని జంపించుచుండెను. తృణావర్తుఁడను రాక్షసుఁడు సుడిగాలియై వచ్చి వీని నెగురవేసుకొనిపోయెను; పైకి పోయినపిమ్మట కృష్ణుఁడు చాల బరువయ్యె. రాక్షసుఁడు భరింపఁజాలక క్రిందఁబడెను; వానిని కృష్ణుఁడు సంహరించెను. పూతన యను రాక్షసస్త్రీ యొకర్తె కృష్ణుని జంపుటకై సుందరాకారయును వరకాంతవలె వచ్చి వాని నెఱుంగదు కావున నందఱు శిశువులకును దన విషదుగ్ధము లిచ్చి చంపుచుండెను. యశోద యింటికిఁగూడ వచ్చి తొట్టిలోనున్న బాలునిఁ జూచి నిజముగ నాతనిపై ప్రేమయున్నట్లు నటించి మాతృవాత్సల్యముచేఁ బాలు చేపువచ్చినదానివలెఁ గృష్ణునకు పాలిచ్చెను. కృష్ణుఁ డీ రాక్షసవనిత శక్తిని బీల్చివేసి విగతప్రాణిగఁ జేసెను. అపుడామె నిజరూపముతోఁ గ్రిందఁ బడి పోయెను. కంసుఁ డీ బాలునిజంపుటకుఁ బన్నాగము మానలేదు. మాయారూపులగు రాక్షసులను బంపుచునే యుండెను. ధేనుకాసురుఁడు, బకాసురుఁడు, కేశివ్యోములు మొదలగువారు వచ్చి కృష్ణుని నంతమొందింపఁదలఁచి వానిచేఁ దామే హతులయిరి. ఇట్లు క్రూరరాక్షసులను జంపిన మాహాత్మ్య మాతని బాల్యముననే యెఱుకపడియెను.

బాల్యమునఁ గృష్ణుఁడు మిక్కిలియల్లరిచేయు వాఁడు. ఈ చిన్నబాలుని యల్లరిపను లెల్లరకు హృదయరంజకముగనే యుండెను. అతఁడు పాలు, వెన్నలను దొంగిలించి భక్షించివచ్చినను ప్రేమతో నవ్వుదురు గాని కొట్టరారు. మిక్కుటముగ నల్లరిచేసినా, యశోదతోఁ జెప్పుదురు. యశోదా! నీకుమారుఁ డల్లరి చేయుచున్నాఁడని నలుగురు చెప్పఁగ నామె యాతని రోటికిఁ గట్టివేసెను. అతఁడు ప్రాకుచు రోటినే యీడ్చుకొనిపోయెను. అది రెండు మద్దిచెట్ల మధ్యఁబడియెను. అయినను దానిని లాగెను. ఆచెట్లు కూలినవి. అందుండి శాపవిమోచితులైన యిరువురు గంధర్వులు నలకూబరమణిగ్రీవులు వచ్చి కృష్ణునకు నమస్కరించి చనిరి.

ఒకనాఁడు కృష్ణునితో నాడుకొను బాలురు వచ్చి యశోదతోఁ గృష్ణుఁడు మన్ను తినుచున్నాఁడని చెప్పిరి. యశోద కుమారుని బిలిచి యడిగెను. కృష్ణుఁడు, 'అమ్మా! నేను వెఱ్ఱినా ? ఆకొంటినా ? మన్ను తిందునా ? నానోరు చూడుము' అని వదనము తెఱువఁగ నందుఁ బదునాల్గు భువనములను యశోద చూచెను; తన కుమారుఁడు సకల భువనకర్తయని గ్రహించెను.

కృష్ణుఁ డంతటివాఁడయినను దనతోడి గోపబాలకులతోఁ గలసిమెలసి మసలువాఁడు. అతఁడును జల్దిచిక్కములు భుజముపై వేసికొని యరణ్యములకుఁ బోయి పశువులను గాచువాఁడు. యమునానదీతీరమునఁ బశువులను గాచుచుండఁగ రాక్షసుఁ డొకఁడు లేఁగయై వచ్చి దూడలను జంపుచుండెను. దూడరూపమున వచ్చిన రాక్షసు నెఱింగి వానిని కృష్ణుఁడు వధించెను. ఆవుల నింటికి మఱలించి వచ్చుచుండఁగ నవి కాళిందిలోని జలము త్రాగెను. ఆనీరు అందున్న కాళియ విషముతో సంకలితమగుటచే గోవులు మృతినొందెను. కృష్ణుఁడు వానిని బ్రతికించి, యామడువునకు సమీపమున నున్న చెట్టునెక్కి కాళియసర్పముపై నుఱికెను. భుజగము వానిని గరవఁజూచెను గాని కృష్ణుని పదభారమున దాని శిరస్సు క్రుంగి పోయెను. నాగకన్యలువచ్చి తమకుఁ బతిభిక్ష యిమ్మని వేఁడఁగ కృష్ణుఁడు కాళియుని జంపక విడచెను. వనములో గోవులను మేపుచుండిన గోపకులను, గోవులనుగూడ బ్రహ్మ మాయాగుహయందు దాచెను. కృష్ణుఁ డెంత నెచ్చట వెదకినను అవి కనఁబడలేదు. తనతో వచ్చినవారిని వారి వారి తల్లిదండ్రుల కప్పగింపక కృష్ణుఁడు ఏమని చెప్పెను ?. కావునఁ దానే అన్నిరూపుల గోపులట్లు నయి, గోవులను తోలుకొనిపోవు వారట్లునై వారి వారి యిండ్లలో సంచరించి ఒక యేడుండెను. బ్రహ్మ అచ్చెరువంది కృష్ణుని సందర్శించి స్తుతియించెను.

ఒకనాఁడు వనములోఁ గార్చిచ్చువచ్చెను. గోపకు లందఱు భీతిల్లిరి. వారు కృష్ణునిఁ జేరి

రక్షింపుమనిరి. అంతఁగృష్ణుఁడు వారిని గన్నులు మూసికొనుఁడని యా దావాగ్నిని మ్రింగివేసెను. బాల్యమున వాఁడు గావించిన యమానుష కార్యములు వర్ణనాతీతములు. నందుఁడు ఇంద్రయాగమును జేయఁబోయెను. ఇంద్రునికై యాగమేల? ఇష్టముండెనేని పర్వతములను, గోవులను, బ్రాహ్మణులను సంప్రీతులను జేయుము మని తండ్రిచేతఁ గృష్ణుఁడు యాగము మాన్పించెను; ఇంద్రునకుఁగోపమువచ్చి రాళ్ళవాన కురిపించెను. అపుడు కృష్ణుఁడు గోపకు లందఱ కభయమిచ్చి గోవర్ధనపర్వతమును తన వ్రేలితో నెత్తి గొడుగుగఁ బట్టి దానిక్రిందకు సకల జనులను, పశువులనురావించి రాళ్ళవానవలన నాపద రాకుండఁ గాపాడెను. అపుడింద్రుఁడే సిగ్గుపడి, వచ్చి కృష్ణునకు నమస్కరించెను.

కృష్ణుఁడును, బలరాముఁడును సాందీపునొద్దఁ జదువుకొనిరి. అపుడే కుచేలునితో స్నేహమయ్యెను. ఈ పేదబ్రాహ్మణునితోడి చెలిమిని కృష్ణుఁడురాజైనను మఱువలేదు. అతఁడుతెచ్చిన పిడికెడటుకులు ప్రీతితోఁ బుచ్చుకొనియె. కుచేలునకుఁ గావలసిన సంపద లిచ్చెను. సాందీపుని పుత్త్రుఁడు ప్రభాసతీర్థమున స్నానముచేయుచు మునిఁగెను. తనకుఁ గురుకట్నముగఁ దన కుమారుని దెచ్చియిమ్మని సాందీపుఁడుకోరెను. అంతఁ గృష్ణుఁడు సముద్రుని కడకరిగిసాందీపునిపుత్త్రుఁడు యమలోకమున నుండు టెఱింగి, యచ్చటకేగి గురుపుత్త్రునిఁ దెచ్చి గురువున కర్పించెను.

ఈ మహామహుని గోపకాంత లందఱును ప్రేమించి యుండిరి. ఈతని రూప లావణ్య గుణాతిశయములును, మధురమైన వేణుగానమును గోపికాలోకమునుమిక్కిలిమోహ పెట్టుచుండెను. కృష్ణుఁడు గానము చేయుచుండెనా, వారు తన్మయత్వము నొందుదురు. తమపనులను, తమ వారిని, దమ్ముగూడ మఱచి యతనిని జేరి యుందురు. కృష్ణుఁడు వారితోడను గలసి మెలసి యాడుచుండును. ఒకనాఁడు గోపకాంతలు తమ పుట్టంబులు వదలి గట్టునఁబెట్టి స్నానము చేయుచుండఁగఁ గృష్ణుఁడు మెల్లగ వచ్చి యా వలువలు పట్టుకొని చెట్టెక్కి కూర్చుండెను. విగతవస్త్రలైన యా వనితలు సిగ్గుచేఁబయటకురాలేక యెటులో వచ్చి యాతనిని ప్రతిమాలుకొనిరి. ఆతఁడు వారిని రావించి నవ్వి వారి చీరలు వారి కిచ్చివేసెను.

లోకమంతయుఁ గృష్ణునిఁ బ్రేమించుచుండును. కాని కంసునికంతకంతకు వానిపైద్వేషము హెచ్చుచుండెను. వీనిని జంపుట కిదివఱకుఁ జేసిన యత్నములు నిష్ఫలములయ్యె; తన నగరమునకు రావించి యచ్చట సంహరించుటకై కృష్ణునిఁ బిలుచుకొని రమ్మని యక్రూరునిఁ బంపెను. కృష్ణుఁడును, బలరాముఁడును మధురానగరమున కేగిరి. కంసునిబట్టలు చాకలి తెచ్చుచుండుటనుజూచి యా బట్టలు తమ కిమ్మనిరి. వాఁడివ్వననియె; వానినిజంపిరి. మాలాకారుని గృహమునకేగి పుష్పమాలికలు పుచ్చుకొనిరి. గంధలేపనము గావించుకొని చనుచుండిరి. ఇది విని కంసుఁడు వారిమీఁదకు మదపుటేనుగులను దోలుఁడని యానతిచ్చెను. వీరిమీఁదకుఁదోలిన కువలయాపీడమను నేనుఁగును, మావటివానినిఁ గూడ వీరు వధించిరి. పిమ్మట వారితో ముష్టి యుద్ధముచేసి యెటులైన వీరిని సంహరించుటకై చాణూరముష్టికు లను మల్లురను గంసుఁడు పంపెను. ఈ మల్లురతో యుద్ధముచేసి బలరామకృష్ణులు వీరిని సంహరించిరి.

వీరి దుండగములుచూచి కంసుఁడు వీరిని దన నగరమునుండి వెడలఁగొట్టుఁడని యాజ్ఞనిచ్చెను. కాని వానిమాటలుధిక్కరించి కృష్ణుఁడు కంసుని పైఁబడి వానిని సంహరించి తన తలిదండ్రులగు దేవకీవసుదేవులను బంధవిముక్తులను గావించి కంసుని తండ్రియగు నుగ్రసేనునకుఁ బట్టము కట్టెను. ఆనగరమందే కృష్ణునితోడి పొందును గోరుచుండిన కంసునిదాసియగు కుబ్జకు దర్శనమిచ్చి యీమె కుబ్జత్వమును బాపెను.

కంసునిమామయగు జరాసంధున కీ వార్త తెలిసి కాలయవనుని సహాయముగఁ దెచ్చుకొని మధురానగరముపైఁబడెను. జరాసంధుఁడొక్కఁడే యజేయుఁడు. వానికిఁదోడు కాలయవనుఁడు కూడ వచ్చెను. కృష్ణుఁడు వారితో యుద్ధము సేయక సముద్రమధ్యమున ద్వారకానగరము నిర్మించి మధురానగర వాసులను నచ్చటికి రావించెను. అయినను కాలయవనుఁడు వీనిని వీడలేదు. నిరాయుధుఁడై యున్న కృష్ణుని వెంటఁ దఱిమెను. కృష్ణుఁడు కొండలనక, యెండ్లనక

పరుగిడఁ బ్రారంభించెను. పరుగెత్తి పరుగెత్తి యొక కొండగుహలో దాఁగెను. ఆ గుహ ద్వారమున ముచికుందుఁడు నిద్రించుచుండెను. కృష్ణునివెనుకవచ్చిన యవనుఁడు ముచికుందుని జూచి యితఁడే కృష్ణుఁడనుకొని వీనిని బాదముతోఁ దన్నెను. ముచికుందుఁడులేచి కన్నులు తెరచి వీనిని చూచెను. ఆ చూపులకు యవనుఁడు భస్మమయ్యె. పిమ్మటఁ గృష్ణుఁడు ముచికుందునియొద్దకు వచ్చెను. ముచికుందుఁ డీతని మాహాత్మ్య మెఱిఁగి స్తుతించెను. కాలయవనుఁడు పోయినను జరాసంధుఁ డీతని బాధించుట మానలేదు. వీనికిని భయపడి కృష్ణుఁడు నగరమువీడి కొంతకాలము ప్రవర్షణ గిరిపై నుండెను.

దుర్మార్గులగు రాజు లేకమై కృష్ణుని వంచింపఁదలఁచుకొనుచుండిరి. కాని యీతని కీర్తి యంతకంతకు వ్యాపించుచుండెను. అంతఃపుర కాంతలలోఁ గూడ నాతని పేరు వినని వారు లేరు. భీమసేనరాజు కుమార్తె యగు రుక్మిణిని శిశుపాలునకిచ్చి వివాహము చేయవలెనని యామె సోదరుఁడు రుక్మి తలంచుచుండె. ఆమె వృద్ధజనకుఁ డే మాటయును చెప్పక స్వయంవరము చాటించెను. కంస జరాసంధ శిశుపాలాది దుష్టులు రుక్మికి మిత్రులు. రుక్మిణి కృష్ణుని పేరు వినినప్పటినుండియు నీతనినే వివాహము గాఁగోరుచుండెను. తన యన్న తలఁపు తెలిసిన దగుటచేఁ గృష్ణుఁడు తన స్వయంవరమునకు వచ్చునో రాఁడో యనియు, వచ్చినచో వానికి వీ రెట్టి యపకృతిని గావింతురో యనియు, భయపడియు నొక వృద్ధ బ్రాహ్మణునిచేఁ గృష్ణునకుఁ దనను రాక్షస వివాహమునఁ గొనిపొమ్మని వర్తమానము చేసెను. కృష్ణుఁ డట్లేవచ్చి సకల నృపకుమారుల సమక్షమందును రుక్మిణిని గ్రహించి తన రథముపైఁ బెట్టుకొని రథము నడిపించెను. వానితో యుద్ధము చేయుటకు వాని వెనుక రుక్మి వచ్చెను. రుక్మి యీతనిని గలుసుకొని నిందించుచు యుద్ధమునకు దిగుమనెను. కృష్ణుఁడు వీనిని బట్టుకొని రథచక్రమునకుఁ గట్టి సంహరింపఁ దలఁచుకొనెను గాని బలరాముఁడు వలదనఁగ మాని, తల బోడిఁజేసి యవమానము చేసి పంపెను.

సూర్యునియొద్దనుండి సత్రాజిత్తు శ్యమంతక మణిని దెచ్చుకొనెను. దానిని జూచి కృష్ణుఁడు తన కిమ్మని యడిగెను. సత్రాజిత్తు ఇవ్వననియె. ఇది జరిగిన కొలఁదిదినములకే సత్రాజిత్తుయొక్క సోదరుఁడు ప్రసేనుఁడు ఈమణిహారమును మెడలో వేసికొని వేఁటకువెళ్ళెను. అడవియం దొక సింహము వానిఁజంపి మణిని గైకొనెను. జాంబవంతుఁడు సింహమును జంపి యామణిని దెచ్చుకొని తన కూతురున కిచ్చెను. అడవికి వెళ్ళిన ప్రసేనుఁడు మరల రాకపోవుటచేఁ గృష్ణుఁడే వానిని సంహరించి మణి నపహరించెనని యపవాదు పుట్టెను. దీనిని బాపుకొనుటకై కృష్ణుఁడే మణిని వెదకి తెచ్చి సత్రాజిత్తున కివ్వఁదలఁచుకొని ప్రసేనుఁడు వెళ్ళిన మార్గముననే చనియెను.

చనిచని కృష్ణుఁడు తుదకు జాంబవంతుఁ డుండిన గుహ ప్రవేశించి యందు జాంబవతి తొట్టెకుఁ గట్టబడిన మణిని దీసికొనెను. ఇంతలో జాంబవంతుఁడు వచ్చి దానినిఁ దస్కరించువాఁడవు నీ వెవ్వఁడ? వని కృష్ణుని మోదెను. మఱికై కృష్ణుఁడును జాంబవంతుఁడును పండ్రెండు దినములు యుద్ధముచేసిరి. జాంబవంతుఁడు మిక్కిలి బలాఢ్యుఁడు; తనతో సమానముగఁ బోరఁగలిగినవాని నిదివఱకుఁ జూచియుండలేదు. తుదకు జాంబవంతుఁడే యోడి కృష్ణుని మహానుభావునిఁగ నెఱింగి మణినేగాక తన కూఁతుని జాంబవతినిఁగూడ నాతని కిచ్చెను. కృష్ణుఁడు మణినిదెచ్చి సత్రాజిత్తున కిచ్చెను. ఆ కారణముగఁ గృష్ణునిపై నిందమోపితినని సత్రాజిత్తు విచారించి యామణి నతనినే పుచ్చుకొనుమని, తన కుమార్తెయగు సత్యభామను గూడ నతని కిచ్చి వివాహము చేసెను. కృష్ణుఁడు మణిని దిరిగి సత్రాజిత్తున కిచ్చివేసెను.

ఇంతలోఁ బాండవులు లక్కయింటఁ గాలిపోయిరని వినవచ్చెను. ఆ మాటలు వినఁగనే కృష్ణుఁడు హస్తినాపురమున కేగెను. కాని యచ్చట నాతనికి నిజమగు వృత్తాంత మెవ్వరును జెప్పలేదు. ఆతఁ డచ్చట నుండఁగనే యక్రూర కృతవర్మలచేఁ బ్రేరేపింపఁబడి శతధన్వుఁడు సత్రాజిత్తును జంపెను. ఆ వార్త సత్యభామ కృష్ణునకుఁ దెలియఁజేసెను. వెంటనే కృష్ణుఁడు

ద్వారకకు మఱలివచ్చెను. అక్రూరుఁడు భయపడి పాఱిపోయెను. కాని శతధన్వుఁడు పట్టువడి చంపబడియె. అక్రూరుఁడు లేకపోవుటచే ద్వారకలో వానలు లేవయ్యె. కావున వాని కభయమిచ్చి వానిని ద్వారకకు రావించెను.

కృష్ణుఁడు కాళింది, మిత్రవింద, భద్ర, నాగ్నజితి, లక్షణ యనువారినిగూడ వివాహమయ్యెను. ఈ భార్య లెనమండుగురు గాక, పదియాఱు వేలగోపికలతోఁ గ్రీడించువాఁడు ఒకనాఁడు నారదుఁడీతని మాహాత్మ్యము చూడఁ గోరి యొంటిగోపికలయిండ్లకుఁజనియె. అందఱు గోపికల చెంతను గృష్ణుఁడు నారదునకుఁ గనఁబడియె.

కృష్ణుఁడు ద్రౌపదీస్వయంవరమున కేఁగెను. కాని యామెను బరిణయమగు తలఁపుతోఁ గాదు; కావుననే మత్స్యయంత్రమును గొట్టుట కాతఁడు యత్నింపనేలేదు. అతఁడు వేడుక మాత్రము చూడఁబోయెను. వెళ్ళినందు కొక లాభము చేకూరెను. కుంతీసుతుల నచ్చటఁ జూచెను. వారికేఁదన నెఱింగించుకొనెను. అప్పటి నుండియును వారితో స్నేహము ప్రారంభించి వారియెడ ననురాగము కలిగియుండెను. అందు వలననే తనసోదరుఁడగు బలరామున కిష్టములేక పోయినను దన చెలియలగు సుభద్రను నర్జునున కిచ్చుటకై వానిని యతిరూపంబున రావించి బలరాముఁడు నగరమును విడిచియుండిననాఁడు సుభద్రార్జునుల వివాహమును గావించెను. అప్పటినుండియును గృష్ణార్జునులు తఱచుఁగలిసి కొనుచునేయుండిరి; తఱచు కలిసియే సంచరించుచుండిరి. అగ్ని బ్రాహ్మణరూపమున వచ్చి ఖాండవవనమును నాహారముగ గోరినపుడు, ఇంద్రాదులతోఁ బోరుటకై యగ్నియే శంఖ చక్రములను దెచ్చి యితనికిచ్చెను. అప్పుడైన వనము కాపాడవచ్చిన యింద్రునితో నెక్కుడుగఁ బోరాడినది యర్జునుఁడే. కృష్ణుఁడు వానిప్రక్క నుండి సహాయము చేయుచుండువాఁడు.

ఆకాలమునఁ గృష్ణునకు వైరిరాజులు పలువురు కలరు. వారి క్రూరత్వమును గృష్ణుఁడు సహింపకపోవుటయే యా రాజులతోడి వైరమునకుఁ గారణము; జరాసంధుఁడు చెఱఁబెట్టి వధింపఁబోవుచుండిన రాకుమారులను గృష్ణుఁడు విడిపింపయత్నించుటయే వైరమునకుఁగారణము. జరాసంధ హంసడిభకులు వచ్చి మథురపైఁబడుచుండిరి. వారా, దుర్జయులు. శిశుపాలాదులును వారికే సహాయ మొసర్తురు. కృష్ణుఁడు వారి దాడి కాఁగలేక మథురానగరముకూడ వదలి వెళ్ళెను. హంసడిభకులు వానిని దఱిమిరి. యుద్ధమున వారిని గెలుచుట కష్టమగుచుండెను. ఉపాయమున వారిని వధింపవలయును. కృష్ణున కుపాయమున కేమి లోటు? హంసడిభకులకు నత్యన్యానురాగ మెక్కుడని యాతఁడెఱుంగును. ఒకఁడు కాలధర్మము నొందెనేని రెండవవాఁడును బ్రాణములను విడుచును; వారి ప్రేమ యట్టిది. యాదవులు సేయుచు హంసుఁడుమరణించెనను వార్తను గృష్ణుఁడు పుట్టించెను. ఆమాటలు డిభకుని చెవినిఁబడియె. తోడనే యతఁడు ప్రాణత్యాగము చేసికొనెను. పిమ్మట మృతి నొందిన డిభకుని చూచి హంసుఁడును ప్రాణమును విడచెను. హంసడిభకు లట్లు మడిసిరి. ఇఁక జరాసంధుఁ డుండెను.

ధర్మరాజు రాజసూయయాగము సేయఁ దలఁచి కృష్ణుని నాలోచనయడిగెను. దిగ్విజయమునకు వెడలినపుడు జరాసంధాదులను సంహరింపవచ్చునుగాన, కృష్ణుఁడువానిని ప్రోత్సాహపఱచెను. ముందుగ శ్రీకృష్ణ భీమార్జునులు గలసి గిరివ్రజమునకే యరిగిరి. కృష్ణుఁడు వారిని బ్రాహ్మణరూపమునఁ గొనిపోయెను. జరాసంధుఁడు మధుపర్కము నీయరాఁగ మేము క్షత్రియులము; మాతో యుద్ధము సేయుమనిరి. అచ్చట భీముఁడే యుద్ధము చేసెను. జరాసంధుఁడును మరణించెను. ఇతరరాజులకడకుఁ గృష్ణుఁడరుగలేదు. భీమార్జున నకుల సహదేవులు వెళ్ళి దిగ్విజయము పూర్తిగావించిరి. రాజసూయము ప్రారంభింపఁబడెను. రాజసభయందుఁ బూజార్హుఁడు కృష్ణుఁడని భీష్ముఁడుపలికెను. సభలోనుండిన శిశుపాలునకుఁ గోపమువచ్చి కృష్ణుని నిందింప నారంభించెను. శిశుపాలునితల్లితోనతని నూఱు తప్పులవఱకు మన్నింతునని కృష్ణుఁడు చెప్పియుండె. ఇపుడు శిశుపాలుఁడు మితిమీఱిపోవుచుండెను. అతనికిఁ గాల మాసన్నమైనది. కావుననే సభయందుఁ బ్రలాపములాడుచున్న యా శిశుపాలునిపై కృష్ణుఁడు చక్రము ప్రయో-

గించి సంహరించెను. శిశుపాలుని దేహమునుండి తేజస్సువచ్చి కృష్ణునియందుఁ బ్రవేశించెను. ధర్మజుని రాజసూయము పూర్తియయ్యెను. కృష్ణుఁడు తన నగరమునకు వెడలెను.

శిశుపాలున కదివఱకు సహాయముగ వచ్చిన సాల్వుని కృష్ణుఁడోడించెను. శిశుపాలుని జంపుటచే సాల్వునకు కోపమెక్కువై యదువంశ నాశనము చేయఁగోరి శివునిగూర్చి తపస్సుచేసి ఆకాశమందుఁ దిరుగఁగల లోహవాహనము సౌభకమును మయ నిర్మితమైనదానిని బడసి ద్వారకపై దండెత్తివచ్చెను. అప్పుడు ఇంద్రప్రస్థము నుండి కృష్ణుఁడు వచ్చి ఘోరముగ సమరము జరుగుచున్న ద్వారకలోఁ బ్రవేశించి సాల్వునితో యుద్ధముచేయుచుండెను. ఇంతలో దేవకీదేవి నన్ను నీయొద్దకుఁ బంపెనని యొకఁడు ఆకాశమునుండి మాయావసుదేవ సహితముగ దిగెను. ఆ మాయావసుదేవుని సాల్వుఁడు పట్టుకొని ఇదిగో! నీతండ్రి నిప్పుడే చంపుచున్నానని వాని శిరమును ఖండించి తన విమానములోఁ బెట్టెను. అదిచూచి కృష్ణుఁడు చాల దుఃఖించెను. అప్పుడు మునులు వచ్చి సామాన్యనరునట్లు నీవిట్లు దుఃఖింపఁ బనిలేదని చెప్పి వెళ్ళిరి. కృష్ణుఁడు మరల ధైర్యము తెచ్చుకొని ఆ వసుదేవుని కళేబర మంతర్ధాన మగుటచూచి యిది రాక్షసమాయ యని గ్రహించి తనగదచే సౌభకమును విఱుగఁగొట్టి సాల్వుని జక్రముచే సంహరించెను. భాగ.

కృష్ణునికడ కింద్రుఁడువచ్చి యదితికుండలములను, వరుణచ్ఛత్రంబును నరకుఁడపహరించె నని చెప్పికొనిరి. అంతఁ గృష్ణుఁడు నరకాసురునిమీఁదకు యుద్ధమునకు వెళ్లెను. సత్యభామ కూడ వీని వెంట నరిగెను. యుద్ధమందు నరకుని సంహరించి వాఁడు చెఱపెట్టిన పదునాఱువేల స్త్రీలను విడిపించి ద్వారకకువచ్చి యచ్చట నుండి యింద్రనగరమునకు వెళ్ళి కుండలము లిచ్చెను. అచ్చటినుండి వచ్చుచు నందనవనముఁదలి పారిజాతమును దెచ్చెను. తెచ్చునపు డింద్రుఁ డడ్డగింప వానితో యుద్ధముచేసి వాని నోడించి ద్వారకకు మఱలివచ్చెను. సాల్వుఁడు మయనిర్మితమైన కామగమనముగల తన నగరముతో ద్వారవతిపైఁబడి, బహువిధములుగఁ దోఁచుచు మాయచేసి యుద్ధము చేయుచుండెను.

మాయావసుదేవుని గల్పించి ఇదిగో! నీతండ్రిని జంపుచున్నాను అని భయపెట్టెను. కృష్ణుఁడు వీని మాయల నెఱుంగును. ముందుగ నితనివిమానము పడఁగొట్టి యితనితో గదాయుద్ధము చేసి వీనిని సంహరించెను. శిశుపాలుని జంపెనను కోపముతో దంతవక్త్రుఁడు కృష్ణునిమీఁదకు యుద్ధమునకు వచ్చెను. వీనిని గృష్ణుఁడు సంహరించెను. పిమ్మట వీని సోదరుఁడగువిదూరథుని జంపెను. పౌండ్రకవాసుదేవుఁడు కాశిరాజును సహాయముగఁ దీసికొని వచ్చి వాసుదేవుఁడను నేను. నీవు కపటివై నా పేరు పెట్టుకొంటివి; ఆ పేరు తీసివేయుము. లేదేని యుద్ధము సేయుమని వచ్చెను. వీనిని గృష్ణుఁడు సంహరించెను.

ఈ పోరాటములలో నుండుటచేఁ బాండవుల వార్త తెలియదయ్యె. ఈలోపుననే వారు జూదము నాడుటయును, రాజ్యము నోడుటయును, వనవాసమున కేగుటయును యుయుధానునివలన విని, చింతాక్రాంతుఁడై వారిని జూచుట కరణ్యమునకు వచ్చెను.

ఒకనాఁడు ద్రౌపదికూడ భుజించిన పిమ్మట వీరిని పరిభవించి సిగ్గుపుచ్చు తలంపుతోనే దుర్వాసుఁడు వందలకొలది బ్రాహ్మణులను వెంటఁబెట్టుకొని వీరికడకు వచ్చెను. వచ్చిన వారిని భోజనమునకుఁ దుడనియును, స్నానము చేసి రండనియు ధర్మజుఁడు చెప్పెను. ద్రౌపదియు భుజించెను. కావున నక్షయపాత్రయు నప్పటి కేమియు నొసఁగలేదు. ఆ సమయమునకే కృష్ణుఁడు వచ్చెను. ఆ స్థితి ద్రౌపది కృష్ణునితోఁ జెప్పికొనెను. అక్షయపాత్రను జూడగ దానిసంటుకొని యొక చిన్న మెతుకుండెను. కృష్ణుఁడు దానిని దిని కడుపు నిండినదని లేచెను. అంతట స్నానము చేయుచుండిన బ్రాహ్మణులపొట్టలు ఆహారముతో నిండినట్టు లయ్యెను. వారిక భుజింపలే మనుకొనిరి. ధర్మజునికడకుఁ బోయి ఇంక భుజింపకున్న నతఁ డేమనునో అని భయముకల్గి పాండవులకడకు రాకుండఁగనే వరుచనిరి.

భార.

అచ్చట వారితో ముచ్చటించివెళ్ళి వారి యజ్ఞాతవాసానంతరము అభిమన్యుని వివాహ

సమయమున మరల వచ్చెను. కాని యీలోపున వీరిని గలుసుకొనలేదు. అపుడే రాజసభయందుఁ బాండవుల కర్తవ్యము తర్కించి కౌరవులు తమరాజ్యభాగ మీయకుండిరేని యుద్ధము చేసి గెలుచుటే తగునని చెప్పి చనియె.

ద్రుపదుని పురోహితుఁడు దూతగఁ గౌరవుల చెంతకుఁ బోయెను గాని వారు రాజ్యభాగ మిచ్చునట్లుగఁ బలుకలేదు. యుద్ధము తప్పనట్లుండెను. కృష్ణుని సహాయమును గోరుట కర్జునుఁడు ద్వారకకు వచ్చెను. అప్పటికే దుర్యోధనుఁడు వచ్చి నిదురించుచున్న కృష్ణుని తలదగ్గఱ నున్నతాసనమునఁ గూర్చుండెను. అర్జునుఁడు కృష్ణుని పాదసమీపమునఁ గూర్చుండెను. కృష్ణుఁడు మేల్కొని లేచి వాని కెదురుగ నున్న యర్జునుని ముందుగఁ జూచెను. పిమ్మట దుర్యోధనుఁడు గూడఁ గనఁబడియె. వారు వచ్చిన కార్యము లడిగి తనను గాని, తన సైన్యమును గాని కోరుకొనుమనియు; ముందుగ నర్జునుని జూచెను గాన ముందుగ నాతనికిఁ జెప్పెను. అర్జునుఁడు కృష్ణుని సహాయము కోరెను. దుర్యోధనుఁ డాతని సైన్యమును గోరెను. విరాటసభయందుఁ గౌరవులతో సంధి పొసఁగుచో మంచిదనిన కృష్ణుఁడు దుర్యోధనార్జునులు తనకడకు వచ్చి యుండఁగ సంధి యుచితంబని వారి కేల చెప్పఁడు? ఇతఁడు యుద్ధమునే గోరుచుండెనా?

వారిని వీడ్కొలిపి కృష్ణుఁ డుపప్లావ్యనగరమునకుఁ బాండవులను జూచుటకు వెడలెను. అప్పటికి సంజయుఁడు వచ్చి ధృతరాష్ట్రుఁడు నుడివిన ప్రకారము ధర్మజున కెఱింగించుచుండెను. ఈవిధమునఁ గావింతువని ధృతరాష్ట్రుఁ డేమియును జెప్పలేదు. కౌరవులయొద్దకుఁ బోయి యెట్లైనను నొడఁబాటు గావింపుమని ధర్మజుఁడు కృష్ణునిఁ గోరెను. ధర్మజుఁడు సంధిసేయుమనెను గావున నర్జునుఁడును, భీముఁడును నట్లేపలికిరి. ద్రౌపది కౌరవులుఁ గావించిన మానభంగమును మఱువఁజాలదయ్యె. వారు యుద్ధమున వధింపఁబడుటయే యామె కోరెను. కృష్ణుఁడు ధర్మజు వాక్యానుసారము సంధిసేయుటకే బయలు వెడలెను గాని ద్రౌపదితోఁ జెప్పిన మాటలనుబట్టి చూడఁగ మనసార నాతఁడు సంధిని గోరినట్లు లేదు.

కృష్ణుఁడు చక్రగదాద్యాయుధంబులు రథంబునఁ బెట్టుకొని కురునగరమునకుఁ జనియె. ఈతని రాకఁ గని యీతనిగౌరవార్థము కురునగర మలంకరింపఁజేసిరి. కృష్ణున కాతిథ్య మొనరించిరి. కృష్ణుఁడు తన వచ్చినపని చెప్పెను. దుర్యోధనుఁడు కృష్ణుని భోజనమునకుఁ బిలచెను; నీదుష్టాన్నంబు నేభుజింపనని కృష్ణుఁడు తిరస్కరించెను. విదురునింట భోజనము చేసెను. ఈతఁడు వచ్చిన కార్యమెట్లు పొసఁగునో దానివలననే తెలియుచున్నది. సభలో కృష్ణుఁడు ధృతరాష్ట్రునకుఁ జెప్పవలసినట్లు ధృతరాష్ట్రునకును, దుర్యోధనునకును జెప్పవలసినట్లతనికిని జెప్పెను గాని ధృతరాష్ట్రుఁ డీతనికి లంచమిచ్చి తమవానిఁగఁ జేసికొని పాండవులభాగ మపహరింపఁ జూచెను. దుర్యోధనుఁడో యీతనిని విఱిచికట్టి పాండవుల ప్రాపు నశింపఁజేయఁ దలఁచుకొనెను. దానికై యత్నముకూడఁ జేసెను. అపుడే కృష్ణుఁడు తన విరాట్‌స్వరూపము చూపించెను భీష్మాదిసుజనులీతని స్తోత్రము చేసిరి. దుర్యోధనాదులు పాండవులకు భాగమిచ్చుటకుఁ దిరస్కరించిరి. కృష్ణుఁ డచ్చటినుండి వచ్చుచుఁ గర్ణుని బిలచి యాతఁడు కుంతీతనయుఁ డగుటయును, తత్కారణమునఁ బాండవులయెడ వైరమూనకుండుట యుచితమనియును దెల్పెను. కాని కర్ణుఁడు తన వృత్తిని మార్చుకొనలేదు.

కృష్ణుఁడు పాండవులకడకు మఱలివచ్చెను. సంధి కుదరలేదని చెప్పి, యుద్ధయత్నము చేయించెను. తాను పార్థునకు సారథియయ్యె. సేనలు నడచెను. ఇరుపక్షముల వాహినులు కురుక్షేత్రమును జేరెను. అర్జునుఁడు తన సేనలను, అందు భీష్మాదియాప్తబంధువులను జూచెను. చూచి వికలమనస్కుఁడయ్యె. వారిని జంపినఁ గాని తనకు లభింపని రాజ్యము తనకు వలదనియె. తన చేతులార బంధువులను జంపఁజాల ననియె. అపుడే కృష్ణుఁ డర్జునునకుఁ దత్త్వోపదేశము చేసెను. యుద్ధము చేయువాఁ డర్జునుఁడు గాని చేయించువాఁడు తానే. యుద్ధ మంతయు నీతఁడే నడపెను. ఎవ్వరితో నెప్పుడెట్లు పోరాడవలయునో చెప్పుచుండెను. శత్రువు లజేయులై గెలువ రాకుండెనేని యుపాయమాత్రమున వారిని వధింపఁజేయును. భీష్ముఁడు పాండులతోఁ బోరు స పడని యెఱింగి యాతని కెదురుగ

శిఖండిని బెట్టించి యా శిఖండి చాటునుండి యర్జునునిచే బాణము వేయించెను. ఒకనాఁడు ప్రొద్దుగ్రుంకులోపున సైంధవుని జంపలేకపోతినేని యాత్మహత్య గావించుకొందునని యర్జునుఁడు శపథము చేసెను. అర్జునుఁ డట్లు వేగిరించి శపథము చేసెననియును, సైంధవుని జంపుట సులభము కాదనియును కృష్ణుఁ డెఱుఁగును. ఆదినము పెద్దతడవు యుద్ధము జరిగెను గాని సైంధవుఁడు గనఁబడఁ డయ్యెను. అపుడు కృష్ణుఁడు మాయాతిమిరమును గల్పించెను. సైంధవుఁడు నిజముగ సూర్యుఁ డస్తమించె ననుకొని బయటకు వచ్చెను. అంతటఁ గృష్ణుఁడు తిమిర మణఁగఁజేసెను. అట్లుపాయముచే సైంధవుని రావించి వానితోఁ బోరాటము చేయించెను. ద్రోణుని సంహరించుటకుఁగూడ "అశ్వత్థామ హతః కుంజరః" యనిపించె. కుంజరః అని ధర్మజుఁడు పలుకునపు డా మాటలు ద్రోణునకు వినఁబడకుండ భేరి మ్రోయించె. ద్రోణుఁడు తన పుత్త్రుఁడే మరణించెనని యనుకొనవలెనని యట్లు చేసెను. పాపము ద్రోణుఁ డట్లే యనుకొనియె. అట్లు శత్త్రులచే గెలువరాని వారిని మాయోపాయంబుల వధింపఁజేసెను. కర్ణుఁడు సేనాధిపతి యయ్యె. అతఁడు యుద్ధరంగమునకు రాకపూర్వ మొకవిధమయిన యస్త్రము ప్రయోగించి యర్జునుని సంహరింపవలెనని యాలోచించుకొనుచుండును. కాని కృష్ణార్జునులను జూడఁగనే మఱచిపోవుచుండును. ఇది యెవ్వరి ప్రభావము? కర్ణుఁడేసిన బాణములకుఁ గృష్ణుఁడు సారథి కానిచో నర్జునుఁడు ప్రాణములను గోల్పోవలసినవాఁడే. కర్ణుని రథము పంకములోఁ గ్రుంకినపుడే యతఁడు సంహరింపఁబడెను. కురుసేనాధిపతులు మరణింపఁగ దుర్యోధనుఁడు ఖేదముతో హ్రదములో దాఁగియుండఁగ వానిని నిందించి బైటకు రావించి వానితో యుద్ధము సేయుటకుఁ బంపెను. దుర్యోధనుని కటిప్రదేశమునకుఁ గ్రింద మోదుమని కృష్ణుఁడే భీమునితోఁ జెప్పెను. భీముఁ డట్లే దుర్యోధనుని వధించె. ఈ యన్యాయము చూచి సహింపలేక బలరాముఁడు భీమునిపై హలమెత్తఁగ కృష్ణుఁడు వానితోఁ బూర్తిగ యథార్థము గాని వాక్యములు కొన్ని చెప్పి శాంతచిత్తునిఁ జేసెను. దుర్యోధనుని జంపినపిదప నశ్వత్థామ పాండవవంశ నిర్మూలనము చేయఁగోరి ఉత్తర గర్భమందున్న శిశువుపైఁ గూడ బాణప్రయోగము చేసెను. అపుడు కృష్ణుఁడే రక్షించెను. అవ్విధమునఁ గురుయుద్ధ మంతయును గృష్ణుఁడే నడిపించి దుష్టజనసంహారమును గావించి సాధువులను రక్షించి కృతార్థుఁ డయ్యెను.

యుద్ధము ముగిసిన పిమ్మటఁ గృష్ణుఁడు ద్వారకకుఁ బోవుటకై యుదంకుఁ డను బ్రాహ్మణుని యాశ్రమము ప్రక్కనుండి పోవుచు నా తపోధనుని జూచెను. ఉదంకుఁ డతనితోఁ గురుపాండవులకు యుద్ధము పెట్టినవాఁడవు నీవే; నిన్ను శపింతుననియె. ఈమాటలకుఁ గృష్ణునకుఁ గోపము రాలేదు. కృష్ణుఁడు తానే యీశ్వరుఁడనని యాతనికిఁ జెప్పి తన విశ్వరూపము నాభక్తునకుఁ జూపెను. అతని భక్తికి మెచ్చుకొని వరమును గోరుకొనుమనియెను. నీదర్శనముకంటె నాకు వరము కావలయునా? యని యుదంకుఁ డనెను గాని నీకోరిన దిచ్చెదనని కృష్ణుఁడు మఱలఁ జెప్పఁగ, నిది మరుదేశము; జలమునకై యిక్కట్టు చాలఁగలదు; కోరినపుడు జలము వచ్చునట్లనుగ్రహింపు మనియె. కృష్ణుఁ డట్లను గ్రహించి ద్వారకకుఁ జని సుఖంబున నుండె.

కృష్ణునకు రుక్మిణియందుఁ బ్రద్యుమ్నుఁడు, చారుదేష్ణుఁడు, సుచారుఁడు, భద్రచారుఁడు మొదలగువారును; సత్యభామయందుఁ దామ్రుఁడు, చక్రుఁడు మొదలగువారును; జాంబవతియందు సాంబుఁడును, మిత్త్రవిందయందు మిత్త్రవంతుఁడును, నాగ్నజితియందు సునీథుఁడు, మి[illegible]బాహువు మొదలగు కుమారులును గలిగిరి.

ప్రద్యుమ్నకుమారుఁడగు అనిరుద్ధుని బాణాసురుని పుత్త్రిక చెలికత్తెయైన చిత్రరేఖ తన మాయాశక్తిచే నొకనాఁటిరాత్రి తీసికొనివెళ్ళి తన చెలియైన యుష యంతఃపురములోఁ బెట్టెను. అనిరుద్ధునికై వెదకుకొనిరి గాని యతనిజాడఁ గానరాలేదు. నారదుఁడు వచ్చి యతఁడు బాణుని పురమున బంధింపఁబడియుండెనని చెప్పెను. కృష్ణుఁడు యుద్ధమునకు వెడలి బాణునితో యుద్ధము చేసి వానిని జంపఁబోఁగ శివుఁడు వచ్చి తనభక్తుఁడగు బాణుని మన్నింపుమని కృష్ణునిఁ గోరెను. కృష్ణుఁడు బాణుని విడిచెను. అంత బాణుఁడే

తన కుమార్తెను ఉషను, అనిరుద్ధున కిచ్చి వివాహముచేసి పంపెను.

ఒకనాఁడు కృష్ణునిఁ బరీక్షింపఁగోరి యాతని కడకు దుర్వాసుఁడు వచ్చెను. కృష్ణుఁ డీతనికి స్వాగతమిచ్చెనుగాని దుర్వాసుఁడు విముఖుఁడై యాతనియింట భోజనము చేయుదునని; తిరిగి చేయననియెను. వండినదంతయును దనకుఁ బెట్టుమనియెను. పాయసమును దెమ్మనియెను. తెచ్చిన దానిని కృష్ణునిశిరమునఁ బూసెను; రుక్మిణి శరీరముపైఁ బూసెను; పాయసము తనశరీరమునంతను బూయుమనియెను. ఇంత చేసినను కృష్ణునకుఁ గోపమురాలేదు. దుర్వాసుఁడు రుక్మిణిని రథ్యముగఁ జేసి రథమునకుఁగట్టెను. అయినను వారు మునిని గౌరవించుచుండిరి. దుర్వాసుఁడు వారిని మెచ్చుకొని వరమును వేఁడుకొనుఁడనియె. మరియుఁ గృష్ణునితో నీవు పాయసము నా శరీరమంతయుఁ బూసి యఱకాళ్ళయందుఁ బూయలేదు కావున నీకుఁ బ్రాణభయ మఱకాళ్ళనుండి వచ్చునని చెప్పిపోయెను.

పిమ్మటఁ గొంతకాలమునకుఁ గృష్ణునిఁ జూచుటకై కణ్వుఁడును నారదుఁడును విశ్వామిత్రుఁడును ద్వారకకువచ్చిరి. యాదవకుమారులు కొంటెతనమున సాంబునకు స్త్రీవేషము వేసి మునులదగ్గఱకుఁ దీసికొనివచ్చి, అయ్యా! ఈమె బభ్రువుని భార్య; సంతానము గలుగునా? యని యడిగిరి. మునులు వానిని సాంబునిగ నెఱిఁగి యాదవకులమునకు నాశనకరమైనముసలము పుట్టునని చెప్పిరి. మఱునాఁడే సాంబునికడుపునుండి రోఁకలి పుట్టెను. ఈ మాట యాదవులు కృష్ణునితోఁ జెప్పిరి. యదుకుమారులుచేసిన కొంటెపనికిఁ గృష్ణుఁడువిచారించి, రోఁకలినిముక్కలుముక్కలుగఁజేయించి సముద్రములోఁబారవేయించెను. తరువాతఁ గొన్నిదినములకే యాదవులు సముద్రతీరమున కరిగి, మద్యపానమత్తులై రోషజనకముగ సంభాషించుకొనుచు ఆరోఁకలిముక్కలతో నొకరి నొకరు కొట్టుకొని చచ్చిరి. అట్లు యదువంశము క్షయమునొందఁగ బలరాముఁడు నగరమువిడచి తపోవనమున కేగెను; ఇతఁడు వెళ్ళుట విని తానును దపస్సుచేసికొనుటకై కృష్ణుఁడరణ్యమునకు వెళ్ళి యచ్చట పరుండెను. ఇతనిని జూచి మృగమనితలఁచిబోయయొకఁడు బాణమువేసెను. అది కృష్ణుని యఱకాలియందుఁదగిలెను. దానిచే కృష్ణుఁడు పరమపదము నొందెను.

రామావతారమున నిష్కారణముగ వాలిని జంపిన కారణముచేతనే యీతని కీవిధమున మరణము కలిగెను. ఆ కొట్టిన బోయవాఁడు పూర్వజన్మమున వాలిపుత్త్రుఁడగు అంగదుఁడే.

కృష్ణుని శరీరమే కొంతకాలమునకు దారువయ్యెను. అదియే జగన్నాథమునందువిగ్రహము.

వానికై యరణ్యములో వెదకుచు వచ్చిన యర్జునుఁడు వానిశరీరమునుగాంచి దుఃఖించి దాని కగ్నిసంస్కారము చేసెను. జగన్నాథ.

కృష్ణుఁడు:-ఒకముని. దేవకియొక్క తనయుఁడు. ఘోరుఁడను మునికి శిష్యుఁడు. ఇతఁడు గురువు వలనఁ బురుషయజ్ఞ విజ్ఞానమును నేర్చుకొనెను. ఛాన్ద ఉ.

కృష్ణుఁడు:-ఆంధ్రజాతీయుఁడైనరాజు. వృషలుని తమ్ముఁడు. తర్వాత రాజ్యమేలెను. ఇతని పుత్త్రుఁడు శతకర్ణుఁడు. భాగ.

కే

కేకయరాజ రాక్షస సంహారము:- కేకయ రాజు రాజ్యమతిధర్మముతోఁ బాలించుచుండెను. ఇతఁడొకనాడు ఊరిబయటకుఁ జనఁగ, రాక్షసుఁ డొకఁడు వీనిని బట్టుకొనెను. వానిని విడిపించుకొనలేకపోయి, నారాజ్యమున నేవర్ణమువారును తమ ధర్మములు తప్పుటలేదే, నాయందేలోటు చూచి నీవు నన్ను ఇట్లు పట్టితివి? అనియడిగెను. ఇట్లు వర్ణరక్షణముచేయు రాజున కెన్నడును గీడురాదని చెప్పుటకే నిన్నుఁబట్టుకొంటినని చెప్పి రాక్షసుఁడు చనియెను. భార.

కేకయరాజు:- కైకేయితండ్రి. ఒకసిద్ధుఁ డిచ్చిన వరమువలన మృగకోటిభాష ఇతనికిఁ దెలియును. ఒకనాడు చీమలాడు మాటలు వినగ నవ్వువచ్చి నవ్వెను. భార్య ఏలనవ్వితివో చెప్పుమనియె.

చెప్పిన మరణము వచ్చును; చెప్పననియె. మరణము వచ్చినను సరే చెప్పుమనియె. వరమిచ్చిన సిద్ధుఁడు చెప్పవద్దనియె నని యితడు చెప్పక ఆగెను. రామా.

కేతుమంతుఁడు:- శ్రుతాయువు కుమారుఁడు. కళింగదేశమునకు రాజు.

కేతుమంతుఁడు:-అంబరీషుని పుత్త్రుఁడు. హరిని గూర్చి తపస్సు చేయుటకు నగరమును విడిచి వనమునకుఁ బోయెను. భాగ.

కేతుమంతుఁడు:- ధన్వంతరి పుత్త్రుఁడు. ఇతని సుతుఁడు భీమరథుఁడు. భాగ.

కేతుమతి:-సుమాలి భార్య.

కేతుమాలుఁడు:-అగ్నీధ్రుని కుమారుఁడు ఇతడు జంబూద్వీపములో నొక వర్షమును పాలించెను. ఇతని పేరును బట్టియే దానికిఁ బేరువచ్చెను. విష్ణు.

కేతువు:- విప్రచిత్తికి సింహికయందుఁ బుట్టిన కుమారుఁడు. పు. నా.

కేతువు:-అగ్నికి వికేశియందుఁ బుట్టిన కుమారుఁడు.

కేదారము:-హిమాలయపర్వతమునందొక శిఖరము అందు శివలింగ మొకటి ప్రతిష్ఠాపింపఁబడియున్నది.

కేరళుఁడు:-మరుత్తువంశపురాజు. సుధృతికుమారుఁడైన నరుని తనయుఁడు. ఇతఁడు పాలించిన దేశమే కేరళదేశము. ఇతని కుమారుఁడు బంధుమంతుఁడు. విష్ణు.

కేవలుఁడు:-సౌధృకేయుని కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు బంధుమంతుఁడు. భాగ.

కేశవుఁడు:-కేశి యను రాక్షసుని కృష్ణుఁడు సంహరించెను; కావునఁ గేశవుఁడను పేరున నతఁడు పరగునని నారదుఁడనియె. విష్ణు.

కేశి:-ఒకరాక్షసుఁడు. కంసునిపంపున గోష్ఠములోఁ బ్రవేశించి కృష్ణుని జంపుటకు యత్నించెను. కాని వీనినే కృష్ణుఁడు సంహరించెను. విష్ణు.

కేశిధ్వజుఁడు:-కృతధ్వజుని కుమారుఁడు. ఇతఁడు తనతండ్రిసోదరుఁడైన ఖాండిక్యునితో యుద్ధము చేసి వానిరాజ్యభాగమునుగూడఁ గైకొనియె. కేశిధ్వజుఁడు యాగముచేయుచుండఁగ యాగధేనువును బులి మ్రింగివేసెను. దానికిఁ బరిహారము చెప్పుఁడని యితఁడందఱిని వేడెను. అది ఖాండిక్యునకుఁ గాని యితరులకుఁ దెలియదనిరి. ఇతఁడు ఖాండిక్యుని యొద్దకు రథమెక్కి వెళ్ళెను. ఖాండిక్యుఁ డెదురుగఁ బచ్చి యాదరించి కర్తవ్యమెఱింగించెను. దానికి సంప్రీతుఁడై గురుదక్షిణముగ నేమి కావలయు ? నని కేశిధ్వజుఁడతని నడిగెను. ఇతనికి వచ్చు యోగవిద్యను నేర్పుమని మాత్రము ఖాండిక్యుఁడు కోరెను. ఖాండిక్యునకితఁడు యోగవిద్యను నేర్పెను. విష్ణు.

కేశిని:-సగరుని భార్య. ఈమె కుమారుఁడే అసమంజసుఁడు. భార.

కేశిని:-అజమీఢుని భార్య. భార.

కేశిని:-విదర్భయందు దమయంతిదాసి. ఋతుపర్ణునితో వచ్చిన బాహుకునివృత్తాంత మఱయుటకీమెను దమయంతి పంపెను. అతని గుణములను, దమయంతిపుత్త్రిని బాహుకుఁడెత్తుకొని విచారించుటయును నామె దమయంతికిఁ దెల్పెను. భార.

కేసరి:-ఒక వానరుఁడు, ప్రభాసతీర్థమున శంఖము, శబలము అను నేనుఁగులు మునులను బాధించుచుండఁగ నితఁడు వానిని సంహరించెను. వీనిని జూచి భరద్వాజుఁడు మెచ్చుకొనియేనుగులను జంపెను. గావున వీనికిఁ గేసరి యను పేరు పెట్టెను. మఱియు నా దుష్ట మృగములను జంపెను గావున వరము నిచ్చెదను వేడుకొనుమనియె. కామరూపియు, బలాఢ్యుఁడు నగు కుమారుని కేసరి కోరెను. కేసరి అంజనను వివాహమయ్యెను. అంజనయందు ఆంజనేయుఁడు జన్మించెను. రామా.

కేసి:-ఒక రాక్షసుఁడు. వీఁడు అరిష్టనేమి కుమార్తె యగు దేవసేనను ఎత్తుకొనిపోయెను. ఆమె యేడ్వఁగ నింద్రుఁడువచ్చి వీనిని సంహరించి యామెను రక్షించెను. భార.

కై

కైక:-(కైకేయి) కేకయరాజు కుమార్తె. దశరథుని భార్య. ఈమె ధవళాంగుఁడను మునివలన రాక్షసమాయలకుఁ బ్రతీకారములు చేయుట నేర్చుకొనెను. శంబరాసురునితో యుద్ధము చేయుచున్న యింద్రునకు సహాయముగ దశరథుఁడు వెళ్ళుచుండఁగ నీమెయు నతనితో వెళ్లెను. యుద్ధమందు రాక్షసులు చేయుచున్న మాయల కీమె ప్రతీకారములు చేయుచుండెను. దశరథుఁ డీమె చేసిన యుపకారమునకు సంప్రీతుఁడై రెండువరము లిచ్చెదను వేఁడుకొనుమనియె. నాకుఁ గావలసినపుడు కోరుకొనియెద నని కైక పలికెను.

దశరథునకు సంతానములేమి పోవుటచే నతఁడు పుత్రకామేష్టి చేసెను. యజ్ఞపురుషుఁడు పాయసమును దెచ్చియిచ్చెను. దానిని కౌసల్యకును, కైకకును దశరథుఁడు పెట్టెను. కైక తనకుఁ బెట్టిన భాగములో సగము సుమిత్రకుఁ బెట్టెను. దశరథుని వలన నీమెకు భరతుఁడు జన్మించెను. కైక సవతిపుత్రులనుగూడఁ బ్రేమతోడనే చూచుచుండెడిది. రామాదులకు వివాహములయ్యెను, రామునకు యువరాజపట్టము కట్టుటకై దశరథుఁ డేర్పాటు చేసెను. కైకయు సంతోషము నొందెను. కాని ఆమె దాసి మంథర యామెను జేరి దుర్బోధలు చేసెను. రాముఁడు రాజగుచోఁ గైక కౌసల్యకు దాసి కావలసివచ్చునని యామె చెప్పెను. కైక దాసిమాటలు నిరాకరించెను. కాని మంథర ఆమెను విడువక భరతుఁడు రాజు కానిచోఁ దమకుఁ గలుగు ననాదరణ యింతింత కాదని చెప్పెను. కైకకు వెనుక దశరథుఁడు రెండువరములిచ్చియున్నాఁడనియు, రాముఁడు పదునాలుగేండ్లు వనవాసము చేయునట్లును, భరతునకుఁ బట్టము కట్టవలసిన దనియును దశరథుని వేడుమని మంథర బోధించెను. ఆమె దుర్బోధలకుఁ గైక లోనయ్యెను. ఈమెను పిలుచుటకు దశరథుఁడు రాఁగా నీమె ముసుఁగిడి మాటాడదాయెను. కైకను దశరథుఁడు బ్రతిమాలెను. ఆడితప్పనివాఁడవు గావున నాకిచ్చెద నన్న వరము లిమ్మని కైక యడిగి మంథర చెప్పిన వరములు వేఁడెను. ఆ మాటలు వినుటతోడనే దశరథుఁడు నిశ్చేష్టుఁడయ్యెను. తండ్రిమాట చెల్లించుటకై రాముఁడడవులకు వచ్చెను. వనవాసమునకుఁ బోవుచున్న రామునకును, సీతకును, లక్ష్మణునకును నీమెయే నారచీర లిచ్చెను. అప్పటికి భరతుఁడు నగరమున లేఁడు. రాముఁడు వనవాసమున కేగెను. దశరథుఁడు ప్రాణములు విడిచెను. భరతుఁడు అయోధ్యకు వచ్చి తల్లి చేసిన దుష్కార్యములకు నిందించెను. పాపము అట్లు కైక నిందలపాలయ్యెను. రాముఁడరణ్యవాసము ముగిసిన పిమ్మట సీతాసమేతుఁడై వచ్చెను. భరతాదు లతనికే పట్టముగట్టిరి. కైక యాతనిచే మన్ననల నొందుచుఁ గౌసల్యవలెనే గౌరవింపఁబడుచుండెను. రాముఁ డశ్వమేధము ముగించిన పిమ్మటనే యీమెయు మేనువిడచెను.

కైకసి:-సుమాలికూఁతురు. ఒకనాఁడీమె తండ్రితోఁ గలసి రథముమీఁద వెళ్ళుచుండెను. వీరు మార్గమందు విశ్రవసుని జూచిరి. సుమాలి తన కూఁతు నతనికివ్వఁదలఁచుకొని యామె నతని యాశ్రమమునకు వెళ్ళి పరిచర్యలు చేయుచుండుమని చెప్పెను. ఈమె వెళ్ళి విశ్రవసునిఁ గొలుచుచుండెను. విశ్రవసుఁడు నీ వెవ్వరవని యామె నడిగెను. నేను సుమాలి కూఁతురను; పుత్రార్థినినై వచ్చితిని. నన్నుఁ గరుణింపుమని యామె పలికెను. సంధ్యాకాలమున వచ్చి యిట్లు ప్రసంగించితివి కావున నీకుఁ బుట్టువారు రాక్షసు లగుదురని విశ్రవసుఁ డనియె. ఈమెకు రావణుఁడును, కుంభకర్ణుఁడును విభీషణుఁడును, శూర్పణఖయును జన్మించిరి. ఉ. రా.

ఈమె విశ్రవసుని జేరినపుడు కైకసీ! నీ వెన్నిసారులు ఋతుమతి వైతివో నీకందఱు పుత్రుల నిత్తును చెప్పుమని విశ్రవసుఁడనియె. ఆమె పదునొకండుసారు లైతినని చెప్పి యందఱు పుత్రులక్కఱలేదని యొక పుత్రుని, నొక పుత్రికను గోరెను. విశ్రవసుని వాక్య మమోఘము గావునఁ బదితలలుగల పుత్రుఁడు రావణుఁడును, శూర్పణఖయును బుట్టిరి. వి. రా.

కుబేరుఁడు కైకసికి సవతిపుత్రుఁడు. అతఁడు పుష్పకమెక్కి తిరుగుచుండఁగ నీమె చూచి

యోర్వలేక రావణునితోఁ బుత్త్రికా! దుర్బలున ట్లూరకుండెదవేమి? యెటులైనను పుష్పకము నీవు పొందుమని చెప్పెను. ఉ. రా.

కైకేయి:- అజమీఢుని భార్యలలో నొకతె. భార.

కైటభుఁడు:- ఒక దనుజుఁడు. (చూడు మధుకైటభులు.)

కో

కోకిలాదేవి:- ద్రుపదుని భార్య. భార.

కోటర:- బాణాసురుని తల్లి. ఇతఁడు కృష్ణునితోఁ జేసిన యుద్ధముయొక్క మొదటిఘట్టములోఁ గృష్ణునిచే సంహరింపఁబడనుండ ఈమె దిగంబరియై జుట్టు విరఁబోసుకొని కృష్ణునెదురుగ నిలచెను. అతఁ డామెను జూచి అసహ్యించుకొని పెడమొగము పెట్టుకొనెను. ఆ సమయములో బాణుఁడు తనకోటకుఁ బారిపోయి మఱల నూతనాయుధములు గొని యుద్ధమునకువచ్చెను. భాగ.

కోటికాస్యుఁడు:- సురథుఁడనురాజుకుమారుఁడు; సైంధవుని మిత్త్రుఁడు. వనవాసము చేయుచున్న ద్రౌపదిని డాసి యామెతో నీవు సైంధవుని భర్తగఁ గైకొనుమని బోధించెను. ఆమెచే వీఁడు తిరస్కరింపఁబడియెను. భీముఁడు సైంధవునితోఁ బోరుటకు వచ్చినపుడు వీఁడుగూడ భీమునితోఁ బోరెను; అపుడే వీఁడతనిచేఁ జంపఁబడెను. భార.

కోలాహలము:- ఒక పర్వతము. హిమవంతుని పుత్త్రుఁడు. ఇతఁడు శుక్తిమతియను నదిని గామించెను. వీరిద్దఱకు వసుపదుఁడను కుమారుఁడును, గిరికయను కూఁతురును గలిగిరి. శుక్తిమతి ప్రవహించుట కీపర్వతము అడ్డుగానున్నందున వసువను రాజు దీనిని గాలితోఁ దన్ని నదికి మార్గము చేసెను. భార.

కోసలము:- ఒకదేశము. దీనికి రాజధాని అయోధ్య.

కోహళుఁడు:- ఒక సంగీతశాస్త్రకర్త.

కౌ

కౌత్సుఁడు:- వరతంతుముని శిష్యుఁడు. విద్య నేర్చిన పిమ్మట గురుని గురుదక్షిణ పుచ్చుకొమ్మని బలవంతపెట్టెను. గురుఁ డక్కఱలేదనినను నితఁడు వినకపోవుటచేఁ దాను నేర్పిన పదునాల్గువిద్యలకుఁ బదునాల్గుకోట్ల సువర్ణము లిమ్మనియెను. అవి సంపాదించుటకుఁ గౌత్సుఁడు రఘుమహారాజుకడకు వచ్చెను. అప్పుడే ఆరాజు విశ్వజిత్తు యాగము చేసి సర్వధనమును దానము చేసియుండుటచే అర్ఘ్యమిచ్చుటకుఁ జెంబుకూడ లేకపోవుటచే మట్టిపాత్రతో జల మిచ్చెను. దానిని జూచియే తనపని వాకిటిలోనే అయ్యెననుకొని పలుక, ధనార్థియై వచ్చిన బ్రాహ్మణ పండితుని నూరక పంపనని వానిని రెండు దినములు తన యింట నుండుమని కుబేరునికడనుండి రఘువు ధనము సంపాదించి యతని కిచ్చెను. రఘు.

కౌరవుఁడు:- కద్రువ కుమారుఁడు. భార.

కౌరవ్యుఁడు:- కద్రువ కుమారుఁడైన యైరావతుని వంశమువాఁడు. ఉలూచి తండ్రి. వసువుల శాపముచే నర్జునునకుఁ గలుగు నరకమెట్లు తప్పునని వసువుల నడిగి తెలిసికొని తన కుమార్తె కెఱింగించెను. (చూడు ఉలూచి) భార.జై.భా.

కౌశిక:- దేవి. శుంభ నిశుంభు లను దనుజులు యజ్ఞభాగముల నపహరించుచున్నారని దేవతలు గౌరితో మొఱపెట్టుకొనిరి. ఆమె శరీరము నుండియే కౌశికి పుట్టినది.

చండ ముండు లను దనుజు లీమెను జూచి యీమెవంటి లావణ్యవతి మఱియొకతె లేదని తమ యేలికలగు శుంభ నిశుంభులకుఁ జెప్పి యామెను వివాహము కాకపోయినయెడల వారి జన్మము జన్మము కాదని చెప్పిరి. తమ్మును బరిణయము కమ్మని కోరుచు శుంభ నిశుంభు లీమె కడకు సుగ్రీవుఁడను దూతను బంపిరి. తనతో యుద్ధము చేసియెవరు గెల్చెదరో వానినిఁ జేపట్టుదునని కౌశిక ప్రత్యుత్తర మిచ్చెను. మఱియు శుంభ నిశుంభులు పాతాళలోకమునకుఁ బోయి దేవతలను బాధింపకుండ నుండవలయు

నని యును, లేనియెడల సంహరించెద ననియును చెప్పుటకై శివుని దూతగాఁ బంపెను. కావున నామెకు శివదూతియను పేరు వచ్చెను. దాన శుంభ నిశుంభులకు రోషమువచ్చి తమ సేనాధిపతిని బంపి కౌశికిని బలాత్కారమున లాగికొని రమ్మనిరి. కాని కౌశికి యాసేనాధిపతిని ధూమ్రలోచనుని నీఱుగఁ జేసివైచెను. అంత శుంభ నిశుంభులు చండ ముండులను సేనల నిచ్చి పంపిరి. వీఁని గౌశికి సంహరించెను. తుదకు శుంభ నిశుంభులువచ్చి యుద్ధముచేసి యామె వలన మడసిరి.

కౌశిక చిత్రసేనులు :—హంసడింభకులు. ఈపేరులతో మహాసేనాన్వితులై జరాసంధునకు దక్షిణ వామభుజములవలె వర్తించుచుండిరి.

కౌశికపత్ని :— కౌశికుఁడను నొక బ్రాహ్మణుని భార్య. (ఈమెపేరు సుమతి)

కౌశికుఁడు కుష్ఠురోగియైనను వానిభార్య యత్యంత భక్తితో వానినిఁ గొలుచుచుండెను. కౌశికుఁ డొకనాఁ డొక కాంతను జూచి కామించి యామెకడకుఁ దనను గొనిపొమ్మని భార్యను గోరెను. అతని కీ తలఁపు కలిగినందుకే యామె మిక్కిలి విచారించి భర్తృనాజ్ఞ శిరసా వహింపవలసి యుండెను గాన నా రాత్రి యందు భర్తను దీసికొని పోవుచుండెను. చీకటిలోఁ గౌశికుఁడు మార్గమందుఁ గొఱత వేయఁబడి యుండిన మాండవ్యుఁడను వాని భుజమును దాకెను. మాండవ్యుని పుండు రేగి బాధపడి కోపముతో నా పుండు రేపినవాఁడు సూర్యోదయము కాఁగానే మరణించునని యతఁడు శపించెను. ఆమాటలు కౌశికుని భార్య విని భయపడి సూర్యుఁ డుదయింపకుండుగాక యని శపించెను. సూర్యుఁ డుదయింప లేదు. పెద్దకాలము చీకటిగనే యుండెను. దేవతలు బ్రహ్మకడకుఁ బోయి ప్రాతఃకాలమును గావింపు మనిరి. అనసూయను వేఁడుఁడని బ్రహ్మ చెప్పెను. దేవతలంత యనసూయయొద్దకు వచ్చిరి. సూర్యుఁ డుదయింప కుండుటకుఁ గారణము కౌశికుని పత్నియొక్క పాతివ్రత్యమని యనసూయ గ్రహించి, యామెకడకు వచ్చి కుశలమడిగి, ఈ చీకటిచే నరులును, దేవతలును బాధపడుచున్నారు. సూర్యోదయమును గావింపుము. నీ భర్త కట్టి భయమును రాదు. నేను వానిని బ్రతికించెదను అని చెప్పఁగఁ గౌశికపత్ని సూర్యుని బ్రార్థించి యుదయింపుమని వేఁడెను. సూర్యుఁడుదయించెను. అంతఁ గౌశికుఁడు మరణించెను. వీనిని అనసూయ మరల బ్రతికించెను. మార్క.

కౌశికుఁడు :— ఒక బ్రాహ్మణుఁడు. పెక్కేండ్లు తపస్సుచేయఁగ సావిత్రీదేవి ప్రత్యక్షమై వరము వేఁడుకొనుమనియెను. విశేష జపనిష్ఠయే కావలెనని యితఁడు కోరెను. నీకునుత్తమగతికలుగును. నీకడకు యమ కాలమృత్యువులు వత్తురని చెప్పి యామె అంతర్ధాన మొందెను. వారతనికడకు సాకారులైవచ్చి యూర్ధ్వలోకమునకు రమ్మని యటకు మేను విడచి రావలయు ననిరి. అతఁడీ దేహము విడువనొల్లననియె. వీనిని గొనిపోవుటకే వారు వచ్చియుండుట చెప్పిరి. మీ కేమి సేయువాఁడనని యడుగ నింతలో నిక్ష్వాకు వచ్చెను. నీవు అతిథివిగ వచ్చితివి. ఏమి కావలెనో కోరుకొను మిత్తునని కౌశికుఁడన, నేను రాజను. ఇచ్చువాఁడనే కాని పుచ్చుకొను వాఁడనుగానని, నీవడుగుము. నీవడిగినది నేనిత్తుననియె. ప్రవత్తిమార్గమున నున్నవారు పుచ్చుకొందురు. నేను నివృత్తినుంటిని. నేను పుచ్చుకొనను అనెను. పూజారూపమున నిచ్చునది యతిథి పుచ్చుకొనుట యెగ్గుకాదని చెప్పెను. అట్లగుచో నీతపఃఫల మిమ్ము అని ఇక్ష్వాకు అడిగి నీతపస్సుయొక్క ఫల మెట్టిదనియె. నేను ఫల మపేక్షించి తపస్సు చేయలేను. దాని రూపు నాకు తెలియదనియెను. ఫలము తెలియని తపస్సు నాకు వలదన, పుచ్చుకొందునని పుచ్చుకొనకుండుట దోషము. నా కసత్య దోషము వచ్చును అని వాదించుకొను చుండఁగఁ బుచ్చుకొనకున్న శపింతు ననియె. రాజు భయపడి చేయిచాపెను. కౌశికుఁడు తన తపస్సు ధారవోసెను. ఇక్ష్వాకు, నాకరమున జలములు పడియెను. మనకిద్దఱకు సత్కర్మ సమత్వముగఁ గలుగవలదా? నా యాగఫలము నీ కిచ్చెదను బుచ్చుకొమ్మనియె. బ్రహ్మాదులు వారిపై పూల వాన కురిపించిరి. నిర్మలోట త్తవతికిరమ్మని వారు పిలచిరి. బ్రహ్మరంధ్ర నిర్గతులైరి. (మూడుము భారతసారము) భార.

కౌశికుఁడు :- ఒక బ్రాహ్మణుఁడు. సత్యవ్రతము పూని తపస్సు చేసికొనుచుండువాఁడు. ఒక నాఁడు కొందఱు జనులు దొంగలచే దఱుమఁబడి పరుగిడి వచ్చి యితని యాశ్రమము చెంత దాఁగిరి. వీరి వెనుకనే దొంగలును వచ్చి వారిని గానలేక కౌశికుని చెంతకు వచ్చి పరుగిడి వచ్చిన జనులెచ్చటదాఁగిరని యడిగిరి. అసత్య దోషమునకు వెఱచి యితఁడు వారున్న చోటును జెప్పెను. తస్కరులు వారిని బట్టుకొని ధనము నపహరించి వారిని జంపిరి. దానివలనఁ గౌశికునకు నరకమే సంప్రాప్తమయ్యెను. భార.

కౌశికుఁడు :- ఒక బ్రాహ్మణుఁడు. సర్వదా విష్ణునిఁగూర్చి చక్కఁగ గానము చేయువాఁడు వీనియొద్దకుఁ బలువురువచ్చి వీనింగూడి పాడుచుండిరి. కళింగదేశపురాజు వచ్చి తన ఖ్యాతి వ్యాపించుటకై తననుగూర్చి గానము చేయుమనియెను. ఇతనిని వానిశిష్యులు నిరాకరించిరి. రాజాతనభటులను, దననుగూర్చి గానముచేయుఁడని ఆనతిచ్చెను. వారు పెద్దగఁ బాడఁ బ్రారంభించిరి. విష్ణుకీర్తనములుతక్క నితరము వినము కౌశికాదులు చెవులు మూసికొని చెవులలో బిరడాలు గొట్టుకొనిరి. రాజు వారల వెడల నడుపుడని ఆజ్ఞాపించెను. వారిని విష్ణుమూర్తి తనలోకమునకుఁ దీసికొనిపోయి గౌరవించెను. లక్ష్మి యీతనిపాట వినవచ్చెను. తుంబురునిఁ గూడ వానితోఁగలసి పాడుమనియె. రామా.

కౌశికుఁడు :- ఒక బ్రాహ్మణుఁడు. చెట్టుక్రిందఁ గూర్చుండి వేదాధ్యయనము చేసికొనుచుండగ చెట్టుపైనుండిన కొంగ వానిమీఁద రెట్టవేసెను. కౌశికునకుఁ గోపమువచ్చి పైకిఁజూచెను. వాని చూడ్కి తగిలి కొంగ భస్మమైపోయెను. తరువాత నతఁడు భిక్షార్థ మొక గృహమున కరిగెను. ఆ యింటియాపె వానినిఁ జూచియుఁ జాలసేపు వఱకు భర్తసేవ సేయుచునే యుండెను. ఆమె భర్తను నిద్రపుచ్చి వీనికై బిచ్చము తెచ్చెను. కౌశికునకు మిక్కిలి కోపమువచ్చి నన్నింత తడవేల నిల్పితి? వని యాపడఁతిని నడిగెను. అయ్యా! నా భర్తసేవ చేయుచుంటిని గాన నింతకుఁబూర్వమే బిచ్చము దేలేకుంటిని, నీవు కోపముతోఁ జూచెదవేల? నీ కోపాగ్నులముచే ఆ కొంగ భస్మమయ్యెనుగాని నాకు బాధ కలుగదు అని యాగృహిణి పలికెను. కౌశికుఁడాశ్చర్యమునొంది కొంగసంగతి నీకెట్లు తెలిసినది? చెప్పుమని వేఁడెను. ఆమె పతివ్రతయగుటచేతను, ధర్మవర్తిని యగుటవలనను దెల్లమయ్యెనని వానికిఁ గొన్ని ధర్మములు బోధించి యాతఁడింకను దెలిసికొనఁ గోరెనేని మిథిలానగరమునన్న ధర్మవ్యాధునికడకుఁ బొమ్మనియెను. కౌశికుఁడు ధర్మవ్యాధుని జూచు వేడుకతో నచ్చటి కరిగెను. మాంసము నమ్ముచున్న వ్యాధుని జూచెను. వానిని డాయ సందేహము నొందుచు దూరముగ నిలచి యుండెను. వ్యాధుఁడు వీనిని జూచి వచ్చి నమస్కరించి అయ్యా! మిమ్ము ఆ బ్రాహ్మణస్త్రీ బంపి యుండును. రండు ఆతిథ్యము గైకొనుఁడని పిలచెను. బ్రాహ్మణస్త్రీ పంపినట్లు వానికెట్లు తెలిసెనని కౌశికుఁ డాశ్చర్యము నొంది నీవు ధర్మపరుఁడవైన జీవహింస యేల చేసెదవు? మాంస మమ్మువానికి ధర్మమెక్కడ? అని ప్రశ్నించెను. అయ్యా! మాంసవిక్రయము చేయుటయే నాధర్మము. అది చేయకుంటినేని ధర్మము తప్పినవాఁడ నగుదును. ఎవరిధర్మములు వారు చేయకుండుటయే దోషము అని వానికి ధర్మములు పెక్కులు బోధించెను.

వానిని దన యింటికి దీసికొనిపోయి తన తల్లిదండ్రులను వాని గొలుచుచుండుటచేతనే తనకీజ్ఞానము గలిగినదనెను. మఱియు ఆ పతివ్రత పంపుటచే నాతనికి ధర్మములుచెప్పెను గాని యితని జూడఁగ నిష్టము కలుగలేదనియె. దానికి లోపము ఇతని తల్లిదండ్రులు పెద్దలై యీ కుమారుని సహాయ మపేక్షించుచున్నను వారిని విడిచి తా నధ్యయనము సేయుచుండుట అధర్మమని చెప్పెను. కౌశికుఁడు వానిచే బోధితుఁడై వీఁగుణములనుబట్టి నీవు విప్రుఁడవే యని కొనియాడి తన తలిదండ్రులసేవ చేయుటకుఁ బోయెను. భార.

కౌసల్య :- పూరుని భార్య. ఈమె కుమారుఁడు జనమేజయుఁడు.

కౌసల్య :- కోసలదేశపురాజైన భానుమంతునికుమారితె. ఒకనాఁడీమె యుద్యానవనమున విహరించుచుండఁ దశరథుఁడు కనబడియె. అతనినిజూచి

నప్పటినుండియు నతనిపై నీమెకు వలపు గలిగెను. దశరథునకుఁ దన పెంపుడు చిలుకచేఁ దన వ్రేలియుంగరమునుగూడఁ బంపెను. భానువంతుఁడును దన కుమార్తెను దశరథునకే యివ్వఁదలఁచుకొని యుండెను. ఇతఁ డాహ్వానము నేయఁగ దశరథుఁడు కౌసల్యను వివాహమగుటకై సపరివారంబుగఁ బ్రయాణమయ్యె. కాని దురదృష్టమున మార్గమధ్యమందు నదిలోఁ గొట్టుకొనిపోయెను.

రావణుఁడు కౌసల్యకుఁ బుట్టు కుమారునిచేఁ దనకు మరణము సంభవించునని విని యామెను జంప నిశ్చయించికొని యామె నెత్తికొనివచ్చి సముద్రమునమందసంబునఁ బెట్టెను. విధివశంబున దశరథుఁడు నదిలోనుండి కొట్టుకొని వచ్చి కౌసల్యయుండిన చోటును జేరెను. అచ్చటనే కౌసల్యా దశరథులకు వివాహమయ్యెను.

నారదుఁడు కౌసల్యను జంపుట పౌరుషము కాదనియు, నామెకుఁబుట్టు కుమారునిఁ జంపుమనియుఁ జెప్పుటచే రావణుఁడు కౌసల్యను జంపుటమానెను. ఈ దంపతులను జటాయువను పక్షి యయోధ్యకుఁ గొనిపోయె. కౌసల్యకుఁ బెద్దకాలమువఱకు సంతానము లేకపోవుటచే దశరథుఁడు పుత్త్రకామేష్టి చేసెను. యజ్ఞపురుషుఁ డిచ్చిన పాయసమును గొంత యీమె సవతియగు సుమిత్రకిచ్చి యీమె భుజించెను. ఈమె గర్భంబున విష్ణువే శ్రీరాముఁడుగ జన్మించెను.

ఈమె కుమారునకుఁ బట్టము కట్టఁబోవునపుడు వానిని బదునాలుగేండ్లువనములకుఁబంపుమని ఈమె సవతియగుకైక కోరెను. రాముఁడు వనవాసమున కేగినపిదప దశరథుఁడు మరణించినను బుత్త్రవాత్సల్యముచే నీమె జీవించియుండి రాముఁడు మఱల నయోధ్యకువచ్చి పట్టాభిషిక్తుఁడై యశ్వమేధమును జేసినపిమ్మట మేను విడిచెను. ఈమె పూర్వభవమున అదితి.

కౌషీతకి:—ఒకముని ఇతఁడు తనకుమారుని బిలచి "నేను ఆదిత్యస్వరూపమును ఏకవిధముగనే ఉపాసించుటచే నీవు ఒక్కరుఁడవే పుట్టితివి. నీవు కిరణములనే యనేకగుణములతోఁగూడిన యాదిత్యస్వరూపమును ఉద్గీథప్రణవమున నుపాసించుము; పలువురు పుత్త్రులు కలుగుదురు" అని చెప్పెను. ఛాన్దో. ఉ.

క్ర

క్రతువు:— బ్రహ్మ మానసపుత్రుఁడు. కర్దముని కుమార్తయైన క్రియ యితనిభార్య. ఇతని కుమారులు వాలఖిల్యులు. భార. భాగ.

క్రతువు:—ఊరుని పుత్త్రుఁడు. ఇతనిభార్య సన్నతి. మత్స్య.

క్రతుస్థల:— ఒక యువతి. ఈమె వసురుచియను గంధర్వుని వలచి యతనినే భర్తగఁ బడయఁ గోరుచుండెను. యక్షుఁడనువాఁ డొకఁడీమెను బరిణయము కాఁగోరుచుండెను. యక్షుఁ డీమె చెంత కరిగి తనకోరిక వెలిపుచ్చెనుగాని యీమె వీనిని నిరాకరించెను. ఈమె వసురుచిని వలచియుండుట యక్షుఁడు తెలిసికొని తానువసురుచి రూపమున నీమె చెంతకరిగెను. తానలచినవాఁడు వచ్చెనని క్రతుస్థల సంతోషముతో వానిం గూడెను. ఆమె గర్భవతియై రజితనాభుఁడను పుత్త్రునిఁ బడసెను. పిదపఁ గ్రతుస్థల యక్షుని నిజరూపముచూచి వాఁడు గావించిన మోసమెఱింగి విచారించి యికఁ జేయునదిలేక వానితోడనే కాపురము చేసెను. బ్రహ్మ.

క్రి

క్రియ:—కర్దమప్రజాపతి కూఁతురు. క్రతువుభార్య. భాగ.

క్రియ:—ధరణీవత్సులకుమార్తె. ధర్ముఁడను మనువు భార్య. భార.

క్రో

క్రోధ:-ధరణీదక్షుల పుత్రిక. కశ్యపుని భార్య. భార.

క్రోధ:-కాలయొక్క కుమారిత. భార.

క్రోధుఁడు:-భైరవులలో నొకఁడు. (చూడుము భైరవులు.)

క్రోష్టుకి:-ఒకముని. మార్కండేయునివలన ననేక విషయము లెఱింగింపఁబడి జ్ఞానము నొందెను. మార్క.

క్రౌ

క్రౌంచపర్వతము:- మైనాకుని కుమారుఁడు. మహిషాసురుఁడు మొదలగు రాక్షసులు దేవతలను బాధించుచు వారు తఱుముకొని వచ్చిరేని యీ పర్వతగుహయందు దాఁగుకొనుచుందురు. ఈ పర్వతమట్లు రాక్షసులకు సహాయమగుటచే దానిని కుమారస్వామి భేదించెను. భార.

క్ష

క్షత్రబంధుఁడు:-ఒకరాజు. బ్రాహ్మణులకై తన ప్రాణమును విడిచెను. బ్రాహ్మణ క్షేత్రము నుండి గాలికి గొట్టుకొనివచ్చు రేణువునకు భయపడి తొలఁగివచ్చు మాలవానిని జూచి యేల యిటువెఱచి వచ్చుచుంటివని యడిగెను. నేను తొలిజన్మమున బ్రాహ్మణుఁడను. ఒకనాఁడు నదీతీరమున భిక్షితాన్నము తినవేసుక పెట్టి తిరుగచుండఁగ బ్రాహ్మణ క్షేత్రమునుండి ధూళివచ్చి యన్నమందుఁ బడెను. ఆ ధూళియు నన్నముతోఁ గడుపులోనికిఁ బోయినది. ఆ పాతకమున నాకీ జన్మము కల్గినది. బ్రాహ్మణుల పాదరేణువైన హరించిన నిట్లగును. నిన్నరాత్రి నాకుఁ గలలో నొక విప్రుఁడు రేపు నీవు క్షత్రబంధు సంవాదముచే దుఃఖము పోవునని చెప్పెను అని చెప్పి యా మాలమృతుఁడయ్యెను. భార.

క్షత్రవృద్ధుఁడు:- పురూరవుని కుమారుఁడు. నహుషుని తమ్ముఁడు. భాగ.

క్షత్రవృద్ధుఁడు:-సుహోత్రుఁడు. కుశుఁడు ఇతని కుమారులు. భాగ.

క్షత్రోపేతుఁడు:-అక్రూరుని తమ్ముఁడు.

క్షీ

క్షీరసాగర మథనము:-జగములెల్లను నిశ్శ్రీకములై రాక్షసప్రభయెక్కుడై యుండఁగ ఇంద్రాది దేవతలను వెడలఁగొట్టి యింద్రనగరము నేలుచుండెను. దేవతలు బ్రహ్మతోఁ గలసి విష్ణుమూర్తి కడకేగి రక్షింపుమని ప్రార్థించిరి. మీకు సమయము వచ్చువఱకును, మీకు బలము వచ్చువఱకును మీరు ఓర్చియుండవలయును గాని వేగిరింపఁగూడదు. ప్రస్తుతము దానవులతో మైత్రి చేసి వారి సహాయమున క్షీరసాగరమును మథింపుఁడు. దాన మీకు సర్వసంపదలును గలుగునని విష్ణువు చెప్పెను. దేవత లంత దైత్యులకడకుఁ జని మనమక్కసెల్లెండ్ర బిడ్డలము. మనకు వైరమేల? సఖ్యము కలిగి, యన్యోన్య సహాయము చేసికొనుచు నుందుమని చెప్పిరి. దానికి దైత్యు లంగీకరించిరి. దేవతలు మందరపర్వతమును వేఁడి, దానిని గొనివచ్చి దానిని దెచ్చుటలో బాధపడిరి. విష్ణుమూర్తియే ఆపర్వతమును వారికి సహాయము చేయుమన నది గరుడునివెనుకనే వెడలి క్షీరసాగరము చేరెను. దానిని కవ్వముగనుంచి వాసుకిని ప్రార్థించి వానిని తరిత్రాడుగఁ జేసిరి. దైత్యులు కూడ దేవతలకు సహాయులై వచ్చిరి. మందరము క్షీరసాగరమున నుంచి మథింప నారంభించిరి. దానవులే వాసుకిశిరస్సు పట్టుకొందుమనిరి. దేవతలు వానితోఁక పట్టుకొనిరి. కొంత మథించఁగ పర్వతము జారి సాగరములో దిగఁబడెను. దేవతలు భగవంతుని ప్రార్థించిరి. విష్ణుమూర్తి కూర్మమై పర్వతముక్రిందఁ జేరి దానిని పైకెత్తనెత్తెను. దేవ

తలఁ జయజయధ్వానములఁ జేయుచు సముద్రమును మఱలఁ ద్రచ్చిరి. దానినుండి హాలాహలము పుట్టెను. దేవతలును, దానవులును భయపడి పరుగెత్తి శివునికడకుఁ బోయి వానిని బ్రార్థించిరి. శివుఁ డా విషమును మ్రింగి కంఠమం దుంచుకొనెను. సముద్రమును మథించుటచే నందుండి లక్ష్మి, అమృతము, చంద్రుఁడు, కల్పవృక్షము, ఐరావతము, ఉచ్చైశ్శ్రవము మొదలగునవియును, అమృతకలశముతో ధన్వంతరియును బుట్టెను.

అమృతము మొదట దానవు లందుకొనిరి. దానిని దేవతల కిప్పించుటకు విష్ణుమూర్తి మోహినీరూపమును దాల్చెను. భాగ.

క్షీరసాగరము:-ఉపమన్యువు బాల్యమునఁ బాల కొఱకుఁ దపస్సు చేయఁగ వాని నిమిత్త మీశ్వరుఁడు క్షీరసాగరమును సృజించెను. శివ.

క్షు

క్షుతుఁడు:-బ్రహ్మ తుమ్ముటచే నతని గర్భమందుండి పుట్టిన పుత్త్రుఁడు. ఇతఁడే బ్రహ్మచేయు యజ్ఞమునకు ఋత్విజుఁ డయ్యెను. భార.

క్షుతుఁడు:-కృతయుగమున దండనీతి ప్రవర్తకుఁడగు మనువునకు జనించిన ప్రజానియనువాని పుత్త్రుఁడు. ఇతని తనయుఁడు ఇక్ష్వాకు. భార.

క్షుధాతీర్థము:-పూర్వము కాటకమువచ్చినపుడు కణ్వమహాముని యాహారములేక బాధపడుచుండినను నాహారము సమృద్ధిగా నుండిన గౌతమముని యాశ్రమమునకుఁ బోక గౌతమీతీరమున కేగి యానదియందు స్నానముచేసి ప్రార్థన చేసెను. గౌతమి ప్రత్యక్షమై వరము కోరుకొను మనియె. నిన్ను వేడినవారికి ఆఁకలి బాధగాని, ఈతిబాధలుగాని లేకుండునట్లు వర మిమ్మని కణ్వుఁడు కోరెను. అతఁడు ప్రార్థించిన ప్రదేశము క్షుధాతీర్థము. బ్రహ్మ.

క్షుపుఁడు:-ఒకరాజు. పూర్వము లోకమరాజకమై యుండఁగ సకలధర్మరక్షణము చేయఁగలుగు రాజు నిమ్మని ప్రజలు బ్రహ్మను వేడిరి. సర్వదిక్పాలురయంశములను బ్రహ్మ యడిగి తెచ్చి క్షుపుఁడను రాజును జేసెను. రామా.

క్షే

క్షేమదర్శి:-ఒక రాజు. కోసలదేశమును బాలించుచుండెను. ఇతనితండ్రికి సఖుఁడగు కాలకవృక్షీయుఁ డను ముని కాకి నొక దానిని పంజరమునఁ బెట్టుకొనివచ్చి యీకాకి త్రికాలవేది. నీరాజ్యమున నీచేఁ బట్టుపడని చోరుల నిది యెఱిఁగి చెప్పఁగలదని చెప్పెను. ఆమాటలు రాజభటులు విని తమగుట్టులు బయటఁబడునని భయపడి కాకిని జంపిరి. ఇతనిచే నియుక్తులగు నధికారులందుఁ జోరు లుండిరనుట కిదియే దృష్టాంతమని ఆ వంచకులకు బరస్పరద్వేషము కల్పించి యొకొక్కరినే దండింపుము. నీకిది నిదర్శనపూర్వకముగఁ దెలియఁజెప్పుటకే యొక కాకి నిట్లు కట్టుకొనివచ్చితిని అని చెప్పెను. మఱియు దండింపుమనియు ముని చెప్పెను. ఆ యధికారుల పేరులు చెప్పెను. రాజు అట్లు చేసి ఇతనిని మంత్రినిగఁ జేసికొని సుఖమున నుండెను.

క్షేమధన్వుఁడు:-
క్షేమధన్వి:- } పుండరీకుని కుమారుఁడు; ఇతని పుత్త్రుఁడు దేవానీకుఁడు. రఘు. భాగ.

క్షేమధూర్తి:- కులూతాధీశ్వరుఁడు. భారతయుద్ధములోఁ గౌరవులపక్షమునఁ బోరెను. ఇతనిని భీముఁడు చంపెను. భార.

క్షేమవర్ముఁడు:-కాకవర్ణుని కుమారుఁడు. ఇతని తరువాత నితనికుమారుఁడైన క్షేత్రజ్ఞుఁడు రాజ్య మేలెను. భాగ.

క్షేమవృద్ధి:-సాల్వుని సేనాధిపతి. భార.

క్షేమ్యుఁడు:-ఉగ్రాయుధుని కుమారుఁడు. భార.

ఖ

ఖగముఖుఁడు:-ఒక బ్రాహ్మణుఁడు; సహస్రపాదుని సహాధ్యాయుఁడు. ఇతనిపై సహస్రపాదుఁడు పరిహాసమునకు గడ్డిపామును వేయఁగ భయపడి యతనిని బలహీనమైన పామువు గమ్మని శపించెను శాపవిమోచనము ప్రసాదింపుమని సహస్రపాదుఁడు ప్రార్థింపఁగ రురుఁడను వాఁడు నిన్నుఁ గొట్టవచ్చినపుడు శాప విమోచనము కల్గునని యితఁడు చెప్పెను.

ఖట్వాంగ దిలీపుఁడు:- భగీరథుని పుత్త్రుఁడు ఇతని తల్లి భానుమతి.

ఖట్వాంగ దిలీపుఁడు:-నాభికవచుని కుమారుఁడైన యిలబిలుని పుత్త్రుఁడు.

దిలీపుఁడు సుదక్షిణను బరిణయమయ్యెను. ఇతఁడు దానవులతోఁడి యుద్ధమందింద్రునకు సహాయముగ వెళ్ళెను. ఆసమయమున సుదక్షిణ ఋతుమతియయ్యెను. ఆమెను దలఁచుకొని ఋతుమతియైన భార్యను గూడనిచో భ్రూణహత్యాదోషము వచ్చునని దిలీపుఁడింద్రలోకమునుండి తొందరగ వచ్చుచు మార్గమందున్న సురభికి నమస్కరింపఁడయ్యె. అందువలన సురభికిఁ గోపమువచ్చి నీవపుత్త్రుఁడవు కమ్మని శపించెను. ఇతఁడు తొందరగవచ్చు కారణము సురభికిఁదెల్పి భూలోకమునకు వచ్చి భార్యాసహితుఁడై వశిష్ఠు నాశ్రమమునకుఁ బోయి యాతని యాగధేనువు నర్చించెను. దాని యనుగ్రహమున నితనికి రఘువను పుత్త్రుఁడు జన్మించెను. దిలీపుఁడు నూఱవ క్రతువు చేయుచుండఁగ నింద్రుఁడు యాగాశ్వమును హరించెను.

దిలీపుఁడు యుద్ధమందు దేవతలకు సహాయము చేయుటచే దేవతలు వీనిని వరము వేడుకొనుమనిరి. తన కాయుష్కాల మెంతయున్నదని దిలీపుఁడడుగఁగ రెండు గడియలుమాత్ర మున్నదని వారు చెప్పిరి. దిలీపుఁడు వెంటనే యుర్వికి వచ్చి యైహిక సుఖములు విడచి యోగవిద్యచే విష్ణుసాయుజ్యమును బొందెను.

(ఖట్వాంగ దిలీపుఁడు దిలీపుని దాయాది.)

ఖట్వాంగుఁడు:- భైరవులలో నొకఁడు. (చూడుము భైరవుఁడు)

ఖట్వాంగుని పుత్త్రుఁడు దీర్ఘబాహుఁడు.

భాగ. విష్ణు రఘు.

ఖడ్గము:-పూర్వము బ్రహ్మ దేవతలు, మనుజులు, జంతువులు మొదలగువానిని సృష్టిగావించెను. వారు వారు తమధర్మములఁబోవుచుండిరి. కాని దైత్యులు అన్యాయవర్తనులై దేవతలకు, మునులకు బాధకలుగఁజేయుటచే బ్రహ్మహిమశైలము కడ పెక్కేండ్లు తపస్సుచేసి క్రతువు చేసెను. దాన పెనుభూత మొకటి పుట్టెను. దానితో సూర్యునికాంతి మాసెను. సుడిగాలిపుట్టె. ఉల్కాలములురాలె. దేవతలు భయపడి బ్రహ్మకడకుఁబోయిరి. అది తనతపస్సువలనఁ బుట్టె, భయపడవలదని చెప్పెను. ఆ భూతమే ఖడ్గాకారము దాల్చెను. బ్రహ్మ దానిని శివునకీయఁగ నతఁడు దైత్యుల సంహరించెను. పిమ్మట దానిని విష్ణువునకిచ్చెను. అతఁడు మరీచికిఁ భార్గవులకు, మన్వాదులకు, పుడమిపాలకులకు నిచ్చిరి. ఒకముని అనుగ్రహంబున ద్రోణుఁ డీ విధముగ నధిగమించెను. దీనికి నక్షత్రము కృత్తిక. అధిదేవత అగ్ని. గురుఁడు రుద్రుఁడు. భాగ.

ఖనిత్రుఁడు:-(ఖనీనేత్రుఁడు) వివింశుని పుత్త్రుఁడు. ఇతఁడు పుత్త్రార్థియై పితరులకు మాంసముతో భోజనము పెట్టఁదలఁచుకొని మృగమును దెచ్చుటకై వనమున కేగెను. ఒక మృగము వచ్చి, ఓరాజా! నన్నుఁజంపుము. పుత్త్రులు లేకపోవుటచే నాకుఁ గలుగు దుఃఖ మింతింతగాదు. ఇఁక నాదుఃఖమును బోఁగొట్టుమనియెను. మఱియొక మృగము వచ్చి, రాజా! నన్ను సంహరింపుము. నాకు సంతానము చాలఁగలదు. ఏబిడ్డ యేపులి నోటఁబడునోయని యెల్లప్పుడును నాకుభయమే కలుగుచుండును. అని చెప్పెను. ఖనీనేత్రుఁడీ మృగముల వచనములు విని మృగములను జంపు నభిప్రాయమును మానితనపితరులవలెఁ దపస్సుచేసి బలాశ్వుఁడను (కరంధముఁడను) పుత్త్రునిబడసెను. ఖనిత్రుఁడు తన రాష్ట్రమందలి ప్రజలను బాధించుచు మంత్రులను, దన సోదరులను గూడ ననాదరణ సేయుచుండెను. అందువల్ల

మంత్రులు వీనిని రాజ్యభ్రష్టునిఁ జేసి యితని కుమారుఁడగు కరంధమునకుఁ బట్టముకట్టిరి.
భార. మార్క.

ఖనిత్రుడు:– ప్రాంశుప్రజాపతి పుత్త్రుఁడు. ఇతని కుమారుఁడు క్షుపుఁడు.

ఖనినేత్రుఁడు:– రంభుని పుత్త్రుఁడు. ఇతని పుత్త్రుఁడు కరంధముఁడు. భాగ.

ఖనిపుత్రిక:– ఖని యొక గార్గ్యవంశపు ముని. ఇతఁడు తన తపోబలమువలన నొక పుత్త్రికను బడసెను. ఈమె కన్యాత్వముననే యుండి వ్రతము సల్పుచు స్వర్గమునుఁ జేరఁగోరెను. ఈమెకు నారదుఁడు కనఁబడి పాణిగ్రహణము చేయని వనితలకు స్వర్గమురాదని చెప్పెను. ఈమె తన తపఃఫలమునుండి సగభాగము నారదున కిచ్చి వానిసహాయమున గాలవాశ్రమని వరించి, వానితో నేకరాత్రి సహవాసము చేసెను. ఆ రాత్రి గూమె యౌవనవతియై యొప్పెను. మఱునాఁ డుదయముననే యీమె స్వర్గమును బొందెను.

ఖమిత్త్రుఁడు:– ప్రమతి కుమారుఁడు. ఇతని కుమారుఁడు చాక్షుషుఁడు. భార.

ఖరుఁడు:– ఒక దనుజుఁడు. రావణుని పినతల్లి కుమారుఁడు. ఇతనిసోదరుఁడు దూషణుఁడు. వీరు దండకారణ్యములో నుండువారు. శూర్పనఖ యామె భర్త చనిపోయిన పిదప వీరికడ నుండుచుండెను. లక్ష్మణుఁ డామె ముక్కు చెవులు కోయఁగ నామె వీరితోఁ జెప్పి దుఃఖించెను. ఖరుఁడు, దూషణుఁడు, త్రిశిరుఁడు మొదలగువారు రామలక్ష్మణులను హింసింపఁబోయి వారితోఁ బోరాడి వారిచేతనే చచ్చిరి.

ఖరుని కుమారుఁడు మకరాక్షుఁడు.

ఖరుఁడు:– విశ్రవసునకు రాకయను రాక్షసాంగనయందుఁ బుట్టినకుమారుఁడు. శూర్పణఖ ఇతని సహోదరి. భార.

ఖా

ఖాండవప్రస్థము:– హస్తినాపురసమీప ప్రదేశము. ఇచ్చటనే పాండవులకు విశ్వకర్మ నగరమును నిర్మించెను. భార.

ఖాండవవనము:– దివ్యౌషధయుక్తమైన యొక దివిజవనము. ఇది యింద్రునిచే రక్షింపఁబడుచుండునది. ఇంద్రునిమిత్త్రుఁడగు తక్షకుఁడు దానిని గాఁచుచుండెను. అట్లు కాపాడఁబడుటచే నందలి సర్వమృగములు భయముతోక తిరుగుచుండెను. శ్వేతకి అను రాజర్షి చేసిన యాగములందలి నిరంతర ఘృతధారలచే నగ్నిదేవున కగ్నిమాంద్యము, తేజోహీనత, దప్పి కలిగెను. అతఁడు బ్రహ్మతోఁ దన శరీరస్థితి చెప్పుకొనెను. వేరొకదానివలన నది కుదురదనియును, దివ్యౌషధయుక్తమైన ఖాండవవనమును భక్షింపుమనియును బ్రహ్మ చెప్పెను. కాని దాని రక్షకులు చేయు విఘాతంబులు వారింపలేక తన కది సాధ్యముకాలేదని అగ్ని మరల బ్రహ్మతోఁజెప్పెను. నరనారాయణులు కృష్ణార్జునులై ఆ వనముచెంత విహరింతురు. వారిని వేడుము అని బ్రహ్మ చెప్పెను. కృష్ణార్జునులు ఆ వనముచెంత నున్నప్పుడు అగ్ని బ్రాహ్మణరూపమున వచ్చి తన కా సహాయము చేయుమనియెను. తమ కాయుధములు లేవనగా రథము, చక్రము, గద, గాండీవము అగ్నివారల కిచ్చెను. వారభయ మొసంగ దానిని భక్షింప మొదలిడియె. ఖాండవవనము దహింపఁబడునని తక్షకుఁడు విని అందుండి వెడలిపోయెను. దానిని రక్షించుటకు ఇంద్రుఁడుకూడ వచ్చి కృష్ణార్జునులతోఁ బోరుచుండెను. ఆకాశవాణి వారు నరనారాయణులనియును, ఖాండవవనము దహింపఁబడుట విధిహిత మనియును బలికెను. ఇంద్రుఁడు వారలతో సఖ్యము చేసెను. అశ్వసేనుఁడు, మయుఁడు, మందపాలుని నల్గురు పుత్త్రులుతప్ప దక్కిన సర్వజీవములు దానిలో దహింపఁబడియె.

అగ్ని కృష్ణార్జునుల సహాయముపొంది యీ వనమును భక్షించెను. భార.

ఖాండిక్యుఁడు:- అమితధ్వజుని కుమారుఁడు ఇతఁడును, నితని సోదరుఁడు కృతధ్వజుఁడును రాజ్యమును బంచుకొని పాలించుచుండిరి. కృతధ్వజుని కుమారుఁడు కేశిధ్వజుఁ డితనిపై యుద్ధమునకు వచ్చి యోడించి వీని రాజ్యభాగమును గైకొనియె. పిమ్మట గొంతకాలమునకుఁ గేశిధ్వజుఁడు యాగము చేయుచుండఁగ నతని యాగధేనువును బులి మ్రింగెను. దానికిఁ బ్రతీకారము చెప్పుమని కేశిధ్వజుఁ డీతనికడకు వచ్చి యడిగెను. ఇతని మంత్రులు, నిన్నుఁ జంపుటకై కేశిధ్వజుఁడు వచ్చుచున్నాఁడు కాఁబోలు; నీవు వానికడకు వెళ్ళకుమని ఖాండిక్యునితోఁ జెప్పిరి. కాని యతఁ డెదురుగ వెళ్ళి కేశిధ్వజు నాదరించి వానినిదీసికొనివచ్చి వానికిఁ గావలసినది చెప్పెను. గురుకట్నముగ నీకేమి కావలయునని కేశిధ్వజుఁ డితని నడిగెను. ఖాండిక్యుఁడు తన రాజ్యభాగ మడుగ లేదు. ధన మడుగలేదు. కాని కేశిధ్వజుఁడు నేర్చినయోగవిద్యను దనకును నేర్పుమని కోరెను.
విష్ణు.

ఖ్యాతి:- ఊరుని పుత్త్రుఁడు. మత్స్య.

ఖ్యాతి:- కర్దమునికూఁతురు. భృగువుభార్య. దేవాసుర యుద్ధమందు దానవులు విష్ణుమూర్తికి వెఱచి భృగుపత్ని వెనుక దాఁగిరి. ఈమె వారిని గాపాడుచుండెను. దానవులను సంహరించుటకై విష్ణుమూర్తి యీమెను సంహరించెను. ఈమె ప్రాణములు విడుచుచు నీవు భార్యావియోగము నందుమని విష్ణుమూర్తిని శపించెను. ఈ శాపమువలననే విష్ణుమూర్తి రామావతారమున భార్యావియోగము నొందెను.
భాగ. రామా.

గ

గంగ:- తొలిజన్మంబునఁ గర్దమపుత్త్రియైన కళయందు మరీచివలనఁ బుట్టిన కుమారిత. అప్పుడామె పేరు పూర్ణిమ. ఈమె జన్మాంతరమున హరిపదప్రక్షాళితజలమున గంగ యనుపేరునఁ బుట్టెను. ఈమెకు దేవకుల్యయను కుమారితయును, విరజుఁడను పుత్త్రుఁడును గలిగిరి. భాగ.

వామనమూర్తి విజృంభించి యాకసమును దన పాదముచేఁ గప్పినపుడు బ్రహ్మ తన కమండలోదకముచే విష్ణుమూర్తియైన యా వామనునియొక్క పాదము కడిగెను. ఆ కడిగిన జలమే గంగానదియై ప్రవహించె. ఈ విధమున గంగానది విష్ణుపాదోద్భవ యయ్యెను.

గంగయు, లక్ష్మియు, సరస్వతియు విష్ణుమూర్తి భార్యలు. వీరు ముగ్గురును భర్తదగ్గఱనున్నపుడు గంగ తెప్పవేయక భర్తవైపు చూచెను. భర్త నవ్వి ముద్దుపెట్టుకొనెను. సరస్వతి యది సహింపలేకపోయెను. ఆమెకు రోషము వచ్చి గంగను దూషించెను. వీరిద్దఱు వాదులాడుకొనిరి. గంగ, సరస్వతిని నీవు నదివికమ్ము అని శపించెను. సరస్వతి యట్లే ప్రతిశాప మిచ్చెను. వీరి తగవులాటలు చూచుచున్న లక్ష్మిని నీవు అయోనిజగ ధర్మధ్వజునింట జన్మించుము అని విష్ణువు శపించెను.

గంగ గోలోకమందు ద్రవరూపమున సంచరించుచుండఁగఁ గృష్ణుఁడు చూచి మోహించెను. ఈ సంగతి రాధ తెలిసికొని కృష్ణుని నిందించెను. ఆమెకు గంగ భయపడి విష్ణుపాదములందు శరణు చొచ్చెను. లోకములందు జలము లేకపోయెను. బ్రహ్మాదులు విష్ణుమూర్తికడకు వచ్చి గంగకు భయము లేకుండఁజేసి యామెను బైకిఁదీసికొని వెళ్ళనీయుమని ప్రార్థించిరి. విష్ణుమూర్తి గంగను విడిపించెను. బ్రహ్మ యామెను దన కమండలమునఁ బట్టి వైకుంఠమునకుఁ గొనిపోయెను. శివుఁడామెను శిరమున ధరించుకొనెను. బ్ర. వై.

అగస్త్యునిచేఁ బానము చేయఁబడి జలశుష్కములైన సముద్రములను జలపూరితములు చేయుమని దేవతలు వేడిరి. గంగాజలముతోడనే సముద్రములు పూరింపఁబడెను.
బ్రహ్మ.

ఇంద్రసభయందు బ్రహ్మయును, మహాభిషుఁడును మొదలగువారందఱుండఁగ నీమెయును స్త్రీరూపమున వచ్చుటకి వచ్చెను. ఆట గాలిచే నీమె పయ్యెద తొలఁగఁగ మహాభిషుఁ డీమెను సాభిప్రాయముగఁ దిలకించె. దీనినంతను బ్రహ్మ

చూచి మర్త్యలోకమున బుట్టుమని మహాభిషుని శపించెను. గంగయును మహాభిషుని జూచి మనోజపీడితయై నరలోకమునకు వచ్చుచుండెను. మార్గమున వసువులను జూచి మీరెక్కడికిఁ బోవుచుండిరి? యని గంగ యడిగెను. మనుజలోకమునఁ బుట్టుడని మాకు వశిష్ఠుఁడు శాపమిచ్చెను; మేము నరలోకమున కేగుచుంటిమి. మహాభిషుఁడు శంతనుఁడై పుట్టెను. అతఁడు మా జన్మములకు నిమిత్తమగును. మేము నీయందుఁదప్ప నితరులందు బుట్టనొల్లము. నీకును, శంతనునకు సంగమంబగు అని వసువులు వలుక నామె కోర్కెయు సఫలమయ్యెను గావున గంగ యద్దానికి సమ్మతించెను. మమ్ములను దీర్ఘకాలము నరలోకమున నుంచక పుట్టినవెంటనే నీళ్ళయందుఁ బడవేయుమని వసువులు కోరిరి. దీర్ఘాయుష్మంతుఁడగు కుమారుఁడు తల్లికి గలుగవలదా? యని గంగయన్నఁ, గడపటి వసువు చిరకాలము పుడమిపై నుండుట కంగీకరించెను.

గంగాతీరమునఁ బ్రతీపుఁడను రాజు మహానిష్ఠతోఁ దపము చేయుచుండఁగ వానిసద్గుణములను గణించి, గంగ స్త్రీరూపధారిణియై వచ్చి వాని కుడితొడనెక్కి తనను భార్యగ గ్రహింపుమని కోరెను. అతఁ డేకపత్నీవ్రతుఁడు గావున నామెను బరిగ్రహింపననియు నామె బుత్త్రీరోహణయోగ్యమైన కుడితొడ నెక్కెను గావున నతని పుత్త్రునకు గంగ భార్యయగుననియు నతఁడు చెప్పెను.

ప్రతీపునకు శంతనుఁడను కుమారుఁడు కలిగెను. ఇతఁడు సంప్రాప్త యౌవనుఁడై రాజ్యాభిషిక్తుఁడై గంగాతీరమున సంచరించుచుండగ గంగ యువతీరూపమున వచ్చెను. ఆమె రూపలావణ్యములు చూచి శంతనుఁడు కామించె. వాని యభిప్రాయ మెఱిఁగి గంగయు నిట్లనియె. "రాజా! నేనెద్ది చేసినను నీ వొడంబడవలయు. నీవప్రియములు పలికితివా నిన్నుఁ బాసిపోవుదును. దీనికి నీవు సమ్మతించెద వేని నీకు భార్య నయ్యెదను" అనెను. శంతనుఁ డామె కోరిన నియమంబుల కంగీకరించెను. గంగ శంతనుని బరిణయమై గర్భవతియై సంతానమును గాంచెను. కాని పుట్టిన శిశువును తోడనే నదిలోఁ బడవైచెను. శంతనున కది యనిష్టమైనను నడ్డుపెట్ట వెఱచుచుండెను. అట్లే గంగ యేడుగురు శిశువులను నదిలోఁ బడవేసెను. అష్టమశిశువు పుట్టినపుడు "పుత్రఘాతినివై యిందఱను జంపితివి. వీనిని జంపనీయను" అని శంతనుఁడనఁగ, నీ శపథము తప్పి పరుషములాడితివి గావున నింక నీకడ నుండనని తనపుత్త్రులైన వసువుల వృత్తాంతము వానికిఁ జెప్పి అష్టమపుత్త్రుఁడగు భీష్ముని పెద్దవాఁడగువఱకుఁ దనయొద్దఁ బెంచి పిదప శంతనుని కప్పగించి గంగ భూలోకమునుండి చనియె. భార.

గంగనుగూర్చి భగీరథుడు ప్రార్థింపఁగ నామె ప్రత్యక్షమై వరము వేడుకొనుమని చెప్పెను. "జననీ! నీవు నా కోర్కె సఫలము చేయుటకే వచ్చితి వేని నాతోఁగూడ భూతలమునకు రమ్ము" అని భగీరథుఁడు వేఁడెను. నేను వచ్చెదను గాని నే క్రిందఁబడునపుడు నాభారము వహింపఁ గల్గువా రెవరని గంగ యడిగెను. ఆమెభారము వహించుటకై భగీరథుఁడు శివుని బ్రార్థించెను. అతఁడు తన జటాజూటముచే గంగాపాత భారము వహించుట కంగీకరించెను. గంగ శివుని జడలందుఁ బడెను. అచ్చటనుండి క్రిందికి జారి భగీరథుని వెనువెంటనే యామె పోవుచుండెను. అట్లు పోవుచు జహ్నుఁడను ముని యాగము చేయుచున్న స్థలమును ముంచెను. ముని జలము నంతయుఁ బీల్చివేసెను. భగీరథుఁడు జహ్నుని బ్రార్థించి మరల గంగను బొంది యామెను సగరపుత్త్రులు భస్మమైన చోటునకుఁ గొని పోయెను. ఈ పావనజలము సోకి వారు దివి కేగిరి. భగీరథుని వెనువెంట నరుగుటచేతను భగీరథునిచే నీలోకమునకు గొనిరాఁబడుట చేతను గంగకు భాగీరథియని పేరు వచ్చెను.

జహ్నుఁడను వానిచే విడువఁబడి ప్రవహించెను గాన జాహ్నవి యని పేరుకూడ వచ్చెను. బ్రహ్మ.

తొల్లి పదునాల్గు లోకములును ప్రళయకాలమున నంతమొందినపుడుకూడ గంగ మిగిలి యుండెను. ఆ గర్వముచే నామెయుప్పొంగెను. గంగతుంపరలు కైలాసముపైఁ బడెను. దాన శివునకుఁ గోపమువచ్చి గంగకు గర్వభంగము చేయుటకై యామెను నరజన్మమునఁ బల్లె కుటుంబములోఁ బుట్టుమని శపించెను. గంగ

పశ్చాత్తాపమునొంది శాపమును మరలింపుమని వేఁడెను. శివుఁడు తానుగూడ భూలోకమునఁ బుట్టి యామెను వివాహమయ్యెదనని చెప్పి యామెనోదార్చెను.

ఏలాపురములో శంకుదేవయ్య, చక్రదేవమ్మ యను దంపతులకు శివ ప్రసాదమున గంగ జన్మించెను. ఎఱుకల వేషముతో నారదుఁ డామెకడకు వచ్చి నీకు శివుఁడు భర్తయగునని యామెతో జెప్పెను. అతఁడు శివునికడకు వెళ్ళి గంగయంత రూపసి లేదనియును, నామెను వివాహ మగుమనియును జెప్పెను. శివుఁడు జంగమ రూపమున వచ్చెను. మునులు శంకు దేవయ్యకడకు వచ్చి యతని కూఁతును నా జంగమున కిచ్చి వివాహము చేయుమనిరి అతఁ డట్లు గావించె. శివుఁడు గంగను దీసికొని వెళ్ళి చాలకాలము తనజటలో దాచియుంచెను గాని, యొకనాఁ డామెను పార్వతి చూచి, యామెను, శివునిని గూడ దూషించెను. గంగయుఁ బార్వతియుఁ నొకరి నొకరు దూషించుకొనిరి. గంగ తన పుట్టినింటికిఁబోయి యచ్చటను నీరులేకుండఁ జేసెను. పార్వతి రజస్వలయైన పిమ్మట స్నానమునకు జలము లేకపోయెను. అపు డామె శివుని బ్రార్థించెను. అతఁడు గంగయొద్దకు విఘ్నేశ్వరుని బంపి యామెను బ్రతిమాలి రావించెను. పార్వతి యామెతో సఖ్యము చేసెను. గం. వి.

పార్వతి శాపప్రకారము అగ్ని గర్భమును ధరించెను. (చూడు. అగ్ని) కాని యతఁడు గర్భభారము సహింపఁజాలక గంగను జూచి 'ఓగంగా! ఈ గర్భభారమును నేను సహింప లేకుంటిని. శివుని వీర్యము నీవును ధరింపవచ్చును గదా! ఈ గర్భము నీవు దాల్చి నన్నురక్షింపు' మని కోరెను. గంగ యంగీకరించి యాతని గర్భము తాను ధరించెను. కొంతకాల మరిగిన పిమ్మట నామెకును గర్భభారము సహింపరాని దయ్యెను. కావున ఆమె గర్భమును రెల్లుగడ్డి యందు ఒగవిడిచెను. అందుండియే కుమార స్వామి పుట్టెను.

గండకీనది.-హిమాలయములకు దక్షిణముగనున్న నది. తులసియే శివునివరమువలన గండకీనది యయ్యెను. ఈ నదియందే సాలగ్రామము లేర్పడెను. శివ.

జగన్మోహినితో శివుఁడు రమించుటచే జగన్మోహినికి రతిశ్రమవలనఁ జెమటపుట్టెను. ఆ చెమటయే గండకీనదియయ్యె. ఆనదియందు వజ్రమయ కీటకము లేర్పడెను. ఆ కీటకములవలన నేర్పడిన శిలలే సాలగ్రామములు. స్కాంద.

గంధమాదనము:-సురసిద్ధ సేవితమైన యొక పర్వతము. భార.

గంధర్వులు:-బ్రహ్మజఘనమునుండియసురులు పుట్టి వానిని జేరి మిథునకర్మ నపేక్షించిరి. బ్రహ్మ నారాయణునికడ కరిగి రక్షింపుమని వేఁడెను. నీ వీ శరీరము వదలివేయుమని నారాయణుఁడు చెప్పిన, బ్రహ్మ తన దేహమును విసర్జించెను. అందుండి సంధ్యారూపమున లలనారత్నము పుట్టెను. అసురులు కామపీడితులై యామెను బట్టుకొనిరి. బ్రహ్మ వారినిజూచి సంతసించి తన కరమాఘ్రాణింపఁగ గంధర్వులును, నప్సరసలును బుట్టిరి. భాగ.

గంధవతి:-(చూడుము మత్స్యగంధి.)

గజాసురుఁడు:- మహిషాసురుని కుమారుఁడు. ఇతఁడు శివునిగూర్చి తపస్సుచేసెను. పిమ్మట దేవతల కహితమైనపనులనే చేయుచుండు వాఁడు. దేవతలందఱు వీనినిగూర్చి శివునితోఁ జెప్పుకొనిరి. శివుఁడీతనిని శిక్షించుటకువచ్చెను. 'దేవా! నీచేతిలోఁ జావు పొందవలెనని కోరు చుంటిని. అందువలననే యిట్టి పనులను జేయు చుంటిని. నేను మరణించినపిమ్మట నాచర్మము నీవు ధరింపుము. నీకపుడు కృత్తివాసుఁడను పేరువచ్చును. ఇదియే నాకోరిక' యని యితఁడు వేఁడెను. శివు డీతఁడు కోఁరినట్లే చేసెను. శివ.

గజేంద్రుఁడు:-ఒక యేనుఁగు. ఇదియును, దీని నాశ్రయించియుండిన యేనుఁగులును ఒకనాఁడు దాహము తీర్చుకొనుటకై యొకకొలనులోఁ బ్రవేశించెను. మొసలియొకటి దీనికాళ్లను బట్టుకొనెను; ఎంతలాగినను నది పట్టువదలినదికాదు ఏనుఁగు మొసలిని బైటకులాగును; మొసలి యేనుగును లోపలకు లాగును; ఇట్లు పెక్కుసంవత్సరములు పోరాటము జరిగెను కాని గజము బైటకు రాలేకపోయెను. అంతకంతకు దీనిశక్తియు ధైర్య

మును తగ్గెను. అపుడిది విష్ణుమూర్తినే ధ్యానింపుచుండెను. దీని దీనాలాపములు వినినతోడనే విష్ణుమూర్తి లక్ష్మిని విడచి తనభక్తురాలిగాచుటకై పరుగిడి వచ్చెను. ఇతని వెనుకనే చక్రము వచ్చెను. ఆ చక్రముతో విష్ణుమూర్తి మకరమును సంహరించి యేనుఁగును విడిపించెను.

ఈ గజేంద్రుఁడు పూర్వజన్మమున ఇంద్రద్యుమ్నుఁడను ద్రవిడాధీశుఁడు. అగస్త్యుఁడొకనాఁ డతనికడకు రాఁగా, నతఁడు లేవక పోవుటచే గజమువు కమ్మని యతఁడు శపించెను. ఆ మకరము హూహూనామ గంధర్వుఁడు. దేవలునిచే నట్లు శపింపబడియె. భాగ.

గతి:—కర్దమ ప్రజాపతి కూఁతురు. పులహుని భార్య. భాగ.

గతి:—సంహ్లాదుని భార్య. పంచజనుని తల్లి. భాగ.

గదాధరము:—ఒక తీర్థము. ఇచ్చట స్నానముచేసి చిచ్చుకుఁడనువాఁడు తనకు బ్రాహ్మణ హత్య వలన సంభవించిన పాతకమును బోఁగొట్టుకొనెను. బ్రహ్మ.

గయ:—గయాసురుఁడు పడియుండినచోట నేర్పడిన పట్టణము; పుణ్యక్షేత్రము.

గయాసురుఁడు:—ఒకరాక్షసుఁడు. నూటయిరువదియైదు యోజనములు పొడవుగలవాఁడు. ఇతఁడు విష్ణుమూర్తిని స్తుతించి శక్తివంతుఁ డయ్యెను. గయాసురునివలన లోకములకు బాధకలుగుచున్నదని ఋషులు, దేవతలు, బ్రహ్మతోఁజెప్పుకొనిరి. వారిబాధ మాన్పదలఁచి, బ్రహ్మ గయాసురుని యొద్దకేగి వానిని బాగడి, నేను యాగముచేయఁదలఁచుకొంటిని; దానికై నీశరీరమంతపవిత్రమైన స్థలమెద్దియు నాకుఁగోచరింపలేదు అని చెప్పఁగ నసురుం డుబ్బి నాశరీరమును గైకొని యా యాగము పూర్తిగావించుకొమ్మని చెప్పెను. అంత బ్రహ్మ దేవరూపిణి యను శిలను దెచ్చి గయాసురుఁడు కదలకుండుటకై వాని శిరమునఁ బెట్టెను. ఇంకను నసురుఁడు కదలుచుండుటచే విష్ణుమూర్తిని బ్రహ్మ ప్రార్థించెను. విష్ణువు వచ్చి యసురునిపై నిలుచుండెను. అపుడు రాక్షసుఁడు నాపై విష్ణువు నిలువనేల? నేను కదలకుండ నుండెదను. బ్రహ్మ తన యజ్ఞమును పూర్తిచేసికొనునుగాక. ఈ ప్రదేశము నా పేరునఁ బరగునట్లును, ఎవ రిచ్చోటఁ బిండప్రదానములు చేయుదురో వారిపితరులు తరించునట్లును నాకు వరమిండు అని ప్రార్థించెను. విష్ణుమూర్తి యట్లనుగ్రహించెను. వాయు.

గయుఁడు:—పుష్కరిణీ ఉల్మకుల పుత్త్రుఁడు. అంగుఁడు. ఖ్యాతి మొదలగువారి సోదరుఁడు. భాగ.

గయుఁడు:—హవిర్ధానుని పుత్త్రుఁడు. బర్హిష్మతి. జితవ్రతుఁడు మొదలగువారితని సోదరులు. భాగ.

గయుఁడు:—భరతునవంశమువాఁడగు నక్తుని పుత్త్రుఁడు. ఇతని భార్య జయంతి. చిత్రరథుఁడు, స్వాతి, అవరోధుఁడు వీరి కుమారులు. ఈ గయుఁడు రాజర్షి. ఇతఁడు ధర్మమార్గమునఁ బ్రజల నేలుచు యజ్ఞ పురుషుని హృదయమందు నిలుపుకొని అఖిలజీవతతికి నానంద మొసఁగెను. ఇతనిరాజ్యమున వసుంధర కామధేనువట్లు లుండెను. భాగ.

గయుఁడు:—సుద్యుమ్నుని కుమారుఁడు. భాగ.

గయుఁడు:—ఆయువు, స్వర్భానువులకుమారుఁడు. నహుషుఁడు, అనేనసుఁడు ఇతని సోదరులు. భార.

గయుఁడు:—ఊరువు కుమారుఁడు. ఇతని తల్లి ఆగ్నేయి. మత్స్య.

గయుఁడు:—ఒకరాజు. అగ్ని నారాధించి బ్రహ్మచర్యవ్రతమును, శమమును, దానమును నతనికిఁ గలుగునట్లు వరములు పొందెను. అతఁడు బంగారముతో వేదికాస్థలిని జేసి దానిని విప్రులకుఁ బంచి పెట్టించెను. అతఁడు పెట్టిన అన్నరాసులు కొండలంతలయినవి. చేసినదానములు, దక్షిణలు నక్షత్రములవలె లెక్కపెట్ట నలవి కానివి యయ్యెను. ఇతని పేరటనే గయ నతికెక్కెను. పుణ్యతీర్థమయ్యెను. భార.

గయుఁడు:—బంగారుమయములైన చషాల స్థాలీ యూప చమస పాత్ర స్రుక్స్రువంబులతో దేవ

స్థాపితంబులైన యూపంబులతో నేకు అశ్వమేధములు చేసెను. అసంఖ్యాకంబులైన ధనము లిచ్చెను. అక్షయమైన ఇంద్రలోక సుఖమును బడసెను. ఆచోటుపయోష్ణితీర్థమయ్యెను. భార.

గయుఁడు:-ఒక గంధర్వుఁడు. మణిపురమునకు రాజు. ఇతఁడు శివుని నర్చించిన పిదప నాకాశయానమున వచ్చుచు నుమిసెను. అది గాలిచేఁ గొట్టుకొనివచ్చి యపుడే స్నానముచేసి యర్ఘ్య మిచ్చుచున్న కృష్ణుని దోసిటఁ బడెను. సూర్య భగవాను నారాధించుచున్న తనపై నుమిసిన వానిని బట్టి వధింతు నని కృష్ణుఁడు శపథము చేసెను. ఆ పలుకు లాకాశవాణివలన గయుఁడు విని బెగ్గడిల్లి బ్రహ్మను శరణువేడెను. కృష్ణుని నెదిరింపఁ దనకుఁ గాదనియును, శివుని వేఁడుమ యును బ్రహ్మ చెప్పెను. ఇతఁడు శివుని కడకుఁ బోఁగా శివకేశవు లొకటియేగాన తాను కృష్ణున కెదురేగనని యతఁ డనియె. గయుఁడు తనకంతముసంభవించెనని విచార మొందుచుండఁగ నారదుఁడు మార్గమునఁ గలిసికొని యర్జునుని శరణు వేఁడుమని చెప్పెను. గయుఁడు పరుగిడి వచ్చి శరణార్థిని, గావుమని యర్జునునిఁ బ్రార్థించెను.. అర్జునుఁ డాతని కభయమిచ్చి నీకువచ్చిన భయమేమని యడిగెను. గయుఁడు చెప్పెను. కృష్ణునకుఁ బగయైనవానిని దాను రక్షింపవలసి వచ్చినందుల కర్జునుఁడు విచారించెను. కృష్ణుఁడు గయుని తన కప్పగించుమని వర్తమాన మంపెను. శరణుఁ జొచ్చినవానిని విడువనని యర్జునుఁడు ప్రత్యుత్తరమిచ్చెను. వీరి బంధువు లెల్లరునుగలసి వారికిసంధిచేయఁజూచిరి కాని కుదిరినది కాదు. తుదకుగయునివలనఁగృష్ణార్జునులకు యుద్ధమువచ్చెను. వీరు ఘోరముగాఁ బోరుచుండిరి. తుదకు దేవతలు వచ్చి కృష్ణునిఁ బ్రార్థించివారియుద్ధమునుమాన్పించిరి. గయుఁడు కృష్ణుని పాదములపైఁ బడి శరణు వేఁడెను. కృష్ణుఁడు వానిని మన్నించెను. గయో.

గరుడతీర్థము:-ఒక తీర్థము. (చూడుము గరుత్మంతుఁడు.)

గరుడాచలము:-ఒక పర్వతము. విష్ణుమూర్తి వరహావతారమును దాల్చినపిమ్మట ఆరూపముతో స్వర్గలోకమునకు వెళ్ళినయెడల లక్ష్మి యాక్షేపించునని వెళ్ళుట మానెను. స్వర్గమునుండి తన క్రీడాచలమును దెమ్మని గరుత్మంతుని బంపెను. గరుఁడు దానిని దీసికొని వచ్చెను. గరుడునిచేఁ దేఁబడిన పర్వతమే గరుడాచలము. దీనికే వేంకటాచలమనియును పేరు. వేంక.

గరుత్మంతుఁడు:-ఒకపక్షి. అనూరునిసోదరుఁడు. ఇతని తల్లి వినత. తండ్రి కశ్యపుఁడు. ఇతఁ డండమునుండి బైటఁబడఁగనే యాకాశమున కెగసి తిరిగివచ్చితల్లికినమస్కరించెను. ఇతఁడును బుట్టినప్పటినుండియుఁ గద్రువయానతిచ్చినటుల నామెకుమారులుసేవ చేయుచుండెను.

ఒకనాఁడు కాద్రవేయులనువీఁపుననెక్కించుకొని గగనతలమునఁ బర్వఁగ సూర్యుని వేడిమికి నవి మాడి క్రిందఁ బడెను. కద్రువ యట్లు మృతులైన తన కుమారులను జూచి విచారించి గరుత్మంతునిపై నాగ్రహించి నిందించెను. గరుత్మంతునకు రోషమువచ్చి తల్లి కడకుఁ జని "జననీ! నాకుఁ బర్వతములనైనఁ బిండిగాఁగొట్టు శక్తికలదు! నేనేల వీరికి నడుగులకు మడుగు లొత్తుచు నుండవలెను? నీ వేల వీరికి దాసివైయుంటివి? చెప్పు" మన నామె తన పందెపు వృత్తాంతమును దెలిపి యా కారణమున దాసులమై యుంటిమని చెప్పెను. ఇతఁడుమింట విహరించుచుండఁగ నారదుఁ డొకనాఁడు కలిసికొని నీ తల్లి దాస్యంబునఁ గుందుచుండఁగ నీవు బలాఢ్యుఁడవయ్యు నిట్లు విహరించుటచెల్లునే? యని ఆ శాపవృత్తాంతము నెఱింగించెను.

గరుడుఁడుకద్రువకడకుఁజని నేను నీపుత్రుఁడనుగదా! నన్ను జూచియైనను నీకుఁ జెలియలును నాకుఁ దల్లియగు వినతయొక్క దాస్యము నివృత్తి సేయుము. అనినకద్రువ అమృతము తెచ్చియిచ్చిన విడిపింతుననియె. తల్లికి దాస్యవిముక్తిచేయ నిశ్చయించికాద్రవేయులనుజేరి యేమిచేసిన మా తల్లి దాస్యము బాపుదు? రని యడిగి వారి కమృతము తెచ్చి యిచ్చుటకును. తన తల్లిని దాసీత్వము నుండి విడిపించుకొని పోవుటకును నేర్పాటు చేసికొని, తల్లి కావృత్తాంతము తెలియపఱచి యామెవలన నమృతము తెచ్చుటకు ననుమతి

బడసెను. బలమగు నాహార ముపదేశింపుమని తల్లినిగోరఁగ సముద్రమధ్యమున వేనవేలు నిషాదులుండి ప్రజలనుబాధించుచున్నారు. వారినిభక్షింపుము. బ్రాహ్మణునిమాత్రము భక్షణ చేయకుమని యామె చెప్పెను. గరుత్మంతుఁడు వారిని మ్రింగఁగ గంఠమున గాలముతగులుకొనినట్లొక డడ్డుపడియెను. నా కుతుకమున బ్రాహ్మణుఁడుండెనేని బయటఁబడుఁగాకయనిన, బ్రాహ్మణుఁడు, నే నొక నిషాదిని వలచియుంటిని. ఆ నిషాదిని విడిచి యెట్లురాఁగలను? అనుగ్రహింపుమనఁగా బ్రాహ్మణులను జేరవారును బవిత్రులగుదురు. నిషాదిసహితముగ బైటకు రమ్మని గరుడుఁడు వానిని రక్షించి, కశ్యపునికడ కరిగి నమస్కరించి తన పోవుకార్యము చెప్పి తన కాఁకలి దీరకుండెను గాన నాహారము ప్రసాదింపుమని కోరెను. యోజనాయుతములై శాపవశమునఁ దగవులాడుచుండు గజ కచ్ఛపములను దినుమని కశ్యపుఁడనియె. గరుత్మంతుఁడు వానినిఁ బట్టుకొని యాకాశమార్గమునఁ బోవుచుండఁగ రోహిణియను వృక్షము తనపై విశ్రమింపుమని యాతిథ్యమొసఁగెను. ఒక కొమ్మపై నితఁడు వ్రాలఁగ నది విఱిగెను. ఆ శాఖనవలంబించి వాలఖిల్యులు తపస్సు చేసికొనుచుండిరి. అది క్రిందఁబడుచో మునులకు హానికలుగునని భయపడి దానిని ముక్కునఁ గఱచుకొని పోవుచు, దాని నెక్కడ విడచినను క్రిందనున్న జంతువులు చచ్చునని యాలోచించుచుండఁ బులిందదేశము నిందితాచారయుతము. అందు విడువుము అను ఆకాశవాణి పలుకు వినంబడనట్లు చేసెను.

కశ్యపునిపాలికిఁబోయియతనియానతిచొప్పున వాలఖిల్యులాశాఖ విడచినపిదప నిర్జనాటవియందుఁ గొమ్మనువిడచి గజకచ్ఛపములని భక్షించెను. పదపడి అమృతముచుట్టు నగ్నియుండుటెఱింగి దానిని గెల్చునుపాయమును చెప్పుమని బ్రహ్మకడకుఁబోయి యడిగెను. తాను తనతల్లి దాస్యము పోఁగొట్టుటకు వచ్చితినని చెప్పెను. బ్రహ్మచెప్పిన యుపాయమునఁ గొండంతవెన్న యాయగ్నిముందటవైచి అమృతమును గైకొనియె.

దేవలోకమునకరిగి, యమృత రక్షకులతో యుద్ధముగావించి, వారినందఱను హతమార్చి అమృతముచుట్టునున్న నగ్ని నార్పి దేవనిర్మితమై తిరుగు చక్రముక్రింద నల్పాంగుఁడై దూరి అమృతమును గాచుచున్న రెండుపెద్దపాములను మోది యమృతమును గైకొని యాకాశమున కెగసెను. ఈతఁడు చేసిన కార్యములకు విష్ణుమూర్తి మెచ్చుకొని, యమృతపానములేకయే యమరత్వము వచ్చునట్లును దనకు వాహనమగునట్లును, నాతని ధ్వజమగునట్లును వరములిచ్చెను.

గరుత్మంతుఁడిట్లమృత మపహరించి పోవుచున్నాఁడని తెలిసికొని యింద్రుఁడు వజ్రాయుధము సేసెను. ఇంద్రాయుధమును బరిభవింప నిష్టపడక యొక్క యీఁకను మాత్రము రాల్చుకొమ్మని చెప్పి గరుత్మంతుఁ డేగెను. అతని పర్ణము లంత గట్టివిగనుక నే సుపర్ణుఁడను పేరుగూడ వచ్చెను. ఇంద్రుఁ డితని సామర్థ్యమును జూచి మెచ్చుకొని యతనితో సఖ్యము చేసి మొదల కీ యమృత మీయవలదని కోరెను. అమృతము సర్పముల కిచ్చి మాతల్లి దాస్యము బాప దీనినిగొనిపోవుచుంటిని. వారుపయోగింపక పూర్వమే నీవుతీసికొనుమని గరుత్మంతుఁడుచెప్పి నింద్రుఁడు వల్లెగాని యతనికి సర్పము లాహారమగునట్లు వరమిచ్చెను. గరుత్మంతుఁడు అమృతమును గెచ్చి కాద్రవేయులకిచ్చి తల్లి దాస్యము వాపి యామెను దీసికొనిచనియె. భార.

పిమ్మటఁ దాను ఇంద్రునకుఁ జెప్పిన ప్రకారము అమృతమును నింద్రునకుఁ గొనిపోయి యిచ్చెను.

దేవతలందఱును మెచ్చుకొనిరి. ఇతనికి వర మీయవలదా అనిరి. మనకలన వరమువకాశించు వాఁడు కాఁడీతఁడు. ఇతఁడు సాక్షాత్తు విష్ణువు. ముందు శూరుఁడను యాదవరాజునకుఁ బౌత్రుఁడై కృష్ణుఁడను పేరున లోకహితము సేయును. మనలను ఏమాత్రమును విడువకుండును అని ఇంద్రుఁడు చెప్పెను.

ఇంద్రుని సారథియైన మాతలి తన కూతురగు గుణకేశికిఁబతిగా ఆర్యకుఁడను భుజంగరాజు మనుమని సుముఖునిఁగోరెను. అయ్యా! గరుడుఁడు నా కుమారుఁడు చికురుని సంహరించెను. ఇఁకనొక నెలలో వీనినిగూడ సంహరింతుననియె. కావున

కు పెండ్లి కియ్యకొన ననియె. మాతలి తాను ఇంద్రునివేడి వానిని చిరాయువుగఁ జేసికొందు ననియె. ఇంద్రుఁడు విష్ణువు ఒక్కచోటనుండఁగ మాతలి తనప్రార్థనయెఱింగించి వరమునుబడసెను. గరుడునకుఁ గోపమువచ్చి యింద్రునితో నీవు నాసముఖమున కడుపడువాఁడవా? అఖిలమును నాపన్నని యీఁకపై ధరింతుననియె. ఆమాటలు విని నేను నిన్నును నడిపించుచుండఁగ నీకింత గర్వమా? అని తనచేయి వానిపైఁ బెట్టెను గరుత్మంతుఁడు వివశుఁడై సొగసిపడియె. అపుడు కేశవుఁడు గరుడునిపై గరుణించెను. గరుఁడుని గర్వమడిగెను. భార.

ఇతఁడు గాలవునకు స్నేహితుఁడు. విశ్వామిత్రుఁడు కోరిన హయములను దెచ్చు వెఱవు లేకయున్నపుడు గరుడుఁడు వానినిజేరి దేవేంద్ర నగరమునకుఁబోవుచు డస్సి యొకశైలముపై వ్రాలెను. అట శాండిలి అను తపస్విని శాపంబున రెక్కలు ఊడిపోయి మరల అతని యనుగ్రహమున రాఁగ, నచట విడిచి మహీతలము తట్టు యయాతి తన స్నేహితుఁడగుటచే వానియొద్దకు గొనిపోయెను. (చూడుము గాలవుఁడు.)

ఆరువందల గుఱ్ఱములే యుండుటచే గాలవుఁ డేమిసేయువాఁడని తలఁచునపుడు యితఁడే విశ్వామిత్రునకు వానిని మాత్రము ఇమ్మని ఆలోచన చెప్పెను. భార.

ఇతఁడింద్రుఁ డగుడని పూర్వము వాలఖిల్యులు వరమిచ్చిరి. కశ్యపుడు పుత్రకామేష్టి సేయు నపుడు వాలఖిల్యులు సహాయము చేయుచుఁ బుష్పములను దెచ్చుచుఁ బుష్పభారమే వహింప లేక పడిరి ఇట్లు పడఁగ నంగుష్ఠమాత్రదేహులను జూచి యింద్రుఁడు నవ్వెను. ఆ మునులు సిగ్గుపడి, రోషముకల్గి కశ్యపునకుఁ బుట్టుకుమారుఁడు ఇంద్రునికంటెను బలాఢ్యుఁడై రెండవ యింద్రుఁడగుననిరి. ఇంద్రున కిది తెలిసి కశ్యపునికడకేగి ప్రార్థింపఁ గశ్యపుఁ డమ్మునులతో అయ్యా! బ్రహ్మ యీతని నింద్రునిగఁ జేసె. ఇపుడు రెండవయింద్రుఁ డుండిన విపరీతముల సంభవించును గాన గరుణింపుఁడనియును, మీ వచన మమోఘము గావున నాకుఁ బుట్టు పుత్రుఁడు ఖగములలో నింద్రుఁడగుననియును సమర్థించెను. భార.

గరుడుఁడు కాళింది మడువులోనుండిన మీనరాజును భక్షించెను. ఆ మడువు సమీపమునఁ దపస్సు చేసికొనుచుండిన సౌభరియను మునియొద్దకు దుఃఖముతో మత్స్యములు వచ్చి గరుత్మంతుఁడు చేసిన యపకారమును జెప్పుకొనెను. గరుడుఁడు మఱల ఆ మడువులోనికి వచ్చెనేని యతఁడు మరణించుగాక యని సౌభరిశపించెను. అప్పటినుండియు నితఁ డచ్చటకుఁ బోవుట మానెను ఈశాపముదెలిసియే కాళియ గరుడుని వలన భయముండదని యా మడువులోఁ జొచ్చెను. భాగ.

సర్పములకు వెఱచి జనులు కొన్ని భక్ష్యములను వానికై చెట్లమొదళ్ళయందుఁ బెట్టుచుండెడివారు సర్పములు వానిలోఁ గొంత భాగమును గరుడున కిచ్చుచుండెడివి. కాని కాళియ వీని కట్టివ్వననియె. గరుత్మంతుఁడు వానిని బాదుచుటకు వచ్చెను. కాని కాళియ పఱుగిడి మడువులో దాఁగెను. ఆ మడుఁగు చేరకుండ శపింపఁబడెను గావున గరుడుఁ డచ్చటికిఁ బోలేదు. భాగ.

మణినాగుఁడను శేషుని కుమారుఁడు విహరించు చుండఁగ నితఁ డా పామును నోటఁ గఱచికొని వచ్చెను. ఆ సర్పము శివునిఁ బ్రార్థించెను. శివుఁడు వానిని విడిపింపుమని నందిని బంపెను. నందివచ్చి విష్ణుమూర్తితోఁ జెప్పెను. విష్ణుమూర్తి చెప్పినను గరుడుఁడు మణినాగుని విడువలేదు. నీవు బలహీనుఁడవు కమ్మని విష్ణుమూర్తి శపించెను. అపు డితఁడు విష్ణుమూర్తిని వేడుకొనఁగ నతఁడు శివుని బ్రార్థింపుమనియె. శివునికడకు వెళ్ళి గరుడుఁడు వేఁడుకొనెను. నీవు గౌతమిలో స్నానముచేసి ప్రార్థించుము; నీకుఁ దిరిగి బలము వచ్చునని శివుఁడు చెప్పెను. ఇతఁడు స్నానము చేసి శివుని బ్రార్థించెను. గరుడుఁడు స్నానముచేసినచోటు గరుడతీర్థము. బ్రహ్మ.

గరుడుఁడు సర్పములను మిక్కిలి హింసించి వానిని భక్షించు చుండెను. ఏ పామునుగూడ ప్రాణభయమును దక్కియుండలేదు. కొంతవఱకైన నా భయము తగ్గించుకొనుటకు దినమునొక నాగకుమారుఁడు వాని కాహారముగ వచ్చుటకును, గరుత్మంతుఁడు వానిమాత్రమే భక్షించి

పోవుటకును నరగములును, గరుత్మంతుఁడును వాడంబడిరి. గరుత్మంతుఁ డట్లు భక్షించి చను చుండెను. జీమూతవాహనుఁ డను విద్యాధర కుమారుఁ డొక సర్పమును గాపాడుటకై దన ప్రాణములైన నివ్వఁదలఁచి గరుడున కాహార ముగఁ దానే చనియె. గరుత్మంతుఁడు వీరిని బరీక్షింపక సర్పమే యనుకొని భక్షించు చుండెను. కాని యితఁడు చలింపక, విచారము నొందక కడుపార నీవు భుజింపుమని గరుడు నితోఁ బల్కుట విని వెఱగొందు చుండెను. జీమూతవాహనునికై వాని తల్లిదండ్రులు వెదకుచు వచ్చి భక్షింపఁబడువానిని జూచి దుఃఖించి యమృతమైన నిచ్చి వానిని బ్రతికింపుమని గరుడుని బ్రార్థించిరి. గరుత్మంతుఁడు తాఁజేసిన పొరబాటు తెలిసికొని జీమూతవాహనుని మెచ్చుకొని వానిని బ్రతికించుటకై యింద్రు నడిగి యమృతము తెచ్చి యిచ్చెను. మఱియు నతని వరము వేఁడుకొనుమనఁగ సర్పములను బ్రతికింపుమని యతఁడు కోరెను. గరుత్మంతుఁడు వానిపైనను నమృతమును వర్షింపఁజేసి వానిని బ్రతికించెను. నాగా.

గర్గుఁడు:-హైహయుఁడను రాజు పురోహితుఁడు. జమదగ్ని హోమధేనువు నెటులైనను దీసికొని రావలయునని మంత్రి చంద్రగుప్తుఁడు చెప్పి నపుడు బ్రాహ్మణధనమును స్వీకరించుట పాతక మని గర్గుఁడు చెప్పెను. వీనిమాటలు వినక చంద్రగుప్తుఁడేగి మునిని జంపి ధుదకు దూడను బట్టుకొని వచ్చెను. బ్రహ్మ.

ఇతఁడు యాదవులకుఁగూడఁ బురోహి తుఁడు. వారిమధ్య నుండఁగ నొకనాఁ డితనిని గర్గుఁడు స్త్రీకాక పురుషుఁడా? యని యాదవుఁ డొకడు పరిహాసము చేసెను. అందుకుఁ గోపగించి యాదవులకు భయంకరుఁడగు కుమారుని గోరి శివునిఁ బ్రార్థించెను. యవనరా జిది విని గర్గుని దీసికొని వెళ్ళి తన యాలమందలో నుంచెను. ఆట నొక యప్సరస వీనిని జూచి కామించెను. ఇతనివలన నామెకుఁ బుత్త్రుఁడుపుట్టెను. అతఁడే కాలయవనుఁడు.

గర్గుఁడు:-మన్యువుయొక్క కుమారులలో నొకడు. ఇతనిపుత్త్రుఁడు శని. భాగ.

గర్గుని శిష్యులు:-(చూడు బ్రహ్మకర్తుఁడు)

గవిజాతుఁడు:-ఒకముని. జలములోఁ గ్రుంకితపస్సు చేసికొనుచున్న చ్యవనుని జాలరులు చేఁపలకై వలవేసి వలతో బైటకు లాగిరి. చ్యవనునకుఁ దగిన విలువ జాలరుల కిత్తునని నహుషుఁడను రాజు వచ్చెను. ఇతఁడు తన రాజ్యమంతయు నిచ్చెదననియె. కాని యది సరియైన విలువ కాదని చ్యవనుఁడు పలికెను. నహుషున కేద్డి యును దోఁచకుండ నుండఁగా, గవిజాతుఁడు వచ్చి బ్రాహ్మణునితో సమానమైనది గోవు తప్ప నన్యముకాదని చెప్పెను. భార.

గవ్హ్యుఁడు:-కంసుని సోదరులలో నొకఁడు. బల రామకృష్ణులను గంసుఁడు వధింప వచ్చినపుడు ఇతఁడును వారితోఁబోరెను. బలరాముఁ డితనిని జంపెను. భాగ.

గా

గాండీవము:-దివ్యధనుస్సు. దానిని బ్రహ్మ శత సహస్రవర్షములును, ప్రజాపతి చతుష్షష్టిసహస్ర వర్షములును, ఇంద్రుఁడు పంచశత హాయనంబు లును, వరుణుఁడు కొన్ని వందల యేండ్లును ధరించిరి. దానిని వరుణు కొద్దనుండి యగ్ని దేవుఁడు పుచ్చుకొనెను. దీనిచే ఖాండవవన దహనమపు డగ్నిని నింద్రుఁడు బాధింపకుండ గాపాడుటకై యర్జునున కగ్నియిచ్చెను. దానిని నే యాయుధము తాకినను నది భస్మమగును. అర్జునుని ముఖ్యాయుధ మిదియే. భార.

గాందిని:-కాశిరాజు కుమార్తె. శ్వఫల్కుని భార్య. ఈమెను దల్లి పండ్రెండువత్సరములు గర్భమున మోసెను. అప్పటికిని నామె ప్రసవింపలేదు. శ్వఫల్కుని దీసికొని వచ్చుచో నామె గర్భ భారము తగ్గునని చెప్పుటచేఁ గాశిరాజు శ్వఫల్కుని తననగరమునకు రప్పించెను. వాని ప్రభావమువలన నామె గర్భములో నున్నది యాఁడుశిశువని గ్రహించి ఓతల్లీ! నీమాతకు శ్రమకలుగఁజేయక శీఘ్రముగ బైటకురమ్ము అనిపల్కిరి. నేఁడు మొదలు ప్రతిదినమును బ్రాహ్మణునకు గో

దానము చేయుఁడని శిశువు గర్భమునుండియే పలికెను. కాశిరాజట్లు గావించిన సతనిభార్య ప్రసవమయ్యెను. ఆమెకుఁ గూఁతురు కలిగెను. గోప్రదాన ప్రమాతయగుటచే నాశిశువునకు గాందిని అని పేరుపెట్టిరి. ఈమెకుయుక్తవయస్సు రాఁగా శ్వఫల్కున కిచ్చి వివాహము చేసిరి. ఈమె కుమారుఁడే అక్రూరుఁడు. హరి.

గాంధారి:-అజమీఢుని భార్యలలో నొకతె. కైకేయి, ఋక్ష యీమె సవతులు. భార.

గాంధారి:-గాంధార దేశాధిపతియగు సుబలుని కూఁతురు. ఈమెసోదరుఁడే శకుని. ఈమె ధృతరాష్ట్రుని గుణములనుగాని యతనినేగాని యన్యుని వివాహము కొననియె. తండ్రి యీమెను ధృతరాష్ట్రున కిచ్చియే వివాహము చేసెను. పతి యంధుఁడు గాన నీమెయును నేత్రపట్టము గట్టుకొని వెలుతురైనను జూడకయుండెను.-ఈమె కృష్ణద్వైపాయనుఁ డిచ్చిన వరమున గర్భవతి యయ్యెను గాని యొక సంవత్సరము వఱకుఁ బ్రసూతి కాకుండెను. అప్పటికే కుంతికిఁ గుమారుఁడు కలిగెను. తనకింకను బుత్త్రిలాభము కలుగమికి వగచి గాంధారిగర్భతాడనము చేసికొనియె. అంత మాంసపుముద్ద బైటఁ బడియెను. కృష్ణద్వైపాయనుఁడు దీని నెఱింగివచ్చియామాంసపుముద్దనుండియే నూర్గురు కుమారులును, నొక కుమార్తెయును బుట్టుదురనియుఁ, గాన దాని నన్ని ఖండములుగఁ జేసి వేఱువేఱుగఁ బెట్టి పరిక్షించుచుండుమనియు నానతిచ్చెను. ఆ ఖండములనుండియే దుర్యోధనాది పుత్త్రులును, దుశ్శలయను కూఁతురును బుట్టిరి. తన కుమారులు పాండవులతో వైరము పెంచుకొనుట చూచి యది మంచిదికాదనియే యీమె చెప్పుచుండును; ద్రౌపదియెడ దుర్యోధన దుశ్శాసనులు గావించిన యకార్యముల కీమె మిక్కిలి విచారించి కుమారులకు బుద్ధిచెప్పెనుగాని వారీమెమాటను పాటింపరైరి. యుద్ధమందీమెకుమారు లెల్లరును మరణించిరి. యుద్ధానంతరమం దీమెను జూడఁబోయిన ధర్మజుని నీమె శపింపఁబోయెను. మఱియును రణరంగమునకుఁ బోయి పుత్త్రులయొక్కయు, బంధువులయొక్కయు శవములు గాంచి మిక్కిలి విలపించి వీరందఱి మరణమునకును కృష్ణుఁడే కారణమని, యాతనిని నీవారు నిట్లే మరణింతురని శపించెను. పుత్త్రదుఃఖమున విలపించుచుండిన యీమెకు, ధృతరాష్ట్రుని వ్యాసుఁ డోదార్చెను. మృతులయిన బంధువులను జూపెను. ఈమెయు భర్తతో నరణ్యవాసమునకుఁ బోయెను. వ్యాసుఁడు రావింప ధృతరాష్ట్రుఁడును, నీమెయుఁ జనిరి. సంజయుఁడు కూడ వీరిని గొలిచియుండువాఁడు. అరణ్యములో నున్నవారిని జూచుటకు పాండవులు వచ్చియుండిరి. వారిని నగరమునకుఁ బొమ్మని చెప్పిరి. వీరున్న అడవిలో దావానలము పుట్టెను అది దాటిపో వెఱవులేక సంజయునిఁ బొమ్మని యందుఁ దూర్పుదిశగఁ గూర్చుండి ప్రాణములు విడచిరి.

గాంధారి పూర్వభవమునందు మతి యను దేవతా స్త్రీ. భార.

గాధి:-కుశికుని కుమారుఁడు. భార.

గాధి:-ఒకరాజు. కుశాంబుని (కుశనాభుని) కుమారుఁడు. ఇతనికి సత్యవతి యను కూఁతురు కలదు. ఆమెను ఋచీకుఁడను ముని చూచి తన కిమ్మని గాధిని గోరెను. ఈ వృద్ధముని కివ్వకుండఁ దప్పించుకొనుటకై యొక చెవి నలుపును, శరీరమంతయుఁ దెలుపును గల గుఱ్ఱముల నంకువగ నిమ్మనియె. నీవు తలఁచినపు డట్టి యశ్వములు వచ్చునని ఋచీకుఁడు చెప్పెను. ఇతఁడు వానికై తలఁపనే గుఱ్ఱములు వచ్చెను. ఋచీకుఁడు తెచ్చియిచ్చెను. అంతఁ దన కూఁతురగు సత్యవతిని గాధి ఋచీకునకిచ్చి వివాహము చేసెను. ఇతనికిఁ బుత్త్రులు లేరు. కావున సత్యవతి తన తల్లిదండ్రులకుఁ బుత్త్రుఁడు పుట్టున ట్లనుగ్రహింపుమని ఋచీకునిఁ గోరెను. గాధికి విశ్వామిత్త్రుఁడు జన్మించెను.

గాధి:-బ్రహ్మమంత్రముతో నొకటియును, రాజమంత్రంబుతో నొకటియును "చరువులు రెండు వేల్పించి" ఋచీకుఁడు నది కేగెను. సత్యవతి తెలియక విప్రమంత్రపూతమగు చరువు తల్లి కిచ్చెను. గాధికి బ్రహ్మపరుఁడగు విశ్వామిత్త్రుఁడు కలిగెను. భాగ.

గానబంధుఁడు:-ఒక గుడ్లగూబ. పూర్వభవమున భువనేశుఁడనురాజు. ఇది మానసోత్తరమను శైలమున శవములను దినుచుండెను; హర

మిత్రుఁడుచూచి దాని పూర్వభవంబును జ్ఞాపకము చేసికొని ఇట్లేలయైతివని యడిగెను. తన పూర్వభవంబున రాజ్యము పాలించినపుడు హరమిత్రుఁడు విష్ణుపూజలు చేయుచు సదా విష్ణుని గానము చేయుచుండుటచే నితఁడు విని వాని కడకరిగి తనకీర్తిని గానము చేయుమనియె. అతఁడు నిరాకరించుటచే ఆ బ్రాహ్మణుఁడు పూజచేయు ప్రతిమను బాఱవైచి వానిని హింసించెను. ఆపాతకమువలన నిట్లైతిని; ఇఁకముందు శునకజన్మము రానున్నది అని చెప్పెను. తన కతమున నింతకలిగినందుకు హరమిత్రుఁడు విచారించి నీపై నాకుఁ గోపములేదు. నావలన నీకుఁ గీడుకలుగకుండునుగాక. ఇఁక నీకు శునకజన్మము కలుగదు. నేను నీకు గానము నేర్పెదను. నీవు విష్ణుకీర్తనము చేయుచుండుమని చెప్పెను. అప్పటి నుండియు నట్లతఁడు చేయుచుండెను. వానికడ నారదుఁడు గానము నేర్చుకొనుటకు విష్ణునిచేఁ బంపఁబడెను. రామా.

గార్గి :- ఒక బ్రాహ్మణ వనిత; మిక్కిలి అద్భుత విద్యావంతురాలు. జనకునిసభలో విద్వాంసులగు బ్రాహ్మణులుండఁగ వీరిలో మిక్కిలి బుద్ధిమంతుఁడగువాఁడీ ధనమును గైకొనవలెనని జనకుఁడిచ్చెను. యాజ్ఞవల్క్యుఁడులేచి దానిని గైకొనియె. ఆ యాజ్ఞవల్క్యునే యీమె వేదాంత విషయమునఁ బ్రశ్నించి వానితో వాదించెను.

ఈమెయొక్క చివర ప్రశ్నను విని యాజ్ఞవల్క్యుఁడు, ఓగార్గీ ! నీ వడుగరాని ప్రశ్నలడుగుచున్నావు. చిరకాలము బ్రతుకఁ దలఁచితిమి. ఇట్టి ప్రశ్న లడుగకుము అనెను. ఆమె భయపడి కొంతసేపు ఊరకుండి, సభవారిని జూచి మీరు పూజ్యులు, మీరనుగ్రహించుచో రెండు ప్రశ్న లితనిని వేసెదను. ఆతఁడుత్తరమిచ్చెనేని మీలోనెవరును జయింపలేరనియె. వారట్లే అనుమతించిరి.

గార్గి :- వచక్నుని కుమారిగ.

గార్గ్యుఁడు:- బాష్కలి శిష్యుఁడు. గర్గుని కుమారుఁడైన శనియొక్క పుత్త్రుఁడు. వాలఖిల్యాఖ్యసంహితను నేర్చెను. ఈతనినుండి బ్రాహ్మణకులంబయ్యె. భాగ.

గార్దభాసురుఁడు:- ఒకదనుజుఁడు. వీఁడు పూర్వజన్మమున సాహసికుఁడనువాఁడు.

భాగ. బ్రహ్మ.

గార్దభాసురుఁడు:- ధేనుకాసురుఁడు గార్దభరూపముతో నుండెను. కాన గార్దభాసురుఁడనియును పేరు. (చూడుము ధేనుకాసురుఁడు.)
భాగ.

గాలఁవుడు:- విశ్వామిత్రుని కుమారుఁడు. క్షామమువచ్చి తినుటకులేక వాని కుటుంబమువారు మలమల మాడిపోవునపుడు విశ్వామిత్రుఁడు తన మధ్యమకుమారుని కంఠమున కురివేసి వీథివీథిని ద్రిప్పుచు ఈబాలుని బుచ్చుకొని నూరుగోవుల నిచ్చెదరా ! యని యఱచెను. సత్యవంతుఁడు మీకుటుంబమును నేను బోషించెదనని వీనిని విడిపించెను. వీని కంఠమున కుఱివేయఁబడెను గాన వీనికి గాలవుఁడను పేరు వచ్చెను.

గాలవుఁడు:- ఒక ముని పుత్త్రుఁడు. విశ్వామిత్రుని యొద్ద విద్యనేర్చుకొని గురుకట్నముగ నతని నేదేని కోరుకొమ్మనియె. విశ్వామిత్రుఁ డక్కఱ లేదనినను వినక వానిని బలవంతిబెట్టెను అపుడు శుద్ధధవళవర్ణమై యొక్కకర్ణము నీలమైయుండిన యశ్వముల నెనిమిదివందలు తెచ్చియిమ్మని విశ్వామిత్రుఁడు చెప్పెను. వానికై గాలవుఁడు వెదకెను. ఎచ్చటను దొరకినవిగావు. ఇతఁడు తన మిత్రుఁడైన గరుడుని నడిగెను. వారిద్దఱు కలసి యశ్వములకై వెదకిరి. గరుడుఁడు తన మిత్రుఁడగు ప్రతిష్ఠానపురనాథుఁడైన యయాతి కడకు వీనిని దీసికొని వెళ్ళెను. అతఁడు తనకడ గుఱ్ఱములు లేవనియును, దన కూతురు మాధవి యనువానినిచ్చి యేరాజునకైన నీమెనిచ్చి గుఱ్ఱములు బుచ్చుకొనుమనియును జెప్పెను. గాలవుఁడామెను దీసికొని ఇక్ష్వాకురాజు నొద్దకు వచ్చెను. ఆమె యువతియయ్యును గన్యయగునట్లు ఒక మునివరము గలదనియు గావున దీనినిచ్చి యున్న గుఱ్ఱములను బుచ్చుకొనుమని ఆమె చెప్పెను. మఱియు సంతానమును బడసిన పిమ్మట వానినివిడచి వెడలునట్లు సమయము చేసెను. అట్లు అతనికడనుండి రెండు వందల

గుఱ్ఱములు పుచ్చుకొని వానికి మాధవి నిచ్చెను. మాధవివలనఁ బుత్త్రుని బడసి యామెను దిరిగి యిక్ష్వాకు గాలవున కిచ్చివేసెను. అతఁడట్లే దివోదాసునికడ రెండువందలును, ఔశీనరుని యొద్ద రెండువందలును బుచ్చుకొనెను. ఇఁక గుఱ్ఱము లెక్కడను దొరకవు. కావున గాలవుని మిత్త్రుఁడు గరుడుఁడు మరలవచ్చి యా గుఱ్ఱములను, మాధవిని బుచ్చుకొనుమని విశ్వామిత్త్రునే ప్రార్థింపుమనియె. ఆ యాఱువందల గుఱ్ఱములను మాధవిని గైకొమ్మని విశ్వామిత్త్రుని గాలవుఁడు ప్రార్థించెను. హరి. భార.

గాలవుఁడు:- ఒకముని. ఇతఁడు తపస్సు చేసికొనుచుండఁగఁ బాతాళకేతుఁడను దనుజుఁడు వివిధ రూపముల వచ్చి తపోభంగము చేయుచుండువాఁడు. వానిని సంహరింపఁ గల్గియుఁ దపోవ్యయమున కిష్టపడక గాలవుం డాకసమువంకఁ జూచుచుండెను. అంతలో నొక యశ్వ మతని యెదుట నిలచెను. ఆకాశవాణి "మునీంద్రా! ఈ గుఱ్ఱమును రవి యొసంగెను. ఇది యెల్ల చోటులను దిరుగఁగలదు. దీనిని గొనిపోయి శత్త్రుజిత్తుకుమారున కిమ్ము. అతఁ డా దానవుని సంహరింపఁగలఁడు" అని పలికెను. తద్వచనానుసారముగ గాలవుఁడు గుఱ్ఱమును ఋతుధ్వజున కిచ్చెను. గాలవునికుమారుఁడు భద్రశీలుఁడు. మార్క.

గి

గిందముఁడు:- ఒక ముని. ఇతఁడును, నితని భార్యయును లేడులై రతికేళిఁదేలుచుండఁగ వేఁటకు వచ్చిన పాండురాజు వారిని బాణములతోఁ గొట్టెను. ఆ దెబ్బచేఁత ప్రాణము విడచుచు మృగరూపముననున్న యా ముని గిందముఁడు రాజైనను ఏ జంతువులను వధింపరాదో చెప్పుచుండెను. అతఁడు నాత్మబోధసేయ మొదలుపెట్టఁగ పాండునకుఁ గోపమువచ్చి పరుషములాడెను. అంతట నతఁడు నీ భార్యతో నీవు సంయోగము పొందునపుడు పంచత్వము నొందుదువు అని పాండురాజును శపించెను.

గిరిక:- శుక్తిమతియను నదికిఁ గోలాహలమను పర్వత సంయోగమునఁ బుట్టిన కుమారిత. ఆ నది కడ్డముగ నున్న కోలాహలపర్వతమును ఉపరిచర వసువు త్రోసిపుచ్చెను. కాన శుక్తిమతి ఈ కూఁతు నాతని కిచ్చెను. ఈమెను అతఁడు భార్యగఁ గైకొనియె. ఈమె ఋతుమతియైన ఈమెకు మాంసమును బెట్టుమని పితృదేవతలు చెప్పఁగా దానినిదెచ్చుటకై వసువు కానవమున కేగెను. అపు డీమె సౌందర్యమును దలపోయుటచే వసువునకు రేతఃపతన మయ్యెను. దానిని గిరికకిమ్మని యొకపర్ణమునఁ బెట్టి డేగచే వసువు పంపెను. అదియేమత్స్యమునోటఁబడియెను. భార.

గిరిభద్ర:- మిత్త్రుఁడను రాజు భార్య. చాక్షుషమను వీమెకు జన్మించెను. శిశువు జన్మించిన యాఱవనాఁ డీమె తన చిన్న శిశువును ముద్దాడుచుండఁగ వాఁడు పక్కున నవ్వెను. "నీవింకను గన్నులు తెఱువనిపాపవే; ఏల యిట్లు నవ్వెదవు?" వని యీమె యడుగఁగ జాతహారిణియను పిల్లి నన్నుఁ దినుటకు సిద్ధముగ నున్నది. అదిగాక నేను నీకట్టి యపకారమును జేసియుండలేదే; నీకింత హర్ష మేల? యని నవ్వుచుంటినని శిశువు పలికెను. గిరిభద్రకుఁ గోపమువచ్చి నీకిష్టము లేకపోయినచో నేను ముద్దాడనని యా పురిటిగదిని విడిచిపోయెను. అపుడు జాతహారిణి శిశువు నెత్తుకొనిపోయెను. మార్క.

గిరివ్రజపురము:- జరాసంధుని నగరము. ఈ నగరముచుట్టును గోరథము, ఋషభము, వైహారము, ఋషగిరి, చైత్రకాద్రియను పర్వతములు కలవు. చైత్రకాద్రిశృంగమందు భేరులుగలవు. ఈగిరులు శూరభటులువోలె బురమును గాచును. కావున ఈపేరు వచ్చెను.

ఇందుఁ బూర్వము గౌతముఁడు ఔశీనరి యను శూద్రీయందు. గామక్షీవాదులను సృజించెను. అతని యనుగ్రహంబున ఈ మాగధుల నెవరును జయింపనోపరు. పూర్వపు మాగధులు మానుషాదము అను ఋషభమునువధించి దానిచర్మంబుతో భేరులఁ జేయించిరి. వాటిని చైత్రకగిరిని బెట్టిరి. పరులు నగరమును బ్రవేశింపఁగనే భేరులు మ్రోగును.

గు

గుణకేశి :- మాతలి కూఁతురు. సుముఖుని భార్య. ఈమెవలననే యీమె భర్త కాయుష్కాలము పెరిగెను. (చూడు సుముఖుఁడు గరుడుఁడు) భార.

గుణనిధి :- యజ్ఞదత్తుని కుమారుఁడు. ఇతఁడే కుబేరుఁడయ్యెను. (చూడు కుబేరుఁడు.)

గురుఁడు :- (చూడుము బృహస్పతి.)

గుహుఁడు :- ఒక నిషాదరాజు. శ్రీరాముని భక్తుఁడు. శృంగిబేరిపుర మితని నగరము. దండకారణ్యవాసమునకుఁ బోవు సీతారామ లక్ష్మణులను గంగానదిని దాటించెను. 'భరతుఁడు శ్రీరామునిఁ జూచుటకై వచ్చుచుండఁగ నతని సేనను జూచి రామునితో యుద్ధమునకు వచ్చుచున్నాఁడని తలఁచి గుహుఁడు వాని నెదిరించి వెళ్ళనివ్వననియెను. అప్పుడు భరతుఁడు రాముని దర్శించి వానికి మ్రొక్కుటకే పోవుచున్నామని చెప్పఁగ వానిని గుహుఁడు గంగ దాటి పోనిచ్చెను. రామా.

గుహ్యకులు - కృష్ణుఁడు గోలోకమున నుండఁగ నతని గుహ్యదేశమునుండి పుట్టినవారు. వారిలో మొదటివాఁడు కుబేరుఁడు. బ్ర. వై.

గృ

గృత్సమదుఁడు :- వీతహవ్యుని పుత్త్రుఁడు. ఇతని కుమారుఁడు సుతేజసుఁడు. భార.

గృత్సమదుఁడు :-సుహోత్రుని కుమారుఁడు ఇతని పుత్త్రుఁడు శునకుఁడు భాగ.

గృధ్రగోమాయుసంవాదము :- ఒక శిశువు చనిపోఁగఁ దల్లిదండ్రులును, బంధువులును వానిని ప్రేతభూమికిఁ దెచ్చి యచ్చటఁ బెట్టి యేడ్చుచుండిరి. ఒక గద్దయును, గలుగులోనుండి యొక నక్కయును దానిని జూచి యాశవమును దిను నాశతో నుండెను. రాత్రిపడినచోఁ దనకు దినుటకు వీలు కాదని గద్ద వారిదగ్గఱకు వచ్చి మీరేల యేడ్చెదరు? చచ్చిపోయినవారు మరల వత్తురా? రాత్రి పడెనేని యే రాక్షసియో వచ్చి మిమ్మునుగూడ మ్రింగివేయును. చీకటి పడక పూర్వమే మీయిండ్లకుఁ బొండని చెప్పెను. ఈ మాటలు విని వారు పెందలకడనే పోవుచో గద్ద యా శిశువును దినివేయుననియును, దన కాహార ముండదనియును భయపడి వీరియొద్దకు నక్క వచ్చి ఓ గద్దా! నీ వట్లనెదవేల? ఏ మునియో వచ్చి వీనిని బ్రతికింపరాదా? దుఃఖముతీరువఱకును జెంతగూర్చుండి యేడ్చుటకైన లేదా? చీకటిపడువఱకును వారి నుండ నిమ్ము అని వారి హితమునే గోరు దానివలె నక్క చెప్పెను. భార.

గొ

గొడుగు :- చెప్పులు దానము. (చూడుము జమదగ్ని) భార.

గో

గోకర్ణక్షేత్రము :- ఒక పుణ్యక్షేత్రము. మునులకు నివాసయోగ్యమైనది. సగరపుత్త్రు లశ్వమును వెదకుటకై భూమిని ద్రవ్వుచు నీ క్షేత్రమునుగూడఁ ద్రవ్వివేసిరి. ఇదియును సముద్రములోఁ గలసెను. అంత మునులు పరశురాముని వేఁడఁగ నీ క్షేత్రమును బైటఁబెట్టుమని పరశురాముఁడు సముద్రుని నాజ్ఞాపించెను. సముద్రుఁడీ క్షేత్రమునుండి తొలఁగిపోయెను. అందు మునులు మరలఁ బ్రవేశించిరి. బ్రహ్మ.

గోదావరి :- అశ్వని కుమారుఁడు తీర్థయాత్రకు బోవుచున్న బ్రాహ్మణకాంతను జూచి మోహించి బలాత్కారమున వీర్యాధానము చేసెను. ఆమెకుఁ గుమారుఁ డుదయించెను. ఆమె సిగ్గుపడుచు భర్తయగు సుతపుని కడకుఁ గొనిపోయెను. భర్త ఆమెను పరిత్యజించెను. ఆపె యోగంబున నదియయ్యె. అదే గోదావరి. బ్ర. వై.

గోదావరి:-ఒకనది. ఇదియును శివునిజటాజూటమునందుఁ గల్గిన గంగయొక్క భాగమని చెప్పవచ్చును. తొల్లి మహాకాటకము సంభవించి తినుట కేమియును లభించక యున్నపుడు మునులందఱును గౌతముని యాశ్రమమునకు వచ్చిరి. గౌతముఁడు పడసిన వరముచే నతని పొలములుమాత్రము పండుచుండెను. ఆ పంట వచ్చినవారి కెల్లగను గౌతముఁడు పెట్టుచుండెను. ఇతనిసంపద కోర్వలేక కొందఱు మునులు మాయగోవును సృజించి గౌతమునిచేను మేయుచుండుమని పంపిరి; గోవు చేను మేయుచుండుట గౌతమునకుఁ దెల్పిరి. చేను పోవుచుండుటకు విచారించి, గోవును గొట్టలేక, గౌతముఁడు పొమ్మని జలమును గోవుపైఁ జల్లెను. నీటిబిందువులు దాని శరీరముపైఁ బడఁగనే యా గోవు చచ్చి క్రిందఁబడియె. అపుడు మునులు ఛీ ఛీ యీగోవధ చేసినవానియింట భుజింపరాదని లేచిరి. గౌతముఁడు వారిని ప్రార్థించి యే కార్యమువలన నీగోహత్యాపాతకము పోవునో చెప్పుఁడని వారిని వేఁడెను. అచ్చటకు గంగను దీసికొని వచ్చిన పాతకము పోవునని వారు తెల్పిరి. గౌతముఁడు శివునిగూర్చి తపస్సు చేసెను. అతఁడు ప్రత్యక్షమై తన జట నొకదానిని దీసియిచ్చి యిది పిండుము. ఆ గోవు బ్రతుకును అని చెప్పెను. గౌతముఁడు దానిని బుచ్చుకొని తెచ్చి గోవుపైఁ బిండెను. గోవు లేచి స్త్రీరూపధారిణియై చనియె. ఆ జలమే నదియయ్యె గోవును బ్రతికించెనుగాన గోదావరియని దానికి పేరువచ్చెను. గౌతముఁడు నదిని దీసికొనివచ్చుటచే గౌతమి యను పేరు కూడ వచ్చెను. వరా.

గోదేవి:- బ్రహ్మదత్తుని భార్య. ఈమె పుత్రుఁడు విష్వక్సేనుఁడు. భార.

గోపతి.- శిబి మనుమఁడు. పరశురామునకు వెఱచి యరణ్యములకేగి యచ్చట గోవులను రక్షించుచుండువాఁడు. భార.

గోబిలుఁడు :- ఒక బ్రాహ్మణుఁడు. దేవదత్తుఁడను బ్రాహ్మణుఁడు చేయుచుండిన యజ్ఞమందు ముద్గాతగ నుండెను. ఇతఁడు స్వరము తప్పు చెప్పఁగ దేవదత్తుఁడు 'మూర్ఖుఁడా!' యని వీనిని దిట్టెను. ఇతనికిఁ గోపమువచ్చి నీకు మూర్ఖుఁడగు కుమారుఁడే పుట్టుఁగాక యని శపించెను. అప్పుడు దేవదత్తుఁడు వాని పాదములమీఁదఁబడి, మ్రొక్కి క్షమింపుమని వేఁడఁగఁ గొంతకాలమునకు నీపుత్రుఁడు కవి యగునని యనుగ్రహించెను. దే. భా.

గోముఖుఁడు :- శాకల్యుని శిష్యుఁడు. తానభ్యసించిన ఋగ్వేదసంహితను జాతుకర్ణి అనువానికుపదేశించెను. భాగ.

గోవర్ధనగిరి:- (చూడుము రాళ్ళవాన.)

గోవు:-(కపిల) దేవతలందఱాఁకొని బ్రహ్మకడ కేగినపుడు బ్రహ్మ వారి కమృతమిచ్చెను. ఆ సురభిత్వసంపదచే సురభి జన్మించెను. దాని సంతానమే గోవులు. కొన్ని గోవులు హిమవత్పర్వతనుమీఁద సంచరించుచుండెను ఒక లేఁగ తల్లిపాలు త్రాగియుండఁగ దాని నోట నూడిన నురుగు తపము చేసికొనుచున్న శివుని శిరస్సుపైఁ బడెను. అతఁడు కన్నెత్తిచూడఁగనే నవి నల్లఁబడియె. దాన గోవులు భయపడి యచ్చటనుండి పరుగెత్తుకొని వచ్చుచుండెను. దానిని బ్రహ్మచూచి శివునికడకేగి నమస్కరించి, గోవులు పవిత్రవంతములైన వనియును, దూడ త్రాగినపిదపఁ బితికినపాలు దూడ యెంగిలి తగిలినను శుద్ధియే యనియును జెప్పి శివున కొక వృషభమిచ్చెను. దానిని ధ్వజమున దాల్చెను శివుఁ డాతని వాక్యము నంగీకరించి తన దృష్టివలనఁ గపిలమైన గోవు లెక్కువ పవిత్రవంతము లగునట్లు ప్రసాదించెను.

గోవు :- సుమిత్రుని గోవులు. రంతిదేవుని యాగమునఁ బశువులై చని గోలోకమునకుఁ బోఁగోరెను. (చూడుము సుమిత్రుఁడు.)

మనము సుమిత్రుని ధనము. వాని యనుమతి లేక యెట్లు పోఁగలమని యొక గోవనఁగ వానిని జంపుదమని కొన్నిగోవు లనియెను. వాని నెవరు చంపఁగలరు? మేము చంపెదమని కొన్ని కపిల గోవులు వచ్చెను. అవి కామరూపమునఁబోయి సుమిత్రుని గోలోకమునకు రమ్మని చెప్పెను. అది యెట్లు పోఁగుసన వానిని ఎత్తి తమ యోగబలముచేఁ జైతన్యమును బాపి, కళేబరమును నేలపై వైచి పిండఁగ కాళ్ళతోను, కొమ్ముల

తోమ్రొక్కెను. ఈ పనిచేయుటచే ఆగోవులు అన్ని వర్ణముల గోవులకంటెను కపిలగోవులు శ్రేష్ఠములగునట్లును, ఒక్క కపిల గోదానము నూరు యితర గోవుల దానమునకు సమానమనియును వారికిచ్చెను. భార.

బ్రహ్మఘాతుకులైన గోవులకు మీ వంశం బశుచిపదనం బయ్యెడు నని గోమాతలు శాపమిచ్చెను.

అవి రంతిదేవుని వేడి యాతని యాగపశువులై గోలోకము చేరెను.

అగ్ని దేవతలను వంచించుటకై తనను దాచుడని గోవులయొద్దకువచ్చి వేడెను. అవి దాచెను. అగ్ని యెచ్చట నుండునో దెల్పుమని దేవతలు గోవుల నడిగిరి. అసత్యము నాడక యవి యగ్నిని జూపించెను తమ కగ్ని నిచ్చెను. కావున గోవులను దేవతలు మెచ్చుకొనిరి తనను దాచియుంచుటచే కృతజ్ఞుఁడై యగ్ని తన కారణమునఁ గపిలమైన గోవులు పవిత్రములగునట్లు వరమిచ్చెను. లక్ష్మి గోవులకడకు వచ్చి నన్ను మీయందు వసింపనిండని ప్రార్థించెను. నీవు చంచలవు మాయందు నీవుండరాదు. పొమ్మని గోవులు తిరస్కరింపఁగ నామె వానిని బ్రతిమాలెను. అపుడు గోవులు కరుణించి మా మూత్ర పురీషములం దుండు మని యామె కనుజ్ఞ నిచ్చెను. భార.

గోవుతీర్థము:-సరయూనది యందలి యొకతీర్థము. ఇచ్చటనే శ్రీరాముఁడును, వాని వెంటవచ్చిన ప్రజలును నదిలో మునిగి దివమున కేగిరి. ఆదిగిన జనులసమ్మర్దము గోవులయీతవలె నుండుటచే దాని కా పేరు కలిగెను. రఘు.

గోవులు:-(చూడుము సురభి)

గౌ

గౌతమి:-(చూడుము గోదావరి)

గౌతమి:-ఒక బ్రాహ్మణ స్త్రీ. ఈమె కుమారుని బాము కఱచెను. బాలుఁడు మృతుఁడయ్యెను. గౌతమి యేడ్చుచుండఁగ నేడ్పు విని బోయవాఁడొకఁడు వచ్చి పామును బట్టుకొని దాని తల చీల్చెదనని పలికెను. దానిజంపిన నేమిలాభము? నాకుమారుఁడు లేచి రాఁడుకదా! వాని కర్మమట్లున్నది. పాము నన నేల? అని గౌతమి బోయవానితోఁ జెప్పెను. పాముకూడ నేనేమి చేయుదును? మృత్యువు నన్నుఁబంపి కఱవుమని చెప్పినది. ఆ తప్పు మృత్యువుది. కాన నామెను శిక్షింపుము. నన్నుఁ గాదని పలికెను. మృత్యువు వచ్చి కాలుఁడు నన్నుఁ బంపెను. కాలుఁ డెట్లు చేయుమన్న నట్లు చేయుదును. నేను దోషిని గానని మృత్యువు చెప్పెను. కాలుఁడు వచ్చి "ఈ కార్య మొకరు చేసిరి. ఒకరు చంపిరి యనుకొనుట పొరపాటు. ఎవరికర్మ మెట్లున్నదో యట్లగును. ఇతరులు నిమిత్త మాత్రమగుదురు. నడిపించునది వాని కర్మయే కావునఁ బాముగాని, మృత్యువుకాని వానిచావుకలుగఁ జేసినవారు కారు. వారు శిక్షార్హులు కా"రని చెప్పెను. బోయవాఁడు పామును విడచెను.
భార.

గౌతముఁడు:-ప్రచేతసుని మానసమువలనఁ బుట్టిన కుమారుఁడు. బ్ర. వై.

గౌతముఁడు:-ఒకముని. బ్రహ్మ మిక్కిలి రూపవతియగు నహల్యను సృజించి యామెను నెవ్వరు ముందుగ భూప్రదక్షిణము చేసివత్తురో వారికిచ్చి వివాహము చేసెదనని చెప్పెను. దేవతలు మొదలగువారు ప్రదక్షిణము చేయుటకై బయలుదేరిరి. గౌతముఁడు సగమీనిన గోవును జూచి దాని చుట్టును బ్రదక్షిణము గావించి ముందుగ బ్రహ్మకడ కరిగెను. అట్టి గోప్రదక్షిణము భూప్రదక్షిణమునకుఁ దుల్యమని బ్రహ్మయీతని కహల్యనిచ్చి వివాహము చేసెను.

అహల్య రూపము చూచి యింద్రుఁడు చిత్తవిభ్రమము నొంది యామెతోఁ బొందుపడఁ గోరుచుండువాఁడు. ఒక నిశి నింద్రుఁడు కోడియై గౌతముని యాశ్రమము చెంగటఁగూసెను. ఆకూఁత విని తెల్లవారవచ్చుచున్న దనుకొని గౌతముఁ డాశ్రమమును వీడి కాలకృత్యములను దీర్చుకొనుట కేగెను; కాని నక్షత్రములను జూచి

యప్పుడర్ధరాత్రియే యగుటచే మరల నాశ్రమమునకు వచ్చెను. ఇతఁడు వచ్చునప్పటి కింద్రుఁడహల్యశయ్యలో నుండెను. దాని నితఁడు గాంచి యామెను శిలకమ్మని శపించి యింద్రుని యండము లూడునట్లును, నింద్రుని శరీరమంత యును యోనులగునట్లును శపించెను. వారిద్దఱు శాపవిమోచనమునకై వేఁడఁగ రామునిపాదరజను తగులఁగ నామెకు శాపవిముక్తి కలుగునట్లును, నింద్రుని శరీరమందలి యోనులితరులకు నేత్రములవలెఁ గనపడునట్లును ననుగ్రహించెను.

అహల్యయందీతనికి శతానీకుఁడను పుత్త్రుఁడు కలిగెను.

గౌతముఁడు:-ఇతఁడు బ్రహ్మను బ్రార్థించి విత్తనములు చల్లగనే ఫలించునట్లు వరము పుచ్చుకొనెను. ఒక సంవత్సరము విపరీతమయిన క్షామము వచ్చెను. అందఱు మునులును గౌతముని యాశ్రమమునకు వచ్చిరి. వీరి కాహారము గౌతముఁడే యొసంగుచుండెను. కొందఱు మునులకు నీర్ష్య కలిగినది; గౌతముని సంపదచూచి సహింపలేకపోయిరి. వారొక మాయా గోవును గల్పించి గౌతమునిపొలమును మేయుచుండుమని పంపిరి. నీ పొలమును గోవు మేసి వేయుచున్నదని గౌతమునితోఁ జెప్పిరి. పండినపొలమును దినుచున్న పశువును జూచి విచారించి గోవు కాన దానిని గొట్టలేక గౌతముఁడు తన చేతనున్న జలమును జల్లి నీవు వెడలిపొమ్మనెను. రెండు జలబిందువులు తగులగనే యా మాయ గోవు చచ్చిపడెను. అపుడా మునులు ఛీ ఛీ ఈ గోహత్య చేసినవానియింట భుజింపరాదు. పోదము అని లేచిరి. గౌతముఁడు వారిని బ్రార్థించి యే కార్యముచేసినచో నాపాతకము పోవునో తెల్పుఁడని వేఁడెను. గోవుచచ్చిపడియున్న చోటగంగాజలమును బ్రవహింపఁజేసినచోఁబాతకము పోవునని మునులుచెప్పిరి. గంగను దెచ్చుటకై గౌతముఁడు చాలకాలముతపస్సు చేసెను. శివుఁడు ప్రత్యక్షమై తన జట నొకదాని నిచ్చి దానిని విడుమని చెప్పెను. దానిని దెచ్చి గౌతముఁడా గోవుపైనఁ విడెను. గోవు లేచి, స్త్రీయై చనియె. జలము నదియై ప్రవహించెను. గౌతముఁడు తెచ్చుటచే నా నదికి గౌతమియనియును, గోవును బ్రతికించుటచే గోదావరి యనియును పేరులు వచ్చినవి.

తరువాత, మాయాగోవును బ్రతికించితివని మునులు గౌతముని(బొగడిరి. మాయగో వెట్లగు? నని గౌతముడు దివ్యదృష్టివలనఁ జూచి తాను భోజనము పెట్టుచుండఁగ కృతఘ్నులై చేసిన యపకారమునకు కోపి యా మునులను బాషండులై పుట్టుదురుగాక యని శపించెను.

గౌతముఁడు బ్రహ్మదత్తుఁడను రాజు నింటికిఁబోయి యాహారమును వేఁడెను. ఆ రాజు నింట మాటయులవదియేండ్లు భుజించెను. ఒకనాఁడు భోజనము చేయుచుండఁగ నన్నములో మాంసము వచ్చెను. ఇతనికి కోపమువచ్చి నీవుగద్దవుకమ్మని రాజును శపించెను. నాకుఁ దెలియక కల్గిన యపరాధమును మన్నింపుమని రాజు వేడుకొనెను. శ్రీరాముఁడు నీశరీరము తాకును. అప్పుడు శాపవిమోచనము కలుగునని యితఁడనియె. ఉ. రా.

గోతముఁడు:-ధనార్థియై వచ్చిన యత్రి పృథుచక్రవర్తిని 'నీవే విధాతవు, నీవే యింద్రుఁడవు' అని పొగడఁజొచ్చెను. పరునివిధాత. ఇంద్రుఁడు అని అట్లుపల్కవచ్చునా? అని గౌతముఁడాక్షేపణ చేసెను. వారిరువురు వాదమునకుదిగిరి. వారివాదము సనత్కుమారుఁడుగాని నిర్ణయించలేఁడని అటనున్న కశ్యపుఁడుపలుకఁగ సనత్కుమారుని కడ కేగిరి. క్షత్రియుఁడు సకల భారమును వహించి యెల్లరను గాచును బ్రోచును ప్రభువు గాన నట్లనవచ్చు ననియె. భార.

గౌతముఁడు న్యాయసూత్రములు రచియించెను. తన మతమును దూషించిన వ్యాసుని కన్నులతోఁ జూడనని ప్రతిజ్ఞ చేసి పాదమందు నేత్రము కల్పించుకొని వానిని జూచెను. పద్మ.

గౌరముఖుఁడు:-శమీకుని శిష్యుఁడు. శృంగి పరీక్షిత్తును శపించెననియును నతనిని దక్షకభయము నివారించుకొను నుపాయమాలోచించికొనుమనియును జెప్పుట కీతనిని బరీక్షిత్తు నొద్దకు శమీకుఁడు పంపెను. భార.

గౌరముఖుఁడు:-ఒక ముని. తన యాశ్రమ సమీపమునకు దుర్జయుఁడను రాజు వేటాడి డస్సి వచ్చి యుండఁగ రాజును, వాని పరివారమును విందునకుఁ బిలచెను. అరణ్యములోఁ గంద మూలములనుదిను ముని రాజున కెట్లు విందు చేయఁగలఁడో చూతము గాకయని రాజును, బరివారమును వచ్చుట నాగిరి. గౌరముఖుఁడు గంగానదియొద్దకుఁబోయి విష్ణుమూర్తిని ప్రార్థించి రాజునకు విందుచేయు నుపాయము చెప్పుమని కోరెను. విష్ణుమూర్తి యొకమణినిచ్చి దానివలన సకలపదార్థములు లభించునని చెప్పెను. ఆమణి ప్రభావమువలనవచ్చట నగరమునునిర్మించి రాజు నొక కనకమయసౌధమునందుంచి షోడశోపచారములు గావించి రాజునకును, సేనకును విందొసంగెను. ఈ మణిప్రభావమునకు రాజాశ్చర్యపడి యెట్లైనను దానిని గైకొమ్మనిమంత్రిని బంపెను. గౌరముఖుఁడివ్వనని గట్టిగఁజెప్పెను. మునియొద్దనుండి లాగికొనివచ్చుటకు నీలుఁడనువాఁడు వచ్చెను. అప్పటికి గౌరముఖుఁడు గంగానదికేగెను. నీలుఁడు రథము దిగఁగనే మణినుండి రథములు, అశ్వములు, వీరులు పుట్టిరి. వీరికిని రాజు సేనకును ఘోరయుద్ధమయ్యెను. ముని తిరిగివచ్చి యుద్ధముగుటచూచి భయవిహ్వలుఁడై విష్ణుమూర్తిని ప్రార్థించెను. విష్ణువు ప్రత్యక్షమయ్యెను. శత్రుసేనలను సంహరింపుమని ముని వేఁడెను. విష్ణుమూర్తి నిమిషములో సేనల నన్నిటిని, దుర్జయుని సంహరించెను. వరా.

గ్ర

గ్రస్తుఁడు:-ఒక రాక్షసుఁడు. ఇతఁడుభృగుపత్నిని బలాత్కారమున నెత్తుకొని పోవుచుండఁగ నీమె నీవు కీటకముకమ్మని శపించెను. ఆ శాపమువలన వీఁడు కీటకమై యుండెను. ఒకనాఁడు పరశురాముఁడు కర్ణుని తొడపైఁ దలయుంచి నిదుర పోవుచుండఁగఁ గర్ణునితొడ దొలిచెను. అచట గాయమై రక్తము కారెను. దానఁ బరశురామునకు మెలఁకువవచ్చి లేచెను. పరశురాముని మొగము చూడఁగనే కీటకమునకు శాపవిమోచనమయ్యెను. పిమ్మట రాక్షసుఁడు తనమార్గమునఁ బోయెను. భార.

గ్రా

గ్రామణి:-ఒకగంధర్వుఁడు. దేవవతితండ్రి. కుమార్తెను సుకేశునకిచ్చి వివాహముచేసెను. ఉ.రా.

గ్లా

గ్లావుఁడు:-(చూడు బకుఁడు)

ఘ

ఘంటాకర్ణుఁడు:-పిశాచ నాయకుఁడు. కుబేరుని బంటు. ఇతని తమ్ముడు కాలాంతకుఁడు. వీరి శరీరము రక్తమాంసముల తోడను ప్రేవుల తోడను మలినమయియుండెను. వీరచ్చటి విప్రులనుగూడ వధించి భక్షించుచుందురు.

కృష్ణుఁడుపుత్రార్థియై కైలాసమునకుఁబోవుచుండఁగ నితఁడు బదరికావనమునఁ గనఁబడి నీవెవ్వరవనికృష్ణుని ప్రశ్నించెను. అతఁడు యదువంశమువాఁడననియును, బుత్రార్థినై కైలాసమునకేగుచున్నాననియును దెల్పెను. నీ విట్లొంటరిగ నేలవచ్చుచుంటివి? నిన్నుఁ బిశాచములు బాధించునుగదా! యని ఘంటాకర్ణుఁడు తన పరివారమును బొమ్మని తాను కృష్ణునితో నుండి యతని నామసంకీర్తనమే చేయుచుఁ దన యీ జన్మమునకై వగచుచుండెను. ఇతని భక్తికిఁ గృష్ణుఁడు మెచ్చుకొని నిజస్వరూపమును గనఁబరచెను. ఘంటాకర్ణుఁడు పిశాచరూపమును వదలి దివ్యరూపమునంది అయ్యా! నేను పోవుచుంటిని. నాశవమును నీకర్పించితిననియె. నేను శవమును ముట్టను. నీకుదివిజలోకమును, నింద్రపదవియును వచ్చును పొమ్మని కృష్ణుఁడు చెప్పెను. ఘంటాకర్ణుఁడు దివిజలోకమున కేగెను. ఉ.హరి.

ఘటోత్కచుఁడు:-హిడింబియందు భీమునకు బుట్టిన కుమారుఁడు. ఇతఁడు రాక్షసికుమారుఁడయినను సద్వర్తనుఁడై పాండవులయెడ

భయభక్తులు కలిగియుండెను. యుద్ధమున నితఁడును వచ్చి తనమాయాబలంబుచేఁ గురుసేనపై విజృంభించెను. ద్రోణాచార్యప్రభృతులతో యుద్ధముచేసెను. జటాసురుని తనయుఁ డలంబసుఁడు ఇరావంతుని జంపఁగ ఘటోత్కచుఁ డతనితో యుద్ధముచేసి యలంబసుని సంహరించెను. ఇతఁడలాయుధాసురునిఁగూడ సంహరించి కర్ణునిపై గవిసెను. ఇతని బాహువిక్రమమునకుఁ గర్ణుఁడును సమానము కాకపోయె. అంత నింద్రుఁడిచ్చిన శక్తిని నీతనిపైఁ బ్రయోగించి కర్ణుఁడు వీనిని సంహరించెను.

ఇతఁడు మరణింప భీముఁడు దుఃఖమొందెను. అది దుఃఖమునకు సమయముకాదనియును, వాని మరణమునకు సంతసింపవలసినదే యనియును జెప్పెను. కర్ణునకు ఇంద్రుడిచ్చిన యా శక్తి యున్నంతవరకును కృష్ణార్జునులకు అతఁడు అజేయుఁడు. ఆ శక్తి ఇతనిపై ప్రయోగింపఁబడెను. కావున నిఁక నతనిని గెలువవచ్చును. మఱియు ఘటోత్కచుఁడును అలాయుధాసురులవంటి వాఁడే. ఇతఁడు రావణునివంటివాఁ డగును. ఇప్పుడు సంహరింపఁబడఁనేని కృష్ణుఁ డీతని సంహరింపవలసివచ్చును. అది ఇప్పుడు తప్పెను.

మేఘవర్ణుఁడు, అంజనపర్వుఁడు ఇతని కుమారులు.

ఘూ

ఘూర్ణిక:—దేవయాని పరిచారిక. దేవయానిశర్మిష్ఠచే నూతఁ ద్రోయఁబడి యుండఁగ నీమె దేవయానికై వెదకుచు వచ్చెను. భార.

ఘృ

ఘృతాచి:—ఒక అప్సరస. కపిలయనుదానికూతురు. ఈమెకుఁ బ్రమతివలన రురుఁడను కుమారుఁడు కలిగెను. భార.

ఒక సారీమె యలంకరించుకొని కాముని యింటికిఁ బోవుచుండఁగ విశ్వకర్మ చూచి యీమె పొందును గోరెను. ఘృతాచి వానిని నిరాకరించెను. విశ్వకర్మకుఁ గోపమువచ్చి శూద్రయోనిం బుట్టుమని శపించెను. నీవు భూలోకమునఁ బడుమని యీమె విశ్వకర్మకుఁ బ్రతిశాపమిచ్చెను, శాపవశమున ఘృతాచియొక మదసుఁడను వానికి గోపకాంతయందు జన్మించి ప్రయాగ తీర్థమునఁ దపము చేసికొనుచుండెను. ఈమెను భూలోకమున జన్మించిన విశ్వకర్మ చూచి పూర్వవృత్తాంతము స్మరణకుఁదెచ్చుకొని యామెతో భోగించెను. ఈమె కుమారులు కంసాలులు, వడ్రంగులు నైరి. బ్ర. కై.

తపస్సుచేసికొను వ్యాసుని చెంగట ఘృతాచి విహరించుట తటస్థించెను. అప్పటి కాతని హృదయము మదన ప్రేరిత మయ్యెను. అట్లు సంభవించిన చిత్తముతో నతఁ డీమెను జూచెను. ఈమె భయపడి శుకకముయొక్క రూపమును దాల్చి యటనుండి యెగిరిపోయెను. ఆ సమయముననే వ్యాసునకు శుకుఁడు జన్మించెను. దే. భా.

ఘో

ఘోరుఁడు:—ఒకముని. ఇతని శిష్యుఁడగు కృష్ణునకుఁ బురుషయజ్ఞ విజ్ఞానము నేర్పెను. ఛా. ఉ.

ఘోషయాత్ర :— పాండవులు ద్వైతవనమున బాధలుపడుచున్నారని విని ధృతరాష్ట్రుఁడు విచారించెను. తమ ప్రతాపమును జూపి వారిని వంచన చేయుటకు ఆదే సమయమని శకుని, కర్ణుఁడు, దుర్యోధనులు తలఁచి వారేగుటకు ధృతరాష్ట్రుఁ డంగీకరించడని యొకపన్నాగము పన్నిరి. ఒక గోపకుని వెంటఁబెట్టుకొని అచ్చట గోవులను వన్యమృగములుబాధ పెట్టుచున్నవని చెప్పించిరి. వీరా మృగయార్థ మరుగుటకు ఎట్టకేలకు ధృతరాష్ట్రుఁ డంగీకరించెను. వారు చతురంగబలముతో వెళ్ళిరి. అచ్చట సరోవరముకడ గంధర్వులతోఁ వీరికి యుద్ధమయ్యెను. గంధర్వరాజగు చిత్రసేనుఁడు కర్ణదుర్యోధనుల రథము విరుగఁగొట్టి దుర్యోధనుని బట్టుకొనెను. అపుడు వీఁ

ధర్మజుని శరణువేడఁ బంపిరి. మనము కలుగఁ జేసికొనకయే వా రోటుపడిరని భీముఁడు సంతసించి మిన్నకుండుద మనెను. కాని ధర్మజుఁడు జ్ఞాతులు తమలో వైర మున్నను, పగరయెడఁ దా మేకీభవింపవలయుననియును, శరణార్థులగు వారిని గాపాడుట ధర్మమనియును చెప్పెను. తాను యాగము చేయుటచేఁ గదలరాదనియును, భీముని, నర్జునుని పోయి వీరిని కాపాడుఁడని యును జెప్పెను. సాయుధులై వీరు చని గంధర్వులతో యుద్ధముచేసిరి. చిత్రసేనుఁడను గంధర్వరాజు అర్జునునకు మిత్రుఁడగుట ఒకరి నొకరు తెలిసికొనిరి. వారిని అవమానింపవచ్చుట యింద్రుఁ డెఱిఁగి వారిని మడియింప బంపెనని చిత్రసేనుఁడు చెప్పెను. కాని ధర్మజుఁడు వానినివేడి దుర్యోధనుని విడిపించి పంపెను.
భార.

ఘోషుఁడు:-పులిందుఁడను రాజు కుమారుఁడు. ఇతని తనయుఁడు వజ్రమిత్రుఁడు. భాగ.

జ్ఞ

జ్ఞానప్రసూనాంబ:- పార్వతి. (చూడుము శ్రీకాళహస్తి)

చ

చండకౌశికుఁడు:-ఒకముని. ఇతఁడు తపస్సుచేసి కొనుచుండగ బృహద్రథుఁడు పుత్రార్థియై వచ్చిన, వానికిఁ జూతఫలమిచ్చి వానిభార్యకుఁ బెట్టుమని చెప్పెను. ఇతఁ డిచ్చిన ఫలమును భక్షించుటచేతనే బృహద్రథునిభార్యకు జరాసంధుఁడు పుట్టెను. ఇతఁడు పుట్టినతరువాతఁ జండకౌశికుఁడు రాజనగరమునకేగి వీనినిజూచి మిక్కిలి బలశాలియగు భూభర్త యగునని బృహద్రథునకు జెప్పెను. భార.

చండదేవుఁడు:-మతంగుఁడను బ్రాహ్మణకుమారుఁ డింద్రునివరమువలనఁ గామరూపత్వము నొంది చండదేవుఁడను ప్రశస్తి వడసి సుస్త్రీలచే బూజింపఁబడుచుండువాఁడు.

చండముండులు:-దనుజసోదరులు; శుంభనిశుంభుల యనుచరులు. వీరు కాళికను జూచి యామె యంతటి సౌందర్యవతి లేదనియును, నామెను బొందనివానిజన్మము వ్యర్థమనియును శుంభునితోఁ జెప్పిరి. శుంభనిశుంభులు కాళికనువలచిరి. ఆమె తనను గెల్చినవానిని బరిణయమయ్యెద ననియె. మఱియును శుంభనిశుంభులు పాతాళలోకమునకుఁ బోకయున్నచో వారిని సంహరించెద ననియె. శుంభనిశుంభులు దేవిని బట్టుటకై తమ సేనలనుబంపిరి. వారు దేవిచేఁ జచ్చిరి. పిమ్మట జండముండులనుగూడఁ బంపిరి. దేవి వీరినిగూడ సంహరించెను. వీరిని సంహరించు నపుడే చండికముఖమునుండి కాళిపుట్టెను.
మార్క.

చండవేగుఁడు:-ఒక గంధర్వరాజు. ఇతఁడు పురంజనుని పురముపై దాడివెడలెను. వానిని బ్రజాగరుఁడను పురాధ్యక్షుఁ డోడించెను.
భాగ.

చండిక:- ఉద్దాలకుఁడను బ్రాహ్మణుని భార్య. కడు దుశ్శీల. భర్తచెప్పినదానికి వ్యతిరేకముగఁ జేయుచుండును. ఇతఁడుచేయుమన్నది మానుచు, మానుమనునది చేయుచుండుటచేతఁ బెద్దలనాలోచించి భర్త తనకు గావలసినదానికి వ్యతిరేకముగఁ జెప్పుచుండువాఁడు. ఒకనా డుద్దాలకు నింటఁ బితృకార్యము రాఁగా, నీవు స్నానము చేయకయే యశుచివై వంటచేయుమని భర్త చెప్పెను. ఈమె ప్రొద్దుననే లేచి స్నానముచేసి శుచియై వంట చేసెను. అట్లానాఁడు పను లన్నియును జక్కఁగఁ జేయుచుండుటచే భర్త యానందపారవశ్యమునఁ దనయుపాయముమఱచి పారణము జాగ్రత్తగ బెట్టుమని చెప్పెను. ఆమె దానిని బెంటమీఁదఁ బారవేసెను. ఉద్దాలకునకుఁ గోపమువచ్చి "నీవు వింధ్యాటవియందు శిలవై యుండు"మని శపించెను. ఈమె యేడ్చి శాప

విమోచనము ప్రసాదింపు మనఁగ ధర్మజుని యాగాశ్వము నిన్నుఁద్రొక్కినపుడు శాపవిమోచనము కలుగునని యనుగ్రహించెను. జై.భార.

చండిక:- పార్వతి శరీరమునుండి పుట్టిన దేవి. కౌశిక, చండముండు లను దనుజులను సంహరించెను. చండుని సంహరించుటచేతఁ జండిక యని పేరువచ్చెను. ఆ దనుజులను జూడఁగనే నీమెకు కోపమువచ్చి ముఖము నల్లబడియెను. ఆ ముఖమునుండి కాళి పుట్టెను. ఈమెయు యుద్ధము చేసెను. కాళి రక్తభోజునితో యుద్ధము చేయునపుడు వాని రక్తము క్రిందఁ బడకుండఁ జండిక త్రాగివేసెను. మార్క.

చండుఁడు:-శుక్రుని కుమారుఁడు. రాక్షసులకు యాజ్ఞికుఁడు. హిరణ్యకశిపుఁడు కోరినట్లు ప్రహ్లాదునకు విష్ణుద్వేషము పుట్టింప యత్నించెను గాని యది సాధ్యముకాలేదు. భార.భాగ.

చంద్రకాంత:-వేదరాశి యను విప్రుని భార్య. ఈమె పతివ్రత; భర్తృసేవచేయుచునే యుండెడిది. వేదరాశి సదా వేదమునే పఠించుచు సతీ సంగమము మానియుండెను. ఇట్లుండగఁ విద్యావతియను జారస్త్రీ యీమెకడకువచ్చి నీయౌవనము నంతయు నేల వ్యర్థము చేయుదువు? సంసార సౌఖ్యము లొందుమని చెప్పి బోధించి యామెను గూడ జారిణిగఁజేసెను. వీరిద్దఱను వేదరాశి తన ఇంటినుండి వెడలఁగొట్టెను. ఈమె జారులను గలిసిపోయి చనిపోయెను. ఆమె మరల నొక కొంతకాలమునకు దాసిగ జన్మించి తిరిగి తిరిగి కావేరీతీరమునకు వచ్చి యందు స్నానముచేసి కావేరీమహిమ బ్రాహ్మణులు చెప్పకొనుచుండగ విని దాన స్వర్గము నొందును. తుకా. అగ్ని.

చంద్రకేతుఁడు:-లక్ష్మణుని తనయుఁడు అంగదుని సోదరుఁడు. పశ్చిమదేశములకు వీరిద్దఱును రాజులైరి. చంద్రకాంత మను దేశమున కితఁడు రాజు. రామా.

చంద్రకేతుఁడు:- సౌబలుని యనుచరుఁడు. దుర్యోధనుని పక్షమునఁబోరి యుద్ధములో జచ్చెను. భార.

చంద్రగుప్తుఁడు:- నందుని దాసీ పుత్త్రుఁడైన మౌర్యుని పుత్త్రుఁడు. మౌర్యుని నూర్గురు పుత్త్రులలో నితఁడే కడపటివాఁడు. మౌర్యుఁడు నందుని సేనాధిపతిగ నుండెను. నందుని తొమ్మండ్రు కుమారు లొక్కొక్కఁ డొక్కొక్క సంవత్సరము రాజుగనుండి పాలించుచుండిరి. అట్లగుటచేఁ బ్రజలకు రాజునందు కంటె మౌర్యునందే యెక్కుడు భయభక్తులు గల్గినవి. మఱియు మౌర్యుఁడు పెద్దవాఁడైనను దనకు నందుఁడు రాజ్య మీయలేదను కోపముతో నతని పుత్త్రులతో విరోధములు పెంచఁ జూచుచుండెను. ఈ కారణములవలన నందపుత్త్రుల మంత్రులు మౌర్యుని, వాని సంతానమును నాశనముచేయ నిశ్చయించి వారు కార్యాలోచనము చేయు రహస్యగృహమున వారందఱకు నొకపూటకు భోజన మేర్పరచియుంచి, మౌర్యునకు "రాజును, మంత్రులును గార్యాలోచన మందిరమున నున్నారు. మిమ్ములను బుత్త్రసహితముగఁ ద్వరగ రమ్మని"నారని కబురు పంపఁగ మౌర్యుఁడు నిజమేయనుకొని తన పుత్త్రులను గూడ దీసికొనివచ్చి భూమిక్రిందఁ గట్టఁబడిన రహస్యగృహమును బ్రవేశించెను. వారు ప్రవేశింపఁగనే రాజభటులు బిలద్వారమును మూసివేసిరి. మౌర్యుఁడు వారుచేసినద్రోహ మెఱింగి, మనమందఱము నొకపూటఁగుడిచి మరణించుటకంటె శత్రువుల నందఱను బరిమార్చి మన పగ దీర్చుకొను నొక్కనికే యాహారముంచి మిగిలినవారము నిరాహారులమై యుండుట మంచిదని చెప్పెను. అంతఁ జంద్రగుప్తుఁడు శత్రువులను బరిమార్పఁగలవాఁడను నేనేనని లేచెను. వీనికే యాహారమంతయు నిచ్చిరి. మిగిలినవారందఱును మృతులైరి. మూడు మాసములు గతించినవి. చంద్రగుప్తుఁడట్లే నీరసముగ జీవించియుండెను.

వంగదేశపురాజు సింహము నొకదానిని నినుపబోనులోఁ బెట్టించి బోనును దెఱువకుండ జంతువును బైటకు వెడలగొట్టువారెవరైనఁ గలరా? యని యాబోనును దేశదేశములఁ ద్రిప్పుచుండెను. అది పాటలీపుత్రము రాఁగనే నందుల కేమియును దోఁచక మన చంద్రగుప్తుఁడుండెనేని యాతఁడు తీయనేర్చుననుకొని, యాతఁడు జీవించియుండు నేమోయని కుతూహలము పొడమ బిలమున

దెఱచి లోపలఁ బ్రవేశించి చంద్రగుప్తునిఁ జూచిరి. అతఁడు బైటకువచ్చి జీవించుట కిష్టములేనివానివలె మాట్లాడెనుగాని నందులు బలవంతపెట్టి వానిని దీసికొనివచ్చిరి. అతఁడు బోనును, దానిపై వ్రాయఁబడియున్న దానినిఁ జూచి చదివెను. ఇంచుక యాలోచించి, యొక యినుపకడ్డీ నెఱ్ఱఁగాఁ గాల్పించి యా సింహముమీఁదఁ బెట్టెను. అది మైనపుమృగ మగుటచేఁ గరిగి బైటకు బ్రవహించెను. నందు లిట్టి యుపాయశాలియగు శత్రువు బ్రతికియుండుటకు విచారించి యితనికే యుద్యోగమిచ్చిన నెట్టియాపద గావించువాఁడో యని వెఱచి బ్రాహ్మణభోజనములపైమాత్ర మధికార మిచ్చిరి.

ఇతనిమంచితనమును విని చాణక్యుఁ డను బ్రాహ్మణుఁ డితనిని జూడ వచ్చుచుండెను. అతఁడు వచ్చుచుండఁగ గాలిలో దర్భగ్రుచ్చుకొనెను. దాని నతఁడు కాల్చి నీరులోఁగలిపి దాహము త్రాగెను. చాణక్యుని సహాయముండిన నందులను బరిమార్చ వచ్చునని చంద్రగుప్తుఁ డూహించి వానితోఁ జెలిమిచేసెను. దీనికిఁ దగినట్టుగనే నందులును జాణక్యుని బరిభవించిరి. అతఁడు చంద్రగుప్తునికడకు వచ్చి నందులను బరిమార్చి నీకు రాజ్యమిప్పించెదనని శపథముచేసి తుదకట్లు కావించెను. చంద్రగుప్తుఁడే పాటలీపుత్త్రమునకు రాజయ్యెను. ఇతని పాలనమునఁ బ్రజలు సౌఖ్యముగనే యుండిరి. చంద్రగుప్తుని పుత్త్రుఁడు వారిసారుఁడు. బౌద్ధమతమును వ్యాపింపజేసిన అశోకుఁడు ఇతనిమనుమఁడే. ము. రా.

వంద్రగుప్తుఁడు:- హైహయుఁడను రాజుయొక్క మంత్రి. ఇతఁడు రాజుతోఁగూడ వేఁటకును, జమదగ్న్యాశ్రమమునకును బోయి యా మునియొక్క హోమధేనువు మహాద్భుతమగు నగరమును నిర్మించుటఁ జూచెను. అతని కెట్టులైనను ఆధేనువును సంపాదింప బుద్ధిపుట్టి, యే యుపాయముచేతనైనను దానిని గ్రహింపవలెనని రాజునకు బోధచేసెను. పురోహితుఁడు చెప్పినను వినక బ్రాహ్మణధనము గ్రహించుట మంచిదికాదని రాజును సమ్మతింపఁ జేసి కొంత ధనమును, సేనలను దీసికొని జమదగ్నికడ కేగి నీ వీ ధనము పుచ్చుకొని ధేనువును మా రాజున కిమ్మని యితఁ డడిగెను. హోమధేనువు గాన నివ్వఁజాలనని ముని చెప్పఁగ నీ వీయకున్న మారాజునకుఁ గోపమువచ్చును. బలాత్కారమున ధేనువునుబుచ్చుకొందుమని యితఁడనియె. దానంబునఁగాకఁ బరవిధమున బ్రాహ్మణధనమును గొనువారికి నాయుఃక్షీణంబగునని ముని ప్రత్యుత్తర మిచ్చెను. ఆ మాటలకుఁ జంద్రగుప్తునకుఁ గోపమువచ్చి సేనలతో జమదగ్నిపైఁ బడి మునిని మోది చంపెను. పిమ్మట హోమధేనువును బట్టుకొనఁబోవ నది విజృంభించి సేనలను జిందఱవందఱ చేసెను. ఇతఁడు దాని దూడమాత్రము పట్టుకొని కొనిపోయి రాజున కిచ్చి యచ్చటివృత్తాంతము తెల్పెను. బ్రహ్మ

చంద్రగుప్తుఁడు:- శ్రీశైలముకడ నుండిన యొక రాజుఁ తనకుమారితరూపమును జూచి యామెనే మోహించెను. శ్రీ. మ.

చంద్రగుప్తుఁడు:- శృంగారశేఖరుని నగరమున నుండిన బ్రాహ్మణుఁడు. రాజకుమారిత యైన రాగమంజరియును, దండనాయకుని కూఁతురగు మదనరేఖయును నీతనిని వలచిరి. రాజానుమతిచే నితఁడు పురోహితునిపుత్త్రిక యగు శీలవతిని, రాజకుమారితను, భాండాగారాధీశ్వరుఁడైన ధనగుప్తుని కుమారితను మదనరేఖను వరుసగ వివాహమయ్యెను. వారియం దితనికి వరరుచి, విక్రమార్కుఁడు, భట్టు, భర్తృహరి జన్మించిరి. విక్ర. చ.

చంద్రభాగ:- ఒక నది. ఇది పుట్టిన పర్వతములపై బ్రహ్మ చంద్రుని విభజించెను. (చూడుము చంద్రుడు.)

చంద్రమతి:- హరిశ్చంద్రమహారాజుభార్య. సత్యమునకుఁ గట్టుపడి రాజ్యమునంతయు విశ్వామిత్త్రునకు ధారపోసి కాననములకేఁగిన భర్తతో నీమెయును లోహితాస్యుఁడను పుత్త్రుని దీసికొని వెళ్ళెను. విశ్వామిత్త్రున కివ్వవలసిన డబ్బును బుచ్చుకొనుటకై యతనిశిష్యుఁడగు నక్షత్రకుఁడు వీరితో వచ్చి మార్గమందు వీరి నిడుములఁ బెట్టుచుండెను. చంద్రమతి తనపుత్త్రుని నడిపించుచు నీబ్రాహ్మణున కుపచారములు చేయుచుండెడిది. కాననములో వీరిమార్గమున గడ్డుగ మంటలు పుట్టఁగ నీమె యీశ్వరునిఁ బ్రార్థించెను. ఈమె పతివ్రతగావుననే యగ్ని చల్లారి మార్గమేర్పడెను. విశ్వామిత్త్రుని ఋణము తీర్చుటకై

భర్తకు వేరుమార్గము లేకుండుటచేఁ దాను కాలకౌశికుఁడను బ్రాహ్మణున కమ్మఁబడియె.

ఈమెపుత్రుఁడును నీమెతోఁగూడ నుండెను. మహారాజుపత్నియైన యీమెను గౌశికుఁడును, వాని భార్యయును దూషించుచుఁ బుత్త్రునైన నెత్తుకొననీయక దాసిచేయు పనుల నీమెచేఁ జేయించుచుండిరి. ఈమెపుత్త్రుఁడు వనఫలములు దేర వనమునకేగి సర్పదష్టుఁడై మరణించెను. కౌశికునింటఁ బనులన్నియును జక్కఁబెట్టి నిశియందుఁ బుత్త్రుని వెదకుకొనుచు మృతుఁడై యున్న పుత్త్రునిఁజూచి విలపించుచు దెల్లవాఱు నప్పటికి యజమానునిపనులు చేయవలయును గాన రాత్రియందే వానిని శ్మశానవాటికకుఁ గొనిపోయెను. అచ్చట హరిశ్చంద్రుఁడే శ్మశానవాటికఁగాచు వీరబాహున కమ్మఁబడియుండెను. వానిని జంద్రమతి గుర్తింపలేదయ్యె. శ్మశానశుల్కమిచ్చినఁగాని పుత్త్రుని దహింపనీయనని హరిశ్చంద్రుఁడనుటచే ధనమును గొనివచ్చుట కీమె నగరమున కేగుచుండెను.

ఆ రాత్రియే రాజపుత్త్రునినగ లపహరించిన చోరులు రాజభీతిచే నగ లీమె యొడియందు వేసి పారిపోయిరి. రాజభటు లీమెనుబట్టుకొని యీమెయే నగ లపహరించెనని రాజునొద్దకుఁ గొనిపోయిరి. రా జీమెశిరమును ఖండింపుడని శాసించుటచే నీమెను హరిశ్చంద్రు నొద్దకుఁ దెచ్చిరి. భార్యాభర్త లొకరినొకర రెఱింగి మిక్కిలి దుఃఖించిరి. హరిశ్చంద్రుఁడు తన కార్యము నెరవేర్పఁ గత్తియెత్తి యీమె శిరముపైఁ బెట్టెను. కాని యీమెశిరము ఖండింపబడదయ్యె. విశ్వామిత్రుఁడును, బ్రహ్మాది దేవతలును వీరికిఁ బ్రత్యక్షమై వీరికివరము లిచ్చి పుత్త్రుని బ్రతికించి హరిశ్చంద్రునకు మరల రాజ్యము నిచ్చిరి. మార్క.

చంద్రరేఖ:- ఒక అప్సరస.

చంద్రవతి:- చంద్రగుప్తుఁడను నొకరాజుకూతురు తన రూపమును జూచి తనతండ్రి మోహించెనని విని శ్రీశైలముమీఁదికేగి శివునిగూర్చి గానముచేసెను. అతఁడు ప్రత్యక్షము కాఁగా మల్లికాదామ మతనికిచ్చి శివునితో నైక్యమును గోరెను. ఆ దండను బుచ్చుకొని శివుఁడర్జునత పొందెను; కావున మల్లికార్జునుఁడయ్యె. అతనితో నీమె యైక్యత నొందెను. భో. వ

చంద్రసేనుఁడు:- ఉజ్జయినీపురమేలిన యొకరాజు. ఈరాజునకు మణిభట్టుఁ డను యోగి చింతామణి నిచ్చెను. దాని ప్రభావమున నితని వస్తువులు బంగారుమయ మగుచుండెను. అదిచూచి శత్రురాజు లేకీభవించి దండెత్తివచ్చిరి. ఇతఁడు శివారాధన ప్రారంభించెను. వీనిని జూచి యొక గోపబాలకుఁడు కూడ రాతిలింగమును బూజించుట ప్రారంభించి తన్మయుఁడయ్యెను. వానితల్లి భోజనమునకు రమ్మన్నను రాలేదు. ఆమె ఆ లింగమును తన్నివైచెను. బాలకుఁడు మిక్కిలివిచారించి తదేకధ్యానముతో ఉండెను. అచ్చోట బంగారు ఆలయము వెలిసెను. ఆయద్భుతమును జూచుటకు దండెత్తివచ్చిన శత్రురాజులు విరోధము మాని స్నేహము చేసికొని గోపకుమారుని దర్శించి వెళ్ళిరి. ఆ గోపకుని 8 వ తరమున నందుఁడను వాఁడు పుట్టుననియును, వానియింట శ్రీమన్నారాయణుఁడు అవతరించి పెరుగుచుండుననియును హనుమంతుఁడు వారికిఁ జెప్పెను. బ్రహ్మ.

చంద్రహంతుఁడు:- క్రూరయనుదాని పుత్త్రుఁడు. భార.

చంద్రహాసుఁడు:- కేరళదేశాధీశ్వరుని పుత్త్రుఁడు. ఇతని పసిదనమందే వీని తండ్రి శత్రువులచే సంహరింపఁబడియె. ఇతని తల్లియును భర్తమరణించుటచే నగ్నిలోఁబడి ప్రాణములను విడచెను. చంద్రహాసుఁ డనాథుఁడై కుంతలదేశమునకు వచ్చెను. రాజభవన సమీపమునుండి యీ బాలుఁడు పోవుచుండఁగాఁ గొందఱు బ్రాహ్మణులు చూచి రాజచిహ్నములుఁ గలవాఁ డీబాలు డెవఁడని ప్రశ్నింపఁజొచ్చిరి. కుంతలదేశపు రాజుయొక్క మంత్రియైన దుష్టబుద్ధియనువాఁ డీమాటలు విని యీదేశమునకుఁ దనకుమారునే రాజుగఁ జేయఁదలఁచుకొనియుండెనుగాన నీ బాలుఁడే రాజు కాఁగలఁడేమోయని భయపడి, కింకరుల బిలిచి ఈబాలుని సంహరింపుడనియానతిచ్చెను. భటులకువానిని జంపుటకుఁజేతులఁరాక బాలునొకయరణ్యమునకుఁ గొనిపోయి వానిపాదమున నారు వ్రేళ్ళుండుటజూచి చిటికెనవ్రేఁ

తెగఁగొట్టి వాని నచ్చటనే విడచివచ్చి బాలుని జంపితిమని మంత్రికిఁ దెల్పిరి.

కుళిందకుఁడను శంబరరాజు వేఁటకువచ్చి యేడ్చుచుండినయాబాలునిఁ జూచివానినెత్తుకొని తనకు బుత్రులు లేకపోవుటచే వాని నింటికిఁ దీసికొనిపోయిచంద్రహాసుఁడని పేరుపెట్టిపెంచుచుండెను, చంద్రహాసుఁడు పెరిగి విద్యాబుద్ధులు నేర్చి రాజకార్యములందుఁ దండ్రికి సహాయపడుచుఁ బరరాజులను గెల్చుచుఁ గప్పములు తెచ్చుచుండెను. దుష్టబుద్ధియొకనాఁడుకుళిందుని భవనమునకేగి యచ్చటఁ జంద్రహాసునిఁ జూచి పూర్వమువీనినిజూచిన జ్ఞాపకముండుటచే నాతఁ డెవ్వఁడని యడిగెను. అడవిలో నేడ్చుచుండిన వానినిదెచ్చి పెంచితినని కుళిందకుఁడుచెప్పెను. అప్పుడు దుష్టబుద్ధి వెనుకటి వృత్తాంతము స్మరణకుఁదెచ్చుకొనివాఁడింకను బ్రతికియున్నాఁడని విచారించి వానిని జంపుటకై యొకపన్నాగము పన్నెను. వానికి విషము నిమ్ము అని తన కుమారుఁడు మదనుని పేర నుత్తరమువ్రాసి యాయుత్తరము చంద్రహాసునకిచ్చి మదనున కిమ్మని చెప్పి పంపెను. చంద్రహాసుఁ డాయుత్తరము పుచ్చుకొని కుంతలదేశమునకేగి యలసియుండుటచే నచ్చటియుద్యానవనమున విశ్రమించియుండెను. విహారమునకువచ్చిన రాజపుత్రికయగు చంపకమాలయును, దుష్టబుద్ధికుమారిత విషయయును వీనింజూచియించుక వికలచిత్తులైరి. విషయవానిని డాసి నిద్రపోవుచుండుటచే నాతనికడనుండిన యుత్తరము నవలీలగఁదీసి దానిని జదివెను. అందు విషము నిమ్మని తండ్రి వ్రాసియుండుటఁజూచి యట్టిసౌందర్యవంతుఁడట్లు మృతినొందవలయునా? యని విచారించి వానిని వలచియుండుటచే నుత్తరమందలి "ము" "య"గ దిద్ది యుత్తరమును యథాస్థానమునముంచి వెడలిపోయెను. చంద్రహాసుఁడులేచియుత్తరము మదనునకుఁగొనిపోయి యిచ్చెను. అందువిషయనిమ్ము అనియుండుటను జూచిమదనుఁడుతనచెలియాలువిషయనిచ్చిచంద్రహాసునకువివాహముచేసెను.మరునాఁడుదుష్టబుద్ధి వచ్చితనకుమార్తెనఁజంద్రహాసునకిచ్చివివాహము చేయుటవినివిచారించియింకను వానిని జంపనిశ్చయించి "మా యాచారము ప్రకారము వివాహముకాఁగానే నీవొక్కరుఁడవు చండికాలయమున కేగి యచ్చట దేవికి నమస్కరింపవలసి యున్న"దని చెప్పెను. చంద్రహాసుఁడు సరే యనియెను. ఈలోపున దుష్టబుద్ధి తలవరులను బిలిపించి చండికాలయమున కీదినమున నొంటరిగ నెవఁడువచ్చునో వానిని సంహరింపుడని యానతిచ్చెను. చంద్రహాసుఁడు గుడికి వెళ్ళుటకు బయలుదేఱెను. కాని అప్పుడే రాజు వీనికై కబురుపంపఁగ మదనుఁడువచ్చి, నేను గుడికి వెళ్ళెదను. నీవు రాజసభకుఁ బొమ్మని చెప్పెను. మదనుఁడు గుడికి వెళ్ళెను. ఇతఁ డొక్కఁడు వెళ్ళఁగనే తలవరులు వీనిని సంహరించిరి. రాజు చంద్రహాసునకుఁ దన కుమార్తెను నిచ్చి వివాహము చేసెను. తన కుమారుఁడు సంహరింపఁ బడుటయును, చంద్రహాసునకు రాజు తన కూఁతునిచ్చి వివాహముచేయుటయును జూచి దుష్టబుద్ధి గుండెబ్రద్దలై చనిపోయెను. మదనుఁడు సంహరింపఁబడుటయు, దుష్టబుద్ధి చనిపోవుటయును జంద్రహాసునకుఁదెలిసెను. ఇతను గుడికివెళ్ళి చండికను బ్రార్థించి తనకుఁ దనతల నాహుతిగ నీయఁదలఁచెను. అప్పుడు చండిక ప్రత్యక్షమై దుష్టబుద్ధిని, మదనుని బ్రతికించెను. కుంతలదేశమునుగూడఁ జంద్రహాసునకే పట్టము గట్టిరి. ఇతనికి మకరధ్వజుఁడు, పద్మాక్షుఁడు అను పుత్రులు కలిగిరి. జై. భా.

చంద్రాంగదుఁడు:-నలునికుమారుఁడైన యింద్రసేనుని కుమారుఁడు. చిత్రవర్మ కుమార్తెయగు సీమంతినిని వివాహమయ్యెను. ఇతఁడును, పరివారమును అత్తవారింటనుండి నావలోఁ బోవుచుండఁగ నది నదిలో మునిగిపోయెను. చంద్రాంగదుని నాగకన్యలు చూచి పాతాళలోకమునకుఁ గొనిపోయిరి. అట నితఁడు మూఁడేండ్లుండెను. ఇట నితఁడు మునిగి కానరామిచే మరణించెననుకొనిరి. సీమంతిని అలంకారములను దీసి భర్తనుబాసిన సతివలెనుండుచు శివపూజ చేయుచుండెను. నదికి స్నానమునకు వచ్చెను. నాగలోకముననున్న చంద్రాంగదుఁడు తనవారు తనకై విలపించుచుందురని తక్షకునితోఁ జెప్పి వారిసహాయమున మరల నదియొద్దకు వచ్చి భార్యను జూచెను. చివర కొకరి నొకరు గుర్తించిరి. చంద్రాంగదుఁడు మరలఁ దండ్రి గృహమునకేగెను. సీమంతినీ చంద్రాంగద పరిణయ

మును ముక్కలఁ గావించిరి. చంద్రసేనుని పిమ్మట నీమె రాజయ్యెను.

చంద్రాంగదుఁడు:-చిత్రవర్మయల్లుఁడు. సీమంతిని భర్త. (చూడు సీమంతిని)

చంద్రాపీడుఁడు:- జనమేజయునకుఁ గార్యయందుఁ బుట్టిన కుమారుఁడు. ఇతని పుత్రుఁడు. సత్యకర్ణుఁడు. భవిష్యపర్వ.

చంద్రుఁడు:-ఇక్ష్వాకువంశములోని విశ్వగంధుని కుమారుఁడు ఇతని పుత్రుఁడు యవనాశ్వుఁడు. భాగ.

చంద్రుఁడు:-అత్రి మన్మథప్రేరితుఁడై భార్యను గూడియుండగఁ రేతస్సుపతితమయ్యెను. దానిని వాయుదేవుఁడు మూఁడుభాగములు గావించెను. అందొక భాగము అత్రికంటియందుఁ జొచ్చెను. అందుండి చంద్రుఁడు పుట్టెను. ఇతఁడు బ్రహ్మ యంశను జన్మించెను. మార్క.

అత్రిని సృష్టిచేయుమని బ్రహ్మ యాజ్ఞాపించెను. అత్రి తపస్సుచేయఁగ నతని నేత్రము నుండి తేజస్సు వెడలెను. దానిని దశదిశలు ధరించినవి. కాని అవి ధరింపఁజాలక వెడలఁ గ్రక్కినవి. సముద్రమునఁ బడవేసెను. బ్రహ్మ దానిని జేర్చి పురుషరూపమిచ్చెను. దేవతలపుడు సోమమంత్రముచేఁ బ్రార్థించిరి. దానఁ జంద్రుఁ డేర్పడెను. మత్స్య.

దేవతల కాహారముగ నుండుటకై చంద్రుఁడు సృజింపఁబడెను.

చంద్రుఁడు విష్ణుమూర్తియొక్క యెడమకన్ను.

చంద్రుఁడు క్షీరసాగర మథనమైన పిదప నందుండి పుట్టెను. ఇతఁడును దేవతలతోఁబాటు అమృతమును గ్రోలుటకుఁ గూర్చుండి తమ పంక్తిలోనికి రాహువు దేవతారూపమున వచ్చి యమృతపానము చేయుట చూచి విష్ణుమూర్తికిఁ జెప్పెను. విష్ణుమూర్తి రాహువును జక్రముచే ఖండించెనుగాని అమృతపానము చేసి యుండుటచేఁ గంఠము తెగిపడినను నతఁడు నాశనము నొందఁడయ్యె. అప్పటినుండియు రాహువు చంద్రునిపైఁ బగపూని యితని నప్పుడప్పుడు మ్రింగుచుండును. భార.

చంద్రుఁడుబృహస్పతియొద్దఁ జదువుకొనెడు వాఁడు. కావునఁ దఱచుగ గురునిగృహమందే యుండుచుండెను. బృహస్పతిభార్య తార చంద్రుని మోహించి భర్త యింటలేని సమయమున వీనిని గూడెను. తార గర్భవతి యయ్యె. ఆమెను జంద్రుఁడు గొనిపోయి తనయొద్ద నుంచుకొని బృహస్పతి యివ్వమన్న నివ్వకుండెను. దేవతలతోడను, సురగురునితోడను విరోధంబుఁజేసి రాక్షసులు చంద్రునిఁగూడి బృహస్పతినెదిరిరి. బృహస్పతిబ్రహ్మాదులతోఁ జెప్పుకొనెను. ఇంతలోఁ దారకుఁ బుత్రుఁడు కలిగెను. వాఁడు నా పుత్రుఁడు నా పుత్రుఁడని గురుచంద్రులు తగవులాడిరి. వారితగవు తీర్పలేక బ్రహ్మ యాకుమారుఁ డెవరి పుత్రుఁడని తారనే యడిగెను. ఆమె చంద్రుని పుత్రుఁడని చెప్పెను. బ్రహ్మ యా కుమారునిజంద్రునకును, తారను బృహస్పతికిని నిప్పించెను. చంద్రుని యీ కుమారుఁడే బుధుఁడు. భాగ.

చంద్రుఁడు దక్షుని కుమారికలగు తారలను నిరువదియేడ్వురను వివాహమయ్యెను. ఇతఁడు వారిలో రోహిణియం దెక్కుడాసక్తితోనుండి తక్కినవారి నాదరింపకుండుటచే వారు తమ దుఃఖకారణము తండ్రితోఁ జెప్పుకొనిరి. తనకుమారిక లిట్లవమానింపఁబడిరని వినఁగనే దక్షునికిఁ బట్టరాని కోపమువచ్చి చంద్రునికడకు వచ్చి నాకుమార్తెలను నిరాకరించి యార్తినొందించితివి కావున నీవు క్షయుఁడవుకమ్మని చంద్రుని శపించెను. చంద్రుఁ డీశాపమునకుభయపడి శివునికడకేగి ప్రార్థింపఁగ శివుఁడు వానినిఁ దన నొసటఁ బెట్టుకొనియెను. దానివలనఁదారలకుఁజంద్రుఁడు మఱింత దూరస్థుఁ డయ్యెను. శివునికడకుఁ దక్షుఁడువచ్చి చంద్రునివదలుమనియె. శరణాగతుఁడై వచ్చినవానిని విడువనని శివుఁడు తిరస్కరించెను. శివునిఁగూడి దక్షుఁడు శపింపఁబోయె. ఆయుపద్రవమురాకుండ వచ్చుటకు విష్ణుమూర్తి వచ్చి వారిద్దఱకును సంధిచేసి చంద్రుని రెండు భాగములుగఁజేసెను. బ్రహ్మయేచంద్రుని హిమాలయపర్వతములందొకశిఖరముపైన రెండుఖండములుగ విభజించెను. ఒక భాగము క్షయము లేకుండునట్లు ప్రసాదించి దానిని శివునకిచ్చి దక్షునిశాప మన్వర్థము కాకుండుటకై రెండవ

భాగము వృద్ధిక్షయములు కలదానినిగఁ జేసి దానిని దారల కిచ్చెను.

దక్షుఁడు శపించుటచేఁ జంద్రునకుఁ గోపము వచ్చి ఇంతమాత్రమునకై నన్ను శపించితివి. కావున నీవు నశింపుమని దక్షునకుఁ బ్రతిశాపమిచ్చెను. పదపడి చంద్రుఁడు మాయమయ్యెను. అతఁడు లేకుండుటచేఁ బంటలు, పైరులు, వర్షములు లేకుండెను. ఓషధులెవ్వియును బెరుగుట లేదు. యజ్ఞములు తగ్గిపోయెను. దేవతలందఱును బ్రహ్మయొద్దకుఁబోయి చంద్రుఁడు మఱల వచ్చునట్లు ప్రసాదింపుమని వేఁడిరి. చంద్రుఁడిపు డోషధులయం దున్నవాఁడు. కావున నోషధులను సముద్రమున వైచి తఱచినచోఁ చంద్రుఁడు మఱల వచ్చునని చెప్పెను. దేవతలును, రాక్షసులును గలసి క్షీరసాగరమును మథించిరి. అందుండి చంద్రుఁడు మరల వచ్చెను. వరా.

దక్షుని యజ్ఞము చూచుటకుఁ జంద్రుఁడు కూడ వెళ్లెను ఆ యజ్ఞము ధ్వంసము చేయుటకై శివుఁడును భూతములును వచ్చి చిందులు త్రొక్కుచుండిరి. ఆ రభసములోఁ జంద్రుఁడు శివుని కాలిక్రిందఁబడెను. చంద్రుఁడు బాధచే శివునిని ప్రార్థించెను. వీనిపై జాలిగొని శివుఁడు వీనిని దన శిరస్సునం దుంచుకొనెను. మార్క.

ప్రచేతసులు వృక్షములను దహింపఁబోవుచుండఁగాఁ జంద్రుఁడు వచ్చి వారికి వృక్షసముద్భవయగు కన్యను మారిష అనుదాని నిచ్చి వృక్షములను గాల్పకుఁడని వేఁడుకొనియె. భార.

విఘ్నేశ్వరుఁడు కడుపునిండ భుజించి శివునకు నమస్కరించుటకై ప్రదోష సమయమందు వెళ్ళుచుండెను. భోజనభారముచే నతఁడు నడువలేకనడువలేక నడచుట చూచి చంద్రుఁడు నవ్వెను. ఇతఁడు నవ్వఁగనే విఘ్నేశ్వరుని యుదరము చీలి పదార్థములు బైటఁబడెను. సర్పముచే వానియుదరము కుట్టిరి. చంద్రునివలన నిది కలిగెఁగదా యని పార్వతికిఁ గోపమువచ్చి చంద్రునిఁ జూడరాదనియును, జూచినవారికి నిష్కారణముగ నపవాదులు వచ్చుననియును శపించి బ్రహ్మకది తెలియఁజేసెను. బ్రహ్మ దేవతలకుఁ జెప్పెను. చంద్రునిఁ జూడకుండుట కష్టమనియును, గావున నాశాపము మాన్పింపుమనియును దేవతలు కోరిరి. విఘ్నేశ్వరుని జన్మదినమైన భాద్రపద శుద్ధ చవితినాఁడే కథ వినకుండఁ జంద్రునిఁ జూడరాదని యామె యనియె. వి. చ.

చంపకమాల:- కుంతలాధీశ్వరుని కుమారిత. చంద్రహాసుని భార్య. జై. భా.

చంపకుఁడు:- చపుఁడు (చూడుము.)

చంపానగరము:- చంపుఁడు నిర్మించిన నగరము. భాగ.

చంపుఁడు:- హితుని కుమారుఁడు. ఇతఁడు తన పేరఁ జంపానగరమును నిర్మించె. ఇతని పుత్త్రుఁడు సుదేవుఁడు.

చంపుఁడు:- పృథులాక్షుని కుమారుఁడు. ఇతని పేరిటనే చంపానగరము కట్టఁబడియెను.

చక్రము:- విష్ణు నాయుధము. దీనిని బంపినచో నెంతబలవంతుఁడైనవానినైనను దఱిమి సంహరించి మఱలివచ్చును. సూర్యుని తేజస్సున కాతని భార్య సంజ్ఞ సహింపలేకపోవుటచే విశ్వకర్మ సూర్యుని సానఁబట్టెను. ఆ రాలిన తేజస్సును ప్రోవుచేసి చక్రముగఁజేసెను. చక్రము దధీచి యస్థులతోఁ జేయఁబడెను. బ్రహ్మ.

చక్షువు:- సర్వతేజస్సుయొక్క కుమారుఁడు. ఇతని తల్లి ఆకూతి. ఇతని భార్య నడ్వల. త్రితుఁడు, ద్యుమ్నుఁడు మొదలగువారితని పుత్త్రులు.

చక్షుషువు:- సుచ్ఛాయాశిష్టుల కుమారుఁడు. ఇతని భార్య పుష్కరిణి. వీరి కుమారుఁడు చాక్షుషు మనువయ్యెను. విష్ణు.

చక్షుషువు:- ఇతని భార్య బృహతి. రిపుఁడను వాని వలన నీమెయందుఁ జాక్షుషువు జన్మించెను. బ్రహ్మ.

చతురంగుఁడు:- శాంతా ఋశ్యశృంగుల కుమారుఁడు. ఇతని కుమారుఁడు పృథులాక్షుఁడు. పద్మ.

చతుర్వ్యూహములు:- పరమేశ్వరుఁ డొకానొకప్పుడు చతుర్విధరూపములతో నుండును. వాసుదేవ ప్రద్యుమ్నానిరుద్ధ సంకర్షణులు చతుర్వ్యూహ

లందురు. మనో బుద్ధి చిత్తాఽహంకారములే బుట్టి నామములఁ బరగును.

చపుఁడు:- ఒక విద్యాధరుఁడు. మదాలస భర్త. దుర్వాసు నాశ్రమసమీపమున నున్న బాలునిఁ దీసి యెత్తుకొని (హాయహాయని) అతఁ డెవ్వరి కుమారుఁడో తెలియక యింద్రునికడకుఁ దీసికొని పోయెను. ఆ బాలుఁడు విష్ణుమూర్తి కుమారుఁ డనియును, వానికై యయాతినూనుఁడు వచ్చుననియును, గాన వానిని గాళిందీతీరమున విడువు మనియును నింద్రుఁడు చెప్పెను. ఇతఁడు వాని నచ్చట విడిచెను. దే. భా.

చర్మణ్వతి.- దశార్ణ దేశమందలియొక నది. రంతిదేవు యాగమందు వేల్వఁబడిన గోవులరక్తము నదియై ప్రవహించెను. అదియే చర్మణ్వతి. ఆ పశువుల చర్మములే ఆ నదికిఁ గట్టు లయ్యెను. భార.

చలుఁడు:- బలునికుమారుఁడు అర్కసంభవుఁడగు వజ్రనాభుఁ డితని పుత్త్రుఁడు. భాగ.

చా

చాక్షుషి:- ఒక విద్య. దీనివలనఁ ద్రిలోకములు చూడవచ్చును. ఈ విద్యచేతనే గంధర్వులు మానవులకు విశేషులై వేల్పులచేత శాసింపఁబడరు. దానిని మనువువలన సోముఁడు, అతని వలన గంధర్వపతియగువిశ్వావసుఁడు, అతనివలన అంగారపర్ణుఁడు నేర్చిరి. అంగారపర్ణుఁడు అర్జునున కిచ్చెను. దానికి షణ్మాసము వ్రతము చేయవలయును; కాపురుషులకు లభింపదు. భార.

చాక్షుషుఁడు:- ఖమిత్త్రుని కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు వివింశతి. భార.

చాక్షుషువు:- ఒకమనువు. (చక్షుషుని భార్యయగు బృహతియందు రిపునివలనఁబుట్టిన కుమారుఁడు) తొలిజన్మంబున బ్రహ్మచక్షుస్సువలనఁ బుట్టి చాక్షుషువనఁ బరగెను. ఇతఁడు జన్మాంతరమున మిత్త్రుఁడు గిరిభద్ర యను మనుష్యదంపతులకు జన్మించె. ఈ బాలుఁడు పుట్టిన యాఱవనాఁడే తల్లి ముద్దాడుచుండఁగ బాలుఁడు పక్కున నవ్వెను. కన్ను తెఱువని పాపవు, ఇట్లేల నవ్వుచుంటివి? అని తల్లి యాశ్చర్యము నొందగ; జాతహారిణి యను బిడాలము నన్ను మ్రింగ వేచి యున్నది. నేను నీకేమియు నపకారమును జేసిన వాఁడను గాను. నీ కింత హర్ష మేల? యని నవ్వుచుంటినని యతఁ డనియె. గిరిభద్రకుఁ గోపము వచ్చి నేను ముద్దాడుట నీకిష్టము లేదేని మానుదు నని పురిటిగదినుండి వెడలిపోయెను. జాతహారిణి యను పిల్లి వాని నెత్తుకొనిపోయి విక్రాంతుఁ డను రాజుభార్య ప్రసవింపఁగ నామె ప్రక్క నా శిశువును బెట్టి, విక్రాంతుని శిశువును గొండొక చోటునకుఁ దీసికొనిపోయెను. విక్రాంతుఁడు వీనినే తన కుమారునిగఁ దలంచి పెంచి, ఆనందుఁడని పేరు పెట్టి యుపనయనము చేసెను. వానిని గురుఁడు విక్రాంతుని భార్యకడకుఁ గొని పోయి ముందుగ నీతల్లికి నమస్కరింపు మనియె. ఈమె నా తల్లి కాదు. విశాలపురమున బోధుఁడను బ్రాహ్మణు నింటఁ బెరుగుచుండిన చైత్త్రుఁడను బాలుఁ డీమె కుమారుఁడు. వానిని దెచ్చుకొనుఁడని, తన జన్మప్రకారంబు వారి కెఱింగించి తా నరణ్యమునకుఁబోయి తపస్సు చేసికొనుచుండెను. బ్రహ్మ ప్రత్యక్షమై నీ కేమి కావలయును? అని యడుగఁగ నితఁడు ముక్తిని గోరెను. నీవు మనువు కావలసి యున్నది; నీ తప మిఁక మానుమని తపస్సు నతనిచేత మానిపించెను. ప్రజాపతి వచ్చి యితనికిఁ జాక్షుషువు అని పేరు పెట్టెను. ఇతఁడు మను వయ్యెను. ఇతని భార్య నడ్వల, శతద్యుమ్నుఁడు, ఊరుఁడు, పూరుఁడు, తపస్వి శుచి, అగ్నిష్టోముఁడు, అతిరాత్రుఁడు, ప్రద్యుమ్నుఁడు అభిమన్యుఁడు ఇతని కుమారులు. చాక్షుషునిమన్వంతరమున మనోజవుఁడను వాఁ డింద్రుఁడయ్యె. భాగ.

(మంత్రద్యుముఁడు) సుమేధుఁడు, విరజుఁడు, హవిష్మంతుఁడు, ఉన్నతుఁడు, మధువు, సహిష్ణువు, విమలుఁడు సప్తర్షులైరి.

చాక్షుషుఁడు:- ఈ మనువుకాలమున విష్ణుమూర్తి వైరాజునకును, సంభూతికిని కుమారుడుగఁబుట్టి అజితుఁడన నొప్పెను. ఈ మనుకాలముననే క్షీరసాగరమథనము జరిగెను. భాగ.

చాక్షుషుఁడు:- ఈ మనువు విశ్వకర్మకు ఆకృతి యను భార్యయందు జన్మించెను. భాగ.

చాణక్యుఁడు:- ఒక బ్రాహ్మణుఁడు. మిక్కిలి తంత్రజ్ఞుఁడు. పాటలీపుత్త్రమున నందులు బ్రాహ్మణులకు భోజనము పెట్టుచున్నారని విని వచ్చుచుండఁగ నతని కాలిలో దర్భపుల్ల గ్రుచ్చుకొనెను. దానిని దీసి ముక్కలుచేసి కాల్చి నీటిలోఁగలిపి దాహము పుచ్చుకొనెను. ఇదంతయును జూచుచుండిన చంద్రగుప్తుఁడు ఇట్లేల చేసితి? వని యడిగెను. ఆ పుల్ల నాకుఁ గ్రుచ్చుకొనియె. దానిని విఱిచినను నాకుఁ గోపము పోలేదు. కనుక నట్లుచేసితినని యా బ్రాహ్మణుఁడు చెప్పెను. ఒకవేళ మనుజులు మీ కపకారము చేయుచో నేమిచేయుదు? రని చంద్రగుప్తుఁడు ప్రశ్నించెను. వారిని నట్లే గావించెదనని చాణక్యుఁడు చెప్పెను. చంద్రగుప్తుఁ డాతనివలనఁ దనకు నందులపైఁగల పగఁ దీర్చుకొనవచ్చునని తలఁచి మీరెవ్వరు? ఇందుల కేలవచ్చితి? రని యడిగెను. నందులుపెట్టు బ్రాహ్మణభోజనములపై నధికారిగ శూద్రుఁ డున్నాఁడనియు, నతఁడుమంచివాఁడనియు విని వానినిఁ జూడఁబోవుచుంటినని చెప్పెను. నేనే యా శూద్రుఁడనని చంద్రగుప్తుఁడు చెప్పికొని ప్రసంగవశమున నందులు తనకుఁ జేసిన యపకారమును జెప్పి చాణక్యుని గౌరవించి భోజనశాలకుఁ బంపెను. అందు తొమ్మిది పీఠములును, వానికెదురుగ నొక్కటియును, ప్రక్కను వేయియు, పీట లుండెను. ఆ యొంటిపీట యుత్తమ బ్రాహ్మణునకని యచ్చటివారు చెప్పిరి. నేనే యుత్తమబ్రాహ్మణుఁడ నని చాణక్యుఁడు దానిపైఁ గూర్చుండెను. రాజులు వచ్చిచూచి యీ కోతి యెవ్వఁ? డని యడిగిరి. అందుపై రాజులును, చాణక్యుఁడును బరుషముగ వాదులాడుకొనిరి. వారాబ్రాహ్మణుని గెంటివేసిరి. చాణక్యునకుఁ గోపమువచ్చి "మిమ్ము నిర్మూలనము చేయువఱకు నాజుట్టు ముడివేయ"నని ప్రతిజ్ఞపట్టి చంద్రగుప్తునియింటికిఁ బోయెను. నందులనెల్లఁ బరిమార్చి నీకు రాజ్యమిచ్చెదనని చంద్రగుప్తునితోఁ జెప్పెను. అదియే చంద్రగుప్తుఁడు కోరినది. చాణక్యుఁడు తన మిత్త్రుని ఇందుశర్మ యనువానికి క్షపణకవేషము వేసి నందులకడకుఁ బంపి వానిపై నందులకు విశ్వాసము గలుగునట్లు మసలుకొనుమనియె. క్షపణకుఁ డట్లు కావించెను. నందు లతనిని విశ్వసించి తను మేలు కోరువాఁడే యనుకొనిరి. అతని యాలోచన కొప్పునఁ జంద్రగుప్తుని నగరము వెడలనడచిరి; రాజభటులకుఁ గొందఱికి వేతనములు మాన్పించిరి. వీరందఱకు నందులపైఁ గోపముండెను. ఇంతలోఁజాణక్యుఁడు మ్లేచ్ఛరాజుతో సఖ్యముచేసి నందులను జయించుట కతిసమయమని యుద్ధమునకు బయలుదేఱుట కొకదినము నిశ్చయించెను. ఈవార్త క్షపణకునకుఁ దెలియఁజేసి యానాఁడు నందులసేనలు యుద్ధమునకు రాకుండఁ జేయుమనియె. క్షపణకుఁడు ప్రతిసేనాధిపతికడకును బోయి యీ యాదివారమునాఁడు కలుగు యుద్ధములో నీకుఁ బ్రాణభయము కలదు. కావున నీవు వెళ్ళకుమని చెప్పెను.

మ్లేచ్ఛరాజును, చాణక్యుఁడును,జంద్రగుప్తుఁడు మొదలగువారును యుద్ధమునకు వచ్చిరి. నందుల సేనలు రావయ్యె. మ్లేచ్ఛరాజు నందులపైఁబడి వారినందఱను బేరులేకుండఁ జంపెను. వారిమంత్రి రాక్షసుఁడు వారినిఁ గాపాడుటకు యత్నించెను. కాని వీలులేక తన భార్యాపుత్త్రుల నొకయింట నుంచి తాను నగరమును విడిచి, చంద్రగుప్తుని నెట్లైనను జంపవలెనని యొకవిషకన్యను జేసెను. చాణక్యుఁడు రాక్షసుఁడు చేయు యత్నములన్నియును జారులవలన నెఱుఁగుచుఁ దా నీవిషకన్యను గైకొని మ్లేచ్ఛరాజును దానం జంపించి వీనిని రాక్షసుఁడు చంపించెనని కింవదంతి పుట్టించెను. రాక్షసుఁడే యక్రమపునింద వాపుకొనుటకై మ్లేచ్ఛరాజపుత్త్రునికడకుఁ బోయి చంద్రగుప్తుఁ జంపించి నీకు రాజ్య మిప్పించెదనని చెప్పెను. రాక్షసుఁడు చంద్రగుప్తుఁ జంపుటకనేకపన్నాగములు పన్నుచుండెను. వానినన్నిఁటిని దొలఁగించుకొని మారువేషములతోఁ దన భృత్యులను బంపి శత్రుసమాచార మెఱుంగుచు నెట్లైనను రాక్షసునిఁ జంద్రగుప్తునకు మంత్రిగఁ జేయనిశ్చయించి చాణక్యుఁడు మెలఁగుచుండెను. అందులకై రాక్షసునిభార్యను గాపాడినవానిని బాధించి రాక్షసుని ముద్ర గైకొని రాక్షసుఁడు

వ్రాసినట్లు ఉత్తరము వ్రాయించి దానిపై నాతని ముద్రవేయించి రాక్షసునకును, నాతఁడు సహాయముగఁ గోరుచుండిన మ్లేచ్ఛునకును విరోధము కల్పించెను; తన భటులను రాక్షసునికడకుఁ బంపి యితనికడ విశ్వాసముతో మెలఁగింపఁజేసి స్వామిద్రోహము చేయించుచుండెను. తుదకు రాక్షసుఁడు మిత్త్రులచే విడువఁబడి యేకాకి యయ్యెను. అతనిని బట్టుకొనుట కుపాయముగ నతని భార్యను గాపాడిన మిత్త్రునిఁ గొఱత వేయఁబోవునట్లు ప్రకటించెను. తన మిత్త్రుని రక్షింపవలెనని రాక్షసుఁడు ఖడ్గము పూని వచ్చెను. అపు డతనిని బట్టుకొని చంద్రగుప్తున కభయ మిచ్చెదేని, యితనిమిత్త్రుని విడుతుమని చెప్పిరి. రాక్షసుఁడు చంద్రగుప్తుని కభయ మిచ్చెను. ఇతనిమిత్త్రుని విడచిరి. రాక్షసునిఁ జంద్రగుప్తుని మంత్రినిగఁ జేసిరి. చాణక్యుఁడు తన కార్యము నెరవేరెను గానఁ దపోవనమునకుఁ బోయెను. ముద్రా.

చాణూరుఁడు:- ముష్టికుఁడును నితఁడును గంసుని కొలువునందు మల్లులు మిక్కిలి బలసంపన్నులు. బలరామకృష్ణులను గంసుఁడు వధింపఁగోరి వంచన చేసియైనను వారిని వధింపుఁడని మల్లులతోఁ జెప్పెను. వీరితో మల్లయుద్ధము చేయుటకై రామకృష్ణులను గంసుఁడు ప్రేరేపించెను. వారు యుద్ధముచేసి చాణూరముష్టికులను జంపిరి. భాగ.

చాతూకర్ణుఁడు:- ఒక ముని. పరాశరుఁడీతనికిఁ బురాణాదు లుపదేశించెను. ఇతఁడు వానిని కృష్ణద్వైపాయనున కెఱింగించెను. బ్రహ్మ.

చాముండి:- త్రికళయొక్క ఈశ్వరశక్తి. ఈమె రురుఁడను దానవుని చర్మమును, ముండమును రెండుగఁజేసెను గాన నామెకు చాముండి అని పేరు వచ్చినది. వ. రా.

చారుగుప్తుఁడు:- కృష్ణునకు రుక్మిణియందుఁ బుట్టిన కుమారుఁడు. భాగ.

చారుచంద్రుఁడు:- కృష్ణునకు రుక్మిణియందుఁ బుట్టిన కుమారుఁడు. భాగ.

చారుదేహుఁడు:- కృష్ణునకు రుక్మిణియందు బుట్టిన కుమారుఁడు. భాగ.

చారుభద్రుఁడు:- (భద్రచారువు) కృష్ణునకు రుక్మిణియందుఁ బుట్టిన కుమారుఁడు. భాగ.

చారుమతి:- రుక్మి కుమారిత. కృతవర్మని కుమారుఁ డీమెను బరిణయ మయ్యెను. భాగ.

చారువు:- కృష్ణునకు రుక్మిణియందుఁ బుట్టిన కుమారుఁడు భాగ.

చారువేష్ణుఁడు:- కృష్ణునకు రుక్మిణియందుఁ బుట్టిన కుమారుఁడు.. భాగ.

చార్వాకుఁడు:- ఒక రాక్షసుఁడు. బ్రహ్మను గూర్చి తపస్సుచేసి దేనివలనను జావు లేకుండునట్లు వరము కోరెను. బ్రహ్మ సరే యనియెను గాని భూసురులకుఁ గోపము తెప్పింతువేని దానివలనఁ జావగునని చెప్పెను. వీఁడు దుర్యోధనునకు స్నేహితుఁ డయ్యెను.

యుద్ధము చేసినపిదప రాజ్యముచేయ నొల్లనని యుండిన ధర్మరాజునకు మునులు కృష్ణుఁడు ఎన్నియో బోధలు చేయఁగ నాతఁడు వల్లెయని పురమునకు వచ్చెను. విప్రజనులాదిగ వీని కెదు రేగిరి. చార్వాకుఁడు దుర్యోధనునిచేఁ బంపఁబడి బ్రాహ్మణసన్యాసి వేషమున బ్రాహ్మణుల వద్ద నిలుచుండునట్లు బ్రాహ్మణజనులిట్లు వచింపుచున్నను; బంధువులను, మిత్త్రులను, గురునిఁ జంపిన యితఁ డేపాటిరాజు? వీనిని గొలువ నొల్లము అని అతఁడట్లు వచింప నచ్చటనున్న బ్రాహ్మణులు తెల్లవోయి, మేమెఱుఁగము. అట్లనలేదు. నీవుధర్మము చేసితివని యాశ్వాసించి, వాఁడు రాక్షసుఁడగుట తెలిసికొని దుర్యోధనుని పంపున వచ్చెనని యెఱింగి కోపముతోఁ జూచిరి. వీరి తేజస్సుచే వాఁడు చచ్చెను. భార.

చి

చికితాయనుఁడు:—చైకితానుని తండ్రి.
ఛాన్దో. ఉ.

చిక్షురుఁడు:—మహిషాసురుని సేనలోనివాఁడు. దేవితో యుద్ధముచేసి చచ్చెను.

చిచ్చుకుఁడు:—ఒకపక్షి. రెండుతలలుగలవాఁడు. ఇతఁ డడవిలో నొక్కఁడు చింతాక్రాంతుఁడై యుండఁగా బవమానుఁ డను రాజు చూచి నీవెవ్వరవు? ఇట్లేల చింతించుచుంటి వని యడిగెను. 'నేను పూర్వజన్మమున నరుఁడను; బ్రాహ్మణహత్యలు చేసి ఇట్లయితిని. పాపపరిహారమునకై యిట్లు తపస్సు చేయుచుంటిని. ఇచ్చటనే గదాధర మను తీర్థము కలదు అందు స్నానము చేసినయెడలఁ బాతకము పోవును. అని చిచ్చుకుఁడు చెప్పెను. బ్రహ్మ.

చిత్ర:—కుబేరుని వీర్యమువలనఁబుట్టిన యొకపడుచు. ఈమెను బుధుఁడు గాంధర్వమున వివాహమయ్యెను. ఈమెకుమారుఁడు చైత్రుఁడు. బ్ర. వై.

చిత్ర:—గర్గ్యకుమారుఁడు. ఇతఁడు తనయజ్ఞమునకు హోతగ అరుణిని బిలచెను. అరుణి తనకుమారుఁడైన శ్వేతకేతునిఁ బంపెను. "నీవు నన్నుంచఁ గలిగిన రహస్యమైన ప్రదేశ మేదైనఁ గలదా?" యని చిత్ర శ్వేతకేతుని నడిగెను. అతఁడు చెప్పలేక తన గురువును నడిగివచ్చెద నని వచ్చి తండ్రినడిగెను. ఇతఁడును జెప్పలేక శిష్యునివలె సమిధలుపుచ్చుకొని చిత్రకడకు వెళ్ళి నీవే మాకుఁ జెప్పుమని కోరెను. ఇతఁడుబోధించెను.
కౌ. ఉ.

చిత్రకూటము:—ఒక పర్వతము. దీని సమీపమున నే యరణ్యవాసమున నేగుచుండిన రాముని భరతుఁడు కలుసుకొనెను. రామా.

చిత్రకేతువు:— ఒక రాజు. ఇతనికిఁ బలువురు భార్యలుకలరు. కాని యొకదానివలననుగూడ సంతానములేకుండెను. పుత్రులు లేక రాజు విచారమునొంది యుండఁగ అంగిరసుఁడను మునివచ్చి పుత్రకామేష్టి చేయించి యజ్ఞశేష మాతని పట్టమహిషి యగు కృతద్యుతి కిచ్చెను. ఆ ప్రసాదమున నామెకుఁ గుమారుఁడు కలిగెను. పుత్రునిఁ గనుటచే నీమెయందు రాజునకుఁ ప్రేమ యెక్కుడయ్యెను. ఇతర భార్యల కీర్ష్య జనించి రాజామె నతిశయముగఁ బ్రేమించుటకుఁ బుత్రుఁడే కారణమని యా బాలకునకు విషముపెట్టి చంపిరి. పుత్రి మరణమునకు రాజు రాత్రింబగళ్ళు శోకించుచునే యుండెను. నారదాదులు చిత్రకేతునికడకు వచ్చి దుఃఖోపశమనమును గావించి మోహమునువిడువుమని జ్ఞానబోధచేసిరి. మఱియును జనిపోయినబాలుని జీవునిఁ బిలచి నీ తల్లిదండ్రులు దుఃఖితులై యున్నారు. నీ వీ శరీరమునఁ బ్రవేశించి ఆయుశ్శేషం బనుభవించి రాజ్యమును గైకొను మనిరి. ఆ బాలుఁడు కర్మవశమునఁ దిరుగ నాకుఁ దల్లిదండ్రు లెవరు? ఎన్ని జన్మముల నెందరు దల్లిదండ్రులు లేరు? పరమేశ్వరరూపుఁడనైన నాకునుమీకును నెక్కడి సంబంధము? అని పలికి చనియెను. చిత్రకేతుని దుఃఖము పోయెను. నారదోపదేశమువల్ల గృహంబు వీడి కాళిందీనదికిఁ బోయి శుచియై యతఁ డుపదేశించిన మంత్రము పఠించి సప్తరాత్రములలో విద్యాధరాధిపత్యమును విమానమును బడసి దాని నెక్కి సంచరించుచు నొకచోఁ దపస్సుచేసి యనంతుని దర్శనంబు నొందెను.

ఒకనాఁడు చిత్రకేతువు విమాన మెక్కి కైలాసము చెంత విహరించుచు సభయందుశివుఁడు పార్వతీసహితుఁడై యుండుటను జూచెను. చూచి యూరకుండక, పరమేశ్వరుఁడైవను సభయందు సతి నాలింగనముచేసికొను నేది రహస్యముగఁ గాంతను జేరవలయును గాని" అని నవ్వెను. శివుఁడును నవ్వెను కాని పార్వతికిఁ గోపము వచ్చెను. నారదాది మహర్షులు మమ్మాక్షేపింపరే! నీవా, ఆక్షేపించువాఁడవు? నీవు రాక్షసయోనిం బుట్టుము" అనిపార్వతి శపించెను. కాని చిత్రకేతువు విచారము నొందలేదు. శాపానుగ్రహంబులు, సుఖదుఃఖములు, స్వర్గనరకములు సమములు. నీ శాపమునకు శంకింపను. కాని జగన్మాతవైన నిన్నుఁ బలికిన దోషమునకు శంకింతునని ప్రణామము లాచరించి చనియె. అప్పుఁడు శివుఁడు పార్వతితో ఇప్పుడు చూచితివి

గదా! నారాయణదాసదాసానుచరులనిస్పృహత్వంబు నిస్పృహులైనభాగవతులకు స్వర్గనరకంబులు తుల్యములు అని చెప్పెను. ఇతఁడే వృత్రాసురుఁడుగ బుట్టెను. భాగ.

చిత్రగుప్తుఁడు:-సూర్యవంశజుఁ డగు చిత్రుఁడు చిరకాలము సూర్యునారాధించెను. సూర్యుఁడు ప్రసన్నుఁడై వరము వేఁడుకొనుమనియెను. నీవు ప్రసన్నుఁడవైతివేని నాకుసర్వకార్యములందును ప్రౌఢత్వమును, సర్వజ్ఞత్వమును నొసంగుమని కోరెను. సూర్యుడొసంగెను. ఇట్టివాఁడు తనకు లేఖకుఁడుగ నుండుచో బాగుండునని యముఁడు తలపోసి చిత్రగుప్తుఁడు లవణసముద్రములో స్నానముచేయుచుండగఁ దనభటులను బంపి వానిని సశరీరముగ రావించుకొనెను. చిత్రగుప్తుఁడెల్ల ప్రాణులు గావించిన కార్యాకార్యములను లిఖించుచుండును. వీనికిఁ జిత్రాదిత్యుఁడను పేరుకూడఁ గలదు.

చిత్రబాణుఁడు:- గాంధారీ ధృతరాష్ట్రుల పుత్రుఁడు. భార.

చిత్రరథుఁడు:-అంగదేశపు రాజు. ఇతని భార్యయును, దేవశర్మయను బ్రాహ్మణుని భార్యయును నప్పచెల్లెండ్రు. భార.

చిత్రరథుఁడు:-(చూడుము రోమపాదుడు) భాగ.

చిత్రరథుఁడు:-అంగారపర్ణుఁడు పెట్టుకొనిన పేరు. (చూడు అంగారపర్ణుఁడు.) భార.

చిత్రరథుఁడు:-కురుకుమారులలోనొకఁడు. భార.

చిత్రరథుఁడు:-శశిబిందుని తండ్రి.

చిత్రరేఖ:-బాణాసురునిమంత్రియైన కుంభాండుని కూఁతురు. ఉష చెలికత్తె. ఉష యొక సుందరాకారునితోఁ గలిసినట్లుకలగని సిగ్గుపడి చిత్రరేఖతోఁ జెప్పుకొనియె. ఆపురుషుఁ డెవ్వరోమాత్రమామె చెప్పలేకపోయెను. అపుడీమె యందఱు రాకుమారుల చిత్తరువులు గీసి యుషకుఁజూపెను. ఆమె అనిరుద్ధునిఁ బోల్చి కలలోఁ గనఁబడినవాఁడీతఁడే యని చెప్పెను. చిత్రరేఖ తనవిద్యాప్రభావముచే నాకాశమార్గమున ద్వారకకువెళ్లి యెవ్వరికినిదెలియకుండ ననిరుద్ధుని నెత్తుకొనివచ్చి యుషయొక్క యంతఃపురమునఁ బెట్టెను. భార.

చిత్రరేఖ:- ఒక అప్సరస. ఇంద్రసభలో నీమె నాట్యము చేయుచుండఁగఁ గొన్ని లేళ్ళుకూడ వచ్చెను. ఈమె యింద్రునివైపుచూడక లేళ్ళవైపు చూచుటచే నింద్రునకుఁ గోపమువచ్చి మృగముల నాసక్తితోఁ జూచితివి కావున మృగివై పుట్టుమని శపించెను. ఆమె యింద్రుని శాపవిమోచనముచేయుమని కోరెను. విభాండకుని వీర్యమువలనఁ బుత్రుని బడసినపిమ్మట శాపముపోవునని యింద్రుఁడు చెప్పెను. ఈమె మృగమైసంచరించుచు దాహముతీర్చుకొనుటకై నదిలో జలముత్రాగెను ఆ జలములో విభాండకుని వీర్యముండెను. (చూడు విభాండకుఁడు) ఈ మృగము గర్భవతియై మనుష్యరూపముగల పుత్రుని గనియె. ఇతఁడే ఋశ్యశృంగుఁడు. అతని నొసట శృంగముకూడ గలదు. పుత్రుఁడు జన్మించఁగనే చిత్రరేఖకు శాపవిమోచనమై పుత్రునివిడచి స్వర్గమున కేగెను. విచి. రా.

చిత్రవర్మ:- ఒకరాజు. ఇతని కనమండుగురు పుత్రులుజనించినపిదప సీమంతిని యను పుత్రిక పుట్టెను. ఇతఁడామె నతిగారాబముతోఁ బెంచుచుండెను. జ్యోతిష్కులువచ్చి యామెకు వైధవ్యము వచ్చునని చెప్పిరి. రాజు మిక్కిలి దుఃఖమునొంది యది తన కూఁతునకుఁ దెలియనీయక ఆమెను చంద్రాంగదుఁడను రాజపుత్రున కిచ్చి పెండ్లిచేసి వానిఁగూడఁ దనయింటనే యుంచుకొనియె. ఒకనాఁడు చంద్రాంగదుఁడు పడవనెక్కి సముద్రములో వెళ్ళుచుండఁగఁ బడవ పెనుగాలివచ్చి ముక్కలై పోయెను. అందఱు సముద్రములో మునిఁగిపోయిరి. చంద్రాంగదుఁడుకూడఁ జనిపోయె ననువార్త వ్యాపించినది. కాని యితఁడు మునిఁగి పాతాళలోకమునకుఁ బోయెను. నాగేంద్రుఁడు చిత్రవర్మకు స్నేహితుఁడు గావునఁ జంద్రాంగదుని గౌరవించి వానికిఁ గానుకలిచ్చి పంపెను. మఱలి వచ్చిన వానిని జూచి చిత్రవర్మ మొదలగువారపరిమితానందము నొందిరి. స్కా. బ్ర.

చిత్రవాహనుఁడు:మణిపూరపురముయొక్క రాజు. ఇతని వంశమువారి కొక్కొక్క పుత్రుఁడు జన్మించుచుండునుగాని యితనికిఁ జిత్రాంగద యను కూఁతురు మాత్రము పుట్టెను. తీర్థయాత్రలకరిఁగిన యర్జునుఁ డీనగరమునకు వచ్చెను. ఇతని-

చిత్రవాహనుఁడు గౌరవించెను. అర్జునుఁడు చిత్రాంగదను దనకు భార్యగ నిమ్మని కోరెను. తనకుఁ బుత్రులు లేరు కావున నామెయందు నర్జునునకుఁ బుట్టిన కుమారునిఁ దన వంశవిస్తారునిగ నుండుట కంగీకరించినయెడల నిచ్చెదనని యితఁ డనియె. అందు కర్జునుఁడు సమ్మతింపఁగఁ జిత్రవాహనుఁడు తన కూతు నిచ్చి వివాహము చేసెను.

చిత్రసేనుఁడు:- ధృతరాష్ట్రునియొక్క ప్రసిద్ధి చెందిన నల్గురు పుత్రులలో నొకఁడు.

చిత్రసేనుఁడు:- ఒక గంధర్వుఁడు. పాండవులు ద్వైతవనమున నుండఁగ వారినిఁ బరిహసించుటకు దుర్యోధనాదులు ఘోషయాత్ర నెపమున వచ్చిరి. వారువచ్చి చిత్రసేనుఁ డుండు ప్రదేశమునఁ జేరిరి. చిత్రసేనుని భటులు కౌరవులను బొమ్మనిరి. వారు పోరిరి. అంతఁ జిత్రసేనుని భటులు వారి నోడించి దుర్యోధనాదు లందఱిని బంధించిరి. అది ధర్మరాజు విని భీమార్జునులను బంపి వారిని విడిపించెను.

చిత్రసేనుఁడు:-వైవస్వతమను పుత్రుఁడైన నరిష్యంతుని కుమారుఁడు. ఇతని తనయుఁడు దక్షుఁడు. భాగ.

చిత్రాంగద:-చిత్రవాహనుఁ డను మణిపూరపురము రాజుయొక్క కూతురు. ఈమెను అర్జునుఁడు వివాహమయ్యెను. ఈమెయం దాతనికి బభ్రువాహనుఁడు అను పుత్రుఁడు జన్మించెను. వివాహమైన పిమ్మటగూడ నీమె పెద్దకాలము తండ్రియింటనే యుండెను. ధర్మజుని యాగాశ్వము వెంటవచ్చు నర్జునునితో బభ్రువాహనుఁడు పోరెను. ఇరువురును మూర్ఛపోయిరి అటకుఁ జిత్రాంగదయును, నులూపియును వచ్చిరి. నీబోధచేత నా కుమారుఁడు తండ్రితో యుద్ధముచేసెను. కుమారునికంటెను బతికై యెక్కువ విలపించును. భర్తను బ్రతికింపుమని కోరెను. బభ్రువాహనుఁడు మూర్ఛదేరెను. ఉలూపి అర్జునుని సంజీవని మణిచే బ్రతికించెను.

చిత్రాంగదుఁడు:-శంతనునకు సత్యవతి వలనఁ బుట్టినకుమారుఁడు. విచిత్రవీర్యుండీతనితమ్ముఁడు. భీష్ముఁడు తాను బూనిన శపథము ప్రకారము తాను రాజుకాక చిత్రాంగదునే రాజ్యాభిషిక్తుఁ జేసెను. కాని యితం డతిగర్వంబుతో సంచరించుచుండెను. చిత్రాంగదుఁడను నొక గంధర్వ వీరునకును, నితనికిని యుద్ధమయ్యె. ఆయుద్ధములో నితఁడు మరణించెను. భార.

చిత్రాంగదుఁడు:- ఒక గంధర్వుఁడు. శంతను పుత్రుఁడగు చిత్రాంగదునితో యుద్ధము చేసి వానిని జంపెను.

చిత్రాంగదుఁడు :- గాంధారీ ధృతరాష్ట్రుల పుత్రుఁడు. భార.

చిత్రాంగి:-రాజరాజనరేంద్రుఁడను రాజుయొక్క రెండవభార్య. ఈయౌవనవతియొక్క భర్త వృద్ధుఁడగుటచే నాతనిపై నీమెకుఁ బ్రేమలేదు; కాని భర్త యీమెను బ్రేమించుచుండెను. రాజుయొక్క పెద్దభార్య కుమారుఁడైన సారంగధరుని రూప సౌందర్యములను గుఱించియు గుణగణంబులను గూర్చియు నీమె విని వానిని వలచియుండెను. ఒకనాఁడు సారంగధరుఁడు పావురములను ఎగురవేయుచుండఁగ నొక పావురము చిత్రాంగియొక్క మేడపై వ్రాలెను. దానిని దీసికొనుటకై సారంగధరుఁ డీమె భవనమునకు వచ్చెను. అప్పుడే చిత్రాంగి సారంగధరునిఁ జూచెను. వానిని జూచినప్పటి నుండియును జిత్రాంగి పాపవశ్యమునొంది తన మనస్సు పట్టజాలక తన హృదయమును సారంగధరుని కఱంగించి తన కౌఁగిటఁజేరి సుఖపెట్టి జన్మము సాఫల్యము చేయుమని వేఁడెను. కాని సారంగధరుఁడు మనోనిశ్చయముగల్గి యిందుకేని చలింపక యీమె కోరిక మహాపాతకమని యెఱింగించి యామెభవనముదాటి బైటఁబడెను. తాను మిక్కుటముగ వలచిన ప్రియుఁ డిట్లు నిరాకరించుటచేఁ జిత్రాంగికి మిక్కిలి దుఃఖమువచ్చి యాతని పైఁ గల వలపునంతటిని ద్వేషముగ మార్చుకొని అతని యుత్తరీయము లాగుకొని దాచియుంచి రాజరాజనరేంద్రుఁ డామెకడకు రాఁగా, సారంగధరుఁడు తనభవనమునఁజొచ్చి మానభంగముచేయ యత్నించెనని చెప్పి యుత్తరీయము చూపించెను. రాజీమె మాటలను విని పుత్రునిఁ జంపించెను. తరువాత నీమె చేసిన ద్రోహమెఱింగి యామెను సంహరింప నాజ్ఞ యిచ్చెను.

చిత్రాక్షుఁడు:-గాంధారి ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

చిత్రాయుధుఁడు:-గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

చిత్రాశ్వుఁడు:-సత్యవంతుని మఱియొక పేరు. భార.

చిత్రుఁడు:-ఒకరాజు. భారతయుద్ధములోఁ గౌరవుల పక్షమునఁ బోరి ప్రతివింధ్యునిచేఁ జంపఁబడెను.

చిరకారి:-మేధాతిథి కుమారుఁడు. ఏకార్యమునైనను జిరకాలమాలోచించి చేయుచుండువాఁడు. ఒక్కనాఁడు మేధాతిథికి భార్యపైఁ గోపమువచ్చి పుత్త్రుని బిలిచి నీవు వెంటనే నీతల్లిని వధింపుమని యానతిచ్చెను. తల్లినిఁ జంపుట మహాపాతకము. తండ్రియాజ్ఞ మీఱుటయును దోషమే ఏది కర్తవ్య ? మని చిరకారి యాదినమంతయును విచారించుచునే యుండెను. అంతలో మేధాతిథికిఁ గోపముతగ్గెను. పుత్త్రుఁడు భార్యను వధించెనేమోయని భయపడి యతని యొద్దకు వచ్చెను. చిరకారి తల్లిని వధింపకుండుటఁ జూచి సంతోషించెను. భార.

చిఱుతొండఁడు:-కాంచీనగరముననొకవైశ్యుఁడు. ఇతఁడు పూర్వజన్మమందుఁ దుంబురుఁడను వాఁడు. దుర్వాసుని శాపవశమున నిట్లు జన్మించెను. ఇతనిభార్య తిరువెంగనాంచి వీరికి సిరియాళుఁడను కుమారుఁడొక్కఁడు కలఁడు. వీరు శివభక్తులు. జంగములకుఁ బెట్టినఁగాని భుజింపరు; అతిథులకుఁ బెట్టక వారెన్నఁడును గుడువరు. ఒకనాఁడెవరును వారింటికి రాలేదు. చిఱుతొండఁడు నాల్గు వీధుల మొగలకును వెళ్ళెను. జంగము లెచ్చటను గనఁబడలేదు. తిరుగఁగఁ దిరుగఁగఁ నొక్కచో వృద్ధులు రోగులు నగు దంపతులు కనఁబడిరి.

ఇతఁడు వారిని దన యింటికి రమ్మని కోరెను. వారు శివభక్తులమనియును, శివవ్రతము చేసిరనియును నది యుద్యాపన కావలయుననియును, దానికై తాము కోరిన దీయవలయుననియును దంపతులు చెప్పిరి. చిఱుతొండఁడు సంతోషముతో నిత్తునని పలికెను. నీకుమారుని మాంసమువండి పెట్టవలయును. దీనికి నీభార్య యిష్టపడనిచో మా వ్రత భంగమగును. నీవు పోయి నీ భార్యను నడిగి రమ్మని పంపిరి. చిఱుతొండఁ డింటికివచ్చి భార్యతో నట్లు చెప్పెను. మన మాంసముకూడ నిచ్చుటకు సిద్ధముగానుంటిమని చెప్పుమని తిరువెంగనాంచి పలికెను. చిఱుతొండఁ డా వృద్ధదంపతులు తనను బరీక్షచేయుటకు వచ్చిన పార్వతీపరమేశ్వరులని యెఱుఁగకయే వారిని దన భుజముపై నెక్కించుకొని తన ఇంటికిఁ దీసికొని వచ్చెను. సిరియాళున కభ్యంగనముచేసి, తల్లి తన కాళ్ళమీఁదఁ బరుండఁ బెట్టుకొనెను. తండ్రి వానిని జంపెను. కుమారుని మాంసము వంటచేసిరి. దానిని వృద్ధదంపతులకు వడ్డించిరి. అపు డా యతిథి "నీయింట బాలుఁ డెవ్వఁడును లేఁడా? పుత్త్రుఁడు లేనియింట నే భుజింపను" అని పలికెను. చిఱుతొండఁడు దీనుఁడై "తమ సెలవు చొప్పున నా పుత్త్రునిఁ జంపి వంట చేయించితిని. ఇఁక నాకుఁ గుమారుఁడు లేఁ"డని చెప్పెను. నీవు పుత్త్రునిఁ బేరుపెట్టి గట్టిగాఁబిలువుమని యా యతిథి యాజ్ఞాపించెను. చిఱుతొండఁడు సిరియాళా! యని బిగ్గఱఁగఁ బిలచెను. అపుడు వీథిలోనుండి సిరియాళుఁడు వచ్చి నమస్కరించెను. అంతటఁ బార్వతీ పరమేశ్వరులు తమ నిజరూపము చూపి వారి యతిథిపూజకును, శివభక్తిని మెచ్చుకొని వారి పూర్వవృత్తాంత మెఱిఁగించి సిరియాళుఁడు కుమారస్వామియగుటను దెల్పిరి. చిఱుతొండఁడు తన శాపవిమోచనము కాఁగాఁ బూర్వరూపము నొందెను. హర.

చూ

చూలి:-ఒకముని. ఈతనికి సోమద యను గంధర్వ కాంత పరిచర్య చేయుచుండెడిది. ఇతనివలన నామెకు బ్రహ్మదత్తుఁడను పుత్త్రుఁడు కలిగెను. రామా.

చె

చెన్నబసవఁడు:-శివునియానతిపై పుడమిమీఁదఁ బుట్టిన కుమారస్వామి. (చూడుము కుమారస్వామి.) ఇతని తల్లి నాగమాంబ. బిజ్జలుని మంత్రియగు బసవఁడు ఇతని మేనమామ. బసవఁడు తెచ్చుకొనిన కక్కయ్యయను భక్తుని ప్రసాదమును నాగమాంబ భక్షించెను. దాని ప్రభావమున "నాకన్యకకు గర్భమయ్యె. దాన లోకనింద యగునని బసవఁడు మిక్కిలిదుఃఖించెను." సంగమేశ్వరుఁడు ప్రత్యక్షమై నాగమాంబ పార్వతి చెలికత్తెయనియును, చెన్నబసవఁడు కుమారస్వామి యనియును, వారట్లు పుట్టుటకు నిమిత్తమును జెప్పెను. "బసవనిసోదరి వివాహము కాకయే గర్భవతి యయ్యె"నని ప్రజలు నిందగఁ జెప్పుకొనుచుండిరి. బిజ్జలుఁడు బసవనిఁ బిలిపించి యిదేమని ? అడిగెను. అతఁడు తన సోదరినే యడుగుమనియె. ఆమెను రాజసభకుఁ బిలిపించి యడిగిరి. తనకుఁ దెలియదనియును, దన గర్భస్థుఁడై యున్నవాని నడుగుమనియును నామె చెప్పెను. బిగ్గఱగఁ బల్కుచు రాజు ప్రశ్నించెను. గర్భస్థడింభకుఁడు "కక్కయ్య ప్రసాదముకతన దానాకన్యయొక్క గర్భము ప్రవేశించుటను దెల్పెను." నిన్నుఁ జూడవలెనని యున్నదని రాజు బలుకఁగ నామెయొక్క దక్షిణకర్ణమునుండి బైటకువచ్చి పండ్రెండేండ్ల బాలుఁడుగ నిలిచెను. చె. బ.

చెప్పులు, గొడుగు దానము:-(చూడుము జమదగ్ని.)

చే

చేఁపలు:-వీనికి ప్రజలు మిమ్ము వధింతురుగాక యని అద్భుతుఁడు శాపమిచ్చెను. (చూడుము మత్స్యములు శాపము)

చేకితానుఁడు:-ఒక యాదవరాజు. పాండవపక్షమున బోరెను. కృపునితో యుద్ధముచేసి యతనిని మూర్ఛనొందింపఁజేసెను. తానును మూర్ఛితుఁడయ్యెను.

చేదిపురము:-ఉపరిచరవసువు పాలించిన దేశము. శిశుపాలుఁడు పాలించిన దేశము.

చై

చైకితాయనుఁడు:- చికితాయనుని పుత్త్రుఁడు. ఇతఁడును, శిలకుఁడును ఉద్గీథవిద్యను గుఱించి తర్కించుకొనుచుండిరి. శిలకుని ప్రశ్నల కితఁడు సమాధానము చెప్పెనుగాని వీనికి జ్ఞానము పూర్తిగ లేదనియును, నాతని సామగానవిద్య శాస్త్రమునకును, న్యాయమునకును విరుద్ధముగ నున్నదనియును,ఉద్గీథ విద్యాపరిపూర్ణుఁడగువాఁ డితనిశిర మూడిపోవునట్లు శపించుచో నది యూడిపోవుననియును శిలకుఁడు చెప్పెను. అంతఁ జైకితాయనుఁడు శిలకునకు శిష్యుఁడై యతనివలన ఉద్గీథవిద్య నేర్చుకొనెను. చా.ఉ.

చైత్రరథము:-ఒక పర్వతము. భార.

చైత్రరథము:-కుబేరుని ఉద్యానవనము.

చైత్రుఁడు:-విక్రాంతుఁడనురాజునకును, హైమినికిని బుట్టినకుమారుఁడు. జాతహారిణి యను బిడాలము గిరిభద్రశిశువగు జాక్షుషుని దెచ్చి హైమినియొక్క ప్రక్కనుంచి చైత్రుని విశాలపురమున బోధుఁడను బ్రాహ్మణుని భార్యప్రక్కయం దుంచెను. చైత్రుఁడే తన కుమారుఁడని విక్రాంతునకుఁ జాక్షుషు వెఱింగింపఁగ నతఁడు చైత్రుని రప్పించుకొనెను. మార్క.

చైత్రుఁడు:-చిత్రయందు బుధునకుబుట్టిన కుమారుఁడు. ఇతని కుమారుఁడు అధిరథుఁడు. బ్ర. వై.

చ్య

చ్యవనుఁడు:-భృగుని కుమారుఁడు. ఇతనితల్లి పులోమ. తల్లి గర్భమందున్నపుడు పులోముఁడను రాక్షసుఁడు. వరాహరూపుఁడై తల్లిని ఎత్తుకొని పోవుచుండఁగ నితఁడు అలిగి గర్భమునుండి బైటకుజారి రాక్షసునిఁ దీక్ష్ణముగఁ జూచెను. దాన వాఁడు మాడిపోయెను. ఇతని భార్య సుకన్య, అప్రవానుఁడు, దధీచి యితని కుమారులు. భార.

ఇతఁడు పెక్కేండ్లు తపస్సుచేసెను. శరీర మంతయును బుట్టగట్టె. ఒకనాఁడు శర్యాతిసేన తోడను, దన కుమారిత సుకన్య తోడను చ్యవనుఁడు తపస్సుచేసికొనుచుండు ప్రదేశమునకడ సంచరించుచుండెను. చ్యవనునిపైఁ బుట్టకట్టి యుండుటచే నితనినిజూడలేక యా పుట్టనుండి మెఱుగులు వచ్చుటమాత్రము చూచి సుకన్య పుట్ట త్రవ్వించెను. చ్యవనునకుఁ గోపమువచ్చి రాజసేనకు మూత్ర పురీషములు బంధనము గలుగునట్లు చేసెను. సైనికులు బాధపడుచుండిరి. దీనికంతకును సుకన్యచేసిన తప్పు కారణమని రాజు చ్యవనునికడకు వచ్చి ప్రార్థించి బాల యగుటచేఁ దనకుమారిత చేసిన యపరాధమును సైరింపుమని వేఁడెను. సుకన్యను దనకిమ్మచో రాజును క్షమించుదుననియును, నప్పుడు వారిబాధ తొలఁగుననియును జ్యవనుఁడు చెప్పెను. శర్యాతి తనకుమార్తెను జ్యవనునకిచ్చి వివాహము చేసెను. ఒకనాఁ డాశ్వినులు సుకన్యను జూచి సుందరగాత్రీ! నీకీ వృద్ధభర్తయేల? మాతోడరమ్ము. నీవుఁ దగినవానిని జూపెద మనిరి. సుకన్య కోపముతో నీమాటలు భర్తతోఁ జెప్పెను. చ్యవనుఁడు వారి యిష్టముగనే వర్తింపుమని భార్యతోఁ జెప్పెను. ఆమె ఆ ఆశ్వినులను జూచి నాకు యౌవనవంతుఁడగు వానినిజూపుఁడనియె. వారిద్దఱును నదిలో స్నానమునకై దిగిరి. చ్యవనుఁడుకూడ వచ్చి దిగెను. ఇతఁడు పరమకోపుఁడైనను నామె పరిచర్యలచే నితని మెప్పు వడసెను. ఇతని యాశ్రమమునకడకు నశ్వినీదేవతలు రాఁగాఁ జ్యవనుఁడు తన ముదిమి పోఁగొట్టవలసినదని యును, యాగమునందు సోమపాన భాగ మిప్పింతుననియును జెప్పెను. అంతవార లట నున్న యొకకొలనులో మునిఁగి రమ్మనిరి. వారును మునిఁగిరి. సమాన వయోరూప విలాసములతో ముగ్గురును వెడలి వచ్చిరి. వీరిలోఁ దనభర్తను దెలిసికొనలేక సుకన్య ఆశ్వినులను ప్రార్థించెను. వా రామెకుఁ జ్యవనుని జూపిరి. ముగ్గురును లేచివచ్చిరి. ముగ్గురును సమాన వయోరూపులుగ నుండిరి. వారిలోఁ దనభర్త నెన్నుకొనుమనిరి. అప్పుడును సుకన్యచ్యవనునే యెన్నుకొనియెను. అశ్వినుల కారణముగఁ జ్యవనునకు యౌవనము వచ్చెను గావున శర్యాతి చేయబోవు యజ్ఞమున వారిని సోమపీథులను జేసెదనని వారికిఁజెప్పి శర్యాతిచేఁ గొనిపోయి వారికిని యజ్ఞభాగ మిప్పించెను. వారికిప్పించుటచే నింద్రునకుఁ గోపమువచ్చి చ్యవనునిపై వజ్రాయుధ మెత్తెను. వానిహస్తము చ్యవనుఁడు అల్లే యాతనివజ్రము స్తంభింపఁ జేసెను. చ్యవనుఁడు హోమముచేసెను. అందుండి మదుఁడను రాక్షసుఁడు పుట్టెను. వాఁడు సురలను గబళింపఁబోయెను. వానిని జూచి ఇంద్రుఁడు భయపడి చ్యవనుని శరణువేఁడెను. ఆశ్వినులకును సోమపాన మిచ్చిరి.

ఇంద్రుఁడు చ్యవనునిపై పర్వతము విసరఁబోయెను. చ్యవనుఁడు మంత్రపూతజలమును పర్వతముపైఁ జల్లగ నది యింద్రునిమీఁదనే పడెను. దానిచే నతఁడు మూర్ఛపోయెను.

ఇతఁడు గంగాయమునల కలియుచోట నీళ్లలోఁ గుంకి పండ్రెండు సంవత్సరములు తపస్సు చేసెను. ఒకనాఁడు బోయలు చేపలకు బట్టుటకై వలవేసిలాగిరి. అందులోఁ జేపలతోఁబాటు నితఁడుకూడ వచ్చెను. ఇతనిని జూచి జాలరులు భయపడి క్షమింపుమని మ్రొక్కిరి. చ్యవనుఁడు కోపము తెచ్చుకొనక యీచేపలతోఁ బండ్రెండేండ్లు నివసించితిని. వానితోఁ జెలిమిచేసితిని. వానినొదలి నాప్రాణము విడుచుట న్యాయముకదా! చేపలతోఁబాటు నాశరీరముకూడ విక్రయించు కొనుఁడని పలికెను. ఆ జాలరులు నహుషునితో నితని వృత్తాంతము చెప్పిరి. ఆ రాజు మంత్రివర్గముతో వచ్చి జాలరులతప్పు క్షమింపుమని ప్రార్థించెను. వారి కులధర్మము వారు చేయుట తప్పు కాదు. నీవు నాశరీరము పుచ్చుకొని తగినవిలువ వారికిమ్ము అని చ్యవనుఁడు చెప్పెను. ఆజాలరులకు వేయిమాడ లిమ్మని రాజు తన భృత్యుల కాజ్ఞయిచ్చెను. అది తనకు సరియైన విలువ కాదని చ్యవనుఁడు పలికెను. నహుషుఁడు కోటి మాడ లిమ్మనెను. అర్ధరాజ్య మిమ్మనెను. తుదకుఁ దన రాజ్యమంతయు నిచ్చెదననియెను; అయినను నది తనకు సరియైన విలువకాదనియును, మఱియొకసారి యాలోచించుకొనుమనియును జ్యవనుఁడు చెప్పెను. నహుషుని కేమియు తోఁచక చింతించుచుండఁగఁ గవిజాతుండను

అను మునివచ్చి బ్రాహ్మణునకును, గోవునకును గుణమొక్కటియే. బ్రాహ్మణునితో సమానమైనది గోవొక్కటియే అని చెప్పెను. ఆమాటలు విని రాజు చ్యవనుని కడకుపోయి ఓ మునివర్యా! నీకు సరియైనవిలువ యిదియని యేర్పరుప నాకు శక్యమా? అయినను నీకైయొక గోవు నిచ్చెద ననియె. చ్యవనుఁడు సంప్రీతుఁడై గో వగ్నిమయము. అమృతమయము. అది దేవతల కైనను బూజ్యమని చెప్పెను. జాలరులు గోవును బుచ్చుకొని చ్యవనునియొద్దకు వచ్చి యీ గోవును పరిగ్రహించి మమ్ముఁ గృతార్థులను జేయుమని మ్రొక్కిరి. చ్యవనుఁడు వారలను జాలపటచేఁగల్గిన ప్రీతివలనను మీరు, చేపలును స్వర్గమునే పొందుఁడని యాశీర్వదించెను. భార.

భృగువంశము కుశికవంశముతోఁ గలియఁగల దని దేవతలు చెప్పుకొనుట చ్యవనుఁడు విని తనవంశము సంకరమగుటకు విచారించి యట్టి సంకరము నివర్తించుటకై కుశికవంశమును నిర్మూలము చేయఁదలఁచుకొనెను. అతఁడు ప్రయోగవంతుఁడై కుశికు నింటికి వచ్చెను. ఆ రాజును, భార్యయు నాతిథ్యమిచ్చిరి. వానికై యేమిసేయవలెనని యతని నేఁడిగిరి. భార్యాభర్తలిరువురును దనకుఁ బరిచర్యలు చేయుచుండవలయునని చ్యవనుఁడు పలికెను. ఆ మునిని రాజు తనఃపురమున నుంచి భార్యయును, దానును బరిచర్యలు చేయుచుండిరి. చ్యవనుఁడు సెజ్జపైఁజేరి వారిని పాదము లొత్తుచుండ నియోగించి తాను లేచువఱకు నిద్రాభంగము చేయఁగలదని యాజ్ఞిచ్చెను. చ్యవనుఁ డిరువదియొక్క దినము లట్లే నిదురించెను. కుశికుఁడును, భార్యయును నిద్రాహారములు మాని వానిపాదములను బట్టుచునే యుండిరి. చ్యవనుఁడు మెల్లఁగాంచి లేచి, వారితో మాటాడకయే యంతఃపురమును విడిచి యరిగెను. వాని వెంబడినే రాజును, భార్యయు నరిగిరి. కొంత దూరము వెళ్ళినపిదప నతఁ డదృశ్యుఁడయ్యెను. వారువిచారముతో నింటికి మరలివచ్చి యంతఃపురమును బ్రవేశించిరి. అందుఁ జ్యవనుఁడు నిద్రపోవుచుండుటఁ జూచి విస్మితులై వాని పాదము లొత్తుచుఁ గూర్చుండిరి. ఇట్లిరువదియొక్క దినములు గడచెను చ్యవనుఁడు లేచెను. వారలచే నభ్యంగనము కావించెను. అతఁడు రథ మెక్కిపోవుదని కోరెను. భార్యాభర్తలనే రథమును లాగుడనియెను. వారికంఠములకుఁ ద్రాళ్ళుకట్టికొని చ్యవనుఁడు వారిని ముల్లుకోలతోఁ బొడుచుచుండెను వారి శరీరములనుండి రక్తము వచ్చుచుండెను అయినను నిట్టిసంకోచములేక కుశికుఁడును వానిభార్యయును రథమును లాగుచుండిరి. వారి శమదమాదుల కచ్చెరువంది చ్యవనుఁడు రథము నాపి వారి శరీరములు స్పృశించెను. దాన వారి యాయాసము పోయెను. వారు యౌవనవంతులైరి. వారిని జూచిమెచ్చుకొని చ్యవనుఁడు నేను గంగానదీ తీరమున జపము చేసికొనుచుందును. రేపు మీరు రండని చెప్పి వెడలెను. మఱునాఁడు కుశికుఁడును వాని భార్యయు నరిగిరి. అప్పటి చ్యవనుఁడు తన యోగబలమున నాగలోకమును, నందలి హర్మ్యములను, వారికిఁ జూపెను; వారందుఁ బ్రవేశించిరి. క్షణములో వానినన్నిటిని మాయముగావించెను అద్దిరా! బ్రహ్మతేజమహిమ యని వారు కొనియాడిరి. చ్యవనుఁడు వానికి వరమిత్తుననియె. ఏల మీరట్లు కదలక యిన్నినాళ్ళు నిద్రించితిరని కుశికుఁడు ప్రశ్నించెను దేవతలవలన వినిన వాక్యము జెప్పి యవకాశము కలిగనేని మిమ్ము శపించుటకై యట్లుచేసితినని చ్యవనుఁడు తెల్పెను తమవంశమును, కుశికవంశమున గలియుట తెలిసికొని కుశికుఁడు మహాతపస్వి బ్రహ్మతేజోదీప్తుఁడై జనించునని చెప్పెను. భార.

చ్యవనుఁడు :–సుహోత్రుని పుత్త్రుఁడు. ఇతని కుమారుఁడు కృతి. భాగ.

ఛా

ఛాయ:–సూర్యుని భార్యయైన సంజ్ఞ యతని తేజస్సు సహింపఁజాలక తన ఛాయను దీసి యతనికడ నుంచి తాను పుట్టినింటి కరిగెను. ఈమెయును సంజ్ఞవలెనే యుండుటచే సూర్యుఁడు భేదమెన్న లేక యుండెను. ఈమెయందు శ్రుతకర్మ, (శ్రుతశ్రవుఁడు), శని, సావర్ణి పుట్టిరి. ఒకనాఁ డీమెకును సంజ్ఞపుత్త్రుఁడైన యమునకును వివాదమయ్యెను. అతఁ డీమెను కాలితోఁ దన్నెను. పాదము విఱిగి నేలఁ బడుమని యీమె వానిని శపించెను ఇతఁడు తండ్రితోఁ దన సవతితల్లి

తనను అనాదరణ చేయుచున్నదని చెప్పెను. సూర్యుఁడు వచ్చి ఛాయను ప్రశ్నించి యామె నిజ వృత్తాంతమును దెలిసికొనియెను. మార్క.

జ

జంతుఁడు:-సోమకుఁ డనువాని పుత్త్రుఁడు. సోమకునకు నూర్గురు భార్యలు కలరుగాని జంతుఁ డొక్కఁడే పుత్త్రుఁడు. వీఁడొకనాఁడు చీమ కుట్టుటచే నేడ్చుచుండెను. వీనితల్లు లందఱును దండ్రియును నీ యొక్కబాలుని నమ్ముకొని యెట్లుజీవించుటకి యని విచారించిరి. ఈ పుత్త్రుని యజ్ఞపశువుగ వేల్చి యాగము చేసినయెడలఁ బుత్త్రులు పలువురు కలుగుదురని ఋత్విజుఁడు చెప్పఁగ సోమకుఁ డట్లు వీనిని వేల్చి యాగము చేసెను. భార.

జంతుధన:-అజుఁడను నొక కపియొక్క సుత. ఈమె తండ్రితో వనమున సంచరించుచుండఁగ నొక రాక్షసుఁడు భీకరముగ నరచెను. జంతువులన్నియును బెగ్గడిల్లెనుగాని ఈమెయు, నీమెతో నుండిన నీమెపినతండ్రి కుమారితెయు భయపడక వానిని జూడఁబోయిరి. ఈకన్యల తండ్రులు వీరి నారాక్షసునకిచ్చి వివాహము చేసిరి. ఈమె భర్తతోఁ బోవుటకు నిరాకరించుటచేఁ దండ్రి విశేషధనమిచ్చి యీమెను భర్తతోఁ బంపెను. బ్రహ్మ.

జంబుకుమారుఁడు:-ఒక రాక్షసుఁడు. విద్యుజ్జిహ్వుని పుత్త్రుఁడు. వీనితల్లిశూర్పణఖ. తండ్రిని దేవతలు చంపుటచే వారిపైఁబగదీర్చుకొనఁదలచి జంబుకుమారుఁ డింద్రునిగుఱించి తపస్సుచేసెను. ఇంద్రుఁడు ప్రత్యక్షమై చంద్రహాస మను నాయుధమిచ్చెను. నాతపస్సునకిదియా యిచ్చెద వని కోపమువచ్చి దానిని గ్రహింపక జంబుకుమారుఁడట్లే పంచవటియందుఁ దపస్సు చేయుచుండెను. ఆతనిచుట్టును వెదుళ్లు పెరిగియుండెను. చంద్రహాస మట్లే యాకాశమున వ్రేలాడుచుండెను. దండకారణ్యవాసము చేయుచున్న లక్ష్మణుఁడా తావునకువచ్చి పండ్లుకోసికొనుచు నా యాయుధమును జూచి దానిని గ్రహించి ఝళిపించెను. అచ్చటనున్న మునులు వానినిజూచి యాఫలతరువుల నేలనఱకెదవు? ఆ వెదురుపొదను నఱకుమనిరి. లక్ష్మణుఁడు దానిని నఱకెను. దాని మధ్యనున్న జంబుకుమారుఁడు శస్త్రహతుఁడై చనిపోయెను. రామా.

జంబుకుమారుఁడు:-ఇతని పేరు జపాసురుఁడు. ఇతఁడు పూర్వము వేదములను దొంగిలించిన సోమకాసురుఁడు. వి. రా.

జంబుమాలి:-ప్రహస్తుని పుత్త్రుఁడు. రావణుని సేనలోనివాఁడు. హనుమంతుఁడు లంకలోఁ జేరి వనము పాడుచేయుచుండఁగ నీతండు వానినిఁ బట్టుకొనఁబోయెను. హనుమంతుఁ డితనితోఁ బోరి వీనిని జంపెను. రామా.

జంబూద్వీపము:-మేరుపర్వతమునకు దక్షిణమున నున్న ద్వీపము. అందున్న జంబూవృక్షమును బట్టి యీపేరు వచ్చెను. ఆ జంబూవృక్షమునకు సుదర్శన మనియును పేరుగలదు. దీనినిబట్టి యీద్వీపమునకు సుదర్శన ద్వీపమనియును పేరు. భార.

ఈ జంబూద్వీపమున వర్షము లను పేరఁ దొమ్మిది ఖండములు కలవు. అవి కురువు, హిరణ్మయము, రమణకము, ఇలావృతము. భద్రాశ్వము, కేతుమాలము, హరివర్షము, భారతవర్షము, కింపురుషము అనునవి.

జంబూనది:-మేరుపర్వతమునకు దక్షిణమునన్న జంబూవృక్షముయొక్క పండ్లు రాలి వానిరసము నదియై ప్రవహించెను. ఆ నదియే జంబూనది. ఈనది నీరుసోకినచో తెల్లబంగారమగును. ఈనది నీరు త్రాగినవారికి ముదిమియును, వ్యాధియును, దప్పియు నుండవు. భార.

జంబూవృక్షము:- మేరువు దక్షిణమున నున్న యొక వృక్షము. దీనికి సుదర్శనమను పేరుకలదు. ఈ వృక్షము రెండువేల నేనూఱు యోజనముల పొడవు. దీని పండ్లరసము నదియయ్యెను. ఈ

వృక్షమును బట్టియే యిది యున్న ద్వీపమునకుఁ బేరువచ్చెను. భార.

జంభాసురుడు:- సుజంభుని సోదరుఁడు. ఇతఁడింద్రుని బాధపెట్టుచుండువాఁడు. ఇంద్రుఁడు విష్ణుమూర్తిని వేఁడుకొనియెను. వజ్రాయుధమును మాని యగ్నిని వేఁడి యస్త్రములు పుచ్చుకొని వానితో యుద్ధము చేయుమని విష్ణువు చెప్పెను. ఇంద్రుఁడు విశ్వావసుఁడను గంధర్వుని రథము పుచ్చుకొని శమీరునిపుత్త్రుని సారథినిగఁ జేసికొని జంభాసురునితో యుద్ధముచేసి వానిని సంహరించెను. రామా.

జంభాసురుని కుమారిత దత్త.

జంభుఁడు:- తాటకభర్తయైన సునందుని తండ్రి. రామా.

జంభుఁడు:- దనుజుఁడు. దేవదానవ యుద్ధములో నింద్రుఁ డితనిని సంహరించెను. భాగ.

జంభుఁడు:- ఒక దానవుఁడు. యజ్ఞములను ధ్వంసము చేయువాఁడు విష్ణుమూర్తి యజ్ఞపురుషుఁడుగ నవతరించి వానిని జంపెను. భార.

జగన్నాథమూర్తి:- కృష్ణుఁడు మృతుఁడైన పిమ్మట నతని శరీరమే దారువయ్యె. అదియే జగన్నాథమూర్తి విగ్రహము. జగన్నాథము.

జగన్మోహిని:- క్షీరసాగరమునుండి యమృతము పుట్టినపిదప దానవు లా యమృతమును గ్రహింపకుండ వారిని సమ్మోహితులనుజేసి దేవతలకే యంతయు బంచిపెట్టుటకై నారాయణుఁడు స్త్రీరూపమునుదాల్చి జగన్మోహినియవతార మెత్తి ముందుగ దేవతలకు నమృతము పంచిపెట్టెను. శివుఁ డీ రూపమును జూడఁగోరి విష్ణుని వేఁడి యీరూపము తిరిగి ధరింపఁజేసి చూచెను. శివుఁడు మరులుకొని యీమె వెంటఁ బరుగిడ సాగెను. ఈమెతో రతిసల్పెను. అపు డీమెకు వచ్చిన చెమటయే గండకీనది యయ్యెను. ఈమెకుఁ బుట్టిన పుత్త్రుడే కాలభైరవుండయ్యెను. భాగ.

జటాయువు:- ఒక పక్షి. శ్యేని అనూరుల కుమారుఁడు. సంపాతి సోదరుఁడు. సోదరు లిరువురును జిన్నప్పు డెవ రెంత యెత్తు ఎగురఁగలరో యని యెగిరిరి; సూర్యమండల సమీపమునకుఁ బోయిరి. సూర్యునివేడిమికి సంపాతి రెక్కలు మాడుటచే నది క్రిందఁబడి పోయెను. జటాయు వేఱొకచోటఁ బడెను. తరువాత నొకరి నొకరు చూచుకొనలేదు. ఇతనికిఁ గర్ణి కారుఁడు, శతగామి అను నిద్దరు పుత్త్రులు. జటాయువు దశరథునకుఁ గడు మిత్త్రుఁడు. దశరథుఁడు కౌసల్యను వివాహమగుటకేగి సముద్రమునఁ గొట్టుకొనిపోయినపు డితఁడే వాని నయోధ్యకుఁ జేర్చెను. రావణుఁడు సీత నెత్తుకొని పోవుచుండఁగ నితఁడు చూచెను. ఆమె దశరథుని కోడలను, రాముని భార్యను, రక్షింపరే యని యేడ్చుచుండుట విని రావణునికడ కేగి యామెను విడువుమని చెప్పెను. అతఁడు నిరాకరించినందున నతనితో యుద్ధము చేసెను. రావణుఁడు వీని రెక్కలను విరుగఁగొట్టెను. జటాయువు క్రిందఁబడి రాముని కొఱకై మార్గమందు వేచియుండి, యతనికిఁ దన వృత్తాంతమును, సీత వృత్తాంతమును దెల్పి ప్రాణములు విడిచెను. వీనికి రాముఁడే యగ్నికార్యము నొనరించెను. రామా. మత్స్య.

జటాసురుఁడు:- ఒక రాక్షసుఁడు. పాండవులు గంధమాదనమున నుండినపుడు వీఁడు బ్రాహ్మణవేషమున వచ్చి వారి వలన నాతిథ్యము నొందుచుండెను. భీముఁడు సౌగంధికహరణమునకై వెడలఁగ నదే సమయమని యీ రాక్షసుఁడు ధర్మరాజును, ద్రౌపదిని మోసికొని గగనమార్గమున నెగసిపోవుచు వారిని బెదరింపఁజొచ్చెను. ఇంతలో భీముఁడు వచ్చి వీనిని సంహరించి ధర్మజుని, ద్రౌపదిని దీసికొని వెళ్ళెను. జటాసురుని కుమారుఁడు శంపకుఁడు. భార.

జటిలుఁడు:- ఒక ఋషి. ఇతని కుమారిత తన తపఃప్రభావమున నేడ్వురుఋషుల కొక్కతియే భార్య యయ్యెను. భార.

జనకుఁడు:- నిమియొక్క దక్షిణభుజము మథింపఁగ జనకుఁడు జన్మించెను. వసిష్ఠునిశాపముచే నిమి

దేహమును విడిచెను (చూడు నిమి). భూమికి రాజు లేఁడుగావున మునులు నిమియొక్క దక్షిణ భుజమును మథించఁగ ఒకకుమారుఁడు కలిగెను. అతనికి జనకుఁడని పేరుపెట్టిరి. ఇతఁడు విదేహజుఁడు గావున వైదేహుఁ డనియును, మథనజాతుఁడు గావున మిథుఁడనియును పేరులుండెను. ఇతఁడు నిర్మించిన పట్టణము మిథిల. జనకుని కుమారుఁడు ఉదావసుఁడు. భాగ.

జనకుఁడు:- ఒకప్పుడు గృహమును విడిచి భిక్షావృత్తిఁ బోవఁదలఁచెను. అప్పు డతని భార్య, ఇది నీ కుచితము కాదు. భిక్షాటనమునకుఁ బయి చేయి చూపువాఁ డధికుఁడా? వానికి బెట్టువాఁడధికుఁడా? త్రైవిద్యులైన మహాత్ములు నీవలన బ్రతుకఁదలఁపఁగ నీవందఱను విడిచి నిష్క్రియత నుండుట దగునా? అని బోధించెను.

ఒకప్పుడు బంధువియోగముచే దుఃఖితుఁడై గృహమును వెడలఁదలఁచెను. అప్పుడు అశ్మకు బ్రాహ్మణుఁడు రాగా వానిని సత్కరించి ఏ తలంపు మదిలోనుండిన నరుఁడు సుఖదుఃఖములచే జలింపఁ? డని యడిగెను. "సర్వముకాలాధీన" మని తలఁచువానికి "ధనము గల్గిన సుఖము గాని నదిపోయిన దుఃఖముగాని కలుగ" దని చెప్పెను. భార.

జనకుఁడు:- సీరధ్వజుఁడు. మిథిలయొక్క రాజు. హ్రస్వరోముని కుమారుఁడు. కుశధ్వజుఁ డితని సోదరుఁడు. జనకునిభార్య రత్నమాల. సంతానమును గోరి పుత్రేష్టి చేయుటకై జనకుఁడు భూమిని దున్నించుచుండఁగ నాగటి చాలునందు నొక బంగారపుఁ బెట్టెయు నందొక కన్యకామణియు దొరకెను. ఈ బాలికను దీసికొని యతఁడు గారాబముతోఁ బెంచెను. నాగటిచాలునందు దొరకుటచే నా బాలకు సీత యని పేరుపెట్టిరి. సీత మిక్కిలి సౌందర్యవంతురాలు. ఈమెను దన కిమ్మని తో యుద్ధము చేసి కొనిపోయెదనని సాంకాశ్యపురీశపు రాజైన సుధన్వుఁడు వచ్చెను. జనకుఁడు వానితో యుద్ధముచేసి, వానిని సంహరించి, వాని రాజ్యమును దన తమ్ముఁడైన కుశధ్వజున కిచ్చెను.

సీతకుఁ బెండ్లియీడు రాఁగాఁ దనయింట నున్న శివుని చాపము నెక్కుపెట్టినవానికిఁ దన కూఁతు నిచ్చెద నని జనకుఁడు ప్రకటించెను. రాజపుత్రులు పలువురు వచ్చి యత్నించిరి. కాని వారి కది సాధ్యము కాకపోయెను. విశ్వామిత్రుఁడు తీసికొనివచ్చిన దశరథరాముఁడు చాపమును విరిచెను. జనకుఁడు మిక్కిలి సంతోషము నొంది దశరథునకుఁ దెలియఁబఱచి వానిని రావించి రామునకు సీతనిచ్చి వివాహముచేసెను. మఱియు నితని తమ్ముని కూఁతులను రాముని తమ్ములకిచ్చి వివాహము చేసెను. ఇతఁడు జ్ఞానసంపన్నుఁడు. గృహస్థాశ్రమములో నుండి స్వర్గమును బొందినవాఁడు. ఇతనికడ కనేక బ్రాహ్మణులు వచ్చి ధర్మవిచారణ చేయుచుందురు.

ఒకనాఁడు శ్వేతకేతువు, అరుణేయుఁడు, యాజ్ఞవల్క్యుఁడు, సోమశుష్ముఁడు మొదలగువారు జనకునిఁ జూడవచ్చిరి. మీ రెట్లు అగ్నిహోత్రము చేయుదురని? జనకుఁడు వారినడిగెను. వారిలో యాజ్ఞవల్క్యుఁడు చెప్పినదే సరియైన విధానమని వానికి జనకుఁడు నూఱువందల గోవుల నిచ్చెను. తక్కిన బ్రాహ్మణులకు వీనిపైఁ గోపమువచ్చి వీని నెట్టులైన గెలువవలెననుకొనిరి. కాని బ్రాహ్మణులు రాజన్యుని గెలుచుటవలన విశేషము లేదనుకొని వెడలిపోయిరి. జనకుఁడు రథము నెక్కి వెడలెను. వాని వెంబడి యాజ్ఞవల్క్యుఁ డేగెను. ఇతనికి జనకుఁ డగ్నిహోత్రమును గుఱించి తన యభిప్రాయమును జెప్పెను. యాజ్ఞవల్క్యుఁడు విని సంతోషించి జనకుని మెచ్చుకొని బ్రాహ్మణత్వము పొందుమని వర మిచ్చెను. శ. బ్రా.

జనమేజయుఁడు:- కౌసల్యాపూరుల పుత్రుఁడు. ఇతఁ డశ్వమేధత్రయంబుచేసి ప్రఖ్యాతినొందెను. ఇతని భార్య అనంత. ప్రాచీన్వం డితని కుమారుఁడు. భార.

జనమేజయుఁడు:- సుమతి కుమారుఁడు. భాగ.

జనమేజయుఁడు:- పరీక్షిత్తుకుమారుఁడు. ఇతని ధర్మపత్ని వపుష్ట. చంద్రాపీడుఁడు, సూర్యా

పీఠుఁడు, శతానీకుఁడు, శంకుఁడు, కర్ణుఁడు ఇతనిసహోదరులు. వైశంపాయనుఁడితనికి భారత కథ వినిపించెను. శ్రుతసేనుఁడు, భీమసేనుఁడు, ఉగ్రసేనుఁడు ఇతని తమ్ములు. ఇతఁడు సత్త్రయాగము చేయుచుండఁగా సారమేయము రాఁగా వీరు కొట్టిరి. సరమ విచారించుచు వచ్చి అయ్యా! నీతమ్ములు మంచి చెడ్డలాలోచించక దుర్బలుఁడగు నాకుమారునిఁగొట్టిరి. పేదవారల కష్టపెట్టెడి దుర్వినీతులకు దుర్నిమిత్తములగుఁగదా అని చెప్పి అదృశ్యమయ్యెను. ఈ సరమవచ ప్రతీకారార్థము శాంతిక్రియలు గావించుటకు సోమశ్రవసుఁ బురోహితునిగాఁ దెచ్చుకొని తత్కర్మలు నిర్వహించెను.

ఇతఁడు తనతండ్రి మరణకారణము తక్షకుఁడని యెఱింగెను. దానితో సర్పములపై నితనికిఁ గోపమువచ్చెను. దానికిఁ దోడు ఉదంకుఁడును "సర్పములు తనకపకారము చేసి యుండుటచే" జనమేజయునకు సర్పయాగబుద్ధి కలుగఁజేసిరి. ఇతఁడుసర్పయాగముప్రారంభించె. సర్పములు వచ్చి హోమకుండమునఁ బడి మాడుచుండెను. సర్పలోకమునఁ దొట్రుపాటు, భయము కలిగెను. కొంద ఱురగులు జరత్కారువు కడకేగి ప్రార్థించిరి. ఆమె "తనసుతుని ఆస్తీకుని జనమేజయునొద్దకుఁబోయి సర్పయాగ మాతని చే మాన్పించు"మని చెప్పిపంపెను. ఆస్తీకుఁడు జనమేజయునొద్దకు వచ్చి తన విద్యానైపుణ్యమునుజూపి జనమేజయునిచేత మెప్పువడసెను. సర్పములను హింసించుటమంచిదికాదని యితఁడు జనమేజయునకు బోధించెను. జనమేజయుఁడంత సర్పయాగము మానెను. భార.

జనార్దనుఁడు:- మిత్త్రసహుఁడను బ్రాహ్మణుని పుత్త్రుఁడు. హంసడిభకులు పుట్టినప్పుడే యతఁడును బుట్టెను. ఇతఁడు వారితోఁ గలసి యుండువాఁడు. కాని వారివలెఁ గాక విష్ణుభక్తుఁడు. హంసడిభకులు తండ్రిని రాజసూయయాగము చేయుమని ప్రోత్సహింపఁగ నితఁడు దానిఁజేయలేమనియును, మానుడనియును బోధించెను. వీని మాట వినక హంసుఁడు వీనినికృష్ణునొద్దకుఁబంపి రాజసూయమునకై లవణంబుకప్పంబుగాఁదెమ్మని చెప్పుమనియె. జనార్దనుఁడేగి కృష్ణునితోఁ జెప్పి మరలివచ్చి కృష్ణాదులు యుద్ధసన్నద్ధులై వచ్చెదరని తెల్పి యాతని బొగడెను. కృష్ణుఁ బొగడుటచే హంసడిభకులకుఁ గోపమువచ్చి వీనిని నగరమునుండి వెడలఁగొట్టిరి. ఉ. హ.

జబాల:- ఒక బ్రాహ్మణుని భార్య. సత్యకాముని తల్లి. సత్యకాముఁడు గురువునొద్ద విద్యనభ్యసింపఁ బోవుచుఁ దల్లిదగ్గఱకు వచ్చి తన తండ్రి పేరు చెప్పుమని యడిగెను. నేను పడుచుతనమున విచ్చలవిడిగఁ దిరిగితిని. నీ తండ్రి పేరు చెప్పఁ జాలను. నీవు జబాల పుత్త్రుఁడనని చెప్పుమని యామె చెప్పెను.

జమదగ్ని:- ఋచీకుని పుత్త్రుడు. ఇతనితల్లి సత్యవతి. ఇతఁడును, ఇతని మేనమామ యగు విశ్వామిత్త్రుఁడును, ఋచీకుని వరములవలనఁ బుట్టిరి. (చూడు సత్యవతి.) ఇతఁడు రేణుకను వివాహమయ్యెను. ఆమెయందు రుమణ్వంతుఁడు, సుషేణుఁడు, వసువు, విశ్వావసువు, పరశురాముఁడు అను పుత్త్రులు జన్మించిరి.

జలముదెచ్చుటకుఁబోయిన ఇతని భార్యయగు రేణుకయటస్నానము చేయుచుండిన చిత్రరథునిఁ గొంత ప్రేమతోఁజూచుచు నిలుచుండి ఆలస్యముగ నీరు తెచ్చెను. ఈమె ఆలసించిన కారణ మెఱింగి "చిత్రరథుఁడను రాజుతో వ్యభిచరించె నని తన పుత్త్రులతో నామెను వధించి" రండని చెప్పెను. నలువురు పెద్దకుమారులును "మేము మాతృవధచేయము"మనిరి. జమదగ్ని వీరిని శపించెను. రామునితోఁ జెప్పి వధించి రమ్మనెను. పరశురాముఁడు తోడనే వెళ్ళి తల్లినిఁ జంపివచ్చి తండ్రితోఁజెప్పెను. జమదగ్ని కుమారుని ధైర్యసాహసములకును, విధేయతకును మెచ్చుకొని వరమును వేడుకొనుమనియెను. రాముఁడు తల్లిని బ్రతికింపుమనియు, సోదరులను శాపవిముక్తులను జేయుమనియును గోరెను. జమదగ్ని వానికోరిక నెరవేర్చుటకై రేణుకను బ్రతికించెను.

హైహయుఁడను రాజు వేటాడి డస్సి యితని యాశ్రమసమీపమునకు వచ్చి యితఁ డుండుటయెఱిఁగి యితనినిదర్శించెను. రాజును, నితని పరివారమును వచ్చుట నాగి విశ్రమింపు డని కోరెను. పరివారజన మెక్కువగ నుండు టచే వారికందఱకును నాతిథ్యమిచ్చుట మునికి భారముగ నుండునని రాజు తలంచి తన నగరము నకు వెళ్లెదననియెను. కాని సపరివారముగ వచ్చిన ధరణీపతికి నాతిథ్య మిచ్చుట గొప్ప యదృష్ట మని ముని వారి నందఱను ఆపి తన కామధేనువు యొక్క ప్రభావముచే నచ్చట నొక నగరమును నిర్మించి హర్మ్యప్రాసాదము లేర్పరచి యందు రాజునుంచి పరివారమునంతయును షడ్రసోపేత ముగ భోజనము పెట్టించెను. అంత హైహయుఁ డా గోవుప్రభావమున కచ్చెరువడి దానిని దాను పొందగోరి మునికిఁ గావలిసినంత ధనమిచ్చి యా గోవును గొనితెమ్మని మంత్రినిఁ బంపెను. ముని యిచ్చుటకు నిరాకరించెను; మునియనిగౌరవింపక యతని ధేనువును బలాత్కారముగ లాగికొని రమ్మని రాజనియెను. ఆతిథ్యమిచ్చి భోజనము పెట్టినవాని యింటనున్న గోవును అపహరింతురే యని జమదగ్ని యడ్డముగ వచ్చిన నితనిని రాజ భృత్యులు కొట్టిచంపిరి. పరశురాముఁడు మాహిష్మతీపురమున కేగి అర్జునుని సేనలనందఱివారిని, అర్జునుని జంపెను. రాముఁడు తిరిగివచ్చునప్పటికి రేణుక భర్తపైఁబడి యేడ్చుచుండెను. పుత్త్రు లితనిని దహనము చేయుటకు సిద్ధముగనుండిరి. అప్పుడే భృగుమహర్షి వచ్చి జమదగ్నిని బ్రతికించెను. పట్టపురాజునుజంపుట పాతకమని, కుమారుని తీర్థయాత్రలు సేయుమనియెను. రాముఁడు తండ్రికిసేవసేయు మనకారణముగ క్షత్త్రియుఁడు తండ్రిని జంపెనుగాన నిరువదియొక్క మాఱులు యుద్ధముచేసి వారిని నిర్మూలము చేసెదనని శపథము చేసెను. జమదగ్ని వానిని శాంతచిత్తునిఁ జేయఁజూచెను. కాని రాముఁడు వారలను సంహరింపుమవచ్చెను. ఆకోపమునఁ గార్తవీర్యుఁ డొకఁడు జమదగ్నిని జంపెను. భార.

పరశురాముఁడు అర్జున సుతాదుల నందఱను సంహరించి రాజరక్తంబులను తొమ్మిదిమడుగులు గావించి, ఖండింపఁబడిన తండ్రిశిరమును దెచ్చి మేనున కతికించి యాగముచేసెను. అతనితపస్సు యొక్క బలమున ఆకసమున సప్తర్షి మండలములో నొకఁడై వెలుఁగుచుండును.

కార్తవీర్యుని కుమారుఁడు శూరుఁడనువాఁడు తన తండ్రి మరణమునకు నితఁడే కారణమని యా మునినిఁ జంపెను. బ్రహ్మ.

జమదగ్ని విల్లును, రేణుక యమ్ములపొదిని పుచ్చుకొనిచని యొకచో వినోదార్థముగ నతఁడు బాణము వేయుచుండెను. వేసినబాణములనామె యేఱి తెచ్చుచుండెను. ఒకసారి ఆమె వచ్చుట ఆలస్యమయ్యె. ఏల యింత తడవయ్యెనని యితఁ డడుగ సూర్యుని వేడిమికి నేలకాలినది. నడుచుటకు నాపాదములు కాలుచున్నవి. తలయును మాడుచున్నది. అందుచేతఁ జెట్టునీడను ఆగి వచ్చితినని ఆమెచెప్పెను. జమదగ్నికి సూర్యునిపై గోపమువచ్చి వానిపై నస్త్రప్రయోగము చేయుదుననియె. అంత సూర్యుఁడు బ్రాహ్మణ వేషమునవచ్చి సూర్యునిపై గోపించుట మంచిది కాదు. కోపముడుగుమనియెను. కాని ముని తన పట్టును వీడలేదు. అంతఁదానే సూర్యుఁడగుట తెల్పి చెప్పులను, గొడుగును దన మానసవృత్తిని సృజించి వానికిచ్చి వీనివలన ఆబాధ కలుగదనియెను. వాని దానమును పుణ్యదాయకమనియెను. భార.

జమదగ్ని పితృయజ్ఞార్థము పాలుపితికి కుండలోఁబోసి యుంచెను. వానిని బరీక్షింపఁగోరి క్రోధాధిదైవము వచ్చి పారఁబోసెను. జమదగ్ని యేమియుననక యూరకుండెను. అపుడా దైవము నీవు క్రోధయుఁడవనఁగ విందును. నీవే యూరకుంటివే! యని యతనిని మెచ్చుకొనుచు క్షమింపుమని వేడెను. నీవేమి తప్పుచేసితివి? అట్లు కేఁడ నక్కఱలేదని జమదగ్ని చెప్పెను. ఆ మాటలు పితరులువిని కోపగించి నీవువానినేమియు ననలేదు. నీవు శ్రాద్ధంబునకు సంకల్పించి తద్ద్రవ్యంబైనను మారకుంటివి. కావున విదగ్ధ విప్రసమూహము నొడంబఱచునట్టి యుచితవాక్యము లనునీవెన్నడుపల్కుదువో, మహాధర్మము నెప్పుడు

చేయుదువో అప్పుడు నీ శాపము పోవునని. అతఁడు ధర్మజుఁడుచేసిన యాగము నాక్షేపించెను. అది పశుహింసాత్మక మగుటచే సక్తుప్రస్థుని యాగమునకుఁ దక్కువయ్యె. పాలు పారబోసినను ఊరకుంటివి; ముంగివై పుట్టుమని శపించిరి. ఇతఁడు వారిని ప్రార్థించెను. ధర్మజుఁడు యాగముచేయు చోటికిఁ బోయి దాని నాక్షేపింపఁగ నీకు శాపవిమోచనము కలుగునని చెప్పిరి. ఇతఁడు తరువాతజన్మమున ముంగి యయ్యెను.

(చూడు సక్తుప్రస్థుఁడు) భార.

జయ:- అర్ష్టిషేణుఁడను రాజుయొక్క భార్య. ఈమెకుమారుఁడు భరుఁడు. భర్త గంగాతీరమున యాగము చేయుచున్నపుడు మిథు వను రాక్షసుఁడువచ్చి యీమెను,భర్తను, ఋత్విజునిగూడ రసాతలమున కెత్తుకొనిపోయెను. ఋత్విజుని కుమారుఁడైన దేవాపియనువాఁడు వీరిని బైటకుఁ దీసికొనివచ్చెను. బ్రహ్మ.

జయ:- పుష్పదంతుఁడను విద్యాధరుని భార్య. పార్వతికి రహస్యముగ శివుఁడు చెప్పిన కథను పుష్పదంతుఁడు చాటుననుండి విని యీమెకుఁ జెప్పెను. విని యూరకుండక యా కథనే యీమె పార్వతికిఁ జెప్పెను. అందువలననే పార్వతి పుష్పదంతుని శపించుట తటస్థించెను. క. సా.

జయంతి:- ఇంద్రుని కూఁతురు. శుక్రుఁడు ఘోర తపస్సును జేయుచుండఁగ వాని తపోభంగమును జేయుటకై యింద్రుఁ డీమెను బంపెను. కాని శుక్రుఁడు తపస్సుముగిసి బ్రహ్మవలన వరమును బుచ్చుకొనిన పిమ్మటనే యీమెను జూచి యీమెతో భోగము అనుభవించెను. ఈమె యందే దేవయాని జన్మించెను. మత్స్య.

జయంతి:- ఋషభుని భార్య. భరతుఁడు, కుశావర్తుఁడు, ఇలావర్తుఁడు, ఆర్యావర్తుఁడు, బ్రహ్మవర్తుఁడు మొదలగువారీమె కుమారులు. భాగ

జయంతి:- నక్తుని కుమారుఁడైన గయుని భార్య. చిత్రరథుఁడు, స్వాతి, అవరోధుఁడు ఈమె కుమారులు.

జయంతుఁడు.- ఇంద్రుని పుత్రుఁడు. ఇతనితల్లి శచీదేవి. జయంతుఁడు రూపసౌందర్యములు కల వాఁడు. ఇతఁ డేయుద్ధమందును శత్రువుతోడను బోరినట్లులేదు. సోమకాంతుఁడను దానవునితో యుద్ధముచేసి రమ్మని బ్రహ్మ వానిఁ గోరఁగ శచీదేవి వీనిని యుద్ధమునకుఁ బంపనియ్యె. కవ్య.

జయంతుఁడు:- విశ్వామిత్రుని నూర్గురు పుత్రులలో మొదటి ఏబదిలోనివాఁడు. శునశ్శేపుని అన్నగా గ్రహించుటకు నిరాకరించి తండ్రిచే శపింపఁబడియె.

జయంతుఁడు:- విరాట నగరమున నున్నపుడు భీముఁడు పెట్టుకొనిన సాంకేతిక నామము. భార.

జయత్సేనుఁడు:- రాజాధిదేవి భర్త. ఇతనికుమారులు విందాను విందులు. భాగ.

జయత్సేనుఁడు:- సార్వభౌముని పుత్రుఁడు. ఇతని భార్య సుశ్రవస వీనికుమారుఁడు అవాచీనుఁడు. భాగ.

జయత్సేనుఁడు:- అజ్ఞాతవాసము చేయుచున్నపుడు నకులుఁడు పెట్టుకొనిన సాంకేతిక నామము. భార.

జయద్బలుఁడు:- అజ్ఞాతవాసము చేయుచున్న సహదేవుఁడు పెట్టుకొనిన సాంకేతిక నామము. భార.

జయద్రథుఁడు:- యశోదా బృహన్మనసుల పుత్రుఁడు.

జయద్రథుఁడు: సింధు దేశాధిపతియైన వృద్ధక్షత్రుని కుమారుఁడు. ఇతఁడే సౌవీరాధిపతి. ఇతఁడే సైంధవుఁడను పేరునఁ బరగువాఁడు. (చూడుము సైంధవుఁడు) ఇతఁను ధృతరాష్ట్రుని కుమార్తెయగు దుస్సలను వివాహమయ్యెను.

జయధ్వజుఁడు:- కార్తవీర్యార్జునుని పుత్రుఁడు. ఇతఁడు పరశురామునకు భయపడి దాగియుండెను. ఇతనిపుత్రుడు తాలజంఘుఁడు.

జయాదిదేవులు:- సృష్టిచేయుటకై వీరిని బ్రహ్మ ముఖమునుండి సృజించి వివాహితులై సంతానములను బడయుడని యానతిచ్చెను. వీరది మోక్షసాధకము కాదని జన్మరాహిత్యము కోరి వివాహముకాకుండిరి. తనయాజ్ఞ మీఱిరని బ్రహ్మ కోపించి యేడుజన్మ లెత్తుడని వీరిని శపించెను. వీరపుడు బ్రహ్మను బ్రార్థించిరి. ఏడువత్సరము లైనపిదప ముక్తిని పొందుదురని యనుగ్రహించెను. బ్రహ్మ.

జయుడు:- విశ్వామిత్రుని పుత్రులలో నొకడు.

జయుడు:- విరాటనగరమున నుండినపుడు ధర్మరాజు పెట్టుకొనిన సాంకేతిక నామము. భార.

జయుడు:- విష్ణువుయొక్క ద్వారపాలకుడు. ఇతని సోదరుడు విజయుడు. సనకసనందనాదులు విష్ణుమూర్తిని జూచుటకై వచ్చినపుడు వీరు ద్వారముకడనుండి యిది సమయము కాదు; కొంతసేపు ఆగుడని వారిని విష్ణుదర్శనము చేయనిచ్చిరి కారు. విష్ణుమూర్తిదర్శనమునకు వచ్చిన మమ్మ మీరడ్డగింతురా? మీరు రాక్షసులుగ బుట్టుడని మునులు వారిని శపించిరి. విష్ణుమూర్తి యది యెఱింగి సనకాదులకు దర్శనమిచ్చి జయ విజయులను రావించి వారిని భయపడవలదనియు, సనకాదుల వాక్యమమోఘముకావున నది తప్పదనియు, గాని తుదకు వారు తనతో నైక్యమొందుదురనియు జెప్పెను. వీరే హిరణ్యాక్ష హిరణ్యకశిపులు, రావణ కుంభకర్ణులు, శిశుపాల దంతవక్త్రులుగ బుట్టి. తుదకు విష్ణుమూర్తితో నైక్యమొందిరి. భాగ.

జయుడు:- విరాధుని తండ్రి. ఇతని భార్య శతహ్రద. రామా.

జర:- ఒకరాక్షసి బృహద్రథుని భవనముచెంగట దిరుగులాడుచు, వీధిలో బారవేయబడి యాతని భార్యలకు బుట్టిన యసమాపక శిశువులను భక్షించు నుద్దేశముతో దీసికొనెను. కాని యామె వీరి నెత్తుకొనగనే యా రెండుశరీరములు గలసి యొక్క శిశువుగ నేర్పడి యేడువ సాగెను. ఆమెకు మాయుటయు గష్టమయ్యెను. ఈ యేడ్పువిని కొందఱు స్త్రీలు వచ్చి శిశువును దీసికొనిరి. ఆమె మనుష్యస్త్రీ రూపము ధరించి యా శిశువును గొంపోయి రాజునకిచ్చి తన వృత్తాంతమును, శిశువుచరితమును జెప్పెను. రాజామెకు గడుపునిండ భోజనము పెట్టించి యామెవలన శిశువేర్పడెను గాన జరాసంధుడని శిశువునకు పేరుపెట్టెను. జర పేరున నేటేట నుత్సవములు చేయించుచుండును. భార.

జరంధర:- భీముని (పాండవుల) భార్య. వీరికి బుట్టిన కుమారుడు సర్వగుడు (నామము జలంధర.) భార.

జరత్కారుడు:- ఒక బ్రాహ్మణుడు. బ్రహ్మచర్య పరిపాలకుండై వివాహమునొల్లక సదా తపస్సు చేసికొనుచుండువాడు. ఒకనాడు చెట్టు నాటుకొని తలక్రిందుగ వ్రేలాడు విప్రులను జూచి వారినిజేరి అయ్యా! మీరలెవరు? ఇట్టి తపము నాకు జెప్పుడనిన, మేము జరత్కారుని పితామహులము. అతడు సంతానహీనుడై యుండుటచే మాకు ముందుగతులు లేక యధోగతులను కాబోవుచున్నాము అని దీనముగ బలుక మనస్సుకరిగి జరత్కారుడు సంతానము బడయగోరి తన పేరుగల్గిన బాలనే భార్యగ బడయదలచి యట్టికన్యకకై వెదకుచుండెను. ఇతని పుత్రుడు జనమేజయుని సర్పయాగము మాన్పగలడని యెఱిగి వాసుకి తన చెలియలగు జరత్కారువును నీతనికిచ్చి వివాహము చేసెను. ఒకనాడితడు నిద్దుర పోవుచుండగ లేపినందున భార్యపై గోపించి యామెను విడచి తపస్సు చేసికొనుటకై యడవులకరిగె. ఆస్తీకుడితని కుమారుడు. స్కాంద.

జరత్కారువు:- వాసుకి చెలియలు. ఈమెను భార్యగ నైకొమ్మని జరత్కారునకు వాసుకి యిచ్చెను. ఒకనాడు భర్త నిద్దురనుండి లేవనందున సంధ్యాసమయము దాటిపోవుచున్నదని యీమె భర్తను లేపెను. నిద్రాభంగమును గావించి తన నవమానపఱచెనని భర్తకు గోపము వచ్చి యీమెను విడచి వెడలిపోయెను. ఈమెకుమారుడు ఆస్తీకుడు ఈమె జనమేజయునొద్దకు సర్పయాగము మానుమని చెప్పుటకు గుమారునిబంపెను. భార.

జరాసంధుఁడు: మగధదేశపురాజు. బృహద్రథుని కుమారుఁడు. బృహద్రథుఁడు పెద్దకాలము సంతానములేక వ్రతములు సల్పుచుఁ గాన నములో నొకమామిడిచెట్టుక్రింద కూర్చుండి తపస్సు చేసికొనుచున్న చండకౌశికుఁడను మునిని జేరి నమస్కరించి తనకు సంతానము కలుగునట్లనుగ్రహింపుమని వేఁడెను. అపుడు చెట్టునుండి రాలిన ఫలమును ముని మంత్రించి బృహద్రథున కిచ్చెను. అతని కిరువురు భార్య లుండుటచే నా ఫలమును రెండుముక్కలుగఁ జేసి యతఁడు ఇద్దరు భార్యలకు నిచ్చెను. వా రా చూతఫల ఖండములను భుజించి గర్భవతులైరి ఇద్దఱకును శిశువులు పుట్టిరి. కాని యొక్కశిశువునే మధ్యకుచీల్చి యిద్దఱు చెరియొక భాగమును గనినట్లు ఒక్కొక్క శిశువునకు ఒక్కకన్ను, ఒక్కకాలు, ఒక్కచెయ్యి, సగము కడుపు, సగము తల - ఇట్లుండెను. వీరిని జూచి భయపడి యిట్టి వికృతరూపులను భర్తకెట్లు చూపుటని వారు శిశువులను వీధిలోఁ బార వేయించిరి. ఆ దగ్గఱనే తిరుగులాడుచున్న రాక్షసి జరయనునది తన కాహారము లభి యించెనని సంతోషముతోఁ బరుగిడివచ్చి యిద్దఱు శిశువులను నెత్తుకొని చనుచుండెను. వారిద్దఱును దగ్గఱఁగ దీసికొని రాఁబడఁగనే వారి శరీరములు కలుసుకొని దృఢమైన శరీర మేర్పడియె; ఈ బాలుఁడు ఏడువసాగెను. ఈ బాలుని భారము రాక్షసి వహింపను లేక యుండెను. వీరియేడ్పువిని ముసలిస్త్రీలు వచ్చి బాలునిజూచి యెత్తుకొని రాజున కప్పగించిరి. ఇఁక జర వాని నాహారముగఁ జేసికొనుటకు భయపడి, మనుష్య స్త్రీరూప ధారిణియై యాబాలునిదెచ్చి రాజునకిచ్చి, తాను రాక్షసి యగుటయు, నాహారార్థ మా వికృతశిశువులను గైకొనుటయు, సామాన్యబాలుఁ డేర్పడుటయు రాజున కప్పగించెను. జర యను రాక్షసిచేత సంధింపఁబడి యీ బాలుఁ డేర్పడెను గాన జరాసంధుఁడని యీ బాలునికిఁ బేరుపెట్టిరి.

ఇతనిని రాజుచేసి తండ్రి తపస్సున కరిగెను. గిరివ్రజపుర మితని రాజధాని. దాని చుట్టును గోరథము, ఋషభము, వైహారము మొదలగు పర్వతములు పెట్టని గోడలై యుండుటచే నగరము వైరులకుఁ జొరశక్యము కాకయుండును. మఱియు చైత్రకగిరి శృంగమున భేరులు "పరులు నగరము ప్రవేశించిరేని మ్రోగించకయే తమంతట మ్రోగును." కావున జరాసంధుఁడు శత్రుభీక రుఁడై యెవ్వారికిని నజేయుండై యుండెను. ఆయుధములతో మరణింప కుండునట్లు నితనికి వరముకలదు. హంసడిభకులు మిత్రులై సేనా సమన్వితులై కొల్చుచుండిరి. ఇతఁ డవనిపతులను జెఱపట్టి తన నగరమున బంధించి భైరవపూజ చేయుచు నొక్కొకని నే బలి యిచ్చుచుండును. పురుజితుఁడు, కరూశుఁడు, యవనుఁడు మొదలగువా రితని మిత్రులు. కంసుఁ డితని యల్లుఁడు. ఇతని కుమార్తెలగు అస్తి, ప్రాప్తులను కంసునకిచ్చి వివాహము చేసెను. కృష్ణుఁడు కంసుని వధించి నప్పటినుండి కృష్ణునితో శత్రుత్వముఁ బూని యితఁడు మథురపై ననేక సారులు దాడి వెడలెను. కృష్ణుఁ డీతనికి వెఱచి దాగి యుండుచుండువాఁడు.

పదునేడు సారులు కృష్ణునిచే నోటువడి పదునెనిమిదవసారి కృష్ణు నోడించెను.

జరాసంధునిచే బంధింపఁబడియున్న నృపులు తమ్ము నెట్టులేని విడిపింపుమని శ్రీకృష్ణునికడకు సందేశము పంపికొనిరి. ఆ సమయముననే నారదుఁడు శ్రీకృష్ణునికడకువచ్చి ధర్మజుఁడు రాజసూయయాగము చేయఁ దలపెట్టినాఁడు. నీవుకాక ఎవరు సహాయము చేయఁగలరు? అని చెప్పెను.

అదియే సమయమనియును, జరాసంధునకు బ్రాహ్మణులందు భక్తికలదు. వారు కోరిన దాని నతఁ డిచ్చుచుండును; కావున బ్రాహ్మణ వేషమునఁబోయి వానితో సంగ్రామభిక్షను గోరవలయుననియు నుద్ధవుఁడు చెప్పెను. "ధర్మజుని యాగార్థము తూర్పు దిగ్విజయ మునకై భీముని్బంపెను. కాని జరాసంధుఁడు ధర్మజుని యాగాశ్వమును అరికట్టలేను" అని యితఁడు తిరిగివచ్చెను. అతనితోఁ బోయి పలుపకయే వెళ్ళినవారు తిరిగివచ్చిరి. "అప్పుడు శ్రీకృష్ణుఁడు నుద్ధవుఁడు చెప్పిన యాలోచన చొప్పునఁ" దానును, భీమార్జునులును బ్రాహ్మణ వేషమున వానికడ కేగెను. భాగ

ధర్మరాజు రాజసూయము ప్రారంభించినపుడు కృష్ణార్జున భీములు జరాసంధుని సంహరించుటకై

గిరివ్రజపురము వచ్చి సింహద్వారమునఁ గాక అన్యమార్గమున బ్రాహ్మణులకు సుప్రవేశమగు మార్గమున రాత్రియందుఁ గోట ప్రవేశించుచుండిరి ఆ వచ్చువారిని జరాసంధుఁడు చూచి బ్రాహ్మణులని తలఁచి యెదురేగి సత్కరించి మధుపర్కము లీయఁబోయెను. వారవి తిరస్కరించిరి. మీరెవరు ? నేఁ జేయు సత్కారము నేల తిరస్కరించెదరు ? అని జరాసంధుఁ డడుగఁగ "మేము బ్రాహ్మణులము కాము. క్షత్త్రియులము. మిత్త్రభావమున నిటకు రాలేదు. మాకుఁ బని వేఱొకటి కలదు" అని ప్రత్యుత్తర మిచ్చిరి. అయ్యా! మన మొండొరుల నెఱుఁగమే? నేను దైవబ్రాహ్మణ భక్తిగలవాఁడను. ఎవ్వరియెడ నధర్మము చేసినవాఁడనుగాను. మీకును నాకును వైర మెట్లు కలుగనేర్చు ? అని జరాసంధుఁడు మరలప్రశ్నించెను. నీవు రాజులను బంధించి బలియిచ్చుచుంటివి. అది యధర్మము. కావున నిన్ను సంహరింప వచ్చితిమి. నేనేకృష్ణుఁడను అని కృష్ణుఁడు పలికెను. క్షత్త్రియులు పరులను సంహరించుట యధర్మమగునా ? అయినను మీరు నాతోఁ బోరవచ్చితిరి కాన వల్లెకాదందు. మీ కేమి యస్త్రములు కావలయును ? మీరు ముగ్గురును గలిసియే నాతోఁ బోరుచో రండు అని జరాసంధుఁడు సన్నద్ధుఁడయ్యెను. నీతో మల్లయుద్ధంబునకు మాలో నొక్కని నేరికొమ్మని వారనిరి. జరాసంధుఁడు ముందుగాఁ దన కుమారుని సింహాసనారూఢునిఁ జేసి వచ్చి తనతో మల్లయుద్ధమునకు భీమునిఁ బిలచి వానితోఁ బదునాల్గు దినములు పోరాడి తుదకు భీముని చేతిలో మడిసెను.

జరాసంధుఁడు:- పూర్వభవమున విప్రచిత్తి యను రాక్షసుఁడు. భార. భాగ.

జరాసంధుఁడు:- గాంధారీధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

జరిత:- ఒక పక్షి. మందపాలుఁడను ముని సంతానము కొఱకుఁ బక్షియై దీనితో రమించెను. ద్రోణుఁడు మొదలగు సుతులు గల్గిరి. (చూడు జరితారి.)

జరితారి:- జరిత యను లావుకపిట్ట పెంటియందు మందపాలుఁ డనువానికిఁ బుట్టిన కుమారుఁడు. ఇతని సోదరులు సారిసృక్కుఁడు, స్తంబమిత్త్రుఁడు, ద్రోణుఁడు. వీరలు బ్రహ్మవిదులు. వీరు జన్మించినపిదప ఈ పుత్త్రికులను, జరితను ఖాండవవనమునఁ బెట్టి మందపాలుఁ డరిగెను. ఇది దహింపఁబడుట చూచి జరిత మిక్కిలి దుఃఖించి. రెక్కలురాని వీరిని వేఱొకచోటునకుఁ దీసికొనఁ బోలేక వగచుచు, అగ్నిని దప్పించుకొనుటకొక బిలమును జొరఁబడుడని వీరికిఁ జెప్పెను. "కలుగులోఁ బ్రవేశించినచో నెలుక తప్పక మమ్ము భక్షించును. ఇచ్చటనే యుండిన నొకవేళ గాలికి అగ్ని యటుపోవచ్చును. కావున నిచ్చటనే యుండెదము. మాపై మోహము విడువుము. నీ వింకొకచోటికిఁబొమ్ము నీవు జీవించి పుత్త్రులను బడయవచ్చు"నని చెప్పిరి.

అగ్ని చుట్టుకొని వచ్చుచుండఁగ నీసోదరులు నలుగురును నాలుగు వేదముల మంత్రములు పఠించి మా కభయమిమ్మని ప్రార్థించిరి. వీరున్న వృక్షము కాలకుండ మిగిలెను.

అప్పుడు తల్లివచ్చి చూచి సంతోషించెను. మందపాలుఁడును వచ్చి చూచెను. భార.

జలంధర:- భీముని భార్య. ఈమెయందు సర్వగుఁడు అను పుత్త్రుఁడు కలిగెను. భార.

జలంధరుఁడు:- ఒక రాక్షసరాజు. మన్మథుని భస్మముచేయఁగ మిగిలిన శివుని నేత్రాగ్ని సముద్రములోఁ బడెను. అపుడు పెద్దరోదనధ్వని వినఁబడెను. ఆ ధ్వనికి లోకములు గజగజ వణఁకెను. దేవతలందఱు బ్రహ్మకడకుఁబరుగెత్తిరి. వీరిని వెంటఁబెట్టుకొని బ్రహ్మ యాధ్వనిసంగతి కనుగొనుటకై సముద్రునికడకువచ్చి యీశబ్దమునకుఁ గారణమేమనియడిగెను. సముద్రుఁడు తన కుమారునిఁ జూపించి వీనికి నామకరణముచేసి జాతకఫలమును జెప్పుమనియె; వానికిజలంధరుఁడని నామకరణము చేసి శివునిచేఁ దప్ప నితరుల వలన భయములేదని బ్రహ్మచెప్పెను. ఇతఁడు పెరిగిన పిమ్మట సముద్రుఁడు కాలనేమికి వర్తమానము పంపెను. కాలనేమి తన పుత్త్రికను బృందనిచ్చి జలంధరునకు వివాహము చేసెను. ఒకనాఁడు జలంధరుఁడు నిండుకొలువుండఁగ

శుక్రుఁడు వచ్చెను. విశేషము లేమని జలంధరుఁడీ రాక్షస గురువును ప్రశ్నించెను. వెనుక దేవతలు సముద్రుని మథించి యమృతమును, మణులను, రత్నములను గైకొనిరి; సముద్రున కొక్కటి యైన నిచ్చిరి కారు. మఱియు నమృతమును త్రాగిన రాహువుతల నఱికిరి అని శుక్రుఁడు చెప్పెను. ఆ మాటలు వినఁగనే జలంధరునకుఁ గోపము వచ్చెను. వెంటనే యింద్రునికడకుఁ దమ సంపదలు తమకిమ్మని చెప్పుటకు ఘస్మరుఁడను దూతను బంపెను. మాతమ్ముఁడు విష్ణుమూర్తి నీవంటి దనుజులననేకులను సంహరించెను. నీవనఁగ నెంత? యని యింద్రుఁడు ప్రత్యుత్తర మిచ్చెను.

జలంధరుఁడు యుద్ధసన్నద్ధుఁ డయ్యెను. దేవతలును సిద్ధపడిరి. వీరు విష్ణుమూర్తిని దీసికొనివచ్చిరి. విష్ణుమూర్తియే జలంధరునితోఁ బోరాడెను. ఎంతగ నెట్లు యుద్ధము చేయుచుండినను జలంధరుఁ డోడుటలేదు. ఇతని శక్తి సాహసములకు మెచ్చుకొని విష్ణుమూర్తి వరము వేఁడుమనెను. నీవు లక్ష్మీసహితుఁడవై వచ్చి మాయింట గాపురముండుమని జలంధరుఁడడిగెను. విష్ణుమూర్తియును, లక్ష్మియును వానిగృహమున కేగిరి. దేవతలపక్షమునఁ బోరాడువారు లేకపోయిరి. వారు నారదునితోఁ జెప్పుకొనిరి మీకు హితవుచేసెదనని నారదుఁడు చెప్పి జలంధరుని కడకువచ్చెను. ఓ జలంధరా! నీసంపద యేమని కొనియాడుదును? నీకు అశ్వరత్నము కలదు. గజరత్నము కలదు సౌధరత్నము కలదు. ఉన్న నేమి? జాయారత్నము లేని హేతువుచే శోభింపకున్నవి. స్త్రీలలో రత్నము పార్వతి. శ్మశానమందుండెను. శివునకుఁ బార్వతియేల? నీ వామె నేల గొనిరావు? అని యడిగెను. ఆ మాట విని యా వెఱ్ఱిజలంధరుఁడు శివునకుఁ బార్వతిని దమకిమ్మని కబురుపంపెను. అందుచే వీనిమీఁదకు శివుడు యుద్ధమునకు వచ్చెను. ఘోరముగ యుద్ధము సాగుచుండెను. అపుడు జలంధరుఁడు మాయచేయఁదలఁచుకొని శివుని రూపము ధరించి కొందఱు దనుజాలను గణపతులుగఁ జేసి వీరిని దీసికొని పార్వతికడకు వెళ్ళిరి. వీరిలోనొకఁడు నీకొఱకు శివుఁడువచ్చియున్నాఁడని పార్వతితోఁ జెప్పెను. కాని వాఁడట్లే స్తంభించిపోయెను. అదిచూచి వాఁడెవఁడో మాయచేయుచున్నాఁడనియెఱింగి పార్వతి యచ్చటనుండి భయపడి పాఱిపోయి విష్ణుమూర్తిని దలఁచుకొనెను. అతఁడు ప్రత్యక్షమై యేమిచేయుమనెదవు? చెప్పుము. శిరసావహించి చేసెద ననియెను. నీవు బృంద పాతివ్రత్యము చెఱుపుము అట్లుకాని జలంధరుఁడు లొంగఁడని పార్వతి చెప్పెను. విష్ణుమూర్తి బృందను వంచన చేసెను. పార్వతిని జలంధరుఁడు మోసపుచ్చఁ జూచెనని శివుఁడు తెలిసికొని ఘోరముగ యుద్ధము చేసెను. ఆయుద్ధమందే జలంధరుని శివుఁడు సంహరించెను.

శివ.

జలపది:- జానపదియొక్క మఱియొక పేరు. (చూడు జానపది.)

భార.

జలసంధుఁడు:- గాంధారీధృతరాష్ట్రుల పుత్త్రుఁడు.

భార.

జలసంధుఁడు:- మగధరాజు. దుర్యోధనుని పక్షంబునఁ బోరెను. సాత్యకి కృతవర్మను విరథునిఁ జేయఁగ నితఁడు సాత్యకి నడ్డగించెను. వీరిఱువురకు యుద్ధమయ్యెను. సాత్యకి వీనిని సంహరించెను.

జలసంధుఁడు:- ఒకరాజు. కౌరవపక్షమునబోరెను. సాత్యకితోఁ బోరి చచ్చెను. భార.

జహ్నువు:- పురూరవుని కుమారుఁడైన విజయుని వంశములోనివాఁడగు ఐజహోత్రుఁడు. భాగ.

జహ్నుఁడు:- ఒకరాజు. ఇతని కుమారుఁడు. అజహ్నుఁడు. వీని వంశములోనివాఁడే విశ్వామిత్రుఁడు.

భార.

జహ్నుఁడు:- ఒక ముని హోత్రకునికుమారుఁడు. యాగము చేసికొనుచుండఁగ భగీరథుని వెనువెంట వచ్చుగంగ యితఁడుయాగము చేసికొను స్థలమును జలముచే ముంచెను. జహ్నువకుఁ గోపమువచ్చి గంగాజలము నంతయును త్రావివేసెను. అంత భగీరథుఁడుగంగను విడువుమని జహ్నునిఁ బ్రార్థించెను. ముని గంగను వదలెను. ఈతనికుమారుఁడు పూరుఁడు.

బ్రహ్మ. భాగ.

జహ్నువు:- కురునికుమారుఁడు. ఇతనికుమారుఁడు సురథుఁడు.

భాగ.

జహ్నువు:- సుధనునివంశము వాఁడు. పుష్పవంతుని కుమారుఁడు.

భాగ.

జా

జాంబవంతుఁడు:- బ్రహ్మ యావులించఁగఁ బుట్టి భల్లూకరాజయ్యెను. ఇతఁడు మిక్కిలి ప్రాజ్ఞుఁడు; బలవంతుఁడు. గరుత్మంతుఁడు జన్మించుటకుఁ బూర్వమే యితఁడు జన్మించెను. దేవతలు అమృతము తెచ్చుట, దేవదానవులయుద్ధము సేయుట యితఁడు చూచెను. భూమ్యాకాశముల ననేక సారులు ప్రదక్షిణము చేసినవాఁడు. బలియజ్ఞము చేయునపు డోషధులు వీని చేతికిచ్చుచుండిరి. అపుడే దేవతలనడిగి కొంచెమమృతము త్రావెను. అందువలన మిక్కిలి జవసత్త్వములుకలిగి చిరకాలము జీవించిన యతివృద్ధు. ఇతఁడు తరుణవయస్సునందు నుదయాద్రినుండి యస్తాద్రికిదాటి యచ్చటనుండి కైలాసమునకేగి వచ్చుచుండెడివాఁడు. కైలాసమున మునులు యజ్ఞముచేయుచుండఁగ నితఁడు వెళ్ళి వారలతో మాట్లాడుచుండెను. అపుడు బలికుమారుఁడు రెండుచేతులతోడ నెత్తి యొక్కపర్వతము వీనిపై విసరెను. దాని నాపుటకై జాంబవంతుఁడు తనమోఁకాలడ్డుపెట్టెను. ఇతనికాలు తగిలి పర్వతము రెండుముక్కలయ్యెను. కాని ఇతనికాలికినిదెబ్బ తగిలెను. అందువలన కొంతజవము తగ్గెను. సీతను జూచివచ్చుటకు లంకనెట్లుదాటుట? యెవరు దాటుదు?రని యాలోచించుకొనునపు డితఁడు నుండెను. తాను తొంబదియోజనములుమాత్రము దాటఁగల ననియెను. సీతను జూచి రాలేనిచో సుగ్రీవుఁడు దండించును; అంతకంటె నిచ్చటనే ప్రాయోపవేశముచేయుట మేలని యంగదుఁడు పలుకఁగ "వాలి కుమారుఁడవు, రాజుకావలసినవాఁడవు, మరణించుటమంచిదికాదు. సముద్రము దాటి రాగలవాఁడు హనుమంతుఁడున్నాఁ" డని చెప్పి వానిని హెచ్చరించి, వాని జన్మవృత్తాంతముఁ గూడఁ జెప్పెను.

కృత త్రేతాయుగములలోనే కాక ద్వాపరయుగమందుఁగూడ నితఁడుండెను. ఇతనికి జాంబవతియను కుమార్తె కలదు. ఇతఁడును, కుమార్తెయును గాననములోనొకగుహలోనుండువారు. ప్రసేనజిత్తునుజంపి శ్యమంతకమణిని దెచ్చుచున్న సింహమును నితఁడు చూచి, దానినిజంపి, మణి తెచ్చి తనకుమార్తె పరుండు ఉయ్యేలకుఁ గట్టెను. ఆ మణిని దీసికొనుటకుఁ గృష్ణుఁడు వచ్చెను. వచ్చినవాఁడు కృష్ణుఁడని యెఱుఁగక యతనితోఁ బెక్కుదినములు ముష్టియుద్ధము చేసెను. పిమ్మట నాతని నెఱింగి తనకుమార్తెను నాతనికిచ్చి వివాహముచేసిమణినిగూడ నిచ్చెను.
రామా. భాగ.

జాంబవతి:- జాంబవంతుని కుమార్తె. శ్యమంతకమణికై వెదకుచు వచ్చి శ్రీకృష్ణుఁ డామణి యూతొట్టెకుఁ గట్టఁబడి యుండుట చూచి దానిని దీసికొనియెను. అప్పుడు జాంబవంతుఁడతనితోఁ గొన్నిరోజులు పోరుసలిపి వచ్చినవాఁడు శ్రీకృష్ణుఁడని తెలిసికొని ఆమణిని ఆమెనుగూడ నాతనికిచ్చెను. శ్రీకృష్ణుఁ డీమెను బరిణయమయ్యెను. ఈమెకుమారుఁడు సాంబుఁడు.

జాజలి:- ఒక ముని. ఇతఁడు తపస్సు చేసికొనుచుండఁగ నితనితలయందుఁ బిచ్చుకలు గూండ్లు పెట్టుకొనెను. అవి గ్రుడ్లు పెట్టెను. అవి పిల్లలై యెగురుచుండఁగ వానికి నే చేటును రాకుండఁ దాను కదలకయుండి, "తాను కదలకయుండి వానికెట్టి యాటంకమును గలుగకుండునట్లు కదలక యుండుట" చూచి "తాను తపస్సిద్ధినందితి ననిగర్వముగఁ" దలఁచెను. పిచ్చుకలకెట్టిచలనము కలుగకుండ వేయితఁడు తపస్సుచేసికొనుటఁజూచి. "యేమి యితని తపోమహిమ? నిశ్చలత్వము!" అని పిచ్చికలు పొగడినవి. ఇతఁడేమి? ఇతనికంటె ఘనుఁడైనవాఁడు తులాధరుఁడువారణాశియందుఁ గలఁడు అని యాకాశవాణి పలికెను. అది విని తులాధరునిఁ జూచుటకు, అతఁ డెట్టివాఁడో తెలిసికొనుటకు వెళ్ళి "పిచ్చుకపిల్లల కపాయము రాకుండఁ గదలక నిల్చితిని. నీ వెంతటివాఁడవు?" అన, వర్తకమునుజేయు నీకెట్లు తెలిసెనని" యడిగెను "నేనునిత్యతృప్తుఁడను, నాకు బంగారము, మన్ను సమానము. దేనినిఁ గోరను. వచ్చినదిపోవలయుననను. ఇట్టిదికావలయుననను" అనెను. యజ్ఞముమాట చెప్పుమని యడిగెను.

ఫలకాంక్షతోఁ జేసిన యజ్ఞమును దేవతలు మెచ్చరనెను. నీవేల ఈకర్మమానవు? అని జాజలి

యడుగఁగ "పనులు చేయుటయందును, అసంగతా నిష్ఠుతికిని నిష్కర్మత్వానందసిద్ధి కలుగును. నీతలయందున్న పక్షులను బిలిచియడుగు" మన, అవి వానిచేతిపై నిలిచి "మేము ధర్మదేవత పనుపఁగ నిన్నరయఁగవచ్చిన భటులము. ఈసు, కలంక, మత్సరము-ఇవిదూషనివి. ఇవి లేనివాఁడు సుఖించు" నని చెప్పెను. మఱియును తులాధరుఁడు బ్రహ్మగీతలు చెప్పెను.

జాతవేదుఁడు:-అగ్ని (చూడుము పురూరవుఁడు.) భాగ.

జాతహారిణి:-ఒకపిల్లి. చాక్షుషువు పుట్టిన యేడవ దినమున వానిని గొనిపోయి విక్రాంతుని భార్య ప్రక్కయందుంచి, ఈమె శిశువును గొనిపోయి మఱియొక చోట నుంచి ఆ మూడవశిశువు నెత్తుకొనిపోయి భక్షించెను. ఇది యిట్లే జీవనము చేయుచుండెను. మార్క.

జాతుకర్ణి:- శాకల్యుని శిష్యులగు వాత్స్యుఁడు, మౌద్గల్యుడు, శాలీయుఁడు, గోముఖుఁడు, శిశిరుఁడు అనువారలు తాముతాము నేర్చిన ఋగ్వేద సంహితయొక్క భాగము లితని కుపదేశించిరి.

ఇతఁడు బలాకుఁడు, పైంగుఁడు, వైతాళుఁడు, విరజుఁడు అనువారల కుపదేశించెను. భాగ.

జానపది:-ఒకసుందరాంగి. శరద్వంతుఁడు తపస్సు చేసికొనుచుండఁగ వాని తపోభంగము కావించుట కీరూపవతి పంపఁబడెను. ఈమెను జూచుట తోడనే మునికి రేతఃపతనమయ్యెను. భార.

జానశ్రుతి:-జనశ్రుతి యను రాజుయొక్క కుమారుఁడు. పలుదానములు చేసినవాఁడు. బ్రాహ్మణభక్తుఁడు. కాని పరమేశ్వరు నెఱుంగఁగోరిన వాఁడు. సత్కార్యములయందుమాత్ర మాసక్తి యున్నది. వీనికి మేలుచేయవలయునని తలంచి గ్రీష్మఋతువులో నితఁడు మేడపై శయనించియుండఁగ నితనివలనఁ బోషింపఁబడిన ఋషులతని ననుగ్రహించుటకై రాజహంసలై వానిని సమీపించిరి. ఆహంసలలోఁ జివరనున్నది ముందఱ నున్నదానితో, "ఓభల్లాక్ష! భద్రము. ఈరాజు తేజస్సు స్వర్గమువఱకు వ్యాపించియున్నది; నీవందులోఁబడి పోవకుము. దగ్ధవై పోయెద" వనెను. అంత నాపక్షి "ఏమిచిత్రము? ధర్మమాత్రపరుఁడై దానములు మాత్రము చేసిన వానిలో నేమి మాహాత్మ్యము కలదు? రైక్వుని గూర్చి పొగడినట్లే పొగడుచుంటివి" అనియెను. ఆ మాటలు రాజు విని మఱునాఁడు తన సేవకుని బిలిచి బండిచక్రముక్రిందఁ దపస్సుచేసికొను రైక్వుని నెఱుఁగుదువా? యని యడిగెను. వీఁడెఱుఁగక పోవుటచే రాజు ఆనవాలు చెప్పెను. సేవకుఁడు వెళ్ళి చూచి నీవా రైక్వుఁడవని యడిగెను. అగునని రైక్వఋషి ప్రత్యుత్తర మిచ్చెను.

ఇతనితోడి సంభాషణవలన నితఁడు గృహస్థాశ్రమము ప్రవేశింపఁగోరి ధనము నపేక్షించియుండుట యెఱిఁగి జానశ్రుతితో నట్లు చెప్పెను. ఈరాజు మునికై యాఱునందల గోవులను, కంఠాభరణములను, రథములను గొనితెచ్చెను. కాని, వీనిని జూచి ముని ఓశూద్రా! యని రాజును సంబోధించి, నీయీధనమును నీవే గొనిపొమ్మని చెప్పెను. అంతట రాజు వేయి గోవులను, దన కుమారితను, ధనమును దెచ్చి యిచ్చెను. అతఁ డెఱిఁగిన విద్య బోధింపుమని కోరెను. రైక్వుఁడామెను, ఆధనమును పరిగ్రహించెను. ఆ వస్తువుల నిచ్చినవాఁడు విద్యను గ్రహింపఁ దగినవాఁడని జానశ్రుతికి బ్రహ్మజ్ఞానము తెల్పెను.

జాబాలి:-ఒకముని వనవాసముచేయుచున్న రాముని యొద్దకు భరతుఁడు వచ్చి రాముని, నయోధ్యకు వచ్చి రాజ్య మేలుమనుటయును, రాముఁడు రాననుటయును విని జాబాలి రామునితో నిట్లనియె. అయ్యా! వెఱ్ఱివై రాజ్య మేలపోఁగొట్టుకొనెదవు? ఎక్కడి తండ్రిమాట? ఎక్కడి రాజ్యము? వానిమాటలు వినినయెడల నీకుఁ గలుగు లాభమేమి? అనెను. ఆవిధముగ నాస్తిక వాక్యములనుజెప్పుటచే రాముఁడతనితో వాదించి సత్య మవశ్య మాదరణీయమనియుఁ, గర్మ యావశ్యకం బనియు నతనిచేత నొప్పించెను. నేను నాస్తికుఁడను గాను. పెద్ద యుపద్రవము కలుగనున్నపుడు దానిని దప్పించుటకు ఆ ధర్మము వెనుకఁబెట్టవచ్చునని, నీతో మాత్ర మట్లు వాదించితిని. నన్ను క్షమింపుమని జాబాలి రాముని బ్రార్థించెను. రామా.

జాబాలి:-పథ్యుని శిష్యుఁడు. అథర్వ వేదము నతిం చెను.

జి

జితవతి.-ఉశీనరపతి కూఁతురు; అష్టమ వసువగు ప్రభాసునిభార్యకుఁ బ్రాణసఖి. ఈమెకిచ్చుట కయియే వసువులు వసిష్ఠుని హోమధేనువును దస్కరించి శాపమునొందిరి. (చూడు వసువులు.) భార.

జితాశ్వుఁడు:-పృథు చక్రవర్తి కుమారుఁడు. పృథువుచేయు యాగమునందశ్వమును నింద్రుం డపహరించెను. ఇతఁడింద్రునితో యుద్ధముచేసి యాయశ్వమును మఱలఁదెచ్చెను. అందుచే నీతని కీ పేరువచ్చెను.(చూడు విజితాశ్వుఁడు.) భాగ.

జితుఁడు:-జయ విజయులయొక్క కింకరుఁడు. ఇతఁడును సనకసనందనాదులచే సంహరింపఁబడి మారీచుఁడుగఁ బుట్టెను. బ్ర. వై.

శ్రీరామునిచే సంహరింపఁబడినపిదపఁ దన రూపముతో స్వర్గమును జేరెను.

జీ

జీబలుఁడు:- ప్రవాహణుని తండ్రి. ఛా. ఉ.

జీమూతవాహనుఁడు: ఒకవిద్యాధరయువకుఁడు జీమూతకేతుని కుమారుఁడు. ఇతనికిఁ బట్టముకట్టి జీమూతకేతుఁడును, భార్యయును దపోవనమున కేగిరి. జీమూత వాహనుఁడు రాజ్యభోగములకంటెఁ బితృసేవయే యెక్కుడుగఁ దలంచుచుఁ దన పితరులకుఁ బరిచర్యలఁ జేయుటకుఁ దఱచు కానమున కేగుచుండువాఁడు. ఒకనాఁ డట్లరుగుచుండఁగ వనములో నొకసుందరాంగిని మలయవతి యనుదానిని జూచెను. మఱియు నామెయు, నామె చెలికత్తెయు విద్యాధర చక్రవర్తియే మలయవతికి భర్తయగునని చెప్పుకొనుట వినెను. ఇతఁడును, మలయవతియుఁ బరస్పరావలోకముచే మోహనిమగ్నులైరి. వీరి తలిదండ్రులు వీరియిరువురకును వివాహము చేసిరి పిమ్మటఁ గొన్ని దినములకు జీమూతవాహనుఁడు భావమఱఁదితో విహారము వెడలి పాములయెముకలు కొండలవలె గుట్టలు పడి యుండుటఁజూచి యివ్వేలవచ్చెనని యడిగెను. అవి గరుత్మంతున కాహారమైన పన్నగముల యెముకలని తెలిసికొనెను. గరుఁడుడు సర్పములను మితిలేకుండ సంహరించుటచే వాని కనుదినమును నొక్కొక్కసర్పము నాహారముగఁ బంపుటకు వాసుకి యొడంబడెనని జీమూతవాహనునకుఁ జెప్పిరి. ఆనాఁడు ఖగేంద్రున కాహారమగుటకై శంఖచూఁడు డను పన్నగకుమారుఁడు వచ్చెను. వానిపిఱుందనే వానితల్లి యేడ్చుచు వచ్చెను. శంఖచూడునికై వాసుకి భటుఁడెఱ్ఱనిబట్టలు తెచ్చెను. వానిని ధరించి శంఖచూడుఁడు వధ్యశిల నెక్కవలయును. దీని నంతనుచూచిన జీమూతవాహనుని హృదయము కరగెను. పరోపకారము చేసి తానే గరుడున కాహారమై శంఖచూడునిప్రాణములు కాపాడ నిశ్చయించుకొనెను; వాసుకి భటుఁడు తెచ్చిన బట్టలు తన కిమ్మనెను. శంఖచూడుఁడు తానే యశన మయ్యెదనని పలుకుచుండెను; బట్టల నివ్వకుండెను. ఇంతలో నచ్చటి యాచారము ప్రకారము జీమూతవాహనుని యత్తగారు క్రొత్త పెండ్లికొడుకునకై యెఱ్ఱనిబట్టలను బంపెను. జీమూతవాహనుఁడు వానిని ధరించి వధ్యశిలనెక్కెను. గరుడుండటకేతెంచి తనకై వచ్చిన బన్నగమని తలంచి వీనిని భక్షింపఁ జొచ్చెను. జీమూతవాహనుఁ డింటికి మఱలి రానందున వీని తల్లిదండ్రులును, బంధువులును వెదకుమవచ్చిరి; ఇతని శిరోభూషణములు, దాని నంటుకొనియున్న మాంసపుముద్దను జూచిరి. ఆ యానవాలునుబట్టి వెదకుకొనుచు వారును వధ్యశిలను జేరిరి. అచ్చటనే శంఖచూడుఁడు వచ్చి జీమూతవాహనుని విడిచి తనను భక్షింపుమని గరుడుని గోరుచుండెను. తనివితీర నాశరీరము భక్షింపుమని జీమూతవాహనుఁ డనుచుండెను. గరుత్మంతుఁడు తాఁజేసిన తప్పు చూచెను; జీమూతవాహనునియొక్క పరోపకార బుద్ధికి వెఱగొందుచుండెను. నూతనవధువగు మలయవతి విలపించుచుండెను. వృద్ధపితరులు

దుఃఖసముద్రములో మునిగి యమృత మిచ్చి యైన నా కుమారుని బ్రతికింపుమని వేడు చుండిరి. అమృతముమాట జ్ఞాపకమునకు వచ్చి గరుత్మంతుఁడు ఇంద్రలోకమున కరిగి యింద్రు నడిగి యమృతము దెప్పించెను. జీమూతవాహనుని, నిదివఱకు చచ్చిన సర్పములను బ్రతికించెను. పార్వతి ప్రత్యక్షమై విద్యాధర చక్రవర్తిని కమ్మని వీని దీవించి బంగారు చక్రముగల తేరు నిచ్చెను. గరుత్మంతుఁ డిఁకఁ బాములకు హింస చేయ ననియెను. జీమూతవాహనుఁడు తన భార్యనుగూడి సుఖంబుగ రాజ్యమేలెను.

జీవలుఁడు:- ఋతుపర్ణుని కొలువులో నుండు వాఁడు. ఆతనిచే నియుక్తుఁడై యాతనిని గొలుచు చున్న బాహుకునకు (నలునకు) సహాయునిగ నుండువాఁడు. నలుఁ డొకనాఁడు విమోహితాత్ముఁడై హృదయేశ్వరినిఁ దలఁచుకొను చుండఁగఁ నీకేల యెడఁబాటు కలిగె? నని యడిగెను. భార.

జీవుఁడు:- బృహస్పతి. (చూడు. బృహస్పతి.)

జై

జైగీషవ్యుఁడు:- ఒక ముని. కపిలునితోఁ గలసి యశ్వశిరుని యాగమునకు వెళ్ళెను. విష్ణుమూర్తి నేవిధమునఁ గొలిచిన వశుఁడగు? నని రాజు వీరి నడిగెను. మేమే విష్ణుమూర్తులమని వీరు చెప్పిరి. విష్ణుమూర్తికిఁ బక్షివాహనము కలదు. శంఖ చక్రము లుండును. మీ కవి లేవు. మీరు విష్ణుమూర్తులు కారు అని రాజు పల్కఁగ, కపిలుడు విష్ణుమూర్తి యయ్యెను. జైగీషవ్యుఁడు గరుడుఁ డయ్యెను విష్ణుమూర్తికి నాభియందుఁ గమలమును, అందు బ్రహ్మయు నుండునని రాజు పల్కెను. జైగీషవ్యుఁడు బ్రహ్మ యయ్యెను. కపిలుఁడు విష్ణుమూర్తి యయ్యెను. ఇంకను నమ్మకున్న, మును అంతర్థానమై యజ్ఞ భూమిని దుష్టమృగమయమును గావించిరి. రాజు వీరిని వేఁడుకొనినఁ బ్రత్యక్షమై కరుణించి సర్వపదార్థములయందును భగవంతుఁ డున్నాఁడని గ్రహించితివని నీవు విష్ణుమూర్తి వశుఁడగుదు. నీకది తెలియఁజేయుటకే మేమిట్లు చేసితిమనిరి. వరా.

జైమిని:- కృష్ణద్వైపాయనుని శిష్యుడు. తొల్లి వేదంబు లేకీభూతంబులై యేర్పఱుపరాక యున్నప్పుడు సహాధ్యాయులగు పైల, వైశంపాయన, సుమంతులతోఁ గలసి చతుర్వేద సూత్రముల నేర్పాటుచేసెను. ఇతఁడు సామవేదమును బఠించెను. దాని నితని కుమారుఁడగు సుమంతున కుపదేశించెను. భాగ. భార.

జ్యా

జ్యామఘుఁడు:- రుచికుని పుత్త్రుఁడు. ఇతనికి సంతానముకలుగకపోయినను జాలకాలము అన్యకాంతను నంటలేదు. ఒక శత్రురాజుయొక్క పుత్త్రికను రథముపై నెక్కించుకొని రాఁగా నితని భార్య శైబ్య పరుషము లాడెను. జ్యామఘుఁ డామెకు వెఱచి, యీపడఁతి నీకు సవతిగాదు. నీకుఁ గోడలగునని చెప్పెను. దేవతలు సంతోషించిరి. శైబ్యయందు విదర్భయను పుత్త్రుండు కలిగెను.

జ్యామఘుఁడు:- రుక్మకవచుని పుత్త్రుఁడు. ఇతఁ డొక రాజుతో యుద్ధము చేసెను. ఇతని దాడి కాగలేక "నాకుమారిత నిచ్చెదను. ఆమెను పరిగ్రహించి నన్ను రక్షింపు" మని యారాజు శరణువేఁడెను. ఇతఁ డా బాలను గైకొనియె. ఆమెను దన గృహమునకుఁ దీసికొనివచ్చి తన భార్య శైబ్య (చైత్ర) యేమనునో యని శంకించి ఇదిగో ఈమె నీకోడలని జ్యామఘుఁడనియె. "ఆమెకుఁబుత్త్రులులేకపోవుటచేనామెయాశ్చర్యమొంది యిదెట్లగును?" అని యడిగెను. ఈమె నీకుఁ బుట్టుకుమారునకు భార్య యగునని జ్యామఘుఁ డనియె. ఇతనికి విదర్భుఁడను కుమారుఁడు కలిగెను. విదర్భున కాబాలనిచ్చి వివాహముచేసిరి. బ్రహ్మ.

జ్యే

జ్యేష్ఠాదేవి:- బ్రహ్మమానస పుత్త్రిక. వరుణుని వలన నధర్ముఁడను పుత్త్రునిఁ బడసెను.

జ్యో

జ్యోతి:-అహుఁడను వసువు కుమారుఁడు. భార.

జ్యోతిర్ధాముఁడు:-తామసమను కాలమున సప్తఋషులలో నొకఁడు. బ్రహ్మ.

జ్యోతిష్మంతుఁడు:- ప్రియవ్రతుని పుత్రుఁడు. కుశద్వీపమునకు రాజు. ఉద్భిజ్జుఁడు, వేణుఁడు, మద్వైగుఁడు, లవణుఁడు, ధృతుఁడు, ప్రభాకరుఁడు, కపిలుఁడు ఇతనికుమారులు. బ్రహ్మ.

జ్వ

జ్వరము:- దక్షయజ్ఞమును ధ్వంసమును జేయు నపుడు శివుని నుదుటినుండి యొక చెమట బిందువు రాలెను. అది మిక్కిలి భయంకరుడైన పురుషుం డయ్యెను. దేవత లందఱును వాని కోప ముడిగింపుమని కోరిరి. ఇంద్రుఁడు "దేవా! ఈ పురుషుండు జ్వరం బనఁ బరగు వాఁడు. ఇతఁడు ఏక ముఖంబైన, భూమికి దుర్భరంబగును. బహుముఖంబుగఁ జేయవే" యని ప్రార్థించెను.

శివుఁడు వల్లెయని, ఏనుగులకు శిరస్తాపనము, పాములకుఁ గుబుసము, గోవులకు డెక్కలమధ్య బాధ, గుఱ్ఱములకుఁ బార్శ్వశోషణము, చిలుకలకు హిక్క, కోకిలలకు నేత్రరోగము, మనుజులకు జనన మరణాదులందు వేదనావేశమున బంచెను. భార.

జ్వా

జ్వాల:-ఋషునిభార్య, మతినారునితల్లి. భార.

డి

డింభకుఁడు:-చూడుము డిభకుఁడు.

డిభకుఁడు:-హంసుని సోదరుఁడు. (చూడుము హంసుఁడు.)

డు

డుండుభము:-ఒకపాము. రురుఁడు దీనినిఁ గొట్టుటకుఁ గఱ్ఱయెత్తఁగ "వయ్యా! ఏలకొట్టెదవు?" అని సర్పరూపము విడిచి మునియై లేచి నిలుచుండెను. నాభార్యను బాముకఱచెను గానఁ బ్రతిపామును నేను గొట్టుచుంటిని. నీ వెవ్వరవో నాకుఁ దెల్పుము. ఇంతలో మునియై యెట్లులేచితివి?" అని రురుఁడడిగిన ముని "తాను సహస్రపాదుఁ డనువాఁడననియు, శాపవిమోచనము కల్గినది గావునఁ దిరిగి మునినైతిననియుఁ" జెప్పి జీవహింసచేయుట బ్రాహ్మణధర్మము కాదని బోధించి యిఁక బాములను జంపకుండ, వాని బుద్ధి మరలించెను. (చూడు. సహస్రపాదుఁడు) భార.

త

తండ్రినిఁ జంపిన భక్తుఁడు:- కాటకోటఁడు. (చూడుము మేక పెంటిక.)

తంత్రీపాలుఁడు:-అజ్ఞాతవాసమున నున్న సహదేవుని పేరు.

తక్షకుఁడు:-కద్రువయొక్క కుమారుఁడు. పన్నగము. ఉదంకుఁడు పౌష్యమహాదేవియొద్దనుండి కుండలములు గొనివచ్చుచు వానిని దటాకపుటొడ్డునఁబెట్టి యాచమించుచుండఁగఁదక్షకుఁడు దిగంబరియైవచ్చి వాని నపహరించి ఉదంకుఁడు వెంబడింపఁగ దిగంబరివేషమువిడచి నిజరూపమున నాగలోకమునకు వచ్చెను. ఉదంకుఁడు వానిని దఱుముకొనివచ్చుచు నాగలోకమున మహాక్షోభమును గావింపఁ దక్షకుఁడు భయపడి కుండలములను దెచ్చి యిచ్చెను. తక్షకుఁ డిట్లపకారము చేయుటచేత నే సర్పయాగము చేయుమని జనమేజయుని నుదంకుఁడు ప్రోత్సాహపఱచెను. భార.

"పరీక్షిత్తు తక్షకవిషాగ్ని దగ్ధుఁడగుఁగాక" యని శృంగి శపించెను. కావునఁ దక్షకుఁడు

బ్రాహ్మణవేషధారులై కొందరు నాగబాలురను బ్రాహ్మణరూపధారులుగఁ జేసి వారిని వెంటఁ బెట్టుకొని పరీక్షిత్తు నిర్మించుకొనిన భవనమున కరుగుచుండెను. ఇతనికి మార్గమందు మఱియొక బ్రాహ్మణుఁడుగనఁబడియె. ఆతనిని నీవెవ్వరవు? ఎచ్చటికిఁ బోవుచుంటివి? అని తక్షకుఁడడిగెను. నేను కశ్యపుఁడనువాఁడను. నాకు విషవైద్యము తెలియును. ఈదినము పరీక్షిత్తు తక్షకవిష దగ్ధుఁడగునని వింటిని. వానిని బ్రతికించి బహుమానమును బడయుటకుఁబోవుచుంటినని యతఁడు ప్రత్యుత్తరమిచ్చెను. తక్షకుఁడను నేనే. నేను గఱచినఁ బ్రతికించుట కవ్వరితరము? నీవేల వృథాశ్రమపడియెదవు? నీవు మరలి నీయింటికిఁ బొమ్ము అని తక్షకుఁడు పల్కఁగ వారిలో వారికి వాదము జరిగెను. ఏది చూతము, ఈ చెట్టును దగ్ధముగావించెద; దానినిబ్రతికింపుమని తక్షకుఁడు దాపుననున్న వృక్షమును గఱువఁగ నదియు దానిపైనుండిన జీవులతోఁ గూడ భస్మమై పోయెను. కశ్యపుఁడు తన ప్రజ్ఞవలన నా భస్మమును వృక్షముగఁజేసి దానితోఁగూడభస్మమైన జీవులనుసైతము బునర్జీవితులను జేసెను. ఈ బ్రాహ్మణుఁడు తనకార్యమునకుఁ బ్రతీకారము చేయునని తక్షకుఁడు భయపడి అతఁడు కోరిన ధనమిచ్చి తనతోడరాక మఱలిపొమ్మని బ్రతిమాలి పంపివైచెను. పిమ్మటఁ దక్షకుఁడల్పకాయుఁడై తనతోడవచ్చు కపటబ్రాహ్మణులు తెచ్చు నిమ్మకాయలలో నొకదానియందుఁ బ్రవేశించెను. ఈ బ్రాహ్మణులను బరీక్షిత్తు తన హర్మ్యములోనికి రానిచ్చెను. వారొసఁగిన నిమ్మపండ్లను గైకొని వాసన చూచుచుండఁగ లోపలఁ బ్రవేశించియున్న తక్షకుఁడు బైటకు వచ్చి పరీక్షిత్తును గఱచెను. భార.

జనమేజయుఁడు చేయు సర్పయాగమున సర్పము లన్నియును నగ్నిలోఁ బడుచుండఁగ నితఁడు భయపడి యింద్రుని సింహాసనమును గౌగలించుకొనెను. కాని బ్రాహ్మణ మంత్రబలమునఁ దక్షకుఁడు పడిపోవుచుండ, ఆస్తీకుఁడు యాగమును మానిపించి భయములేదని చెప్పి వానిని బంపివేసెను.

తక్షుఁడు:-రాముని సోదరుఁడగు భరతుని పుత్త్రుఁడు. గంధర్వశైలూష పుత్త్రులను భరతుఁడు చంపి వీనికిఁ బట్టముకట్టెను. వీని పురము తక్షశిల. రామా.

తక్షుఁడు:- వృకుని పుత్త్రుఁడు.

తటాతక:- మలయధ్వజుని కుమారిత. ఈమెతల్లి కాంచనమాల. ఈమె మూడు కుచములతో జన్మించెను. మలయధ్వజుఁడు విస్మయమంది చూచుచుండఁగ శివుఁడు ప్రత్యక్షమై, పార్వతియే యిట్లు పుట్టెను. వివాహమైన పిమ్మట మూడవ కుచము పోవునని చెప్పెను. ఈమె తండ్రితోఁ గొలువులోనేయుండునది. దిగ్విజయమునకై బయలుదేఱి రాజులను గెలుచుచుండెడిది. ఈమె యుద్ధము చేయుటకై సోమసుందరుని చెంతకుఁబోయెను. కాని యతనిసుందరాకారము చూచి మోహించి యాతనిని వివాహమయ్యెను. ఈ దంపతులకు ఉగ్రపాండ్యుఁడు జన్మించెను. వీనికిఁ బట్టము కట్టి, తటాతక సోమసుందరుని గుడిలోనికివెళ్ళి యచ్చట యదృశ్యమయ్యెను. స్కాంద.

తపతి:-సూర్యుని పుత్త్రిక. ఈమెను సంవరణుఁడు కాననములోఁజూచి మోహించి గాంధర్వమునఁ దనను బెండ్లిచేసికొమ్మనియె. తండ్రి యనుమతి లేక తా నంగీకరింపఁజాలనని చెప్పి యీమె యదృశ్య యయ్యెను. సంవరణుఁడు సూర్యుని గూర్చి తపముచేసి యీమెను భార్యగఁబడసెను. భార.

తమసానది-: ఈ నదీతీరముననే వాల్మీకి యాశ్రమ ముండెను.

తర్దముఁడు:- శారదండాయని యొక్క క్షేత్రజ పుత్త్రుఁడు. ఇతనితల్లి శ్రుతసేన. భార.

తా

తాండ్రచెట్టు:-(విభాతకవృక్షము.) నలుని శరీరమునువిడిచిన కలి ప్రక్కనున్న తాండ్రచెట్టునఁ బ్రవేశించెను. అప్పటినుండియే యది యప్రశస్తమయ్యెను. ఈ తాండ్రచెట్టుయొక్క ఆకులను,

గాయలను లెక్కపెట్టకయే ఋతుపర్ణుఁడు తన 'అక్షవిద్య'చేఁ జెప్పఁగలిగెను. భార

తాటక:-ఒకరాక్షసి. సుకేతునికూఁతురు. ఈమెకు వేయి యేనుఁగుల బలముకలదు. జంభుని కుమారుఁడు సునందుఁ డీమెను వివాహమయ్యెను. ఈమె మొదట రూపవతిగనుండెను. అగస్త్యుని హింసింపఁబోఁగా నతఁడు వికృతరూపముగల దానవగమని శపించెను. రామా.

వీరలకు మారీచుఁడను కుమారుఁడు జన్మించెను. వీరు మునులను బాధించుచు, వారి యగ్ని గుండములనుబాడుచేయుచు, హోమద్రవ్యముల నపహరించుచు, వారియాశ్రమములందు రక్తవర్షమును కురిపించుచు సకలబాధలు కలుగజేయుచుండిరి. ఈమెను సంహరించుటకై విశ్వామిత్రుఁడు శ్రీరాముని దీసికొనివచ్చెను. అతఁ డీమెను బాణములతోఁగొట్టి చంపెను. రామా.

తామసుఁడు:-ఒకమనువుఉత్పలావతియను నామె శాపవశమున మృగిజన్మమున నుండెను. ఈమృగి పుచ్ఛమూలమున సురాష్ట్రుఁడనురాజు స్పృశించుటచే నది గర్భము దాల్చెను. లోలుఁడను మునీంద్రుఁ డామె గర్భమునఁ బడెను. ఆమృగి జగంబు లన్నిఁటియందు, దమంబు గప్పియున్న సమయమునఁ బ్రసవించెను. ఆకుమారుని జూచుటకు మునులువచ్చి వానికిఁ దామసుఁడను పేరు పెట్టిరి. ఇతనిని దండ్రియే పెంచెను. తామసుఁడు తనజన్మకథను, దనతండ్రి శత్రువులచే రాజ్యమునుండి వెడలఁగొట్టఁ బడుటయు, నిజజనకుని వలన విని యతని యనుమతిగైకొని పరరాజుల నోడించి రాజ్యమును గెలిచెను. జానుజంఘుఁడు, శాంతి, నరుఁడు, ప్రస్థుఁడు దృఢుఁడు, కృతబంధువు తామసుని కుమారులు. తామసుఁడు నాల్గవ మనువయ్యెను. ఇతని మన్వంతరమునఁ (త్రిశిఖుఁడు) శిబి యింద్రుఁడయ్యెను. భాగ.

జ్యోతిర్ధాముఁడు, పృథుఁడు, గావ్యుఁడు చైత్రుఁడు మొదలగువారు సప్తఋషులైరి.

గజేంద్రమోక్షణము ఈ మనుకాలమున జరిగెను. మార్క.

తామిస్రమము:- ఒక నరకము.

తామ్ర:-దక్షప్రజాపతి కూఁతురు. కశ్యపునిభార్య.

తామ్రచూడము:- కుమారస్వామి ననుసరించి యుండు ఒక మాతృగణము.

తామ్రధ్వజుఁడు:-మణిపురము రాజైన మయూరధ్వజుని పుత్రుఁడు. ఇతఁడు ధర్మరాజు యాగాశ్వమును బట్టుకొనఁ కృష్ణార్జునులు లితనితోఁ బోరాడిరి; కాని యోడుపడిరి. ఇతఁడు గుఱ్ఱమును దండ్రికడకుఁ గొనిపోయెను. మయూరధ్వజునికడకుఁ గృష్ణార్జునులు బ్రాహ్మణవేషమునవచ్చి యతని శరీరభాగమును గోసి యిమ్మనిరి ఇతఁడు తన శరీరమిత్తుననియె. (చూడుము. మయూరధ్వజుఁడు) ఇతఁడు తండ్రిశరీరమును గోసెను. అపుడు కృష్ణుఁడు నిజస్వరూపము చూపించెను. జై. భా.

తామ్రపర్ణి:- గోకర్ణక్షేత్రము దగ్గరగఁ బ్రవహించు నొక నది. ఈ నదీతీరమున దేవతలు తపస్సుచేసిరి.

తామ్రము:- కార్తికేయుని వీర్యము.

తామ్రుఁడు:- మహిషాసురుని మిత్రుఁడు. దేవితో యుద్ధముచేసి మరణించెను. దే. భా.

తార:- బృహస్పతిభార్య. బృహస్పతియొద్దకుఁ జంద్రుఁడు శిష్యుఁడై చదువుచుండువాఁడు. చంద్రుని రూపము చూచి యీమె మోహించి వృద్ధుఁడగు తనపతి గృహమునలేనిసమయమునఁ జంద్రునితోఁ గూడెను. ఈమె గర్భవతి యయ్యెను. ఈమెను జంద్రుఁడు తనతోఁ దోడ్కొని పోయెను. ఈమెనుగూర్చి చంద్రునకును, బృహస్పతికిని పోరాటమయ్యెను. అసురులుచంద్రునిపక్షమునఁ జేరవచ్చుచుండిరి. ఈ యుపద్రవము మాన్పుటకై బ్రహ్మగారు వచ్చిరి. ఇంతలోఁ దార ప్రసవించెను. ఆమెకు బుధుఁడు జన్మించెను. "ఈ పుత్రుఁడు నాకుమారుఁడు, నాకుమారుఁడని చంద్రుఁడును, గురుఁడును దగవులాడిరి."

ఎవరి కుమారుఁడగునో నిశ్చయింపలేక బ్రహ్మ తారనే యడిగెను. ఈమె "యీ కుమారుఁడు చంద్రుని పుత్త్రుఁడే" యని చెప్పెను. బ్రహ్మ బుధునిఁ జంద్రునకును, నీమెను బృహస్పతికి నిప్పించెను. భాగ.

తార:- తారుఁడనువాని కుమార్తె. వాలిభార్య. ఈమెకుమారుఁ డంగదుఁడు. వాలి మాయావితో యుద్ధమునకు వెళ్ళినపుడీమెయును, సుగ్రీవుఁడును వాని వెంబడి వెళ్ళిరి. వాలి, మాయావు లొక బిలములో దూఱి యెంతకును రాకుండుటచే వాలి మరణించెనని వీరనుకొనిరి. నగరమునకు మఱలి వచ్చిరి. సుగ్రీవుఁడే కిష్కింధకు రాజయ్యెను. తార వీనికి భార్యయయ్యెను. పిమ్మట వాలివచ్చి సుగ్రీవుని దఱిమివేసెను; మఱలఁ దారను గ్రహించెను. తార వాలినే పతిఁగ దలచెను. పిమ్మట వాలిని రాముఁడు చంపివేసెను. పతి మరణమువలనఁ దారకు నపారదుఃఖము కలిగెను. శ్రీరామునిపైఁ గోపముకూడవచ్చెను. సీత మరల దొఱకినను స్వల్పకాలము మాత్రమే నీయొద్ద నుండునని యీమె రాముని శపించెను. రాముఁ డాగ్రహము పూనక యీమె నోదార్చెను. సుగ్రీవునకుఁ బట్టము కట్టిన పిదప వాతనికిఁ దార మఱల భార్యయయ్యె. రామా.

తారకాక్షుఁడు:- త్రిపురాసురులలో నొకఁడు. (మూడు త్రిపురాసురులు) ఇతని కుమారుఁడు హరి యనువాఁడు. భార.

తారకాసురుఁడు:- వజ్రాంగుని కుమారుఁడు. ఇతఁడు బ్రహ్మనుగూర్చి మహోగ్రతపముచేసెను. అతని తపస్సువలన లోకములు మలమలమాడఁ జొచ్చెను. ఇంద్రాదిదేవతలు బ్రహ్మకడకుఁబోయి వాని తపము మాన్పుమని కోరిరి. బ్రహ్మ తారకునకుఁ బ్రత్యక్షమై వరము వేఁడుకొనుమనియె. తనతో సమానమైన బలాఢ్యులు బ్రహ్మసృష్టిలోఁ గలుగకుండుట్లితఁడు వరమువేఁడెను. ఆవరము పుచ్చుకొని తారకుఁడు లోకములకుబాధకలుగఁ జేయఁ బ్రారంభించెను. వాని నణఁచుటకు శివుని కుమారుఁడగు కుమారస్వామిఁదప్ప నొరులకు సాధ్యముకాదని బ్రహ్మ దేవతలతోఁ జెప్పెను. అపుడు దేవతలు శివుఁడు పార్వతిని వివాహమగునట్లు చేసిరి. శివునకుఁ గుమారస్వామి జన్మించి తారకునితో యుద్ధముచేసెను. ఆ యుద్ధమునఁ దారకుఁడు సంహరింపఁబడియె. శివ.

తారకాసురుఁడు:- సురసయందుఁ గశ్యపుని వలనఁబుట్టిన రాక్షసుఁడు. శూరపద్మాసురుఁడు, సింహవక్త్రుఁడు ఇతని సహోదరులు. స్కాంద.

తారుఁడు:- తారతండ్రి. బృహస్పతి తనయుఁడు.

తార్క్షి:- (పూర్వజన్మమున వసువు) ఒకపక్షి. కంధరుని కుమార్తె. మందపాలుఁడను ముని కుమారుఁడు (పక్షి). ద్రోణుఁడనువాఁడీమెను వివాహమయ్యెను. ఈమె గర్భవతిగ నుండి భారత యుద్ధము జరుగుచుండఁగ యుద్ధభూమియందు నెగురుచుండెను. భగదత్తుని యశ్వముపై నర్జునుఁ డేయుచుండిన బాణము లీమెకుఁ దగులుటచే నీమె గర్భముచీలి గ్రుడ్లు క్రిందఁబడెను. ఈమెకు శాపవిమోచనమై నిజరూపము వహించి దేవలోకమున కరిగెను. ఆ క్రిందఁబడిన గ్రుడ్లను శమీకముని తీసి కాపాడెను. మార్క.

తార్క్ష్యుఁడు:- ఒక ముని. ఈతనియాశ్రమ సమీపమున నొక విప్రకుమారుని మృగమని తలంపుతో హయహయరాజు ధుంధుమారుఁ డనువాఁడు చంపెను. హయహయుఁ డందులకు మిక్కిలి విచారించి యతనికడకు వచ్చెను. వచ్చినవారికి నితఁడు తనశిష్యులచేఁ బరిచర్యలు చేయించుచుండఁగ, వారు చేసిన దోషమును జెప్పికొని, యీ పరిచర్యలకుఁ దగమనిరి. భయ వ్యాధి మరణదుఃఖాదులు తనయాశ్రమమునందు జేరవని, వారి పుత్త్రునిఁబిలిచి, "ఇతఁడా ? మీ రాజకుమారునిచే నిహతుఁడైనవాఁడు" అని చూపెను. వారలాశ్చర్యమంది "మరణించినవాఁ డెట్లు మఱల బ్రతికెను ?" అని యడిగిరి. "సత్యము, శుచి, బ్రహ్మచర్యము, అతిథిసత్కారము, శాంతి - ఇట్టివి కలిగియుండుటచే మృత్యుశోక భయమును పొందము" అనియెను. భార.

తాళకేతుఁడు:- రాక్షసుఁడు. పాతాళకేతుని తమ్ముఁడు. కువలయాశ్వుఁడు తన యన్నను జంపెను. కావున నతనిని వంచింపఁ దలఁచుకొని

యుండెను. కువలయాశ్వుఁ డొకనాఁడు వనమున సంచరించుచుండగఁ దాళకేతుఁడు ముని వేషమున వచ్చి, తాను యాగము చేయఁబోవు చుంటినని చెప్పి దానికై సంభావననిమ్మని కోరి రాజా మెడనున్న కంఠమాలను బుచ్చుకొనెను. "మఱియుఁ దాను నదికిఁబోయి స్నానముచేసి వచ్చెదననియు, నంతవఱకుఁ దన యాశ్రమము భద్రముగఁ జూచుచుండు" మనియు రాజును కోరెను. కువలయాశ్వుఁడు వానినినమ్మి, వాఁడు కూర్చుండఁబెట్టిన చోటుననే కూర్చుండెను. ఇంతలోఁ దాళకేతుఁడు నదిలో మునిఁగి తన మాయాబలమువలనఁ గువలయాశ్వుని పట్టణమునకుఁ బోయి యచ్చటఁ గువలయాశ్వుఁడు దనుజులచేత హతుఁడయ్యెనని చెప్పి వానికంఠమాల నిచ్చెను. కువలయాశ్వుని కంఠమాలను గుర్తించి, నగరవాసులు నిజముగఁ గువలయాశ్వుఁడు చనిపోయెననియె విశ్వసించిరి. కువలయాశ్వునిభార్య పతి చనిపోయెనను వార్త విని దుఃఖము పట్టజాలక ప్రాణములు విడచెను.
మార్క.

తాళజంఘుఁడు:- కార్తవీర్యుని పౌత్త్రుఁడు.

తి

తిత్తిరి:- కద్రువ కుమారుఁడు.

తిన్నఁడు:- ఒక చెంచువాఁడు. వేటకై వెళ్ళి యట శివలింగమునుజూచి దాని నారాధించుచు నింటికి రాక యటనేయుండెను. శివునియందు గాఢ భక్తి కలిగినవాఁడు. ఇతఁడు పచనముచేసి రుచి చూచినమాంసపుముక్కలను రెండుచేతులలోను బెట్టుకొని, నోటినిండఁ గల్లుపోసికొని 'శ్రీకాళహస్తి'లో నున్న శివలింగమును బూజ చేయుచుండుటకుఁ వచ్చుచుండువాఁడు. లింగముపై నదివఱకుఁ బూజచేసిన నిర్మాల్య ముండుటచే, రెండుచేతులలో మాంసమున్నదిగావున, గాళ్ళయందున్న కోళ్ళతోనే నిర్మాల్యమును దీసివేసి, నోటిలోని కల్లుతోఁగడిగి, యామాంసమును లింగముపై నైవేద్యము పెట్టుచుండువాఁడు. శివుఁడు "యథాప్రకారమొకనాఁడు నిర్మాల్యముచేసి, నైవేద్యము పెట్టఁగఁ" దన లింగము కన్నునుండి బొటబొట నీరుకారునట్లు చేసెను. ఇతఁడు శివుని నేత్రరోగమును మానుపుట కెన్నోమందులువేసెనుగాని ఆనీరు తగ్గక పోవుటచేఁ దనకన్నును బెకలించి శివుని కంటి యందుఁబెట్టెను. అంత రెండవకన్నునుండి నీరు కారఁజొచ్చెను. ఆ కంటి దగ్గఱ 'ఆనవాలు'గ దన పాదమును బెట్టి తన రెండవ కన్నునుగూడఁ బెకలించి యందుఁజేర్చు తలంపుతో దానిని గూడఁ బెకలించఁబోయెను. ఇంతలోఁ శివుఁ డాతనికిఁ బ్రసన్నుండై యతఁడు కోరినట్లు జన్మములేకుండఁ దన సాయుజ్య మిచ్చెను.
శ్రీకాళహస్తి.

తిన్నఁడుచేయుపూజ యమాంగల్యమనితలంచి శివునియొక్క భక్తుఁడు శివబ్రాహ్మణుఁ డను వాఁడు దాని నసహ్యించుకొన, శివుఁడు వానికిఁ దిన్నఁడు భక్తుడని చెప్పి వానిని నిరూపించుటకై పైఁజెప్పిన లీల కనఁబఱచెను.

తిన్నఁడు:- పూర్వజన్మమున అర్జునుఁడు. శివునితోఁ బోరి పాశుపతాస్త్రమును బొందినపుడు శివుఁ డితనికిఁ బ్రత్యక్షమయ్యెను. తెలియక యా దేవునితోఁ బోరు సలిపినందుకు వగచుచుఁ దనకు మోక్షమిమ్మని ప్రార్థించెను. ఈజన్మమున నీకది కలుగదు. బంధుహాననము తలపెట్టితివి కావున మృగహంతవై పుట్టి శివలింగము నర్చించి సాయుజ్యమును బొందుదువని చెప్పెను.
శ్రీకాళహస్తి.

తిరువెంగనాంచి:- చిఱుతొండని భార్య. పతివ్రత. మిక్కిలి శివభక్తిగలది. అతిథిపూజచేసి కాని భుజింపదు. అతిథికిఁ గుడువఁబెట్టుటకై తన కుమారుని సిరియాళుని జంపుకొనెను. కాని పిమ్మటఁ బార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్షమై యామెకు ముక్తినిచ్చిరి. హర.

తిలోత్తమ:- ఒక అప్సరస. సుందోపసుందు లను దానవులను వినాశనము నొందించుటకై బ్రహ్మ పంపున విశ్వకర్మ (మయుఁడు) లోకమునందుఁగల యొప్పులందెల్లఁ దిలప్రమాణంబులాహరించి కామినిఁగజేసెను. ఆమెయే తిలోత్తమ. ఈమెపూర్వ

రూపమున సృష్టించె. ఈమె ఈశ్వరునకుఁ బ్రదక్షిణములు చేసెను. దేవకార్యంబుచేసి రమ్మని యతఁడు పల్కఁ యీమె తిరిగిన దిక్కున మొగంబు దాల్చుచువచ్చెను. బ్రహ్మ చెప్పఁగఁ దిలోత్తమ వచ్చి సుందోపసుందుల చెంత నిలచెను. వారిరువురు నామెను మోహించిరి. మాలో నెవ్వరిని జేపట్టెదవని వారడిగిరి. ఎవఁడు రెండవవానిని బాధించి గెలువఁగల్గునో వానిని జేపట్టెదనని తిలోత్తమ పల్కెను. ఈమెకై వారు తగవులాడుకొని యొకరి నొకరు పొడుచుకొని యిరువురును బ్రాణములు వీడిరి.

భార. పద్మ.

తిలోత్తమ యొకనాఁడు చంద్రునికై పోవుచుండఁగ సాహసికుఁ డాపి యీమెతోఁ గ్రీడించుచుండెను. వీరి యాహ్లాదరావములచే ఆసమీపమునఁ దపస్సు చేసికొనుచున్న దుర్వాసుని నిష్ఠకు భంగము కలిగెను. అతఁ డీమెను రాక్షసివై పుట్టుమని శపించెను. ఈమె ప్రార్థింపఁగ బాణాసురుని పుత్రికవై పుట్టి కృష్ణుని పౌత్రుని వరించి పిమ్మట నీరూపము గైకొందు వనియె. బ్ర. వై.

తుం

తుంబురుఁడు:-ఒక గంధర్వుఁడు. కుబేరుని కొలువులో నున్నవాఁడు. రంభయందున్న వలపు వలన నితఁడు కుబేరుని గొలుచుటను మఱచెను. అందుచే రాక్షసుఁడవై పుట్టుమని కుబేరుఁడు వీనిని శపించెను. ఇతఁడు విరాధుఁడు అను రాక్షసుఁడుగఁ బుట్టెను. తుంబురుని వీణ పేరు కళావతి. రామా

ఇతఁడును, నితనిభార్యయూ నీశ్వరునిసేవించుటకై వెళ్ళుచుండిరి దుర్వాసుఁడు తన భుక్తశేషమును లేడిపిల్లలకుఁ బెట్టుచుండుట చూచి యా ముని చేయు పోషణమున కచ్చెరువొంది సంతోషముచేఁ దుంబురుఁడు చిటిక వేసెను. ఆ చప్పుడునకు బెదరి లేడిపిల్లలు పాఱిపోయెను. దుర్వాసునకుఁ గోపమువచ్చి మీరు మనుజులై పుట్టుఁడనియె. ఈ శాపముచే నితఁడు కాంచి నగరమునఁ జిఱుతొండఁడు అను వైశ్యుఁడుగఁ బుట్టెను. హర.

తుర్వసుఁడు:-దేవయానీ యయాతుల పుత్త్రుఁడు; యదువు సోదరుడు. ఇతని యౌవనము తనకిచ్చి తన జరాభారము గైకొనుమని తండ్రియగు యయాతి కోరెను. ఇతఁడు తిరస్కరించెను. కాన నితని వంశమువారలు రాజ్యార్హులు కాకుండునట్లు తండ్రి శపించెను. భార.

తులసి:-ధర్మధ్వజునకు లక్ష్మియంశమునఁ బుట్టిన కూఁతురు. ఈమెతల్లి మాధవి. ఈమె చిన్నతనమునందే బదరీవనమునకేగి తపస్సు చేసెను. బ్రహ్మ ప్రత్యక్షమై వరము వేఁడుకొనుమనఁగ విష్ణుమూర్తియే నాకు భర్తయగునట్లు వరమిమ్మని యీమె కోరెను. బ్రహ్మ యావరము నిచ్చి "విష్ణుశాపముచే నీవు వృక్షమ వగుదువు. అతి పవిత్రతను బొందుదువు. నీవు నిజముగ నారాయణునిఁ బొందఁగలవు" అని నుడివెను. తులసి విరహవేదనతో వనమునందు సంచరించుచుండెను. ఈమెను శంఖచూడుఁ డను దనుజుఁడు చూచి మోహించి యీమె దగ్గఱకు వచ్చి నీవెవ్వరవు? ఇచట నేల సంచరించుచుంటివని సంభాషణ ప్రారంభించెను. వారొకరి మనోభావము నొకరెఱింగిరి. అంతలోనే యచ్చటకు నారదుఁడు వచ్చి యీ తులసికి శంఖచూడుఁడే తగును. యీ శంఖచూడునకు తులసియే తగును. మీ రిరువురు తప్పక వివాహము కావలసినదియే యని చెప్పెను. వారొకరి నొకరు వలచియుండిరి. కావున గాంధర్వమున వివాహము చేసికొనిరి. శంఖచూడుఁ డదిమొదలు దేవతలతో యుద్ధము చేయఁ బ్రారంభించెను. దేవత లాతని ధాటి కాగలేక పోవుచుండిరి. శంఖచూడునితోఁ బోరుటకుఁ గాళి వచ్చెను. కాని యీమెయు నోడిపోయెను. దేవత లంతఁ గుమారస్వామిని దీసికొని వచ్చిరి. ఈ దానవుని బాణములతో నతఁడు మూర్ఛితుఁడయ్యెను. వానిని దేవతలు శివునికడకుఁ గొనిపోయిరి. అపుడు శివుడు స్వయముగవచ్చి శంఖచూడునితోఁబోరి వానిని జంపెను. పిమ్మట శివుఁడు శంఖచూడుని కవచము గైకొని యతని రూపము ధరించి తులసియింటి కరిగెను. తులసి తనభర్త యుద్ధములో గెలిచి

వచ్చినాఁడని వాని కభ్యంగనము కావించి భోజనముపెట్టి వాని పర్యంకమునఁ జేరెను. వారు రతిక్రీడలను దేలిరి. అతని నీమె నిజముగఁ దన భర్తయే యనుకొని ముచ్చటించుచుండెను. కాని యంతలోనే యామె వంచింపఁబడినట్లు గ్రహించె. ఛటాలున లేచి దూరముగ నిలువఁబడి వికలమనస్కయై చూచుచుండెను. శివుఁడును లేచి యీమె శపించునని భయపడి తాను శివుఁడననియును, దనను వివాహము కోరి తపస్సు చేసి యుండుటచే నిది సమకూడెననియు, శంఖచూడుఁడు తులసిని వివాహము కోరి తపస్సు చేసి యుండుటచే నతఁడు పరిణయమయ్యెననియుఁ జెప్పెను. తాఁగోరిన విష్ణుమూర్తి యతఁడే యని యెఱింగి తులసియానందము నొందెను. ఆమె యాశరీరము విడిసి యన్యశరీరము (వృక్షరూపము) ధరించెను. బ్ర. వై.

వృంద దగ్ధయై భస్మమైనచోట విష్ణుమూర్తి స్తంభించి నిలచిపోయెను. ఇచ్చట గింజలు చల్లిరి. తులసి మొలచెను. (చూడుము వృంద.)

తులాధరుఁడు:-వారణాసియందు ఒక వర్తకుఁడు. ఇతఁడు కడు ధార్మికుఁడు; సత్యపరుఁడు; పేరాసలేక వ్యవహారము చేసికొనుచుండును. ఇతఁ డెన్నడును యజ్ఞములుచేసి యెఱుఁగడు. జాజలి యితనికడకు వచ్చి బ్రహ్మగీతలు నేర్చుకొనెను.

(చూడుము జాజలి)

తుల్యభాగ:-ఒకనది. తుల్యభాగుఁ డనువానినిబట్టి యీ పేరు వచ్చెను. భీమేశ్వరుఁడు ప్రత్యక్షమగునని యింద్రాదులు చూడ వచ్చుచుండిరి. సప్తమునులు గోదావరిని దీసికొని వచ్చుచుండిరి. మార్గమందొక నదిపొంతను దానవులు తపస్సు చేసికొనుచుండిరి. మునులు తీసికొని వచ్చుచున్న నది పొంగి యా దానవుల పదార్థములను ముంచివైచెను. దానవులకుఁ గోపమువచ్చి మునులు తీసికొనివచ్చిన యానది శుష్కతోయ యగుఁగాక యని శపించిరి. దానవులు చేరి యున్న యానది యపవిత్రయు, నస్పృశ్యయు నగుఁగాక యని మునులు శపించిరి. తుల్యభాగుఁడను దానవుఁడు సద్ధర్ముఁడు గావున నిట్లొకరి నొకరు శపించుకొనుట మంచిదిగాదని చెప్పి దేవతలను, దానవులను నుపశాంతులఁగఁ జేసెను. శాపము పూర్తిగఁ గ్రమ్మరించుట యసాధ్యము. కావునఁ దుల్యభాగయందుఁ బర్వదినములందును, ఆదివారమునాఁడును స్నానము చేసిన యెడల పుణ్యము వచ్చునట్లును; దంపతీయుక్తముగ స్నానముచేసిన సంతానము కలుగునట్లును దేవతలు వరము నిచ్చిరి. భీమే.

తుల్యభాగుఁడు:-ఒక దానవుఁడు. ధర్మపరుఁడు. ఇతఁడు భీమేశ్వరుని జూడవచ్చుచున్నపుడు గోదావరిని దెచ్చు మునులును, నదికడఁజేరి తపస్సు చేసికొనుచున్న దానవులును నొకరి నొకరు శపించుకొనుటచూచి యది యుక్తము కాదని వారికి మధ్యవర్తిగనుండి కొంతవఱకు శాపవిమోచనము చేసెను. భీమే.

తుషిత:-స్వారోచిష మనుకాలమందు వేదశిరుఁడను విప్రుని కూఁతురు. ఈమెకు విష్ణుమూర్తి కుమారుఁడుగ విభుఁడను పేరుతో జన్మించెను. భాగ.

తుషితుఁలు:-దేవతలు. తోషుఁడు, ప్రతోషుఁడు, సంతోషుఁడు, భద్రుఁడు, శాంతి, నిడస్పతి, కవి, విభుఁడు, వహ్ని, సుదేవుఁడు, లోచనుఁడు అనువారలు. ఆకూతి కుమారుఁడైన యజ్ఞుఁడును, ఆమె కుమారితయైన దక్షిణయు వీరి తలిదండ్రులు. భాగ.

తృ

తృణబిందుఁడు:- వేగవంతుని కుమారుఁడైన బుధుని తనయుఁడు. ఇతనికి నిలబిల యను కుమారిత కలదు. ఆమెకుఁ బుట్టిన కూఁతురు అలంబుస యనునామె యితనిని మోహించుటచే నీతఁడాపడుచును వివాహమయ్యెను. ఆమెయందిలబలయనుకుమారితయు, విశాలుఁడను కుమారుడును బుట్టిరి. ఇతని నివాసమునకు సమీపముగనే పులస్త్యుఁడు తపస్సు చేసికొనుచుండెను.

తృణబిందుని కుమార్తె పులస్త్యుని యాశ్రమమున సందడిచేసెను. అతని శాపమువలన నామె గర్భవతియయ్యెను. తృణబిందుఁడు తనకుమార్తె నిర్దోషిణియని గ్రహించి యామెను బులస్త్యునకు భార్యగనిచ్చి పరిగ్రహింపుమని కోరెను.

ఉ. రా.

తృణబిందుఁడు:- వేదవంతుని కుమారుఁడైన బంధుని పుత్త్రుఁడు. అలంబుస అను దేవకామిని యితనినిఁ జూచి మోహించెను. వారికి ఇలబిల అను కుమార్తె కలిగెను.

ఈ యిలబిలకు, విశ్రవసునకుఁ బుట్టిన కుమారుఁడు కుబేరుఁడు.

తృణబిందునకు విశాలుఁడు, శూన్యబంధుఁడు, ధూమకేతుఁడు అను మువ్వురు కుమారులు కలిగిరి. భాగ.

తృణావర్తుఁడు:-ఒక రాక్షసుఁడు. (పూర్వభవమునందు సహస్రాక్షుఁడనురాజు) కృష్ణునిజంపుటకై వాఁడు కంసునిచేఁ బంపఁబడెను. ఈ దనుజుఁడు సుడిగాలివలె వచ్చి కృష్ణునిపై కెగురఁగొట్టెను. కాని కృష్ణుఁడు బరువయ్యెను. ఇతని భారముచే దనుజుఁడు క్రిందఁబడెను. వాని నపుడు కృష్ణుఁడు సంహరించెను. భాగ.

తే

తేజశ్శ్రవ:- గాంధారితోఁబుట్టువు. ఈమెనుగూడ ధృతరాష్ట్రుఁడు వివాహమయ్యెను. భార.

తేజస్వి:- దృఢస్యుని కుమారుఁడు. అగస్త్యుని పౌత్త్రుఁడు. ఇతఁ డపారమైన ఇధ్మభారమును వహించుటచే ఇధ్మవాహుఁడను పేరుకూడ వచ్చెను. భార.

త్ర

త్రయ్యారుణి:- ఋక్షయుని కుమారుఁడు.

త్రసదస్యుఁడు:- పురుకుత్సుని కుమారుఁడు. అనరణ్యుని తండ్రి.

త్రసదస్యుఁడు:- ఒక రాజు. ధనము కావలసిన యగస్త్యుఁడును, నిద్దఱు రాజులును నితనికడకు వచ్చిరి. ఇతనికడ ధనము మిగులకుండుటచే వారిని వెంటఁబెట్టుకొని యిల్వలునికడకు గొని పోయెను. భార

త్రసుఁడు:- మతినారుని తనయుఁడు. ఇతనిభార్య కాళింది వీరికుమారుఁడు ఈలినుఁడు. భార.

త్రి

త్రికళ:- మహామాయ. బ్రహ్మ విష్ణు మహేశ్వరు లొకరి నొకరు రతిభావముతోఁ జూచుకొను చుండఁగా వారి చూపులవలన నొక కన్యక యేర్పడియెను. ఆమెయే మహామాయ. ఆమె పేరు త్రికళ యనిరి. ఆమె దేహమందలి వర్ణత్రయమును మూడు మూర్తులుగ విభజింపుమని కోరిరి. ఆమె దేహమందలి బ్రహ్మశక్తి శ్వేతపర్వతమునకుఁబోయి తపస్సు చేసికొనుచుండెను. అప్పుటకు బ్రహ్మవచ్చి వరము వేఁడుకొను మనఁగ సర్వపదార్థముల యందును నేనే వ్యాపించి యుండునట్లు వర మొసఁగుమని కోరెను. బ్రహ్మ ఆమెను దన శరీరములోనికిఁ దీసికొనియెను. అప్పటి నుండియు సృష్టి వర్థిల్లెను.

విష్ణుశక్తియైన నారాయణి మహావైభవముతో మందర నగరమునం దుండెను. అప్పటికి నారదుఁడు వచ్చి ప్రణమిల్లి యామెసొగసును గొనియాడి విష్ణుమూర్తి యింకను నిన్నుఁ గైకొనకుండుట చిత్రమేయని వెడలెను. అప్పటనుండి నారదుఁడు మహిషాసురుని కడకుఁ బోయి మందరనగరమున సుందరాకారయగు కామినిగలదు. ఆమెవంటివారీ లోకమున లేరు. నీకుఁ దగినకాంత యామెయే యని చెప్పెను. మహిషాసురుఁ డామెను గొనిరమ్మని

తన భటుల నంపెను. నారదుఁడు మఱల నారాయణికడకు వచ్చి చూచితివా? మహిషాసురుని కావరము. నిన్నుఁగోరి సేనలను బంపుచున్నాఁడు. వానిని నీవుతక్క నొరులు గెలువఁజాలరని చెప్పెను. మహిషాసురుని భటులు వచ్చిరి. వారి నీమె ధిక్కరించెను. మహిషాసురుఁడు స్వయముగవచ్చి యుద్ధముచేసెను. కాని ఈమెవలనఁ జంపఁబడియె.

త్రిశక్తియొక్క ఈశ్వరశక్తి రురుఁడను దానవుని జంపెను. అతనిచర్మమును, ముండమును రెండుగాఁ జేసెను. కావున చాముండి అని యామెకుఁ బేరువచ్చెను. వరా.

త్రికాలజ్ఞుఁడు.- ఒక ముని. ఇతనికడకు సుశర్మ భార్యను తెచ్చుట కెవ్వరుదాచిరో యనుటకు ఉత్తముఁడు వచ్చెను. వచ్చిన యారాజున కర్ఘ్యమిమ్మని శిష్యున కాజ్ఞయిచ్చెను. కాని శిష్యుఁడు చక్కఁగ నాలోచించి యానతిండని పల్కెను. ముని దివ్యదృష్టివలన రాజు భార్యాహీనుఁడని యెఱింగి యర్ఘ్యముమాట తలఁపక వచ్చినపని యేమని? రాజునడిగి, సుశర్మభార్యను బలాకుఁడను దనుజుం డెత్తుకొనుపోవుట యెఱింగించెను. నాకేల యర్ఘ్యమీయ? వని రాజడుగఁగ భార్యాహీను లర్ఘ్యమునకుఁ బాత్రులు కారని తెల్పెను. ఉత్తముని భార్య యగు బహుళను పాలపోతకుఁడు హరించె ననియు నితఁడే యుత్తమునకుఁ జెప్పెను. మార్క.

త్రిగర్త:- సుశర్మ పాలించినదేశము. భార.

త్రిజట:- విభీషణుని కూఁతురు. లంకయందు సీతకుఁ గావలియుండిన రాక్షసి. ఈమెకే రాముఁడు సముద్రము దాటివచ్చినట్లును, రావణాసురుఁడు యుద్ధములోఁ జనిపోయినట్లును కల వచ్చెను. ఆ వృత్తాంత మీమె సీతతోఁజెప్పెను. ఈమె సీతను గౌరవముగనే చూచుచుండెడిది. రామా.

త్రిజటుఁడు:-ఒక పేదబ్రాహ్మణుఁడు; శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోవుచుండ దానమును జేయుమని యాచించెను. అతఁడు తన గోవులను జూపి వానిపైపు దండమొకటి విసరుమనియె. ఆ దండము పడినచోటువఱకు నుండిన గోవులను త్రిజటున కిచ్చెను. రామా.

త్రితుఁడు:- బ్రహ్మమానస పుత్త్రులలో నొకఁడు. బ్రాహ్మణుఁడు. ద్వితుఁడు, ఏకతుఁడు ఇతని సోదరులు. వీరు ముగ్గురు నొకరాజునొద్ద గోవులను దక్షిణగఁ బడసి వచ్చుచుండఁగ నితనిని వంచించి సోదరు లిఱువురును నితని గోవులను గైకొనిరి. భార.

త్రిధన్వుఁడు:- సుమనుని కుమారుఁడు. సూర్యారణ్యుని తండ్రి.

త్రిపురాసురులు:- విద్యున్మాలి, తారకాక్షుఁడు, కమలాక్షుఁడు అనువారలు. వీరు తారకుని కుమారులు. దేవతలతో యుద్ధము చేసి తారకుఁడు చనిపోఁగా నతని కుమారులీ ముగ్గురు బ్రహ్మనుగురించి ప్రార్థించిరి. అతఁడు ప్రత్యక్షముకాఁగా వారికిఁ జావులేకుండునట్లు వరము కోరిరి. అది యసాధ్యమని బ్రహ్మ చెప్పెను. అంత వారు సకల సౌఖ్యములు కలిగి కామగమనముకల్గిన మూఁడు పురములను గోరిరి. బ్రహ్మ వారికొసంగి యాపురములను మూఁడును నొకదానితో నొకటి కలియకుండ నున్నంతకాలము వారెవ్వరివలనను నోడింపఁబడరనియును, వారు ముగ్గురు కలిసిరేని బలహీను లగుదురనియుఁ గూడ నుడివెను. ఈ దనుజులు ముగ్గురును మయునిచేత పసిడి, వెండి, ఇనుములతో మూఁడు పురములు చేయించుకొనిరి. తారకాక్షుని కుమారుఁడు హరి యనువాఁడు విష్ణువును బ్రార్థించి తమవారిలో నెవ్వరు చనిపోయినను వారిశరీరములను నీటఁదడుపఁగనే వారు బ్రతికి యొక్కొక్కఁడు పదిమందియై వచ్చునట్లు చేయఁగల ప్రభావముతోఁ గూడిన జలయుతకూపములను తమనగరముల నిర్మించుమని కోరెను. విష్ణు వా వర మొసంగెను. త్రిపురాసురులు తమ నగరములతోఁ ద్రిలోకములందు సంచరించుచు నగరములతోడనే వ్రాలుచుండిరి. అందుచే దేవతల సదనములును, భూలోకమందలి నగరములును పొడిపొడియై పోవుచుండెను. దేవతలందఱును బ్రహ్మతోఁ జెప్పుకొనిరి. బ్రహ్మ వారినిఁదీసికొని శివునికడకు వెళ్ళెను. ఆ దనుజులను సంహరించుట తనకు సాధ్యముకాదనియును, తన తేజస్సులో సగము వారి కిత్తుననియును చెప్పి బ్రహ్మాదులనే దనుజులను జంపుడనియును శివుఁడు గోరెను. బ్రహ్మాదులే శివునకుఁ దమ తేజమిత్తుమనిరి.

వారిని జంపుటకుఁ దగిన యాయుధములు లేకుం
డుటచేఁ బృథ్విని రథముగను, వేదములను
హరులుఁగను, సూర్యచంద్రులను చక్రములుఁగను,
బ్రహ్మను రథసారథిగను జేసిరి. శివుఁ డా
ముగ్గురు దనుజులను తన నిందుతేజముతోఁ దలఁ
చెను. వారుముగ్గురు నొక్కచోటఁజేరిరి. అపుడు
శివుఁడు పాశుపతాస్త్రముతోఁ గొట్టెను.
ఆ పురములు మూడును దహనమయ్యెను.
దనుజులు మరణించిరి. భార.

త్రిపురాసురులు:-మయుఁడు ఇనుము, వెండి, బంగారములతో, గామగమనముగల మూఁడు నగరములను నిర్మించి యసురులకిచ్చెను. వానిలోఁ బ్రవేశించి యసురులు దేవతలను బాధించుచుండిరి. వారు విష్ణుమూర్తితోఁ జెప్పికొనఁగా నతఁడొక బాణమున వానిని గొట్టెను. ఆ యొక్క బాణమే యనేక వేలబాణములై యసురులను దాకెను. అంత మయుఁడు అసురులను నొక సిద్ధరసమయంబైన కూపంబునఁ బెట్టెను. ఆ రసప్రభావంబు నవారి కేపాటును దగులదు. విష్ణువు ధేనువై, బ్రహ్మ లేగయై వచ్చి యారసమును ద్రావివైచిరి. కావలి యున్నవారలు ధేనువును జూచుచుండిరి కాని కొట్టరైరి. రసమాస్వాదింపఁబడఁగా వారునిర్బలు లైరి. పిమ్మట శివుఁడు త్రిపురమును బాణమునఁ గొట్టికూలవేసెను. భాగ.

త్రిబంధనుఁడు:-అరుణుని పుత్త్రుఁడు. ఇతని పుత్త్రుఁడు సత్యవ్రతుఁడు. ఈ సత్యవ్రతుఁడే త్రిశంకుఁ డనఁబరగెను. భాగ.

త్రివక్ర:-కంసునిదాసి. ఈమె శరీరము మూడు వంకరలు తిరిగియుండెను. ఈమెయే కుబ్జ. ఇది కంసునికై గంధలేపనములు గొనిపోవుచుండగ నీమె యొద్దనుండి వానిని కృష్ణుఁడు పుచ్చుకొనెను. ఇట్లు పుచ్చుకొని ప్రీతుఁడై ఆమె పాదములపై తనపాదములు మోపి లేవనెత్తి ఆమెవంకరలు పోగొట్టెను.

కృష్ణునివలన నీమెకు ఉపశ్లోకుఁడు అను పుత్త్రుఁడు కలిగెను.

త్రివృష్ణుఁడు:-వసుదేవునకు ధృతియందుఁబుట్టిన కుమారుఁడు.

త్రిశంకుఁడు:-(త్రిబంధనుని పుత్త్రుఁడు) భాగ.

త్రిశంకుఁడు:-ఒకసూర్యవంశపురాజు. త్రిధన్వుని (త్రయ్యారుణుని) పుత్త్రుఁడు. ఇతని పేరు సత్యవ్రతుఁడు. ఇతఁడు పెండ్లియైన యొక యువతిని బలాత్కారమున నెత్తికొనివచ్చెను. దానికిఁ దండ్రి కోపపడి తన నగరమునుండి వీనిని పొమ్మనియె. నే నెక్కడకుఁ బోవుదునని యితఁడడుగ "పో, కుక్కలను దినువారితోఁ గలిసిపో" యని త్రిధన్వుఁడు కసరికొట్టెను. సత్యవ్రతుఁడు నగరమువిడిచి పోయెను. త్రిధన్వుని రాజ్యమునఁ బండ్రెండు సంవత్సరములు వర్షములు లేకుండెను. దేశమున క్షామముపట్టెను. వసిష్ఠుఁడు రాజ్యమును రక్షించుచుండెను. ఆకాలమున విశ్వామిత్రుని కుటుంబమా నగరముననే యుండెను. వారికిని దినుటకులేక కుమారుని కంఠమున కురివేసి వీథివీథిని ద్రిప్పుచు, ఈ బాలు నిచ్చెదను; నూరుగోవు లిచ్చెదరా? లేదా మమ్ములను బోషించెదరా? యని విశ్వామిత్రుఁడు అఱచుచుండెను. సత్యవ్రతుఁడు తాను పోషించెద ననియె. సత్యవ్రతునకు వసిష్ఠునిపైఁ గోపము కలదు. తనను దండ్రి పొమ్మని చెప్పునపుడు తన పక్షమున వసిష్ఠుఁ డొక్కమాటయైన నాడినవాఁడు కాఁడు. అదియే కోపకారణము. కావున విశ్వామిత్రునికుటుంబమును బోషించుటకై వసిష్ఠుని ధేనువును జంపెను. కాని ఆకలి గొనుటచేఁ దానే యాధేనువును భక్షించెను. ఇది వసిష్ఠునకుఁ దెలిసెను. నీ తండ్రికి బాధ కలిగెడు కార్యము చేసియుండుటచేతను, గురుధేనువును వధించుటచేతను అప్రోక్షిత మాంసమును భక్షించుటచేతను మూడుతెఱంగుల హృదయశంకువులు కల్పించుకొంటివి. త్రిశంకుఁడవైతివి అని వసిష్ఠుఁడు పలికెను. అప్పటినుండియుఁ ద్రిశంకువను పేరాతనికి వచ్చెను. ఇతని భార్య సత్యరథ. ఇతని కుమారుఁడే హరిశ్చంద్రుఁడు. బ్రహ్మ.

ఈ త్రిశంకుఁడు దేహముతో స్వర్గలోకమునకుఁ బోవఁగలుగు యాగము చేయించుమని పురోహితుఁడగు వసిష్ఠునిఁ గోరెను. అదియసాధ్యమని ముని చెప్పెను. త్రిశంకువునకుఁ గోపము వచ్చి వసిష్ఠుని దూషించి యతని పుత్త్రుల నట్లే యడిగెను. వారును జేయింపమనఁగ వారినిగూడ నిందించెను. వారు నీవు చండాలుఁడవు కమ్మని

శపించిరి. విశ్వామిత్రుని భార్యను, బిడ్డలను నితఁడు పోషించెను గాన నీతనిపై దయఁగలిగి విశ్వామిత్రుఁడు వరము వేఁడుకొను మనియెను. ఇతఁడు శరీరముతో స్వర్గమునకుఁ బోఁగోరి వసిష్ఠు నడిగి విఫలమనోరథుఁ డయ్యెను గావున నట్లుంపుమని విశ్వామిత్రుని నడిగెను. విశ్వామిత్రుఁడు సమ్మతించి యందుకై యాగము చేయించుటకుఁ దనశిష్యులను, నితర మునులను బిలచెను గాని వారు రాలేదు. విశ్వామిత్రుఁడొకఁడే దానినిజేయించి తన తపస్సు ధారవోసి త్రిశంకుని దర్భలతోఁ ద్రోసి స్వర్గమునకుఁ బంపెను. ఇంద్రుఁ డితఁడు స్వర్గమున నుండుట కిష్టపడక క్రిందికిఁ ద్రోసివేసెను. ఇతఁడు పడిపోవుచు విశ్వామిత్రునిఁ దలంచుకొని ప్రార్థించెను. విశ్వామిత్రుఁడు వీనిని బడకుండ నాపి వానికై యన్యస్వర్గము నిర్మించెద ననియె. అది యింద్రుఁడెఱిఁగి విశ్వామిత్రునికడకు వచ్చి స్వర్గము నిర్మించవలదని వేఁడి త్రిశంకుఁ డపుడున్న చోటుననే నుండుట కంగీకరించెను. త్రిశంకుఁ డట్లు భూస్వర్గలోకముల మధ్య నుండెను. బ్రహ్మ.

త్రిశంకుస్వర్గము:-త్రిశంకుఁడు భూస్వర్గలోకములకుమధ్యగనిలచినస్థానము. (చూడుత్రిశంకుఁడు)

త్రిశిఖుఁడు:- తామసమనువు కాలమందు ఇంద్రుఁడు. భాగ.

త్రిశిరుఁడు:-ఒక రాక్షసుఁడు. ఖరదూషణులతో నుండువాఁడు. వారితోఁగలసి రామలక్ష్మణుల మీఁదకుఁ బోరాటమునకుఁబోయి వారిచేఁ జంపఁబడెను.

త్రిశిరుఁడు:-త్వష్ట్రప్రజాపతి కుమారుఁడు. వీనికి మూఁడు మొగములు గలవు. ఎక్కువగాఁ దపస్సు చేయుచుండెను. ఒక ముఖముతో వేదములు చదువుచు, రెండవ ముఖముతో దిక్కులన్నియును జూచుచుఁ మూఁడవముఖముతో మద్యమును ద్రోలుచు నుండును. వీనియొక్క తపస్సును భంగము చేయుటకు ఇంద్రుఁడు అప్సరసలను బంపెను గాని వారు వానిని గదల్పలేకపోయిరి. అంత నింద్రుఁడే వీని శిరములను ఖండించెను. ఒక శిరమునుండి కపింజలములును, రెండవశిరమునుండి తిత్తిరులును బుట్టెను. వానినిఁజంపుటచేతనే త్వష్టవృత్రునిఁ బుట్టించెను. దే. భా

త్రే

త్రేతాగ్నులు:-తనను విడిచి వెళ్ళిన యూర్వశి నిప్పింపుఁడని పురూరవుఁడు గంధర్వులను బ్రార్థించెను. వా రగ్ని నిచ్చి దాని నర్పించుమనిరి. అతఁడు దానిని మూడు భాగములుగఁజేసి పూజించి స్వర్గమును బొందఁగలిగెను. ఉపాసనార్థంబైన యగ్ని యట్లు మూడుగ విభజింపఁబడి త్రేతాగ్నులయ్యెను.

వసిష్ఠుని మర్త్యయోనిని జన్మింపుమని శపింపఁబడిన శిఖండికిఁ 'త్రేతాగ్నులు' పావకుఁడు, పవమానుఁడు, శుచి అను కుమారులుగ జన్మించిరి. భాగ.

త్వ

త్వష్ట:-ఒక ప్రజాపతి. ఇంద్రునిపైఁగల కోపముచే నతనికిఁ గీడుచేయుటకై మూడు శిరములు కల్గిన విశ్వరూపుఁడనువాని నితఁడు సృజించెను. విశ్వరూపుని నింద్రుఁడు వధించెను. ఆకోపముచే నింద్రునిసంహరించుటకై హోమముచేసి యితఁడు వృత్రాసురుని గల్పించెను. ఇతనికి భయపడి యింద్రుఁడు పాఱిపోయెను. భార.
త్వష్టకుమారిత పద్మకోమల స్కాంద.

త్వా

త్వాష్ట్రుఁడు:-శుక్రుని కుమారుఁడు. భార.

ద

దండకారణ్యము:- వింధ్యపర్వతమునకు దక్షిణమున నున్న యరణ్యము. దండుని పురము మట్టిలోఁ గలిసి యందు నరణ్యము బయలుదేరుటచే దానికి దండకారణ్యమని పేరువచ్చినది. రామా.

దండధారుఁడు:- మగధరాజు. భారతయుద్ధమం దర్జునునితోఁ బోరెను. వీనిని, వీని యేనుఁగును నర్జునుఁడు సంహరించెను. భార.

దండనీతి:- కృతయుగమున మొదట రాజు లేఁడు. జనులు ధర్మబద్ధులై యొండొరులకు రక్షకులుగ నుండిరి. కాని కాలవశమున వారికిఁ గామక్రోధములు పెరిగెను. జను లధర్మవర్తనులైరి. వేదవిధ్వంసకులైరి. యజ్ఞయాగాదులు లేవు. ఆ సంగతి దేవతలు బ్రహ్మతోఁ జెప్పుకొనిరి. బ్రహ్మ "స్వామి, అమాత్య, రాష్ట్ర, కోశ, సుహృద్బలంబులు, సంధి, విగ్రహము మొదలగు వానినిగూర్చి నూఱువేల యధ్యాయములుగల గ్రంథము" నీతిశాస్త్రమును రచించెను. అది లోకహిత చరిత్ర నిర్మాణించుట కుపయోగించు ననియెను.

బ్రహ్మ లలాటమునుండి విరూపాక్షుఁడు, విశాలాక్షుఁడను నామమున ఆవిర్భవించి ఆ గ్రంథ మధివహించెను. దానిని జదువుటకు మనుష్యుల కాయువు చాలదని, దానిని సంక్షేపరూపమునఁ బదివేల యధ్యాయములు గలదానినిగఁ జేసెను. అది వైశాలాక్షం బనఁబడెను. దానిని ఇంద్రుం డయిదువేలు చేసెను. బృహస్పతి మూఁడువేలు చేసెను. శుక్రుఁడు ఒక వెయ్యి చేసెను. మునులు దానినింకను సంక్షేపించిరి. పిమ్మట దేవతలు విష్ణువొద్దకుబోయి తదీయాచారంబులు నడుప నొక రాజును బంపుమనిరి.

నిజతేజోమయుండైన యొక మానసపుత్త్రుని విరజాండనువానినిఁ బుట్టించెను. అతఁడు భూలోకమునకు రాఁ డొల్లఁ డయ్యెను. ఇతని పుత్త్రుఁడు రాజ్యమేల్లననియెను. ఇతని పుత్త్రుఁడు అనంతుఁడు ఈ శాస్త్రముచొప్పున భూమిని బరిపాలించెను.

దండము:- బ్రహ్మ అధ్వరము చేయఁదలచుకొని తనవంటి ఋత్విజునకై వెదకి యొందును గానక వేయేండ్లు గర్భముతాల్చి తుమ్మి యొకనిని వెలువరించెను. క్షుతసంభవ్యముచేత నతనికి క్షుతుఁడని పేరువచ్చెను. బ్రహ్మ యాగము చేయుచుండఁగా దండము అంతర్ధానమయ్యెను. అంతఁ గార్యాకార్యములకు మర్యాద తప్పెను. బ్రహ్మ విష్ణువుకడకరిగి యది చెప్పికొనెను. అతఁడు రుద్రునికడకుఁ గొనిపోయెను. ఆ మహాదేవుఁడు తన ప్రభావమును దండముగాఁ జేసి యిచ్చెను. అతఁడు దండనీతి కాశ్రయుఁ డయ్యెను. దండంబును, దండనీతి ప్రపంచంబులైన విద్యలను విష్ణువశముచేసెను. విష్ణు వాంగిరసున కిచ్చెను. అతఁడు ఇంద్ర మరీచులు అను వారల కిచ్చెను. మరీచి భృగునకిచ్చెను. ఇతఁ డితరమునులకుఁ దెలిపెను. భార.

దండుఁడు:- ఇక్ష్వాకు కడగొట్టుకుమారుఁడు. కడు దుర్మార్గుఁడు. బాల్యమున నాడుకొనునపుడు కూడఁ దోడిబాలురను మిక్కిలి బాధించుచు నొకప్పుడు మృతినొందించువాఁడు. తండ్రివీనిని నగరమునుండి వెడలఁగొట్టి వింధ్యపర్వతము కడకుఁ బొమ్మనియెను. దండుఁడు వింధ్యపర్వతము సమీపమునకుఁ బోయి మధుమంత మను పురము నిర్మించి పరిపాలించెను. ఇతఁడు శుక్రాచార్యునియొద్ద విద్యనభ్యసించి రాక్షసులతో సఖ్యము చేయువాఁడు. ఒకనాఁడు శుక్రుని యాశ్రమములోనికిఁ బోవుచు నతని కూఁతురు తపస్సు చేసికొనుచున్న దానిని జూచి కామించి నీవెవ్వర ? వని యడిగెను. నేను అరజ యను దానను; శుక్రుని కూఁతురను అని యామె చెప్పినను దనయభిప్రాయ మెఱింగించెను. గురుపుత్త్రికను, నీకుఁ జెల్లెలివంటిదానను అని యామె చెప్పుచుండినను నీతఁడు బలవంతముగ నామెతో రమించెను. అరజ యేడ్చెను. శుక్రునకీ వార్త తెలిసి యతఁడువచ్చి యితనిపైఁ గోపగించి యితనిపురముపై శతయోజనముల కలుకు మట్టివర్షము కురియునట్లు శపించెను. మధుమంత నగరము మన్నులోఁ గప్పఁబడియెను. ఆ ప్రదేశమునందటపైన నరణ్యము మొలచెను. అదే దండకారణ్యము. ఉ. రా.

దండుఁడు:- శ్రుతదేవ వసువుకుమారుఁడు. మత్స్య.

దంతవక్త్రుఁడు:- శిశుపాలుని తమ్ముఁడు. వృద్ధశర్మనకు శ్రుతదేవయందుబుట్టిన కుమారుఁడు.

కరూషదేశమున కధిపతి. తనసోదరుఁడగు శిశుపాలుని మిత్రులగు సాల్వ పౌండ్రక వాసుదేవాదులను శ్రీకృష్ణుఁడు సంహరించి యుండుటచే వానిపైఁ బగపట్టి యుండెను.

దంతవక్త్రుఁడు తన మిత్రులకుఁ బారలౌకిక క్రియలు చేసివచ్చుచుండఁగ శ్రీకృష్ణుండు కనఁబడియెను. అప్పుడాతనిని సంహరింపఁబోయెను. శ్రీకృష్ణుఁడు వానిని సంహరించెను. అప్పుడితని శరీరమునుండి తేజస్సు వెడలి శ్రీకృష్ణునిలోఁ బ్రవేశించెను.

దంభుఁడు:-విప్రజిత్తు కుమారుఁడు. పుత్రులులేక పోవుటచే నితఁడు ఘోరముగాఁ దపస్సు చేసెను; లోకము లన్నియును గంపించెను. దేవతలందరును విష్ణుమూర్తికడకు వెళ్ళిరి. నా భక్తుఁ డొకఁడు పుత్రునికై తపము చేయుచున్నాఁడు. మీకు భయములేదు. వెళ్లుఁడని చెప్పి దంభునకు విష్ణుమూర్తి ప్రత్యక్షమయ్యెను. దంభుఁడు కోరిన వరమునిచ్చెను. దంభునకు శంఖచూడుఁడను కుమారుఁడు పుట్టెను. శివ.

దంభోద్భవుఁడు:-ఒకరాజు. గంధమాదనముపైఁ దపస్సు చేసికొనుచుండిన నరనారాయణుల కడకుఁబోయి గర్వితుఁడై వారిని దనతో రణమొనర్చుటకుఁ బిలచెను. వారితని నోడించి పంపిరి. భార.

దక్షసావర్ణి:-వరుణుని కుమారుఁడు. తొమ్మిదవ మనువగును. ఇతని పుత్రులు ధృతకేతువు, దీప్తకేతువు మొదలగువారు రాజులగుదురు. అద్భుతుఁడు అనువాఁడు ఇంద్రుఁడు. భాగ.

దక్షసావర్ణి:-దక్షుని తనయుఁడు. ఇతఁడు తొమ్మిదవ మనువయ్యెను. ఇతని మన్వంతరమునఁ గుమారస్వామియే అద్భుతుండను పేరుతో నింద్రుఁడయ్యెను. మేధాతిథి, వసువు, సత్యుఁడు, జ్యోతిష్మంతుఁడు, ద్యుతిమంతుఁడు, సవనుఁడు, హవ్యవాహనుఁడు అనువారు సప్తఋషులైరి. మార్క.

దక్షిణ:-రుచిప్రజాపతికి లక్ష్మియంశమునఁ బుట్టిన కుమార్తె. ఈమెతల్లి ఆకూతి ఈమె సోదరుఁడగు యజ్ఞునే భర్తగాఁ బడసెను. వీరలే యాదిమిథునము గావున నది యాక్షేపణీయము కాదు. వీరికి తోషుఁడు, సంతోషుఁడు, ప్రతోషుఁడు, భద్రుఁడు, శాంతి, ఇడస్పతి, ఇధ్ముఁడు, కవి, విభుఁడు, వహ్ని, సుదేవుఁడు, రోచనుఁడు అనువారు పుట్టిరి. వారే తుషితులను దేవతలైరి. భాగ.

దక్షిణ:-విష్ణువుయొక్క యంశమున రుచిప్రజాపతికి యజ్ఞుఁడు పుట్టెను. యజ్ఞుని స్వాయంభువమనువు పెంచెను. దక్షిణ యజ్ఞునే భర్తగాఁ గోరెను.

దక్షిణకాశి:-(శ్రీ కాళహస్తి చూడుము)

దక్షుఁడు:-(తక్షకుఁడు) శ్రీరాముని తమ్ముఁడగు భరతుని పుత్రుఁడు. వీని పేరుననే (తక్షక) దక్షపురము నిర్మించి వీనిని బట్టాభిషిక్తునిఁ జేసెను.

దక్షుఁడు:-నరిష్యంతుని కుమారుఁడైన చిత్రసేనుని పుత్రుఁడు. ఇతని పుత్రుఁడు మీఢ్వాంసుఁడు. భాగ.

దక్షుఁడు:-ప్రజాపతులలో నొకఁడు. ఇతఁడు బ్రహ్మ దక్షిణాంగుష్ఠమునఁ బుట్టెను. బ్రహ్మ వామాంగుష్ఠమునఁ బుట్టిన ధరణిని వివాహమయ్యెను. ఈ దంపతులకుఁ గీర్తి, లక్ష్మి, ధృతి, మేధ మొదలగు నేఁబదిమంది కూఁతులును, నైదుగురు కుమారులును బుట్టిరి.

వీరిలో నెనమండ్రు పుత్రికలు ముఖ్యులు. వారిలో సతి యను నామె పెద్దది. ఆమెను శివున కిచ్చి వివాహము చేసెను. బ్రహ్మ చేయుచుండిన యజ్ఞము చూచుటకు దక్షుఁడు కూడ వెళ్ళెను. అచ్చట శివుఁడుండెను. దక్షునిఁ జూచియు నతఁడు లేవక, గౌరవింపక యూరకుండెను. అందువలన శివునిపై దక్షునకుఁ గోపము కలదు. దక్షుఁడు కుమార్తెల నింటికిఁ దీసికొనివచ్చి వారికిఁ జీరలిచ్చుచుండును గాని శివుఁడు తనకు మ్రొక్కఁడనియు, దనకుఁ బరిచర్య చేయఁడనియుఁ గోపముచే సతిని మాత్రము పిలువకుండెను. పెద్దకాలము సతి భర్తయింటికడనే యుండెను. కాని తన తోఁబుట్టువులఁ జూచు నభిలాషతో నొకసారి తండ్రియింటి కేఁగెను. దక్షుఁడు యజ్ఞము చేయుచున్నాఁడని విని పిలువకపోయినను సతి తండ్రియింటికి వెళ్ళెను. నీవేల వచ్చితివి? యని దక్షుఁ డీమె నడిగెను. నేనేమి యపరాధము గావించితినని సతి యడుగఁగ నీపతి నన్నవమా

నించి ద్వేషించుచుండును. నీవునా కులాంగారవము చెఱుపఁ బుట్టితివి అని యామెపై కోపించి యామె భర్తను దూషించెను. పతి నవమానించు వాని పలుకులు వినలేక పతినే స్మరించుకొనుచుఁ దిరిగి జన్మమునకైనను శివునే పతిఁగ బడయు టకు శివునిఁ బ్రార్థించుచు సతి యోగాగ్ని కల్పించుకొని శరీరము దహింపఁ జేసికొనెను. శివుని కీవృత్తాంతము తెలిసివచ్చి దక్షుఁడు చేయు యజ్ఞము ధ్వంసముచేసెను. మఱియు వీరభద్రాదు లను బుట్టించి దక్షునిపక్షము వారిని సంహరింపఁ జేసెను. ఇతఁడు దక్షుని శిరముకూడ నఱకెను. అతని భార్య వేఁడఁగ మేఁక గొఱియతల పెట్టిరి. అందువలన దక్షునకు అజముఖుఁ డను పేరు వచ్చెను. మఱియు "నీవు తిరిగి చాక్షుషమన్వం తరమున మారిషయను నంగనయందుఁ బుట్టుము. అప్పుడును దక్షుఁడను పేరటనే యుండుము. నీవు చేయు సర్వకార్యములకు నేను విఘ్నములు కల్పింతు" నని శివుఁడు శపథము చేసెను. దక్షు నకుఁ గోపమువచ్చి "నీవు నన్ను శపించితివి కాఁబట్టి త్రిదశులతో హవ్యములు పొందకుందు దువుగాక. కాలాంతమునకును హీనత ననుభ వింతువుగాక" యని ప్రతిశాప మిచ్చెను.

దక్షుఁడు ప్రచేతసులకు మారిషయను కాంత యందుఁబుట్టెను. ఇతఁడు కొంతసృష్టిచేసి యిఁక చేయలేక తపస్సున కరిగెను. అఘమర్షణ మను తీర్థముకడ జపమాచరించుకొనుచుండఁగ విష్ణువు ప్రసన్నుఁడై అసిక్ని అను నామె నితనికిచ్చి యామెవలన మిథునవ్యవాయధర్మమున సృష్టిని చేయుమని చెప్పెను. (దక్షునిపిమ్మట నుండి ఆధర్మముననే సంతానము కలుగుచుండెను.) ఆమెవలన హర్యశ్వులు, శబళాశ్వులు అను పుత్త్రు లును; భానువు, విశ్వ, సాధ్య మొదలుగాఁగల యఱువదిమంది కూఁతురులును బుట్టిరి. దక్షుఁడు తన పుత్త్రులను సృష్టి చేయుఁడని యాజ్ఞాపించిన వారు దానికిఁ బూనుకొని చనిరి. ఇంతలో నారదుఁడు దక్షకుమారులకడకేగి మీరు ముక్తి మార్గము మానుకొనక సంసారములో దిగదరేల? ఆకార్యము మానుఁడని వారిచే సృష్టిచేయుట మానిపించెను. ఈ వార్త దక్షునకు దెలిసినది. అతఁడు బ్రహ్మకడకుఁబోయి సృష్టికి నారదుఁడిట్లు భంగము కల్పించెనని చెప్పికొనెను. నారదుఁడు దక్షుని కూఁతురందు జన్మించునట్లు శపించి బ్రహ్మ దక్షుని కోపోపశమనము గావిం చెను. మఱియు నారదున కొక్కచో నిలుకడ లేకుండునట్లు దక్షుఁడు శపించె. దక్షుఁడు ప్రియ యను తనకూఁతును బ్రహ్మకిచ్చెను. ఆమెయందు నారదుఁడు మరల జన్మించెను.

భాగ. బ్రహ్మ.

తనకుమార్తెలగు తారలనిరువదేడ్గురను దక్షుఁడు చంద్రునికిచ్చి వివాహము చేసెను. చంద్రుఁడు వారినందఱను సమానముగఁ జూడక రోహిణి యం దక్కువాసక్తిగల్గి తక్కినవారివైపు మాడఁడయ్యె. వారు తమదుఃఖమును దండ్రితోఁ జెప్పికొనిరి. తన కుమార్తెల భంగపాటునకు దక్షుఁడు విచా రించి చంద్రునిపైఁ గోపముకల్గి నీవు క్షయుఁడవు కమ్మని శపించెను. చంద్రుఁడు శివునిశరణు వేఁడఁగ నతఁడు చంద్రుని తనశిరమునఁ దాల్చెను. దానఁ జంద్రుఁడు తారలకు మఱింత దూరమయ్యెను. దక్షుఁడు శివునికడకువచ్చి చంద్రుని విడువు మనియె. శివుఁడు నిరాకరించెను. దక్షుఁడు శివుని గూడ శపింపబోయిన విష్ణుమూర్తివచ్చి చంద్రుని రెండుభాగములుఁజేసి యొకదానిని శివునకిచ్చి దక్షునిశాపము తప్పకుండునట్లు రెండవభాగము వృద్ధిక్షయము బొందునట్లుచేసి దానిని తారల కిచ్చెను. బ్రహ్మవై.

విశ్వకర్మ యజ్ఞముచేసి దక్షునకు దక్షిణ దేశమును దక్షిణగ నిచ్చెను. కాని భూదేవి దానికి సమ్మతింపక రసాతలమున కరిగెను. దక్షుఁడు కాళీదేవిని ప్రార్థించెను. అప్పుడామె వేదిరూపమునఁ బైకివచ్చెను. భార.

దత్త:-జంభాసురుని కుమార్తె. ఈమెకు హిరణ్య కశిపునివలన ప్రహ్లాదుఁడు పుట్టెను. భాగ.

దత్తాత్రేయుఁడు:-అనసూయా అత్రుల కుమా రుఁడు దత్తాత్రేయుఁడు. అత్రి విష్ణువునిఁ గూర్చి తపస్సుచేయఁగ హరి నీకు నేను దత్తుఁడ నైతినని పలికెను. అట్లు పుట్టినసుతుఁడు దత్తా త్రేయుఁడను పేరునఁ బరగెను. సంతానమునకై తపస్సుచేసిన అత్రికి బ్రహ్మవిష్ణుమహేశ్వరులు ప్రత్యక్షమై వారి కళలతోఁ గుమారులు పుట్టుదురని వరమిచ్చిరి. విష్ణ్వంశమునఁ బుట్టినవాఁడే దత్తా త్రేయుఁడు. ఇతని భార్య లక్ష్మి. అలర్కునకు ప్రహ్లాదముఖ్యులకు ఆత్మవిద్యను దెలిపెను.

భాగ.

దానవులవలని బాధ తప్పింపుమని దేవతలితనిని గోరిరి. దానవులను దనయొద్దకుఁ దీసికొనిరండని యితఁడు చెప్పెను. దేవతలు రాక్షసులను యుద్ధమునకుఁ బిలిచి వీని యాశ్రమము చెంతకు వచ్చిరి. రాక్షసు లితని యాశ్రమములో లక్ష్మిని జూచి యామె నపహరించుటకై యామెను శిరమునఁ దాల్చిరి. అంత వా రపగత శిరస్కులైరి. మార్క.

దత్తాత్రేయుని మునిపుత్త్రులు సదా కొలుచుచుండిరి. ఇతఁ డొంటరిగ నుండగోరినను వారు విడువకుండిరి. వారిని దప్పించుకొనుటకై యతఁ డొక కొలనులోఁ బ్రవేశించెను. ఇంకను మునిపుత్త్రులు వెళ్ళక కొలనుగట్టునఁ గూర్చుండిరి. అంత నతఁ డొక దివ్యాంగనను దోడ్కొని వచ్చెను. అయినను వారు వెళ్ళలేదు. అంత నతఁ డామెతో సంభోగింపఁజొచ్చెను. అపుడు మునికుమారు లితనిని వదలి వెళ్ళిరి.

దత్తాత్రేయుని కార్తవీర్యుఁడు కొలుచుచుండెను. నేను స్త్రీలోలుఁడను. నన్నేల కొలిచెద? వని దత్తుఁడడిగెను. నీవు విష్ణుమూర్తివి. అందు వలన నిన్నుఁ గొలుచుచుంటినని రాజు పలికెను. పిమ్మట దత్తుని నపానవాయు జనితానలముచే కార్తవీర్యుని బాహువులు మాడిపోయెను. అయినను రాజు వానిని సేవించుచుండెను. వీనిస్తుతికిని భక్తికిని మెచ్చుకొని దత్తాత్రేయుఁడు వరము వేఁడుకొనుమనియె. అతఁడు బాహుసహస్రమును, రాజ్యమును గోరెను. ఇతఁడిచ్చెను. మార్క.

దత్తిలుఁడు:-ఒక సంగీతశాస్త్రకర్త.

దధిముఖుఁడు:-కద్రువ కుమారుఁడు.

దధిముఖుఁడు:-ఒక వానరుఁడు. సుగ్రీవునిబంటు. మధువనమును గాచుచుండువాఁడు. మధువనమును జొచ్చి ఫలములను గోయుచుండిన వానరుల, నంగదాదుల నడ్డగించి వారివలనఁ ద్రోపులను బడి సుగ్రీవునితోఁ జెప్పికొనెను.

దధీచి:-ఒక ముని. చ్యవనునిపుత్త్రుఁడు. సారస్వతమను తీర్థమున నితఁడు నియమంబు లాచరించిన నింద్రుఁడుశంకించివిఘ్నముచేయుటకైయలంబుసయను నప్సరసను బంపెను. ఈమెను జూచుట తోడనే దధీచికి వీర్యము స్ఖలితమయ్యెను. దీనిని సరస్వతీనది తనగర్భమునఁ దాల్చెను. ఆమెకుఁ బుత్త్రుఁడు కలిగె. వానికి సారస్వతుఁడను పేరు పెట్టి యామునికిచ్చెను. ఇతఁడు వానిని ముద్దిడుకొని పండ్రెండేండ్లు అనావృష్టికలిగినను నాపద రాకుండ నితఁడు కాపాడఁగలఁడని చెప్పి యా కుమారుని నామెకిచ్చెను.

దధీచి మహాతపస్వి. అతనిభార్య లోపాముద్ర (సువర్చ). రాక్షసులు దేవతలను బాధించి వారి యస్త్రములను లాగుకొనుచుండుటచే దేవతలు తమయస్త్రములను దధీచిచేతికిచ్చి దాచిపెట్టుమని వెళ్ళిరి. దధీచి వానిని పుచ్చుకొనియుంచెను. దేవతలు భోగము ననుభవించుచు నెంతకాలమునకుఁ దిరిగిరాలేదు. ఇంతలో దధీచి యభిమంత్రించి వారియస్త్రములను పానము చేసెను. పిమ్మట దేవతలువచ్చి మా యస్త్రములు మాకిమ్మనిరి. వానిని నేను పానము చేసితిని. మీకిపుడిచ్చుట కష్టమనియతఁడు చెప్పెను. కాని దేవతలు మాయస్త్రములు మాకిచ్చుట తప్పదని బలవంతపెట్టిరి. మీ యస్త్రములు నాయెముకలను బట్టియున్నవి. నన్ను జంపి నాయెముకలు తీసికొనుఁడని దధీచి పలికెను. నీవు బ్రతికియుండఁగ నీయెముకల నెట్లు తీసికొందుము ? నిన్నుఁ జంపుదుమా ! బ్రాహ్మణవధ చేయము అని దేవతలు పలుకఁగ దధీచి "యోగాగ్ని కల్పించుకొని శరీరము దహించుకొనియెదను. నాయస్థులు తీసికొను"డని యతఁడగ్ని కల్పించుకొని దానియందుఁ బ్రవేశించి శరీరము దహించుకొనెను. ఇతని యెముకలనుండియే బ్రహ్మ చక్రము, వజ్రాయుధము మొదలగు నస్త్రములుచేయ నేర్పాటుచేసెను. ఇతఁడు మరణించునప్పటికి భార్య గర్భవతిగనుండెను. ఆమెయందు పిప్పలాదుఁడు జన్మించెను.

దధ్యంగుఁడు:- అథర్వుని పుత్త్రుఁడు. ఇతనికింద్రుఁడు మధువిద్యను, బ్రహ్మవిద్యను నేర్పి దాని నెవ్వరికిని జెప్పకుండుమని శాసించి, చెప్పినచో వానితల ఖండింతునని భయపెట్టెను. అశ్వినులు దధ్యంగునితల తీసి దాని నొకచోటనుంచి వానికి గుఱ్ఱముతల పెట్టి యతనివలన విద్యలను నేర్చుకొనిరి. దధ్యంగుఁ డశ్వినుల కుపదేశించెనని యింద్రుఁడు విని వీనితల ఖండించెను. వీని గుఱ్ఱపుతల పోయెను. అపు డశ్వినులు వాని పూర్వపుశిరమునునతికించిరి.

దనుఁడు:-ఒక ముని. బదరికాశ్రమంబున నుండువాఁడు. ఇతనికడకు వీరద్యుమ్నుఁడు అను రాజు వచ్చి తన కుమారుఁడు భూరిద్యుమ్నుఁడు అనువాఁడు వేఁటకువెళ్ళి తిరిగి రాలేదని చెప్పి, పుత్త్రుఁ డేమయ్యెనో యని విచారింపఁ దొడఁగెను. "ఏ పదార్థమందైన నాశ యున్నచో విచారము కలుగునుగాని, ఆశ లేనియెడల విచారముండదు. కావున ఆశను విడువు" మని యీ ముని బోధించి తన తపోమహిమచేత భూరిద్యుమ్నునిఁ దెప్పించి రాజునకప్పగించెను. భార.

దనువు:-ధరణీదక్షుల కుమారిత; కశ్యపునిభార్య. శంబర, నముచి, పులోమాసి, దుర్జయ మొదలగువా రామె సంతానము. భార.

దమఘోషుఁడు:-చేదిదేశపు రాజు. కృష్ణుని మేనత్తయగు సాత్వతి యితనిభార్య. శిశుపాలుఁడు, సాల్వుఁడు ఇతని కుమారులు. భార.

ధమని:-హ్లాదుసిభార్య. వాతాపీ ఇల్వలుల తల్లి. భాగ.

దమనిక:-ఒక అప్సరస. మేనక కూఁతురు. కందరుఁడు అను పక్షి భార్య.

దమనుఁడు:-ఒక ముని. ఇతనిని సేవించి యితఁడిచ్చిన వరమువలన విదర్భరాజైన భీముఁడు దమయంతి యను కూఁతును; దమదాంత, దమను లను పుత్త్రులను బడసెను. భార.

దమనుఁడు:-విదర్భరాజైన భీముని తనయుఁడు; దమయంతి సోదరుఁడు. భార.

దమయంతి:-విదర్భరాజైన భీముని కూఁతురు. దమనుఁడను మునివరమువలన నా రాజున కీమె జన్మించెను. ఈమె వనములో విహరించుచుండఁగ నొకహంస పట్టుఁబడి మనుష్యవాక్యములతో నలుని గుణములు వర్ణించి యాతఁడే యీమెకుఁ దగినభర్తయని చెప్పెను. అప్పటి నుండియు నీమెచిత్తము నలునియందు లగ్నమయ్యె. తండ్రి ఈమెకు స్వయంవరము సాటించెను. రాకుమారులందఱును, దిక్పాలురును స్వయంవరమునకువచ్చిరి. దిక్పాలురును దమలో నొక్కరిని వరింపుమని చెప్పుటకై యీమె యొద్దకు నలునినే పంపిరి. ఈమె నలునినే పరిణయ మయ్యెదను గాని దేవతల నొల్లననియు, నది సమకూడని నాడు ప్రాణపరిత్యాగము చేసెదననియుఁ జెప్పెను. స్వయంవరమునకు ఇంద్రాదిదేవత లెల్లరు నలరూపములనే వచ్చిరి. వారిలో నలుని చేర్పరుపలేక దమయంతి దేవతలను ప్రార్థించెను. వారు ధరించిన నలరూపములను విడిచిరి. దమయంతి నలుని వరించి యాతనిని బరిణయమయ్యెను.

దిక్పాలురు స్వర్గమునకుఁ బోవుచుండఁగ, దమయంతి తనను వరించు నను నాశతో వచ్చుచున్న కలి వారి కగపడెను. వారీమె నలుని వరించె నని చెప్పిరి. కలికిఁ గోపము వచ్చి నల దమయంతుల కెడఁబాపుసేయ సమకట్టెను.

పుష్కరునితో నలుఁడు జూదము నాడునపుడు అక్షములు పుష్కరునకు వశ్యములై నలుఁ డోడుచుండుట చూచి జూదము నాడవలదని యామె భర్తను వేడెను. కాని యతఁడు వినలేదు. తనపుత్త్రుఁడగు నింద్రసేనునిఁ, బుత్త్రిక యగు నింద్రసేనను దన తండ్రియింటికిఁ బంపి, సర్వము పోయినను దాను నిక్కట్టులు పడుటకు సంసిద్ధముగా నుండెను.

నలుఁడు జూదము నాడి తనరాజ్య మోడి కాననముల కేగెను. అతనితో నీమెయు నరిగెను. అడవిలోనే వీరు సంచరించుచుండిరి. నలుని యేకవస్త్రము నతఁ డాహారమునకై పట్టుకొనబోయిన పక్షులే యెత్తుకొని పోయెను. ఈమె తన చీరలోఁ గొంత నాతనికిఁ గట్టుకొన నిచ్చెను. ఇట్లీమె యడవిలో నిడుములు పడుచుండుట నలుఁడు సహించలేక యీమె తండ్రి గృహమున కేగు నను తలఁపుతో నర్ధరాత్రియం దీమె నిదురించుచుండగ, విడిచి వేరుమార్గమున నతఁ డేగెను. భర్తకై యీమె కానన మెల్లఁ దిరిగెను.

ఒకచోఁ బాము కఱువవచ్చెను. భయముతో విలపించుచుండఁగ నొక బోయవాఁడు వచ్చి, దానిని సంహరించి యీమె రూపమును జూచి, వలచి తన మనం బెఱిఁగించెను. అంతఁ "దాను పతివ్రతనైతినేని తోడనే వాఁడు మరణించుఁగాక" యని యీమె శపించెను. ఆ యెఱుకల వాఁడు వెంటనే మరణించెను. ఈమె విపిన

ములోఁ దిరుగుచు నొకచో మునులను గాంచి నమస్కరించెను. వారు తమ దివ్యదృష్టినిఁ జూచి అచిర కాలములో నలునిఁ గలిసికొందువని యును, సుఖముగా నుందువనియును జెప్పిరి. ఆ వనములో నిద్రాహారములులేక యలసి యలసి యందుఁ గనఁబడిన వర్తకులను నలునిఁగూర్చి యడుగుచు వారు చేదిదేశమునకుఁ బోవుట విని తానును నరిగెను. అట రాజమాత యీమెను జూచి ప్రీతమనస్కురాలై రావింపఁ దన కథ చెప్పి "పరపురుషులతోఁ బలుకననియును, ఉచ్ఛిష్టమును దిననొల్లననియును, పదములు పట్టననియును, పతిని వెదకు బ్రాహ్మణులతో మాత్రము పలుకుదాన ననియును, వీనికి నామె యొడంబడినచో తాను సైరంధ్రిగ నుందు" నని యును జెప్పెను. ఆమె యందుకొడంబడెను. ఈమె దమయంతి యగుట యామెకుఁ దెలియదు. దమయంతియొక్క తల్లిదండ్రులచే వెదుకఁ బంపిన బ్రాహ్మణుఁ డీమెను గుర్తించెను. దమయంతి తన పినతల్లిని దెలిసికొనెను. అటనుండి తండ్రియింటి కేగెను. అక్కడ నలుని కొఱకుఁగూడ బ్రాహ్మణులను వెదుకఁ బంపుమని దమయంతి కోరెను. ఈమె పలుకుమన్న మాటలకు సమాధానముగ ఋతుపర్ణుని యొద్దనున్న వికృతరూపుఁడే మాఱు పలికెను. ఇంకెవ్వ రట్లనలేదు. అతఁడు నలుఁ డగునని సందేహించి మఱియొక బ్రాహ్మణునిఁ బంపి, "దమయంతీ ద్వితీయ స్వయంవరంబు మఱునాఁడే జరుగుచున్న"దని ఋతుపర్ణు నాహ్వానించిరి. దానిని జూచుటకు ఋతుపర్ణుఁడు బాహుకునిచే రథంబు తోలించుకొని వచ్చెను. బాహుకుఁడు ఋతుపర్ణునికై వంటచేయుచుండగ వానిని బరీక్షించుటకు, దమయంతి దాసినిఁ బంపెను. మఱలఁ దనబిడ్డలను బంపెను. వీరి నెత్తుకొని ముద్దాడి బాహుకుఁడు కంటనీరుఁ గార్చెను. ఇతఁడు నలుఁడని నిశ్చయించి తల్లి యనుమతిని దమ గృహంబునకు రావించి "తనను ఒంటరిగ నడవిలో విడిచిపోవుట నలునకు ధర్మమా?" అనియెను. "ఆమె మఱల నిట్లు స్వయంవరము చాటించుట సిగ్గు గాదా?" యని నలుఁడనియెను. "వానిని గుర్తించుటకే యిట్లుచేసె"నని యామెపలికెను. వాయుదేవుఁడును ఆమె పతివ్రత అని పలికెను. నలుఁడు కర్కోటకునిఁ దలంచి పూర్వరూపమును గైకొని యామెనుగూడి సుఖంబుగా నుండి మఱల రాజ్యమును సంపాదించుకొనెను.

దమయంతి కీర్తనము కలినాశనము, పాప నాశనము, సుఖప్రదము, సంతోషప్రదము. భార.

దముఁడు:–అరిందముఁ డను రాజకుమారుఁడు. ఇతఁడు పూర్వజన్మమున యజ్ఞదత్తుఁడను బ్రాహ్మణుని కుమారుఁడు. రాజ్యమేలుచు గుడులయందు దీపారాధనము చేయించుచుండు వాఁడు. దముఁడు కాశిలో విశ్వేశ్వరుని ప్రార్థించెను. పార్వతీపరమేశ్వరులు ప్రత్యక్షమైరి. ఈశ్వరుని తేజము చూడలేక వానిం జూచు శక్తినిమ్మని వేఁడఁగ శివుఁ డిచ్చెను. ఇతఁడు ముందుగఁ బార్వతిని జూచి యామె సౌందర్యమును వర్ణించెను. ఆమెకు గోపము వచ్చెను. ఇతనికన్ను బ్రద్దలయ్యెను. "ఇతఁడు భక్తుఁడు; పుత్త్రునివంటివాఁడు; కరుణింపు!" మని ఈశ్వరుఁడు చెప్పెను. దృష్టి చెడకుండ వరమిచ్చెను. అలకాపట్టణమిచ్చెను. శివ.

దముఁడు:–మరుత్తు కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు రాజవర్ధనుఁడు. భాగ.

దముఁడు:–దమయంతి సోదరుఁడు; భీముని కుమారుఁడు. భార.

దముఁడు:–దానవుఁడు. శతశృంగుని తనయుఁడు. సదముఁడు, విదముఁడు ఇతని సోదరులు. వీరు దేశములఁ గొల్లకొట్టుచు అంబరీషునినగరముపైఁ బడగ వాని భటుఁడును, సుదేవుఁడును; యుద్ధముచేసి వీనిని సంహరించిరి. భార.

దముఁడు:–నరిష్యంతుని కుమారుఁడు. ఇతఁడు వేద వేదాంగములు నేర్చెను. వీనినిఁ జారుకర్ముని కుమార్తె సుమన స్వయంవరమున వరించెను. స్వయంవరమునకు వచ్చిన యితర రాజులు మహానంద వపుష్మంతాదు లీర్ష్యచే బలవంతంబున సుమనం గొనిపోవ నాలోచించిరి. దముఁ డది యెఱింగి "కన్య తావలచిన వానిని వివాహమగుట న్యాయము గాని, యిట్లు బలవంతంబునఁ గొనిపోవుట ధర్మమా?" యని సభ్యులఁ బ్రశ్నించెను. కన్య దముని వరించెనుగాన నామె దమునిభార్యయగు; ఇపు

డాపెను బలవంతంబునఁ గైకొనుట పరదారాపహారణంబగునని సభ్యులు పలికిరి. అంత దముఁడు శక్తిగలదేని నామెనుగొంపొండని బాణమెత్తెను. మహానందాదు లీతనితోఁబోరిరి; వపుష్మంతుఁ డోడి పాఱిపోయెను. మహానందు నితఁడు సంహరించెను. పిమ్మట శాస్త్రోక్తముగ నితఁడు సుమనం బరిణయమయ్యెను.

నరిష్యంతుఁడు దమునకుఁ బట్టము కట్టి తపోవనమున కరిగెను. వపుష్మంతుఁ డరణ్యములో వీనింజూచి తన రిపుఁడగు దముని తండ్రియని యెఱింగి వానిశిరమును ఖండించెను. ఆవృత్తాంతము నరిష్యంతుని భార్య తనసుతునకుఁ దెలియజేసెను. ఇతఁడు సేనాసమేతుఁడై యేగి వపుష్మంతునితో యుద్ధముచేసి వానిని సంహరించెను. మార్క.

దర్భకుఁడు:- అజాతశత్రుని కుమారుఁడు. శిశునాగుని వంశములోనివాఁడు. ఇతని కుమారుఁడు అజయుఁడు.

దర్భలు:- గరుత్మంతుఁడు తెచ్చిన యమృతమును సర్పములకిచ్చుటకై సర్పములు స్నానము చేసివచ్చువఱకు దర్భలపైఁ బెట్టెను. అందువలననే దర్భలకుఁ బవిత్రత కలిగెను. ఈ దర్భలు నాకుటవలననే పాముల నాలుకలు చీలి రెండయ్యెను. కుమారస్వామి దర్భలమధ్యనే పెరిగెను. భార.

దర్శుఁడు:- ధాతకు సినీవాలియందుఁ బుట్టిన కుమారుఁడు. భార.

దలుఁడు:- సుశోభనా పరీక్షితుల కుమారుఁడు. శలుని తమ్ముఁడు. శలుఁడు చంపఁబడినపిమ్మట నితఁడు రాజయ్యెను.

వామదేవుఁడను బ్రాహ్మణుని గుఱ్ఱములు శలుఁడు పుచ్చుకొనిఉండెను. (చూడుశలుఁడు) వాని నిమ్మని బ్రాహ్మణుం డడుగ వచ్చెను. దలుఁడు కుపితుఁడై ఈబ్రాహ్మణుఁడు బ్రొవ్వి వదరుచున్నాఁడు. విషదిగ్ధసాయకమును దెండు. వీనిని సంహరించెద ననియెను. నీవు నాపై వేయఁదలచిన బాణ మపుడే యంతఃపురమందలి నీ కుమారునిఁ జంపునని వామదేవుఁడు పలికెను. అట్లే జరిగెను. దలునకుఁ గోపము మఱింత హెచ్చయ్యెను. వామదేవునిఁ జంపుటకు బాణమును సంధింపఁబోయెను. కాని వాని హస్తంబులు స్తంభితములై పోయెను. అంత దలుఁడు చిన్నఁబోయి, బ్రాహ్మణ ప్రభావము గొప్పదని యంగీకరించి వామదేవునిఁ బ్రార్థించెను. ఆ బ్రాహ్మణుఁడు మఱల వీని చేతులు వచ్చునట్లును, పుత్త్రుఁడు బ్రతుకునట్లును అనుగ్రహించెను. వీనిగుఱ్ఱములును వీనికి దలుఁ డిచ్చెను. భార.

దల్భుఁడు:- ఒకఋషి. ఇతనితండ్రి దవిద్యోతుఁడు (అభిజిత్తు). దుందుభి కుమారుఁడు.

దశరథుఁడు:- మూలకుని కుమారుఁడు. వృద్ధశర్మ తండ్రి.

దశరథుఁడు:- సూర్యవంశపురాజు. అజుని కుమారుఁడు. భానుమంతుని కూఁతురగు కౌసల్య యీతనినిఁ జూచి మోహించెను. భానుమంతుఁడును దన కూఁతు నితని కివ్వఁగోరి యితని నాహ్వానముచేసెను. దశరథుఁడు పరివారముతోఁ బోవుచు మార్గమం దొక నదిలోఁ గొట్టుకొనిపోయి సముద్రమందు మందసంబునఁ జేరెను. అచ్చటనే రావణునిచేఁ దస్కరింపఁబడి దాచఁబడిన కౌసల్య యుండెను. ఆమె నచటనే దశరథుఁడు పరిణయమయ్యెను. అచ్చటినుండి వారిని జటాయువను పక్షి యయోధ్యకుఁ దీసికొనివచ్చెను.

దశరథునకుఁ గౌసల్య, కైక, సుమిత్ర యను ముగ్గురు భార్యలు కలరు. ఇతఁడొకసారి ఇంద్రునితోఁ గలసి శంబరాసురునిమీఁదకు యుద్ధమునకుఁ బోవుచుఁ గైకనుగూడ వెంటఁ గొంపోయెను. ఇతఁడు యుద్ధము చేయుచుండఁగ రథచక్రముకీలు ఊడిపోయెను. కైక తన వ్రేలా చోటునుంచి చక్రమును గాపాడెను. దశరథుఁ డది యెఱింగి మిక్కిలి సంతోషించి రెండువరము లిచ్చెదను కోరుకొమ్మనియెను. నాకుఁ గావలసినపుడు కోరెదను; అపుడిమ్మని యామె యనియె.

దశరథుఁ డొకనాఁడు వేటకుబోయి నీరు ముంచుచున్న బ్రాహ్మణబాలునిఁ జూచి యేనుఁగని భ్రమించి బాణముతోఁ గొట్టెను. ఆ బాలుఁడు బిగ్గఱగ నఱచి నేలంబడియెను. దశరథుఁడు మానుషస్వరము విని దగ్గఱకుఁబోయి

బ్రాహ్మణ బాలునిఁజూచి మిక్కిలి పరితపించెను. కాని యిఁక నేమిచేయఁగలఁడు? యజ్ఞదత్తుఁడను ఆ బాలుఁడు తాను తన వృద్ధపితరులకు నీరము గొనితెచ్చుటకై వచ్చితి నని చెప్పెను. దశరథుఁడు జలమునుఁగొని వాని తల్లిదండ్రులకిచ్చి వారు దాహము తీర్చుకొనినపిదప వాని పుత్త్రుని మరణమును గుఱించి చెప్పెను. ఆ దంపతులకుఁ బుత్త్రశోకముచేఁ గలిగిన దుఃఖమునకు మేరలేదు. నీవును బుత్త్రశోకముచే మరణించెదవని దశరథుని శపించి వారు ప్రాణములు విడచిరి.

దశరథునకు శాంత యను కుమారిత జన్మించెను. ఇతని మిత్త్రుఁడైన రోమపాదున కామెను బెంపిచ్చెను. దశరథునకుఁ బుత్త్రసంతానము కలుగక పోవుటచేఁ బుత్త్రకామేష్టి చేసెను. అగ్నిహోత్రమునుండి పురుషుఁ డొకఁడువచ్చి పాయసము దశరథున కిచ్చి యతని భార్య కిమ్మనియె. ఇతఁడు కౌసల్యకు సగమును, కైకకు సగమును నివ్వగ వారు చెరిసగమును సుమిత్త్రకు నిచ్చిరి. వారియందు దశరథునకు రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు పుట్టిరి.. పుత్త్రులను నల్వురను నతిగారాబముతోఁ బెంచుచుండెఁ; వారి కుపనయనముచేసి విద్యాభ్యాసము చేయించఁదలచుచుండెను. ఆసమయమున విశ్వామిత్త్రుఁడువచ్చి తన యాగ రక్షణమునకై రామలక్ష్మణులను బంపుమనియె. రాక్షసమయమైనవనము లెచ్చట! ఈ పసిబాలు రెచ్చట! దశరథుఁడు వీరిని బంపుటకు సంకోచించెను. కాని విశ్వామిత్త్రునకు వెఱచి వారిద్దఱిని నా మునివెంటఁ బంపెను.

దశరథుఁ డొకనాఁడు పురోహితునిఁ జూడ వెళ్ళెను; అచ్చటకే దుర్వాసుఁడుకూడ వచ్చెను. ఈ మునిని "రాముఁ డెన్నియేండ్లు రాజ్యము చేయును? ఎందఱుసుతులు కలుగుదురు?" అని యడిగెను. "రాముఁడు పదునొకండువేలయేండ్లు రాజ్యము చేయుననియు, నతని కిరువురు పుత్త్రులు పుట్టుదురనియు, దుదకు భార్యావియోగము వచ్చుననియు" దుర్వాసుఁడు చెప్పెను. దానికిఁ గారణము విష్ణుమూర్తికి భృగుపత్ని యిచ్చిన శాపమని తెల్పెను.

విశ్వామిత్త్రుఁడే రామలక్ష్మణులకు విద్యాభ్యాసముగావించి శస్త్రాస్త్రవిద్యలను నేర్పెను. వీరు తాటకాది రాక్షసులను సంహరించెను. జనకునింటికిఁ బోయిరి. అచ్చట రాముఁడు శివునివిల్లు విఱిచెను. సీతను రామునకిచ్చి వివాహముచేయుటకు జనకుఁడు నిశ్చయించి దశరథునకు వర్తమానము చేసెను. దశరథుఁడు సామంతరాజవర్గముతో వెడలి కుమారులకు వివాహము గావించెను. వారందఱును నయోధ్యకు మఱలివచ్చిరి.

రామునకు యువరాజ పట్టాభిషేకము చేయుటకై దశరథుఁడు నిశ్చయము చేసెను. వసిష్ఠాదులు సుముహూర్తము చూచిరి. పురమంతయు నలంకరించిరి. ప్రజలందఱు నుత్సాహముతో నుండిరి. మరునాఁడే పట్టాభిషేకము జరుగును. దశరథుఁడు కైకను బిలుచుటకై యత్యుత్సాహముతో వెడలెను. ఆమె మందిరమునఁ గానరాదయ్యె. ఆమె యాభరణములను దీసివేసి మలిన వసనముగట్టి విచారముతోఁ బరుండెను. దశరథుఁ డామె కడకుఁ జేరి "యిట్లేల యుంటివి? రామునకు బట్టము కట్టుచుంటిని. సంతోషముతో నుండు" మనెను. ఆమెకు దుఃఖ మెక్కువయ్యెను. తన కిచ్చెద నన్న వరము లిమ్మనియె. రామునిఁ బదునాలుగేండ్లు వనవాసమునకుఁ బంపుమనియె. భరతునకుఁ బట్టము కట్టుమనియె. దశరథుఁడు "మొదలునఱికిన తరువు"వలెఁ గూలెను. కైకను నిందించెను. రామునిఁజూచి విచారముపొందెను. అచ్చటకు శ్రీరాముఁడు వచ్చెను. కైకవరము తెలిసికొనెను. తండ్రిమాట నెఱవేర్చెదననియె. కైక యిచ్చిన నారచీరలు కట్టి వనముల కేగెను. రామునితో లక్ష్మణుఁడు, సీతయు నరిగిరి. భరత శత్రుఘ్నులు మేనమామ యింటికడనే యుండిరి. లేక లేక కనిన పుత్త్రులిద్ద ఱరణ్యముల పాలైరి. దశరథుఁడు రాముని విడిచి నిలువలేఁడయ్యె. పట్టభద్రుఁడు కావలసిన రాముఁ డడవికేగెనని తలపలేఁడయ్యె. ఆతని గుండియలు విచ్చెను. పుత్త్రదుఃఖముతోఁ బ్రాణములు విడిచెను. రామా.

దశార్ణ:- గాంధారి తోఁబుట్టువు. ఈమెను గూడ ధృతరాష్ట్రుఁడు వివాహమయ్యెను.

దశార్హుఁడు:- క్రోష్టువంశమువాఁడైన దృష్టుని పుత్త్రుఁడు.

దా

దాంతుఁడు:-దమయంతి సోదరుఁడు. భీముని కుమారుఁడు. భార.

దాక్షాయణి:-ఒక వనిత. ప్రచేతసులు పదునొకండుగురకు నీమె యొక్కతయే భార్య. భార.

దారకుఁడు:-ఒక బోయవాఁడు. పింగాక్షుని పినతండ్రి. కాశీ.

దారుకవనము:- ఆర్యావర్తమున నొక వనము. మును లచ్చటఁ దపస్సుచేసికొను చుందురు. అచ్చటనే మునులు శివుని శపించిరి. లింగ మచ్చటనే యావిర్భవించెను. బ్రహ్మ.

దాశరాజు:-ఒకరాజు. యమునానదిలో నొక జాలరికి దొరకిన కన్యను, మత్స్యగంధిని, ఆజాలరితెచ్చి యీరాజున కిచ్చెను. ఆమె పెరిగి పెద్దదై యమునానదిలో నోడ నడుపుచుండెను. శంతనుఁడను రాజీమెను వరించి దాశరాజుకడకు వచ్చి మత్స్యగంధిని తన కిమ్మని వేడెను. ఈమెకుఁబుట్టు పుత్త్రునే రాజుగఁ జేసెడియెడల నిత్తునని దాశరాజు చెప్పెను. శంతనునకుఁ బెద్ద కుమారుఁడు భీష్ముఁడుండుటచే, శంతనుఁడట్లు ప్రతిజ్ఞచేయలేక మగిడి వచ్చి విచారించుచుండెను. భీష్ముఁడు తండ్రి విచారమునకుఁ గారణమును దెలిసికొని దాశరాజుకడకుఁ దాను బోయి రాజ్యము దాను అపేక్షింపననియును, మత్స్యగంధి కుమారునే రాజును జేసెదనని యును ప్రతిజ్ఞపూనెను. దాశరాజు మత్స్యగంధిని శంతనునకిచ్చి వివాహము చేసెను. భార.

దాశరాజు:- నిషాదదేశపు రాజు. మిక్కిలి దురాచారుఁడైయుండెను. అయినను శివభక్తుఁడు. ఇతనిభార్య కుముద్వతి "నీవింత దురాచారుఁడవుగద, శివభక్తుఁడ వెట్లైతి!" వని యడిగెను. "నేను పూర్వజన్మమున నొక శునకమును. మహాశివరాత్రినాఁడు శివుని గుడిలో భక్తులు పెట్టిన దీపమును జూచితిని. వారుతెచ్చిన బలిని గూడ దినఁబోతినిగాని వారు నన్నుఁ దిననివ్వక కొట్టిరి. అందువలన నుపవాస ఫలముకూడ నాకు వచ్చినది. ఆపుణ్యముచేతనే నేను పూర్వజ్ఞానము కలిగి యిట్లుంటిని" అని తనభావిజన్మములను గూర్చి కూడఁ జెప్పెను. బ్రహ్మో. పా.

దాశార్హుఁడు:-ఒక రాజు. కాశిరాజు కూఁతురగు కళావతి యనుదానిని వివాహమయ్యెను. కాని యామె యితనిని పాపుఁ డని చేరరాకుండెను. ఆమె దుర్వాసుని వలనఁ బంచాక్షరీ మంత్ర ముపదేశింపఁబడెను. ఇతఁడు భార్యను దన కుపదేశింపుమని కోరెను. భార్య భర్త కుపదేశము చేయరాదని యామె చెప్పెను. అంత నితఁడు గర్గుఁడను మునివలన మంత్రోపదేశమునొందెను. బ్రహ్మో. పా.

ది

దిక్కన్యలు:- బ్రహ్మ సృష్టి చేయఁదలఁచుకొని తలఁపోయుచుండఁగ నతని కర్ణమునుండి పూర్వ, ఉత్తర, దక్షిణ మొదలగు దిక్కులు పుట్టిరి. వీరు తాము నిలుచుటకుఁ దగినస్థానము చూపుమనిరి. "ఇది బ్రహ్మాండము. మీరు మీ యిష్టమువచ్చిన చోటున నుండుఁడు. మీకు భర్తల నచ్చటకే పంపుదు" నని బ్రహ్మ చెప్పెను. వారు వెళ్ళిరి. వారు నిలచినస్థానములకు వారి పేరులనుబట్టియే పూర్వదిక్కు, ఉత్తరదిక్కు మొదలగు పేరులు వచ్చెను. బ్రహ్మ యింద్రాదిదిక్పతుల నా యా దిక్కులకుఁ బంపెను.

దితి:- ధరణీదక్షుల కుమార్తె; కశ్యపునిభార్య; అదితి, వినత, కద్రువయామెసవతులు. ఈమెకుఁ బలువురు పుత్త్రులు జన్మించిరి. కాని వారెల్లరు దుర్మార్గులు, క్రూరులు నగుచుండిరి. కశ్యపుఁడు కూడదనుచుండినను నీమె కామోద్రేకముచే భర్తను సంధ్యాకాలముననే గవయుచుండెడిది. కశ్యపుఁడును "నీకుమారులు దుష్కర్ములై ప్రజలను బాధించుచుండఁగ వారిని హరిసంహరించు" నని శపించె. ఉగ్రకర్ములగు భద్రుఁడు, హిరణ్యాక్షుఁడు, హిరణ్యకశిపుఁడు మొదలగువారీమె కుమారులే. ఈమె పుత్త్రులను ఇంద్రుఁడు

సంహరించుచు వచ్చెను. కాని నింద్రుని వధింప సమర్థుఁడగుపుత్త్రునిఁ బడయఁగోరి పతిసేవచేయుచుండెను. కశ్యపుఁ డీమె చేసిన పరిచర్యలకు సంప్రీతుఁడై 'నీ వేదానిఁ గోరెదవు?' అని యడిగెను. "ఇంద్రునోడింపఁగల్గు సముజ్జ్వలతేజుఁడగు నొక పుత్త్రునిమ్ము" అని దితి వేడఁగ కశ్యపుఁడించుక దుఃఖముకల్గియు, సరేయనియె. వారి మాటలు ఇంద్రునకుఁ దెలిసెను. దితియు గర్భమును ధరించినట్లు వినియె. ఇంద్రుఁడు భయమొంది తనకు శత్రువు పుట్టకుండఁ జేసికొనవలెనను కొని, యొక బాలకునివలె దితికడకువచ్చి నీకు దాసుఁడనై పరిచర్య చేయుచుందును. అంగీకరింపుమని కోరెను; ఆమెకు సేవచేయఁ జొచ్చెను. ఈబాలకునిపై దితికి విశ్వాస మెక్కువయ్యె. ఒకనాఁడు మధ్యాహ్న మామె పాదములపై కేశములుంచుకొని నిదురించుచుండెను. అదియే సమయమని ఇంద్రుఁ డామె గర్భభేదము చేయఁదలఁచెను. కాని యది మహాపాతకమని గర్భములోనున్న శిశువును జంపుటకు గర్భము ప్రవేశించి శిశువు నేడు తునకలుగాఁ గోసెను. ప్రతిభాగము నేడువసాగెను. దానిని దిరిగి ఏడేసి ముక్కలుగఁ గోసెను. ఈ రోదనమువలన దితికి మెలఁకువ వచ్చెను. తన గర్భమందున్న వారిని జంపవలదు, చంపవల దని దితి యఱచెను ఇంద్రుఁడు బైటకువచ్చి తాఁజేసిన దానిని క్షమింపుమని ప్రార్థించి శత్రువు నేవిధముగనైనఁ జంపవచ్చును గాన నట్లు చేసితి ననియె. దితి తన కుమారులను ఇంద్రునకే యప్పగించి వారిని రక్షించుచుండుమని చెప్పెను. వారే మరుత్తులను దేవతలైరి. బ్రహ్మ.

దిలీపుఁడు:- ఇక్ష్వాకు కులమునఁ బుట్టినవాఁడు. ఇతనికిసంతానము కలుగలేదు. వసిష్ఠునియాశ్రమమునకేగి యతనిని సేవించెను. ఆముని "దివ్యదృష్టి వలనఁ గామధేనువు శాపమును దెలిసికొని యా ధేనువపుడు పాతాళలోకమున నుండుటచే దానికి బదులుగ దానిబిడ్డయగు తన యాశ్రమము నందున్న నందినిని గొలువు" డనియెను. ఈరాజును వీనిభార్యయును నందినీధేనువును సదాకనిపెట్టుకొని కొలుచుచుండిరి. నందిని హిమవత్పర్వతములపై మేయుచు నొక గుహలోఁ బ్రవేశించెను. ఇతఁడు దానికై గుహలోనికిఁబోఁగా, నొక సింహము నందినిని దినఁబోవు చుండుట చూచి దానినిఁ జంపుటకు బాణమును దీయఁబోయెను. ఇతని చేయి స్తంభించెను. సింహము మనుష్యభాషణములతో నిట్లు పలికెను. "నా కాహారమగుటచే నే నా ధేనువును తినుదు" ననెను. దానిని జంపలేకపోవుట తెలుసుకొని దానికి నమస్కరించి "తనను నాహారముగఁ గైకొని ముని హోమధేనువునువిడువు" మనియెను. ఇతని భక్తికి నందినీధేనువు మెచ్చుకొని "ఆ దృశ్యమంతయును దాను కల్పించిన" దనిచెప్పి కోరిన వరము లిచ్చెను. రఘు.

దిలీపుఁడు:- అనమిత్త్రుని కుమారుఁడైన దులిదుహుని పుత్త్రుఁడు.

దివిరథుఁడు:-దధివాహనుని కుమారుఁడు.

దివిరథుఁడు:-భూమన్యుని పుత్త్రుఁడు.

దివోదాసుడు:-కాశిరాజైన సుదేవుని పుత్త్రుఁడు. వీతహవ్యుఁ డను హయహయరాజు సుదేవుని జంపి యితనిపైకి యుద్ధమునకు వచ్చెను. దివోదాసుఁడు భారద్వాజుని యాశ్రమమునకుఁ బాఱిపోయి వాని నాశ్రయించెను. అచ్చట నితఁడు వీతహవ్యుని జంపగలుగు పుత్త్రుఁడు పుట్టుటకై పుత్త్రకామేష్టి చేసెను. వీనికిఁ బ్రతర్దనుఁడు అను పుత్త్రుఁడు పుట్టెను.

దివోదాసునికడనున్న తెల్లగుఱ్ఱములనురెండు వందలు నిమ్మని గాలవుఁడను మునిపుత్త్రుఁడు గోరెను. దివోదాసుఁ డొసంగెను. అందుకు ముని ప్రత్యుపకారముగ యయాతి పుత్రిక యగు మాధవిని వీనికిచ్చెను. ఆమెయం దీతనికి ప్రతర్దనుఁడను కుమారుఁడు పుట్టెను. పిమ్మట నితఁడు మాధవిని గాలవున కిచ్చివేసెను. భార.

దివోదాసుఁడు:-భీమరథుని పుత్త్రుఁడు. ఇతని పేరు ద్యుమంతుఁడు. ఇతఁడే దివోదాసుఁడనఁబరగెను. భాగ.

దివోదాసుఁడు:-ముద్గలుని పుత్త్రుఁడు. ఇతని పుత్త్రుఁడు మిత్త్రాయువు. భాగ.

దివోదాసుఁడు:-కాశీరాజు. కాశీనగరమందున్న నికుంభుఁ డను బ్రాహ్మణుఁ డితని చెంతకు వచ్చి శివునకచ్చట గుడికట్టింపుమనియు, శివుఁడట

వాసము చేయఁగోరు చున్నట్లు తన కలలోఁ దెలిపెననియుఁ జెప్పెను. దివోదాసుఁడు గుడి కట్టించి ఈశ్వరప్రతిష్ఠచేసి సదాదేవునారాధించు చుండెను. ఈ దేవుఁ డెవ రేదికోరిన నొసంగు చుండెనుగాని దివోదాసుఁడు భక్తితోఁ గొలుచుచుఁ బుత్త్రునికై ప్రార్థింపఁగ నితని కనుగ్రహింపఁడయ్యె. దాన దివోదాసునకుఁ గోపమువచ్చి గుడినిఁ బగులఁ గొట్టించెను. ఇట్టి పాతకము గావించినందుకు బ్రాహ్మణులు కినిసిరి. ఔని కుంభుఁడు కాశీనగరమును జనవిహీన మగునట్లు శపించెను. బ్రహ్మ.

దివోదాసుఁడు మొదట రిపుంజయుఁడను వాఁడు. అనావృష్టిచేఁ బ్రజలెల్లరు మరణింపఁగ రాజు లేకుండెను. బ్రహ్మ యీతనికడకు వచ్చి నీవు రాజవై, కాశీనగరమున నుండుము. నీవు దివోదాసుఁ డను పేరునఁ బరగుదువు అని చెప్పెను. (చూడు రిపుంజయుఁడు).

దిషణ:-హవిర్ధానునిభార్య. ప్రాచీనబర్హి, శుక్లుఁడు మొదలగువా రామె పుత్త్రులు. బ్రహ్మ.

దిష్టుఁడు:- ఇక్ష్వాకు తమ్ముఁడు.

దిష్యంతుఁడు:-దుష్యంతుని తమ్ముఁడు.

దీ

దీర్ఘతపుఁడు:- రాష్ట్రునికుమారుఁడు, ఇతని పుత్త్రుఁడు ఆయుర్వేదజ్ఞుఁడైన ధన్వంతరి. భాగ.

దీర్ఘతముఁడు:-ఉతథ్యుని కుమారుఁడు. ఇతనితల్లి మమత. ఇతఁడు తల్లిగర్భమందున్నపు డితని పిన తండ్రియగు బృహస్పతి మమతతో బలవంతముగ రమించెను. దాన గర్భమందున్న శిశువు బృహస్పతిపైఁగోపగించెను. "ఆ! దేవగురునిశిశువొకండు నిందించుటా!" యని గురునకు రోషమువచ్చి దీర్ఘతముఁడవు కమ్మని గర్భమందలి శిశువును శపించెను. మనుతనుఁ బుట్టంధుఁడైనవాఁడు పుట్టి దీర్ఘతముఁడను పేరునఁ బరగెను. ఇతఁడు గ్రుడ్డి వాఁడైనను సర్వవిద్యల నభ్యసించెను.

దీర్ఘతముఁడు ప్రద్వేషిణి యను కన్యను వివాహమయి సంతానమును బడసెను. భార్య యీతనిపైఁ గోపగించుకొనుచునే యుండెడిది. దీర్ఘతమున కొకనాఁడు విసుఁగుపుట్టి నీవుసంతానమునుబడసియు, నాపై నేలకిని సెదవని యడిగెను. "భరించువాఁడు భర్త భరియింపఁ బడునది భార్య. ఐనను సదానిన్నే నేనుభరించుచుంటిని; ఇంకనన్ను వదలిపొ"మ్మని ప్రద్వేషిణి నుడివెను. ఆమాటలకు దీర్ఘతమునకుఁ గోపమువచ్చి "పతిహీనయగువనిత యలంకారము, మాంగల్యము లేకయుండుగాక" యని శపించెను. దానఁ బ్రద్వేషిణికిఁ గోపము వచ్చి పుత్త్రులను బిలచి మీతండ్రిని నెటకేని గొంపోయి విడిచిరండని చెప్పెను. వారు దీర్ఘతముని గంగలోఁ ద్రోసిరి. ఇతఁడు వేదము పఠించుచుఁ బ్రవాహములోఁ గొట్టుకొని వచ్చుచుండఁగ, స్నానార్థము వచ్చిన బలి యను రాజు చూచి వానిని దనయింటికిఁ దోడ్కొనిపోయెను. బలి యితనిని మహర్షిగ నెఱిఁగి తనభార్యయందు దనకు సంతానము కలిగింపుమని కోరి భార్యను నియోగించెను. ఆమె ఈతనిని డాయుటకురోసి తన దాదికూఁతురిని బంపెను. దానికిఁగుమారులు కల్గిరి. వారు తన కుమారులేయని బలి సంతసించు చుండెను. కాని దీర్ఘతముఁడు వారు బలికుమారులు కారనియు,నతనిభార్యపంపిన దాసికుమారులనియుఁ జెప్పెను. బలి యతనిని మఱల బ్రతిమాలి భార్యను నియోగించెను. ఆమెయందీతని వలన అంగరాజు పుట్టెను. భార.

దీర్ఘదర్శి:-ఒకమత్స్యము. దీర్ఘదర్శి, ప్రాప్తకాలజ్ఞుఁడు, దీర్ఘసూత్రుఁడు అను మూడు మత్స్యము లొక మడువులో నుండెను. వేసవికాలమువచ్చుచుండఁగ నీ రింకిపోవుననియు, నప్పుడు బోయలు తమ్మును బట్టుదురనియుఁ గాఁబట్టి యీ మడువు వదలి వెళ్ళిపోవలయునని దీర్ఘదర్శి చెప్పెను. "రానున్న యాపత్తులకిప్పటినుండియు బెంగయేల? అప్పుడుచూచుకొందములే"యని ప్రాప్తకాలజ్ఞుఁ డనెను. దీర్ఘదర్శి యా మడువు విడిచి యన్య హ్రదమునుచేరెను. తక్కినవారిరువురు నచ్చటనే యుండిరి. వేసవిరాఁగ బోయలువచ్చి చేపలఁ

బట్టుకొని గ్రుచ్చుచుండిరి. ప్రాప్తకాలజ్ఞుఁడు తానే పోయి త్రాటిని నోటితోఁ గఱచుకొని యుండెను. దీర్ఘసూత్రుని కేమియు నాలోచన తెగక, ఏమిచేయుటకుఁ దోఁచక బోయలచేతు లలోఁబడెను. దానిని వారు త్రాటికిఁ గ్రుచ్చిరి. ఈ చేపలగుత్తిని నీళ్ళలోఁ గడుగుచుండఁగ ప్రాప్తకాలజ్ఞుఁడు మెల్లగాఁ ద్రాడువిడిచి నీటఁ బడి వారిని దప్పించుకొనెను. భార.

దీర్ఘబాహుఁడు:-గాంధారీధృతరాష్ట్రుల పుత్త్రుఁడు భార.

దీర్ఘబాహుఁడు:- ఖట్వాంగుని కుమారుఁడు. ఈతని పుత్త్రుఁడు రఘువు. భాగ.

దీర్ఘబాహుఁడు:-ఒకరాజు. ఇతఁడు విద్యలన్నిటిని నేర్చెను గాని గర్వ మధికముగఁ గలదు. అందువలన బ్రాహ్మణులను దూషించుచుండెను. ఇతఁడు నిందించుటచేఁ గొందఱు బ్రాహ్మణులు "నీవు పెద్దపులివి కమ్మ"ని శపించిరి. రాజు చింత నొంది "నే నెంతకాల మట్లుండవలయునో సెల విం"డని కోరెను. 'నీవు పులివై బ్రాహ్మణునొకనిని భక్షింపబోదువు. నిన్నుజూచి భయపడి బ్రాహ్మణుఁడు నారాయణనామము స్మరించును. అసమయమునను నిన్నొక బోయవాఁడు చంపును. ఆ నారాయణనామము వినఁగనే శాపవిమోచన మగును'అనిచెప్పిరి అట్లే రాజు పులియై కొంత కాలమైనపిదప'అరుణి' అనుమునినిఁ దినబోయెను ఇతఁడు భయపడి "నారాయణ, నారాయణ, నారాయణ" యని స్మరించుచుఁ బాఱిపోయెను. అపులియుబోయచేఁ గొట్టబడియె. అపు డీరాజునకు శాపవిమోచన మయ్యెను. వరా.

దీర్ఘరోముఁడు:- గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

దీర్ఘశ్రవసుఁడు:- ఉశజుని కుమారుఁడు; ఒక ముని. ఆయునను నితఁడు వర్తకముచేసెను.

దీర్ఘసూత్రుఁడు:-ఒకమత్స్యము. ముందాలోచన గాని, సమయస్ఫూర్తిగాని లేక బెస్తలచేతులలో మరణించెను. (చూడు దీర్ఘదర్శి.)

దీర్ఘాయువు:- అయుతాయువు కుమారుఁడు. తండ్రిని అర్జునుఁడోడించఁగ నితఁ డర్జునునితోఁ బోరెను. ఇతఁడును నోటువడియె. భార.

దు

దుందుభి:- ఒక గంధర్వకాంత. రావణునివలన నుపద్రవములు పెక్కులుకలుగుచున్నవని దేవతలు బ్రహ్మతోఁ జెప్పికొనునపుడు, నారాయణుఁడు మనుజలోకమునబుట్టి వానినిసంహరించునని చెప్పి అప్పుడే ఈమెను గుబ్జరూపమున మంథర యను పేర భూలోకంబున జన్మించి దేవకార్యంబులు నిర్వహించుమని పరమేష్ఠి పంపెను. భార.

దుందుభి:-ఒకరాక్షసుఁడు. మయుని కుమారుడు.

దుందుభీ:-మాయావికుమారుఁడు. ఇతఁడుహిమవంతునికడకుఁబోయి తనతో యుద్ధమునకు రమ్మని పిలచెను. నీతో నేను యుద్ధముచేయలేను. నీతో సరిగఁ బోరఁగల్గినవాఁడు వాలి యున్నాఁడు ఆతని మధువనముచొచ్చి పిలిచితివేని యతఁడు వచ్చియుద్ధముచేయునని హిమవంతుఁడుచెప్పెను. దుందుభి వాలి మధువనము ప్రవేశించి దానిని బాడుచేయుచు, హుంకరించుచువాలినియుద్ధమునకుఁబిలిచెను. వాలివచ్చి యితనితోఁబోరి వీనిని సంహరించెను. ఇతనిని బైకెత్తి క్రిందఁపడవేసి నపుడు ఋష్యమూకపర్వతముపైఁ దపస్సు చేసికొనుచున్న మతంగమునిపై రక్తబిందువు పడి వాలి శాపము నొందెను. దుందుభి కుమారుఁడు మాయావి. రామా.

దురాధర్షుఁడు:- గాంధారీధృతరాష్ట్రుల పుత్త్రుడు భార.

దుర్గాదేవి:-ఈమెయే చండిక. దుర్గముఁడను దనుజుని సంహరించుటచే నీమెకు 'దుర్గ' యను పేరు వచ్చెను. మార్క. కాశీ.

దుర్గుడు:- ఒక రాక్షసుఁడు. వాఁడు బాధపెట్టుచుండఁగమునులీశ్వరునితోఁజెప్పిరి. ఈశ్వరుఁడు

పార్వతితోఁ జెప్పెను. ఆమె వింధ్యకుఁబోయి తపస్సుచేసి, కాళరాత్రి యను శక్తిని వాని కడకుఁబంపి వానిని బాధలు కలుగఁజేయకుండు మని చెప్పుమనియె. వాఁడీ కాళరాత్రిని బంధింపఁబోయెను. ఆమె పరుగిడివచ్చి పార్వతితోఁ జెప్పికొనెను. వాఁడీమెను దఱుముకొని వచ్చెను. యుద్ధములో వీనిని పార్వతి సంహరించెను. కాశీ.

దుర్జయ:-దనువుయొక్క కుమారిత. భార.

దుర్జయుఁడు:-ఒకరాజు. సుప్రతీకునికుమారుఁడు. ఇతని తల్లి విద్యుత్ప్రభ. ఇతఁడు సుద్యుమ్నుఁడను తమ్మునితోఁ గలసి రాజ్యమేలుచు వాని సహాయమునచే సర్వదేశాధిపతులను, నింద్రునిఁ గూడ గెలిచెను. కొందఱు రాక్షసులు విద్యుత్తు, వినజిహ్వుఁడు, ఖడ్గహస్తుఁడు, దీప్తాలకుఁడు మొదలగువారు వచ్చి యాచింపఁగ నితఁడు వారికి వేలుకొండని కొన్ని నగరము లిచ్చెను. ఒకనాఁడు దుర్జయుఁడు కుబేరవనమునందు విహరించుచుండ సుకేశి మిత్రకేశి యను కన్యక లిరువురు హేతి, ప్రహేతుల కుమారికలు ఇతనికంటఁ బడిరి. వారినిఁజూచి యితఁడు మోహించెను. ఇతనిని జూచి వారును మదనావల పీడితలైరి. ఇది యెఱింగి హేతియుఁ, బ్రహేతియు వచ్చి తమ తమ కుమారికలను దుర్జయునకిచ్చి యేక కాలమందే వివాహము గావించిరి. దుర్జయునకు సుకేశివలన సుప్రభుఁడును, మిత్రకేశి వలన సుదర్శనుఁడును నను పుత్త్రులు పుట్టిరి. దుర్జయుఁడు రాజ్యము తమ్మున కప్పగించి సదా స్త్రీలోలుఁడై యుండెను. ఒకనాఁ డితఁడు వేటకుఁబోయి దప్పియుండెను. గౌరముఖుఁడను ముని వీనిని జూచి రాజు గావునను, దప్పియుండెను గావునను దా నిచ్చు నాతిథ్యమును గొనిపొమ్మని రాజును గోరెను. "అడవిలోఁ గాయకూరలు తిను ముని రాజున కాతిథ్య మిచ్చు టేమి"యని రాజునకుఁ గోపమువచ్చి యెటులిచ్చునో చూచెదఁ గాక యనుకొని యును, సలిపియుండుటచేతను నాతిథ్యమును గైకొనుట కొప్పెను. రాజునకును, వానిపరివారమునకును విందుచేయుటకై తగిన పదార్థము లిమ్మనిగౌరముఖుఁడు విష్ణుమూర్తిని బ్రార్థించెను. విష్ణుమూర్తి యాతని కొక్క మణి నొసంగెను. ఆ మణిప్రభావమువలన నొకనగరమును నిర్మించి యందొక సౌధమున రాజును నిల్పి వానికి సమస్తోపచారములు చేయించి విందును గావించెను. దుర్జయునకు మిక్కిలి యాశ్చర్యము కలిగెను. అతఁడు మణిప్రభావ మెఱింగెను. ఎటులైనను దానిని గైకొనవలెనని కోరెను. మంత్రి యగు విరోచనుఁడు మునిని మణినిమ్మని యడిగెను గాని లాభము లేకపోయెను. దుర్జయుఁడు తన నగరమునకు వచ్చి నీలుఁ డనువానినిఁ బంపెను. ఇతఁడు గౌరముఖుని యాశ్రమముకడ రథము నాపెను. ఆశ్రమమునం దతఁడు లేఁడు. కాని మణి కలదు. ఇతఁడు రథము దిగఁగనే మణినుండి రథములు, అశ్వములు, వీరులు బయలు వెడలిరి. వీరు నీలునితోడను, వాని సేనతోడను యుద్ధముచేసిరి. పిమ్మట దుర్జయుఁడు కూడ వచ్చెను; యుద్ధము చేయుచుండెను. గౌరముఖుఁడు తన యాశ్రమమునకుఁ దిరిగివచ్చి యుద్ధము జరుగుటచూచి వెఱగంది విష్ణుమూర్తిని బ్రార్థించెను. విష్ణుమూర్తి చక్రధారియై వచ్చి దుర్జయాదులను సంహరించెను. రాత.

దుర్జయుఁడు:-కార్తవీర్యుని సంతతివాఁడగు నొక రాజు. ఇతఁ డూర్వశినిఁ జూచి మోహించి తన భార్యను విడచి యూర్వశితోఁ జాలకాల ముండెను. ఇతని భార్య వీనిని గణ్వాశ్రమమునకుఁ బొమ్మని ప్రేరేపించెను ఇతఁ డాశ్రమమునకుఁ బోయి కణ్వునివలన నుపదేశమును గొని వచ్చుచుఁ డా యూర్వశి కిచ్చిన హారము నొక గంధర్వుని మెడలో నుండఁగఁ జూచెను. అతఁడు గంధర్వునితోఁ బోరాడి హారము పుచ్చుకొని యూర్వశిని వెదకుకొనుచు వచ్చి యామెను దనతోఁ గలయు మని బలవంత పెట్టెను. ఆమె కణ్వునకు భయపడి యాతని కోరిక మంచిదికాదని చెప్పెను. కాని యాతఁడు వినక బలాత్కారమునఁ బైబడుచుండిన రోమ యుక్తమైన తన దేహమును పింగళవర్ణములైన నేత్రములను జూపెట్టెను. అది చూచి రాజు విరక్తిఁబొంది, యామెతోడి పొందు వేరగించు కొని మరలివచ్చెను. భవి.

దుర్దముఁడు:-ఒక రాజు. రైవతమనువు యొక్క తండ్రి. దుర్దముఁ డొకనాఁడు ప్రముఖుఁ డను ముని యాశ్రమమున కరిగి, యచ్చట మునినిఁ గానక రేవతీకన్యను జూచి ప్రియా! ముని యెచ్చటికేగెనని యడిగెను. ప్రముఖుఁడు లోపలనుండి వచ్చి యితనికే తన కుమారిక నివ్వఁదలఁచుకొని యుండెను గాన నితని రాకకు సంతసించి నీవు నాకూఁతును ప్రియా! యని పిలచితివి. కావున నీవు నాకల్లుఁడ వగుదువు అని యతనికి రేవతి నిచ్చి వివాహము చేసెను. "నీకు అరణమిచ్చెదను. దుర్లభమగుదాని నేదేని కోరుకొ"మ్మనఁగ "నాకు మనువగు పుత్త్రుఁడు జన్మింపవలె" నని దుర్దముఁడు కోరెను. ప్రముఖుఁ డద్దానిని బ్రసాదించెను. రేవతియందితనికిఁ బుట్టిన తనయుఁడు రైవతుఁడు మనువయ్యెను. మార్క.

దుర్దమ్నుఁడు:- ఒక బోయవాఁడు; యుధాజిత్తుతో భారద్వాజాశ్రమమునకు వెళ్ళెను. దే. భా.

దుర్ధర్షుఁడు:-ధృతరాష్ట్రుని పుత్త్రుఁడు. భార.

దుర్మదుఁడు:- ధృతరాష్ట్రుని పుత్త్రుఁడు. వీనిని భీముఁడు చంపెను.

దుర్మర్షణుఁడు:- ఒకరాజు. సత్యరథు నోడించి వానిరాజ్యము లాగుకొనెను. సత్యరథుని కుమారుఁడు ధర్మగుప్తుఁడు. వీనిని జంపి రాజ్యమును గైకొనెను. బ్రహ్మ. స్కా.

దుర్మర్షణుఁడు:-ధృతరాష్ట్రుని పుత్త్రుఁడు. భార.

దుర్ముఖుఁడు:- రావణునిమంత్రులలో నొకఁడు. రామునితో యుద్ధము చేయుటయే మంచిదని యితఁ డాలోచన చెప్పెను. రామా.

దుర్ముఖుఁడు:- ధృతరాష్ట్రుని పుత్త్రుఁడు. భార.

దుర్యోధనుఁడు:-ఒక మనువంశపురాజు. ఇతనిని జూచి నర్మద మోహించి వనితారూపమున వచ్చి యితనిని గూడి భోగించెను. ఈమె యందు దుర్యోధనునకు సుదర్శన యను కన్యక పుట్టెను. ఈ సుదర్శనచే దుర్యోధనుఁ డగ్ని గృహంబునఁ బనులు చేయించుచుండెను. అగ్ని యీమెను జూచి మోహించి బ్రాహ్మణవేషమునవచ్చి తనను బరిణయము కమ్మనికోరెను. తల్లిదండ్రులచే నివ్వఁబడక యామె ఈ బ్రాహ్మణునిఁ జేపట్టఁజాలనని చెప్పెను. దుర్యోధనుఁడు యజ్ఞము చేయుచుండఁగా అగ్ని బ్రాహ్మణస్వరూపమున దుర్యోధనునికడకు వచ్చి సుదర్శనను దన కిమ్మని కోరెను. అన్యకులమువానికిఁ దన కూఁతు నీయనని రాజు చెప్పెను. అగ్నికిఁ గోపమువచ్చి తన రూప ముపసంహరించుకొనెను. రాజును, ఋత్విజులును నీవృత్తాంతము గ్రహింపలేక తమవలన నేదో దోషముకలిగెనని వెఱచి యగ్నిని బ్రార్థించిరి. అగ్ని తన యీప్సితము భూదేవతలకుఁ జెప్పెను. భూదేవతలు దుర్యోధనునకుఁ జెప్పిరి. ఆ బ్రాహ్మణుఁడు అగ్నియే యగుట రాజెఱింగి సంతసించి తన కూఁతునిచ్చి వివాహముచేసెను. భార.

దుర్యోధనుఁడు:- గాంధారి ధృతరాష్ట్రుల ప్రథమ పుత్త్రుఁడు. ఇతఁడు కలియంశంబున జన్మించెను. గాంధారి యొక సంవత్సరము గర్భము ధరించినను బ్రసవింప కుండుటచే గర్భతాడనము చేసికొనెను. దాన నొక మాంసపుముద్దను గని దుఃఖించుచుండఁగఁ గృష్ణద్వైపాయనుఁడు వచ్చి దానియందు నూర్గురు పుత్త్రు లున్నారనియును, దానిని నూఱుశకలములు గావించి ఘృతమునం దుంచి కాపాడుచుండుఁడనియును జెప్పెను. దుర్యోధనుఁడు, నతని సోదరులు నా శకలముల నుండియే పెరిగిరి. దుర్యోధనునిపై దండ్రి కెక్కువ ప్రేమయును, సోదరులకు గౌరవమును గలదు.

చిన్నతనమునఁ బాండుకుమారులు దుర్యోధనాదులతోఁ గలసి మెలసి యాడుకొనుచుండెడివారు. కాని దుర్యోధనునిపై వానితమ్ములు చూపినంత గౌరవము వీరు చూపుటలేదు. వీరు ధార్తరాష్ట్రులకంటె నధిక జ్ఞానబల గుణ సంపన్నులు. జలక్రీడలలో భీముఁడు పదిమంది ధార్తరాష్ట్రుల నొక్కసారిగ ముంచును. వీరు చెట్ల నెక్కుచో చెట్ల మొదళ్ళుబట్టి ఝల్లలాడించును. ఇట్టివి దుర్యోధనుఁడు సహింపలేఁడు. ఎటులైనను భీమునిఁ జంపఁదలఁచుకొనెను. దానికై కపటోపాయంబు లాలోచించెను. భీముఁడలసి గాఢనిద్రయందుండఁగ వానినిఁ గట్టించి గంగాప్రవాహమధ్యమునఁ బడవేయించెను; ఒకనాఁడు నిద్రించుచుండఁగ వానిపై విషసర్పములఁ బఱపించి కఱపించెను.

మఱియొక నాఁడు వానికి విషదూషితాన్నమును పెట్టించెను. కాని యెద్దానివలనను భీముఁడు హానిచెందలేదు. అస్త్రవిద్యా సందర్శనము నాఁడు దుర్యోధనుఁడు తన గదాకౌశలము చూపుచు భీముని బరాభవింపఁదలఁచి కుత్సితుఁడై యాతనిఁ దాఁకుచుండెను. కాని భీముఁ డీతనికి వశుఁడు గాఁడు. ధనుర్విద్యయం దర్జునుని కుండిన నేర్పు ఇతనికి లేదయ్యె. ఇట్టి పరాభవంబులచే మనం బెఱియుచుండఁగ నర్జునుని నాక్షేపణ చేయుచుఁ గర్ణుఁడు ముందునకు వచ్చెను. అర్జునుని దనతోడఁ బోరుమనెను. పాండుకుమారుల నోడింపఁ గలుగువాఁడు కలిగెఁగదా యని దుర్యోధనునకు సంతోషము కలిగెను. కాని కృపుఁడు "నీ వెవ్వరిసుతుఁడవు? నీకులమెయ్యది? తెల్పు"మనియడిగెను. కర్ణుఁడు సూతునింటఁ బెరిగినవాఁ డగుటచే నీ రాజపుత్రులతోఁ బోరుటకుఁ దగినవాఁడు కాఁడు. కర్ణుఁడు తన కులము తెలుప సిగ్గుపడి యూరకుండెను. ఆ సమయమున దుర్యోధనుఁడు కర్ణున కంగరాజ్యమిచ్చి వానిని రాజును జేసెను. అర్జును నోడింపఁగోరుటయే దీనికిఁ గారణము గాని కర్ణునిపైఁ బ్రేమకాదు అప్పటినుండియును గర్ణ దుర్యోధనులు బద్ధసఖ్యులై యుండిరి. ఇరువురును పాండుకుమారద్వేషు లగుటయే వీరి చెలిమికి బలమయ్యెను.

కళింగపతి చిత్రాంగుఁడు తన పుత్రిక యగు శుభాంగికి స్వయంవరము చాటింపఁగా జరాసంధుఁడు, శిశుపాలుఁడు, దుర్యోధనుఁడు మొదలగువారు వెళ్ళిరి. శుభాంగి దుర్యోధనుని దాటిపోఁగా నాతనికిఁ గోపమువచ్చి యామెను బలాత్కారమున నెత్తికొనిపోయి తనరథములో నెక్కించుకొని పోయెను. జరాసంధాదులు వీనితోఁ బోరుటకు వచ్చిరి. కర్ణుఁడు వీరిని బెక్కుర నోడించెను. జరాసంధుఁడు కర్ణునితో యుద్ధము చేసిచేసి బలము తగ్గుటవల్లఁ గర్ణునకు మిత్రుఁ డయ్యెను.

దుర్యోధనుఁడు ద్రోణునకు గురుకట్నంబుగ ద్రుపదుని బట్టి తెచ్చుటకేగి వానితో యుద్ధము చేసి యోడి వచ్చెను. కాని యర్జునుఁ డవలీలగ ద్రుపదుని బట్టి తెచ్చెను. దానఁగలిగిన దుఃఖము చల్లారకపూర్వమే కురువృద్ధులు ధర్మరాజును యువరాజుగఁ జేసిరి. దుర్యోధనునకు మిక్కిలి దుఃఖము కలిగెను. ఇతని మంత్రియు శత్రువులైనవారి నెటులైన సంహరించుటే మంచిదని చెప్పెను. దుర్యోధనుఁడు తండ్రికడ కేగి ధర్మరాజునందుఁ బ్రజ అనురాగులై యున్నారనియును, నతఁడు యువరాజయ్యె నేని పిమ్మట నతఁడే రాజగుననియును, నతని వంశమువారే భూపాలురగుదురనియును, ధృతరాష్ట్రుని పుత్రులు కుడుచుట కొరుల నాశ్రయింపవలసి వచ్చుననియును జెప్పికొని విలపించెను. ధృతరాష్ట్రుఁడు వీని వచన మంగీకరించి పాండవులను వారణాసియం దుండుఁడని పంపెను. వీరు వారణాసికిఁ బ్రయాణంబగు టెఱింగి దుర్యోధనుఁడు తన కాప్తుఁడగువాని నొకనిని వారికంటె ముందుగఁ బంపి వారికై మార్గమం దొక లక్కయిల్లు కట్టించెను. మఱియును పాండవు లందుఁ బ్రవేశించియున్న సమయమున దానిని దగులఁబెట్టుమని వానితోఁ జెప్పెను. తాఁగోరినట్లు పాండవు లందుఁ జచ్చిరని విని సంతోషించెను.

మిథిలలో జనకునిఁ జూచుటకువచ్చి యతని గృహమునసున్న బలరామునియొద్ద నితఁడు గదాయుద్ధకౌశలమును నేర్చెను.

దుర్యోధనుఁడు ద్రౌపదీస్వయంవరమున కేగి మత్స్యయంత్రమునుగొట్ట యత్నించి యోడెను. ఒక బ్రాహ్మణరూపుఁడు యంత్రమును గొట్టి ద్రౌపదిని బడయుటచే నితని కవమానము వచ్చి ద్రుపదుఁడు తనను బరాభవించెనని యాతనితో యుద్ధముచేసెను. పిమ్మట ద్రౌపదిని వివాహమయినవారు పాండుకుమారులని తెలియవచ్చెను. మరణించిరనుకొనిన శత్రువులిపుడు ద్రుపదునకు బంధువులై బలాఢ్యులైరి. వీరిని యదు వృష్ణి భోజాదులుం జేరుదురు. అపుడు పాండవు లజేయు లగుదురు. ఏ యుపాయమున నైనను పాండవులను జంపించుటే కర్తవ్య మని యెంచి తండ్రిని జేరి పాండవపక్షపాతియైన విదురుఁడే సదా నీ యొద్దనుండి వారింగూర్చి నీతోఁ జెప్పుచుండును. మా చెప్పవలసినది విన్నవించుకొనుట కైన సమయము కాకుండెనే! నీ పుత్రులపైఁ గలుగు ప్రేమ యిదియా! యని చెప్పుకొని దుఃఖించి పాండవులను వంచించు నుపాయ మాలోచింపుమనెను. కుంతీపుత్త్రులకును, మాద్రీ

తనయులకును బరస్పరవైరము పుట్టించుటయో, మోహనాంగులను బంపి పాండవులను ద్రౌపది యందు విరక్తులుగఁ జేయుటయో, ద్రౌపదికే వీరియందు విరక్తి పుట్టించుటయో యాలోచింపుమని ధృతరాష్ట్రునకుఁ జెప్పెను. వంచనచే భీమునిఁ జంపినయెడల నర్జునునిఁ గర్ణుఁడు చంపఁగలఁడని చెప్పెను. ధృతరాష్ట్రుఁ డేదియును నిర్ణయింపలేక పెద్దల నడిగెను. భీష్మాదులిది తగనిపని యని దుర్యోధనునకు బుద్ధి చెప్పిరి. ధృతరాష్ట్రుఁడు వీరి కెదురాడలేకపోయెను; పైఁ బాండవులను హస్తినాపురమునకు రప్పింపుమని వారు చెప్పిరి. దుర్యోధనుఁడు వలదనలేఁడు. ధర్మజాదులను హస్తినాపురమునకు రావించిరి.

పాండవులు కొంతకాలము హస్తినాపురమున నున్నపిదప ధృతరాష్ట్రుఁడు వారల కర్ధరాజ్యమిచ్చి పంపెను. వారింద్రప్రస్థ నగరమును నిర్మించుకొని యందుండిరి. ధర్మరాజు రాజసూయము సేయుచు నాహ్వానము సేయ దుర్యోధనుఁడును వచ్చుటకు వెళ్ళెను.

పాండవుల హార్మ్యసౌందర్యమున కితఁడు వెఱఁగొందెను. అందొకచో స్థలమును జూచి జలమని భ్రమించి పుట్టంబులు పైకెగఁద్రోసుకొనియె. మఱియొకచో జలప్రదేశంబును జూచి స్థలమని నడచి వస్త్రంబులు తడుపుకొనెను. ఇదంతయును జూచిన ద్రౌపదికి నవ్వువచ్చి నవ్వెను. తనభంగపాటును జూచి యొక పడఁతిఁ నవ్వుటచే దుర్యోధనునకుఁ గల్గిన రోష మింతంతకాదు. కాని యా సమయమున దానిని వెలిబుచ్చలేదు. ధర్మజుని యాగము సాంతమగువఱకు నచ్చటనే యుండెను. పాండవుల సంపద చూచుటతో నతని కీర్ష్యకూడఁ గలిగెను. తన మనోదుఃఖమును శకునితోఁ జెప్పుకొనెను. జూదమునాడి పాండవుల రాజ్యము గెల్చియిత్తునని శకుని చెప్పెను. ఈ యుపాయంబున కొడంబడుమనియును, లేనిచోఁ దా నగ్నింబడి ప్రాణపరిత్యాగము చేయుదుననియును దుర్యోధనుఁడు తండ్రితోఁ జెప్పెను. పుత్త్రుఁ డిట్లు పల్కుటచే ధృతరాష్ట్రుఁ డెదురాడలేక సమ్మతించి పాండవులను బిలువనంపెను. వచ్చిన ధర్మజుని సుహృద్ద్యూతము నాడుమని దుర్యోధనుఁడు పిలిచెను. తనకై శకుని యాడుననియు, నతఁ డొడ్డిన ధనము తానిచ్చెదననియును జెప్పెను. ఆ జూదమున ధర్మరాజు తన రాజ్యమును, దనను, దన తమ్ములను నోడెను. అపుడు ద్రౌపది గలదు కదా! యామె నొడ్డుమని దుర్యోధనుఁడు చెప్ప ధర్మరాజట్లు చేసెను. శకుని గావించు మాయోపాయంబులచే నీసారియు ధర్మజుఁ డోడెను. ఓడనే దుర్యోధనుఁడు ద్రౌపదిని సభలోనికి లాగికొనిరమ్మని ప్రాతికామినిఁ బంపెను. ఆమె రాకపోవుటచే దుశ్శాసనునిఁ బంపెను. వీఁ డామెను జుట్టుపట్టి లాగికొని వచ్చెను. రజస్వలయై యేకవస్త్రయై యున్న యామెకట్టిన పుట్టంబు విప్పుమని దుర్యోధనుఁడు పలికెను. దుశ్శాసనుఁ డెన్నిబట్టలు తీసినను నామె శరీరమున నట్టే వస్త్రముండుచుండెను. అపుడైన నామెపతివ్రత్యమాహాత్మ్యమెఱుఁగలేక తన తొడపైఁ గూర్చుండుమని నీచమనస్కుఁడై దుర్యోధనుఁడు సైగలుచేసెను. పాండుకుమారులు శపథబద్ధులగుటచే వీని నేమియుఁ జేయలేకుండిరి. వీనితో జూదమునాడి యోడుటచే వనవాసమును, నజ్ఞాతవాసమును జేయ వెడలిరి.

ఇంకను దుర్యోధనుఁడు పాండవులను విషాగ్నిజలంబులఁ జంప నాలోచించుచుండెను. అది మగటిమి కాదనియును, యుద్ధమున వారి నోడింపవలయు ననియును కర్ణుఁడు చెప్పెను. దానికి దుర్యోధనుఁడు యత్నించుచుండఁగ గృష్ణద్వైపాయనుఁడు వచ్చి దుర్యోధనునకు బుద్ధి చెప్పుమని ధృతరాష్ట్రునితోఁ జెప్పి యరిగెను. మైత్రేయుఁడును వచ్చి పాండవులతో మైత్రిచేసి యుండుమని చెప్పెను. వాని మాటలకు దుర్యోధనుఁడు నవ్వి తొడలు సఱచుచుఁ బాండవుల నెంత? యని హేళనగఁ బలికెను. కాన మునికిఁ గోపమువచ్చి భీమునిచే నీ తొడలు విఱుగఁగొట్టఁ బడునని శపించెను. వారు యుద్ధప్రయత్నము లంతటితో మానిరిగాని దుర్యోధనునకు మనశ్శాంతి లేదు. ద్వైతవనమునఁ బశువులను క్రూరమృగములు మిక్కిలి బాధించుచున్నవనియును, వీనిని వధింతుమనియును ధృతరాష్ట్రునకుఁ జెప్పి పాండవులతో యుద్ధము సేయుటకు దుర్యోధన కర్ణాదులు వెడలిరి. వనమునందుఁ గొంతసేపు వేటసలిపి

దుర్యోధనుఁడు గంధర్వులకొలనులో స్నానము చేయఁబోఁగా గంధర్వులాటంకపఱచిరి. వారితో దుర్యోధనుఁడు పోరాడెను. వారు దుర్యోధనుని బంధించిరి. వీనిని భీమార్జునులు విడిపించిరి. తా నపకారముచేయఁదలఁచినవారలే తన ప్రాణసంరక్షణము చేసిరి. దానిచే దుర్యోధనునకుఁ దలవంపులుగలిగి యచ్చటనే ప్రాయోపవేశము చేయఁబోయెను గాని కర్ణుఁడు వానికి ధైర్యము చెప్పి నగరమునకుఁ గొనిపోయెను.

సపత్నులగు పాండవులవలనిబాధ తొలఁగఁగనే దుర్యోధనుఁడు వీరాగ్రేసరుఁడయ్యె. అతడే రాజై రాజ్యము నేకచ్ఛత్రముగ నేలుచుండెను. ఇపుడును పాండవులవృత్తాంత మారసి వారు వసించు నుపాయము వెదకుచుండెను. భీష్ముఁడు అది నీతిగాదని చెప్పుచోఁ గర్ణశకునులతోఁగలసి వానిని నిందచేయుచుండెను.

ధర్మజుఁడు చేసిన యాగము చూచుటచే దుర్యోధనునకును నట్టిదిచేయఁ గోర్కె పుట్టెను. దానినిగూర్చి పురోహితు నాలోచన యడిగెను. ఆజేయులగుపాండవులుండ రాజసూయమితఁడు సేయుటయసాధ్యమని పండితులు చెప్పిరి; కావున దుర్యోధనుఁడు తత్తుల్యమగుయాగము నొకటి చేసెను. పాండవులజ్ఞాతవాసంబునయుండఁగ వారి నెఱుంగుట కీతఁడు చారుల నంపుచుండెను. వారిని గుర్తింపుచో నవతీలఁగఁ దిరిగి యరణ్యంబులకుఁ బంపవచ్చును. విరాటునగరమున నుందురని శంకించిరి; వారిని బట్టుకొనవచ్చునని తలఁచి విరాటునియావులను బట్టుకొనుటకుఁ జనిరి. వీరు తలఁచినట్లర్జునుఁడేయుత్తరునకుసారథిగవచ్చెను. ఫల్గునుని జయించుట కష్టమని ద్రోణుఁడు పలికెను. పోరుటకు లావుచాలదేని తొలఁగిపొమ్మని దుర్యోధనుఁడు పలికెను. తానును యుద్ధముచేసి యోడెను. అపుడు గడువులోపల నెఱింగితిమని సంతోషముతోఁ బలికెను. ధర్మజానకట్లు వర్తమానము చేసెను. భీష్ముఁడును, ధర్మజుఁడును గూడగడువుముగిసెనని చెప్పిరి. దుర్యోధనుఁడు తలవంపులతో నింటికి వచ్చెను.

అజ్ఞాతవాసము ముగిసినపిమ్మట బలరామకృష్ణాదులు పాండవులనుజూచి వారిరాజ్యభాగ మెట్లైన గ్రహింపవలయునని నిశ్చయించిరి. ద్రుపదుని పురోహితుని ధృతరాష్ట్రుని యొద్దకు దూతగఁ బంపిరి. యుద్ధము తప్పునట్లుండెను. దుర్యోధనుఁడును నితరరాజులతో మైత్రిసలుపుచుండెను. దుర్యోధనుఁడు కృష్ణుని సహాయమును గోరుటకై వచ్చి కృష్ణుఁడు నిదురించుచుండుటచే వాతని శిరస్సు చెంతఁ గూర్చుండెను. అప్పుడే కృష్ణునిసహాయమును గోరుట కర్జునుఁడును వచ్చి వాని పాదములచెంగటఁ గూర్చుండెను. ఒకరితో నొకరు మాట్లాడలేదు. శ్రీకృష్ణుఁడు మేల్కాంచి యర్జునునిఁ జూచెను. దుర్యోధనుఁడు తాను వచ్చినపనిని దెల్పి తాను ముందుగవచ్చుటచే ముందుగ దన కోర్కెను దీర్పుమనియెను. శ్రీకృష్ణుఁడు ముందుగ నర్జునునిజూచితినిగావున నిరువుర కోర్కెలునుదీర్తుననితనను, దనసేనలను వాటాలుపెట్టి, చిన్నవాఁడు గావున ముం దర్జునునిఁ గోరుకొమ్మనియెను. అర్జునుఁడు శ్రీకృష్ణునే కోరుకొనెను. ఇతఁడు కృష్ణునిసేన నే తనకిమ్మని కోరెను. ఇతఁడు కృష్ణునికడనుండి హస్తినాపురము వెళ్ళునప్పటికి ధర్మజునికడనుండి సంజయుఁడువచ్చి పాండవులబలమును వర్ణించుచుండెను. వారు తప్పక దుర్యోధనుని నోడింతురని ధృతరాష్ట్రుఁడు విచారించి పుత్త్రుని వారితోడి పొత్తున కొడంబడుమనియె; భీష్మాదు లట్లే పలికిరి. కాని దుర్యోధనుఁడు వారిమాటల నిరాకరించెను. కృష్ణుఁడు వారిపక్షమున నుండుటచేఁ బాండవులకే జయమగునని వ్యాసుఁడు చెప్పెను. యుద్ధముమాని పాండవులతో నెయ్యముననుండుమని తల్లియు బ్రతిమాలెను గాని దుర్యోధనుఁ డామాట లాలకింపఁడు. కృష్ణుఁడుకూడఁ బాండవులకడనుండి రాయబారిగ వచ్చెను. కృష్ణుని దుర్యోధనుఁడు భోజనమునకుఁ బిలువ నీ దుష్టాన్నమును భుజింపనని యతఁడు తిరస్కరించెను. కృష్ణునే దుర్యోధనుఁడు బంధింపఁదలంచెను. పాండవులకు నూదిమొన మోపినంత నేలయైన నివ్వననియె. సభలో కృష్ణుఁడు నీతిని జూపించెను. యుద్ధమొనర్చుట నిశ్చయమయ్యెను. ఇతఁడుపాయంబునఁబాండవులకాప్తబంధువులగు రాజులను దనమిత్త్రులఁగఁ జేసికొనెను. శల్యుఁడు పాండవులను జూడవచ్చుటవిని దుర్యోధనుఁడు దాని మార్గమందనేక సదుపాయములు గావించి

వానిదయ సంపాదించుకొని తనపక్షమునఁ బోరు నట్లు చేసెను.

ఇతనికడ గోచరించు కపటవృత్తి యుద్ధ సమయమునమాత్రము లేదు. దుర్యోధనుఁడును, నితని పక్షమువారును నభిమన్యుని వధయించుఁ దప్ప ధర్మముగనే పోరిరి. దుర్యోధనుఁడు భీష్మ కృప ద్రోణాది వీరులను వేఁడుకొని వారిని బెద్దలుగఁజేసి యుద్ధము వారిచే నడిపించు చుండెను. తానును భీమాదులతోఁ బోరు చుండెను. భీమునిచే నోడింపఁబడి యవమానింప బడి భీష్మునిఁజేరి "నీవు దేవతలకైన నజేయుఁ డవుగదా! అట్టి నీవు చూచుచుండఁగనే మన సేనలనోడించి భీముఁడు విజృంభించుచుండెనే" అని విలపింప భీష్ముఁడు పాండవులకుఁ గృష్ణుఁడు సహాయుఁడై యుండెననియును, నాతఁడు పరమేశ్వరుఁడే యనియును బాండ వులతోడి సంధియే యొప్పుననియును జెప్పుచు వచ్చెను. కాని దుర్యోధనుఁ డా మాటలు పెడ చెవినిబెట్టెను. అయినను భీష్ముఁడు దుర్యోధనుని జయము కోరి పాండవసేనపై విజృంభించుచుండె ప్రథమమున దుర్యోధనుఁడు తానే జయించు ననుకొనియెను గాని భీష్ముఁడు మరణింపఁగనే యా ధైర్యము తగ్గెను. ద్రోణుని సేనాధిపతిగ జేసి ధైర్యము వీడక సైనికులను బ్రోత్సాహము చేయుచుండెను. ద్రోణు నట్లు గౌరవించుటచే నాతఁడు సంతోషించి దుర్యోధనుని వరము వేడు కొనుమనియె. ఇతఁడు ధర్మజునిఁబట్టి తీసికొని రమ్మనికోరెను. అతనిచే మఱియొకసారి జూదము నాడించినచో యుద్ధ మక్కఱలేకయే మఱలఁ బాండవులను నరణ్యమునకు బంపవచ్చునని గురు నకుఁ దెల్పెను. అర్జునాదులను గెల్చుట కష్టమని యీతనికిఁ దెలియకపోలేదు. కాని పాండవుల బలమెక్కువయ్యె. కురుపక్షమునఁ బరాజయము కలుగుచుండెను. ద్రోణుఁడుండియు గెలుపు గలుగమికి విచారించి యితఁడు పాండవ పక్ష పాతి యగుటచే నట్లయ్యెనని ద్రోణుని దూషిం చెను. ద్రోణుఁ డా యపవాదమునకుఁ జింతించి ప్రాణములకు లక్ష్యము చేయక శత్రుమధ్యమం దుఱికి యుద్ధము చేయుచుండెను. అతఁడు మర ణించెను. పిమ్మట సహజకవచకుండలుండును, సూర్యపుత్త్రుండును, దనకుఁ బరమమిత్త్రుండును నగు కర్ణుఁడును మరణించెను. వానిపిమ్మట సేనాధి పతియైన శల్యుండును మరణించెను. అప్పుడును సంధి సేయుటే మంచిదని దుర్యోధనునకుం జెప్పిరి. కాని యితఁడు తనను రక్షింపుమని శత్రువులను వేఁడఁజాలఁడు. దుర్యోధనుండు విముఖుండై రణరంగము వీడి యొక హ్రదమున దాఁగియుండెను. కృపాశ్వత్థామ కృపవర్మలు వానింజేరి యోదార్చిరి. శత్రువులను సంహరించి వానికి ముదమొనఁగూర్తు మనుచుండిరి. పాండ వులు చారులవలన నితఁడు దాగియుండిన తా వెఱింగి వచ్చి దూషించిరి. దుర్యోధనుఁడు "ధర్మజా! నీకుఁగాని, నీ వారికిఁగాని వెఱచి నేనిచ్చట డాఁగలేదు. యుద్ధమున నా మిత్త్రు లెందఱో మరణించుటచే నా మనము ఖేదపడు చున్నది. నీవును నేదదీర్చుకొనుము" అని విచారముతోఁ బలికెను. కాని పాండవులు వానిని విడువలేదు. వానికి రోషజనకముగఁ బలుకుచునేయున్న నాతఁడు యుద్ధము సేయు టకువచ్చెను. వీనితో గదాయుద్ధము చేయుటకు భీముఁ డంగీకరించెను. వీరిరువురును గదా యుద్ధము చేయుచుండిరి. భీముఁ డధర్మముగ దుర్యోధనునిఁ దొడలపైమోది సంహరించెను.

దుర్యోధనుని పుత్త్రుఁడగు లక్ష్మణుఁడును యుద్ధములో సంహరింపఁబడియె. భార.

దుర్యోధనుఁడు:-వృషదానవి పుత్త్రుఁడు.

దుర్వాసుఁడు:-ఒక ముని. అత్రి అనసూయలకు శివునంశంబునఁ బుట్టినకుమారుఁడు. పుత్త్రార్థియై అత్రి ప్రార్థించిన బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ముగ్గురు ప్రత్యక్షమై తాము ముగ్గురొక్కటే యని చెప్పి తమయంశంబులఁ బుత్త్రులు పుట్టుదు రని చెప్పిరి. అనసూయకూడ వారిమువ్వురయంశ ములఁ బుత్త్రులు కావలెనని కోరెను. అనసూయ గర్భవతిగ నున్నపుడు హైహయుఁ డనురా జామెగర్భనిరోధంబును గావించెను. అదియెఱింగి వానిని నిర్దగ్ధుంజేయుటకు శివుఁ డామెగర్భమున బ్రవేశించి యామెకు జన్మించెను. అతఁడే దుర్వాసుఁడు. మార్క.

దుర్విగాహుఁడు: గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు

దుర్విషహుఁడు:-గాంధారి ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. వీనిని యుద్ధములో భీముఁడు చంపెను.

దుశ్శాసనుఁడు:-గాంధారి ధృతరాష్ట్రుల కుమారుఁడు. దుర్యోధనుని తమ్ముఁడు. ఇతఁడును కుత్సితమనస్కుఁడై దుర్యోధనుఁడు గావించు దుష్కార్యములలో నతనికి సహాయము చేయుచుండువాఁడు. ఇతనికి దుర్యోధనున కున్నంత దేహబలము గాని, బుద్ధిబలము గాని యున్నట్లు లేదు. పాండవులు తమలోఁ దా మాలోచించినట్లు ఇతనితో దుర్యోధనుఁ డంతగాఁ గార్యాలోచన మేమియును జేయలేదు. ధర్మరాజు జూదమునాడి ద్రౌపదిని నోడిపోయిన పిమ్మట నామెను సభకుఁ దీసికొనిరమ్మని దుర్యోధనుఁ డాజ్ఞయిచ్చెను. ప్రాతికామి వెళ్ళెను గాని యామె రాలేదు; దుశ్శాసనుఁడు క్రూరుఁడు, తన సోదరుల భార్యయని తలఁపక రాక్షసునట్లు ద్రౌపది కొప్పుపట్టి సభ కీడ్చుకొనివచ్చి యామెను వివస్త్రను గావించుట కామె బట్టను విప్పెను. అతఁ డెన్ని విప్పినను నామె శరీరమును వసన మంటుకొనియే యుండెను. అతఁడు విప్పినబట్టలు కొండంత పేరుకొన్నను గాని ద్రౌపది శరీరమునుండి బట్ట తొలఁగలేదు. ఇట్లు దుశ్శాసనుఁడు తన నవమానపఱచుటచే "వీని రక్తము జడలంబూసికొనిఁగాని ముడువ" నని ద్రౌపది శపథముపట్టెను. "వీని హృదయమును ఛేదించి రక్తము త్రావెద"నని భీముఁడు ప్రతిజ్ఞ చేసెను. దుర్యోధనుఁడు గాని, వీఁడు గాని పాండవులను లెక్కపెట్టలేదు. వా రజ్ఞాతవాసములో నుండఁగ వారిని గుర్తించు నుపాయ మేమని దుర్యోధనుఁ డాలోచించుచుండెను. ఇతఁడు "పాండవు లీపాటికిఁ జచ్చిపోయియుందురు. మనము వారిని వెదకవలసిన పనిలేదు" అని యాలోచన చెప్పెను. కాని వీని యాలోచన నెవరును వినలేదు. యుద్ధములో దుశ్శాసనుఁడు మొదట నభిమన్యునితో యుద్ధముచేసి యోడిపోయెను. మరల సాత్యకితో యుద్ధముచేసి యోడెను. సహదేవునితోఁ బోరి మూర్ఛిల్లెను. వీనిని భీముఁడే చంపి వీని హృదయమును చీల్చి ప్రతిజ్ఞ పట్టినట్లు రక్తమును గ్రోలి ద్రౌపది కురులకుఁ బూసెను. భార.

దుష్కరుఁడు:—గాంధారి ధృతరాష్ట్రుల పుత్రుఁడు. వీని భీముఁడు చంపెను.

దుష్టచతుష్టయము:— దుర్యోధనుఁడు, దుశ్శాసనుఁడు, కర్ణుఁడు, శకుని. భార

దుష్టబుద్ధి:—కుంతలదేశపురాజుయొక్క మంత్రి. ఇతనికి మదనుఁడు అను కుమారుఁడును, విషయ యను కుమార్తెయును గలరు. కుంతలదేశాధిపునకుఁ బుత్రసంతానము లేదు. చంపకమాలిని యను కూఁతురుమాత్ర ముండెను. ఈ చంపకమాలినిని దన కుమారునకిచ్చి వివాహము చేయించి మదనునకుఁ బట్టము కట్టింపవలెనని యాతనికిఁ దలంపుకలదు. ఇతఁ డొకనాఁడు రాజభవనమునకుఁ బోవుచు నొక పసిబాలునిఁ గాంచి వీనికి రాజలక్షణములుండుటఁ గని బ్రాహ్మణు లనుకొనుట వినెను. ఆ బాలుఁడు తన రాజ్యకాంక్షకు భంగము కలిగించునేమో యని భయపడి వానిని సంహరింపుఁడని ఘాతుకుల కొప్పగించెను. వా రా బాలునిఁ జంపలేక యడవిలో నాతని విడచి వాని కాలి నాఱవ వ్రేలుమాత్రము కోసి తీసికొనివచ్చి చంపితిమని దుష్టబుద్ధికిఁ జూపిరి. కొన్ని సంవత్సరములు గతించిన, పిదపఁ గుంతలాధీశుని సామంతరాజగు కుళిందకునియొద్ద నొక బాలునిఁ జూచి వానిని దాను వెనుక చెప్పుటలో చూచినట్లు జ్ఞాపక మగుటచే 'నీ బాలుఁ డెవఁ' డని కుళిందకు నడిగెను. "అరణ్యములో ప్రేలు తెగఁగోయఁబడి రోదించుచుండిన బాలునిఁ దీసికొనివచ్చి పెంచితిని; చంద్రహాసుఁడని పేరిడితి" నని కుళిందకుఁడు చెప్పెను. దానితోఁ బూర్వవృత్తాంతము దుష్టబుద్ధియొక్క తలఁపునకు వచ్చెను. వానిని సంహరించుటకై మఱియొక ప్రయత్నము చేసెను. 'వీనికి విషము నిమ్ము' అని యొక లేఖను వ్రాసి యా లేఖను చంద్రహాసున కిచ్చి "నీవు దానిని శీఘ్రముగఁ గొనిపోయి కుంతలదేశమున నా కుమారుఁడు మదనున కీయవలెను" అని చెప్పెను. ఆ లేఖను జూచి తన కుమారుఁడు చంద్రహాసునకు విషము పెట్టి చంపునని నమ్మియుండెను. ఈ నడుమ చంద్రహాసుఁ డొంగనివాఁ డగుటచే లేఖను గొని కుంతలదేశమున కేగి యచ్చట మిత్రాంతికమున నిద్రించుచుండఁగా యుద్యానవనమున యుండుట మిత్రమంచెను. తనపుత్రునకు వచ్చిన

చంపకమాలినియు, విషయయు వానిఁ గూడిరి. వీని సౌందర్యమున కాశ్చర్యమునొందిరి. విషయ వీనిని సమీపించి వీనిప్రక్కనున్న యుత్తరమును జదివెను. తన తండ్రివ్రాతను మిక్కిలి బెగడొంది చంద్రహాసుని రక్షింపదలఁచుకొని 'ము' అను నక్షరము కొట్టివేసి విష'య'యని సవరించి వ్రాసి యుత్తర మచ్చటనేయుంచి వెడలిపోయెను. తరువాత నిద్రలేచి చంద్రహాసుఁ డా యుత్తరమును దీసికొని మదనున కిచ్చెను. అతఁడు చంద్రహాసునకుఁ దన చెలియలిని 'విషయ' నిచ్చి పెండ్లిచేసెను. పాపము "దుష్టబుద్ధి తానొకటి తలపఁగ దైవమొకటి తలఁచె." అతఁడు తన నగరమునకు వచ్చి మిక్కిలివిచారమునొంది యింకను జంద్రహాసుని జంపుటకే నిశ్చయించుకొని "వివాహము కాఁగానే చండికయాలయమునకు నీవొక్కరుఁడవు పోయి నమస్కరింపవలయును. అది మా యాచారము" అని చంద్రహాసునితోఁ జెప్పెను. ఇతఁడు సరేయనియె. పిమ్మట దుష్టబుద్ధి తలవరులను బిలిచి నేఁడు చండికయాలయమునకు నొక్కఁడు వచ్చును; వానిని సంహరింపుడని యానతిచ్చెను. ఆ సాయంకాలము చంద్రహాసుఁడు చండికగుడికిఁ బోవనుండఁగఁ గుంతలాధీశ్వరుఁ డీతనిని రమ్మని కబురుపంపుటచే మదనుఁడు తాను గుడికిఁబోయి చంద్రహాసుని రాజసభకుఁ బంపెను. మదనుఁడు గుడిప్రవేశింపఁగనే తలవరు లాతనిని సంహరించిరి. రాజు చంద్రహాసునకుఁ దన కూఁతురునిచ్చి వివాహము చేసెను. చంద్రహాసుని వివాహమును, దన పుత్త్రుని మరణమును జూచి దుష్టబుద్ధి గుండె బ్రద్దలై చచ్చెను. వానిచావును గురించి విని చంద్రహాసుఁడు దేవిని బ్రార్థించి యామె ప్రత్యక్షము కాఁగా దుష్టబుద్ధిని, మదనుని బ్రతికింపుమని వేఁడెను. ఆమె వారిని బ్రతికించెను. జై. భా.

దుష్యంతుఁడు:-ఒక రాజు. ఇలలుని (రైభ్యుని) పుత్త్రుఁడు. ఇతని తల్లి రథంతరి. దుష్యంతుఁ డొకనాఁడు వేటకుబోయి దన్నికణ్వమహాముని యాశ్రమము దగ్గఱనే యున్నదని విని యాతని జూడఁబోయెను. ఆశ్రమముకడఁ గణ్వుఁడు లేఁడు. కాని శకుంతల కనఁబడియెను. ఆమె వయోరూపవిలాసములకు విభ్రాంతి నొంది యామెను వివాహముకాఁగోరెను. కణ్వుఁడు వచ్చి తన నిచ్చినఁగాని స్వతంత్రముగ వివాహము కాఁజాలనని శకుంతల పలుక "గాంధర్వ వివాహము క్షత్త్రియులకుఁ జెల్లు"నని యామె నొడంబఱచి, శకుంతలకుఁ బుట్టిన కుమారునే యువరాజు చేయుటకు నొడంబడి యామెను గాంధర్వమున వివాహమయ్యెను. దుష్యంతుఁ డామె నచ్చటనే విడిచి తాను రాజధానికిఁ బోయిన పిమ్మట నచ్చటనుండి యామెను దోడితేరఁ బనిచెదనని చెప్పి తన నగరమునకు వెళ్ళెను. కాని పదపడి శకుంతల యొక్క తలఁపే లేకయుండెను. అట్లు పెద్దకాల మఱిగిన పిమ్మటఁ గణ్వునిశిష్యులను వెంటబెట్టుకొని, తనకుఁ బుట్టిన కుమారుని భరతు నెత్తుకొని దుష్యంతుని కడకు వచ్చి తననుఁ, దనపుత్త్రుని బరిగ్రహింపుమని కోరెను. "నిన్ను నేనెఱుఁగను. ఈ బాలుఁడు నా పుత్త్రుడని యపవాదములుపలుకకుము. పో పొ"మ్మని దుష్యంతుఁడు నిరాకరించెను. అంతట నాకాశవాణి "ఓ రాజా! ఈమె నీ భార్యయే. ఈ బాలుఁడు నీ కుమారుఁడు వీరిని బరిగ్రహింపు"మని నుడివెను. పిదప దుష్యంతుఁడు కుమారు నెత్తుకొని శకుంతల నాలింగనము చేసికొని "లోకాపవాదరేకుండ నాకాశవాణిపలుకుటకే యిట్లంటిని;వేఱు గాదని" వారిని బరిగ్రహించెను. తనకుమారుఁడు భరతుఁడు పెద్దవాఁడైనపిదప వానికే పట్టము గట్టెను. భార.

దుష్ప్రధర్షణుఁడు:-గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భీముఁడు వీనిని జంపెను.

దుస్సఖుఁడు:-గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

దుస్సల:-గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రిక. సైంధవుని భార్య. ఈమె మనుమలు ధర్మజుని యాగాశ్వమును బట్టిరి. అర్జునుఁడు వారి నోడించి సంహరింపఁ బోయెను. అప్పుడు దుస్సల యర్జునునికడకు వచ్చి వీరు నీమేనల్లుని పుత్త్రులు. రక్షింపుమని వేఁడెను. అర్జునుఁడు వారిని విడిచెను.

దుస్సేనుఁడు:-గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. యుద్ధములోఁ గొందఱు పాండవవీరులతోఁ బోరెను గాని యోడెను.

శివుఁడు త్రిపురాసురులను సంహరించి బాణము నుంకఁబెట్టుకొని వచ్చుచుండెను. అది బాలునిరూపమున నుండెను. ఆ బాలుఁ డెవ్వఁడని సుర లడిగిరి. వీఁడు దుర్వాసుఁడని శివుఁడు చెప్పెను. భార.

దుర్వాసుఁడు గంధమాదన పర్వతముకడఁ దపస్సు చేసికొనుచుండ నటఁ గ్రీడించుచున్న తిలోత్తమా సాహసికుల యాహ్లాదారావము లతనికి వ్రతభంగము కావించెను. అందుచే గోపమువచ్చి వారిని రాక్షసులు కండని దుర్వాసుఁడు శపించెను. సాహసికుఁడు గార్దభాసురుఁడయ్యెను. తిలోత్తమా సాహసికుల క్రీడలు చూడ నితనికిని సంసారవాంఛ జనించెను. ఆసమయముననే ఔర్వుఁడు తన కుమారితయగు కందళిని దీసికొని యచ్చటకు వచ్చి యామెను గైకొనుమని కోరెను. దుర్వాసుఁడు కందళిని పరిగ్రహించెను. ఇతఁ డామెతోఁ గొంతకాలము క్రీడించెను. కందళికిని గోప మెక్కువయ్యెను. దుర్వాసుఁ డామెపై విసుఁగుచెంది యామెను విడచి తపస్సు చేసికొనుచుండెను. అతని ప్రక్కనే కందళియు నుండెను. బ్రాహ్మణబాలుఁ డొకఁడువచ్చి భార్య నీ యర్ధాంగిగద, అర్ధశరీరమును విడిచి వచ్చుట నీకుఁ దగునా? ఆమెయే నీకు జన్మ జన్మములందును భార్య యగును. ఆమెకుఁ గోపముపోవును. ఆమెవలన భూలోకమందుఁ గదళిజాతి యేర్పడునని చెప్పెను. బ్రహ్మ

దుర్వాసుఁ డొకసారి కుంతిభోజునింటి కేగెను. అటఁ గుంతి యాతనికి బరిచర్యను జేసెను. ఇతఁడు సంప్రీతుఁడై కుంతి కొక మంత్ర ముపదేశించి, నీ వీ మంత్ర ముపాసించి యేదేవునిఁ గోరిన నాతఁడువచ్చి పుత్త్రు నిచ్చునని చెప్పెను. భార.

దుర్వాసుఁడు లోకసంచారము చేయుచు మార్గమధ్యమందుఁ గనఁబడిన యొక విద్యాధరకాంతచేత నున్న పుష్పమాలికను బుచ్చుకొనెను. పిమ్మట నింద్రలోకమునకుఁ బోయి యుద్యానవనములో విహరింపబడిన యింద్రున కా దండ నిచ్చెను. అతఁడు దానిం దన యేనుఁగుమీఁద వేసెను. అది క్రిందఁ బారవేసెను. ఇంద్రుఁడును, నతనితో నున్నవారును నవ్విరి. దుర్వాసునకుఁ దాను దండ నివ్వఁగ నితఁడిటు లవమానము చేసెనని యింద్రునిపైఁ గోపమువచ్చి నీ సిరియంతయును సముద్రములోఁ బడుఁగాక యని శపించెను. అపుడే అమృతాదులన్నియు సముద్రగతమయ్యెను. విష్ణు.

నాభాగుని కుమారుఁడైన అంబరీషుఁడు ద్వాదశీవ్రతముచేసి భోజనమునకుఁగూర్చుండఁ బోవుసమయమున నితఁడు వానిగృహమున కేగెను. వచ్చిన యభ్యాగతుని సత్కరించి భోజనమునకు రమ్మని యంబరీషుఁడు కోరెను. దుర్వాసుఁడు స్నానము చేయుటకై నదికి వెళ్ళెను. కాని యెంతకును దిరిగిరాఁడు. ద్వాదశి గడియలు మించి పోవుచుండెను. మించినపిదప భుజించుచో వ్రతఫలితము రాదు; వెంటనే భుజించినయెడలఁ బిలిచిన యతిథి రాకుండఁ గుడిచిన దోషమువచ్చును. అపుడంబరీషుఁడు పెద్దలను నాలోచన యడిగెను; ఉదకపారణము గావింపుమని వారు చెప్పుటచే నంబరీషుఁడు ఉదకమునుమాత్రము పానముచేసెను. స్నానముచేసి వచ్చినపిదప నిది దుర్వాసునకుఁ దెలిసెను. తాను రాకుండ నుదకపారణము చేసెనను కోపముతో నితఁడు భోజనముచేయక తన జడనుండి మహాకృత్యను సృజించెను. అది యంబరీషునిపై బడఁజొచ్చెను. ఇంతలో విష్ణుమూర్తి చక్రమువచ్చి కృత్యను సంహరించి దుర్వాసునిఁ దఱుముకొని వెళ్ళెను. దుర్వాసుఁడు పాఱిపోయి శివునిని శరణు వేఁడెను. అతఁడేమియుఁ జేయఁజాలననియె. అచ్చటనుండి విష్ణుమూర్తివద్దకుఁ బరుగెత్తెను. నేను నా భక్తుల యధీనముందుంటిని. వారి కపకృతి సల్పఁబడియేని నేను సహింపఁజాలను. ఇపుడు నేను నిన్ను రక్షింపలేను. నీవు అంబరీషునే శరణువేఁడుమని విష్ణుమూర్తి చెప్పెను. దుర్వాసుఁడు పరుగిడివచ్చి యంబరీషునిపాదములపైఁబడి రక్షించుమని వేఁడెను. అంబరీషుఁడే వీనిని మన్నించి చక్రమువలని భయమును బాపెను. భాగ.

దుర్వాసుఁడు కృష్ణునిఁబరీక్షింపఁగోరి యతని యింటికేగి యతని నొకమాటు అన్నము పెట్టు

మనుచు, మఱియొకమాటు తిన వనుచు, అట్లే కుముఖుఁ డగుచు విముఖుఁడగుచు నుండెను. పాయసమును దెచ్చి తన శరీరమంతయుఁ బూయుమని చెప్పెను. కృష్ణుఁడు పూసెను. దానిని దుర్వాసుఁడు రుక్మిణిదేహమునకుఁ బూసెను. ఏమిచేసినను కృష్ణుఁ డేమియు ననక యుండెను. అంతట దుర్వాసుఁడు రుక్మిణిని రథ్యముగఁ జేసి రథమునకుఁ గట్టెను. అయినను కృష్ణుఁడు చిన్నవోక దుర్వాసుని సేవ చేయు చుండెను. దుర్వాసుఁడు వానిని మెచ్చుకొనియు నీవు నాశరీరమంతకును పాయసము పూసితివి. కాని అరికాళ్ళకుమాత్రము పూసితివి కావు, కావున నీకు అరికాళ్ళనుండియే ప్రాణభయము వచ్చునని చెప్పి వెడలిపోయెను. భాగ.

రాముఁడొక బ్రాహ్మణునితో(యమునితో) రహస్యముగ మాటలాడుచు లోపలకు నెవ్వరిని రానీయవలదని లక్ష్మణుని ద్వారముకడనుంచెను. అపుడు దుర్వాసుఁడు రాఁగా వానిని లోపలకుఁ బోఁ జనదని లక్ష్మణుఁ డడ్డుపెట్టెను. ఆకలిగొని వచ్చిన బ్రాహ్మణుఁడను, లోపలకుఁ బోనీయకుంటివేని నిన్నును, నీ వారిని శపింతు ననియె. లక్ష్మణుఁ డితనిరాక తెల్పుటకు రామునికడకేగెను. బ్రాహ్మణునితో మాటాడు చుండఁగ వచ్చిన యతినిని రాముఁడు నగరము వెడల నడచెను. అట్లు దుర్వాసుఁడే లక్ష్మణుని యవతారము చాలించుటకు గారణ మయ్యెను. రామా.

దూ

దూషణుఁడు:-ఖరుని సోదరుఁడు. రావణుని పినతల్లి కుమారుఁడు. (చూడు ఖరుఁడు)

దృ

దృఢక్షత్రుఁడు:-గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

దృఢధన్వుఁడు :-ఒకరాజు, ఉత్పలావతి తండ్రి. మార్క.

దృఢరథుఁడు:- గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

దృఢరథుఁడు:- కక్షేయుని వంశమువాఁడు. జయద్రథుని కుమారుఁడు. భార.

దృఢవర్మ:-గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

దృఢసంధుఁడు:-గాంధారీధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

దృఢహస్తుడు:-గాంధారీ ధృతరాష్ట్రుల కుమారుఁడు. భార.

దృఢాయువు:-ఊర్వశియందుఁ బురూరవునకుఁ బుట్టిన కుమారుఁడు. భార.

దృఢాశ్వుఁడు:- దుంధుమారుని కుమారుఁడు. ఇతని కుమారుఁడు హర్యశ్వుఁడు. భాగ.

దృఢాస్యుఁడు:-లోపాముద్రా అగస్త్యుల కుమారుఁడు, తేజస్వి తండ్రి. భార.

దృహ్యు:-శర్మిష్ఠయందు యయాతికిఁ బుట్టిన కుమారుఁడు. యయాతి తన ముదిమి నితనిని బుచ్చుకొని యితని పడుచుదన మిమ్మని కోరెను. ఇతఁడు దాని కంగీకరింపక నిరాకరించెను. యయాతికిఁ గోపమువచ్చి యితనికి రాజ్యమివ్వక యితని వంశమువారు రాజ్యార్హులు కాకుండునట్లును, ముసలితనము రాకుండనే చనిపోవునట్లును శపించెను. భార.

దే

దేవకి:- వసుదేవుని భార్య. ఈమె పూర్వజన్మంబున కశ్యపుని భార్యయైన అదితి, కద్రువ యొక్క శాపంబున నిట్లు జన్మించెను.

దేవకి:-స్వాయంభువ మన్వంతరమునఁ బ్రశ్నియను పతివ్రత. ఆమె సంతానమును గోరి విష్ణుమూర్తిని బ్రార్థించెను. విష్ణువు ప్రసన్నుఁడై ముందుజన్మమునఁదానే కుమారుఁడుగ నామె గర్భమునఁ బుట్టుదునని చెప్పెను.

దేవకి:-ఉగ్రసేనుని సోదరుఁడైన దేవకుని కుమార్తె. శ్రుతదేవి, మిత్త్రదేవి, శ్రీదేవి, యశోధర

యీమె తోఁబుట్టువులు. వీరిని వసుదేవుఁడు వివాహమయ్యెను. దేవకి స్వయంవర మహోత్సవమునకు తనివెళ్ళి యామెంగొనివచ్చి వసుదేవున కిచ్చి వివాహము చేసెను. కంసుఁడు వీరిపినతండ్రి కుమారుఁడు. దేవకియొక్క వివాహమైనపిదప దేవకీవసుదేవులతోఁ గంసుఁడుకూడ వచ్చుచుండెను. అపుడు దేవకి యష్టమగర్భంబువలనఁ గంసుఁడు సంహరింపఁబడునని యాకాశవాణి పలికెను. ఆ మాటలు విని కంసుఁడు దుఃఖాక్రాంతుఁడై నిజప్రాణమును గాపాడుకొనుటకై దేవకిఁ జంపఁబోయెను. వసుదేవుఁడడ్డపడి యాడుదానిని జంపకుము. దేవకిఁ బుట్టినబిడ్డలను నీవు చంపవచ్చును. ఈమెవలన నీకపకారము లేదని వేఁడుకొనఁగ గంసుఁడు సమ్మతించి యామెను, వసుదేవునిఁ గారాగారమునఁ బెట్టి వారికి సంతానము గలుగఁగనే శిశువులను జంపుచుండెను. దేవకి యష్టమగర్భమునఁ గృష్ణుఁడు జన్మించెను. లోకనాయకుఁడు తమకుఁ గుమారుఁడుగ జన్మించుట యెఱింగి దేవకీవసుదేవులు వానిసస్తుతించిరి. వసుదేవుని బంధించియున్న సంకెళ్ళు వదులయ్యెను. అతఁడీబాలుని రక్షించుటకై వానిని గొంపోయి రేపల్లెలోఁ బెట్టి యశోద ప్రసవించిన బాలను దెచ్చి యీమె శయ్యపై నుంచెను.

దేవకి:-ప్రథమయుగమున మరీచికి వర్ణయను నామె యందుఁ గలిగిన పుత్రులార్వురును బ్రహ్మశాపముచే హిరణ్యకశిపునందుఁబుట్టి, పిమ్మట నీమె గర్భంబున జన్మించిరి. వీరినే కంసుఁడు సంహరించుచు వచ్చెను. కంసుఁడు చంపిన పుత్రులను జూడఁగోరికకలిగెడునని దేవకి బలరామకృష్ణులను గోరెను. వీరుసుతలమునకేగి బలియనుజ్ఞనుగైకొని యందున్న వారిని దీసికొనివచ్చి దేవకకిఁ జూపిరి. వారును శిశువులరూపముననే దేవకికి గోచరించిరి. ఆమె ముద్దాడి చనుబాలిచ్చెను. శ్రీకృష్ణుని సందర్శనమున వారి శాపములు తొలఁగఁగా వారు నాగలోకమునకుఁ బోయిరి. (చూడుము దేవకీసుతులు.) భాగ.

శ్రీకృష్ణుఁడు పెరిగి కంసుని వధించి తల్లిదండ్రులను జెఱనుండి విడిపించెను. అతఁడు పెద్దవాఁడైనప్పటినుండియును వీరివద్దనే యుండువాఁడు. వసుదేవుఁడు శరీరమును వీడఁగ నీమెయును నాతనిదేహముతోఁ జితికెక్కెను.

దేవకీసుతులు:- దేవకి యష్టమపుత్రుఁడు కంసుని సంహరించునను నాకాశవాణిపల్కులువిని యది తప్పించుకొనుటకై కంసుఁడు దేవకికి సుతులు పుట్టఁగనే వారిని సంహరించుచు వచ్చెను. వారిలో మొదటి యార్గురును బూర్వభవమునందు మరీచిపుత్రులు. బ్రహ్మ తన పుత్రికతో రమించుచుండుట చూచి వీరు నవ్విరి. అందుచే వీరికి నసురయోనిం బుట్టుఁడని బ్రహ్మ శాపమిచ్చెను. వారు హిరణ్యకశిపునకుఁ బుట్టిరి. పిమ్మట వారు కాలనేమిపుత్రులుగఁబుట్టిరి.
దే. భా.

యోగమాయవారినిఁదెచ్చి దేవకిగర్భమందుంచెను. వీరు పుట్టఁగనే కంసుఁడు సంహరించుచు వచ్చెను. వీరు పాతాళలోకమున కేగియుండిరి. పిమ్మటఁ గొంతకాలమునకు దేవకీ వసుదేవులు తమ పుత్రులను జూడఁగోరిరి. శ్రీకృష్ణ బలరాములు పాతాళలోకమున కరిగి బలి నడిగి వీరిని భూలోకమునకుఁ దీసికొని వచ్చి తల్లిదండ్రులకుఁజూపిరి. వారు దేవకికిని, కృష్ణునకును నమస్కరించి యాకాశమున కేగిరి. భాగ.

దేవకుఁడు:-ధర్మరాజునకుఁ బౌరవతియను భార్యయందు జన్మించిన కుమారుఁడు భాగ.

దేవకుఁడు:- ఆహుకుని కుమారుఁడు. దేవలుఁడు, అనుపదేవుఁడు, సుదేవుఁడు, దేవవర్ధనుఁడు ఇతని కుమారులు. ఇతని కుమార్తెల నందఱను వసుదేవుఁడు వివాహమయ్యెను. భాగ.

దేవకుఁడు:-ఉగ్రసేనుని తమ్ముఁడు. దేవకితండ్రి. శ్రుతదేవి, మిత్రదేవి, శ్రీదేవి, యశోధర ఇతని కుమార్తెలు. భాగ.

దేవకుల్య:-గంగ కూతురు. భాగ.

దేవజిత్తు:- సుమతి కుమారుఁడు. ఇతనిపుత్రుఁడు దేవద్యుమ్నుఁడు. భాగ.

దేవదత్తము:-అర్జునుని శంఖము. మయుఁడు అర్జునున కొసగెను.

దేవదత్తుఁడు:— ఉరుశ్రవుని పుత్త్రుఁడు. ఆతని పుత్త్రుఁడు అగ్నివేశుఁడు. భాగ.

దేవదత్తుఁడు:— ఒక బ్రాహ్మణుఁడు. ఇతఁడు పుత్త్రార్థియై యజ్ఞము చేయుచుండెను. ఆ యజ్ఞమందు గోబిలుఁడనువాఁడు ఉద్గాతగనుండెను. గోబిలుఁడు స్వరము తప్పు చెప్పగ మూర్ఖుఁడా! అట్లు చెప్పెదవేల? యని దేవదత్తుఁడు పలికెను. ఉద్గాతకుఁ గోపము వచ్చి నన్ను మూర్ఖుఁడా! యని తిట్టితివిగాన నీకు మూర్ఖుఁడగు కుమారుఁడే పుట్టునని శపించెను. దేవదత్తుఁడు గోబిలుని కాళ్ళపైబడి మ్రొక్కి క్షమింపుమని వేఁడగ నీకుమారుఁడు పిమ్మట గొప్పకవి యగునని గోబిలుఁ డనుగ్రహించెను. దేవదత్తునకుఁ బుత్త్రుఁడు పుట్టెను. వాని కుపనయనము గావించిరి. వానికెంత చెప్పినను నొక యక్షరమైనను రాకుండెను. తెలివితేటలు సున్న. తల్లిదండ్రులు వానిని విడనాడిరి. అతఁడు సర్వదా సత్యము చెప్పుచుండుటచేత సత్యవ్రతుఁడను పేరు వచ్చినది. ఇతనికి సరస్వతీప్రసాదమునఁ గవిత్వము కూడ వచ్చినది. దే. భా.

దేవద్యుతి:— సుమిత్త్రుఁడను ముని కుమారుఁడు. మాఘయేకాదశినాడు విష్ణుమూర్తిని స్తుతించి యాతని జూడఁగలిగెను. చిత్రసేనుఁడను నొక రాజు పాపకర్మలచే పిశాచముకాఁగా నతనిని జూచి వానికి విష్ణుమాహాత్మ్యము నెఱింగించెను. పద్మ.

దేవద్యుమ్నుఁడు:— దేవతాజిత్తుయొక్క కుమారుఁడు. ఇతనికి ధేనుమతియందుఁ బరమేష్ఠియను పుత్త్రుఁడు కలిగెను. భాగ.

దేవభాగుఁడు:— వసుదేవుని తమ్ముఁడు. ఉద్ధవుని తండ్రి. భాగ.

దేవభూతి:—శుంగునివంశమువాఁడైన భాగవతుఁడను రాజుయొక్క కుమారుఁడు. కణ్వామాత్యుఁడు వసుదేవుఁడనువాడు ఇతనిని జంపి రాజ్యమును గైకొనెను. భాగ.

దేవమిత్త్రుఁడు:— మాండూకేయుని శిష్యుఁడు. ఋగ్వేదసంహిత నుపదేశింపఁబడి ఇతని శిష్యులను సౌభర్యాదుల కుపదేశించెను. భాగ.

దేవమీఢుఁడు:— హృదికుని తనయుఁడు.

దేవమీఢుఁడు:—భోజునికుమారుఁడగు హృదికుని తనయుఁడు. ఇతఁడు శూరుఁడను పేరునఁ బరగెను. ఇతనిభార్య మారిష. ఆమెయందు సుదేవుఁడు దేవభాగుఁడు, దేవశ్రవుఁడు, ఆనకుఁడు, సృంజయుఁడు, శ్యామకుఁడు, కంకుఁడు, అనీకుఁడు వత్సకుఁడు, వృకుఁడు అను పుత్త్రులును; పృథ, శ్రుతదేవ, శ్రుతకీర్తి, శ్రుతశ్రవస, రాజాధిదేవి అను పుత్త్రికలును బుట్టిరి. భాగ.

కుంతిభోజుఁ డితని మేనత్తకొడుకు. ఇతనికి బిడ్డలు లేకపోవుటచేఁ బృథను బుత్త్రికనుగ నిచ్చెను.

దేవయాని:— ఈమెతల్లి ప్రియవ్రతుని కుమార్తెయైన ఊర్జస్వతి. భాగ.

దేవయాని:— శుక్రుని కుమార్తె. ఈమె తల్లి యింద్రుని కుమార్తె యగు జయంతి. ఈమె తన తండ్రికి శుశ్రూష చేయుచు కచునియందుఁ బ్రేమ కలిగియుండెడిది. కచుఁడు రాక్షసహతుఁడై యింటికిరాకయున్నపు డీమె వానికై బెంగపెట్టుకొనుటవలననే శుక్రుఁడు వానిని బ్రతికించెను. (చూడు కచుఁడు) కచుఁడు గురువునొద్ద సంజీవినీవిద్య నభ్యసించి గురు ననుమతిఁ బడసి వెడలఁబోవుచున్నపు డీమె కచుని నాపి తనను వివాహము చేసికొనవలసినదని కోరెను. గురుపుత్త్రిక తోఁబుట్టువు వంటిది. కావున నిన్ను వివాహము చేసికొనఁగూడదు అనియతఁడు తిరస్కరింపఁగ దేవయాని యీర్ష్య కలిగి నీవు నేర్చుకొనిన విద్య నీకుఁ బనిచేయకుండుగాక యని శాప మిచ్చెను. ధర్మవిరుద్ధమైన పనిచేయకున్న నాకకారణముగ శాప మిచ్చితివిగావున నిన్ను బ్రాహ్మణుఁడు పెండ్లియాడకుండుఁగాక యని కచుఁడీమెకుఁ బ్రతిశాప మిచ్చెను.

ఒకనాఁడు దేవయానియు, వృషపర్వునికూఁతురగు శర్మిష్ఠయు, వారిచెలికత్తెలును గొలనిగట్టున బట్టలు పెట్టుకొని జలకములాడిరి. గాలివచ్చి వీరిబట్టలన్నియుఁ కలిసిపోయెను. శర్మిష్ఠముందుగ వచ్చి తెలియక దేవయానిబట్టలు కట్టుకొనెను. పిమ్మట దేవయానివచ్చి "మీకుం గురుఁడైన శుక్రుని

కూఁతురను. నీవువిడచిన బట్టలు నేనుకట్టుదునా" యని యలుగ "మీయయ్య మాతండ్రికి సేవకుఁడు గదా! నీకింత కావరమా? ఇట్లు నిష్ఠురము లాడెదవు" అని శర్మిష్ఠ దేవయానిని నచ్చటనున్న నూతియందుఁ ద్రోసి వెడలి పోయెను. అట్లు నూతఁబడి దేవయాని యేడ్చు చుండఁగ వేటకై యచ్చటకువచ్చిన యయాతి యామె యేడ్పువిని యామెను బైటకుఁ దీసెను. దేవయాని, ఆమెకై వెదకుచు వచ్చిన పరిచారిక ఘూర్ణికతో జరిగిన వృత్తాంతమంతయుఁ జెప్పి తండ్రి కిది యెఱింగింపుమనియె. శుక్రుఁడువచ్చి యామెను నింటికిరమ్మని బ్రతిమాలెను. కాని వృషపర్వుని నగరమున కామె రానని యెను. కూఁతు నెడఁబాసి యుండజాలక శుక్రుఁడును వృషపర్వుని నగరమును వదలి వెళ్ళెను. ఈ వృత్తాంతము వృషపర్వుఁడు విని శుక్రునికడ కేగి బ్రతిమాలి దేవయానిని సంతసిల్లఁజేయుటకు దనకూఁతును నామెకు దాసిగఁ బంపెను. శర్మిష్ఠ దాసియై దేవయానిని గొలుచుచుండెను.

ఒకనాఁడు వనవిహారము చేయుచుండఁగఁ యయాతిని జూచి వెనుక నన్ను నూతినుండి బైటకుఁ దీయునపుడే నా దక్షిణ హస్తమును బట్టుకొంటివి కావున నీవే నన్నుఁ బాణిగ్రహణము చేసికొమ్మని కోరెను. బ్రాహ్మణ బాలికను క్షత్రియుఁడు వివాహము కాఁజనదని యయాతి సంకోచించుచుండ నామె యపక్రమ దోషము లేకుండ శుక్రు ననుమతినొందెను. వారిరువురును వివాహము చేసికొనిరి. దేవయానితో దాసిగ శర్మిష్ఠయు యయాతి నగరమునకుఁ బోయెను. శర్మిష్ఠను యయాతి వేఱొక భవనమునం దుంచెను. దేవయానికి యదువు, తుర్వసువు అను పుత్త్రులు కలిగిరి. ఋతుమతియైన శర్మిష్ఠ తనకును బుత్త్రదాన మొసఁగుమని యయాతిని బ్రార్థింపఁగ రాజామె కోర్కెతీర్చెను. దేవయాని శర్మిష్ఠ పుత్త్రులను జూచి మీరెవ్వరని యడిగి తెలిసికొనియె. తనభర్త శర్మిష్ఠశయనము చేరకుండునని యొడంబడియు నామెతోఁ గలసి సంభోగించె నని కోపమువచ్చి భర్తను విడచి తండ్రియొద్దకుఁ బోయి తనభర్త తన నవమానము చేసెనని చెప్పి కొనెను. తన కూఁతున కన్యాయమును గావించె

నని శుక్రుఁడు యయాతిని జరాభారము పొందు నట్లు శపించెను. భార.

దేవరాతుఁడు:- నిమికి నాలవ సంతతివాఁడు. కేతుని పుత్త్రుఁడు. దక్షయజ్ఞము ధ్వంసము చేయునప్పుడు శివుఁ డుపయోగించిన చాపమును శివుఁడు దేవతల కిచ్చెను. వారితని కిచ్చిరి. ఇతఁడును నితని సంతతి వారును దానిని బూజించుచు వచ్చిరి. ఈ చాపమునే రాముఁడు విరచెను. ఇతని కుమారుఁడు బృహద్రథుఁడు.

దేవరాతుఁడు :- విశ్వామిత్త్రుని కుమారుఁడు. ఇతఁడే శునశ్శేపుఁడు. యూపస్తంభమునకుఁ గట్టఁబడి బ్రహ్మదేవుని యనుగ్రహముచే విముక్తుఁ డయ్యెను. కావున దేవరాతుఁ డను పేరు వచ్చెను. భాగ.

దేవరూపిణి:-ఒక శిల. ధర్మవ్రత యను నామె శాపవశమున శిలయై యీ పేరునఁ బరగెను. గయాసురుఁడు. కదలకుండ నుండుటకై యీ శిలనే వానిశిరముపైఁ బెట్టి విష్ణువు దీనిపై నెక్కి నిలుచుండెను.

దేవలుడు :- ప్రత్యూషుఁడను వసువు కుమారుఁడు. పితృలోకమున భారతము వక్కాణించుటకై వ్యాసుఁ డితనిని బంపెను. భార.

దేవలుఁడు:-అక్రూరుని కుమారుఁడు. ఇతనికుమారుఁడు అనుపదేవుఁడు. భాగ.

దేవలుఁడు:-బ్రహ్మ సర్వమును సృజించి వస్త్రములను మాత్రము చేయలేక పోయెను. అతఁడు శివుని యొద్దకు వెళ్ళి వస్త్రములు సృజించుమని కోరెను. శివుఁడును బుట్టింపలేక పోయెను. అతనినుండి యొకశక్తి స్వరూపుఁడు వచ్చెను. ఇతఁడే దేవలుఁడు. అతనిని జూచి శివుఁడు "ఓయీ! నీవు వస్త్రములను జేయుము. వేదములు పుట్టినపుడు దారములు పుట్టెను. అవి విష్ణుమూర్తి నాభియందున్నవి. వానిని దీసికొని రమ్ము" అని పంపెను. ఇతఁడు విష్ణుమూర్తి దగ్గఱకు వెళ్ళుచు మార్గమందనేక రాక్షసులతో యుద్ధము చేసెను. ఇతఁడు శక్తిని దలఁచుకొనఁగ నామె వచ్చి రాక్షసులను జంపెను. పిమ్మట నేత సామగ్రులకై మేరుపర్వతము దగ్గఱకుఁ

బోయెను. మార్గమందు దానవులను, దుష్టమృగములను సంహరించెను. వారికి శాప విమోచనము లయ్యెను. మయునిదగ్గఱకు వెళ్ళి సామగ్రులు తెచ్చి వస్త్రములు నేసి దేవతలందఱకును నిచ్చెను. ఈతఁడు ఆమోదపురమునకు రాజగు నట్లు శివుఁ డనుగ్రహించెను. శేషుఁడు తన కుమారిత యగు చంద్రరేఖ నితని కిచ్చి వివాహము చేసెను. సూర్యుఁడు తన సోదరియగు దేవదత్తను ఇచ్చి వివాహము చేసెను. దివ్యాంగుఁడు, విమలాంగుఁడు, ధవళాంగుఁడు ఇతని పుత్త్రులు. దేవలునకు దేవాంగుఁ డను పేరు కూడఁ గలదు. ఇతనిని రంభచూచి మోహించి కవయఁగోరెను గాని యాతఁడు తిరస్కరించె. ఆమెకు దుఃఖమువచ్చి "నీవైనువేల యేండ్లు శూద్రుఁడ వగుము. పిమ్మట బ్రాహ్మణుఁడ వయ్యెద" వని శపించెను. దే. పు.

దేవవతి:–గ్రామణి యను గంధర్వుని కూఁతురు. సుకేశుని భార్య. మాల్యవంతుఁడు, సుమాలి, మాలి ఈమె కుమారులు. దే. పు.

దేవవర్ణి:–భరద్వాజుని కుమారిత. విశ్రవోబ్రహ్మ యొక్క భార్య; కుబేరుని తల్లి.

దేవశర్మ–ఒకముని. ఇతని భార్య రుచి. ఈమెను ఇంద్రుఁడు కామించి తిరుగుచుండెను. దేవశర్మ యాగార్థ మరుగుచు నింద్రునివలన భయము లేకుండ భార్యను గాపాడు చుండుమని తన శిష్యుని విపులుని నింటియొద్ద నుంచెను. భార.

దేవశ్రవసుఁడు:–వసుదేవుని తమ్ముఁడు.

దేవసావర్ణి :–విష్ణుసావర్ణి కుమారుఁడు. ఇతని కుమారుఁడు రాజసావర్ణి.

దేవసేన:–అరిష్టనేమి కూతురు. ఈమెయు, నీమె సోదరి దైత్యసేనయు విహరించుచుండఁగఁ గేశి యను రాక్షసుఁడు బలాత్కారమున నామె నెత్తుకొని పోయెను. ఈమె యాలాపములు విని యింద్రుఁడు వేగమేవచ్చి రాక్షసుని సంహరించి యీమెను గాపాడి తానే యీమెను బెంచెను. దీనికు వరమిచ్చెదనువేఁడుకొనుమని, యింద్రుడు చెప్పఁగ నామె తనకు దగినభర్త నిమ్మని కోరెను. ఇంద్రుఁ డీమెను బ్రహ్మదగ్గఱకుఁ గొనిపోయి యీమెకు భర్త యెవ్వరని యడిగెను. వీరుఁడైనవాఁడే యీమెకు భర్త యగునని బ్రహ్మ చెప్పెను. శూరపద్మాసురునిఁ గుమారస్వామి సంహరింపఁగ నతని శౌర్యమును మెచ్చుకొని యింద్రుఁ డీమె నతనికిచ్చి వివాహము చేసెను. భార.

దేవస్థానుఁడు:–ఒక ముని. యుద్ధానంతరమందు ధర్మరాజునకు హితవును బోధించి శాంతము కలుగఁ జేసెను. భార.

దేవహూతి:–స్వాయంభువు మనువు కుమారిత. ఈమెతల్లి శతరూప. ఆకూతి, ప్రసూతి ఈమెకుఁ దోఁబుట్టువులు. దేవహూతి రూప లావణ్యములను జూచి విశ్వావసుఁడను నొక గంధర్వుఁడు మోహించి, యట్లు దోషసంకలిత చిత్తవృత్తి గలవాఁ డగుటచే నధోలోకమునఁ బడెను. ఆమెయుఁ దగిన వరుని వెదకుటకై తల్లియుఁ, దండ్రియు నామెను దీసికొని దేశములు దిరుగుచుండిరి. సరస్వతీనదీతీరమునఁ గర్దమునిఁ జూచి స్వాయంభువు తన కుమారితను బరిగ్రహింపుమని వేఁడెను. కర్దముఁ డీమెను బరిణయమయ్యెను. దేవహూతి భర్తకుఁ బరిచర్య లానరించుచు సంతానమునకై వేఁడెను. కర్దముఁడు విమాన మొకటి సృజించి దానిపై భార్య నెక్కించి లోకమంతయుఁ జూచి సరస్వతీ నదియందు స్నానము చేయించెను. దేవహూతి గర్భమును ధరించెను. ఆమెకు కళ, అనసూయ, శ్రద్ధ, హవిర్భువు, గతి, క్రియ, ఖ్యాతి, అరుంధతి, శాంతి అను తొమ్మండ్రు కుమారితలు పుట్టిరి. అంతటఁ గర్దముఁడు సన్న్యసించెద ననియెను. పుత్త్రికలకు వివాహములు చేసి తన కొకపుత్త్ర ననుగ్రహించిన పిమ్మట సన్న్యసింపవచ్చునని యును, దనకోరిక సఫలము చేయుమని యును దేవహూతి ప్రార్థించెను. నీవు భగవంతుని ప్రార్థింపుము. నీగర్భమునఁ బుట్టఁ గలవాఁడని భర్తపలికెను. ఆమెగర్భముధరించెను. కపిలుఁడు జన్మించి యామెకు యోగమార్గ మెఱింగించెను. కుమారునిచేఁ జెప్పఁబడిన యోగమార్గమునన్నే యామె మోక్షమొందెను. భాగ.

దేవాంతకుఁడు:– రావణుని కుమారుఁడు.

దేవాతిథి:- అక్రోధనుని పుత్త్రుఁడు. ఇతఁడు విదేహ రాజు కూఁతురగు మర్యాదను బెండ్లియాడెను. ఋచీకుఁ డితని పుత్త్రుఁడు. భార.

దేవానీకుఁడు:- క్షేమధన్వుని కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు అహీనుఁడు. భాగ.

దేవాపి:- సునందాప్రతీపుల కుమారుఁడు. శంతనుఁడు, బాహ్లికుఁ డితని సోదరులు. ఇతఁడు బాల్యమునందే తపోవనమునకేగి పాషండులలోఁ గలసెను. ఇతఁడే పెద్దకుమారుఁడు కనుకఁ ప్రతీపుఁడు మరణించినపిమ్మట రాజ్యముచేయుట కితనిని దీసికొనివచ్చిరి. కాని యితఁడు పాషండులలోఁ గలియుటఁ దెలిసికొని రాజ్యార్హుఁడు కాఁడని మరల వెడలఁగొట్టిరి. భార.

ఈ దేవాపియును నిక్ష్వాకు వంశజుండగు మరుత్తును యోగయుక్తులై కలాపగ్రామమందుండి కలియుగాంతంబునఁ బ్రజలను ఆశ్రమాచారములు తప్పకుండ నడుపుదురు. భాగ.

దేవాపి:- ఒక బ్రాహ్మణబాలుఁడు. ఇతని తండ్రి ఆర్ష్టిషేణుండను రాజుచేత యాగము చేయించుచుండఁగ మిథువను దనుజుఁడు వీనితండ్రిని, రాజును, రాజుభార్యను గూడ రసాతలమున కెత్తుకొని పోయెను. ఈ బాలుఁ డొకనాఁడు తన తండ్రి యేడి? యని తల్లినడిగెను. అతఁడు యాగము చేయించుటకు వెళ్ళి రాక్షసునిచే రసాతలమున కెత్తుకొని పోఁబడెనని యామె తెలిపెను. తండ్రిలేని బ్రతుకు నాకేల? అని యగ్నిని వేదములనుగూర్చి తపస్సు చేసెను. వారు ప్రత్యక్షమై గౌతమీతీరమున శివునిని గూర్చి తపస్సు చేయుమనిరి. ఇతఁడిట్లు ప్రార్థించి శివుని యనుగ్రహము వడసి రసాతలమునకేగి తనతండ్రిని, రాజును, రాజుభార్యను, గైకొని వచ్చెను. బ్రహ్మ.

దేవావృధుఁడు:- ఇతఁడు నదీతీరమునఁ బుత్త్రులకై తపసు చేయుచుండెను. ఇతని తీవ్రమైనతపస్సు చూచి యెట్టిపుత్త్రుఁడు పుట్టునో యని యా నది స్త్రీరూపమున వచ్చి యితనిని గామించెను. దేవావృధుఁ డామెను భార్యగఁ గైకొని యామెయందు బభ్రువను పుత్త్రుఁ బడసెను. మత్స్య.

దేవి:- ప్రహ్లాదుని భార్య. విరోచనునితల్లి. భాగ.

దేవిక:- ధర్మరాజు భార్య. ఈమెయం దాతనికి యౌధేయుఁడను కుమారుఁడుజన్మించెను. భార.

దేవుఁడు:- ఒక మనువు. ప్రజాపతి తండ్రి. భార.

దై

దైత్యసేన:- అరిష్టనేమి కూఁతురు. దేవసేన తోఁబుట్టువు

ద్యు

ద్యుతిమంతుఁడు:- ప్రియవ్రతుని పుత్త్రుఁడు. క్రౌంచద్వీపమునకు రాజు. కుశలుఁడు, మనోనుగుఁడు, ఉష్ణుఁడు, పావనుఁడు, అంధకారుఁడు, ముని, దుందుభి ఇతని పుత్త్రులు. బ్రహ్మ.

ద్యుతిమంతుఁడు:- మార్కండేయుని పెదతండ్రియగు ప్రాణుని పుత్త్రుఁడు. ఇతని పుత్త్రుఁడు స్వనవాకుఁడు. బ్రహ్మ.

ద్యుమత్సేనుఁడు:- సాళ్వదేశపు రాజు. ఇతఁ డంధుఁడై రాజ్యమును బోఁగొట్టుకొని యడవిలో మునివలెఁ గాలము గడుపుచుండెను. ఇతని కుమారుఁడగు సత్యవంతుని సావిత్రి వలచి వివాహమయ్యెను. ఆమె యమునివలనఁ బొందిన వరములవలన నీతని కన్నులును, రాజ్యమును మరల లభించెను. భాగ.

ద్యుమత్సేనుఁడు:- శల్యుని చిత్రరక్షకుఁడు. ధర్మరాజు వీనిఁ జంపెను. భార.

ద్యుముఁడు:- సాల్వుని మంత్రులలో నొకఁడు. సాల్వునిమంత్రులతోఁ గలసి ద్వారకయందు యదువీరులతో యుద్ధముచేయుచుఁ బ్రద్యుమ్నుని కుమారులలో నొకనిని జంపెను. వీనిని బ్రద్యుమ్నుఁడు సంహరించెను. భాగ.

ద్ర

ద్రమిళుఁడు:- కన్యాకుబ్జదేశమున నొక గోపరాజు. ఇతనిభార్య కలావతి. ఆమెకు సంతానములేదు. పుత్రునిఁగోరి తపస్సు చేసికొను కశ్యపునియెదుట విడిచెను. ఆతని వీర్యంబు గ్రహించి (మాసము కలావతి) భర్తతో నావృత్తాంతంబు చెప్పెను. బ్రాహ్మణుని వీర్యంబున భగవద్భక్తుఁడగువాఁడు పుట్టునని యాతఁడు సంతోషించి యామెను బ్రాహ్మణునివెంటనే యుండుమని తన సర్వస్వమును బ్రాహ్మణునకు దానముచేసి మోహంబున గంగాతీరంబున శరీరమును విడచెను. ఇతనిభార్యయందుఁ బుట్టినవాఁడే నారదుఁడు. బ్రహ్మచే శూద్రయోనియందుఁ బుట్టుమని శపింపఁబడిన యుపబర్హణుఁ డీ కలావతియొక్క గర్భమునఁ బుట్టెను. బ్ర. వై.

ద్రవిణుఁడు:- ధరుని కుమారుఁడు.

ద్రవిళుఁడు:- ఒక దనుజుఁడు. వీఁ డుగ్రసేనుని భార్యను వలచి యుండెను. కాని యామె పొందుట యసంభవ మయ్యెను. ఒకనాఁ డామె స్నానమునకు రాఁగా వీఁడు చూచి యుగ్రసేనుని రూపమును ధరించి యామెను జేరెను. ఆమె వానిఁ జూచి నిజముగఁ దనభర్తయే యనుకొని వానితో రమించెను. పిమ్మట వాఁడు దనుజుఁడనియుఁ, దనను మోసగించెననియు తెలిసి వానిశుక్రజము వలనఁ బుట్టినవాఁడు దనుజుఁడై వారివంశమున జన్మించినవానిచే మరణించునని పలికెను. ఈ దనుజునివలనఁ బుట్టినవాఁడే కంసుఁడు. హరి.

ద్రు

ద్రుపదుఁడు:- (మరుద్గణము వలనఁ బుట్టెను) పృషతుని కుమారుఁడు. ఇతని జన్మవృత్తాంతము చిత్రము. పృషతుఁడు తపస్సు చేసికొనుచు దగ్గఱఁ బువ్వు కోయుచుండిన మేనకను జూచెను. అంత నతనికి రేతస్ఖలనమయ్యెనుఁ. దానిని తన పాదముతోఁ గప్పియుంచెను. అందుండి ద్రుపదుఁడు జన్మించెను. ఈ బాలుని భరద్వాజాశ్రమమున విడిచి. పృషతుఁడు తన నగరమున కేగెను. ద్రుపదుఁడు భరద్వాజుని పుత్రుఁడైన ద్రోణునితోఁ గలసి విలువిద్య నేర్చుకొనియెను. తండ్రి యనంతర మితఁడు పాంచాలదేశమున కభిషిక్తుఁ డయ్యెను. ఇతఁడు కోకిలాదేవిని బరిణయమయ్యెను.

ఇతఁడు రాజ్యము చేయుచుండఁగ ద్రోణుఁడు ధనార్థియై వచ్చి నీబాల్యస్నేహితుఁడనని చెప్పుకొనియెను. ఆయనను రాజ్యగర్వంబున ద్రుపదుఁడు ద్రోణుని దూలనాడి పంపెను. ఆ యవమానము ద్రోణుఁడు మఱువలేదు. ఎట్లైన ద్రుపదుని వంచింపవలెనని చూచుచుండెను. ద్రోణుఁడు కురు పాండవులను నస్త్రవిద్య నేర్పెను. వారివిద్య పరీక్షించుటకును, తన గురు కట్నముగను ద్రుపదునితో సంగ్రామము చేసి వాని నోడించి పట్టితెమ్మని చెప్పెను. దుర్యోధనాదులు వచ్చి ద్రుపదునితోఁ బోరాడిరి. కాని వారి నీరా జోడించిపంపెను. పిమ్మట నర్జునుఁడు వచ్చి యుద్ధముచేసి ద్రుపదు నోడించి వానిని దెచ్చి ద్రోణుని ముందటఁ బెట్టెను. అట్లు ద్రోణుఁడవమానించుటచే ద్రుపదుఁడు బ్రాహ్మణోపాస్తి చేయుచుండెను. ద్రోణునిఁ జంపఁగలుగు పుత్రుని, నర్జునున కిచ్చి వివాహము చేయుట కొక పుత్రికను బడయఁగోరి పుత్రకామేష్టిచేసెను. అగ్నికుండమునందుండి ధృష్టద్యుమ్నుఁడను కుమారుఁడును, ద్రౌపదియను కూఁతురును బుట్టిరి. ద్రుపదుఁడు సుతునకు సకలవిద్యల నేర్పించెను. ద్రౌపదిని నర్జునున కిచ్చి వివాహము చేయఁదలఁచు చుండెను. అట్లుండఁగఁ బాండవులు లక్కయింట మరణించిరని వార్తవినఁబడియెను. కాని వారు క్షేమముగ నుందురని పురోహితుఁడు చెప్పెను. అర్జునుఁడు నిశ్చయముగ వచ్చుననుకొనుటకు వీలులేదు. ఏమైనను ద్రౌపదికిస్వయంవరమును బ్రకటించెను. దానికై మత్స్యయంత్రమును నిర్మించెను. నీడచూచి మత్స్యమును గొట్టినవానికి ద్రౌపదినిత్తునని శపథము

చేసెను. రాజాధిరాజకుమారులు వచ్చిరి; కొట్ట లేకపోయిరి. తుదకు బీదబ్రాహ్మణకుమారుఁ డొకఁడు కొట్టెను. మాటతప్పక వానితోడనే ద్రుపదుఁడు తనకూఁతును బంపెను. పిమ్మట వాఁడెవరై యుండునని యెఱుంగగోరెను. అతఁడే యర్జునుఁడని తెలిసికొని యపరిమితానందమునొందెను. ద్రౌపది నర్జునునకిచ్చి పాణిగ్రహణము చేయించవలె ననుకొనుచుండఁగఁ బాండవులేవురును నామెను వివాహమయ్యెద మనిరి. ఇట్టి విరుద్ధముండునా ? యని ద్రుపదుఁడు నివ్వెరపాటునందుచుండఁగ వ్యాసుఁడువచ్చి పాండవులేవురును నిజముగ నొక్కటియేయని దివ్యదృష్టి నిచ్చిచూపి తృప్తిపఱచెను. అందుపై ద్రౌపదిని బాండవులకు వివాహముచేసి వారి వెంబడిని బంపెను.

పాండవులు తన నగరమునుండి యేగినపిదపఁ గొంతకాలము సుఖముగనేయుండిరి. ఇంద్రప్రస్థమను నగరము కట్టుకొని ఖాండవప్రస్థమును బాలించుచుండిరి. ధర్మజుఁడు రాజసూయమును చేసెను. ద్రుపదుఁడువెళ్ళి తనకూఁతురును నల్లుండ్రను సౌఖ్యముతో నుండుటఁజూచి యానందమునందెను. కాని యాయానంద మల్పకాలములోనేపోయెను. పాండవులుజూదమునాడిరాజ్యమోడి యరణ్యములపాలైరి. వా రరణ్యవాసము చేయుచుండినపుడు ద్రుపదుఁడు వారినిఁజూడనే లేకపోయెను. పాండవు లజ్ఞాతవాసముకూడ ముగిసినపిమ్మట నభిమన్యునివివాహమునకునితఁడు కూడ విరాటనగరమునకు వెళ్ళెను; అచ్చటనే కృష్ణాదులు పాండవులు చేయవలసిన కర్తవ్యమేమని తర్కించిరి. ఇతఁడును ముందుగ దూతను బంపుటయే మంచిదని తన పురోహితునకుఁ జెప్పవలసినట్లుగఁ జెప్పి కౌరవులకడకుఁ బంపెను. కాని దానివలన లాభములేకపోయెను. యుద్ధము సేయవలసివచ్చెను. యుద్ధములో ద్రోణుఁ డీతనిని జంపెను. భార.

ద్రుమసేనుఁడు:-యుద్ధములోఁ గర్ణుని కుమారునితోఁ బోరివానిచేఁ జంపఁబడియె. భార.

ద్రుహ్యుఁడు:-యయాతికి శర్మిష్ఠయందుఁ బుట్టిన కుమారుఁడు. భాగ.

ద్రో

ద్రోణుఁడు:-వసువులలో ముఖ్యుఁడు. ఇతనిని, ఇతని భార్యను భూలోకమున జన్మింపుఁడని బ్రహ్మ కోరెను. విష్ణుసేవారతి తనకిచ్చిన యెడలఁ బుట్టుదు ననియెను. భాగ.

ద్రోణుఁడు:-ధర యను నామెను వివాహమయ్యెను. ఈ దంపతులకు సంతానము లేకపోవుటచే గంధమాదనపర్వతమును జేరి యట విష్ణుమూర్తిని బ్రార్థించిరి. ఎంతకును నతఁడు ప్రత్యక్షము కాకపోవుటచే విసిఁగి యీ దంపతు లగ్నికుండమునఁ బడిరి మీ ముందుజన్మమున విష్ణుమూర్తి మీ కుమారుఁడగునని యాకాశవాణి పలికెను. ద్రోణుఁడే నందుఁడుగఁ బుట్టెను. ధర యశోదయై జన్మించె. వీరికిఁ గృష్ణుఁడు పుత్త్రుఁడయ్యెను. బ్ర.వై.

ద్రోణుఁడు:- ఒక పక్షి. జరిత యను పక్షియందుఁ బక్షిరూపము ధరించిన మందపాలుఁడను ముని వలనఁబుట్టిన కుమారుఁడు. ఇతఁడు తార్క్షి యను పక్షిని వివాహమయ్యెను. పింగాక్షుఁడు, విరాటుఁడు, వృతుఁడు, సుముఖుఁడు వీనికుమారులు. ఈ పక్షులనే జైమిని ప్రశ్నించి తన సందేహములు నివృత్తి చేసికొనెను. మార్క.

ద్రోణుఁడు:- భరద్వాజుఁడు ఘృతాచిని జూచుటచేనతని చిత్తముచంచలమై రేతఃపతనమయ్యెను అందుండి జన్మించిన కుమారుఁడే ద్రోణుఁడు. ఈతఁడు తండ్రియాశ్రమములోనే పెరిగి వేదాధ్యయనాది విద్యలను నేర్చుకొనెను. మఱియు ధనుర్వేదమునుగూడ నెఱింగి యగ్నివేశుండను మునివలన నాగ్నేయాది దివ్యబాణములను బడసెను. ద్రుపదుఁ డీతనిచిన్ననాఁటిచెలికాఁడు. వీరిఱువురును సహాధ్యాయులు.

విద్య పూర్తియైన పిమ్మట భరద్వాజునిచే నాజ్ఞాపితుఁడై యితఁడు పుత్త్రలాభార్థము కృపుని చెలియలైన కృపియనునామెను వివాహమయ్యెను. ఇతనికి నశ్వత్థామయను పుత్త్రుఁడు,

జన్మించెను. ధనికుల పుత్త్రులు పాలుద్రావుట చూచి యీ బాలుఁడును బాలకై యేడ్చెను. ఏడ్చుచున్న పుత్త్రకుని వాంఛ దీర్పలేక తన లేమికై మిక్కిలి విచారించెను. ద్రోణుఁడు ధనార్జనము నిమిత్తము వెడలెను. పరశురాముఁడు బహుదానంబులు సేయుచున్నాఁడని విని ద్రోణుఁ డతనికడ కేగెను. కాని యితఁడు వెళ్ళునప్పటికే పరశురాముఁడు తనకడనున్న ధనమంతయును బంచిపెట్టెను. అతనికడ శస్త్రములు మాత్రము మిగిలియుండెను. వానినే ద్రోణుఁడు గ్రహించి యతనివలన నస్త్రప్రయోగ రహస్యంబులు కొన్ని నేర్చుకొని మరలివచ్చెను. తాఁగోరిన ధనము చిక్కకుండుటచేఁ దన చెలిమికాఁడును, నపుడు రాజ్యాధిపతియు నగు ద్రుపదుని దలఁచుకొని యతనికడ కేగి తనరాక నెఱింగించెను. ద్రుపదుఁ డితని నెఱుఁగననియును, మహారాజులకును బేద విప్రులకును మైత్రియుండఁజాలదనియును ద్రోణుని గసరికొట్టెను. ఇతఁడు విచారగ్రస్తుఁడై హస్తినాపురంబునకుఁ దన భార్యాపుత్త్రులను దీసికొని వచ్చెను. దుర్యోధనాదులు బంతియాడి దాని నూతఁ బారవేసికొని పైకిఁ దీయు నుపాయము నెఱుంగక నూతిచుట్టు నిలువంబడిరి. ద్రోణుఁడు వారిని సమీపించి బంతి నూతఁబడుట నెఱింగి యెవ్వరెఱుంగని యుపాయంబున దానిం దీసెద నని యాకంటకమును బాణముతోఁ గొట్టి, యా బాణమును మఱియొక బాణముతోఁ గొట్టి యట్లు బాణరజ్జువు గావించి దానితోఁ బంతిని బైకి లాగెను. రాజకుమారు లా వృత్తాంతము తమ తండ్రికిని, భీష్మునకును నెఱింగించిరి. భీష్ముఁ డితనిని రావించి ధనధాన్యాదు లొసంగి శస్త్రవిద్య నేర్పుమని పుత్త్రుల నాతని కప్పగించెను.

అప్పటినుండియు ద్రోణుఁడు ధృతరాష్ట్ర పాండుపుత్త్రులకు ధనుర్విద్యను నేర్పుచుండెను. మీలో! నాకోర్కె తీర్పఁగలవాఁడెవ్వఁ? డని ద్రోణుఁ డడుగఁ నేనని యర్జునుఁడు ముందునకు వచ్చెను. ద్రోణుఁ డితనియం దధికప్రేమ కలిగి యుండెను. అర్జునుఁడును మిగిలినవారి కంటె నైపుణ్యముచూపుచుండెను. కావున నితని నందఱికంటెను నధికునిగఁ జేయఁగోరి ద్వంద్వ సంకీర్ణయుద్ధముల తెఱఁగును, వ్యూహముల భేదనోపాయమును నతిశయముగ నేర్పెను. తనకు గురుకట్నంబుగఁ దన చెలికాఁడైయుండి రాజ్యగర్వమునఁ దనను దూలనాడిన ద్రుపదునిఁ బట్టి తెండని శిష్యులకుఁ జెప్పెను. అర్జునుఁడు ద్రుపదు నోడించి వానిం గట్టి ద్రోణునొద్దకుఁ దెచ్చెను. వానిం జూచి ద్రోణుని పరిహాసముగ మాట్లాడి తన చెలిమిని జ్ఞాపకముచేసి వానిని విడిపించెను. ద్రుపదుఁడుమాత్ర మితనిపై రోషము కల్గి ద్రోణుని సంహరింపఁగలుగు పుత్త్రునికై హోమములు చేసెను. అర్జునుఁ డట్లు తనకోర్కె నెఱవేర్పుటచే ద్రోణుఁడు సంప్రీతుఁడై 'బ్రహ్మశిరం' బను బాణప్రయోగంబు కూడ నాతనికి నేర్పి తనతో సమానునిగఁ జేసెను. కావుఁ దనతో మాత్రము ప్రతియుద్ధము సేయకుండుమని యర్జునునిఁ గోరెను.

అట్లు ద్రోణుఁడు రాజపుత్త్రులకు గురుఁడై కురురాజునకును నాలోచనలు చెప్పుచుండువాఁడు. పాండవులు వారణాశికిఁ బోవుచు లక్కయింట మడసిరని విని మిక్కిలి దుఃఖించెను. దుర్యోధనుఁడు గావించిన కపట మాతఁ డెఱుఁగఁడు. పిమ్మటఁ బాండవులు సజీవులై యున్నారనియును, ద్రౌపదిని బెండ్లియాడి ద్రుపదునగరమున నున్నారనియును విని సంతోషించెను.

ఇట్లుండ ధృతరాష్ట్రుఁడు సభచేసి ద్రోణాదులను రావించి, పాండవులను జంపు నుపాయ మెద్ది? యని యాలోచన యడిగె. ద్రోణుఁడు నిర్ఘాంతపోయెను. భీష్ముఁ డది తగదని ధృతరాష్ట్రునకు బుద్ధిచెప్పెను. ద్రోణునకును ధృతరాష్ట్రునెడలఁ గోపముకూడ వచ్చెను గాని రాజగు నతని నేమియుఁ బలుకలేక భీష్ముఁడు మందలించిన పిమ్మట నితఁడును బాండవులను రావించుటయే యుక్తమని చెప్పెను. వీనివచనంబులకు దుర్యోధనునకును, కర్ణునకును వీనిపైఁ గోపము వచ్చెను. కర్ణుఁడు వీనిని నిందించెను. పాండవు లచ్చట లేకపోవుటచే వారితో ద్రోణుఁడు కలిసియుండఁ బోయినను దఱచు వారింగూర్చి ప్రశంసించక పోయినను దుర్యోధనుఁ డీతనిని బాండవపక్షపాతిగనే తలంచుచుండెను. కాని భీష్మ ధృతరాష్ట్రు లితనిని గౌరవముగనే చూచుచుండిరి. ద్రోణాదులు చెప్పినట్లు పాండవులు హస్తినాపురము వచ్చుటయు, నింద్రప్రస్థము

నిర్మించుకొని యేగుటయు నయ్యె. పాండవులందును వారిలో నర్జునునం దధికముగ బ్రేమ యుండినను నితఁడు పాండవులతో నరుగలేదు. మొదటఁ దనను రావించి పోషించుచున్న భీష్మునితోడనే యుండెను. అంత నచిరకాలములోనే పాండవులు జూదంబున నోడి యరణ్యముల కేగుట తటస్థించెను.

పాండవుల యరణ్యాజ్ఞాత వాసంబుల కాలమంతయు నాతఁడు వారినిఁ జూడక దుర్యోధనుని చెంతనే యుండినను బాండవులపై సదభిప్రాయ మీతనికిఁ బోలేదు. వారి యజ్ఞాతవాస సమయంబున వారి నెఱుంగుటకై గోగ్రహణార్థము దుర్యోధన భీష్మ కర్ణాదులు బయలు వెడలిరి వీరితో ద్రోణుఁడును వచ్చెను. ఉత్తరకుమారుని, వీనికి సారథియైన బృహన్నలను జూచెను. బృహన్నలయే యర్జునుఁడని నిశ్చయించుకొని గడువు ముగియకుండ నితఁడేల యెఱుకపడియెను? అని విచారించి భీష్మునితోఁ మర్మముగఁ బలికెను. భీష్ముఁ డీతని మనమును బాధించు సందియమును వెడల నడిచెను అజ్ఞాతవాసము ముగిసెనని చెప్పెను. అంత ద్రోణుఁడు సంతోషము పట్టఁజాలక యర్జునునిబలమును బొగడెను. వానిని గెల్చుట దుస్తరమని చెప్పెను. కర్ణుఁ డీతనిని మిక్కుటముగ నిందించెను. వీని పలుకులకు రోసి ద్రోణుఁడు యుద్ధపరాఙ్ముఖుఁ డయ్యెను. ఆ సమయంబున భీష్ముఁడు ముందునకు వచ్చి యందఱకు హితమగురీతిని మాట్లాడి కార్యోన్ముఖులను గావించెను. కాని కౌరవు లోడియే వచ్చిరి.

దుర్యోధనునకును, నెక్కువగఁ గర్ణునకును నీతనిపై ద్వేషము మెండుగనే యుండెను. ద్రోణుఁడును వారి యాలోచన లందుఁ గల్పించుకొనక యుండెను. అయినను సమయము వచ్చినపుడు హితవునే బోధించుచుండెను. శ్రీకృష్ణుఁడు వచ్చినపుడును, నతఁడు వెళ్ళినపిదపను బాండవులతో సంధియే యొప్పునని యితఁడు చెప్పెను. కాని దుర్యోధనుఁడు వినలేదు.

తుదకుఁ గురుపాండవులకు యుద్ధము సంభవించెను. శిష్యభావంబున దుర్యోధనాదులును, పాండవులును ద్రోణునకు సమానులయ్యు ద్రోణుఁడు దుర్యోధనుని పక్షముననే పోరెను. అతఁడు ప్రథమమున ధృష్టద్యుమ్నునితోఁ దలఁపడియెను. పిమ్మటఁ బాండవసైన్యంబుపైఁ గవిసె. ఘటోత్కచునితోఁ బోరాడెను. భీష్ముఁడు శరతల్పగతుఁడైన పిమ్మట ద్రోణునినే సర్వసేనాధిపతిగ నిర్ణయించిరి. ద్రోణునకుఁ బాండవులపై నభిమానముండినను, దుర్యోధనుఁ డిదివఱకు ద్వేషించినను నిప్పుడు ప్రభుభక్తిని దలఁచి శక్తివంచనలేక దుర్యోధనుని జయమే కోరి ద్రోణుఁడు యుద్ధముచేసెను. తన నట్లు గౌరవించినందుకు కుప్పొంగి ద్రోణుఁడు దుర్యోధనుని వరము వేడుకొనుమనియెను. అతఁడు ధర్మజునిఁ జంపకుండఁ బట్టి తెమ్మనియె. ద్రోణుఁడు వల్లెయని పాండవ సైన్యంబుపై కేగెను. వారిపై దివ్యాస్త్రంబులు వేయుచుండెను. అర్జునాదులు ధర్మజుని రక్షించుచుండిరి.

ద్రోణుఁడు చొచ్చుకొని వచ్చి ధర్మజునితో యుద్ధము సేయుచుండెను. ధర్మజునకు సింహసేన వ్యాఘ్రదత్తాదులు సహాయము వచ్చిన వీరిని ద్రోణుఁడు సంహరించెను. నకుల సహదేవాదులను నొప్పించెను. ధర్మజుఁడు పట్టువడునని భయపడి సైనికు లఱచుచుండిరి. ఆ సమయంబున నర్జునుఁడు ఘోరాకారుఁడై నిశితసాయక పరంపరలను గురిపించుచుండెను. అట్లు యుద్ధంబు సేయుచుండ నినుఁడస్తమించుటయు నా నాఁటికి యుద్ధమాపిరి. ద్రోణుని వలన సత్యజిత్తు. సూర్యదత్తుఁడు మొదలగువారు జంపఁబడిరి. అర్జునుఁడు సైంధవునిఁ జంపెదనని ప్రతిజ్ఞ పట్టినాఁడు ద్రోణుఁడే మొగ్గరంబు కాచియుండె. మొగ్గరంబు ప్రవేశింప నెలవిమ్మని యర్జునుఁడు వేఁడఁగ నన్ను గెలువక యెట్లు ప్రవేశించువాఁడవు? అని ద్రోణుఁ డాతనిపై బాణము వేసెను. అర్జునుఁడును వానిపై బాణంబువేసి మొగ్గరంబు ప్రవేశించి ఘోరంబుగ యుద్ధంబుచేసె. దాన దుర్యోధనుండే కుపితుఁడై పాండవ పక్షపాతియై ద్రోణుఁ డర్జునుని రానిచ్చెనని దూషించెను. తన ప్రతిజ్ఞచొప్పున ధర్మజునిఁబట్టు నుపాయంబుగ నట్లు చేసితినని ద్రోణుఁ డాతనికి సమాధానము చెప్పెను. దుర్యోధనుం డట్లు పల్కుటచే రోషంబున వచ్చి ద్రోణుఁడు పాండవసైన్యంబుపై విజృంభించెను. ధర్మజునితోఁబోర నతఁడోడి యమజుని సారథిం

బునఁ బోయెను. ద్రోణుఁడు పాండవపక్షమున బోరు విరాట ద్రుపదులను సంహరించెను. పిమ్మట నతనికిని, నర్జునకును ద్వంద్వయుద్ధమయ్యెను. గెలుపోటములేక యీ యుద్ధంబు సాగుచుండె. దేవతలును నీ పోరాటము చూడవచ్చుచుండిరి. గురుని గెల్చుట యసంభవమని శ్రీకృష్ణుఁ డెఱింగి అశ్వత్థామ మృతుఁడగుచో నితఁడు జీవింపలేఁ డనియు నెఱింగి శ్రీకృష్ణుఁడు భీమునిచే నశ్వత్థామ చచ్చెనని ద్రోణునకుఁ జెప్పించె. ఆ మాటలు వినుటతోడనే నతనికి గుండె జల్లుమనియె. అయినను ధృష్టద్యుమ్నునిపై బాణమువేసి తన కడ్డువచ్చిన వారిని వధించుచు సైన్యంబుపైఁ బడుచుండఁగా విశ్వామిత్ర జమదగ్ని భరద్వాజాదులు ద్రోణునకుఁ గనంబడి "బ్రహ్మోత్తమా ! ఇదివఱకుఁ జేసినను జేసితివి. ఇంక నీకు యుద్ధము తగదు. నీ కాలంబు పూర్ణంబయ్యె" అనిచెప్పి యంతర్ధానంబొందిరి. దీనిం జూచియు భీముని పలుకులు తలఁచికొనియు విస్మయంపడి తన పుత్త్రుని వృత్తాంత మరయఁగోరి ధర్మజుఁడు నిజము పలుకును గాన నతని నడిగెను. అశ్వత్థామ మరణించెనని పలుకుమని శ్రీకృష్ణుఁడు ధర్మజుని బలవంత పెట్టెను. అశ్వత్థామ యను నేనుఁగు మరణించుటచే ఆ నెపంబునైన ననుమని చెప్పెను. ధర్మజుఁడు అశ్వత్థామ చచ్చెననియె పదపడి కుంజరమనియె. ఈ కుంజర మను మాట వినఁబడకుండ వాద్యములు వాయింపఁబడెను. ద్రోణుఁడు నిజముగఁ దనసుతుఁడే మరణించెనని నమ్మి యస్త్రసన్న్యాసము చేసి కార్యమంతయు దుర్యోధనునకును, కృపునకును, కర్ణునకును నప్పగించి తన రథంబెక్కి నిజయోగ బలంబునఁ బ్రకట జ్యోతీరూపంబున నెగసి పరమస్థానంబు చేరెను. పిమ్మట ధృష్టద్యుమ్నుఁడు పాదచారియై యాతని రథముకడ కేగి యాతని శిరమును ఖండించెను. భార.

ద్రౌ

ద్రౌపది:- పాంచాలనృపతి ద్రుపదుఁడు పుత్త్రార్థియై క్రతువుసేయఁగ నగ్నిగుండము నుండి యొక పుత్త్రుఁడు, బుత్త్రికయుఁ బుట్టిరి. ఈ పుత్త్రికయే ద్రౌపది. ఈమె పుట్టినపు డాకాశవాణి ఈమెకు 'కృష్ణ' యను నామకరణ మొనరించెను. కాని యీమె ద్రౌపదియను పేరటనే పరగినది. ఈమెను ద్రుపదుఁడు మిక్కిలి గారాబముతోఁ బెంచుచు నర్జునున కిచ్చి వివాహముచేయఁ దలఁపోయుచుండెను. కాని యీమెకు వివాహముసేయ యుక్తవయస్సు వచ్చినప్పటికిఁ బాండవులు మరణించిరని విని మిక్కిలి దుఃఖించెను. ద్రౌపదికిఁ దగిన భర్తను నిర్ణయించుటకై మత్స్యయంత్ర మొకటి నిర్మించి దానినెడంజాచి దానింగొట్టిన వానికిఁ దనకూఁతు నిత్తునని చాటించెను. ద్రౌపదిని వివాహము గాఁగోరిన రాకొమరు లెల్లరు వచ్చిరి. కర్ణ దుర్యోధనాదులును వచ్చి యంత్రమును గొట్టలేకపోయిరి. బ్రాహ్మణ వేషముతో నున్న యర్జునుఁ డవలీలగ మత్స్యమును గొట్టెను. ఈతని మెడలో ద్రౌపది పూలహారము వేసెను.

పాండుపుత్త్రునకిచ్చి వివాహము సేయుదునని తండ్రియనుట వినియు నొక బీదబ్రాహ్మణునకు భార్యయగుటకు ద్రౌపది విచారింపలేదు. ఆతని వెంటనే కుంభాకారగృహమున కేగి కుంతికిని, ధర్మరాజునకును నమస్కరించినది. కుంతి వచనానుసారము పాండవు లేవు రామెను వివాహము గాఁదలఁచినపుడు లోకవిరుద్ధమగు నాచారమునుగూర్చి ద్రౌపది యేమాటయు నాడక వా రేవురకు భార్య యయ్యెను. వివాహమున కించుక పూర్వమే తన భర్తలు పాండవులని యెఱింగెను. ఈమె నారదుఁడు చెప్పిన నియమము ప్రకార మొక్కొక్క సంవత్సర మొక్కొక్కనికి భార్యయై మెలఁగుచు రాజపుత్త్రియని గర్వింపక యిడుములు గణియింపక పతులతోడి జీవనమే సుఖముగఁ దలఁచుచుండెను.

ఈమెకు ధర్మరాజాదులవలనఁ గ్రమముగ ప్రతివింధ్యుఁడు, శ్రుతసేనుఁడు, శ్రుతకీర్తి, శతానీకుఁడు, శ్రుతకర్ముఁడు అను పుత్త్రులు కలిగిరి.

అర్జునుఁడు సుభద్రను వివాహమయినపిదప ద్రౌపది యేమనునో యని సంకోచించి ముందుగ సుభద్రనుబంపి యీమెకు నమస్కరింపుమనియె. కాని ద్రౌపది యర్జునునిపైఁ గోపమును జెందక సుభద్రను నాదరించెను.

ధర్మరాజు ఇంద్రప్రస్థపురమునకు రాజై రాజసూయము నొనరించెను. అందు ద్రౌపది వచ్చిన వారిని స్వయముగ నాదరించుచుండెడిది. ఆ యాగమునకే దుర్యోధనాదులు వచ్చిరి పాండవ సభయందు విమలమణిస్థలంబును జూచి జలాశయముగఁ దలఁచి దుర్యోధనుఁడు పుట్టంబు లెగఁద్రోసికొనియె; జలాశయమును స్థలముగ తలఁచి కట్టినబట్టలు తడుపుకొనియె; దాని నంతయుఁ జూచిన ద్రౌపదికి నవ్వువచ్చినది; ఆమె నవ్వినది కాని దానివలనఁ జేటు మూడునని యెఱుఁగక పోయెను. ఈమె నవ్వుట దుర్యోధనుఁడు జూచెను. ద్రౌపది తనను పరాభవించెననుకొని యామెను వంచింప నిశ్చయించుకొని ఉండెను.

కొంతకాల మరిగినపిమ్మట దుర్యోధనుఁడు పిలువఁ బాండవులేవురును, ద్రౌపదియు హస్తినాపురమున కేగిరి. ద్రౌపది గాంధారితోడను, ఆమె కోడండ్రతోడను ముచ్చటించుచుండెను. ఇంతలోనే ప్రాతికామి వచ్చి ధర్మరాజు నిన్నోటువడియె. కౌరవేశ్వరుఁడు నిన్ను రాఁబనిచె రమ్మని పిలచెను. ద్రౌపది నివ్వెఱపాటు నొందెను. ధర్మరాజోడిన పిదపఁ దననోడెనా? ఓటుపడకపూర్వమే యొడ్డెనా? యని యామె ప్రశ్నించెను. కాని యీ ప్రశ్న కుత్తరువు చెప్పలేదు. సభ్యులే నీయడిగిన యర్థంబు నిర్ణయించువారు; తత్‌క్షణమే సభకు రావలయునన్న రాజానతి నతిక్రమించుటకు వెఱచి ద్రౌపది సభకుఁబోయి కురువృద్ధులచెంగట నిలచెను. నిలచిన యామెను సభామధ్యమునకీడ్చుకొనిరమ్మని దుర్యోధనుఁడు పలుక దుశ్శాసనుఁడామెను కొప్పుపట్టిలాగెను. రాజపుత్రి, పాండుపుత్రులభార్య, రజస్వల యైయున్నదానిని రాజసభలో నట్లవమానించుచుండ నెవ్వరును నామెను రక్షింపరైరి; ద్రౌపది యెంతయో విలపించెను. దుర్యోధనుఁడు నీచ మనస్కుఁడై యామెకట్టిన పుట్టంబు లాగివేయుమనెను. అట్లనుట తడవుగ దుశ్శాసనుఁడామె వస్త్రంబు లాగఁజొచ్చెను. ఆమె పతులా వ్రతబద్ధులై యోటుపడి నిలిచియుండిరి. భీష్మాదులా యది తగనిపనియని మాన్పింపరైరి. ద్రౌపదికి దిక్కెవ్వరు? తనమానము కాపాడుమని శ్రీకృష్ణునే వేడుకొనియెను. మానవతుల మానభంగమునకు సర్వేశ్వరుఁడు సహించునా? దుశ్శాసనుఁ డెంత యొలిచినను ద్రౌపది శరీరముపై వస్త్ర ముండుచునే యుండెను. ఇంకను నామె పాతివ్రత్య ప్రభావము దుర్యోధనుఁ డెఱుఁగక యామెకు నీచసంజ్ఞలు చేసెను. ధృతరాష్ట్రుఁడు పుత్రుని మందలించి ద్రౌపదిని వరము వేడుకొనుమనియెను. తనభర్తల దాస్యమువాపి వారి యాయుధములు వారికిమ్మని ద్రౌపది కోరెను. ఇంకను గోరుకొమ్మని ధృతరాష్ట్రుఁడనియెనుగాని రాజకాంత రెండు వరములకంటె నెక్కువ కోరరాదని నుడివెను. ద్రౌపదియు భర్తలతోఁ బాటింద్రప్రస్థమునకుఁ జనియెను.

కాని యచిర కాలములోనే ధర్మజుఁడు జూదమునాడి రాజ్యమోడెను. పాండవులవెంట నీమెయును గాననములకేగి సూర్యుఁ డొసఁగిన స్థాలితో వంటచేయుచుఁ దమతో నుండిన పరిజనులకుఁ గూడఁ బెట్టుచుండెను. అరణ్యమున కేగిన కొలదికాలములోనే శ్రీకృష్ణుఁడు పాండవులను చూడవచ్చెను. వానితోఁ దనకును దన భర్తలకును గల్గిన భంగపాటును గుఱించి ద్రౌపది చెప్పికొని విలపించెను. ధర్మరాజుతోఁ గూడ బాహువిక్రమంబున దుర్యోధనునితో యుద్ధముచేసి రాజ్యమును గెల్చుట పాడియని వాదించెను. కాని యామెమాటలు ధర్మజుఁడు లక్ష్యపెట్టునా? అతఁడు కర్మఫలమును గుఱించియును, ధర్మమును గుఱించియును బోధించెను. పిమ్మట ద్రౌపది రాజ్యనష్టమునుగూర్చి కాని, తన వనవాసమును గుఱించికాని విచారింపలేదు. పతులతోడిపొందే పరమప్రసాద మని సంతోషముతో నుండెను. శ్రీకృష్ణునితో నామెను జూడవచ్చిన సత్యభామకును నామె సతీధర్మములు బోధించెను.

ద్వైతవనంబున నామె భర్తలవెంటఁ బోవుచుండ గాలి కెగిరివచ్చి సౌగంధికపుష్ప మొకటి యీమె పదసమీపమునఁ బడెను. పుష్పములఁ జూడ ముదితలకు వేడుక గాన నట్టి వింకను దెమ్మని యీమె కోరెను. వానిని దెచ్చుటకై భీముఁడేగి పుష్పవనమును గాచుచుండిన యక్షులను సంహరించి యీపెకై పుష్పములను దెచ్చెను.

ఒకనాఁడు ద్రౌపదిని తృణబిందు నాశ్రమమున నుంచి పాండవులేవురు వేఁటకేగిరి. సైంధవుఁడు సాల్వకన్యం బరిణయమునకై కా దారిం బోవుచు నామెను జూచి మోహించి తనను బఁణయము కమ్మని చెప్పెను. ద్రౌపది వానికది నీతి గాదని చెప్పి తన వృత్తాంతంబు చెప్పినను వాఁడు మానక యామెను లాగెను. ద్రౌపది వానిఁ ద్రోసిన, వాఁడు క్రిందపడియును లేచి యామెను రథముపైఁ గూర్చుండఁబెట్టి తోలుకొని పోవుచుండెను. ధర్మజుఁ డార్తనాదమును విని యొంటిగ నున్న ద్రౌపది యెట్లుండెనో చూచుటకై తమ్ములతో వేగమే యాశ్రమంబునకు వచ్చెను. అచ్చట ద్రౌపది లేదు. సైంధవుఁ డెత్తుకొని పోవుట గని పాండవులు వానిని వెంబడించి వానితో యుద్ధము చేసి, వాని నవమానించి పంపి, ద్రౌపదిని సురక్షితముగఁ గొనివచ్చిరి.

ఇట్టి కష్టములతో నరణ్యవాసము ముగిసెను. అజ్ఞాతవాసము సల్పుటకై పాండవులు మారుపేరులతో విరటునగరమునకు వచ్చిరి. ఈమెయు వారి వెనుకనే సైరంధ్రిరూపమున 'మాలిని' అను పేరుతో వచ్చెను. విరటుని భార్య యీమె రూపలావణ్యములు చూచి యచ్చెరువొందెను ఆ రాణితో ద్రౌపది తనపతులేవురును నరణ్యవాసంబు చేయవలసి వచ్చెననియు, నింక నొకవత్సర మొక నియమంబునఁ గడుపవలసి యున్నదనియు నొక విధముగ నిజవృత్తాంతమే చెప్పుకొనియె. ద్రౌపది యారాణి సేవచేయుచు రహస్యంబుగఁ బతులను గలసికొనుచుండెను. ఒకనాఁడు ద్రౌపది రాణియగు సుధేష్ణ చెంత నుండఁగ నామె సోదరుఁడు కీచకాగ్రజుఁ డీమెను జూచి మోహించి తనకోర్కె నామెకుఁ దెల్పెను. మంచి మాటలచే నాతని వెడలనంపఁ జూచెనుగాని యాతఁడట్లు పోకుండుటచేఁ దన పతు లతనిని జంపఁగలవారని గంభీరముగఁ బలికెను. కీచకుఁడు తనసోదరిని జేరి యామెను వేఁడి యెటులైన దనకు సైరంధ్రిపొందు కలుగఁ జేయుమని వేఁడెను. ఆమె తనకు దాహమగుచున్నదని కీచకునింటికేగి మద్యమును దెమ్మని సైరంధ్రి కాజ్ఞనిచ్చెను. కీచకునొద్దకుఁ బంపుటకై సుధేష్ణ యిటు కల్పించెనని ద్రౌపది యెఱింగి తప్పించుకొనఁ జూచెను గాని సాగినది కాదు. ఆమె సూర్యుని బ్రార్థించి తన కాపద రాకుండఁ గాపాడుమని వేఁడి కీచకు నింటికి జనియె. కీచకుం డామెపైఁ బడఁబోయె. సూర్యుని ప్రసాదంబున నొకశక్తి ద్రౌపది నావహించెను. దాన నామె సింహబలునిఁ ద్రోసి పరుగిడి వచ్చి విరటుసభకడఁ జేరి విలపించెను. ఆ సమయంబున భర్తలును నూరకొనియుండుట ద్రౌపదికిఁ గష్టముగనే యుండెను భీముఁడు వాని నిజంప దాపుననున్న వృక్షమును బెకలింపఁ బోయెను. కాని ధర్మజుఁడది సమయము కాదని వారించెను. ఆమె యింకను సభయందే నిలువఁబడుటచే నాట్యకత్తెవలె నిండోల నిలువఁబడియెదవు? పొమ్మని ధర్మరాజు పలుక నాభర్త నాట్యగాఁడు గావున, నాకును నాట్యము వచ్చెనని ప్రత్యుత్తర మిచ్చి ద్రౌపది యటనుండి యేగె. సుధేష్ణ యేమియు నెఱుఁగనిదానివలె నామె నోదార్చెను.

ద్రౌపదికి మనశ్శాంతి లేదు. తనకైన భంగపాటు మఱువలేదు. ఎల్లరు నిద్రించిన పిమ్మట భీముని జేరి కీచకుఁడు చేసిన పరిభవము చెప్పికొని దుఃఖించెను. భీముఁడామె కొక్క యాలోచన చెప్పెను. ఈసారి కీచకుఁడు వచ్చుచో నాతని వచనంబుల కనుమతించినదానివలెఁ బలికి యాతని నొక సాంకేతికస్థలంబునకు వచ్చునట్లు చేయుమని భీముఁడు చెప్పెను. వీరనుకొనునట్లే కీచకుఁడు మరల వచ్చెను. భీముఁడు చెప్పినట్లే ద్రౌపది పలికెను. ఆనాఁటిరాత్రి సింహబలుఁడు ముదముతో సాంకేతికస్థలమునకు వచ్చియుండె. భీముఁడు ద్రౌపదివేషంబునఁ బోయెను. కీచకుఁ డీ కాంతారూపంబున నున్నవానిని గౌఁగలించుకొనెను. వానితో యుద్ధము చేసి భీముఁడు వానిని జంపెను. భీమునితోఁ గూడఁ బోయిన ద్రౌపది యదిచూచి సంతోషించి, "చూడుఁడు నాభర్తలెంతపని చేసిరో చూడుఁ"డని చాటుచు వచ్చెను, అంతఁ గీచకుని సోదరు లుపకీచకులు తమయన్నమృతి కీమెయే కారణమని యీమెను సింహబలుని శవంబునకుఁ గట్టి తీసికొని పోయిరి. అపుడీమె యేడ్పువిని భీముఁడు వచ్చి యుపకీచకులను సంహరించి యీమెను విడిపించెను.

విరటుఁడీమెయునికికి భయమొంది యీమెను మంచి మాటలతోఁ దన రాష్ట్రమునుండి వెడల నంపుమని భార్యతోఁజెప్పెను. సుధేష్ణయు నట్లు చెప్పఁగ నింకఁ బదమూఁడు దినంబులుమాత్రము నిచ్చట నుండుటకు ననుమతిని గోరెను.

గోవులను మరల్చుకొని వచ్చిన యుత్తరుని విరాటుఁడు ప్రశంసించుచుండఁగా వానిసారథి యుద్ధకళా నిపుణుఁడని ధర్మరాజు పలికెను. విరటునకుఁ గోపమువచ్చి వానిని పాచికతోఁ గొట్టిన ముఖముపైఁ దగిలి బొటబొట రక్తము కారెను. అటనున్న ద్రౌపది తన చీరకొంగుతో నారక్తమును నద్దెను. "ఏల నీవిట్లుచేసితివి?" అనిరాజడుగఁగాఁ "ఈ బ్రాహ్మణుని (ధర్మజుని) రక్తబిందువు లెన్ని నేలఁబడునో, యన్ని వర్షము లీదేశమున ననావృష్టి కలుగును. అట్టిది కలుగకకుండ నద్దితి" నని ఆమె చెప్పెను.

పదపడి కొన్నిదినముల కజ్ఞాతవాసము ముగిసెను. సుధేష్ణ ద్రౌపది నెఱింగెను. ఈమెను గౌరవించుచుండెను. అచ్చటనే యభిమన్యుని వివాహము జరిగెను. ద్రుపద బలరామ శ్రీకృష్ణాదులు వచ్చిరి. కౌరవులతో సంధిచేసికొనుటయే యొప్పని యాలోచించిరి. ద్రుపదుని పురోహితుని దూతగఁ బంపిరి.

తరువాత శ్రీకృష్ణుఁడే రాయబారిగ నేగెను. సంధికై యత్నింపుమని ధర్మరాజు ఈతనితోఁ జెప్పెను; ధర్మరాజిట్లనుటచే భీమార్జునులు నట్లే యనిరి. కాని ద్రౌపదికి సంధిచేయుట యిష్టము లేదు. శ్రీకృష్ణునితోఁ దనను గౌరవులు పెట్టిన కొఱియలు చెప్పుకొని దుఃఖించెను. వారితో యుద్ధము జరుగుననియే శ్రీకృష్ణుఁడు సూచించి చనియెను. తుదకు యుద్ధమే సంభవించెను. యుద్ధములో భీముఁడు దుశ్శాసనుని వధించి యాతని హృదయంబు చీల్చెను. ఆసమయమున నీమె భీమునిప్రక్కనేయుండెను. కౌరవసభలో దుశ్శాసనుఁ డీమెకొప్పు పట్టుకొని లాగుటచే విడిన కురులకు భీముఁడు దుశ్శాసనుని రక్తము పూసెను. పూర్వము గావించిన శపథము ప్రకారము దుశ్శాసనుని రక్తమట్లు పూయఁబడిన తరువాతనే యామె కురు సంస్కారము గావించుకొనెను. ఆ యుద్ధంబున ద్రౌపదేయులను ప్రతి వింధ్యుడు, శ్రుతసోముఁడు, శ్రుతకీర్తి, శతానీకుఁడు, శ్రుతసేనుఁడు నను వీరల నేవురను బాలురను నిద్రపోవుచున్నవారిని నశ్వత్థామ సంహరించెను. భీముఁడు అశ్వత్థామను సంహరించెదనన్న నీమెయే బ్రాహ్మణవధ తగదని చెప్పి వారించెను. యుద్ధమునఁ బాండవులు గెలిచి రాజపాలనము చేసిరి గాని చిరకాల మీమె సౌఖ్యపడి నట్లులేదు. కలియుగము ప్రవేశించినపిదప రాజ్యమును వదలి వెళ్ళు పాండవులతో, వారి యితర భార్యలు కాక, యీమె యొక్కతెయే చని హిమవంతంబునకుఁ బోవు మార్గముననే నీమె విగతప్రాణియై పడి స్వర్గలోకమును జేరెను.

అర్జునునిపై పక్షపాతము కలిగియుండుటచే నట్లయ్యెను.

ద్రౌపది:-లక్ష్మియొక్క ఛాయ. సీత రావణునిచే హరింపఁబడక పూర్వము, అగ్నిదేవుఁడు ఆమెయొక్క ఛాయను సీతఁగజేసి యిచ్చి, సీతను దాను దాచెను. ఆ ఛాయయే తపస్సుచేసి ద్రౌపదిగఁ బుట్టెను. బ్ర. వై.

ద్రౌపది పూర్వజన్మమున నింద్రసేన యను నామె. (చూడు ఇంద్రసేన) భార.

ద్వా

ద్వాదశాదిత్యులు:-శ్రీమన్నారాయణ స్వరూపుఁడైన సూర్యుఁడు ఏకస్వరూపుఁడే.

కాని, కాలదేశ క్రియాది భేదములచేత ఋషు లనేక క్రమంబుల వర్ణించిరి.

ఒక్కొక్క మాసమునందు సూర్యుఁడును, ఆయన గణంబును నొక్కొక్క పేరునఁ బరగుదురు.

ద్వాదశమాసంబులందు ఆయన పరగుకీతిని ద్వాదశాదిత్యులని వర్ణింపఁబడియెను.

చైత్రమాసమున ధాతయను నామమును ధరించెను. కృతస్థలి, హేతి, వాసుకి, రథకృత్తు, పులస్త్యుఁడు, తుంబురుఁడు అను పరిజనము.-

వైశాఖమాసమున అర్యముఁడు అను పేరు ధరించును. పులహుఁడు, భోజుఁడుఁ ప్రహేళి, పుంజకస్థలి. నారదుఁడు, కంజనీరుఁడు అను పరిజనము.

జ్యేష్ఠమాసమున మిత్త్రుఁడను నామము ధరించును. అత్రి, పౌరుషేయుఁడు, తక్షకుఁడు మేనక, హాహా, రథస్వనుఁడు అను పరిజనము.

ఆషాఢమాసమున వరుణుఁడను పేరు. వసిష్ఠుఁడు, రంభ, సహజన్యుఁడు, హూహువు, శుక్రుఁడు, చిత్రస్వనుఁడు అను పరిజనము.

శ్రావణమాసమున అతని పేరు ఇంద్రుఁడు విశ్వావసువు, శ్రోత, ఏలాపుత్త్రుఁడు, అంగీరసుఁడు, ప్రమ్లోచి, చర్యుఁడు అను పరివారము.

భాద్రపదమాసమున వివస్వంతుఁడు అని పేరు. ఉగ్రసేనుఁడు, వ్యాఘ్రుఁడు, ఆసారణుఁడు, భృగువు, అనుమ్లోచుఁడు, శంఖపాలుఁడు అను పరివారము.

ఆశ్వయుజమాసమున త్వష్ట అని పేరు. (ఋచీక తనయుఁడు) కంబళాశ్వుఁడు, తిలోత్తమ, బ్రహ్మోపేతుఁడు, శతజిత్తు, ధృతరాష్ట్రుఁడు, ఇషంభరుఁడు అను పరివారము.

కార్తికమాసమున విష్ణువు అని పేరు. అశ్వతరుఁడు, రంభ, సూర్యవర్చసుఁడు, సత్యజిత్తు, విశ్వామిత్త్రుఁడు, మఖాపేతుఁడు అను పరివారము.

మార్గశిరమాసమున అర్యముఁడు అని పేరు. కశ్యపుఁడు, తార్క్ష్యుఁడు, ఋతసేనుఁడు, ఊర్వశి, విద్యుచ్ఛత్రువు, మహాశంఖుఁడు అను పరివారము.

పుష్యమాసమున, భగుఁడు అని పేరు. స్ఫూర్జుఁడు, అరిష్టనేమి, ఊర్ణుఁడు, ఆయువు, కర్కోటకుఁడు, పూర్వజిత్తి అను పరివారము.

మాఘమాసమున పూషుఁడు అని పేరు. ధనంజయుఁడు, వాతుఁడు, సుషేణుఁడు, సురుచి, ఘృతాచి, గౌతముఁడు అనుపరివారము

ఫాల్గుణమాసమున క్రతువు అని పేరు. వర్చసుఁడు, భరద్వాజుఁడు, పర్జన్యుఁడు, సేనజిత్తు, విష్ణుఁడు, ఐరావతుఁడు అను పరివారము.

ద్వారక:-కృష్ణునినగరము. జరాసంధుని నోడించిన పిమ్మట నారదప్రేరితుఁడై కాలయవనుఁడు సేనలతో మధురపైఁబడెను. అతఁడు మిక్కిలి బలాఢ్యుఁడు. అతనితో నొకవైపునఁ బోరు చుండఁగా జరాసంధుఁడుకూడ దండెత్తివచ్చి యింకొకవైపునుండి తనవారి నెక్కుడ సంహరించునోయని శ్రీకృష్ణునకు భయముగలిగి విశ్వకర్మను పిలిచి సముద్రమధ్యమునఁ దనకు నగరమును నిర్మించి యిమ్మనియె.

సముద్రుఁడు చోటిచ్చినచోఁ జక్కని నగరము నిర్మించెదనని విశ్వకర్మ చెప్పెను. శ్రీకృష్ణుఁడు సముద్రునిఁ బ్రార్థించెను. అతఁడు పండ్రెండు యోజనములు వెడల్పుగల స్థలమిచ్చెను. అచ్చట విశ్వకర్మ యీ నగరమును నిర్మించెను. హరి.

దిక్పతులు కొన్ని సంపద లానగరమున కిచ్చిరి. పారిజాతమును, సుధర్మ అను దేవసభయు నింద్రుఁ డిచ్చెను. మనోజవంబుగల గుఱ్ఱములను వరుణుఁ డిచ్చెను. నవనిధులను కుబేరుఁ డిచ్చెను. ఆపట్టణమునకు మధురాపురవాసులనందఱిని బలరాముఁడు తోడ్కొని పోయెను. భాగ.

ద్వి

ద్వితుఁడు:-ఒక బ్రాహ్మణుఁడు. ఏకతుఁడు త్రితుఁడు ఇతనిసోదరులు. వీరు ముగ్గురు నొక రాజుకడ గోవులను దక్షిణగఁ బుచ్చుకొని వచ్చుచుండిరి. త్రితుని వంచించి ఏకతుఁడును ద్వితుఁడును వానిగోవుల నపహరింపఁదలఁచిరి. మార్గమున వీరిఱువురకుఁ దోఁడేలు భయము కలిగెను. దానిని దప్పించుకొనుటకై ద్వితుఁడు వేఱుమార్గమున వచ్చుచు నొక నూతఁబడెను. ఆ నూతియందు జలములేదు. సోమపానము చేసినగాని పాపము పోదని ఇతఁడు సంకల్పమాత్రముననే యజ్ఞ సాధనమునకుఁ బ్రతినిధులను గల్పించుకొని యజ్ఞము చేసెను. దేవతలు యజ్ఞభాగములను బుచ్చుకొని వానిని వరము వేఁడుకొనుమనిరి. ఆ నూతియందు సరస్వతీజలం బుద్గతంబయ్యె. ఉపస్పర్శనము చేసినవాఁడు సోమపానఫలము పొందున ట్లితఁడు

శరము వేఁడెను. ఆతీర్థమునకు చమసోద్భేదనము అని పేరు. భార.

ద్విర్విమోచనుఁడు:- గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

ద్వివిదుఁడు:- ఒక వానరము. సుగ్రీవుని మంత్రియైన మైందుని సోదరుఁడు.

రామరావణ యుద్ధమున రామునిపక్షమునఁ బోరెను. మిక్కిలి బలశాలి. చాలమందిరాక్షసుల సంహరించెను. శ్రీరాముఁడు వాలీప్రస్థానమునకుఁ బోవకపూర్వము ఆతనిని జూచుటకు వెళ్ళెను.

నరకాసురుని మిత్త్రుఁడు. నరకునిఁ గృష్ణుఁడు చంపెనన్న కోపముతో వీఁడు నగరములం పాడుచేయుచుండెను. అందువలన బలరాముఁడు వీనిని దన హలముతోఁగొట్టి చంపెను. భాగ.

ద్వైతవనము:- ఒక యరణ్యము. అచ్చటనే పాండవులు కొంతకాలముండిరి. భార.

ధ

ధనంజయుఁడు:-కద్రువ కుమారుఁడు. భార.

ధనుర్ధరుఁడు:-గాంధారీధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

ధనుసాక్షుఁడు:-ఒకతపస్వి. మేధావియనువాఁడు అతిగర్వముతోఁ బలికిన వాని నితఁడు యమపురమునకుఁ బంపెను. భార.

ధన్య:- ధ్రువుని భార్య. శిష్టుని తల్లి. మత్స్య

ధన్య:- దక్షుని మనుమరాలు. స్వధ కూఁతురు. మేనక, కళావతి ఈమె తోబుట్టువులు. వీరు విష్ణుమూర్తిని జూచుటకు వెళ్ళిరి. వీరు వెళ్ళిన పిమ్మట సనత్కుమారులుకూడ విష్ణుమూర్తిని జూచుటకే వచ్చిరి. వారిని జూచియు ధన్య లేవలేదు. కావున నరస్త్రీవై పుట్టుమని మునివరులు శపించిరి. కరుణింపుఁడని యామె వారినిఁ బ్రార్థింపఁగ "నీవు జనకుని భార్యవగుదువు. సీత నీ కుమార్తెయగును. ఆమెవలన స్వర్గలోకమును బొందగలవు" అని వారుచెప్పిరి. శివ.

ధన్వంతరి:- కలశమునఁ బుట్టఁగ విష్ణువు వచ్చి నీవు అబ్జుఁడను పేరు పొందుమని చెప్పెను. నేను నీ పుత్త్రుఁడనుగద, నాకు యజ్ఞభాగమిప్పింపరాదా! యని యితఁడడుగఁగ "నాభాగముల కిదివఱకే యేర్పాటు గలదు; నీకుఁ గ్రొత్తగా నిచ్చుట పనికూడదు. రెండవ ద్వాపరంబున నీకు ఖ్యాతివచ్చును. దేవత్వము నొందుదువు. చాతుర్మంత్రంబులను నిన్నుద్దేశించి ద్విజులు వేల్తురు" అని విష్ణుమూర్తి చెప్పి చనియెను. ద్వితీయ ద్వాపరములో దీర్ఘతపుఁడు పుత్త్రార్థియై అబ్జునుద్దేశించి తపస్సు చేసెను. ధన్వంతరి ప్రత్యక్షమై తానే సుతుఁడుగఁ బుట్టుదు ననియె. ఇతఁడు పుట్టి భరద్వాజునకు శిష్యుఁడై ఆయుర్వేదము నేర్చుకొనెను. ఇతఁడు కాశీ రాజయ్యెను. ఇతఁడే దివోదాసుఁడు. ఇతని పుత్త్రుఁడు కేతుమంతుఁడు. బ్రహ్మ.

ధర:-ద్రోణుని భార్య. ఈమెయు భర్తతోఁ గలసి విష్ణుమూర్తిని గూర్చి తపస్సుచేసెను. ఆతఁడెంతకును దర్శన మీయకుండుటచే ఈ దంపతు లగ్నిగుండములోఁ బడిరి. ముందుజన్మమున విష్ణుమూర్తి మీకుఁ గుమారుఁడగునని యాకాశవాణి పలికెను. ఈమెయే యశోదగఁ బుట్టెను. బ్ర. వై.

ధరణి:- బ్రహ్మ వామాంగుష్ఠమునఁ బుట్టిన స్త్రీ. ఈమె దక్షునిఁ బరిణయమయ్యెను. వీరికి కీర్తి, లక్ష్మి, ధృతి, అశ్విని, సింహిక, దితి, అదితి మొదలగు నేబదిమంది కూఁతులును, నేవురు పుత్త్రులును బుట్టిరి. భార.

ధరాత్రుఁడు:-శుక్రుని పుత్త్రుఁడు. భార.

ధరుఁడు:- అష్టవసువులలో నొకఁడు. ధూమ్రా ప్రజాపతుల కుమారుఁడు. ఇతని భార్య కల్యాణి. ద్రవిణుఁడు, హుతహవ్యుఁడు, ప్రాణుఁడు, హవ్యవహుఁడు, రమణుఁడు, శిశిరుఁడు ఇతని కుమారులు. మత్స్య. భార.

ధర్మకీర్తి :- ఒక చంద్రవంశపు రాజు. ఇతఁడు దేశము నధర్మముగనే పాలించుచుండెను. ఒకనాఁ డితఁడు వేటకుఁబోయి మృగమును దఱిమి తఱిమి మార్గముతప్పి యొంటరిగానుండి

తన పరివారమును వెదకుచు రేవాతీరమునకు వచ్చి యచ్చట నేకాదశీవ్రతము చేయువారిని జూచి తానును జేసెను. దాన నితనికి బ్రహ్మలోకము వచ్చెను. తరువాతి జన్మములో నితఁడు భద్రశీలుఁడను నామమున గాలవుఁడను వాని పుత్త్రుఁడుగఁ బుట్టెను. నార.

ధర్మగుప్తుఁడు:- సత్యరథుఁడను రాజు కుమారుఁడు. సత్యరథుఁడు యుద్ధములోఁ జనిపోయెను. ఆ విచారమున వాని భార్య యరణ్యములకుఁ బోయెను; అచ్చట ధర్మగుప్తుఁ బ్రసవించెను. ఆమె యొకనాఁడు దాహము తీర్చుకొనుటకై కొలనులో దిగఁగ నామెను మొసలి యీడ్చుకొని పోయెను. తల్లిదండ్రులను బోఁగొట్టుకొని యేడ్చుచుండిన యీ బాలుని బ్రాహ్మణస్త్రీ యొకతె చూచి శాండిల్య మహామునికడకుఁ గొంపోయెను. అచ్చట నామె కుమారునితోఁ గూడ నితఁడును జదువు నేర్చుకొనెను. ఇతఁ డొకనాఁడు విహరించుచుండఁగఁ జిత్రరథుఁ డను గంధర్వరాజకుమారిత యీతని జూచెను. ఒకరి నొకరు ప్రేమించుకొనిరి. ఇతఁ డామెను బెండ్లియాడెను. ఇతఁడు చిత్రరథుఁ డిచ్చిన సేనలసహాయముచేఁ దన తండ్రిని సంహరించిన దుర్మర్షణునిపై దండెత్తి వాని నోడించి రాజ్యమును గెల్చి దానికి రాజయ్యెను. ఈ సౌభాగ్యము సంతయును బ్రదోషకాలమున సూర్యు నారాధించుటచేఁ గలిగెను. బ్రహ్మో. స్కా.

ధర్మధ్వజుఁడు:- హంసధ్వజుని పుత్త్రుఁడు. కృతధ్వజుఁ డితని సోదరుఁడు. ఇతని భార్య మాధవి. ఇతనికిఁ దులసియను కూఁతురు పుట్టెను.
బ్ర. వై.

ధర్మపక్షులు:- పింగాక్షుఁడు, విరాటుఁడు, వృతుఁడు, సుముఖుఁడు అను పక్షులు. ద్రోణుని సుతులు. వీనితల్లి తార్క్షి. తల్లి కురుక్షేత్రమున నాకాశమున విహరించుచుండఁగ నర్జునుని బాణము తగిలి యామె గర్భము భేదింపఁబడెను. గ్రుడ్లు క్రిందఁబడెను. భగదత్తుని యేనుఁగుగంట వీనిపైఁబడి వీని కాచ్ఛాదన మయ్యెను. అండములనుండి పక్షులు వచ్చి గంటలోపల ధ్వని చేయుచుండఁగ శమీకముని వచ్చి యాధ్వని విని వీనిఁదీసి పెంచెను. ఇవి పెరిగి "మునీంద్రా! మేము ప్రబుద్ధులమైతిమి. మే మేమిచేయువార"మని యడిగి యతనికిఁ దమ కథచెప్పి వింధ్యనగరమున కేగెను. అచ్చట వని తపస్సు చేసికొనుచుండెను. వీనికడకు జైమిని యను ముని వచ్చి భారతంబునఁ దనకుఁ గల సందేహంబుల నడిగి తెలిసికొనెను.

ఈ పక్షులు పూర్వజన్మమున సుకృశుఁడను బ్రాహ్మణుని పుత్త్రులు. సుకృశునికడ కింద్రుఁడు పక్షిరూపమున వచ్చి నరమాంస మాహారముగఁ గోరఁగ నతఁడు తనపుత్త్రుల నింద్రున కాహారము కండని యానతిచ్చెను. వారు తిరస్కరించిరి. తిర్యగ్యోనులై పుట్టుఁడని తండ్రి వీరిని శపించెను. అంత వీరు తమతప్పు సైరింపుమని తండ్రిని వేఁడిరి. వీరికి మనుష్యభాషణము వచ్చునట్లును, సకల శాస్త్రవిషయంబు లెఱుకపడునట్లును దండ్రి యనుగ్రహించెను. మార్క.

ధర్మభృతుఁడు:- దండకారణ్యమందున్న యొక ముని. కొలనులోనుండి వచ్చుధ్వనిని విని యదేమని యడుగుటకు రాముఁడితనికడకు వచ్చెను.

ధర్మరథుఁడు:- సగరుని పుత్త్రులలో నొకఁడు. కపిలుని చూడ్కిచే భస్మము కాకుండ నితఁడు మిగిలెను.

ధర్మరాజు:- పాండురాజు యొక్క ప్రథమ పుత్త్రుఁడు. ఇతనిని కుంతి భర్త యనుమతి వడసి ధర్మునివలనఁ గనెను. ఇతఁడు ధర్ముని పుత్త్రుఁ డగుటచే ధర్మస్థిత మతియై యుండు ధృతి గలవాఁ డగుటచే యుధిష్ఠిరుఁడను పేరితనికి నాకాశవాణి యిచ్చెను. పాండురాజు మరణించినపిదపఁ గుంతి సుతులతో హస్తినాపురమునకు వచ్చెను. ధర్మరాజు ధృతరాష్ట్రునే తండ్రిగ భావించుచు వినయవిధేయతలతో మెలఁగుచుండెను. ఇతని గుణముల కితనియందుఁ బ్రజలెల్లరు సంప్రీతులైరి. ఇతనినే యువరాజుగఁ జేసిరి.

దుర్యోధనునకుఁ దనయందును, దన సోదరులందును ద్వేషము కలిగి తమనిని వంచించుటకు యత్నించుచున్నాఁడని ధర్మరాజెఱిఁగియుఁ దమ్ములకది చెప్పియుండలేదు. ధృతరాష్ట్రుఁడు పాండుసుతులను వారణాసికి వెళ్ళుఁడనెను. దానికిఁ గారణ ముండకపోదని ధర్మరాజూహించుకొనెను. విదురుఁడును దుర్యోధనుని దురాలోచన నితని కెఱింగించెను. వారణాసికిఁ బోవు మార్గమందు

గట్టఁబడిన గృహము తైలసమన్వితంబని యెఱింగి యప్రమత్తులై యుండుఁడని యితఁడు తమ్ములకు జెప్పెను. విదురునిచేఁ బంపఁబడిన ఖనకుఁడుచేసిన మార్గమున వా రాగృహము దాటిపోయిరి. తరువాత నది తరింపఁబెట్టఁబడెను. ఆ యరణ్యమునందు హిడింబి భీమునిఁజూచి వలచి యాతనిపొందును గోరుచుండెను భీముఁ డామెను నిరాకరించుట చూచి ధర్మజుఁ డామెపైఁ గరుణ కలవాఁడై యామెకోరిక తీర్పుమని భీమునకుఁ జెప్పెను.

ఆ యరణ్యమునుండి పాండవు లేకచక్రపురమునకేగి బ్రాహ్మణవేషంబున నందొక విప్రగృహంబున నుండిరి. ఒకనాఁడు భిక్షార్థ మఱిగి యింటికి వచ్చి యుద్ధసన్నాహుఁడగు భీమునిఁ జూచి యాయింటివారి కుమారునకు బదులుగ భీమునే, కుంతి బకాసురునకు బలిగఁ బంపుచున్నదని తెలిసికొని ధర్మజుఁడుమిక్కిలి విచారించెను. హిడింబాసురుని బాధ తప్పించుకొని వచ్చినదియును, లాక్షాగృహము దాటి వచ్చినదియును, భీముని సహాయముననే కష్టకాలమందు భీముని నమ్మియుండెను అట్టివాని నిపుడు రాక్షసునకు బలిగఁ బంపిన నికముందు వీరిగతి యేమి కావలయునని విచారించెను. కాని భీముని వెళ్ళవల దనదు. కుంతియు భీముఁడు మహాబలసంపన్నుఁడని యెఱింగించి ధర్మరాజుయొక్క చింత వాపెను భీముఁడును బకాసురుని జంపివచ్చెను.

ద్రుపదునగరమున నాతని కుమారిక స్వయంవరము జరుగుచున్నదని విని దానిం జూడ వేడుకపుట్టి ధర్మజుఁడు తల్లితోడను; దమ్ములతోడను బయలువెడలెను. మార్గమున వీరి నంగారపర్ణుఁడను గంధర్వుఁ డడ్డగించెను. వీని నర్జునుఁ డోడించి ధర్మజునికడ కీడ్చుకొనివచ్చెను. ఇట్లు తేఁబడిన శత్రువుపై జాలిగొని ధర్మరాజు వానిని విడిచి పుచ్చెను. ఆ రాత్రియే యితనికి వ్యాసుఁడు ప్రత్యక్షమైన, వానిం గురుభావమునఁబూజించి వానివలననాశీర్వాదములను బొందెను. ఆ మునియు వీరిని ద్రుపదునగరమున కేగుఁడని చెప్పెను. పాండుసుతులు బ్రాహ్మణవేషముననే పోయి స్వయంవరమహోత్సవము వీక్షించుచుండిరి. సుందరాంగియగు రాకుమారికను జూచినను నితనికి నామెను బడయఁదలంపుపుట్టలేదు. రాకుమారులెల్లరును మత్స్యయంత్రము కొట్ట యత్నించుచుండినను నితని కట్టి కుతూహలమును గలుగలేదు. యంత్రమును గొట్టువేడుక యర్జునునకుఁ గల్గినది. అతఁడు ధర్మజుని యనుమతి నడిగెను. ఇతఁడు తమ్ముని నాశీర్వదించి పంపెను. ఏ రాజపుత్త్రుఁడును గొట్టలేని యంత్రమును నర్జునుఁ డవలీలఁ గొట్టెను. ఆ సంతోషవార్త తెల్పుటకు ధర్మరాజు నకుల సహదేవులతోఁ దల్లికడకుఁ బోయెను. వీరి వెనుక వచ్చి "మేమొక భిక్ష తెచ్చితి" మని పల్కిన భీమార్జునులతో దాని మీరేవు రుపయోగింపుఁడని కుంతి పలికెను. తరువాత వారివెంట వచ్చిన ద్రౌపదినిఁ జూచి కుంతి లజ్జపడి "యేల యిట్టి యధర్మము పల్కితిని? నావచనమెన్నఁడు నన్నృతము కాలేదే!" యని వగచుచుండె. ధర్మజుఁ డామె నూఱడించి ద్రౌపదిని పార్థుఁడే పడసెను. గాన నితఁడే వివాహమగునని చెప్పెను. పెద్దవాఁడు తా నవివాహితుఁడుగ నుండఁగఁ దాను పరిణయము కానని యర్జునుఁడు ధర్మజునే యామెను గైకొమ్మని కోరెను. అయినను బాండవు లేవురు ద్రౌపదీలగ్నమానసులైరి. వేదవ్యాసుని వచనమును, దల్లియానతిని దలఁచి వారేవురును ద్రౌపదిని వివాహమగుటకు నిశ్చయించిరి. వీరి నిశ్చయమునకు ద్రుపదుఁడు విస్మయమొంది యది లోకవిరుద్ధము గావున ధర్మమాలోచింపుఁడని పలికెను. అటకు వేదవ్యాసుఁడు వచ్చెను. ఈ మునీంద్రుఁడు ద్రుపదునకు దివ్యదృష్టి నిచ్చి పాండవేయుల పూర్వజన్మవృత్తాంతము తెల్పి ద్రుపదుచే వారి వివాహంబున నొప్పించెను. ధర్మరాజాదులు ద్రౌపదిని వివాహమయి కొంతకాలమచ్చటనే యుండిరి. ఇంద్రప్రస్థమునకు వచ్చినతరువాత నారదుఁడు చెప్పిన ప్రకారమామె యొక్కొక్కవత్సర మొక్కొక్కనికి భార్యగ నుండుచుండెను. ధర్మజునకు ద్రౌపది గాక స్వయంవరలబ్ధ యగునామె దేవిక యను భార్యయుఁ గలదు. ఈమెయం దాతనికి యౌధేయుఁ డను పుత్త్రుఁడు కలిగెను. ధర్మరాజుభార్య పౌరవతి అనునామె. ఆమెయందు దేవకుఁడు అను పుత్త్రుఁడు కలిగెను. ధర్మజునకు ద్రౌపది యందుఁ బుట్టినవాఁడు ప్రతివింధ్యుఁడు. భాగ.

కొంతకాలము ద్రుపదునగరమున నున్న తరువాత విదురుఁడు వచ్చి పాండవులను గొని వచ్చుటకై ధృతరాష్ట్రుఁడు తనను బంపెనని చెప్పెను. దుర్యోధనుఁడు వెనుక చేసిన యొగ్గులు తెలుపక విదుర కృష్ణు లున్నంతకాలము తమ కెట్టి భయముకలుగదని నమ్మి ధర్మరాజు తమ్ములతోడను, ద్రౌపదీ కుంతులతోడను హస్తినాపురమునకు వచ్చెను. అచ్చటఁ గొంత కాల మున్నతరువాత ధృతరాష్ట్రుఁడు ధర్మజు నభిషిక్తునఁజేసి యర్ధరాజ్యమిచ్చి ఖాండవప్రస్థమున నుండుమని చెప్పెను. విశ్వకర్మ పాండవులకై ఇంద్రప్రస్థము నిర్మించెను. అచ్చట ధర్మరాజు సర్వవర్ణాశ్రమ ధర్మసంరక్షణము చేయుచు రాజ్యము చేయుచుండెను.

ఇట్లుండ నొకనాఁడు నారదుఁడు వచ్చి మయనిర్మితమైనట్టి ధర్మజుని సభను బొగడి రాజనీతివిశేషంబులు గొన్ని చెప్పి హరిశ్చంద్రాదులు యాగము చేసిరి గావున ధర్మజుని నట్లే చేయుమని చెప్పెను. మఱియు నది యవిఘ్నంబుగఁ గొనసాగదేని ప్రజాసంహృతియు నగునని చెప్పెను. యాగముచేయుట కిచ్ఛ గలిగియు మునీంద్రుఁడు చెప్పిన భయమున వెనుదీయుచున్న ధర్మజుని ధౌమ్యాది పురోహితులును, దమ్ములును ప్రోత్సాహము చేసిరి. అతఁడు కృష్ణుని రావించి వాని కా సంగతి యెఱింగించెను. శ్రీకృష్ణుఁడును నది సత్కార్యమని చెప్పి హెచ్చరిక చేసె. దానికై జరాసంధాది దుర్మార్గులను గునిమి దిగ్విజయము చేయుటకై తాను భీమార్జున సహితుఁడై బయలు వెడలెను. నకుల సహదేవులును నరిగి రాజుల నోడించి ధనరాసులు కప్పములుగఁ గొనివచ్చిరి. యాగమునకై ధృతరాష్ట్రాది యాప్తబంధువులను రావించిరి. యాగమున మహాసభయందు శ్రీకృష్ణుఁడే పూజ్యుఁడని ధర్మజుఁ డతని కర్ఘ్యమిచ్చెను. శ్రీకృష్ణుఁడే తగువాఁడని భీష్మాది వృద్ధులును జెప్పిరి. కాని శిశుపాలునకుఁ గోపము వచ్చి వదరిపోవుచుండెను. అతనిని ధర్మరాజు వినయముగ బ్రతిమాలుచుండెను గాని యతని వాక్పారుష్యము హెచ్చగుచుండెను. తుదకు శ్రీకృష్ణుఁడు చక్రమును బంపి వానిని జంపెను. యాగము పూర్తి యయ్యెను. వచ్చిన రాజకుమారులు ధర్మజుచేత సత్కరింపఁబడి కృతార్థులై చనిరి.

దుర్యోధనాదులు మాత్ర మా భవనము చూచుట కాగిరి. అందు జలాశయమును జూచి స్థలముగ దలఁచి నడచి దుర్యోధనుఁడు తన బట్టలు తడిపికొనియెను. భీమాదులును, ద్రౌపదియు నది చూచి నవ్విరి. ధర్మజుఁ డాతనికి వస్త్రములు తెప్పించియిచ్చెను. దుర్యోధనుఁడు ధర్మరాజుచేసిన యాదరమును మరచెను. పాండవులసంపద చూడ నాతని కీర్ష్య జనించెను. ద్రౌపది నవ్వుటచేఁ గ్రోధము కలిగెను. ఎటులైనను వీరిని వంచనచేసి వీరిధన మపహరింపఁగోరి మాయాద్యూతము నాడఁ దండ్రి నంగీకరింపఁ జేసెను. ధృతరాష్ట్రుఁడు ధర్మజుని దీసికొని రమ్మని విదురునంపెను. ఇతఁడు తమ్ములతోడను, ద్రౌపదితోడను హస్తినాపురమునకు వచ్చెను. ఇతనితో నతిప్రియముగ దుర్యోధనుఁడు సంభాషించుచుఁ బ్రొద్దుబోవుటకై జూదము నాడుదము రమ్మని పిలచెను. దుర్యోధనుఁ డాడక తనపక్షమున శకునిచే నాడించుచుండెను. వీరు మాయచేసి యాడుచుండిరి. శకునిచే నోడింపఁబడి ధర్మజుఁడు మఱల మఱల నాసుచుఁ దనను, దమ్ములను, రాజ్యమును, తుదకు ద్రౌపదినిగూడ నొడ్డి యోడెను. దుర్యోధనుఁడు సభలో ద్రౌపది నవమానపఱచెను. ఆమె పుట్టంబుల నొలిపించె. కాని ధర్మరా జేమి చేయగలఁడు? ధృతరాష్ట్రుఁడు తన కుమారులను భంగించి ద్రౌపదికి వరములిచ్చి పాండవులనష్టరాజ్యము వారికిచ్చెను. పాండవు లింద్రప్రస్థమున కేగిరి. కాని యంతలో ధృతరాష్ట్రుఁడు రమ్మనుచున్నాడని ప్రాతికామి వచ్చి చెప్పెను. ధర్మజాదులు మరల వెళ్ళిరి. శకుని నిష్ఠురములాడెను. మరలనతఁడును, ధర్మరాజును జూదము నాడిరి. ఈసారి రాజ్యమును విడచి యరణ్యవాసమును జేయుటే పణముగఁ బెట్టుకొనిరి. మాయాద్యూతమున ధర్మజుఁడు మరల నోడెను.

శపథముచొప్పున ధర్మరాజును, దమ్ములును, ద్రౌపదియు నరణ్యవాసమున కేగిరి. వీరితోఁ బౌరులు పెక్కురు వచ్చిరి. తమకడ ధనము లేకపోవుటచే వచ్చిన యతిథులను బోషిం

లేమగదా యని ధర్మజుఁడు విచారించి మూర్ఛ నొందెను. ధౌమ్యుఁ డితని నోదార్చి సూర్యునిఁ బ్రార్థింపుమనియెను. సూర్యుఁడితనికి నొకస్థాలి నిచ్చెను. దానితో ద్రౌపది వండును. దానితో వండినది యున్నా వారందఱికి సరిపోవును. ఒకనాఁడు పాండవులకడకు విదురుఁడు వచ్చుచుండుట చూచి తమకడ నున్న యాయుధములను లాగికొనుటకై ధృతరాష్ట్రుఁడు పంపుచున్నాఁడేమో యని ధర్మజుఁడు తలఁచెను గాని విదురుఁడును ధృతరాష్ట్రునిచే వెడలనంపఁబడి వచ్చితినని చెప్పెను. కాని వాని పిఱుఁదనే సంజయుఁడు వచ్చి విదురుని ధృతరాష్ట్రుఁడు తోడ్కొని రమ్మనెనని చెప్పెను. వెళ్ళి వృద్ధ రాజున కుపచారము చేయుమని ధర్మరాజు చెప్పి విదురుని బంపెను.

ధర్మజుఁడు బ్రాహ్మణునట్లు మునివృత్తినుండి మునులవలనఁ బుణ్యకథలు వినుచుఁ జింతలేకయే కాలము గడుపుచుండెను. ద్రౌపదీ భీము లెటులైన రాజ్యమును బొందుటే తగవని వాదించిరి; కాని యరణ్యవాసము, నజ్ఞాతవాసము ముగియువఱకు నది తగదని ధర్మరాజు చెప్పెను.

ఒకనాఁ డాహారముతేఁబోయిన భీముని యాజగర మొకటి పట్టుకొనెను. భీముఁడును దానిని వదిలించుకొనిరాలేకపోయెను. వీనికై వెదకుచు వచ్చి ధర్మరాజు పన్నగముతో సంభాషించెను. తన ప్రశ్నలకు సమాధానము చెప్పుచో భీముని విడచెదనని యది పలికెను. బ్రాహ్మణుఁడన నెట్టివాఁడు మొదలైన ఆ నహుషప్రశ్నలకు ధర్మరాజు సమాధానములు చెప్పి భీముని విడిపించుకొనిపోయెను. మఱియొక నాఁడు పాండవులొకవనమునుండి మఱియొక వనమునకుఁబోవుచు దాహమగుటచే నొక చెట్టునీడ నాగిరి. దగ్గఱ నీర ముండుటఁజూచి దానిం దెచ్చుటకై సహదేవుఁ డేగెను. అతఁ డెంతకును రాకపోవుటచే నకులుఁడు వెళ్ళెను. అతఁడును రాకపోవుటచే నర్జునుఁడును, భీముఁడునుగూడ వెళ్ళిరి. వీరును రాకపోవుటచే ధర్మజుఁ డరిగి యొక కొలను గట్టున మూర్ఛితులై పడియుండిన సోదరులను జూచెను. ఎప్పుడును దుఃఖము కలుగని ధర్మరాజున కప్పుడే కడు విచారమయ్యెను. వారట్లు పడియుండుటకుఁ గారణము తెలిసికొనలేకపోయె. జలము త్రాగుటకై యతఁడు కొలనులో దిగెను. అంతట నాకాశవాణి నీవు నా ప్రశ్నల కుత్తరమీయక జలము త్రాగకుమని పలికెను. ఇతఁ డా పలుకలనాదరించి యాయక్షప్రశ్నలకు సమాధానము చెప్పెను. దానికి సంతసించి యాకాశవాణి వర మిచ్చెదను. వేఁడుకొనుమనియె. ధర్మరాజు నకులుని బ్రతికింపుమని కోరెను. తన కత్యంతసహాయము చేయుచున్న కుంతీపుత్రులను బ్రతికింపుమని కోరక నకులునిఁ గోరుటేల? యని యాకాశవాణికే యాశ్చర్యము కలిగెను. ఇతని ధర్మబుద్ధికి మెచ్చుకొని యతని సోదరుల నెల్లరను ఆ యక్షుఁడు బ్రతికించెను.

అరణ్యవాసము చేయుచున్న పాండవులను జూచి వారిని లజ్జపుచ్చఁగోరి దుర్యోధనుఁడు సేనతో వచ్చెను. కాని యతనిని చిత్రసేనుఁడను గంధర్వుని భటు లరణ్యములోనే బంధించిరి. ఈవార్త ధర్మరాజునకుఁ దెలిసి, శత్రువులైనను దమవారిని గాపాడుట ధర్మంబుగాన, దుర్యోధనుని విడిపించుటకై భీమార్జునులను బంపెను. తానపకారముచేయఁబోయి ధర్మజునిచే రక్షింపఁబడినందుకు దుర్యోధనుఁడు సిగ్గుపడెను.

అరణ్యవాసము పండ్రెండేండ్లు ముగిసెను. అజ్ఞాతవాసమునఁ బాండవులు విరటుని గొలుచుట కేర్పఱచు [illegible] ముఁడిచ్చిన వరమున ధర్మరాజు సన్న్యాసివేషము వేసికొనెను. తమయాయుధములను కళేబరమట్లు కట్టి యొక చెట్టుపైఁ బెట్టి యొకరొకరే విరటునగరము ప్రవేశించిరి. ధర్మజునిఁజూచి రాజుగ నుండఁదగినవాఁడు సన్న్యాసి యాయెనా? యని వెఱఁగుపడుచు విరాటుఁడు వానిని రావించి ప్రశ్నించెను. ధర్మజుఁడు తన పేరు కంకుఁడని చెప్పికొనెను. విరటుని కొలువులోఁ జేరెను. అతనికి బురాణములను జదివి వినిపించుచు, ద్యూతము నాడుచు గాలముగడుపుచుండెను. వీలైనపుడు తనవారిని గలసికొనుచుండెను. కీచకుఁడు ద్రౌపదిని నవమానింపఁబోయినపు డామె విరటుసభ ప్రవేశించి వికలచిత్తయై తన భర్తలేవురున్నను దనకు దిక్కులేకపోయెనని విలపించెను. భీముఁ డపుడే కీచకుని సంహరింప యత్నించెను గాని ధర్మజుఁడు తమ గుట్టు బైటఁబడునని యతని నివారించి ద్రౌపదిని గూడ రాజసభ విడచి పొమ్మనెను.

గోగ్రహణమునకై దుర్యోధనాదులు విరటు నగరమునకు వచ్చిరి. విరటుని పుత్రునితో నర్జునుఁడును యుద్ధమునకు వెళ్ళెను. తన కుమారుఁడు జయించివచ్చెనని విరటుఁడుసంతోషించుచుండెను. పాండవుల యజ్ఞాతవాసము ముగిసెను గానఁ దమనిఁ దెల్పుకొనఁ బ్రారంభించి యీ జయము బృహన్నలవలనఁగలిగెనని ధర్మజుఁ డాతనినిఁ బొగడ మొదలిడెను. విరటునకు గోపమువచ్చి పాచికతో ధర్మజునిఁ గొట్టెను. బొటబొటరక్తముకారఁజొచ్చెను. అచ్చటనున్న ద్రౌపది తన చీరకొంగులో పట్టెను. విరటుఁడు తనకుమారుని, సారథిని గొలువునకురాఁబనిచెను. కాని ధర్మజుఁడు దౌవారికునితో సారథిని రావించుటకు జాగుచేయుమనియెను. తనకుఁ దగిలిన దెబ్బనుజూచి యర్జునుం డాగ్రహమొంది విరటు నేమిచేయునోయని భయపడియెను. అర్జునుఁడు వచ్చినపుడు, నితఁడుతలయెత్తిమాటాడలేదు. పదపడిసోదరులేవురునుగలిసికొని ముచ్చటించుకొనునప్పుడును నితఁడుతనముఖమును గప్పికొనియుండెను. 'వచ్చినవన్నా ముఖమెత్తియేలపల్కరింప' వని యర్జునుఁ డడుగ ధర్మజుఁడు జరిగినది చెప్పెను. భీమునకును, నర్జునునకును గోపమువచ్చి విరటునిఁ దెగటార్తుమనిరి. విరటుఁడు తమ్మెఱుగక చేసినదానిని మన్నింపుఁడని ధర్మజునిగూర్చి పలికెను. అర్జునుఁడు ఇంతలోవచ్చెను. పాండవులెల్లరు స్నానముచేసి ధౌతవస్త్రములు ధరించిరి. ధర్మజుఁడువిరాటుని సింహాసనమునగూర్చుండెను విరాటుఁడు విస్మయమంది యిదేమి కంకుభట్టా! సింహాసనమునఁ గూర్చుండెద వని యడిగెను. అప్పుడే యర్జునుఁ డతఁడు ధర్మరాజని తెలియఁజేసెను. విరటుఁ డపరిమితానందము నొంది పాండవులనెల్లర గౌరవించెను. తన కూఁతురగు నుత్తరను అభిమన్యున కిచ్చి వివాహము చేసెను. అపుడే శ్రీకృష్ణుఁడు, బలరాముఁడు, సాత్యకి ద్రుపదుఁడు మొదలగువారు వచ్చి యిఁకఁ బాండవులు చేయవలసిన కార్యములుగూర్చి తర్కించిరి. దుర్యోధనునితో సంధి చేసికొనుటకై ద్రుపదుని పురోహితుని దూతగఁ బంపిరి.

ఉపప్లావ్యమున నున్న పాండవులను జూచుటకు శల్యుఁడు వచ్చుచుండుట విని దుర్యోధనుఁడు మార్గమందు వానికి సదుపాయము గావించి పిమ్మటఁ దాను వానినిఁ జూచెను. శల్యుండుసంప్రీతుండై, దుర్యోధనుఁడుకోరఁగా జరుగఁబోవు యుద్ధమునం దాతనికి సహాయము చేయుట కంగీకరించెను. అటనుండి శల్యుండు పాండవులకడకు వచ్చి వారిక్షేమము నారసి దుర్యోధనునకుఁ దానిచ్చిన వచనమును జెప్పెను. ధర్మజుఁడు వికలుఁడుగాక యిట్లనియె. "మేలు చేసినవారిని మెచ్చుకొని వారికోరిక తీర్చుట యుచితము. మీరట్లే చేయుఁడు. కాని నే నొక్కటియడిగెదను. అర్జునునకు శ్రీకృష్ణుఁడు సారథియగును. అర్జునునితోఁ గర్ణుఁడు యుద్ధము చేయునపుడు వీనికి రథము నడుపువాఁడు నీవు తప్ప నన్యునకుఁగాదు. ఆ సమయమునఁ గర్ణునిఁ బరుషములాడి మనస్సునకుఁగలంకఁబుట్టింపుము" అని కోరెను. దానిని శల్యుఁ డియ్యకొనెను.

ధృతరాష్ట్రునికడనుండి సంజయుఁడు వచ్చెను. వీరిక్షేమ మడిగెను. సంధి చేసికొనుటయే మంచిదని ధృతరాష్ట్రుఁ డనినట్లు చెప్పెను. కాని యేవిధమున నదియగునో చెప్పఁడు. ధర్మరాజు సంధినిగోరియే శ్రీకృష్ణుని రాయబారిగఁబంపెను. కాని దుర్యోధనుఁడు సంధి కొంతమాత్రము నంగీకరింపఁడు. యుద్ధము తప్పదయ్యెను. పాండవులు యుద్ధసన్నాహములు చేసిరి. ఇరుపక్షముల వారిసేనలు కురుక్షేత్రమునఁ జేరెను. ధర్మజుఁడు రథముదిగ్గి యనుజులును, శత్రులును నివ్వెఱపడఁ బాదచారియై భీష్మద్రోణాదుల కడకుఁ బోయి వారికి నమస్కరించి యాశీర్వచనములు పొంది వచ్చెను. భీష్ముని యుద్ధముచూడ నితనికిఁ దాము గెలుచుదుమను ధైర్యము లేకపోయెను. కృష్ణార్జును లితనికి ధైర్యము చెప్పుచుండెడివారు. ఏమైనను భీష్మునిగెల్చుట యసాధ్యమని యాతఁ డెఱుంగును. కావుననే యొకనిశయందు భీష్మునికడకుఁబోయి నిన్ను గెల్చునుపాయము చెప్పుమని యడిగెను. అతఁడు చెప్పినమీఁదనే శిఖండిని భీష్మునితో యుద్ధమునకుఁ బంపి యర్జునునిచే బాణమును వేయించెను. భీష్ముఁడు శరతల్పగతుఁడైయుండ నితఁ డతనికడ కేగి వానికి సేవచేయుచు నతనివలన నీతులు నేర్చుకొనెను.

రణరంగమునం దితఁడును జేరి పోరుచుండినను నితఁడు భీమార్జును అంత యొక్కువగ

యుద్ధము చేయుటలేదు. మఱియు ధర్మజుని సంరక్షణకొఱకై కొందఱు యోధులు పాండవ శిబిరముననే యుండుచుండువారు.

అర్జునుఁడు వేఱొకచోఁ బోరుచుండినపుడు కౌరవులు పద్మవ్యూహమేర్పఱచిరి. ఆ వ్యూహము భేదింప నెఱిఁగినవాఁడచట నభిమన్యుఁడు తక్క నెవ్వరును లేకుండిరి. అతనికైనను వ్యూహము ప్రవేశించిన పిదప బైటకువచ్చు నేర్పులేదు. నీవు ప్రవేశించినపిమ్మట నీ వెంబడి వచ్చువారమని ధర్మజుఁడు ధైర్యముచెప్పి యభిమన్యునిఁ బంపెను. తరువాతఁ దాను వ్యూహము ప్రవేశింపఁ బోయెనుగాని సైంధవుఁ డడ్డుపడియె; దాన నభిమన్యునిఁ జేరలేక పోయెను. అభిమన్యుఁడు వధింపఁబడెను. అర్జునుని పుత్త్రుఁడట్లు మరణించినందుకు ధర్మజునకుఁ గల్గిన విచారమునకు మేరలేదు.

దుర్యోధనుఁడు ద్రోణునిఁ బరుషము లాడుటచే నతఁ డతిక్రోధంబుగ యుద్ధము చేయుచుండెను. అతని నుపాయంబునఁ గాక యుద్ధమున గెల్చుట కష్టమని శ్రీకృష్ణుఁడు కూడ గ్రహించెను. అశ్వత్థామ చంపఁబడెనని పల్కుమని ధర్మజుని శ్రీకృష్ణుఁడు కోరెను. పుత్త్రశోకముచే ద్రోణుఁ డస్త్రసన్న్యాసము చేయునని వారెఱుఁగుదురు. ద్రోణునిపుత్త్రుఁడు సజీవుఁడై యుండఁగ నిట్లు పల్కుటకు ధర్మజుఁడు సంకోచించెను. కాని అశ్వత్థామ అను యేనుఁగు చంపఁబడుటచే నా మాట చెప్పుమని శ్రీకృష్ణుఁడు కోరెను. ధర్మరాజు "అశ్వత్థామ హతః కుంజరః" అనియె. ద్రోణునకుఁ గుంజరపదము వినఁబడలేదు. ధర్మజుఁడు నిజము చెప్పెనను కొని ద్రోణుఁ డస్త్రసన్న్యాసము చేసెను.

ద్రోణుఁడు మరణించినపిమ్మటఁ గర్ణుఁడు కౌరవులకు సర్వసేనాధిపతి యయ్యె. అతనికి శల్యుఁడు సారథి. ధర్మరాజు యుద్ధంబు సేయుచు నోడి తుదకుఁ బ్రాణంబుతో శిబిరంబు చేరెను. ఈ వార్త యర్జునుఁడు విని ధర్మజునిఁ జూడవచ్చెను. అర్జునుఁడు కర్ణు నోడించి వచ్చెననుకొని ధర్మరాజు వానిని స్తుతించెను. కాని కర్ణుఁడు జీవించి యున్నాఁడని యర్జునుఁడు చెప్పఁగ నట్టిచో రణరంగమునుండి మరలివత్తురా? యని ధర్మరాజు అర్జునుని దూషించెను. దాన నర్జునునకుఁ గోపమువచ్చి యాతనిపైఁ గత్తి యెత్తెను. కాని శ్రీకృష్ణుఁడు వానిని శాంతచిత్తునిగఁ జేసెను.

కర్ణుని పిదప శల్యుఁడు సేనాధిపతి యయ్యె. వీనితో విశేషముగ ధర్మరాజే పోరాడెను. వీరు ద్వంద్వయుద్ధములు చేసిరి. తుదకు శల్యుఁడే మరణించెను. పదపడి, హ్రదములో దాఁగిన దుర్యోధనుని నాక్షేపణచేసి వానిని యుద్ధమునకుఁ బిలచిరి. అతఁడును గదాయుద్ధములో మరణించెను. పాండవులకే జయము సమకూరెను; కాని సంతోషము లేకపోయెను. ఈ యుద్ధమున బంధువులెల్లరు మరణించిరి

పదపడి ధర్మరాజు ధృతరాష్ట్రుని యొద్ద కేగెను. అతఁడు దీవించెను గాని గాంధారి పుత్త్రశోకముతో ధర్మజుని శపింపఁబోయెను. అప్పుడే వ్యాసుఁడే తెంచి యితఁడు ధర్మపరుఁడు; ఈతని శపింపకుమని చెప్పెను. అచ్చటనుండి ధర్మజుఁడును, దమ్ములును గుంతికడ కేగిరి. ఆమె పుత్త్రులనుజూచి మిక్కిలి యానందించెను. బంధువులకుఁ బితృకార్యములు చేయునపుడు కర్ణునకును జేయుమనియు, నతఁడు తనకుమారుఁడనియు నప్పుడే కుంతి చెప్పెను. ఆసంగతి యీవఱకే కుంతి చెప్పక యుండుటకు మిక్కిలి విచారించి ధర్మజుఁడు స్త్రీలు రహస్యము దాచియుంచలేకుందురు గాక యని శపించెను.

ధర్మరాజు యుద్ధమున గెలిచినను బంధువులందఱును మరణించుటచేతను, వారిని జంపుటచేతనురాజ్యము చేయనొల్లనని యరణ్యములో నే యుండెదననియెను. వానికి సోదరులును, ద్రౌపదియును, మునులును శ్రీకృష్ణుఁడును కూడ శాంత వచనములచే బోధించి కలంకఁ దేర్చి నగరమునకుఁ దీసికొనివచ్చిరి. శ్రీకృష్ణుఁడు ఇతనికి ధర్మములు బోధించుటకు భీష్ముని నియోగించెను. ధర్మరాజు వానివలన సకల ధర్మములను తెలిసికొనెను.

ధృతరాష్ట్రుఁడును నగరము విడిచి వనములకుఁ జనియె. ధర్మరాజే రాజై యశ్వమేధము చేసెను. కాని యితఁడు చిరకాలము పాలింపలేదు. శ్రీకృష్ణుఁడు అవతారము చాలించెనని వినఁగనే, అభిమన్యునికుమారుఁడగు పరీక్షిత్తు

నకుఁజుట్టముకట్టి తామును, తమ్ములును, ద్రౌపదియు నుత్తరాభిముఖులై చనిరి. వీరివెంట నొక కుక్కయు నడచుచుండెను. వీరిలో మొదట ద్రౌపదియుఁ దరువాత సహదేవుఁడు, పిమ్మట నకులుఁడు ఇట్లు వరుసగఁ బడిపోయిరి. ధర్మజునితోఁ నొక కుక్కమాత్రము నడచుచుండెను. అతని కింద్రుఁ డెదురువచ్చి రథముపైనెక్కి తనతో రమ్మనెను. ధర్మరాజు తనతోవచ్చిన కుక్కను విడిచి రాననియు, ఇట్లు విడుచుట పాపమనియుఁ జెప్పెను. వీని భావమునకు మెచ్చుకొని యా కుక్కరూపమునున్న ధర్ముఁడు నిజరూపము దాల్చెను. ధర్మరాజును నింద్ర లోకమునకుఁ గొనిపోయిరి. అచ్చట నతఁడు దుర్యోధనుని జూచెను. కాని కర్ణ భీమార్జునాదులు కనఁబడకపోవుటచే వారిని జూడఁ గోరెను. వారిని జూపించుట కింద్రుఁడు దూతనితో నరకమునకు బంపెను. అతఁడు ధర్మజుని నరకమునకుఁ దీసికొనివచ్చెను. రాజనువాఁడు పుణ్య పాపములను రెంటిని చేయుచుండును. గాన వానికి స్వర్గనరకములు రెండును కలుగునని మునులు చెప్పిరి. అచ్చటనే కర్ణాదు లగుపడిరి. దుర్యోధనుఁడు స్వర్గమున సుఖించుటయు, వీరు నరకమున దుఃఖము ననుభవించుటయు నాతనికి విచారమయ్యెను. మొదటఁ గష్టపడినవారు పిదప చిరకాలము సుఖింతురని వారు చెప్పి యూరడించి చింత వాపిరి. ధర్ముఁడు ధర్మరాజును నాకాశగంగలో స్నానము చేయుమనెను. దాన నతఁడు దేవత్వము నొందెను. వీని నింద్ర లోకమునకుఁ గొంపోయిరి. అచ్చటఁ గర్ణ భీమార్జునాదులను, దన బంధువులను జూచెను.

భార.

ధర్మవ్యాధుఁడు:- మిథిలానగరమందలి యొక బోయవాఁడు. కులవృత్తి ననుసరించు మాంస విక్రయముచేయుచు సద్వర్తనుఁడై యుండెను. ఇతనికిఁ బెక్కు ధర్మములు తెలిసియుండెను. కౌశికుఁడను బ్రాహ్మణుఁ డితనికడకు వచ్చి ధర్మముల నేర్చుకొనెను. ఇతనివలన శీలలక్షణాలు లను సహింపాలక్షణంబుల నెఱిఁగెను. (చూడుము కౌశికుఁడు)

ఇతనికి అర్జునుఁడు అను పుత్రుఁడును, అర్జునకియను కుమార్తెయునుఁగలరు. కుమార్తెను మతంగముని కుమారుఁడైన ప్రసన్నునకిచ్చి వివాహముచేసెను. కుమార్తె కతఁడు నీతులన్నియును బోధించి యత్తవారింటికి బంపెను. ఒక నాఁ డర్జునకిని యత్తగారు నీవు మృగములను జంపి తినువాని కుమార్తెవు అని నిందించెను. ఆమెకుఁ గోపమువచ్చి తండ్రియింటికి వచ్చి చెప్పెను. ధర్మవ్యాధుఁడు కుమార్తెను వెంటఁ బెట్టుకొని యత్తవారింటికిఁ దీసికొని వెళ్ళి యామె నప్పగించెను. నేను మీయింట భోజనము చేయుదును. ఏమి పెట్టుదురని యత్తగారి నడిగెను. గోధుమలు, కందులు, ధాన్యములు వండిపెట్టుదుమని యామె యనెను. వానినిఁ జూడనిండని ధర్మవ్యాధుఁడు కోరగ మతంగుని భార్య చేటలో వానిని దీసికొనివచ్చెను. అవిచూచి ఛీఛీ మీయింట భోజనము చేయను. అన్యాయము ఇన్నివేల జీవరాసులను జంపెదరా? నేను వారమున కొక్క మృగమును మాత్రము చంపి తిందును. మీయింటఁ గుడువరాదని వ్యాధుఁడు వెళ్ళిపోవుచుండఁగ మతంగుఁడు బ్రతిమాలికొనెను. అప్పుడు తన కూఁతుని నిందించుట దోషమని వారికిఁ దెలియునట్లుగఁ జెప్పెను.

ధర్మవ్యాధుఁడు పూర్వజన్మమున నొక బ్రాహ్మణుఁడు; ధనుర్విద్య నేర్చుకొని రాజ కుమారులతోఁ జెలిమిచేసి వేటకుఁ బోవుచుం డెడివాఁడు. ఒకసారి వేటకుఁ బోయినపుడు మృగమని భ్రమపడి యొక మునిని గొట్టెను. ఆ ముని యితనిని జూచి నీవు బ్రాహ్మణుఁడ వయ్యును శూద్రునట్లు వర్తించితివి గావున మాంసము నమ్మువాఁడవై పుట్టుమని శపించెను. అతఁడే బోయవాఁడై పుట్టెను. ఇతఁడు కాశ్మీర రాజైన వసువు దేహమునుండి పుట్టెను.) (చూడు వసువు) వరా.భార.

ధర్మవ్రత:- ధర్ముని కూఁతురు; మరీచిభార్య. భర్త శయనించి యుండఁగ ధర్మవ్రత పాదము లొత్తుచుండెను. బ్రహ్మ వారియింటికి వచ్చెను; అప్పటికి మరీచి నిదురపోవు చుండెను. బ్రహ్మకు స్వాగత మిచ్చుటకు నిదురపోవు భర్తను లేపుట కామె శంకించెను. తాను పతిసేవ విడిచి వెళ్ళిన దోషమగు ననియును, మామగారగు బ్రహ్మకు నాతిథ్య మీయకుండుట పాపమగుననియు నేమి చేయుటకు నిశ్చయింపలేక యాలోచించి తుదకు

బ్రహ్మ గర్భించుటకే నిశ్చయించి పతిసేవమాని వెళ్ళి మామగారిపదములు పట్టుచుండెను. ఇంతలో మరీచి మేల్కాంచి, భార్య బ్రహ్మ పాదములు పట్టుటమాని నీవు పతిసేవమాని యన్యపురుషుని పదము లొత్తుచుంటివి కావున శిలవై యుండు మని శపించెను. అన్యాయముగ శపించినందు కామెకు మిక్కిలి గోపమువచ్చి శివునిచే దగ్ధుడవు కమ్మని భర్తకుం బ్రతిశాప మిచ్చెను.

భార్యా భర్త లిరువురును శాపవిమోచనమునకై తపస్సుం జేయం బ్రారంభించిరి. ధర్మవ్రత యగ్ని మధ్యమను నుండి తపస్సు చేయుచుండెను. దేవతలామె తపమును మాన్పుమని బ్రహ్మను బ్రార్థించిరి. బ్రహ్మ యామెకుం బ్రత్యక్షమై తపస్సు చాలించుమని కోరి యామె కాంబోవు శిలను స్పృశించినను, అచ్చట నశ్వమేధాది యాగములం జేసినను, పిండ ప్రదానములుచేసినను, చేసినవారికిని, వారి పితరులకును బుణ్యలోకము వచ్చునట్లు ఆమెకు వర మిచ్చెను. ఆమెయే దేవరూపిణియను శిలయయ్యె. ఆ శిలనే గయాసురుని శిరమునందు బ్రహ్మ యుంచెను. వాయు.

ధర్మ్మవ్రతుండు:-దండకారణ్యమునుండిన యొక ఋషి. రామునకుం బంచాప్సరసముయొక్క కథ చెప్పెను. రామా.

ధర్మసావర్ణి:- దక్షసావర్ణి కుమారుండు. ఇతని కుమారుండు విష్ణుసావర్ణి. బ్ర. వై.

ధర్ముండు:- ఒక మనువు; బ్రహ్మ దక్షిణస్తనము వలనం బుట్టెను. ఇతండు ధరణికుమార్తెలగు కీర్తి, లక్ష్మి, ధృతి, మేధ, లజ్జ మొదలగువారిని పెండ్లియాడెను. శముండు, కాముండు, హరుండు ఇతని పుత్త్రులు. భార.

ధవళాంగుండు:- ఒక ముని. రాక్షసమాయలకుం బ్రతీకారము చేయు విద్య నితండు కైకేయికి నేర్పెను. రామా.

ధా

ధాత:-విధాత సోదరుండు. ఇతండు మేరుపుత్త్రికయైన ఆయతిని వివాహమయ్యెను. ప్రాణుండితని కుమారుండు. బ్రహ్మ.

ధాతకి:- పుష్కరద్వీపమునకు రాజైన సవనుని పుత్త్రుండు. ఇతనిని బట్టియే పుష్కరద్వీపమునకు ధాతకీఖండ మను పేరు వచ్చినది. బ్రహ్మ.

ధాత్రేయిక:- కామ్యకవనములో ద్రౌపది యున్నపు డామె పరిచారిక. సైంధవుండు ద్రౌపదిని నిర్బంధము చేయుచుండుట యీమెయే భీమార్జునులకుం దెల్పెను. భార.

ధాన్యమాలి:- ఒక దివ్యాంగన. ఈమె కీశ్వరుండొక వాహన మిచ్చెను. అది యెక్కి యీమె సర్వలోకములు సంచరించుచుండును. ఈమె రూపము చూచి శాండిల్యుండను ముని మోహించి యీమెను గవయం గోరెను. అపు డీమె రజస్వలయై యుండెను. కాన స్నానమైన పిదప వచ్చెద ననియె. స్నానమైన పిదప రావణుం డీమెను జూచి మోహించియీమెతో రమించెను. ఈమెకుసద్యోగర్భమున అతికాయుండు జన్మించెను. పిమ్మట నీమె శాండిల్యునికడ కరిగి రావణుండు బలవంతమున రమించెనని చెప్పికొనియె. అతనికిం గోపము వచ్చి నీవు మకరమవై యుండుమని శపించెను. ఆమె శాపవిమోచనమునకై ప్రార్థించెను. రామకార్యమున హనుమంతుండువచ్చి నిన్నుం దన్నినపుడు నీరూపము నీకు వచ్చునని మునిపలికెను. సంజీవికొఱకు వచ్చిన హనుమంతుని నీ మకరము పట్టుకొనియెను. అతండు దీనిం దన్ని కొట్టెను. అపుడు శాపవిమోచనము పొంది యీమె నిజరూపమునుదాల్చి చనియె. రామా.

ధాన్యమాలిని:- ఒక రాక్షసాంగన. అశోకవనములో సీతకుం గావలిం బెట్టంబడినవారిలో నీమె యొకతె. రావణుండువచ్చి పలుకీడులం దనను వరింపుమని సీతతోం బలుకుచుండెను. ఇష్టములేని దాని నేల కోరెదవు? దానితోం గ్రీడింపు మని యీమె పలికెను. రామా.

ధి

ధిషణ:-హవిర్ధానుని భార్య. మత్స్య.

ధీ

ధీమంతుఁడు:- పురూరవునకును, మార్వశికిని బుట్టిన కుమారుఁడు. భార.

ధు

ధుంధుమారుఁడు:- బృహదశ్వుని కుమారుఁడు. ఇతని పేరు కువలాశ్వుఁడు; ధుంధువను రాక్షసుని జంపుటచే నీ పేరు వచ్చెను. ధుంధువు ఉత్తంకుని యాశ్రమ సమీపమున నుండి వాని తపమునకు భంగము కలుగఁజేయుచుండుటచే నతఁడు బృహదశ్వుని కడకు వచ్చి వానిని వధింపుమని కోరెను. బృహదశ్వుఁడు రాజ్యము కుమారులకిచ్చి తపోవనమునకుఁ బో నుద్యుక్తుఁడై యుండెను. కావ నీతఁ డరములు మట్టకయుండగోరి రాక్షస హననమునకుఁ దనకుమారుని నియోగించెను ధుంధుమారుఁడు ఉత్తంకుని సహాయము నుగైకొని దనుజుని సంహరించుట కేగెను.

ఇతని కుమారులు పొగలు వచ్చుచుండిన బిలమును ద్రవ్విరి. ఆ దనుజుఁడు కదలి యావులింపఁగనే ముగ్గురు తప్ప మిగిలినవారలు ఆవులింత వలన వచ్చిన మంటలలోఁ జచ్చిరి. ఆ ముగ్గురును దృఢాశ్వుఁడు, కపిలాశ్వుఁడు, భద్రాశ్వుఁడు అనువారలు. భాగ.

చివరకు బ్రహ్మాస్త్రము వేసి వానినిఁ జంపెను. ఇంద్రాది దేవతలు ప్రత్యక్షమై వరములు వేడుకొనుమనిరి. విష్ణువుతోడి సఖ్యమును, అనవరత దానశీలతయును, బ్రాహ్మణభక్తియును దప్ప నితరములు నాకక్కఱలేదనెను. దేవతలిచ్చి వానిపుత్త్రులను బ్రతికించిరి. భాగ.

ధుంధుమారుఁడు:-ఒక హైహయ రాజు. ఇతఁడు వేటకుబోయి మృగమను శంకచే నొక మునికుమారునిఁ జంపెను. దగ్గఱకు వెళ్ళి తాను జంపినది మునిపుత్త్రుఁడగుట గ్రహించి మిక్కిలి చింతనొందెను. ఇంటికి వెళ్ళి తనవారితో జరిగిన వృత్తాంతం తెలిగించెను. వారు తార్క్ష్యుఁడను ముని యాశ్రమమునకు వానిని దీసికొనివెళ్ళి యితఁడు చేసిన దోషము ముని కెఱింగించి దానికిఁ బ్రతీకారము చెప్పుమని కోరిరి. తార్క్ష్యుఁడు తన యాశ్రమమందు మృతి యను నది యుండబోదని తన కుమారునిఁ బిలచెను. అతఁడు వచ్చెను. ధుంధుమారుఁడా బాలుని జూచి ఇతఁడే నాచేతఁ జంపఁబడినవాఁడు; మరల నెట్లు బ్రతుకఁగలిగెనని ముని నడిగెను. సచ్ఛీలత్వమే కారణమని ముని చెప్పెను.

ధుంధువు:-ఒక దనుజుఁడు; మధువు కుమారుఁడు. ఇతఁడు తపస్సు చేసి బ్రహ్మవలన వరములను బొందెను. ఇతఁడు ఉత్తంకుఁడను ముని యాశ్రమ సమీపంబున నొక వివరమును గావించుకొని యందు నిద్రించుచుండును. వీని వదనశ్వాసము అగ్నితోడను, బొగతోడను గూడి నభోంతరమును రజముచేఁ దూటుకొనఁ జేయుచుండును. వానికి సమీపమునందున్న కానసులు, పర్వతములు వణఁకుచుండును; ఆచ్చట వాసయోగ్యము కాకుండెను. ఉదంకుఁడు బృహదశ్వుఁడను రాజుకడకు వచ్చి వీనిని సంహరింపుమని కోరెను. అతని కుమారుఁడు కువలాశ్వుఁడు వీనిని సంహరించెను.

ధుర్యచిత్తుఁడు:-యయాతివంశమువాఁడు. ఇతనికి మరుత్తు అను పేరుకలదు. ఇతఁడు దుష్యంతుని బెంచుకొనెను.

ధూ

ధూతపాప:-ఒక నది. పంచనదములలోనునొకటి. వేదశిరుఁడను ముని తపస్సు చేసికొనుచుండఁగ నొక యప్సరస యాతని కంటఁబడెను. అతనికి రేతఃపతన మయ్యెను. అందుండియే పుత్త్రిక యేర్పడెను. వేదశిరుఁడామెకు 'ధూతపాప' యను పేరుపెట్టెను. ఈ కన్యక తండ్రియనుజ్ఞ వడసి తపస్సు చేసెను. బ్రహ్మ ప్రత్యక్షమై వరమును వేడుకొనుమనెను. సర్వపదార్థముల

కల్పించెను నన్నుఁ బవిత్రమైనదానినిగఁ జేయుమని ధూతపాప కోరెను. సర్వతీర్థములలోను నీవు పావని వగుదువని బ్రహ్మ యనుగ్రహించెను. పిమ్మట నీమెను ధర్ముఁడు చూచి కామించి తనకోరిక నెఱింగించెను. ఆమె నేను స్వతంత్రను కాదనియు, నాతండ్రిని వేఁడుమనియు ధూతపాపధర్మునితోఁజెప్పెను. ధర్ముఁడు దాని కంగీకరింపక తనను గాంధర్వమునఁ గలియుమని బలవంతము చేసెను. అపుడామె ధర్ముని నదివి కమ్మని శపించెను. నీవు శిలవు కమ్మని ధర్ముఁ డీమెకుఁ బ్రతిశాప మిచ్చెను. ధూతపాప యీ వృత్తాంతము తండ్రి కెఱింగించెను. అతఁడు ధర్మునిశాపము తప్పదని చెప్పి "నీవు చంద్రకాంతశిల వగుదువు చంద్రోదయమైన పిదప నదమగుదువు. అపుడు ధర్ముఁడు నీకు భర్తయగు" ననియుఁ జెప్పెను. కాశీ.

ధూమ్ర:-మార్కండేయుని భార్య. ఈమె కుమారుఁడు వేదశిరుఁడు. బ్రహ్మ. మార్క.

ధూమ్ర:- దేవునికుమారుఁడైన ప్రజాపతి భార్య. ఈమె కుమారుఁడు ధరుఁడు. భార.

ధూమ్రకేతువు:- భరతుని పుత్త్రులలో నొకఁడు.

ధూమ్రకేతువు:- తృణబిందుని కుమారుఁడు.

ధూమ్రకేశుఁడు:-పృథునికుమారులలో నొకడు.

ధూమ్రలోచనుఁడు:-శుంభ నిశుంభుల సేనాపతి. కాళికను బలాత్కారముననైనను దీసికొనరమ్మని వీనిని శుంభుఁడు పంపెను. కాళికకడకు వీఁడేగఁగ నామె వీనిని వధించెను. మార్క.

ధూమ్రాక్షుఁడు:- సుమాలి పుత్త్రుఁడు. ప్రహస్తుఁడు తెగినపిమ్మట నితఁడు హనుమంతునితో యుద్ధముచేసి రణమున మడిసెను. రామా.

ధూమ్రాక్షుఁడు:-తృణబిందుని వంశమువాఁడైన హేమచంద్రుని తనయుఁడు. ఇతని పుత్త్రుఁడు సహదేవుఁడు. భాగ.

ధూమ్రావతి:- (చూడు ధూమ్ర)

ధూమ్రాశ్వుఁడు:- సుదేవుని మిత్త్రుఁడైన నలుఁడను వాని తండ్రి. మార్క.

ధూమ్రాశ్వుఁడు:- హేమచంద్రుని పుత్త్రుఁడైన సుచంద్రుని తనయుఁడు. ఇతని కుమారుఁడు సృంజయుఁడు. రామా.

ధృ

ధృతకేతువు:- రోహితుని కుమారుఁడు.

ధృతకేతువు:- సన్నతివంశమువాఁడైన సుకుమారుని పుత్త్రుఁడు.

ధృతదేవి:- దేవకుని కూఁతురు; వసుదేవుని భార్య.

ధృతరాష్ట్రుఁడు:- సర్పము. క్రమువ కుమారుఁడు. అర్జునుని బ్రతికించుటకై బభ్రువాహనుఁడు మృతసంజీవనిని దెచ్చుటకు నాగలోకమునకు వచ్చెను. సర్పము లిచ్చినవి గావు; బభ్రువాహనుఁ డితనితో యుద్ధముచేసి వీని నోడించెను. అపుడితఁ డిచ్చెను. జై. భా.

ధృతరాష్ట్రుఁడు:- విచిత్రవీర్యుని కుమారుఁడు. ఇతఁడు పూర్వభవంబున అరిష్టాపుత్త్రుఁడైన హంసుఁడను గంధర్వరాజు. విచిత్రవీర్యుఁడు సంతానము పడయకయె మరణించెను. అతని వంశము నిర్మూలము కాకుండుటకై యతని తల్లి సత్యవతి వ్యాసునివలనఁ బుత్త్రుం బడయుమని విచిత్రవీర్యుని భార్య యగు నంబికను నియోగించెను. అంబిక ఋషివర్యునిఁజేరివానిమునివేషంబునకు వెఱగొంది కన్నులు మూసికొనియె. అందువలన నామె గర్భమున నంధుఁడైన యీధృతరాష్ట్రుఁడు జన్మించెను. ఇతఁడు భీష్మరక్షితుఁడై పెరిగి యుపనయనానంతరమున నధ్యయనమొనరించి రాజవిద్యలు నేర్చెను. భీష్ముఁ డితనినే రాజ్యాభిషిక్తుంజేసి తాను రాజ్యరక్షణము చేయుచుండెను. ఇతని తమ్ముఁడగు పాండురాజును రాజకార్యములందు మిక్కుటముగఁ దోడ్పడుచుండెను.

ధృతరాష్ట్రుఁడు సుబలుని కూఁతురగు గాంధారిని, ఆమె తోఁబుట్టువులగు సత్యవ్రత, సత్యసేన, సుదేష్ణ, సంహిత, తేజశ్శ్రవ, సుశ్రవ, నికృతి, శుభ, సంభవ, దశార్ణ అను మఱి నూర్గురను వివాహమయ్యెను. గాంధారి యందు దుర్యోధన దుశ్శాసనాదులు పుత్రులు నూర్గురును, నొక పుత్రిక దుస్సల యనునదియును జన్మించిరి.

పాండురాజు మరణించిన పిదప నతని కుమారులు ధర్మరాజాదులు హస్తినాపురముననే పెరుగుచుండిరి. ధృతరాష్ట్రుఁడు వారలను దన పుత్రులవలెనే ప్రేమించుచుండెను. భీష్మునివలన ధర్మరాజు నీతిధురంధరుఁడని యెఱింగి యతనికే యౌవరాజ్యపట్టముకట్టెను. కాని దుర్యోధనుఁడు అసూయాగ్రస్తుఁడై ధర్మజుఁడును, వాని సంతానమువారును, హస్తినాపురమునకు రాజులగుదురనియును, ధృతరాష్ట్రుని పుత్రులు తుద కాహారము లేకుండఁబోవుదురనియును, నిజపుత్రులనట్లు చేయుట యుచితంబు కాదనియును జెప్పి విలపించెను. పాండవులను నగరమునుండి వెడలఁగొట్టుమనెను. వారిని వంచించుట కతఁడనేక యత్నములు చేయుచుండెను. ధృతరాష్ట్రుఁడు పాండుపుత్రులను బంపివేయుట యన్యాయమని యెఱింగియును బుత్రునిపై గల్గిన ప్రేమచే నాతఁడు చెప్పిన దానికంగీకరించి ధర్మరాజాదులను "వారణాసికి వెళ్ళి యందుఁ బాండుని నిమిత్తముగ గో హిరణ్యాది దానములు చేసి రం"డని చెప్పి వారిని బంపెను.

పాండవులు మార్గమందు మరణించిరను వార్త ధృతరాష్ట్రుఁడు వినెను. అతనికిఁ బట్టరాని దుఃఖము వచ్చెను. సభలోనే బిగ్గఱగ నఱచెను. పాండవులకై తర్పణములు చేయించెను. కాని కొంతకాలమునకుఁ బాండవులు సుఖులై ద్రౌపదిని వివాహమయి ద్రుపదనగరమున నున్నారని చెప్పబడియె. ఈ వార్తలవలన ధృతరాష్ట్రునకంత సంతసము గలిగినట్లు లేదు. దుర్యోధనుఁడును, కర్ణుఁడును పాండవులను వధించుటయే కర్తవ్యమని రహస్యముగఁ జెప్పుచుండిరి. విదురుఁడు పాండవపక్షపాతియని వానిని నిందించుచుండిరి. ధృతరాష్ట్రుని మనస్సు కూడ మారెను. పాండవులను బరిమార్చుట కెద్ది యుపాయమని భీష్మాదులను నాలోచన యడిగెను.

ఆది నీతిగాదని భీష్మద్రోణులు బుద్ధిచెప్పిరి. పాండవులతో వైరము కలుగఁజేసికొనవలెనని వారు వారిమగటిమిచే రాజ్యమును గైకొందురని విదురుఁడు భయపెట్టెను. ఎట్టకేలకు పాండవుల కర్ధరాజ్యమిచ్చుట కంగీకరించి వారిని హస్తినాపురమునకుఁ బిలుచుకొని వచ్చుటకై విదురుని బంపెను. పాండవులువచ్చి పెదతండ్రియందు భక్తితోడనే మెలంగుచుండిరి. ధృతరాష్ట్రుఁడును వారికి ఖాండవప్రస్థము నిచ్చి నగరము నిర్మించుకొనుమని చెప్పెను.

పాండవనగరమగు నింద్రప్రస్థమున ధర్మరాజు రాజసూయయాగము చేసెను. ధృతరాష్ట్రుఁడు దానికి సంతోషించెను. కాని దుర్యోధనున కీర్ష్య కలిగెను. శకుని పాండవుల సిరిని మాయాజూదమున గెల్చి దుర్యోధనున కిచ్చెదననియె. యుద్ధమున గెల్చుటకంటె నిట్లు గెల్చుటయే సులభమని ధృతరాష్ట్రుని దీనికొడంబడుమనిరి. ధృతరాష్ట్రుఁడు రహస్యముగ విదురునితోఁ దనపుత్త్రుని తలఁపులు చెప్పెను. విదురుఁడు వానిని మందలించెను. జూదము నాడుటవలనఁగీడురాదని ధృతరాష్ట్రుఁడు చెప్పెనుగాని దానికి విదురుండంగీకరింపలేదు. కావున ధృతరాష్ట్రుఁడు పుత్రునితో జూదము నాడవలదనియును, దానెక్కుడు ధనమిచ్చెదననియును జెప్పి వాని నూఱడింపఁ జూచెను గాని దుర్యోధనుఁడు వినఁడు. తుదకుఁ బుత్రుని కోర్కె తీర్పఁదలఁచుకొని, దానివలనఁ గలుగు కీడును గ్రహించియు విదురుని బిలచి, "విదురా! పాండవులను బిలుచుకొనిరమ్ము వారు మన రత్నమయ సభను జూచెదరు. దాన నా కానందమగును. ప్రొద్దుపోవుటకు సుహృద్ద్యూతము నాడిన నాడవచ్చును" అని చెప్పెను. ధృతరాష్ట్రుని కపట హృదయము దీనివలననే తెల్లమయ్యెడు. ధర్మరాజాదులువచ్చి ధృతరాష్ట్రునకు నమస్కరించిరి. వారితో మాట్లాడుచుండిరి. అపుడే దుర్యోధనుఁడు ధర్మరాజును జూదమునకుఁ బిలచెను. మాయాజూదమునఁ బాండవులోడుచుండిరి. తమరాజ్యము నోడిరి. ద్రౌపదినోడిరి. దుర్యోధనుఁడు ద్రౌపదిని సభకు రావించెను. దుశ్శాసనుఁ డామె కట్టిన వస్త్రంబుల వొలుచుచుండె. అపుడైనను ధృతరాష్ట్రుఁడు కల్పించుకొని మాటా

డఁడు; పుత్త్రుని మందలింపఁడు. దుర్యోధనుఁడు గావించినదియవినీతియని విదురుఁడును, గాంధారియుఁగూడఁ బల్కిరి. అపుడు ధృతరాష్ట్రుఁడు ద్రౌపదిని బిల్చి తన కుమారునితప్పు మన్నింపుమని యామెకువరములిచ్చి పాండవులరాజ్యము వారికి మగిడియిచ్చెను. కాని మరల జూదము నాడి వారి రాజ్యము పోఁగొట్టుకొని వనముల కేగిరి. అడవులపాలైన పాండవులను గుఱించి ధృతరాష్ట్రునకు విచారము కలిగెను. కాని విదురుఁడు, "దానికి వగవనేల? వారిని రావించి వారి రాజ్యము వారికిమ్ము" అనఁగ నాతని దుఃఖము పోయెను. ఒకనాఁడు విదురుఁడు, "అధర్మ ద్యూతమున నోడఁబడి, వివిధాస్త్ర విద్యావిశేషులును, నీతివిశాలురు నగు పాండవులను నరణ్యముల పాలుచేసితివి. వారితోడి వైర మూరకపోవునే" యని ధృతరాష్ట్రునితో నన, నతనికిఁ గోపమువచ్చి "నా కొడుకుల సంపదచూచి నీవు సహింపలేవు. నీ యిష్టంబు వచ్చిన చోటికి నీవు పొమ్ము" అని విదురుని వెడల నడిచెను. విదురుఁడు పాండవులకడకు వచ్చెను. ఇతఁడు పాండవులతోఁ జేరియుండుట కిష్టపడక ధృతరాష్ట్రుఁ డతనిని నగరమునకుఁ బిలిపించెను. వనము లో మునివృత్తినుండిన పాండవులతో యుద్ధము సేయుటకు దుర్యోధనుఁడు యత్నించుచుండెను. ఆ సమయమున, కృష్ణద్వైపాయనుఁ డరుదెంచి మీరు గావించునది నీతికాదని చెప్పెను. వచ్చిన కీడంతయుఁ బుత్త్రునివలననే కలిగెననియును, నతఁడు తనకు వినకుండెననియును జెప్పి తన పుత్త్రుని శిక్షింపుమని వ్యాసుని నతఁడు గోరెను. పిమ్మటఁ బాండవులను జూచి మైత్రేయుఁడను ముని వచ్చెను. ధృతరాష్ట్రుఁడు వారల కుశలమడిగి వెంటనే వారు సమయము తప్పుదురుగద యని ప్రశ్నించెను. పాండవులు యుద్ధముచేసి తన పుత్త్రుని రాజ్యభ్రష్టునిఁ జేయుదురేమో యను భయము ధృతరాష్ట్రునకు మిక్కుటముగఁ గలదు. ఇతఁడు తఱచుఁ బాండవుల క్షేమ మారయుచుండెడువాఁడు; తన పుత్త్రుఁడు పాండవులను జూచుటకు వెళ్లెదనన్న నితఁడు వలదనియె. దుర్యోధనుఁడు వారి కెగ్గేమి చేయునో యనికాదు; పాండవులు వీని నేమిచేయుదురో యనియే యితని భయము. అజ్ఞాతవాసమున నున్న పాండవులను గుర్తించుటకై గోగ్రహణము మిషపై దుర్యోధనాదులు వెడలినపు డీతనితో నాలోచించినట్లు లేదు. అయిన నది ధృతరాష్ట్రునకుఁ దెలియకపోదు. అజ్ఞాతవాసముకూడ ముగిసినపిమ్మటఁ బాండవులు ద్రుపదునిపురోహితుని దూతగఁ బంపిరి. ధృతరాష్ట్రుఁడును ధర్మజాదులయొద్దకు సంజయునిఁ బంపెను. సంధిచేసికొనుటయే సముచితమని యితఁడు చెప్పుమనియె. కాని యేవిధమున నెట్లు సంధియయ్యెడిదియు మాత్రము చెప్పఁడు. దుర్యోధనుఁడు పాండవుల కేమాత్రము నివ్వననుచుండెను. భీష్మాదులును, వ్యాసుండును కృష్ణార్జునులు సామాన్యులు కారనియును, వారు మహానుభావులనియును వారితో వైరము పెట్టుకొనరాదనియును జెప్పిరి. ధృతరాష్ట్రునకు భయము కలిగియే పాండవులతో సంధిచేసికొనుమని పుత్త్రునితోఁ జెప్పెను గాని వారలపైఁగల ప్రేమచేఁగాదు. ఏమైనను దుర్యోధనుని యభిప్రాయమున కడ్డు చెప్పలేఁడు. అతఁ డెద్దిచేసిన నన్నను వలదన లేఁడు. తుదకు శ్రీకృష్ణుఁడు రాయబారిగ వచ్చినపుడును సంధి కుదురలేదు. కృష్ణునకుఁ బ్రత్యుత్తర మీయలేక పుత్త్రున కెదురుగఁ బలుకనులేక వీనికి బుద్ధి చెప్పుటకై, గాంధారిని బిలుచుకొనిరమ్మని విదురుని బంపెను.

తుదకు యుద్ధము సంభవించెను. సేనలు రణరంగమును జేరినవి. అపుడు వేదవ్యాసుఁడు వచ్చి పాండవుల రాజ్యభాగము వారికిప్పించి సంధి చేసికొనుమని చెప్పెను. తన పుత్త్రుఁడు తన మాట వినఁడని ధృతరాష్ట్రుఁడు విచారించెను. వ్యాసునివలన యుద్ధములో గెలుపు తెలుపు విషయములను నేర్చుకొనెను. ధృతరాష్ట్రునకు యుద్ధముందలివార్తలన్నియును దెల్పుటకై సంజయునకు రణరంగమందెవ్వరికిని గోచరింపకుండ, బాణహతుఁడు కాకుండ సంచరించునట్లు వ్యాసుఁడు వరమిచ్చెను. సంజయునివలననే పదునెనిమిది దినముల యుద్ధప్రకారమును ధృతరాష్ట్రుఁడు వినెను. తనవారెల్లరును మరణించిరని వినుటచే నితనికిఁ గలుగు దుఃఖమునకు మేర గలదా? యుద్ధానంతరమందుఁ బాండవులు ధృతరాష్ట్రునిఁ జూడవచ్చిరి. ఇతఁడు వారి నాశీర్వదించి కౌఁగిలించుకొనుచుండెను; భీమునిఁ గౌఁగిలించుకొనఁబోవునపుడు శ్రీకృష్ణుఁడు వీనిని వెనుకకు లాగి వాని యాకార

ముగఁ జేయఁబడిన యినుపవిగ్రహమును నచటఁ బెట్టెను. ధృతరాష్ట్రుఁ డనురాగముతోడ నలెనే దానిం గౌఁగిలించుకొని తుత్తునియలుగఁజేసెను. తన కుమారునితొడలు విరుగఁగొట్టిన భీముఁడే యనుకొని దానిని నలిపివేసెను. పుత్రశోకమునఁ గుందుచున్న యీతనిని వ్యాసుం డోదార్చి వీనికి దివ్యదృష్టి నిచ్చి మృతినొందిన వారిని గనఁబడఁ జేసెను. ధృతరాష్ట్రుఁడును నిజనగరమున నుండలేక భార్యాసహితుఁడై తపోవనమున కేగెను. భార.

ఇతఁడు శతయూపుఁడను రాజర్షి యాశ్రమమున నుండెను. అచ్చటకే వ్యాసుఁడు పాండవసహితుఁడై వచ్చెను. ధృతరాష్ట్రుఁడు మరణించిన తనవారినిఁ జూడఁగోరుట తెల్పెను. వ్యాసుఁడు వారిని గంగానదికిఁ గొంపోయి యందు స్నానముచేయించి వీనికి దివ్యదృష్టి నిచ్చెను. ధృతరాష్ట్రుఁడు తనవారలను జూచి మరల నిజాశ్రమంబునకు వచ్చెను. ఇతఁడు తపస్సు చేసికొనుచుండఁగ నొకనాఁ డగ్ని ప్రజ్వరిల్లెను. ఇతఁడు తనతోనుండిన సంజయుని బంపివేసి తాను యోగయుక్తుఁడై యుండను, అగ్ని వీనిపైఁ బ్రజ్వరిల్లెను. ధృతరాష్ట్రుఁడు శరీరము విడిచి యింద్రలోకమున కేగెను. భార.

యాగాగ్నితో నుత్తరాభిముఖుండయి చనియెను. వీనితో సంజయుఁడును వచ్చెను. అంతనా యడవియందు అగ్నిహోత్రము పుట్టినది. వీరికిఁ దప్పించుకొను నుపాయము లేదు. సంజయుని బలవంతపెట్టి వానిని బొమ్మని తూర్పు దిశగఁ గూర్చుండి ఆ యగ్నిని బ్రాణములు విడిచెను.

ధృతరాష్ట్రుఁడు:- తామ్రయందుఁ గశ్యపునకుఁ బుట్టిన పక్షి.

ధృతవర్మ:- కేతువర్మ తమ్ముఁడు.

ధృతవ్రతుఁడు:- పూరువంశమువాఁడైన ధృతి పుత్రుఁడు.

ధృతి:- ధరణీదక్షుల కుమారిత. ధర్ముఁడను మనువు భార్య.

ధృష్టకేతుఁడు :- చేది దేశాధిపతి; శిశుపాలుని తనయుఁడు. ఇతఁడు పాండవులకు మిత్రుఁడు. పాండవుల యక్షౌహిణులలో నొక దానికి నాథుఁడుగ నుండెను. భారత యుద్ధమందే యితఁడు మరణించెను. భార.

ధృష్టకేతువు:- ధృష్టద్యుమ్నుని కుమారుఁడు.

ధృష్టద్యుమ్నుఁడు:- ద్రుపదుని పుత్రుఁడు. ద్రోణుఁడు ద్రుపదుని నవమానించుటచే నతనిని బరిమార్పఁగలుగు సుతుఁడు కలుగుటకై ద్రుపదుఁడు పుత్రేష్టి చేసెను. హోమగుండమునుండి ధృష్టద్యుమ్నుఁడును, ద్రౌపదియును జన్మించిరి. ఇతఁడు మిక్కిలి శూరుఁడు. వ్యూహములు పన్నుటయందుఁ గడు నేర్పరి. కౌరవుల వ్యూహంబులకుఁ బ్రతివ్యూహంబులు పాండవపక్షంబున నితఁడే యేర్పఱచుచుండెడివాఁడు. ఆ యుద్ధమున నితఁడు మిక్కుటముగఁ బోరాడెను. ఇతఁడు పలువురు కౌరవపక్షమువారిని సంహరించెను. తుదకు ద్రోణునిమాత్ర మితఁడు చంపనేలేదు; మరణించిన వాని శిర మీతఁడు తెగవేసెను. ఈతఁ డట్లేల కావించెనో సుబోధకము గాదు. తన తండ్రి నట్లవమానపఱచె నను క్రోధము అశ్వత్థామకుఁ గలను. యుద్ధమంతయును ముగిసినతరువాతఁ బాండవ శిబిరమున నితఁడు నిదురించుచుండఁగ నిశియందు అశ్వత్థామ వీనిని సంహరించెను. ధృష్టద్యుమ్నుని కుమారుఁడు ధృతకేతువు. భార.

ధృష్టుఁడు:- వైవస్వతమనువుయొక్క కుమారుడు. ఇతనివలన ధార్ష్టంబను వంశముకలిగి భూతలంబున బ్రహ్మభూయంబునొంది నెగడెను. భాగ.

ధే

ధేనుకాసురుఁడు:- ఒక రాక్షసుఁడు. ఇతఁడు గార్దభాకారమునఁ దాలవనమునుండి మనుష్యభక్షణము చేయుచుండువాఁడు. వీనిని బలరాముఁడు సంహరించెను. భాగ.

ధేనుమతి:- దేవద్యుమ్నుని భార్య. భాగ

ధౌ

ధౌమ్యుఁడు :- ఒక బ్రాహ్మణుఁడు. ఇతనిని పురోహితుఁడుగ నుండఁ గోరుఁడని యంగారపర్ణుఁడు పాండవులతోఁ జెప్పెను. వారితనిని గోరిరి. ధౌమ్యుఁడు వారికిఁ బురోహితుఁడై యరణ్యవాసమందుఁ గూడ వారితోడనే యుండెను. భార.

ధ్రు

ధ్రువసంధి:-పుష్యుని కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు సుదర్శనుఁడు. భాగ.

ధ్రువసంధి:-(చూడుము ధ్రువసింధువు) ఇతఁడు వేఁటకుఁబోయి యొక సింహముచేతఁ జంపఁబడెను. పిమ్మటఁ జిన్నవాఁడైనను శత్రుజిత్తును రాజుగఁ జేసిరి. పిమ్మట సోదరుల మాతామహులకు యుద్ధము జరిగెను.

ధ్రువసింధువు :- (ధ్రువసంధి) కోసలాధీశుఁడు. ఒక రాజు. మనోరమ, లీలావతి యనువారలితని భార్యలు. ఇతనికి మనోరమయందు సుదర్శనుఁడు, లీలావతియందు శత్రుజిత్తు అను కుమారులు కల్గిరి. దే. భా.

ధ్రువసేన:-భరతుని పుత్త్రుఁడైన సుమతి భార్య. భాగ.

ధ్రువుఁడు:-అష్టవసువులలో నొకఁడు. బ్రహ్మవిద్యా ప్రజాపతుల కుమారుఁడు. ఇతని కుమారుఁడు కాలుఁడు. భార.

ధ్రువుఁడు:-నహుషుని కుమారుఁడు. భార.

ధ్రువుఁడు:-సూనృతా (సునీతి) ఉత్తానపాదుల కుమారుఁడు. ఇతనికి సవతితల్లి సురుచి. ధ్రువుఁడు బాల్యమునఁ దండ్రితొడపైఁ గూర్చుండఁగ నతని సవతితల్లి "నాకుమారుఁడు కూర్చుండఁదగిన చోటున నీవు కూర్చుండఁ దగవు. నా గర్భమున జన్మించినఁగాని నీకంతటి యదృష్టము కలుగదు. పొమ్ము" అని వీనిని గసరెను. ఆ మాటలకు ధ్రువునకుఁ గోపమువచ్చి తండ్రియంకమునుండి లేచివెళ్ళి తల్లియనుమతి పొంది తపోవనమున కరిగెను. మార్గమున నారదునిఁజూచి యతనిచే బోధితుఁడై విష్ణుమూర్తినిగూర్చి తీవ్రముగఁ దపస్సు చేసెను. అట నితఁడు సప్తఋషులనుజూచి వారికిఁ దన వృత్తాంతము చెప్పెను. ఇతఁడు వారిచే మంత్రోపదేశంబు నొంది తపస్సుచేసెను. వీనికి విష్ణువు ప్రత్యక్షమై వరములిచ్చెను. విష్ణువువలన వరంబులంది మగిడివచ్చుచున్న వార్త తండ్రి విని మిక్కిలి ఆనందించెను. ఉత్తానపాదుఁడు ఈతనికే పట్టముగట్టి తాను యోగమార్గమునఁ జనియె. ఇతనితమ్ముఁ డుత్తముఁడు వివాహము లేకయుండి హిమవన్నగప్రాంతములకు వేఁటకేఁగి యట యక్షులచేతఁ జంపఁబడెను. ఆ కోపమున ధ్రువుఁడు కుబేరపురముపైఁబడి యక్షులను వధింపఁజొచ్చెను. తుదకుఁ గుబేరుఁడువచ్చి మైత్రి గావించుకొనెను. ఇతఁ డిరువదియారువేలేండ్లు రాజ్యము చేసెను. ఇతనికి ధన్య యను భార్యయందు శిష్టుఁడను కుమారుఁడు కలిగెను. భ్రమి యను శింశుమార తనయయందు కల్పుఁడు, వత్సరుఁడు అనువారలును, వాయుపుత్త్రికయైన ఇలయందు ఉత్కలుఁడు అనువాఁడును జన్మించిరి. శంభువు అను భార్యయందు భవ్యుఁడు, శ్లిష్టి అనుపుత్త్రులు కల్గిరి. ధ్రువుఁడు పూర్వజన్మమున నొక బ్రాహ్మణుఁడు. సదాచారసంపన్నుఁడు. దైవభక్తికలవాఁడు. ఇతఁ డొక రాజుతో చెలిమి చేసి తానును రాజ్యమేలఁ గోరికకలిగియుండెను. అందువలననే తరువాతజన్మమున క్షత్రియుఁడై పుట్టి రాజ్యమేలెను.

భాగ. మత్స్య. విష్ణు. హరి.

విష్ణుదూతలు వచ్చి విమానారూఢునిఁ గావించి తీసికొనివెళ్లిరి. విమాన మెక్కఁబోవునపుడు తల్లికై చూడఁగ నితని తలంపెఱిఁగి యతనిముందఱఁ బోవుచున్న తల్లినిఁ జూపిరి. ఇతఁడు నక్షత్రమై ప్రకాశించుచుండెను.

ధ్రువుఁడు: - తననీడను జూచి దానిని స్త్రీని కమ్మనెను. ఆదిస్త్రీ కాఁగ నామెనతఁడు వివాహమయ్యెను. ఆమెయందు ప్రాచీనగర్భుఁడు, వృషభుఁడు, వృకుఁడు, వృకలుఁడు, ధృతిమంతుఁడు అను కుమారులు పుట్టిరి. బ్రహ్మ.

న

నంద:-హుహుని భార్య. భార

నంద:- పాలపోతకుఁడను సర్పరాజు యొక్క కూఁతురు. పాలపోతకుఁడు వనములోఁ గ్రుమ్మరుచు బహుళ యను కాంతను జూచి వలచి యామెను నింటికిఁ దోడ్కొనివచ్చెను. ఆమెను నంద చూచి యామెతనతల్లికి సవతికాఁబోవుట గ్రహించి బహుళను దాఁచిపెట్టెను. ఆమెను నెక్కడఁ బెట్టితివని తండ్రి యెన్నివిధముల నడిగినను జెప్పినదికాదు. అతనికిఁ గోపమువచ్చి నీవు మూకవు కమ్మని శపించెను. ఆమె మూగ యయ్యె, బహుళను నామె భర్త కడకు బలాత్కుఁడు గొనిపోయెను. తరువాత నామె దౌర్భల్యమును హరించుటకుఁ గ్రతువు చేసిన సుశర్మయే సరస్వతీక్రతువుచేసి నందయొక్క మూకభావమును బోఁగొట్టెను. మాక్క.

నందనము:-ఇంద్రుని యుద్యానవనము.

నంది:- శిలాదుని (శాలంకాయనుని) అయోనిజ కుమారుఁడు. శిలాదుఁడు పొలముదున్నుచుండఁగ నితఁడు దొరకెను. అది వృషభరూపమున నున్న ధర్ముఁడే యిట్లుజన్మించెను. నంది శివునిగూర్చి ప్రార్థింపఁగ శివుఁడు ప్రత్యక్షమై వరము వేఁడు కొనుమనియె. సదా శివధ్యానమే తనకుఁ గలుగునట్లు వరము ప్రసాదింపుమని నంది కోరెను. శివుఁడట్లనుగ్రహించి పార్వతికిఁ గుమారుఁడవుఁగ గూడ భావింపఁబడుదువని చెప్పెను. శివుఁ డొసంగిన వరమువలననే నంది శివునకు వాహనమును, ద్వారపాలకుఁడును నయ్యెను. ఇతని భార్య సుయశ.

నంది పార్వతీపరమేశ్వరుల వాకిటఁ గావలి గాచుచుండువాఁడు. వారు క్రీడించుచుండఁగ రావణుఁడు లోపలకు వెళ్ళఁబోయెను. నంది వలదనెను. ఇతనిని వానరముఖమని రావణుఁ డాక్షేపణ చేసెను. ఇట్లాక్షేపించుటచే నందికిఁ గోపమువచ్చి వానరులచేతనే నీవంశము నాశనము చేయఁబడునని రావణుని శపించెను.

శివ. ఉ. రా.

నందికేశ్వరుఁడు:-ఇతఁడే నంది (చూడు నంది.)

నందిని:- వసిష్ఠుని హోమధేనువు; దక్షప్రజాపతి పుత్త్రియైన సురభికిని, కశ్యపునకుఁ బుట్టినది. దానిపాలు త్రాగినవారు పదివేలయేండ్లు జరామరణములు లేక యుందురు. వసువు లొకపారి నందినిని దస్కరించిరి.

వసిష్ఠుఁడు చెప్పినట్లు దిలీపుఁడును, ఇతని భార్యయును సంతానముకొఱకు ఈ ధేనువును గొలిచిరి. ఈ ధేనువు నడచిన నడచుచు, ఆగిన నాగుచు, పరుండినఁ బరుండుచు దీని వెంబడినే యా రాజు ఉండుచుండువాఁడు. ఒకనాఁడు హిమవత్పర్వతముపై మేసి వచ్చుచు దిలీపుఁడు చూడకుండ నొక గుహలోఁ బ్రవేశించెను. అతఁడు వెదకుకొనుచు వచ్చి యీ ధేనువు సింహమున కాహారము కాఁబోవుచుండునట్లు చూచెను. అతఁడా సింహమును సంహరింప బాణమును దీయఁబోయెను గాని చేతులు స్తంభించెను. అది యంతయును నతనిని బరీక్షచేయుటకే యీ ధేనువు కల్పించెను. అతఁడు తన ప్రాణమునైన నిచ్చి నందినీ ధేనువును గాపాడుటకుఁ గోరుటచేత వీనిని మెచ్చుకొని వీనికి సంతానము కలుగునట్లు వరమిచ్చెను. భాగ.

నందివర్ధనుఁడు:- ప్రద్యోతనుని కుమారుఁడు. వీరి వంశము నందలి కడపటి రాజు శిశునాఁగుడను వాఁడు వీని తరువాత పరిపాలించెను. భాగ.

నందివర్ధనుఁడు:- శిశునాగుల వంశమువాఁడగు అజయుని పుత్త్రుఁడు. ఇతని పిమ్మట నితని కుమారుఁడైన మహానంది రాజ్యమేలెను. భాగ.

నందుఁడు:- ధృతరాష్ట్రుని పుత్త్రులలో నొకఁడు. భార.

నందుఁడు:- వసుదేవునకు మదిరయందుఁ బుట్టిన కుమారుఁడు.

నందుఁడు:-వ్రేపల్లెలో నొక గొల్లవాఁడు. ఇతఁడు పూర్వభవమున ద్రోణుఁ డను వసువు. నందుని భార్య యశోద. వీరికి యోగమాయ పుత్త్రికగ జన్మించెను. ఈమెను వసుదేవుఁడు కొనిపోయి

శ్రీకృష్ణుని వీరింటఁబెట్టెను. నందుఁడు శ్రీకృష్ణుఁడు తన పుత్త్రుఁడనుకొనియెను. భాగ.

నందుఁడు:-ఒకరాజు. మహానందుని పుత్త్రుఁడు. ఇతనికిఁ దొమ్మండ్రు పుత్త్రులు. ఇతనికి ముర యను దాసి కలదు. ఆమెయం దీతనికిఁ బుట్టిన వాఁడు చంద్రగుప్తుఁడు.

నందులు:-(చూడుము నవనందులు)

"నందో రాజా భవిష్యతి":-ఉత్తుంగ భుజుఁడను రాజునకు నందుఁడను కుమారుఁడు కలఁడు. ఈ కుమారునందును, వీని తల్లియందును రాజు ఉపేక్షవహించి యొకవేశ్యను గూడియుండెను. రాజుభార్య పేదయై దీనయై యుండెను. ఒక వర్తకుఁడు ముత్యాలహార మమ్ముటకుఁ దీసికొని రాఁగా నీమె చూచి దానిం గొనఁగోరి ధనములేమికి మిక్కిలి విచారించెను. ఆమెకడ నున్న దాసి "ముందుగ హారమును బుచ్చుకొనుము. తరువాత వర్తకునకు ధన మీయ వలసినసంగతి చూచుకొనవచ్చును. ఇంతలో రాజు చనిపోవునో? వర్తకుఁడు చనిపోవునో? మన నందుఁడే రాజగునో? ఏమి చెప్పగలము?" అని చెప్పను.

"ఉత్తుంగభుజనాశో వా, దేశ కాలగతో పి వా
వేశ్యావణిగ్వినాశో వా, నందో రాజా భవిష్యతి"
భా. వి.

నకులము:-ధర్మజుని యాగము. (చూడుము సక్తుప్రస్థుఁడు.) ధర్మరాజు అశ్వమేధమును మిక్కిలి గొప్పగఁ జేసెను. భక్తి, శ్రద్ధ, శౌచము, దానము ఎంతో అతిశయిల్లినవి. అందున నకుల మొకటి వచ్చి మనుష్యభాషణములతో "ఇదియేమి? ఇది సక్తుప్రస్థుని యాగమును బోలదు. వానియింటి కేతెంచిన అతిథి పాద్యజల క్షేపంబున నాతలయును, నొకపార్శ్వమును బంగారు మయమయ్యె. ఎన్నిచోట్లకుఁ బోయినను తక్కినభాగము నట్లగుటలేదు" అని అచటి విప్రులకుగ సక్తుప్రస్థుని యజ్ఞకథ చెప్పెను. (చూడుము జమదగ్ని. సక్తుప్రస్థుఁడు.) దాన వీనికి శాపమోక్షము కలిగెను.

నకులుఁడు:- పాండురాజుయొక్క కుమారుఁడు. ఆతని నియోగంబున మాద్రియందుఅశ్వినులవలనఁ బుట్టినవాఁడు. ఇతఁడు సౌందర్యవంతుఁడు. మాద్రి భర్తతో సహగమనము చేసినతరువాతఁ గుంతియే యితనిని బెంచెను. ఇతఁడు ధర్మరాజాదులతో సోదరులవలెనే కలసిమెలసి మెలగుచుండెడివాఁడు. ధర్మజునిమాట నకులుఁడు జవదాటఁడు. ద్రౌపదికాక యితనికి (కరేణుక) రేణుమతియను భార్య కలదు. ఆమె యందు నిరమిత్త్రుఁడను కుమారుఁడుజన్మించెను. ద్రౌపదియందు నకులునకుఁబుట్టిన కుమారుఁడు శతానీకుఁడు.

దుర్యోధనునకు నకుల సహదేవులపై, కౌంతేయులపై నున్నంత ద్వేష మున్నట్లు కనఁబడదు. అతఁడు వీరి నంతఁగఁ బాటింప లేదు. నకులుఁడు కౌంతేయులతోఁ గలసి వారణాసికిని, ద్రుపదునగరమునకును, నరణ్యములకును వెళ్ళెను. అజ్ఞాతవాసమున నితఁడు 'దామగ్రంథి' అను పేరుపెట్టుకొని విరాటుని కొలువులోఁ, బశుపాలకుఁడుగ నుండెను. అశ్వముల నడుపుటయందు నితనికి నేర్పు మెండు. భారతయుద్ధమున నితఁడు విశేషముగఁ బోరాడి కర్ణునికుమారులుసత్యసేన,చిత్రసేన, సుశర్మలను; నితరవీరులను సంహరించెను. ధర్మజుఁడు చేసిన యాగమునకు దిగ్విజయార్థమరిగి ధనరాసులు కొని తెచ్చెను. ఇతనికిఁదానేమిక్కిలిసౌందర్యవంతుఁడ నను గర్వమును గొంచెము కలదు. భార.

నక్షత్రకుఁడు:-ఒకబ్రాహ్మణుఁడు. విశ్వామిత్త్రుని శిష్యుఁడు. విశ్వామిత్త్రునకు హరిశ్చంద్రుఁడీయ వలసిన డబ్బును బుచ్చుకొనుటకు విశ్వామిత్త్రుఁడు హరిశ్చంద్రునివెంట నితనిని బంపెను. ఆ రాజును సకలబాధలుపెట్టి యతనిచే నబద్ధము నాడించుమని రహస్యముగా విశ్వామిత్త్రుఁడితనికిఁ జెప్పెను. హరిశ్చంద్రుఁడు రాజ్యమును విశ్వామిత్త్రునకు ధారపోసి యరణ్యమునకు భార్యాపుత్త్రులతో వెళ్లునపుడు నక్షత్రకుఁడు వారితోఁ గూడ వెళ్ళెను. ఇతఁడు వారు నడుచునపుడు తాను నడువలేననికూర్చుండును; వారికుమారుని దింపి తన నెత్తుకొమ్మనును. వారు విశ్రమించినపుడు తనకాలము వ్యర్థము చేయుచున్నారని త్వరగాఁ గాశికిఁ జేరి చంద్రమతినమ్మి తన గురువుగారి డబ్బు నిమ్మనును. అరణ్యములో నెచ్చటను జలముదొరకనిచోట నాకుదాహమగు

చున్నది; జలము కావలయు నని కూర్చుండును. మధ్యమధ్య విశ్వామిత్రుని ధనమివ్వనని యొక యసత్యము నాడినచోఁ దాను వెళ్ళిపోదునని చెప్పుచుండును. చంద్రమతిని అమ్మఁగా వచ్చిన డబ్బుచాలకపోఁగా నితఁడు హరిశ్చంద్రుని నొక మాలవాని కమ్మివేసెను. మార్క.

నగ్నజిత్తు:-కోసలదేశము రాజు. ఇతని కుమారిత నాగ్నజితి. ఈరాజు నగరంబున వాడికొమ్ములు గల వృషభంబు లేదును ప్రజలకుఁ బట్టుకొనుట కందక హానిచేయుచుండెను. వానిని లొంగఁదీసిన వానికిఁ దనకుమార్తె నిత్తునని చాటించెను. శ్రీకృష్ణుఁడు వానిని సంహరించి నాగ్నజితిని గైకొని పరిణయమయ్యెను. భాగ.

నచికేతుఁడు:-(చూడుము నాచికేతుఁడు)

నడ్వల:-చాక్షుషమనువుయొక్క భార్య.

నభగుఁడు:-వైవస్వతుని కుమారుఁడు. ఇతని కుమారుఁడు నాభాగుఁడు. (చూడుము నాభాగుఁడు.)

నభస్వంతుఁడు:- మురాసురుని కుమారుఁడు. శ్రీకృష్ణునిచేఁ జంపఁబడెను.

నభస్వతి:-విజితాశ్వునిరెండవభార్య. హవిర్ధానుని తల్లి. భాగ.

నభుఁడు:-నిషధుని (నలుని) పుత్త్రుఁడు. ఇతని కుమారుఁడు పుండరీకుఁడు. రఘు. భాగ.

నముచి:-దనువునకుఁ గశ్యపునివలనఁబుట్టిన కుమారుఁడు. ఇతని భార్య ప్రభ. ఇతఁ డింద్రునకు వెఱచి డాఁగెను. "నిన్ను ఆర్ద్రమైనదానితోఁ గాని, శుష్కమైనదానితోఁ గాని కొట్ట" నని యింద్రుఁడు వీనిని నమ్మించి ఫేనముతోఁ గొట్టి చంపెను. భార.

దేవదానవులయుద్ధములో నింద్రుఁడు వజ్రాయుధముతోఁ గొట్టెను గాని నముచి కసికంద లేదు. ఇంద్రుఁడు విస్మితుఁడై వజ్రాయుధమిట్లు శక్తిహీనమైనదేల ? యని విచారించుచుండఁగ ఆకాశవాణి నముచికి ఉన్నవరమును జెప్పెను. ఆర్ద్రమైనది, శుష్కమైనది, కానిది ఫేనమని దానితోఁగొట్టి చంపెను. భాగ.

నరకాసురుఁడు:-వరాహరూపమున నున్న విష్ణుమూర్తి వలన భూదేవికిఁ బుట్టిన కుమారుఁడు. యోగనిద్రనుండి లేచిన విష్ణుమూర్తిని భూదేవి కామించెను. అతఁడు ప్రీతుఁడై వరము వేఁడుకొనుమనెను. ఆమె తన కుమారునకు వైష్ణవాస్త్ర మిమ్మని వేఁడెను. విష్ణుమూర్తి దాని నొసంగెను. నరకుని రాజధాని ప్రాగ్జ్యోతిషము. ఇతని వాహనము సుప్రతీక మను నేనుఁగు. నరకుని పుత్త్రుఁడు భగదత్తుఁడు. దండనాథుఁడు పీఠుఁడనువాఁడు. నరకాసురుఁడు బలగర్వముచే నరులను, దేవతలను బాధపెట్టు చుండెడువాఁడు. ఇతఁడు పదునాఱువేల స్త్రీలను జెరపెట్టెను; అదితి కర్ణకుండలములను, వరుణచ్ఛత్రంబును నపహరించెను. సత్యభామా శ్రీకృష్ణులితనితో యుద్ధముచేసి వీనిని జంపిరి. భాగ.

నరకుఁడు:-విప్రజిత్తి కుమారుఁడు.

నరనారాయణులు:- ధర్మునిపుత్త్రులు. హిరణ్యకశిపుని సంహరించిన తరువాత నరసింహావతారము రెండుభాగము లయ్యెను. నరరూపము నరుఁడయ్యెను. సింహరూపము నారాయణుఁడయ్యెను.

వీరు విష్ణ్వంశసంభూతులు; కడుమిత్త్రులు. ఇద్దఱును బదరీవనములోఁ దపస్సు చేసికొనుచుండఁగ నింద్రుఁడుచూచి వీరితపస్సునకు భంగము చేయుటకై యప్సరసలను బంపెను. నరనారాయణులు అకాలవసంతమును జూచిరి. తోడనే యప్సరసలను గూడఁ జూచిరి. అది యింద్రునిమాయ యని గ్రహించిరి. అప్సరసలను జూచి నారాయణుఁడు తన యూరువును గోరుతో గీరెను. అచ్చటనుండి సుందరాకారయైన యొక యువిద పుట్టెను. ఊరువులనుండి పుట్టెను గాన నీమెకు ఊర్వశి యను పేరు వచ్చెను. ఈమెను జూచి వచ్చిన యప్సరసలాశ్చర్యమును, సిగ్గును బొంది వెడలిపోయిరి.

వీరు తపస్సుచేసికొనుచున్న ప్రదేశము ప్రక్కనుండి ప్రహ్లాదుఁడు పోవుచు వారి ముందట నస్త్రము లుండుటజూచి మునులైనవారికి నాయుధములేల ? వీరు కపట మునులు కావచ్చునని పలికెను. ఆ మాటలకు నరనారాయణులకు కోపము వచ్చెను. వారికిని, ప్రహ్లాదునకును వాదము జరిగెను.

తుదకు యుద్ధమునకుఁ గడంగిరి. ఎంతపోరినను ప్రహ్లాదుఁడు వారిని గెలువలేకుండెను. ఇతఁడు విష్ణుమూర్తిని ప్రార్థించెను. విష్ణుమూర్తి ప్రత్యక్షమై నరనారాయణులు విష్ణ్వంశమువారనియును, నీకు నజేయులనియును దెల్పెను.

నరనారాయణులు రాక్షస సంహారము చేయుటకై యవతరించిరి. సహస్రకవచుఁ డొకఁడు కలఁడు. వానికి సహజముగనే శరీరమున సహస్రకవచములు కలవు. వెయ్యేండ్లు తపస్సుచేసినఁగాని వానితోఁ బోరుటకు శక్తి యుండెడిది కాదు. అందువలన నరనారాయణులు తపస్సు చేసిరి. మఱియు నరుఁడు వెయ్యేండ్లు తపస్సుచేసి యుద్ధమునకు వెళ్ళఁగనే నారాయణుఁడు యుద్ధముమాని తపస్సునకు వచ్చును. నారాయణుఁడు వెయ్యేండ్లు తపస్సుచేసి యుద్ధమునకు వెళ్ళి నరుని మరలఁ దపస్సునకుఁ బంపును. అట్లు వారు సహస్రకవచునియొక్క తొమ్మిదివందల తొంబది తొమ్మిది కవచములు ఛేదించిరి. ఒంటి కవచముతో నా రాక్షసుఁడు కర్ణుఁడుగ జన్మించెను. వానిని సంహరించుటకు నరనారాయణులు కృష్ణార్జునులుగఁ బుట్టిరి.

నరాంతకుఁడు:- రావణాసురుని కుమారుఁడు. యుద్ధమున నీఁడంగదునిచేఁ జంపఁబడెను. రామా.

నరిష్యంతుఁడు:-మరుత్తుయొక్క పెద్దకుమారుఁడు. పితరులవలె నితఁడును యాగముచేసి సాటిలేని ద్రవ్యదానము చేసెను. పిమ్మట మఱియొక యాగము చేయఁదలఁచి బ్రాహ్మణులను గోరఁగఁ బ్రతిబ్రాహ్మణుఁడును నేనే యాగము చేయ సంకల్పించితిని. మఱియొకరిని గోరుమనుచు వచ్చెను. నరిష్యంతుఁడు చేసిన దానములవలన నాతని రాజ్యమున దానము పరిగ్రహించు బీదబ్రాహ్మణుఁ డొకఁడును లేఁడు. నరిష్యంతుఁడు బభ్రువు పుత్త్రిక యగు నింద్రసేనను బరిణయమయ్యెను. ఇతనికి దముఁడను కుమారుఁడు జన్మించెను. దమునకుఁ బట్టముకట్టి నరిష్యంతుఁడు భార్యాసమేతుఁడై తపోవనమున కేగెను. అచ్చట మానవృత్తి నుండఁగ దముని శత్రుఁడగు వపుష్మంతుఁ డనువాఁడు వీనిశిరమును ఖండించెను. మార్క.

నరిష్యంతుఁడు:-ఇతని పుత్త్రుఁడు చిత్రసేనుఁడు.

నరిష్యంతుఁడు:- వైవస్వత మను వు యొక్క పుత్త్రుఁడు.

నరుఁడు:-(చూడుము నరనారాయణులు.)

నర్మద:-ఒక నది. శివుని శరీరమువలనఁ బుట్టినది. దుర్యోధనుఁ డను మనువంశపురాజును జూచి మోహించి స్త్రీ రూ ప ము న వ చ్చి యాతని సాంగత్యము నొందెను. అతనివలన నామెకు సుదర్శన యను కుమారిక పుట్టెను. మార్క.

నర్మద:-నాగకుమారిక. నాగకుమారులు పురుకుత్సునిఁ దమలోకమునకుఁ గొనిపోయి తమ చెల్లెలినిచ్చి వివాహమును జేసిరి. భాగ.

నర్మద:-ఒక నది. చంద్రుని పుత్త్రిక. ఈమెను బురుకుత్సుఁడు ప్రేమించెను. ఈమెయును బురుకుత్సుని వలచియుండెను. గంధర్వులు నాగలోకమునకుఁ బోయి యచ్చట వానిని బాధపెట్టుచున్నారని నాగులు విష్ణువుతోఁ జెప్పికొనిరి. తనయంశతోఁ బుట్టిన పురుకుత్సునితోఁ జెప్పికొనుమని విష్ణువు చెప్పెను. అది యెట్లు సమకూరునని వా రాలోచించునపుడే నర్మద స్త్రీరూపమున వచ్చెను. వారు నర్మదను వేఁడిరి. ఈమె పురుకుత్సుని నాగలోకమునకుఁ గొంపోయెను. అతఁడు గంధర్వులను వెడలఁగొట్టెను. నర్మద పు రు కు త్సు న కు భార్యయయ్యెను. ఈమెకుఁ ద్రస్యదసుఁడు అను పుత్త్రుఁడు జన్మించెను. పన్నగముల కీమె యుపకారము చేయుటచే నీమె నామము స్మరించిన వారికి సర్పవిషబాధ కలుగకుండునని వారనుగ్రహించిరి. హరి.

నర్మద:-ఒక గంధర్వస్త్రీ. ఈమెకు ముగ్గురు కుమారితలు సుందరి, కేతుమతి, వసుద అను వారలు కల్గిరి. వారిని సుమాలి, మాల్యవంతుఁడు, మాలి యనువారలకిచ్చి వివాహము చేసెను. ఉ. రా.

నల:-విభీషణుని కుమారిత. అశోకవనములో సీతకు గావలి కాచుచుండెడిది. ఈమె సీతను ఆదరించుచుండెడిది. కాని దూషించలేదు. రామా.

నలకూబరుఁడు:-కుబేరుని పుత్త్రుఁడు. ఇతఁడును, నితని సోదరుఁడు మణిగ్రీవుఁడును కైలాస

యుండుఁ దోఁటలో నప్సరసలతో విహరించుచు దిగంబరులై యుండిరి. అట్లుండఁగ నారదుఁడు వచ్చెను. అప్సరసలు వస్త్రములుధరించిరి. కాని వీరట్లేయుండిరి. సంపన్నుని సుతులు పరులను జూడరు. వీరి గర్వము నడచి బుద్ధిమంతులను జేయుట మంచిదని తలంచి వారిని నారదుఁడు మద్దిచెట్లు కండని శపించెను. అపుడు వారు మునిని అనుగ్రహింపుమని వేఁడగ శ్రీకృష్ణుని పాదము లగిలినపుడు శాపవిమోచన మగునని నారదుఁడుచెప్పెను. వీరిద్దఱును సాలవృక్షములై నందునింటఁ బుట్టిరి.

శ్రీకృష్ణుఁ డల్లరిచేయుచున్నాఁడని యశోద వానిని త్రాటితో నొకరోటికిఁ గట్టివేసెను.

శ్రీకృష్ణుఁడు బాల్యచాపల్యముచేతఁ బ్రాకుచు రోటినిగూడ నీడ్చెను. అది యీ వృక్షములకుఁ దగిలెను. ఇవి విఱిగిపడిపోయినవి. నలకూబర మణిగ్రీవులు శాపవిమోచన మొంది లేచిరి.

నలకూబరుఁడు మిక్కిలి సౌందర్యవంతుఁడు. అప్సరస స్త్రీలతో విహరించుటయే గాని యితఁ డెవరితోడను యుద్ధముచేసినట్లులేదు. ఈతనిపై రంభకుఁ బ్రేమ యెక్కువ. భాగ.

నలపాకము:- నలుఁడు కొంచెముగడ్డినిఁ జేతఁ బుచ్చుకొని విసరఁగనే యగ్నిపుట్టును. అతని వంట అగునంతవఱకు వేఱె కట్టెలులేక ఆరిపోక మండుచునే యుండును. జలము కావలసినయెడల బింకెలయందు జలము దానియంతట నదియే నిండుచుండును. రెండుచేతులు చఱచి కొట్టఁగ మహా సుగంధద్రవ్యము వచ్చును. వాని వంట యొక్క రుచియు మిక్కిలి ఘనముగా నుండును.

నలిని:-అజమీఢుని భార్య. ఈమెకు నీలుఁడను కుమారుఁడు కలిగెను. భాగ.

నలుఁడు:-ఒక వానరుఁడు. విశ్వకర్మయొక్క పుత్త్రుఁడు. సుగ్రీవుని సేనలో నుండువాఁడు. సముద్రమునకు వారధికట్టుట కితఁడే ప్రారంభించెను. సముద్రముదాటి రామునితోఁ గలసి రావణునితోఁ బోరాడెను. రామా.

నలుఁడు:-కుశునిపౌత్త్రుఁడైన నిషధుని కుమారుఁడు. ఇతని కుమారుఁడు నభుఁడు.

నలుఁడు తనకుమారున కుత్తరకోసలరాజ్య మిచ్చి తాను తపోవనమున కరిగెను. రఘు.

నలుఁడు:-ధూమాక్షుని కుమారుఁడు. సుదేవుఁడను రాజునకు మిత్త్రుఁడు. రాజుతో నితఁడు నరణ్యమునకేగి యచ్చటఁ బ్రమతి యను ముని భార్యను మోహించెను. మునికిఁ గోపమువచ్చి నలుని దండింపుమని సుదేవునితోఁ జెప్పెను. సుదేవుఁడు నేను కోమటిని. రాజునుగాను. కావున నలుని దండింపలేనని చెప్పెను. ఆ మునియే నలుని నీచుకమ్మని శపించెను. మార్క.

నలుఁడు:-నిషధదేశపురాజు. వీరసేనుని పుత్త్రుఁడు. ఇతఁడు వనములో విహరించుచు నొక హంసను బట్టుకొనెను. ఆ హంస తనను విడువుమని బ్రతిమాలి యితని గుణములను నీతఁడు వలచి యుండిన దమయంతియెదుట వర్ణింతునని యెను. నలుఁడు హంసను వదలెను. ఆ హంసయే దమయంతిచే నుద్యానవనములోఁ బట్టువడియెను. ఆమెతోడను నయ్యది తాఁ జూచినంతవఱకు దమయంతికిఁ దగినవాఁడు నలుఁడుతప్ప వేఱొక రాకుమారుఁడు లేఁడని చెప్పెను. దమయంతీ స్వయంవరము జరుగునని యామెతండ్రి చాటించెను. ఆ స్వయంవరమునకు నలుఁడు వచ్చెను. అచ్చటికే దిక్పాలురునువచ్చి నలునిఁ దమకొక హితముచేయుమని కోరిరి; ఇతఁడు సరేయనియె. వీనినే దమయంతికడకుఁ బోయి దేవత లామెను వలచి వచ్చియున్నారని చెప్పుమనిరి. ఇతం డదృశ్యుఁడై యంతఃపురము ప్రవేశించుశక్తి నీతనికిచ్చిరి. తనకోర్కకు భంగము కలిగెనని విచారించియు నితఁ డేగెను. నలునింగాని నే నన్యుని వరింపనని దమయంతి పలికెను. స్వయంవరమున దిక్పాలురు నల్వురును నలునిరూపమునే తాల్చిరి. దమయంతి వారలను బ్రార్థించి వారు నిజరూపములు పూనినతరువాత నలుని వరించెను. నలుఁ డామెను వివాహమయి తన నగరమున కేగెను.

దమయంతీ స్వయంవరమునకు వచ్చుచుండిన కలి 'ఆమె నలుని వరించె' నని దేవతలవలన విని వానిపైన నీర్ష్య కలిగియుండెను. ఒకనాఁడు నలుఁడు కృతమూత్రుఁడై పాదశౌచము చేయక మఱచి సంధ్యోపాసనంబు చేసెను. అప్పుడు కలి వానియందుఁ బ్రవేశించి, యతని పినతండ్రి కొడుకగు పుష్కరునియొద్దకుఁబోయి నలునితో జూదమునాడి యతని రాజ్యమును గెలువుమని

చెప్పెను. విప్రరూపంబునఁ గలి వాని చెంత నుండెను. జూదంబున నలుఁడు రాజ్యమోడి దమయంతీసహితుఁడై యరణ్యముల కేగెను. ఆఁకటి యాహారమునకై పక్షులను బట్టుకొనఁబోయి తాఁగట్టినవస్త్రమును బక్షులపై విసరెను. అవి యా వస్త్రము నెత్తుకొని యెగిరిపోయెను. దమయంతిచీరలో సగమీతఁడు కట్టుకొనియుండెను. ఒకనాఁడురాత్రి యామె నిద్రించుచుండఁగ నితఁ డామెను విడిచి వెళ్ళిపోయెను. తాను గనఁబడక పోయినయెడల దమయంతి తండ్రి యింటి కేగుననియు, నందుచే నరణ్యక్లేశము లామె పడు నవసరముండదనియుఁ దలఁచెను. ఇతఁడు సంచరించుచుండఁగ నగ్నిహోత్రము మధ్యనున్న యొకపాము కర్కోటకుఁడు రక్షింపుమని యితనిని గోరెను. ఇతఁడు దానిని గాపాడినపిదప నది యితనిని గఱచి వికృతరూపుని జేసెను. "ఇతఁడు కోరినపుడు నిజరూపము వచ్చుననియు, బాహుకుఁడను పేరుతో ఋతుపర్ణునియొద్ద వంటలవాఁడుగనుండుమనియు దెల్పి వాని కశ్వహృదయము నుపదేశించి, వాని వలన అక్షహృదయము నేర్చుకొమ్మనియు" నది చెప్పెను. నలునికై వెదుకవచ్చిన వారితని యాలాపములను వినిరి. ఇతఁడే నలుఁడగునని శంకించిరి.

దమయంతి పలుకుమన్న మాటలు వెదుకవచ్చిన బ్రాహ్మణులు పలుకఁగా, నితఁడే బదులు బలికెను. ఇతఁడు నలుఁడగునని సందేహించి వానిని విదర్భకు రావించు నుపాయముగ మఱునాఁడే దమయంతీ స్వయంవరమగునని ఋతుపర్ణునకుఁ దెలుపుటకై బ్రాహ్మణులను బంపిరి.

దమయంతికి ద్వితీయ స్వయంవరమును జాటించిరి. దానికి ఋతుపర్ణుఁ డేగెను. వానికి రథచోదకుఁడుగ నలుఁ డరిగెను.

దమయంతీ ద్వితీయస్వయంవరమునకు నితర రాజుల నెవ్వరిని రప్పింపలేదు. ఋతుపర్ణుని వేయియోజనములు నొక్కదినములో నడుపఁ గల్గినవాఁడు నలుఁడేకావున నిట్లుచేసిరి.

ఋతుపర్ణుఁడు మార్గమున వచ్చుచు ఫలంబులతో నున్న యొక్క తాండ్రచెట్టును జూచి లెక్కింపకయే దానియందున్న కాయలు, ఆకులు తెల్పుదుననియెను. అతఁడు చెప్పినపిదప నలుఁడు వానిని లెక్కించెను. అవి సరిగా నుండెను. ఆ విద్య అక్షహృదయము అనునది. వచ్చిన ఋతుపర్ణుని, వార్ష్ణేయుని దమయంతి తెలిసికొనెను. బాహుకునిఁ దెలిసికొని వచ్చుటకు నతఁడు వంటచేసికొనుచున్న చోటునకు దమయంతి తనదాసినిఁ బంపెను. ఆమె సంభాషణ వలన నితఁడు నలుఁడని సందేహించెను. వీని యొద్దకు దమయంతి తన బిడ్డలను బంపఁగా ఇతఁడు తన పుత్త్రుఁడగు ఇంద్రసేనుని, పుత్రిక యగు నింద్రసేనను నెత్తుకొని ముద్దాడెను. వారినిఁజూచి యితఁ డెత్తుకొని ముద్దాడి కంటఁ దడిపెట్టెను. దమయంతి ఇతఁడు నలుఁడనుకొని తన తల్లి యనుమతిపై నలునినిఁ దన గృహమునకు రప్పించుకొనెను. పిమ్మట "నలుఁడు ఇట్లు దమయంతిని అడవిలో విడిచి వెళ్ళుట న్యాయమా?" అని దమయంతి యనియెను. "దమయంతి ద్వితీయస్వయంవర మని యెల్ల రాజులను రావించుటకుఁ జాటుట న్యాయమగునా?" యని నలుఁడు పలికెను. వాయుదేవుఁడు దమయంతి పతివ్రత యని పలికెను. నలుఁడు కర్కోటకునిఁ దలంచి నాగాంబరమును ధరించి పూర్వస్వరూపము గైకొనెను. ఋతుపర్ణుఁడు బాహుకుఁడే నలుండగుట యెఱింగి వానినిఁ దక్కువపనులందు నియోగించి నందులకు విచారించి క్షమింపుమని, వానివలన అశ్వహృదయవిద్య నేర్చుకొని, నలునకు అక్షహృదయమును నేర్పి చనెను.

అది నేర్వఁగానే యతని శరీరమునుండి కలి వెలుపలికివచ్చెను. నలుఁడు వానిని శపింపఁబోవ కలి మిక్కిలి బ్రతిమాలుకొనియెను. నలుని గీర్తించినవారికిఁ గలిదోషము అంటదని కలి వరమిచ్చి చనిపోయెను.

నలుఁడు భార్యతోను, బిడ్డలతోను నొకనెల యటనుండి పిమ్మటఁ దన నగరమునకుఁ బోయి "తనతో యుద్ధముచేసినను సరే, లేక నేను దమయంతిని బణముగఁ బెట్టెదను జూదము నాడినను సరే. పుష్కరుఁడోడినచో రాజ్యము నీయవలయు" నని చెప్పెను. పుష్కరుఁడు జూదము నాడుదననియే పలికెను. అక్షహృదయవిద్య నలుఁడు నేర్చియుండెను గావునఁ బుష్కరుని నోడించి రాజ్యమును గైకొనెను. పుష్కరుఁ డీతని పినతండ్రియొక్క

కుమారుఁడు కావున వానిని వధింపక విడిచెను. ఇతఁడు భార్యాపుత్త్రిలను గూడి సుఖముగా నుండెను. భార.

నవనందులు:-మహాపద్మని కుమారులైన సుమాల్యాదుల సిమ్మట, కార్మకుఁడు మొదలగు రాజనవకంబు నందాఖ్యలను జయించి రాజ్య మేలినారు. కాని వీరిని జాణక్యుఁడు అను భూసురోత్తముఁ డున్మూలనముఁ జేసెను. ఆ చాణక్యుఁడు వీరిరాజ్యమునఁ జంద్రగుప్తుఁడను వానిని నభిషిక్తునిఁ జేసెను. భాగ.

నహుషప్రశ్న:-చూడుడు నహుషుఁడు.

నహుషుఁడు:-ఒకరాజు. (పురూరవునకు ఊర్వశి యందుఁ బుట్టినకుమారుఁడు.)

నహుషుఁడు:-ఆయువు కుమారుఁడు. స్వర్భానవి యితనితల్లి. ఇతఁడు ప్రియంవదను వివాహ మయ్యెను. ఇతనికి యతి, యయాతి, సంయాతి, యాయాతి, ధ్రువుఁడు అనుకుమారులు కలిగిరి. నహుషుఁ డనేక క్రతువులు చేసెను. దానివలన దేవత్వము నొందెను. మఱియు విశ్వరూపునిఁ జంపిన పాతకమునకు భయపడి యింద్రుఁడు పాఱిపోయినపుడు ఆ పదవికి మనుజుండైనను నహుషుండు తగినవాఁడని వానిని దేవత లెన్నుకొని వానికిఁ దమతమ యంశలిచ్చి నహుషునకే యింద్రపదవి నిచ్చిరి. ఇతఁ డింద్రుఁడగుటచే మిక్కిలిగర్వించి దేవతలను, మునులను నవమాన పఱచుచుండెను. శచీదేవిని జూచి మోహించి యామెను తనకడకు రప్పింపుఁడని యాజ్ఞాపించెను. ఆమె బృహస్పతియొక్క యాలోచన పొంది యుపాయముగ మునివాహనముపై తన కడకు నహుషుఁడు వచ్చెనేని యాతనిపొందు నంగీకరింతు ననియె. నహుషుఁడు గర్వాంధుఁడై అగస్త్యాది మహామునులను దన యందలమును మోయుఁడని యాజ్ఞాపించెను. బ్రాహ్మణులు గౌరవించుమంత్రము లాక్షేపించెను. అతనితో వాదముచేసిన యగస్త్యునిఁ దలమీదఁ దన్నెను. అంతట "నీవు మదాంధుఁడవై యిట్లు పల్కుచుంటివి గావున సర్పమవుక" మ్మని యగస్త్యుఁడు శపించెను; మఱియు "సర్పమైయుండి యతఁడు వేసినప్రశ్నల కెవరైన నేనాడు ప్రత్యుత్తరమిత్తురో, ఆనాఁడు శాపవిమోచనము కలుగు"నని చెప్పెను. ఇతఁడు సర్పమై పడిపోయెనుగాని పూర్వజ్ఞానము కలదు. తనకు దొరకిన వారినిఁ బట్టుకొనుచుండెను. వారిని గొన్ని ప్రశ్నలు వేయుచుండెను. ఎవ్వరును ప్రత్యుత్తరము చెప్పలేక పోవుచుండిరి. ఒకనాఁడు వనములో సంచరించుచున్న భీముఁడు కూడ నీ యజగరమునకుఁ జిక్కెను. దాని బంధనము నుండి తప్పించుకొనఁ జూచెనుగాని భీమునకును సాధ్యమైనదిగాదు; వానిని వెదకుచు ధర్మజుఁడు వచ్చి యజగరముచే బంధింపఁబడుటను జూచెను. అది తన ప్రశ్నలకు సమాధానమిచ్చినచో వదలుదుననియె. బ్రాహ్మణుఁడన నెట్టివాఁడు ? అసత్యము నాడువాఁడైనను బ్రాణహింస చేయనివాఁ డగుచో సుగతిం బొందునందురేల ? మొదలగు ప్రశ్నలువేసెను. ఆ నహుష ప్రశ్నల కన్నిఁటికిని ధర్మజుఁడు సమాధానము చెప్పెను. అంత నది భీముని వదలెను. నహుషునకును శాపవిమోచనమయ్యెను. అతఁడు పుణ్యలోకము బొందెను. భార.

నహుషుఁడు:-కద్రువ కుమారుఁడు. భార.

నహుషుఁడు:-ఒకరాజు. చేపలకై బోయలు గంగానదిలో వలవేయఁగ నదిలోఁ దపస్సుచేసికొనుచుండిన చ్యవనుఁడు వలలోఁజిక్కుపడి వచ్చెను. అతనిని జూచి భయపడి జాలరులు మ్రొక్కి వాని వృత్తాంతము నహుషునితోఁ జెప్పిరి. నహుషుఁడు మంత్రివర్గముతోవచ్చి చ్యవనునకు నమస్కరించి జాలరులుచేసిన తప్పు క్షమింపుమని వేఁడెను. తన శరీరమునకు సరియైనవిలువ వారి కిమ్మని చ్యవనుఁడు చెప్పెను. వేయిమాడ లిత్తునని నహుషుఁడు చెప్పెను. అది తగినవిలువ కాదని చెప్పఁగఁ గోటి మాడ. లిత్తుననియె; అర్ధరాజ్య మిత్తుననియె; తుదకు రాజ్యమంతయు నిత్తుననియె. అదియుఁ దనకు సరియైన విలువ కాదని చ్యవనుఁడు పలికెను. ఏమిసేయుటకుఁ దోచక రాజు చింతించుచుండఁగఁ గవిజాతుఁ డను ముని వచ్చి బ్రాహ్మణునకు సరియైనది గోవుకాని యన్యముకాదని చెప్పెను. ఆమాట విని నహుషుఁడు చ్యవనునితో గోవునిత్తునని చెప్పెను. చ్యవనుఁడు సంప్రీతుఁ డయ్యెను. నహుషునకుఁ జ్యవనుఁడు వరములు కూడ నిచ్చెను. భార.

నా

నాగదత్తుఁడు:–గాంధారీధృతరాష్ట్రులపుత్త్రుఁడు.
భార.

నాగధన్వము:–ఒక పుణ్యతీర్థము. ఇచ్చట దేవతలు నాగేంద్రత్వమునకు వాసుకి నభిషేకించిరి.
భార.

నాగ్నజితి:– కోసల దేశాధిపతియైన నగ్నజితి యొక్క కుమారిత. ఈ రాజు నగరమునయుండిన వృషభములు ప్రజల కపాయము చేయుచు నెవ్వరికిని బట్టుపడక యుండుటచే వానినిఁ బట్టగలవానికి దన కూఁతునిచ్చి వివాహము చేయుదునని రాజు ప్రకటించెను. శ్రీకృష్ణుఁ డా వృషభములను వధించి నాగ్నజితిని పరిణయ మయ్యెను. ఈమె శ్రీకృష్ణుని యష్టభార్యలలో నొకతె.

నాచికేతుఁడు:–వాజశ్రవసుని కుమారుఁడు. వాజశ్రవసుఁడు తన భాగ్యమంతయు నంద ఱకును బంచిపెట్టెను. అపుడు తండ్రీ! నన్నెవరి కిచ్చెదవు? అని నాచికేతుఁ డడిగెను. తండ్రి బదులు చెప్పలేదు. ఇతఁడు మరల నడుగుటచేఁ దండ్రికిఁ గోపమువచ్చి నిన్ను యమున కిచ్చెద నని తండ్రిచెప్పెను. యమునకు నేను జేయ వలసినదేమి కలదని నాచికేతుఁడు తలపోసెను. నాచికేతుఁడు నిశ్చేష్టుఁడై పడిపోయెను. యముని సదనమునకుఁ జనియెను. కాని యచ్చట యముఁడులేడు. అతఁడు మూడు దినములైన పిదప వచ్చి నాచికేతుని జూచి నీవు నా యింటి కతిథిగవచ్చి సత్కరింపఁబడక మూడుదినము లుంటివి; కావున నీకు మూడు వరము లిచ్చెదను. గోరుకొనుమనెను. నాతండ్రి శాంతుఁడై నేను మరల నీచేఁబంపబడినపిమ్మట నాయం దాదరము గలిగియుండునట్లు చేయుము. నాకగ్నిని గుఱించియు, మరణానంతరమునందలి యవస్థను గూర్చియుఁ జెప్పుమని కోరి కొంతజ్ఞానము వడసి మరలఁ దనగృహమునకు వచ్చెను.
కఠో. ఉ.

నాచికేతుఁడు:– ఔద్దాలకి యను మునిపుత్త్రుఁడు. ఔద్దాలకి స్నానముచేసి నదియొద్దను దర్భలు, జలకలశము మఱచివచ్చెను. వీనిని దీసికొని రమ్మని కుమారునితోఁ జెప్పెను. నాచికేతుఁడు వెళ్ళునప్పటికవి జలములోఁ గొట్టుకొనిపోయెను. అవి కనబడలేదని యితఁడు తండ్రితోఁ జెప్పెను. ఔద్దాలకికిఁ గోపమువచ్చి నీవు యముని దర్శింపు మని శపించెను. నాచికేతుఁడు విగతచేష్టుఁడై పడిపోయెను. ఔద్దాలకి మిక్కిలి చింతనొందెను. ఆ మరునాఁ డుదయమున లేచి నాచికేతుఁడు యముని దర్శించితి ననియును, యముఁడు తనను వాహన మెక్కించి భోగయోగ్య పదార్థములు మహారాసులైయున్న పుణ్యలోకములు చూపించె ననియును, నవి గోదానములు చేసినవారికి లభ్య మగునని తెల్పెననియును జెప్పెను. భార.

నాడీజంఘుఁడు:–ఒక బకము. ఇతనికి రాజధర్ముఁ డనియును పేరు కలదు. ఈ బకము బ్రహ్మకు మిత్త్రుఁడు. గౌతముఁడను బ్రాహ్మణుఁడొకఁడు దుర్మార్గుఁడై స్వధర్మమునువీడి బోయవనితను బెండ్లాడి మద్యమాంసములు భక్షించుచు ధనము కొఱకు వర్తకులతోఁ దిరుగుచుండెను. వీఁడొక నా డరణ్యములోఁ బోవుచున్నప్పుడు మత్తకరి యొకటి తఱుముకొనిరాఁగాఁ బరుగిడి మఱ్ఱిచెట్టు క్రింద దాఁగుకొనియెను. అది నాడీజంఘుని గృహము. డస్సియున్నవానిని గౌరవించి భోజ నముపెట్టి "నాయొద్ద ధనములేదుగాని మధుధ్రజ పురమున విరూపాక్షుఁడను దనుజుఁడు నా మిత్త్రుఁడు కలఁడు. ఆతని కడకుఁ బొమ్ము. ధనమిచ్చు" నని చెప్పెను. ఆ బ్రాహ్మణుఁడు విరూపాక్షునికడకుఁ బోయెను. దనుజుఁ డీతనిని జూచి తుచ్ఛుఁడగుటయెఱింగి ధన మివ్వదలఁచు కొనలేదు. కాని మిత్త్రుఁడగు నాడీజంఘునిమాట దీసివేయలేక యిచ్చిపంపెను. అతఁడిచ్చిన ధన మంతయు మోసికొని బ్రాహ్మణుఁడు తిరిగి నాడీ జంఘునికడకువచ్చి భార మచ్చటదింపి నిదుర పోయెను. వానిశ్రమ వాయుటకై యా బకము ఱెక్కలతో విసరి తానుగూడ నిదురించెను. ఆ బకముశరీరము బ్రొవ్వియున్నది. మఱునాటికి మంచి భోజనమగునని తలంచి అంత బ్రాహ్మ ణుఁడు లేచి నిద్రపోవుచున్నబకమును చంపెను. దానిని దినెను. విరూపాక్షునకు మది వికల మయ్యెను. మరునాఁడు విరూపాక్షునికడకు

యథాప్రకారము నాడీజంఘుఁడు రాకుండుటచే విరూపాక్షుఁడు దూతలనుబంపి బకమును జూచి రమ్మనియెను. వారు వచ్చి బకము చంపఁబడి యుండుట చూచి దనుజునితోఁ జెప్పిరి. అతఁ డా బ్రాహ్మణునిఁబట్టితెప్పించి వాఁడు చేసినది దోషమనియే ఎఱింగి వానిని భక్షింపుఁడని యానతిచ్చెను. వాఁడు కృతఘ్నుఁడు గాన వాని మాంసమును ముట్టమనిరి. శునకములుకూడ తిరస్కరించెను. విరూపాక్షుఁడు తనమిత్త్రునికళేబరము చితిపైఁ బెట్టించెను. ఇంతలో నింద్రుఁడు వచ్చెను. నామిత్రుని నాకిప్పింపుమని విరూపాక్షుఁడు దీనుఁడై వేఁడెను. కాని నాడీజంఘుఁడు బ్రహ్మకు స్నేహితుఁడగుటచే బ్రహ్మ గొనిపోయెనని యింద్రుఁడు చెప్పెను. ఆ చితికి సమీపమున సురభి తన దూడకుఁ బాలిచ్చుచుండఁగ దూడమూతినుండి పాలనుఱుఁగు చితిపైఁబడెను. తోడనే నాడీజంఘుఁడు లేచివచ్చెను. అది బ్రహ్మప్రభావమే యని వారు తెలిసికొనిరి. నాడీజంఘుఁ డపుడు బ్రాహ్మణునకుఁ గావింపఁబోవు దండనము నెఱింగి వానిని మన్నింపుఁడని ఇంద్రాదులను బ్రార్థించెను. బ్రాహ్మణునకు ధనమిచ్చి పంపిరి. నాడీజంఘుఁడును, నతని మిత్త్రుఁడును సుఖంబున నుండిరి. భార.

నాభాగుఁడు:-ధృష్టుని(దిష్టుని)కుమారుఁడు. ఇతఁడు కర్మవశమున వైశ్యత్వము నొందెను. ఇతని పుత్త్రుఁడు హాలంధనుఁడు. ఇతఁడొక వైశ్యకన్యకను సుప్రభ యనుదానిని వరించి యామె తండ్రి కడకుఁ బోయి సుప్రభను దన కిమ్మని కోరెను. నీవు క్షత్రియుఁడవు. వైశ్యకన్యకను గైకొనఁ దగదని యతం డనినను నాభాగుఁడు వినలేదు. అపు డా వైశ్యుఁడు మన యిద్దఱకును నేలిక యగు నీతండ్రి కలడుకదా! అతని యిష్టానుసారము సేయుదమనియె. వారు రాజుకడ కేగిరి. తమ వివాదము తెల్పిరి. ధృష్టుఁడుకూడ ఆ వివాహము వలదనెను. కాని నాభాగుఁడు రాక్షస వివాహమున సుప్రభను దెచ్చెను. ఆమెతండ్రి రాజుతో ఆసంగతి చెప్పుకొనియెను. ధృష్టుఁడు కొంతసేననంపి తుదకుఁ దానుగూడవచ్చి కుమారునితో యుద్ధము సేయుచుండెను. ఆ సమయమునఁ బరివ్రాజుఁడను ముని వచ్చి అనులోమ వివాహ మంగీకరింపవచ్చుననియును, కోమటి వనితను బెండ్లి యాడుటచే నాభాగుఁడును గోమటి యయ్యెనుగాన క్షత్రియుఁడగు ధృష్టుఁ డతనితో యుద్ధము సేయరాదనియును జెప్పెను. అంత యుద్ధమును మానిరి. నాభాగుఁడు తండ్రి యాజ్ఞవలన వైశ్యవృత్తులనే యవలంబించెను. అతనికి సుప్రభవలన భనందుఁ డను పుత్త్రుఁడు కలిగెను. భనందుఁడు తన పినతండ్రి కుమారుఁడైన వసురాతుని జయించి, రాజ్యమును గైకొని తండ్రికడకు వచ్చి యా రాజ్యము నేలుమని కోరెను. వైశ్యుఁడనైన నాకు రాజ్యపరిపాలనము తగదని నాభాగుఁడు చెప్పెను. అపుడు సుప్రభ తానుగాని, తనతండ్రిగాని వైశ్యులము కామనియును, శాపవశమున వచ్చిన వైశ్యత్వము భనందుఁడు యుద్ధములో గెలిచిన తోడనే పోయెననియుఁ జెప్పి వీరి పూర్వవృత్తాంతముల నెఱుకపఱచెను. అయినను నాభాగుఁడు తన పుత్త్రునకే పట్టమును గట్టెను. మార్క.

నాభాగుఁడు:- మనువుకుమారుఁడైన నభగుని తనయుఁడు. ఇతఁడు బ్రహ్మచారిగనుండి తన తోఁబుట్టినవారిని ధనముపంచి తన భాగమిమ్మని కోరెను. తండ్రిచెప్పినవిధమున నిత్తుమని సోదరులనిరి. నాభాగుఁడు తండ్రికడకుఁ జని యడుగఁగ నతఁ డిట్లనెను. అంగీరసులు మేధగలవారయ్యును సత్త్రయాగంబు చేయుచు నాఱవ దినంబున అర్హకర్మములు తోపక మూఢులయ్యెదరు. నీవు వైశ్యదేవసూక్తంబులు రెండెఱింగించి కవి అని ప్రసిద్ధిని గాంచెదవు. వారు సంతోషించి సత్త్రపరిశేషితంబైన ధనంబును నీకిత్తురు అని చెప్పెను. ఆ ప్రకారము జరిగెను. కాని ఇతఁడు ఆ ధనము తీసికొనఁబోవుచుండఁగా నొకనల్లనిరూపువాఁడు ఆ విత్తమును తీసికొనుచుండెను. మునులు నా కిచ్చిన ధనమును నీవేల తీసికొందువు? అని యితఁ డడుగఁగ మీతండ్రిజెప్పినట్లు చేయుట యుక్తమని ఆపురుషుఁడుచెప్పెను. నాభాగుఁడు మరలఁ దండ్రికడకువచ్చి యడిగెను. యజ్ఞమందిర గతంబైన ధనమును మునులు మొదట రుద్రున కిచ్చిరి. ఆకారణమున ధనము ఆ దేవునిది అని చెప్పెను. నాభాగుఁడు మరలివచ్చి యా పురుషునకు నమస్కరించి ధనము నాదికాదు. తీసికొనుమని

చెప్పెను. నభగునియొక్కయు, నాభాగుని యొక్కయు సత్యప్రియత్వంబునకు మెచ్చి యీశ్వరుఁడు అంతర్థిత్వము, బ్రహ్మజ్ఞానము కలుగునట్లు వరమిచ్చి ఆ ధనమిచ్చి తాను అంతర్హితుం డయ్యెను. నాభాగుని కుమారుఁడు అంబరీషుఁడు. భాగ.

నాభావరుఁడు:-శ్రుతునిపుత్త్రుఁడు. ఇతని కుమారుఁడు సింధుద్వీపుఁడు. భాగ.

నాభి:-ఒకరాజు. ఆగ్నీధ్రుని పుత్త్రుఁడు. ఇతఁడు హిమాలయపర్వతమునకు దక్షిణముననున్న దేశమును బరిపాలించెను. నాభి సంతానముకొఱకు తపస్సుచేయఁగ విష్ణువు ప్రత్యక్షమై తానే యితని పుత్త్రుఁడుగ జన్మించెదనని చెప్పెను. నాభిభార్య సుదేవి (మేరువు). ఆమెయందు విష్ణువు వృషభుఁడను పేరుతో (ఋషభుఁడను పేరుతో) జన్మించెను. ఋషభుని ప్రభావమున కీర్ష్యచెంది యింద్రుఁడు నాభిరాజ్యమున ననావృష్టి కలుగఁజేసెను. కాని ఋషభుఁడు తన ప్రభావముచే వర్షమును గురిపించెను. నాభి మనుమఁడే భరతుఁడు. భాగ. విష్ణు.

నాభి:-మేరుదేవియందు విష్ణుమూర్తియే ఉరుక్రముఁడను పేరున జన్మించి విద్వజ్జనులకుఁ బరమహంస మార్గము వెల్లడించెను. భాగ.

నారదుఁడు:- బ్రహ్మయొక్క కంఠదేశమందుఁ బుట్టినవాఁడు. బ్ర. వై.

నారదుఁడు:-విష్ణుమూర్తియే నారదుఁడను దేవర్షియై కర్మనిర్మోచకంబైన వైష్ణవతంత్రము చెప్పెను. భాగ.

నారదుఁడు:- బ్రహ్మపుత్త్రుఁడు. బ్రహ్మతొడనుండి పుట్టినవాఁడు. ఇతనికి సంతానముగాని, సంసారముగాని లేదు. ఇతని కొకచోట నిలుకడయు లేదు; ఇందుకు దక్షునిశాపము గలదు. ఇతఁడు మహతి యను తనవీణపై సదా విష్ణుగానము చేయుచుఁ ద్రిలోకములు సంచరించుచుండును. ఆయాదేశముల వార్త లెఱుంగుచుఁ గావలసిన వారికి తోడైన యుపకారము చేయుచుండును. ఆపదలో నున్నవారికి భగవద్విలాసమెఱుకపఱచి వారి చిత్తమునకు శాంతి కలుగఁ జేయుచుండును. అకంపనుఁడు పుత్త్రుఁడు పోవుటచే నేడ్చుచుండఁగ నారదుఁ డతనికడకుఁ బోయి మృత్యువుప్రకారం బెఱింగించి వాని దుఃఖము పోఁగొట్టెను. సృంజయునకు షోడశ రాజుల చరిత్రమును జెప్పి వానివిచారము నాపి వాని పుత్త్రుని బ్రతికించి తెచ్చి యిచ్చెను. లీలావతి నింద్రుఁడు సంహరింపఁబోగా నితఁడు వచ్చి యామె గర్భమునఁ బెరుగు బాలుఁడు భగవద్భక్తుఁడగుట తెల్పి యామెను గాపాడెను. ధర్మరాజున కవసరమైనచో వచ్చి హితవులు బోధించెను. రామలక్ష్మణులు ఇంద్రజిత్తుయొక్క నాగాస్త్రముచే బంధింపబడఁగ నారదుఁడువచ్చి గరుత్మంతుని స్మరింపుఁడని బోధించెను. ఇట్లే నారదుఁడనేకుల కుపకారము చేయుచువచ్చెను.

ఈ ఋషి తాను వినినవాక్యము నొరులకుఁ జెప్పకుండ నుండలేఁడు. విష్ణువు రామావతార మెత్తఁబోవుట వాల్మీకి కితఁడే చెప్పెను. ఒకరిమాట యొకరివద్ద చెప్పుటవలన వైరములు కలుగుచుండును. అదియు నితని కానందమే. కలహములు కల్పించుటలో నీతనిని మించినవాఁడింకొకఁడులేఁడు. కలహభోజనుఁడనియే యీతనికిఁ బేరుకూడవచ్చినది. అయినను దగవులమారి యని యితని నెవ్వరునుగౌరవముచేయరు. ఇతఁడు కలుగఁజేయు తగవులును లోకహితమే యగుచుండును. జలంధరాసురుని దేవతలు జయింపలేకపోయిరి;వారునారదునితోఁ జెప్పికొనిరి. ఇతఁడు తగిన యుపాయ మాలోచించెదనని వారినిబంపి తిన్నగ జలంధరునికడకువెళ్ళెను. వానిని స్తుతించెను. అశ్వరత్నము, గజరత్నము, సౌధరత్నము అన్నియును గలవు. కాని నీకు జాయారత్నము లేనిలోటు కలుగుచున్నదని వానికిఁ జెప్పెను. ఎట్లు లాలోపము పూర్తిచేయవచ్చు? నని జలంధరుఁ డడిగెను. శ్మశానములోనుండు శివునకు పార్వతియేటికి? ఆమెనుబట్టుమని నూదించెను. జలంధరుఁడుపార్వతికై యాశపడిపోయెను.దానివలన శివుఁడు జలంధరునితో యుద్ధము చేయవలసి వచ్చెను. ఆ యుద్ధములో జలంధరునికి మరణము వచ్చెను.

గరుడునియొద్దకుఁ బోయి నీబలమెచ్చుట? సర్పము లెచ్చట? నీతల్లి వారికి దాసియై

యుండఁగఁ జూచుచు నూరకుందువా ? యని గరుడునితోఁ జెప్పెను. ఉతథ్యుని భార్యను వరుణుఁ డెత్తికొనిపోయెను. అది నారదుఁ డెఱింగి "నీభార్యను వరుణుఁ డెత్తుకొనిపోయెను. తెచ్చుకొను" మని చెప్పెను.

కాలయవనుఁడను మ్లేచ్ఛరాజు, బలాఢ్యుఁడై గర్వించియుండెను. శ్రీకృష్ణుఁడు మొదట జరాసంధుని నోడించినపిమ్మట నారదుఁడు యవనుని కడకువచ్చి "శ్రీకృష్ణుఁడు జరాసంధు నోడించి దర్పించియున్నాఁడు. నీవు వానినెఱుంగవా ? లేక భయపడి యూరకుంటివా ?" అని మధురపై దండెత్తుటకుఁ బ్రోత్సాహముచేసెను." దాని మూలమున యవనుఁడు ముచికుందునిచేఁ జంపఁబడుట తటస్థించెను. భాగ.

నారదుఁడు రావణునికడకువెళ్ళెను. రావణుఁ డాదరించి యేమి విశేషము ? అని యడిగెను. రావణా! నీవునరులను గెల్చితివి; దానివలన నేమి శ్రేయస్సువచ్చును? దేవతలును, వారిలో యముఁడును గర్వించి యున్నారు. వారిని నోడఁగొట్టుమని చెప్పి రావణునికంటె ముందుగా యముని కడకుఁ బోయి, చూచితివా రావణుని గర్వము ! వాఁడు నీపైకి యుద్ధమునకు వచ్చుచున్నాఁడు. వాని పీచ మణఁగఁగొట్టుమని చెప్పెను.

మహిషాసురునివలన బాధ యెక్కువగ నుండుచుండెను. వానిని దేవత లోడించలేక పోవుచుండిరి.- నారదుఁడు మలయపర్వతముననున్న నారాయణీకడకుఁబోయి, వింటివా మహిషుని కావరము ! వాఁడు నిన్ను వివాహమగునఁట. వానిని సంహరింపుమని చెప్పెను. అచ్చటనుండి మహిషునికడకు వచ్చి, ఓయసురరాజా! మలయ పర్వతముపై నుండిన నారాయణిని జేపట్టని నీయావనము యావనమా ? ఎటులైన నామెను వివాహమగుమని చెప్పెను. మహిషాసురుఁడు తనను వివాహ మగుమని యామెకు వర్తమానముచేసెను. తుదకు నిద్దఱికిని యుద్ధమయ్యెను. దేవి మహిషాసురుని సంహరించెను. వరా.

ఒకనాఁడింద్రసభలో రంభాదులు నృత్యము చేయుచుండఁగ నారదుఁ డచ్చటికి వెళ్ళెను. కొంత సేపైనపిమ్మట నింద్రుఁడు నారదునిఁ జూచి మునీంద్రా ! ఎవరిగానము నీ కింపుగ నున్నది ? యని యడిగెను. ఎవ్వతె హావభావములతో విజృంభించునో దాని సంగీతము బాగుండునని నారదుఁడు చెప్పెను. అంత నే నెక్కువ యని, నే నెక్కువయని యప్సరసలు వాదించుకొనిరి. ఎవరెక్కువయో నారదుఁడే నిర్ణయింపవలెనని యింద్రుఁడు పలికెను. దుర్వాసుని నెవ్వతె చలింపఁజేయఁగలుగునో యది యెక్కువ యని నారదుఁడు పలికెను. అంత వపువు అను వనిత నేను జలింపఁజేసెదనని పోయెను.

మార్క.

కౌశికుఁడనువాఁడు స్వర్గమున గానమును జేయుచుండఁగా లక్ష్మియును, బరిచారికలును, మునులును, నారదుఁడు, తుంబురుఁడు మొదలగువారును వచ్చిరి. పరిచారికలు దూరముగఁ దొలఁగుడని బెత్తములుపుచ్చుకొని వారిని దొలఁగఁజేసిరి. లక్ష్మి తుంబురునిబిలచి కౌశికునితోఁగలసి గానము చేయుమని వానికిఁ బారితోషిక మిచ్చెను. దాన నారదుఁడు అవమానపడి లక్ష్మిపైఁగోపించి దనుజగర్భమునఁ బుట్టుమనియును, దనుజులచే నామెయు నిట్లే శిక్షింపఁబడుననియును శపించెను.

విష్ణు వీతని నూరడించి భక్తిగానమునుజేయుటచేఁ దుంబురునకుఁ బ్రభావముకల్గిన దనెను. నీకును గావలెనన్న మానసోత్తర యను పర్వతముపై గానబంధుఁడు అను గూబ గలదు. దాని కడకేగి గానమును నేర్చుకొమ్మని చెప్పెను. అతఁడు వెళ్ళి దానివలన శిక్షితుఁడై తుంబురుని కడకువచ్చి తుంబురునితోసముఁడుకాక అతనిపై ననూయకలిగి విష్ణుమూర్తికడకుఁ బోయెను. అంత విష్ణుమూర్తి తాను శ్రీకృష్ణుఁడుగ జన్మించినపుడు నీకు గానమును నేర్పెదననియెను.

శ్రీకృష్ణావతారమున నారదుఁడు వానిసేఁజేరి నాకు గానమును నేర్పుమనెను. ఒక సంవత్సరము జాంబవతియొద్ద నేర్చుకొమ్మని శ్రీకృష్ణుఁడు చెప్పెను. పిదపఁ దక్కిన భార్యలందఱి యొద్దను నొక్కొక్క సంవత్సరము చొప్పున నేర్చుకొని యప్పటికిని గానకౌశలము పొంద నేరక తుట్టతుదకు శ్రీకృష్ణునిచే శిక్షితుఁడై, కుశలుఁడై, యీర్ష్యతొలంగిసుఖముగా నుండెను.

అద్భుతరామాయణము.

తండ్రి పంపున దక్షునికుమారులు సృష్టి చేయఁ బూనియుండిరి. ఇంతలో నారదుఁడు వారినిఁ జేరి మీరు ముక్తిసాధనము చింతింపక సంసారములో నేల దిగుదురు? అని బోధించి వారిచే సృష్టిచేయుట మాన్పించెను. నారదుని వలనఁగలిగిన విఘ్నము దక్షునకుఁదెలిసి యతఁడు బ్రహ్మతోఁ జెప్పెను. నారదుఁడు మరల దక్షునిపుత్రికయందు జన్మ మొందునని బ్రహ్మ శపించెను. నారదున కొక్కచో నిలుకడలేకుండ బోవుఁగాక యనియు, వనపత్యుఁడగు ననియు దక్షుఁడుకూడ శపించెను.

నారదుఁడు:- దక్షుఁడు ప్రియయను తనపుత్రికను బ్రహ్మకిచ్చెను. ఆమెయందు నారదుఁడు జన్మించెను.

సృష్టిని జెంపు చేయుమని నారదునితో బ్రహ్మ చెప్పెను. కాని నారదుఁడు సంసారములో నిమగ్నుఁడనై యుండజాలను. మోహబంధనములు నాకేల? నేను సృష్టి సేయఁజాలనని తిరస్కరించెను. బ్రహ్మకుఁ గోపమువచ్చి నీవు కాముకుఁడవై, స్త్రీలోలుఁడవై శూద్రయోనింబుట్టుమని శపించి బ్రాహ్మణ సంపర్కంబున విష్ణుభక్తికలవాఁడ వగుదువని యనుగ్రహించెను. నారదునకును గోపమువచ్చి నీకుఁ బూజాకవచములు లేకుండఁ బోవుగాక యని బ్రహ్మకుఁ బ్రతిశాప మిచ్చెను. బ్ర. వై.

నారదుఁడు:- పూర్వమహాకల్పమున ఉపబర్హణుఁడు అను గంధర్వుఁడు; బ్రహ్మలు దేవసత్రమనెడి యాగముచేయుచు నారాయణుని కథలు గానము చేయుటకై యప్సరసలను, గంధర్వులను బిలిచిరి. ఉపబర్హణుఁడుకూడ వెళ్ళి గంధర్వులతోఁ గలసి పాడక, కామినీజనములోఁ గూడియుండుటచే విశ్వస్రష్టలు నీవు శూద్రయోనిం బుట్టుమని శపించిరి. ఆ శాపమువలన నారదుఁడు బ్రాహ్మణునింటి దాసికిఁ బుత్త్రుఁడుగఁబుట్టెను.

నారదుఁడు:- తొల్లిటి జన్మమున వేదవాదుల యింటి దాసికిఁ బుట్టినవాఁడు. చాతుర్మాస్యంబున నేకస్థలనివాసము చేయుచుండిన మునులకుఁ బరిచర్య చేయుచుండువాఁడు. చిన్ననాఁటి నుండియు వారినే యనుసరించి యుండుటచే వానికిఁ గొంత బ్రహ్మజ్ఞానము కలిగెను.

ఆతని తల్లి పాలు పిదుకుచుఁ బాముకఱచి చనిపోయెను. అట్లు సంసారబంధనము తెగుటచే నారదుఁడు సంతోషమునే చెంది యుత్తరాభిముఖుఁడై యేగి మహారణ్యముఁ జేరి యచ్చట నీశ్వరుని గూర్చి చింతించుచుఁ గూర్చుండెను. ఈశ్వరుఁ డెదుట నిలచెనుగాని నారదుఁడు చూడలేకపోయెను. తరువాత నీశ్వరునిరూపమిట్టిదని మనస్సునందు నిల్పుకొనఁ జూచెను కాని యదియును సాధ్యము కాలేదు. "మునిముఖ్యులు చూడఁగల్గు మారూపు నీవు జూడఁజాలవు. ఈ సృష్టి లయము చెందును; అపుడు నీవీశరీరము విడిచి మీఁదటిజన్మమున మా యనుమతినిబుట్టి మా రూపమును జూడఁగల్గుదువు" అను ఈశ్వరవాక్యమును వినెను. కొంతకాలమునకుఁ బ్రళయము వచ్చెను. నారదుఁడు కర్మస్వరూపమైన యాదేహమును విడిచి హరికృపావశమున శుద్ధసత్వమయంబైన దేహంబు దాల్చి నారాయణమూర్తియందు నిదురవోవ నిచ్ఛగించు బ్రహ్మ నిశ్వాసమువెంట నతని లోపలఁ బ్రవేశించి, బ్రహ్మ ప్రాణమువలన మరీచి మొదలగు మునిముఖ్యులతోఁ బుట్టెను. భాగ.

నారదుఁడు:-ఒక జన్మమున నితఁడు సారస్వతుఁడను బ్రాహ్మణుఁడు. సంసారభారము పుత్త్రునిపైఁబెట్టి వనమునకేగి తపస్సు చేసెను. విష్ణుమూర్తి ప్రసన్నుఁడై వరము వేఁడుకొనుమనఁగ నితఁడు విష్ణుమూర్తి సాయుజ్యమునే యపేక్షించెను. నాతరువాత సుంతువాఁడు బ్రహ్మ; నీవు బ్రహ్మకుజన్మించి నా సాయుజ్యమును బొందఁగలవు. నీవు ఇతరులకు "నారము=నీరు సదా యిచ్చుచుండుటచే నారదుఁడ వనఁబరగుదువు" అని విష్ణువు పలికెను. వరా.

నారదుఁడు:- శ్వేతద్వీపమును జూడఁబోయెను. అచ్చట మన్మథాకారులు పలువురు గోచరించిరి. వారిలో విష్ణువెవరో గుర్తింపఁజాలక నారదుఁడు విష్ణుమూర్తిని బ్రార్థించెను. అతఁడు ప్రత్యక్షమై వరము వేడుకొమ్మనఁగ నాకు విష్ణుమాయ దెలియఁగింపుమని కోరెను. విష్ణుఁడు సరేయని నారదుని దాపుననున్న కొలనులో మునిఁగి రమ్మనియె. నారదుఁడు మునిఁగెను; లేచి వచ్చెను. అతఁడు స్త్రీయయ్యె; చారుమతి యను పేరఁ గాశిరాజు కూఁతురుగఁ బుట్టెను. శిబిని వివాహ మయ్యెను.

నగ్నజిత్తి, విప్రజిత్తి, విచిత్తి, చారువక్త్రుఁడు, చిత్రుఁడు అను పుత్త్రులు పుట్టిరి. ఈ పుత్త్రులు తండ్రితోఁ గలసి యుద్ధములు చేయుచు దేశాధిపతులను గెలుచుచుండిరి. తుదకుఁ గాశిరాజుచే వీరందఱును హతులైరి. చారుమతి మిక్కిలి చింతించుచు భర్తృ పుత్త్రవిహీనయై శోకము పొందుచుఁ జితిఁబేర్చి యందుఁ బడఁబోగాఁ బూర్వరూపమున నారదుఁ డయ్యెను. నారదుఁడు మిక్కిలి యాశ్చర్య మొంది యిది కలయా ? యని విభ్రాంతి నొంది, వితర్కించి యిది విష్ణుమాయ యని గ్రహించెను. శరా.

నారదుఁడు వచ్చుచుండుటను జూచి శ్రీవిష్ణుమూర్తి ప్రక్కనున్న లక్ష్మి యటనుండి తొలఁగెను. నేను వృద్ధతపస్విని. నన్నుఁజూచి యీమె తొలఁగుటేల ? యని నారదుఁడు ప్రశ్నించెను. పరపురుషులను జూడకయుండుట మంచిదికదా ! మాయ యెంతయేనిఁ జేయించు నని శ్రీవిష్ణు వనెను. నీ మాయాప్రభావమును జూపుమని నారదుఁడడుగ వీనిని గరుడునిపై నెక్కించుకొని కొంతదూరము పోయి కన్యాకుబ్జమువద్ద దిగి యటనున్న కొలనులో స్నానమును జేయుమనియెను.

నారదుఁడు:- కొలనులో దిగి బైటకు వచ్చునప్పటికి సుందరాకారయగు స్త్రీ యయ్యెను. అటనుండి శ్రీవిష్ణువు వెడలిపోయెను. ఈమెను తాళధ్వజుం డను రాజు చూచి మోహించి తన నగరమునకుఁ గొనిపోయెను. తనకు రాణినిఁగఁ జేసికొనెను. ఈమెకుఁ బుత్త్రులు కలిగిరి. కొన్ని సంవత్సరము లయినపిదప శత్రురాజు లీతని దేశముపైఁ బడిరి. వీరిచేఁ బుత్త్రులు సంహరింపఁబడిరి. అందుచే నీమె మిక్కిలి విలపించుచుండె. అప్పుడు శ్రీ వి ష్ణు వు వృద్ధబ్రాహ్మణరూపమున వచ్చి పుత్త్రాదులు నిత్యముకాకపోవుట తెలిపి బోధించి తనవెంట రమ్మని తీసికొనిపోయి కొలనులో స్నానమునుజేయు మనియెను. అంత నతనికిఁ బూర్వపురూపు వచ్చెను. అప్పుడు నారదుఁ డది తెలిసికొనెను. ఎదుట నున్న శ్రీవిష్ణువును గాంచి యీతని మాయామాహాత్మ్యమని గ్రహించెను.
దే. భా.

నారదుఁడు:-హిమాలయపర్వతముపైఁ దపసు చేసికొనుచుండగఁ దపోభంగము చేయుటకై యింద్రుఁడు దేవకన్యలను బంపెను. కాని నారదుఁడు శివారాధన చేసెనుగాన శివప్రభావముచే నతనిమనస్సు చలింపకుండెను. అందువలన నారదునకు గర్వమువచ్చినది. తన మహిమవలననే మన్మథుని గెల్చితి ననుకొనుచుండెను. ఇతఁడు తపస్సు ముగించి శివుని దర్శించి, బ్రహ్మను, విష్ణుమూర్తిని జూడవచ్చెను. విష్ణువు శివుని మాహాత్మ్యమెన్నినను నారదుఁడు తన ప్రభావమువలననే కామమును జయించితినని చెప్పికొనుచుండెను. ఇతఁడు విష్ణువును దర్శించి వెళ్ళునపుడు విష్ణువు మార్గమం దొక నగరమును నిర్మించి యందు మిక్కిలి సౌందర్యవంతురాలగు శ్రీమతియను సుందరాంగిని సృజించెను. నారదుఁడామెను జూచి యామెస్వయంవరమున కేగుటకై హరికడకు వచ్చి యతని రూపమును తన కిమ్మని కోరెను.

నారదుఁడును, బర్వతుఁడును దేశాటనము చేయుచు నంబరీషునినగరమునకువచ్చి యీతనిచే సమ్మానింపఁబడి యీతని గృహమున సుందరగాత్రి యగు నతనికుమారిత శ్రీమతిని జూచిరి. ఆ బాల యెవ్వ ? రని యడిగిరి. అంబరీషుఁడు తన కుమారిత యని చెప్పెను. ఆమెను దమ కిమ్మని కోరిరి. ఇఱువుర కిచ్చు టెట్లు ? మీలో నొక్కరికి నామె వరించినవానికిత్తునని యంబరీషుఁ డనియె. శ్రీమతి కొకనాఁడు స్వయంవర మేర్పఱచిరి. అంతకుఁబూర్వమే నారదుఁడును, బర్వతుఁడును నొకరికిఁ దెలియకుండ నొకరు విష్ణుమూర్తికడ కేగిరి. నారదునిముఖమును గోతిముఖముగఁ జేయుమని పర్వతుఁడును, పర్వతుని ముఖము కోతిముఖముగఁజేయుమని నారదుఁడును గోరిరి. విష్ణుమూర్తి వారు కోరినట్లుచేసెను. వీరు స్వయంవరమునకేగిరి. విష్ణుమూర్తికూడ వెళ్ళెను. వీరిద్దఱి కోతిముఖములను జూచి యచ్చటివారు నవ్విరి. శ్రీమతి దివ్యసుందరరూపుఁడగు విష్ణుమూర్తిని వరించెను. ఆమెను విష్ణుమూర్తితీసికొని వెళ్ళెను. పర్వతనారదులకుఁ గోపమువచ్చినది. తమకిచ్చెదనన్న బాలను నన్యుల కేలయిచ్చితి ? వని యంబరీషుని నీవుతమోమయుఁడవు కమ్మని శపించిరి. అంత విష్ణుమూర్తిచక్రమువచ్చి వారిని దఱిమెను. వారు స్వర్గలోకమునకుఁ బాఱిపోయిరి. విష్ణుమూర్తి యింటికడ శ్రీమతిని జూచిరి.

మా ముఖములు వానరముఖములుచేసి మేము వలచిన కన్యను నీవు తెచ్చుకొంటివి. నీవు నరుఁడవై వియోగదుఃఖము ననుభవించెదవు గాక; తుదకు వానరుల సహాయముననే నీ భార్యను బడయఁగల్గుదువు" అని వీరు విష్ణువును శపించిరి. విష్ణువు శివునిప్రభావముచే నట్లయ్యెనని నారదునితోఁ జెప్పి యంతర్ధానము నొందెను. వీరిశాపమువలననే విష్ణువు రామావతారమున భార్యావియోగము నొందుటయును, వానరుల సహాయమున నామెను మరలఁ బొందుటయును దటస్థించెను. లింగ. శివ.

నారదుఁడును, నతని మేనల్లుఁడగు పర్వతుఁడును త్రిలోకసంచారము చేయుచు నొకరి హృదయములో నున్నది యొకరు దాఁచక రెండవవారికిఁ జెప్పుటకును, చెప్పనివాఁడు శపించుటకు నొడంబడి చనిరి. వారిద్దరును సృంజయుఁడను రాజుకడకు వచ్చిరి. అతని కుమారిత సుకుమారిని వీరలకుఁ బరిచర్య చేయుటకై రాజు నియోగించెను. ఈమెను నారదుఁడు వలచెను. కాని సిగ్గుపడి పర్వతునితో నది చెప్పలేదు. ఇతనిహృదయములోని కోరిక పర్వతునకుఁ దెలిసి నీవు నాతోఁ జెప్పక దాచియుంచితివి కాన నీవీమెను బరిణయమైన పిదప నీ ముఖము వానరముఖ మగుఁగాక యని శపించెను. నారదునకుఁ గోపమువచ్చి నీవు నాకలోక సంచారము లేకపోవుఁగాక యని ప్రతిశాప మిచ్చెను. నారదుఁడు సృంజయు నడిగి సుకుమారిని వివాహమయ్యెను. కొంత కాలమునకు నారదుఁడును, పర్వతుఁడును గలిసికొనిరి. అన్యోన్యశాపవిమోచనమును గావించికొనిరి. నారదుఁడు తిరిగివచ్చునప్పటి కతని వానరముఖము మారి యుండెను. సుకుమారి యితనిని గుర్తింపలేక తనపతి కాఁడనుకొనియె; పర్వతుఁ డామెతో నాతఁడు నారదుఁడే యని చెప్పెను. భార.

కొంతకాలము పర్వతనారదులు సృంజయుని కడనుండి వెళ్ళఁబోవుచు వాని యుపకారము చేయఁగోరి వరమును వేఁడుకొనుమనిరి. మీ కృప కంటె వరము గలదే? యని సృంజయుఁడు పలికెను. నీకు దేవతలనుమించు పుత్త్రుఁడు కలుగునని నారదుఁడు వరమిచ్చెను. కాని వాని కాయుష్కాలము తక్కువయని వెంటనే పర్వతుఁడు పలికెను. రాజు దానికి దుఃఖించెను. అతనిపైనుండిన కరుణచే నారదుఁడు "ఇంద్రుఁడు నీ పుత్త్రునిఁ జంపును. అప్పుడు నన్నుఁ దలఁచుకొనుము. నీపుత్త్రు నిచ్చెద"ననియె. సృంజయునకు బుత్త్రుఁడు జన్మించెను. ఆ పుత్త్రుని నిష్ఠీవనాదులు సువర్ణమయంబులగుటచే సువర్ణష్ఠీవి యని వానికిఁ బేరు పెట్టిరి. వాని నిష్ఠీవనాదులు బంగారమగుచుండెను. వీని శరీరమంతయును బంగారమయమని దొంగలు వీనిని జంపి కోసిరి. సృంజయుఁడు నారదుని దలఁచుకొనెను; అతఁడు దొంగలు కావించిన దుండగము వెల్లడించి బాలుని బ్రతికించి యిచ్చెను. పిమ్మట నింద్రుఁ డసూయనుపొంది బృహస్పతి నాలోచన యడిగి తనవజ్రమును శార్దూలరూపమునఁ బంపి వనవిహారము చేయుచున్న యా బాలునిఁ జంపెను. వీనిని మరల నారదుఁడు బ్రతికించెను. భార.

నారాయణసరస్సు:-(తీర్థము) సింధునది సముద్రమును గలియుచోట నున్నతీర్థము.

ఇచ్చటనే దక్షునిపుత్త్రులగు హర్యశ్వులు, శబలాశ్వులు తపస్సుచేసిరి. భాగ.

నారాయణాస్త్రము:-ఒక దివ్యాస్త్రము. ఇది యమోఘము. దీనిని నెదిరించినయెడల సంహరించితీరును. దీనియెదుట అస్త్రసన్న్యాసము చేసి దీనికి నమస్కరించినయెడల నది విన్నకుండును. భారతయుద్ధములో అశ్వత్థామ ప్రయోగించెను. అర్జునునిచే శ్రీకృష్ణుఁ డస్త్రసన్న్యాసము చేయించెను. కాని భీముఁడు తెలియక యెదిరింపబోయెను. అప్పుడు కృష్ణార్జునులు భీముని యుద్ధమునుండి లాగికొని పెట్టిరి. భార.

నారాయణుఁడు:-విష్ణువు నారమందు శయనించియుండుటచే నీ పేరు వచ్చెను. (చూడుము నర నారాయణులు.)

నారాయణుఁడు:-అజామిళుని పుత్త్రుఁడు. భాగ.

నారికవచుఁడు:-ఒక రాజు. (చూడుము మూలకుఁడు.)

నారీతీర్థములు:- దక్షిణసముద్రతీరమందున్న తీర్థములు. అవి సౌభద్ర, పౌలోమ, కారంధమ,

ప్రసన్న, భారద్వాజము అని యైదు తీర్థములు. అందు సౌరభేయి, వంద, సమీచి, బుద్బుద, లత యను నప్సరసస్త్రీలు శాపవశమున మొసళ్ళై యుండిరి. జలచరము లుండుటచే నీ తీర్థము లందు స్నానముజేయుటకు భయపడుదురు. కాని యర్జునుఁడు భయములేక మొదట నొక దానిలోదిగెను. వానినొక మొసలి పట్టుకొనెను. అర్జునుఁడు దానినిలాగి బైటఁ బడవేసెను. శాప విమోచనమగుటచే మొసలి తన పూర్వ పు రూపము ధరించెను. అట్లే యర్జునుఁ డైదు మడువులయందున్న జలచరములకు శాపవిమోచ నమును గలుగఁజేసెను. భార.

నాలాయని:—చూడుము ఇంద్రసేన.

నాళీకజంఘుఁడు:—ఒక బకము. మార్కండేయుని కంటెను బెద్దది. దానికంటెను బెద్దది అకూపా రుఁడను తాఁబేలు. (చూడు నాడీజంఘుఁడు కూడ.)

ని

నికుంభుఁడు:—ఒక గణనాథుఁడు. ఈశ్వరుఁ డితని బిలిచి తాను కాశీనగరమునఁ గాపురముండఁ దలఁచితి ననియును, నుపాయముచే నా పురము నుండి తత్పురాధిపతియైన దివోదాసుని వెడలఁ గొట్టు మనియును జెప్పెను. నికుంభుఁడు వాని కుంభుఁడను బ్రాహ్మణుని కలలోఁ గనఁబడి కాశీనగరమున నీశ్వరునకు గుడి కట్టింపుమని చెప్పెను. ఆ బ్రాహ్మణుఁడు కాశీరాజైన దివోదాసునకుఁ దన కలవృత్తాంతము చెప్పెను. దివోదాసుఁడు గుడి కట్టించి, యీశ్వరప్రతిష్ఠను గావించి, యనుదినమును దేవుని నారాధించు చుండెను. కాని యతని కోర్కెలు సఫలము కాకపోవుటచే నితనికిఁ గోపమువచ్చి గుడి పగులఁగొట్టించెను. అందుకు నికుంభునకుఁ గోపమువచ్చినది. గుడి పగులఁగొట్టించెనను మిషచే కాశీనగరము నిర్జనప్రదేశమగున ట్లితఁడు శపించి పిమ్మట పార్వతీపరమేశ్వరుల నచ్చటికిఁ దోడ్కొనివచ్చెను. బ్రహ్మ.

నికుంభుఁడు:—కుంభకర్ణునికుమారుఁడు; యుద్ధమునకుఁ బూర్వము రావణాదు లాలోచించుకొను నపుడు రామునితోఁ దప్పక యుద్ధముచేయ వలెననియే యితఁడు చెప్పెను. రామా.

నికుంభుఁడు:—సుందోపసుందుల తండ్రి. హిరణ్య కశిపుని వంశమువాఁడు. భార.

నికుంభుఁడు:—హర్యశ్వుని కుమారుఁడు. ఇతని కుమారుఁడు బర్హిణాశ్వుఁడు.

నికృతి:—గాంధారి తోఁబుట్టువు. ఈమెనుగూడ ధృతరాష్ట్రుఁడు వివాహమయ్యెను. భార.

నిగమశర్మ:—పీఠికాపురమం దొక బ్రాహ్మణ పుత్త్రుఁడు. స్వధర్మమునువీడి వేశ్యాలంపటుఁడై తిరుగుచుండువాఁడు. అతని సోదరి వానిని దనయింటియం దుంచుకొని బోధచేయుచుఁ దల్లి దండ్రులతోఁగలసి భోజనమిడుచుండెను. కొంతకాలమిట్లుండి యితఁడామె నగలనెత్తుకొని పాఱిపోయెను. వీనిని దొంగలు చావఁగొట్టి నగలు లాగుకొని అడవిలోఁ బడవేసిరి. వీనిపై నొక కాపు జాలిపడి వీనిని దనయింటికిఁ గొనిపోయి సేవచేయుచుండెను. వానిభార్యయు నుపచారములు చేయుచుండెను. ఇతఁడు కొన్ని దినములుండి వానిభార్యను లేవఁదీసికొని పాఱిపోయెను. ఇట్లు పాతకియై తిరుగుచు విసిగి యందఱినివిడిచి భోజనముమాని నృసింహతీర్థము కడఁ బ్రాణములు విడిచెను. ఆకారణమున నితనికి బుణ్యలోకము వచ్చినది. పద్మ.

నితంతుఁడు:—ఒక రాజర్షి. సాల్వేయుఁడు, శూరసేనుఁడు, శ్రుతసేనుఁడు, బిందుసారుఁడు, అతిసారుఁడు ఇతని కుమారులు. వీరందఱు నొక్క కాంతను అజిత యనుదానిని వివాహ మయిరి. భార.

నిదాఘుఁడు:—పులస్త్యుని కుమారుఁడు. ఒక రాజు ఏనుఁగునెక్కి పోవుచుండఁగా ఋభుమహర్షి చూచి, వారిలో నెవరురాజు? ఎవరు ఏనుఁగు? అని ప్రశ్నించెను. వానిప్రక్కనున్న నిదాఘుఁడు

మహర్షి దలఁబట్టి వంచి వానిపై నెక్కి "నీవలె నడుగున నున్నది యేనుఁగు, నావలె పైనున్న వాఁడు రాజు" అనిచెప్పెను. ఆ మహర్షి 'నీవు నేను' అను భేదములేదని వాని కద్వైతమును బోధించెను. నిదాఘుఁడు బుద్ధితెచ్చుకొని మహర్షి కాళ్ళపైఁబడి మ్రొక్కి వానికి శిష్యుఁడయ్యెను. విష్ణు.

నిమి:-ఒక సూర్యవంశపురాజు. ఇక్ష్వాకుపుత్త్రుఁడు. ఒకచక్రవర్తి. ఇతఁడు యాగము చేయుటకై పదార్థము లన్నియును సమకూర్చుకొని వసిష్ఠుని హోతగఁ బిలచెను. అంతకుఁ బూర్వమే పురుహూతుఁ డను రాజు తాఁజేయు యజ్ఞమునకు వసిష్ఠుని హోతగఁబిలచెను. అందువలన ముందుగ బురుహూతుని యాగము పూర్తిచేసి వచ్చెదనని వసిష్ఠుఁడు చెప్పెను. "సంసారము చంచలము. కాలయాపన మేలచేయవలె" నని తలంచి నిమి వసిష్ఠునకై వేచియుండక గౌతముని హోతగఁ బిలచి యాగము చేయుచుండెను. అపుడు వసిష్ఠుఁడువచ్చి తానురాకుండ యాగము చేయం బడుటచేఁ గోపమువచ్చి నిమిని విదేహుఁడవు కమ్మని శపించెను. (నిమి నిద్రపోవుచుండఁగ వసిష్ఠుఁడు వచ్చెను. అతఁడు నిద్రపోవుచుండెను. గాన వసిష్ఠునకు నమస్కరింపలేదు. నమస్కరింపలేదని వసిష్ఠునకు గోపమువచ్చి శపించెను.) నిమి మునికి నట్లే ప్రతిశాప మిచ్చెను. నిమి ప్రాణములను విడచెను; గౌతముఁ డీతనిశరీరము తైలమందుంచి యాగము పూర్తిచేసెను. హవిర్భాగము లందుకొనుటకు దేవతలువచ్చి నిమిని బునర్జీవితునిఁ జేసెదమనిరి. అతనిని వరము వేఁడుకొను మనిరి. "దేహము మమతాహంకార యుక్తము; నానాసుఖదుఃఖ పీడితము" గావున అతఁడు దేహమును ధరించుట కిష్టపడలేదు. వారి ప్రసాదమున దేహము లేకయుండినను ప్రజలకు దేహమున్నట్లే గోచరించును. అందుచే నిమి పాలించు దేశమునకు విదేహదేశమని పేరు వచ్చినది. నిమి దక్షిణ భుజమును మథించిరి. అందుండి కుమారుఁడు జన్మించెను. అతఁడే జనకుఁడు. ఉరా. విష్ణు.

నిమి:-దత్తాత్రేయుని పుత్త్రుఁడు.

నిమిషము:-కనుఱెప్ప. నిమి యను రాజు విదేహుఁడైనను బ్రజల కన్నులయందు నిలచెను. కొన దేహముండినట్లే ప్రజలకన్నులకు గోచరించును. కొనఁ గనుఱెప్పకు 'నిమి' యను పేరువచ్చెను.

నిమ్నుఁడు:-అనమిత్త్రుని కుమారుఁడు. సత్రాజిత్తు, ప్రసేనుఁడు ఇతని కుమారులు. భాగ.

నియతి:-మేరువు కుమారిత; విధాతభార్య. ఈమె కుమారుఁడు మృకండుఁడు. బ్రహ్మ.

నియుతాయువు:-శ్రుతాయువుకుమారుఁడు. అర్జునుఁడు శ్రుతాయువునోడింపఁగ,నితఁడర్జునునితో యుద్ధముచేసెను. కాని యితఁడును ఓడెను. జై. భా.

నిరమిత్త్రుఁడు:-నకులుని కుమారుఁడు. ఇతని తల్లి కరేణువతి. భార.

నిరమిత్త్రుఁడు:- త్రిగర్తదేశపు రాజుయొక్క కొడుకు. యుదములో సహదేవునిచేఁ జంపఁబడెను. భార.

నిర్ఋతి:- అష్టదిక్పాలురలో నొకఁడు. ఇతఁడు నిర్ఋతిలోకమున కధిపతి. ఇతనిభార్య దీర్ఘాదేవి. నిర్ఋతి పూర్వజన్మమునఁ బింగాక్షుఁ డను బోయవాఁడు. (చూడుము పింగాక్షుఁడు.)

నిర్ఘోషుఁడు:- వేదదర్శుని శిష్యుఁడు. అథర్వవేదమును బఠించెను. భాగ.

నివాతకవచులు:- రాక్షసులు. వీరు దేవతలను బాధించుచుండురు. వారుకొట్టవచ్చినపుడు సముద్రమందు దాఁగియుందురు. దేవతల కజేయులు.

ఇంద్రుఁడు కట్టుకొనిన అత్యంతసుందరమగు హేమవికారనగరమునుండి దేవతలను బారద్రోలి వీరు కాపురముండిరి. పాశుపతాస్త్రమును బడసినపిమ్మట నింద్రలోకమునకేగిన యర్జునునకు ఇంద్రాది దేవతలు తమ దివ్యాస్త్రము లిచ్చిరి. దానికిఁ బ్రత్యుపకారముగా నింద్రుఁడు వీరిని సంహరింపుమని యర్జునునితోఁ జెప్పెను. మాతలిని, దన రథమును ఇచ్చి పంపెను. అర్జునుఁడు వీరిని సంహరించెను. భార.

నిశాకరుఁడు:-ఒక ముని. ఇతనియాశ్రమములో సంపాతి, జటాయువు లుండువారు. ఈముని నుర

లోకమునకు వెళ్ళఁగ వారును సూర్యమండలము దాఁటి యెవరు పోఁగలరోయని యెగిరిరి. రామా.

నిశాకరుఁడు:-దశరథుని పుత్త్రుఁడగు శ్రీరాముఁడు అరణ్యమునకు వచ్చెననియును, వానరులు సీతకై వెదకుదురనియును, రాఁగలసంగతులు చెప్పి సంపాతిరెక్కలు మఱల వచ్చునని చెప్పెను. సంపాతి అంగదుఁడు మొదలగువారి కా వృత్తాంతము చెప్పెను. సంపాతికి మఱల రెక్కలు వచ్చినవి. రామా.

నిశుంభుఁడు:-ఒక దనుజుఁడు. (చూడుము శుంభుఁడు)

నిషంగి:-ధృతరాష్ట్రుని కుమారుఁడు.

నిషధుఁడు:-కుశునిమనుమఁడు. అతిథికుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు నలుఁడు. నలుని పుత్త్రుఁడు నభుఁడు. రఘు.

నిషధుఁడు:-కుశుని నాలుగవ కుమారుఁడు. భాగ.

నిషధుఁడు:-కుశుని పౌత్త్రుఁడు. అతిథికుమారుఁడు.

నిషధుఁడు:-మాహిష్మతీ పురాధీశ్వరుఁడు. అగ్ని దేవుఁడు బ్రాహ్మణరూపమున వచ్చి యితని నగరమునఁ బరదారరతుఁడై తిరుగుచుండిన నితఁడు వానిని బట్టుకొని శిక్షింపఁబోయెను. అంతట నగ్ని విజృంభించెను. ఈ రాజు భయపడి వానికి నమస్కరించెను. అగ్ని వానికి సంప్రీతుఁడై నీవుకోరినవరమిచ్చెద నడుగుమనియె. తననగరమునకు శత్రువులు వచ్చినయెడల వారిపై నగ్నిపడునట్లు రాజు వరము వేఁడెను. ఆ వర మొసంగి యందుకుఁ బ్రత్యుపకారముగ నచ్చటి స్త్రీలు జారిణు లయ్యును దోషులు గారని శాసింపుమని యగ్ని కోరెను. నిషధుఁ డట్లు శాసించెను. భార.

నిషాదులు:-గిరి వన ప్రదేశంబులందుఁ గ్రూరత్వములో నుండు జనులు. వేనుని దక్షిణోరువును మథించఁగా నల్లని పొట్టివాఁడు, ఎఱ్ఱని కన్నులతో నొకఁడుపుట్టెను. వానినిఁజూచి మునులు 'నిషీద' యని పలికిరి. వాని సంతతి వారే నిషాదులు. భార.

నిష్ఠానకుఁడు:-కద్రువ కుమారుఁడు.

నీ

నీతి:-అనంగుఁడను రాజుయొక్క పుత్త్రుఁడు. ఇతఁడు మృత్యుపుత్త్రికయగు సునీథను బరిణయమయ్యెను. ఇతనికుమారుఁడు వేనుఁడు. భార.

నీతిశాస్త్రము:-కృతయుగమందుఁ బ్రజ లెవరి ధర్మములు వారు నడపుకొనుచుండిరి. ధర్మరక్షణము చేయుటకు రాజుయొక్క యవశ్యమే లేకుండెనుగాన నాయుగమునందు రాజులేఁడు. కాని తరువాతఁ దరువాతఁ గామక్రోధాదులు హెచ్చెను.యజ్ఞములుతగ్గెను. ప్రజలుఅందఱును స్వార్థపరులైరి. ఆసమయమున నింద్రాదిదేవతలు భూలోకముసంగతి బ్రహ్మతోఁ జెప్పికొనిరి. అతఁడు నూరువేల యధ్యాయముల నీతిశాస్త్రము రచియించి యిది లోకచరిత్రయొక్క నిర్మలీకరణమునకు గారణ మగుననియె. విరూపాక్షుఁడు, విశాలాక్షుఁ డను నామమున నావిర్భవించి, యాశాస్త్రము చదువుటకు మర్త్యుల కాయుష్కాలము చాలదుగావునఁ బదివేల యధ్యాయములు గలదానినిగనే చేసెను. ఆ శాస్త్రము శివునివలన నింద్రుఁడు నేర్చుకొని యైదువేల యధ్యాయములు గలదానినిగఁ జేసెను. బృహస్పతి మూడు వేలుగలదానినిగఁ జేసెను. శుక్రుఁడు దీనిని తగ్గించి వేయి యధ్యాయముల గ్రంథముగఁ జేసెను. ఈ శాస్త్రము నడుపుటకు విష్ణువు విరజుఁడను మానసపుత్త్రునిఁబుట్టించెను. ఇతఁడు భూలోకమునకు రా నిచ్చగింపలేదు. ఇతని పుత్త్రుఁడు కర్దముఁడు రాజ్యమపేక్షింపక యడవికేగెను. కర్దమునిపుత్త్రుఁడగు అంగుఁడు భూమిని నీతిశాస్త్రముప్రకారము పరిపాలించెను. భార.

నీపుఁడు:- ఒక రాజర్షి. భనందునకు శస్త్రవిద్య యుపదేశించెను. మార్క.

నీపుఁడు:- పారుని కుమారుఁడు. వీనికి నూర్గురు కుమారులు కలరు. మఱియును శుకునికూఁతురగు సుందరిని బరిణయమై బ్రహ్మదత్తుఁడను కుమారునిఁ గనియెను. భాగ.

నీల:- మిథిలానగరములోనున్న కుంభకుఁ డను గొల్లవాని కూఁతురు. రూపసి. ఒకనాఁ డీతని యింటికి నారదుఁడు వచ్చి నందుని కుమారుఁ డైన శ్రీకృష్ణునిరూపమును వర్ణించుచుండెను. ఆ సమయముననే యచ్చటకు నీల వచ్చెను. ఆమె తన కుమారిత యనియును, భర్తకై వెదకుచున్నాననియుఁ గుంభకుఁడు చెప్పెను. నీలకుఁ గృష్ణునిపై వలపు గలిగెను. కుంభకు నింటఁ గాలనేమిపుత్త్రులు వృషభములై పుట్టిరి. ఆ వృషభము లెవ్వరికిని బట్టరాక జనులను బాధించుచుఁ, బంటలను బాడుచేయుచుండెను. వానినిబట్టియుంచుమని మిథిలాధీశుఁడు కుంభకుని నాజ్ఞాపించెను. అది వానికి సాధ్యమైనది కాదు. ఎవ్వ రా వృషభములను లొంగఁదీయుదురో వారికిఁ దన కుమారిత నిచ్చెదనని కుంభకుఁడు చాటించెను. శ్రీకృష్ణుఁడువచ్చి యా వృషభములను సంహరించి నీలను బరిణయమయ్యెను.
నీ. సు.

నీలధ్వజుఁడు:- మాహిష్మతీ పురాధిపతి. ఇతని పెద్దభార్య జ్వాల; ఆమెవలన స్వాహా యను కూఁతురు కలిగెను. స్వాహా స్వయంవరమున నగ్నినే వరించెను. నీలధ్వజుఁడు ధర్మజుని యాగాశ్వమును గట్టివేసెను. దానిని రక్షించుటకు వచ్చుచుండిన యర్జునుఁ డితనితో యుద్ధమునకుఁ గడంగెను. నీలధ్వజుఁ డోడునని భయపడి యగ్నివచ్చి యర్జునునిసేనను గాల్చివేసెను. అర్జునుఁ డగ్నిని బ్రార్థించెను. అగ్ని వాని సేనను బ్రతికించి యుద్ధముమాత్రము జరుగకుండ నీలధ్వజునకును, నర్జునునకును సఖ్యముచేసి యాగాశ్వమును విడువుమని నీలధ్వజునితోఁ జెప్పెను. నీలధ్వజుని రెండవ భార్య "పట్టిన యశ్వమును వదలిత్తురా? అది క్షత్త్రియ పౌరుషమా?" యని యాక్షేపణచేసెను. అంతట మరల నీలధ్వజుఁడు యుద్ధమునకు వచ్చెనుగాని యోటుపడి యశ్వము నిచ్చెను. పౌరుషహీనుఁ డని యితని నిందించి రెండవభార్య తన పుట్టినింటికి వెడలిపోయెను. జై. భా.

నీలుఁడు:- ఒక వానరుఁడు; సుగ్రీవుని సేనలోనివాఁడు. రామరావణయుద్ధమందుఁ బోరాడెను. ఇతఁడు రావణుని మంత్రియైన ప్రహస్తునిఁ జంపెను. రామా.

నీలుఁడు:-పాండవపక్షమునఁ బోరాడిన ఒక రాజు. వానిని అశ్వత్థామ చంపెను. భార.

నీలుఁడు:-అజమీఢునకు నళినియను భార్యయందుఁ బుట్టిన కుమారుఁడు. ఇతనికుమారుఁడు శాంతి.
భాగ.

నీలుఁడు:-మాహిష్మతీపురనాథుఁడు. కౌరవ పక్షమునఁ బోరెను.

నీలుఁడు:-కద్రువ కుమారుఁడు. భార.

నీలుఁడు:-దుర్జయుఁ డను రాజు పరివారములో నొకఁడు. రాజుతో వేఁటకును, గౌరముఖుని యాశ్రమమునకును వెళ్ళెను. ఏ మణిప్రభావమున గౌరముఖుఁ డచ్చట నగరము నిర్మింపఁ గల్గెనో యా మణిని బుచ్చుకొమ్మని మొదట రాజు మంత్రిని బంపెను. ముని యివ్వనందున నెట్లైనను దానిని గైకొనుమని నీలునిసేనను బంపెను. నీలుఁడు గౌరముఖుని యాశ్రమముకడ రథముదిగఁగనే మణినుండి రథములు, అశ్వములు, వీరులు పుట్టిరి. వారికిని, దుర్జయుని సేనకును యుద్ధమయ్యెను. ఇంతలో గంగయొద్దున కేగిన గౌరముఖుఁడు వచ్చి యుద్ధమగుచుండుట చూచి విష్ణుమూర్తిని బ్రార్థించెను. అతఁడు దుర్జయుని, నీలునిసేన నంతను సంహరించెను. వరా.

నృ

నృగుఁడు:-ఒక రాజు. అనేక గోదానములు చేసి పుణ్యము సంపాదించుకొనెను. ఇతఁడు దానమిచ్చిన గోవొకటి తిరిగి యితని గోవుల మందలోఁ గలిసి యతనిగృహమునకు వచ్చెను. దాని నెఱుంగక నృగుఁడు ఆ గోవునే మఱియొక బ్రాహ్మణునకు దానమిచ్చెను. మొదట నా గోవును బరిగ్రహించిన బ్రాహ్మణుఁడు దానికై వెదకి యీబ్రాహ్మణునింటఁ జూచి "నాగోవును

నీ వేల కట్టియుంచితివి? నాకిచ్చి వేయు" మనియె. "నృగునివలన నేను ఈ గోవును దానము పట్టితిని; ఇది నాది; నే నివ్వ" నని యీ బ్రాహ్మణుఁడు పలికెను. వారిద్దఱు తగవులాడుకొని నృగునియొద్దకు వచ్చిరి. (ఎంత కాలము వేచియున్నను నృగుని దర్శనము కాలేదు. వారికిఁ గోపమువచ్చి "అర్థులై ప్రజలు రాఁగా ధనమదాంధతచేత రాజు దర్శన మిచ్చినవాఁడు కాఁ" డని, కావునఁ బ్రజలకు గోచరముకాక బిలములో నివసించుమనిరి. ఊసరవెల్లివి కమ్మని బ్రాహ్మణులు నృగుని శపించిరి.) నాకు దానమిచ్చిన గోవును దిరిగి నీ వెట్లీబ్రాహ్మణున కిచ్చితివని మొదటదానము పట్టిన బ్రాహ్మణుఁ డడిగెను. తా నెఱుఁగక చేసినదోషము సైపుమని నృగుఁడు వేఁడి యా గోవునకు బదులుగ వేయిగోవుల నిత్తుననియె. కాని వా రిరువుఱును ఆ గోవునే గోరిరి.

మొదట దానమిచ్చినదానిని దిరిగి గ్రహించి దానినే మఱియొకనికి దానమిచ్చిన పాతకముచే నృగుఁడు యమపురి కరిగెను. అచ్చటనుండి తల క్రిందుగఁబడి తొండయై చరించు చుండెను. (ఒక నాఁ డీ తొండ నూతిదగ్గఱనుండి తల యూఁచుచుండఁగ నీతొండ నూతిలోని జలమును గలికి పాడుచేయుచున్నదని కొందఱు రాళ్ళతోఁ గొట్టిరి. దెబ్బలుతినుచునే యుండెను గాని తొండ యచ్చటనుండి కదలలేదు. నూతిలోఁ బడియున్న యీ యూసరవెల్లిని బైటకుఁ దీయుటకు యదుకుమారులు ఇట్లు మిక్కిలి ప్రయత్నించిరి. అది కదలకుండుట కచ్చెరువొంది వారు శ్రీకృష్ణునితోఁ జెప్పిరి. ఆతఁడు వచ్చి చూచెను. శ్రీకృష్ణుని దర్శింపఁగనే తొండ మానిసియై లేచి తాను నృగుఁ డగుటయుఁ, దాఁజేసిన పాతకమువలన నట్లగుటయును దెల్పెను. భార. భాగ.

నృగుఁడు:-వైవస్వతుని పుత్త్రుఁడు. ఇతనివంశమున సుమతి యనువాఁడు పుట్టెను. భాగ.

నృగుఁడు:-ఒక రాజు. ఇతఁడొకనాఁడు వేఁటాడి డస్సి చెట్టునీడను నిదురించుచుండెను. కొందఱు బోయలు వానిధనమునుజూచి యపహరించుటకై వానిని జంప యత్నించిరి. కాని యీ రాజు శరీరమునుండి యొక కాంత వచ్చి వారిని జంపి వేసెను. రాజు మేల్కాని యా శవములనుజూచి యాశ్చర్యపడి వెంటనే రామదేవుని యాశ్రమమునకు వెడలి తన శరీరమునుండి వచ్చిన యా కాంత యెవ్వ? రని యడిగెను. ఆమె శ్రావణశుక్ల ద్వాదశినాఁడు వ్రతముచేయుటచే వచ్చిన పుణ్యమని యతఁడు చెప్పెను. వరా.

నృసింహమూర్తి:-హిరణ్యకశిపుఁడు బ్రహ్మను గూర్చి తపస్సుచేసి యతనివలన నరులచేఁగాని, మృగములచేఁగాని, పగలుగాని, రాత్రిగాని, ప్రాణమున్నవానిచేఁగాని, ప్రాణము లేనివానిచేగాని మరణము పొందకుండునట్లు వరము పొందెను. పిమ్మట నతఁడు దేవతలను, మూడు లోకములను మిక్కిలి బాధ పెట్టుచుండెను. విష్ణుభక్తుఁడైన తన పుత్త్రునిఁగూడ బాధలు పెట్టుచుండెను. విష్ణువంతటను నున్నయెడల నీ స్తంభములోఁ జూపుమని తన హర్మ్యమందలి స్తంభమును దన్నెను. వానిని సంహరించుటకై విష్ణుమూర్తి యా స్తంభమునుండి వచ్చి హిరణ్యకశిపునకు బ్రహ్మయిచ్చిన వరములకు భంగము లేకుండ, సగము నరరూపము, సగము మృగరూపము ధరించి సంజవేళ ఈ దనుజుని గోళ్ళతోఁ జీల్చి సంహరించెను. భాగ.

నృసింహావతార కార్యము ముగిసెను. నృసింహుఁడు గర్వముగఁ దిరుగుచుండెను. శివుఁడు శరభరూపమై వానిని వధించి యా చర్మము తీసి తాను గప్పికొనియె. పిమ్మట నరరూపము నరుఁడును, మృగరూపము నారాయణుఁడు నయ్యెను. శివ.

నై

నైమిశారణ్యము:-గౌరముఖునియాశ్రమప్రాంతమందలి యరణ్యము. దుర్జయుఁడను రాజు సేనాసమేతుఁడై యేగి వేఁటాడి డస్సియుండఁగ గౌరముఖుఁడు వారిని దనయాశ్రమమునకు విందునకు బిలిచి, విష్ణుమూర్తిని బ్రార్థించి యొకమణి తెచ్చి దానిప్రభావమున నరణ్యమున నగరమునిర్మించి

రాజునకు షోడశోపచారములు గావించెను. రాజు మణిని దనకిమ్మని కోరెను. ముని నిరాకరించెను. యుద్ధముచేసియైన తెమ్మని రాజు తన పరివారమును బంపెను. అప్పటికి ముని గంగానదికేగియుండెను. వారు మునియాశ్రమముచేరఁగనే మణినుండి శూరులు పుట్టి రాజుసేనతో యుద్ధముచేయ మొదలిడిరి. ఇంతలో ముని వచ్చి యాశ్చర్యము, భయము నొంది విష్ణుమూర్తిని ప్రార్థించెను. విష్ణువు ప్రత్యక్షమై నిమిషములో శత్రుసేనను సంహరించెను. అచ్చట నిమిషములోనే శత్రువు లందఱు సంహరింపఁబడుటచే నైమిశారణ్యమను పేరునఁ బరగుఁగాక యని విష్ణువనియె. వరా.

నైమిశారణ్యము:- బ్రాహ్మణులు కొందఱు బ్రహ్మకడ కరిగి మేము తపస్సు చేయఁదలఁచుకొంటిమి; మాకు దగినచోటు చెప్పుమనికోరిరి. నేను దర్భలతో రథముచేసి దానిని విసరెదను. అది యెచ్చటఁబడునో నచ్చటఁ దపస్సు చేయుఁడని రథమును విసరెను. రథనేమి పడిన యరణ్యమునకే నైమిశారణ్యమనిపేరు వచ్చెను.

స్కాంద.

నైమిశారణ్యము:- పూర్వము పరమేష్ఠి లోకములు నిర్మించుటకై సత్త్రాధ్వరము చేయఁదలఁచుకొని సంచరించుచుండఁగ ధర్మరథచక్రమునేమి జారి పడిపోయెను. అది పడినచోటే పవిత్రమైన నైమిశారణ్యమయ్యెను. బ్రహ్మ.

నైమిశారణ్యము:-పూర్వము మునులు కొందఱు కలి సంప్రాప్తకాలము వచ్చుచున్నది,"అని శంకతోఁ బలుకఁగా నొక చక్రము నిచ్చి 'దీనిని ద్రిప్పుచు వెంటనే పొందు. దీని నేమి యెచ్చట సడలి పడునో యచ్చటనే'యుండుఁడనియెను. దానినేమి పడినచోటు నైమిశము అని చెప్పఁబడును. ఇది మిక్కిలి పవిత్రస్థలక్షేత్ర మగును అని బ్రహ్మ చెప్పెను. దే. భా.

న్య

న్యగ్రోధుఁడు:- కంసుని సోదరులలో నొకఁడు. బలరామకృష్ణులు చాణూర ముష్టికులను జంపిన తరువాత నితఁడు వారితోఁ బోరాడి బలరామునిచేఁ జంపబడియెను. భాగ.

ప

పంచచూడ:-ఒక దేవతాస్త్రీ. ఈమెను స్త్రీస్వభావ మెట్టి? దని నారదుఁ డడిగెను. ఆమె స్త్రీకి సహజముగఁ గలుగు దోషములు పరపురుషులను గవయఁగోరుట మొదలగునవి తెల్పెను. భార.

పంచజని:- విశ్వరూపుని కుమారిత. వృషభుని కుమారుఁడగు భరతుని భార్య. సుమతి, రాష్ట్రభుక్కు, సుదర్శనుఁడు, ఆచరణుఁడు, ధూమకేతువు ఈమె కుమారులు. భార.

పంచజనుఁడు:-ఒక ప్రజాపతి. ఇతని పుత్రిక అసిక్ని. ఈమెను విష్ణుమూర్తి దక్షునకు భార్యగ నిచ్చెను. భాగ.

పంచజనుఁడు:-ఒక రాక్షసుఁడు. వీఁడు సాందీపుని కుమారు నెత్తుకొనిపోయెను. సాందీపుఁడు తనశిష్యులగు బలరామకృష్ణులతోఁ దనకుమారుని దెచ్చి యిమ్మని చెప్పెను. వారు వెదకుచు సముద్రముకడకు వచ్చిరి; సముద్రుఁడు వీరికి భయపడి పంచజనుఁ డా కుమారుని సంహరించి తాను సముద్రములో దాఁగియున్నాఁడని చెప్పెను. రామకృష్ణులు సముద్రమును బ్రవేశించి యందున్న పంచజనుని సంహరించిరి. వాని గర్భమందున్న శంఖమును కృష్ణుఁడు గైకొనియె. అదియే పాంచజన్యము. విష్ణు.

పంచజనుఁడు:- సంహ్లాదుని పుత్త్రుఁడు.

పంచనదము:- ధూతపాప, కిరణానది, ధర్మనది, గంగ, యమున నదులు కలసి పంచనద మన బడును. కాశీ.

పంచపాండవులు:- పాండురాజు పుత్త్రులు. (చూడుము పంచేంద్రులు)

పంచవటము:- గౌతమీతీరమున నున్న యొక యరణ్యము. ఇచ్చట రాక్షసబాధ మెండుగ నుండెను. వనవాసము చేయుచున్న రామలక్ష్మణులతో ఈ యరణ్యమునందు వసింపుఁడని యగస్త్యుఁడు చెప్పెను. ఇందు వారు పర్ణశాల నిర్మించుకొని యుండిరి. ఇచ్చటనుండియే సీతను రావణుఁ డెత్తుకొనిపోయెను. రామా.

పంచశిఖుఁడు:- ఒక ఋషి. తత్త్వజ్ఞాన సంపన్నుఁడు. ఇతఁడు మిథిలానగరమునకు వచ్చి జనకునకుఁ దత్త్వోపదేశము చేసెను.

పంచశిఖుఁడు-ఒక బ్రాహ్మణుఁడు. పసితనమున 'కపిల' యను స్త్రీ పాలు: త్రావుటచే 'కాపిలేయుఁడు' అను పేరుకూడఁ గలదు. జనకమహారాజునకు నూర్వురు గురువులు సదా తత్త్వమును బోధచేయుచుండిరి. ఇతఁడు మిథిలకుఁ బోయి వారినిఁ జూచి తన వాక్యవిశేషంబున వారిని నిరుత్తరులను జేసెను. అంత జనకుఁ డితనిని దనకుఁ దత్త్వబోధ చేయుమని కోరెను. ఇతఁడు బోధచేసెను. ఇతనిబోధవలన మిథిల అంటుకొనినపుడు తనదేమియును గాల లేదని యనియెను. భార.

పంచశిఖుఁడు:- బ్రహ్మకు నాభివలనఁ బుట్టిన కుమారుఁడు. బ్ర. వై.

పంచాప్సరము:- దండకారణ్యమం దొక కొలను. మాండకర్ణియను ముని యప్సరసలతో నిందుఁ బ్రవేశించి జలమధ్యమునఁ జాలకాలముండి విహరించెను. రామా.

పంచాప్సరము:- శాతకర్ణుఁడను ముని దర్భల కొనలు తినుచు నిష్ఠతోఁ దపస్సు చేయుచుండువాఁడు. ఈ కొలనులో స్నానమును జేయుచుండును. వీనితపస్సునకు భయపడి యింద్రుఁడు వీని తపోభంగమును జేయుటకుఁ బంచాప్సరసలను బంపెను. వారితో నీ కొలనునందలి మేరులలో నీ ముని విహరించెను.

పంచేంద్రులు:- వైవస్వతుఁడు సత్త్రియాగము చేయుచు నేమాత్రమును బ్రాణిహింస చేయకుండుటచేత భూలోకమున మనుజులకు మరణము సంభవించుటలేదు. దేవతలును, నింద్రుఁడును బ్రహ్మకడకుఁ బోయి మనుజులు మరణింపకున్నారు. ఇఁక నమరులకును, వారికిని భేదమెద్ది ? యని చెప్పికొని విచారించిరి. "యముఁడు వారి నంత మొందించును. మీరు విచారింపకుఁడు. మీ వీర్యమున నే యమితతేజు లేవురు భూలోకమునఁ బుట్టుదు" రని బ్రహ్మ వారితోఁ జెప్పెను. వారు తిరిగి వచ్చుచుండఁగ గంగానదిలో నేడ్చుచున్న యొక యువతి కనఁబడియె. ఆమె కన్నులనుండి కారిన జలము బంగారు కమలము లగుచుండెను. ఇంద్రుఁడది చూచి యాశ్చర్యమొంది నీవెవ్వర ? వని యడిగెను. నన్నెఱుఁగవలయునేని వాతోడరమ్మని యాపె చెప్పెను. ఆమె యీశ్వరుఁడు దేవితో జూదమునాడుచున్న చోటునకుఁ దీసికొని వెళ్ళెను. అపుఁడీశ్వరుఁడు వరుణరూపమున నుండుటచే నింద్రుఁడాతనిని వరుణుఁడేయని తలఁచి "నాముందట నీవు సింహాసనారూఢుఁడవై దర్పించియుండి జూదము'నాడుచుంటివే" మని యడిగెను. ఈశ్వరుఁడు రౌద్రాకారముపూని "మా క్రీడారసభంగము గావించిన యా దురాత్ముని నిటకుఁ దోడితె"మ్మని యా కన్నియను బంపెను. ఆమె కరస్పర్శనముచే నిశ్చేష్టితుఁడై యింద్రుఁడు మహీతలమునఁ బడెను. నీవు గర్వించి పలికితివి. ఈ గిరిరాజు వివరముచూడుము. ఏమియున్నదో? యని శివుఁడాజ్ఞయిచ్చె. ఇంద్రుఁడు తనవంటి వారిని నలుగురనుజూచి, యిదేమి ? నేనిట్టిదు రూపములై తినని యాశ్చర్యమొందెను. ఆయైదుగు రింద్రులను మనుజులై పుట్టుఁడని యీశ్వరుఁడు శాసించెను. అట్లు పంచేంద్రులును ధర్మానిల శక్రాశ్వినులు తమ కాధానకర్తలు కాఁగ ధర్మ భీమార్జున నకుల సహదేవులుగఁ బుట్టిరి. భార.

పతంజలి:-ప్రాచీనయోగి కుమారుఁడు. ఇతఁడు షట్సంహితలను రచియించెను. బ్రహ్మ.

పథ్యుఁడు:- సుమంతుని శిష్యునివలన అథర్వవేదమభ్యసించి దానిని కుముదుఁడు, శుకుఁడు, జాబాలి, బభ్రువు, అంగిరసుఁడు, సైంధవాయనుఁడు అనువారల కుపదేశించెను. భాగ.

పదాఱువేల భార్యలు:-నరకాసురుఁడు పదాఱువేల కన్యలను జెఱపట్టి యుంచెను. నరకుని సంహరించి శ్రీకృష్ణుఁడు వారిని విడిపించెను. వారాతనిని పరిణయము కాఁగోరిరి. శ్రీకృష్ణుఁ డందఱ కన్ని రూపులునై వారిని వివాహము చేసికొనెను. ఈ వార్త నారదుఁడు విని, ఆ విభవంబు చూడవలెనని ద్వారకకు వచ్చి యొక్కొక్క కాంతయొక్క గృహమును బ్రవేశించెను. అతనికిఁ బ్రతియింటను శ్రీకృష్ణుఁడు పెక్కు రీతులుగా సరస సల్లాపములు చేయుచు గోచరించెను. భాగ.

పద్మ:- అనరణ్యుఁ డను రాజుకూఁతురు. ఈమె యొకనాఁ డరణ్యములోఁ దిరుగుచుఁ బిప్పలాదుని యాశ్రమమునకు వెళ్ళెను. అతఁ డీమెను జూచి వలచి నీ వెవ్వరిదాన? వని యడిగెను. ఆమె చెప్పెను. పిప్పలాదుఁడు రాజుకడకు వచ్చి యీమెను దన కిమ్మని కోరెను. పద్మతల్లి యీ ముసలివానికి దనబిడ్డ నీయరాదనియెను. కాని యితనికి భయపడి తండ్రి తన కూఁతునిచ్చి వివాహముచేసెను. పద్మ పిప్పలాదునితో నతని యాశ్రమమునకు వెడలెను. ఒకనాఁడు ధర్ముఁడు నృపకుమారుని రూపమునఁ బద్మకడకు వచ్చి యో సుందరాంగీ! నీ చక్కదనమునకు ఈ ముసలివాఁడా భర్త! వానిని విడువుము. నిన్ను నా రాణినిగఁ జేసెదననియెను. పద్మ పతివ్రత గావున వీనికి బుద్ధిచెప్పెను. ఆమె పతిభక్తికి మెచ్చుకొని, ధర్ముఁడు నిజస్వరూపము చూపించి యామెకు వరము లిచ్చెను. శివ.

పద్మకల్పము:-సృష్టిలో నొక కాలము. విష్ణు నాభియందున్న పద్మములోనుండి బ్రహ్మ వచ్చి సృష్టిచేసినకాలము. ఇతర కల్పములు బ్రహ్మకల్పము, వరాహకల్పము. బ్ర. వై.

పద్మకోమల:-త్వష్టృప్రజాపతి కూఁతురు. శూరపద్మాసురుని భార్య. స్కాంద.

పద్మాక్షుఁడు:-చంద్రహాసుని కుమారుఁడు. జై. భా.

పద్మావతి:- ఇక్ష్వాకువంశమువాఁడగు అంబరీషుని తల్లి. ఈమె విష్ణుమూర్తిని సేవించి భక్తుఁడగు కుమారుఁడు కలుగునట్లు వేఁడెను. ఆమెకు అంబరీషుఁడు జన్మించెను. లింగ.

పద్మావతి:-ఆకాశరాజు కూఁతురు. ఆకాశరాజునకు సంతానము కలుగలేదు. అతఁడు పుత్రేష్టి చేయుటకై పొలము దున్నుచుండఁగ నందీమె కనబడెను. ఈమెను దీసి యాతఁడు పెంచెను. ఈమె యొకనాఁడు విహరించుచుండఁగ వేంకటాద్రియందున్న హరి గుఱ్ఱము నెక్కివచ్చి యీమెనుజూచి మోహించి యీమెపైఁబువ్వులు చల్లెను. పద్మావతి వానిని రాళ్ళతోఁగొట్టి తన చెలికత్తెలతోఁ జెప్పి కొట్టించి యింటికివచ్చెను. కాని ఆమెకును మనస్స్వస్థత తప్పెను. హరికిఁ బోషణచేయుచుండు వకుళమాలిక వచ్చి యీమెనుజూచి వెళ్ళెను. పిమ్మట వేంకటేశ్వరుఁడే యెరుకులదానివేషమున వచ్చి యీమె హరిని వలచియున్నదనియును, నందువలననే జ్వరము వచ్చినదనియును జెప్పెను. ఆకాశరాజీమెను వేంకటేశ్వరున కిచ్చి వివాహము చేసెను. వేంక.

పద్మావతి:- సింహళదేశాధీశ్వరుఁడైన బృహద్రతునికుమారిత. ఈమెపసితనమునందేశివునిదీక్షతో బూజించెను. అతఁడుప్రత్యక్షమై విష్ణుమూర్తియే నీకు భర్త గాఁగలఁడు; పరరాజు లెవరు వచ్చి నిన్నుఁ బరిణయము కోఁ జూచినను వారు స్త్రీలే యగుదురని చెప్పి వెడలిపోయెను. ఈ మాట యామె యెవ్వరితోడను జెప్పలేదు. పద్మావతికి యుక్తవయస్సురాఁగానే తండ్రి యామెస్వయంవరమును బ్రకటించెను. అనేక దేశముల రాజకుమారులు వచ్చియుండిరి. వారు పద్మావతినిజూచిరి; చూచుటతోడ నేపడఁతులైరి. ఈ దైవమాయకు వారందఱును జింతనొందుచుండిరి. ఇఁకఁ బద్మావతిని వివాహమగుట కే రాజును రాకుండెను. ఆమె విరహానలమునఁ గృశించిపోవుచుండెను. ఒకనాఁడామె యుద్యానవనములోఁ గూర్చుండి విలపించుచుండఁగఁ జిలుకయొకటి మనుష్యవాక్యములనిట్లనియెను. 'పడఁతీ! ఏలవిచారించెదవు? నీకుఁదగిన సుందరాకారుఁడుకలఁడు. అతఁడు కేవలము విష్ణుమూర్తియే యనవచ్చు. వానిని గొనివచ్చెదను. దుఃఖింపకుము'' అని యోదార్చెను. పిమ్మట శంబళపురమునఁ దనయజమానుఁడైనకల్కితో, నతనికిఁ దగినభార్య పద్మావతితప్ప వేఱొకతెలేదనిచెప్పి యామెపై వలపు పుట్టించియాతనిని సింహళమునకుఁ గొనిపోయెను.

ఈచిలుక పద్మావతికిఁ గల్కిరాకయెఱింగించెను. ఆమెవచ్చి యుద్యానవనమందున్న కల్కినిఁ జూచి వీనితోఁ బ్రసంగించి వీనిని దన తండ్రి కెఱింగించెను. బృహద్రథుఁడు పద్మావతిని గల్కి కిచ్చి వివాహముచేసెను. ఇదివఱకు స్త్రీలైయుండిన రాజులు వచ్చి కల్కికి నమస్కరించి తమ పురుషత్వమును బ్రసాదింపుమని వేఁడిరి. రేవానదిలో స్నానముచేసి రండని కల్కిచెప్పెను. వారు స్నానముచేసి పూర్వరూపములు గలవారై పద్మావతిని, గల్కిని వీడ్కొని తమతమదేశములకుఁ బోయిరి. కల్కి.

పద్మఁడు:-ఒక నాగరాజు. మహాపద్మ మను మడువుతీరమున నుండువాఁడు. ఇతఁడు సూర్యుని రథము లాగుటకుఁ బోవుచుండును. ఇతని భార్య సువ్రత. ఇతనియొద్ద నాత్మతత్త్వముఁ దెలిసికొనుటకు భృగుఁడను బ్రాహ్మణుఁడు వచ్చెను. అప్పటికి బద్మఁ డింటియొద్ద లేకుండెను. ఇతఁడు వచ్చువఱకు భృగుఁడు నైమిశారణ్యమందుండెను. పద్మఁ డింటికి రాఁగానే యతిథిపూజ సరిగ జరుగుచున్నదా? యని భార్య నడిగెను. మీకై బ్రాహ్మణుఁడు వేచియున్నాడని భార్య చెప్పఁగఁ బద్మఁడు భృగునికడకు వచ్చి సత్కరించెను. నీవుచూచిన విశేషములను జెప్పుమని భృగుఁడడిగెను. సూర్యుఁడే వర్షములు కల్పించి, సూర్యుఁడే జలము శోషింపఁజేయును. అతఁడే జనుల కాహారమిచ్చువాఁడు. అతఁడే శోషింపఁజేయువాఁడు. సర్వశక్తు లతనియందే యుండును. అదియాశ్చర్యమేకదా! ఇంతకంటెను విశేషమొకటి కలదు. ఆకాశమున జ్యోతియొకటి కనఁబడెను. దానిని సూర్యుఁడుదగ్గఱగనే యతని యందుఁ బ్రవేశించెను. ఆ జ్యోతి కల్గినదానితో సంతసించి ఉంఛవృత్తినున్న బ్రాహ్మణుఁడని తెల్పి యతని మహత్త్వము నాకు సూర్యుఁడు చెప్పెను అని పద్మఁడు భృగునకెఱుకపరచెను. ఆత్మతత్త్వము చెప్పితివి. ఇదియే నే గోరితినని భృగుఁడు చెప్పి చనెను. భార.

పరమేష్ఠి:-దేవద్యుమ్నునకు ధేనుమతి యందుఁ బుట్టిన కుమారుఁడు. ఇతనిభార్య సువర్చల. పుత్త్రుఁడు ప్రతీహుఁడు. భాగ.

పరశురాముఁడు:- రేణుకా జమదగ్నుల పుత్త్రుఁడు. రమణ్వతుఁడు, సుషేణుఁడు, వసువు, విశ్వావసువు ఇతని సోదరులు. ఇతని తల్లి వ్యభిచరించెనని తండ్రి యామెను వధింపుఁడని కొడుకులతోఁ జెప్పెను, పరశురాముని సోదరులు నలుగురు మాతృవధ సేయమని నిరాకరించిరి. జమదగ్ని వారిని శపించి పరశురామునితోఁ దల్లిని వధించి రమ్మని చెప్పెను. వెంటనే రాముఁడు రేణుకను వధించి యా సంగతి తండ్రి కెఱింగించెను. ఇతని ధైర్యసాహసములకును, విధేయతకును మెచ్చుకొని జమదగ్ని వరము వేఁడుకొనుమనియెను. తల్లిని బ్రతికింపుమనియును, సోదరులను శాపవిముక్తులను జేయుమనియును, దనకు సదా జయము కలుగున ట్లాశీర్వదింపుమనియు నితఁడు గోరెను. పరశురాముఁడు పితామహునిఁ జూచు వేఁడుక పుట్టి తండ్రికడ సెలవుగైకొని తాతయగు ఋచీకుని యాశ్రమమునకుఁ బోయెను. అటఁ గొన్నిదినములుండి యౌర్వుని యాశ్రమమునకు వచ్చెను. ఈ మునియొద్ద సెలవుదీసికొని పరశురాముఁడు జమదగ్నిపితామహుఁడగు భృగుముని యాశ్రమమునకు వచ్చుచుండెను. వీని తేజస్సునకుఁ దాళలేక భృగుమునిశిష్యులు కనులు మూసికొనిరి. భృగు వీతని నాదరించి "పుత్త్రక! నీకును, మాకును హితమగుదాని నొక్కటి చెప్పెద; అది లోకహితముకూడ నగును. నీవు హిమాచలమున కేగి శివునిఁగూర్చి తపస్సు చేయుము. నీ కోర్కెలు ఫలించును" అని చెప్పెను. పరశురాముఁడు హిమాచలమునకేగి తపస్సు ప్రారంభించెను. అతని నిశ్చలతపమును జూచి మునులు విస్మితు లగుచుండిరి. ఇతని తపస్సు పరీక్షచేయుటకు శివుఁడు వ్యాధుని రూపమున వచ్చి గట్టిగ నఱచుచు, నీ వెవ్వఁడవు? ఇటకేల వచ్చితివి? అని యడిగినఁ గొంతసేపునకు రాముఁడు కన్నులు తెఱచి వినయముగఁ బ్రత్యుత్తర మిచ్చెను. ఇంకను వ్యాధుఁడు వెడలకుండుటచే "ఓయీ! నీవు దగ్గఱగనుండిన నాకు దోషమగును; దూరముగఁ బొమ్ము. పోవేని నీవుకూడ నిచ్చట గూర్చుండి తపస్సు చేసికొనుము" అని పరశురాముఁడు పలికెను. దానిపై వారిరువురకును గొంత వాదము జరిగెను. తుదకా వ్యాధుఁ డెవరో మహానుభావుఁడై యుండునని పరశురాముఁ డెఱింగి వానికి సాష్టాంగముపడియె. రాముని

భక్తికి మెచ్చుకొని వానిని లేవఁదీసి "రామా! నీవింకను జిన్నవాఁడవు. రౌద్రాస్త్రము ధరింప శక్తి నీకింకను జాలదు. తీర్థయాత్రలు చేసి రమ్ము" అనిచెప్పి శివుఁ డంతర్ధానము నొందెను. రాముఁడు తపమాపి తీర్థయాత్రలు సేవించి తిరిగి యథాస్థానమునకువచ్చి తపముచేసికొనెను.

ఇట్లుండఁగ నింద్రాదిదేవతలు శివునికడకరిగి, "దేవా! దానవులు మా నగరము ధ్వంసముచేయుచున్నారు. నీవే మాకుదిక్కు. వచ్చి రక్షింపు" మని వేఁడిరి. పరశురామునిఁ దీసికొనిరమ్మని శివుఁడు మహోదరుఁడనువానిని బంపెను. రాముఁడు సత్వరముగ శివునికడకు వెళ్ళెను. "రామా! నీవింద్రనగరమునకుఁ బోయి దానవులను వెడలఁగొట్టి ర" మ్మని శివుఁడు చెప్పెను. "దేవా! నీ వెఱుఁగనిది గలదే? దానవులు శక్తిసంపన్నులు. వారిని నేనెట్లు గెలువగలవాఁడ" నని రాముఁడు పలుక శివుఁడు పరశువు అను నస్త్రమును రామునకిచ్చెను. మఱియును శివుని యందుండు తేజస్సు రామునందుఁ బ్రవేశించెను. రాముఁ డింద్రనగరమునకుఁ బోయి దానవుల నటనుండి తఱిమి దేవతల కా పట్టణ మప్పగించి తన స్థానమునకుఁ బోయి యథాప్రకారము తపస్సుచేసికొనుచుండెను. శివుఁ డీతని భక్తికి మిక్కిలి మెచ్చుకొని నిశ్చలభక్తిని, భార్గవాస్త్రమును నతనికిఁ బ్రసాదించెను.

పిమ్మట దల్లిదండ్రులను జూచుటకై వచ్చుచు మార్గమందు నొక బ్రాహ్మణ బాలకునిపైఁ బడ నుంకించు వ్యాఘ్రమును జూచి బాలుని రక్షించు నుద్దేశముతోఁ బులిపై బ్రహ్మాస్త్రము ప్రయోగించెను. వ్యాఘ్రము క్రిందఁబడి గంధర్వరూపమున వచ్చి నమస్కరించి శాపవశమునఁ బులినై యుంటి నని చెప్పి గంధర్వలోకమునకుఁ బోయెను. భయముచే వడకుచుండిన బాలునకు రాముఁ డభయ మిచ్చెను.

ఆ బాలుఁడు శాంతుఁ డను మునియొక్క పుత్త్రుఁడు. తీర్థయాత్రలుచేయుచు మార్గముతప్పి యిటువచ్చెను. అకృతవ్రణుండని అతనిపేరు. ఇతఁడు రామునకు శిష్యుఁడును, మిత్రుఁడును నయ్యెను.

అకృతవ్రణుని వెంటబెట్టుకొని రాముఁడు భృగువునాశ్రమమునకు, నౌర్వఋచీకుల యాశ్రమముల కేగి వారిని సంతుష్టాంతరంగులను జేసి జననీజనకులకడకుఁ బోయెను. వారికిఁ దాను చేసిన కార్యములన్నిఁటిని నివేదించెను. జమదగ్ని యాశ్రమమునకు హయహయుఁడువచ్చి సత్కారమునొంది వెడలెను. రాముఁడును అకృతవ్రణుని వెంటబెట్టుకొని యరణ్యమున కేగెను. అచ్చట నకారణంబుగ రామునకు హృదయము భారముగ నుండుట, మనస్సు వ్యాకులమునొందియుండుట సంభవించెను. ఏకీడురానున్నదోయని రాముఁడు భయపడి గృహమునకుమరలిరాఁగా హయహయునిచేఁ జంపబడిన తండ్రిశవముపైఁ దల్లిపడియేడ్చుచుండుటను జూచెను. ఆమెదుఃఖముతో నిఱువదియొక్కమారులు గుండెలు బాదుకొనెను. ఆమె నోదార్చి నిష్కారణముగ దనతండ్రిని హయహయుఁడు చంపెను గావున నిఱువదియొక్కమారులు క్షత్రియులను వధింతునని రాముఁడు శపథముచేసి తండ్రికగ్నిసంస్కారము చేయబోవుచుండెను. ఇంతలో భృగుమహర్షివచ్చి మంత్రపూతజలమును జల్లి జమదగ్నిని బ్రతికించెను. పరశురాముఁ డట్లు బ్రతికిన తనతండ్రి కుపచారములుచేయుచుఁ దనశపథము నెఱింగించెను. జమదగ్ని కుమారుని శాంతచిత్తునిఁజేయఁజూచెను గాని యకారణముగ వధించువారిని నూరకవిడువరాదని రాముఁడు పల్కెను. పట్టినపట్టు విడువని కుమారుని జూచి నీవు బ్రహ్మకడకుఁబోయి యతఁడు చెప్పిన చొప్పున జేయుమని తండ్రి పల్కెను. రాముఁ డంత బ్రహ్మకడ కేగెను. తాఁ జేసిన సృష్టియందలి క్షత్రియులెల్లరు వధింపఁబడుట కంగీకరింపలేక బ్రహ్మ యేమియుఁ జెప్పలేక పరమేశ్వరునికరుణలేనిచో నీ కిది సాధ్యము కాదు. కావున నీశ్వరునికడ కేగుమనియె.

రాముఁడు పార్వతీ సమేతుఁడై యుండిన శివునికడ కరిగి వానిని బ్రార్థించెను. శివుని కృప యుండినచో నీవు చేయఁజాలని దెద్ది? అయిన నీ కస్త్రములు లేవే? యని పార్వతి పలికెను. శివుఁడాతని కస్త్రములను, గవచమును నిచ్చెను. వానిని బుచ్చుకొని వచ్చుచు, నొక కొలను గట్టునఁబెట్టి రాముఁడు జపము చేసికొను

టకు గూర్చుండెను. ఇంతలో రెండుమృగములు వేటగానిచేఁ దఱుమఁబడినట్లు పరుగిడి వచ్చి యా కొలనుఁ జేరి నీరు త్రావుచుండెను (మూడు నూరిశర్మ) గాని వ్యాధుఁ డెవఁడును రామునకుఁ గోచరింపలేదు. అంత మృగము మృగి కిట్లనియె. "ఈ జపము చేయుచున్నవాఁడు పరశురాముఁడు; మన కిఁక నాపద రాదు. ఇతఁడిపుడు కృష్ణకవచమునకై తపస్సు చేయుచున్నాఁడు. అగస్త్యాశ్రమమునకేగి కృష్ణాఽమృత స్తోత్రమును విననఁగాని యది లభింపదు." ఆ మాటలు రాముఁడు విని యాశ్చర్యమొంది యగస్త్యాశ్రమమునకుఁ జని తన నెఱింగించుకొని కృష్ణస్తోత్రము విని ధన్యుఁడయ్యెను. ఆ మృగములను జంపవచ్చు వేటకానిని మార్గమం దతఁడు చూచి వానిని సంహరించెను. మృగములుగూడ రాముని వెనుకనే వెళ్ళి కృష్ణస్తోత్రమును వినుటచె స్వర్గలోకము నొందెను.

పదపడి రాముఁడు కృష్ణునిఁ బ్రార్థించిన నతఁడు ప్రత్యక్షమై తన తేజంబు నిచ్చెను. ఇప్పటినుండియు నా యంశము నీ యందుండును. దీనిని తిరిగి నేను రఘురామునిఁగ నవతరించి, విశ్వామిత్రునియజ్ఞమును గాచి, సీతను బెండ్లియాడి వచ్చునపుడు గైకొందునని పల్కి కృష్ణుఁ డంతర్థానము నొందెను.

తరువాతఁ బరశురాముఁడు నర్మదయందు స్నానముచేసి కార్తవీర్యుని నగరమున కేగి జమదగ్ని సుతుఁడు పరశురాముఁడు నిన్ను వధించుటకై వచ్చియున్నవాఁడు అని దూతచే రాజునకు వర్తమాన మంపెను. బ్రాహ్మణుఁ డడిగిన లేదనను; యుద్ధ మడిగినవానికి యుద్ధ మిచ్చెదను. అని దూతచేతనే ప్రత్యుత్తరమంపి యుద్ధసన్నద్ధులరు కండు అని రాజు సేనానుల కాజ్ఞ నిచ్చెను. కార్తవీర్యునిసేనలు, పరశురామునిపైఁ బడెను గాని శివుఁ డొసంగిన పరశువుచే రాముఁడు వారిని జిందఱవందఱ చేసెను. మత్స్యరాజువచ్చి యుద్ధముచేసి మడసెను. మగధనిషాదరాజులును, విదర్భనృపతియగు సోమదత్తుఁడును, మిథిలాపతియగు బృహద్బలుఁడును రామునితోఁ బోరిచచ్చిరి. కన్యాకుబ్జాధీశ్వరుఁడుసౌరాష్ట్రాధిపతి, అవంతివీరులు ఒక్కసారిగాశరములతో రాముని ముంచివైచిరి; వానినన్నిఁటిని చెదరగొట్టి రాముఁడు రాజులనుసంహరించెను. సుచంద్రుఁడు ద్వంద్వయుద్ధముచేసి శివునిత్రిశూలమురామునిపై విసరెను. అది పుష్పమాలికయై రాముని కంఠ మలంకరించెను. రామునకు గాళిప్రత్యక్షమై యాగ్నేయాస్త్రముచే సుచంద్రుఁడు హతుఁడగునని చెప్పి యదృశ్యయయ్యెను. సుచంద్రుని పిదప వానికుమారుఁడు పుష్కరాక్షుఁడు వచ్చి యుద్ధముచెసి మృతుఁడయ్యె. అంతటఁ గార్తవీర్యుఁడు స్వయముగవచ్చి యుద్ధము చేయఁ బూనెను. ఇతఁడు త్రిశూలముతో గొట్టఁగ రాముఁడు క్రిందఁబడెను. ఇంతలో దేవతలందఱు వచ్చిరి. శివుఁడు సంజీవనిచేఁ బరశురాముని బ్రతికించెను. రాముఁడు లేచి, శివకవచము పఠించి కార్తవీర్యునిపై బాణమువేసి వానిశిరము వ్రయ్యలుగఁ జేసెను; అతనిపుత్త్రులను సంహరించెను.

అట్లు క్షత్రియవీరులను సంహరించినపిదప నర్మదానదియందు స్నానముచేసి యాచమించి రాముఁడు కైలాసమున కేగి శివునిమందిరము ప్రవేశించుచుండెను. విఘ్నేశ్వరుఁడు వానినాపి ఈశ్వరుఁడుపార్వతితో శయనించియున్నాఁడు. నీవిపుడు పోఁజనదనియె. పరశురామునకును, విఘ్నేశ్వరునకును వివాదము జరిగెను. వీరికి బాహాబాహావిని బోరాటమయ్యెను. విఘ్ననాయకుఁడు తన తొండముతోఁ బరశురాముని నెత్తగ, నతనికి బై ఏడులోకములు గోచరించెను. అతనికి భయమయ్యెను. వినాయకుఁడుచెసిన పరాభవము సహింపలేక రాముఁడు తనపరశువుల వానిని గొట్టెను. గణేశ్వరుని దంతమొకటి విఱిగి క్రిందఁబడియె. ఆ చప్పుడువిని దేవతలు భయమందిరి. పార్వతియు, శివుఁడును బైటకువచ్చి చూచిరి. విఘ్నేశ్వరుఁడు తనకు గలిగిన యాపదను జెప్పుకొనెను. మనవలన నుపకార మొందినవాఁడిట్లు నాపుత్త్రుని గొట్టునా? యని పార్వతికిఁ గోపమువచ్చెను. శివుఁడేమియు జేయలేక కృష్ణునిదలఁచుకొనెను. శ్రీకృష్ణుఁడు వచ్చి పార్వతి నూరార్చి పరశురాముని మన్నించి పుత్త్రభావమునఁ జూడుమని వేఁడెను. రాముఁడు పార్వతిని ప్రార్థించెను.

అచ్చటనుండి రాముఁడు గృహమునకేతెంచి తండ్రికి నమస్కరించి తాఁజేసిన కార్యము

లన్నియు గెలుకపఱచెను. అందఱురాజులను జంపిన పాతకము పోవుటకై మహేంద్ర నగరమున కేగి కొన్ని సంవత్సరములు తపస్సు చేయుమని తండ్రిచెప్పెను. ఆ ప్రకారము రాముఁడు తపస్సు చేసికొనుచుఁ గొంత కాల మరిగినపిమ్మటఁ గార్తవీర్యుని పుత్త్రుఁ డొకఁడు తన తండ్రిని జంపెననియుఁ, దన తల్లి సహగమనము చేసెననియు విని మిక్కిలి యార్తి నొంది సకలక్ష్మానాథులను వధించి వారి రక్తముచేఁ బితృతర్పణము చేసెదఁగాక యని శపథమూని కార్తవీర్యుని పుత్త్రులను, గంటఁ బడిన రాజులనందఱను వధించి యింకను గోప మాగక యాగ్నేయాస్త్రము వేసి కార్తవీర్యుని పురము కాల్చివైచెను.

పరశురాముఁడు హైహయులను, నితర రాజులను దునిమి కృపావిష్టహృదయుఁడై తపోవనమున కరిగెను. తరువాతఁ గొన్ని సంవత్సరములకు విశ్వామిత్త్రుని పౌత్త్రుఁడైన పరావసువు అను రాజు వీనికడకు వచ్చి రాజులకు భయపడి నీ విచట దాగి యున్నావా? అని గేలి చేసెను. మఱియును బరశురాముఁడు చంపక విడిచిన బాల వృద్ధ క్షత్త్రియులను ప్రతర్దనాదులను ప్రోత్సహించి యుద్ధమునకు లేవఁదీసెను. దాన నితఁడు మఱల యుద్ధము పూని యిఱువది యొక్కమారులు వెదకి వెదకి క్షత్త్రియులను సంహరించెను.

పరశురామునకు జడిసి కొందఱు రాజులు స్త్రీలమధ్యను, పశువులమందలలోను దాఁగిరి. బ్రాహ్మణులు మఱల క్షత్రియులను బుట్టించిరని విని పరశురాముఁడు క్షత్రియశిశువులనుగూడఁ జంపెను. ఇట్లిఱువదియొక్కమాఱులు క్షత్రియ వీరులను జంపి కురుక్షేత్రంబున నైదుమడుగులు త్రవ్వించి వానిని రాజుల రక్తముతో నింపి పితృతర్పణ గావించెను. ఇవియే శ్యమంతక పంచకములని ప్రసిద్ధినొందినవి.

రఘురాముఁడు సీతను పరిణయమై యయోధ్యకు వచ్చుచుండఁగ మార్గమందుఁ బరశురాముఁ డడ్డగించెను. తన పుత్త్రుని గాపాడుమని దశరథుఁడు పరశురామునిఁ బ్రార్థించెను. పరశురాముఁడు వీనిమాటలనలక్ష్యముచేయక రాముని మర్దింపక మాన ననెను. మఱియు రాముఁడు శివునిచాపమును విరచినందుకు హేళనగఁ బలుకుచుఁ దన చాపము నెక్కుపెట్టు మనెను. రఘురాముఁ డుగ్రకోపంబున భార్గవుచాపము లాగి వాని నవలీలగ సంధించెను. అంత భార్గవుఁడా శ్రీరాముఁడు విష్ణువే యని గ్రహించి యితనికిఁ బ్రదక్షిణముచేసి యరిగెను.

పరశురాముఁడు పితరులకుఁ దర్పణ లిచ్చుచుండఁగ వారు "నాయనా! నీవు చేసిన పాతక మింకను బోలేదు. వ్రతమాచరింపుము" అనిరి. అతడు మహేంద్రనగరమునకరిగి తపస్సు చేసికొనుచుండెను. మునులువచ్చి యశ్వమేధమును జేయుమనిరి. యాగము చేయ రాముఁడు ప్రారంభించెను. మునులు చూడవచ్చిరి. వచ్చిన వారిని కుశలమడుగఁగ గోకర్ణక్షేత్రము సముద్రముచే ముంపఁబడినదని తెలియఁజేసి దాని నుద్ధరింపవలసినదని వేఁడిరి. "అయ్యా! నాతండ్రి యాజ్ఞచే వ్రతముచేయుచున్నవాఁడను. ఇపుడు నాకు శరములు పూననెట్లగును?" అని రాముఁడు శంకించుచుండ శుష్కుఁడను ముని దానివలనఁ బాపమురాదనిచెప్పెను. పరశురాముఁడు మునుల వాంఛితమునుదీర్ప బయలువెడలెను; సముద్రము కడ కేగి, గోకర్ణమునువీడి యావలకు బొమ్మని చెప్పుటకై వరుణుని బిలిచెను. కాని వరుణుఁడు రాలేదు. శాంతముతోడనే రాముఁడు మరలఁ బిలచెను. అపుడునురాలేదు. పరశురాముఁడంతట నాగ్నేయాస్త్రము సంధించెను. అగ్గి పుట్టి యందంతటను వ్యాపించెను. సముద్రుఁడు భయపడి వచ్చి రాముని శరణువేఁడ, నీ వెంత దూరము పొమ్మనినఁనంతదూరముపోయెద నానతిమ్మనియె. ప్రదేశము చూపుటకై రాముఁడు స్రువమును విసరెను. అది రెండుయోజనముల దూరమునఁ బడెను. అంత ప్రదేశమునుండి సముద్రము తొలఁగిపోయెను. బ్రహ్మ.

పరశురాముఁడు మహేంద్రనగరముపైనున్నపుడు కర్ణుఁడు వచ్చి తనకు బ్రహ్మాస్త్ర ముపదేశింపుమని కోరెను. తాను బ్రాహ్మణుఁడే యని చెప్పెను. పరశురాముఁడు వాని కాయస్త్రముపదేశించెను. ఒకనాఁడుకర్ణునితొడపైఁదలయుంచి పరశురాముఁడు నిదురించుచుండెను; ఆసమయమున నే కీటక మొకటి కర్ణునితొడక్రిందఁజేరి వాని

తొడను దొలుచుచుండెను; గాయము తగిలి రక్తము వచ్చుచుండెను. కాని పాదము కదపినచోఁ బరశురామునకు నిద్రాభంగము వచ్చునని సంకోచించి కర్ణుఁడు బాధనొందుచున్నను వల్లెయుండెను. రక్తము తగిలి పరశురామునకు మెలఁకువ వచ్చెను. కర్ణునిగాయము చూచెను. ఇంత రక్తము కారుచుండినను నీవు కాలుకదపకుంటివి; ఇంతధీరత బ్రాహ్మణున కుండదు; అనిపలుకఁగఁ గర్ణుఁడు భయపడి తానునూతజుఁడనని చెప్పెను. అసత్యము పలికి విద్య నేర్చుకొనెను గానఁ గర్ణునియస్త్రవిభవము వికలమగునట్లు రాముఁడు శపించెను. పరశురామునిజూడఁగనే కీటకమునకు శాపవిమోచనమై వెడలిపోయెను.

ఇతని నొకనాఁ డరణ్యములో హోత్రవాహనుఁడను రాజర్షియు, వానికూఁతురు అంబయుఁ జూచిరి. అంబను భీష్ముఁడు గొనిపోవుటయును, ఆమె సాళ్వునివరించి యుండుటయును, ఆమెను సాళ్వుఁడు నిరాకరించుటయును జెప్పుకొనిరి. భీష్ముని వంచింతునా? సాళ్వుని వంచింతునా? యని పరశురాముఁ డడిగెను. వారికి భీష్మునిపైఁ గోప మెక్కుడున్నదిగాన భీష్మునే వంచింపుమనిరి. రాముఁ డంబను దీసికొని భీష్మునికడకు వచ్చెను. ఆమెను బరిగ్రహించుమని భీష్ముని గోరెను. పరుని వలచియున్నదానిని గైకొనవని భీష్ముఁడు నిరాకరించెను. అంత రాముఁడతనితో యుద్ధముచేసెను. ఇరువదినాల్గుదినములు పోరు సాగినది. ఇరువురు సమానబలముతో నుండిరి. ఋషులు, దేవతలువచ్చి మీరుయుద్ధము మానుఁడని కోరిరి. పరశురాముఁడు మాని యిఁక నేను చేయవలసినదిలేదని చెప్పి వెడలిపోయెను. భార.

ఇరువదియొక్క మారులు క్షత్రియులను వధించి పిమ్మట భూమినంతను బరశురాముఁడు కశ్యపునకు దానముచేసెను. తనకు దానమిచ్చిన భూమియం దుండక దక్షిణాబ్ధి దాటి పొమ్మని కశ్యపుఁడురామునితోఁజెప్పెను. పరశురాముఁడు దాటి వెడలెను. సముద్రుఁ డీతనికి వెలిచి చోటిచ్చెను. భార.

పరశురాముఁడు:—రాఁబోవు సూర్యసావర్ణికమను కాలమున నితఁడు సప్తర్షులలో నొకఁడగును. భార.

పరసువు:—ఒకరాక్షసుఁడు; కామరూపి. బ్రాహ్మణహంతకుఁడు. వీఁడొకనాఁడు బ్రాహ్మణరూపమున శాకల్యముని యాశ్రమములోనికి వెళ్ళి, నా కాకలియగుచున్నది. ఆహారము పెట్టుమని కోరెను. ముని వానికి వడ్డించెను. వీఁడు పరిషేచనము చేసి నా కీ యాహారము చాలదు. నేను రాక్షసుఁడను. నిన్నుఁగూడ నమలివేసెదననియెను. ఆపాదమస్తకము బ్రహ్మాదిదేవతలు నన్నుఁ గాపాడుచుందురు. నీవు నన్ను నమలు టేమి? ఆహారము భుజించి పొమ్మని ముని చెప్పెను. కాని రాక్షసుఁడు లేచి మునికి దగ్గఱగ వెళ్ళెను. ముని వేయితలలు, రెండువేల చేతులు గలవాఁడుగ రాక్షసునకు గనఁబడెను. పరసువు భయపడి నీవు సామాన్య నరుఁడవు కావు. నన్ను క్షమింపుము. నాకు జ్ఞాన మిమ్ము అని ప్రార్థించెను. గౌతమీనదిలో స్నానముచేసి సరస్వతిని బ్రార్థించుమని శాకల్యముని చెప్పెను. బ్రహ్మ

పరావసుఁడు:—ఒక బ్రాహ్మణుఁడు. రైభ్యుని కుమారుఁడు. అర్వావసుని తమ్ముఁడు. ఈ సోదరు లిరువురు వేదాధ్యయన సంపన్నులు. వీరిపై యవక్రీతునకు నీర్ష్య మెండుగ నుండెడిది. అతఁ డొకనాఁడు పరావసుని భార్యయైన కృష్ణను గామించి తన వలపు తెలిపెను. రైభ్యుఁడు వానిని జంపించెను.

పరావసుఁడును, అర్వావసుఁడును బృహద్ద్యుమ్నుఁడను రాజు యాగము చేయించుట కేగిరి. పరావసుఁ డొకనాఁడు చీకటిలో వచ్చుచుఁ దన కెదురుగ వచ్చుచున్న తండ్రిని జూచి మృగమని భ్రమచెంది తండ్రిని గొట్టెను; పదపడి దగ్గఱకువెళ్ళి మరణించిన తండ్రిని జూచి మిక్కిలి విచారించి యా సంగతి తన యన్నతోఁ జెప్పి రాజుయాగ మతనేని చేయించుమనెను. అర్వావసుఁడు తానొక్కఁడే చేయించలేననుటచేఁ బరావసుఁడే వెళ్ళి యాగము పూర్తిచేయించెను. అర్వావసుఁడు తన గృహమునకేగి పరావసుని బ్రహ్మహత్యా పాతకము పోవుటకు యాగములుచేసెను

అతఁడు మరల బృహద్ద్యుమ్నునియాగమునకు రాఁగా “అర్వావసుఁడు ఉగ్రకర్మలు చేసి వచ్చినవాఁడు. ఇటకు రాదగఁ” దని యితఁడు చెప్పెను. “పరావసుఁడే బ్రహ్మఘాతము చేసి

వనియును, వానిపాతకమును నేను బోఁగొట్టితి" వనియును అర్వావసుఁడు చెప్పెను.

పరావసువు:-ఒక రాజు. విశ్వామిత్రుని పౌత్రుఁడు. పరశురాముఁడు హైహయు లను పెక్కుర రాజులను సంహరించి పిమ్మటఁ గృపావిష్ట హృదయుండై తపస్సు చేసికొనఁబోయెను. అప్పు డీ రాజు గర్వముతో వానికడకుఁ బోయి "క్షత్త్రియులకు భయపడి నీవిట దాగితివా ?" అని గేలిచేసెను. మఱియును బరశురామునిచేఁ జావకయున్న ప్రతర్దనులను బాలవృద్ధులగు క్షత్త్రియులను బ్రోత్సహించి యుద్ధమునకై పురికొల్పెను. పరశురాముఁడు మఱల వచ్చి వెదకి వెదకి క్షత్త్రియులను గర్భములో నున్నవారిని గూడ సంహరించెను.

పరాశరుఁడు:- పైలునిశిష్యుఁడగు బాష్కలుని శిష్యుఁడు. ఋగ్వేదసంహిత నుపదేశము నొందెను. భాగ.

పరాశరుఁడు:-వసిష్ఠునిపౌత్త్రుఁడు; శక్త్రిపుత్త్రుఁడు. ఇతనితల్లి అదృశ్యంతి. పరాశరుఁడు జన్మింపని పూర్వమే యతనితండ్రిని రాక్షసుఁ డొకఁడు మ్రింగివేసెను. పరాశరుఁ డొకనాఁడు తల్లిని జూచి "నీవిట్లేల యమంగళవుగ నుంటివి ? నా జనకుఁ డెచ్చట నున్నాఁడు ?" అని యడిగెను. వానిని రాక్షసుఁ డొకఁడు సంహరించెనని యామె చెప్పఁగ నితఁడు తండ్రిని జూచివచ్చెదనని పితామహుఁడగు వసిష్ఠునితోఁ జెప్పెను. అతఁడు శివుని నారాధింపుమని బోధించెను. పరాశరుఁడు శివునిఁగూర్చి ప్రార్థించెను. శివుఁడు ప్రత్యక్షముకాఁగా దనతండ్రిని జూడఁగోరుచున్నానని పరాశరుఁడు చెప్పెను. శివప్రసాదమునఁ బరాశరుఁడు స్వర్గముననున్న తన తండ్రినిఁజూచెను. అచ్చటినుండివచ్చి, తన తండ్రిని రాక్షసుఁడు చంపెనుగావున రాక్షస వినాశార్థము క్రతువుచేయుచుండెను. రాక్షస కులములు నశించుచుండెను. పులస్త్యాది మును లటకువచ్చి యాక్రతువును మానుమనికోరిరి. వారిమాటవిని పరాశరుఁడు క్రతువుమాని యాయగ్నిని హిమాలయములకు నుత్తరముగా విడిచెను.

పరాశరుఁడు తీర్థయాత్రకుఁజనుచు యమునా నదియందు పడవ నడుపుచుండిన మత్స్యగంధినిఁ జూచి మోహించెను. ఆమె కన్యక గావునఁ దల్లిదండ్రులచే నీతని కివ్వఁబడకపూర్వ మీతని కోర్కె తీర్చుటకు వెఱచెను. పరాశరుఁ డామె కన్యాత్వము దూషితముకాదని యభయమిచ్చి శరీరసౌగంధ్య మేర్పడునట్లు ప్రసాదించి దివ్యాభరణములిచ్చి యమునానదీతీరమునఁ జీకటిని గావించి యామెతో సంగమించెను. వీరికి వ్యాసుఁడు జన్మించెను. భాగ.

పరీక్షిత్తు:-కురుని కుమారుఁడు. భాగ.

పరీక్షిత్తు:-ఒక సూర్యవంశపురాజు. వేఁటకేగి యొక సుందరాంగిని జూచి మోహించి తన యభిప్రాయ మెఱింగించెను. నన్నెన్నఁడును జలమునందు దింపకుంటివేని నిన్నుఁ బరిణయ మయ్యెదనని యామె యనియె. రాజట్లే శపథము గావించెను. పరీక్షిత్తును, నామెయుఁ గొంతకాలము గాపురము చేసిరి. కొంతకాల మైనపిదప రాజు తనశపథమును మఱచి యొకఁ వేసవిరోజునఁ గొలనులోదిగి భార్యనుఁగూడ దిగుమనియె. ఆమె వెంటనే దిగి యదృశ్య యయ్యెను. ఆమెకై కొలనంతయు వెదకించెను. ఎచ్చటను గనఁబడలేదు. కప్పలు మాత్ర మున్నవి. ఆకప్పలే ఆమెను అపహరించి యుండునని కప్పలనన్నిఁటిని జంపుఁడని ఇతఁడు కింకరుల కాజ్ఞయిచ్చెను. వారు కప్పలను జంపఁ బ్రారంభించిరి. ఆయువు అను మండూకరాజు వృద్ధబ్రాహ్మణ వేషమున వచ్చి "అయ్యా ! కప్ప లేమిచేసినవి ? వానినివధించెద వేల ?" యని యడుగఁగ "వవి నాభార్యను బాధించినవికాబట్టి నేను వానిని వధింపక మాన" నని రాజనియె. "ఓ రాజా ! నేను కప్పలయొక్క రాజును. ఆ వనిత నా కుమారిత సుశోధన యనునది. ఇట్లు "పెక్కురరాజులను వంచన చేసినది" అని యాయువు చెప్పెను. నీవామెనుదెచ్చి నాకిత్తువేని కప్పలను జంపుట మానుదునని పరీక్షిత్తు చెప్పెను. ఆయువు తలఁచినంతనే యామెను రావించి "నీ విట్లు పెక్కురాజులను వంచించితివి. కావున నీకుమారులు కపటవర్తను లయ్యెదరు" అని శపించెను. రాజు సంప్రీతుఁడై యామెను గైకొని యామెయందు శలుఁడు, దలుఁడు, వలుఁడు అను కుమారులను గనియెను. పెద్దవానికిరాజ్యమిచ్చి తానడవులకుఁజనియెను.

పరీక్షిత్తు:-అభిమన్యుని పుత్త్రుఁడు. ఇతనితల్లి ఉత్తర. తల్లిగర్భమం దున్నప్పుడే అశ్వత్థామ బ్రహ్మశిరోనామకాస్త్రము వేసి వీనిం గొట్టెను. దానిచేఁ గల్గినబాధ కోర్వలేక యుత్తర శ్రీకృష్ణుని బ్రార్థించెను. అతనికరుణచే బాధ నివారణ యయ్యె. గర్భమందున్న శిశువు బ్రతికెను. ఈతఁడు తనకుఁ దల్లిగర్భమునఁ గనఁబడిన దేవుఁడే లోకమందంతటను గలఁడని పరీక్షించుటచే నీతనికిఁ బరీక్షిత్తు అను నామము వచ్చెను. ఇతఁడు ఉత్తరునిపుత్త్రికయగు ఇరావతిని వివాహము చేసికొనెను. ఇతనికుమారుఁడు జనమేజయుఁడు. ధర్మరాజు రాజ్యము చాలించి సోదరులతో హిమాలయమున కేగకపూర్వమే పరీక్షిత్తునకు బట్టముగట్టిరి.

శ్రీకృష్ణుఁడు నిర్యాణముచెందుటచే భూదేవి విషణ్ణయై యుండెను. ధర్మదేవుఁడు గూడ నామెతోఁబాటు విచారము నొందుచు నొంటికాలిని నడచుచుండెను. అపుడు కలిపురుషుఁడు వృషభరూపుఁడై ధర్ముని దన్నెను. అది పరీక్షిత్తుచూచి కలిపురుషుని దండించెదనని భీకరముగఁ బల్కెను. కలి భయపడి మ్రొక్కెనఁ దన రాజ్యమునుండి పొమ్మని పరీక్షిత్తు ధర్ముని నాల్గుపాదములను నడిపించెను.

పరీక్షిత్తు:-త్రికాలవేదియగు బ్రాహ్మణుఁ డొకఁ డుపప్లావ్యమునకు వచ్చి యుత్తరను జూచి నీ పుణ్యంబునఁ బ్రాణంబులు పరిక్షీణంబులైన పుత్త్రుఁడు జన్మింపఁగలవాఁడు. అది కారణముగ వానికిఁ బరీక్షిత్తు అను నామము కలుగునని చెప్పెను. భార.

పరీక్షిత్తు అఱువదియేడులు రాజ్యముచేసెను. ఇతఁ డొకనాఁడు వేఁటకై కాననమున కరిగి యందొక మృగమును దఱిమి తఱిమి శమీకుఁ డను మునియాశ్రమము జేరి మృగ మేమయ్యెనని సమాధియందున్న యా ముని నడిగెను. అతఁడు ప్రత్యుత్తర మియ్యకుండుటచే నితనికిఁ గోపమువచ్చి యచ్చటనున్న సర్పశవమును ముని మెడమీఁద వేసెను. మునికుమారుఁడు శృంగి యనువాఁ డది చూచి నిష్కారణముగ మా తండ్రిమెడపై సర్పమును వేసెను గావున నతఁ డేడుదినములలోఁ దక్షకవిషముచే మృతి నొందునని శపించెను. శమీకుఁడీ వృత్తాంతమంతయుఁ దెలిసికొని రాజును శపించినందుకు విచారించి శాపము నెఱింగించి కర్తవ్యమును జేసికొమ్మని చెప్పుటకుఁ బరీక్షిత్తునికడకుఁ దన శిష్యుని బంపెను. పరీక్షిత్తు తాఁజేసిన నేరమునకు వగచుచు సర్పములకు దుర్గమమైనచోట హర్మ్యమొకటి నిర్మించుకొని యందే భద్రముగ నుండుచుఁ బ్రాయోపవిష్టుఁడై శ్రీశుకునివలనఁ బుణ్యకథలను వినుచుండెను. ఏడవనాఁడు బ్రాహ్మణవేషధారులైన సర్పములువచ్చి నిమ్మపండ్లను గానుకఁగ నిచ్చిరి. ఆ కపటబ్రాహ్మణు లిచ్చినవానిని గైకొని పరీక్షిత్తు ఒక పండును వాసనచూచెను. ఆ పండునందదివరకే దాగి యుండిన తక్షకుఁడు బైటకువచ్చి కఱచెను. పరీక్షిత్తు శాపమును దప్పించుకొనలేక మృతుఁ డయ్యెను. భార. భాగ.

పరీక్షిత్తుఁడు:-అనశ్వని కుమారుఁడు. ఇతనిభార్య సుయశ. కుమారుఁడు భీమసేనుఁడు. భార.

పర్ణాదుఁడు:- ఒక బ్రాహ్మణుఁడు. నలునిగూర్చి వెదకుటకై దమయంతిచే నితఁడు పంపఁబడెను. దమయంతి చెప్పినయట్లే ప్రశ్నించుచు వానికిఁ దగుప్రత్యుత్తరము నిచ్చినవాని వికృతరూపుని నొక్కనినే ఋతుపర్ణుని రాజ్యమునఁ జూచి వచ్చితినని దమయంతితోఁ జెప్పెను. భార.

పర్వతములు:-ప్రజాపతిసంతానము. వీనికి ఱెక్కలుండెడివి. పర్వతములు తమ యిచ్చవచ్చిన చోటున కెగిరిపోయి వ్రాలుటచే భూమికిని, ప్రజలకును బాధలు కలుగుచుండెను. దాని నివారించుటకై యింద్రుఁడు పర్వతముల ఱెక్కలు తెగఁగొట్టెను. ఈ ఱెక్కలే మేఘములయ్యె.

పర్వతుఁడు:- శిలాదుని పుత్త్రుఁడు. ఇతఁడు ఈశ్వరుని బ్రార్థించి పర్వతమయ్యెను. (చూడుము శ్రీశైలము.)

పర్వతుఁడు:- ఒక ముని. నారదుని మేనల్లుఁడు. మూఁడులోకము లందును సంచరించువాఁడు ఇతఁడును, నారదుఁడును నంబరీషుని కూఁతురు శ్రీమతినిఁజూచి యామెను వివాహము కాఁగోరిరి. వీరిలో నొకని కిత్తునని యంబరీషుఁడు చెప్పెను. నారదుని నామె వరింపకుండుటకై విష్ణుమూర్తి

కడకుఁ బర్వతుఁడు వెళ్ళి నారదుని ముఖము కోతిముఖమువలెఁ గనఁబడునట్లు చేయుమని కోరెను. అదేయుద్దేశముతో నారదుఁడు వచ్చి పర్వతునిముఖము కోతిముఖమువలె నుండునట్లు చేయుమని విష్ణువును గోరెను. వీరిద్దఱి కోర్కెలను విష్ణువు తీర్చెను. శ్రీమతి స్వయంవరమునకు వీరిఱువురును, విష్ణుమూర్తియును వెళ్ళిరి; ఆమె వీరిని మాని విష్ణువునే వరించెను. ఇతఁడును, నారదుఁడును తాము వరించిన శ్రీమతి విష్ణువునింట నుండుటఁ జూచి వారికి వియోగము కల్పించినందుకు దుఃఖించి నీవు భార్య నెడబాసి వియోగదుఃఖము నొంది తుదకు వానరుల సహాయమున భార్యను బొందుదువని విష్ణువును శపించిరి. లింగ. శివ.

పర్వతుఁడును, నారదుఁడును త్రిలోకసంచారము చేయుచు నొకరి హృదయములోనున్న దానిని నొకరు దాచక రెండవవారికిఁ జెప్పునట్లును, జెప్పనివాఁడు శపించుటకును నొడంబడిరి. వీరు సృంజయుఁడను రాజుకడకు వెళ్ళి కొంతకాలముండిరి. ఆతనికుమారిత సుకుమారిని వీరికిఁ బరిచర్యలు చేయ రాజు నియోగించెను. సుకుమారిని నారదుఁడు వలచెను. కాని యా సంగతి పర్వతునకుఁ జెప్పలేదు. పర్వతుఁడిద్దాని నెఱింగి నారదునకుఁ గోతిముఖము వచ్చునట్లు శపించెను. నారదుఁడితనికి నాకలోక సంచారము లేకుండునట్లు శపించెను. కొంతకాలమున కొకరి నొకరు అరణ్యములోఁ గలసికొని శాపవిమోచనము గావించుకొనిరి. మరలి వచ్చిననారదుని సుకుమారి ఆనవాలు పట్టలేక పరునిఁగఁ దలఁచెను. పర్వతుఁ డామెకు శాప వృత్తాంతము చెప్పెను. భార.

సృంజయున కుపకారము చేయఁదలఁచుకొని యతనికిఁ గుమారుఁడు కలుగునట్లు నారదుఁడు వరమిచ్చెను. అతఁడు అల్పాయుష్కుఁడగునని పర్వతుఁడు పలికెను.

పలితుఁడు:—ఒక యెలుక. వీనికిని, రోమశుఁడను పిల్లికిని జరిగిన సంవాదము భారతములోఁ జెప్పఁబడెను. నిరసుఁడగు రాజు బలవంతులగు శత్రువులనుండి యెట్లు తప్పించుకొనుట? యని ధర్మజు డడుగఁగా దానికి భీష్ముం డీ యితిహాసమును జెప్పెను.

ఎలుక చెట్టుక్రింద కలుగులో నుండెను. చెట్టుపైఁ బిల్లియుండెను. ఒకనాఁ డొక బోయవాఁడు పన్నిన వలలోఁ బిల్లి చిక్కుకొనెను. ఎలుక యాహారమునకై బయటికి రాఁగా నది యొక ముంగికిని, గూబకును గోచరించెను. ఈ రెండింటిని దప్పించుకొని పోవుట యసంభవమనుకొని, యయినను ధైర్యము తెచ్చుకొని తగిన వెఱ వాలోచించెను. రోమశునిఁ జూచి "నీ యురిత్రాళ్ళు త్రెంపి నిన్ను ముక్తునిఁ జేయఁగలను గాని గూబను, ముంగిని జూచి భయపడుచున్నాను" అనఁగా "సత్వరముగా రమ్ము. నన్నుఁజూచి నీకవి యపకారము చేయఁజాల" వని చెప్పెను. పిల్లికడ నెలుక చేరి యుండుటఁజూచి ముంగిసయును, గూబయును వెళ్ళిపోయినవి. ఎలుక యురికొఱకక యుండుట చూచి రోమశుఁ డిట్లనెను. "నీవూరకుంటివేమి? కృతఘ్నత తగ" దని చెప్పఁగా, నేను కృతఘ్నుఁడను గాను. ఇప్పుడు త్రెంపిన నీ వేమి చేయుదువో యనుకొనుచున్నాను. బోయవాఁడు వచ్చుచుండుట చూచి త్రెంపెదను. అప్పుడు వానినిజూచి భయపడి చెట్టుమీదికిఁ బాఱిపోవుదువుగాని నన్ను భక్షింపఁదలఁపవు" అని చెప్పెను. అట్లేచేసెను. అప్పుడే ఎలుక కూడఁ దన కలుగులోనికిఁ బోయెను. తన కుపకారము చేసిన వానిని సత్కరింతును రమ్మని రోమశుఁడు కోరెనుగాని రాత్రి యంతయు నీ వలలోఁ జిక్కుకొని యుంటివి. నీ కాహారము లేదు. నీ కపుడేమి బుద్ధిపుట్టునో, నీవార లేమిచేయుదురో నీకు దూరముగ నందక యుందు ననెను. భార.

పల్లవుఁడు:— జహ్నుని మనుమఁడు. అజహ్నుని కుమారుఁడు. వీనిపుత్త్రుఁడు కుశికుఁడు. భార.

పల్వలుఁడు:—ఒక దనుజుఁడు. ఇల్వలుని కుమారుఁడు. వీఁడును యజ్ఞములను బాడు చేయుచుండువాఁడు. నైమిశారణ్యమునకు వచ్చిన బలరామునితో వీనిని సంహరింపుమని మునులు చెప్పికొనిరి. బలరాముఁడు వీనిని సంహరించెను. భాగ.

పశుపతి:— శివుఁడు. దక్షునియజ్ఞమునకు దేవతలందఱు వచ్చియుండిరి. యజ్ఞము ధ్వంసము చేయుటకై రుద్రుఁడు భూతపిశాచములను బుట్టించి దేవతలనుగూడఁ జెండాడుచుండెను.

దేవతలందఱు మేము దక్షునిగూడి పశువులైతిమి. మమ్ము రక్షింపుము, రక్షింపుమని శివునిఁ బ్రార్థించిరి. వీరి ప్రార్థనలకు సంతసించి రుద్రుఁడు మీరు దక్షునిఁగూడి పశువులైతిరి. మిమ్ములను రక్షించెదను. మిమ్ములను గాపాడుటచే నేఁటి మొదలు నేను పశుపతి యనఁబరగుదు ననియె.

పశుపతి:- శివుఁడు. (చూడుము గోవులు.) వరా.

పశుసఖుఁడు:- ఇతఁడును, నితని భార్య యగు చండియును సప్తఋషులను గొలిచియుండు వారు. (చూడుము సప్తఋషులు) భార.

పా

పాంచజన్యము:- పంచజనుఁ డను దనుజుని శరీరములో నున్న శంఖము. బలరామకృష్ణుల గురువైన సాందీపుని పుత్త్రుఁడు ప్రభాసతీర్థమునకు వచ్చి జలకము లాడుచుండఁగ నొక కెరటము వచ్చెను. దానితోఁ గొట్టుకొనిపోయి వాఁడు మునిగెను. సముద్రమునందున్న పంచజనుఁ డను దనుజుఁడు వానిని మ్రింగెను. సాందీపుఁడు తన గురుకట్నముగఁ బోయి నా కుమారునిఁ దీసికొనిరండని బలరామకృష్ణులను గోరఁగ వారు సముద్రునికడకు వచ్చి వానిని బిలిచి గురుపుత్త్రు నిమ్మని కోరిరి. ప్రభాసతీర్థమునన్న పంచజనుఁడు మ్రింగెనని సముద్రుఁడు చెప్పెను. అంతట వారు ప్రభాసతీర్థములో దిగి పంచజనుని జూచి వాఁడు మ్రింగెనని వాని శరీరమును జీల్చిరి. అందు శంఖమున్నది. అదే పాంచజన్యము. దీనిని శ్రీకృష్ణుఁడు పుచ్చుకొని యమపురి కరిగి అచ్చట దాని నూదెను. ఆ నాదమునకు యముఁడదరిపడి వచ్చి శ్రీకృష్ణుని జూచి వచ్చినపనిని దెలిసికొని సాందీపుని యొక్క పుత్త్రు నిచ్చి పంపెను. భాగ.

పాంచజన్యుఁడు:- (అగ్ని) కాశ్యపుఁడు, వాసిష్ఠుఁడు, ప్రాణుఁడు, ఆంగిరసుఁడు, చ్యవనుఁడు అను నేవురును దేజస్వియగు పుత్త్రునిఁ బడయుదుమని మిక్కిలి ఘోరతపముచేసి మహా వ్యాహృతిస్మరణంబు చేసిరి. ఇట్లు పంచజన ప్రభావుఁ డగుటవల్ల వానికీ పేరు వచ్చినది. భార.

పాండురాజు:- విచిత్రవీర్యుని క్షేత్రజ కుమారుఁడు. విచిత్రవీర్యుఁడు సంతానములేక చనిపోయెను. అతని వంశమువా రెవరును లేకపోయిరి. అట్లు వంశము క్షీణతనొందుటకు వెఱచి విచిత్రవీర్యుని తల్లి యతని భార్యయగు అంబాలికను వేదవ్యాసుని వలనఁ బుత్త్రునిఁ బడయుమని నియోగించెను. అంబాలిక వ్యాసుని జేరెను. కాని యాతని రూపుచూచి, యామె వెల్లనై యుండుటచే నామెకుఁ బాండు దేహుఁడైన కుమారుఁడు పుట్టెను. అతనికిఁ బాండురాజని పేరువచ్చెను. ఇతఁడు భీష్మునిచేతనే పెంపఁబడి సకలవిద్యలను నేర్చుకొనెను. పాండురాజు కుంతిని స్వయంవరమున వివాహమయ్యెను. మఱియు మద్రరాజ తనయయగు మాద్రినిఁ బరిణయమయ్యెను. ఇతఁడు అన్నయగు నంబిక పుత్త్రుఁడు. ధృతరాష్ట్రునకుఁ దోడునీడయై యాతఁ డంధత్వముచే జేయలేని రాజ్యకార్యములను జేయుచుండువాఁడు. దిగ్విజయార్థమరిగి సకలభూపతులను గెల్చి యపరిమిత ధనములు తెచ్చి ధృతరాష్ట్రున కిచ్చుచుండువాఁడు. పాండురాజు శ్రీనిలయుఁడై, శిష్టప్రియుఁడై యుండెను.

పాండురాజునకు మృగయావ్యసనము మెండు. పెద్దకాలము భార్యలతో నరణ్యముల కేగి యటనే కాలము గడుపువాఁడు. ఒకనాఁడు వేఁటాడ బైలుదేఱెను గాని మృగము లేవియుఁ గనఁబడవయ్యెను. తుదకు మన్మథక్రీడ సల్పుచుండిన రెండు మృగములు మాత్రము గోచరించెను. వానినే పాండురాజు బాణముతోఁ గొట్టెను. శరహతమైన మృగమొకటి క్రిందఁబడి నిజాకారమును దాల్చి తాను కిందముఁడను మునియనియు, నట్లు విహరించుచుంటి ననియు, మన్మథ క్రీడలఁ దేలుచుండిన మృగములను గొట్టుట నీతికాదనియుఁ జెప్పెను. తనను నిందించుచున్నాఁ డనుకొని పాండురాజు అలుక పూని నేను శత్రువులనైన క్షమింతునుగాని మృగములను జూచి కొట్టక మాననననియె. ఆ మాటలకు మునికిఁ గోపమువచ్చి నీ ప్రియాసంగము మైనపుడే నీకు మరణము సంభవించు ననియు, నీ భార్యయు నీతోడనే చచ్చుననియుఁ శపించెను.

అప్పటికిఁ బాండురాజునకుఁ జింత పుట్టెను. ఇఁక హస్తినాపురమునకు బోనిచ్ఛగించలేదు. సతీసంగమము మాని మునివృత్తిని నరణ్యమందే చరించుచుండెను. కుంతియు, మాద్రియు నతని విడిచి వెళ్ళమనిరి. పాండురాజు భార్యలతోడనే యరణ్యవాసము చేయుచుఁ దపస్సుచేసికొను చుండెను.

ఇతఁడు శతశృంగమునఁ దపస్సుచేసి యూర్ధ్వ లోకమున కరుగుచుండిన దేవర్షిగణములను జూచి వారివెంట భార్యాసమేతుఁడై యరుగయత్నించె. ఆ మార్గము నరులకును, ననపత్యులగువారికిని దుర్గ మంబని దేవర్షులుచెప్పుటచేఁ బాండురాజు మరలి, సంతానముఁ బడయుమని భార్యను నియోగించెను. అపుఁడు కుంతికి దుర్వాసుఁడిచ్చిన వరమును నామె యెఱింగించి భర్త యనుమతిని బడసి ధర్మునివలన నొకపుత్రుని ధర్మజునిఁ బడసెను. మఱియు వాయుదేవునివలన భీమునిఁ బడసెను. పిమ్మటఁ బాండురా జింద్రునిఁగూర్చి యొక్క సంవత్సర మారాధించి పుత్రునికై వరమునుగైకొని కుంతిని నియోగించెను. ఇంద్రునివలన నామె యందు అర్జునుఁడు జన్మించెను. మాద్రికూడ సంతానము వడయఁగోరి భర్తనువేఁడెను. కుంతి యనుమతివడసి సంతానము పొందుమని పాండు రాజు చెప్పెను. మాద్రి కుంతీ సహాయమున అశ్వినీదేవతలను రావించి వారివలన నకుల సహ దేవులను గనెను.

పాండురాజును, భార్యలును దపోవృత్తినే యుండిరి. ఒకనాఁడు కుంతి బ్రాహ్మణులకు భోజనము పెట్టుసమయమున నతిశయరూపలావ ణ్యయగు మాద్రినిజూచి పాండురాజు రతివిభ్ర మమున ఆమె వలదనినను వినక గిందముని శాప మెనుఁదలఁపక మాద్రిని గవయఁజూచెను. కాని తోడనే మునిశాపమువలనఁ బ్రాణములు విడ చెను. మాద్రి యితనితో సహగమనము చేసెను. భార.

పాక:- కుబేరునిచే విశ్రవసునకుఁబరిచర్యలు చేయుటకుఁ బంపఁబడిన ముగ్గురు రాక్షసాంగనలలో నీమె యొకతె. ఈమెకు విశ్రవసుని వలన ఖరుఁడును, శూర్పణఖయును బుట్టిరి. భార.

పాకుఁడు:- జంభుని సోదరుఁడు. దేవదానవ యుద్ధ ములో ఇంద్రుఁడు వీనిని సంహరించెను. భాగ.

పాకుఁడు:- వృత్రాసురుని తమ్ముఁడు. ఇంద్రుఁడు వీనిని జంపెను. కావున నతనికిఁ బాకశాసనుఁ డను పేరువచ్చెను.

పాటలి:- ఒకరాజపుత్రిక. (చూడుముపుత్రకుఁడు)

పాటలీపుత్రము:- గంగానది యొడ్డున నున్న యొక పట్టణము. పాటలీపుత్రకులను భార్యా భర్తల పేరునుబట్టి యీ నగరమునకు నామము వచ్చెను. పుత్రకుఁడు మయునిపుత్రులను మోస గించితెచ్చిన కఱ్ఱతో నేలమీదఁ జతురంగయుక్త మైన పట్టణమును గీయఁగ నది నిజమైన పట్టణ మయ్యెను. అదియే పాటలీపుత్రము. క. సా.

పాణిని:- వ్యాకరణకర్త. వర్షుని శిష్యుఁడు. మొదట మిక్కిలి మందబుద్ధి కలవాఁడు; గురువునకు శుశ్రూషకూడఁ జేయువాఁడు కాఁడు. అందు వలన వర్షునిభార్య తమ యింటినుండి యితనిని వెడలఁగొట్టెను. ఇతఁడు హిమాలయమున కేగి శివునిఁ బ్రార్థించి విద్యఁ బడసెను. ఆ విద్యచేఁ కాత్యాయనాదులనుగూడ నోడింపఁగలిగెను. క. సా.

పాతాళకేతుఁడు:- ఒక దనుజుఁడు. తాళకేతుని సోదరుఁడు. ఇతఁడు మదాలసను నపహరించి పాతాళలోకమున దాఁచెను. మఱియు నితఁడు వివిధరూపములతో మునులను బాధించుచుండు వాఁడు. గాలవుఁడను ముని యితనిని శపింపఁ దలఁచుకొనియెను. కాని తపోవ్యయమున కిష్ట పడక యాకసమువంకఁ జూడఁగ నొకయశ్వము వచ్చెను. దానిని ఋతధ్వజున కిచ్చి పాతాళ కేతుని సంహరింపుమని చెప్పెను. ఋతధ్వజుఁ డా కువలయాశ్వము నెక్కి పాతాళకేతుని దఱిమెను. ఈ దనుజుఁడు బిలమున దాఁగెను. ఋతధ్వజుఁడుకూడ నందుఁ బ్రవేశించి వీనిని సంహరించెను. మార్క.

పాపప్రణాశనము:- ఒకతీర్థము. దీనికే గాలవము, ధౌతపాపము అను పేరులు గలవు. పూర్వము ధృతవ్రతుఁ డను బ్రాహ్మణునకు మహి యను భార్యగలదు. వీరికి సనజాతుఁడను కుమారుఁడు

పుట్టెను. ఇతని చిన్నతనములో ధృతవ్రతుఁడు చనిపోయెను. భార్య, కుమారుని గాలవుఁ డను మునియాశ్రమములో విడచి స్వైరిణిగఁ దిరిగెను. బాలుఁడును జెరిగి చెడుమార్గములోనే ప్రవేశించెను. దేశములఁ దిరుగుచు, వీరిరువురు నొక్క నగరముచేరి యొకరి నొక రెఱుఁగలేక, కలసికొని కామక్రీడలను దేలిరి. పిదప మాతాసుతులైన క్లెఱింగి దుఃఖించి గాలవునియొద్దకు వచ్చి వారి పాపమునకుఁ బరిహారము చెప్పుమనిరి. అతఁడు గౌతమిలో స్నానముచేసి రండనియె. వీరు స్నానముచేసి ముక్తిని బొందిన చోటు పాపప్రణాశనతీర్థము. బ్రహ్మ.

పాపభయుఁడు:—గాంధారీధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

పారియాత్రుఁడు:—అహీనుని పుత్త్రుఁడు. ఇతని కుమారుఁడు బలుఁడు. భాగ.

పార్వతి:—మేనకా హిమవంతుల కుమారిత. ఈమె పూర్వభవమున దక్షునికూఁతురును, శివుని భార్యయు నగు సతి. తరువాతిజన్మమున మేనక గర్భమందుఁ బుట్టునని విష్ణ్వాదులు హిమవంతుని గృహమునకు వచ్చిరి. మేనకా హిమవంతులు పార్వతిని ప్రార్థించి తమయందు జన్మింపుమని కోరిరి. పార్వతి మేనకయందు జన్మించె. హిమవంతుఁడు నారదున కామెజాతకమునుగూడఁ జూపెను. శివుఁడే యీమెకు భర్తయగునని నారదుఁడు చెప్పెను.

శివుఁడును హిమాలయపర్వతముపైఁ దపస్సు చేసికొనుచుండెను. ఆ సమయముననే దేవతలకు దారకాసురునివలనబాధమిక్కుటముగ నుండెను. శివునికుమారుఁడుతప్ప నితరులు వానిని జయింప లేరని వారెఱింగిరి. శివుఁడు తపస్సుమాని కుమారుని గనువిధ మాలోచించిరి. ఇంద్రాదులుమన్మథునిఁ బంపి శివుని జయించుమనిరి. మన్మథబాణహతుఁడగుటచే నాచెంతఁ దిరుగుచుండిన పార్వతిని జూచి శివుఁడు చంచలమనస్కుఁడయ్యెను. మన్మథుని భస్మముచేసి యచ్చటనుండిలేచి మఱియొకచోటునకేగి తపస్సుచేసికొనుచుండెను.

పార్వతి పినికొఱకై తపస్సుచేయఁ బ్రారంభించెను. ఆతపోగ్ని వేడిమి భరింపరానిదయ్యెను. అపుడు బ్రహ్మాదులువచ్చి పార్వతినిబరిగ్రహింపుమని శివునిఁ గోరిరి. హిమవంతుఁడు శివుని బ్రార్థించి యతనిని తనగృహమునకుఁగొనిపోయి పార్వతినిచ్చి వివాహము చేసెను. పార్వతి భర్తతోఁ గైలాసమున కేగెను.

సృష్టిని గావింపుమని బ్రహ్మ శివునకు నానతిచ్చెను. తపస్సుచేయక సృష్టిచేయు టెట్లని శివుఁడు తపస్సున కరిగెను. ఆకాలమందు బ్రహ్మ పార్వతిని దనశరీరములో దాఁచి యుంచెను. దక్షయజ్ఞధ్వంసము చేయుటకు శివుఁడు వచ్చినపు డచ్చట శివునకును, విష్ణువునకును యుద్ధమయ్యెను. బ్రహ్మ వారిని శాంతపఱచి తన దేహమున దాఁచియుంచిన పార్వతిని శివునకిచ్చెను.

ఈశ్వరి చాలకాలము బ్రహ్మ శరీరమునం దుండుటచే భర్త తనను సరిగ గౌరవించునో, గౌరవింపఁడోయని బెగడొంది వేరొకజన్మ మెత్తఁ గోరి హిమవన్నగమునకుఁ బోయి తపస్సుచేసి, హిమవంతునికూఁతురుగఁ బుట్టెను. ఆమె ఈశ్వరునే పతిగఁగోరి తపస్సుచేయుచుండగఁ శివుఁడు బ్రాహ్మణరూపమున వచ్చి యాహారము పెట్టుమని యామెను గోరెను. నదిలో స్నానముచేసి రమ్మని యామె చెప్పెను. ఆ బ్రాహ్మణుఁడు నదిలోదిగి మొసలి యొకటి తనను బట్టుకొనెనని యఱచి యామెను లేవఁదీయుమని వేఁడెను. ఆమె లేచి నదికడకుఁ బోయెను గాని పరపురుషుని దాకుటకు సందేహించుచుండెను. అపుడీశ్వరుఁడు తన నిజరూపమును జూపెను. తన పూర్వపుజన్మమున నతఁడు తన భర్త యగుట గౌరి గుర్తించి యతనినిగూర్చి తండ్రియగు హిమవంతున కెఱింగించెను. హిమవంతుఁడును శివుఁడు తన కల్లుఁడగుటకు సంతోషించి తన కుమారితను శివునకిచ్చి వివాహముచేసెను. వరా.

పార్వతియు,శివుఁడును పిమ్మటఁజాలకాలము వఱకు హిమవంతునియింటనే యుండిరి. మేనక తనయల్లుఁడు రూపములేనివాఁడనియును, ధనము లేనివాఁడనియును, గృహము లేనివాఁడనియును ననుచు వచ్చెను. ఆ మాటలు పార్వతి చెవిని బడెను. ఆమెకుఁ గష్టముతోఁచి యచ్చటినుండి పోవుదమని భర్తతోఁజెప్పెను. శివుఁడునికుంభుఁడను గణాధిపతిని బిలచి దివోదాసునికడనుండి కాశీనగరము పుచ్చుకొని యతని వచ్చటనుండి

వెడలగొట్టుమని చెప్పెను. ఆ గణనాథుఁడు కాశీనగరమును నిర్జననగరముగఁ జేసి పార్వతీ పరమేశ్వరుల నచ్చటకుఁ గొంపోయెను.

పార్వతి తలంటుకొనుచుఁ బిండిబొమ్మ నొకదానినిజేసి దానికిఁ బ్రాణముపోసి గుమ్మము యొద్దనుంచి లోపలి కెవ్వరిని రానీయకు మని యా బాలునితోఁ జెప్పెను. అతఁడు సరేయని యచ్చటనే యుండెను. ఇంతలో శివుఁడు వచ్చెను. ఇతనిని బాలుఁడు లోపలకు రా వీలు లేదని యాటంకపెట్టెను. శివునకుఁ గోపము వచ్చి త్రిశూలముతోఁ గొట్టి వానిని జంపి లోపలకువెళ్ళెను. శివుఁడు లోపలప్రవేశించగనే పార్వతి బాలునివైపు చూచి యతఁడు చంపఁబడి యుండుట కనుంగొనెను. ఆమెకుఁ గడు దుఃఖము వచ్చినది. తన ముద్దులబాలు నిట్లు చంపినందుకు రోషము జెంది వీనిని బ్రతికించిన సరే, లేనిచో లోకమంతయును ప్రళయము చేయుదునని పార్వతి నుడివెను. అపుడు శివుఁ డుత్తరముగ నిదురించు జంతువుతలను దెమ్మని తన భటుల కాజ్ఞయిచ్చెను. వారేనుఁగుతల నఱికి తెచ్చిరి. దాని నా బాలునికంఠమున కతికించి వానిని శివుఁడు బ్రతికించెను. అతఁడే విఘ్నేశ్వరుఁడు. వీనినే తనకుమారుఁడుగ పార్వతి భావించు కొనుచుండెను. శివ.

పార్వతి భర్తతో నేకాంతమునఁ గ్రీడించు చుండఁగ అగ్ని వచ్చి వారికెదురుగ నిలచెను. వానిని జూచి శివుఁడు పార్వతిని విడచి దూర ముగఁ బోయెను. అతని వీర్యమంతయుఁ గ్రిందఁ బడెను. క్రీడాభంగము కలిగినందుకుఁ బార్వతికి దుఃఖమును, గోపమును వచ్చి శివునివీర్య మూరక పోదు; నీవుధరించి గర్భమును దాల్చుమని యగ్నిని శపించెను. ఈ వీర్యమును నగ్ని ధరించెను. ఈ వీర్యమువలననే కుమారస్వామి జన్మించెను. బ్రహ్మ.

మఱియొకనాఁడు పార్వతిభర్తతోఁ గ్రీడించు చుండెను. భార్యాభర్తలు రతిసుఖములఁ దేలు చుండిరి. పార్వతి పుత్రుఁడుకలుగునని ముచ్చట పడుచుండెను. అట్టిసమయమున దేవతలందఱు వచ్చి శివుని దర్శించి, దేవా! మీ యిరువురకును బుత్త్రుఁడు జన్మించినయెడల ! మే మాగఁ గలమా ? ఇక రతి యుడుగుము అని వేడిరి. శివుఁడు పార్వతిని విడిచి దూరముగఁబోయెను. పార్వతికిఁ గోపమువచ్చి నాకు సంతానము లేకుండఁ జేసితిరి. కావున మీకును సంతానము లేకపోవుఁగాక యని దేవతలను శపించెను. మఱియు వారిని వృక్షములు కండని శపించెను; ఆ శాపమువలననే విష్ణుమూర్తి అశ్వత్థవృక్ష మయ్యెను. రామా. బ్రహ్మ.

పార్వతీ పరమేశ్వరుల యనుగ్రహమున వారి భక్తులకు సంతానము కలుగుచుండినను పార్వతికి మాత్రము కలుగలేదు.

పాపము పార్వతికి సురతానందమునకే భంగము కలుగుచుండెను. ఇఁక నట్టిభంగము కలుగకుండుటకై యతిరహస్యస్థల మని కుమార వనమునకేగి పార్వతీ పరమేశ్వరులు క్రీడింపఁ జొచ్చిరి. పార్వతి విగతవస్త్రయై యుండెను. ఆ సమయముననే కొందఱు ఋషు లా మార్గమున వచ్చిరి. పార్వతి వారిని జూచెను. ఆమెకు సిగ్గును, కోపమును వచ్చెను. ఆమె యా యడవికి వచ్చినవారెల్ల స్త్రీలగునట్లు శపించెను. భాగ.

గంగ శివునితలమీఁద నుండుటను జూచి సహింపలేక శివునితలమీఁదనున్న గంగను దింపు మని పార్వతి విఘ్నేశ్వరుని, స్కందుని గోరెను. గౌతముఁడే దింపఁగలఁడని వారు చెప్పిరి. గౌతమునిపొలములో గోవు చచ్చిపడి యున్న పుడు గంగనుదెచ్చి గోవుపైఁజల్లిన నది బ్రతుకు నని విఘ్నేశ్వరుఁడు చెప్పెను: గౌతముఁడు శివునిఁ బ్రార్థించి గంగను దీసికొని వచ్చెను. అట్లు గంగ దింపఁబడియె. బ్రహ్మ.

జలంధరుఁడను రాక్షసుఁడు పార్వతిని వంచనచేయఁదలఁచుకొని శివరూపమున నామె కడకు వచ్చెను. అతనితో వచ్చిన మఱియొక రాక్షసుఁడు, పార్వతీ! నీకొఱకై శివుఁడు వచ్చి యున్నాఁడని చెప్పెను; కాని వాఁడట్లే స్తంభించిపోయెను. అది చూచి రాక్షసమాయ యని యెఱింగి పార్వతి యచ్చటనుండి పాఱి పోయి విష్ణుమూర్తిని దలఁచుకొనెను. అతఁడు ప్రత్యక్షమై యేమి కోరెదవు ? నేఁ జేసెదను చెప్పుమనియె. ఈమె జలంధరుని భార్యయొక్క పాతివ్రత్యము చెరుపుమని చెప్పెను. శివ.

ఒకనాఁడు పార్వతి జగమంతయుఁ దనవలననే కలుగుచున్నదని శివునితోఁ జెప్పెను. శివుఁడామెకుఁ దన విశ్వరూపమును జూపెను. అతని యాధిక్యము నామె గ్రహించి స్తుతించెను. నీవు శంఖరూపమున యమునానదియందుండి దక్షునకుఁ గన్యవలెఁ గనబడుదువు. అతఁడు నిన్నుఁ బెంచును. నేను నిన్ను వివాహ మగుదునని శివుఁడు పలికెను. స్కాంద.

పార్శ్వమౌళి:-మాణిభద్రునకు వచ్చిన పేరు.

పాశి:-గాంధారీ ధృతరాష్ట్రుల కుమారుఁడు. భార.

పి

పింగళ:-మిథిలానగరమం దొక గణిక. ధనాపేక్షచే ఆత్మసఖుని మోసగించి ధన మిచ్చువానిని జేరి రాత్రి పర్యటనముసేయుచు నలసి, "ఆత్మసుఖమును జేయువాఁడే భర్తయగును" అనుకొనెను. పిమ్మట నారాయణుని నిష్ఠచేఁ జింతింప నతనికిఁ గైవల్యమ్మును జేరవచ్చునుగదా! యని తలపోసి, తన శయనస్థానాదికమునువిడిచి దేహము మెఱపు వంటి చంచలమైనదని పరమేశ్వరునందు చిత్తము నిలిపి ముక్తిని బడసెను. భాగ.

పింగళ:-ఒకవేశ్య. తనకాంతునికై వేచివేచి యెంతకును రాకయుండుటచే "నేనిట్లున్మత్తయగుట యేల? పొంతకు వచ్చినవానినే కాంతునిఁగఁ దలంతును. రానివానినిఁగోరను"అనుకొని యూరడిల్లి మనమునందుఁ జింతనుబాసియుండెను. ఆశ వలననే సుఖము లేకపోవును. ఈ కథను సేనాజిత్తున కొకమిత్త్రుఁడు చెప్పెను. అతనిదుఃఖము పోయెను. భార.

పింగళుఁడు:-కద్రువకుమారుఁడు. భాగ.

పింగాక్షుఁడు:-ఒకపక్షి. ధర్మపక్షులలో నొకటి. (చూడుము ధర్మపక్షులు.) మార్క.

పింగాక్షుఁడు:-ఒక బోయవాఁడు. ఇతఁడు బోయ కులమునఁ బుట్టినను నెన్నడును జీవహింస చేయ లేదు; ధర్మపరుఁడై దైవచింత కలిగియుండెను. ఇతని పినతండ్రి దారుఁ డనువాఁడు మార్గస్థులను గొట్టి వారిధన మపహరించుచుండువాఁడు.వీఁడొకనాఁడుకొందఱిని గొట్టుచుండఁగ వారియేడ్పులువిని పింగాక్షుఁడు వారిని గాపాడుటకై పరుగిడివచ్చెను. ప్రజలను గొట్టుచున్న తన పినతండ్రితోడను;వానితోనున్నబోయలతోడను యుద్ధముచేసెను. ఆబోయలు పింగాక్షునిబాణములతోఁగొట్టి చంపిరి. పరోపకారము చేయు యత్నములో నితడు మరణించెను గాన నితనికిఁ బుణ్యలోకమువచ్చెను. ఇతఁడే నిరృతియయ్యె. కాశీ.

పింజరకుఁడు:-కద్రువకుమారుఁడు. భార.

పిండారకము:-ద్వారకకు సమీపముననున్న యొక తీర్థము. విశ్వామిత్త్రాసిత దుర్వాసాదులు శ్రీకృష్ణుని సందర్శించి యీ తీర్థముకడకు వచ్చునపుడు యదుబాలురు శాపమునొందిరి. (చూడుము ముసలము)

పినాకము:-శివునివిల్లు. ఆదియుగమునఁ గణ్వుఁడను ముని తపస్సుచేయఁగ నాతనిపై బుట్టలుపెరిగెను. అందుండి యొక మహావేణువు బయలు వెడల బ్రహ్మ మునికిఁ బ్రత్యక్షమై యా వెదురు పుచ్చుకొని దానితో మూడువిండ్లు కావించి, శివున కొకటియు, విష్ణువున కొకటియు నిచ్చి తానొకటి తీసికొనెను. భార.

పిప్పలాదుఁడు:-దధీచికుమారుఁడు. ఇతని తల్లి లోపాముద్ర. ఇతఁడు తండ్రి మరణించినపిమ్మట జన్మించెను. తల్లి వీనిని బిప్పలవృక్షముక్రిందఁ బ్రసవించి యగ్నిలోఁబడి భర్తను గలిసికొనెను. పిప్పలవృక్షములే యీ శిశుపై జాలిగొని చంద్రునడిగి యమృతముతెచ్చి వానికి బెట్టి పెంచినవి. కావున వీనికిఁ బిప్పలాదుఁడని పేరువచ్చెను.

పిప్పలాదుఁడు:-తల్లి సువర్చ. దేవతలు దధీచిని నతని యెముకల నడిగినపుడు దధీచి తన భార్యను లోపలకుఁ బొమ్మని తాను ప్రాణము విడచి తన యస్థులను దేవతలకిచ్చెను. సువర్చ బైటకువచ్చి మృతిచెందిన తన భర్తను జూచి విలపించి మీరు పశువులుకండని దేవతలను

దూషించి యామె భర్తతోఁ జితి నెక్కఁబోయెను. అప్పు డశరీరవాణి నీవు చితి నెక్కకుము. నీగర్భమందు బాలుఁడున్నాఁడని చెప్పెను. కాని యామె వినక చితి నెక్కఁగా గర్భమునుండి బాలుఁడు జారిపడెను. అతఁడే పిప్పలాదుఁడు. పిప్పలాదుఁడు పెరిగి తనతండ్రి మరణమునకు దేవతలు గారణమని తెలిసికొని వారిని జంపుటకై బయలుదేఱి చంద్రునితో నాలోచించెను. చంద్రుఁడు గోదావరీతీరమున కేగి శివుని స్తోత్రము చేయుమని చెప్పెను. పిప్పలాదుఁ డట్లు కావించిన శివుఁడు ప్రత్యక్షమై పిప్పలాదుఁడు కోరుటచేఁ గృత్యను పంపెను. దేవతలను సంహరించి రమ్మని పిప్పలాఁదు డీ కృత్య నాజ్ఞాపించెను. దేవతలందఱు గజగజ వణకుచు శివునికడకుఁ బరుగిడి వానిని బ్రార్థించిరి. శివుఁడు కృత్యను బడబరూపమున గంగలో నుండుమని చెప్పి పిప్పలాదునికడకు వచ్చి నీవేల దేవతలనుజంపెదవు? వారు మరణించినను నీతండ్రి మరలి రాఁడుకదా! నీ వా యత్నము మానుమని చెప్పెను. ఇపుడు కృత్య నాపుట నా శక్యముకాదు. అయిన నా యత్నము మానెదను. నాతల్లిని, దండ్రిని బితృలోకమునఁ జూడఁ గల్గునట్లు నాకు వరమిమ్ము. అని పిప్పలాదుఁడు పలికెను. దేవత లందఱు కృత్యనే ప్రార్థించిరి. ఆమె నేను బడబరూపమున గంగలో నుందుననియె. హిరణ్మయ కలశములో నామెనుంచి గంగకడకుఁ దీసికొని వెళ్ళిరి. గంగ యొకతెయే యామెను భరింపఁజాలక యమున, సరస్వతి నదులందుఁగూడ నామె నుంచెను. వారు ముగ్గురు సముద్రమునకుఁ దీసికొనిపోయిరి.

పిప్పలాదుని యాశ్రమములోనికి అనరణ్యుని కూఁతురు పద్మయను చిన్నది వచ్చెను. ఆమెను పిప్పలాదుఁడు చూచి వలచి యనరణ్యుని వేఁడి యామెను బరిణయమయ్యెను. శివ.

పిప్పలాయనుఁడు:- వేదదర్శుని శిష్యుఁడు. అథర్వవేదమును బఠించెను. భాగ.

పిప్పలుఁడు:- గౌతమీతీరమున నుండిన యొక రాక్షసుఁడు. అశ్వత్థుఁ డను వానితోఁ గలసి సంచరించుచు బ్రాహ్మణులను భక్షించువాఁడు. వీఁడు బ్రాహ్మణవేషమునను౦డి సామవేదము చదువుచు శిష్యులకుఁ జెప్పెదననుచు వచ్చిన శిష్యులను భక్షణచేయుచుండువాఁడు. బ్రాహ్మణులు వీని బాధ తొలగింపుమని శనైశ్చరుని బ్రార్థించిరి. అతనికి వారి తపోమహిమ నంతయును ధారవోసిరి. అతఁడు శిష్యుఁడుగ వెళ్ళి పిప్పలుని సంహరించెను. బ్రహ్మ.

పిప్పలుఁడు:- (పిప్పలాదుఁడు) ఒకఋషి. బ్రహ్మజ్ఞానము నేర్చుకొనుటకై యతనికడకు భారద్వాజ గోత్రుఁడైన సుకేశుఁడును, శిబికుమారుఁడైన సత్యకాముఁడును, సౌర్యుని కుమారుఁడైన గార్గ్యుఁడును, అశ్వలుని పుత్త్రుఁడైన కౌశల్యుఁడును, భృగుపుత్త్రుఁడైన వైదర్భియును, కత్యుని కుమారుఁడైన కబంధియును శిష్యులై సమిధలతో వెళ్ళిరి.

పిప్పలుఁడు వారు వచ్చిన కార్యమును దెలిసికొని మీరొక సంవత్సరము పుణ్యవ్రతములను జేయుచు బ్రహ్మచర్యముతో నొకసంవత్సరము నా యాశ్రమమునం దుండుడు. అప్పుడు మీ రడిగిన ప్రశ్నలకు నాకుఁ దెలిసినంత వఱకును జెప్పెదననియెను. వా రట్లాచరించి, వానిని బ్రశ్నించి తెలిసికొనిరి. ప్రశ్న. ఉ.

పీ

పీఠుఁడు:- నరకాసురుని దండనాథుఁడు. నరకునిఁ జంపుటకు వచ్చిన శ్రీకృష్ణునితోఁ బోరి యా యుద్ధములో మరణించెను. భాగ.

పీవరి:- విభ్రాజా లను దేవతల పుత్త్రిక. ఈమె తపస్సుచేసి బలసంపన్నుఁడగు భర్తను వనుగ్రహింపుమని కోరెను. శ్రీశుకుఁడు నీకు భర్తయగు నని దేవతలు పలికిరి. శ్రీశుకుం డీమెను పరిణయమయ్యెను. ఈమెకు గృష్ణుఁడు, గౌరప్రభువు, భూరి, దేవశ్రవుఁడు అను కుమారులును; కీర్తి, కృత్య యను కుమార్తెలును గలిగిరి. దే. భా. మత్స్య.

పీవరి:- వేదశిరుని భార్య. బ్రహ్మ.

పు

పుంజకస్థల:– ఒక అప్సరస. రావణుఁడు బలాత్కారమున నీమెను దిగంబరిగఁజేసి రమించెను. ఆమె బ్రహ్మతోఁ జెప్పుకొనెను. అందుచే బ్రహ్మ పరకాంతతోఁ గూడుచో నీతల వ్రయ్యలగునని రావణుని శపించెను. పిమ్మట నీమెయు శాపవశమున అంజన యను వానర స్త్రీయయి జన్మించెను. రామా.

పుండరీక:– వసిష్ఠుని కూఁతురు. ప్రాణుని భార్య. ఈమె కుమారుఁడు ద్యుతిమంతుఁడు. బ్రహ్మ.

పుండరీకుఁడు:– నభుని పుత్త్రుఁడు. ఇతని కుమారుఁడు క్షేమధన్వుఁడు. భాగ.

పుండరీకుఁడు:– లోహదండ మను పురమున నివసించుచున్న జహ్నువను బ్రాహ్మణునిపుత్త్రుఁడు. బ్రాహ్మణధర్మమును మాని వేశ్యలను గూడి తిరుగుచుండువాఁడు; తల్లిదండ్రుల నాదరింపకయే భార్యను సుఖపెట్టును. ఇతని తల్లిదండ్రులు నడచి కాశికిఁబోవుచుండిరి. ఇతఁడును, భార్యయును గుఱ్ఱములెక్కి కాశికివెళ్లుచు తల్లిదండ్రులను దాటిపోయి ముందుగఁ గుక్కుట మునియొక్క యాశ్రమముచేరి యటకు గంగ యెంతదూరమని యడిగెను. తాను గంగలో స్నానము చేయలేదనియును, కాశియును, గంగయును, దనకుఁ దెలియవనియును నతఁడు చెప్పఁగా నితఁడు నవ్వి గేలిచేసి నీవు కపట మునివని చెప్పి వెడలిపోయెను.

ఇంతలోఁ గురూపులును, రక్కసులవంటి స్త్రీలు ముప్వురువచ్చి కుక్కుటుని యాశ్రమమునుజేరి యటనుండు చెత్తచెదారములను బాగుచేసి మిక్కిలి సుందరాకారములతో నలరారి వెడలుటనుజూచి వెఱగుపడి "మీ రెవ్వరు? మీ రూపము లిట్టు లేల మాఱినవి?" అని యడిగెను. "మేము గంగ, యమున, సరస్వతు లనువారలము. మాయందు స్నానముచేసినవారి పాతకములు మా శరీరమున కంటుకొనుటచే మేము కురూపులమై యీ మునియాశ్రమముచేరి సేవచేసి యీభాగ్యముచే మా మలినమును బోగొట్టుకొనినవార మగుచున్నారము" అని చెప్పిరి. ఈ ప్రభావము కుక్కుటమునికి, దల్లిదండ్రులకు సేవచేయుటచేతనే కలిగినదని పుండరీకుఁడు తెలిసికొని యప్పటినుండియు తల్లిదండ్రులకు సేవచేయుచుండెను. అతనిసేవకు మెచ్చి విష్ణువు వచ్చెను. అప్పటికి సేవచేయుచుండిన పుండరీకుఁడు తల్లిదండ్రులకుఁ జేయు నుపచారములు పూర్తియగువఱకు వానిని అంతవఱకు నిటుకపై నిలుచుండుమని దగ్గఱనున్న ఇటుకఱాతిని వాని దగ్గఱకు విసరివేసెను. తల్లిదండ్రులకుఁ జేయు నుపచారము పూర్తియయినపిమ్మటనే శ్రీవిష్ణువు నొద్దకుఁ బోయెను. విష్ణువు సంప్రీతుఁడై కోరిన వరము లిచ్చెను. ఆ పుండరీకవరదుని యనుగ్రహాము చేతనే యా క్షేత్రము "పాండురంగ క్షేత్రము, పంఢరీపురము, పుండరీకపురము" అను పేరులను బడసి పుణ్యక్షేత్ర మయ్యెను. పుణ్యక్షేత్ర మచ్చటఁ గలదు. భ. వి.

పుత్త్రికుఁడు:– ఒక బ్రాహ్మణుఁడు. ఇతఁడు తల్లి గర్భమందున్నపుడు కఱవు వచ్చుటచే నితని తండ్రి యాత్మసంరక్షణార్థము భార్యను విడచి తాను దేశాంతరమేగెను. ఈ శిశువునే దిక్కుగ వీనితల్లియు, నామె తోఁబుట్టువులును జూచుకొనుచుండిరి. అట్లు ముదమొందుచున్న వీనిని పార్వతి చూచి యీ బాలుఁడు చిన్నతనములోనే వారి కాధారుఁ డగునట్లు ప్రసాదింపుమని శివునిఁగోరెను. ఈబాలుఁడు నిదురించిలేవఁగనే వీని తలక్రిందఁ బంగారముండునట్లు శివుఁడు వరమిచ్చెను. అంత ధనలాభముచే నితఁడు రాజయ్యె. బ్రాహ్మణులకు దానములు మిక్కుటముగఁ జేయుచుండెను. రాజిట్లు దానము చేయుచున్నాఁడని వానితండ్రి విని వచ్చెను. పిమ్మట నితఁడు తనకుమారుఁడేయని గ్రహించి లుబ్ధుఁడై తాను రాజ్యమేలఁగోరి పుత్త్రునిఁ జంపుటకు యత్నించెను. ఇతఁడు తలవరులను బ్రతిమాలి మరణము తప్పించుకొని వింధ్యారణ్యమున కేగెను. అందు మయుని పావుకోళ్ళకును, చేతికఱ్ఱకును ముష్టియుద్ధము చేయుచుండిన మయునికుమారులను జూచి వీనికై యుద్ధము చేయవలయునా? యని నవ్వెను. ఆ పావుకోళ్ళు తొడిగికొనినఁ దలఁచిన చోటునకవి తీసుకొని పోవుననియు, ఆ కఱ్ఱతో నేలపైగీచిన తానేదితలఁచిన నది యగునని వారు చెప్పిరి. మీరు యుద్ధముచేయు టేల? మీలో వేగముగ నెవ్వఁడు పరుగెత్తఁ

గలఁడో వాఁడు వీనిని బుచ్చుకొనునుగాక యని యితఁడు తీర్పుచెప్పెను. ఇది బాగున్నదని వారు పరుగెత్తిరి. పుత్రికుఁడా పావుకోళ్ళ నెక్కి యెగిరిపోయెను.

ఇతఁడొక నగరము చేరెను. ఆ నగరాధిపతి కూఁతురు పాటలి మిక్కిలి చక్కనిదని వినెను. ఒకనాఁడు రాత్రి పావుకోళ్ళ సహాయమున నామెగదిలోఁ బ్రవేశించెను. పాటలియు నీతని బ్రేమించెను. వీరు రతిసుఖములఁ దేలుచుండిరి. ఈ సంగతి పాటలితండ్రి యెఱింగి వీనింబట్టుకొన వచ్చెను. ఇతఁడు పావుకోళ్ళనెక్కి పాటలిని దనతొడపైఁ గూర్చుండఁబెట్టుకొని యెగిరిపోయి గంగానదియొద్దనదిగి మయుని నేలపైఁ బట్టణము గీసెను. అచ్చట నగర హర్మ్యములు నేర్పడెను. దానికే పాటలీపుత్రమని పేరుపెట్టి పాలించెను. క. సా.

పురంజనుఁడు:- ఒక రాజు. విజ్ఞాతుఁడనువాని మిత్రుఁడు. తన కనురూపమైనపురము నెచ్చటను గానక తిరిగి తిరిగి హిమవత్పర్వత దక్షిణసానువులందు రమణీయ కాంచనమయ వివిధగేహములతో మించు నవద్వారములు కలిగిన యొక పురమును జూచి యందుఁ బ్రవేశించెను. అందలి సుందరోద్యానవనమున నొక గజగామినిని నవోఢను ప్రమదోత్తమ యనుదానినిఁ జూచి విమోహితుఁడై నీవెవ్వరవనియడిగెను. ఈపుర మెవ్వరు నిర్మించిరో నే నెఱుఁగను. నేనే దీనిని బాలించుచుంటిని. వీరు నాసఖీజనము. నీవిందుండినన్నును, నీపురమును నేలుమని యితనితో ఆవనితచెప్పెను. కొంతకాల మామెతో భోగించినపిదప రాజు భార్యతోఁ జెప్పకుండ వేఁటకు వెడలి కొన్ని దినములకుఁ దన యంతఃపురమునకు వచ్చెను. అతనిభార్య భర్త తనను బాసిపోవుటచేదుఃఖితయై యుండె. పురంజనుఁడామెకుఁ గోపోపశమనము చేసి యిఁకఁ బ్రపంచమునుమఱచి సదా యామెతో భోగించుచుండెను. వారికిఁ బలువురు కుమారులు, కుమార్తెలుకలిగిరి. వారికిఁ బెండ్లిండ్లు కావించిరి. పురంజనుఁడు తన భార్యయే పరమార్థముగఁ దలఁచుచుండెను. ఇట్లుండఁగఁ జండవేగుఁడను గంధర్వుఁడు గంధర్వసేనతోఁ బురంజయునగరముపైఁ బడెను. పురాధ్యక్షుఁడు ప్రజాగరుఁడను వాఁడు గంధర్వరాజు నోడించెను. అచిరకాలములోనే భయుఁడను యవనేశ్వరుఁడును, కాలపుత్రికయును బురంజనుని నగరమును బ్రవేశించిరి. కాలపుత్రికిఁ బురంజనుఁడు వశుఁడయ్యెను. ఇతఁడు పురము విడువలేక విడువలేక విడచెను. ప్రజాగరుఁడను మయుని సోదరుఁడు నగరమునుదగులఁబెట్టెను. పురంజనుఁడు భార్యనే తలఁచుకొనుచుఁ బ్రాణములువీడెను. పూర్వమున నితనిచేత హింసింపఁబడిన యజ్ఞపశువులు నరలోకమునకు వచ్చిన యితనిని కుఠారములచే నఱకెను. ఇతఁడు ప్రాణములు విడుచునపుడును భార్యనే తలఁచుకొనెనుగానఁ దరువాతి జన్మమందు విదర్భరాజగృహమున స్త్రీయైజన్మించెను. అపుడామెను మలయకేతనుఁడనురాజు వివాహము చేసికొనెను. భాగ.

పురంజయుఁడు:-ఒక రాజు. బృహద్రథుని కుమారుఁడు; ఇతనిమంత్రి శౌనకుఁడనువాఁడు. ఇతనినిజంపి తాను రాజ్యమునుగైకొనెను. భాగ.

పురంజయుఁడు:-సూర్యవంశపు రాజు. వికుక్షి (శశాదుని) కుమారుఁడు. రాక్షసబాధ కోర్వలేక దేవతలు బ్రహ్మకడకును, విష్ణువుకడకును బోయి చెప్పుకొనిరి. వారు “మేము పురంజయునందు నుందుము. ఇంద్రుఁడు వాహనమై వానిని మోయవలయును. అప్పుడు పురంజయుఁడు రాక్షసులను సంహరించును. వానిని వేఁడుఁడని బ్రహ్మయును, విష్ణువును జెప్పిరి. వారితనికడకు వచ్చి రాక్షసులబారినుండి తమ నగరముగాచి రక్షింపుమని వేఁడిరి. వృషభముపై నెక్కి వచ్చెదనని పురంజయుఁడు పలికెను. ఇంద్రుఁడు వృషభమయ్యెను. ఇతఁడు కకుత్థ్సలమునఁ గూర్చుండి వెళ్ళి దానవులతోయుద్ధము చేసి వారినోడించి తఱిమెను. కకుత్థ్సలమునఁ గూర్చుండుటచే కకుత్థ్సుఁడనియును, నింద్రవాహనుఁడనియును పేర్లు వచ్చినవి. ఇతని కుమారుఁడు అనేనసుఁడు. విష్ణు. భాగ.

పురాణప్రవర్తకులు:-త్రైయ్యారుణి, కశ్యపుఁడు, సావర్ణి, అకృతవ్రణుఁడు, వైశంపాయనుఁడు, హారీతకుఁడు అనువారలు వ్యాసశిష్యుండగు రోమహర్షణునివలనఁ బురాణములు నేర్చి, వానిని

లోకమునఁ బ్రవర్తింపఁజేసి పురాణప్రవర్తకులని ప్రసిద్ధినందిరి. భాగ.

పురుకుత్సుఁడు:–బిందుమతీ మాంధాతల కుమారుఁడు. నాగకుమారులు వీనిని దమలోకమునకుఁ గొంపోయి యటఁ దమచెల్లెలిని నర్మదనిచ్చి వివాహముచేసిరి. అంగీరసులు నాగలోకమునకేగి నాగులను బాధపెట్టుచుండిరి. నాగులు నర్మదతోఁ జెప్పుకొనిరి. నర్మద యీతనితోఁ జెప్పెను. ఇతఁడచ్చట ననేక గంధర్వనాథులను వధించెను. తన నాగలోకసంచరణము తలంచుకొనువారికి సర్పభయము లేకుండునట్లు వరము పొందెను. ఇతఁ డాంగిరసులను నాగలోకము నుండి తఱిమివేసెను. తిరిగి తన దేశమునకు వచ్చెను. పురుకుత్సునకు త్రసదస్యుఁడను కుమారుఁడు కలిగ్గెను. భాగ. విష్ణు.

పురూరవుఁడు:–ఇలా బుధుల కుమారుఁడు. ఇతని భార్య కౌసల్య. ఈమెయం దితనికి జనమేజయుఁడను కుమారుఁడు కలిగెను. పురూరవుఁడు మదాంధతచే బ్రాహ్మణులధన మపహరించెను. అది కూడనిపని యని చెప్పుటకు సనత్కుమారుఁడును, బ్రాహ్మణులును వచ్చిరి. కాని యీ రాజు వారికి దర్శనమీయలేదు. వారికిఁ గోపము వచ్చి నీ వున్మత్తుఁడవై యుండుమని వీనిని శపించిరి.

పురూరవుఁ డూర్వశిని జూచి మోహించి యామెయం దాసక్తి కలిగియుండెను. ఆమెను దనతో నుండుమని కోరెను. ఈ రాజు నగ్నుఁడై కనఁబడినను, ఆమె యూరణకములు పోయినను వెళ్లిపోవుదుననియును, ఆప్రతిజ్ఞల కంగీకరించు నెడల నేవచ్చియుందుననియు నూర్వశిచెప్పెను. పురూరవుఁడంగీకరించెను. ఊర్వశి చాలకాలము పురూరవునితో నుండెను. ఊర్వశియం దీతనికి శ్రుతాయువు, సత్యాయువు, రయుఁడు, జయుఁడు, విజయుఁడు, ఆయువు, ధీమంతుఁడు, అమావసువు, దృఢాయువు, వనాయువు, శతాయువు అను కుమారులు పుట్టిరి. భాగ.

ఊర్వశి పురూరవుల కడఁ బాటుకలుగఁజేయుటకై విశ్వావసుఁడనుగంధర్వుఁడుఊర్వశియూరణ [illegible] యుండిన పురూరవుఁడది చూచి యా గంధర్వుని వెంటఁబరుగిడెను. ఇతఁడు దిగంబరుఁడైయూర్వశి కంటఁబడెను. కాన నామె వీనిని విడిచివెళ్ళెను.

పురూరవుఁ డూర్వశికై వెదకుచుఁ గురుక్షేత్రమున కేగెను. అచ్చట నూర్వశిని జూచి యామెతో సంభాషించెను. ఆమెను మరలరమ్మని కోరెను. గంధర్వులను వేఁడుకొనుమని యామె చెప్పెను. ఇతఁడు గంధర్వులను బ్రార్థించెను. వారు ప్రీతులై వీని కగ్నిస్థాలి నిచ్చిరి. అది యూర్వశిగాఁదలఁచుకొనుచు నతఁడరణ్యములో దిరుగుచు నొకనాడది యూర్వశికాదని తెలిసికొని యడవిలోవిడిచి యింటికిఁజనుదెంచినిత్యము నూర్వశినే తలఁచుచుండెను. ఇంతలోనే త్రేతాయుగము వచ్చెను. ఆ రాజుయొక్క మనంబునకు వేదంబులు కర్మబోధంబులై మూఁడు మార్గములుగఁ దోచెను. అతఁడు ఆ యగ్నిస్థాలి యున్నచోటునకేగి శమీగర్భజాతమయిన యశ్వత్థమును జూచి ఆయశ్వత్థమును రెండు అరణులుగాఁజేసి, ముందటియరణి తాననియును, రెండవ యరణి యూర్వశి యనియును, మధ్యమున్న కాష్ఠము పుత్త్రుఁడనియును మంత్రంబులు చెప్పుచుండెను. జాతవేదుఁడను అగ్ని సంభవించెను. అది విహితారాధన సంస్కారంబునంజేసి ఆహవనీయరూపమై పురూరవుని పుత్త్రుఁడని కల్పింపఁ బడియెను. అప్పటివఱకు నుపాసనార్హంబైనయగ్ని యొక్కటియే. పురూరవుఁడు దానిని మూఁడుభాగములుగ జేసెను. అప్పటి నుండియును త్రేతాగ్ని యేర్పడియె. భాగ.

పురూరవుఁడు యాగమునుగావించి గంధర్వలోకమునకేగి యూర్వశిని దలంచుకొనెను.

ఇతఁడు వాయుదేవునివలన రాజధర్మములను నేర్చెను. భార.

పురూరవుఁడు నైమిశారణ్యమున మునులు చేయు సత్రయాగమును జూచుటకు వెళ్ళెను. అచ్చట యజ్ఞవాటమంతయును బంగారముతోఁ జేయఁబడినదై యుండెను. దాని నపహరింపవలెననుతలఁపు పురూరవునకుఁ గలిగెను. అది మునులెఱిఁగి పురూరవుని వజ్రముతోఁ గొట్టిరి. ఆ దెబ్బచే నితఁడు ప్రాణములను విడచెను. బ్రహ్మ.

పురోచనుఁడు:-దుర్యోధనుని కిష్టుఁడు. దుర్యోధనుఁడు చెప్పఁగ నితఁడే పాండవులను గాల్చుటకు లక్కయిల్లు కట్టించెను. తగినసమయమున నా లక్క యింటికి నిప్పంటించుటకు నొక నిషాద స్త్రీవలనఁ బాండవుల వృత్తాంతము కనుఁగొనుచుండువాఁడు. ఇతఁడు చేయఁబోవు కార్యము భీమునకుఁ దెలిసెను. పురోచనుఁడొకరేయి నిద్రించుచుండఁగ నితని గృహమునకు భీముఁడే నిప్పంటించెను. దానితో నితఁడు మరణించెను. భార.

పులస్త్యుఁడు:- ఒకఋషి. బ్రహ్మకర్ణములనుండి పుట్టెను. బ్రహ్మ లంకలోఁ దపస్సు చేసికొనుచుండఁగ నూర్వశి యతని కంటఁబడియె. బ్రహ్మకు రేతఃపతనముకాఁగా నందుండి పులస్త్యుఁడు పుట్టెను. బ్రహ్మ వెళ్ళుమని చెప్పఁగ నితఁడు యదుమహాముని యాశ్రమమునకు వెళ్లెను. ఆతఁడు తన పుత్త్రికయగు ప్రియమతి నితని కిచ్చి వివాహము చేసెను. ఆమెయం దీతనికి విశ్రవుఁడు, అగస్త్యుఁడు జన్మించిరి.

పులస్త్యుఁడు:-బ్రహ్మయొక్క మానసపుత్త్రుఁడు. ఇతఁడు మేరు పర్వతముదగ్గఱ తృణబిందుని యాశ్రమసమీపమునఁ దపస్సుచేసికొనుచుండువాఁడు. దివ్యాంగనలు వచ్చి యితని యాశ్రమ సమీపమున నాడుచుఁ బాడుచు, సందడి చేయుచుఁ, దపోభంగము చేయుచుండిరి. ఇతనికిఁ గోపమువచ్చి, మీరిచ్చటినుండి పొండు. పోకుంటిరా నాదృష్టిపథంబున నెవరుపడిన వారి కన్యాత్వము దూషితమగు నని శాపించెను. ఆ మాటలు విని దేవకన్యలుభయపడి పాఱిపోయిరి; కాని తృణబిందుని కూఁతురుమాత్రము పులస్త్యుని శాప మెఱుంగకుండుటచే నచ్చటనే తిరుగుచుండెను. ఆమెను బులస్త్యుఁడు చూచెను. ఆమె ఏపాప మెఱుఁగక, క్షణములో గర్భవతి యగుటకు మిక్కిలివిచారించి తండ్రియేమనునో యని భయపడుచుఁ దండ్రి యాశ్రమమునకుఁ బోయెను. ఈమె విన్నదనము చూచి తృణబిందుఁడు దివ్యదృష్టి వలన జరిగిన వృత్తాంతమెఱింగి యామెదోషము లేదనిచెప్పి యోదార్చెను. పిమ్మటఁ బులస్త్యుని తన యాశ్రమమునకుఁగొనివచ్చి తనకూఁతునిచ్చెను. పులస్త్యుఁ డామెగుణవతియని యెఱింగి యామెను ప్రతిగ్రహించెను. ఆతని కామెయందు విశ్రవో బ్రహ్మ జన్మించెను. పులస్త్యుఁడు కర్దముని కుమారితయైన హవిర్భువునుగూడ భార్యగఁ గైకొనియె. ఉ. రా. భాగ.

పులహుఁడు:- బ్రహ్మ మానసపుత్త్రుఁడు. బ్రహ్మ నాభినుండి పుట్టెను. కర్దమునికూఁతురైన గతి యీతనిభార్య. కర్మశ్రేష్ఠుఁడు, వరీయాంసుఁడు, సహిష్ణుఁడు ఇతని కుమారులు. ఇతనికిఁ గిన్నర కింపురుషాదులు పుట్టిరి. భార. భాగ.

పులోమ:-భృగునిభార్య; చ్యవనుని తల్లి. ఈమె గర్భవతియై యుండినపుడు భర్తపంపున నగ్నిహోత్రునకు నగ్నులు నిహరించుచుండెను. అపుడు పులోముఁడు అను రాక్షసుఁడు వచ్చి యీ సతి యెవ్వరని యగ్నిహోత్రు నడిగెను. ఈమె పులోమ; భృగునిభార్య అని యగ్నిహోత్రుఁడు తెల్పగ, నిది నాకుఁ దొల్లి వరియింపఁబడిన భార్య; తరువాత భృగుఁడు వివాహము చేసికొనియెను అని తాను వరాహరూపమై ఆమె నెత్తుకొని పోయెను. ఆమె గర్భమందున్న సుతుఁడు బైటకువచ్చి తీక్ష్ణముగఁ జూచి యసురుని మాడ్చివేసెను. ఈ సుతుఁడే చ్యవనుఁడు. ఆమె సుతునిఁ దీసికొని గృహము చేరి తనభర్తకీ వృత్తాంతము చెప్పెను. భార.

పులోముఁడు:- దనువునందుఁ గశ్యపునకుఁ బుట్టిన రాక్షసుఁడు (చూడుము పులోమ.)

పుష్కరశాలి:-కుండలయను వనితయొక్క భర్త. వీనిని శుంభుఁడను దనుజుఁడు చంపెను. మార్క.

పుష్కరాక్షుఁడు:- భరతునిపుత్త్రుఁడు. (చూడుము పుష్కరుఁడు.)

పుష్కరిణి:-చక్షుషుని భార్య. విష్ణు.

పుష్కరిణి:-ఉల్ముకునిభార్య. అంగునితల్లి. భాగ.

పుష్కరుఁడు:- నలుని పినతండ్రి కుమారుఁడు. కడు దుర్మార్గుఁడు. ఇతఁడు నలునితో జూదము నాడి కలిసహాయమున గెలిచి నలుని రాజ్యము నుండి వెడలఁగొట్టెను. ఇతఁడు పాలనము చేసినంత కాలము ప్రజలను బాధ పెట్టుచుండెను. మరల నలుఁ డితనిని గెల్చి రాజ్యము గైకొనియె. భార.

పుష్కరుఁడు:— రాముని సోదరుఁడైన భరతుని కుమారుఁడు. భరతుఁడు గంధర్వ శైలూష పుత్త్రులను జంపి (లవణుని జంపి మధురానగరము నకు) వారిదేశమున కీతనికిని, వీని సోదరుఁడగు పుష్కరాక్షునకును బట్టముకట్టెను. ఇతనినగరము పుష్కలావతీపురము. భాగ. రామా.

పుష్కరుఁడు:—వరుణుని కుమారుఁడు. ప్రమోచన యను నప్సరసకు నితనివలన మాలిని యను కూఁతురు జన్మించెను. మార్క.

పుష్కలుఁడు:— దశరథుని పుత్త్రుఁడగు భరతుని కుమారుఁడు. వాని పేరుననే పుష్కలనగరమును నిర్మించి దానికి నీతనిని భరతుఁడు పట్టభద్రునిఁ జేసెను. రామా.

పుష్టి:—ధరణీదక్షులకుఁ బుట్టిన కుమారిత. ధర్ముఁ డను మను వీమెను వివాహ మయ్యెను. భార.

పుష్పకము:— కుబేరుని విమానము. ఇది యాకస మున సంచరించును. దీనిని బ్రహ్మయే కుబేరున కిచ్చెను. ఈతని విమానముచూచి సహింపలేక రావణునితల్లి దాని నెటులైనఁ గైకొమ్మని తన పుత్త్రునిఁ బ్రేరేపించెను. రావణుఁడు దానిని బలాత్కారమునఁ గుబేరునొద్దనుండి గైకొనియె. రావణుని జంపిన పిమ్మట శ్రీరాముఁడు దాని నెక్కియే లంకనుండి వచ్చెను. పిమ్మట నతఁడు దీనిని గుబేరున కిచ్చెను. రామా.

పుష్పదంతుఁడు:—ఒకగంధర్వుఁడు. తన మాయా ప్రభావముచే నితరులకుఁ గనుపడకుండ రాజు తోటలోని పుష్పమును తీసికొనిపోయి శివుని బూజించుచుండువాఁడు. రాజు వానిమార్గములో శివనిర్మాల్యమును బోయించెను. ఆ గంధర్వుఁ డది దాటిపోవఁగా వాని ప్రభావము తగ్గినది. అంత నతఁడు మహిమ్నస్తోత్రము చేసి శివునిని మెప్పించి తనప్రభావమును మఱలఁ బొందెను.

పుష్పదంతుఁడు:— యుగంధర దేశమునకు రాజు. శివభక్తుఁడు. ఇతఁడు శివుని నారాధించికాని జలమునైనఁ ద్రాగఁడు. ఒక శివరాత్రినాం డుపవాసముచేసి శివుని నారాధించెను. శివుఁడు ప్రత్యక్షమై వరము వేఁడుకొనుమనఁగ, అనుదినము మీ భార్యాభర్తలు నాకు దర్శన మిచ్చుచుండుఁడని పుష్పదంతుఁడు కోరెను. శివుఁ డట్లే యనుగ్రహించెను. ఇతఁడు ప్రతి దినమును గైలాసమునకేగి పార్వతీ పరమేశ్వరు లను దర్శించి వచ్చుచుండెను. ఒకనాఁడు కైలాసమునకు వెళ్ళినపుడు పార్వతి పరమేశ్వ రుని నొక యపూర్వమైనట్టియును, రహస్యమై నట్టియును గథను జెప్పుమని కోరుట వినెను. శివుఁ డామె కొక కథ చెప్పెను. పుష్పదం తుఁడు చాటుననుండి యా కథ వినెను. పిమ్మట నతఁడు వారిని దర్శించి తన గృహమునకుఁ బోయెను. అప్పటికి రాత్రి చాలభాగము గతిం చెను. పుష్పదంతునిభార్య దేవదత్త తనపతి జారుఁడై యరిగెనని కోపించియుండెను. పుష్ప దంతుఁడు తన కాలస్యమైన కారణమును జెప్పి తాను రహస్యముగ వినిన కథనుగూడఁ జెప్పెను. పార్వతీకి శివుఁడు రహస్యముగ జెప్పిన కథను బుష్పదంతుఁడు చాటుననుండి వినెనని పార్వతీపరమేశ్వరులకుఁదెలిసి కోపము వచ్చినది. వారు వీనిని బిశాచములకు నాథుఁ డవై శ్మశానములం దుండుమని శపించిరి. ఇతఁ డా శాపవశముననే భేతాళుఁడయ్యె. దేవా.

పుష్పదంతుఁడు:—ఒక విద్యాధరుఁడు. ఒక నాఁడు పార్వతి యపూర్వకథ నేదైనను జెప్పు మని యీశ్వరు నడుగఁగాఁ దమ ప్రాసాదము లోని కెవ్వరును రాకుండ నందిని గాపుపెట్టి యీశ్వరుఁడు కథ చెప్పుచుండెను. పుష్ప దంతుఁడు లోపలకుఁ బ్రవేశింపఁబోయెను. నంది వలదనెను గాని యతఁడు వినక, నందికంటఁబడ కుండ నదృశ్యుఁడై లోపలఁ బ్రవేశించి రహ స్యముగ శివుఁడుచెప్పిన కథను వినెను. పిమ్మట ఆ కథనే తన భార్యయగు జయకుఁ జెప్పెను. మఱికొన్ని దినములకు ఆకథనే జయ పార్వతికిఁ జెప్పెను. శివుఁ డపూర్వకథ చెప్పెదనని యెల్లర కును దెలిసినకథనే చెప్పెనని యీశ్వరునిపైఁ బార్వతికి గోపమువచ్చినది. పుష్పదంతుఁ డా కథను రహస్యముగ వినెనని శివుఁడుపార్వతితోఁ జెప్పెను. పార్వతికిఁ బుష్పదంతునిపై గోపమువచ్చి నీవు నరుఁడవై జన్మించుమని శపిం చెను. పుష్పదంతుని మన్నించుమని వేఁడిన యితని మిత్త్రుని మాల్యవంతునిఁగూడ నామె

శపించెను. శాపవిమోచనమునకై వేఁడఁగ వానికి నీవు కథచెప్పినప్పుడు నీ రూపము నీకు వచ్చునని యామె యనుగ్రహించెను.

పుష్పదంతుఁడు వరరుచి (కాత్యాయనుఁడు)గ బుట్టెను. క. సా.

పుష్పదంతుఁడు:-దేవతలచే శంఖచూడుని దగ్గఱకుఁ బంపఁబడిన దూత. దేవతలతో యుద్ధము చేయుట మంచిదికాదని యితఁడు చెప్పెను గాని శంఖచూడుఁడు వినలేదు. శివ.

పుష్పదంష్ట్రుఁడు:-కద్రువకుమారుఁడు. భార.

పుష్పార్ణుఁడు:-వత్సరునకు సర్వర్ధియందుఁబుట్టిన కుమారుఁడు. ప్రభ, దోష ఇతని భార్యలు.

పుష్పోత్కట:-సుమాలి కూఁతురు. విశ్రవస్సు యొక్క భార్యలలో నొకతె. మహోదరుఁడు, మహాపార్శ్వుఁడు ఈమె కుమారులు. ఉ.రా.

పులస్త్యుఁడు వైశ్రవణునిపైఁ గోపించి వాని కహితమును జేయుటకు విశ్రవసునిని బంపఁగా వైశ్రవణుఁడు వీనికి నమస్కరించి వీనికి బరిచర్యలు చేయుటకునై పుష్పోత్కట, మాలిని, పాక అను రాక్షసస్త్రీలను బంపెను. ఈమె యందు విశ్రవసునకు రావణ కుంభకర్ణులు పుట్టిరి. భార.

పుష్యుఁడు:-హిరణ్యనాభుని పుత్త్రుఁడు. ఇతని కుమారుఁడు ధ్రువసంధి. భాగ.

పుళిందుఁడు:-భద్రకుఁడను రాజుయొక్క కుమారుఁడు. ఇతనిపుత్త్రుఁడు ఘోషుఁడు. భాగ.

పూ

పూజని:-ఒక గోరువంక. నేర్పుతో మాటలాడ గలది. బ్రహ్మదత్తుఁడను రాజుయొక్క రాజ్యములో నుండునది. అది పిల్లను బెట్టి దానికొఱకు మంచిపండ్లు తెచ్చియిచ్చుచు, ఆరాజు కొడుకునకు బెట్టుచుండెడిది. ఆ పిల్లవాఁడు పక్షిపిల్లతో నాడుకొనుచుండువాఁడు. ఒకనాడు తల్లి లేని పుడు పిల్లను జంపెను. పూజని వచ్చి చూచి దుఃఖించి రాజకుమారుని గ్రుడ్లు పెరికివేసెను. పిమ్మట బ్రహ్మదత్తుని నగరమునుండి యెగిరి పోవుచు ఆకాశముననిలిచి నీకొడుకుచేసిన పనికి అతఁడు ఫలమనుభవించెను. కాని నేను చేసిన యెగ్గులేదనెను. నీయందును నగలేదు. కాని నీవు వెళ్ళిపోవుటకుఁ జింతించుచున్నానని రాజుఅనెను. "స్నేహము చెడినపిమ్మట మాటల తియ్యదనమును బట్టి యుండఁదగదు. చల్లని నీళ్ళలోనే బడబాగ్ని దాగియుండును" అని యతనిని విశ్వసింపకయే యటనుండి వెడలి పోయెను. భార.

పూతకి:-(పూతన) ఒకదనుజకాంత. కంసునిరాజ్యములోవసించుచుండెడిది. కంసుఁడు తనను జంపువాఁడు దేవకీసుతుఁడు పెరుగుచున్నాఁడని యెఱింగి వానినే సంహరింపఁగోరెను. కాని ఆ బాలుఁ డెచ్చోటనున్నదియుఁ దెలిసికొనలేక పోయెను. కావున శిశువుల నందఱను జంపింపఁ దలఁచుకొనెను. అందుకై పూతకిని బిలచి బాలురందఱకును నీ స్తన్య మిచ్చి నీ విషదుగ్ధములచే వారు మరణించునట్లు చేయుమని కంసుఁడు చెప్పెను. పూతకి యద్దాని కంగీకరించి సుందరాకారముగల మనుష్య స్త్రీ రూపమును ధరించెను. ఆమె పసిబాలురుగల యింటింటికిఁ దిరుగుచుఁ బిల్లలపైఁ బ్రేమకల్గినదానివలె నటించుచుఁ దనచనుఁబాలు ద్రావించుచుండెను. ఈమె పాలు ద్రావిన శిశువులు వెంటనే మరణించుచుండిరి. ఈమె నందునిగృహమునకును వచ్చెను. యశోదాదు లీమె దనుజకాంతయని గ్రహింపలేకపోయిరి. వారీమెను గృష్ణునిదొట్టెయొద్దకు వెళ్ళనిచ్చిరి. ఈమె కృష్ణునకును బాలిచ్చెను. అతఁడీమె బలమంతయును పీల్చివేసెను. ఈమె బిగ్గఱగ నఱచుచు నిజరూపమునుదాల్చి ప్రాణములు విడిచెను. ఈమె పూర్వము రత్నమాల యను కాంత. భాగ. బ్ర.వై.

పూతాత్ముఁడు:-ఒక బ్రాహ్మణుఁడు. కశ్యపుని దాయాది. ఇతఁడు కాశీనగరమందుఁ బెక్కేండ్లు శివుని నారాధించెను. శివుఁడుప్రత్యక్షమై ఇతనికి దిక్పతిత్వంబును, బ్రాణాపానాదిపంచమూర్తి

త్వంబును, సర్వగత్వంబును, సర్వసత్త్వావ బోధకత్వంబును నొసంగెను. ఇతఁడే వాసుదేవుఁడయ్యెను. కాశీ.

పూరణుఁడు:-కద్రువ కుమారుఁడు.

పూరుఁడు:-చాక్షుషమనువు కుమారుఁడు. ఇతని తల్లి నడ్వల. మత్స్య.

పూరుఁడు:-జహ్నుని కుమారుఁడు. భాగ.

పూరుఁడు:-యయాతి పుత్త్రుఁడు. ఇతనితల్లిశర్మిష్ఠ. యయాతికి శాపవశమున ముదిమివచ్చెను. కాని భోగేచ్ఛ యింకను మిక్కుటముగ నుండెను. అందువలనఁ దన కుమారులను తన ముదిమిని గ్రహించి వారి యౌవనమును దనకిండనికోరెను. పూరుఁ డొక్కఁడే యద్దాని కంగీకరించెను. తక్కినపుత్త్రులు నిరాకరించిరి. అందువలన వారు రాజ్యార్హులు కాకుందురుగాక యని యయాతి శపించెను. యయాతి మఱికొంతకాలము సుఖము ననుభవించి మరల యౌవనము పూరునకిచ్చి వానినే రాజ్యాభిషిక్తునిఁగావించెను. ఇతనిభార్య కౌసల్య. ఆమెయం దితనికి జనమేజయుఁడను పుత్త్రుఁడు కలిగెను. భార.

పూర్ణిమ:-మరీచి కుమారిత. ఈమె జన్మాంతరమున గంగయనుపేరునఁ బుట్టెను. భాగ.

పూర్వచిత్తి:-ఒక అప్సరస. ఆగ్నీధ్రుఁడు సంతానమునకై తపస్సు చేసికొనుచుండఁగ నీమెను బ్రహ్మ యతనికడకుఁ బంపెను. ఈమెనుజూచి మోహించి యాగ్నీధ్రుఁడు భార్యగఁ గైకొనియె. అతనికి నాభి, కింపురుషుఁడు మొదలగువా రీమెయందే జనించిరి. భాగ.

పృ

పృథ:-సోముఁడను వసువుయొక్క కూఁతురు. భార.

పృథ:-కుంతిపేరు. (చూడుము కుంతి)

పృథుఁడు:-అనేనసుని యొక్క కుమారుఁడు. ఇతనిపుత్త్రుఁడు విశ్వగంధుఁడు. భాగ.

పృథువు:-ఒకరాజు. ఇతఁడు వేనుని భుజములు మర్దింపఁగఁబుట్టెను. వేనుని సంహరించి యితనినే పట్టాభిషిక్తునిఁ జేసిరి. వేనుని మర్దింపఁగ నతని శరీరమునుండి పుట్టిన వనితను అర్చి యను దానిని లక్ష్మీకళాకలితయైన దానిని పృథువు వివాహమయ్యెను. విజితాశ్వుఁడు, ధూమ్రాక్షుఁడు, హర్యశ్వుఁడు, ద్రవిణుఁడు, వృకుఁడు, అంతర్ధానుఁడు, హవిర్ధానుఁడు అను పుత్త్రులు కలిగిరి. వేనుని పాలనమున నధర్మము పెరిగి వర్షములుగాని, పంటలుగాని లేకయుండెను. ప్రజలాహారములేక బాధలుపడుచుండిరి. పృథువు ప్రజాసంరక్షణము చేయుటకై గోరూపధారిణియైన భూమిని బాణముతోఁ గొట్టబోయెను. భూమి బెగడొంది "క్రతువులులేక, ధర్మములులేక పుడమి చోరీభూతమైయుండఁగ నారూప ముపసంహరించుకొంటిని. నాకు వత్సమును గల్పించి క్షీరము పితుకుము" అనివేఁడెను. పృథువు మనువును దూడగఁజేసి భూమివలన సకలౌషధులను బితికెను. అపుడు యక్షులు, సిద్ధులు, సాధ్యులు ఒక్కొక్కరు తమ కనుగుణంబైనవారిని ఒక్కొక్కరిని వత్సముగఁజేసి వారివారికిఁ గావలసిన పదార్థములను బితుకుకొనిరి. పృథువు పర్వతముల నన్నిటిని భేదించి పుడమిని సమముగఁ జేసెను.

నూరశ్వయాగములు చేయఁ దలఁచుకొని పృథుచక్రవర్తి బ్రహ్మావర్తదేశమున సరస్వతీ నదీతీరమునఁ గ్రతువులు ప్రారంభించి తొంబది తొమ్మిది ముగించెను. నూరవది పూర్తిచేయుచుండఁగ నింద్రుఁడోర్వలేక యాగాశ్వమును అపహరించిపోయెను. ఇంద్రు నోడించి పృథువుకుమారుఁడు తురగమును దెచ్చెను. మాయచేసి తిరిగి యింద్రుఁడు మరల నశ్వమును గొనిపోయెను. పృథువునకుఁ గోపమువచ్చి బాణముల ధరించి ఇంద్రు నోడించుటకు లేచెను. యాగదీక్షయం దున్నవా రస్త్రములుపూనరాదు. కావున నింద్రు నాహ్వానముచేసి వాని వహ్ని కాహుతిగనొసఁగెద

మని కొందఱు మును అనుటచేఁ బృథువు బాణములు విడిచి యగ్నికడఁ గూర్చుండెను.

అంత బ్రహ్మవచ్చి "మీ దేవేశునిగూర్చి యాగములు చేయుచున్నారో యా దేవుని యంశసంభవుఁడే యింద్రుఁడు. అతఁడు మీచేత వధార్హుఁడు గాఁడు. ఈ పృథువునకును నేకోన శతయాగ సత్ప్రయోగఫలంబు సిద్ధించును. ఇతఁడు నారాయణాంశమునఁ బృథ్విని ధర్మము తప్పకుండఁ బాలించుటకై పుట్టినవాఁడు" అని చెప్పఁగఁ బృథువు చింతమాని యా యజ్ఞము మాని యింద్రునితో బద్ధసఖ్యుఁడై యుండెను. అప్పుడే పరమేశ్వరుఁడు ఇంద్రసహితముగఁ బ్రత్యక్షమై పృథువునకు "సత్పురుషులు దేహాభిమానమునకుఁ గారు; ప్రాప్తంబులైన యాపత్సమయంబులందు మత్పరులగువారు వికారము నొందరు" అని యిట్లు ధర్మమెఱింగించెను.

ఇతఁడు సద్ధర్మముగ భూమండలము పాలించి రాజ్యము కుమారుల కప్పగించి తపోవనమున కేగెను. భాగ.

పృథుశ్రవసుఁడు:— ద్వారకాపుర పరిరక్షకుఁడు. అర్జునుఁడు సుభద్రను దీసికొని పోవుచుండఁగ నితఁ డడ్డించెను. కాని యర్జునుఁడు వీనిని లక్ష్యపెట్టక పోయెను. భాగ.

పృథుశ్రవుఁడు:— శశబిందువుయొక్క కుమారుఁడు. ఇతనియొక్క పుత్త్రుఁడు ఉశనుఁడు. భాగ.

పృథూదకము:— ఒక తీర్థము. వసిష్ఠుని మూలమున తేజమునందు నోడింపఁబడినవాఁడై విశ్వామిత్రుఁ డిచ్చటనే తపస్సుచేసెను. "ఇచట స్నానము చేసిన క్షత్త్రియుఁడు బ్రాహ్మణుఁ డగును. స్నానముచేసిన బ్రాహ్మణుఁడు సిద్ధినొందును." భాగ.

పృశ్ని:— స్వాయంభువ మన్వంతరమున సుతపుఁడను ప్రజాపతియొక్క భార్య. ఈమెయందు, కృతయుగమున శ్రీహరి పృశ్నిగర్భుఁడు ప్రాదుర్భవించె నామెకుఁ గుమారుఁడుగఁ గలిగె. ఈమె అదితి యయ్యెను. ఈమె దేవకిగను పుట్టెను. భాగ.

పృషతుఁడు:— సుజన్యకృతుయొక్క కడపటి కుమారుఁడు. పాంచాలదేశాధిపతి. ద్రుపదమహారాజు జనకుఁడు. పృషతుఁ డొకనాఁడు తపస్సు చేసికొనుచు నగ్గంగ ఋష్యాశ్రమమున మేనకను జూచెను. అంతట నతనికి రేతఃపతనమయ్యెను. దానిని తన పాదముతోఁ గప్పెను. అందుండియే ద్రుపదుఁ డను కుమారుఁడు పుట్టెను. వాఁడు భరద్వాజాశ్రమమున నుండి యితఁడు పాంచాలదేశమున నుండెను. భాగ.

పృషదశ్వుఁడు:— విరూపుని కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు రథీతరుఁడు. భాగ.

పృషధ్రుఁడు:— (పృషధ్రుఁడు) వైవస్వతమనువుయొక్క కుమారుఁడు. ఇతఁడు గోవులను గాచుచుండువాఁడు. ఒకనాఁటి రాత్రి పెద్ద మబ్బు, గాలి, వాన వచ్చినప్పుడు గోశాలకు జేరెను. యామందలోనికి బెబ్బులి వచ్చి గోవు నొకదానిఁ జంపఁగా నది పులియని యనుకొని యితఁ డా గోవును జంపెను. ఆ సంగతి వసిష్ఠుఁడు వినెను. గోహత్య చేసితివి గావున శూద్రుఁడ వగుమని యాతనిని శపించెను. భాగ.

ఇతఁడు వసిష్ఠునివలన యాతని యనుమతంబున శ్రీహరియందు భక్తి నిలిపి యింద్రియములను గెలిచి శాంతుఁడై యుపరతకాముఁడు నగుచు, జడునివలెఁ దిరుగుచు నడవిని దహించుచు వచ్చుచున్న కార్చిచ్చునకు హుతమై పరబ్రహ్మమును గలిసెను. భాగ.

ఇతఁడు గురుఁడైన చ్యవనునిగోవును జంపెను గాన నితఁడు శూద్రుఁ డగునట్లు శపింపఁ బడియెను. విష్ణు.

ఇతనికే కరూశకుమారుఁ డను నామము వచ్చెను. భాగ.

పై

పైంగుఁడు:— బాష్కలుఁ డనువానివలన ఋగ్వేద సంహిత నుపదేశము నొందెను. భాగ.

పైలుఁడు:— కృష్ణద్వైపాయనుని శిష్యుఁడు. ఋగ్వేదపాఠకుఁడై ధర్మరాజు యజ్ఞమున

ఇతఁడు చతుర్వేద సూత్రములను ఏర్పాటు చేసెను. ఇతఁడు ఋగ్వేదమును బఠించెను. ఉదంకుఁ డితని శిష్యుఁడు. భాగ. భార.

పైలూషుఁడు:-కవషుని కుమారుఁడు. దరిద్రతను బోఁగొట్టుకొనుటకై ఈశ్వరు నారాధించెను. బ్రహ్మ.

పౌ

పౌండ్రకవాసుదేవుఁడు:- కరూశాధిపతి. శ్రీకృష్ణుఁడు కైలాసమునకు వెళ్ళినపు డీతఁడు ద్వారకానగరమునకేగి "లోకమున నిద్దఱు వాసుదేవులుందురా? ఒక గొల్లవాఁడు నా పేరు పెట్టుకొనునా? నాకును గద, సుదర్శనము కలవు. నిజమైన వాసుదేవుఁడను నేనే" యని యెల్లవారలకును జెప్పుచు శ్రీకృష్ణుని దూషించుచుండెను. ఆ మాటలు సాత్యకి విని వీనితో యుద్ధముచేసి వీనినిద్వారకనుండి వెడలఁగొట్టెను. అంతఁ బౌండ్రకవాసుదేవుఁడు కాశిరాజుకడకుఁ బోయి యతని సహాయముపొంది శ్రీకృష్ణుని కడకు వాసుదేవుఁడనునామము తీసివేసికొనుమని చెప్పుట కొకదూతను బంపెను. శ్రీకృష్ణుఁడు వీరిని యుద్ధమునకు రండని పిలచెను. పౌండ్రక వాసుదేవుఁడును, గాశిరాజును యుద్ధమునకు వెళ్ళిరి. శ్రీకృష్ణుఁడు వీరిని యుద్ధములో సంహరించెను. భార.

పౌండ్రము:- భీముని శంఖము. భార.

పౌరవతి:-ధర్మరాజుయొక్క భార్య. ఈమెయందు దేవకుఁడు అను పుత్త్రుఁడు కలిగెను. భాగ.

పౌరికుఁడు:-పురిక యను పట్టణములోనుండు రాజు. క్రూరుఁడు. తరువాతి జన్మములో నక్కకుఁ బుట్టెను. ఈనక్కకుఁ బూర్వజన్మస్మృతి గలదు. మాంసమును దినక, పండి రాలిన యాకులను, బండ్లను దినుచుండెను. తోడి నక్కలు మాంసమును దెచ్చి యిచ్చెద మనినను దినకుండెను. "వ్యాఘ్ర గోమాయు సంవాదములోనిది" యీ నక్కయే. భార.

పౌలోమ:-నారీతీర్థములలో నొకటి. (చూడుము నారీతీర్థములు.)

పౌష్పంజి:-జైమిని కుమారుఁ డగు సుమంతుని తనయుఁడు. తండ్రివద్ద సామవేదమును బఠించి దానిని ఆవంత్యులు, ఉదీత్యులు నను నే నూర్వురకు నుపదేశించెను. భాగ.

పౌష్యమహాదేవి:-పౌష్యమహారాజుయొక్క భార్య. అశుచిగనున్నవారి కీమె గోచరింపదు. ఈమె కుండలము లడిగి పుచ్చుకొనుటకు వచ్చిన యుదంకునకు మొదట నీమె కనఁబడ లేదు. అతఁడు కాళ్ళు చేతులు కడుగుకొని యాచమించి వచ్చినపిదపఁ గనఁబడి కుండలము లిచ్చెను. భార.

పౌష్యమహారాజు:-ఒక రాజు. ఉదంకుఁడను మునిశిష్యుఁ డితనికడకు వచ్చి యితని భార్య కుండలముల నిమ్మని యడిగెను. ఇతఁడు తన భార్యనడిగి కైకొమ్మని చెప్పెను. కుండలము లిచ్చిన పిదప నీ బ్రాహ్మణునకు రాజాతిథ్య మిచ్చి భోజనము పెట్టెను. ఈ బ్రాహ్మణునకు భోజనములోఁ దలవెండ్రుక యొకటి వచ్చెను. దాన నుదంకునకుఁ గోపమువచ్చి అంధుఁడవు కమ్మని రాజును శపించెను. ఇతఁడును నిష్కారణముగఁ దనను శపించెను గాన నపుత్త్రకుఁడవు కమ్మని యుదంకునకుఁ బ్రతిశాప మిచ్చెను. ఈ శాపము మరలింపుమని యుదంకుఁడు వేఁడెను. కాని యది తనకు సాధ్యముగాదని యీరాజు చెప్పెను; మఱియుఁ దన శాపమును మరల్చుమని యుదంకుని గోరెను. అచిరకాలములోనే శాపవిమోచనమగునట్లు ఉదంకుఁ డనుగ్రహించెను. భార.

ప్ర

ప్రఘనుఁడు:-సుమాలియొక్క కుమారుఁడు. రామా.

ప్రచేతసుఁడు:-వాల్మీకి తండ్రి.

ప్రచేతసుఁడు:-బ్రహ్మయొక్క పుత్త్రుఁడు. ఈతని మానసపుత్త్రుఁడు గౌతముఁడు. బ్ర. వై.

ప్రచేతసులు:- ప్రాచీన బర్హియొక్క పుత్త్రులు. వీరితల్లి సముద్రి (సౌవర్ణ). వీ రన్నదమ్ములు పదు నొకండుగురును ఈ నామమునే పరగుదురు. వీరు తండ్రిచేఁ దపస్సుచేయ ననుజ్ఞాతులై సముద్ర మధ్యమునఁ దపస్సుచేసిరి. ఈశ్వరుఁడు ప్రత్యక్షమై వరమువేఁడుకొనుఁ డనియె. ప్రచేతసులు ప్రజాపతిత్వమును గోరిరి. మీకు దక్షుఁ డను కుమారుఁడు పుట్టును. అతఁడు ప్రజాపతియగును అని శివుఁడు చెప్పెను. వీరు తపస్సు చాలించి వచ్చుచుండిరి. అప్పటికి లోకమంతయు వృక్షములతో నిండియుండెను. ప్రచేతసులు వృక్షముల నఱకు టారంభించిరి. అంతఁ జంద్రుఁడు వీరికడకు వచ్చి మీరు వృక్షములను నాశనము నొందింపకుఁడు. వృక్షముల కుమారిత మారిష యనునది కలదు. దానినిచ్చెదను. వివాహము కండు అని కోరెను. ప్రచేతసులు పదునొకండుగురును మారిషనే వివాహ మయిరి. వీరి కామె యందు దక్షుఁడు పుట్టెను. విష్ణు. మత్స్య.

ప్రజాగరుఁడు:- పురంజనుని పురాధ్యక్షుఁడు. చండవేగుఁ డను గంధర్వరాజు దండెత్తి రాఁగా వాని నోడించెను. భాగ.

ప్రజాపతి:- దేవుఁ డను మనువు కుమారుఁడు. అతనికి ధూమ్ర, బ్రహ్మవిద్య, మనస్విని, రతి, శ్వస, శాండిలి, ప్రభాత యను నేడ్గురు భార్యలు కలరు. వీరియందతనికి ధరుఁడు, ధ్రువుఁడు, సోముఁడు, అహుఁడు, అనిలుఁడు, అగ్ని, ప్రత్యూషుఁడు, ప్రభాసుఁడు అను నెనమండ్రు పుత్త్రులు కలిగిరి. భార.

ప్రజాపాలుఁడు:- శ్రుతకీర్తియొక్క కుమారుఁడు. అడవికేగి మహాతపుఁడను మునినిఁజూచి మోక్ష సాధనము బోధింపుమని కోరెను. ఇతఁడు పూర్వ జన్మమున సుప్రభుఁడను ముని. వరా.

ప్రజుఁడు:- అనిరుద్ధుని కుమారుఁడు. ప్రతిభానుఁడు. భాగ.

ప్రజ్వారుఁడు:- భయుఁ డను యవనేశ్వరుని తమ్ముఁడు. భయునితోడను, కాలపుత్త్రితోడను కోయి పురంజనునగరము గాల్చెను. భాగ.

ప్రతర్దనుఁడు:- కాశిరాజైన దివోదాసునకుఁ బుత్రకామేష్టి చేయఁగాఁ బుట్టిన కుమారుఁడు. (చూడుము ప్రవర్ధనుఁడు.)

ప్రతర్దనుఁడు:- ఒకరాజు. వత్సుని తండ్రి. భాగ.

ప్రతిబాహుఁడు:- అనిరుద్ధుని మనుమఁడు. ప్రజుని కుమారుఁడు. ఇతని కుమారుఁడు సుబాహుఁడు. భాగ.

ప్రతివింధ్యుఁడు:- ఉపపాండవులలో నొకఁడు. ద్రౌపదీధర్మరాజుల పుత్త్రుఁడు. యుద్ధములో జిత్తుఁడను రాజును జంపెను. భార.

ప్రతిశ్రవసుఁడు:- భీమసేనుని పుత్త్రుఁడు. ప్రతీపుని తండ్రి. భాగ.

ప్రతిష్ఠానపురము:- గంగా యమునా సంగమమునకుఁ దూర్పుననున్న పురము. దీనికి సుద్యుమ్నుఁడు రాజు. అతఁడు రాజ్యమును దన కుమారుఁడైన పురూరవున కిచ్చెను. భాగ.

ప్రతిస్మృతి:- ఒక విద్య. దీనిని వనవాసముచేయుచున్న ధర్మరాజునకు వ్యాసుఁ డుపదేశించెను. ధర్మజుఁ డర్జునునకుఁ జెప్పెను. దీనివలననే యర్జునుఁ డధిక తపోవీర్యవిభవుఁడై యింద్రాది దేవతలను బ్రత్యక్షము గావించుకొనియెను. భార.

ప్రతీతుఁడు:- వసువు కుమారుఁడు. ఇతనిపుత్త్రుఁడు ఓఘవంతుఁడు. భాగ.

ప్రతీపుఁడు:- ఋక్షుని కుమారుఁడైన భీమసేనుని పుత్త్రుఁడు. (ప్రతిశ్రవసుని పుత్త్రుఁడు) ఇతని భార్య సునంద. వీరు సంతానమునకై తీర్థ యాత్రలు సలిపిరి. వీరికి శంతనుఁడు, దేవాపి, బాహ్లికుఁడు అను పుత్త్రులు కల్గిరి. ప్రతీపుఁడు గంగాతీరమందుఁ దపస్సు చేసికొనుచుండఁగా గంగ యితనిని జూచి మోహించి స్త్రీ రూపమున వచ్చి తనను భార్యగ గ్రహింపుమని వేఁడి యాతని కుడితొడపైఁ గూర్చుండెను. "నే నేకపత్నీవ్రతుఁడను; నిన్నుఁ బరిగ్రహింపఁ జాలను. మఱియుఁ బుత్త్రారోహణ యోగ్యమైన కుడితొడ నెక్కితివి గావున నా పుత్త్రునకు భార్యవు కమ్ము" అని ప్రతీపుఁడు నుడివెను. భార.

అతఁడు శంతనునకు రాజ్యమప్పగించి తపోవనమునకుఁ బోవుచు, సురనదీతటమునఁ గనఁబడిన యొక కన్యను నా కుమారునకు భార్యవగుమని చెప్పితిని. ఆమె యిష్టపడినది. నీవు ఆమెయొక్క కులగోత్ర నామములడుగక యామె యిష్టమునే చేయుమని చెప్పెను.

ప్రతీహారుఁడు:- పరమేష్ఠికి సువర్చలయందుఁ బుట్టిన కుమారుఁడు. ఇతఁడు సకల జనులకును బ్రహ్మోపదేశమును జేయుచు యజ్ఞకరణ నిపుణులగు ప్రతిహర్త, ప్రస్తోత, ఉద్గాత అను పుత్త్రులను బడసెను. భాగ.

ప్రత్యగ్రుఁడు:-అపరిచరవసువుయొక్క పుత్త్రుఁడు.

ప్రత్యూషుఁడు:- అష్టవసువులలో నొకఁడు. ప్రభాతాప్రజాపతుల కుమారుఁడు; ప్రభాసుని సోదరుఁడు. దేవలుఁడు, విభువు ఇతని కుమారులు. భార. భాగ.

ప్రద్యుమ్నుఁడు:- సనత్కుమారు వంశంబునఁ బుట్టిన రుక్మిణీ కృష్ణుల కుమారుఁడు. ఇతఁడు పూర్వభవమున మన్మథుఁడు. ప్రద్యుమ్నుఁడు పుట్టఁగనే శంబరాసురుఁ డితనిచేఁ జచ్చునని యాకాశవాణి పలికెను. ఆమాటలు శంబరుఁడు విని భయపడి ప్రద్యుమ్నుని సంహరించుటకై కాకిరూపమున వచ్చి పురిటి యొనిమిదవనాఁడే ప్రద్యుమ్నుని నపహరించి సముద్రములోఁ బడవేసెను. ఈ శిశువు నొకచేఁప మ్రింగెను. ఈ చేఁప యొక జాలరివలలో బడెను. అది మిక్కిలి పెద్దదిగ నుండుటచే నా జాలరి దీనిని గానుకగ శంబరుని గృహమునకుఁ గొనిపోయి యాతని కూఁతురగు మాయావతి కిచ్చెను.

శివుఁడు మన్మథుని భస్మముచేసినపిదప రతీదేవి దీనరాలై విచారించుచుండెను. నారదుఁ డామెకడకుఁ బోయి మన్మథుఁడు ప్రద్యుమ్నుఁడుగఁ బునర్జన్మము నొందుననియు, శంబరాసురుఁ డతనిని సంహరింపయత్నించుననియుఁ జెప్పెను. రతీదేవి మాయావతి యనుపేరుతో దాసిరాలై వచ్చి శంబరుని గృహమునఁ బనులు చేయుచుండెను.

మాయావతి జాలరితెచ్చిన చేఁపను దఱుగఁగ నందు బాలకుఁడు గోచరించెను. నారదుఁడు వచ్చి యీ బాలుఁడే ప్రద్యుమ్నుఁడని చెప్పెను. (ఈ మాటలు శంబరుఁడునువిని వీనిని సంహరింప వచ్చెను. అసురునితో బాలకుఁడు పోరి వానిని సంహరించెను.) చేపగర్భమునుండి తీసిన యాబాలకుని మాయావతి రహస్యముగఁ బెంచెను. ఇతఁడు పెరిగిన పిమ్మట మాయావతి యితని భార్యవలె మెలంగుచుండెను. ఈమె నడవడిని బ్రద్యుమ్నుఁ డాక్షేపణచేయఁగ నామె యతని నిజవృత్తాంతము చెప్పెను. ప్రద్యుమ్నుఁ డామెవలన "సర్వశత్రు మాయావినాశని" అను మంత్రము నేర్చుకొని శంబరునిఁ జంపెను. మాయావతి ప్రద్యుమ్నునకు భార్యయయ్యెను. ఈమె యాకాశమార్గమునఁ గొనిపోయి ద్వారకయందుఁ బ్రద్యుమ్నుని జేర్చెను. రుక్మిణి యీతనిని జూచి తనపుత్త్రుఁ డగునో యని సంకోచించుచుండఁగ నారదుఁడు వచ్చి యితఁడే ప్రద్యుమ్నుఁడని చెప్పెను. ప్రద్యుమ్నుఁడు స్వయంవరమున రుక్మి కుమారితయైన శుభాంగిని రుక్మవతిని బరిణయమయ్యెను. ఆమెయం దాతనికి అనిరుద్ధుఁడు జన్మించెను. భాగ.

శ్రీకృష్ణుఁడు నగరమునలేఁడనివిని సాల్వుఁడు ద్వారకపై దండెత్తెను. వీనితోఁ బ్రద్యుమ్నుఁడు పోరాడెను. సాల్వుని బాణములచే నితఁడు మూర్ఛవోయెను. సారథి యతనిని రణరంగమునుండి మరలించెను. ప్రద్యుమ్నుఁడు మూర్ఛఁదేరి మరల యుద్ధమునకు వచ్చి పోరుచుండఁగ నారదుఁడు వచ్చి సాల్వుఁడు నీచే హతుఁడు గాఁడు. శ్రీకృష్ణుఁడే వీనిని సంహరించునని చెప్పెను. అంతఁ బ్రద్యుమ్నుఁ డాయత్నమును మానెను. భార. భాగ.

శుచిముఖి యను హంసి కృష్ణేంద్రులు వజ్రనాభుని సంహారణమును గూర్చి యాలోచించుచున్నారనియును, నితనివలన నొకపని గావలసి యున్నదనియుఁ జెప్పెను. మఱియు నది వజ్రనాభుని కుమారితయైన ప్రభావతి సౌందర్యము నెన్నెను. మొదట నితఁ డావచనములు లక్ష్యము చేయలేదుగాని తరువాత వానినే తలఁచుకొని ప్రభావతియందులగ్నమానసుఁడయ్యెను. అవిరళా

వేదనలోఁ దనవలపును దెల్పుచు, నొక యుత్తరము వ్రాసి శుచిముఖికిమ్మని యొకచిలుకకిచ్చెను. శుచిముఖి యాతనిని భద్రుఁడను నటుని రూపమునఁ గొనిపోయెను. ఈతని వజ్రనాభుఁడు తన కోటకు రావించి యాడించెను. ఇతఁ డపుడు సాంకేతికవచనములఁ దనప్రియనుగూర్చి వచించెను. ప్రభావతికై కొనిపోఁబడు పుష్పమందు భ్రమరమై ప్రవేశించి యంతఃపురము చేరినపిదప నామెయెదట నిజరూపముతోఁ దోచెను. ఆమె నచ్చటనే రహస్యముగ వివాహ మయ్యెను. తనతోవచ్చిన గదసాంబులు సునాభుని కుమార్తెలను వలచి యుండుటచే వారియంతఃపురములకుఁ దమవిడిదులనుండి సురంగములు కల్పించెను. ఈ సురంగద్వారముననే వీరు అంతఃపురమును ప్రవేశించి తమతమ నాయకలను జూడఁగల్గిరి. ప్రద్యుమ్నునకుఁ బ్రభావతియందుఁ బ్రభావంతుఁడను కుమారుఁడు కలిగెను. వజ్రనాభుని కంతఃపురమున నన్యులు ప్రవేశించినట్లు తెలిసి వీరినిబంధింప సేనానాయకులను బంపెను. ప్రద్యుమ్నుఁడు వారలతో యుద్ధము చేసెను. యుద్ధసమయమున కింద్రాదులు సహాయమువచ్చిరి. ప్రద్యుమ్నుఁడు వజ్రనాభుని సంహరించి ప్రభావతితో నిజనగరమున కేగెను. ప్రభావతియం దితనికిఁ బుట్టిన పుత్త్రుఁడు వజ్రనాభపురమునకు రాజయ్యెను.

ప్రద్యోతనుఁడు:- పురంజయునకు మంత్రియైన శునకుని కుమారుఁడు. శునకుని తరువాత (చూడు శునకుఁడు) నితఁడు రాజ్యము నేలెను. ఇతని కుమారుఁడు నందివర్ధనుఁడు. భాగ.

ప్రద్వేషిణి:- ఒక వనిత. ఈమె దీర్ఘతముఁడు గ్రుడ్డివాఁడైనను విద్యాసంపన్నుఁ డగుటచే నతనిని వివాహమయ్యెను. ఆతనివలన సంతానవతి యయ్యె. అయినను, నతనిపైఁ గోపించుచునే యుండెడిది. నాపై నిట్లేల యలుగుచుందు ? వని యతఁడు భార్య నడిగెను. "పోషించువాఁడు భర్త, పోషింపఁబడునది భార్య. అయినను సదా నిన్నే నేను పోషించుచుంటిని. ఇఁక నన్ను విడచి యెందేనిఁబొమ్ము" అని యామె పల్కెను. భర్తకుఁ గోపమువచ్చి "పతిహీనయైన భార్య అలంకారములు, మాంగల్యము లేక యుండుఁ గాక" యని శపించెను. అందువలన నీమెకుఁ గోపమువచ్చి కొడుకులను బిలిచి మీతండ్రిని నెందేని విడిచిరండని చెప్పెను. వారు తండ్రిని గంగానదిలో వదలి వచ్చిరి. భార.

ప్రధ్నశ్వుఁడు:-ఒకరాజు. అగస్త్యునకు ధనము కావలసి శ్రుతపర్వునితోఁ గలసి యితనికడకు వచ్చెను; కాని ఇతనికడ వానికిచ్చుటకు ధనము మిగులక పోవుట నితఁడును వారితోఁ గలసి త్రసదస్యుఁడను రాజుకడకు వెళ్ళెను. భార.

ప్రభాకరుఁడు:-మణిపూరుపురముయొక్క రాజైన చిత్రవాహనుని పూర్వుఁడు. ఇతఁడు సంతానము కొఱకు బ్రహ్మనుగూర్చి తపస్సుచేసెను. బ్రహ్మ ప్రత్యక్షమై నీకును, నీ సంతతివారికిని నొక్కొక్కఁడే పుత్త్రుఁడు పుట్టునని వరమిచ్చెను. అట్లే యితనికొక్క పుత్త్రుఁడును, వీని పుత్త్రున కొక్క పుత్త్రుఁడును ఇట్లు జన్మించిరి. భార.

ప్రభాకరుఁడు:-కద్రువకుమారుఁడు. భార.

ప్రభాకరుఁడు:- సూర్యుఁడు. (చూడు సూర్యుఁడు) రాహువుచేఁ గొట్టఁబడి క్రిందఁ బడిపోవుచుండఁగ వానిని అత్రి పునస్స్వస్థునిఁ జేసెను. ఇతఁడు రౌద్రాశ్వుని కుమార్తెలను బదిమందిని వివాహమయ్యెను. స్వస్తి, ఆత్రేయుఁడు ఇతని కుమారులు. హరి.

ప్రభాత:-దేవుని కుమారుఁడైన ప్రజాపతిభార్య. ప్రత్యూషుఁడు, ప్రభాసుఁడు ఈమె కుమారులు. భార.

ప్రభావంతుఁడు:- ప్రభావతియందుఁ బ్రద్యుమ్నునకుఁ బుట్టిన కుమారుఁడు. వజ్రనాభుఁడు సంహరింపబడిన పిదప నాతని నగరమునకుఁ గృష్ణుఁ డితనిని రాజుగఁ జేసెను.

ప్రభావతి:-వజ్రనాభుఁడను దనుజుని కుమార్తె. ఈమె చెలికత్తె రాగవల్లరి. ఇంద్రుని పంపున శుచిముఖి యను హంసి యీమె యుద్యానవనములోఁ బ్రవేశించి యీమెయెదుటఁ బ్రద్యుమ్నుని రూపమును బొగడి యాతనియం దీమెకు వలపు పుట్టించెను. ఆతని నేవిధముననైనను తనయం దనురక్తునిఁ జేసి తనకడకుఁ గొని రమ్మని ప్రభావతి హంసిని వేఁడెను. శుచిముఖి

ప్రద్యుమ్నుని నటునిరూపమున రావించెను. ప్రద్యుమ్నుఁడు నాట్యము నాడుచు సాంకేతిక వచనముల నాఁటిరాత్రి యీమెను గూడుటను దెల్పెను. ఇతఁడు భ్రమరమై ప్రభావతి నిమిత్తము కొనిపోఁబడు పుష్పములో దూరి యంతఃపురమునకుఁ బోయెను. అందేరహస్యముగ ప్రభావతీ ప్రద్యుమ్నులు వివాహమైరి. ఈమెకు ప్రభావంతుడను కుమారుఁడు కలిగెను. ప్ర.

ప్రభావతి:- భరద్వాజుని కుమారిత. ఈమె యింద్రుని భర్తగఁబడయగోరి తపస్సుచేసెను. ఇంద్రుఁడు వసిష్ఠునిరూపమున వచ్చి తనను బొందుమని చెప్పెను. ఆమె వసిష్ఠుని రూపమున నున్న యీతనితో నింద్రునకే భార్యనయ్యెదఁ గాని యొరునిఁ జేపట్టనని చెప్పి, యయ్యదిగాక యాతఁడేమి చెప్పినను జేసెదనని నుడివెను. ఆ పురుషుఁడు కొన్ని బదరీఫలములనిచ్చి వానిని బక్వము చేయుమని కోరెను. ఆమె యగ్నినిఁ జేసి పక్వముచేయఁ బ్రారంభించెను. కట్టెలన్నియుఁ గాలెనుగాని, ఫలములు పక్వము కాలేదు. కట్టెల నింకను దెచ్చుటకై వెళ్ళుచోఁ దిరిగివచ్చు లోపున నగ్ని చల్లారిపోవునేమో యనియును, దాన దుష్పాకంబగు ననియును భయపడి తన పాదములనే కట్టెలుగఁ బెట్టి కాల్చి ఫలములను బక్వముచేసెను. అదిచూచి ఈమె భక్తిశ్రద్ధలకు మెచ్చుకొని యింద్రుఁడు నిజస్వరూపము చూపించి యీమెను స్వర్గమునకుఁ గొంపోయెను. అది 'బదరీపాంచ' మను తీర్థమయ్యె. భార.

ప్రభావతి:-భద్రావతి నగరాధిపతియైన యౌవనాశ్వుఁడను రాజుయొక్క భార్య. ఈమె భర్త ధర్మజుని యాగాశ్వమునుబట్టెను. వానితోడను, వాని కుమారునితోడను భీమ వృషకేత్వాదులు యుద్ధముచేసిరి. ఆ యుద్ధమందు భీమసేనుఁడు వారినిఁ జంపఁగల్గినను, జంపక విడిచెను. అది యీమె తెలిసికొని కృతజ్ఞతగలిగి భీమాదులను గౌరవించి వారికి రత్నకానుక లిచ్చెను.

జై. భా.

ప్రభాసము:-ఒక పుణ్యతీర్థము. సరస్వతీనది సముద్రములో గలియుచోటున నున్నది. చంద్రుఁడశ్విన్యాదితారలను సమముగఁ జూడనందున వానిని గృశించుమని దక్షుఁడు శపించెను. అతఁడు కృశించుటచే నోషధులును గృశించెను. దేవతల కాహారమును తగిపోయెను. చంద్రున కివ్వఁబడిన శాపమువలన నిట్టి యవస్థ కలుగుచున్నదని దేవతలు దక్షునితోఁ జెప్పిరి. చంద్రుఁడు ప్రతి యమావాస్యనాఁడును సరస్వతీనది సముద్రములోఁ గలియుచోటున స్నానము చేయవలయుననియును, దానివలన నతఁడు వృద్ధినొందుచుండు ననియును దక్షుఁడు చెప్పెను. చంద్రుఁడు స్నానముచేసిన తీర్థమే ప్రభాసతీర్థము. • బ్రహ్మ.

చంద్రుఁ డిందు స్నానమును జేయుటచేతనే ఆప్యాయితశరీరుండై లోకప్రభాసుండయ్యెను. ఆ కారణముననే దానికిని ప్రభాసతీర్థమని పేరు వచ్చెను. భార.

ప్రభాసుఁడు:-ప్రభాతాప్రజాపతుల కుమారుఁడు. ఇతఁ డంగిరసుని కుమారిత యగు యోగసిద్ధిని వివాహమయ్యెను. విశ్వకర్మ యీతని కుమారుఁడే. ప్రభాసుఁడు అష్టవసువులలో నొకఁడు. వసువులందఱును దమ తమ భార్యలతో వసిష్ఠు నాశ్రమమునకుఁ జనిరి. ఈ ముని హోమధేనువు పాలు త్రాగినవారికి జరామరణములు కలుగవు. కావున నీ యాగధేనువును దస్కరించి తన చెలి కత్తియ కీయవలయునని ప్రభాసునిభార్య తలంచెను. వసువు లందఱును గలసి యా ధేనువును దస్కరించిరి. వసువులను మర్త్యయోనిం బుట్టుఁడని వసిష్ఠుఁడు శపించెను; మఱియు వారిలో బెద్దతప్పు చేసినవాఁడు ప్రభాసుఁడు కావున నితఁడు చిరకాలము మర్త్యలోకమున ననపత్యుఁడై యుండునట్లు శపించెను. ఇతఁడే భీష్ముఁడు జన్మించెను. భార.

ప్రమతి:-ప్రాంశువు కుమారుఁడు. ఇతనిపుత్త్రుఁడు ఖమిత్త్రుఁడు. భాగ.

ప్రమతి:- ఒక ముని. ఇతనిభార్యను సుదేవుఁడను రాజుయొక్క మిత్త్రుఁడు నలుఁడనువాఁడు మోహించెను. అందుకై నలుని దండింపుమని ప్రమతి సుదేవునితోఁ జెప్పెను. కాని సుదేవుఁడు వీనిని లక్ష్యముచేయక హేళనగ నేను కోమటిని, క్షత్రియుఁడనుగాను. వాని నెట్లు దండింతునని వచించెను. ఇతఁ డసత్యము చెప్పుచున్నాఁడని

ప్రమతి తెలిసికొని వలుఁడు నీరగునట్లు శపించి, సుదేవుని నీవు కోమటివై జన్మింపుమని శపించెను. సుదేవుఁ డపుడు వీని పాదములపైఁ బడెను. మార్క.

ప్రమతి:- చ్యవనునికుమారుఁడు. ఇతనితల్లి సుకన్య. ఇతనికి ఘృతాచియందు రురుఁడను కుమారుఁడు కలిగెను. భార.

ప్రమదోత్తమ:- హిమవత్పర్వత ప్రాంతములఁ గనకమయ గోపురములు గలిగి నవద్వారములతో నొప్పు పురమేలిన కాంత. భాగ.

ప్రమద్వర:- విశ్వావసుఁడను గంధర్వరాజునకును, మేనకకును బుట్టిన కన్య. ఈమె స్థూలకేశుఁడను మునియాశ్రమమునఁ బెరుగుచుండెను. ఈమెను రురుఁడు వరించి వివాహము కాఁగోరుచుండెను. ఒకనాఁ డామె కన్నియలతో నాడుకొను చుండఁగ బాము కఱచి విగతప్రాణయై నేలపైఁ బడియెను. మైత్రేయప్రముఖు లీమెను స్థూలకేశునియాశ్రమమునకుఁ గొంపోయిరి. ఈమెను వలచియుండిన రురుఁడు తన యాయువునందు సగ మీమెకు నిచ్చుటచే నీమె బ్రతికెను. ప్రమద్వరా రురులు వివాహమయి సుఖంబున నుండిరి. భార.

ప్రమిల:- స్త్రీమండలమందలి రాజకన్య. అచ్చట స్త్రీలే పరిపాలకులు. యుద్ధములు చేయుటయు వీరే. ఎంతటి బలాఢ్యులైనను వీరికి వశ్యులగు చుందురు. వీరికి సంతానము కలిగినను స్త్రీ సంతానమే కాని మగబిడ్డలు పుట్టరు. కావున నా రాజ్యమం దందఱు వనితలే కాని పురుషులు లేరు. ప్రమిల యీ రాజ్యమునకు రాణి. ఈమె నగరమున ధర్మజునియాగాశ్వము కట్టబడియెను. దానిని విడిపించుటకై అర్జునుఁ డీమెతోఁ బోరాటమునకు గడంగెను. కాని యచ్చటి వారు యుద్ధముచేసి నీవు గెలువఁజాలవు; ఆమెను వివాహమయి యశ్వమును విడిపించు కొనుమని చెప్పిరి. అర్జునుఁ డీమెను వివాహ మయ్యెను. జై. భా.

ప్రముచుఁడు:- ఒక ముని. ఋతధ్వజుని శాపము చేత రేవతి క్రిందఁ బడఁగ నితఁడు దానిని బెంచెను. ఆ కన్యకు యుక్తవయస్సు రాఁగాఁ దగిన భర్తకై వెదకుచు నెవరు తగినవారని యగ్నినిగూడ నడిగెను. దుర్దముఁడను రాజు కలఁడు; వాని కిమ్మని యగ్ని చెప్పెను. ఒకనాఁడు దుర్దముఁడే ప్రముచు నాశ్రమమునకు వచ్చి యచ్చట మునిని గానక, రేవతిని జూచి "ప్రియా! ముని యెచ్చటి కేగెను?" అని యడిగెను. ప్రముచుఁ డతఁడు వచ్చినందుకు సంతోషించి "నీవు నాకల్లుఁడ వగుదువు. నా కన్యను ప్రియా! యని పిలచితివి; దానిని స్వీకరింపు"మని అతని కిచ్చి వివాహము చేసెను. ఆ కన్య రేవతీనక్షత్రమందు నాకుఁ బరిణయము చేయుము అని కోరెను. ఆ నక్షత్రము చంద్రపథమున లేదుగదా, ఎట్లు చేయుదువని యడుగ, నీ తపఃప్రభావమున దాని నచ్చట నుంచు మని యామె కోరెను. ప్రముచుఁడు రేవతిని యథాస్థానమున నుంచి కుమారికకు వివాహముచేసెను. మఱియు దుర్దముని జూచి నీకు అరణ మిచ్చెదను. దుర్లభమైన దాని నేదైనఁ గోరుకొనుమనియె. తనకుఁ బుట్టిన కుమారుఁడు మనువు కావలెనని యతఁడు కోరెను. ఈ ముని దానిని బ్రసాదించెను. మార్క.

ప్రమోచన:- ఒక అప్సరస. ఈమెకు వరుణ పుత్త్రుఁడైన పుష్కరునివలన మాలిని యను కన్యక పుట్టెను. ఆమెను రుచి యను రాజునకు భార్యగ స్వీకరింపుమని యిచ్చెను. మార్క.

ప్రమ్లోచన:- ఒక అప్సరస. కంఘుఁడను ముని తపస్సు చేసికొనుచుండఁగ నతని తపస్సునకు భంగము కలుగఁజేయుటకై యింద్రుఁ డీమెను బంపెను. ప్రమ్లోచన వచ్చి కంఘుని మోహ పెట్టి వానిని దపస్సునుండి మఱలించెను. అతఁ డీమెతోడఁ బెక్కేండ్లు రతిసుఖములఁ దేలెను. కొంత కాలమైనపిదప ముని తన భంగపాటును దెలిసికొని యీమెపైఁ గోపగించెను. అప్పటి కీమె లేఁతచూలాలు; ముని భీషణవాక్కుల కీమె భయపడియెను. కంఘునివీర్య మీమె శరీరముపైకి చెమటరూపమున వచ్చెను. ఈమె దానిని చెట్లచిగుళ్ళతోఁ దుడిచివేసెను. పదపడి కంఘుని విడచి వెడలిపోయెను. ఆ చిగుళ్ళవలనఁ దుడువఁబడినది మారిష యను బాల యయ్యె.

ప్రయాగ:- బ్రహ్మ యిచ్చటఁ బెక్కు క్రతువులు చేసెను. అందువలన ఈ పట్టణమున కీ పేరు వచ్చెను. విష్ణు.

ప్రలంబుఁడు:- ఒక రాక్షసుఁడు. శ్రీకృష్ణ బలరాములు శైశవక్రీడలుసల్పుచున్నపుడు వీఁడుకూడ గోపవేషమువఁబోయి వారితోఁ గలసి యాడుచు వారిని సంహరించు నుద్దేశముతో బలరాముని మోసికొని గగనతలమున కెగసెను. బలరాముఁడు తన బరువుచే వానిని క్రిందకుద్రోసి వానిశిరముపై మోది వానిని జంపెను. విష్ణు.

ప్రవరాఖ్యుఁడు:- అరుణాస్పద నగరమందలి యొక బ్రాహ్మణుఁడు; నిష్ఠాపరుఁడు; సదాచార సంపన్నుఁడు; రూపవంతుఁడు. ఇతఁడు తన యింటికి వచ్చిన యతిథులను, నభ్యాగతులను సత్కరించి వారివలనఁ బుణ్యకథలు వినుచుండును. ఒకనాఁడొక సిద్ధుఁడు రాఁగా వాని నేయే పుణ్యదేశములు చూచితి? వని యడిగెను. అతఁడు చూచిన పలుతావుల పేరులు చెప్పెను. స్వల్పకాలములో నన్నిదేశము లా సిద్ధుఁ డెట్లు చూడఁగల్గెనో ప్రవరాఖ్యుఁ డచ్చెరువొందెను. ఒక పాదలేపనమువలన నిమిషములో నెచ్చటికైనఁ బోవచ్చునని చెప్పి సిద్ధుఁడు వానికిని పాదలేపనమిచ్చి దానిని గాళ్ళకు రాసికొనిన నితఁడును నేదేశమునకుఁ బోవలెనన్న నచ్చటికి రెప్పపాటులోఁ బోవచ్చునని చెప్పెను. ప్రవరాఖ్యుఁడు దానిని పాదములకు రాసికొని హిమవన్నగమునకుఁ బోఁగోరెను. క్షణములో నా పర్వతముపై నుండెను. అచ్చటి చిత్రవిచిత్రములన్నియుఁ జూచెను. కొంత ప్రొద్దెక్కఁగనే యెండవలనఁ బాదలేపనము కరగిపోయెను. ప్రవరాఖ్యుఁ డిఁక నింటికిఁ ద్రోవ గానలేకపోయెను. ఈ హిమవన్నగముపైకి వచ్చినందుకుఁ జింతనొందుచు మార్గమును వెదకుకొనుచుఁ బోవుచుండఁగ వరూధిని యను నొక వనిత కనఁబడియె. ఆమెను జూచి కొంతధైర్యము తెచ్చుకొని తన నగరమునకుఁ బోవుటకు తెరువెయ్యది? చెప్పుమని వేఁడెను. "ఇంతలు కన్నులుండఁ దెరు వెవ్వరి వేఁడెదు? నీవువచ్చినమార్గము నీకు తెలియదా? ఏకాంతముననున్న స్త్రీ నిట్లు సెపము కల్పించుకొని పల్కరించుచుంటివా?" యని యా యువతి పలికెను. ఆమెయతని నచ్చటనుండుమని కోరెను. అతనిపై వలపుగొనియుండుట తెల్పెను. ఇతఁడియ్యకొనకపోయినను నామె వీని నధరచుంబన మాసించెను. ఆమె పట్టు తప్పించుకొనివచ్చి ప్రవరాఖ్యుఁడు నేను ధర్మపరుఁడనైతినేని నన్ను నిల్లుజేర్చుమని యగ్నిని దలంచుకొనెను. ఇతఁడు సచ్ఛీలుఁడు గావున క్షణములో గృహము చేరఁగల్గెను. మార్క.

ప్రవర్ధనుఁడు:- (ప్రతర్దనుఁడు) దివోదాసునకు మాధవియందుఁ బుట్టిన కుమారుఁడు. భార.

హైహయ వంశపురాజైన వీతహవ్యుఁడు దివోదాసుని రాజ్యమునుండి తఱిమెను; అతని తండ్రియగు సుదేవుని సంహరించెను. ఆ కోపముచేఁ బ్రవర్ధనుఁడు వీతహవ్యుని పుత్త్రులను జంపి వీతహవ్యునిని గూడఁ జంపుట కేగెను. వీతహవ్యుఁడు భృగువాశ్రమములో దాఁగెను. ఇతఁడును ఆశ్రమముదగ్గఱకు వెళ్ళి వానికై యడుగఁగ వీతహవ్యుని దాచి యా ముని ఇచ్చట రాజులేరు; అందఱును బ్రాహ్మణులే యని చెప్పెను. ప్రవర్ధనుఁడు నవ్వి "ఇదియే చాలును. నా శత్రువును నిజజాతి నెడఁబాసినవానిగఁ జేసితిని. అది సిగ్గుగాదా?. అయిన నీ వాక్య మనృతము కా"దని వెడలెను. భార.

ప్రవర్షణగిరి:- ఒక పర్వతము. జరాసంధుఁడు తఱుముకొనిరాఁగా రామకృష్ణు లీ పర్వతముపైన డాఁగుకొనిరి. అతఁ డీ పర్వతముచుట్టును మంటలు పెట్టెను. భాగ.

ప్రవాహణుఁడు:- జీబలుని పుత్త్రుఁడు; రాజర్షి. ఇతఁడును, శిలకుఁడును, చైకితాయనుఁడును, ఉద్గీథవిద్యయందు జ్ఞానముగలిగి దానినిగుఱించి తర్కించుచుండిరి. శిలకుఁడు వేసెడు ప్రశ్నలకుఁ జైకితాయనుఁడు సమాధానము చెప్పుచుండెనుగాని తుద కాతనికి జ్ఞానము పూర్తిగ లేదని శిలకుఁడు "ఓయీ! నీ సామగానవిద్య శాస్త్రమునకును, న్యాయమునకును విరుద్ధముగ నున్నది. ఉద్గీథవిద్యాపరిపూర్ణుఁడైనవాఁడు శిరముఊడిపోవునట్లు శపించుచో నూడిపోయెడి సుమా! నేను సౌహార్దముచే నుపేక్షచేసి యూ

కొంటిని" అని చెప్పెను. అంతటఁ జైకితాయనుఁడు శిలకునకు శిష్యుఁడై యా విద్య నేర్చుకొనియె. పిమ్మటఁ బ్రవాహణుఁడు శిలకునిఁ బ్రశ్నించెను. తుదకు ప్రవాహణుఁడుకూడఁ జైకితాయనుని గూర్చి శిలకుఁడు చెప్పినట్లే శిలకునిగూర్చి చెప్పెను. అంత శిలకుఁడు ప్రవాహణుని వేఁడి ఉద్గీథజ్ఞానమును బడసెను. ఛా. ఉ.

ఇతనికడకు శ్వేతకేతుఁడను బ్రాహ్మణుఁడు తానే విద్యావంతుడననుగర్వముతో వచ్చెను. జీవు లెట్లుపుట్టి యెచ్చటికిఁబోవునో యెఱుగుదువా ? యని యీ రాజర్షి యా బ్రాహ్మణుని బ్రశ్నించెను. అతఁడు చెప్పలేకపోయెను. "ఇది యెఱుంగనివాఁడవు విద్యావంతుఁ డెట్లగుదువు ?" అని యితఁడాక్షేపించి పంపెను. ఆ శ్వేతకేతునితండ్రి యా జ్ఞానమును బడయుటకై వచ్చెను. ప్రవాహణుఁడతనికి "జీవము మేఘరూపమై, జలరూపమై, ఓషధులై జీవులచే భక్షింపఁబడి తిరిగి జన్మము లొందుటయు, నవి పోవుటయుఁ" దెల్పెను. (చూడుము అరణుఁడు) ఛా. ఉ.

ప్రశుశుక్రుఁడు:- మరుత్తుయొక్క కుమారుఁడు. ఇతనిపుత్త్రుఁడు సంధి. భాగ.

ప్రసన్న:-నారీతీర్థములలో నొకటి. (చూడుము నారీతీర్థములు)

ప్రసన్నుఁడు:-మతంగుని కుమారుఁడు. ధర్మవ్యాధునియల్లుఁడు. ఇతనిభార్య అర్జునకి. వ.రా.

ప్రసూతి:-స్వాయంభువు యొక్క కుమారిత. దక్షుని భార్య. భాగ.

ప్రసేనజిత్తు:-(సేనజిత్తు) కృశాశ్వునికుమారుఁడు. ఇతనిపుత్త్రుఁడు యవనాశ్వుఁడు. భాగ.

ప్రసేనజిత్తు:-రేణుకతండ్రి; జమదగ్నికి మామ. భార.

ప్రసేనుఁడు:- సత్రాజిత్తుయొక్క సోదరుఁడు. సత్రాజిత్తునొద్దనుండి శమంతకమణినితఁడుపుచ్చుకొనెను. ఈమణి నిమ్మని శ్రీకృష్ణుఁడితనినడిగెను. ఇతఁడివ్వననియె. ఒకనాఁ డితఁ డా మణితో వనమువెంబడిఁ బోవుచుండఁగ సింహ మొకటి వానిని జంపెను. మణికొఱకై ప్రసేనుని కృష్ణుఁడే చంపెనని యపవాదము పుట్టెను. భాగ.

ప్రస్రవణము:- కిష్కింధదగ్గఱనున్న యొక గిరి. ఈ గిరిగుహయందు శ్రీరామలక్ష్మణులు వర్షాకాలములో నుండిరి. రామా.

ప్రహస్తుఁడు:- సుమాలి పుత్త్రుఁడు. రావణుని సేనానాయకులలో నొకఁడు. రావణుఁడు కుబేరునితో యుద్ధమునకు వెడలినపుడు ఇతఁడు కుబేరునిదళవాయి యగు మణిభద్రునితోఁ బోరి వాని నోడించెను. రావణుఁడు యుద్ధమునకుఁ బూర్వము కార్యాలోచనము చేయునపుడు సంధి కంటె యుద్ధము చేయుటయే యుత్తమమని యితఁడు చెప్పెను. ఇతనికుమారుఁడు జంబుమాలి. యుద్ధములోఁ బ్రహస్తుని నీలుఁడు చంపెను. రామా.

ప్రహేతి:- స్వాయంభువమనువుయొక్క కుమారుఁడు. హేతిసోదరుఁడు. వారిఱువురును గలసి యింద్రాదుల నోడించిరి. వారు విష్ణుమూర్తితో మొఱపెట్టుకొనఁగ నతఁడువచ్చి వీరి నోడించెను. మిత్త్రకేశి యితని కుమారిత. ఈమె దుర్జయుఁడను రాజును వలచియుండుట విని యీమెను అతనికిచ్చి ప్రహేతి వివాహముచేసెను. వరా.

ప్రహ్లాది:-విశ్వకర్మ యొక్క భార్య. బ్రహ్మ.

ప్రహ్లాదుఁడు:- హిరణ్యకశిపుని పుత్త్రుఁడు. ఇతని యొక్క తల్లి లీలావతి. హిరణ్యకశిపుఁడు బ్రహ్మను గూర్చి తపస్సుచేయుట కేగినపుడు దేవతలు రాక్షసులపై యుద్ధమున కేగిరి. దనుజులోటువడి పాఱిపోయిరి. ఇంద్రుఁడు హిరణ్యకశిపుని భార్యను లీలావతినిగూడఁ బట్టుకొనెను. అప్పటికిఁ బ్రహ్లాదుఁ డామె గర్భముననుండెను. నారదుఁడు వచ్చి యామె సచ్చరిత్ర, ఆమెను విడువుమనియె. ఈమె గర్భమందు బాలుఁ డున్నాఁడు. వానిని జంపి యామెను విడిచెదనని యింద్రుఁడుచెప్పెను. ఆ పెరుగుచున్న బాలుఁడు కూడ భగవద్భక్తుఁ డగును; వానిని జంపకుమని నారదుఁడు చెప్పి లీలావతిని దన యాశ్రమమునకుఁ గొంపోయి కాపాడుచు నామెకుఁ దత్త్వోపదేశము చేసెను. గర్భమందున్న బాలుఁడుకూడ ఆతత్త్వమును గ్రహించెను. అందుచేఁ బ్రహ్లాదుఁడు పుట్టినప్పటినుండియు విష్ణుభక్తుఁడే యయ్యెను. ఇతనిని మించిన యుత్తమగుణుఁడు వేఱొకఁడు

లేదు. హిరణ్యకశిపుఁ డితనికి శుక్రాచార్యుని పుత్త్రులగు చండామార్కులచేఁ జదువు చెప్పించెను. ఇతఁ డచిరకాలములోనే శాస్త్రము లన్నియును నేర్చుకొని తోడిబాలురకు వేదాంతమును, విష్ణుభక్తిని నుపదేశించువాఁడు. ఇతఁ డెంత వఱకుఁ జదివినాఁడో యని తండ్రి పరీక్షింపఁ గోరి బాలునిఁ దనతొడపైఁ గూర్చుండఁ బెట్టుకొని ముద్దాడి యొక పద్యమును జదువుమనఁగా నితఁడు విష్ణునామసంకీర్తనము చేసెను. హిరణ్యకశిపుఁడు కుమారుని మందలించి "విష్ణుమూర్తి మనకు విరోధియనియును, దొంగ యనియును, తానే మూడులోకములకు నాథుఁడ ననియును, విష్ణుమూర్తిని స్మరింపరా" దనియును జెప్పెను. కాని విష్ణుభక్తిలేక భవబంధములుఁ బాయవని ప్రహ్లాదుఁడు పలుకువాఁడు. తండ్రి యెంత చెప్పినను, గురువు లెంతచెప్పినను ప్రహ్లాదుఁడు సదా విష్ణునామసంకీర్తనము చేయుచుండెను గాని మానలేదు. తుదకు హిరణ్యకశిపునకుఁ బుత్త్రునిపైఁ గోపమువచ్చి తనకులము చెఱుపఁ బుట్టిన యాబాలునిఁ జంపుటకై కొండలపైనుండి పడఁద్రోయించెను. సర్పములచేఁ గఱపించెను. ఏనుఁగులచేఁ ద్రొక్కించెను. కాని వీనివలనఁ బ్రహ్లాదుఁ డించుకయును బాధనొందఁడు; తనను గాపాడుమని వేఁడడు; విష్ణుకీర్తనము మానఁడు. తుదకుఁ బ్రాణము విసిఁగి హిరణ్యకశిపుఁడు 'ఏడిరా? నీహరి!' యనియడిగెను. హరి యొక్కచోట నననేల ? ప్రతిపదార్థమందును గలఁడని ప్రహ్లాదుఁడు చెప్పెను. తండ్రి ఈ స్తంభమందుఁ జూపుమని తన భవనమందలి యొక స్తంభమును దన్నెను. ఆ స్తంభమును బ్రద్దలు చేసికొని నృసింహమూర్తి వచ్చి హిరణ్యకశిపునిఁ జీల్చి చంపివేసెను. ఆ నృసింహమూర్తిని బ్రహ్లాదుఁడు స్తుతించి మ్రొక్కెను. భాగ.

ప్రహ్లాదుని భార్యపేరు దేవి. ఇతని కాయుష్మంతుఁడు, శిబి, విరోచనుఁడు, కుంభుఁడు, నికుంభుఁడు అను పుత్త్రులు కలిగిరి.

ప్రహ్లాదుఁ డొకసారి యొక ముని నవమానించెను. ఆ మునిశాపమువలన నితనికి విష్ణుభక్తి పోయెను. అంత విష్ణుమూర్తియు, నితఁడు నొకరితో నొకరుపోరుట తటస్థించెను. తిరిగి ప్రహ్లాదుఁడు జ్ఞానముతెచ్చుకొని విష్ణుభక్తిని గలిగి యుండెను.

చ్యవనుఁడు స్నానమును జేయుచుండఁగ నతఁడు పాతాళలోకమున కీడ్చుకొని పోఁబడియెను. అచ్చటనున్న ప్రహ్లాదుఁడు వానినిఁ జూచి గౌరవించెను. ఇతఁడు జేసిన తీర్థయాత్రల మాహాత్మ్యమును వర్ణింపఁగాఁ బ్రహ్లాదుఁడు తీర్థములు సేవింపఁ గోరి యితనితో సపరివారముగా వచ్చెను.

ప్రహ్లాదుఁడు తీర్థయాత్రలు చేయుచు నరనారాయణులు తపస్సుచేసికొనుచోటునకు వచ్చి వారిని, వారిముందఱనున్న యస్త్రములనుజూచి, వీరు నిజముగ మునులయిరేని వీరికి నస్త్రములేల? వీరెవ్వరో వంచకులు అనియె. ఆమాటలకు నరనారాయణులకుఁగోపమువచ్చినది. వారును, నితఁడును బోరాటమునకు సంసిద్ధమైరి. ప్రహ్లాదుఁ డోడింపఁబడియె. ఇతఁడు విష్ణుమూర్తిని ప్రార్థించెను. విష్ణువు ప్రసన్నుఁడై నరనారాయణులు తనయంశమువారే యని చెప్పెను. దే. భాగ.

ప్రహ్లాదుఁడుకూడ స్వర్గాధిపత్యమును జేయఁ గోరెను. సురలతోఁ బోరెనుగాని యోటువడి బలిని రాజ్యమందుంచి తాను దపస్సునకు బోయెను.

ప్రహ్లాదుని పుత్త్రుఁ డగు విరోచనుఁడును, సుధన్వుఁ డను నొక బ్రాహ్మణుఁడును నొక కన్యాప్రతిగ్రహమునుగుఱించి తమలోఁ దాము వాదులాడుకొనిరి. తమలో గుణగణములందుఁ బెద్ద యెవ్వఁడో నిర్ణయించి చెప్పుమని యిఱువురును బ్రహ్లాదునికడకు వచ్చిరి. నీవు ధర్మము విచారింపక చెప్పితివేని నీతల వ్రయ్యలగునని సుధన్వుఁడు పలికెను. ఇతఁ డామాటలకు భయపడి కశ్యపు నొద్దకుఁబోయి యీసందర్భమున నేనేమి చేయువాఁడ ? నని యడిగెను. సాక్షియు, ధర్మదర్శులు విధి తప్పరాదు. ధర్మము చెప్పుమని వచ్చిరేని చెప్పకుండినను పాతకమువచ్చును. కావున ధర్మమతిని విచారించిచెప్పుమని కశ్యపుఁడుచెప్పెను. ప్రహ్లాదుఁడు వారి గుణగణములను విమర్శించి సుధన్వుఁడే యెక్కుడుగుణవంతుఁడని చెప్పెను. భార.

విరోచనుఁడు, సుధన్వుఁడును ఒక పన్నిదములోఁ దమతమప్రాణము లొడ్డి ప్రహ్లాదుని తమతగవుఁ దీర్పుమనిరి. విరోచనుఁడుతనకొడు

కనియును సుధన్వుఁడు లాఁతివాఁ డనియును దలంపక సుధన్వుని గెలిపించి యీతనివలనఁ దనయుని జీవితంబును దానంబుగఁ గొని వానిని బ్రతికించెను. భార.

విరోచనుని పుత్త్రుఁడగు బలి రాజ్యము చేయుచు, ఇపుఁడు దైత్యులమహిమ చల్లార బొచ్చెను. దానికి కారణమేమని ప్రహ్లాదు నడిగెను. విష్ణుమూర్తిప్రభావమే దానికిఁ గారణ మని ప్రహ్లాదుఁడు పలికెను. విష్ణుమూర్తి యనఁగ నెంత, వానిని గెలువఁజాలిన వీరులు మనలోఁ లేరా ? యని బలియనఁగ బ్రహ్లాదునకుఁ గోపము వచ్చి విష్ణుమూర్తిచేత నే యణఁగిఁద్రొక్క బడుదువని బలిని శపించెను. వామ.

ప్రహ్లాదుఁడు బలికి ధర్మములు చెప్పుచుండు వాఁడు. వామనమూర్తి బలిని అణఁగఁద్రొక్కఁగఁ బ్రహ్లాదుఁడువచ్చి, వీఁడు హంతవ్యుఁడుకాఁడు, సద్ధర్ముఁడు; వీనిని గాపాడుమని విష్ణువులోఁ జెప్పెను. ప్రహ్లాదుఁడు చెప్పుటచేత విష్ణుమూర్తి యితనిని సంహరింపక మానెను. వామ.

ప్రా

ప్రాంశువు:-వత్సప్రీతి కు మా రు ఁ డు. ఇ త ని పుత్త్రుఁడు ప్రమతి.

ప్రాగ్జ్యోతిషము:-భగదత్తుని పురము.

ప్రాగ్దంశుఁడు:-ఒకదనుజుఁడు. వీఁడు భృగుపత్నిని నపహరించుటచే గీటకమవు కమ్మని భృగువు వీనిని శపించెను. అపు డీ దనుజుఁడు శాపవిమోచనమునకై వేఁడగ భార్గవుని మొగము నీవు జూచినపుడు శాపవిమోచన మగునని భృగువు పలికెను. వీఁడలర్కమను పురుగయ్యెను. కర్ణుని తొడయందుఁ బరశురాముఁడు నిద్రించుచుండఁగ ఈ కీటకము కర్ణునిఁ గఱచెను. రక్తముకారెను. పరశురాముఁ డపుడే మేల్కాంచెను. అపుడు వాని మోము ఈ కీటకము దర్శించెను. అంత దానికి శాపవిమోచన మయ్యెను.

ప్రాచీనబర్హి:-(ఇతఁడు బర్హిష్మంతుఁడు). ఇతని భార్య సముద్రి (సౌవర్ణ). పుత్త్రిక శతధృతి.

ప్రాచీనబర్హి:-హవిర్ధానుని పుత్త్రుఁడు. ఇతనిభార్య సముద్రి (సౌవర్ణ). ప్రచేతసు లీతని కుమారులు. విష్ణు. మత్స్య.

ప్రాచీనశాలుఁడు:-ఉపమన్యునికుమారుఁడు. వేద వేదాంగములు నేర్చెను గాని బ్రహ్మస్వరూప మును దెలిసికొనలేదు. దాని నెఱుంగుటకై యతఁడును, సత్యయజ్ఞుఁడును ఉద్దాలకునికడ కేగిరి. అచ్చటినుండి అశ్వపతికడ కరిగి, వానివలన నేర్చుకొనిరి. (చూడుము ఉద్దాలకుఁడు)

ప్రాచీశుఁడు:-పురూరవుని పుత్త్రుఁడగు జనమేజయుని కుమారుఁడు. ఇతఁడు ఉదయాచల పర్వతమువఱకును దిగ్విజయము చేసెను. ఇతని భార్య అశ్మకి. వీరిపుత్త్రుఁడు సంయాతి. భార.

ప్రాణుఁడు:-ధాతపుత్త్రుఁడు. మృకండుని సోదరుఁడు. వసిష్ఠునిపుత్త్రికయగు పుండరీక యితని భార్య. ఇతనికుమారుఁడు ద్యుతిమంతుఁడు. బ్రహ్మ.

ప్రాణుఁడు:-సోముఁడను వసువు కుమారుఁడు. భార.

ప్రాతికామి:-దుర్యోధనుని సేవకుఁడు. ధర్మరాజు జూదమున నోడినపిదప ద్రౌపదిని సభకుఁదీసికొని వచ్చుటకు వీఁడు పంపఁబడెను. ఆమె యొక ప్రశ్ననిచ్చి దానికి సమాధానమును గొని తెమ్మని చెప్పెను. అతఁడు సభలో ద్రౌపది యొక్క ప్రశ్నను జెప్పెను గాని యెవరును సమాధాన మీయలేదు.

రెండవసారి జూదమునాడుటకు ధర్మరాజును బిలుచుకొనివచ్చుట కితఁడే పంపఁబడెను. భార.

ప్రాప్తకాలజ్ఞుఁడు:-చూడుము దీర్ఘదర్శి.

ప్రాప్తి:-శమునిభార్య. భార.

ప్రాప్తి:-జరాసంధుని కూతురు. కంసునిభార్య. విష్ణు.

ప్రావారకర్ణుఁడు:-ఒక గుడ్లగూబ. మార్కండేయునికంటెను వయస్సునకుఁ బెద్దది. భార.

ప్రి

ప్రియ:-దక్షుని కుమారిత. దక్షుఁడీమెను బ్రహ్మకిచ్చెను. ఈమెయందు నారదుఁడు జన్మించెను. బ్రహ్మ.

ప్రియంవద:-నహుషుని భార్య. భార.

ప్రియంవదుఁడు:-ఒక గంధర్వుఁడు. మతంగ మహామునిని దిరస్కరించుటచేత నితనిని మదపుటేనుఁగవు కమ్మని శపించెను. శాపవిమోచనమునకై ప్రార్థింపఁగా, అజుఁడు నీకుంభస్థలమును గొట్టఁగా నీకు శాపవిమోచనమగు ననియెను. ఇతఁడు ఏనుఁగై కొలనులోనుండఁగా స్వయంవరమునకై వెళ్ళుచుండిన యజుని ఏనుఁగులు బెదరినవి. ఈ గజము తఱుముకొనిరాఁగా, దానిని సంహరింపరాదని యజుఁడు బాణముతో గొట్టెను. ఆ రూపముపోయి నిజరూపమును దాల్చి అజునకు నమస్కరించి సమ్మోహనాస్త్రమునుపదేశించెను. రఘు.

ప్రియవ్రతుఁడు:-అనంతా స్వాయంభువుల కుమారుఁడు. ఇతనిసోదరుఁ డుత్తానపాదుఁడు. ఇతఁడు కర్దమప్రజాపతిపుత్రికయైన కుక్షిని, విశ్వకర్మపుత్రికయైన బర్హిష్మతిని వివాహమయ్యెను. అగ్నీధ్రుఁడు, మేధాతిథి, వపుష్మంతుఁడు, ఇధ్మజిహ్వుఁడు, కవి, వీతిహోత్రుఁడు, సవనుఁడు మొదలగువా రితనిపుత్రులు. ఇతనికి నితరభార్యవలన ఊర్జస్వతి యను కూఁతురును, ఉత్తముఁడు, తామసుఁడు, రైవతుఁడు అను కుమారులును గల్గిరి.

ప్రియవ్రతుఁడు ధరణీపాలన మంగీకరింపలేదు. బ్రహ్మ వచ్చి గృహస్థాశ్రమంబునందును జితేంద్రియులై యాత్మజ్ఞానము కలవారికి బంధము కలుగదని బోధించి రాజ్యము నంగీకరించునట్లు చేసెను. భాగ.

సూర్యుఁడు మేరుపర్వతముచుట్టును దిరుగుచు నపరదిశను జేరునప్పుడు కలుగు చీఁకటిని బోఁగొట్టుటకుఁ బ్రియవ్రతుఁడు తపస్సు చేయుచు రథమెక్కి తిరిగెను. ఆ రథనేమి మార్గములు సప్తసముద్రము లయ్యెను. భూసంధులు సప్తద్వీపము లయ్యెను. విష్ణు. భాగ.

ఫే

ఫేనపుఁడు:-ఇతఁడు భార్గవకుల బ్రాహ్మణుఁడు. సుమిత్రుఁడనువాఁడు. గోవులను బెంచుచు వానివెంటనరిగి మేపుచు, దూడలు పాలుత్రావినపిదప గోస్తనఫేనమును ద్రావుచుండువాఁడు. దానివలన ఫేనపుఁడు అని పేరువచ్చెను. (చూడుము సుమిత్రుఁడు)

బ

బంధుఁడు:-తృణబిందుని తండ్రి.

బంధుఁడు:-వేదవంతుని కుమారుఁడు. భాగ.

బంధుమంతుఁడు:-కేవలుని పుత్త్రుఁడు. ఇతని కుమారుఁడు వేదవంతుఁడు. భాగ.

బకదాల్భ్యుఁడు:-ఒక ముని అరణ్యములో దుఃఖించుచున్న ధర్మజునకు బ్రాహ్మణప్రియులును, ధర్మనిత్యులు నగు మీ కభ్యుదయం బగునని చెప్పి చనియెను. భార.

బకాసురుఁడు:-ఒక రాక్షసుఁడు. బలరామకృష్ణులు వనములోఁ బశువులనుమేపి యింటికి వచ్చుచుండఁగా బకుఁడు పెద్ద కొంగవలెనయి కృష్ణుని మ్రింగెను. కంసునిపంపునవే వీఁడట్లు చేసెను. శ్రీకృష్ణుఁడు వీని కంఠము చీల్చి బయటకు వచ్చెను. భాగ.

బకాసురుఁడు:-పూర్వజన్మమున ఒక గంధర్వుఁడు. ఇతఁడు పరమ శివభక్తుఁడు. [illegible]

నొక సరస్సునుండి యొక కమలమును దెచ్చి శివపూజ చేయుచుండెను. ఇతఁ డొకనాఁడు తెలియక పార్వతి కొలనులోనుండి కమలమును గోసెను. అపు డాతనిని శివునియొక్క కింకరులు పట్టుకొని పార్వతికడకుఁ దీసికొనిపోయిరి. నేను శ్రీకృష్ణునిఁ బూజించుటకై కోయుకమలమును నీవేల కోసితి వని కోపపడి యామె శ్రీకృష్ణనామకీర్తనము కావించెను. ఇతఁడును శ్రీకృష్ణుని దర్శింపఁ గోరియుండుట తెల్పెను. భూలోకమునఁ గృష్ణుఁడు జన్మించును. నీవును రాక్షసుఁడవై శ్రీకృష్ణునిఁ జూచి యీలోకమునకు మరల వత్తువని పార్వతి పలికెను. బ్ర. వై.

బకాసురుఁడు:-ఒక రాక్షసుఁడు. ఏకచక్ర పురమందలి ప్రజలపైఁబడి వారిని బాధించి భక్షించుచుండెను. "దినమునకు నొక యింటి మనుజుఁడు నీకాహారము తీసికొనివచ్చి అతఁడును నీకాహారమయ్యెఁడు. వానిని గ్రహించి పురముపైఁ బడకుండుము" అని పురజనులు వానిని ప్రార్థించిరి. ఆట్లనుదినమును రెండెనుపోతుల బండిపై బండినిండ నన్నము వేసికొని యూరిబైటకు బకాసురునికడ కొకఁడు దానిని దోలుకొని పోవును. ఆ బండెడన్నమును, ఎనుపోతులను, ఆ మనుజుని బకాసురుఁడు భక్షించును. భీముఁ డాపురమున నుండఁగ నతని కీతని చరిత్ర తెలిసెను. ఒకనాఁడు భీముఁడే యాహారము తోలించుకొని వెళ్ళెను. బకాసురుఁ డట లేకపోవుటచే భీముఁ డన్నము తినుటకుఁ బ్రారంభించెను. బకాసురుఁడు హుంకరించుచు వచ్చి వీనిని గ్రుద్దెను. అప్పు డిరువురకు యుద్ధ మయ్యెను. తుదకు రాక్షసుఁడు భీమునిచే సంహరింపఁ బడియెను. బకుని తమ్ముఁడు కిమ్మీరుఁడు. భార.

బకుఁడు:-దల్భుని పుత్త్రుఁడు. ఇతనికి గ్లావుఁ డను పేరుకూడఁ గలదు. ఇతఁడు ముఖ్య ప్రాణాత్మస్వరూపము గలవాఁడు. ఇతఁడు నైమిశీయ ఋషులకు ఉద్గాతగనుండి వారికోరికల ఫలింపఁ జేసెను. బకుఁడు మిత్త్రి అను నామెచేఁ బుత్త్రుఁడుగ స్వీకరింపఁబడియెను. అందువలన నితఁడు ద్వ్యాముష్యాయణఋషి యనికూడఁ బిలువఁబడుచుండెడివాఁడు. ఇతనికి నొక తెల్లని శునకమును, దాని నాశ్రయించియున్న కొన్ని సామాన్యశునకములు గనఁబడియెను. సామాన్య శునకములు "నీ గానమహిమచే మాకు నాహారము కలుగఁజేయు" మని యా ధవళ శునకమును గోరెను. అది యేమిచేయునో యని బకుఁడు వానిని జూచుచుండెను. ఆ శునకము వానిని మఱునాఁ డుదయమున రమ్మనియెను. అవి అట్లే వచ్చెను. అవి యొకదానితోఁక నొకటి నోటఁ బెట్టుకొని గుండ్రముగాఁ దిరుగుచు హింకారములు చేసెను. అవి ఋత్విజులవలెను, ఉద్గాతృపురుషులవలెను జేయుట నితఁడు గ్రహించెను. ఛాన్దో. ఉ.

బకుఁడు:-ఒకముని. ఈతఁడు పూర్వముధృతరాష్ట్రుఁ డను నొక రాజును ధేనువును గోరెను. ఆ రాజు ఇతనిని జిన్నపుచ్చి పంపెను. అంత నితనికిఁ గ్రోధముకలిగి హోమముచేయఁ బ్రారంభించఁగా ఆ రాజు రాజ్యములోనివారు అడవిలో నరికిన చెట్లవలెఁ గూలిపోవుచుండిరి. ధృతరాష్ట్రుఁడు తన తప్పును దెలిసికొని బకునికడకుఁ బోయి వానికిఁ బెక్కు ధేనువు లిచ్చి వానినిఁ బ్రార్థించెను. భార.

బదరి:-ఒక వనము. పెక్కుఋషుల కాశ్రమము. నరనారాయణు లచ్చటనే తపస్సుగావించిరి.

బదరిపాచము:-ఒక తీర్థము. అచ్చటఁ బ్రభావతి యనునామె వసిష్ఠరూపమునవచ్చిన ఇంద్రునకు బదరీఫలములు వండిపెట్టుటకై తన పాదమును గూడఁ బ్రొయ్యిలోఁ బెట్టెను. (చూడుము ప్రభావతి.) మత్స్య.

బభ్రువాహనుఁడు:-అర్జునునకుఁ జిత్రాంగద యందుఁ బుట్టిన కుమారుఁడు. మణిపురము ఇతని రాజధాని. ఇతఁడు పుట్టినపిదపఁ బెద్దకాలము వఱకుఁ దండ్రిని జూచియెఱుఁగఁడు. ధర్మజుని యజ్ఞాశ్వమును అర్జునుఁడు కాచుకొనివచ్చుచున్నాఁడని విని తండ్రిని జూడఁగల్గితి నని సంతసించి బభ్రువాహనుఁ డెదురేగి తండ్రికి నమస్కరించెను. అర్జునుఁడు తన కుమారుని నాదరింపక "యశ్వమున కడ్డమై పట్టినవాఁడు రాజుగాని, యిట్లు భయముతో వచ్చి నమస్కరించువాఁడా రాజు? మా వంశమువాఁ డెదిరించి యుద్ధము చేయవలెనుగాని యిట్లు [illegible]

డగునా ?" యని నవ్వెను. ఆ సమయముననే నాగలోకమునుండి యులూచివచ్చి తాను బభ్రువాహనునకుఁ దల్లియగుదునని తెల్పి అర్జును నెదిరించియుద్ధముచేయుమనిచెప్పెను. అర్జునుఁడును, బభ్రువాహనుఁడును యుద్ధముచేసి యిద్దఱు హతులై పడిపోయిరి. చిత్రాంగద మిక్కిలి యార్తినొంది "నీమూలమున నాపుత్త్రుఁడు హతుఁడయ్యెను. నీకుఁ బుత్త్రులు లేరా ? ఏల యిట్లు చేయుదువు ? నాకుఁ బుత్త్రభిక్ష మి" మ్మని యులూచినిఁ బ్రార్థించెను. ఉలూచి సంజీవని మణిచే వారిద్దఱిని బ్రతికించెను. ఇంతలో బభ్రువాహనుఁడు లేచెను. ఉలూచి సంజీవని మణి తెచ్చి బభ్రువాహనున కిచ్చి యర్జునుని గుండె దగ్గఱ బెట్టుమనెను. ఇతఁడట్లు కావింపఁగా నర్జునుఁడు బ్రతికి లేచెను. భార.

బభ్రువాహనుని వలన నర్జునుఁడు విగత ప్రాణుఁడై పడిపోయెను. అచ్చటకు వచ్చిన చిత్రాంగదయు, నులూచియు దుఃఖమునొందిరి. తన తండ్రికడకుఁబోయి సంజీవనిమణిని తెమ్మని యులూచి బభ్రువాహనుని బంపెను. బభ్రువాహనుఁడు వెళ్ళి యడిగెను. కాని సర్పములు తిర్కించుకొని తుదకు యివ్వమనిరి. ఆ మాట బభ్రువాహనుఁ డులూచితోఁజెప్పెను. ఈమెకు మిక్కిలి గోపమువచ్చెను. బభ్రువాహనుఁడు తల్లులతోఁజెప్పి యురగులపై యుద్ధమునకు వెళ్ళెను. ధృతరాష్ట్రుఁడను సర్పము యుద్ధము చేసి యోడిపోయి యా విపత్తునకుఁ గారణము మృతసంజీవనినివ్వమని తనకుమారులు చెప్పుటే యని గ్రహించి వారిని జీవాట్లుపెట్టి బభ్రువాహనునకు మణి నిచ్చెను. ఈ ధృతరాష్ట్రుని పుత్త్రులకు రోషమువచ్చి బభ్రువాహనుని వంచించుటకై ముందుగవచ్చి యర్జునుని శిరమును నపహరించిరి. బభ్రువాహనుఁడు మణిని దెచ్చునప్పటికి అర్జునునిశిరము కనఁబడలేదు. అపుడు బభ్రువాహనుఁడు శ్రీకృష్ణుని దలఁచుకొని ప్రార్థనచేసెను. అర్జునునిశిరము మరల వచ్చెను. మృతసంజీవనిమణిచే వానిని బభ్రువాహనుఁడు బ్రతికించెను. జై. భా.

బభ్రువు:—పథ్యుని శిష్యుఁడు. అథర్వణవేదము పఠించెను. భాగ.

బభ్రువు:—సాత్వతుని కుమారుఁడైన దేవావృధుని తనయుఁడు. వీని కాలమున వీని నెఱుంగనివాఁడు లేఁడు. నరులలో బభ్రునికంటె నున్నతుఁడు లేఁడు. ఇతఁడు చెప్పిన యోగంబు నవలంబించి పలువురు ముక్తినొందిరి. భార.

బభ్రువు:—విదర్భుని పుత్త్రుఁడైన రోమపాదుని తనయుఁడు. ఇతని కుమారుఁడు విభువు. భాగ.

బర్హిణాశ్వుఁడు:— నికుంభుని పుత్త్రుఁడు. ఇతని పుత్త్రుఁడు కృతాశ్వుఁడు. భాగ.

బర్హిష్మంతుఁడు:— హవిర్ధానుని కుమారుఁడు. ఇతఁడు సంతతము యాగదీక్షగలిగి ప్రాచీనాగ్ర కుశలచేత క్షితితలంబెల్లఁ గప్పెను. ఇందువలన నితనికిఁ బ్రాచీనబర్హి యను పేరువచ్చినది. భాగ.

బర్హిష్మతి:— విశ్వకర్మ కూఁతురు; ప్రియవ్రతుని భార్య. భాగ.

బల:—ఒక మంత్రము. (చూడుము అతిబల)

బలంధనుఁడు:—వాభాగుని పుత్త్రుఁడు.

బలరాముఁడు:—రోహిణి వసుదేవుల కుమారుఁడు. విష్ణుమూర్తి కృష్ణావతార మెత్తునపుడు ఆదిశేషుఁడు భూలోకమున నవతరించుటకై దేవకీదేవి సప్తమగర్భమునఁ బెరుగుచుండెను. కాని కంసుఁడు దేవకీపుత్త్రుల నందఱిని సంహరింపఁ దలఁచి యుండుటచే ఈ పిండమునుదీసి రోహిణి గర్భమందుంచుమని హరి యోగమాయ కాజ్ఞ యిచ్చెను. యోగమాయయట్లుచేసెను. రోహిణి యందు ఆదిశేషుఁడే బలరాముఁడుగ జన్మించెను. గదుఁడు, సారణుఁడు, దుర్మదుఁడు, విపులుఁడు ఇతనియనుజులు. దేవకీదేవిగర్భ మణఁగిపోవుటచే నితనికి సంకర్షణుఁడని పేరువచ్చినది. జనులను రమించుటచే రాముఁడనియును, యదుసంకర్షణంబున సంకర్షణుఁడనియును, బలము గలిగి యుండుటచే బలుఁడనియును నీతనికిఁ బేరులు వచ్చినవి. ఇతఁడును, కృష్ణుఁడును గలసి యుండువారు. వీరు గోపకులతోఁగలిసి పశువుల మేపుచుండువారు. వారితోఁడనే క్రీడించువారు. వీరిని వంచించుటకై గోపవేషము న వచ్చి వీరి యాటలలోఁ జేరిన ప్రలంబాసురుని బలరాముఁడు ఆటలలోనే సంహరించెను. కంసు

కొలువులోనుండు చాణూర ముష్టికు లను మల్లులను ఇతఁడును, కృష్ణుఁడును సంహరించిరి. మఱియు నితఁడును, కృష్ణుఁడును తాలవనములో నుండఁగ వీనిని బాధుచుటకు వచ్చిన ధేనుకాసురుని నితఁడు సంహరించెను. గదాయుద్ధమునం దితఁడు ప్రవీణుఁడు. దుర్యోధనున కీతఁడు గదాప్రయోగ నైపుణ్యము కలుగునట్లు నేర్పెను. ఆ కారణమునఁ గాఁబోలు ఇతఁడు దుర్యోధన పక్షపాతియై యుండువాఁడు. ఇతని చెలియలగు సుభద్రను నర్జునున కిచ్చి వివాహముచేయఁ గృష్ణుఁడు తలఁచెను. సుభద్రయు వానినే గోరెను. కాని బలరామున కిష్టములేదు. శ్రీకృష్ణుఁ డితనిమాట కాదనాడఁడు; కాని యెట్లో తన యుద్దేశమే నెఱవేర్చుకొనుచుండువాఁడు. బలరామునకు యతులయెడ గౌరవము మెండు. అర్జునుఁడు యతివేషమున రాఁగా అతనిని సత్కరించి యతనికిఁ బరిచర్య లొనరించుటకు బలరాముఁడే సుభద్రను బంపెను.

రామకృష్ణు లిద్దఱు సాందీపునికడనే విద్య నభ్యసించిరి. సాందీపుని పుత్త్రుని దనుజుఁ డపహరించి సముద్రములో దాఁచఁగ నితఁడును, కృష్ణుఁడును వరుణునిచే వానిని దెప్పించిరి. దేవకి చనిపోయిన తన యేడ్వురు పుత్త్రులను జూడఁగోరెను. బలరామకృష్ణులు యమలోకమునకుఁ బోయి మృతులైన తమ సోదరులను దెచ్చి దేవకికిఁ జూపిరి.

బలరాముఁడు రేవతిని వివాహ మయ్యెను. శ్రీకృష్ణుఁడు రుక్మిణిని దెచ్చునపుడుఁ వానితో యుద్ధముచేయుటకు రుక్మి వచ్చెను. శ్రీకృష్ణుఁడు రుక్మిని సంహరింపఁ బోయెను. బలరాముఁ డడ్డుపడి "వానిని జంపకుము. వాని తలగొరిగి పంపుము. అదియును జంపినంత యవమానమే" యని చెప్పెను. ప్రద్యుమ్నుని వివాహమునకు బలరాముఁడు కూడ రుక్మి గృహమునకు వెళ్ళెను. రుక్మి, బలరాముఁడు తనకుఁ జేసిన యవమానమును జ్ఞాపకముంచుకొని ఇతనిని నవ్వులపాలు సేయఁగోరి జూదమునకు రమ్మని పిలిచెను. రుక్మియు, బలరాముఁడును ఆడిరి. మొదట రాముఁ డోడెను. తరువాత రుక్మి రాజా లందఱితోడను జెప్పెను. కొందఱిటు, కొంద ఱటు పలికిరి. వారిద్దఱు తిరిగి యాడిరి. చూచుచుండినవారు మాట్లాడకయే యుండిరి. ఆకాశవాణి బలరాముఁడే గెలిచెనని పలికెను. ఆ పలుకులు విని రుక్మి యుక్కురోషము పట్టఁజాలక బలరాముని దూషించుటకుఁ బ్రారంభించెను. చివరకిద్దఱును బోరాడిరి. ఆ యుద్ధములో బలరాముఁడు రుక్మిని జంపెను.

దుర్యోధనుని కూఁతురైన లక్ష్మణను రథమెక్కించుకొని సాంబుఁడు పోవుచుండఁగఁ గౌరవవీరు లాతనిని ముట్టడించిరి. సాంబుని బంధించి హస్తినాపురమునందుఁ బెట్టిరి. బలరాముఁడు వచ్చి వానిని విడువుఁ డనియెను; కాని "దుర్యోధనుఁడు బలరామాదులతోడి సంబంధము పాదుకలను దీసి శిరమునఁ బెట్టుకొనినట్లున్నది" యనిరి. ఆమాటకు బలరామునకు మిక్కిలి కోపమువచ్చి హస్తినాపురమును గంగలోఁ గలిపెదనని హలముతోఁ బొడిచెను. నగరమంతయుఁ బడవ ఆడిన ట్లల్లలాడినది. భీష్మాదులు బలరాముని ప్రభావముచే నట్టైనదని గ్రహించి వానిని బ్రార్థించి లక్ష్మణను, సాంబుని విడిపించి పంపిరి.

నరకాసురుని శ్రీకృష్ణుఁడు వధించుటచే నరకాసురుని మిత్త్రుఁడైన వానరము ద్వివిదుఁడనువాఁడు నగరములను, నుద్యానవనములను బాదుచేయుచుండెను. బలరాముఁడు బెదరించవలెనని రాళ్ళతోఁ గొట్టెనుగాని యది లక్ష్యముచేయక నగరములను ధ్వంసముచేయుచునే యుండెను. అంత దానిని రాముఁడు హలములోఁ జంపెను.

బలరాముఁడు బంధువులను జూడఁబోయి గోపికలతో యమునకు స్నానమునకు వెళ్ళెను. యమునను బిలిచెను. ఆమె రాలేదు. బలరామునకుఁ గోపమువచ్చి నిన్నుఁ జీల్చెదనని హలమును దివిచెను. అప్పటినుండియును యమున తెల్లఁబడియె. ఆమె స్త్రీరూపమునవచ్చి బలరామునకు నమస్కరించి వినీలవస్త్రాది కానుక లర్పించి చనియెను.

బలరాముని యొద్దనే దుర్యోధనుఁడును, భీముఁడును గదాయుద్ధము నేర్చుకొనిరి. ఏ కారణము వలననో కృష్ణునకుఁ బాండవులందుగల

బలరామునకు దుర్యోధనాదులందుఁ బ్రేమ మెండు. అర్జునునకు సుభద్రనిచ్చుట కిష్టపడక పోవుటయే గాక, తనకూఁతును శశిరేఖను దుర్యోధనుని కుమారుఁడైన లక్ష్మణున కివ్వఁ గోరెను. కాని యిదియును సమకూరినదికాదు.

విరాటునగరమున నభిమన్యుని వివాహమునకు నితఁడుగూడ వచ్చెను. అచ్చటనే పాండవు లిఁకముందుఁ జేయవలసినది తర్కింపఁబడియె. ముందుగఁ గౌరవులకడకు దూతను బంపవలెనని శ్రీకృష్ణుఁ డనఁగ బలరాముఁడు దానికి సమ్మతించెను. పాండవులు రాజ్యమును జూదములో నోడిపోయిరి. కాని గౌరవులేమియు నన్యాయము చేయలేదని యితఁడు చెప్పెను. వారికడకు వెళ్ళెడుదూత సాంత్వవచనములఁ బలుకవలెను గాని, వా రన్యాయముచేసిరని యెక్కువతక్కువ మాటలు చెప్పరాదని బోధించెను. కాని యిచ్చటఁజేరిన మిగిలినవారందఱును గౌరవు లన్యాయమునే చేసిరని తలఁచువారు. బలరాముఁడు యుద్ధము లేకపోవునేమో యని చూచెనుగాని తుదకది తప్పినదికాదు. కురు పాండవ యుద్ధమునందు బలరాముఁడు పాల్గొనుట కిష్టపడక యది తప్పించుకొనుటకై తీర్థయాత్రలు చేయుటకు వెడలెను. ఒకచోట నారదునివలన భీమ దుర్యోధనులకు గదాయుద్ధము జరుగఁబోవునని విని కురుక్షేత్రమునకు వచ్చెను. భీముఁడు దుర్యోధనుని యూరువులపైఁ గొట్టుటను జూచి, అది యధర్మమగుటచేఁ గోపము వచ్చి భీమునిపైఁ దన హలమునెత్తెను. అపుడు శ్రీకృష్ణుఁ డడ్డుపడి వానిని శాంతచిత్తునిఁజేసెను.

బలరాముఁడు తీర్థయాత్రలుచేసి తుదకు నైమిశారణ్యమునకు వచ్చెను. అచ్చట మును లందఱతనిని జూచుటతోడనే లేచిరిగాని సూతుఁడు లేవక యుండెను. బలరామునకుఁ గోపమువచ్చి "నీచులువిద్య నభ్యసించిన నిట్లె మదాంధు లగుదు"రని దర్భతో వానిని గొట్టెను. సూతుఁడు మృతినొందెను. "మేము సూతునకు బ్రహ్మాసన మిచ్చుట నీ వెఱుఁగుదువుగదా! ఇట్లు చేయుట ధర్మమా! నీవు ధర్మము తప్పిన నెవ్వరు మాన్పఁగలరు? కావున బ్రాయశ్చిత్తమును గైకొని ధర్మమును నిలుపుము. ధర్మరక్షణమునకై నీవు వచ్చితివి. నీకును, మాకును, మృత్యువునకును వైకల్య ముండునట్లు చేయుము" అనియును మునులు కోరిరి. బలరాముఁడు ఈ సూతపుత్త్రుఁడు దీర్ఘాయుష్మంతుఁడై వర్ధిల్లునని సూతుని బ్రతికించెను. బలరాముఁడు తామసముచే నట్టిపని చేసినందుకు విచారించి ఏమిసేయుదునని మునుల నడిగెను. మఱియును వారలకుఁ బ్రీతిచేయఁ దలంచి యేమిచేయుదునని మునుల నడుగఁగా "నిల్వలుని కుమారుఁడు పల్వలుఁ డను దనుజుఁడు యజ్ఞములను బాధుచేయుచున్నాఁడు. వానిని సంహరింపుము. పిదపఁ దీర్థయాత్రలు చేయుము" అని మునులు కోరిరి. అంత బలరాముఁడు వానిని జంపెను.

పిమ్మట నన్నితీర్థయాత్రలు సేవించి తిరిగి ప్రభాసంబునకు వచ్చి కురు పాండవ యుద్ధము జరుగుటయు, భీముఁడును, దుర్యోధనుఁడును గదాయుద్ధము చేయఁబోవు చున్నారని విని యట కరిగెను. వారిని "మీరు ఇరువురు సమ బలులు. పోరవల" దని చెప్పెనుగాని వారు వినలేదు. అటనుండి ద్వారక కేగి మఱల నైమిశారణ్యమునకు వచ్చి మునుల యనుమతిని బలరాముఁడు నైమిశారణ్యముననే యొక యజ్ఞమును గావించి నిజనగరంబున కరిగెను. పిమ్మట నల్పకాలములోనే కృష్ణుఁడు దుర్నిమిత్తములు గని యాదవులను బ్రభాసతీర్థమునకుఁ బంపి బలరామ సమేతుఁడై ద్వారక వీడివచ్చెను. యాదవకులమున ముసలము పుట్టి యన్యోన్య హతులై యదువృష్ణి భోజాంధక వీరులు నశించిరి. బలరాముఁడు శరీరము విడిచి యనంతునిఁ గలిసెను. ఈతనిజాడ వెదకుచుఁ గాననమునకు వచ్చిన యర్జునుఁ డీతనిశరీరమున కగ్నిసంస్కారమును గావించెను. పదపడి బలరాముఁడు వైకుంఠంబున కేగెను. భాగ.

బలాకి:-గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

బలాకుఁడు:-ఒక దనుజుఁడు. రాక్షసహననార్థము సుశర్మ యను బ్రాహ్మణుఁడు యాగము చేయఁ బోవుచుండఁగ నతనిభార్యనుహరించి యొకచోట దాఁచెను. సుశర్మ, రాజగు నుత్తమునితోఁ దన భార్యను వెదకియిమ్మనిచెప్పుకొనెను. బలాకుఁ డెత్తుకొనివచ్చి దాఁచియుంచుట యుత్తముఁడు తెలిసికొనివచ్చి రాక్షసునివలన నెట్టి యపహృతి

పొందనిదానిని విప్రుభార్యనుజూచి యచ్చెరువొంది, ఈమెను భక్షింపవు, ఈమెతో భోగింపవుగద, నీవేల యీమెను ఎత్తుకొని వచ్చితి" వని బలాకుని నడిగెను. భోగములు కోరితినేని దివ్యాంగనలు లేరా నాకు? ఆ బ్రాహ్మణుఁడు మమ్ములను నాశనము చేయుటకుఁ గ్రతువు సేయుచున్నాఁడు. ఆ కర్మ చేయుటకనర్హునిగఁ జేయుటకై యాతనిని భార్యాహీనునిగఁ జేసితిని. ఇపుడు నీ దాసుఁడనైతి. నీ వెద్ది చేయుమనిన దానిని జేసెద. నీవు తలఁచినపుడు నేను వచ్చెద"నని బలాకుఁడు పల్కెను. రాజానతి ప్రకారము బలాకుఁడు సుశర్మ భార్యను నామె యింటియొద్ద దిగఁబెట్టెను. తరువాత నుత్తమునిభార్యను బహుళను, సాల పోతకు నింటికడనుండి కొనివచ్చి యుత్తమున కిచ్చెను. మార్క.

బలాశ్వుఁడు:- ఖనిత్రుని పుత్త్రుఁడు. ఇతఁడే కరంధముఁడు. (చూడుము కరంధముఁడు)

బలి:- విరోచనుని పుత్త్రుఁడు. ఇతనిభార్య ఆశన. ఇతనికి రత్నమాలయను కూఁతురును; బాణుఁడు, ధృతరాష్ట్రుఁడు, నికుంభనాభుఁడు, విభీషణుఁడు అను కుమారులును గలరు. బలి సద్ధర్ముఁడు; ఆడితప్పనివాఁడు. దైత్యులకు దేవతలవలనఁ గార్యావరోధములు, బాధలు పెక్కులు గలుగుచుండెను. కావున నింద్రునిఁ బదభ్రష్టుని జేయుటకై బలి యింద్రనగరముపై దండెత్తెను. ఇతనితో యుద్ధము సేయుటకు నింద్రుఁడు వెఱచి బృహస్పతిని నాలోచన యడిగెను. "నీ విపుడు పోరఁజాలవు. రాజ్యము విడచి పొమ్ము. తిరిగి విష్ణుసహాయము పొంది రాజ్యమును పొందఁగల" వని బృహస్పతి చెప్పఁగ నింద్రుఁడు రాజ్యమును విడిచిపోయెను. బలియే మూఁడు లోకములకుఁ బ్రభువయ్యెను. కాని దానవుల ధైర్యము, తేజము తగ్గఁజొచ్చెను. ఏల యిట్లు తగ్గుచున్న"దని బలి ప్రహ్లాదుని నడిగె. హరిప్రభావమే దానికిఁ గారణమని ప్రహ్లాదుఁడు ప్రత్యుత్తర మివ్వఁగ నితఁడు "ఎవఁడా హరి? వానియంతవారు దేవతలు లేరా? వారిని జయింపమా? హరియనఁగ నెంత?" యని గర్వముగఁ బలికెను. అందుపైఁ బ్రహ్లాదునకుఁ గోపమువచ్చి యతనిని హరి చేతనే పదభ్రష్టుఁడ వయ్యెదవని శపించెను.

బలి మూఁడులోకము లాక్రమించుకొనినాఁడని దేవతలు బ్రహ్మతోఁ జెప్పుకొనిరి. బ్రహ్మాదులు విష్ణుమూర్తితోఁ జెప్పుకొని తమ్మును గాపాడుమని కోరుకొనిరి. విష్ణుమూర్తి వామనావతారమెత్తి యితనికడకు వచ్చి యాచించెను. నీకు గావలసినది కోరుకొమ్మని బలి చెప్పెను. రాక్షస గురువగు శుక్రాచార్యుఁడు, వచ్చినవాఁడు సామాన్యుఁడు కాడుసుమా, వాని కట్టీవలదు. నీ వరము మరల్పుమని వేఁడెనుగాని ఆడినమాట తప్పనని బలి గట్టిగఁబలికెను. వామనుఁడు మూడడుగులు నేలమాత్రముకోరెను. బలి వానికి ధారపోసెను. వామనుఁడు విజృంభించి యొకపాదముతో భూమి యంతయును గప్పెను. రెండవ యడుగులో నాకాశము కప్పెను. మూడవ యడుగు పెట్టుటకుఁ దావు లేకపోయెను. మూడవపాదము నాశిరముపైఁ బెట్టుమని బలి తలవంచెను. విష్ణుమూర్తి తనపాదమును బలి శిరముపై నుంచెను. అంతఁ బ్రహ్లాదుఁడు వచ్చి బలి భక్తియుతుఁడు, నీతిపరుఁడు. దండార్హుఁడు కాఁడు మన్నింపు" మని విష్ణుమూర్తిని ప్రార్థించెను. బలిని హరి సుతలలోకమునం దుండఁబంచెను. అతనియాజ్ఞ నెఱవేర్పని దనుజులు దండార్హులని శాసించెను. బలి కట్టి భంగిపాటును లేకుండ బలి వాకిటఁ దానే కావలియుండెను. పాతాళలోకమున నున్న బలితో యుద్ధముచేసి వానిని జయింపవలెనని రావణుఁ డాలోకమున కరిగెను. బలి యతనిని జూచి 'రావణా! రమ్ము' అని తన తొడపైఁ గూర్చుండబెట్టుకొని నీవువచ్చినపని యేమి? యని యడిగెను. రావణుఁడు తావచ్చిన పని చెప్పలేక నిన్ను విష్ణుమూర్తి మాయచేసెనని వింటిని. వాఁడెచ్చట నున్నాఁడో తెల్పుము అనియె. నీవు మొదటిద్వారముకడఁ జూచిన యతఁడే విష్ణువని బలి విష్ణుమాహాత్మ్యమును దెల్పెను. భాగ. ఉ.రా.

బలిదగ్గఱకు దేవకి కోర్కెపైఁ గృష్ణ బలరాములు కంసునిచేఁ జంపఁబడిన శిశువుల నామె కొకసారి చూపుటకై సుతలమునకు వచ్చిరి. వారిని బలి సేవించి ప్రార్థించెను. వారు తాము వచ్చినపని చెప్పి యితని యనుమతిని గైకొని

అందున్న శిశువులను భూలోకమునకుఁ దీసికొని వచ్చిరి. భాగ.

బలి:-సూర్యసావర్ణిమనువుకాలమున విష్ణుమూర్తియే బలిని ఇంద్రపదమునఁ బెట్టును. ఇతఁడు ఇంద్రుఁ డగును. భాగ.

బలి:-భార్య వింధ్యావళి.

బలి:-ప్రభావమును గోల్పోయి యింద్రునిచే నోడింపఁబడి ఖరరూపమును దాల్చి యొకచో దాగియుండెను. అట కింద్రుఁ డైరావతమెక్కి వచ్చి యితని నాక్షేపణ చేసెను; కాలప్రభావ మటువంటిది. నీవు పూర్వము బ్రహ్మహత్యా పాతకమునకువెఱచి రాజ్యమువిడిచి తుమ్మెదవై యొకచో దాగవా ? అని బదులు చెప్పెను.

బలి:-సుతపుని కుమారుఁడు; ఒక రాజు. ఇతఁడు గంగానదిలో స్నానము చేయుచున్నపుడు వేదములు చదువుచుఁ బ్రవాహముతోఁ గొట్టుకొని వచ్చుచున్న దీర్ఘతమునిఁజూచి వానిని మహర్షిగానెఱింగి తనగృహమునకుఁ గొంపోయి యతని భార్యయందుఁ బుత్త్రుల ననుగ్రహింపుమని కోరెను. ఇతనివలనఁ బుత్త్రినిఁ బడయుమని తన భార్యను సుధేష్ణను నియోగించెను. ఆమె యీ ముదుసలిని డాయరోసి తనయొక్క దాసిని బంపెను. దానికిఁ బుత్త్రులుగల్గిరి. వారు తన పుత్త్రులేయని బలి సంతసించుచుండెను. కాని దీర్ఘతముఁడు వారలు దాసీకుమారులని చెప్పెను. మఱియొకసారి బ్రాహ్మణునివేఁడి తనభార్యను దిరిగి నియోగించెను. ఆమెకు వంశకరుఁడు, బలసంపన్నుఁడు నగు కుమారుఁడు అంగరాజు కలిగెను. ఇతనికి వంగుఁడు, కళింగుఁడు, సింహుఁడు, ఆంధ్రుఁడు అను కుమారులుకూడ కలిగిరి. భార. భాగ.

బలుఁడు:-అనాయువు పుత్త్రుఁడు. భార.

బలుఁడు:-పారియాత్రుని పుత్త్రుఁడు. ఇతని కుమారుఁడు చలుఁడు. భాగ.

బల్లేశ్వరుఁడు:-(చూడుము కుంచము)

బసవన్న:-మండెంగి మాదిరాజు పుత్త్రుఁడు. ఇతనితల్లి మాదమాంబ. పుత్త్రులు లేకపోవుటచే నందికేశ్వరు నారాధించెను. అతని వరప్రసాదమువనే గర్భమును దాల్చెను. ఆమె మూఁడేడులు మోసెనుగాని ప్రసవము కాదయ్యె. ఆమె విసుగుచెంది శివుని బ్రార్థింపఁగఁ గలలో నంది సాక్షాత్కరించి యామెయందుఁ దాను బుట్టుదుననియును, బసవన్న యను పేరు పెట్టుమనియును జెప్పెను. బాలుఁడు పుట్టి పెరిగిన పిమ్మటఁ దండ్రి యుపనయనము చేయుదు ననియెను. వలదని యితఁడు వాదించెను. బసవన్న తన మేనమామ కూఁతురును బరిణయమయ్యెను. పిమ్మటఁ దన గురువును జూచుటకు వెళ్ళి సంగమేశ్వరుని యాలయములో శివుని స్తుతించెను. శివుఁడు బ్రత్యక్షమై నీతిని బోధించెను. బసవన్న సామర్థ్యము విని బిజ్జలుఁడను రాజతనిని దనకు మంత్రిగ రమ్మనియె. బసవన్నను జూచుటకు శివుఁడు అల్లమనువు అను రాజుగ నవతరించి బసవన్నకడకు వచ్చి తన కారగించుటకుఁ బెట్టుమనియె. నీకుఁ బెట్టఁగల వాఁడను నేనా ? యని బసవన్న యతనిని గొనియాడఁగ సంగమేశ్వరుఁడు తనను గుర్తెరింగినందుకు మెచ్చుకొని వరము లిచ్చెను. భగవద్భక్తుఁడుగాన నాతనిచరిత మద్భుతము.

ఒక జంగమువచ్చి రాజుయొక్క పేటికలో నున్న ధనమంతయుఁ దనకిమ్మని బసవన్నను బ్రార్థించెను. బసవన్న యిచ్చివేసెను. ఇతర మంత్రు లది చూచి రాజుతోఁ జెప్పిరి. రాజు కోపపడియె. నీకుఁ బరధనాపేక్ష లేదుకదా ? మా ధన మేల తీసికొంటివి ? అని బసవన్నను అడిగెను. భక్తులగువారికిఁ గొదువయుండునా ? నీ ధనము మాకేల ? నీపెట్టె చూచుకొనుమని బసవన్న పలికెను. రాజు తనపెట్టెను సభలోనికిఁ దెప్పించి తాళముతీయఁగా నందు ధనమంతయు నుండెను.

ఒక జంగముయొక్క యుంపుడుగత్తె బసవన్న భార్య కట్టినచీర తనకుఁ దెచ్చి యిమ్మని కోరఁగ ఆ జంగము వచ్చి బసవన్న నడిగెను. బసవన్న తన భార్యను బిలచి కట్టిన వస్త్రము విప్పి యిమ్మనియెను. ఆమె చీరె విప్పి యిచ్చెను గాని యామె శరీరమున బట్ట తొలఁగకుండగనే యుండెను. బసవ.

బహుమూలకము:-కద్రువ కుమారుఁడు. భార.

బహుళ:-ఉత్తముని భార్య. ఉత్తమమనువు తల్లి. ఈమెయందు భర్త యనురాగుఁడై యున్నను భర్తను నీమెతిరస్కరించుచు నవమానముచేయుచుండును. విసిగి విసిగి భర్త యీమెను కానన మధ్యమునకుఁ బంపివైచెను. భర్త నెడఁబాసి పోవుట కీమె విచారించలేదు. అడవియందుఁ దిరుగుచున్న సాలపోతకుఁడను సర్పరా జీమెను జూచి వలచి తనభవనమునకుఁ గొనిపోయెను. ఇతనికూఁతురు నంద యనునది తనతల్లికి బహుళ సవతి యగునని భయపడి యీమెనొకచోదాఁచి పోషించుచుండెను. కొంతకాలమైన పిదప నుత్తమునిపంపున బలాకుఁడను దనుజుఁడు వచ్చి యీమెను ఉత్తమునికడకుఁ గొంపోయెను. ఉత్తముని మిత్త్రుఁడు సుశర్మ క్రతువుచేసి యీమె దుశ్శీలము హరింపఁజేసెను. ఈమె భర్తతోఁగలసి సుఖంబులనుభవించుచుండెను. ఈమెకుఉత్తముఁడను పుత్త్రుఁడు కలిగెను. మార్క.

బహుళాశ్వుఁడు:-మిథిలదేశపురాజు. సద్ధర్ముఁడు. సుశీలుఁడు. భాగ.

బహుళాశ్వుఁడు:-ఇతని నగరమందే సద్భూషణుఁడను బ్రాహ్మణుఁడు శ్రుతదేవుఁడనువాఁడు నివసించుచుండెను. వీరిని జూచుటకు శ్రీకృష్ణుఁడు మునిసమేతుఁడై మిథిలకుఁబోయెను. వారిద్దఱును శ్రీకృష్ణునకెదురేగి యాతిథ్యమిచ్చి తోడ్కొని వచ్చి తమ గృహములం దుండుమనికోరిరి. ఒకరి సంగతి యొకరికిఁ దెలియకుండ మునులును, శ్రీకృష్ణుఁడును నిద్దఱియిండ్లలోను గొన్నిదినము లుండిరి. భాగ.

బహ్వాశి:-గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

బహ్వృచప్రవరుఁడు:-శౌనకుని కుమారుఁడు. భాగ.

బా

బాణాసురుఁడు:-బలిపుత్త్రుఁడు. శోణపుర మీతని నివాసము. ఇతనికి వేయిబాహువులు కలవు. ఇతఁ డీశ్వరు నారాధించి తనకు శత్రుభయము లేకుండుటకై శివునిని వచ్చి తన నగరమునఁ గాఁపురముండుమని కోరెను. శివుఁడును, పార్వతియును నీతనిపట్టణమునకు వచ్చి యుండిరి. మఱల నొకనాడు శివునకు మ్రొక్కి "నాతోఁ బోరఁగలవాఁ డొకఁడును నాకుఁ గనఁబడుట లేదు. నాచేతులదురద పోకున్నది. నీవే నాతో యుద్ధమునకు రమ్మని కోరెను. నీ దురదను బోఁగొట్టువాఁడు కలఁడు. నీ ధ్వజ మెప్పుడు క్రిందఁబడునో అప్పు డతఁడు నీతోఁ బోరుటకు వచ్చును. పొమ్ము" అని శివుఁడు చెప్పెను.

అట్లుండఁగ బాణాసురుని కుమారితయగు నుషకు నొక సుందరాకారునితోఁ గలసినట్లు కల వచ్చెను. ఆమె ఆ సంగతి చిత్రరేఖతోఁ జెప్పెను. ఆమెకలలోఁ గనఁబడినవాఁడు అనిరుద్ధుఁ డని చిత్రరేఖ గ్రహించి తన విద్యచే నొరులెఱుంగకుండ ననిరుద్ధుని దెచ్చి యుష యొక్క సౌధములోఁజేర్చెను. ఇతనివలన నుష గర్భవతి యయ్యెను. అది కావలివారు బాణున కెఱింగించిరి. తనపుత్త్రికకన్యాత్వము దూషిత మయ్యెనని రోషముతో బాణుఁడు కన్యా సౌధాంతమునకుఁ బోయి యనిరుద్ధుని నాగ పాశముచే బంధించెను. ఈ వృత్తాంతము నారదునివలనఁ గృష్ణుఁ డెఱిగి సేనాసమేతుఁడై బాణుని నగరమునకువచ్చి అనిరుద్ధుని విడిపింపుమని శ్రీకృష్ణుఁడు కోరెను. కాని బాణుఁడు తిరస్కరించి శ్రీకృష్ణునితో యుద్ధము చేసెను. శ్రీకృష్ణుఁడువానిబాహువులను నఱికెను. తుదకు వానిని సంహరింపఁబోవుచుండఁగా శివుఁడువచ్చి శ్రీకృష్ణునిఁ బ్రార్థించి బాణుని విడిపించెను. బాణుఁడు తన కుమార్తెను అనిరుద్ధున కిచ్చి వివాహము చేసెను. భాగ.

బాణాసురుఁడు:- బలికి అశనయందుఁ బుట్టిన కుమారుఁడు. భాగ.

బాణుఁడు:- సూర్యవంశపురాజు. వికుక్షిసుతుఁడు. ఇతనిపుత్త్రుఁడు అనరణ్యుఁడు. రామా.

బాలధి:-ఒకముని. పుత్త్రశోకాపన్నుఁడై దేవతలను ప్రార్థించి చిరంజీవియగు పుత్త్రుని మేధావి యను వానిని బడసెను. భార.

బాలవత్స:-సత్యవంతునితల్లి. ద్యుమత్సేనునిభార్య.

బాలాయని:- బాష్కలియొక్క శిష్యుఁడు. వాలఖిల్యాఖ్యసంహితను బఠించెను. భాగ.

బాలుఁడు:-(పాఠకము) పదునాల్గువత్సరములుదాటని పురుషుఁడు బాలుఁడనియును, అప్పు డత

కేమి చేసినను పాతకము పొందఁడనియును మాండవ్యుఁడు శాసించెను. అతని చిన్నతనములోఁ "దూనీగలను కొఱ్ఱునఁ బెట్టుటవలనఁ గల్గిన పాతకమువలన నాతనికిని గొఱఁత వేయఁ బడుటతటస్థించిన" దని యముఁడు చెప్పఁగా గోపమువచ్చి యిట్లు శాసించెను. భార.

బాష్కలుఁడు:- పైలుని శిష్యుఁడు. గురునిచే ఋగ్వేద ముపదేశింపఁబడి దానిని జతుర్విధములు గావించి తన శిష్యులగు బోధ్యుఁడు, యాజ్ఞవల్క్యుఁడు, పరాశరుఁడు, అగ్నిమిత్త్రుఁడు అనువారల కుపదేశించెను. ఇతని కుమారుఁడు బాష్కలి. భాగ.

బాష్కలుఁడు:- ప్రహ్లాదునిపుత్త్రుఁడు. మత్స్య.

బాష్కలుఁడు:-అనుహ్లాదుని పుత్త్రుఁడు. భాగ.

బాహుకుఁడు:- వృకునిపుత్త్రుఁడు. ఇతని రాజ్యమును శత్రువులు గైకొనుటచే భార్యలు, నితఁడును వనమున కేగిరి. భార్య గర్భవతియై యుండఁగా నితఁడు మరణించెను. ఆ కలిగిన పుత్త్రుఁడు సగరుఁడు. భాగ.

బాహుకుఁడు:- నలుఁడు వికృతరూపుఁడై ఋతుపర్ణునింట వంటలవాఁడుగనున్నపుడు బాహుకుఁడను పేరుపెట్టుకొనెను. ఒకసారి యితఁడు తన ప్రేయసినిగూర్చి విలపించుచుండెను. నలునికై వెదకవచ్చిన యొకఁడు వీని విలాపములు విని యేల నీవిట్లు పరితపించుచుంటివి? అనియడిగెను. మందప్రజ్ఞుఁడను భటుఁడు తన ప్రేయసినిగూర్చి యిట్లువిలపించెననియును, దాను వానిననుకరించుచుంటిననియుఁ జెప్పెను. బాహుకుఁడే నలుఁడగుననియాతఁడూహించెను. దమయంతికిద్వితీయస్వయంవరము చాటించినపుడు ఋతుపర్ణునితో రథచోదకుఁడుగ నితఁడేగెను. ఇతఁడు దమయంతి పుత్త్రుని ముద్దాడెను. మఱియు నితఁడే నలుఁడని యెఱుకపడియె. కర్కోటకుఁ డిచ్చిన వరమువలన మరల నితనికిఁబూర్వపురూపము వచ్చెను. భార.

బాహువు:-వృకుని కుమారుఁడు. సగరుని తండ్రి. అయోధ్యనేలు రాజు. హైహయు లితని రాజ్యమును స్వాధీనముచేసికొని యితనిని వెడలఁగొట్టిరి. బాహువు భార్యలతోఁగూడ నరణ్యములకరిగెను. అతనిభార్య యొకతె గర్భిణియై యుండఁగనే యరణ్యమం దితఁడు మరణించెను. తరువాత నితనిభార్య సగరునిఁ బ్రసవించెను. విష్ణు.

బాహ్లికుఁడు:-ప్రతీపుని కుమారుఁడు. శంతనుని సోదరుఁడు. వీనికుమారుఁడు సోమదత్తుఁడు. బాహ్లికుఁడు భారతయుద్ధమందు దుర్యోధనుని పక్షమునఁ బోరెను. సాత్యకి వీనికుమారుని బాణమువేసి మూర్ఛనొందింపఁగా నితఁడు సాత్యకితోఁ బోరెను. భీముఁడు సాత్యకికి సాయమై వీనిని జంపెను. భార.

బి

బిందుమతి:-శశిబిందుని కుమారిత; మాంధాత భార్య. పురుకుత్సుఁడు, అంబరీషుఁడు, ముచికుందుఁడు ఈమె కుమారులు. విష్ణు.

బిందుసరోవరము:-స్వాయంభువు, కుమార్తెకు వరుని వెదకుచుఁ దిరిగితిరిగి కర్దమునిఁ జూచి మిక్కిలి యానంద మొందగా, ఆనంద బాష్పములు రాలి సరోవరమయ్యెను. అదియే బిందుసరోవరము. భాగ.

బిందుసారుఁడు:- వితంతుని కుమారుఁడు. ఇతఁడును, నితని సోదరులు అతిసారాదులును అజితయను నొక్కకాంతను వివాహమైరి. భార.

బిడాలుఁడు:- మహిషాసురుని సేవలోనివాఁడు. దేవితో యుద్ధముచేసి మరణించెను. దే. భా.

బిల్వకుఁడు:-కద్రువ కుమారుఁడు. భార.

బిల్వపాండురము:-కద్రువకుమారుఁడు. భార.

బిల్హణుఁడు:-మదనాభిరాముఁడు అను రాజు నగరమందలి యొక కవి. ఇతఁడు మిక్కిలి రూపవంతుఁడు. రాజు తనకుమారిత యామినీపూర్ణతిలకకు విద్యచెప్పించుటకై యాతనినిరావించెను. ఇతనిరూపము జూచి యామె మోహించునేమో యని భయపడి యితఁడు గ్రుడ్డివాఁడని యామెకును, ఆమె కుష్ఠరోగి యని యాతనికిని జెప్పెను.

అట్లనుటచే నొకరి నొకరు చూచుకొనవలని రాజెఱుంగును. బిల్హణుఁడు తెఱచాటున నుండి యామెకుఁ జదువు చెప్పుచుండువాఁడు. ఇతఁ డొకనాఁటిరాత్రి చంద్రుని వర్ణించుచుండఁగ రాకుమారిత విని యంధుఁడగువాఁడు ఇంత నిపుణముగ నెట్లు వర్ణింపఁగల్గెనని వెఱగొంది యితనిని జూచెను. ఇతఁ డంధుఁడు కానట్లు తెలిసికొనెను. ఇతఁడు ఆమెను జూచి కుష్ఠరోగి కానట్లు తెలిసికొనెను. ఒకరి నొకరు మోహించిరి. ఆ రాత్రియే కాముక క్రీడలఁ దేలిరి. ఇది విని రాజు బిల్హణుని బంధించి వీనిశిరమును ఖండించుటకుఁ దలవరుల కాజ్ఞయిచ్చెను. కారాగారమునుండి యితఁడు రాజున కొక పద్యము వ్రాసి పంపెను. సతీసుతలు రాజును వేఁడిరి. తుదకు రాజు కరుణించి వీనిని విముక్తుని గావించి వీనికిఁ దన కూఁతునిచ్చి వివాహము చేసెను.

బు

బుద్ధి:- ధరణీదక్షులకుఁ బుట్టిన పుత్త్రిక. ధర్ముఁడను మనువును బెండ్లియాడెను. భార.

బుద్ధుఁడు:- విష్ణువుయొక్క యవతారము. భూలోకమున వేదవిహితములైనకర్మ లాచరింపఁబడుచు ధర్మము చక్కఁగ నడుచుచుండెను. ప్రజలు స్వర్గమునే పొందుచుండిరి. యమలోకమున కెవ్వరును పోకుండిరి. యమునకుఁబనిలేకుండెను. మఱియు నందఱును స్వర్గమునందే యుండుటచే దేవతలకును, మనుజులకును భేదము లేకుండెను. కావున యముఁడును, నితర దేవతలును విష్ణుమూర్తితో మొఱపెట్టుకొనిరి. విష్ణువు భూలోకమున నవతరించి ప్రజలకు వేదములందు గౌరవమును బోఁగొట్టి వారిని గర్మభ్రష్టులను జేసి స్వర్గానర్హులను గావించెదనని చెప్పెను.

అట్లొనరించుటకు విష్ణువు శాక్యవంశపు రాజైన శుద్ధోదనునకు మహామాయయందు జన్మించెను. ఇతఁడే బుద్ధుఁడు. ఇతఁడు బౌద్ధమతమును వ్యాపింపఁజేసెను. భాగ.

బుద్బుద:- ఒక అప్సరస. నంద, సమీచి మొదలగువా రీమె చెలికత్తెలు. వీరు భూలోకమును జూడవచ్చి తపస్సుచేసికొనుచున్న ఒక బ్రాహ్మణుని జూచి కొంటెతనమున వాని తపోభంగము చేయఁదలఁచి వానిని బరిహసించిరి. అతఁడు మీరు మొసళ్లు కండని వీరిని శపించెను. శాపవిమోచనమునకై బ్రాహ్మణుని బ్రార్థింపఁగ మిమ్ములను నీటినుండి తీసి గట్టునఁ బడవేసిరేని మీకు శాపవిమోచన మగుననియె. వీరు మొసళ్లై ఉండిన తీర్థములకు నారీతీర్థములని పేరువచ్చెను. తీర్థయాత్రకుఁ జనుచు నర్జునుఁ డీ తీర్థములందు స్నానముచేయుటకు దిగఁగ మొసలి వానికాలును బట్టుకొనియెను. అర్జునుఁడు దానిని విదలించి గట్టునఁ బాఱవైచెను. అంత దానికి శాపవిమోచనమై స్త్రీయయ్యె. అది యర్జునునకు నమస్కరించి చనియె. భార.

బుధుఁడు:- బృహస్పతి భార్యయైన తారయందు చంద్రునకుఁ బుట్టిన కుమారుఁడు. వీనినిగూర్చి గురు చంద్రు లిఱువురు తగవులాడుకొనిరి. బ్రహ్మ వచ్చి వీనిని జంద్రున కిప్పించెను. చంద్రుని భార్యయగు రోహిణి వీనిని బెంచెను.

మనువు కుమారుఁడు సుద్యుమ్నుఁడనువాఁడు కొలనులో స్నానముచేసి స్త్రీ యయ్యెను. (అపు డామె పేరు ఇల.) ఆమె చరితమునకును, రూపమునకును ఆమెకే యద్భుత మయ్యెను. అట్లు వెరఁగొందుచున్న యామెను బుధుఁడు చూచి కామించి నీ వొక్కర్తెవు ఇట కేల వచ్చితివి? పద. గృహమునకుఁ బదమనియెను. ఆమె బుధునివెంబడి చనియె. ఇతఁ డామెను భార్యగఁ గైకొనియె. ఆమెయందు బుధునకుఁ బురూరవుఁడు జన్మించెను. బుధుఁడు తపస్సుచేసి గ్రహపథమందు నిలిచెను. భా

బృ

బృందారకుఁడు:- గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు.

బృహంతుఁడు:-ఉలూక దేశాధిపతి. దిగ్విజయార్థమరిగిన యర్జును నెదిరించెను. కాని యతనిచే నోటువడియె. భార.

బృహక్షత్త్రుఁడు:-భుమన్యుని కుమారుఁడు. హస్తికుని పితామహుఁడు.

బృహతి:-విశ్వావసుని వీణె.

బృహతి:-చక్షుషునిభార్య. ఈమెయందు భద్రుని కుమారుఁడైన రిపుఁడు చాక్షుషునిఁ గనియెను. బ్రహ్మ.

బృహత్సేనుఁడు:-మద్రదేశపు రాజు. ఇతని కుమారిత లక్షణ. ఈమె శ్రీకృష్ణుని వివాహము కాఁగోరుట తెలిసికొని ఒక మత్స్యయంత్రము కల్పించి తానచ్చటనుంచిన ధనుస్సునెక్కుపెట్టి ఆ తిరుగుచుండు మత్స్యమును గొట్టినవానికిఁ గూఁతును నిత్తు ననెను. పల్వురు యత్నించిరి కాని తుదకు శ్రీకృష్ణుఁడే దానిని గొట్టెను. ఈమెను శ్రీకృష్ణునకిచ్చి వివాహము చేసెను. భాగ.

బృహదశ్వుఁడు:-ఒక ముని. అరణ్యవాసములో నున్న ధర్మజునకు నలోపాఖ్యానము చెప్పెను. భార.

బృహదశ్వుఁడు:-శ్రావస్తి కుమారుఁడు. ఇతఁడు రాజ్యమును గుమారుఁడైన కువలయాశ్వున కప్పగించి తపోవనమున కేగఁబోవుసమయమున ఉత్తంకుఁడను బ్రాహ్మణుఁడువచ్చి ధుంధువను రాక్షసుఁడు బాధించుచున్నాఁడని చెప్పి వానిని సంహరింపుమని కోరెను. ఇతఁడు తపస్సుచేయఁ బోవుటచే శస్త్రములు తాకకుండ నుండఁ గోరును. కావున రాక్షసవధకుఁ గుమారునే నియోగించి తాను వనమున కేగెను.

బృహదశ్వుఁడు:-సూర్యవంశపు రాజైన సహదేవుని కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు భానుమంతుఁడు. భాగ.

బృహద్ద్యుమ్నుఁడు:- ఒకరాజు. ఇతఁడు చేసిన సత్త్రియాగమునకు అర్వావసుని ఋత్విజునిఁగఁ బిలచెను. భార.

బృహద్బలుఁడు:- కోసలదేశాధిపతి. ఇతఁడు కౌరవపక్షమునఁ బోరెను. అభిమన్యుఁడు పద్మవ్యూహము చొచ్చినపు డతనితో యుద్ధముచేసి మరణించెను. భార.

బృహద్బలుఁడు:- విశ్వసాహ్యుని కుమారుఁడు. ఇతనిపుత్త్రుఁడు బృహద్రథుఁడు. భారతయుద్ధమున అభిమన్యునిచే హతుఁడయ్యెను. భాగ.

బృహద్రతుఁడు:- సింహళదేశపు రాజు. పద్మావతి తండ్రి. కుమారితను కల్కికిచ్చి వివాహము చేసెను. కల్కి.

బృహద్రథుఁడు:- ఉపరిచరవసువు కుమారుఁడు. భార.

బృహద్రథుఁడు:- రోమపాదుని వంశమువాఁడు. పృథులాక్షుని తనయుఁడు. ఇతనికి నొక కుశాగ్రుఁడను పుత్త్రుఁడు కలఁడు. భాగ.

బృహద్రథుఁడు:- కృతియొక్క కుమారుఁడైన వసువుయొక్క తనయుఁడు.

బృహద్రథుఁడు:- మగధరాజు. జరాసంధుని తండ్రి. ఇతఁడు కాశిరాజు కూఁతులను గవలవారలను బరిణయమయ్యెను. ఇతఁడు చిరకాలము సంతానములేక వ్రతములు సల్పుచుఁ, గానసముల సంచరించుచు నొకనాఁడు చూతవృక్షము క్రిందఁ దపస్సుచేసికొనుచుండు కౌశికుఁ డను మునిని జూచి వానికి మ్రొక్కి సంప్రీతుని గావించి తనకు సంతానము లేకపోవుటచేఁ గలుగు దుఃఖమును జెప్పుకొనెను. అపుడు చెట్టునుండి రాలిన మామిడిపండును ముని మంత్రించి "ఈ ఫలమువలన నీకొక పుత్త్రుఁడు పుట్టును" అని యిచ్చెను. బృహద్రథునకిరువురు భార్యలుండుటచే ఆ పండును మధ్యకుఁ జీల్చి యితఁడు యిద్దఱకుఁ జెఱియొక భాగము నిచ్చెను. వారిద్దఱును గర్భిణులైరి.

పదియవమాసంబున వారికి వికృతరూపులగు శిశువులు అర్ధశరీరమే కలిగినవారు పుట్టిరి. వారా వికృతరూపమునకు భయపడి తమదాదులచే ఆ శిశువులను గృహద్వార సమీపముననున్న చదుకమునఁ బారవేయించిరి. అది తనకు బలియని దానిని దినవచ్చు ననుకొని యటనుండు రాక్షసి జర యనునది యా రెండుశకలములను జేతఁబట్టుకొని నొక్కి యదుమగా నవి కలిసికొని శిశు వేర్పడెను. ఆమె మోయలేకపోయెను. శిశువు ఏడ్చుట కారంభింప గృహమందలి ముసలివనితలా యేడ్పువిని శిశువునుదెప్పించిరి. జరయును సుందరవనితారూపముతో వచ్చి బృహద్రథునకు సర్వము నెఱింగించెను. ఆయేర్పడినబాలుని జరాసంధుని భక్షింపక బృహద్రథునకిచ్చెను. ఇతఁడామె కాహార మొసంగి, యామెకుఁ గృతజ్ఞుఁడై యేటేట నామెపేర నుత్సవములు చేయించు వాఁడు. జరాసంధుఁడు పెద్దవాఁడైన పిదప వానికి రాజ్య మప్పగించి బృహద్రథుఁడు తపోవనమున కేగెను. భార.

బృహద్రథుఁడు:-ఒక రాజు. ఇతని కుమారుఁడు పురంజయుఁడు. భాగ.

బృహద్రథుఁడు:-అశోకునివంశమువాఁడైన శతధన్వుని కుమారుఁడు. పుంగుఁడనువాఁ డితనిని వధించి రాజ్యమును గైకొనెను. భాగ.

బృహద్రథుఁడు:-దూర్వునిపుత్త్రుఁడైన నిమి తనయుఁడు. ఇతని కుమారుఁడు సుదాసుఁడు. భాగ.

బృహన్నల:-విరాటనగరమున నర్జునుఁడు పెట్టుకొనిన పేరు. భార.

బృహస్పతి:-ఒక ఋషి. ముఖ్యప్రాణదృష్టిచేత ఉద్గీథ ప్రణవోపాసన చేసెను. కావున ముఖ్యప్రాణమును బృహస్పతిరూపముగఁ దలఁచుచున్నారు. ఛాన్దో. ఉ.

బృహస్పతి:-దేవతలకు గురువు. ఇతఁ డంగిరసుని పుత్త్రుఁడు. ఉతథ్యుఁడు, సంవర్తనుఁడు ఇతని సోదరులు. బృహస్పతిభార్య తార. ఇతనికి శంయుఁడు అను పుత్త్రుఁడు కలఁడు.

బృహస్పతియు, నింద్రుఁడును శివునిఁ జూచుటకై మునిరూపములు ధరించి కైలాసమునకు వెళ్ళుచుండిరి. శివుఁడు వీరినిఁ బరీక్షింపఁగోరి యుగ్రరూపముధరించి దిగంబరుఁడై వీరిమార్గమున నడ్డుగ నిలువఁబడెను. ఇంద్రుఁడు వానిని నెఱుంగలేక వానిపై వజ్రాయుధ మెత్తెను. ఆ దిగంబరుఁడు తన చూడ్కిచేతనే యింద్రుని భస్మముచేసెను. అపుడు బృహస్పతి యా దిగంబరుఁడు శివుఁడని గ్రహించెను; వానిని స్తుతించి యింద్రుని జీవితునిగఁ జేయుమని ప్రార్థించెను. అందువలన బృహస్పతికి జీవుఁడని పేరువచ్చెను. శివ.

బృహస్పతిభార్య తార చంద్రునిఁ గామించెను. చంద్రుఁ డామెను గొనిపోయెను. తారకు బుధుఁడు జన్మించెను. తారను గుఱించియును, నామెకుమారుని గుఱించియును బృహస్పతికిని, జంద్రునకును వివాదమయ్యెను. దేవగురుని వంచించుట కదేసమయమని రాక్షసులు చంద్రునిఁ జేరిరి. ఇంద్రుఁడు బృహస్పతిని జేరెను. రాక్షసులకును, దేవతలకును వీరికారణమున యుద్ధ మగుచుండెను. ఇంతలో అంగిరసుఁడు బ్రహ్మతో జెప్పగా బ్రహ్మవచ్చి తారనడిగి యా పిల్లవాఁడు చంద్రునకుఁ బుట్టినవాఁడగుటచేఁ దారను బృహస్పతికిని, బుధుని జంద్రునకు నిప్పించెను. భాగ.

బృహస్పతి తన సోదరుఁడైన యుతథ్యుని భార్యను మమతను గామించెను. ఆమె వలదనుచున్నను ఆమెపై బడియెను. అప్పటి కామె గర్భవతియై యుండెను. ఆమె గర్భమందున్న శిశువుకూడ బృహస్పతిని నిందించెను. బృహస్పతికిఁ గోపమువచ్చి యా శిశువును నీవు గ్రుడ్డివాఁడవై పుట్టుమని శపించెను. ఆ శిశువు బృహస్పతివీర్యమును బైటకుఁదన్నెను. అట్లు ఉద్వాజంబైనదానిని నీవు భరింపుము, నీవు భరింపుమని బృహస్పతియు, మమతయుఁ దగవులాడుకొనిరి. ఇద్దఱును దానిని విడిచిరి. ఆ వీర్యము పెరిగి శిశువయ్యెను. ఇతఁడే భరద్వాజుఁడు. భార.

రాక్షసగురుఁడైనశుక్రుఁ డొకతో జయంతితో భోగించుచుండెను. రాక్షసులనువంచించుట కదే సమయమని బృహస్పతి శుక్రునిరూపముధరించి రాక్షసులచెంతకుఁబోయి వారితో వాసముచేయు

చుండెను. రాక్షసులు వారిమర్మములు వీనితోఁ జెప్పుచుండిరి. ఇంతలో శుక్రుఁడు వచ్చెను. ఇరువురు నొక్కలాగున నుండుటచే రాక్షసులు నివ్వెరపాటు నొందిరి. "నేను శుక్రుఁడను. నేను నిజమైన శుక్రుఁడ" నని యిరువురును బోట్లాడిరి. తుదకు బృహస్పతి యంతర్ధానము నొంది వారిని విడిచివచ్చెను. మత్స్య.

బే

బేతాళుఁడు:–పిశాచములకు నాథుఁడు. శ్మశానములందుండును. ఇతఁడు పూర్వభవమునఁ బుష్పదంతుఁడనువాఁడు. శాపవశమున నిట్లయ్యెను. (చూడుము పుష్పదంతుఁడు)

బో

బోధుఁడు:–విశాలయను గ్రామమున నున్న యొక బ్రాహ్మణుఁడు. ఇతనిభార్య ప్రసవించిన శిశువును బిడాల మొకటియెత్తుకొనిపోయి వానిస్థానమున విక్రాంతునిశిశువును బెట్టెను. బోధుఁడు వానినే తన యౌరసపుత్త్రుఁడుగఁ దలఁచెను. వీనికిఁ జైత్త్రుఁడనినామకరణము చేసెను. మార్క.

బోధ్యుఁడు:– పైలుని శిష్యుఁడగు బాష్కలుని శిష్యుఁడు. ఋగ్వేదసంహిత నుపదేశమునొందెను భాగ.

బ్ర

బ్రహ్మ:–సృష్టిచేయు భగవదంశ బ్రహ్మ యనఁబడును. ఇంద్రత్వమువలెనే బ్రహ్మత్వము నొక పదవి. కావున బ్రహ్మలును మారుచుందురు. బ్రహ్మలు తొమ్మండ్రు; భృగువు, పులస్త్యుఁడు, పులహుఁడు, అంగిరసుఁడు, అత్రి, క్రతువు, దక్షుఁడు, వసిష్ఠుఁడు, మరీచి అనువారలు.

బ్రహ్మ నారాయణుని కుమారుఁడు; నారాయణుని నాభియందున్న కమలమునుండి జన్మించెను.

ప్రళయమందు భగవంతుఁ డద్భుతాకారమున నీరముపైశయనించియుండఁగా లీలచే నతని నాభినుండి కమలముపుట్టెను. బ్రహ్మ యీ విష్ణుమూర్తికడకు వచ్చి లోకములన్నియు నితనియందుండునని కొంత ముచ్చటించి విష్ణుశరీరమునఁ బ్రవేశించి లోకము లన్నియును జూచెను. ఇంతలో విష్ణుమూర్తి నవరంధ్రములు మూసికొనియె. అతని నాభియందున్న కమలమునుండి బ్రహ్మ బైటకు వచ్చెను. ఆకారణమున బ్రహ్మ విష్ణునిపుత్త్రుఁడయ్యె. పిమ్మట నితఁడు విష్ణువుతోఁ నీకంటెను, నాకంటెను నధికుఁడైనవాఁ డింకొకఁడు లేఁడని చెప్పుచుండెను. ఆ సమయమునకే యచ్చటికి శివుఁడు వచ్చెను. వీని మాహాత్మ్యము విష్ణువు బ్రహ్మకుఁ జెప్పెను. కూర్మ.

బ్రహ్మ శివునియొక్క దక్షిణాంగమువలన జన్మించెను. అప్పటికి విష్ణునాభినుండి కమలమొకటి యుద్భవించియుండెను. బ్రహ్మ లీలచే ఆ కమలమును బ్రవేశించెను. దానియాది చూడఁ గోరెను. కాని కనుగొనలేక బైటకువచ్చి విస్మితుఁడై "నేనిచ్చట కెట్లు వచ్చితిని? నాతండ్రి యెవరు?" అని వితర్కించుకొనియెను; అపుడు తపస్సుచేసి విష్ణువును దర్శించెను. శివ.

బ్రహ్మను మధుకైటభులు బాధించుచుండుటచే నితఁడు విష్ణుమూర్తిని బ్రార్థించెను. అతఁడు శయనించి లేవకుండుటచే యోగనిద్రను బ్రార్థించి యామెను విష్ణువునుండి తొలఁగిపొమ్మని కోరి విష్ణువు మేల్కొనినపిమ్మట నతనితోఁ దనబాధ తెల్పుకొనెను. విష్ణుమూర్తి మధుకైటభులను సంహరించెను. దే. భా.

బ్రహ్మకు మొదట నైదుశిరము లుండెడివి. వానిలో నొకటి గార్దభముఖాకారమున నుండెడిది. దీనినే శివుఁడు (భైరవుఁడు) ఖండించెను.

బ్రహ్మవలన సరస్వతి జన్మించెను. సృష్టి పెంపొందించుటకై బ్రహ్మ యామెనే పరిణయమయ్యెను. బ్రహ్మవాహనము హంస.

బ్రహ్మ విష్ణువుయొక్క నాభియందుఁ జేరి సృష్టిచేయుటకుఁ దామిస్రము, అంధతామిస్రము అను పంచమోహరూపాత్మకమైన యవిద్యను బుట్టించి యది తనకుఁ దమోమయదేహమయ్యె నని దానిని విడచెను. ఆ దేహము క్షుత్తునకును, దృష్ణకును నావాసమయ్యెను. అందుండికొందఱు జన్మించిరి. వారిలోఁ గొందఱు బ్రహ్మను భక్షింతుమనిరి. "నేను మీ జనకుఁడను. భక్షింపకుఁడు" అని బ్రహ్మ చెప్పెను. "మా మా, జక్షత రక్షత" అని వారు పలికిరి. వారి వాక్యములనుబట్టి యక్షులు, రాక్షసులు ఏర్పడిరి. తదనంతరము బ్రహ్మ సత్వగుణ ప్రధానుఁడై సుపర్వులను సృజియించి యా దేహము వీడిన నది దేవతలకు నాశ్రయ మయ్యెను.

బ్రహ్మ జఘనమునుండి యసురులు పుట్టి వానినిజేరి మిథునకర్మ మపేక్షించిరి. బ్రహ్మ నారాయణునికడకుఁ బోయి శరణువేఁడెను. నీ శరీరము విడచివేయుమని నారాయణుఁడు చెప్పెను. బ్రహ్మ దేహమును విడనాడెను. అందుండి సంధ్యారూపమున లలనారత్నము పుట్టెను. ఆమెను మోహించి యసురులందఱు నామెను బట్టుకొనిరి. ఆ సమయమున బ్రహ్మ సంతసించి తన కరమాఘ్రాణింపఁగ గంధర్వులు, అప్సరసలు పుట్టిరి. బ్రహ్మ.

తరువాత బ్రహ్మ ఉన్మాద జృంభికా నిద్రా రూపములను దాల్పఁగ బిశాచులు, గుహ్యులు, సిద్ధులు పుట్టిరి. అనంతరము బ్రహ్మ యదృశ్యదేహుఁ డగుచుఁ బితృ సాధ్య గణములను బుట్టించెను. తిరోధానశక్తివలన నరులను, కిన్నరులను బుట్టించెను. ఇంకను సృష్టి పెంపొందకుండుటచే మనువులను బుట్టించెను. భాగ.

బ్రహ్మకర్ణములనుండి పులస్త్యుఁడు, నాభినుండి పులహుఁడు, అంగుష్ఠములనుండి ధరణియును, దక్షుఁడును బుట్టిరి. బ్రహ్మకు మానస పుత్త్రులు, మునిశ్రేష్ఠులు పలువురు కలరు.

బ్రాహ్మణులు బ్రహ్మశిరము నుండియు, క్షత్రియులు బ్రహ్మ బాహువులనుండియు, వైశ్యులు బ్రహ్మజఘనమునుండియు, శూద్రులు బ్రహ్మపాదములనుండియుఁ బుట్టిరి. భాగ.

సృష్టిచేయఁదలఁచి బ్రహ్మ సనత్కుమారులను బుట్టించెను. వారిని సృష్టి పెంపొందించుఁడని కోరెను. కాని వీరు ప్రజాసృష్టిచేయమనిరి. బ్రహ్మకుఁ గోపమువచ్చినది. ఇఁక సృష్టి యెటుల వృద్ధిచేయుట యని యాలోచించుచుండఁగా విష్ణుమూర్తి నీకు రుద్రుఁడే కుమారుఁడుగఁ బుట్టునని చెప్పెను. బ్రహ్మ.

బ్రహ్మ కనుబొమలనుండి రుద్రుఁడుపుట్టెను. ఇతఁడు ఏకాదశరుద్రులను బుట్టించెను. వీరును సృష్టిచేయుట నిరాకరించిరి; అపుడు బ్రహ్మ నవబ్రహ్మలను సృజించెను. కూర్మ.

బ్రహ్మవలననే సృష్టియంతయును గలిగెను. అతని శరీరమునుండియే ప్రజాపతులు పుట్టిరి. బ్రహ్మతొడనుండి నారదుఁడు పుట్టెను.

బ్రహ్మ నారదునితో నీవు సృష్టిసేయుమని చెప్పెను. కాని నారదుఁడు "నేను సంసార బంధనములను దగుల్చుకొనువాఁడనుకాను. నేను సృష్టినిచేయ" నని తిరస్కరించెను. బ్రహ్మకుఁ గోపము వచ్చి నీవు కాముకుఁడవై శూద్రయోని యందుఁ బుట్టుమని నారదుని శపించెను. నారదునకుఁ గోపమువచ్చి నీకుఁ బూజాకవచములు లేకుండ బోవుగాక యని బ్రహ్మకుఁ బ్రతిశాప మిచ్చెను. బ్ర. వై.

బ్రహ్మయును, విష్ణుమూర్తియును నేనధికుఁడను, నే నధికుఁడను అని వాదులాడుకొనుచుండిరి. అంత వారియెదుట దివ్యప్రభలతోడ నొక లింగ మావిర్భవించెను. దాని యాద్యంతములు చూచుటకు వీరిరువురును బయలువెడలిరి. బ్రహ్మ హంసరూపమున నూర్ధ్వముగ వెళ్ళెను. విష్ణువు వరాహరూపమునఁ గ్రిందకు వెళ్ళెను. ఎవరు కడవఱకు వెళ్ళివచ్చెదరో వారికి రెండవవారు నమస్కరించి పూజించునట్లు పందెము వేసికొనిరి. ఎవరును తుదముట్ట వెళ్ళలేకపోయిరి. బ్రహ్మకుఁ బైనుండివచ్చు మొగలిపువ్వొకటి కనఁబడి యెంతకాలమునుండియో యీ స్తంభము మొదలుచేర యత్నించుచుంటి ననియును, చేరలేకుంటిననియును జెప్పెను. బ్రహ్మయు నింకఁ బోలేక తుదవఱకు వెళ్ళి వచ్చితినని యసత్య మాడఁగోరి మొగలిపువ్వును గూడఁ దనకు సాక్ష్యము పలుకుమనియె. విష్ణునితో

గడపటివఱకు వెళ్ళివచ్చితి నని చెప్పెను. విష్ణుమూర్తి బ్రహ్మకు నమస్కరించెను. అపుడు శివుఁడు ప్రత్యక్షమై బ్రహ్మ యసత్యము చెప్పె నని తెల్పి బ్రహ్మకుఁ బూజలేకుండ శపించెను. ఆ యసత్యమును చెప్పిన దోషముచే బ్రహ్మ పంచమముఖము గార్దభముఖమయ్యెను. బ్రహ్మ శివునిఁబ్రార్థించి కరుణింపుమని కోరెను. యజ్ఞము లందుఁదప్ప నితరచోటులఁ బూజయుండునట్లు శివుఁ డనుగ్రహించెను. శివ. బ్రహ్మ.

ఆ జ్యోతిర్లింగము బ్రహ్మతో "నీకు వర మిచ్చెదను గోరుకొను" మనియెను. బ్రహ్మయే శివునికంటె నధికుఁడుగ నుండగోరి శివుని దన కుమారునిగఁ బుట్టుమని కోరెను. శివునకుఁ గోపమువచ్చి బ్రహ్మకుఁ బూజలేకుండునట్లు శపించెను. క. సా.

త్రిపురసంహారమునకు రథము, అశ్వములు సిద్ధ మయ్యెను. కాని తగినసారథి కావలెనని శివుఁడు చెప్పెను. రథికునికంటెను బలముకలవాఁడు సారథి కావలయును. ఆ పనిని బూనుటకు దేవతలు బ్రహ్మను బ్రార్థించిరి. ఇతఁడంగీకరించి శివునకు సారథియయ్యెను. భార.

బ్రహ్మకుఁ దొలుత నైదుముఖములు కలవు. బ్రహ్మ గర్వించి తన పంచమముఖముచే శివుని దూఱుచు బలికెను. శివుఁడు కాలభైరవునిఁ బుట్టించి యా శిరమును ఖండించుమనియె. బ్రహ్మ భయపడియె. తన పంచమశిరమును శివునిదగ్గఱఁ బడునట్లును, ఆ కపాలముతో శివుఁడు భిక్షాటనము చేయునట్లును శివునిఁ గోరెను. స్కాంద. శివ.

పూర్వము దేవతలకును, దానవులకును యుద్ధము జరిగినపుడు బ్రహ్మకు గార్దభముఖాకారమున నున్న పంచమముఖముకూడఁ గలదు. ఆ ముఖముతో బ్రహ్మ "ఓ దానవులారా! మీరు భయపడకుడు. నేను దేవతలను బ్రమింగి వేసెదను" అనెను. ఆ మాటలు దేవతలు శివునితోడను, విష్ణుమూర్తితోడను జెప్పిరి. శివుఁడు బ్రహ్మయొక్క పంచమశిరమును దెగవేసెను. ఆ శిరము పాతాళలోకమునఁ బడెను. ఆ శిరము ఖండింపఁబడినప్రదేశమే బ్రహ్మతీర్థము. బ్రహ్మ.

బ్రహ్మ విష్ణు మహేశ్వరులలో నెవ్వరు ముక్తి నివ్వఁగలుగుదు? రని మునులలో వాదము వచ్చెను. అది నిర్ధారణచేయుటకై మునులు భృగువును బంపిరి. అతఁడు ముందుగ బ్రహ్మ యొద్దకు వచ్చెను. ఇతఁడు కూర్చుండమనకయే భృగువు గూరుచుండెను. బ్రహ్మ యితనిని గోపపడియెను.

నీవు రజోగుణప్రధానుఁడవు. ముక్తి నివ్వ లేవు. నీకు లోకమునందుఁ బూజలేకుండునుగాక యని భృగువు బ్రహ్మను శపించెను. భాగ.

బ్రహ్మ యజ్ఞముచేయఁదలఁచుకొని తనయట్టి ఋత్విజునికొఱకై వెదకెను. అట్టివాఁడుఎచ్చటను గనఁబడలేదు. అతఁడే గర్భముధరించి వేయేండ్లు మోసి, తుమ్మి యొక పుత్రుని వెలువరించెను. తుమ్ముచేఁ బుట్టినవాఁ డగుటవలన ఈ బుత్రునకు క్షుతుఁడను పేరువచ్చెను. ఇతఁడు పెరిగి ఋత్విజుఁడై క్రతువు సేయించుచుండఁగ దండ మదృశ్యమయ్యెను. ఎచ్చట వెదకినను గనఁబడలేదు. బ్రహ్మ విష్ణుమూర్తితోఁ జెప్పెను. వా రిద్దఱును శివునికడకు వెళ్ళిరి. శివుఁడు తన ప్రభావమున దండమునుజేసి యిచ్చెను. భార.

గంగ గోలోకమున ద్రవరూపముతో సంచరించుచుండగాఁ గృష్ణుఁడుచూచి మోహించెను. అది రాధ యెఱింగెను. కృష్ణునినిందించెను. గంగ భయపడి కృష్ణునిపాదములందు శరణుజొచ్చెను. లోకములో నెచ్చటను జలము లేకపోయెను. దేవతలు తహతహలాడిరి. బ్రహ్మ శ్రీకృష్ణుని కడకు వచ్చి గంగ కభయమిచ్చి తన కమండలమందు గంగనుంచుకొని స్వర్గమునకుఁ దీసికొని పోయెను. బ్ర. వై.

సత్యయుగంబున నొకనాఁడు బ్రహ్మ ఇంద్రలోకమునకు వెళ్ళెను. సకల దిక్పాలురును, రంభాది సకలయప్సరసలును నెదురుగ వచ్చిరి. వీరి యంగ సౌష్ఠవము చూడఁగ బ్రహ్మకుఁ జిత్తము కరగి వీర్యస్ఖలన మయ్యెను. బ్రహ్మ సిగ్గుపడి కాలితో దానిని గప్పివుచ్చెను. ఆ వీర్యమును, కొన్నియిసుకరేణువులును గలసి వాలఖిల్యులైరి. కొంత పంకమునఁబడి వాల్మీకి యయ్యెను. విచి.

రతినిఁ జూడఁగనే బ్రహ్మకు రేతఃపతన మయ్యెను. బ్రహ్మ సిగ్గుపడి బట్టకట్టుకొనెను. ఆబట్టను అగ్ని తగులఁబెట్టెను. అగ్నిపై నీరుచల్లిరి. ఆ నీరునుండి వరుణుఁడుపుట్టెను. బ్ర. వై.

పార్వతీ పరమేశ్వరుల వివాహము చూచుటకు బ్రహ్మ వెళ్ళెను. పీటలమీఁదఁ గూర్చుండిన వధూవరులను జూచెను. బ్రహ్మకుఁ జిత్తము చలించి రేతఃపతనమయ్యెను. ఇతఁడు సిగ్గుపడి తలవంచుకొనియె. ఆ రేతస్సు చూర్ణమయ్యెను. అందుండియే వాలఖిల్యులు పుట్టిరి. బ్ర. వై.

బ్రహ్మకల్పము:- సృష్టియందొక కాలము. మధుకైటభుల మెదడునుండి మేదిని యేర్పడి సృష్టిచేయఁబడిన కాలము. ఇతర కల్పములు పద్మకల్పము, వరాహకల్పము. బ్ర. వై.

బ్రహ్మతీర్థము:-బ్రహ్మయొక్క పంచమముఖము శివుఁడు ఖండించినపుడది పడినప్రదేశము. బ్రహ్మ.

బ్రహ్మదత్తుఁడు:- అనఘుఁడను రాజకుమారుఁడు. ఇతని కన్నిజంతువుల స్వరములును, వానిభావములును దెలియును. ఇతఁడును, భార్యయును వనములో విహరించుచుండఁగాఁ గొన్ని జంతువులరవములు వినఁబడియెను. వానిని విని బ్రహ్మదత్తుఁడు నవ్వెను. తననుజూచి నవ్వెనని యితనిభార్య కోపగించి మాట్లాడుట మానివేసెను. ఇతఁ డేడురాత్రులు విష్ణుమూర్తిని బ్రార్థించెను. కలలో విష్ణుమూర్తి "మఱునాఁడు ఉదయమున బ్రాహ్మణులను గలసికొను" మని చెప్పెను. మఱునాఁ డితని సభలోనికొక బ్రాహ్మణుఁడు వచ్చి, మొదట బ్రాహ్మణపుత్త్రులై, పిమ్మట సప్తవ్యాఘులై సప్తచక్రవాకములైనవార లిపు డే మయిరో యని శ్లోకములను జదివెను. బ్రహ్మదత్తుఁడు తన పూర్వజన్మములను స్మృతికిఁ దెచ్చుకొని యతఁడుకోరిన ధనమిచ్చి పంపెను.

ఇతఁడును, మఱియార్గురును కౌశికుఁడను బ్రాహ్మణుని పుత్త్రులు. వారు గర్గునిశిష్యులు. అరణ్యములో గురుధేనువును మేపుచుండి ఆకలిచే బాధపడుచుండుట వలనఁ బితరులకు శ్రాద్ధమను నెపముపెట్టి యా గోవును జంపి తాము భుజించిరి. మఱియు వ్యాఘ్రము గోవును జంపెనని గర్గునితోఁ జెప్పిరి. ఆ పాతకముచే వారు వ్యాధులై పుట్టిరి. పితరుల కర్పణ చేయుటచే పూర్వస్మృతి కలిగియుండిరి. వారే తరువాతి జన్మములలోఁ జక్రవాకములైరి. వారిలో నొకఁడు రాజు కాఁగోరెను. ఇతఁడే బ్రహ్మదత్తుఁడుగజన్మించెను. ఇరువురుమంత్రులు కాఁగోరిరి. ఆ ఇద్దఱును బ్రహ్మదత్తునికి మంత్రులైరి. నలువురు ఆ పట్టణమందే బ్రాహ్మణులుగఁ బుట్టి తపస్సున కేగఁగోరిరి. నాకు దిక్కెవ్వరని వారి తండ్రి వారి నడుగఁగ, వారు రాజుదగ్గఱకు వెళ్ళి పైనఁ జెప్పఁబడినవిధమున శ్లోకమును జదువుమనిరి. అట్లు జదువఁగా నొకరి నొకరు గుర్తించుకొనిరి. మత్స్య.

బ్రహ్మదత్తుఁడు:-ఒకరాజు. (చూడుము పూజని)

బ్రహ్మదత్తుఁడు:-శుకుని కుమార్తెయగు సుందరియందు నీపుఁడను రాజునకుఁ బుట్టిన కుమారుఁడు. ఇతఁడు జైగిషవ్యోపదేశంబున యోగతంత్రంబునంజేసి గోదేవియను భార్యవలన విష్వక్సేనుఁడను పుత్త్రునిం గనియెను. భాగ.

బ్రహ్మదత్తుఁడు:- ఒక రాజు. గౌతమముని ఇతని యింటికి వచ్చి యాహారమును బెట్టుమనియెను. ఆ ముని నూటయిఱువదియేండ్లితని యింట నుండెను. ఒకనాఁడు భోజనము చేయుచుండఁగ నన్నములో మాంసము వచ్చెను. మునికిఁ గోపమువచ్చి నీవు మాంసముపెట్టితివి గావున గ్రద్దవై పుట్టుమని ఇతనిని శపించెను. అన్నములో మాంసముండినట్లు నాకుఁ దెలియదు. తెలియక చేసినదానికి శపింతువా? యని వేఁడుకొనఁగ "శ్రీరాముడు నిన్నుఁ దాకును. అపుడు శాపవిమోచన మగును" అనియె. ఇతఁడే గ్రద్దయయ్యె. ఒక గుడ్లగూబతోఁ దగవు తెచ్చుకొని, తగవుతీర్చుమని శ్రీరామునికడకుఁ బోయెను. అపుడు శ్రీరాముఁడు దానిని తాకెను. అంత దానికి శాపవిమోచన మయ్యెను. ఉ. రా.

బ్రహ్మదత్తుఁడు:- సాల్వదేశముయొక్క రాజు. ఇతని కిరువురు భార్యలు. పుత్త్రులు లేకపోవుటచే నితఁడు శివుని బ్రార్థించెను. వైశ్యానువనుగ్రహమున హంసడింభకులను పుత్త్రులు గల్గిరి. పుత్త్రులు వీనిని రాజసూయయాగము చేయుమని ప్రోత్సహించిరి. దీనివలనఁ గృష్ణాదులతో యుద్ధము, బుత్త్రిమరణమునుమాత్రము సంభవించెను. ఉ. హ.

బ్రహ్మదత్తుఁడు:-చూలియను మునివలన సోమదయందుఁబుట్టిన కుమారుఁడు. ఇతఁడు కాంపిల్యదేశమునకు రాజయ్యె. కుశనాభుఁడు తననూర్గురు కుమార్తెల నితనికిచ్చి వివాహము చేసెను. ఇతఁడు వారిచేయి పట్టగనే వారి వికృతరూపములు బోయి మనోహరాకృతి వచ్చెను. రామా.

బ్రహ్మధన:-ఒక కపిసుత. శండుఁడను వాని కూఁతురు. బ్రహ్మ.

బ్రహ్మపుత్ర:-హరివర్షమందలి యొకనది. బ్రహ్మ శాంతనువు అను మునియొక్క భార్యయైన అమోఘను జూచి చిత్తవిభ్రమము పొందెను. శాంతనువు ఆశ్రమమున లేనిసమయమున బ్రహ్మ వెళ్ళి తనకోరిక తీర్పుమని యమోఘను గోరెను. అమోఘ తలుపు వేసికొని యట్లు బ్రహ్మ పలుకుచో వానిని శపింతు ననియెను. బ్రహ్మ తేజస్సు జారి క్రిందఁబడెను. అతఁడు తన హంసవాహనమెక్కి వెడలిపోయెను. శాంతనువు మరలివచ్చి తన యాశ్రమముముందఱ హంసపదములను, వీర్యమును జూచి యిదేమని భార్యనడిగెను. ఆమె జరిగినవృత్తాంత మెఱింగించెను. అపుడు శాంతను వాలోచించి లోకహితార్థమై చెయవలసిన కార్యమని యెంచి ఆ వీర్యము తానుగ్రహించి తన భార్యాగర్భమందుంచెను. దీనివలన నామెకుఁ బుట్టిన శిశువును శాంతనువు పర్వతములమధ్యఁ బెట్టెను. అది జలరూపమున వృద్ధిపొందెను. అదియే బ్రహ్మపుత్రనది యయ్యె. తల్లిని జంపిన పరశురాముఁ డిందు స్నానముచేసి తనపాతకమును బోఁగొట్టుకొనెను. కాలికా.

బ్రహ్మబలి:-దేవదర్శునివలన అథర్వవేదము నుపదేశము నొందెను. భాగ.

బ్రహ్మవిద్య:- దేవుఁడను మనువుకుమారుఁడైన ప్రజాపతిభార్య. ఈమెకు ధ్రువుఁడు పుట్టెను. భార.

బ్రహ్మశిరము:-ఒకయస్త్రము. ఆ యస్త్రప్రయోగము మొదట అగస్తియను ముని అగ్నివేశుఁడనువాని కెరింగించెను. దానినే ద్రోణుఁడు అర్జునునకుఁగూడ నేర్పెను.

అశ్వత్థామ ఈ యస్త్రమును బ్రయోగించి ఉత్తర గర్భములోనున్న శిశువునకుఁగూడఁ బ్రాణాపాయము కలుగఁజేసెను. భార.

బ్రహ్మహత్య:- (పాతకము) వృత్రుని జంపుటచే నింద్రునకు బ్రహ్మహత్య వచ్చెను. దానినిఁ బాపుమని యింద్రుఁడు బ్రహ్మను వేడెను. అతఁడు జలమును, వృక్షములను, అగ్నిని, స్త్రీలను బిలిచి "హత్యాపాతకమును నాలు భాగములుగఁ బంచితిని. మీరు తీసికొను"డని యెను. మాకుఁ బ్రాయశ్చిత్తమెట్లని ? యడిగినవి. "అగ్నిని బ్రజ్వలింపక హవిఃప్రదానము చేయువారికిని, పర్వకాలమున నోషధులుఛేదనము చేయువారికిని, జలములందు మూత్రపురీషములు విడుచువారికిని, రజస్వలయైనపుడు సంగమము చేయువారికిని ఈ పాతకమును మీరొసంగుడు" అని బ్రహ్మ చెప్పెను. భార.

భ

భంగాస్వనుఁడు:- ఒక రాజు. ఇతఁడు పుత్త్రులను గోరి యొక క్రతువుచేసెను. ఇతనికి నూర్గురు పుత్త్రులు పుట్టిరి; కాని యా యాగము ఇంద్రున కప్రియమైనదగుటచే నింద్రున కితనిపైఁ గోపము హెచ్చుగ నుండెను. భంగాస్వనుం డొకనాఁడు వేటకేఁగగా నింద్రుఁ డితనిని వంచనచేయుటకై దిగ్భ్రాంతిపుట్టించి దూరముగబోవునట్లు చేసెను. ఆ నడకచే నలసి రాజు మంచినీటికై చేరువనున్న కొలనులో దిగెను. అతఁడు పైకివచ్చుటతోడనే స్త్రీ యయ్యెను. ఆతనిరూపము చూచుకొనఁగ నతనికే విస్మయము కలిగెను. భంగాస్వనుఁ డాఁడురూపుతోఁ దననగరమునకుఁ బోవుటకు సిగ్గుపడెను. తన పరివారమును బంపివైచి తన పుత్త్రులకు బట్టము కట్టుఁడని చెప్పెను. ఈ స్త్రీ వనములోనే తాపసులచెంత సంచరించు చుండెను. ఒకఁ డీమెను జూచి మోహించి

యామెను గూడెను. వీనికిఁ బుత్త్రిలు కలిగిరి. ఈ పుత్త్రులనుగూడ భంగాస్వనుని పుత్త్రులతోఁ గలసి రాజ్యముచేయుఁడని పంపిరి. వీరును, వారును గలసి బలవంతులై రాజ్యములను గెలుచుచుండిరి. తా నపకారము చేయఁదలఁచు కొనఁగ నది యుపకారముగఁ బరిణమించె నని యింద్రునకుఁ గ్రోధము హెచ్చయ్యెను. అతఁడు బ్రాహ్మణరూపమున వచ్చి భంగాస్వనునకుఁ బుట్టిన కుమారులకును, నతఁడు స్త్రీయై యుండఁగా బుట్టిన కుమారులకును వైరమును బుట్టించెను. వారొకరి నొకరు కొట్టుకొని చచ్చిరి. ఈ వార్త కొననములో స్త్రీయై యున్న భంగాస్వనునకుఁ దెలిసి యచ్చటికివచ్చి యా బ్రాహ్మణుని పాదముల మీఁదఁబడి యేడ్చెను. ఆ బ్రాహ్మణుఁడు తా నింద్రుఁడనని తెల్పి వరము వేఁడుకొనుమనియెను. నా పుత్త్రులను బ్రతికింపుమని యామె కోరెను. ఏపుత్త్రులనని యింద్రుఁడడిగెను. నేను స్త్రీయై యుండఁగ బుట్టినపుత్త్రులే; స్త్రీకిఁ బురుషుని కంటెఁ దనపుత్త్రులపై నెక్కుడుప్రేమ గల్గును గదా! అని చెప్పెను. ఇంద్రుఁ డిఱువెగల పుత్త్రులను బ్రతికించి యామెకుఁ బురుషత్వముకూడ నిత్తుననియె. కాని సురతసుఖము పురుషునికంటె స్త్రీ కెక్కువగాన స్త్రీగానుండుటే యామె కోరెను. భార.

భగదత్తుఁడు:- నరకాసురుని కుమారుఁడు. ప్రాగ్జ్యోతిష మితనిరాజధాని. ఇతఁడు పాండురాజునందు భక్తి కలిగియుండువాఁడు. కాని జరాసంధునకు వెఱచి యాతనికిఁ దోడగుచుండును. అర్జునుఁడు దిగ్విజయార్థ మరిగినపు డతనితో నెనిమిదిదినములుపోరి, గెలువలేక భగదత్తుఁడు "నేనింద్రసఖుఁడను, నీ వింద్రపుత్త్రుఁడవు. మనకుఁ బోరాటమేల ?" అని వానితో సంధి గావించుకొని ధనములిచ్చి పంపెను.

భారతయుద్ధమున నితఁడు దుర్యోధనుని పక్షమునఁ బోరాడెను. నరకుఁడు తాను సంపాదించిన వైష్ణవాస్త్ర మీతనికిచ్చెను. దానినే భగదత్తుఁడు భారతయుద్ధమున నర్జునునిపైఁ బ్రయోగించెను. దాని నెవ్వరును సహింపలేరుకావునఆసమయమున నర్జునునకుఁ గృష్ణుఁడడ్డుపడియెను. భగదత్తుఁడు తన వాహనమైన సుప్రతీక మను నేనుఁగుతోఁ బాండవసైన్యముపైఁ బడెను. అపు డర్జునుఁ డితనిని, నీతని వాహనమునుగొట్టి సంహరించెను. భార.

భగీరథుఁడు:-దిలీపుని పుత్త్రుఁడు.

సగరునిపుత్త్రు లఱువదివేల మందియుఁ జనిపోవఁగా వారిభార్యలు దిగులొంది నారాయణు నారాధించిరి. నారాయణుఁడు ప్రత్యక్షమై "మీకుఁ బుత్త్రుఁడుకావలయునేని మీరు ఋతుమతులైనపుడు మీ శోణితమును నూతన భాండమునఁ బోయుఁ" డని చెప్పెను. వారట్లుచేసిరి. అందుండి పుత్త్రుఁ డేర్పడియెను. అతఁడే భగీరథుఁడు. ఆ శోణితము శుక్లసమన్వితము కాక పోవుటచే నీ బాలునకు బలములేక లేచుచుఁ బడుచు నుండెను. ఆ మార్గమున బోవుచుండిన అష్టావక్రుఁ డీ బాలుఁ డిట్లులేచుటను, బడుటను జూచి తన నాక్షేపణ చేయుచున్నాఁ డను కొనియెను. కాని యది నిశ్చయముగ నెఱుఁగఁడు కావున నీ బాలుఁడు నిజముగఁ దనను బరిహాసించెనేని భస్మమైపోవునట్లును, బరిహాసింపనియెడల సుందరాకారుఁ డగునట్లును బలికెను. అతని వాక్యమువలన భగీరథుఁడు సుందరాకారుఁడయ్యెను. వి. రా.

భగీరథుఁడు తన పూర్వులైన సగరపుత్త్రుల వృత్తాంతమును విని చింతనొంది యెట్లులైన వారి నుద్ధరించుకోరిక కలిగి బ్రహ్మ నారాధించెను. బ్రహ్మవలన ధర్మము తప్పకుండఁ దన యిచ్చవచ్చినరీతిని జీవించునట్లు వరము పుచ్చుకొనెను. పిమ్మట నతఁడు గంగను బ్రార్థించెను. ఆమెయుఁ బ్రత్యక్షమై వరము వేఁడుకొనుమనెను. "జననీ ! నీవు నాకోరిక సఫలముచేయఁదలఁచితివేని నాతోఁగూడభూతలమునకు ర"మ్మని యితఁడు కోరెను. ఆమె యంగీకరించి, స్వర్గమునుండి భూలోకమున పడునపు డామెభారము శివుఁ డొక్కఁడే భరింపఁగలవాఁడనియును, నితరులవలనఁ గాదనియును జెప్పెను. భగీరథుఁ డంతట నీశ్వరునిగూర్చి తపస్సుచేసి యాతని మెప్పువడసి గంగాపాతభార మాతఁడు వహించునట్లు వేఁడెను. శివుఁడు సమ్మతించెను. ఆకాశమునుండి గంగ శివుని శిరమునందుఁ బడెను. అచ్చటినుండి క్రిందకు జారెను. ఆమెను భగీరథుఁడు సగరపుత్త్రులు భస్మమై పడియుండిన చోటునకుఁ దీసికొనిపోవు

చుండెను. మార్గమందున్న జహ్నుని యాగస్థలమునుగూడ గంగ ముంచివైచెను. దాన జహ్నుఁడు గంగను పీల్చి పుక్కిటఁబట్టెను. భగీరథుఁడు జహ్నునివేఁడి యామెను విడిపించుకొని సగరపుత్త్రులు పడియున్న స్థలమునకుఁ దీసికొనివెళ్ళెను. ఈ పవిత్రజలము సోకగనే సగరపుత్త్రులు స్వర్గమునకేగిరి. సాగరములు జలముచే నిండెను. భగీరథుఁడు కృతార్థుఁడయ్యెను.

భగీరథునిపుత్త్రులు నాభాగుఁడు, శ్రుతుఁడు. భాగ. బ్రహ్మ.

భజమానుఁడు:- సాత్వతుని కుమారుఁడు. ఇతని కొక భార్యవలన నిమ్రోచి, కంకణుఁడు, వృష్ణి అను వారలును; వేఱొక భార్యవలన శతజిత్తు, సహస్రజిత్తు, అయుతజిత్తు అను వారలును జన్మించిరి. భాగ.

భజమానుఁడు:-అంధకుని కుమారుఁడు.

భజి:-సాత్వతుని పుత్త్రుఁడు.

భట్టి:- (విక్రమార్కుఁడు) చంద్రగుప్తుఁడను బ్రాహ్మణుఁడు ధనగుప్తుఁడను భాండాగారాధీశ్వరుని కుమార్తెయగు సుమతిని వివాహమయ్యెను. ఆమెయందుఁ బుట్టిన కుమారుఁడే భట్టి. చంద్రగుప్తున కితర భార్యలయందు బుట్టిన కుమారులు విక్రమార్కుఁడు, వరరుచి, భర్తృహరి. విక్ర. చ.

భద్ర:-శ్రుతకీర్తి కుమారిత. కృష్ణుని భార్య. భాగ.

భద్ర:- వ్యుషితాశ్వుఁడను రాజుయొక్క భార్య. ఈమెకు సంతానము కలుగకపూర్వమే వ్యుషితాశ్వుఁడు మరణించెను. పుత్త్రులైనను లేక తాను జీవింపఁజాలనని యీమె భర్తశవముపైఁ బడి యేడ్చెను. వ్యుషితాశ్వునిశరీరమునుండి యశరీరవాణి వెడలి "నీవు ఋతుమతివైన యెనిమిదవ నాఁడును, పదునాల్గవనాఁడును భర్తను దలఁచుకొనుము. సంతానము కలుగు" నని చెప్పెను. ఆమె కట్లే సంతానము కలిగెను. భార.

భద్రకుఁడు:-వసుమిత్రుఁడను రాజుయొక్క కుమారుఁడు. ఇతనిపుత్త్రుఁడు పుళిందుఁడు. భాగ.

భద్రశీలుఁడు:- గాలవుని కుమారుఁడు. ఇతఁడు పూర్వభవమున ధర్మశీలుఁడను రాజు. నార.

• భద్రాయువు:-దాశార్ణదేశమునకు రాజైన వజ్రబాహునకు సుమతి యను భార్యయును, నితర భార్యలును గలరు. సుమతి గర్భవతికాఁగా ఆమె సవతులు మందుపెట్టిరి. ఆమె కుమారునిఁ బ్రసవించెను గాని తల్లియును, శిశువును రోగార్తులై యెల్లప్పుడును నేడ్చుచుండిరి. రాజు చిరాకుపడి వీరిని అడవులలో దిగవిడువుడని పంపివేసెను. సుమతియును, శిశువును వైశ్యపురమును జేరి యావైశ్యునిభార్యచే నాదరింపఁబడి వారిగృహమున నుండిరి. అట ఆ కుమారుఁడు మరణించెను. సుమతి విలపించుచుండఁగ నామె నోదార్చుటకు ఋషభయోగివచ్చి తత్త్వబోధను జేసెను గాని యాదుఃఖమును సహింపలేక యామెయును మృతి నొందద ననఁగ నతఁడు జాలిపడి మరణించిన శిశువుపై భస్మ మలదెను. అంత శిశువు నిద్రనుండి మేల్కొనినట్లు లేచెను. వీనిని ఆశీర్వదించి యాఋషి వీనికి భద్రాయువు అని పేరుపెట్టెను. ఇతఁడు వైశ్యునికుమారునితోఁ బెరుగుచుండెను. మఱల ఋషభయోగివచ్చి శివకవచ ముపదేశించి చంద్రహాస మను ఖడ్గమును, శంఖము నిచ్చెను. పిమ్మటఁ గొంతకాలమునకు మగధరాజు వజ్రబాహు నోడించి దశార్ణదేశ మాక్రమించెనని భద్రాయువువిని తన మిత్త్రుఁడగువైశ్యకుమారుని సారథినిగఁ జేసికొని చంద్రహాస శంఖములు గైకొని దశార్ణదేశమునకుఁబోయి మగధసేనలతో యుద్ధముచేసివారినోడించి వజ్రబాహునకు మఱల రాజ్యమిచ్చి తిరిగి వైశ్యపురమునకు వచ్చెను.

ఋషభయోగి చంద్రాంగదునకు దర్శనమిచ్చి భద్రాయువు వృత్తాంతముచెప్పి యాతని కొమార్తెను కీర్తిమాలిని వీనికిచ్చి వివాహము చేయుమనెను. అతఁడు భద్రాయువునకు శుభలేఖ పంపి తన కుమారికనిచ్చి వివాహము చేసెను. ఆ వివాహమునకుఁ బరరాజులనుగూడఁ బిలచెను. వజ్రబాహుఁడును వచ్చియీబాలకునిఁజూచియితఁడే తనకుపకారముచేసి రాజ్యమును మఱలనిచ్చినవాఁడని చెప్పి యితఁ డెవరిపుత్త్రుఁ? డని యడిగెను. చంద్రాంగదుఁడు ఇతఁడు వజ్రబాహుని కుమారుఁడే యగుట మొదలగు వృత్తాంతము తెలిపి సుమతిని రావించెను. వజ్రబాహుఁడు తానుచేసిన యపరాధమునకు విచారించి వీరిని దననగరమునకుఁ

గొనిపోయి భద్రాయువునకు రాజ్య మప్పగించెను.

ఒకనాఁడు భద్రాయువును, భార్యయును గానవములో విహరించి యొక చెట్టునీడను విశ్రమించి యుండఁగా నొక బ్రాహ్మణుఁడు "రక్షింపుము, రక్షింపుము" అనుచు వచ్చెను. ఇతఁడు లేచులోపలనే పులిచే నీడ్వఁబడుచున్న వనిత యఱచుచుండెను. భద్రాయు వెన్ని బాణములు వేసినను ఆ పులి యామెను వదలక లాగుకొనిపోయెను. ఆ బ్రాహ్మణుఁడు రాజును జూచి "స్త్రీని గాపాడలేకపోయితివి. నీ చంద్ర హాస మేది? శంఖ మేమయ్యెను? రాజు చేతఁగానివాఁడగునా?" అని నీతులు చెప్పి నిందింప వానిని క్షమింపుమని వేడెను. రాజు "ఈమె నా భార్య. ఇది నా దేహము, అది నా దేశము. వీనిలో నేది కావలెనో యది నీవు కైకొను" మని చెప్పి వేడుకొనెను. ఇతఁడు మిక్కిలి ధైర్యశాలి. వీని ధైర్యమునకు బ్రాహ్మణుఁడు సంతసించి "ఇది తాను కల్పించిన మాయయే" నని చెప్పి వాని భార్యను జూపి తాను వరములిచ్చి చనెను.

భద్రావతి:-యావనాశ్వుఁ డనురాజు పాలించిన దేశము. జై. భా.

భద్రాశ్వుఁడు:-అగ్నీధ్రుని కుమారుఁడు. ఇతఁడు పాలించిన దేశమున కితని పేరును బట్టియే భద్రాశ్వవర్షమని పేరువచ్చెను. విష్ణు.

భద్రుఁడు:- అయోధ్య యందుఁ గాపురమున్న వాఁడు. నగరమునఁగల వృత్తాంతము నితఁడు శ్రీరామునకుఁ దెల్పుచుండును. "తనను గూర్చి ప్రజ లేమనుకొనుచున్నా"రని రాముఁ డొకనాఁ డితని నడిగెను. భద్రుఁడు తావినిన వృత్తాంతము చెప్పక దాఁచఁగోరెను గాని శ్రీరాముఁడు తఱచి తఱచి యడుగుటచే దాఁచక "సీతను మఱలఁ దెచ్చి యింటఁ బెట్టుకొనుటచేఁ బ్రజ లాక్షేపణ చేయుచున్నా"రని చెప్పెను. భద్రుని యీ మాటలే శ్రీరాముఁడు సీతను అరణ్యమునకుఁ బంపుటకుఁ గారణ మయ్యెను. ఉ. రా.

భద్రుఁడు:- ఒక నటుఁడు. ఇతఁడు తన నాట్యముచే ఋషులను మెప్పించి వారివలనఁ గామరూపమును వరముగాఁ గైకొనియె. హరి.

భద్రుఁడు:- ఇతఁడును, అనుభద్రుఁ డనువాఁడును రుద్రుని యనుచరులు. వీ రుగ్రకర్ములు. దితి సంధ్యాకాలమునఁ గశ్యపునిఁ గూడుటచే వీరామెగర్భమున దైత్యులుగ జన్మించిరి. భాగ.

భనందనుఁడు:-కన్యాకుబ్జము నేలిన రాజు. ఇతని కుమారితయైన కళావతిని వృషభానున కిచ్చి వివాహముచేసెను. బ్ర. వై.

భనందుఁడు:- నాభాగుని కుమారుఁడు. ఇతని తల్లి యొక వైశ్యునిపుత్త్రికయగు సుప్రభ. నాభాగుఁడు వైశ్యకాంతను వివాహమయ్యెను. కావున వైశ్యవృత్తులనే యవలంబించియుండెను. భనందుఁడు తల్లికడకేగి నేనేమిపనిచేయువాఁడ నని యడిగెను. గోవును బాలించుచుండుమని తల్లి చెప్పెను. అంత భనందుఁడు, గోరూపధారిణియైనభూమిని శత్రురాజులు పాలించుచున్నారు. దానిని సంపాదింపవలయునని హిమాలయపర్వతమునకేగి తపస్సుచేసి నీపుఁడను రాజర్షివలన శస్త్రవిద్య నేర్చుకొనెను. పిమ్మటఁ దన పినతండ్రి కుమారుఁడగు వసురాతునికడకు వచ్చి యర్ధరాజ్య మిమ్మని యడిగెను. నాభాగుఁడు కోమటివనితను బెండ్లియాడి కోమటియయ్యెను గాన వానిపుత్త్రుఁడును గోమటియే యగునని యును, రాజ్యమున కర్హుఁడుకాఁడనియుఁ జెప్పి వసురాతుఁడు రాజ్యభాగ మొసంగక నిరాకరించెను. వసురాతునకును, భనందునకును యుద్ధముజరిగెను. భనందుఁడు గెలిచి తండ్రి కడకువచ్చి యారాజ్యము పాలింపుమని కోరెను. నాభాగుఁడు తాను రాజ్యార్హుఁడను కానని చెప్పి కుమారునే పాలింపుమనియెను. భనందుఁడే రాజయ్యెను. మార్క.

భయ:- కాలుని సోదరి. హేతి భార్య. ఈమె కుమారుఁడు విద్యుత్కేశుఁడు. ఉ. రా.

భయుఁడు:- ఒక యవనేశ్వరుఁడు. ఇతనియొద్దకు నారదునిచేఁ బంపఁబడిన భర్త్రాన్వేషిణియగు

కాలపుత్రివచ్చి నన్ను వరింపుమని వేఁడె. నీ వశుభవు. నిన్నెవనును వరింపను. నీవు నాకు సోదరివంటిదానవు. నాకోరమ్ము. నీకు భర్తనువెదకెదనని యామెను; దన సోదరుఁడగు ప్రజ్వారుని వెంటఁబెట్టుకొని భూమియంతయుఁ దిరిగి తిరిగి పురంజనునినగరమునకు వచ్చెను. అచ్చటఁ గాలపుత్రికిఁ బురంజనుఁడు వశమయ్యెను. భాగ.

భరతుఁడు:- దుష్యంతునకు శకుంతలయందుఁ బుట్టిన కుమారుఁడు. శకుంతల కణ్వాశ్రమమున నున్నపుడే వీనిని గనియె. ఇతఁడు చిన్నతనమందే వనమందలి సర్వమృగములను బట్టి కట్టుచుండుటచే సర్వదమనుఁడనికూడ నితనికిఁ బేరిడిరి. భరతుఁడు మునులవలన సర్వశాస్త్రములు నేర్చుకొనెను. కణ్వుఁడు భరతుని, శకుంతలను దుష్యంతునికడకుఁ బంపినపుడు, మొదట నతఁడు భరతుఁడు తనపుత్త్రుఁడుకాఁడని నిరాకరించెను. కాని యాకాశవాణి 'నీపుత్త్రుఁడే వీనిని భరింపు' మని పలికెను. ఆకాశవాణి భరింపుమని పలుకుటచేత అతఁడు భరతుఁడయ్యెను. భాగ.

పిమ్మట నీతనిని స్వీకరించెను. దుష్యంతుని యనంతర మీతఁడే పట్టభద్రుఁ డయ్యెను. ఇతఁడశేష భూ భువన భారధురంధరుఁడై, రాజవంశములకుఁ గర్తయయ్యెను. ఇతనిభార్య సునంద. ఆమెయం దీతనికి భుమన్యుఁడను కుమారుఁడు కలిగెను. భార.

భరతుఁడు:-భరతునకుముగ్గురుభార్యలుకలరు. వారు ముగ్గురకును సంతానము కలిగెను; కాని యొక్కపుత్త్రుఁడును దండ్రితో సమానమైనవాఁడు కాఁడని తల్లులు శిశువులను జంపివేసిరి. భరతునకుఁ బుత్త్రులు లేకపోయిరి. అతఁడు యాగము చేయుచుండఁగా మరుత్తులు భరద్వాజునిఁదెచ్చి వీనిని బెంచుకొనుమనియిచ్చిరి. భరతుఁడు వానిని బెంచుకొనియెను.

భరతుఁడు వానిని వేదశాస్త్రములను జదువనీయక గృహకర్మలందుఁ బెట్టుచుండువాఁడు. ఇతఁ డా పనులను జేయుచు జడునిమాడ్కి సంచరించుచుండును. జడభరతుడని పేరొందెను. భాగ.

భరతునకు ముగ్గురుకుమార్తెలును, దౌష్మంత్రుడు పుత్త్రులును గలిగిరి. వీరు తల్లి శాపమువలన మృతులైరి. పిమ్మట భరద్వాజుఁడు చేయించిన యాగము వలన భరతునకు సుహోత్రుఁడు, గయుఁడు, గర్గుఁడు, కపిలుఁడు అను నలువురు పుత్త్రులు గలిగిరి. వి. రా.

భరతుఁడు:- సూర్యవంశపు రాజైన ధ్రువసంధి కుమారుఁడు. ఇతనిపుత్త్రుఁడు అసితుఁడు. రామా.

భరతుఁడు:- ఋషభుని కుమారుఁడు. ఇతని తల్లి జయంతి. కుశావర్తుఁడు, ఇలావర్తుఁడు, బ్రహ్మవర్తుఁడు, బ్రహ్మావర్తుఁడు, ఆర్యావర్తుఁడు, మలయకేతువు, భద్రసేనుఁడు, విదర్భుఁడు భరతుని సోదరులు.

భరతుఁడు పంచజనిని వివాహమయ్యెను. ఈ దంపతులకు సుమతి, రాష్ట్రభృత్తు, సుదర్శనుఁడు, ఆచరణుఁడు, ధూమ్రకేతువు అను పుత్త్రులు గల్గిరి. ఋషభునియనంతరము భరతుఁడే రాజై అజనాభము అను దేశమును బాలించెను. ఇతనిని బట్టియే ఆ దేశమునకు భరతవర్షమను పేరువచ్చినది. ఇతనిసోదరులు భరతవర్షములోని భాగములను బాలించిరి. వారి పేరులనుబట్టి ఆ దేశములకుఁ బేరులు వచ్చెను.

భరతుఁడు పెక్కేండ్లు పరిపాలించి తన రాజ్యము కుమారులకిచ్చి తపోవనమున కేగెను. ఒకనాఁ డితఁడు స్నానము చేయుచుండఁగ గర్భిణియగు లేడిగూడ నా నదికడకే వచ్చి నీరు త్రావుచుండెను. అపుడు కొరుమబ్బు క్రమ్మి భీకరముగ నురిమెను. దానికి లేడి భయపడి, భయముచే అచ్చటనే ప్రసవమై ప్రాణములు విడచెను. భరతుఁడది చూచి లేడిపిల్లపై జాలిగొని దానిని దన యాశ్రమమునకుఁ గొనిపోయి పెంచుచుండెను. పుత్త్రులను, సంసారమును వీడి వచ్చినను నితనికి శాబకముతో ననుబంధము పెరిగియుండెను. తుదకితఁడు మరణించునపుడు ఆ లేడిపిల్లనే తలఁచుకొని ప్రాణములు విడచెను. ఆ కారణమున నితఁడు తరువాత జన్మమున లేడియై జన్మించెను. ఆ రూపమున నుండినను నితనికిఁ బూర్వజ్ఞానము కలదు.

దాని తరువాత జన్మమున భరతుఁడు అంగిరసుఁడు అను బ్రాహ్మణుని పుత్త్రుఁడుగా జన్మిం

చెను. ఇతనిసవతితమ్ములు వానిని సరిగఁజూడక యాక్షేపించుచుండిరి. వీఁడున్మాదునివలె సంచరించువాఁడు. ఆ దేశమునకురాజైన వృషలుఁడనువాఁడు గాళికి నరబలి యివ్వఁదలఁచుకొనఁగ వాని భృత్యులొకమనుజుని బట్టి తెచ్చిరి. కాని వాఁడు పాఱిపోయెను. వానికై వెదకుచు రాజభటులీతనిని బట్టుకొని వచ్చిరి. వృషలుఁ డితనిని గాళీగుడికిఁ గొంపోయెను. కాళి ప్రత్యక్షమై రాజును, వాని భృత్యులను సంహరించి యీ బ్రాహ్మణుని విడచెను.

ఇతఁడు దేశసంచారము చేయుచుండెను. సింధుదేశపురాజైన రహూగణుఁడు కపిలుని యొద్ద వేదాంత మభ్యసించుటకు సవారియెక్కిపోవుచుండెను. బోయవాండ్రు అలసటచెంది మార్గమున నీ బ్రాహ్మణుఁడు కనఁబడఁగా సవారికొమ్ము వీని భుజముపైనఁ బెట్టిరి. ఇతఁడు లక్ష్యముచేయక సవారిమోయుచు మెట్టల వెంటను బోవుచుండెను. అందువలన రాజు శరీరమున కాయాసముగల్గి యా బ్రాహ్మణునిఁ గఠినముగ దూషించెను. ఆ బ్రాహ్మణుఁడు "ఓరాజా! దూషణము, భూషణము, కోపము అనునవి ఈ శరీరమునకుఁగాని, ఆత్మకుఁ గాదు" అని వేదాంత సారమును బోధించెను. రాజు సవారీ దిగి 'నీవే వేదాంతి' వని వీనికి నమస్కరించెను. భరతుఁడు ఆ మూడుజన్మములపిదపనే ముక్తిఁబొందెను.

భరతుని పుత్త్రుఁడు సుమతి. ఇతఁడు పాషండమతబోధితుండయ్యెను. భాగ.

రతుఁడు:—కైకయందు దశరథునకు జన్మించిన పుత్త్రుఁడు. పుత్త్రులకొఱకు దశరథుఁడు యజ్ఞము చేసెను. యజ్ఞపురుషుఁడు పాయసము తెచ్చి దశరథునకిచ్చి యతని భార్యలకుఁ బెట్టుమనియె. అతఁడు కౌసల్యకును, కైకకును బెట్టెను. కైక సగము భాగము సుమిత్త్రకుఁ బెట్టెను. కైకకు భరతుఁడును, సుమిత్త్రకు శత్రుఘ్నుఁడును ఆ పాయస ప్రభావము వలనఁ బుట్టిరి. కావుననే వీరిద్దఱును సదా కలసి మెలసి యుండువారు. జనకుఁడు సీతను రామునికిచ్చి వివాహము చేసినపుడే యతని సోదరుఁడు తన కుమార్తెయైన మాండవిని భరతునకిచ్చి వివాహము చేసెను. వివాహమైన పిమ్మట నితఁడును, శత్రుఘ్నుఁడును నతని మేనమామగృహమున కేగిరి. రాముఁడు పెద్ద కుమారుఁ డగుటచే నతనికి యౌవరాజ్య పట్టాభిషేకము చేయ దశరథుఁడు నిశ్చయించెను. కాని భరతునితల్లి కైక రాముని నరణ్యములకుఁ బంపి, రాజ్యము భరతున కిమ్మని కోరెను. దశరథుఁ డాడితప్పలేఁడుగావున రాముని నరణ్యమునకుఁ బంపెను. కుమారునిఁ బాసిన దుఃఖముచే నతఁడు ప్రాణములు విడిచెను. అపుడు భరత శత్రుఘ్నులకు వర్తమాన మంపిరి. భరతుఁడు తాను రాజగుదునని సంతసమొందలేదు. రాముఁ డరణ్యమునకుఁ బోయినందుకు మిక్కిలి విలపించెను. తన తల్లిని నిందించెను. తండ్రి మరణమునకై విచారించి వాని కగ్నిసంస్కారమును గావించెను. తాను రాజ్యము నొల్లక రాముని వెదకుచుఁ జనియెను.

భరతుఁడు గంగానదియొద్దకు వచ్చెను. వీనిని గుహుఁడు చూచి రామునితో యుద్ధమునకుఁ బోవుచున్నాఁడనుకొని గంగదాటి వెళ్ళనీయ ననియెను. రామునిదర్శించి తిరిగి వానినిదీసికొని వచ్చుటకై వెళ్ళుచున్నానని భరతుఁడు చెప్పి గంగ దాటివచ్చి చిత్రకూటముకడ రామునిఁ జూచెను. అతని నాలింగనము చేసికొనెను. రామునిపాదములపైఁ బడెను. మరల వచ్చి రాజ్యమును గైకొనుమనియెను. కాని రాముఁడు తన తండ్రిమాట నెఱవేర్పవలయునని చెప్పెను. భరతునే రాజ్యమును బరిపాలింపుమనియెను. భరతుఁడు మరలివచ్చి శ్రీరాముని పాదుకలను దెచ్చి వానికే పట్టముగట్టి అయోధ్యయందుండలేక నందిగ్రామమున కేగియుండెను.

శ్రీరాముఁడు రావణునితో యుద్ధముచేసి వచ్చుచు నతనికిఁ దెలియఁజేసెను. ఇతఁ డెదురేగి గౌరవించి యతనితోఁ గలసి యయోధ్యకు వచ్చెను. అచ్చట శ్రీరామునికిఁ బట్టముగట్టిరి. భరతుఁడు రాజ్యభారమంతయును రామున కప్పగించి యతని యాజ్ఞానువర్తియై యుండెను.

దక్షుఁడు, పుష్కలుఁడు ఇతనికుమారులు.

ఒకనాఁడు రాముఁడు నిండుకొలువుండఁగా గార్గ్యుఁడు వచ్చి గంధర్వశైలూష పుత్త్రులు బాధించుచున్నారనియును, వారిని బరిమార్చుట

కెవ్వరికైనఁ బంపుమని కేకయరాజు కోరు చున్నాఁడనియుఁ దెల్పెను. రాముడుఁ భరతుని, నతని పుత్త్రులను వెళ్ళుడనియె. భరతుఁడు తన పుత్త్రులగు దక్ష పుష్కరులను దీసికొనివెళ్ళి శత్రుసంహారమును గావించి పుత్త్రులకుఁ బట్టము గట్టి వచ్చెను. కాని చిరకాలము సుఖమనుభ వింపలేదు. లక్ష్మణుఁడు చనినపిమ్మట ఇతఁడును రామునితో నరిగి సరయూనదిలోఁ గ్రుంకి పరమ పదము నొందెను. రామా.

భరతుఁడు:—సత్యాశంయుల కుమారుఁడు. భరద్వాజుని సోదరుఁడు. ఇతనిపుత్త్రుడు భారతుఁడు; కుమారిత భారతి. భార.

భరతుఁడు:—ఒక ముని. నాట్యశాస్త్రకర్త; సంగీత శాస్త్రమునుకూడ రచియించెను.

భరద్వాజవిందు:— అరణ్యమునకువెళ్ళిన శ్రీరాముని బిలుచుకొనివచ్చుటకు భరతుఁడు సేనా సమేతుఁడైవెడలి భరద్వాజుని యాశ్రమమును జేరెను. ఆ ముని విశ్వకర్మను, సర్వదేవతలను గూర్చి ప్రార్థించెను. రాజునకు, సేనలకు విశ్వకర్మచే వసతులేర్పడెను. దేవతలు సర్వపదార్థము లిచ్చిరి. పంచభక్ష్య పరమాన్నములు, అన్ని రకముల వస్తువులు, పిండివంటలు మేటులకొలది వచ్చెను. దేవతాస్త్రీలే వడ్డించిరి. అప్సరసలు నాట్యమును, గానమును జేసిరి. వచ్చినవార లందఱును కడుపునిండ భుజించిరి. అన్నిరకముల పదార్థములును అంతసమృద్ధిగ నింకెచ్చటను గలుగలేదు. భార.

భరద్వాజుఁడు:—బృహస్పతిపుత్త్రుఁడు. బృహస్పతి తన సోదరుని భార్యయగు మమత గర్భిణిగ నుండఁగా నామెను గామించెను. వలదని యామె చెప్పినను, ఆమె గర్భమందున్నపిండము చెప్పినను వినక బృహస్పతి యామెపైఁ బడి యాతని యీప్సితము నెఱవేర్చుకొనెను. మమత గర్భమందున్న పిండ మచ్చట నిఱువురు శిశువు లుండుటకుఁ జోటులేదని బృహస్పతివీర్యమును వెడలఁదన్నెను. దీనివలనఁ బుత్త్రుడేర్పడెను. "ద్వాజుఁడైన వీనిని నీవు భరింపుము, నీవు భరింపు" మని వదిన మఱదులు పలికిన నితఁడు భరద్వాజుఁ డయ్యెను. ఇరువురును వీనిని విడిచి చనిరి. మరుత్తులు వీనినిఁ బెంచిరి. ఇతని పుత్త్రుఁడు మన్యువు. భాగ.

దుష్యంతుని పుత్త్రుఁడైన భరతుఁడు సంతానముకొఱకు యాగముచేయుచుండఁగ మరుత్తులు భరద్వాజుని గొనిపోయి వీనిని బెంచుకొమ్మని భరతున కిచ్చిరి. భరతుఁ డితనిని బెంచుకొనెను. (వితథం) విరథంబైన భరతవంశమున కితఁడు వంశకర్తయయ్యెను గావున నితనికి విరథుఁడను పేరుకూడ వచ్చెను. భార.

భరద్వాజుఁడే భరతునిచేఁ బుత్రేష్టి చేయించెను.

భరద్వాజుఁడు గంగయొడ్డునఁ గూర్చుండి తపస్సుచేసికొనువాఁడు. ఒకనాఁడితఁ డభిషేచనార్థము నదిలోనికి దిగి యందు జలక్రీడలాడుచుండిన ఘృతాచిని జూచెను. అంత నాతనికి రేతఃపతనమయ్యెను. దానిని దెచ్చి భరద్వాజుఁ డొక ద్రోణమందుఁ బెట్టి కాపాడెను. అందుండియే ద్రోణుఁడను కుమారుఁడు పుట్టెను. భార.

భరద్వాజుఁడు సప్తఋషులలో నొకఁడు. వనవాసము చేయుచున్న రాముఁ డితని యాశ్రమమునకు వెళ్లెను. భరతుఁడుకూడ వచ్చి రాముఁ డటనుండి యెచ్చటకేగెనో యితనినే యడిగెను. రామా.

భరద్వాజుఁడు:—సత్యాశంయుల పుత్త్రుఁడు; భరతుని సోదరుఁడు. ఇతనిభార్య వీర. ఆమెయందు వీరుఁడను కుమారుఁడు కలిగెను. భార.

భరద్వాజుఁడు:—అవక్రీతుని తండ్రి. పుత్త్రుఁడు రైభ్యునిచేఁ జంపఁబడఁగా బుత్త్రశోకముచే నితఁడును ప్రాణత్యాగము చేసికొనెను. అర్వావసుఁడు చేసిన హోమములకు దేవతలు మెచ్చుకొని వరము వేఁడుమనఁగా నతఁడు అవక్రీతుఁడును, భరద్వాజుఁడును బ్రతుకునట్లు వరమును వేఁడెను. ఆ వరమువలన భరద్వాజుఁడు మరల బ్రతికెను. భార.

భరుఁడు:—ఆర్ష్టిషేణుని కుమారుఁడు.

భర్తృహరి:—ధనగుప్తుని కుమారితయగు సుమతి చంద్రగుప్తుఁడును బ్రాహ్మణుని వివాహమయ్యెను. ఈ దంపతులపుత్త్రుఁడే భర్తృహరి. విక్రమార్కుఁడు, భట్టి, వరరుచి ఇతని (సవతి) సోదరులు. విక్ర. చ.

భర్మ్యాశ్వుఁడు:-పురుజుని కుమారుఁడైన అస్కుని తనయుఁడు.

భర్మ్యాశ్వుఁడు:- ఇతఁడే హర్యశ్వుఁడు. ముద్గలుఁడు, యవీనరుఁడు, బృహదిషుఁడు, కాంపిల్యుఁడు, సృంజయుఁడు ఇతనిపుత్త్రులు.

భల్లాణుఁడు:- సింధు, కటకదేశములకు రాజు. ఇతఁ డిష్టదానవ్రతముపట్టి యెవ రేది కోరినను నిత్తు ననియె. ఇతనిని బరీక్షింపఁగోరి శివుఁ డతిథియై యీతని గృహమునకు వచ్చెను. ఈ యతిథి యొక వేశ్యను గోరెను. భల్లాణుఁడు నగరమంతయును వెదకించెను గానియొక్క వేశ్యయును గనఁబడలేదు. ఏ వనితయు దొరకలేదు. అందువలన వ్రతభంగము కాకుండుటకై యా యతిథికి సంప్రీతిచేయుటకై తన భార్యనే పంపెను. ఈతని వ్రతనిష్ఠకు మెచ్చుకొని శివుఁడు నిజరూపమునఁ బ్రత్యక్షమై వరములిచ్చెను.

భల్లాదుఁడు:-ఉదక్సేనుని పుత్త్రుఁడు. భారత యుద్ధమునఁ గర్ణునిచేఁ జంపఁబడెను. భార.

భవ్యుఁడు:-ప్రియవ్రతుని పుత్త్రుఁడు. శాకద్వీపమునకు రాజు. మార్క.

భా

భానుకోపుడు:-శూరపద్మాసురుని పుత్త్రుఁడు. స్కాంద.

భానుమంతుఁడు:-కళింగాధిపతియైనశ్రుతాయువు తమ్ముఁడు. శ్రుతాయువు భీమునితో యుద్ధము చేయుచుండఁగా నితఁడువచ్చి భీముని దాకెను. భీముఁ డితనిని సంహరించెను. భార.

భానుమంతుఁడు:-ఖాండిక్యుని కుమారుఁడు. ఇతని కుమారుఁడు శతద్యుమ్నుఁడు. భాగ.

భానుమతి:-కృతవీర్యుని కుమార్తె. అహంయాతి యొక్క భార్య. సార్వభౌముని తల్లి. భార.

భానుమతి:-దుర్యోధనుని భార్య.

భానుమతి:-సహదేవుని భార్య.

భారతము:-ఈ గ్రంథమును కృష్ణద్వైపాయనుఁడు లోకహితార్థము సంవత్సరత్రయము నిర్మించి దానిని దేవలోకమునందు వక్కాణింప నారదునిఁ; బితృలోకమునను,రాక్షసలోకములందును వక్కాణింప దేవలుని; గరుడ గంధర్వ యక్ష రాక్షస లోకములందు వక్కాణింప శుకుని; నాగలోకమునవక్కాణింప సుమంతుని; మనుష్య లోకమున జనమేజయునికి వక్కాణింప వైశంపాయనునిఁ బంపెను. భార.

భారతవర్షము:- హిమాలయపర్వతమునకు దక్షిణముననున్న దేశము. దానికిఁ బూర్వము అజనాభమనిపేరు. ఋషభునికుమారుఁడగు భరతుఁడు పాలించుటచే దీనికి 'భారతవర్ష' మని పేరు వచ్చెను. భాగ.

భారతి:- భరతునికూఁతురు. శంయుతమనుమరాలు.

భారద్వాజము:-ఒకతీర్థము. (చూడుము నారీ తీర్థములు.)

భార్గభూమి:- భర్గుని కుమారుఁడు. క్షత్రవృద్ధుని వంశములోనివాఁడు. కాశులు అనువారిలోఁ గడపటివాఁడు. భాగ.

భి

భిక్షుతాడిత:-శునకము. రాముఁడు కొలువుండి తనతో నెవ్వరైన నేదేని చెప్పుకొనుటకువచ్చిన యెడల వారిని లోపలకుఁ దీసికొనిరమ్మని లక్ష్మణుని బహిద్వారమున నుంచెను. శునక మొకటి భిక్షునిచేఁ గొట్టఁబడి తలనుండి రక్తము కారుచు వచ్చి గుమ్మముదగ్గఱ మొఱపెట్టుకొనియెను. 'ఒక శునకము వచ్చియున్న' దని లక్ష్మణుఁడు రామునితోఁ జెప్పెను. లోపలకుఁ దీసికొని రమ్మని రాముఁ డానతిచ్చెను. లక్ష్మణుఁ డా శునకమును బిలచెను. "రాజులును, మునులును, యతులును నుండు చోటులకు నే నెట్లు వత్తు" నని శునక మనియెను. రాముఁడే బైటకు వచ్చెను; నిన్నెవరు కొట్టి? రని శునకమును అడిగెను. భిక్షువును జూపి, యితఁడే నన్నుఁ

గొట్టెనని శునకము చెప్పెను. ఈ శునకమును ఏలకొట్టితి ? వని యా భిక్షుని నడుగఁగా "నేను భిక్షాటనముచేసి తెచ్చుకొనిన యన్నమును దారి కడ్డుగ నిలుచుండి యీ శునకము గ్రహించుచుండును గావునఁ గొట్టితిని. నన్ను దండింపుము" అని భిక్షువు పలికెను. వాని నేప్రకారము దండనచేయవలెనని రాముఁ డరయుచుండఁగా శునకము "కాలాంజనమను గిరి కలదు. అందు దేవళ మున్నది. దానిని పాలించుటకై వీనినిఁబంపు" మని చెప్పెను. "తప్పుచేసిన వానికి నిది శిక్షయగునా ?" యని రాముఁడు నవ్వఁగ "నేనుతొలిజన్మంబున నచ్చటనే యుండి కోవెలపారుపత్తెముపని చేసి దేవబ్రాహ్మణుల ధనమపహరించితిని; అందువలననే ఈజన్మమెత్తితిని. ఇంతకంటె వానికి శిక్షయేమి?"అని శునకము పలికెను. పిమ్మట శునకము కాశికేగి యచ్చటనే ప్రాణమును విడిచి స్వర్గము నొందెను. ఉ. రా.

భీ

భీమకుఁడు:- కుండినగరము రాజు. ఇతని కుమారితయే రుక్మిణి. రుక్మధరుఁడు, రుక్మబాహువు, రుక్మకేశి, రుక్మ నేత్రుఁడు - ఇతని కుమారులు. భాగ.

భీమబలుఁడు:-గాంధారీధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

భీమరథుఁడు:- కేతుమంతుని కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు ద్యుమంతుఁడు. ఈ ద్యుమంతుఁడే దివోదాసుఁ డనఁబరగెను. భాగ.

భీమవేగుఁడు:- గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుడు. భార.

భీమసేనుఁడు:-జనమేజయుని తమ్ముఁడు. జనమేజయుఁడు సత్త్రయాగము చేయు చోటునకు సారమేయము రాఁగా దాని నితఁడు కొట్టెను; 'సరమ' జనమేజయునికడకు వచ్చి యితఁ డిట్లు కొట్టెనని చెప్పుకొనియెను. భార.

భీమసేనుఁడు:-ఒక గంధర్వుఁడు.ముని యనుదాని కుమారుఁడు. భార.

భీమసేనుఁడు:-అనశ్వుని తనయుఁడగు పరీక్షిత్తుని కుమారుఁడు. ఇతని భార్యపేరు కుమారిక. ప్రతిశ్రవసుఁ డితని పుత్త్రుఁడు. భార.

భీమాసురుఁడు:-కుంభకర్ణుని పుత్త్రుఁడు. వీఁడు లోకముల కుపద్రవములు చేయుచుండువాఁడు. వీనిని శివుఁడు సంహరించెను.

భీముఁడు:-విదర్భరాజు. ఇతనికి సంతానము కలుగక పోవుటచే దమనుఁ డను ముని నుపాసించెను. పిమ్మట నితనికి దముఁడు, దాంతుఁడు, దమనుఁడు అను పుత్త్రులును; దమయంతి యను పుత్త్రిక యును కలిగిరి. భార.

భీముఁడు:- పాండురాజు నియోగంబునఁ గుంతికి వాయుదేవుని ప్రసాదంబునఁ బుట్టిన కుమారుఁడు. ఇతనిని బ్రసవించిన పదియవనాఁడు కుంతి శిశువు నెత్తుకొని వనదేవతను బూజించుటకు వెళ్ళుచుండఁగా నొక పులి యామెపైఁ బడఁబోయెను. ఆమె భయముచే శిశువును జారవిడిచెను. ఇతఁడు క్రింద నొక రాతిమీఁదఁ బడియెను. వీని కేమి యాపద కలిగెనో యని పాండురాజువచ్చి వీనిని లేవఁదీసెను గాని వీని కేమాత్రమును గాయము తగులక ఱాయియే ముక్కలైయుండెను.

పాండురాజు మరణించిన పిమ్మటఁ గుంతి పుత్త్రులను హస్తినాపురమునకుఁ దీసికొనివెళ్ళెను. భీముఁడు దుర్యోధనాదులతోఁగలసి యాడుకొనుచుండువాఁడు. ఆ యాటలందు ధార్తరాష్ట్రులను గ్రిందఁ బడవైచుచు, ఈడ్చుచు, జలములందు ముంచుచు నుండువాఁడు. అది క్రీడాభిలాషచేఁ జేసినదేగానిఁ వారిని బాధించు దుర్బుద్ధిచేతఁ జేసినదికాదు; అయినను దుర్యోధనున కితనిపై నీర్ష్య యెక్కుడుకలిగె. భీముఁ డొకనాఁడు అలసి నిదురించు చుండఁగా వీని శరీరసంధులను బంధించి మడువులోఁ ద్రోయించెను. మఱియొకసారి విషసర్పములచే వీనిని గఱపించెను. కాని యీ వజ్రకాయున కవి యేబాధయును గలుగఁ జేయలేకపోయెను. దుర్యోధనుఁ డిట్లు బాధించుచుండినను దనపైఁ గ్రోధ

మును, ననూయయుఁ గలిగియున్న వాఁడని యీతఁడు గ్రహించినట్లు కన్పట్టదు.

భీముఁడు పరులను దనవలెనే సరళ హృదయు లనుకొనునుగాని కృత్రిమస్వభావులు కూడ నుందురని తలఁపడు. ధృతరాష్ట్రుఁడు పాండుసుతులను గాశికిఁ బొమ్మని చెప్పిన దానికిఁ గారణ మీతఁ డూహింపలేదు. మార్గమధ్యమందుఁ బురోచనుఁడు నిర్మించినది మాయాగృహమని యెఱుఁగఁడు. ఏకార్యమైనను దాను విమర్శింపక ధర్మరాజు చెప్పినట్లు చేయును. ధర్మరాజు న్యాయవర్తనుఁడనియు, నతఁడు చెప్పినట్లు చేసినయెడల నే కీడును రాదనియు నితఁడు నమ్మి యుండెను.

భీముఁడు లక్కయింటినుండి తల్లిని, సోదరులను దీసికొని వెళ్ళెను. వారలసి నిద్రించుచుండగా నితఁడు మేల్కొని వారి కేయాపదయును రాకుండఁగఁ గాపాడుచుండెను. అపుడు హిడింబి యను రాక్షసాంగన వీనిని జూచి కామించి రత్నశోభితభూషణములతో మర్త్యస్త్రీ రూపంబున వచ్చి తనవలపును వెలిఁగించెను. ఇతఁ డామెను హేళనచేసెను. ఇతని సోదరులకును, దల్లికిని నాపదరాకుండ దాను గాపాడెదననియును, దనకోరిక తీర్పుమనియును నామె వేఁడెను. తనకుఁ జేతకానియట్టుల నొక కాంత వచ్చి వారినిఁ గాపాడుదు ననుటచేఁ బవనసుతునకు రోషము వచ్చెను. ఇంతలో హిడింబుఁడు వచ్చి యట్టహాసము చేసెను. భీముఁడు వానితో యుద్ధము చేయఁదలఁచి, నిదురించుచున్న తన సోదరులకు మెలఁకువ రాకుండుటకై వానినిఁ గొంతదూర మీడ్చుకొనిపోయి యట సంహరించెను. ఇతని వచనములకు హిడింబియు భయపడుచు నిలుచుండెను. ధర్మరాజు లేచి యీమెనుజూచి యీమెపై జాలిగొని యీమె కోరిక తీర్పుమని తమ్మునకుఁ జెప్పెను. అప్పుడు వాయుపుత్త్రుఁ డంగీకరించెను. ఆమెయందు వానికి ఘటోత్కచుఁడను కుమారుడు కలిగెను.

అచ్చటినుండి వ్యాసుని వచనానుసారము పాండవులు విప్రవేషధారులై యేకచక్రపురమున కేగి యొక బ్రాహ్మణునింట భిక్షాటనము చేసికొనుచు నుండిరి. ఆ యింటివాని వలన బకాసురుని వృత్తాంత మెఱింగి తల్లిపంపున భీముఁడే యసురునకు నశనశకటము తోలుకొనిపోయెను. సాంకేతికస్థానమున కప్పటి కసురుఁడు రాకపోవుటచే నితఁడే యా యన్నము తినుట ప్రారంభించెను. ఇంతలో బకాసురుఁడు వీనినే మ్రింగుటకు వచ్చెను. వృకోదరుఁడు కదలక యాహారమంతయు దిని వానితో ముష్టియుద్ధముచేసి వానిని సంహరించి వానికళేబరము నగరసమీపమున కీడ్చి తక్కిన రాక్షసులను భయపెట్టి యేకచక్ర నగరవాసులను విగత భీతులను జేసెను.

అచ్చటినుండి పాండవులు ద్రుపదునినగరమున కేగిరి. అర్జునుఁడు మత్స్యయంత్రమును గొట్టెను. భీమునకు యంత్రమును గొట్టు తలఁపే కలుగలేదు. అర్జునునిపై నీర్ష్యచేఁ గర్ణ దుర్యోధన శల్యాదులు వానిని గొట్టవచ్చిరి. భీముఁడు శల్యునితో మల్లయుద్ధముచేసి వాని నీచముణచి పంపెను. పదపడి ద్రౌపదిని దోడ్కొని భీమార్జునులు తల్లికడకుఁ బోయి తామొక భిక్ష తెచ్చితిమని చెప్పిరి. ఆమె మీరేవురు నుపయోగింపుఁడని పలికినపు డితఁడు తెల్లఁబోయి నిలుచుండెను. పాండవు లేవురును ద్రౌపదిని వివాహము చేసికొనునపుడును దాని ధర్మాధర్మములు ఇతఁడు విచారింపలేదు; తల్లియును, నన్నయును జెప్పినయట్లు చేసెను.

ద్రౌపది గాక భీమునకు స్వయంవరలబ్ధయగు భార్య జలంధర యనునది కలదు. ఆమెయందీతనికి సర్వగుఁడను కుమారుఁడు కలిగెను. ద్రౌపదియందుఁ బుట్టిన కుమారుఁడు శ్రుతసోముఁడు.
భీమునకుఁ గాళి యను భార్యయందు సర్వగతుఁడను కుమారుఁడు జన్మించెను.

ద్రుపదునినగరమునఁ గొంతకాల మున్నతరువాత ధృతరాష్ట్రుఁడు పాండవులను రాఁబిలచెను; వారి కర్ధరాజ్య మిచ్చెను. ఇంద్రప్రస్థపురంబు నిర్మించి ధర్మజుఁడు రాజ్యము చేయునపుడు భీముఁడు రాజ్యవిషయములలో సహాయము చేయుచుండెడివాఁడు.

నారదుఁడు ధర్మరాజును రాజసూయ యాగము చేయుమని ప్రోత్సాహపఱిచినపుడు పవనాత్మజుం డేమియును వనలేదుగాని, దాని వలన జరాసంధాది దుష్టనృపతులను సంహరింప వచ్చునని శ్రీకృష్ణుఁడు చెప్పినపు డితనిశరీరము గగుర్పొడిచెను. జరాసంధుని సంహరించుటకు శ్రీకృష్ణభీమార్జునులు వెడలిరి. వీరు బ్రాహ్మణ వేషమున జరాసంధుని కోటలోఁ బ్రవేశించి దానితో యుద్ధమపేక్షించిరి. భీముఁడే జరాసంధు నితో మల్లయుద్ధముచేసి వానిని సంహరించెను. పదపడి ధర్మజునిపంపున నితఁడు పూర్వదిగ్విజయార్థ మరిగి పుళింద అయోధ్య మత్స్యాది దేశాధిపతులవలనఁ గప్పములును, ధనరాసులును గొనివచ్చెను.

రాజసభయందు శిశుపాలుఁడు శ్రీకృష్ణుని దూషించునపుడు, భీముఁడు క్రుద్ధుఁడై వానిని సంహరించుటకు లేచెను. కాని భీష్ముఁడు వీనిని శాంతచిత్తునిఁ జేసెను.

పాండవులసంపద చూచుటచే దుర్యోధనున కీర్ష్యకలిగెను; పాండవులను వంచించి వారిరాజ్యమును లాగుకొనుట కాలోచించి వారిని రప్పించెను. సుహృద్ద్యూతమని ధర్మజుఁడు జూదము నాడఁ బ్రారంభించెను. ఆ మాయాజూదంబున ధర్మజుఁడు భీముని, దక్కిన సోదరులను, ద్రౌపదిని నొడ్డి యోడెను. తన నొడ్డినను నతఁడు కోపగింపలేదు కాని దుర్యోధనుఁడు ద్రౌపదిని పరాభవించినపుడుమాత్రము పట్టరాని దుఃఖమును, గోపమునువచ్చెను. నీచమనస్కుఁడై ద్రౌపదికిఁ దన తొడలుచూపి సైగలుచేసిన దుర్యోధనుని తొడలు విఱుగఁ గొట్టెదనని యితఁడు ప్రతిజ్ఞచేసెను. ఈ బకవిధ్వంసి తానోటువడి ధార్తరాష్ట్రులకు వశుఁడైయుండెను గాన నప్పటి కేమియుఁ జేయలేకపోయెను. ధృతరాష్ట్రుఁడు మరల వీరిరాజ్యము వీరికిచ్చెను. కాని యచిరకాలములోనే మరల జూదములో దానిని ధర్మజుఁ డోడెను. భీముఁడును, జూదమందు ధర్మరాజు చేసిన శపథమునకుఁ గట్టువడి యరణ్యాజ్ఞాతవాసములు చేయుటకు వెడలెను.

అరణ్యములకుఁ బోవుచుండగాఁ బాండవుల కడ్డువచ్చి హానిచేయఁబోయిన కిమ్మీరునితో ద్వంద్వయుద్ధముచేసి భీముఁడు వానిని సంహరించెను. కందమూలములనుదినుచు మునులవలె నరణ్యములోఁ గాలమునుగడపుట కితఁ డిష్టపడ లేదు. దుర్యోధనాదులతో యుద్ధముచేసి తమ రాజ్యంబును గెలుచుటయే క్షత్రియధర్మమని వాదించెను. కాని ధర్మజుఁడు తాను సభలోఁ జేసిన శపథముప్రకారము వర్తింపవలెననియును, సత్యముదప్పుట నీతి కాదనియును జెప్పెను. ధర్మరాజట్లు పలికిన తరువాత భీముఁ డింక రాజ్యముమాటగాని, యుద్ధముమాటగాని తలఁప లేదు. "పంజరగత సింహమువలె" ధర్మబద్ధుఁడై యుండెను.

కొంతకాల మొక యరణ్యములోఁ గడపిన పిదపఁ బాండవులు గంధమాదనమునకుఁ బోఁ గోరిరి. భీముఁడుఘటోత్కచునిఁ దలఁచుకొనెను. అతఁడు రాక్షససేనతో వచ్చి వారిని గొనిపోయెను. మార్గమం దొక కమలము గాలి కెగిరివచ్చి వారికడఁ బడెను. దాని యపూర్వరమణీయతకు మెచ్చుకొని ద్రౌపది యట్టివానిని మఱికొన్నిటిని దెచ్చియిమ్మని కోరెను, వానిని దెచ్చుటకై భీముఁడరిగెను. మార్గమం దొక వానరముండుటచే నితఁడు దానిని భయపెట్టుటకై సింహనాదము చేసెను. ఆ వానరము హనుమంతుఁడని యీతఁ డెఱుఁగఁడు. "మృగములము,మమ్ము భయపెట్టుట నీకు దగునా? నీవెవరవు? ఈ వనము సిద్ధగతిలేని వారికిఁజొరశక్యముకాదే?" యని యావానరుఁడు పలికెను. నేను ప్రఖ్యాత బలుఁడను, భీముఁడను అని యతఁడు బదులుచెప్పెను. హనుమంతుఁడీత నికి గర్వభంగము చేయఁగోరి "నేనువృద్ధుఁడను, కదలలేను, నా తోఁక నెత్తిగించి యా దారిని పొమ్మని" పలికెను. భీముఁడు నిరసనముగఁ దన యెడమచేతితో నెత్తబోయెను. తుదకు రెండుచేతులతోడనుబలమంతయు వినియోగించి యత్నించి ననునితనికిసాధ్యముకాలేదు. అప్పుడుకుంతీసూనుఁడా వానరుఁడెవ్వడో మహానుభావుఁడని గ్రహించెను. ఆతనికినమస్కరించెను. ఆవానరుఁడుహనుమంతుఁడని పాండుతనయుం డెఱింగెను. ఆతని వలనఁ గొన్నిధర్మములు వినెను. హనుమంతుఁడే దుర్యోధనాధులనుగెల్చివారిరాజ్యమునువారికిత్తుననియెను గాని వారియరణ్యాజ్ఞాతవాసములు ముగిసిన పిదప దుర్యోధనాదులతో యుద్ధముచేసినను

దానికై హనుమంతుని సహాయమును గోరవలసి సంతటి వీరులు కౌరవులలో లేరని యితఁడు చెప్పెను.

భీముఁడు హనుమంతుని వీడి పుష్పములకై కొలనులో దిగఁబోయెను. దానిని గావలి గాచుచున్నవా రిది కుబేరుని కొలననియును, వాతని సెలవులేక పుష్పములు గోయరాదనియును జెప్పిరి. వా రీతనిని భయపెట్టిరి. ప్రతిమాలిరి. కాని యితఁడు మానలేదు. ఆ భటులు తమ యేలికతోఁ జెప్పుకొనిరి. అతఁడు కొందఱు యోధులను బంపెను. పాండుసుతుఁడు వారి నోడించి కొందఱిని సంహరించి పుష్పములను దెచ్చెను.

ఇంతలో జటాసురుండను దనుజుఁ డొకఁడు మాయచేసి ధర్మరాజాదులను గొలుచుచు వారిని నమ్మించి యుండి ద్రౌపది నెత్తుకొనిపోయెను. భీముఁ డది చూచి వానిని మోది చంపెను.

ఒకనాఁడు భీముఁడు మృగయార్థమరిగి యొక పన్నగముచేఁ బట్టువడియెను. ఇతఁడు విడిపించుకొనఁ జూచెను గాని యది సాధ్యముకాలేదు. తనకంటెను బలాఢ్యుఁడైనవానిని జూచి యితఁ డాశ్చర్యమునొంది యదియెవ్వరో మహానుభావుఁడని తలఁచెను. ఆపన్నగము తాను పూర్వభవమున బ్రాహ్మణుఁడ ననియును, శాపవశమున నిట్లయితిననియునుఁ దెల్పెను. అపుడు వృకోదరుఁడు వానికి వేదాంతవిషయములు తెలిపి దుఃఖోపశమనమునుగావించెను. తత్త్వవిషయమున నితఁడు ప్రసంగించిన దిచ్చోటనే. కార్యశూరుఁడగు భీముఁ డీ యాధ్యాత్మిక విషయములను గుఱించి ముచ్చటించుట క్రొత్తగనే యున్నది. ధర్మజుఁడు వీనికై వచ్చి వీనినిఁ బట్టిన నహుషుఁడు వేసినప్రశ్నలకు నుత్తరువులిచ్చి వీనిని విడిపించుకొని వెళ్ళెను.

భీముఁ డరణ్యములో సంచరించుచుండఁగాఁ గొందఱు కౌరవులు వచ్చి "గంధర్వులు తమ్ము బాధించుచున్నారని చెప్పుకొని రక్షింపుఁ" డని వేఁడిరి. శత్రుపక్షమువారి కష్టమునందు కితఁడు సంతోషించెను. కాని ధర్మరాజు వారికి సహాయము చేయుమని చెప్పుటచే గంధర్వులనోడించి దుర్యోధనుని విడిపించి ధర్మరాజు ముందటఁ బెట్టెను. వీరి కపకారము చేయవచ్చిన దుర్యోధనుఁడు వీరిచే రక్షింపఁబడి గతగర్వుఁడై ఖిన్నుఁడయ్యెను.

ఒకనాఁడు ద్రౌపది యొంటరిగ నున్నపుడు సైంధవుఁ డామెను జూచి మోహించి దుర్భాషలాడఁజొచ్చెను. ఆమె ధౌమ్యునితోఁ జెప్పెను. ధౌమ్యుఁ డా సంగతి భీమార్జునుల కెఱిఁగించెను. వీరు వానినిఁబట్టి యవమానపరచి పంపిరి.

ఆ యరణ్యమునుండి యేగుచుండఁగా వారలకు దాహమయ్యెను. నీరుతెచ్చుటకు సహదేవుఁడరిగెను. అతఁడు తిరిగి రాకపోవుటచే నకులుం డేగెను. ఇతఁడును రాకపోవుటచే నర్జునుఁడును, తరువాత భీముఁడును నరిగిరి. ఇతని సోదరులు ముగ్గురును విగతజీవులైనట్లు పడియుండిరి. భీముఁడును నీరమునకై కొలనులో దిగెను. అపు డాకాశవాణి తన ప్రశ్నలకుత్తరువిచ్చి దాహము దీర్చుకొనుమని చెప్పెను. కాని యితఁ డా మాటలకు లక్ష్యముచేయలేదు. ఇతఁడును సోదరులవలెఁ బడిపోయెను. వీరినందఱను వెదకుకొనుచు ధర్మజుఁడువచ్చి యా యక్షప్రశ్నలకు సమాధానము చెప్పి లబ్ధజీవులైన వీరిని గొనిపోయెను.

పాండవుల యరణ్యవాసము ముగిసెను. వారు తామింకఁ జేయవలసిన కార్యము లేర్పఱచుకొనిరి. భీముఁడు వంటలవాఁడ నయ్యెద ననియె. ఎందువలన నాతఁ డిట్లనియెనో తెలియరాదు. ఆ పనియందును భీమకార్యములనే యితఁడు చేయునట్లు చెప్పెను. కత్తులక్కఱలేకుండనే కట్టెలనువిరచెదననియెను. ధర్మరాజు వెనుక నితఁడును విరటునగరమును బ్రవేశించెను. విరటుఁ డితనికిఁ బెద్దయుద్యోగమిచ్చెదనన్నను దాను వాల్లవకులమువాఁడ ననియును, ధర్మజుని కడ వంటలవాఁడుగ నుండువాఁడ ననియును, నిచ్చటను ఆ పనియే చేయుచుందు ననియును జెప్పెను. వలలుఁడను పేరున విరటునియొద్ద వంటలవాఁడుగ నుండెను. ఇతఁడు వంటచేసి, ప్రభుభోజనము కాఁగా మిగిలిన యాహారమును సోదరులకును, ద్రౌపదికిని నిచ్చుచుండువాఁడు. ఇతఁడు తనబలముచే నచ్చటివారల కాశ్చర్యమును గొలుపుచుండెడివాఁడు. అంతఃపురస్త్రీల

వినోదమునకై యితఁడు మృగములతోఁ బట్టుపట్టుచుండును. ఒక మల్లుఁడు విరటునగరమునకువచ్చిన తననోడింపగలవాఁడు లేడనిచెప్పికొనగ, మన వలలుఁడు వానితో యుద్ధము చేయగలఁడని కంకుఁడు (ధర్మరాజు) చెప్పెను. విరటుఁడు వీనిని రావించి వీనిచే మల్లయుద్ధము చేయించెను. ఇతఁ డా మల్లు నోడించెను.

ఒకనాఁడు ద్రౌపది విరటునిసభకుఁ గీచకునిచే దఱుమఁబడి పరుగెత్తుకొని వచ్చి కీచకుఁడు తన నవమానపఱచుచున్నాఁడని చెప్పికొని విలపించెను. వానిని సంహరించుటకు భీముఁ డప్పుడే పరిసర వృక్షమును బెఱుకఁబోయెను గాని ధర్మజుఁడు వలదనుటచే మానెను.

ఆ రాత్రి ద్రౌపది భీమునికడకే వచ్చి తనకుఁ గీచకుఁడుచేసిన పరాభవము తెల్పి విచారించెను. ఆ క్షణముననే సభలోఁ గీచకుని వధింపఁగల్గినను తమ రహస్యము బయల్పడు ననియును, దానివలన మరి పండ్రెండేండ్లరణ్యవాసము చేయవలసి వచ్చుననియును, నందుచేతనే ధర్మజుఁడు తన నప్పుడు వారించెననియును నామెకు నీతఁడు చెప్పెను. కాని కీచకుని వధించుట కాతఁ డొడంబడియెను. దాని నుపాయంబునఁ గావింపవలె ననియెను. ఇతఁడు చెప్పిన యుపాయము ప్రకారము ద్రౌపది కీచకుని గోరినకోరిక తీర్చుట కంగీకరించినట్లు నటించి వానికై సాంకేతికస్థలమును, నిర్ణయకాలమును నేర్పఱచెను. అచ్చట కా సమయమునకు నితఁడే నారీరూపమున నేగెను. కీచకుఁ డీ రూపమున నున్న కుంతీతనయుని జూచి ద్రౌపదియేయనుకొని కౌఁగిలించుకొనఁబోయెను. అపుడు భీముఁడు వానిపైఁ బడి వానితో యుద్ధముచేసి సంహరించెను. ఆ మఱునాఁ డుపకీచకులు తమయన్నశవముతో ద్రౌపదిని గట్టుకొనిపోవుచుండఁగా నితఁడు దాపుననున్న వృక్షములను బెల్లగించి వానినిగైకొని యుపకీచకులను దఱిమెను. వీనినిజూచి వారుభయపడి పాఱిపోయిరి. ఇతఁడు వారినిఁ దఱిమి పట్టుకొని సంహరించెను.

ఇంతచేసినను భీముఁడు ప్రచ్ఛన్నుఁడై యుండెను. విరటుఁ డీతని నెఱుంగలేకపోయెను. కాని కౌరవు లీతనికార్యములవలన నీవలలుఁడు భీముఁడే యగునని శంకించిరి. పాండవులను గుర్తించుటకై విరటునగరమునకు గోగ్రహణమునకై వచ్చిరి.

పాండవుల యజ్ఞాతవాసము ముగిసినపిమ్మట వారు కావించిన కార్యాలోచనయందు నితఁడు పాల్గొనలేదు. ధర్మజుఁడేది నిశ్చయించినను దానిని జేయుట కంగీకరించియుండెను. తుదకు యుద్ధమే నిశ్చయమయ్యెను.

ఇతనిశంఖము పౌండ్రము. యుద్ధమున భీముఁ డర్జునునంతఁ జొఱుచుకొని పోరలేదు. ధర్మజుని వలె వెనుక వెనుకలనే యుండలేదు. కౌరవులకును నర్జును నోడింపవలయునన్న పట్టుదల నితని నోడింపవలెనని లేదు. ఇతఁడు కురుసేనలోఁ జొచ్చి కర్ణ శల్యాదులతో యుద్ధముచేయుచుండెను. కర్ణుఁడితని నోడించినపు డితఁ డర్జునుని గూడెను. ద్రోణుఁడు విజృంభించి పాండవసేనను దాకుచున్నపుడు కృష్ణార్జునులు వాని నాపలేకపోయిరి. అప్పుడు కృష్ణుఁడు అశ్వత్థామ మరణించెనని పలుకుమని యుపాయము చెప్పెను. దాని కర్జునుఁడొడంబడలేదు. ధర్మజుఁడు కల్లలాడ ననియెను. ఈ విచారములు పెట్టుకొ భీముఁడే గట్టిగ నశ్వత్థామ చనిపోయెనని యఱచెను. కాని వీనిమాటలను ద్రోణుఁడు పాటించలేదు.

భీముఁడు కర్ణుని సుతుండైన సత్యసేనుని జంపెను. శల్యునిదాకి మూర్ఛితునిఁ జేసెను. అంత ధృతరాష్ట్రపుత్త్రులును, కర్ణుఁడును వీనితోడఁ దలపడిరి. భీముఁ డరునుని జేరెను. ఆ సమర సంకులమున దుశ్శాసనుఁడు భీమునితోఁ బోర వచ్చెను. గాన నితనికి సంతోషమయ్యెను. ఆనాఁడు సభలో ద్రౌపదిని బరిభవించిన వాని హృదయము చీల్ప నిప్పటికవకాశము కలిగెను. వానితో యుద్ధముచేయునపుడు భీమున కుగ్రరూపమే వచ్చెను. ఇతఁడు దుశ్శాసనుని జంపి వానిహృదయమును జీల్చి, రక్తమును ద్రావి, శిరోజములకుఁ బూసెను.

కర్ణ శల్యులుకూడ మరణించినపిమ్మటఁ గురుబలము చెల్లాచెదరై పోయెను. దుర్యోధనుఁ

డొక్క ప్రహదములో దాఁగియుండెను. పాండవులు వానిని వెదకుచుఁ బోయి వానికిఁ బౌరుషము పుట్టునట్లు పలికిరి. దుర్యోధనుఁడు యుద్ధమునకు వచ్చుట కంగీకరించెను. పవనసుతుం డతనితో గదాయుద్ధముచేసి శ్రీకృష్ణుఁడు చెప్పిన యాలోచనచొప్పునను, వెనుక తాను సభలోఁ జేసిన శపథము ప్రకారమునను దుర్యోధనుని తొడలు విరుగఁగొట్టి వానిని సంహరించెను. అధర్మముగ నాతఁడు తొడలపైఁ గొట్టుటచే బలరామునకుఁ గోపమువచ్చి వీనిపై హల మెత్తెను. కాని శ్రీకృష్ణుఁడు వానిని శాంతచిత్తునిఁ జేసెను.

యుద్ధము ముగిసినతరువాతఁ బాండవులు ధృతరాష్ట్రునిఁజూడఁబోయిరి. అతఁడు వారిపైఁ బ్రేమగలవానివలె వారలను గౌఁగిలించుకొనఁ బోయెను. అతఁడు భీమునిఁ జేరఁదీయునపుడు శ్రీకృష్ణుఁ డీతనిని వెనుకకు లాగి యచ్చట నుక్కుతోఁ జేసిన విగ్రహమును బెట్టెను. దానినే భీముఁ డనుకొని ధృతరాష్ట్రుఁడు కౌఁగిటయందు నొక్కినొక్కి పొడిచేసెను. తన పుత్రులను జంపిన పాండుసుతునందు ధృతరాష్ట్రున కింతకోపము గలదు.

యుద్ధము ముగిసిన తరువాత ధర్మరాజు రాజయ్యెను. భీముఁ డతనికి రాజకార్యములందు సహాయము చేయుచుండువాఁడు. శ్రీకృష్ణుఁడు పరలోకగతుఁడయ్యెనని యర్జునుఁడు తెలుపఁగనే నితఁడును రాజ్యమునందుండ నిచ్ఛగింపలేదు. పాండవు లందఱును, ద్రౌపదియును నగరమును వీడి యుత్తరాభిముఖులై హిమవన్నగమునుగూర్చి చనిరి. మార్గమందు ద్రౌపదియును, సహదేవ నకులార్జునులును గతప్రాణులై పడిపోయినపిదప నితఁడును గతజీవుఁడై పడి స్వర్గలోకమును జేరెను. భార.

భీమదుఁడు:– భైరవులలో నొకఁడు. (చూడుము భైరవులు.)

భీష్ముఁడు:– పూర్వభవమున ప్రభాసుఁడను నొక వసువు. (చూడుము ప్రభాసుఁడు.)

భీష్ముఁడు గంగాశంతనుల యష్టమపుత్రుఁడు. వానిసోదరులనువలె వానినిగూడ గంగాప్రవాహములోఁ బడవేయకుండ శంతనుఁడు గంగను వారించి యామెనుగూర్చి యప్రియంబులు పలికెను. గంగ యీపుత్రుని, భర్తను విడచి వాని వృత్తాంతము భర్తకెఱింగించి చనియెను. భీష్ముఁడు వసిష్ఠునితో సకలవేదములను, శాస్త్రములను జదివి యస్త్రవిద్యయందుఁ బరశురామునంత దక్షుఁడై, యాత్మవిజ్ఞానంబున సనత్కుమారులను బోలి సర్వశాస్త్రములందును బృహస్పతి ననుకరించి యుండెను. శంతనుఁడితనికి యౌవరాజ్యాభిషేకము చేసెను.

శంతనుఁ డొకనాఁడు దాశరాజపుత్త్రియైన సత్యవతినిఁజూచి కామించి ప్రతిహత మనోరథుఁడై చింతాక్రాంతుఁడై యుండెను. భీష్ముఁడు తండ్రి దుఃఖకారణ మెఱింగి రాజన్య సమన్వితుండై దాశరాజుకడకుఁ బోయి సత్యవతిని దన తండ్రి కిమ్మని యడిగెను. ఆమెకుఁ బుట్టు పుత్రులు సింహాసనారూఢార్హులు కారని దాశరాజు శంకించుచుండ నామెపుత్రులే రాజ్యమేలెడువారని భీష్ముఁడు శపథముచేసెను. అయినను దాశరాజుయొక్క భయము పోలేదు. ఇతఁడుకాకపోయినను నితని సంతతివా రేమి యవరోధము చేయుదురోయని సందేహించెను. గంగానూనుఁడు ఆ సంశోచమునకును నవకాశము లేకుండ చేసెను. తండ్రికార్యమును దలఁచి తాను బ్రహ్మచర్యవ్రతమును బూనెను. ఇతనిరాజ్యపరిత్యాగమునకును, బ్రహ్మచర్యవ్రతపరిగ్రహంబునకును, సత్యవ్రతంబునకును దేవర్షిగణంబులు మెచ్చుకొని పుష్పవర్షంబులు గురిపించిరి. దాశరాజు సంతసించి సత్యవతి నిచ్చెను. ఈమెను గనకరథంబునఁ గొనిపోయి భీష్ముఁడు తండ్రి కర్పించెను. అతఁడు మెచ్చుకొని పుత్రునకు స్వచ్ఛందమరణము వరముగా నిచ్చెను.

సత్యవతికిఁ జిత్రాంగద, విచిత్రవీర్యులను పుత్రులు కలిగిరి. వీరి చిన్నతనములోనే శంతనుఁడు మరణించెను. భీష్ముఁడు చిత్రాంగదుని రాజుగఁ జేసెను. కాని వానిని జిత్రాంగదుఁడను గంధర్వుఁడు సంహరించెను. అంత నదీసూనుఁడు విచిత్రవీర్యునకుఁ బట్టముగట్టి తాను

రాజకీయవ్యవహార ధురంధరుఁడై ప్రజాపాలనము చేయుచుండెను. ఇతఁడు విచిత్రవీర్యునకు వివాహముచేయ యత్నించుచుండఁగా కాశీరాజు కూఁతుల స్వయంవరము జరుగుచున్నదని విని యటకేగి యీ మువ్వురు బాలికలను గైకొనియె. స్వయంవరార్థము వచ్చిన రాజకుమారులు వీనితో యుద్ధంబుసేయ వారి నోడించి తనను వెన్నంటివచ్చిన సాల్వునిపై శరవర్షంబుకురిపించి వానింగూలఁద్రోసి రాకుమారికలను నిజనగరమునకుఁ దీసికొని వచ్చెను. వీరి మువ్వురిలోఁ బెద్దదియైన అంబ తా నిదివఱకే సాల్వుని వరించి యాతనిచే వరియింపఁబడి యుంటినని తెల్పెను. నదీనందనుఁ డామెనువిడిచి యంబిక యంబాలికలనే విచిత్రవీర్యునకిచ్చి వైభవంబుగవివాహము చేసెను.

అంబ సాళ్వునికడకేగెను. కాని భీష్మునిచేఁ గొనిరాఁబడినదని యామెను సాళ్వుఁడు స్వీకరింప కుండెను. ఆమె తపస్సు చేసికొనుట కడవిలోఁ దిరుగుచుండెను. తుదకుఁ బరశురాముఁ డామెను భీష్మునియొద్దకు దీసికొనివచ్చి మరలఁ గైకొనుమనియె. అన్యునిచే వరింపఁబడిన దానిని గైకొననని భీష్ముఁడు నిరాకరించెను. అంతఁ బరశురాముఁ డితనితో యుద్ధముచేయఁజొచ్చెను. ఎన్నినాళ్ళు యుద్ధముచేయుచున్నను నెవ్వరును నోడుటలేదు. భీష్ముఁడు సగమోడెను. అతఁడు వసువులను ప్రార్థింప వారు కలలోఁ గనఁబడి మోహనాస్త్రమిచ్చిరి. మఱునాటియుద్ధములో భీష్ముఁడు దానినిఁ బ్రయోగింపఁబోవ నారదుఁడు వచ్చి అతనిగురుని నట్లుచేయుట మంచిదికాదనియును, మానుమనియును జెప్పెను. సురలు, మునులు, గంగయుఁ గలుగఁజేసికొనిరి. జమదగ్నియును గోపమును మానుమని పరశురామునకుఁ జెప్పెను. నారాయణుని సఖుఁడగు నరుఁడు వేఱొక జన్మమున వీనిని జయింపవలయునుగాని యన్యునకు శక్యముగాదని వానికిఁజెప్పి, వీరుభయుల ననునయించిరి. భీష్మునిఁ బరశురాముని కడకుఁ దీసికొని వెళ్ళిరి. ఇతఁడు సాష్టాంగదండప్రణామంబు చేయఁగా నతఁడు లేవనెత్తి యొడిలోనికిఁ దీసికొని యాశీర్వాదము చేసెను. యుద్ధమునుమాని మునులతో మహేంద్రశైలమునకుఁ బోయెను. శాం.

విచిత్రవీర్యుఁడు సంతానములేకయే చనిపోయెను. కురువంశ మింక నంతరించునని సత్యవతి విచారించి భీష్ముని సంతానము వడయుమని కోరెను. కాని, యితఁడు తానుబూనిన శపథమున కిపుడు వ్యతిరేకముగ సలుపననియె. కురుసంతతి శాశ్వతముగఁజేయుటకై క్షాత్రధర్మము నెఱింగించి దానికి నిదర్శనముగా దీర్ఘతముని వృత్తాంత మెఱింగించి యామె నొడంబఱచెను.

పిమ్మట నంబిక యంబాలికలయందు వ్యాసుని వలన ధృతరాష్ట్ర పాండురాజులు పుట్టిరి. భీష్ముఁడు ధృతరాష్ట్రుని రాజునుఁజేసి తాను విదుర సహాయమున రాజ్యాభిరక్షణము చేయుచుండెను. ఈ పుత్త్రులకు భీష్ముఁడు వివాహము చేయఁదలంచెను. కురువంశమునకు సంతానహీన భయంబులేకుండఁ జేయఁగోరెను; కావున నతఁడు గాంధారి శతపుత్త్రులను బడయునట్లు వరము గొనినదని వినుటచే నామెతండ్రికి వర్తమాన మంపెను. అతఁడు గాంధారిని, నామె తోఁబుట్టువులను ధృతరాష్ట్రునకిచ్చి వివాహము చేసెను. పాండురాజు కుంతిని, మాద్రిని వివాహమయ్యెను. పాండురాజు మరణించిన పిమ్మట నాతనిసుతులకు భీష్ముఁడు ధృతరాష్ట్రనందనులతో సమానముగ విద్యనేర్పించెను.

ఆటలయందు ధృతరాష్ట్ర పాండుసుతుల వైరములు తెల్లమయ్యెను. అర్జునునితోఁ బోరుటకు దుర్యోధనుఁడు కర్ణున కంగరాజ్యమిచ్చెను. పాండుసుతుల కపకారముచేయదలఁచి దుర్యోధనుఁడును, ధృతరాష్ట్రుఁడును వారలను వారణాసికిఁ బొమ్మనిరి. ఇన్ని జరుగుచుండినను భీష్ముఁ డేలమిన్నకుండెనో తెలియరాదు. పాండుపుత్త్రులు ద్రౌపదిని వివాహమయి ద్రుపదుని నగరమున సుఖంబుగనున్నారని ధృతరాష్ట్రాదులు వినిరి. భీష్ముఁడు వారి క్షేమమునను సంతోషించెను. దుర్యోధనుఁడు, ధృతరాష్ట్రుఁడును వారినిసంహరింపఁగోరిరి. దానికై ధృతరాష్ట్రుఁడు భీష్ముని నాలోచన యడిగెను. అపు డితఁడు కోపానలజ్వాలితుఁడై వీరిదురూహలను నిందించి పాండవు లజేయులని తెల్పెను. ఇతఁడిట్లు పల్కుటచేతనే ధృతరాష్ట్రుఁడు ధర్మజాదులను రావించి వారి కర్ధరాజ్య మిచ్చెను. ధర్మజుఁ

డింద్రప్రస్థమును నిర్మించి పాలించుచుండినను భీష్ముఁడు హస్తినాపురములోనే యుండెను.

ధర్మరాజుచేసిన రాజసూయమునకు భీష్ముఁడు సంతోషముతో నేగెను. తన మనుమ లింతటి వారైరని యానంద మొందెను. రాజసభలోఁ బూజార్హుఁడైనవాఁ డెవరని ధర్మరాజు భీష్ముని నడిగెను. ఇతఁడు శ్రీకృష్ణుఁడే యని చెప్పెను. అందుపై శిశుపాలునకుఁ గోపము వచ్చెను. అతఁడు శ్రీకృష్ణుని, భీష్మునిగూడ నిందించెను. అయిన నితఁడు శాంతచిత్తుఁడై యుండెను. ధర్మరాజుచేసిన యాగము చూచుటచే దుర్యోధనున కీర్ష్యజనించెను. పాండవులను వంచించుటకు దుర్యోధనుఁడు వారిని జూదము నాడుటకుఁ బిలిచెను. ధర్మనందనుఁడు జూదము నాడెను; ఎన్నడు వినరాని పణముల నొడ్డిరి. పాండుసుతుఁడు ద్రౌపది నొడ్డెను. ఆమెను దుర్యోధనుఁ డవమానముచేసెను. మరల నాడిన జూదమున దుర్యోధనుఁడు పాండవులను రాజ్యభ్రష్టులనుజేసెను; వారి నరణ్యముల పాలుచేసెను. అప్పుడైనను భీష్ముఁడు కల్పించుకొని దుర్యోధనాదులను మందలింపలేదు. కాని దుర్యోధనుఁడు చేసినదాని నామోదింపనులేదు. దుర్యోధనుఁడును, ధృతరాష్ట్రుఁడునుతమయాలోచనలను వీనికిఁ జెప్పుటయును లేదు. అయిన నితఁడు ధృతరాష్ట్ర గృహమును వీడి వెళ్ళలేదు. పాండవు లజ్ఞాతవాసము చేయునపుడు వారిని గుర్తించు విధమును గూర్చి దుర్యోధనాదులతోఁ బాటు భీష్ముఁడును జింతించెను. గోగ్రహణమునకై యితఁడును నేగెను. ఉత్తరకుమారుని సారథిగ వచ్చిన బృహన్నలయే యర్జునుఁడై యుండునని నిశ్చయించెను. పాండవుల యజ్ఞాతవాసము గడువు తప్పలేదని వారు శంకించుకొనినపు డది గడచెనని యాతఁ డెఱింగించెను. ఆ సమయమున నర్జునుఁడే గెల్చెను.

పాండవులయొక్క యజ్ఞాతవాసము ముగిసెను. ధర్మరాజు సంధిచేసికొన నపేక్షించి రాయబారి నంపెను. ధృతరాష్ట్రుఁడు ధర్మజుని కడకు సంజయు నంపెను. దుర్యోధనుఁడు మాత్రము సంధి కంతమాత్రమును నిచ్చగించుటలేదు. కర్ణుఁ డీ దురాలోచనలందును, దుష్కార్యములందును దుర్యోధనునకు సహాయము చేయుచుండెను. కర్ణుని మూలముననే యింత ముప్పువచ్చినదని భీష్ముఁడు వానిని నిందించెను. ఆ నాఁడు సభలోఁ గర్ణుఁడు బలికినపుడెల్ల వాని నధిక్షేపించుచునే యుండెను. వీని మాటలకుఁ గోపమువచ్చి కర్ణుఁడు, భీష్ముఁడు యుద్ధము చేయుచున్నంతకాలము దా నస్త్రము బూననని శపథము చేసెను. భీష్ముఁ డెన్నివిధముల సంధి చేసికొనుమని చెప్పినను దుర్యోధనుఁడు వినలేదు. తుదకు యుద్ధమే సంభవించెను. ఆ యుద్ధమందు భీష్ముఁడే దుర్యోధనునకు సర్వసేనాధిపతి యయ్యెను. దుర్యోధనునితో సంధి చేసికొనుమనియును, బాండవులతో యుద్ధము చేయవలదనియును నెంతగఁ జెప్పినను భీష్ముఁడు బాండుపుత్త్రులతో యుద్ధము చేయుటకు సంకోచింపలేదు. మఱియును దానుండఁగఁ బాండవులకు భయపడవలసిన పనిలేదని దుర్యోధనునకు ధైర్యము చెప్పెను.

కురుక్షేత్రముననుభయపక్షములవారును వ్యూహములు తీర్చియుండిరి. యుద్ధమింకను నారంభింపలేదు. ధర్మజుఁ డా సమయమున బాదచారియై భీష్మునియొద్దకేగి నమస్కరించెను. ధర్మరాజును జూచుటతో నీతని కానందముకలిగెను. ధర్మజు నాశీర్వదించి పాండవపక్షమునఁ బోరుటయే కాక ఏదేని వరము వేఁడుకొను మనియెను.

భీష్మునకుఁ బాండవులందంత యనురాగముండినను యుద్ధమారంభించిన పిదప గర్భశత్రువులతోఁ బోరునట్లే యుద్ధము చేయుచుండెను. పాండవపక్షులగు శతానీకాదులను దునుముచుండెను. దుర్యోధనుని జయమేకోరి రణమొనరించుచుండెను. అయినను దుర్యోధనున కీతనిపై నమ్మకము లేకపోయెను. భీష్ముఁడెన్నిదినములుపోరినను నర్జునుఁడు మరణింపఁడయ్యెను. కావున నతనిని దొలంగి కర్ణుని యుద్ధముసేయనిమ్మనియె. ఈమాటలకు భీష్మునకుఁ గష్టముగనే యుండెను. అయిన నతఁడు యుద్ధమును మానలేదు. పాండవసేనపై విజృంభించి శత్రుసేనల నుక్కాడుచుండెను. వీనిని జయించుట యసాధ్యమని పాండవులు భయపడిరి. వారు శ్రీకృష్ణునితో నాలోచించిరి. భీష్ముఁడు వారికి హితంబుసేసెదననియెను. కావున

బాండవులు పాదచారులై నిశియందు రహస్యం బున నతనిని చేరిరి. వారు వచ్చిన పనియేమని యతఁడడిగెను; పాండవులు చెప్పిరి. తాను జీవించియున్నంతవఱకును బాండవులకు జయము కలుగదని చెప్పి తానెట్లు మరణించునో యా యుపాయమును జెప్పెను. ఆ మఱునాఁడు మరల యుద్ధముచేసిరి. భీష్ముఁడు చెప్పిన యుపాయము చొప్పునఁ బాండవులు శిఖండిచేత నతనితో యుద్ధమును జేయించిరి. శిఖండి చాటుననుండి యర్జునుఁడు బాణములు వేయుచుండెను. శిఖండిని జూచుటతోడనే యాపగాతనయుఁ డస్త్రసన్న్యాసముచేసెను. పదిదినములు యుద్ధముచేసి యర్జునుని బాణములచేహతుఁడై యతఁడు తూర్పు తలగఁ బడియెను. అతనిశరీరము భూమిపైఁ బడకుండ బాణంబులే తల్పంబువలె నూతయయ్యెను.

గంగానూనుని పాటునకు దివిజాలును విచారించిరి. కొందఱు హంసరూపమునవచ్చి యది దక్షిణాయనమని తెల్పిరి. భీష్మునకుఁ దండ్రి స్వచ్ఛందమరణము వరముగా నిచ్చెను. కావున నాతఁ డుత్తరాయణము వఱకును మరణింపక యుండఁగోరెను. అట్లుపడియుండిన వీనియొద్దకు పాండవులెల్లరు చేరిరి. కర్ణుడుకూడవచ్చి యలుక తక్క తగినమాటలాడుమని పలికెను. భీష్మునకు శల్యచికిత్స చేసెద మనిరి. వినోదములుగావించి యాతనికి ముదముచేయుదుమనిరి. పట్టుతలగడాల దెచ్చియానుకొనుటకిచ్చిరి. భీష్ముఁడివియేవియును వలదనెను. అర్జునుఁడుబాణమేయఁగ భూమినుండి వచ్చిన నిర్మలజలమును మాత్రము గ్రోలెను. శరతల్పగతుఁడై యుండిన భీష్ముని కౌరవ పాండవులు సేవించుచునే యుండిరి. ధర్మజునిఁ గలంకఁ దీర్చుటకై భీష్మునియొద్దకు శ్రీకృష్ణుఁడు తీసికొనివచ్చి ధర్మము లుపదేశింపుమని చెప్పెను. శరతల్పగతుఁడై యున్నవానికి, ఇంద్రియములకు బాధ కలుగకుండఁగను, ఆకలియును,దాహమును బుట్టకుండఁగను, సకలభూతముల వర్తనమును దెలుపునపుడు బుద్ధి దివ్యబోధంబునఁ దెంపు పొందునట్లును శ్రీ కృష్ణుఁడు వరంబులిచ్చెను.

ధర్మరాజున కితఁ డనేక నీతులు చెప్పెను. లౌకికాధ్యాత్మిక విషయములలో భీష్ముఁడు చెప్పని నీతివాక్యమే లేదు. అట్లు కొన్ని దినములైనపిదప నుత్తరాయణము వచ్చెను. భీష్ముఁడు శరీరమును విడిచి దివిజలోకమున కేగెను. భార.

భు

భుమన్యుఁడు:—భరతుని పుత్త్రుఁడు; దుష్యంతుని పౌత్త్రుఁడు. ఇతనితల్లి సునంద. భార్య విజయ. సుహోత్రుఁ డీతని కుమారుఁడు. భార.

భువనేశుఁడు:–ఒక రాజు. ఇతని రాజ్యమున హరిమిత్త్రుఁడను బ్రాహ్మణుఁడు సదా శ్రీవిష్ణుకీర్తనమును జేయుచుండువాఁడు. ఈ రాజు తన యొక్క కీర్తి వ్యాపించుటకై తనను గూర్చి గానము జేయుమనియెను. ఆ బ్రాహ్మణుఁడు నిరాకరింపఁగా ఆ బ్రాహ్మణుఁడు పూజచేయు ప్రతిమలను బారవేసి యతనిని హింసించెను. ఇతనికి ఉలూకజన్మము వచ్చెను. (చూడుము గానబంధుఁడు.)

భూ

భూతజ్యోతి:– నృగునివంశమువాఁడగు సుమతి యొక్క కుమారుఁడు. ఇతనిపుత్త్రుఁడు వసువు. భాగ.

భూతసంతాపనుఁడు:–హిరణ్యాక్షుని పుత్త్రుఁడు మత్స్య.

భూమింజయుఁడు:–ఉత్తరుఁడు.

భూమిదేవి:–యోగనిద్రా సమయావసానమున సుప్రబుద్ధుఁడైన విష్ణువుకడకు నీమె కామించి చనెను. ఆయన తత్సంగతినివిని ప్రీతుడై ఆమెకు వరము లిచ్చెను. వైష్ణవాస్త్రము ఆమె కుమారుఁడగు నరకునకు వశమగునట్లు లామె కోరెను. భార.

భూరి:- బృహద్రథకులమువాఁడైన యొక రాజు. ఇతఁడు పరశురామునకు భయపడి గృధ్రకూట శైలమున దాఁగెను. భార.

భూరిశ్రవుఁడు:- ఒక బాహ్లీకరాజు. సోమదత్తునకు వరమువలనఁ బుట్టినకుమారుఁడు. ఇతఁడు కౌరవపక్షమునఁ బోరి సాత్యకి నోడించి తన్నెను. (చూడుము సోమదత్తుఁడు.) కాని మరల సాత్యకి యితనితోడనే యుద్ధముచేసి వీనిని సంహరించెను. భార.

భృ

భృంగి:- శివుని ద్వారపాలకుఁడు. శివుని వీర్యము అగ్ని ధరించినపుడు (చూడుము అగ్ని) రెండు బిందువులు గిరిప్రస్థమునఁ బడెను. అందుండి శిశువు లేర్పడిరి. వీరిని శివుఁడును, పార్వతి యును పెంచిరి. ఈ సోదరులకు బ్రహ్మ భృంగి, మహాకాళి యని నామకరణము చేసెను.

తత్యనంతరము విగతవస్త్రయై యుండిన పార్వతిని భృంగి చూచెను. ఆమెకు కోపము వచ్చి వానిని మనుష్యయోనియందు వానర ముఖముతో జన్మించునట్లు శపించెను. ఇతఁడు పార్వతీ పరమేశ్వరులను ప్రార్థించెను. తామే వీనికి మనుష్యరూపమున జన్మనిమిత్త మగుదుమని వారు చెప్పిరి. పార్వతీ శివాంశలు గల దంపతులకు వానరముఖముతో భృంగియును, వీని సోదరుఁడు మహాకాళియును జన్మించిరి. అపుడు భైరవుఁడు, బేతాళుఁడు అను పేరునఁ బరగిరి. భృంగియే భైరవుఁ డయ్యెను. ఇతఁడు తరువాతి జన్మమున వంధకాసురుఁడైపుట్టి తుదకు శివునిని జేరెను. కాళి.

భృగుఁడు:- ఒక బ్రాహ్మణుఁడు. భాగీరథీనది దక్షిణతీరమున నున్న మహాపద్మమనియెడు పుర మున నుండువాఁడు. ఇతఁడు ధర్మనిరతుఁడు. సత్యవ్రతుఁడు. ఇతఁ డెంత యత్నించినను ఆత్మావలోకనము చేసికొనుటకు సాధ్యము కాకుండెను. పద్మఁడను నాగరాజునడిగి తెలిసి కొనుమని యొక యతిథి చెప్పెను. భృగుఁ డతని కడకు వెళ్ళెను. పద్ముఁ డింటలేకపోవుటచే నతని కొఱకు నైమిశారణ్యమున భోజనములేకయే వేచి యుండెను. పద్ముఁడువచ్చి యితఁడు వచ్చినపని యేమని యడిగెను. పద్ముఁడు చూచిన విశేష ములను దెల్పుమనిభృగుఁడుకోరెను. 'సూర్యుఁడే శుష్కింపఁ జేయువాఁడును, సూర్యుఁడేయాహార మొసంగువాఁడు ననియును బలికి ఉంఛవృత్తి సూర్యునిఁజేరిన విధమును జెప్పెను; మఱియు నాయందు నీవును, నీయందు నేనును గలము. మనయందు సర్వలోకమును గలదు. నీవు నిశ్చింత భావమునొందుము' అని పద్ముఁడుచెప్పెను. సర్వ భూతములు నొక్కటియేయగుట విదితమయ్యెను. దాని నెఱుంగుటకే నీయొద్దకు వచ్చితినని భృగుఁడు చెప్పి వెడలెను. భార.

భృగుఁడు:-ఒక ముని. బ్రహ్మ హృదయమునుండి పుట్టినవాఁడు. హిరణ్యకశిపుని కూఁతురైన దివి యతని పెద్ద భార్య. ఆమెయం దీతనికిఁ గవి జన్మించెను. భృగుఁడు తన పుత్రికను దేవవర్ణిని విశ్వవోబ్రహ్మకిచ్చి వివాహముచేసెను.

ఒకప్పుడు దేవతలు రాక్షసులను దఱిమి వేయఁగా వారువచ్చి భృగుపత్నిని శరణుఁ జొచ్చిరి. వా రామె యాశ్రమంబునఁ జేరి దేవత లను ధిక్కరించుచుండుటచేత విష్ణువు తన చక్ర ముచే భృగుపత్నిని సంహరించెను. భృగునకుఁ గోపమును, దుఃఖమునువచ్చి నీవు మనుజుఁడవై యవతరించి భార్యావియోగదుఃఖము నొందెదవు అని శపించెను. విష్ణువు శ్రీరాముడుగా నవత రించి సీతావియోగదుఃఖము నొందును. రామా.

భృగువు కర్దమప్రజాపతి పుత్రికయైన ఖ్యాతిని వివాహమయ్యెను. ఆమెయం దీతనికి ధాత, విధాత అను పుత్రులు పుట్టిరి.

భృగువునకుఁ బులోమ యను వేఱొక భార్య కలదు; ఒకనాఁ డీమెను నగ్నిహో త్రునకు నప్పగించి విహరింపుమని యగ్ని గృహం బునకుఁ బంపి తా నభిషేచనార్థ మరిగెను. పులోముఁ డను రాక్షసుఁ డా యగ్నిగృహ మునకు వచ్చి యెవరీమె? యని యగ్ని నడి గెను. ఈమె భృగుపత్ని యని యగ్ని చెప్పెను. అంతఁ బులోముఁడు పందిరూపమై యామె నెత్తుకొనిపోయెను. ఆమెపుత్రుఁడగు చ్యవనుని

చూడ్కిచే రాక్షసుఁడు భస్మమయ్యెను. అగ్ని చెప్పుటచేతనే పులోముఁడు తన భార్య నెత్తుకొని పోయెనని భృగునకుఁ గోపమువచ్చి యగ్నిని సర్వభక్షకుఁడవు, క్రూరుఁడవు కమ్మని శపించెను.

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులలో నెవ్వరు ముక్తి నివ్వఁగలవారని మునులు కొందఱు వాదించుకొనిరి. దీనిని నిర్ధారణ చేయుటకు భృగువును బంపిరి. ఇతఁడు ముందుగ బ్రహ్మ దగ్గఱకు వెళ్ళెను. బ్రహ్మ కూర్చుండుమనక పూర్వమే యితఁడు కూర్చుండెను. దానిచే బ్రహ్మకుఁ గోపమువచ్చెను. నీవు రజోగుణ ప్రధానుఁడవు; నీకుఁ బూజ లేకపోవునుగాక యని భృగుఁడు బ్రహ్మను శపించి శివుని యొద్దకు వెళ్ళెను. ఆ సమయమున శివుఁడును, బార్వతియును క్రీడించుచుండిరి. చెప్పకుండ లోపలి కేలవచ్చితి? వని శివుఁ డితనిని గోపపడెను. నీవు తమోగుణప్రధానుఁడవు. నీ రూపమునకుఁ బూజలేకపోవుఁగాక యని భృగుఁడు శివుని శపించి విష్ణుమూర్తికడ కేగెను. భృగుని జూచుటతోడనే విష్ణువు తన వక్షస్స్థలమునుండి లక్ష్మిని దింపి లేచివచ్చి యా మునికి నమస్కరించెను. ఇతఁడు విష్ణుని దన్నెను. విష్ణువించుకేనియును గోపమూనలేదు. భృగుఁడు మరలివచ్చి విష్ణువే మోక్షమివ్వఁగలవాఁడని చెప్పెను. వేంక.

భృగువు:–ఒక ముని. తండ్రియగు వరుణునికడకుఁ బోయి బ్రహ్మము నెఱుంగుమార్గము చెప్పుమనెను. తండ్రివలన నన్నము బ్రహ్మమనియుఁ, బ్రాణము బ్రహ్మమనియుఁ, జక్షువులు బ్రహ్మమనియు, ఆనందము బ్రహ్మమనియు మొదలగు విషయములను నేర్చుకొనెను. ఐ. ఉ.

భృశాశ్వుఁడు:–ఒక ప్రజాపతి. దక్షునికుమార్తెలగు జయ, సుప్రభ అనువారలను బెండ్లియాడెను. ఒక్కొక్కరుఁ బదులు పదులఁ బుత్త్రులఁ బడసిరి. వారు అస్త్రములైరి. వానిని విశ్వామిత్త్రుఁడు పొందెను. రామా.

భృశాశ్వుఁడు:– విశ్వామిత్త్రునియొక్క యస్త్రగురువు. ఉ. రా.

భే

భేరుశేకుఁడు:– క్రోష్టువు వంశమువాఁడు. ఇతని కుమారుఁడు చిత్రరథుఁడు. భాగ.

భై

భైరవుఁడు:– శివునియందుండి పుట్టినవాఁడు. బ్రహ్మ యొక్క పంచమముఖము శివుని దూలనాడుచుండఁగా నితఁడు పుట్టి యా పంచమశిరమును ఖండించెను. బ్రహ్మహత్యాపాతకమును, బ్రహ్మకపాలము నితని కంటుకొనియెను. భైరవుఁడు కపాలమోక్షతీర్థమునకుఁ బోయి వానిని వదలించుకొనెను. భావి.

భైరవుఁడు తొలిజన్మంబున భృంగి. (చూడు భృంగి.)

భైరవులు:– గోలోకమందు శ్రీకృష్ణుని దక్షిణనేత్రమువలనఁ బుట్టినవారు. వీరు త్రినేత్రులు. దిగంబరులు. చంద్రశేఖరులు.

వీరు రురువు, సంహారుఁడు, కాలుఁడు, అసితుఁడు, క్రోధుఁడు, భీషణుఁడు, మహాభైరవుఁడు, ఖట్వాంగుఁడు. బ్ర. వై.

భౌ

భౌమాదిత్యుఁడు:– ఒక రాజర్షి. ఇతనిచే నిహితమైన సకలశత్రుఘాతినియైన గదను మయుఁడు భీముని కిచ్చెను. భార.

భ్ర

భ్రమి:– శింశుమారుఁ డను రాజు యొక్క కూఁతురు. ధ్రువునిభార్య. ఈమెకుఁ గల్పుఁడు, వత్సరుఁడు అను కుమారులు పుట్టిరి. భాగ.

మ

మంకణుఁడు:- ఒక ఋషి. ఇతనివ్రేలు దర్భ గంటికిఁ దగిలి యందుండి శాకరసము కారెను. దానినిజూచి (యది తన తపోమహిమంబువలననే యయ్యెననుకొని హర్షించి) యతఁడు నాట్యము చేసెను. మునులు హరునికడకుఁ జని మంకణుని నృత్యమాపుమని కోరిరి. శంభుఁ డితనికడకు మునిరూపమున వచ్చి నీవేల నాట్యము చేయుచుంటి? వని యడిగెను. (నాచేతినుండి తగులుట చేతనే) దీనినుండి శాకరసము కారుచున్నది; అద్దానిని జూచి విస్మయంబంది యాడుచుంటినని మంకణుఁడు చెప్పెను. అంత మంకణుఁడు చూచుచుండఁగనే హరుఁడు తనయంగము వ్రేలఁతో గీరెను. అందుండి బంగారువంటి భస్మము వెడలెను. మంకణుఁ డద్దానిని జూచి నాకంటె నీవు ఘనుఁడవు. నీవు పరమేశ్వరుఁడవే కానోపుదువు. నా తపోవృద్ధి సేయుమని మంకణుఁడు శివునివేడి తన నృత్యమును మానెను. ఆ చోటు ప్రణవతీర్థమయ్యెను. భార.

ఒకవనిత విసర్జితవస్త్రయై జలకము లాడుచుండఁగా మంకణుఁడు చూచెను. చూచుటతోడనే యతనికి రేతఃపతన మయ్యెను. మంకణుఁడు దానిని భద్రముచేసెను. అందుండి యేడ్గురుపురుషులు జన్మించిరి; వీరే మరుద్గణమునకు సంజనన కారణులైరి.

మంకి:- ఒక బ్రాహ్మణుఁడు; కామము వదలి మోక్షసుఖము నొందఁగలిగెను. భార.

మంకి:- ధనార్జనయందాశగలిగి రెండు గిత్తలను గొని వానికి లంకెవేసి యుంచెను. అవి యాలంకెతోడనే పాఱిపోయినవి. వాని కొకయేనుఁగు అడ్డము రాఁగా వానికి వేసినలంకె వానికి ఉరివలెనై యవి చచ్చినవి. వానిని మంకిచూచి తన కగు దుఃఖ మంతయును గామమువలననే కలుగుచున్నదని యోచించి కామమును విడిచెను. భార.

మంథర:-కైకేయి దాసి. రామునకుఁ పట్టాభిషేకము కట్టఁబోవుచున్నట్లు విని కైకదగ్గఱకుఁ బోయి, "ఓరాణీ! నీ సవతిపుత్త్రుఁడగు రామునకు నీ భర్త యువరాజ్యపట్టాభిషేకము చేయుచున్నాఁడు. రాముఁడు రాజైనచో నీవు కౌసల్యకు దాసివి కావలసివచ్చును. నీవు సంతోషముతో నూరకుండెదవేల?" యని చెప్పుచు వచ్చినను కైక యీమెవాక్యములను నిరాకరించి రామునిపై నీర్ష్య లేకుండనే యుండెను. కాని మంథర ఈమెను విడువక "కైకా! నామాటవినుము. ముందు నీకేమి కావలయునో, భరతునిగతి యెట్టిదో నీవు తలఁచుటలేదు. రాముఁడు రాజ్య మేలుచుండఁగా భరతుఁడు చేతులొగ్గి వానికనుసన్నల మెలఁగుచుండవలయునా? ఇఁక నీవీ గౌరవముతో నగరమున నుండగలవా? నా చెప్పినది వినుము. నీ మేలుకొఱకై చెప్పుచుంటిని. వెనుక దశరథుఁడు నీకు రెండువరము లిచ్చెనంటివి. ఆ వరములు వేఁడుట కిదియే సమయము. రాముని బదునాలుగేండ్లు వనవాసమునకుఁ బంపుమనుము. భరతునకుఁ బట్టము కట్టుమనుము" అని బోధించి కైకను దనవశముచేసికొనియెను. తుదకుఁ గైక యట్లు కోరెను. రామా.

మంథర పూర్వభవంబున దుందుభి యను గంధర్వకాంత. పరమేష్ఠియానతిచొప్పున దేవకార్యము నిర్వహించుట కిట్లు పుట్టెను. భార.

మందపాలుఁడు:-ఒకముని. చిరకాలము బ్రహ్మచర్యము నిష్ఠతో జరిపి యోగాభ్యాసవశమున దేహమునువిడచెను. కానిపుణ్యలోకములోఁ బ్రవేశింపలేకపోయెను. నేనింత తపముచేసియుంటిని. పుణ్యలోకముల నేల చేరలేకుంటి? నని యతఁడు దేవతల నడిగెను. "ఎంత తపస్సుచేసినను సంతానవంతులుగాక బుణ్యలోకములు పొంద శక్యము కా"దని దేవతలు చెప్పిరి. కావున నచిరకాలములో సంతానము వడయఁదలఁచి మందపాలుఁడు పక్షులందు సంతానము త్వరగాఁ గలుటఁజూచి తానును బక్షియై జరిత యను పక్షితో రమించెను. వానికి జరితారి, సారసృక్వ, అ స్తంబమిత్త్రుఁడు, ద్రోణుఁడు అను పుత్త్రులుగల్గిరి. వీరిని, జరితను ఖాండవ వనమునందుంచి మందపాలుఁడు తన పూర్వపు భార్యయైన లపితతో రమించుచుండెను. ఖాండవవనమును దహించుట కగ్నిదేవుఁడు వచ్చుటను జూచి వానిని స్తుతియించి తన

భార్యను, పుత్త్రులను రక్షింపుమని వేఁడెను. అగ్నిదేవుఁ డా పక్షులున్న వృక్షము కాల్పకుండ మిగిల్చెను. ఈ సంతాన మేమయ్యెనో యని భయపడివచ్చి వీరు సజీవులై యుండుట చూచి సంతోషించి మందపాలుఁడు నిజేచ్ఛ వరిగెను. భార.

మందప్రజ్ఞుఁడు:- ఋశుపర్ణునింటనుండిన బాహుకుఁడు భార్యావియోగమునకై విలపించుచుండ నీవుఁ డేల విలపించుచున్నా? వని యడుగఁగా మందప్రజ్ఞుఁడను భటుఁ డట్లు విలపించెననియు, దానిని తా ననుసరించు చున్నాననియును జెప్పెను. భార.

మందరము:-ఒకపర్వతము. ఇది క్షీరసాగర మథనమందుఁ గవ్వముగా నుపయోగింపఁబడినది. పట్టుజారి సముద్రములో దిగఁబడినపుడు నారాయణుఁడు కూర్మరూపమై దీనిని లేవనెత్తెను. భాగ.

మందరుఁడు:-ఒక బ్రాహ్మణుఁడు. పూర్వజన్మమున అజామిళుఁడు సదా స్త్రీలోలుఁడై వేశ్యాలంపటుఁడై యుండువాఁడు. వీనిగృహమునకు ఋషభయోగి యను మహానుభావుఁడు రాఁగా వానికి సేవచేసెను. తరువాతిజన్మమున వజ్రబాహుని కుమారుఁడు భద్రాయువుగా జన్మించెను. వానిభార్య వేశ్యయను పింగళ కీర్తిమాలినిగా జన్మించెను. బ్రహ్మో.

మందుఁడు:-చ్యవనుఁడు చేసిన హోమగుండము నుండిపుట్టిన రాక్షసుఁడు. అశ్వినులకు హవిర్భాగము లిప్పించెదనని చ్యవనుఁడు చెప్పఁగా నింద్రుఁడు చ్యవనుని గొట్టుటకై వజ్రాయుధ మెత్తెను. ఇంద్రుని సంహరించుటకై చ్యవనుఁడు వీనినిఁ బుట్టించెను. మందుఁడు సురలను గబళింపఁ బోయెను. వానినిఁజూచి యింద్రుఁడు భయపడి చ్యవనుని శరణువేఁడెను. భార.

మందుఁడు:-సుగ్రీవుని మంత్రి.

మందుఁడు:-(మైందుఁడు) వీని సోదరుఁడు ద్వివిదుఁడు.

మందోదరి:-మయునికుమార్తె. ఈమెతల్లి హేమ అను దేవకన్యక. మందోదరి తండ్రితో నరణ్యములో విహరించుచుండఁగా వేఁటకు వచ్చిన రావణుఁ డీమెనుజూచి మోహించెను. రావణుఁడు వీనినిఁజేరి కుశలప్రశ్నముచేసి తాను లంకేశ్వరుఁడ ననియును, నింకను వివాహము లేనివాఁడననియుఁ దెల్పెను. మయుఁడు మందోదరిని నీతనికిచ్చి వివాహము చేసెను. ఈమెకింద్రజిత్తు మొదలగు కుమారులు పుట్టిరి. మందోదరి మహాపతివ్రతలలో నొక్కతె.

మందోదరి:-రావణుఁడు మునులను జయింపగోరి తన విజయసూచకముగా వారలరక్త మించుక యిమ్మని యా మునులరక్తము నొక భాండములోఁ బెట్టెను. కృత్స్నమదుఁడను ముని, కుమార్తెను గోరి క్రతువుచేయుచు నొక భాండమునఁ బాలుపోసి దర్భలచే మంత్రించి యుంచెను. ఆ భాండము రావణునకు జిక్కెను. ఆ పాలయందు రక్తముకలిపి మందోదరికిచ్చి "ఇది విషము, దాచియుంచు"మని చెప్పెను. రావణుఁడు తన ననాదరణచేసి యితరకాంతలను గోరుచున్నాఁడను దుఃఖముచేత బ్రాణమును బోఁగొట్టుకొనఁ దలఁచి దాని కుపాయముగ "ఆ విషమును ద్రావవచ్చు"నని యా క్షీర మిశ్రిత రక్తమును ద్రావెను. దాన నామెకు గర్భమయ్యె. ఆ వార్త పతికిదెల్పుటకు వెఱచి తీర్థయాత్రకుఁబోయెదనని నెపమిడి పుట్టినింటి కేగి ప్రసవించి యా బాలికను బంగారుపెట్టెయందుంచి భూమిలోఁబెట్టి తాను సరస్వతీనదిలో స్నానముచేసి వచ్చెను.

జనకుఁడు భూమిని దున్నుచుండఁగా నీమె దొరకెను. అద్భుత రామాయణము.

రావణుఁడు యుద్ధము చేయఁబోవునపుడు మందోదరి "సంధిప్రయత్నములనే చేయుము. యుద్ధము మాను" మని బోధించెనుగాని రావణుఁడు వినలేదు. యుద్ధములో నింద్రజిత్తు మరణించినపిదపఁ గూడ సీతను రామునకిచ్చి వానిని బ్రతిమాలుకొనుమనియును, రాముఁడు విష్ణుమూర్తియే యనియును జెప్పెను.

రామునిజయించుటకై రావణుఁడు హోమము చేయుచుండఁగా హోమభంగము చేయుటకై

యంగదుఁ డీమె జుట్టుపట్టుకొని రావణు నెదుటకు లాగికొనివచ్చెను. అంత రావణుఁడు హోమముమాని యీమెను విడిపించెను. రామా.

మందోదరి:- సింహళదేశమునందలి చంద్రసేనుఁడను రాజుయొక్క కుమారితె. ఈమెను పెండ్లి వయస్సు వచ్చినతరువాత నాంధ్రదేశపు రాజైన కంబుగ్రీవున కిచ్చి వివాహము చేయఁదలంచెను. ఈమె తాను వివాహమగుటకు నిరాకరించెను. పదపడి కోసలదేశపురాజైన వీరసేనుఁ డుద్యానవనములో నీమెను జూచి వివాహము చేసికొనఁ గోరెను. ఈమె పెండ్లిచేసికొన ననియును, దానివలన నొకరికి లొంగియుండవలసి వచ్చుననియును జెప్పి వివాహమగుటకు నిరాకరించెను. ఈమె చెలియలు చంద్రమతి యొక రాజును వివాహమయ్యెను. పిదప నీమెకును వివాహమగుటకుఁ గోరికపుట్టి మద్రదేశాధీశ్వరునిఁ బరిణయ మయ్యెను. అతఁ డామెను దననగరమునకుఁ గొనిపోయెను. కొన్ని దినములైన పిదప నతఁడు తన దాసితోఁ గూడి యుండుటవిని విచారించి భర్తకడ నుండనొల్లక యుభయభ్రష్టనైతి ననుకొని విచారించెను. దే. భా.

మకరధ్వజుఁడు:-చంద్రహాసుని కుమారుఁడు. జై. భా.

మకరాక్షుఁడు:-ఖరుని కుమారుఁడు. రామరావణయుద్ధమందు రామునిచేఁ జంపబడెను.

మణికర్ణిక:- కాశీపట్టణమందలి యొక కోనేఱు. దీనిని విష్ణుమూర్తి చక్రములోఁ ద్రవ్వెను. ఆ శ్రమచేఁ దనకుఁగల్గినచెమటచే దానినినింపి దానియొద్దనుఁ గూర్చుండి శివునిని గూర్చి తపస్సు చేసెను. శివుఁడు ప్రత్యక్షమై యా పుష్కరిణిని జూచి మెచ్చుకొని వంగి యా జలమును జూచుచుండెను. అంత నతని దక్షిణ కర్ణమందలి భూషణముజారి యా కొలనులోఁ బడెను. అందుచే దానికి 'మణికర్ణిక' యను పేరువచ్చెను. ఇదియును గంగానదివలెఁ బుణ్యతీర్థ మగునని శివుఁడనుగ్రహించెను. కాశీ.

మణిగ్రీవుఁడు:- కుబేరుని పుత్త్రుఁడు. (చూడుము నలకూబరుఁడు)

మణినాగుఁడు:-శేషుని కుమారుఁడు. ఇతఁడు శివుని బ్రార్థించి గరుడునివలన భయములేకుండునట్లు వరము పొందెను. ఇతఁ డొకనాఁడు విహరించు చుండఁగా గరుత్మంతుఁడు వచ్చి వీనిని నోటఁ గఱచుకొని పోయెను. అపుడు మణినాగుఁడు శివునిఁ బ్రార్థించెను. శివుఁడు నందినిబంపెను. నంది విష్ణుమూర్తితోఁ జెప్పెను. అతఁడు వీనిని విడిపించెను. బ్రహ్మ.

మణిపుష్పకము:-సహదేవుని శంఖము.

మణిపూరు:-చిత్రవాహనుని నగరము; తీర్థయాత్రలు చేయుచు నర్జునుఁ డిటకు వచ్చెను.

మణిమంతుఁడు:- ఒక యక్షుఁడు. కుబేరుని మిత్త్రుఁడు. ఇతఁడు కుబేరునితోఁ బుష్పకమెక్కి తిరుగుచు నుమిసిన నది యగస్త్యునిపైఁ బడెను. నీవు నరునిచేత మృతినొందుదువని యతఁడు వీనిని శపించెను.

పాండవులు శ్వేతకీనదీతీరమునఁ బోవుచుండఁగా ద్రౌపది పంచవర్ణముల పుష్పములను జూచి వానినిదెమ్మనికోరెను. భీముఁడు వానిని గొనివచ్చుటకై వెళ్ళెను. పుష్పములను గోయరాదని మణిమంతుఁడు భీముని నడ్డుపెట్టెను. కాని భీముఁడు వీనితోఁ బోరిచంపెను. పుష్పములను దెచ్చెను. భార.

మణిమతిపురము:-వాతాపి ఇల్వలుల నగరము. భార.

మణివక్త్రుఁడు:-అపుఁడను వసువు కుమారుఁడు. మత్స్య.

మణివాహనుఁడు:-ఉపరిచరవసువు కుమారుఁడు. భార.

మతంగముని:-ప్రసన్నుని తండ్రి. ధర్మవ్యాధుని వియ్యంకుఁడు.

మతంగుఁడు:-ఒక సంగీతశాస్త్రకర్త.

మతంగుఁడు:- ఋష్యమూకపర్వతముపైఁ దపస్సు చేసికొనిన యొకముని. వాలి దుందుభినిజంపి యాతని శరీరమెగురవేయఁగా రక్తము చిమ్మి మతంగునిపైఁ బడెను. ఈ మునికిఁ గోపము వచ్చి వాలి యా పర్వతముమీదకు వచ్చునెడల మృతుఁడగునుగాక యని శపించెను. రామా

మతంగుఁడు:-ఒక బ్రాహ్మణుని కుమారుఁడు. యజ్ఞమునకై కావలసిన కొన్ని పదార్థములు తెచ్చుటకై తండ్రి వీనినిబంపెను. ఇతఁడు వెళ్ళుచు మార్గమందున్న యొక గాడిదపిల్లను నిష్కారణముగఁ గొట్టెను. ఆ పిల్ల తల్లితోఁ దనను బ్రాహ్మణబాలుఁడు కొట్టెనని చెప్పెను. "వాఁడు చండాలుఁడు; వాని ప్రచండస్వభావ మెక్కడికిఁ బోవును?" అని గార్దభమాత యనియెను. మతంగునకు వానిభాష తెలియును. ఈ మాట విని గాడిదదగ్గరకుఁ బోయి "నేను బ్రాహ్మణుఁడనుగద! ఏల యిట్లంటి" వని యడిగెను. "నీవు నీజననియందు మంగలివలనఁబుట్టితివి కావున నిట్లంటి"నని యా గాడిద చెప్పెను. మతంగుఁడింటికి మరలివచ్చి తండ్రి కా వృత్తాంతమునుచెప్పి, బ్రాహ్మణత్వము పొందుటకై తపస్సుచేయ వెడలెను. మతంగుఁడు నిశ్చల భక్తితోఁ దపస్సుచేసెను. ఇంద్రుఁడు ప్రత్యక్షమై వరమును వేఁడుకొనుమనియెను. మతంగుఁడు బ్రాహ్మణత్వమును గోరెను. నీకది రాదు. మఱియొక వరము వేఁడుకొమ్మని యింద్రుఁడు చెప్పెను. ఇతరవరము లక్కఱలేదని మతంగుఁడు పలికెను. వరమీయకుండనే యింద్రుఁడు వెళ్ళిపోయెను. మతంగుఁడు నిలుచుండి నూఱేండ్లు తపస్సుచేసెను. ఇంద్రుఁడు మఱలఁ బ్రత్యక్షమయ్యెను. అప్పుడును మతంగుఁడు బ్రాహ్మణత్వమే కోరెను.

బ్రాహ్మణత్వము కడుదుర్లభము. ఇట్లు తపమునకుఁ బది మడుంగులుచేసి చండాలుఁడు శూద్రుండగును. దానికి నూఱురెట్లు చేసి శూద్రుఁడు వైశ్యుఁడగును. అని యీతీరునఁ జెప్పెనుగాని యింద్రుఁ డీయలేదు. ఈ సారి మతంగుఁడు బొటనవ్రేలిమీఁద నిలుచుండి నూఱేండ్లు తపస్సుచేసెను. ఇంద్రుఁడు మరల వచ్చి నీవెంతతపస్సుచేసినను బ్రాహ్మణత్వము నీకు రాదు. నీకు వరమిచ్చెదను. పుచ్చుకొమ్ము. నీవు చండదేవుఁడవని ప్రశస్తి వహించి కామరూపివై సుస్త్రీలచేఁత బూజింపఁబడుచుందువు. అని యింద్రుఁడు ప్రసాదించి చనియెను.

మతి:-ధరణీదక్షుల కుమారిత. ఈమెను ధర్ముఁడను మనువు వివాహమయ్యెను. భార.

మతినారుఁడు:- ఋక్షుని పుత్త్రుఁడు. ఇతఁడు పండ్రెండు సంవత్సరములు సరస్వతీ నదీతీరమునఁ గూర్చుండి తపస్సుచేయఁగా నానది యనురక్తయై యితనిని భర్తగాఁ గోరెను. మతినారున కీమె యందుఁ ద్రసుఁ డను కుమారుఁడు జన్మించెను. భాగ.

మత్స్యగంధి:- యమునానదియందున్న యొక్క మీనము గర్భమున నుపరిచరవసువు వీర్యమువలన జన్మించిన బాల (పూర్వ అద్రిక). యమునానది యందు జాలరియొకఁడు వలను వేయఁగా నందొకచేఁప చిక్కెను. దాని యుదరము చీల్చఁగా నం దీమె లభించెను. వాఁ డీ కన్యకను దాశరాజునకుఁ గానుకగా నిచ్చెను. దాశరాజు చేతనే యీమె పెంపఁబడుచు యమునానది యందు నోడ నడుపుచుండెడిది. తీర్థయాత్రకుఁ జనుచు నచ్చటికి వచ్చిన పరాశరుఁ డీమెను జూచి మోహించెను. పితృదత్తనుగానిదే యూతని కోర్కె తీర్చుటకు సందేహించుచు మునిని దిరస్కరించుటకు వెఱచుచుండిన యీమెకుఁ గన్యాత్వము దూషితముగాకుండ ముని వరమిచ్చి యీమెతో సంయోగము నొందెను. పరాశరుని వలన వ్యాసుఁ డీమెకు జన్మించెను. ఈమె శరీర సౌగంధ్యము యోజనములవఱకు వ్యాపించునట్లు పరాశరుఁడు వరమిచ్చెను. కావున నీమెకు యోజనగంధి, గంధవతి అను పేరులు వచ్చెను.

ఈమెకు సత్యవతి యను పేరుకూడఁ గలదు. ఒకనాఁ డీమె యమునానదీతీరమున నుండఁగా శంతనుఁడను రాజుచూచి మోహించి నీ వెవ్వరిదాన? వని యడిగెను. నేను దాశరాజు కూఁతురను. పితృదత్తగానిదే పురుషుని వరియింపఁ జాలనని యీమె చెప్పెను. శంతనుఁడు దాశరాజుకడకుఁ బోయి సత్యవతిని దన కిమ్మని వేఁడెను. ఈమెకుఁ బుట్టినకుమారునే రాజ్యాభిషిక్తునిఁ జేసెదనని ప్రతిజ్ఞ చేసితివేని యిత్తునని దాశరాజు పలుకఁగా శంతనుఁడు తన కుమారుఁడగు భీష్మునిఁ దలఁచుకొని యట్లు శపథము చేయఁజాలక మనోవేదనతో విచారించుచుండెను. అట్లు ఖిన్నతనము వహించిన తండ్రినిజూచి భీష్ముఁడు కారణముతెలిసికొని తాను రాజ్యమపేక్షింప ననియును, వివాహము చేసికొనననియును దాశరాజుకడ శపథము

చేసెను. దానిపై దాశరాజు సత్యవతిని శంతనునకిచ్చి వివాహము చేసెను. ఆమెకుఁ జిత్రాంగద, విచిత్రవీర్యులను పుత్రులు కలిగిరి. చిత్రాంగదుఁ డవివాహితుఁడుగఁ జనిపోయెను. విచిత్రవీర్యుఁడు సంతానమును బడయకుండఁగను జనిపోయెను. వీరిభార్యలైన అంబిక, అంబాలికల యందుఁ బుత్రులను బడయుమని యీమె భీష్ముని గోరెను గాని యతఁడు తనవ్రతము తప్పననియెను. శంతనుని వంశము నిర్మూలము గాకుండుటకై సత్యవతి వ్యాసుని రప్పించి, వంశనాశనము కాకుండ క్షేత్రజులఁ బడయుట పూర్వాచారమని కోడండ్రనుఒప్పించి వ్యాసుని వలనఁ బుత్రులను బడయుటకు అంబిక, అంబాలికలను నియోగించెను. వారికి ధృతరాష్ట్ర పాండురాజులు జన్మించిరి.

కొంతకాలమైన పిదప సత్యవతి, ధృతరాష్ట్రుని పుత్రులు దుర్మార్గులును, వంశనాశనకరులును నగుదురని వ్యాసునివలన విని నగరమును విడిచి తపస్సుచేసికొనుటకై అంబికా అంబాలికలతో గానముల కేగెను. భార.

మత్స్యగంధి పూర్వజన్మమున అచ్ఛోదము. (చూడు అచ్ఛోదను) బ్ర. వై.

మత్స్యములు:- శాపము. అద్భుత నాముఁడను అగ్ని యింద్రాదిదేవతలకు హవిస్సును మోసి మోసి యా పని యథర్వుఁడనువాని కప్పగించి తాను సముద్రములో దాగెను. వీనికై దేవతలు వెదుకఁజొచ్చిరి. మత్స్యములు ఈ యగ్ని జలనిధిలో దాగియుండుటను దెల్పెను. ఇతనికిఁ గోపమువచ్చి "జనులు నిర్దయులై మిమ్ము వధింతురుగాక" యని శపించెను. భార.

మత్స్యరాజు:- యమునానదియందున్న యొక మీనను గర్భమున నుపరిచిర వసువు వీర్యము వలన జన్మించినవాఁడు. జాలరులు నదిలో వల వేయఁగ నితఁడును, వీనితోఁబుట్టువు మత్స్యగంధియును మత్స్యగర్భమున దొరకిరి. జాలరులు వీరిని దాశరాజునకుఁ గానుకగా నిచ్చిరి. ఇతఁడు మత్స్యదేశమున కధిపతి యయ్యెను. భార.

మత్స్యావతారము:- ద్రవిడ దేశపు రాజైన సత్యవ్రతుఁడు కృతమాలిక యొడ్డున జలతర్పణము సేయుచుండఁగా మత్స్యమొకటి యాతని దోసిటఁ బడెను.

వైవస్వతమనువు అర్ఘ్య మిచ్చుచుండఁగా మత్స్యమొకటి అతని దోసిటఁ బడెను. అదినన్ను రక్షింపుము రక్షింపుమని వేఁడెను. రాజు మత్స్యమును భాండమునందుంచెను. మఱునాఁటి యుదయమున కామత్స్యము పదునారంగుళములు పెరిఁగెను. నన్ను రక్షింపుమని తిరిగి మత్స్యము ప్రార్థించిన దానిని నూతిలో వైచెను. ఆ మఱునాఁటికి మత్స్యము పెరిఁగి నూయి పట్టకున్న దానిని దీసి చెఱువునందుంచెను. ఆమఱునాఁటికి మత్స్యము మిక్కుటముగఁ బెరిఁగెను. చెఱువు కూడఁ జాలకపోయెను. అది మరలఁ దనను గాపాడుమని మొఱలిడెను. మనువు దానినిఁ జెఱువునుండి తీసి సముద్రములో నుంచెను. ఈ మత్స్య మిట్లు విపరీతముగాఁ బెరుఁగుటను జూచి రాజు మిక్కిలి వెఱఁగుపడి నీవు రాక్షసుఁడవా? ఈశ్వరుఁడవా? నీచరిత్ర విచిత్రముగనున్నది. నీవెవ్వర వని యడిగెను. మత్స్యము తాను జనార్దనుఁడననియును, నేఁటి నూఱేండ్లలో ప్రళయము రానున్నదనియును, అపుడు మహాసత్వములను, వేదములను నొక నావయందుంచి తన శృంగమునకుఁ గట్టుమనియును జెప్పి వాని కొక నావనిచ్చి యదృశ్యమయిపోయెను. ప్రళయము వచ్చినపుడు మనువు సర్వపదార్థ సత్వములను స్వీకరించి మత్స్యము చెప్పినట్లు చేసెను. ప్రళయాంతమున నావయందుండిన సత్వముల నుండియే తిరిగి ప్రపంచమును, సర్వపదార్థములును నేర్పడినవి.

హయగ్రీవుఁడను (సోమకాసురుఁడను) దనుజుఁడు చతుర్వేదంబులనపహరించి సముద్రమున దాఁగియుండెను. విష్ణువుమత్స్యరూపుఁడై యవతరించి యసురునిసంహరించి వేదముల నుద్ధరించెను. మత్స్య. భాగ.

మదనరేఖ:- శృంగార శేఖరుని దండనాయకుఁడగు వీరవర్ముఁడను శూద్రుఁడు కలఁడు. అతని కుమారిత మదనరేఖ. ఈమె చంద్రగుప్తుఁడను బ్రాహ్మణుని వలచి వివాహమయ్యెను. ఈమె కుమారుఁడు భర్తృహరి. విక్ర. చ.

మదనిక:- విద్యుద్రూపుఁడను దనుజుని భార్య. ఇతనిని కందరుఁడను పక్షి సంహరింపఁగా మదనిక పక్షియై కందరునకు భార్యయయ్యెను. ఈమెకుఁ దార్క్షి జన్మించెను. మార్క.

మదనుఁడు:- దుష్టబుద్ధికుమారుఁడు. ఇతని సోదరి విషయ. తండ్రి వ్రాసిన యుత్తరము చూచుకొని విషయను జంద్రహాసుని కిచ్చి వివాహము చేసెను. చంద్రహాసుఁడు చండికగుడికిఁ బోవ నుద్యుక్తుఁడై యుండఁగా రాజు కబురుపంపెను. చంద్రహాసుని రాజసభకుఁ బంపి మదనుఁడు చండికగుడికి వెళ్ళెను.

చంద్రహాసుని వధించుటకై దుష్టబుద్ధిచే నుంచఁబడిన తలవరులు మదనుఁడు గుడిలోనికి వెళ్ళఁగానే నితఁడే చంద్రహాసుఁడని తలఁచి వీనిని సంహరించిరి. తరువాతఁ జంద్రహాసుఁడు వచ్చి చండికను బ్రార్థించి యామె ప్రత్యక్షము కాఁగా మదనుని బ్రతికింపుమని కోరెను.

జై. భా.

మదయంతి:- కల్మాషపాదుని భార్య. ఈమె యశుచిగ నుండినవారికిఁ గనఁబడదు. ఈమెనడిగి యామె కుండలములను దెమ్మని గౌతముఁడు తన శిష్యుఁడగు నుదంకుని బంపెను. ఉదంకుఁడు కల్మాషపాదు నొద్దనుండి యానవాలు తెచ్చి యామె కిచ్చెను. ఈమె యుదంకునకుఁ గుండలము లిచ్చెను. కల్మాషపాదుఁడు సతీసంగమము నొందినపుడు మరణమునొందునని శాపముగలదు. కావున నతఁడు భార్యను వసిష్ఠునివలనఁ బుత్త్రునిఁ బడయుమని నియోగించెను. మదయంతి గర్భవతియై యే డేండ్లు గర్భమును దాల్చెను. అప్పటికిని బ్రసవింపకుండుటచే నామె అశ్మముతో (ఱాతితో) గర్భతాడనము చేసికొనియెను. వసిష్ఠుఁడు వాడియగు అశ్మంబున గర్భంబును జీరెను. ఆమెకుఁ బుత్త్రుఁడు జన్మించెను. అతనికి అశ్మకుఁడను పేరుపెట్టిరి.

మదయంతి:- మిత్త్రసహునిభార్య. (చూడుము మిత్త్రసహుఁడు) వసిష్ఠుఁడు దనుజుఁడవు కమ్మని మిత్త్రసహునకు శాపమివ్వఁగా నితఁడు ప్రతిశాప మియ్యఁదలఁచి జలమును దోసిటఁ బోసికొని మంత్రించెను. గురునకుఁ బ్రతిశాపమిచ్చుట తగదని యామె వారించెను. భాగ.

మదయంతి:-సృంజయుని కుమారిత. ఈ రాజగృహమునకు వచ్చియుండిన పర్వతనారదుల సేవకుఁ దండ్రి యామెను నియమించెను. ఈమెపై నారదునకును, నారదునిపై నీమెకును బ్రేమకలిగెను. పర్వతుఁ డది యెఱింగి నారదుఁడు తనను వంచించె ననుకొని నారదుని మోము కోతిముఖమగునట్లు శపించెను. నారదుఁడు వానికి స్వర్గలోకగమనము లేకుండునట్లు ప్రతిశాప మిచ్చెను. నారదుఁ డచ్చటనే యుండెను. మదాలసకుఁ బెండ్లిచేయ సృంజయుఁడు సంకల్పించెను. ఈమె నారదునే వివాహమగుదు ననెను. తండ్రి కిష్టములేకుండెను. కాని, తల్లి కూఁతుని కోరికప్రకారము చేయుమనియెను. నారదునకిచ్చి వివాహము చేసిరి. మఱలఁ బర్వతుఁడువచ్చి వాని ముఖము పూర్వమువలె నుండునట్లు అనుగ్రహించెను.

దే. భా.

మదాలస:-చంపుఁడను (చంపకుఁడను) విద్యాధరుని భార్య. దే. భా.

మదాలస:- విశ్వావసుఁడను గంధర్వరాజు కూఁతురు; మిక్కిలి సౌందర్యవతి. ఈమెను పాతాళగతుఁ డను దనుజుఁ డపహరించి యొక బిలమునందు దాఁచెను. ఈమె రాక్షసునిచేఁ జిక్కియుండుట సహింపలేక ప్రాణత్యాగము చేయ యత్నించెనుగాని యంతలో రాక్షసుఁ డీమెకు భర్త కాఁడనియును, నారాక్షసుని వధించుటకు వచ్చు రాజకుమారుఁడే భర్తయగు ననియును సురభి పలికెను. ఆ మాటలువిని మదాలస ధైర్యము తెచ్చుకొనియుండెను. కొంతకాలమునకుఁ బాతాళకేతుని సంహరించుటకై కువలయాశ్వుఁడు వానిని వెంటఁ దగిలెను. పాతాళకేతుఁడు వరాహరూపమై యా బిలము ప్రవేశించెను. కువలయాశ్వుఁడుకూడ నందుఁ జొచ్చెను. అచ్చట మదాలసను, ఆమె చెలికత్తెయగు కుండలనుజూచి వారి రూపములకు విస్మయ మందెను. మదాలసను జూచి కువలయాశ్వుఁడు మోహించెను. ఆమెయు నితనిని వలచెను; మదాలస యతనిని వివాహము గాఁగోరియుండుట కుండల దెల్పెను. కువలయాశ్వుఁడు పాతాళకేతుని సంహరించి మదాలసను బరిణయమై నిజనగరమున కేతెంచి సుఖంబుగా నుండెను.

పిమ్మట నచిరకాలములోనే కువలయాశ్వుఁడు జనపద సంరక్షణార్థము తిరుగుచు నగరమును విడిచియున్నపుడు మునియాకృతిని నున్న దనుజుఁడు (తాళకేతుఁడు) కువల

యాశ్వ నగరమునకు వచ్చి కువలయాశ్వుఁడు హతుఁ డయ్యెనని చెప్పి వాని కంఠమునందుండు మాలను నిచ్చెను; కువలయాశ్వుని కంఠమాల గుర్తించి యీ మునివాక్యములను నమ్మి భర్త చనిపోయినాఁడని విచారించి మదాలస తాను ప్రాణములు విడచెను. కొన్ని దినములలో కువలయాశ్వుఁడు గృహమున కేతెంచి దనుజ మాయవలన మదాలస ప్రాణములు వీడుట యెఱింగి దుఃఖముతో విరాగియై యుండెను. ఇతని దుఃఖము వాపి ముదము చేకూర్చుటకై యశ్వతరుఁడను పేరుగలిగిన నాగేంద్రుఁడు శివుని మెప్పించి వానివలన మదాలస పూర్వ జ్ఞానముతోడను, బూర్వరూపముతోడను తనకు బుట్టునట్లును వరము నొందెను. మదాలస యశ్వ తరుని మధ్యఫణమునుండి మరల జన్మించెను. నాగేంద్రుఁ డపుడు గువలయాశ్వుని రావించి యితనికి మదాలస నిచ్చెను. కువలయాశ్వుఁ డామెను బరిగ్రహించి నిజనగరమునకేగి తొంటి యట్లు సుఖంబుననుండి రాజ్యమేలెను. వారికి విక్రాంతుఁడును, సుబాహువు, శత్రుమర్దనుఁడు, అలర్కుఁడు, అను కుమారులు కల్గిరి. మదాలస కుమారులకు ధర్మములను, బ్రహ్మజ్ఞానమును బోధించెను. మార్క.

మధుకైటభులు:-విష్ణువు నీరముపై శయనించి యుండఁగా నతని నాభినుండి బ్రహ్మయును, గర్ణముఃనుండి మధుకైటభులును బుట్టిరి. మధుకైటభులు తమ జన్మస్థానము నెఱుఁగలేక యెక్కడినుండి వచ్చితిమి? యని తర్కించుకొని శక్తివలనఁ బుట్టినట్లు తలఁచి యామెను బ్రార్థించిరి. శక్తిప్రసాదమునవారు బలసమన్వితులై గర్వించి బ్రహ్మను బాధపెట్టుచు మాట మాటకు మాతో యుద్ధమునకురమ్మని బ్రహ్మను బిలుచుచుండిరి. బ్రహ్మ వీరికి భయపడి తనను గాపాడుమని విష్ణుమూర్తిని బ్రార్థించెను. విష్ణువు నిద్రమేల్కాంచక యుండుటచే బ్రహ్మ యోగ నిద్రనుబ్రార్థించి విష్ణువును విడచి యామెను దొలఁగిపొమ్మనికోరెను. యోగనిద్రవెడలగానే విష్ణువు మేలుకొని బ్రహ్మనుజూచి వాని కభయ హస్తమిచ్చెను; మధుకైటభులతో యుద్ధమునకు వెడలెను. వారు విష్ణుమూర్తితో యుద్ధమునకుఁ గడంగిరి. యుద్ధమొనరించిరి. వీరే గెల్చుచుండిరి. అంతవిష్ణువు, "మీయిరువురతో నేనొక్కరుడను బోరుచుంటినిగద! నాకుఁ గొంచెము విశ్రాంతి కావలయు" ననియెను. ఆ రాక్షసులు సరేయని పోరాట మాపిరి. అపుడు విష్ణుమూర్తి శక్తిని బ్రార్థించెను. శక్తి, వీరి నావహించి మోహితులుగఁజేసెను. అప్పుడే విష్ణువు "ఓదానవులారా! మీరు నాతోఁ బోరలేరు. మీరు నాకుమ్రొక్కి శరణువేఁడుకొనుఁడు" అనిపలికెను. మధుకైటభులహంభావము కలిగి "నీవేమమ్ము ప్రార్థించుము. మేమే నీకు వరమిచ్చెదము కోరుకొనుము" అనిరి. అట్లయినచో మీరు మృతులగునట్లు నాకు వర మొసంగుఁ"డని విష్ణువనియెను. దానవులు నివ్వెరపడి యాడినమాట తప్పలేకయుఁ బ్రాణములపై నాస కలిగియుండుటచే నుపాయముగ, "మమ్ము జలములేనిచోటఁ జంపుము" అని కోరిరి. కాని సర్వము జలమయమైయుండెను. అపుడు విష్ణువు తన యూరువులు పెంచి వానిపై దనుజులను జంపెను. వీరి మేధస్సుదెగిపడి యదియే భూమి యయ్యెను. దే. భా.

వీరే గజ కచ్ఛపములై యొకరితో నొకరు పోరాడుకొనుచుండిరి. అమృతము తేఁబోవు గరుడుఁడు ఈ గజకచ్ఛపములనే భక్షించెను. భార.

మధుఁడు:-ఒక రాక్షసుడు. యమునానదీ తీరమున ఆదిదేవునిగూర్చి తపస్సు చేసి సిద్ధిపొందెను. ఆ చోటే మధురానగర మయ్యెను. విష్ణు.

మధుచ్ఛందుఁడు:-విశ్వామిత్రుని నూర్గురు కొడుకులలో నేఁబదిఒకటవవాఁడు. శునశ్శేఫుని విశ్వామిత్రుడు తనపుత్రునిఁగఁ బెంచి వాఁడు మీ కన్నయగును. అట్లు గ్రహింపుఁడని పుత్రులతో జెప్పఁగా వీరు నవ్వి గేలిచేసిరి. వారిని 'మ్లేచ్ఛులఁకండు' అని శపించెను. మధుచ్ఛందుఁడును, వారి తరువాతివారును తండ్రి చెప్పినట్లు అంగీకరించిరి. విశ్వామిత్రుని కుమారులు అట్లు రెండు తెఱంగులగుటచేఁ బ్రవరాంతరంబు కలిగెను.

మధుఁడు:-ఒకరాక్షసుడు. ఈశ్వరు నారాధింపగా నతఁడు ప్రసన్నుఁడై తన శూలమువలన, మఱియొక శూలమును గలుగఁజేసి దానిని మధున కిచ్చెను. ఆది శత్రువునుదఱిమి సంహరించి తిరిగి ప్రయోగించినవానిని జేరునట్టి ప్రభావము

కలదు. మధుఁడు ధర్మముతప్పి వర్తించినచో నది యాతనిని విడచి తిరిగి తనకడకే వచ్చు ననియును, నీశ్వరుఁ డెఱింగించెను. మధుఁడు రావణుని చెల్లెలైన కుంభీనసను బలాత్కారముగఁ గైకొని పరిణయమయ్యెను. ఆమెయం దీతనికి లవణుఁడను కుమారుఁడు పుట్టెను. మధుఁడును కుమారున కా శూలమిచ్చి దాని ప్రభావ మెఱింగించెను. లవణుఁడు దుర్మార్గుఁడై చరించుచున్న మధుఁడు విచారించి యట్లు వర్తించెనేని శూలము బోవునని యెఱింగించెను. కుమారుని సద్వర్తనునిగ నుండుమని బోధించి తాను వారధిని బ్రవేశించెను. ఉ. రా.

మధుమంతము:-వింధ్యపర్వతముకడ దండుఁడను వాఁడు నిర్మించిన పట్టణము. ఉ. రా.

మధురాపురము:-కాళిందీతీరమున మధువనము కలదు. మధువనువాఁడు దానిని బాలించెను. ఆతనిపురమే మధురాపురము. మధుకుమారుడైన లవణుని శత్రుఘ్నుఁడు చంపి యా నగరమును దనకుమారులగు పుష్కరునకును, బుష్కరాక్షునకును నిచ్చెను. సూర్యవంశము క్షయమైన పిమ్మట నా నగరము యాదవులకుఁ జిక్కెను. ఇది శూరశేనుని రాజధాని యయ్యెను. దే.భా.

మధువనము:-వాలియొక్క వనము. దీనిని వాలి ప్రీతితోఁ గాపాడుచుండువాఁడు. దుందుభి దీనిలోఁ బ్రవేశించి వానిని దనతో యుద్ధమునకు వచ్చుటకై వనమును బాడుచేసెను.

హనుమంతుఁడు సీతను జూచివచ్చినపిమ్మట సంతసముతో వానరులిందుఁ జేరిరి. రామా.

మధువు:-ఒక దనుజుఁడు. (చూడుము మధుకైటభులు.)

మనస్విని:-మృకండుని భార్య. మార్క.

మనస్విని:-ప్రజాపతిభార్య. ఈమె కుమారుఁడు సోముఁడు. భార.

మనోజవుఁడు:-అనిలుఁడను వసువు కుమారుఁడు. భార.

మనోరమ:-వీరసేనుని కుమారిత. ధ్రువసింధువను రాజుయొక్క భార్య. ఈమె కుమారుఁడగు సుదర్శనుని నభిషిక్తునిజేయఁబోవుచుండగా నీమెసవతియొక్క తండ్రివచ్చి తన దౌహిత్రునకే పట్టము గట్టవలయుననెను. వీనితో యుద్ధముచేసి వీరసేనుఁడు మరణించెను. మనోరమ తనపుత్త్రుని దీసికొని భారద్వాజాశ్రమమునకువెళ్లెను. దే.భా.

మనోరమ:- కుబేరుని వామపార్శ్వమువలన బుట్టిన కన్య. కుబేరునకు భార్యయయ్యెను. బ్ర.వై.

మనోహర:- సోముఁడను వసువుభార్య. వర్చసుఁడు, శిశిరుఁడు, ప్రాణుఁడు,రమణుఁడు,ఈమె కుమారులు. పృథ యీమె కుమారిత. భార.

మన్మథుఁడు:-(బ్రహ్మనుండి పుట్టెను. మరీచ్యాది మునులు ఈ పేరు పెట్టిరి.)

మన్మథుఁడు:- విష్ణుమూర్తి కుమారుఁడు. విష్ణుమూర్తి సంతానమునకై శివునిఁ బ్రార్థించెను. అతఁడు ప్రసన్నుఁడయ్యెను. కాని విష్ణువు పార్వతిని బ్రార్థింపకపోవుటచేఁ బార్వతికిఁ గోపము వచ్చి విష్ణుమూర్తికిఁ గలుగుకుమారుఁడు శివుని నేత్రానలముచే భస్మమగుఁగాక యనిశపించెను. అపుడు విష్ణువామెను బ్రార్థించెను. ఈ పుట్టిన కుమారుఁడు మరల బ్రతుకునని యామె యనుగ్రహించెను. ఇట్లు శివునివరమువలనఁ బుట్టిన కుమారుఁడే మన్మథుఁడు.

మన్మథుఁడు:-సౌందర్యరాశి. ఇతనిభార్య రతీదేవి. ఈమె మన్మథుని వామభాగమునుండి పుట్టెను. ఇతని వాహనము చిలుక. అరవిందాది పుష్పములే యతని సాయకములు. మన్మథుఁడు తన బాణములచే బ్రహ్మనుగూడ క్షోభపెట్టెను. దానిచే బ్రహ్మ తన కూఁతురగు సరస్వతి (సావిత్రి) తోడనే సంగమించెను. పిమ్మట బ్రహ్మ, తాజేసినదానికి సిగ్గుపడి దానికి మన్మథుఁడే కారణమని యచిరకాలములో నతఁడు భస్మమగునట్లు శపించెను. మన్మథుఁడు బ్రహ్మను బ్రార్థించెను. యదువంశమునఁ దిరిగి జన్మింతువని బ్రహ్మచెప్పెను. మత్స్య.

తారకాసురునిబాధ మిక్కుటముగ నుండెను. బ్రహ్మ వానికి వరమిచ్చెను గాని యణఁచలేకపోయెను. శివుని కుమారుఁడుతప్ప నితరుల కది సాధ్యముకాదని బ్రహ్మచెప్పెను. అప్పటికి శివుఁడవివాహితుఁడై తపస్సుచేసికొనుచుండెను. ఇంద్రుఁడు మన్మథుని జూచి యాతనిని బొగడి

యెటులైనను శివుని గల్చి యాతఁడు పార్వతిని వివాహమగునట్లు చేయుమని చెప్పెను. శివునిఁ గెల్చు టెంతయని మన్మథుఁడు తపస్సు చేసి కొనుచున్న శివునికడకు వచ్చెను. అచ్చటనే పార్వతి చరించుచుండెను. మన్మథుఁడు శివునిఁ దన బాణములతోఁ గొట్టెను. శివుని మనస్సు చలించెను. ఎవ్వఁడిట్లు చలింపఁజేసెనని శివుఁడు కోపముతోఁ గన్నుతెఱచి యెదుటనున్న మన్మథునిఁ జూచెను. ఇతఁడు తన మూడవ కన్ను తెఱచి మన్మథుని భస్మముచేసెను. మన్మథుఁడే మఱలఁ బ్రద్యుమ్నుఁడుగ జనించెను. శివ.

మన్యువు:-భరద్వాజుని పుత్రుఁడు. ఇతనికి భయుఁడు, మహావీర్యుఁడు, నరుఁడు, గర్గుఁడు మొదలగు పుత్రులు కలిగిరి. రంతిదేవుఁడు ఇతని మనుమఁడే.

మమత:-ఉతథ్యుని భార్య. ఈమె గర్భిణియై యుండఁగా నీమె మఱది బృహస్పతి యతిథిగ వచ్చియీమెను కామించెను; ఈమెతో బలవంతముగ రమించెను. ఈమె గర్భమందున్న బాలుఁడు బృహస్పతిని కోపించెను. ఇతఁ డా బాలుని గ్రుడ్డివాఁడవుకమ్ము అని శపించెను. కాన నీమె కుమారుఁడు గ్రుడ్డివాఁడుగఁ బుట్టెను. ఇతఁడే దీర్ఘతముఁడు. భార.

మయుఁడు:-మయాసురుఁడు. ఇతనివంటి గొప్ప శిల్పి మఱి యెవ్వఁడును లేఁడు. పాండవులకుఁ గట్టి యిచ్చిన సభలో జలము స్థలముగను, స్థలము జలముగను గనఁబడున ట్లొకచోట నిర్మించెను. దుర్యోధనుం డచ్చటనే పరిహసింపబడెను. సాల్వుఁడు శివుని ప్రార్థింపఁగా నితఁడు శివునియాజ్ఞచే నెగిరెడిదానిని, స్వేచ్ఛాకామగమనము కలదానిని సౌభక మను నగరమును నిర్మించి యిచ్చెను. సాల్వుఁ డా నగరమునందు సేనలను, స్నేహితులను నిడుకొని ద్వారకపై దండెత్తిపోయెను. ఈ యద్భుత ప్రభావముచేతనే యీతని నసురుఁ డనవలెను గాని యితనియం దిసుమంతయును క్రూర కృత్యము గనఁబడదు. ఇతఁడు కామగమనము గల త్రిపురమును నిర్మించి యసురులకు నిచ్చెను. (చూడు త్రిపురము) ఇతని కుమారుఁడు వ్యోముఁడను నసురుఁడు.

ఇతనికి దేవతలు 'హేమ' యను కన్యను భార్యగ నిచ్చిరి. హేమఁ గ్రీడించుచుండెను. ఆమెయందు మందోదరి, మాయావి, దుందుభి జన్మించిరి. అంతహేమ యితనిని విడిచి వెళ్ళెను.

ఇతఁ డా పురమునం దుండలేక కుమార్తెను వెంటఁబెట్టుకొని తిరుగుచుండగా రావణుఁడు కనఁబడెను. మండోదరిని అతనికిచ్చి వివాహము చేసెను.

మయుఁడు:-ఇతఁడునముచిసోదరుఁడు; దనుజుఁడు. ఖాండవవనమున నుండువాడు. అగ్నిచే నది దగ్ధంబగునపుడు అందుండి రాలేక తక్షకునిగృహమునందుఁ బ్రవేశించెను. అగ్ని దానిని ముట్టడించెను. అర్జునుఁడు చంపవచ్చెను. అపుడు అర్జునుని శరణుఁ జొచ్చెను. అర్జునుఁ డీతనిని గాపాడి ధర్మజునికడకుఁ దీసికొనిపోయెను. ఆ కృతజ్ఞతవలననే వీరికి నేదేని నిత్తునన, శ్రీకృష్ణుఁడు నొక్క యపూర్వసభను నిర్మించియిమ్మనియెను. ధర్మజునకు మయుఁడు సభ గావించి యిచ్చెను. గద భీమునకిచ్చెను. దేవదత్తమను శంఖ మర్జునునకిచ్చెను. అతఁడు పూర్వము వృషపర్వుఁడను దానవేశ్వరునకు సభనునిర్మింపవలెను అని వివిధ రత్నమయములైన యుపకరణములను బిందు సరోవరమునఁ బెట్టెను. వీనితోడనే ధర్మజునకు నిర్మించి, ఎనిమిదివేల రాక్షసులచేత మోయించి తెప్పించెను.

మయుఁడు:-కశ్యపునకు దనువునందుఁ బుట్టిన కుమారుఁడు. ఇతని సోదరుఁడు నముచి. మయుఁడు దానవులకు శిల్పాచార్యుఁడయ్యెను. ఇతని సుగుణములకు మెచ్చుకొని దేవతలు హేమ యను కన్యకను ఇతని కిచ్చిరి. మయుఁ డామె పేరటనే నగరమొకటి నిర్మించి యందుఁగాపురముండువాఁడు. అతనికి మాయావి, దుందుభియను పుత్రులును, మందోదరి యను పుత్రికయును జన్మించిరి. పిమ్మట దేవతలు హేమను రమ్మని పిలచిరి. ఆమె వెడలిపోయెను.

భార్యను బాసినవాఁ డగుటచే మయుఁడు వైరాగ్యమునొంది తన కూఁతునకు వివాహము చేసినపిమ్మటఁ దాను తపోవనమునకుఁ బోఁ గోరెను. అతఁడు మందోదరితో వనమందు సంచరించుచుండఁగా రావణుఁడు కనఁబడియెను. రావణుఁడు మందోదరిని జూచి వలచి తా నవి

వాహితుఁడవనియు, లంకకు రాజువనియు మయునితోఁ జెప్పెను. మయుఁడు తన కుమార్తెను రావణునికిచ్చి వివాహముచేసి రావణునకద్భుత శక్తిని గూడ నిచ్చెను. ఉ. రా.

మయుఁడు:-ఖాండవవనమును నగ్ని కాల్చునపుడు మయుఁడందుండెను. ఆవనమునందుండి యితఁడు వెడలలేకపోయెను. శ్రీకృష్ణుఁ డితనిని జంప వచ్చెను. అపుడు మయుఁడు రక్షింపు మని యర్జునుని వేఁడెను. అర్జునుఁడు మయునిఁ గాపాడెను. తన ప్రాణరక్షణము చేసినవానికి మయుఁడు ప్రత్యుపకారము చేయఁ గోరెను. తా ననేకవిధ శిల్పకళా కుశలుండనని యెఱింగించెను. అర్జునున కిష్టమైనదానిని జేసి యిచ్చెద ననెను. యుధిష్ఠిరునకు రత్నరాజి సుందరమగు సభ నొకటి నిర్మించి యిమ్మని శ్రీకృష్ణుఁడు చెప్పెను. తత్పూర్వము మయుఁడు వృషపర్వున కొకసభ నిర్మించి యిచ్చెను. ఇంద్రప్రస్థమునఁ బాండవులకు మయుఁడు చిత్రవిచిత్ర సభను నిర్మించి యిచ్చెను. మఱియు భీమునకొకగదను, అర్జునునకు దేవదత్తమను శంఖమును గూడ నిచ్చెను. మయుఁడు తన శిల్పోపకరణములను బిందుసరమను కొలనులో దాఁచుకొనెను. భార.

మయూరధ్వజుఁడు:- మణిపురమునకు రాజు. ఇతని కుమారుఁడైన తామ్రధ్వజుఁడు ధర్మజుని యాగాశ్వమును బట్టెను. వీనినోడించి యశ్వమును బుచ్చుకొనలేక కృష్ణార్జునులు విప్రవేషమున మయూరధ్వజునికడకు వచ్చిరి. మయూరధ్వజుఁ డీ కపటవిప్రులకు నమస్కరించి మీరేల వచ్చితిరి? మీకేమి కావలయును? నని యడిగి వారు కోరిన విత్తునని చెప్పెను. అపుడు శ్రీకృష్ణుఁడుఁ "రాజా! మేమువచ్చుచుండఁగా సింహమొకటి నాకుమారుని బట్టుకొనినది; నన్నుభక్షించి నాకుమారుని విడువుమని కోరితిని గాని యది రాజుయొక్క యర్ధశరీర మిమ్మను చున్నది. మేము కోరిన దిచ్చెదనంటివి గావునఁ జెప్పితి" ననియెను. ఈ మాటలు మయూరధ్వజునిభార్యవిని యీరాజున కర్ధశరీరము నేనగుదును; నన్ను సింహమున కిమ్మనియెను. తామ్రధ్వజుఁడు తననర్పించుకొనియెను. కానికృష్ణుఁడు "ఆ సింహము రాజుయొక్కశరీరము, వానిభార్యయును, బుత్త్రుఁడును బట్టుకొని కోయవలెనని చెప్పిన" దని నుడివెను. మయూరధ్వజుఁడట్లు చేయ నాజ్ఞాపించెను. భార్యాసుతులు తన శరీరములో సగము కోయుచుండిరి. రెండవ భాగమందున్న కన్నునుండి నీరుకారెను. దానింజూచి శ్రీకృష్ణుఁడు, "రాజా! నీవు దుఃఖించుచు నిచ్చిన దానము మాకువలదు. మేము వెడలిపోయెద" మనియెను. అపుడు మయూరధ్వజుఁ డిట్లనియె. "ఓ విప్రోత్తమా! అట్లుగాదు; ఒక భాగము బ్రాహ్మణుల కర్పింపఁబడి ధన్యమయ్యెను. నేను కాలేక పోతినని యీకన్ను వగచుచున్న" దని నుడివెను. కృష్ణుఁడు సంప్రీతుఁడై మయూరధ్వజునకు నిజరూపము చూపెను. జై. భా.

మరీచి:-బ్రహ్మమానస పుత్త్రుఁడు. ఇతఁడు కర్దముని పుత్రికయగు కళను వివాహమయ్యెను. ఇతనికిఁ గశ్యపుఁడు జన్మించెను. మరీచికి సంభూతి యను భార్యకూడఁగలదు. భార, భాగ.

మరీచి ధర్ముని కూఁతురగు దేవవ్రతను వివాహమయ్యెను. ఇతఁడు శయనించియుండగా భార్య యితని పాదము లొత్తుచుండెను. ఆ సమయమున బ్రహ్మవచ్చెను. ధర్మవ్రత మామగారి శ్రమ వాయుటకై యాతని పాదములు పట్టుచుండెను. మరీచి మేల్కొని తనను విడిచి బ్రహ్మను సేవించుచుండిన భార్యను జూచి పరపురుషుని గొలుచుచుంటివి గాన శిలవై ఉండుమని శపించెను. శివునిచే దగ్ధుఁడవు కమ్మని యామె వీనికిఁ బ్రతిశాప మిచ్చెను.

వాయు.

మరీచి:-ప్రథమ యుగమున వీనిభార్య వర్ష. ఆమెయం దీతని కార్గురు పుత్త్రులు జన్మించిరి. బ్రహ్మ తన పుత్త్రికపై మోహముతో నామెను గూడియుండ వీరు నవ్విరి. బ్రహ్మ వారిని నసురయోనియందుఁ బుట్టుఁడని శపించెను. వీరే హిరణ్యకశిపునకును, బిమ్మట దేవకీగర్భమందును జన్మించిరి. భాగ.

మరుత్తు:-ఒకరాజు. అవీక్షిత్తు కుమారుఁడు. ఇతని తల్లి విశాల. మరుత్తు జన్మించినపుడు తుంబురుఁడు వచ్చి మరుత్తు అన్నియు నీబాలునకు శుభము చేయునని చెప్పెను. ఆ కారణమున నితనికి 'మరుత్తు' అని పేరుపెట్టిరి.

ఆహారమునకై మరుత్తు అఱువదేండ్లు చంద్రు నారాధించెను. చంద్రుఁడన్నమిచ్చెను. ఆయన్న మెంత తినినను, నెందఱికిఁ బెట్టినను దఱుగదు. మరుత్తు కుమారుఁడు అసేనసుఁడు. బ్రహ్మ.

మరుత్తు సుగుణాఢ్యుఁడై సంపదను నింద్రుని మించియుండెను. ఇతఁడు యజ్ఞము చేయఁ దలఁచుకొనియెను. ఇంద్రున కితనిపై నీర్ష్య కలదు. ఈతని యాగమును భంగము చేయ గోరెను. ఇంద్రుఁడే ముందుగ బృహస్పతి కడకుఁబోయి దేవతలచే యాగములు చేయించు వాఁడవు నరులు పిలిచిన వెళ్ళెదవా? యని హాస్యము చేసెను. పిమ్మట మరుత్తు బృహస్పతి కడకుఁ బోయి నా యాగమున కుపద్రష్టగ రమ్మనికోరెను. బృహస్పతి రానని నిరాక రించెను. ఇంద్రుఁ డిట్లు పల్కెనని మరుత్తు ఎఱుఁగడు. తనకైన యాశాభంగమునకు విచా రించు చుండెను. వీనికి నారదుఁడు కనఁబడి యంగిరసుని పిన్న కుమారుఁడైన సంవర్తుని యుపద్రష్టగఁ బిలిచి యాగము చేసికొమ్మని చెప్పెను. "సంవర్తుఁడు కాశీపురములోఁ బిచ్చివానివలెఁ దిరుగు చుండెను. నీవు పుర ద్వారమునకు శవమును కట్టుము; దానిని జూచి యెవఁడు పాఱిపోవునో వానినే సంవర్తునిఁగ నెఱుఁగుము. నీకీ యానవా లెవ్వరు చెప్పిరన్న నారదుఁడు చెప్పెననుము. నారదుఁ డిపు డెచ్చటనున్నాఁ డని యడిగిన నతఁ డగ్ని ప్రవేశము చేసెనని చెప్పుము" అని నారదుఁడు మరుత్తునకుఁ జెప్పి వానిని బంపెను. మరుత్తు కాశికేగి యా ప్రకార మొనరించి సంవర్తుని గలసికొనెను. "ఇంద్రుఁడును, నాయన్న యగు బృహస్పతియు నీ యాగము విఘ్నము చేయఁ జూతురు. నీవు యాగము కొనసాగింపకుంటివేని నిన్ను శపించెద సుమీ, ఆలోచించుకొనుము" అని సంవర్తుఁడు పల్కెను. మరుత్తు యాగము సంపూర్తిగఁ జేయ నిశ్చయముతో నుంటినని చెప్పెను. పిదప మరుత్తు సువర్ణసంపాదనమునకు హిమవన్నగమున కేగి శివుఁడు తపముచేసిన చోటునుండి బంగారము త్రవ్వి మోపులు కట్టించి తెచ్చి యజ్ఞవాటము బంగారుమయము చేసెను. ఇతని యాగప్రకారంబు బృహస్పతి విని చిన్నవోయెను. ఇంద్రుఁడు వాని నోదార్చి మరుత్తు యాగమునకు భంగము కలుగఁ జేయుటకై యగ్నినిఁ బంపెను. అగ్ని మరుత్తు కడకు వచ్చి నీవు బృహస్పతినే యుపద్రష్టగఁ బిలువుమని చెప్పెను. మరుత్తు వీనిమాటలు వినక నీవు తిరిగి యిటకు వత్తువేని నిన్ను మాడ్చి వేసెదనని భయపెట్టెను. పిమ్మట నింద్రుఁడు మరుత్తుకడకు ధృతరాష్ట్రుఁ డను గంధర్వునిఁబంపి యాగము మానుమనియును, మానని యెడలఁ దాను వజ్రాయుధముతోఁ గొట్టుదుననియును దెల్పుమనియెను. మరుత్తు వీరిమాటలను లక్ష్యము చేయలేదు. సంవర్తుని మంత్రప్రభావముచే నింద్రాదులను రావించి వారిచేతను హవిర్భాగ ములు గైకొనఁబడునట్లుచేసెను. సురాపానము నకు మదిని మెచ్చుకొని యింద్రుఁడు యాగ వస్తువులనెల్ల బంగారుమయముచేసెను. భాగ.

మరుత్తు యాగము చేయుచుండఁగా రావణుఁడు వచ్చి యజ్ఞభాగములన్నియు దేవతలకే యిచ్చుటేల? నాకు నిమ్ము. లేదేని యుద్ధము నకురమ్ము అని పిలచెను. మరుత్తు యుద్ధమునకే లేచెను. కాని దానివలనఁ గ్రతుభంగము కలుగు నని మునులుచెప్పి యాయత్నమును మాన్పించిరి. మరుత్తు యజ్ఞము చేసినపుడు బ్రాహ్మణులు పట్టుకొనిపోఁగా మిగిలినధనము పాతిపెట్టించెను. ధర్మరాజు యాగముచేయునపుడు భీమార్జును లీ ధనము తెచ్చిరి.

మరుత్తు వీరపుత్త్రియైన బ్రభావతిని, మాగధ తనయయైన సుకేశినిని, కేకయసుతయైన కైకేయిని, సురంధ్రతనయయైన సైరంధ్రిని, సింధు నృపతి కుమారితయైన పుష్పవతిని, చేదిపతి సుత యైన సుశోభనను వివాహమయ్యెను. ఇతనికి నరిష్యంతాదులు పుత్త్రులుపుట్టిరి. ఇతని పుత్త్రుఁడగు దముని సంతతిలోనివాఁడే తృణబిందుఁడు.

భాగ.

మరుత్తు రాజ్యముచేయుచుండఁగా నాగలోక మునుండి పన్నగములు వచ్చి మునులను బాధింపఁ జొచ్చెను. ఈబాధ తొలఁగింపుమని మరుత్తును గోరిరి. మరుత్తు సంవర్తాస్త్రమువేసి నాగలోక మును దపింపఁజేసెను. పాములన్నియును విశాల కడకు వచ్చి రక్షింపుమని వేఁడెను. ఆమె తన భర్తతోఁ జెప్పెను. అవీక్షిత్తు పన్నగహననము మానుమని కుమారునితోఁ జెప్పెను. కాని మరుత్తు మానలేదు. తుదకు దీనినిగురించియే తండ్రియుఁ, గుమారుఁడును యుద్ధమునకు దిగిరి. మునులువచ్చి "సర్పహతులై చనిపోయిన మును

లను బ్రతికిరనియును, బన్నగములు శరణాగతములయ్యెను గావున వానిని రక్షించుటయుక్తమనియును" జెప్పి వారిని శాంతులను జేసిరి.

మరుత్తు పిదప నరిష్యంతుఁడే రాజయ్యెను.
మార్క. భార.

మరుత్తు:- (మరువు) కుశుని వంశము వాఁడు. శీఘ్రునిపుత్త్రుఁడు. ఇతఁడు యోగసిద్ధుఁడు. ఇతఁడును, శంతనుని భ్రాతయగు దేవాపియును యోగయుక్తులై కలాప గ్రామమందుండి కలియుగాంతంబునఁ బ్రజలధర్మములు తప్పకుండ నడుపుదురు. ఇతనికుమారుఁడు ప్రశుశ్రుకుఁడు.
భాగ.

మరుత్తులు:- దేవతలు, దితి కశ్యపుల కుమారులు. ఇంద్రుఁడు దితికుమారులను సంహరించుచు వచ్చెను. ఆమె పుత్రశోకమునఁ గుందుచుండెను. ఇంద్రుని సంహరింపఁగలుగు పుత్త్రుని బడయఁ గోరి భర్తను బ్రార్థించెను. కశ్యపుఁ డనుగ్రహించెను. దితిగర్భవతి యయ్యెను. ఇంద్రుఁడు తనకు శత్రువు పుట్టఁబోవుచున్నాఁడని తెలిసికొని యొక బాలునిరూపమును ధరించి వచ్చి దితికిఁ బరిచర్యలుచేయుచుండెను. ఒకనాఁడామె యశుచియై నిదురించుచుండఁగ నింద్రుఁడామె గర్భము ప్రవేశించి శిశువు నేడు ముక్కలుగఁ గోసెను. ఆ యేడును శిశువులై యేడువసాగెను. మఱల నింద్రుఁ డొక్కొక్కని నేడేసి ముక్కలుగ గోసెను. ఇవన్నియును శిశువులై యేడువసాగెను. ఇంద్రుఁడు కోసినకొలఁదియు శిశువు లేర్పడుచుండిరి. ఇంతలో దితి మేల్కాంచి శిశువులను జంపవలదని వేఁడెను. ఇంద్రుఁడు బైటకువచ్చి పుట్టఁబోవువాఁడు తనకు శత్రువు కాఁబోవుటచే నట్లు చేసితినని చెప్పెను. వీరు నీకు శత్రువులు కారు; మిత్త్రులే యగుదురు. వీరిని నీవే కావుమని దితి వారిని ఇంద్రున కప్పగించెను. వా రెంతకును మరణమొందకుండుటచే వారును దేవతలేయని యింద్రుఁడు పలికి వారికి మరుత్తులను నామమిచ్చెను. వారే మరుద్గణము.
బ్రహ్మ. మత్స్య.

మరువు:- శీఘ్రుని కుమారుఁడు. ఇతఁడు యోగసిద్ధుఁడై కలాపగ్రామంబున నుండువాఁడు. కలియుగాంతంబున నష్టం బయ్యెడు సూర్యవంశము నితఁడే మరలఁ బుట్టింపఁ గలవాఁడు. ఇతని కుమారుఁడు ప్రశుశ్రుకుఁడు. భాగ.

మర్యాద:- అవాచీనుని భార్య; అరిహుని తల్లి.
భార.

మర్యాద:- విదేహరాజు పుత్త్రిక; దేవాతిథి భార్య. ఈమె కుమారుఁడు ఋచికుఁడు.

మలదము:- ఒక దేశము (చూడుము కరూశము.)

మలయధ్వజుఁడు:- పాండ్యమహారాజు; కులశేఖరుని కుమారుఁడు. ఇతని భార్య కాంచనమాల. ఇతఁడు సంతానమునకై యనేక హోమములు చేసెను. ఇతని కొక కుమారిత జన్మించెను. ఆమెకు మూడు కుచములుండెను. అట్టి వికృతరూపముగల కుమారితనుజూచి మలయధ్వజుఁడు నిర్వేర పడుచుండఁగా శివుఁడు ప్రత్యక్షమై, "యీమెకుఁ దటాతక యని పేరు పెట్టుము. వివాహమైనపిదప మూడవ కుచము పోవును" అని చెప్పెను. పార్వతియే మలయధ్వజున కిట్లు కుమారితగాఁ బుట్టెను.

భారతరణమందు మలయధ్వజుఁడు పాండవులకు సహాయముగ వెళ్లెను. వీనిని అశ్వత్థామ సంహరించెను. స్కాం. భార.

మల్లయ్య:- బల్లేశుఁడు. (చూడుము కుంచము.)

మల్లికార్జునుఁడు:- శివుఁడు. శ్రీశైలము సమీపమునఁ జంద్రగుప్తుఁడను రాజు కలఁడు. అతని కుమారితయైన చంద్రవతి రూపలావణ్యములను రతీదేవిని మించియుండెను. ఈమెను జూచి తండ్రికూడ విమోహితుఁ డయ్యెను. తండ్రి యిట్లున్మత్తుఁ డగుట నామె యెఱింగి యిఁక ఆ దేహముతో నుండఁజాలక శ్రీశైలమున కేగి శివునిని గూర్చి గానము చేసెను. శివుఁడు ప్రత్యక్ష మయ్యెను. నీలో నన్ను ఐక్యము చేసికొను మని యామె మల్లికాదామము శివున కిచ్చెను. దానినిగైకొని శివుఁడు తెల్లనయ్యెను. ఈ మల్లికాదామము పుచ్చుకొని యర్జునత వహించితివి గావున మల్లికార్జునుఁడవనఁ బరగుమని యీమె యనియె. శ్రీ. మ.

మహతి:- నారదుని వీణె.

మహాకాయుఁడు:- రావణుని ముఖ్యసేనాధిపతులలో నొకఁడు. ధూమ్రాక్షుఁడు మరణము

పొందినపిదప నితఁడే యెక్కువగ యుద్ధముచేసెను. అంగదుఁ డీతనిని జంపెను. రామా.

మహాతపుఁడు:-ఒకముని. ప్రజాపాలుని కితఁడు మోక్షసాధనమును బోధించెను. వరా.

మహానంది:-శిశునాగుని వంశమువాఁడు. నందివర్ధనుని పుత్త్రుఁడు. ఇతనికి శూద్ర స్త్రీయందు మహాపద్మవతి యనువాఁడు పుట్టెను. భాగ.

మహానాభుఁడు:-హిరణ్యాక్షుని కుమారుఁడు. మత్స్య.

మహాపద్మవతి:-మహానందికి శూద్ర స్త్రీవలనఁ బుట్టిన కుమారుఁడు. ఇతనితో క్షత్త్రియవంశ మంతరించెను. పిదప నేలెడిరాజులు శూద్ర ప్రాయులే. ఇతని పుత్త్రుఁడు సుమాల్యుఁడు. నందులు వీని యనంతరము రాజులైరి. భాగ.

మహాపార్శ్వుఁడు:-రావణుని సేనానాయకులలో నొకఁడు. రావణునకు "నీవు సీతనుగూడి సుఖింపు" మని దుర్బోధన చేసెను. రామా.

మహాబాహుఁడు:- గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

మహాభిషుఁడు:- ఇక్ష్వాకువంశపురాజు. ఇతఁడు మహాధర్మశీలుఁడై యశ్వమేధములు చేసి దేవలోకమున కరిగెను. ఇతఁ డొకనాఁ డింద్ర సభలో నుండఁగా గంగ స్త్రీరూపమున వచ్చటికి వచ్చెను. గాలిచే నామెపయ్యెద తొలఁగెను. మహాభిషుఁడు సాభిలాషుఁడై యామె నవలోకించెను. దీనినెఱిఁగి బ్రహ్మ మర్త్యలోకమునఁ బుట్టుమని వానిని శపించెను. మనుజలోకమునఁ బుణ్యచరిత్రుఁడగు రాజు ప్రతీపుఁడను వాఁడొక్కఁడే కలఁడు. వానికిఁ బుత్త్రునిగఁ బుట్టెదను. అట్లనుగ్రహింపుమని మహాభిషుఁడు వేఁడెను. బ్రహ్మ దానికి సమ్మతించెను. ఇతఁడు ప్రతీపునకు జన్మించి శంతనుఁడన బరగుచుండెను.

మహాభైరవుఁడు:-భైరవులలో నొకఁడు. (చూడుము భైరవులు) భాగ.

మహాభోజుఁడు:-సాత్వతుని కుమారుఁడు. భాగ.

మహాభౌముఁడు:-అరిహుని తనయుఁడు. సుపుష్ట యితనిభార్య. వారిపుత్త్రుఁడు అయుతానీకుఁడు. భార.

మహావీతుఁడు:- పుష్కరద్వీపమునకు రాజైన సవనుని పుత్త్రుఁడు. ఇతనినిబట్టియే పుష్కరద్వీపమునకు మహావీతఖండమని పేరువచ్చెను. బ్రహ్మ.

మహావీర్యుఁడు:-మన్యువు కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు ఉరుక్షయుఁడు. భాగ.

మహాశని.-ఒక రాక్షసుఁడు. హిరణ్యుఁడనువాని పుత్త్రుఁడు. ఇతఁ డింద్రునితో యుద్ధముచేసి వానిని పాతాళలోకమునకు దిగఁద్రొక్కెను. పిమ్మట వరుణునితో యుద్ధము చేయుటకు వెళ్లెను. వరుణుఁ డితనికి భయపడి యీతనితోఁ జెలిమిచేసి యీతనికిఁ గన్యాప్రదానము చేసెను. దేవలోకమున నింద్రుఁడు లేకపోవుటచే దేవతలు విష్ణుమూర్తికడకు వచ్చిరి. విష్ణువుకూడ వీనిని సంహరింపలేకపోవుటచే నతఁడు ఇంద్రునిఁ దప్పింపుమని వరుణునితోఁ జెప్పెను. వరుణుఁ డితని గృహమునకు వచ్చెను. మహాశని వరుణుని గౌరవించి నీకేమి కావలయును? నేనిచ్చెదను. చెప్పుమని పల్కెను. అతఁ డింద్రుని రప్పింపుమని కోరెను. ఇంద్రుఁడు దేవలోకమునకు మరల వచ్చెను. పిమ్మట నింద్రుఁడు గౌతమీతీరమున నుండి శివునిఁ బ్రార్థించెను. శివుఁ డింద్రునకుఁ బ్రత్యక్షమై వరమిచ్చి మహాశనిని జంపెను. బ్రహ్మ.

మహాసురుఁడు:- ఒక రాక్షసుఁడు. సురసతండ్రి. స్కాంద.

మహాస్వంతుఁడు:- అమర్షణుని పుత్త్రుఁడు ఇతని కుమారుఁడు విశ్వసాహ్యుఁడు. భాగ.

మహిషాసురమర్దని:- (చూడుము త్రికళ. మహిషాసురుఁడు.)

మహిషాసురుఁడు:- మహిష్మతి యనునామె శాపవశమున మహిషమైయుండెను. ఈ మహిషము కొలనులలో నీరు త్రావుచు నందు బడియుండిన సింధుద్వీపుఁడను రాజు వీర్యమును మ్రింగెను. దానివలన గర్భము దాల్చెను.

ఆమెకుఁ బుట్టిన కుమారుఁడే మహిషాసురుఁడు. ఇతఁడు పుట్టఁగానే మహిషమునకు శాపవిమోచన మయ్యెను. వరా.

మహిషాసురుఁడు:- రంభుఁడను దనుజుఁడు. తపస్సుచేయఁగా నగ్ని ప్రత్యక్షమయ్యెను. మిక్కిలి బలాఢ్యుఁడును, దేవతలను గెలువఁ గలుగు పుత్త్రుఁడును గలుగవలెనని రంభుఁడు కోరెను. నీ వేజంతువుతో రమింతువో యట్టి పుత్త్రుఁడు నీకుఁ గల్గునని యగ్ని చెప్పెను. అచ్చటినుండి రంభుఁడు వచ్చుచుండఁగా మహిషము కనఁబడెను. దానితో రంభుఁడు రమించెను. వీరికిఁ బుట్టిన కుమారుఁడే మహిషాసురుఁడు. దే. భా.

మహిషాసురుఁడు:- దితిసుతుల నందఱను నింద్రుఁడు సంహరించుచుండుటచే నింద్రుని జయింపగలుగు పుత్త్రునిఁ బడయఁగోరి దితి సుపార్శ్వుండను ముని యాశ్రమమ్రుపక్క తపస్సు చేసికొనుచుండెను. ఈమె తపస్సు వేడిమికి నాగలేక సుపార్శ్వుఁడు నీకు మహిషుఁడు పుట్టుఁగాక యని శపించెను. కాని యామె తపస్సునకు బ్రహ్మ మెచ్చుకొని ప్రత్యక్షమై నీ కుమారుని ముఖముమాత్రము మహిషముఖముగ నుండును. మిగిలిన శరీరము నరదేహమువలెనే యుండునని చెప్పెను.

మహిషాసురుఁడు శివునిగూర్చి ప్రార్థించెను. శివుఁడు ప్రత్యక్షముకాఁగాఁ దనకు మరణము లేకుండునట్లు వరము వేఁడెను. పుట్టినవారికి మరణము తప్పదని శివుఁడు చెప్పి వేఱొకవరము కోరుకొనుమనియెను. మహిషుఁడు తనకు స్త్రీ వలన మరణము వచ్చునట్లు కోరెను.

దైత్యులెల్లరు మహిషుని గొలుచుచుండిరి. తమ రాజ్యము దేవత లపహరించిరని చెప్పి, వారినోడించి మరలఁదమరాజ్యము తమకిప్పింపుమని కోరిరి. మహిషుఁడు దేవతలను మిక్కుటముగ బాధపెట్టుచుండువాఁడు. ఇతని క్రూరత్వ మెవ్వరును సైపలేకుండిరి. ఇతఁడు స్త్రీవలనఁ గాని సంహరింపఁబడకుండుటయెఱింగి దేవతలు తమ నారీతేజము లొక్కటిగఁ జేర్చి స్తుతించిరి. అందుండి దేవి యావిర్భవించెను. ఈమెకు దేవతలు తమ యాయుధము లిచ్చిరి. ఈదేవి సింహవాహన మధిష్ఠించి మహిషునితో యుద్ధముచేసి వానిని సంహరించెను.

మహిషాసురునివలన బాధ మిక్కుటముగ నున్నపుడు నారదుఁ డతని కడకు వచ్చి, మలయపర్వతముపై నారాయణి యను వనిత తపస్సు చేసికొనుచున్నది; ఆమెను మించిన రూపవతులు లేరు. నీకుఁ దగినభార్య ఆమెయే యని చెప్పెను. ఆమెను గొనిరండని మహిషుఁడు తన భటుల కాజ్ఞ నిచ్చెను. అతనిమంత్రి యగు ప్రఘసుఁడు "ఆ కాంత సాంబమూర్తి భార్య; ఆమెను దీసికొనిరావల" దని చెప్పెను. కాని మహిషుఁడు వినలేదు. ఇతనిభటులను దేవి ధిక్కరించెను. అంత మహిషుఁడే స్వయముగ వెళ్ళెను. తనను జేపట్టుమని దేవితోఁ జెప్పెను. దేవి వీనిని సంహరించెను.

మహిషాసురుడు:-వీనికుమారుఁడు గజాసురుడు. మహిషాసురునిఁ గుమారస్వామి సంహరించెను.

మహిషుఁడు:-అనుహాదుని కుమారుఁడు. ఇతని తలి సూర్మి. భాగ.

మహీదాసుఁడు:-ఒక ఋషి; పురుషయజ్ఞ జ్ఞాన విశిష్టుఁడు. ఇతఁడు రోగార్తుఁడై యుండి, రోగమా! నన్నేల బాధపెట్టెదవు? నాకుఁ బురుషయజ్ఞజ్ఞానముకలదు. నేను మృతిపొందను అనియెను. అతనిని రోగము విడిచిపోయెను. అతఁడు పూర్ణాయుర్దాయుఁడైయుండెను. ఛాన్దో.

మహోదరుఁడు:- గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

మహోదరుఁడు:-పన్నగము, కద్రువ కుమారుఁడు. ఇతఁడు శివునిని గొలిచియుండువాఁడు. పరశురామునిఁ బిలుచుకొని వచ్చుటకు శివుఁడీతనినే పంపెను. బ్రహ్మ.

మహోదరుఁడు:- ఒకరాక్షసుఁడు; రావణుని సేనలోనివాఁడు. వీని శిరము రాముఁడు తెగవేసెను. అది మహోదరుఁడను పేరుగల ముని కాలికి నంటుకొనెను.

మహోదరుడు:- ఒకముని. రాముఁడు మహోదరుఁడను దనుజునిశిరము నఱికినపు డది యెగిరిపడి యితనికాలి కంటుకొనెను. దాని నెంత లాగినను వచ్చినదికాదు. సరస్వతినాశనంబు అను తీర్థములో స్నానముచేసి రమ్మని యీ మునికిఁజెప్పిరి. ఇతఁడట్లు స్నానము చేయఁగనే కపాల మూడివచ్చెను. భార.

మా

మాండవి:-దశరథుని పుత్త్రుఁడైన భరతుని భార్య.

మాండవ్యుఁడు:-ఒకముని. ఇతఁడు తీర్థయాత్రలు చేసి చెసి యొక నగరము దాపుననున్న యరణ్యములోఁ దపస్సు చేసికొనుచుండెను. ఒకనాఁడు దొంగలు రాజధన మపహరించి యితని యాశ్రమముఁజేరి యచట డాఁగియుండిరి. రాజభటులు దొంగలను దఱుముకొనివచ్చి వారిని గానక దొంగలేమైరని మునినడిగిరి. ఈ ముని ప్రత్యుత్తర మీయలేదు. వారే వెదకి యాశ్రమమున నున్న దొంగలను బట్టుకొని మునివేషముననున్న పెద్దదొంగవు నీవే యని వీనినిఁగూడ రాజు కడకుఁదీసికొనిపోయిరి. వీనినిఁగూడఁ గొఱత వేసిరి. అయినను నితఁడు ప్రాణములు పాయక తపస్సు చేసికొనుచుండెను. అంత మునులు గొందఱు పక్షులైవచ్చి యేమికారణమువలన నీ విట్లుంటివి? వని మాండవ్యు నడుగుట రాజభటులు విని రాజున కివింతఁదెల్పిరి. రా జీతని కడకుఁ బరుగిడివచ్చి క్షమింపుమని వేఁడి కొఱత తీసివేయుమని భటుల నాజ్ఞాపించెను. కాని కఱ్ఱ పూర్తిగ నూడిరాక యతనికంఠమునఁ గొంచెము మిగిలియుండెను. ఆ కారణమున నితనికి అణిమాండవ్యుఁడను పేరువచ్చినది.

మాండవ్యుఁడు:-ఇతఁడు జనకునికడకరిగి తృష్ణ పోవు శిక్షణము నడిగెను. దేనిపైనను ఆశపెట్టుకొనక యుండుటవల్లనే సుఖము కలుగుననియును, అందుచేతనే మిథిల తగులఁబడుచున్నను తనకు దుఃఖము కలుగలేదనియును, దివ్యసుఖమైనను తృష్ణను విడిచిన సుఖమునకు పాటిరాదనియును జెప్పెను. భార.

కౌశికునిభార్య భర్తను జీకటిలో మోసికొని పోవుచుండఁగా నతని కాలుమాండవ్యునకుఁదగిలి పుండురేగెను. ఆ బాధచేత మాండవ్యుఁడు నా పుండు రేపినవాఁడు సూర్యోదయము కాఁగానే మరణించునని శపించెను. ఆమాటలు గౌశికునిభార్య విని సూర్యుఁ డుదయింపకుండనే యాజ్ఞ పెట్టెను. ఆమె పతివ్రత గావున సూర్యుఁడుదయింపనేరెదు. మాండవ్యుఁడుదకు యమపురి కరిగెను. ఏమి కారణమున నా కిట్టి శిక్ష విధించితివి? వని యముని నడిగెను. నీవు చిన్ననాఁడు తూనీగలను బట్టుకొని వాని నిశ్లే కొఱత వేసితివి. ఆ పాపఫలము నీ విపు డనుభవించితివి అని యముఁడు చెప్పెను. అంతమాత్రమున కింతటి శిక్ష విధించుటయా? యని మాండవ్యుఁడు కినిసి నీవు మర్త్యుఁడవై శూద్రస్త్రీయందుఁ బుట్టుమని యమునికి శాప మిచ్చెను. ఆ శాపము వలన యముఁడు విదురుఁడుగా బుట్టెను. భార. మార్క.

మాండూకేయుఁడు:-పైలుని శిష్యుఁడగు ఇంద్ర ప్రమితికి శిష్యుఁడు. ఋగ్వేదసంహిత నుపదేశము నందెను. ఇతఁడు దేవమిత్త్రునకుపదేశించెను. భాగ.

మాందకర్ణి:- ఒక ముని. మహాతపశ్శాలి. ఇతడు వేయేండ్లు వాయుభక్షణంబును, శిలాశయనమును చేసి తపస్సుచేసెను. ఇతని తపస్సునకు దేవతలు భయపడి తపోవిఘ్నము చేయుటకై యప్సరసలను బంపిరి. ఈ ముని వారి వలలను జిక్కుకొనియెను. వారితోనిర్జనప్రదేశమున సంభోగింపఁ గోరి దివ్యాంగనా సహితుఁడై యొక కొలను ప్రవేశించి యందు విహరించు చుండువాఁడు. ఆ కొలనులో వీరి విహారమున సందడి యరణ్యవాసము చేయుచున్న రాముఁడు వినెను. ఆ కొలనునం దంతర్గతులై యప్సరస లుండుటచే దానికిఁ బంచాప్సరసము అను పేరువచ్చినది. రామా.

మాంధాత:- యువనాశ్వుని పుత్త్రుఁడు. యువనాశ్వునకుఁ బుత్త్రులు లేకపోవుటచే నతఁడు పుత్త్రేష్టి చేయుచుండెను. యువనాశ్వుని భార్యలకై భృగుమహర్షి జలము మంత్రించి యొకచో నుంచెను. యువనాశ్వుఁ డీ జలము మంత్రపూతమైనదని యెఱుఁగక దానిని త్రాగెను. దాన నతఁడు గర్భముధరించెను. అతని గర్భము చీల్చుకొని మాంధాత బైటఁబడెను. ఇంద్రుఁడు వచ్చి యీశిశువునోటఁ దన వ్రేలిడి కుడిపెను.

మాంధాత శశిబిందుని కుమారితయైన బిందుమతిని వివాహమయ్యెను. పురుకుత్సుఁడు, అంబరీషుఁడు, ముచికుందుఁడు ఇతని పుత్త్రులు.

ఇతని పెద్దకుమారుఁడగు అంబరీషుని యువనాశ్వుఁడు తన పుత్త్రునిఁగ గైకొనెను. వానికి యావనాశ్వుఁడు పుట్టెను. యావనాశ్వుని కుమారుఁడు హారితుఁడు. ఆ కారణముననే మాంధాతృ గోత్రమునకు అంబరీష, యావనాశ్వ, హారీతులు ప్రవరులైరి. భాగ.

మాంధాతకుఁ బలువురు కుమార్తెలు కలరు. వీరిని దనకిచ్చి వివాహముచేయుమని సౌభరి యను ముని కోరెను. "నీవు ముసలివి. నిన్ను నా కుమార్తెలు మెచ్చరు. వారంగీకరించెద రేని నీకిచ్చెదనని" మాంధాత చెప్పెను. సౌభరియంతఃపురములోపలికి వెళ్ళెను. మాంధాత కుమార్తెలు వానిని వివాహమగుట కంగీకరించిరి; ఇతఁడు కుమార్తెలను సౌభరికిచ్చి వివాహము చేసెను.

మాంధాత పండ్రెండవఏటనే రాజ్యాభిషిక్తుఁడయ్యెను. ఇతఁడు రాజులనందఱను యుద్ధమున గెల్చుచుండెను. వీని ఖ్యాతివిని రావణుఁడు వీనికడకువచ్చి నాతో యుద్ధముచేయుము అని దర్పముగఁ బల్కెను. మాంధాత రావణు నోడించి బంధించెను. అంత బ్రహ్మవచ్చి రావణుని విడువుమని కోరి మాంధాతకును, రావణునకును సంధి గావించెను. ఇందఱు రాజులను గెల్చిన గర్వముచే మాంధాత ఇంద్రునిమీఁదకును యుద్ధమునకు వెళ్ళెను. ఇంద్రుఁడు భయపడియెను.

నీవు భూలోకమునంతయును జయించితివా? తగుదునని ఈలోకమునకువచ్చితివి అని అడిగెను.

నీవు ముందు లవణుని నోడించిరమ్ము. తరువాత నాతో యుద్ధము చేయవచ్చునని యింద్రుఁడు నుడివెను. మాంధాత సరేయని లవణుని మీఁదకు యుద్ధమునకు వెళ్ళెను. లవణుఁడు వీని నోడించెను.

ఇతఁడు వసుహోముఁ డను రాజుకడకుఁ బోయి దండోత్పత్తియొక్క క్రమంబును దెలిసికొనెను. భార.

మాణిభద్రుఁడు:- కుబేరుని దళవాయి. అలకాపట్టణముమీఁదకు రావణుఁడు యుద్ధమునకు వచ్చినపుఁ డతని దళవాయియైన ప్రహస్తునితో నితఁడు యుద్ధముచేసెను. ప్రహస్తుని బాణమీతని తలకుఁ దగిలి యతని తల వంకరగఁ దిరిగెను. అందువలన నితనికిఁ 'పార్శ్వమౌళి' యను పేరువచ్చెను. ఉ. రా.

మాణిభద్రుఁడు:-ఒకగంధర్వుఁడు. కుండధారుని కడ నుండువాఁడు. కుండధారుని కడకు బ్రాహ్మణుఁ డొకఁడువచ్చి యాగము చేసికొనుచున్నాను. ధనమిమ్మని వేఁడెను. అతఁడు మాణిభద్రుని బిలచి ధనమిమ్మని చెప్పెను. ఇతఁడు మనుష్యునకు ధనమిచ్చిన నేమి ప్రయోజనము? మనుష స్వరూపమే యనిత్యము. ధర్మముచే దైవత్వము సంపాదించుకొనుచో నదియే ధనమని చెప్పెను. వీనిబోధ విని బ్రాహ్మణుఁడు ధనమడుగకయే చనియెను. భార.

మాతలి:-ఇంద్రుని సారథి. ఇతనికి గుణకేశియను కూఁతురు కలదు. ఆమెను ఆర్యకునిమనుమఁడగు సుముఖున కిచ్చి వివాహము చేయఁదలఁచుకొని ఆర్యకు నడిగెను. అతఁడు గరుత్మంతుఁడు తన కుమారుని సంహరించెననియును, నచిరకాలములోనే తన మనుమనిగూడ సంహరించుననియును, గావున నతనికి వివాహము చేయఁజాలననియును జెప్పెను. మాతలివచ్చి యామాట లింద్రునితోఁ జెప్పెను. ఇంద్రుఁడును, విష్ణుమూర్తియును సుముఖునిఁ జిరాయువుగఁ జేసిరి. అపుడు మాతలి తనకూఁతును సుముఖునకిచ్చి వివాహముచేసెను. భార.

మాద్రి:-మద్రరాజుయొక్క కూఁతురు; పాండురాజు భార్య. ఈమెయుఁ బాండురాజుతోఁ దఱచు వనములందే యుండెడిది. పాండురాజునకు సతీసంగమము ఒసెసేని మరణము సంభవించునట్లు శాపముకలదు. కావున నీమె భర్తచే నియోగింపఁబడి కుంతిసహాయమున అశ్వులను రావించి, వారివలన నకుల సహదేవులను గనియెను. ఒకనాఁడు పాండురాజు అతిశయ రూప లావణ్యయగు మాద్రినిఁజూచి యామె వలదనుచున్నను రతివిభ్రమమున నీమెను గవయ యత్నించెను. తోడనే యాతఁడు మరణించెను. మాద్రియు భర్తతో సహగమనము చేసెను. భార.

మాధవి:-ధర్మధ్వజుని భార్య. తులసి యీమె కుమార్తెయే. బ్ర. వై.

మాధవి:- ప్రతిష్ఠానపురాధీశ్వరుఁడగు యయాతి కూఁతురు. ఈమెకు సంతానముకలిగినను నీమె కన్యాత్వము దూషితముగాదని యీమె కొక ఋషి వరమిచ్చెను. గాలవుఁడును, గరుడుఁడును యయాతికడకు గుఱ్ఱములకై వెళ్ళిరి. గుఱ్ఱములతనికడ లేనందున యయాతి మాధవినిచ్చి యీమెను ఏ రాజునకైన నిచ్చి గుఱ్ఱములను బుచ్చుకొనుమని చెప్పెను. గాలవుఁ డిక్ష్వాకుని కడ కీమెనుదీసికొనివెళ్ళి యీమెను బుచ్చుకొని గుఱ్ఱముల నిమ్మని కోరెను. ఇక్ష్వాకు పుత్రులఁ బడయఁగోరి యీమెను బుచ్చుకొని గుఱ్ఱముల నిచ్చెను. ఈమెయం దిక్ష్వాకునకు వసుమనస్సుఁడను కుమారుఁడు పుట్టెను. పిమ్మట నిక్ష్వాకుడు ఈమెను గాలవున కిచ్చెను.

గాలవుం డీమెను దివోదాసున కిచ్చి గుఱ్ఱములను బుచ్చుకొనెను. దివోదాసున కీమెయంగుఁ బ్రతర్దనుఁడు పుట్టెను. దివోదాసుఁడు మరల నీమెను గాలవన కిచ్చివేసెను. గాలవుఁ డౌశీనరుని కడకుఁ బోయి వానికి మాధవినిచ్చి గుఱ్ఱములను బుచ్చుకొనెను. మాధవియందాతనికి శిబి పుట్టెను. పిమ్మట నతఁడును మాధవి నిచ్చివేసెను. అట్లు సంపాదించిన గుఱ్ఱములను, మాధవి గాలవుఁడు విశ్వామిత్రునకు గురుకట్నముగ నిచ్చెను. ఆమెయందు విశ్వామిత్రునకు అష్టకుఁ డనువాఁడు పుట్టెను. భార.

మానసము:-హాటకదేశమున నున్న ఒక కొలను. హంస లిదు వసించును. భార.

మానిని:- రాజ్యవర్ధనుని భార్య. ఒకనాఁ డీమె స్వయముగా భర్తకుఁ దలయంటుచు నతని నెఱసిన వెండ్రుకలు చూచి ముసలితన మప్పుడే వచ్చినదని దుఃఖించెను. పౌరులు కూడ విచారించి. వీరందఱును గలసి రాజునకు వాయువు చిక్కవగునట్లు సూర్యుని బ్రార్థించిరి.

మానుపాదము:-ఒక వృషభము. దీనిచర్మముతో భేరులు వేయఁబడి జరాసంధుని చైత్రకగిరి శృంగమునం దుంపఁబడియెను. ఆ నగరము పరు లెవ్వరైనఁ బ్రవేశించినపుడు భేరులు తమంతట మ్రోగును.

మాయ:-ఒక పుణ్యక్షేత్రము. ఇదియే హరిద్వారము దీనినే గంగాద్వారము అందురు.

మాయావతి:-శివునిచే మన్మథుఁడు సంహరింపఁబడినపిదప రతీదేవి మన్మథుని పునర్జన్మమున కెదురు చూచుచుండెను. మన్మథుఁడే ప్రద్యుమ్నుఁడుగఁబుట్టుటయును, శంబరునిచే నెత్తుకొనిపోఁబడి సముద్రములోఁ బారవేయఁ బడుటయును, జేఁపచే మ్రింగఁబడుటయు నామెతో నారదుఁడు చెప్పెను. ఆమె దాసివేషముతో మాయావతి యను పేరున శంబరునింటఁ బని చేయుటకు వచ్చెను. ఈమె చేఁపకడుపులో నున్న బాలునిఁదీసి రహస్యముగఁబెంచి పెద్దవానిని జేసి యాతనికి భార్యవలె వర్తింపసాగెను. నీవు నాకుఁ దల్లివి; ఇట్లు వర్తింపఁదగునా? యని యా బాలుఁ డడుగఁగా నామె యాతని నిజ వృత్తాంత మంతయును దెలిఁగించెను. మఱియు నామె యాతనికి 'సర్వశత్రుమాయావినాశని' అనువిద్య నేర్పెను. ఆవిద్యవలన ప్రద్యుమ్నుఁడు శంబరుని సంహరింపఁగలిగెను. పిమ్మట నీమెయే ఆకాశమార్గమునఁ బ్రద్యుమ్నుని ద్వారకకుఁ గొనిపోయెను.

మాయావతి:-శంబరాసురుని కూఁతురు. ఈమె యొకనాఁడు చేఁపను దరుగుచుండఁగా నందు బాలుఁడు కనఁబడియెను. నారదుఁడు వచ్చి యా బాలుఁడు శ్రీకృష్ణునికుమారుఁడు ప్రద్యుమ్నుఁడని చెప్పెను. శంబరుఁడు వీనిని జంపుటకు వచ్చి వీనిచేతిలోఁ దానే చచ్చెను. ఈమె ప్రద్యుమ్నుని మోహించి వానిని ద్వారకకుఁ దీసికొని వెళ్ళెను. విష్ణు.

మాయావి:-(మయుని కుమారుఁడు)

మాయావి:-దుందుభికుమారుఁడు. దుందుభిని వాలి సంహరించెను; ఆ కోపమున నొకనాఁటిరాత్రి మాయావి కిష్కింధ కేగి వాలిని యుద్ధమునకు రమ్మని పిలచెను. వాలి వెళ్ళెను. వానివెంట సుగ్రీవుఁడును, దారయును నరిగిరి. వాలికిని; మాయావికిని ఘోరయుద్ధము జరిగెను. మాయావి చేరువనున్న యొక్కబిలములో దూరెను. వాలియు నందుఁ బ్రవేశించెను. చాల కాలమువఱకు నెవ్వరును బైకిరాలేదు. అందే వాలి మాయావినిసంహరించెను. ఇతనిరక్తధారలు బయటకు వచ్చెను. వాలియే చనిపోయెనని

భయమొంది యీబిలముఖము నొక రాత్రినో యూని సుగ్రీవుఁడు పరుగిడివచ్చెను.

రామా.

మారిష:—పూర్వజన్మమున నొక బాలవితంతువు. ఈమె విష్ణుమూర్తిని ప్రార్థించి కామాతురతచే భర్తల నిమ్మనికోరెను.

కంఘుఁడనుముని తపస్సుచేసికొనుచుండగా వానికడ కింద్రుఁడు ప్రమ్లోచన అను నప్సరసను బంపెను. ఈమునివలన ఆమెగర్భవతియయ్యెను. ఒకనాఁడు ముని యామెను గోపబడియెను. ఆమె భయపడెను. కంఘునివీర్యము చెమటరూపమున నామెదేహముపైకి వచ్చెను. దాని నామె చెట్ల చిగుళ్ళతోఁ దుడిచెను. ఆ వీర్యము చెట్ల చిగుళ్ళచేతను, వెన్నెలచేతను బెంపఁబడి యొక బాలయయ్యెను. ఆమెయే మారిష. చంద్రుఁడు తన తర్జనిస్రవేలు ఈమె నోటఁబెట్టి కుడిపెను. ప్రచేతసులు వృక్షములను దహింపఁజేయుటకు వచ్చిరి. చంద్రుఁడు వృక్షములను నాశనము చెయకుఁడని వారిని బ్రతిమాలి వారికి మారిష నిచ్చి వివాహము చేసెను. పూర్వజన్మమునఁ గోరినవరము చొప్పున నీమెకు ప్రచేతసు లంద ఱును భర్తలుగానయిరి. వారివలన నామెకు దక్షుఁడు జన్మించెను. మారిష చంద్రవతియను నదినిగూడఁ గనియెను. విష్ణు. మత్స్య.

మారిష:—దేవమీఢుని భార్య. ఈ దేవమీఢునినే శూరుఁడందురు. వీరి కుమారులు వసుదేవుఁడు మొదలగువారు. కుమార్తెలు పృథ మొదలగు వారు. (చూడుము దేవమీఢుఁడు.)

మారీచుడు:—తాటకా సుందరుల కుమారుఁడు. ఈతఁడు సనకసనందనాదులవలన శపింపఁబడి యీ జన్మము నెత్తెను. పూర్వమీతఁడు జితుఁడనువాఁడు (చూడుము జితుఁడు)

ఒకనాఁడు మిక్కిలి యాఁకలియగుటచే నితఁడు దండ్రితోఁబోయి యగస్త్యుని మ్రింగఁబోయెను. మీరు రాక్షసులు కండు అని యా ముని శపించెను. అప్పటినుండియు నితఁడు ప్రజలను బాధించుటయును, మునుల యాగములు పాడుచేయుటయును మొదలగు రాక్షస కృత్యము లనేకములు చేయుచు వచ్చెను. ఇతఁడు రావణుని బంటుగ నుండెను. సీత నపహరించుటకుఁ దనకు సహాయముగ రమ్మని రావణుఁ డీతని కాజ్ఞ యిచ్చెను. "రాముఁడు సామాన్య నరుఁడు కాఁడు. వాని కపకారమును దలఁపకుము. తలఁచితివా మన ప్రాణము లుండవు. సీత నపహరించు యత్నమును మానుము" అని మారీచుఁడు రావణునకు బోధించెను. కాని రావణుఁడు వినక తనకు వ్యతిరేకమును బల్కినందులకే దండింతుననియెను. మారీచుఁడు తన కెటులైనను చావుతప్పదనుకొని శ్రీరాముని చేతిలోనే చనిపోవుటను గోరి తన రాక్షస మాయచే నతిసుందరమైన లేడిరూపమును ధరించెను. ఈలేడిని సీత కోరఁగా రాముఁడు బాణము పుచ్చుకొని లేడిని గొట్టవచ్చెను. ఈలేడి చాలదూరము పరుగిడెను. రాముఁడు తఱిమెను. రావణుఁడు సీత నెత్తుకొనిపోవుటకు వీలగునట్లు రాము నెడఁబాటు చేయుటయే యితఁడు కోరినది. తుదకు నది రాముని బాణముచేఁ గొట్టఁబడెను. ఆ లేడి ప్రాణములు విడుచుచు 'హా! లక్ష్మణా!' యని యఱచెను. ఈయఱపు పర్ణశాలయందున్న సీతాలక్ష్మణులకు వినఁబడియెను. అట్లు మారీచుఁడు బాణహతుఁడై నిజరూపమునుదాల్చి ప్రాణములువిడిచెను.

మారీచునిపుత్త్రుఁడు కాలనేమి. రామా.

మార్కండేయుఁడు:— మృకండుని కుమారుఁడు. ఇతనితల్లి మనస్విని. మార్కండేయుఁడు నియమ నిష్ఠాగరిష్ఠుండై యుండువాఁడు. ఇతనిని మృత్యువు పాశబద్ధునిజేసి లాగెను. ఇతఁడు మృత్యువు నెదిరించి పదివేల హాయనంబులు తపస్సుచేసెను. ఇతని తపస్సున కింద్రుఁడు భయపడి తపోభంగము చేయుటకై యప్సరస లను బంపెను. కాని మార్కండేయుఁడు చలింపలేదు. ఇతనికి హరి ప్రత్యక్షంబయ్యెను. ఆ శరీరముతోడనే యనేకయుగములు బ్రతుకు నట్లు మార్కండేయుఁడు కోరె. విష్ణు వర్దాని నొసంగెను. ప్రళయము సంభవించి లోక మంతయును జలమయంబైనపుడు మార్కండేయుఁడు జీవించియుండెను. వటపత్త్రంబున శయనించినహరికి నమస్కరించి వానిదేహంబుఁ జొచ్చి యనేక హాయనంబు లదు సంచరించి బయటకు వచ్చెను. పిమ్మట వాని గౌగిలించు కొనఁబోగా హరి యదృశ్యుఁడయ్యెను.

మార్కండేయుఁడు మరల నిజాశ్రమంబునఁ దపస్సు చేసికొనుచుండెను. అతనికి శివుఁడు ప్రత్యక్ష మయ్యెను. మార్కండేయునకు మృత్యువురానట్లు వర మిచ్చెను. మార్కండేయుని భార్య ధూమ్రావతి. ఆమెయందు వేదశిరుఁ డను కుమారుఁడు జన్మించెను.

మార్కండేయుని కడకు జైమిని వచ్చి పాండవు లేవురకు ద్రౌపదియొక్కతెయే యెట్లు పత్ని యయ్యె? నను మొదలగు ప్రశ్నలను చేసెను. తన జపమునకు వేళయగుటచేఁ బింగాక్షుఁడు మొదలగు పక్షులకడకు వెళ్ళి యడుగు మని యితఁడు చెప్పెను. భాగ. మార్క.

మార్కండేయుఁడు వనవాసము చేయుచుండిన ధర్మరాజుకడకుబోయి వానికిఁ బూర్వ వృత్తాంతములు, ధర్మములు చెప్పెను.

ఇంద్రద్యుమ్నుఁడు అను రాజు ఇంద్రలోకమున నుండఁగా నతని కీర్తి యీ లోకమున మాసెను. కావున నాతనిని భూలోకమునకున బంపిరి. అతఁడు మార్కండేయునొద్దకు బోయి 'నన్నెఱుఁగుదునా?' యని యడిగెను. "నేను నిన్నెఱుంగను. హిమశైల శృంగముకడ నున్న ప్రావారకర్ణుఁడు అను ఘూకము కలదు. అది నాకంటెను పెద్దది అని చెప్పి దాని నడుగు" మనెను. (చూడుము ఇంద్రద్యుమ్నుఁడు.)

మార్తాండుఁడు:-సూర్యుఁడు హవిర్భాగములను దేవతల కందకుండఁగా దైత్యులే యపహరించుచుండిరి. అందువలన దేవత లార్తినొందిరి. వీనిని గాపాడుటకై అదితి సూర్యు నారాధించెను. సూర్యుఁడు ప్రత్యక్షముకాఁగా నీ యంశమున నాకుఁ బుత్రుఁడు గల్గి దేవతలను రక్షింపవలయు నని యామె కోరెను. సూర్యకిరణములనుండి 'సుషుమ్న' యను రశ్మి అదితిగర్భము ప్రవేశించెను. ఆమె గర్భవతి యయ్యెను. అయినను ఆమె యుపవాసములు చేయుచుండెను. ఏల యుపవాసములు చేయుదువు? నీ గర్భమందున్న యండమును మారణము చేయుదువా? యని కశ్యపుఁడు కోపపడియెను. అదితికినిగోపమువచ్చెను. అండము ఆమె గర్భమునుండి బైటఁబడెను; అండమును మారణముచేయుదువేల? యని కశ్యపుఁడు పలికెను. కాన దానివలనఁ బుట్టిన బాలునకు మార్తాండుఁడు అనిపేరువచ్చెను. మార్తాండుని తేజస్సునకుఁ దాళలేక దానవులు పలువురు దగ్ధమైరి. మార్క.

మార్తాండుఁడు:- బ్రహ్మాండము మృతి నొందినపుడే (రెండు శకలములైనపుడే) పుట్టెను; అందువలన ఆపేరు వచ్చెను. మత్స్య.

మార్తాండుఁడు:-విశ్వకర్మ తపోనియతుఁడై, తన మనోవృత్తిని అమృతనయమూర్తియును, గామరూపిణియునగుకన్యను సురభియనుదానిని, తేజోమయుం డగు నొకపురుషుని సృజించెను. ఈ పురుషుఁ డా కన్యను జూచి కామమోహితుఁడై యార్తినొందిన, బ్రహ్మవచ్చి 'మార్తోభవ' అని యీతని యార్తత్వం బుడిపి యాకన్య నిచ్చెను. దాన వానికి 'మార్తాండుం'డను పేరు వచ్చెను. వారలకు ఏకాదశ రుద్రులు జన్మించిరి. మఱియును వారికిఁ గలిగిన సౌరభేయకులకు యాగాపవర్గార్థ క్షీర జనకంబులైన బ్రహ్మలోకంబుపై నుండునట్లు వర మిచ్చెను. అది గోలోకము. భార.

మాలావతి:- ఉపబర్హణుఁ డను గంధర్వునిభార్య. ఈ గంధర్వునకు దేవసభయందు రంభను జూడఁగా రేతఃపతన మగుటచే వీనిని శూద్రయోనియందుఁ బుట్టుమని బ్రహ్మ శపించెను. వెంటనే యుపబర్హణుఁడు ప్రాణములువిడిచెను. మాలావతి తనభర్తను బ్రతికింపుఁడని దేవతలను బ్రార్థించెను. ఎంత ప్రార్థించినను వారూరకుండిరి; తుదకు మాలావతి దేవతలనందఱను శపింపఁబోయెను. ఆ పతివ్రత మాహాత్మ్యమెఱింగి బ్రహ్మాదులు విష్ణువుతోఁ జెప్పికొనిరి. విష్ణువు విప్రబాలకునివేషమునవచ్చి యామెతోఁ గాలము, మరణము మొదలగు ననేకవిషయములను గుఱించి ప్రసంగించెను. ఆమె తనభర్త నిమ్మని ప్రార్థించెను. విష్ణువు బ్రహ్మకడకు విప్రబాలకుని వేషముననేపోయి యామెను మహాపతివ్రత యనియును, నామెభర్తను నామెకొసంగుట యుచిత మనియును, లేనియెడల నామె దేవతల నెల్లరను శపించు ననియును జెప్పెను. నారదుఁడు తనపుత్త్రుఁడే యనియును,

తన శాపవశమున నుపబర్హణుఁ డయ్యె ననియును, అతని కింకను ఆయుష్కాలము వేయి సంవత్సరములు గలదనియును, విష్ణువుయొక్క యనుగ్రహంబునఁ దానే బ్రతికింతుననియును జెప్పెను. దేవత లందఱును నామెదగ్గఱకు వెళ్ళి యుపబర్హణుని బ్రతికించిరి. మాలావతి యాతనిని గూడి పెక్కేండ్లు సుఖంబుగా నుండెను. పిమ్మట నతఁడు బ్రహ్మయొక్క శాపముచేత శరీరమును విడువఁగా నామెయును బ్రహ్మకుండంబునఁ బ్రవేశించి మఱల సృంజయరాజుయొక్కపత్నియందు జాతస్మరయైపుట్టి యుపబర్హణునినే భర్తగాఁ గోరెను. బ్ర. వై.

మాలావతి:– కుశధ్వజుని భార్య. వేదవతి తల్లి. బ్ర. వై.

మాలి:– సుకేశుని పుత్త్రుఁడు; సుమాలి, మాల్యవంతుల సోదరుఁడు. ఇతఁడు నర్మద యను గంధర్వస్త్రీ పుత్త్రిక వసుధను వివాహమయ్యెను. ఇతనికి అనలుఁడు, అనిలుఁడు, హరుఁడు, సంపాతి అను నలువురు కుమారులు. వీరి దుండగములు చూచి దేవతలు శివునితో మొఱపెట్టుకొనిరి. శివుఁడు విష్ణువుతోఁజెప్పెను. ఈవార్త వీరికిఁ దెలిసి విష్ణువు గొప్పయేమి? వానిని గెలువలేమా? యని సురనగరముపై యుద్ధమునకేగిరి; కాని యోటువడి వచ్చిరి. పిమ్మట మాలి మాల్యవంతుని, సుమాలిని సహాయముగఁ దీసికొని స్వర్గమునకువెళ్ళి గరుత్మంతునితో యుద్ధము చేసెను. విష్ణుమూర్తి చక్రము గరుత్మంతునకు సహాయముగ వచ్చెను. దాని సహాయముచే గరుత్మంతుఁడు మాలిని జంపఁగలిగెను. సుమాలియు, మాల్యవంతుఁడును భయపడి పాఱిపోయిరి. ఉ. రా.

మాలిని:– (మానిని) శ్వేతకర్ణుని భార్య. భరత రాజ్యము మంత్రుల కప్పగించి తపోవనమునకేగెను. ఈమె గర్భవతిగ నుండియు భర్తతో వెళ్ళి యొకకొండపైఁ బ్రసవించి బాలునివిడిచి పతితో నేగెను. ఆబాలుని మునులుతీసి కాపాడి అజపార్శ్వుఁడని పేరుపెట్టిరి. హరి.

మాలిని:– ప్రమోచనయనునప్సరసకు వరుణపుత్త్రుఁడైన పుష్కరునివలనఁ బుట్టిన తనయ. ఈమెను దల్లి రుచి యను రాజున కిచ్చెను. ఈమెకు రౌచ్యుఁడను కుమారుఁడు పుట్టి మనువయ్యెను. మార్క.

మాలిని:–అజ్ఞాతవాసమున ద్రౌపది పెట్టుకొనిన పేరు. భార.

మాలిని:–విశ్రవసునకుఁ బరిచర్య చేయుటకునై వైశ్రవణునిచేతఁ బంపఁబడిన ముగ్గురు రాక్షసాంగనలలో నీమెయొకతె. ఈమెయందు విశ్రవసునకు విభీషణుండు జన్మించెను. భార.

మాలిని:–ఒక యేరు. దీనియొద్దననే శకుంతలను మేనకా విశ్వామిత్రులు విడిచి వెళ్ళిరి. అచ్చట నుండియే కణ్వుఁడు తీసికొనివెళ్లెను. భార.

మాల్యవంతుఁడు:–సుకేశునిపుత్త్రుఁడు. ఇతనితల్లి దేవవతి; సుమాలి, మాలి ఇతని సోదరులు. వీరు ముగ్గురును దండ్రివలెనే భోగమును, వైభవమును బొందఁగోరి పెక్కేండ్లు బ్రహ్మను గూర్చి తపస్సు చేసిరి. బ్రహ్మ ప్రత్యక్షమై వారు కోరిన వరము లిచ్చెను. అప్పటినుండియు నెక్కువగ గర్వించి లోకముల నొక్కపెట్టున బాధించుచుండువారు. వీరు విశ్వకర్మను బిలిచి తమకు నగర మొకదానిని నిర్మింపుమనిరి. రాక్షసేశ్వరుని యానతి చొప్పున లంకాపట్టణము నిర్మించినాననియును, నచ్చట మీరుండ వచ్చుననియును విశ్వకర్మ చెప్పెను. వీరు సోదరులు ముగ్గురును స్వర్గలోకముపైకి యుద్ధమునకు వెడలిరి. గరుత్మంతుఁడు మాలినిని సంహరించెను. మాల్యవంతుఁడు భయపడి పాతాళలోకమునకుఁ బాఱిపోయెను.

మాల్యవంతుఁడు తన మనుమఁ డగు రావణుఁడు లంకను బాలించునపుడు లంకకు మరల వచ్చి యతనికడ మంత్రిగ నుండెను. ఇతనిని రావణుఁడు గౌరవించుచుండువాఁడు. రాముఁడు యుద్ధమునకు వచ్చుట తెలిసి, రావణుఁడు మంత్రులతో సభ చేసినపుడు యుద్ధముమాని సంధిచేసికొనుమని యితఁడు గట్టిగాఁ జెప్పెను. కాని రావణుఁడు వినలేదు. రామా.

మాల్యవంతుఁడు నర్మద అను గంధర్వస్త్రీ పుత్త్రికయైన సుందరిని వివాహమయ్యెను. అనిలక్రోధుఁడు, వజ్రముష్టి, విరూపాక్షుఁడు,

దుర్ముఖుఁడు, సుప్తఘ్నుఁడు, యజ్ఞకోపుఁడు, ఉన్మత్తకుఁడు మాల్యవంతుని కుమారులు. అనల ఇతని కుమారిత. ఉ.రా.

మాళవి:-అశ్వపతి భార్య. సావిత్రి తల్లి. భార.

మాహిష్మతి:-విప్రజిత్తియను దానవుని కూఁతురు. ఈమె సింధుద్వీపుఁడను రాజును మోహించి విరహవేదనకుఁ దాళలేక వనములో సంచరించు చుండెను. అచ్చటను మునులసందడి యుండెను. ఆసందడి సైపలేక వారిని దఱుమఁదలఁచుకొని మహిషరూపమును ధరించి వారి హోమగుండము లను బాధుచేసెను. దైత్యుని కుమారితయే యీ వేషమున వచ్చెనని గ్రహించి శంబరుఁడను ముని నూరేండ్లు నీవిట్లేయుండుమని యీమెను శపిం చెను. అపుడు మాహిష్మతి శాపవిమోచనము ప్రసాదింపుమనిప్రార్థించెను. నీకుఁ గుమారుఁడు కల్గినపిదప శాపవిమోచన మగునని ముని ప్రసా దించెను. ఆమె మహిషరూపముననే తిరుగు చుండెను. ఒకనాఁడు విద్యున్మతియను సుంద రాంగి యొకతె దిగంబరియై కొలనులో స్నానముచేయుట. సింధుద్వీపుఁడు చూచెను. అతనికి రేతః పతన మయ్యెను. ఆ ధాతువు సువాసనవలన ఈ మహిషము కొలనునకుఁ బోయి నీటఁబడిన సింధుద్వీపుని వీర్యము త్రాగెను. దానివలన నామెకు గర్భమై మహిషాసురుఁడు పుట్టెను. అంతట నామెకు శాపవిమోచన మయ్యెను. వరా.

మాహిష్మతీపురము:-నిషధుని నగరము.అచ్చట స్త్రీలు జారిణులయ్యును దోషులుగ నెంచఁ బడరు. దానికి అగ్నిదేవుఁడే కారణము.

మి

మిత్త్రిసఖుఁడు:- ఒక సూర్యవంశపురాజు; సుదా సుని కుమారుఁడు. మిత్త్రిసఖునకే సుదాసుఁ డను పేరుకలదు. ఇతఁడు సర్వకాముని కుమా రుఁడు. ఇతనిభార్య మదయంతి. ఇతఁడొకనాడు వేఁటకుఁబోయి రెండుపులులను జూచి వానిలో నొకదానిని గొట్టెను. రెండవది దనుజరూప మును దాల్చి పాఱిపోయెను.

ఇది జరిగిన కొంత కాలమునకు మిత్త్రి సఖుఁడు యాగము చేయుచుండెను. ఆ పాఱి పోయిన దనుజుఁడు వసిష్ఠునిరూపమున నీయాగ మునకు వచ్చి తనకు నరమాంసముతో భోజనము పెట్టుమనికోరి వెడలిపోయెను. మిత్త్రిసఖుఁడు నిజముగ వసిష్ఠుఁడే యట్లు కోరెనని నమ్మి భోజనమునకు వచ్చిన వసిష్ఠునకు నరమాంసము కల్పిన యన్నము పెట్టించెను. ఆ పాఱిపోయిన దనుజుఁడు సూపకారుని వేషమున వచ్చి మిత్త్రిసఖునికడ వంటలవాఁడుగ నుండెను. వసిష్ఠుఁడు మిత్త్రిసఖు నింటికి భోజనమునకు రాఁగా నీ సూపకారుఁడు వానికి నరమాంసము కల్పిన యాహారమును బెట్టెను. వసిష్ఠునకుఁ గోపము వచ్చి నాకు నరమాంసము పెట్టితివి గావున నీవు నరులను భక్షించుచు రాక్షసుఁడ వగుమని మిత్త్రిసఖుని శపించెను. నీవే వచ్చి నరమాంసము పెట్టుమని కోరియు నిట్లు శపిం చెద వేల ? ఏ పాపము నెఱుఁగని నన్నిట్లు శపింతువేల ? అని రాజునకుఁ గోపము వచ్చి నీ విఁక సూర్యవంశపు రాజులకు గురువుగ నుండకుందువు గాక యని మునికిఁ బ్రతిశాప మిచ్చి జలమును మంత్రించెను. ఇంతలో వసిష్ఠుఁడు తన దివ్యదృష్టిని జూచి దనుజుఁడు చేసిన మోసమును నెఱింగి, పండ్రెండు సంవత్సరములలో రాజునకు శాపవిముక్తి యగునని యనుగ్రహించెను. అట్టి సందర్భ ములో గురువునకుఁ బ్రతిశాప మిచ్చుట మంచిది కాదని మిత్త్రిసఖుఁడు మంత్ర పుతజలమును దనపాదముల మీఁదను బోసి కొని కల్మాషపాదుఁ డయ్యెను. అప్పటి నుండియు నితనికిఁ గల్మాషపాదుఁడని పేరు వచ్చెను. కల్మాషపాదుఁ డొకనాఁడు వసిష్ఠ నాశ్రమమునుగూర్చి పోవుచు నరణ్యములో మార్గము తప్పెను. అతఁడు పోవుమార్గమున వసిష్ఠుని కుమారుఁడైన శక్తిని జూచి ఓరీ! దారిలో నిలువఁబడెదవేల ? తొలఁగిపొమ్ము అనియెను. నేను ధర్మపథమున నున్నవాఁడను. నన్నేల తొలఁగుమనియెదవని శక్తి పలుకఁగాఁ గల్మాషపాదునకుఁ గోపము వచ్చి శక్తినిఁ గొట్టెను. శక్తి వీనిని రాక్షసుఁడవై నరమాంసము

తినుచుండుమని శపించెను. అపుడు కల్మాష పాదుఁడు శక్తిని వసిష్ఠునిపుత్త్రునిఁగా నెఱింగి శాపవిమోచనమునకై ప్రార్థించెను. ఇంతలోఁ జెంతనుండిచూచుచున్న విశ్వామిత్త్రుఁడు కింకరుఁ డను రాక్షసునిబంపి కల్మాషపాదుని హృదయ మావహింపజేసెను. రాక్షసుఁ డావేశించి యుండునపుడు కల్మాషపాదుఁడు రాజ్యకార్య ములు మాని రాక్షసునివలెనే యుండెను.

ఒకనాడు బ్రాహ్మణుఁ డొకఁడు క్షుధార్తుఁడై వచ్చి మాంససహితంబుగ భోజనము పెట్టుమని కోరెను. ఇతఁడు సరే యని యంతఃపుర మున కేగి యా మాట మఱచి నిదురించి లేచి తాను బ్రాహ్మణు నుండుమనుట జ్ఞాపకము నకు రాఁగా వంటవానినిఁ బిలిచి బ్రాహ్మణు నకు మాంససహితమగు భోజనమును బెట్టుమని యెను. ఇంతప్రొద్దుపోవఁగా మాంస మెట్లు లభించు? నవఁగా నరమాంసముతోఁ బెట్టుమనెను. వాఁడు వధ్యస్థానమునకుఁ బోయి నర మాంసమును దెచ్చి వండి బ్రాహ్మణునకుఁ బెట్టెను. అది నరమాంసమగుట బ్రాహ్మణుం డెఱింగి నీవు మనుజాశనుండవు కమ్మని రాజును శపించెను. "ఈ శాపమునకు ఆదికారణము శక్తియే"యని రాజునకుఁగోపమువచ్చి "ఈరాక్ష సత్వఫలితమునీవేపొందుము" అని శక్తిని, వాని సోదరులను భ్రమింగెను. భార.

కల్మాషపాదుఁడు శాపముకతన దనుజుఁడై మనుజులను వధించుచుండెను. ఒక రేయి సురత సుఖము లనుభవించుచున్న బ్రాహ్మణమిథున మును జూచి యితఁ డాబ్రాహ్మణుని సంహరించెను. వానిభార్య దుఃఖించి "నీవుసతీసంగమము చేయునపుడు మరణింతువు"అని వీనిని శపించెను.

రాక్షసరూపముననున్న మిత్త్రసఖుఁడు శక్తిని, వాని తమ్ములను గూడఁ జంపెను. శక్తిభార్యను దఱుముకొనివెళ్ళెను. ఆమె పరుగిడుచుండెను. వసిష్ఠుఁ డద్దానినిగాంచి మంత్రపూతజలము దనుజునిపైఁ జల్లెను. అంత దనుజుఁడు శాప విముక్తినొంది పూర్వరూపమును దాల్చెను.

గౌతముని శిష్యుఁడగు నుదంకుఁడు గురుకార్యార్థ మరుగుచుండఁగా వానిని కల్మాషపాదుఁడు భక్షింపఁబోయెను. "నేను గురుకార్యార్థ మేగుచుంటిని. నీ భార్యకుండలములే మా గురుపత్ని కోరినది. అవి యిప్పింపుము. వానిని మా గురుపత్ని కిచ్చి నీకు భోజన మయ్యెద"నని యుదంకుఁడు చెప్పెను. కల్మాషపాదుఁడు తన భార్య కిమ్మని వానికొక యానవాలిచ్చి, కుండలము లడిగి పుచ్చుకొనుమని పంపెను. మఱియు నతఁడు అశుచిగనుండినవారి కామె కనఁబడదని చెప్పెను. ఉదంకుఁడు కుండలములు పుచ్చుకొని వచ్చి యీ రాజునకుఁ జూపి వానిని దనగురు పత్ని కిచ్చివచ్చెద ననియెను. ఈతని గురుకార్య పరత్వమునకును, సత్యసంధతకును మెచ్చుకొని కల్మాషపాదుఁడు "విప్రులు పటుసమర్థులు, విప్రశాపమువలననే నాకీ దురవస్థ కల్గినది. దీనిని బాపుము" అని వేఁడెను. ఉదంకుఁ డాతని శరీరమును దాకెను. అంతఁ గల్మాషపాదునకు శాపవిమోచన మయ్యెను.

శాపవిముక్తి యైనపిమ్మట మిత్త్రిసఖుఁడు రాజ్యము చేసెను. అతఁడు బ్రాహ్మణ స్త్రీ శాపమును దలఁచుకొని సతీసంగమము చేయక యుండెను. కాని వంశాభివృద్ధికొఱకు తన భార్యను దమయంతిని వసిష్ఠునివలనఁ బుత్త్రినిఁ బడయుమని నియోగించెను. ఆమెకు అశ్మకుఁడు అను పుత్త్రుఁడు జన్మించెను. భార. విష్ణు.

మిత్త్రిసహుఁడు:- (చూడుము నిషధుఁడు)

మిత్త్రిసేనుఁడు:- సుశర్మ సోదరుఁడు. త్రిగర్తాధిపతి. వీనిని యుద్ధములో అర్జునుఁడు చంపెను. భార.

మిత్త్రివింద:- అవంతి దేశాధీశ్వరులైన విందాను విందుల చెలియలు. శ్రీకృష్ణుని మేనత్తయగు రాజాధిదేవి కూతురు. స్వయంవరమున నీమె శ్రీకృష్ణుని వరించెను. భాగ.

మిత్త్రుఁడు:-ఒక రాజు. గిరిభద్ర యితని భార్య. చాక్షుషమను వీతని కుమారుఁడు. మార్క.

మిథి:-(జనకుడు) నిమిని మథింపఁగాఁ బుట్టిన వాఁడు కావున మిథియను పేరువచ్చెను.

మిథిల:-మిథి పాలించిన దేశము.

మిథువు:-ఒక రాక్షసుఁడు. ఆర్ష్టిషేణుఁడు అను రాజు యాగము చేయుచుండఁగా నతనిని, నతని భార్యను, ఋత్విజునిఁగూడ నెత్తుకొని పోయెను.

మీ

మీఢ్వాంసుఁడు:-దక్షుఁడను రాజుయొక్క కుమారుఁడు. ఇతనిపుత్త్రుఁడు శర్వుఁడు. భాగ.

ము

ముండుఁడు:-(చూడుము చండముండులు)

ముచికుందుఁడు:-ఇతఁడొకసారి అలకాపట్టణముపై యుద్ధమునకు వెళ్ళెను. త్రోవలోనే కుబేరుని భటులితని సైన్యముపైఁబడి కొట్టిరి. అప్పుడితఁడు తన పురోహితునిఁ బ్రార్థించెను. పురోహితుఁడు తానుచేసినతపస్సు, మంత్రములు, పూజలు మొదలగువానివలన వాని సైన్యమునకుఁ దిరిగి బలమును కలిగించెను. పిమ్మట నీతఁడు కుబేరునిమీదకు యుద్ధమునకుఁబోఁగా బ్రాహ్మణక్షాత్త్రబలంబు లేకమై యుండుటవలన నీతో నేను బోరలేనని చెప్పి తప్పుకొనెను. భార.

ముచికుందుఁడు:- కాలయవనునిచేఁ దరుమఁబడుచున్న శ్రీకృష్ణుఁడు వచ్చి యొకచో గుహలో నుండెను. పిమ్మట శ్రీకృష్ణునిఁ జూచి యితని నెఱింగి పూర్వము గర్గుఁడు చెప్పిన మాట చొప్పున 28 వ మహాయుగమున శ్రీమన్నారాయణుం డవతరించు ననుటను దలఁపోసి శ్రీకృష్ణుని స్తుతించెను. అంత శ్రీకృష్ణుండు ప్రీతుఁడై నీవు క్షత్రధర్మంబున వేటాడి జంతువులను జంపితివి. తపముచేతఁ బాపకర్మమునుండి విముక్తుఁడవై తర్వాత జన్మంబున సర్వభూతహితత్వంబు గలిగిన బ్రాహ్మణుండవై నన్నుఁ జేరెదవు అని వరమిచ్చెను. ముచికుందుఁడు గుహదాటివచ్చి కలికాలము రాబోవుచున్నదని గ్రహించి యుత్తరాభిముఖుండై పోయి బదరికాశ్రమమునఁ దపస్సు చేయుచుండెను. భాగ.

ముచికుందుఁడు:-ఒకరాజు; మాంధాతకుమారుఁడు. ఇతఁడు దేవాసురులకు యుద్ధమైనపుడు దేవతలకు సహాయముచేసెను. దేవతలు వరము వేఁడుకొనుమనిరి. ఇతఁడు మిక్కిలి డస్సియుండెను. ఇతనికి నిద్ర వచ్చుచుండెను; కావున నిద్ర పోఁగోరి తననిద్రాభంగ మెవ్వరేని చేసినయెడల వారినితఁడు చూడఁగనే వారు భస్మము కావలయునని వరమునుగోరెను. ఇతఁ డొక గుహలో నిదురించుచుండెను. ఆ గుహలోనికే కాలయవనుఁడువచ్చి యితనిని జూచి కృష్ణుఁడని భ్రమించి యితనినే తన్నెను. ముచికుందుడు లేచి వానిని జూచెను. వాఁడు భస్మమయ్యెను. విష్ణు. భాగ.

ముదావతి:- విదూరథుఁ డను రాజుయొక్క కూఁతురు. ఈమె యొకనాఁడు చెలికత్తెలతో విహరించుచుండఁగా కుజంభుఁడను రాక్షసుఁ డీమె నెత్తుకొనిపోయి పాతాళలోకమున దాఁచెను. ఈమె యదివఱకుఁ దండ్రితోఁ గాననమున కేగి యీ దనుజుఁడు గావించిన బిలము చూచియుండెను. అపుడు కుజంభుని ముసలము సునంద మనునది స్త్రీస్పర్శ తగిలినయెడల శక్తిహీన మగునని వినియుండెను. ఆ మాట జ్ఞప్తియందుంచుకొని యీమె శేషునిఁ దలచుకొనుచుఁ బూజసేయుచు నెపంబున సునందమును స్పృశించుచుండెను. ఈమెను విడిపించుటకై విదూరథుఁడు తన కుమారులను సుమతిని, సునీతిని బంపెను. కాని వారును దనుజునిచే నచ్చటనే కట్టఁబడి యుండిరి. వీరిని విడిపించుటకై వత్సంధ్రుఁడను రాజు వచ్చెను. అతనికిని దైత్యునకును యుద్ధము జరిగెను. తుదకు దనుజుఁడు తన ప్రబలాయుధమైన ముసలమును దీసికొని దానితో యుద్ధము చేయుచుండెను. కాని యది ముదావతి కరస్పర్శమున శక్తిహీనమయ్యెను. వత్సంధ్రుఁడు దనుజుని జంపి ముదావతిని, నామె సోదరులను విడిపించెను. ఈమెను వత్సంధ్రున కిచ్చి తండ్రి వివాహము చేసెను. ఈమె శేషుని దలఁచుకొనుచు సునంద మను ముసలమును స్పర్శనము చేయుచుండెను గాన నామెకు శేషుఁడు సునంద యని పేరు పెట్టెను. ఈమెకు ప్రాంశుఁడు, ప్రవీరుఁడు, శూరుఁడు, సుచక్రుఁడు, విక్రముఁడు, క్రముఁడు, బలి, బలాకుఁడు, చండుఁడు ప్రచండుఁడు అను పుత్త్రులు గల్గిరి. మార్క.

ముద్గలుఁడు:- ఒక బ్రాహ్మణుఁడు. ఇతఁడు ధాన్యము నొక్కొక్క గింజ చొప్పున నేరి ప్రోగు చేసి సమకూర్చిన దంతయుఁ బర్వదినమున దానము చేయుచుండును. ఒకనాఁడు వాని గృహమునకు దుర్వాసుఁడు రాఁగా వానికిఁ దృప్తిగా భోజనము పెట్టెను. దుర్వాసుఁడు వదపడి మూఁడు, నాల్గుసారులు వచ్చెను. వచ్చినపుడెల్ల ముద్గలునకుఁ గల్గినది దుర్వాసునకు బెట్టుచుండెను. ఆ ముని "నీదానశీలతకు సంత సించితిని. నీకుఁదప్పక దేవలోకము కలుగును" అనిచెప్పి వెడలిపోయెను. అచిరకాలములో నే దేవదూత ముద్గలునికడకు విమానమును దెచ్చెను. ముద్గలుఁడు విమాన మెక్కుటకుఁ బూర్వము దేవలోక మెట్లుండు? నని దూతను బ్రశ్నించెను. "అచ్చట సమస్తభోగము లుండును. నీవు చేసిన సుకర్మనంతయు నచ్చట ననుభవించు వఱకు నక్కడ నుందువు. పిమ్మట భూలోకమునకు వచ్చెదవు" అని దూత చెప్పెను. అంత ముద్గలుఁడు "ఓయీ! నీ విమానమును నీవు గొనిపొమ్ము. నేనురాను. ఏది శాశ్వతానందము నిచ్చునో దానికై యత్నించెదను" అని తపస్సు చేసికొనుచుఁ గూర్చుండెను. భార.

ముద్గలుఁడు:- భర్మ్యాశ్వుని కుమారుఁడు. అవీన రుఁడు, సృంజయుఁడు, కాంపిల్యుఁడు ఇతని సోదరులు. ఇతని కుమారుఁడు దివోదాసుఁడు. గౌతముని భార్యయగు నహల్య ఇతని కుమారి తయే. భాగ

ముని:- ధరణీ దక్షుల కుమారిత. కశ్యపునిభార్య. భీమసేనుఁడు, ఉగ్రసేనుఁడు అనువార లీమె కుమారులు. భార.

మురాసురుఁడు:- ఒక రాక్షసుఁడు. ఇతఁడు బ్రహ్మనుగూర్చి తపముచేసి తన అరచేయి యెవనిమీదఁ బెట్టునో వాఁడు భస్మమైపోవు నట్లు వరము పొందెను. వరము పొందిన వెంటనే యముని భస్మము చేయుటకు వెళ్ళెను. యముఁడు విష్ణువుకడకుఁ బరుగిడి యతనితోఁ జెప్పుకొనియెను. మురుఁడు కూడ విష్ణుమూర్తి దగ్గఱకువెళ్ళి నీతో యుద్ధము చేయుటకువచ్చితి ననియెను. నీవు నాతో యుద్ధము చేయుటకు వచ్చినయెడల నీ గుండెలేల యట్లు తటతటఁ గొట్టుకొనుచున్నవని విష్ణుమూర్తి పలికెను. లేదే యని మురాసురుఁడు తనచెయ్యి గుండెలమీఁద బెట్టుకొని చూచుకొనెను. చెయ్యిపెట్టుకొనఁ గానే నతఁడు భస్మమయ్యెను.

మురాసురున కంతరిక్షుఁ డను కుమారుఁడు కలఁడు. వీఁడు శ్రీకృష్ణునిచేఁ జంపబడియెను.

ముష్టికుఁడు:-(చూడుము చాణూరుఁడు)

ముసలము:-(చూడుము. యాదవకులమునకు ముసలము.)

మూ

మూకుఁడు:-ఒక దైత్యుఁడు. శివునిబంటు. ఈశ్వ రుఁడు కిరాతరూపమున నర్జునుని బరీక్షింపవచ్చి నపుడు ఇతఁ డీశ్వరచోదితుండై పందిరూపమున వచ్చి యర్జునునిపైఁ బడబోయెను. దానిని గొట్టు టకే యర్జునుఁడు బాణమువేసెను. దానినిగుఱించి యర్జునుఁడును, మాయాకిరాతుఁడును బోరాడు కొనిరి. ఈశ్వరునిచేతను గొట్టఁబడి పందిరూపమును విడిచి నిజరూపమున నదృశ్యుఁడై చనియెను.

మూలకుఁడు:-అశ్మకుని కుమారుఁడు. ఇతఁడు పరశురామునకు వెఱచి స్త్రీలమధ్య దాగియుండు టచే నారీకవచుఁడను పేరు వచ్చినది.

పరశురామునిచే నిర్మూలంబయిన రవివంశము నకు మూలమయినవాఁ డగుటంజేసి యితనికి 'మూలకుఁడు' అను పేరు వచ్చినది. ఇతని కుమారులు ఇలబిలుఁడు, విశ్వసహుఁడు. భాగ. విష్ణు.

మృ

మృకండుఁడు:-విధాత కుమారుఁడు. ఇతని తల్లి నియతి. మనస్విని యితనిభార్య. ఇతఁడు తపస్సు చేసి గుణగణాఢ్యుడైన పుత్త్రుని మార్కండేయునిఁ బడసెను. భాగ.

మృత్యువు:-భూదేవి బ్రహ్మకడకు వెళ్ళి తనకు భారము హెచ్చగుచున్నదని చెప్పికొని దానిని తగ్గింపుమని వేడెను. తగ్గించు నుపాయము బ్రహ్మకుఁ దోఁచలేదు. అతనికిఁ జాల కోపము వచ్చెను. ఆ కోపానలముచే లోకములు మండు టారంభించెను. శివుఁ డదిచూచి బ్రహ్మయొద్దకు వచ్చి శాంతింపుమని కోరెను. బ్రహ్మ ఉపశమించెను. అపుడు వానిశరీరమునుండి యెఱ్ఱని వర్ణముగల స్త్రీయొకతె జనియించెను. బ్రహ్మ యామెను మృత్యువని పిలచి నీవు జీవులను సంహరింపుచుండుమని యాజ్ఞాపించెను. ఆమె విచారించి, వగచి, యీకార్యము నేనుచేయలేను. నేను తపస్సుచేసికొందును అని హిమాలయము చెంతకు నరుగుచుండెను. బ్రహ్మ యామెను బిలిచి నీ కధర్మము రాకుండ వరమిత్తును. నీవు రాల్చిన యశ్రుకణములే రోగములగును. నీ వా పనిని జేయుచుండుము అనియెను. లోభము, క్రోధము, ఈర్ష్య, మోహము, అసూయ యనునవి ప్రజలను బాధించునట్లు చేయుమని మృత్యువు కోరెను. బ్రహ్మయట్లుచేసెను. అంతపై మృత్యువు జీవులను సంహరించుట కంగీకరించెను. భార.

మే

మేఁకపెంటిక:-కాటకోటఁడు అను గొల్లవాఁడు పెంటికను శివునిఁగ భావించుచు దానిపై క్షీర మంతయు నభిషేకము చేయుచుండెను. వాని తండ్రి గెలిసేయుచువచ్చి పెంటికను కాలితోఁ దన్నెను. ఈ కాటకోటఁడు దానిని సహింపలేక వాని తండ్రితలను దెగవేసెను. అప్పుడే కైలాస మందలి హర్మ్యక టములు విరిగి పడిపోయినవి. ఆ పెంటిక తత్క్షణమే శివలింగమై ప్రకాశించినది. బస.

మేఁకపెంటిక:-కోటఁ డను గొల్లవానికొడుకు కూటఁడనువాఁడు కలఁడు. ఒక బ్రాహ్మణుఁడు ప్రతిరోజును శివలింగమునకు క్షీరాభిషేకము చేయుచుండువాఁడు. ఆ తఁడు పాలనిమ్మని కోటు నడిగెను. వాఁడు తన కుమారు నిమ్మని చెప్పెను; ఆ పిల్లవాఁడు 'శివపూజ' యెట్టిదో తనకుఁ జెప్పిననేగాని పాల నీయననియెను. ఆ బ్రాహ్మణుఁడు ఒక మేఁకపెంటికపై పాలుపోయించి యిదే 'శివపూజ' యనిచెప్పెను. ఆ గొల్లపిల్లవాఁడు ప్రతిదినము నిట్లు చేయుచుండుటచే వాఁడు గృహమునకుఁ దెచ్చు పాలు తక్కువగుచుండెను. తండ్రి వాని నడుగఁగాఁ దాను 'శివపూజ' చేయుచున్నట్లు చెప్పెను: ఆ 'శివపూజ' చూపించుమని తండ్రియడుగఁగాఁ దండ్రిని దీసికొనివెళ్ళెను. అంత నా మేఁక పెంటిక శివలింగమై ప్రత్యక్షమయ్యెను. ఆ లింగమునే "కోట కూటేశ్వర లింగము" అని యందురు. ఆ ప్రదేశము నాటినుండియును శ్రీకోటకూటేశ్వరక్షేత్రమునాఁ బరగుచుండెను.

మేఘనాథుఁడు:-(చూడుము ఇంద్రజిత్తు.)

మేఘవర్ణుఁడు:-ఘటోత్కచుని కుమారుఁడు. ధర్మరాజు చేయు యాగమునకై యశ్వమును దెచ్చుటకు నితఁడు భీమునితో యౌవనాశ్వుని నగరమునకు వెళ్ళెను. యాగార్హమైన యశ్వమచ్చట నేయుండెను. దానిని యౌవనాశ్వుఁడు సంరక్షించుచుండెను. దానినిదెచ్చువిధ మెఱుఁగలేక భీముఁడు విచారించుచుండఁగా మేఘవర్ణుఁడు తన రాక్షసమాయచేత గుఱ్ఱమును హరించెను. అది యెఱింగి యౌవనాశ్వుఁడు యుద్ధమునకు వచ్చెను. పోరాటముకూడ నయ్యెను. తుదకు యౌవనాశ్వుఁ డశ్వము నిచ్చెను.

మేఘసంధి:-జరాసంధుని పౌత్త్రుఁడు. సహదేవుని పుత్త్రుఁడు. ఇతని రాజధాని రాజగృహపురము.

మేఘహాసుఁడు:-రాహువుకుమారుఁడు. తండ్రికి గలిగిన యాపదను దప్పించుటకై యితఁడు గౌతమీతీరమునఁ దపస్సుచేసెను. బ్రహ్మ.

మేదిని:-మధుకైటభులయొక్క మేధస్సు జలములలోఁబడి యదియే భూమియయ్యెను; అందువలన భూమికి మేదిని అను పేరువచ్చెను. దే. భా.

మేధ:-ధరణీ దక్షుల కుమారిత. ధర్ముఁడను మనువుయొక్క భార్య.

మేధాతిథి:—కణ్వునికుమారుఁడు. ఇతనికుమారుఁడు ప్రస్కంధుఁడు. భాగ.

మేధాతిథి:—చిరకారియొక్క తండ్రి. ఒకనాఁడతనికి భార్యపైఁ జాల కోపమువచ్చెను. కుమారునిఁ బిలిచి వెంటనే నీతల్లిని వధింపుమని యానతిచ్చెను. తల్లిని జంపవచ్చునా? తండ్రియాజ్ఞ మీరిన దోషము వచ్చునుగదా! యని యా దినమంతయును చిరకారి తర్కించుకొనుచునే యుండెను. అంతలో మేధాతిథికిఁ గోపముపోయెను. కుమారుఁడు భార్యను జంపెనేమోయని అతనికడకు వెడలెను. అతఁ డింకను ఆ కార్యము చేయకుండుట చూచి నాకును, నా తపస్సునకును నిందరాకుండను, నీకుఁ బాతకము లేకుండను జేసితివని సంతోషించెను. భాగ.

మేధాతిథి:—ప్రియవ్రతుని పుత్త్రుఁడు; ప్లక్షద్వీపమునకు రాజు. ఇతనికి శాంతుఁడు, భయుఁడు, శిశిరుఁడు, సుఖోదయుఁడు, శివుఁడు, క్షేమకుఁడు, ధ్రువుఁడు అను పుత్త్రులు గలరు. బ్రహ్మ.

మేధావి:—బాలధి యను మునిపుత్త్రుఁడు. బాలధి యిదివఱకుఁ జాలమంది పుత్త్రులను గోల్పోయి యుండుటచే దేవతలను బ్రార్థించి వారిదయచే దీర్ఘాయువగు ఈ పుత్త్రునిఁ బడసెను. ఈతఁడు దీర్ఘాయుష్యగర్వమున మునులతో ధిక్కరించి పలుకుచుండెడివాఁడు. పిమ్మట ధనుషాక్షుఁడను మునినిఁజేరి వానిని లెక్కచేయక గర్వముతోఁ బలుకఁగా నంత నతఁడు వీనిని యమపురమునకుఁ బంపెను. భార.

మేధావి:—ఒకబ్రాహ్మణుఁడు. ఆయువు జనులను దఱుముకొని వచ్చుచున్నది. జను లేమిచేయువారలో యనఁగా నితనితండ్రి యిట్టులనెను. "భార్యను, పుత్త్రులను బడసినపిమ్మట యాగములు చేసి పదపడి కానలకేగి ముక్తిమార్గము చూచుకొనవలయు" నన్న మేధావి "కాలము నీవశమైయున్నట్లు పల్కెదవు. తల్లిగర్భంబునఁ బడినప్పటినుండియు మృత్యువు హరింపవలెనని పొంచి చూచుచుండును. పశుయజ్ఞముకూడ హింసయేకదా! అనంతఫలము కాదు. వాఙ్మానసయజ్ఞమే మిక్కిలి మంచిది. క్రోధాదివిరోధులను జయించి నిన్ను నీవు తెలిసికొనుటకు యత్నము చేయుము" అని తండ్రితోఁగూడ నిదియే యుక్తమని యొప్పించెను.

మేనక:—ఒక అప్సరస. కపిల యనుదాని పుత్త్రిక. మునులతపస్సునకు భంగముచేయుటకు ఇంద్రుఁ డీమెను బంపుచుండును. ఈమెకు విశ్వామిత్రుని వలన శకుంతల జన్మించెను. పుత్త్రికను విడిచియే యీమె స్వర్గలోకమునకు మరలి వెళ్ళెను. విశ్వావసుఁడను గంధర్వరాజువలన నీమెకుఁ బ్రమద్వర జన్మించెను. ఆ పుత్త్రికనుగూడ విడిచి యీమె వెళ్ళిపోయెను. భార.

మేనక:—దక్షునియొక్క మనుమరాలు. స్వధయొక్క కూఁతురు. ఈమెయును, నీమెయప్పచెల్లెండ్రును ధన్య, కళావతియు విష్ణుమూర్తిని జూచుటకు వెళ్ళిరి. వానిని జూచుటకే సనత్కుమారులు కూడ వచ్చిరి. వీరిని జూచియు మేనకాదులు లేచి నిలుచుండలేదు. మమ్ములను నగౌరవము చేసిరి. కావున నరస్త్రీలై పుట్టుఁడని యా మునివరులు శపించిరి. తమ తప్పు మన్నింపుఁడని మేనకాదులు వారి పాదములపైఁ బడి వేఁడగాఁ గరుణించి "మేనక హిమవంతుని భార్యయగును. ఆమెకుఁ బార్వతి పుట్టును. ఈమెవలన మేనక స్వర్గము పొందగలదు" అనిరి.

మేనక:—వైరాజులను పితృదేవతల మానసపుత్త్రిక. ఈమెను హిమవంతుఁడు వివాహ మయ్యెను. విష్ణ్వాదులు వీరి గృహమునకువచ్చి శివుని భార్యయగు సతి వీరికిఁ గుమార్తెగఁ బుట్టునని చెప్పిరి. మేనక సదా సతినిగూర్చి జపము చేయుచుండెడిది. దేవి యామెకు బ్రత్యక్షమై వరము వేఁడుకొనుమనియెను. ఆమెకు నూర్గురుపుత్త్రిలు పుట్టునట్లును, దేవి యామె కుమారితగఁ బుట్టునట్లును మేనక కోరెను. మేనకకు మైనాకుఁడు, క్రౌంచుఁడు మొదలగు పుత్త్రులును, అపర్ణ, ఏకపర్ణ, ఏకపాటల అను కుమారితలును బుట్టిరి. అపర్ణయే పార్వతి.

పార్వతిని శివునకిచ్చి వివాహము చేయుటకు దేవతలును, హిమవంతుఁడును నిశ్చయించిరి. మేనకమాత్రము దిగంబరుఁడై శ్మశానములందుఁ దిరుగువానికి దనకూఁతు నిచ్చుట కిష్టపడలేదు

ఆది దేవతల యభీప్సితమని హిమవంతుఁ డామె కొఱకుపఱచి ఆమెచే ఒప్పించెను.

ఒకనాఁ డీమె కుమారితనుఁజూచి "పార్వతీ! నీభర్త శ్మశానములం దుండు నేమి? మీరింక నెంతకాలము మాయింట నుందురు?" అని యాక్షేపించెను. ఆ మాటలకుఁ బార్వతికిఁ గోపమువచ్చి భర్తతోఁ జెప్పెను. వారిరువురును హిమవంతునిగృహమునుండి వెడలిపోయిరి. బ్రహ్మ.

మేరుదేవి:- నాభియొక్క భార్య. ఈమెయందు శ్రీవిష్ణుమూర్తి కుమారుఁడుగఁ బుట్టి ఋషభుం డను పేరున మిక్కిలి ప్రసిద్ధిగాంచెను. భాగ.

మేరువు:- బంగారుపర్వతము. ఇది భూమిచుట్టు మేఖలవలె నుండును. దీనిచుట్టు సూర్యచంద్రులు తిరుగుచుందురు. ఈ పర్వతశిఖరములందు దేవతలు విహరించుచుందురు.

మేరువునకు ఆయతి, నియతి యను నిద్దఱు కూఁతురులు కలరు. వారిని ధాత, విధాతలకు నిచ్చి వివాహము చేసెను. బ్రహ్మ.

మై

మైందుఁడు:-వంకుఁడు.

మైత్రావరుణుఁడు:-పులస్త్యునియొక్క మానస పుత్త్రుఁడు. బ్ర. వై.

మైత్త్రేయి:- యాజ్ఞవల్క్యుని భార్య. యాజ్ఞవల్క్యునకుఁ గాత్యాయని యను మఱియొక భార్య కలదు. అతఁడు తపోవనమున కేఁగఁ బోవుచు భార్యల కొక యేర్పాటుచేయుటకై యీమెను బిలిచెను. ఎంత ధనమిచ్చినను శాశ్వతముకాదు. మాకు శాశ్వతానందము నిచ్చు దానిని బోధింపుము అని యీమె భర్తతో ఆధ్యాత్మికవిషయములను గూర్చి వాదించి అతనిచే బోధింపఁబడియెను. బృహ.

మైత్రేయుఁడు:- ఒక ముని. వనవాసము చేయుచున్న పాండవులనుఁజూచి ధృతరాష్ట్రునికడకు వచ్చి పాండవులకుశల మెఱింగించెను. వారితో మైత్రి చేసికొనుట దుర్యోధనునకు మేలని యును, కృష్ణుఁడు వారికి సహాయము చేయుచుండెనుగాన వారితోఁ బోరి గెలుచుట కష్టమనియును జెప్పెను. ఆమాటలు దుర్యోధనుఁడు విని నవ్వుచుఁ దొడలు సడలించుచు నేలను గీఱిచెను. మునికిఁ గోపమువచ్చి భీమునిచే నీ తొడలు విఱుగఁగొట్టఁబడునని శపించెను. శాపవిమోచనము చేయుమని ధృతరాష్ట్రుఁడు ప్రార్థించెను. దుర్యోధనునకు బుద్ధికలిగెనేని శాపము పోవునని మైత్త్రేయుఁడు చెప్పెను. కిమ్మీరుఁ డను దనుజుఁడు భీమునిచేఁ జంపఁబడుటయు నితఁడు ధృతరాష్ట్రునకుఁ జెప్పెను. విదురునకు ధర్మమును బోధించుమని యితనితో శ్రీకృష్ణుఁ డానతిచ్చెను. విదురుఁ డితనికడకు వచ్చి తత్త్వము నేర్చుకొనెను. భాగ.

మైనాకము:- ఒక పర్వతము. మేనకా హిమవంతుల కుమారుఁడు. ఇంద్రుఁడు పర్వతముల ఱెక్కలు విఱుగఁగొట్టుచుండుటచే నితఁడు భయపడి దక్షిణసముద్రములో దాఁగెను. హనుమంతుఁడు సముద్రము దాఁటునపుడు మైనాకము పైకివచ్చి తనపైవిశ్రమింపుమనికోరెను. అతఁడు కొంతతడవు విశ్రమించెను. రామా.

మొ

మొగలిపువ్వు:- బ్రహ్మయు, విష్ణుమూర్తియు దమయెదుట నావిర్భవించిన లింగముయొక్క యాద్యంతములుచూడ వెళ్ళిరి. బ్రహ్మ యూర్ధ్వముగఁ బోవుచుండెను. అతనికి మార్గమం దొక మొగలిపువ్వు కనఁబడెను. నీ వెక్కడినుండి వచ్చుచుంటివని బ్రహ్మయడిగెను. "ఈలింగముయొక్క యాది చూడవలెనని నే నెంతకాలము నుండియో వచ్చుచుంటినిగాని యింకను జేరలేకపోయితి"నని మొగలిపువ్వు చెప్పెను. "నే నీ లింగముయొక్క అంతము చూచుట కెంత కాలమునుండియో వచ్చుచుంటిని. కాని చూడలేకపోయితిని. నీవువిష్ణుమూర్తితో నేను

తుదను జూచివచ్చితి నని చెప్పుము” అని బ్రహ్మ చెప్పెను. మొగలిపువ్వు సరేయనియెను. లింగాదిని జూడలేక విష్ణుమూర్తి తిరిగివచ్చెను. వానితో బ్రహ్మ తాను అంతమునుజూచివచ్చితి నని చెప్పెను. వానికి మొగలిపువ్వు సాక్ష్యము పలికెను. విష్ణుమూర్తి నమ్మి బ్రహ్మకు నమస్కరించెను. అపుడు శివుఁడు ప్రత్యక్షమై వీరిద్దఱు నబద్ధములాడిరని మొగలిపువ్వునకు బూజయందర్హతలేకుండ శపించెను. అది శివుని బ్రార్థించెను. పూజకుఁ దగకపోయినను అందముగ నుండునట్లును, శిరములపై ధరింపఁబడునట్లును శివునిచే ననుగ్రహింపఁబడియెను. శివ.

మో

మోహిని:- క్షీరసాగరమును మథించఁగా నందుండి యమృతము పుట్టెను. దానిని మొదట దానవు లందుకొనిరి. దేవతలు తమ కది లభ్యము కాలేదని వగచుచు విష్ణుమూర్తికడకుఁ బోయి యమృతమును దమ కిప్పింపఁ బ్రార్థించిరి. దానవులయొద్దనుండి యమృతకలశము గైకొనుటకై విష్ణువు జగన్మోహిని రూపముదాల్చి వచ్చెను. అప్పటికి దానవులొకరిచేతినుండి యొక రమృతభాండము నందుకొనుచుండిరి. జగన్మోహిని వారినిఁజేరి మీరు తగవు లాడకుఁడు. మీకందఱకును నేను పంచెదనని చెప్పఁగా నామెచేతికి నమృతభాండ మిచ్చిరి. ఆమె దేవతల నొకపంక్తిగను, దానవుల నొక పంక్తిగను గూర్చుండఁబెట్టెను. ఆమె దివ్యసుందరరూపమును చూచి దానవులు మైమఱచి యుండిరి. ఆమె యమృతమును దేవతలకే పంచిపెట్టుచుండెను. అపుడు రాహువు దానవులపంక్తిలో నుండి వచ్చి దేవతలమధ్య కూర్చుని యమృతమును గైకొనెను. ఇతఁడుచేసినమాయ సూర్యచంద్రులు చూచి విష్ణువునకుఁ జెప్పిరి. విష్ణువు రాహువును జక్రముతోఁ గొట్టెను. తుదకు దానవుల కమృతము లేకపోయెను. భార.

విష్ణుమూర్తియొక్క జగన్మోహినిరూపమును జూచి మైమఱచి దానవు లమృతమును గోల్పోయిరని శివుఁడు వినెను. అట్టిరూప మెంత మనోహరముగానుండునో తనకునుజూపుమని శివుఁడు విష్ణుమూర్తిని వేఁడెను. విష్ణు వంతర్ధానము నొందెను. అతఁ డెచటికేగె నని శివుఁడు నలుమూలలు పరికించులోపున వాని యెదుట జగన్మోహినిరూపముతో నుండెను. శివునకు మతి భ్రమించెను; ఆమెను బట్టుకొనఁబోయెను. ఆమె పరుగిడెను. ఆమె వెనుకనే శివుఁడు పరుగిడెను. అట్లు మెట్టలు, పుట్టలు లెక్కసేయక పోవుచుండిరి. తుదకు శివునివీర్యము జారి నేలపైఁ బడెను. ఇదియే కాలభైరవుం డయ్యెను. అపుడు విష్ణుమాయ తెలిసికొని శివుఁడు ప్రార్థించఁగా విష్ణువు స్వస్వరూపమును దాల్చెను. భాగ.

మౌద్గల్యుఁడు:- ఒక ముని. నాలాయని యైన యింద్రసేన యితని భార్య. ఇతఁడు కుష్ఠవ్యాధిచే బాధపడుచు, అసహ్యరూపుఁడై యుండువాఁడు. అయిన నీతనిభార్య పతిభక్తిచే నితని యుచ్ఛిష్టము తినుచు నొకనాఁ డన్నములో నూడిపడిన యితని వ్రేలు వచ్చినను వెగటొందక దానిని తీసివేసి యా యన్నమే భుజించెను. ముని యామె పతిభక్తికి మెచ్చుకొని 'నీ కోరిక తీర్చెదను తెల్పు' మనియె. “నాకు కామభోగేచ్ఛ మెండుగాఁ గలదు. నీ తపోమహిమచే నీవు మనోహరరూపమును దాల్చి పంచధావిభక్తుఁడవై నాతో డరమింపు” మని కోరెను. ముని ఆమె కోరికతీర్చి యామెతో భోగించి తిరిగి తపస్సు గావించుకొని బ్రహ్మలోకము నొందెను. భార.

మౌద్గల్యుఁడు:- శాకల్యుని శిష్యుఁడు. తాను నేర్చిన ఋగ్వేదసంహితను 'జాతుకర్ణి' అను వాని కుపదేశించెను. భాగ.

య

యక్షప్రశ్నలు:- యక్షుఁడువేసిన చిక్కుప్రశ్నలు. వనవాసము పండ్రెండుసంవత్సరములు ముగియుటకు వచ్చినపుడు బ్రాహ్మణుఁడొకఁడు ధర్మజునియొద్దకువచ్చి తన యరణిని నొక మృగ మెత్తుకొనిపోవుచున్నది. దానిని దెచ్చియిమ్మని

కోరెను. ధర్మజుఁడు సోదరులు ఆమృగమువెంట నరిగిరి. అది యదృశ్యమయ్యెను. దానిని దఱిమి వారలసటనొంది దప్పికొనిరి. దగ్గఱగా నీర మున్నచోఁ గొనితెమ్మని ధర్మరాజు నకులునిఁ బంపెను. అతఁడొక కొలనునుజూచి యందు దిగఁ బోవుచుండఁగా నొకయశరీరవాణి "యీకొలను నాది. నీవు నీరు త్రాఁగదలఁతువేని ముందుఁగా నాప్రశ్నలకు సమాధానమిమ్ము" అనిచెప్పెను. అతఁడు లక్ష్యపెట్టక నీరు త్రాగెను. కాని స్పృహతప్పి పడిపోయెను. అతఁడెంతకును రాకపోవుటచే సహదేవునిఁబంపెను. ఆతనికి నట్లే యయ్యెను. తరువాత నర్జునుని, భీమునిఁగూడఁ బంపెను. వారికి నట్లే జరిగినది. పిమ్మట వారికై దుఃఖించుచు ధర్మజుఁ డరిగెను. ఆ యశరీరవాణి "నేనొక బకమును. ఈ కొలను నాది. నీవు నీరు గొనదలఁతువేని ముందుగా నాప్రశ్నలకు సమాధాన మిమ్ము. వీరు నిర్లక్ష్యముచేసి యిట్లు నిస్పృహులై పడియుండిరి" అనెను. "నీవు బకమవు కాఁజాలవు. ఎవ్వరవో మహానుభావుఁడవు. బకమునకు నా సోదరులు నిస్పృహులగు వారు కారు" అని ధర్మజుఁడు పలికెను. "నేను బకమునుగాను. ఒకయక్షుఁడను" అని మహోగ్ర రూపమున నాకొలనుచెంత నిలిచి "నా ప్రశ్నలకు సమాధానమును జెప్పకయే యీ నీరము ను ద్రావినవారు మరణింతు"రని చెప్పెను. "నా నేర్చినకొలఁదిని సమాధానమును జెప్పెదు" నని ధర్మజుఁడు పలికెను. అంత యక్షుఁడు "సూర్యుని నేది నడుపును ? వాని కాధార మెయ్యది ? పురుషుఁ డేఖిట సహాయుతుఁడగును ? ఏమిట బుద్ధిమంతుఁడగును ? జీవన్మృతుఁ డెట్టివాఁడు ? నిద్రించియు నేది కన్నుమూయదు ? పుట్టియు నేది చేతనత్వంబు నొందదు ? మనుజుఁ డేదివిడిచి సర్వజనప్రియుఁ డగును ? నిశ్శోకుఁడగును? ఏది విడిచి యర్థవంతుఁడగును ?" అని యిట్టిప్రశ్నలు వేసెను. వీని కన్నింటికిని ధర్మరాజు సమాధానమును జెప్పఁగా నా యక్షుఁడు సంతోషించి "నీతమ్ములలో నొక్కనిని బ్రతికింతును. కోరు కొను"మనియెను. ధర్మరాజు నకులుని బ్రతికింపు మనెను. "కుంతీపుత్రులలో నేనుంటిని కావున మాద్రీపుత్రులలో నొకనిని బ్రతికింపుమనికోరి తిని. కావున దయయుంచి వానిని బ్రతికింపుము" అని కోరెను. ఆ యక్షుఁడు మెచ్చుకొని వారి నందఱను బ్రతికించెను. అంత నా యక్షుఁడు "నేను యమధర్మరాజును. ఈ రూపమునమిమ్ముఁ బరీక్షించుటకు మృగమును, బ్రాహ్మణునిఁగల్పించితిని అనిచెప్పి, మీకు వనవాసము ముగిసినదని యును, అజ్ఞాతవాసములో మీరుకోరిన రూపములు మీకువచ్చుననియును, మిమ్మునెవ్వరును గుర్తింపలే" రనియును జెప్పి యంతర్ధానము నొందెను.

యక్షుఁడు:-యక్షుఁడనువాఁడు క్రతుస్థల యను చిన్నదానిని వివాహము కాఁగోరెను. కాని యామె యంగీకరించినదికాదు. ఆమె వసురుచి అనుగంధర్వుని వలచియుండెను. దీనిని యక్షుఁడు తెలిసికొని వసురుచి రూపమును దాల్చివచ్చెను. అతఁడే వసురుచి యని క్రతుస్థల నమ్మి వానికి భార్య యయ్యెను. వారికి రజతనాభుఁడను కుమారుఁడు పుట్టెను. పిమ్మట యక్షుఁడు తన నిజరూపమును దాల్చెను. క్రతుస్థల వాఁడుచేసిన మోసమునకు విచారించి యిఁక జేయునదిలేక వానితోడనే కాఁపురముచేసెను. బ్రహ్మ.

యజ్ఞకోపుఁడు:- మాల్యవంతునికుమారుఁడు. రామా.

యజ్ఞదత్తుఁడు:-ఒక బ్రాహ్మణబాలుఁడు. తన వృద్ధపితరులకొఱకు కొలనులో నీరు ముంచుచుండఁగా దశరథుఁడు వీనిని ఏనుఁగను భ్రాంతితో బాణమువేసి కొట్టెను. శరహతుఁడై యీ బాలుఁడు పెద్దకేకవేసి నేలంబడియెను. అంత దశరథుఁడు వీనిని సమీపించెను. తన తల్లిదండ్రులు దాహములో నున్నారనియును, వారికి జలమును గొనిపొమ్మనియును యజ్ఞదత్తుఁడు దశరథునితోఁ జెప్పి ప్రాణములు విడిచెను. రామా.

యజ్ఞదత్తుని కుమారుఁడు:- యజ్ఞదత్తుఁడను బ్రాహ్మణుఁడు సదాచారము గలవాఁడు. ఇతనికి లేకలేక యొకకుమారుఁడు దుర్మార్గుఁడు, చోరుఁడు, జారుఁడు నగువాఁడు పుట్టెను. యజ్ఞదత్తుఁడు కుమారుని మందలించుచుండినను వాని భార్య గారాబముగఁ జూచుచుండెను. కావున నతఁడు కుమారుని, భార్యనుగూడ వదలిపెట్టెను.

ఈ కుమారునకుఁ దిండిలేకపోయెను. ఒకఁడు శివారాధనము కావించి ప్రసాద మొక్కచో నుంచుకొనఁగా వీఁడు దొంగిలించి దానిని భక్షించెను. వీనిని భటులు పట్టుకొనఁబోయిరి. కాని శివప్రసాదము తినెను గావున దాని మాహాత్మ్యమువలన వీఁడు భటులకన్నులకుఁ గనఁబడకుండఁబోయెను. వీనికి నవసానకాలము వచ్చినది. వీనిని గొనిపోవుటకు యమదూతలును, విష్ణుదూతలునుగూడ వచ్చిరి. వీనిని గొనిపోవుటకు వారిలో వారికి సంవాదము జరిగెను. తుదకు వీఁడు శివప్రసాదము భక్షించెనుగాన విష్ణుదూతలే వీనిని దీసికొని వెళ్ళిరి. ఇతఁడు తరువాతిజన్మమున అరిందముఁడను రాజకుమారునకు దనుఁడు అనువాఁడుగాఁ బుట్టెను. శివ.

యజ్ఞ పురుషుఁడు:- యజ్ఞమూర్తి. విష్ణుని యవతారము. పూర్వము యజ్ఞములను ధ్వంసము చేయుచున్న దానవుని జంభుఁ డనువానిని సంహరించెను. భార.

యజ్ఞ వరాహము:-స్వారోచిషమనువును సృష్టి నొంపొందించి భూపరిపాలనమును బెంపుచేయుమని బ్రహ్మ చెప్పెను. అప్పుడు భూమి రసాతలమందు నీళ్ళలో మునిగియున్నది. వారు నిలుచుటకుఁ జోటేది ? యని మనువు బ్రహ్మ నడిగెను. అంత బ్రహ్మ యిప్పుడేమి చేయవలయునని పరమేశ్వరునిఁగూర్చి తలఁపోయుచుండఁగా నతని నాసికా రంధ్రమునుండి యంగుష్ఠమాత్రుఁడు క్రిందఁబడి క్షణములో నేనుగంతయై పరమేశ్వరుఁడు వరాహరూపమున జలముక్రిందకుఁ బోయి భూమిని లేవనెత్తెను. భాగ.

యజ్ఞుఁడు:-ఆకూతీ రుచిప్రజాపతుల కుమారుఁడు. ఇతఁడు పెద్దకుమారుఁడగుటచేఁ దండ్రియాతనికి రాజ్యమిచ్చెనుగాని యితఁడు "రాజులు రాజ్యముతో నొడలెఱుంగరు. ముక్తిరతునకదితగ"దని రాజ్యమునువిడిచి తపోవనమునకుఁ బోయెను. ఇతఁడు విష్ణ్వంశగలవాఁడు. ఇతని తోబుట్టువు దక్షిణ. ఈమె లక్ష్మీయంశమునఁ బుట్టెను. వీరిరువురును బరిణయమైరి. వీరలే యాదిమిథునము. వీరికి తోషుఁడు, ప్రతోషుఁడు, సంతోషుఁడు, భద్రుఁడు, ఇధ్మ్యుఁడు, కవి, విభుఁడు, వహ్ని, సుదేవుఁడు, రోచనుఁడు అను కుమారులు జన్మించిరి. భాగ.

యజ్ఞుఁడు:- స్వాయంభువు మనువునకు దౌహిత్రుఁడు. ఈతఁడు రుచియింటఁ బెరుగుచుండెను. ఆమెయితనినిఁ బతిఁగాఁగోరెను. స్వాయంభువు కూడ నీతనిని బెంచుచుండెను. స్వాయంభువును, నాతనిభార్య శతరూపయును సంసారమును విడిచి సునందానదీతీరమునఁ దపస్సు చేసికొనుచుండగా రాక్షసులు వానినిఁదినవచ్చిరి. అప్పుడు యజ్ఞుఁడారక్కసులను సంహరించెను. భాగ.

యతి:- నహుషుని కుమారుఁడు. యయాతి సోదరుఁడు. భార.

యదువు:- దేవయానీయయాతుల పుత్త్రుఁడు; ఇతని యౌవనము తనకిచ్చి తన జరాభారముు వీనిని గైకొనుమని యితని తండ్రి కోరెను. యదువు దానికంగీకరింపలేదు. తండ్రిని తిరస్కరించెను. అందుచే యదువును, వీని వంశమువారలును రాజ్యార్హులుకాకుండునట్లు యయాతి శపించెను. భార.

యదువు:-ఉపరిచరవసువు కుమారుఁడు. భార.

యమి:- యముని భార్య, వీరే యాదిదంపతులు. వారికాలమున సర్వదా పగలేకాని రాత్రిలేదు. యముఁడు చనిపోయెను. ఆమె సదా యీదినమే నాభర్త చనిపోయెనని యేడ్చుచుండెను. ఎంత చెప్పినను ఆమె మఱచినదిగాదు. అంత దేవతలాలోచనచేసి రాత్రినిగల్పించిరి. మఱునాఁడు యమి భర్తను మఱచెను.

యముఁడు:-యమి భర్త.

యముఁడు:- దిక్పాలురులలో నొకఁడు. దక్షిణ దిక్కునకధిపతి. ఇతఁడుసూర్యునిపుత్త్రుఁడు. ఇతని తల్లి సంజ్ఞ. సూర్యుని తేజస్సు సహింపలేక తన ఛాయను సూర్యునొద్దనుంచి తాను బుట్టినింటి కరిగెను. యమునకును, ఛాయకును అనిష్టము కలిగెను. ఛాయ తనపుత్త్రుల నాదరించుచుఁ దన నవాదరణచేసెనని యమునకును గోపమువచ్చి ఛాయనుదన్నెను. కాలువిఱిగి నేలపైఁ బడుమని యామె వీనిని శపించెను. అతఁడు తండ్రిలోఁ

తప్పిపోయెను. అతని పాదము క్రిందఁబడి క్రిములచేఁ దినఁబడినపిమ్మట శాపవిమోచన మగునని సూర్యుఁడు చెప్పెను. ఇతఁడు శాపభయముచేతనే ధర్మమును గాపాడుకొనుచుండెను. అందువలననే ఇతనికి ధర్ముఁడను పేరువచ్చినది. ఇతని ధర్మగుణమునుబట్టియే యితనికిఁ బితృలోకాధిపత్యము కల్గినది.

మార్క. బ్రహ్మ.

యమునిభార్యలు ధూమోర్ణ, విజయ యను వారలు. చిత్రగుప్తుఁడు, లేఖరి, చండుఁడు, మహాచండుఁడు భృత్యులు. యమునకు వట వృక్షము ప్రియము.

కుంతియందు యమునకు ధర్మరాజు జన్మించెను.

మాండవ్యుఁడను ముని తపస్సు చేసికొనుచుండఁగాఁ జోరుని వెదకుటకై వచ్చిన రాజభటులువీనినిజూచి వీఁడెచోరుఁడని గొనిపోయిరి; రాజు వీనిని గొఱత వేయించెను. ఇతఁడు మరణించి పరలోకమున కేగి నాకేల యిట్టి శిక్ష విధించితి ?" వని యముని నడిగెను. "నీవు చిన్ననాఁడు తూనీగలను బట్టుకొని గొఱతవేసితివి. ఆ పాపముచే నీకిపు డిట్టిశిక్షకలిగినదని యముఁడు ప్రత్యుత్తరమిచ్చెను. అంతమాత్రమున కిట్టి శిక్ష విధించెదవా ? యని కోపగించి నీవు మర్త్యరూపమున శూద్రస్త్రీయందుఁ బుట్టుమని మాండవ్యుఁడు యముని శపించెను. ఆ కారణమున యముఁడు విదురుఁడుగా జన్మించెను.

ఆ నూటేండ్లును అర్యముఁడు పాపకర్ములను శిక్షించుచు యముఁడుచేయుపనిని నిర్వహించుచుండెను.

భాగ.

శ్రీరామునియవతారము ముగియుకాలము వచ్చినదని తెల్పుటకై యముఁడు బ్రాహ్మణ వేషమున వచ్చి రామునితో రహస్యముగ మాటాడఁ గోరెను. వీరు మాటలాడుచుండినపు డెవ్వరేని వచ్చినచో వారి శిరచ్ఛేదము చేయునట్లు రాముఁ డానతిచ్చెనేని మాటాడెద ననియెను. రాముఁడు సరే యనియెను. రామునితో, "నీవు విష్ణుమూర్తివి. 'స్వర్గమునుండి వచ్చి చిరకాలమైనది. మరల నీవు స్వర్గమునకు వచ్చుకాలము సమీపించినది" అని నుడువుచుండఁగా లక్ష్మణుఁడు లోపలకు వచ్చెను. అంత నితఁ డంతర్ధానము నొందెను.

రామా.

యమున:-సూర్యుని కుమారిత. ఈమె నదీరూపమునుదాల్చి ప్రవహించుచుండెను. బలరాముఁడు బంధువులను జూడ వెళ్ళినపుడు గోపికలతో యమునకు స్నానమునకు వెళ్లెను. వెళ్ళి యమునను బిలచెను. ఆమె రాలేదు. బలరాముఁడు, "నీవు రానిచో నిన్నుఁ జీల్చెద" వని హలమును దివిచెను. ఆమె భయపడి స్త్రీరూపమున వచ్చి వినీలాంబరమ్మును లిచ్చి చనియెను. హలమును దివుచుటచే యమున అప్పటినుండియుఁ దెల్లగ నయ్యెను.

భాగ.

యయాతి:- చంద్రవంశపు రాజు. నహుషుని కుమారుఁడు. ఇతనితల్లి ప్రియంవద. ఒకనాఁడు యయాతి వేఁటకుఁ బోయినపుడు నూతఁబడి ఏడ్చుచుండిన దేవయాని అను శుక్రునికుమారిత యేడ్పు విని యామెను నూతినుండి బయటకుఁ దీసి రక్షించెను. తదనంతరము దేవయాని తన దాసియైన శర్మిష్ఠ మొదలగువారితో వనవిహారము సల్పుచు యయాతినిఁ జూచి మోహించి వెనుక నూతినుండి వెలుటకుఁ దీయునపుడే తన దక్షిణ హస్తమును యయాతి గ్రహించెనుగాన నిపుడు తనను భార్యగఁ గైకొనుమని కోరెను. ఆమె బ్రాహ్మణబాలికయును, దాను క్షత్రియుఁడును గావున నట్టివివాహము దోషమని యితఁడు పలికెను. కాని దేవయాని ఈతననే వలచియుండుటచేఁ దండ్రి కడకేఁగి యపక్రమ దోషము లేకుండ నతని యనుమతిని బడసి ఈతనిని వివాహమయ్యెను. యయాతి దేవయాని దాసియగు శర్మిష్ఠనుగూడఁ దన నగరమునకుఁ గొనిపోయి యామెను వేఱుభవనమునం దుంచెను. దేవయానికి యదువు, తుర్వసువు అను నిద్దఱు పుత్రులు కలిగిరి. బుతుమతియైన శర్మిష్ఠయుఁ దనకుఁ బుత్రదానము సేయుమని రాజును బ్రార్థింపఁగా యయాతి యామెకోరిక తీర్చెను. ఆమెకు ద్రుహ్యువు, అనువు, పూరుఁడు అను కుమారులు పుట్టిరి. దీనిని దేవయాని తెలిసికొని తనభర్త తనదాసితో సంభోగించి తన నవమానము చేసెనని కోపగించి యితనిని విడచి తండ్రి యొద్దకుఁ బోయెను. తనభర్త తన నవమానపఱచెనని చెప్పి యేడ్చెను. శుక్రుఁడు పుత్రికయందున్న ప్రేమాతిశయముచే జరాభారపీడితుఁడవు కమ్మని యయాతిని శపించెను.

యయాతి శాపమునకు విచారించుచు, "అయ్యా! ఋతుమతినై పుత్రార్థినినై వచ్చిన భార్యకు ఋతువిఫలత్వము చేసినచో భ్రూణహత్యా పాతకమగునని భయపడి యట్లు చేసితిని. నన్ను మన్నింపుఁ"డని శుక్రుని ప్రార్థించెను. నీ కుమారులలో నొక్కఁడు నీ జరాభారమును గైకొనిన నీవు మరల యౌవనవంతుఁడవగుదువని శుక్రుఁడు అనుగ్రహించెను. అంతట యయాతి తనపుత్రులను బిలచి తన కింకను భోగేచ్ఛ గలదుకావున తన జరాభారమును గైకొమ్మని కోరెను. పుత్రులు తిరస్కరించిరి. కుమారు లిట్లు తిరస్కరించుటచే యయాతికిఁ గోపము వచ్చి తన కుమారులను వారివంశములను యదువంశమువారు రాజ్యమున కయోగ్యులుగను, తుర్వసువంశమువారు ధర్మాధర్మ వివేకశూన్యులై కిరాతులకు రాజులగునట్లుగను, ద్రుహ్యువంశమువారు ముదిమిరాకుండఁగనే మృతులగునట్లును శపించెను. పదపడి తన చిన్న కుమారునిఁ బూరునిఁ బిలిపించి తన ముసలితనము గైకొందువా ? యని యడుగ నతఁ డంగీకరించెను. పూరునకుఁ దన ముసలితనము నిచ్చి యయాతి యౌవనవంతుఁడై చిరకాలము భోగములనుభవించెను.

యయాతితో నింద్రుఁడు సఖ్యమునుగావించి యతని కొక రథ మిచ్చెను. ఆ రథ మెక్కి వెళ్ళి యతఁడు వైరినృపుల నడంచువాఁడు. కావున నితనికి 'మహారథి' యను పేరువచ్చెను.

అట్లు యయాతి భోగము లనుభవించిన పిమ్మటఁ దన ముసలితనము తాను గ్రహించి పూరునకు యౌవనమిచ్చి వానిని రాజ్యాభిషిక్తుని గావించి తాను కాననమునకేగి ఘోర తపస్సుచేసి బ్రహ్మలోకమునకు, దేవలోకమున కేగెను.

స్వర్గలోకమున నింద్రుఁ డితని తపస్సును మెచ్చుకొనగా నా తపస్సున కిచ్చటివారి తపస్సు సాటిరాదుకదాయని పలికెను. అచ్చట మహర్షుల తపమును గూర్చి యితఁ డట్లు చులకనఁగా గర్వముతోఁ బలికెను గావున నింద్రునకుఁ గోపమువచ్చి యయాతిని స్వర్గలోక భ్రష్టుని గావించెను. యయాతి భూలోకమునకుఁ బోనొల్లక యంతరిక్షమునసన్ముఖవంబున తత్సంగతి నుండునట్లుగా నింద్రునిఁ గోరి యతని యనుమతి వట నుండెను. అచ్చటనే తన దౌహిత్రులతోఁ గొంతకాలము సాంగత్యముచేసి తిరిగి యూర్ధ్వ లోకమునకుఁ బోయెను. భార.

యయాతి:-ప్రతిష్ఠానపురాధీశ్వరుఁడు. మాధవి తండ్రి. గాలవుఁడును, గరుడుఁడును నితనికడకు వచ్చి తమకు నొకచెవి నీలవర్ణమైన తెల్లని గుఱ్ఱములు కావలయుననియును, నితనికడఁ గలవేని యిమ్మనియును గోరిరి. ఇతనికడ నట్టివి లేవు. కావున వారికిఁ దన పుత్రికను మాధవి నిచ్చి యీమె నేరాజునకైన నిచ్చి మీకుఁ గావలసిన గుఱ్ఱములను బుచ్చుకొనుఁడని చెప్పి పంపెను.

యవనాశ్వుఁడు:-విశ్వగంధుని కుమారుఁడైన చంద్రుని పుత్త్రుఁడు. ఇతని పుత్త్రుఁడు శవస్తుఁడు. భాగ.

యశోమతి:-(యశోవతి) ఏకావళియొక్క చెలికత్తె. ఏకావళిని కాలకేతుఁ డెత్తుకొనిపోయినపుడామెతోఁగూడ యశోమతి పాతాళలోకమునకు వెళ్ళెను. ఏకావళితో "నన్నుఁ బెండ్లియాడుమనిచెప్పు"మని కాలకేతుఁ డీమెనుగూడ నిర్బంధించెను. ఈమె తనచెలి బంధవిమోచనమునకై దేవిని ప్రార్థింపఁగా నామె హయహయుఁడు వచ్చి విడిపించునని చెప్పెను. హయహయునిఁ గానక యీమె గంగాతీరమున నేడ్చుచుండఁగా నేడ్పువిని హయహయుఁడే వచ్చి యీమె వృత్తాంతమడిగి తానే హయహయుఁడనని తెల్పెను. ఈమె వానిని గాలకేతుఁడున్న తావునకుఁ గొనిపోయెను. హయహయుఁడు వానిని జంపి వీరిని గాపాడెను. దే. భా.

యశోద:-కృష్ణునిఁ బెంచినతల్లి. గోపకాంత. ఈమె పూర్వజన్మమున ధర యను ద్రోణుని భార్య.

యశోధర:-హస్తిభార్య. వికుంఠనుని తల్లి. భార.

యశోవతి:-(చూడుము యశోమతి.)

యా

యాజి:-ఒక బ్రాహ్మణుఁడు. ఇతని సోదరుఁడు ఉపయాజి. వనములోరాలిన ఫలము నొకదానిని శుచియో అశుచియో విచారింపక యాజి భక్షించుచుండెను. ద్రుపదుఁడు గోవుల నిచ్చెదనని చెప్పి పుత్త్రేష్టి చేయించుమని ఉపయాజిని గోరెను. అతఁడు తానొల్లక యాజిని గోరుమనియెను. ద్రుపదుఁడు యాజిని వేఁడెను. యాజి యాగమును గావించి యతనివలన గోవులను బొందెను. (చూడుము ఉపయాజి) భార.

యాజ్ఞవల్క్యుఁడు:-దేవరాతుఁడనుముని పుత్త్రుఁడు. దేవరాతుఁడు శివునిగూర్చి తపస్సు చేయఁగా నతఁడు ప్రత్యక్షమై వరమును వేడుకొమ్మనియె. నీవంటిపుత్త్రునిమ్మని యాముని కోరెను. నావంటి వాఁడింకొకఁడులేడు. నేనే నీకుఁ బుత్త్రుఁడుగా జన్మించి సూర్యునందలి శుక్ల యజుర్వేదమును భూమిపై వ్యాపింపఁ జేయుదునని చెప్పి యంతర్ధాన మయ్యెను. ఆ ముని గృహమునకు వచ్చి క్రతువుచేయఁగా యజ్ఞవేదియందు సూర్యకాంతులతోఁ దేజరిల్లు శిశువుండెను. వానిని దేవరాతుఁడు పెంచి యాజ్ఞవల్క్యుఁడని పేరుపెట్టెను. ఇతఁడు పైలుని శిష్యుండగు బాష్కలుండను మునివలన ఋగ్వేదమును, జైమినియను మునివలన సహస్రశాఖలుగల సామవేదమును, మహాముని వలన అథర్వణవేదంబును, వైశంపాయన ముని వలన యజుర్వేదంబును సాంగములుగాఁ బఠించెను. ఇతఁడు వైశంపాయనుని సన్నిధిని బఠించుచుండఁగా వైశంపాయనుఁడు జనకునికోరికపై తన శిష్యులలో నొక్కొకని జనకుని గృహమున కతిథిగాఁ బంపుచుండెను. ఒకనాడుయాజ్ఞవల్క్యుఁడు జనకునిగృహమున భుజించి యక్షతలతో సభకువచ్చి రాజును బిలువుమని యట నున్నభటునకుఁ జెప్పెను. ఆనాడు రాజు వేటకు వెళ్ళెనని భటుఁడు చెప్పెను. రాణిని బిలువుమనెను. ఆమె యశుచియై యున్నదని భటుఁడు చెప్పెను. అంత యాజ్ఞవల్క్యుఁడు తనచేతనున్న యక్షతలను సింహాసనముపైనను, గుజ్జుపాల యందును జల్లెను. అవి పల్లవములతోను, పుష్పములతోను శోభిల్లెను. రాజగృహమునకు మరలి వచ్చి వానిఁ జూచి విస్మయమునొంది యాజ్ఞవల్క్యునిఁ జూడఁగోరి వానిదగ్గఱకువెళ్ళి వాని బోధనలు విని మిక్కిలి యానందము నొందెను.

యాజ్ఞవల్క్యుఁడు:-బ్రహ్మరాతుఁ డను ముని పుత్త్రుఁడు. వైశంపాయనుని శిష్యుఁడు. జనకుఁడు యాగముచేయుచు మునులను రావించి వారిలో ఘనుఁడగువానిని మిక్కిలి సన్మానింపఁదలఁచి వచ్చినవారిలో నగ్రగణ్యుఁ డెవరో తా నేర్పఱుపఁజాలక అయ్యా! మీలో మిక్కిలి శ్రేష్ఠుఁడైనవానికి ధనరాసు లిదే యుంచితిని. వీనికి నర్హుండగువాఁ డెవఁడో మీరే నిర్ణయించుకొనుఁడు. అనగా బ్రాహ్మణులు "నేనుఘనుఁడను, నేనుఘనుఁడను" అని తగవులాడుకొనిరి. నేనే ఘనుఁడను అని యాజ్ఞవల్క్యుఁడు వచ్చి తన శిష్యులను బిలచి ధనరాసులు గొనిపొమ్మని చెప్పెను. అచ్చటఁ జేరిన బ్రాహ్మణులకు నీర్ష్యజనించెను. వారందఱొకటై యితనితో వాదించిరి. కాని యితఁడే వారి నోడించెను. తరువాత శాకల్యముని వచ్చి వానితో వాదింపుమనియెను. ఓడిపోయినవారు ప్రాణము విడచుటకుఁ బన్నిదము వేసికొనిరి. శాకల్యుఁడు వేయిప్రశ్నలను వేసెను. వాని కన్నిటికి యాజ్ఞవల్క్యుఁడు సమాధానమిచ్చెను. యాజ్ఞవల్క్యుఁడు వేసిన యొక్క ప్రశ్నకును శాకల్యుఁడు జవాబు చెప్పలేకపోయెను.

తొల్లి మునులు కొందఱు మేరునగంబున కరిగి "మునులందఱును నిచ్చటి కేడు దినములలోపున వచ్చితీరవలయును. "రానిచో బ్రహ్మహత్యాపాతకము చుట్టుకొను" ననిరి. వైశంపాయనుఁడు వెళ్ళలేకపోయెను. బ్రహ్మహత్యాపాతకము పైఁబడిన, దానిని సహింపలేక వైశంపాయనుఁడు శిష్యులను బిలచి "నాకిది భారంబయ్యెను; ఈపాతకమును మీరు భరించెదరే!" యని యడుగుచుండఁగా యాజ్ఞవల్క్యుఁడు వచ్చి, "గురువరా! ఇదెంతపని? మీపాతకము నేను వహించి నావిద్యమెయి దాని నవలీలగఁ బోఁగొట్టఁగలవాఁడ" నని పలికెను.

వైశంపాయనుఁడు తన మేనల్లుని దన్నఁగా బ్రహ్మహత్యతోడ సమానమైనపాతక మాతనిఁ

జొచ్చుకొనియె. దాని నెట్లు పోఁగొట్టుకొనుట యని బ్రాహ్మణులతో నాలోచించుచుండఁగా యాజ్ఞవల్క్యుఁడు వచ్చి వీరి కేమి దెలియును ? నీపాతకముపోవు నుపాయము నేను జెప్పవాఁడ నని పలికెను.

ఆ మాటలకు వైశంపాయనునకుఁ గోపము వచ్చి "యింతమదముతోఁ బలికెదవుగా ? నీ విటనుండఁదగవు. ఎటకేనిపొమ్ము. నేఁజెప్పిన విద్య మరల నాకేవచ్చుఁగాక" యనిశాసించెను. యాజ్ఞవల్క్యుఁడు వైశంపాయనుని వలన నేర్చికొనినవిద్యను నచ్చటనే కక్కివేసి వెడలి సూర్యుని బ్రార్థించెను. సూర్యుఁడు గుఱ్ఱము రూపమునవచ్చి, వీనికి శుక్ల యజుర్వేదమును యజుస్సుల నుపదేశముచేసెను.

యాజ్ఞవల్క్యునకు మైత్రేయి, కాత్యాయని అను నిరువురు భార్యలు కలరు. అతఁడు సంసారము విడిచి తపోవనమునకుఁ బోవుచు భార్యల కొక యేర్పాటుచేసెదనని వారితోఁ జెప్పెను. ఎంత ధనమిచ్చినను నది శాశ్వతముకాదని యును, శాశ్వతానందము కలుగఁజేయుదానిని నుపదేశింపు మనియును మైత్రేయి కోరెను. యాజ్ఞవల్క్యుఁడు వారికి బ్రహ్మజ్ఞాన ముపదేశించి చనియెను. బ్రహ్మ. విష్ణు.

యాదవకులమునకు ముసలము:- విశ్వామిత్రాదిత దుర్వాసాదులు శ్రీకృష్ణుని సందర్శించుటకై సమీపముననున్న పిండారక మను పుణ్యతీర్థమునకుఁ బోయిరి. అచ్చట యదుకుమారులు సాంబునకు గర్భవతివేషముచేసి "యీమెకుఁ గుమారుఁడు కలుగునా ? కుమారితె కలుగునా ?" యని యడిగిరి. వారు ముసలము పుట్టుననిరి. అంత సాంబునికిఁ గట్టిన గుడ్డలు విప్పుచుండఁగా రోఁకలి క్రిందఁబడెను. దానిని ముక్కలుచేసి సముద్రములోఁ బాఱవేసిరి. అందలిచేప యొక చిన్నముక్కను మ్రింగినది. బోయవాఁ డొకఁడు వలవేసి యా చేపను బట్టుకొని కోయుచు దానిలోనున్న యుక్కురోఁకలిముక్కను దీసి తన బాణమునకుఁ బెట్టుకొనెను. భాగ.

యాదవకులమునకు ముసలము:- శ్రీకృష్ణునిఁ జూచుటకై కణ్వుఁడు, విశ్వామిత్రుఁడు ద్వారకకు వచ్చిరి. యాదవకుమారులు కొంటెతనముచే సాంబునకు స్త్రీవేషమువేసి "యీమె బభ్రుని భార్య యని మునులకుఁజూపి, యీమెకు సంతానము కలుగునా ?" యని యడిగిరి. మునులు వీనిని సాంబునిఁగా నెఱిఁగి, యితనికి యాదవకుల వినాశనకరమైన ముసలముపుట్టుననిరి. మరునాఁడే సాంబుని గర్భమునుండి రోఁకలి పుట్టెను. అది యదుకుమారులు శ్రీకృష్ణునితోఁ జెప్పిరి. అతఁడు యదుకులమునకు వినాశన కాలము సమీపించెనని తెలిసికొని యించుక చింతించి యా రోఁకలిని ముక్కలు ముక్కలుగాఁ జేసి పొడిచేసి సముద్రములోఁ బాఱవేయుఁడని చెప్పెను. వారట్లుచేసిరి. కాని యింకను సముద్రముకడ చిన్నముక్క మిగిలిపోయెను. తరువాత యాదవు లందఱు సముద్రతీరమున కరిగి మద్యపానమత్తులై పరుషములాడికొనుచు ఆ ముసలమును బుచ్చుకొని యొకరి నొకరు కొట్టుకొని చచ్చిరి. భార.

యామినీపూర్ణతిలక:-మదనాభిరాముఁ డను రాజు కుమారిత. మిక్కిలి రూపవతి. అంధుఁడైన వానిని జూడనని యీమెకు వ్రతము గలదు. ఈమెకు విద్య చెప్పించుటకై తండ్రి బిల్హణుఁడను కవిని రావించెను. బిల్హణుఁడును మిక్కిలి చక్కనివాఁడు. తరుణవయస్కుఁడు. వీరిరువురు నొకరినొకరు చూచుచో మోహితు లగుదురేమో యని భయపడి బిల్హణుఁడు గ్రుడ్డివాఁ డని యీమెకును, నీమె కుష్ఠురోగియని వానితోడను రాజు, మంత్రి చెప్పెను. బిల్హణునికడ నేర్చుకొనుట కీమెగాని, యీమెకుఁ జెప్పుటకు బిల్హణుఁడు గాని యంగీకరించలేదు. కాని వీరిద్దఱిమధ్య నొక తెర కట్టించిరి. తెరచాటుననుండి యామినీపూర్ణతిలక బిల్హణునియొద్ద విద్య నేర్చుకొనుచుండెను.

యామినీపూర్ణతిలకకు ఒకరాత్రి సుందరాకారునిఁ గూడినట్లు కలవచ్చెను. తరువాత నొక నిశియందు బిల్హణుఁడు చంద్రుని వర్ణించుట వినెను. అంధుఁడైనవాఁడు చంద్రుని నట్లువర్ణించుట కాశ్చర్యమునొంది వానిని జూడఁగోరెను. వానినిజూచి యతఁడు గ్రుడ్డివాఁడు కాఁడని తెలిసికొనియెను. మఱియు నతని రూపమును జూచి మోహించి వానిని గవయఁగోరెను.

బిల్హణుఁడును యామినీపూర్ణతిలకను జూచి యీమె కుష్ఠగాత్రి కాదని గ్రహించెను. ఆతఁడీమెను వలచెను. వీరిరువురు కామక్రీడలఁ దేలిరి. ఈసంగతి రాజువిని బిల్హణునిబంధించెను. యామినీపూర్ణతిలక మిక్కిలి విచారించి తండ్రిని బ్రతిమాలుకొనెను. బిల్హణుఁడును వాని కొక పద్యము వ్రాసి పంపెను. రాజు వానిని బంధవిముక్తుని గావించి యామినీపూర్ణతిలకను వానికిచ్చి వివాహము చేసెను.

యు

యుగంధరుఁడు:-వత్సరాజు మంత్రి.

యుగంధరుఁడు:-ప్రతాపరుద్రునిమంత్రి.

యుధాజిత్తు:-కేకయరాజు కుమారుఁడు. భరతుని మేనమామ. శ్రీరాముఁ డశ్వమేధమును బూర్తి చేసినపిమ్మట యుధాజిత్తు భరతునకుసింధుదేశము నిమ్మని కోరను. శ్రీరాముఁ డిచ్చెను. రామా.

యుధామన్యుఁడు:-ద్రుపదుని పుత్త్రుఁడు. పాండవశిబిరమున నిద్రించుచున్నవీనిని రాత్రివేళ నశ్వత్థామ చంపెను. భార.

యుయుత్సుఁడు:-వైశ్యయందు ధృతరాష్ట్రునకుఁ బుట్టిన కుమారుఁడు. యుద్ధము ప్రారంభింపక పూర్వము ధర్మరాజు భీష్మాదులకు నమస్కరించి మమ్ముఁ జేరఁగోరు రాజు లిపుడే వచ్చి చేరుఁడని పిలిచెను. యుయుత్సుఁడు పాండవ పక్షము చేరెను. ధృతరాష్ట్రుని పుత్త్రులలో యుద్ధమందు మరణింపక మిగిలినవాఁ డితఁడే. భార.

యువకేతుఁడు:-ఒక రాజర్షి. ఒకనాఁ డితని వీర్యము జలమునందుఁ బడెను. ఆ జలము నొక కన్యక త్రాగెను. అంత నామెకు గర్భం బయినది. బ్రహ్మ:

యువనాశ్వుఁడు:- ప్రసేనజిత్తుయొక్క కుమారుఁడు. పెద్దకాలము పుత్త్రులు లేనందున రాజ్యమును వీడి పుత్త్రార్థియై యరణ్యమున,కేగి భృగుమహర్షిని సేవించెను. అతఁడు పుత్త్రికామేష్టి చేయించి జలమును మంత్రించి యిచ్చి దానిని భద్రముగా నుంచుమని యిచ్చెను. క్రతువు సేయునాఁడు యువనాశ్వునకు విశేష దాహమయ్యెను. అందఱును నిద్రపోవుచుండిరి. జలమెచ్చటను గనఁబడినది కాదు. దాహమాపికొనలేక భృగుమహర్షి యిచ్చిన జలమును త్రావెను. మఱునాఁ డుదయముననే ఈ మంత్రపూత జలమునకై వెదకిరి. అది యెచ్చటను గనఁబడ లేదు. నేను త్రాగితినని రాజు చెప్పెను. నీ భార్యలకై యుంచిన జలము నీ వేల త్రాగితివి? కాలగతితప్ప శక్యముకాదు. ఆ జలము త్రాగితివి గావున నీవే గర్భమును దాల్చెదవని భృగువు చెప్పెను. అతనియుదరము ఛేదించుకొని తేజస్వి యగు పుత్త్రుఁడు పుట్టెను. ఇంద్రుఁడు వచ్చి తన వ్రేలు నా శిశువునోటఁబెట్టి పానము చేయించెను. ఆ బాలుఁడే మాంధాత. యువనాశ్వుఁడు తనకు మనుమడును, మాంధాతకుఁ బెద్దకుమారుఁడును నగు అంబరీషునిఁ దన కుమారుఁడుగాఁ గైకొనియెను. భార.

యో

యోగసిద్ధి:-అంగిరసుని కుమారిత. బృహస్పతి చెలియలు. ప్రభాసుఁ డను వసునియొక్క భార్య. ఈమె కుమారుఁడు విశ్వకర్మ. భాగ.

యోజనగంధి:-(చూడు మత్స్యగంధి)

యౌ

యౌధేయుఁడు:- దేవికయందు ధర్మరాజునకుఁ బుట్టిన కుమారుఁడు. భాగ.

యౌవనాశ్వుఁడు:-భద్రావతి నగరాధిపతి. ఇతనియొద్ద యాగార్హమైన యశ్వ మున్నదని విని దానిని దెచ్చుటకై ధర్మరాజు భీమునిఁ బంపెను. భీమునితోఁగూడ మేఘవర్ణుఁడు వెళ్ళి

తన రాక్షసమాయచేత గుఱ్ఱము నపహరించెను. యౌవనాశ్వుఁడు దానినెఱింగి యుద్ధమునకు వచ్చి మేఘవర్ణుని, నతనికి సహాయముగ వచ్చిన వృషకేతునిఁ గూడ నోడించెను. అంత భీముఁడు యుద్ధమునకు వచ్చి యీ రాజు నోడించెను. ఇతఁడు మూర్ఛితుఁడై యుండ నితని కుమారుఁడు సువేగుఁడు కూడ వచ్చి యుద్ధముచేసెను. వృషకేతుఁడు మూర్ఛ తేఱి అన్యోన్యహతులై పడియున్న యౌవనాశ్వాదులను జూచి జాలి నొంది యీ మహావీరులు బ్రతుకునట్లు ప్రార్థించెను. ఆ వీరులు లేవఁగా వారిని ఉపశాంతులుగఁ జేసెను. ఇట్లు ఉపకారము చేసిన వృషకేతుని గౌరవించి యీ వచ్చినవాఁడు భీముఁడనియును, ధర్మరాజుచేయు యాగమునకు నశ్వమునుగోరి వచ్చిరనియును నెఱింగి వారికి నశ్వమును, ధనరాసులు నిచ్చి భార్యయైన ప్రభావతి సహితముగ యౌవనాశ్వుఁడు యాగమునకు వెళ్ళెను.
జై. భా.

యౌవనాశ్వుఁడు:—యువనాశ్వుఁడు పుత్త్రుఁడుగా గైకొనిన యంబరీషునియొక్క కుమారుఁడు. ఇతనిపుత్త్రుఁడు హారీతుఁడు. కావుననే అంబరీష, యౌవనాశ్వ, హారీతులు మాంధాతృ గోత్రమునకుఁ బ్రవరులైరి. భాగ.

ర

రంతిదేవుఁడు:— సంకృతియొక్క కుమారుఁడు. ఇతఁడు యాగము చేయఁబోవుచుండఁగా గోవులు వచ్చి మనుష్య భాషణములతో "ఓ రాజా! నీ యాగమందు మమ్ము వ్రేల్చుము" అని ప్రార్థించెను. దానికితఁడు సందేహించుచుండ "జ్ఞానులే యీ కార్యము చేయఁదగినదని మమ్ముఁ బంపిరి; దీన నీకుఁ బుణ్యమే చేకూరు" నని గోవులు చెప్పినవి. రంతిదేవుఁ డవి కోరినయట్లు చేయుట కంగీకరించి వానిలో నొక్కటియైన వేల్వఁబడుటకు సంకోచించెనేని యాగము మానుదునని చెప్పెను. ఇతని యాగమున వేల్వఁబడిన గోవులు గోలోకమును జేరెను. గోవులరక్తము నదియై ప్రవహించెను. అదియే చర్మణ్వతి అను నది. అనేక గోచయములు పోయినపిదప నొక యావు తన లేఁగనుజూచి యకృపులు వచ్చిరి. ఇఁక సంహరించెదరు అని విచారించెను. గోవుభాష తెలిసిన రంతిదేవుఁ డా మాటలువిని తనయాగమును బరిసమాప్తి నొందించెను.

రంతిదేవుఁడు తనకుఁ గల్గినదానిని నడిగిన వారికి లేదనక యిచ్చుచుండెను. అట్లివ్వఁగా నితనికిఁ దినుటకుఁగూడ లేకుండఁ బోయెను. నలుబది దినము లుపవాసములుఁ గూడఁ జేసెను. పిమ్మటఁ గొంతయన్నము దొరకను. కాని యప్పుడే యొక యతిథివచ్చెను. వానికి రంతిదేవుఁడు సగముపెట్టెను. వానివెనుక నొక శూద్రుఁడు, చండాలుఁడు, కుక్కయుఁగూడ వచ్చెను. రంతిదేవుఁడు తనకు లభించినదానినిఁ బెట్టివేసెను. బ్రహ్మాదిదేవతలు నిజస్వరూపములు చూపి తామే యీ యారూపముల వచ్చితిమని చెప్పి యాతని యతిథిసత్కారమునకును, భూతదయకును మెచ్చుకొని వరములను వేఁడుకొనుమనిరి. రంతిదేవుఁడు సదా విష్ణుభక్తి గలిగి యుండునట్లు కోరెను. భార. భాగ.

రంభ:— ఒక యప్సరస. దేవకన్యలలో కెల్ల నందమైనదని ప్రసిద్ధి. ఈమెకు నలకూబరునిపైఁ బ్రేమ మెండు. ఒకనాఁడు రంభ నలకూబరుని సౌధమున కేగుచుండఁగా రావణుఁ డామెను బలాత్కారముగఁ బట్టెను. ఎట్టకేల కీమె విడిపించుకొని ప్రియునితోఁ జెప్పెను. పరస్త్రీని బట్టితివేని నీతల వ్రయ్య లగునని రావణుని నలకూబరుఁడు అప్పుడే శపించెను.

విశ్వామిత్రుఁడు బ్రహ్మర్షి కాఁగోరి యత్యుగ్రముగఁ దపస్సుచేయుచుండెను. అతని తపోభంగము చేయుటకై దేవతలు రంభను వెళ్లుమనిరి. ఈమె భయపడుచువచ్చెను; తన తపస్సు భంగముచేయుటకు వచ్చిన యామెను జూచి విశ్వామిత్రుడు పదివేలయేండ్లు శిలవై యుండుమని యీమెను శపించెను. రామా.

రంభుఁడు:—ఒకదనుజుఁడు. కరంభుని సోదరుఁడు. వీరిద్దఱును గలసి దేవతలను బాధించుచుండువారు. తుదకు కరంభుఁడు సురలకు భయపడి జలనిధియందు దాఁగెను. అప్పటనే యతఁడు

సంహరింపఁబడియెను. రంభుఁడు దేవతలను గెలువఁగలుగు పుత్త్రునిఁగోరి శివునిఁ బ్రార్థించెను. శివుఁడు ప్రత్యక్షమై యా వరము నొసంగెను.

రంభుఁడు చిరకాలము తపస్సుచేసెనుగాని శివుఁడు ప్రత్యక్షము కాలేదు. తుదకు విసిగి తన శిరమే యాహుతిగ నీయఁదలఁచి ఖడ్గమెత్తి తన మెడమీఁదఁ బెట్టుకొనఁబోవుచుండెను. అప్పు డగ్ని "నీప్రాణమునుపోఁగొట్టుకొని యేమిచేయఁ గలవు? ఆత్మహత్యయుఁ బాతకముకదా! నీకేమి కావలయును? కోరుకొనుము" అనియెను. ఇతఁడు దేవతలను గెలువఁగలయట్టి కుమారునిఁ గోరెను. "నీ వేజంతువుతో రమింతువో యట్టి పుత్త్రుఁడు నీకుఁ బుట్టును" అని యగ్ని పలికెను. రంభుఁడు తపస్సుమాని వచ్చుచుండఁగా నితనికి మహిషము గోచరించెను. దానిని జూచి మోహించి పాతాళలోకమునకుఁ గొనిపోయి రంభుఁడు దానితో రమించెను. దానియం దితనికి మహిషాసురుఁడు జనించెను. దే. భా.

రంభుఁడు:-వివింశతి కుమారుఁడు. ఇతనిపుత్త్రుఁడు ఖనినేత్త్రుఁడు. భాగ.

రక్తబీజుఁడు:- ఒక దనుజుఁడు. రంభుఁడు చని పోఁగా నితనిభార్య చితిపేర్చి రంభున కగ్ని కార్యములు చేసి తానును జితి నెక్కెను. అందుండి రౌద్రాకారుఁడగు పురుషుఁడు వచ్చెను. అతఁడే రక్తబీజుఁడు. రంభుఁడే రక్తబీజుఁడుగ జన్మించెను.

రక్తబీజుఁడు శుంభ నిశుంభులకు సేనాధిపతి యయ్యెను. శుంభ నిశుంభులతోఁ గలసి యతఁడు దేవితో యుద్ధముచేయుచుండెను. ఇతని శరీరము నుండి రక్తబిందువులు క్రిందఁబడుచో నాబిందు వులనుండి దనుజులు పుట్టుచుండిరి. కావున వీనిని జంపుటయును, జయించుటయును దేవికిఁ గష్టముగనే యుండెను. అంత దేవి తన కళతోఁ జండిని గావించెను. ఆమె వీని శరీరమునుండి రక్తము కారకుండఁ ద్రావివేయుచుండెను. అపుడు కాళి వీనిని జంపెను. దే. భా.

రఘువు:-దిలీపుని పుత్త్రుఁడు. ఇతనితల్లి సుదక్షిణ. తండ్రి గావించిన యాగమందు యజ్ఞపశువు హరియింపఁ బడకుండ నితఁడే కాపాడెను. రఘువుచేసిన విశ్వజిన్నామాధ్వరమందుఁ దనయొద్దనున్న ధనమేకాక కుబేరునియొద్దనుండి కూడ ధనముతెచ్చి దానమిచ్చెను.

దిలీపుఁడుచేసిన నూఱవయాగమునందు యాగా శ్వమును నింద్రుఁడే యపహరించెను. రఘువు వెంటనే యింద్రునితోడనే యుద్ధముచేసెను. ఆతని వజ్రాయుధప్రహారమునుగూడ నీతఁ డోర్చుకొనియెను. అంత నింద్రుఁడు మెచ్చు కొని "యాగాశ్వమునుగాక మఱియొక కోరికను దేనినేని గోరుకొ"మ్మనికోరెను. అంత నింద్రుఁ డాతని కా వరమిచ్చెను.

వరతంతుముని శిష్యుండగు కౌత్సుఁ డను వాఁడు ధనార్థియై రఘువుదగ్గఱకు వచ్చెను. ఇతఁ డిదివఱకే తన సర్వస్వమును దానముచేసి యుండుటచే మట్టిపాత్రతోనే యతనికిఁ బాద్యము నిచ్చెను. ఇతనియొద్ద ధనము లేకుం డుట తెలిసికొని కౌత్సుఁడు వెళ్లఁబోయెను. ఆతని నాపి కుబేరునిఁజేరి ధనమును గొనివచ్చి యితని కిచ్చెను. రఘువుకుమారుఁడు అజుఁడు.

రఘువు:-దీర్ఘబాహుని పుత్త్రుఁడు. ఇతని కుమా రుఁడు పృథుశ్రవుఁడు. భాగ.

రజి:-ఆయువు కుమారుఁడు. నహుషుఁడు, క్షత్త్రి వృద్ధుఁడు ఇతని సోదరులు. దేవతలకును, రాక్ష సులకును యుద్ధమువచ్చినపు డెవరు గెలుతు రని దేవతలు బ్రహ్మ నడిగిరి. రజి యెవరిపక్ష మందుండునో వారు గెలిచెదరని బ్రహ్మ చెప్పెను. దేవతలు రజిని దమపక్షము చేరుమని కోరిరి. రజి వెళ్లెను. దేవతలు గెలిచిరి. ఇంద్రుఁ డితనికిఁ దన నగరమిచ్చెను. తరువాత నితని పుత్త్రులు దేవేంద్రుఁ డడిగినను నివ్వక ఇంద్ర పుర మేలుచు, యాగఫలములు గైకొనుచు వచ్చిరి. ఇంద్రునకు రాజ్యమిప్పించి రజి తపో వనమున కేగెను. రజిపుత్త్రులు ఇంద్రుని రాజ్య భ్రష్టునిగఁ జేసిరి. అప్పుడింద్రుఁడు యాగమును గావించి రజియొక్క సుతులను బరాజితులను గావించెను. పిమ్మట మఱియును వీరు దైవ మతస్థులైరి. కావున నింద్రుఁడు వీరిని సంహ రించెను. మత్స్యం

రతి:-ప్రజాపతి భార్య. నహుషుని తల్లి.

రతి:-మన్మథుని భార్య. ఈమె మన్మథుని వామ భాగమునుండి యేర్పడియెను.

రతి:-దక్షుని దేహస్వేదమువలన బుట్టెను. ఆమె నితఁడు మన్మథునకు భార్యగా నిచ్చెను.

మన్మథుఁడు శివునిచే దగ్ధమగుట నీమెచూచి మిక్కిలి విలపించెను. అతఁడు తిరిగిప్రద్యుమ్నుఁడుగాఁ బుట్టునని దేవతలుచెప్పి యీమెనోదార్చిరి. ఆ ప్రద్యుమ్నుని శంబరాసురుఁడు సంహరించుటకు వచ్చునని నారదుఁ డీమె కెఱింగించెను. ఈమె మాయావతి యను పేరుతో శంబరునింట దాసిగా నుండెను. (చూడుము మాయావతి)

రత్నమాల:- బలికుమారిత. ఈమె బలిచేయు యజ్ఞమందు వామనునిఁ జూచి వానిపైఁ బుత్త్రప్రేమ కలిగియుండి యట్టి పుత్త్రుఁడు నా స్తన్యపానము చేసినా నాకెంత యానందము కలుగును! అని తలఁపోసినది. ఈమెకోరిక కృష్ణుఁడెఱిఁగెను. ఈమె తరువాతిజన్మమునఁ బూతకి యయ్యెను. (చూడుము పూతకి) బ్ర. వై.

రథంతరి:-ఇలలుని భార్య. దుష్యంతుని తల్లి. భార.

రథీతరుఁడు:-పృషదశ్వుని కుమారుఁడు. ఇతనికిఁ బుత్త్రులు లేరు. ఇతనిభార్యయందు అంగిరసుండనుమునివలన బ్రహ్మతేజోనిధులైన పుత్త్రులు 'అంగిరసులు' అను బ్రాహ్మణులు పుట్టిరి. భాగ.

రభ్యుఁడు:-ఒక రాజు. ఇతనిభార్య రుక్మరేఖ. చిరకాల మితనికి సంతానము లేదు. ఇతఁడు పుత్త్రులకై హోమములు చేయఁగాఁ జేయఁగా ఏకావళి యను కుమారిత కలిగెను. దే. భా.

రమణుఁడు:-సోముఁ డను వసువు. ధరుఁడను వసువు కుమారుఁడు. మత్స్య. భార.

రమణ్వాతుఁడు:-జమదగ్ని పెద్ద కుమారుఁడు. జమదగ్ని "వీనితోఁ దల్లియగు రేణుకను వధించి ర"మ్మని చెప్పెను. ఇతఁడు నిరాకరించెను.

రమ్యుఁడు:- అగ్నీధ్రుని కుమారుఁడు. ఇతఁడు పాలించినదేశమునకు నితని పేరునుబట్టి రమ్యక వర్షమని పేరు వచ్చెను. విష్ణు.

రహస్యము:-స్త్రీలు. "స్త్రీలకు రహస్యముదాఁచు నట్టిశక్తి లేకుండ నుండుఁగాక" యని ధర్మరాజు శపించెను. దానికిఁగారణమిది: కుంతి తన కన్యాత్వమందే కర్ణునిఁగనినది. కాని భారతయుద్ధము ముగియకపూర్వమెన్నడును గర్ణుఁడు తన కుమారుఁడని యెవ్వరికిని చెప్పలేదు. యుద్ధానంతరమందు మరణించినవారికి ధర్మరాజు పితృకార్యములు చేయుచుండఁగా నప్పుడు కర్ణునికిఁగూడఁ జేయుమనియును, నాతఁడు తనపుత్త్రుఁడనియును జెప్పెను. అప్పుడు ధర్మరాజునకుఁ గుంతిపైఁ గోపమేవచ్చినది. ఆ వృత్తాంతము ముందుగాఁ జెప్పుచోఁ బాండవులకును, కర్ణునకును వైరమే రాకపోయెడిదనియును, నీ యుద్ధమే సంభవించునది కాదనియును బలికెను. కుంతి యా రహస్యము దాఁచుటచే నింత ముప్పు వాటిల్లినది గాన నిఁక స్త్రీలు రహస్యము దాఁచలేకుండునట్లు శపించెను. భార.

రహూగణుఁడు:- సింధుదేశపు రాజు. ఇతఁడు వేదాంతము నేర్చుకొనుటకుఁ గపిలునియొద్దకు సవారియెక్కి పోవుచుండెను. బోయీలు అలసి మార్గమం దొక బ్రాహ్మణుని నున్మాదునివలె సంచరించువానిని (ఇతఁడు పూర్వజన్మమున భరతుఁడు; ఋషభుని కుమారుఁడు.) జూచి వానిభుజముపై సవారికొమ్ము పెట్టిరి. దానిని భారముగఁ దలఁపకయే బ్రాహ్మణుఁడు మెట్టలవెంటఁ, బుట్టలవెంట సవారి మోసికొనిపోవుచుండెను. అందువలన రాజున కాయాసము గల్గి వానిని గఠినముగ దూషించెను. అంత బ్రాహ్మణుఁడు, "రాజా ! దూషణము, కోపము అనునవి శరీరమునకుఁ గాని యాత్మకు లేవుసుమీ!" అని శాంతముగఁబల్కి వేదాంతసారము బోధించెను. రాజు సవారి దిగి, నీవే వేదాంతి వని నమస్కరించెను. భాగ.

రా

రాక్షసుఁడు:—పాటలీపుత్రమునకు రాజైన నందుని మంత్రి. చాణక్యుఁడను బ్రాహ్మణుఁడు నందుని కుమారులనుజంపి చంద్రగుప్తునకుఁబట్టము కట్టించెను. తన ప్రభువంశమునాశనముచేసిన చాణక్యుని బరిమార్చవలయుననియు, చంద్రగుప్తుని సంహరించి నందవంశమువారికే రాజ్యమిప్పింపవలయుననియు రాక్షసుఁ డెన్ని విధములనో యత్నముచేసెను. దానికై యెన్నియో యుపాయములుపన్నెను. కపటవేషములు వేసెను. కాని వీనినన్నిటిని చాణక్యుఁడు తెలిసికొని ప్రతీకారములుచేయుచుండువాఁడు. మాయోపాయంబుల నొకరి నొకరు తీసిపోవుటలేదు. చాణక్యుఁడు రాక్షసుని జంపింపఁ దలఁచుకొనలేదు. ఇతఁడు మిక్కిలి బుద్ధిశాలియనియును, రాజనీతివిశారదుఁడనియును జాణక్యుఁడెఱుంగును. ఎటులైనను వీనినిబట్టుకొని స్వాధీనముచేసికొని చంద్రగుప్తునకు మంత్రిగ నుండఁజేయుటే చాణుక్యుఁడు కోరెను. దీనికై యనేక తంత్రంబులు చేసెను. తుదకుఁ బరరాజుల సహాయముకూడఁగోరి రాక్షసుని నేకాకిగఁజేసిరి. వీని సతీసుతుల నొకఁడు కాపాడుచుండెను. ఈ కాపాడుచుండినవానిని గొఱత వేయించెదనని చాణక్యుఁడు ప్రకటించెను. వానిని విడిపించుటకై రాక్షసుఁడు వచ్చెను. అప్పుడే రాక్షసుని జాణక్యుఁడు పట్టుకొనెను. చంద్రగుప్తున కితఁ డభయమిచ్చినచో వీని మిత్రుని విడుతునని చాణక్యుఁడు చెప్పెను. రాక్షసుఁడు చంద్రగుప్తున కభయమిచ్చెను. చాణక్యుఁడు కోరఁగాఁ జంద్రగుప్తునకు మంత్రికూడ నయ్యెను. ముద్రా.

రాగమంజరి:— శృంగారశేఖరుం డను రాజు యొక్క కుమారిత. ఈమె చంద్రగుప్తుఁడను బ్రాహ్మణుని వలచెను. తండ్రి యీతని కిచ్చి వివాహము చేసెను. ఈ దంపతులకు విక్రమార్కుఁడు జన్మించెను. విక్ర. చ.

రాజగృహపురము:— జరాసంధుని పౌత్రుఁడగు మేఘసంధుని రాజధాని. భార.

రాజన్యుఁడు:—ఉపరిచరవసువుకుమారుఁడు. భార.

రాజరాజనరేంద్రుఁడు:— రాజమహేంద్రవరము నేలినరాజు. ఇతనికి రత్నాంగియను భార్యకలదు. ఆమెయందు సారంగధరుఁడను కుమారుఁడు జన్మించెను. సారంగధరునకువివాహంచేయుటకై చిత్రాంగియను రాకుమారితను దీసికొనివచ్చెను. కానియామెనుజూచి మోహించి తానేయామెను వివాహమయ్యెను. రాజరాజనరేంద్రునకు జిత్రాంగి యను భోగకాంత కలదు. చిత్రాంగి సారంగధరుని వలచియుండెను. ఇతఁడు పావురములకై యామెయింటికిఁ బోయినపుడు తనకోరిక తీర్పుమని యామె సారంగధరుని బ్రతిమాలెను. అతఁడు తిరస్కరించెను. ఆకోపముచేఁ జిత్రాంగి రాజరాజనరేంద్రునితో సారంగధరుఁడు తన నవమానముచేసెనని చెప్పికొనెను. ఆమెమాటలు విని రాజరాజనరేంద్రుఁడు కుమారుని కాళ్లు చేతులు ఖండింపఁజేసెను. పిమ్మటఁ జిత్రాంగియే మోసగించెనని తెలిసికొని యామెను జంపించెను. (ఇది చారిత్రకము కాదు.)

రాజరాజనరేంద్రుఁడు:—చాళుక్యరాజు. భారతము తెనుగున వ్రాయుట కితఁడే ప్రోత్సాహము చేసెను.

రాజవర్ధనుఁడు:—దముని కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు సుధృతి. భాగ.

రాజశ్శవసుఁడు:—నాచికేతునితండ్రి. ఇతఁడు తన గోవుల నన్నిఁటిని బ్రాహ్మణులకు దానము చేయుచుండెను. నాచికేతుఁడు వీనికడకు వచ్చి "తండ్రీ! నన్నెవ్వరి కిచ్చెదవు?" అని యడిగెను. ఆ మాట రాజశ్రవసుఁడు వినిపించుకొనలేదు. నాచికేతుఁడు మరలనడిగెను. రాజశ్రవసునకుఁ గోపమువచ్చి నిన్ను యమున కిచ్చెదననియెను. కుమారుఁడు యముని సదనమునకేగి యాతని యనుగ్రహమున మరలివచ్చెను.

రాజసావర్ణి:—దేవసావర్ణి కుమారుఁడు. ఇతని కుమారుఁడు వృషధ్వజుఁడు. బ్ర. వై.

రాజాధిదేవి:—వసుదేవుని తోఁబుట్టువు. జయత్సేనుఁడీమెను బరిణయమయ్యెను. విందాను విందులు వీరి పుత్త్రులు. ఈమె కుమారితయే మిత్త్రవింద. భాగ.

రాజ్యవర్ధనుఁడు:—ఒకరాజు. ఇతని భార్య మాలిని. ఒకనాఁడితనికి భార్య తలంటుచు నితని నెరసిన వెండ్రుకలు చూచి ముసలితనము వచ్చినదని దుఃఖించెను. పౌరులునుదమరాజునకు ముసలితనము వచ్చెనని విచారించిరి. రాజ్యవర్ధనున కాయు ష్కాలము వృద్ధియగుటకు సూర్యుని బ్రార్థించిరి. సూర్యుఁ డా వరమునొసంగెను. రాజ్యవర్ధనుఁడు తాను చిరకాలము జీవించియుండుటయుఁ, దన పౌరులు చనిపోవుటయుఁ దటస్థించునని తలఁచి వారును దాను బ్రతికియున్నంతకాలము జీవించు నట్లు కోరి సూర్యునారాధించెను. సూర్యుఁ డీతనికి వరము నొసంగెను. మార్క.

రాత్రి:—తొలుదొల్త నెల్లప్పుడు పగలేకాని రాత్రి లేదు. ఆదిదంపతులైన యమి యములలో యముడు చనిపోయెను. యమి సర్వదా యీ దినమే తనభర్త పోయెనని యేడ్చుచుండెను. దేవత లెంతయత్నించినను నామె మఱచుటలేదు. ఆమెకు మఱపును గలిగించుటకై దేవతలు రాత్రిచేసిరి. మరలఁ దెల్లవారినపిదప నామె దుఃఖము మఱచెను.

రాధ:—అతిరథుఁడను సూతునిభార్య. ఈమెకు సంతానము లేదు. నదిలోఁ గొట్టుకొని వచ్చు చున్న కర్ణుని దీసికొని యతిరథుఁ డింటికి దెచ్చెను. రాధ కర్ణుని మిక్కిలి ప్రేమతోఁ బెంచెను. భార.

రాధ:—ఇంద్రాణి విష్ణులోకమునకేగి విష్ణువునిజూచి ప్రార్థించి "నీతోడనెపై కూరుచుండవలెనని కోరుచున్నా" ననియెను. "నీవు భూలోకము నకుఁ బొమ్ము. నేను శ్రీకృష్ణుండనై జన్మించి నపుడు నీ కోరిక దీర్చెద" ననియెను. శచీదేవియే రాధగాఁ బుట్టెను.

ఈమెతోఁ గృష్ణుఁ డుండుట రుక్మిణి చూచి యలిగెను. రాధ తెలిసికొని శ్రీకృష్ణుని విడిచి వెళ్ళెను. అతఁ డామెను వెదకుచుఁ బోయి తపస్సుచేసికొను నామెను జూచి తనచేతనున్న కోలను మోకాళ్ళవద్దను, చేతులను, నడుమునను బెట్టుకొని నిలిచి యుండెను.

రాధ:— వృషభానునకుఁ గళావతియందుఁ బుట్టిన కూఁతురు. కృష్ణుని మేనయత్త. కృష్ణుఁడు గోలోక మున నున్నపు డీమె రాసమునుండిపుట్టి యాతని ప్రక్కనుండి పరుగెత్తెను. "రాసంబునుండి పుట్టి హరియెదుట ధావనమును జేసెనుకావున రాధ యనుపేరువచ్చినది. అతఁడీమెనుజూచి మోహిం చెను. రాధశరీరమందలి రోమకూపములనుండియే గోపికలు పుట్టిరి. శ్రీకృష్ణుఁడు గోపికలనుగూడి యుండెను. రాధదానిని సహింపలేక శ్రీకృష్ణునిఁ బరుషము లాడెను. శ్రీకృష్ణుని పార్శ్వుఁడైన సుదాముఁడు వాసుదేవు నట్లు నిందించెదవేలయని యీమె నడిగెను. ఈమెకు వానిపైన గోపము వచ్చి నీవు రాక్షసుఁడవుగా జన్మింపుమని శపిం చెను. రాధకుఁ గృష్ణునిపైఁ బ్రేమ మెండు.

రాధ:— నందినిమఱదియగు శతగోపుఁ డనువాని పుత్రిక. పాండు.

రామాయణము:— వాల్మీకిచేఁ జెప్పఁబడిన యాది కావ్యము. వాల్మీకి శిష్యులతోఁ గలసి స్నానము చేసివచ్చుచు, బోయవాఁడొకడు క్రౌంచపక్షి మిథునములో నొక్క దానిని జంప చూచెను. అతనికి విచారమయ్యెను. "ఓరీ! యింతటితో నీ ప్రతిష్ఠ యంతమగుగాక" యని బోయవానిని శపించెను. అతనివాక్యములు ఛందోబద్ధమైన శ్లోకమయ్యెను. దానికి రామకథాసూచకమైన యర్థముకూడఁ గలిగెను. దానికి భారద్వాజాది శిష్యులు నిశ్చేరపడుచుండిరి. అంతలో నారదుఁడువచ్చి వాల్మీకికి రామకథ చెప్పెను. వాల్మీకి రామకథనే ఛందోబద్ధముగ జెప్పెను. అదియే రామాయణకావ్యము. దానినే వాల్మీకి కుశలవులకుఁ జెప్పి వారిచే శ్రీరామునియెదుటఁ బాడించెను. రామా.

రాముఁడు:— అయోధ్యానాథుఁ డగు దశరథుని పెద్దకుమారుఁడు. దశరథుఁడుగావించిన పుత్రి కామేష్టియందు యజ్ఞపురుషుఁ డిచ్చినపాయస ప్రభావముచేఁ గౌసల్యయందు రాముఁడును, కైకయందు భరతుఁడును, సుమిత్రయందు లక్ష్మణ శత్రుఘ్నులును బుట్టిరి. సుమిత్రకుఁ గౌసల్య యిచ్చిన పాయస భాగ ప్రభావము వలన లక్ష్మణుఁడు జన్మించెను. ఆ కారణము వలన రామలక్ష్మణుల కన్యోన్యము మెండు.

రామలక్ష్మణుల బాల్యమందే విశ్వామిత్రుఁడు వచ్చి రాక్షసబాధ నివారణము చేయుటకై యీ బాలురను బంపుమని దశరథునిఁ గోరెను. దశరథుఁడు వానిమాట కెదురాడలేక పంపెను. విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులను దనవెంటఁ గొనిపోయి విలువిద్య నేర్పెను. పిమ్మట వారిని మారీచ సుబాహువులు వచ్చు తావునకుఁ గొని పోయి యాదనుజులనుజూపి వారిని సంహరింపుఁడనియెను. ఈ బాలు రా దనుజులతోఁ బోరి వారిని జంపిరి. పిమ్మటఁ బర్వతగుహవలె నోరు తెరచికొని వీరిని మ్రింగెదనంచుఁ దాటక వచ్చెను. ఈమెనుగూడ సంహరింపుమని విశ్వామిత్రుఁడు చెప్పెను. స్త్రీయనితలఁపక రాముఁడు తాటకను సంహరించెను. పిమ్మట రామలక్ష్మణులను వనవాటికల, ఋష్యాశ్రమంబుల వెంబడి విశ్వామిత్రుఁడు గొనిపోయెను. మార్గమం దొక్క రాయిని రాముఁడు త్రొక్కెను. దానినుండి యహల్య లేచి రామునకు మ్రొక్కి చనియెను. ఆమెయొక్క వృత్తాంత మాతనికిఁ గౌశికుఁ డెఱింగించెను. ఈముని ఈబాలురను మిథిలకుఁ గొనిపోయెను.

జనకుఁడు తన యింటనున్న శివుని చాప మెక్కుపెట్టినవానికి సీత నిచ్చెదనని ప్రకటించెను. పలువురు రాజకుమారులు యత్నించి యోడిరి. రాముఁ డా చాప మెక్కుపెట్టుటకై యత్నించెను. అది యతని చేతిలో విఱిగెను. జనకుఁడు సంతోషముతో సీతను రామునకిచ్చి వివాహము చేసెను. వివాహమైన పిదప నయోధ్యకుఁ బోవుచుండఁగా వీరలను బరశు రాముఁ డడ్డగించెను. వానితో దశరథరాముఁడు పోరి వాని నోడించెను. ఇతఁడు మహానుభావుఁడని బరశురాముఁడు గ్రహించి వీనికి బ్రదక్షిణమును గావించి నమస్కరించెను. పరశురాముని తేజమే శ్రీరామునిశరీరమున జొచ్చెను.

రామునకు యౌవరాజ్య పట్టాభిషేకము చేయుటకు దశరథుఁ డన్ని యేర్పాటులను గావించెను. వసిష్ఠుఁడు ముహూర్త మేర్పఱచెను. ఈ సంగతులు దశరథుఁడు కైకతోఁ జెప్పుటకై వెళ్ళెను. కైక, రామునిఁ బదునాలుగేండ్లు వనవాసమునకుఁ బంపుమనియును, భరతునకుఁ బట్టము కట్టుమనియును గోరెను. కైకకు రెండు వరములనిచ్చెదనని దశరథుఁడు చెప్పియుండుటచే నతఁ డిపుడు మారుమాటాడలేక దుఃఖముతో క్రుంగిపోయెను. రాముఁడు తనకు వచ్చిన భంగపాటునకుఁ జింతనొందలేదు. కైకకడకుఁ బోయి తనతండ్రిమాట చెల్లించెదననియెను.

రాముఁడు వల్కలాజినములు ధరించి యరణ్యవాసమునకై వెడలెను. అతనివెంబడి సీతాలక్ష్మణులు వెళ్ళిరి. గుహుఁడు వీరిని గంగానది దాటించెను. వీరు చిత్రకూటము చేరునప్పటికి భరతుఁడు వచ్చెను. వారిని మరల నగరమునకు రమ్మనియును, రాముని రాజ్యమును గైకొనుమనియును వేఁడెను. కాని రాముఁడు తండ్రి మాటతప్పరాదనిచెప్పి భరతునే రాజ్యపాలనము చేయుచుండుమనెను. చిత్రకూటమునుండి సీతారామలక్ష్మణులు అత్రిముని యాశ్రమమునకు వెళ్ళిరి. అచ్చట ననసూయ సీతకు సతీధర్మములు నేర్పెను. ఆ యాశ్రమమునుండి వచ్చుచు మార్గమున కడ్డముగనుండిన విరాధుఁడను దనుజుని రామలక్ష్మణులు సంహరించిరి. పిమ్మట సుతీక్ష్ణుఁడను మునిని, ఇతర మునులను దర్శించి యగస్త్యాశ్రమము చేరిరి. అటఁ గొన్నిదినములుండి యగస్త్యుఁడు చెప్పిన పంచవటమునకు వచ్చి యచ్చటఁ బర్ణశాలను నిర్మించుకొనిరి.

పంచవటమున లక్ష్మణుఁడు పండ్లు కోయుచుఁ జూడక, పొదరింటనున్న శూర్పణఖయొక్క కుమారునిఁ జంపెను. తన కుమారుని జంపిన వారిని వెదకుచు వచ్చుచు శూర్పణఖ రామునిఁ జూచి మోహించెను. తనను బెండ్లియాడుమని కోరెను. ఈతఁడు పరిహాసముగా లక్ష్మణుని గోరుమనియెను. లక్ష్మణుఁడును నీమెను నిరాకరించెను. శూర్పణఖకుఁ గోపమువచ్చి సీతను మ్రింగఁబోయెను. అంత లక్ష్మణుఁడు శూర్పణఖ ముక్కును, చెవులను గోసివేసెను. ఆమె ఖర దూషణాదులతోఁ జెప్పుకొనెను. వారు యుద్ధమునకు వచ్చిరి. రామలక్ష్మణులు ఖర దూషణ త్రిశిరాదులను సంహరించిరి.

ఈ సంగతి రావణునకుఁ దెలిసినది. శూర్పణఖయును నరులు తన నవమానము చేసినట్లు చెప్పి యేడ్చినది. సీతను గొనిరమ్మని ప్రోత్సాహము చేసినది. రావణుఁడు మారీచుని సహాయము

పొందెను. మారీచుఁడు బంగారు లేడివలెనై సీతముందఱ గంతులువేసెను. ఆమె యా లేడిని బొందఁగోరెను. రాముఁడు దీనిని గొట్టుటకై వెడలెను. లేడి బాణముచేఁగొట్టఁబడి 'హాలక్ష్మణా' యని యఱచెను. రాముఁడే యట్లఱచెనని లక్ష్మణుఁడు వెళ్ళెను. ఆ సమయమున రావణుఁడు యతిరూపమునవచ్చి సీతను ఎత్తుకొనిపోయెను.

రామలక్ష్మణులు పర్ణశాలకు మరలివచ్చిరి. అచ్చట సీత లేదయ్యెను. ఆమె కనఁబడకుండుటకై యాత్రినొంది యామెను వెదకుచు రామలక్ష్మణులు చనిరి. జటాయువు కనఁబడి సీతను రావణుఁ డెత్తుకొనిపోయెనని చెప్పి ప్రాణములు విడిచెను. తమతండ్రి మిత్త్రుఁడైన యా పక్షికి రామలక్ష్మణు లగ్ని కార్యములు గావించిరి. పదపడి వీరిమార్గమున వికృతరూపుఁడగు కబంధుఁ డడ్డుపడెను. వాఁడు వీరిని మ్రింగబోయెను. వీరు వానిని సంహరించిరి. కబంధుఁడు శాపవిముక్తుఁడై లేచి రామునకు నమస్కరించి, తన వృత్తాంతము చెప్పి వారు సీతను వెదకుటకై పోవుచుండుట తెలిసికొని, కిష్కింధకువళ్లి సుగ్రీవునితో స్నేహము చేయుఁడనియు, నతఁడు తోడ్పడఁగలఁ డనియుఁ జెప్పెను.

రామలక్ష్మణులు పంపాతీరమున జేరిరి. సుగ్రీవుని మంత్రి హనుమంతుఁడు వీరలను జూచి నమస్కరించి వీరి వృత్తాంతము నడిగి సుగ్రీవుని యొద్దకు వీరిని గొంపోయెను. సుగ్రీవుఁడు వీరి కాతిథ్య మిచ్చెను. రావణుఁ డెత్తుకొనిపోయిన సీతను వెదకుచు వచ్చుట వీరు తెలిపిరి. సుగ్రీవునకు దొరకిన యాభరణములమూట రామునకుఁ జూపెను. అతఁడు సీతనగలనుగుర్తించి దుఃఖించెను. సుగ్రీవుఁడును దనయన్నయగు వాలితోఁ దనకు వైరముండుట తెల్పి వానిని సంహరింపుమనియెను. కాని వాలిని నితఁడు కొట్టఁగలడో లేఁడోయని సందేహముకలిగియుండెను. రాముడు సప్తసాలవృక్షములను నొక్కసారికొట్టి వాని సందేహము వాపెను. వాలిని నెంతటివారును నెదురుగనిలచి కొట్టలేరనియును, మరుగుననుండి కొట్టవలయుననియును సుగ్రీవుఁడు చెప్పెను. రాముని సహాయము చూచుకొని సుగ్రీవుఁడు వాలిని యుద్ధమునకుఁ బిలిచెను. వాలి వచ్చెను. పోరాటము జరుగుచుండెను. కాని వారిలో నెవఁడు వాలియో రాముఁ డెఱుంగలేక యూరకుండెను. సుగ్రీవుఁడోడి పాఱిపోయెను. మరల సుగ్రీవుఁడు వాలిని యుద్ధమునకుఁ బిలచెను. ఈసారి సుగ్రీవుఁడు మెడలో దండవేసికొనియెను. రాముఁడు చెట్టుచాటుననుండి వాలిని గొట్టి చంపెను. రాముఁడు మహానుభావుఁడని యెఱుంగుటచే వాలి యామరణమునకు విచారింపలేదు. కాని, వాలిభార్యతార పతిమరణించిన విచారముచే సీతతిరిగివచ్చినను ఆమెరామునితోఁ జిరకాలము కాపురము చేయకుండుఁగాక యని శపించెను. వాలిని నిష్కారణముగఁ జంపిన పాపము శ్రీరామునకుఁ గృష్ణావతారమునఁ బోయెను. వాలిపుత్త్రుఁడైన యంగదుఁడే బోయవాఁడై పుట్టి మృగమను భ్రాంతిచే వేసినబాణము శ్రీకృష్ణుని పాదములకుఁ దగిలెను. దానివలననే యతఁడు మరణించెను. జగన్నాథమాహాత్మ్యము.

సుగ్రీవునకు పట్టాభిషేకము చేసిరి. వాలి కుమారుఁడగు నంగదుని యువరాజును గావించిరి. రామలక్ష్మణులు వర్షకాలమంతయును గిష్కింధలోనే యుండిరి. సీతను వెదకివచ్చుటకై సుగ్రీవుఁడు వానరులను బంపెను. సీత కనఁబడుచో నామెకు నానవాలుగ నిమ్మని రాముఁడు తన యుంగర మిచ్చెను. హనుమంతుఁడు సీతను జూచివచ్చి యామె వృత్తాంతము చెప్పెను.

వానరసేనలను దీసికొని రామలక్ష్మణులు సముద్రపుటొడ్డు చేరిరి. అప్పటికే లంకనుండి విభీషణుఁడు వచ్చి రాముని శరణువేఁడెను. శత్త్రుకోటిలోనివాని నమ్మరాదనియును, వానిని సంహరింపుమనియును వానరు లనిరిగాని, శరణు వేఁడినవానిని జంపరాదని రాముఁడు చెప్పెను. వారినిధి దాటుటకై సముద్రునే ప్రార్థింపుమని విభీషణుఁడు చెప్పెను. రాముఁడు దర్భశయనుఁడై సముద్రుని ధ్యానించెను. కాని యీతఁడు త్రోవ నీయలేదు. అంత రాముఁడు సముద్రమును బాణముతోఁ గొట్టెను. సముద్రుఁడు ప్రత్యక్షమై రామునకు నమస్కరించి తాను దశరథునకు మిత్త్రుఁడనని తెల్పి సముద్రమునకు నలునిచే వారధి కట్టింపుమని చెప్పెను. నలుఁడు వంతెన కట్టుట ప్రారంభించెను. వానరులందఱు వానికిఁ దోడ్పడిరి. రాముఁడు సేనాసమేతుఁడై లంకలోఁ ప్రవేశించెను.

రావణుని చారులు వారి రహస్యములు తెలిసికొనుటకు వచ్చిరి; కపులు వారిని వధింపఁబోయిరి గాని రాముఁడు వారిని విడిపించెను. సీతను దీసికొనివచ్చి యామె నప్పగించుమని రాముఁడు రావణునికడకు నంగదుని రాయబారినిగాఁ బంపెను. కాని రావణుఁడు ధిక్కరించెను. అంత యుద్ధము ప్రారంభమయ్యెను. రాక్షసవీరులు మిక్కుటముగాఁ జచ్చిపోవుచుండిరి. వారి సేనాధిపతులు మడియుచుండిరి. ఇంద్రజిత్తు హోమముచేసి హోమగుండమునుండి వచ్చిన పసిడిరథము నెక్కివచ్చి రామ లక్ష్మణులతోఁ బోర నారంభించెను. వీరిని నాగాస్త్రముచేఁ గొట్టెను. రామలక్ష్మణులు మూర్ఛపడిరి. కొంతసేపటికి రాముఁడు లేచెను. కాని లక్ష్మణుఁడు స్మృతితప్పి యట్లే పడియుండెను. అతఁడు లేచునో, లేవడో యని రాముఁడు సందేహించుచుండఁగనే నారదుఁడు వచ్చి గరుత్మంతునిఁ బ్రార్థింపుమని బోధించెను. రాముఁడు గరుత్మంతుని వేఁడఁగా లక్ష్మణుని నాగపాశములు తప్పినవి. అతఁడు లేచెను. వీరు తిరిగి యుద్ధమునకుఁ బూనుకొనిరి. ఒక్కొక్క వీరునే వధించుచుండిరి. ఇంద్రజిత్తు కూడ వధింపఁబడెను. అప్పుడు రావణుఁడు యుద్ధమునకు వచ్చెను. ఇతనిచేఁ గొట్టఁబడి లక్ష్మణుఁడు మూర్ఛనొందెను. వీనికై సంజీవిని దెచ్చుటకై రాముఁడు హనుమంతునిఁ బంపెను. ఇతఁడు తెచ్చుచుండఁగా సంజీవి కాంతిని జూచి సూర్యుఁ డుదయించుచున్నాఁడని భ్రమించి యిఁక లక్ష్మణుఁడు బ్రతుకఁడని రాముఁడు మిక్కిలి దుఃఖించెను. కాని అంతలో హనుమంతుఁడు సంజీవిని గొనివచ్చి లక్ష్మణుని బునర్జీవితుని గావించెను. రావణునితో యుద్ధ మెంత చేసినను వాఁ డోడునట్లు తోఁచలేదు. ఒక శిరమును దెగఁగొట్టిన మరల నింకొకటి మొలచుచుండెను. ఒక చేతిని విఱుగఁగొట్టిన మరల నింకొకటి వచ్చుచుండెను. వానిని జంపుట వట్టిదని రాముఁడు నిరాశుఁడై యుండఁగా, విభీషణుఁడు తనయన్న గుట్టును దెల్పెను. రావణుని నాభికడ నమృతము కలదు. అందువలన శిరములు మరల బయలుదేఱుచున్నవి. కావున రావణుని నాభికడనే కొట్టుమనియెను. రాముఁ డట్లేచేసెను; ఆయువుపట్టునందుఁ గొట్టి రావణుని వధించెను.

అంతట నింద్రుఁడు, బ్రహ్మ మొదలగు దేవతలు వచ్చిరి. శ్రీరాముని స్తుతించిరి. సీత శ్రీరామునికడకుఁ దేబడెను. ఆమె రామునకు నమస్కరించెను. రాముఁడు లోకనిందను బాపికొనుటకై రావణుని వధించెను. అతఁ డంతకాలము రావణునింటనున్న సతిని మరల గ్రహింపననియెను. సీత తనవర్తనము పరిశీలింపుమని కోరెను. చితిపేర్చి యగ్నిని బ్రజ్వరిల్లఁజేసిరి. సీత చేతులు జోడించి నేను శ్రీరాముని పాదారవిందములనే నమ్మియుంటినేని యీ యగ్ని నన్నుఁ గాపాడుఁగాక యని యగ్నిజ్వాలలమధ్యఁజొచ్చెను. ఆ మంటలలో నామె చెక్కుచెదరక పుష్పములరాశిమధ్య నున్నట్లుండెను. ఈమె పావనియని యగ్ని నుడివెను. అపుడు రాముఁడు సీతను బరిగ్రహించెను.

లంకకు రాముఁడు విభీషణుని రాజునిఁజేసి సీతను దీసికొని పుష్పకమెక్కి యయోధ్యను గూర్చి వచ్చెను. రామునిరాకకుఁ బ్రజలు మిక్కిలి సంతోషమునొందిరి. అతనికే పట్టమును గట్టిరి; రామరాజ్యము పేరొందియుండెను. శునకములవంటి యల్పజంతువులకుఁగూడ నితఁడు దర్శనమిచ్చి వారికష్టసుఖముల నారయుచుండువాఁడు. సీతారాములును సంతోషంబుతో నుండిరి. సీత గర్భవతియయ్యెను. ఒకనాఁడు రాముఁడు సీతను బిలచి నీకుఁ గల కోరికలను జెప్పుముతీర్చెదననియెను. ఆమె గంగాతీరమందు మునిపత్నులతోఁ గలిసియుండుటను గోరెను. రేపే నిన్నచ్చటికి బంపెదనని చెప్పి రాముఁడు కొలువుకూటమునకు వచ్చెను. అందు భద్రుఁడు కలఁడు. "భద్రా! నన్నుఁగూర్చి ప్రజ లేమనుకొనువారో చెప్పు?" మని రాముఁ డడిగెను. "రాజా! రావణునిఁ జంపిన మహానుభావుని స్తుతించుట గాక ప్రజ లేమనఁగలరు?" అని భద్రుఁడు ప్రత్యుత్తర మిచ్చెను గాని రాముఁ డాతనిని "నిజము చెప్పుము. నన్నును, జానకిని గూర్చి ప్రజ లేమందురో తెల్పు" మని నొక్కినొక్కి యడుగఁగా భద్రుఁడు చెప్పలేక, చెప్పలేక "రామా! అంతకాలము రావణునింట నుండిన సీతను దీసికొనివచ్చి, రాముఁ డేలుచున్నాఁడేయని పౌరులు నిందావాక్యము లాడుచున్నా" రని చెప్పెను.

శ్రీరాముఁడు ప్రచ్ఛన్నవేషంబున రాత్రి యందు నగరమునఁ దిరుగుచుండఁగా నొక చాకలివాఁడు తనభార్యను దీసికొని రానొల్లక, "పరునియింట నున్నదానిని దీసికొనివచ్చి దానితోఁ గలసియుండుటకు నేను వెఱ్ఱిరాముఁడను గాను; ఆ భార్య నాకు వలదు" అనుచుండుట విని చింతాక్రాంతుఁడై తన్నుఁగూర్చియును, జానకినిగూర్చియును నిట్టి యపవాదు లున్నవి గదాయని దుఃఖము నొందెను.

రాముఁడు సోదరులను రావించెను. వారు వచ్చి విషణ్ణవదనుఁడై యున్న సోదరునిఁ జూచిరి. రాముఁడు వారికిఁ బౌరులాడుచున్న నిందా వాక్యములను దెలిపి లక్ష్మణునితో "రేపే నీవు సీతను అరణ్యమున దిగఁబెట్టుము. ఆమె మునిపత్నులను జూడఁగోరినది; ఆ నెపమునఁ గొనిపొమ్ము. నీవు మారుపలుకకుము" అని యానబెట్టెను. సతీతిలకమగు సీత కిట్టి యిక్కట్టువచ్చెనా యని యెల్లరును విచారించిరి. ఆమె పతివ్రత యగునని, రామునకుఁ దెలియునని లక్ష్మణుఁడెఱుంగును. కాని ప్రజానింద సహింపలేక తన కాంతామణిని బాయుచున్నాఁడని రామునియాజ్ఞ శిరసావహించి యతి దుఃఖముతో లక్ష్మణుఁడు సీతను నరణ్యములకుఁ గొనిపోయి యచ్చట దిగవిడచి వచ్చెను. రామునకును శాపము తప్పదయ్యెను. పూర్వము చేసిన కర్మఫల మిపు డనుభవించెను. (చూడుము విష్ణుమూర్తి)

ఒకనాఁడు రాముఁడు కొలువునందుండఁగా వృద్ధబ్రాహ్మణదంపతులువచ్చి చనిపోయిన తమ చిన్నబాలుని రాముని యెదుటఁబెట్టి "రాజా! నీరాజ్యమున నిట్టి యక్రమములు జరుగునా ? పసిబాలురకుమృత్యువా?" యనియేడ్చిరి. దానికి గారణము శూద్రుఁడొకఁడు తపస్సుచేయుట యని రాముఁడు గ్రహించి శంబుకుఁడను శూద్రయోగిని జూచి బొందితో నింద్రలోకమున కరుగనున్నవానిని వధించెను. అపుడింద్రాది దేవతలు రామునిఁజూడవచ్చి వరమిచ్చెదము వేఁడుకొనుమనిరి. ఈ బ్రాహ్మణబాలుని బ్రతికింపుఁడని రాముఁడు కోరెను. వారు బాలుని బ్రతికించిరి.

రాముఁడు శంబుకుని సంహరించి వచ్చుచుండఁగా మార్గమందు గృధ్రమును, గుడ్లగూబయు వాని కెదురుగా వచ్చి "రాజా! నేను గూడుకట్టుకొని యుండఁగా ఈ గూబ వచ్చి యందుఁజేరి లేవకున్నది. దానిని వెడలఁగొట్టింపుమని గ్రద్దయును, తాను గూడు కట్టుకొని యుండఁగా గ్రద్దవచ్చి యందుఁ జేరెను. దానిని వెడలఁగొట్టింపుమని గుడ్లగూబయును వేడుకొనినవి. రాముఁడు మంత్రులను బిలచి దాని నిజమారయుఁడనియె. గుడ్లగూబ యాచెట్టు మొలచినప్పటినుండియు గూడుకట్టుకొని యందుంటి ననియెను; గ్రద్ద భూమిపుట్టినప్పటినుండియు గూడుకట్టుకొంటి ననియెను. గృధ్ర మసత్యము చెప్పుచున్నదని దానిని వధింపుమని మంత్రు లనిరి. రాముఁడు తనకు నట్లే తోఁచెననియె. గ్రద్దను వధింపఁబోవుచుండఁగా నాకాశవాణి "వలదు వలదు. దాని శరీరముమీఁద చెయ్యిమాత్రము వేయు" మనియెను. రాముఁ డట్లుచేయఁగా గ్రద్ద నరుఁడై లేచి "తాను బ్రహ్మదత్తుఁడను వాఁడ" నని తన వృత్తాంతము చెప్పుకొనియెను. పిమ్మట రాముఁ డగస్త్యుని యాశ్రమమునకు వెళ్ళెను. అతఁడు గౌరవించి భూషణముల నీయఁబోఁగా "నేను ఇయ్యవలసిన వాఁడనేగాని పుచ్చుకొనవచ్చునా? ధర్మమును బరికింపుఁ" డని రాముఁ డనఁగాఁ గైకొనవచ్చునని తృపునివృత్తాంతము తార్కాణముగాఁ జెప్పి శ్వేతుఁడనురాజు తన కిచ్చిన యాభరణమును అగస్త్యుఁడు రామున కిచ్చెను. పిమ్మట రామునకు దండకారణ్య వృత్తాంతము చెప్పెను.

రాముఁ డయోధ్యకు మరలివచ్చి యశ్వమేధము చేయబూనెను. మునులును, మంత్రులును ప్రోత్సాహము చేసిరి. సకల మునిజనములను రావించి రాముఁ డశ్వమేధము చేసెను. వాల్మీకి తనశిష్యులగు కుశలవులనుగూడఁ దీసికొనివచ్చెను. వారిచే రామాయణము గానము చేయించెను. "చిన్నిబాలురేడ! ఇంతటి గానకౌశల మేడ!" యని నివ్వెరపాటు నొందిచూచుచు 'మీ రెవ్వరి పుత్త్రికు' లని రాముఁ డడిగెను. మేము శ్రీరాముని పుత్త్రుల మనిరి. వారినిజూడ జానకిని బోలియున్నారు. జానకికిఁ గవలపుత్త్రు లుద్భవించిన ట్లిదివఱకే వినియెను. వీరు తనపుత్త్రులే యైయుందురని యూహించి

సీతను దలఁచుకొని రాముఁడు దుఃఖించుచు ఆమె పావనియని తానెఱింగి యుండియును లోకమునకుఁ దెలియఁజేయుటకై యట్లుచేసి యుండుటను దలఁపోయుచుండెను. వాల్మీకి రామునితలం పెఱిఁగి గోమతీతీరమున నున్న సీతను రప్పింపుమనియెను. శత్రుఘ్నుఁడువెళ్ళి సీతను దీసికొనివచ్చెను. సీత పావనచరితయని వాల్మీకి గట్టిగాఁ జెప్పెను. కాని సీతయే శపథము చేయుచో బాగుండునని రాముఁడు పలికెను. అంత సీత ముందునకువచ్చి శిరము వాల్చి చేతులు జోడించి నేను రామచంద్రుని పాదారవిందముల నే యెద నమ్మియుంటి నేని, శ్రీరామునిఁదప్ప నన్య మెఱుంగకుంటి నేని ఈ భూదేవి నన్నుఁగైకొనునుగాక యనిపలికెను. తోడనే యచ్చటఁ బృథ్వి చీలి నాగలోకము నుండి నాగకన్యలువచ్చి రత్న సింహాసనముపై సీతనుంచి యామెను నాగలోకమునకుఁ గొని పోయిరి.

రాముఁ డతివ్యాకులచిత్తుఁడై సీతనుగూర్చి తలఁచుకొనుచు శోకించుచుండెను. సీతనుజూడఁ గోరుచుండెను. భూమిని దనచాపముచేఁ జీల్చెద నని ధనుస్సు పూనెను. అప్పుడు బ్రహ్మవచ్చి "రామా! నీవు సామాన్యనరుఁడవే! మాకందఱ కును నీవే రాజువు. లక్ష్మియే సీత. నీకు మేము చెప్పఁగలవారమా? నీవు శాంతింపుము. నీవు కోపించినయెడల లోకము లాగునా?" యని యిట్లు స్తుతించెను. వాల్మీకియు రాముని మఖము పూర్తిచేయుమని హెచ్చరించెను. రాముఁడు యాగమును బూర్తిగావించెను.

ఒకనాఁడు రాముఁడు కొలువులోనుండఁగా గార్గ్యుఁడు వచ్చి గంధర్వులు, శైలూషుని పుత్త్రిలు బాధించుచున్నారని కేకయరాజు నీతోఁ జెప్పుమనియె నని చెప్పెను. రాముఁడు భరతుని, వాని పుత్త్రిలను, దక్షపుష్కరులను బంపి యా గంధర్వులను జంపి కుమారులకుఁ బట్టము కట్టుమనియెను. లక్ష్మణుని పుత్త్రిలకుఁ బశ్చిమరాజ్యము లిచ్చిరి. భరతుఁడు పుత్త్రిలకుఁ బట్టముగట్టి యయోధ్యకు మఱలివచ్చెను.

మఱియొకనాఁడు రాముఁడు కొలువులో నుండగా యముఁడు మునివేషమునవచ్చి "రాజా! నీతో మాటాడవలయును. మనము మాటాడు నపు డెవ్వరును వినరాదు. పరులనావలికిఁ బొమ్మ నుము. మనము మాటాడుచుండఁగా నెవ్వరేని వచ్చుచో వారిశిరశ్ఛేదనము చేసెదనని శపథము చేసినచే నీతోఁ జెప్పవలసినది చెప్పెదను" అని చెప్పఁగా రాముఁడు సరేయని లక్ష్మణుని ద్వారముకడ నుండుమని, యెవ్వరిని లోపలకు రానీయకుమని చెప్పెను. వారికడనుండి లక్ష్మణుఁడుగూడ వెళ్ళెను. అపుడా ముని, "రామా! నేను యముఁడను; నీవు విష్ణుమూర్తివి. పదునొకండువేలసంవత్సరములనుండియు నీవిట్లు యవతరించియుంటివి. రావణాదిదుష్టులెల్లరును మడిసిరి; కావున నీవీ యవతారముచాలింపుము" అని చెప్పునంతలో లోపలకు లక్ష్మణుఁడు వచ్చెను. యముఁడు వెడలిపోయెను. రామునకు గడుదుఃఖము కలిగెను. తనకై సర్వభోగములు మాని యరణ్యమందు సకల కష్టముల ననుభ వించిన తమ్ముని దాను వధించుటయా? రాముఁడు దానినిగూర్చి తలఁపలేకయుండెను. ఏమిచేయుటకును బాలుపోక మునులను జూచి 'తానేమి చేయవలయు' ననియడిగెను. "రామా! నీవాడినమాట తప్పవచ్చునా? లక్ష్మణుఁడైనను సరియే నీవాక్యము చెల్లవలసినదే కాని చంపు టయు, నగరమునుండి వెడలఁ గొట్టుటయు నొక్కటియే గాన లక్ష్మణుని నగరమునుండి వెడలఁగొట్టుము" అని చెప్పిరి. లక్ష్మణుఁ డయోధ్య విడచివెళ్ళి సరయూనదియందుఁ గ్రుంకి పరమపదము నొందెను. లక్ష్మణునిగూడ వెడఁబాసి రాముఁడుండలేఁడు. ఇతఁడు రాజ్య మును బుత్త్రిల కప్పగించెను. లక్ష్మణునితోఁ బోఁగోరెను. శత్రుఘ్నునకు వర్తమానమంపెను. శత్రుఘ్నుఁడుకూడ వచ్చెను. సోదరులందఱును సరయూనదిలో దిగి వారి యవతారములను జాలించిరి. రామా. ఉ.రా. విరా.

రావణుఁడు:-విశ్వవోబ్రహ్మకు సుమాలి కూఁతు రగు కైకసియందుఁ బుట్టిన పెద్దకుమారుఁడు. కైకసి సంతానమును గోరి భర్తను సంజవేళఁ జేరుటచే నామెకుఁబుట్టుసంతానము రాక్షసు లగుదురని విశ్రవసుఁడు చెప్పెను. రావణునకుఁ గుంభకర్ణుఁడు, విభీషణుఁడు అను సోదరులును, శూర్పణఖ అను సోదరియునుగలరు. రావణుఁడు జన్మించినపుడు రక్తవర్షము కురిసెను. గ్రద్ద అరచెను. దేవతలు భయపడిరి. విశ్రవసు వీనికి దశగ్రీవుఁడని పేరు పెట్టెను. ఉ.

విశ్రవసును శాంతింపఁజేయుటకై కుబేరుఁ డాతనికడకు ముగ్గురు స్త్రీలను బంపెను. (చూడుము విశ్రవసు) వారిలోఁ బుష్పోత్కట యనునామెకు విశ్రవసునివలన రావణుఁడును, కుంభకర్ణుఁడును జన్మించిరి. మాలినికి విభీషణుఁడు పుట్టెను. పాకకు ఖరుఁడును, శూర్పణఖయును బుట్టిరి. భార.

రావణుఁడు పదితలలతోఁ బుట్టెను. విశ్రవసువు కైకసిని గవయుచుఁ "ప్రేయసీ! నీవెన్నిసారులు ఋతుమతివైతివి చెప్పుము. నీకందఱు పుత్త్రులనిచ్చెద" ననియెను. ఆమె పదునొకండుసారు లైతినని తెల్పి, నాకందఱు పుత్త్రులక్కఱలేదు. ఒక్కపుత్త్రుని, నొక్కపుత్త్రికను నిమ్ము అనికోరెను. ఆమెకోరినయట్లే చేసెదనని తన వచన మమోఘమగుటచేఁ బదితలలుగల పుత్త్రుని రావణుని, నొక్క కుమారిక శూర్పణఖను నొసంగెను. వి.రా.

రావణునకుఁ బదితలలు వచ్చుటకు మఱియొకకారణముగలదు. నృసింహమూర్తి హిరణ్యకశిపుని వధించునపు డీ దనుజుఁడు "నీవు కపటముగ స్తంభమునుండివచ్చి యిరువదిగోళ్ళతో నన్నుఁ జంపితివి; ఇదియా నీ పౌరుషము?" అని యాక్షేపణముచేసెను. అపుడు నృసింహుఁడు నీకీముందువచ్చు జన్మమున నిరువదిబాహువులను, బదిశిరములను నిచ్చి నేను సామాన్యనరుఁడనై నిన్ను వధించెదననియెను. వి.రా.

రావణుని పురోహితుఁడు శౌష్కలుఁడు. మురారి.

రావణుఁడు పూర్వజన్మమున హిరణ్యకశిపుఁడు (చూడుము జయవిజయులు).

రావణునిసవతియన్నయగుకుబేరుఁడు పుష్పకమెక్కి తిరుగుచుండఁగా నైకసి చూచి యోర్వలేక, యాపుష్పకము నీవు పొందుమని కుమారునితోఁ జెప్పెను. అదియే యననేల? దానికంటె నెక్కువదానినే పొందెదనని రావణుఁడు బ్రహ్మనుగూర్చి తపస్సుచేయఁ బ్రారంభించెను. ఒంటికాలిపై నిలుచుండి సూర్యునివైపుఁ జూచుచుఁ దపస్సుచేయుచు వేయేండ్లకొక్కసారి తనశిరము నొక్కదానిని వ్రేల్చుచుండెను. ఇట్లు తొమ్మిదిశిరములు వ్రేల్చెను. లోకము లన్నియుఁ దహతహలాడుచుండెను. దేవతలు బెగడొందిరి. రావణుఁడు పదియవతలనుగూడ హోమము చేయుటకు సిద్ధముగ నుండెను. అపుడు బ్రహ్మవచ్చి నీ తపస్సునకు మెచ్చుకొంటిని, వరము వేడుకొనుమనియెను. "నాకు నరులవలన భయములేదు. దేవ యక్ష గంధర్వాదులచే నాకు మరణములేకుండునట్లు వరమిమ్ము" అని రావణుఁడు కోరెను. బ్రహ్మ యా వరమిచ్చెను. రావణుఁడు తపస్సుచాలించి వచ్చెను. పిమ్మట సుమాలి యితనికడకువచ్చి "మేములంకయందుండువారము. మమ్ములను దేవతలు రసాతలమునకుఁ దరిమిరి; నీయన్న కుబేరుఁ డిపుడు లంకయం దున్నవాఁడు. నీ వెట్టులైనను లంకను గైకొనుము"అని చెప్పెను. రావణుఁడు సరేయని లంకను దనకప్పగించి దానిని విడిచి వెళ్లుమని కుబేరునకుఁ బ్రహస్తునిచే సందేశమంపెను. కుబేరుఁడు తండ్రితోఁ జెప్పుకొని యచ్చటనుండి వెడలిపోయెను. రాక్షసులు మరల లంకలోఁ బ్రవేశించిరి. దశకంఠుఁడు లంకకు రాజయ్యెను.

రావణుఁ డొకనాఁడు వేఁటకుబోయెను. కాననమందు మయుని, వానికూఁతురు మందోదరినిఁ జూచెను. ఆమెరూపలావణ్యముల కాతని చిత్తము కరఁగెను. వారిని సమీపించి మీరెవ్వరని కుశలప్రశ్నము చేసెను. తాను లంకేశ్వరుఁడ ననియును, నింకను వివాహము కాలేదనియును జెప్పెను. మయుఁడు మందోదరిని రావణునకిచ్చి పెండ్లిచేసెను. ఈ దంపతులకు మేఘనాథుఁడు, దేవాంతకుఁడు, నరాంతకుఁడు, మహాపార్శ్వుఁడు, అక్షుఁడు అను కుమారులు జన్మించిరి.

రావణుఁడు గృహమునకు మరలివచ్చినపిదప కుబేరుఁడు ఇతనికడ కొక దూతను బంపెను. "రావణా! నీ చెయిదములకు లోకులు నిన్ను గర్హించుచున్నారు. నీ దుర్ణయము లెక్కువగా నున్నవి. నీ క్రూరత్వమువలన, నీర్ష్యాది దుర్గుణములవలనఁ జెడుగువచ్చుచున్నది" అని దూత కుబేరునిమాటలుగఁ దెలుప రావణునకు గోపము వచ్చి యాదూతనుసంహరించి కుబేరుని యలకాపట్టణముపై దాడివెడలెను. ఇతని దళవాయిలును, కుబేరునిదళవాయిలును బోరాడిరి. వారోడిపాఱిపోయిరి. కుబేరుఁడే వచ్చి యుద్ధముచేయ

నారంభించెను. రావణుఁ డనేక మాయారూపములఁ గనఁబడుచు యుద్ధముచేసి కుబేరుని నోడించి, యాతనిని బుష్పకముపైనుండి త్రోసి తా నా వాహనమెక్కి కైలాసమున కేగెను.

పుష్పకము కొంతదూరము ప్రయాణముచేసి కైలాస సమీపమున నాగిపోయెను. దానికిఁ గారణము తెలిసికొనలేక రావణుఁ డాలోచించుచుండఁగా నందివచ్చి, శంభుఁడు దేవితోఁ గ్రీడించుచున్నాఁడు; నీ విపుడు పోఁ జనదని చెప్పెను. రావణుఁడు పుష్పకముదిగి వానరముఖముతో నున్న నందినిజూచి నవ్వెను. నందికిఁ గోపము వచ్చి వానరముఖము చూచి నవ్వితివి గావున వానరులచేతనే నీ వంశము నాశనముచేయఁబడుఁగాక యని వీనిని శపించెను. రావణున కామాటలకుఁ బట్టరానియాగ్రహము వచ్చెను. నీవెంత? నీ శంకరుఁడెంత? యని కైలాసపర్వతము నెత్తి బంతియాడించినట్లాడించివేసెను. అది యట్లు కదలుటచే గౌరిభయపడి శివునిఁ గట్టిగఁ గౌఁగిలించుకొనియెను. రావణుఁడు వచ్చెనని శివుఁడు గ్రహించుకొని వానికిఁ గొంత పరాభవమైనగాని దర్పనమియరాదనుకొని తన బొటనవ్రేలితోఁ బర్వతమును నొక్కెను. దానిక్రింద రావణుని చేతులు పడి నలిగిపోయినవి. ఆ బాధచే లోకములన్నియు బెగ్గడిల్లునట్లతఁడు పెద్దరావముచేసెను. అందువలననే యతనికి రావణుఁడను పేరువచ్చినది. అప్పటివరకు దశకంఠుఁడను పేరనే బరగువాఁడు. మారీచుఁడు మొదలగువారు వచ్చిరి. నీవు శివునిఁ బ్రార్థించుము. అతఁడు ప్రసన్నుఁడగునని హితవుచెప్పిరి. రావణుఁడు పరమేశ్వరుని స్తుతించెను. శివుఁడు ప్రత్యక్షముకాఁగా, చంద్రహాసమును, గొఱఁతలేని యాయువును నిమ్మని దశకంఠుఁడుకోరెను. శివుఁ డనుగ్రహించి నీవు దుశ్శీలుఁడవై యుండునెడల మాత్రము తిరిగి యవి రెండు మాకడకే వచ్చునని చెప్పెను.

రావణుఁ డచ్చటినుండి వచ్చుచుఁ దపస్సు చేసికొనుచున్న వేదవతిని జూచి నీ వెవ్వరవని యడిగెను. ఆమె విష్ణుమూర్తినిగూర్చి తపస్సు చేయుచుండుటను దెల్పెను. "విష్ణుమూర్తి నాకంటె ఘనుఁడా? వానికంటె నధికుఁడను నన్నుఁ జేపట్టుము" అని యతఁ డామెను సమీపించెను. మోహాంధతచే నామెను ముద్దాడఁగోరి యామె వేణిపట్టి లాగెను. వేదవతి యరుణలోచనయై నీవు దుష్టుఁడవని యెఱిఁగియుండియు మంచితనమునకై నీతో సంభాషించితిని. నీవు ముట్టిన యీ శరీరము నే నొల్లను. నా మనస్సు నిజముగ హరిపైనుండెనేని నే నయోనిజనుగఁ బుట్టి విష్ణుమూర్తినే గ్రహించి నీ వంశనాశన మొనరించెదనని యామె యోగాగ్ని కల్పించుకొని దగ్ధయయ్యెను.

అచ్చటినుండి రావణుఁడు పుష్పకమెక్కి పోవుచుండఁగాఁ బొగ కనఁబడెను. దానికిఁ గారణ మేమగునని యాతఁ డచ్చటకుఁ జూడఁబోయి మరుత్తు యజ్ఞము చేయుచుండుటను గాంచెను. హవిర్భాగములను దనకు నిమ్మని కోరెను. లేదేని యుద్ధముచేయుదు ననియెను. మరుత్తు వీనితో యుద్ధముచేయుటకు లేచెను గాని యాగముచేయువారు యుద్ధము చేయరాదని బ్రాహ్మణులుమాన్పించిరి. రావణుఁడు బ్రాహ్మణులను హింసించి, యగ్నులను బాడుచేసెను. దేవతలు జంతువులరూపమున వచ్చి హవిర్భాగములను గైకొనిరి.

పిమ్మట రావణుఁడు రాజులతో యుద్ధమారంభించెను. ఈలంకేశ్వరునితోఁ బోరుటకు బ్రతివారును వెఱచుచుండిరి. అనరణ్యుఁడను రాజు పోరి యోడియు నూరకుండక ఇది నీ ప్రతాపముగాదు. నీచే జయించువాఁడు భగవంతుఁ డున్నాఁడని పలికెను. ఆ మాటలకు రావణునకుఁ గోపమువచ్చి వాని తల చితుకఁ గొట్టెను.

నారదుఁడు రావణుని గలసికొని విష్ణుమూర్తి కౌసల్యయం దుద్భవించి నిన్ను సంహరించునని తెల్పెను. ఆ మాట విని రావణుఁడు కౌసల్య నెత్తుకొనివచ్చి సముద్రంబున మందసంబునఁ బెట్టెను. దశరథుఁడు కౌసల్యను వివాహమగుటకు వచ్చుచుండఁగాఁ బ్రమాదవశమున నదిలోఁ బడి కొట్టుకొనివచ్చి యీ మందసంబునే చేరెను. రావణునకీ సంగతి తెలిసి కౌసల్యను జంపుచో నామెయందు విష్ణువు పుట్టఁడని యెంచి యామెను జంపఁబోయెను. కాని యప్పుడే నారదుఁడువచ్చి స్త్రీనిజంపుట పౌరుషహీనమని యాక్షేపణము చేసెను. రావణుఁ డామెను జంపకవిడచెను. అనరణ్యుని సంహరించినపిదపఁ, నీతఁడు మాహిష్మతీపురమున కేగెను.

అచ్చటనుండి కార్తవీర్యునికడకేగి తనతో యుద్ధమునకురమ్మని సందేశమంపెను. అర్జునుఁడు యుద్ధముచేసి రావణు నోడించి వీనిని చెఱయం దుంచెను. పులస్త్యుఁడు వచ్చి తన పౌత్త్రుని విడువుమని కోరఁగా నర్జునుఁడు విడచెను.

తరువాత వాలి బలాఢ్యుఁడని విని వానితో యుద్ధముచేయఁగోరి తారుఁడనువానిని వాలి యెచ్చట నున్నాఁడని రావణుఁ డడిగెను. వానితో నీవు యుద్ధముచేయలేవని తారుఁడు చెప్పఁగా వానిని జావమోది దక్షిణముగఁ బయనమై, వాలినిజూచి యుద్ధమునకు రమ్మని పిలిచెను. రావణునిపీఁచ మణఁగునట్లుగ వాలి కొట్టెను. దాన నీతఁడు బుద్ధితెచ్చుకొని వాలితో సఖ్యముచేసికొని యుండెను. రావణుఁడు వాలికడనుండి వచ్చుచుండఁగా నారదుఁడు కనఁబడియెను. "నీవు నరులనే గెల్చుచుంటివి. దానివలన నేమి ఖ్యాతివచ్చును? దేవత లున్నారు. వారిలో యముఁడు గర్వించి యున్నాఁడు. వానినోడింపు" మని యా ముని చెప్పి రావణునికంటె ముందుగ యమునికడకుఁ బోయి "లంకాధీశుఁడు గర్వించి నీపైకియుద్ధమునకు వచ్చుచున్నాఁడు. వానిగర్వ మణఁగఁ గొట్టు"మని చెప్పెను. రావణుఁడు యమలోకములోనికేగి యచ్చట భటులను గొట్టుచుఁ గావలివారలను దండించుచున్నందున యముఁడు వీనితో యుద్ధము చేయఁజొచ్చెను. బ్రహ్మ వచ్చి, "నేను వీనికిఁ జిరాయువుకలుగునట్లు వరమిచ్చితిని. నా మాట యసత్యముసేయకు" మని యమునిఁ గోరఁగా యముఁడు రావణుని ప్రాణములతో విడిచెను.

యమలోకమునుండి దశగ్రీవుఁను రసాతలమున కేగెను. అందు భోగవతీపురమున నివాతకవచులతోఁ బోరాడ నారంభించెను. బ్రహ్మ వచ్చి వీరికి సంధిచేసెను. అచ్చటఁ గొంత కాలముండి రావణుఁడు అశ్మపురము వెళ్ళి యచ్చటఁ గాలకేయులను యుద్ధమునకుఁ బిలచెను. వారి నోడించెను. వారు పాఱిపోవుచుండఁగా శూర్పణఖభర్త విద్యుజ్జిహ్వుఁడు వచ్చి నేనుండఁగా మీరెక్కడికిఁబోదు రని వారిం జేరఁబోఁగాఁ గాలకేయులనుభ్రాంతిచే రావణుఁడు వానిని సంహరించెను.

పిమ్మట దశగ్రీవుఁడు బలిని గెలువఁగోరి పాతాళలోకమున కేగెను. ప్రథమద్వారముకడ నుండిన తేజోమూర్తినిజూచి "నేను బలిని గెలువ వలెనని వచ్చితిని. అతఁ డెచ్చట నుండును? చూపు" మనియెను. ఏడవద్వారముదాఁటి వెళ్ళుమని యతఁడు చెప్పెను. రావణుఁడు వచ్చి బలిని జూచెను. బలి 'రావణా రమ్మ' అని తన తొడమీఁదఁ గూర్చుండఁబెట్టుకొని "నీ వేమిటికై వచ్చితివి? నాయనా!" యని యడిగెను. రావణుఁడు తాను వచ్చినపని చెప్పలేక హరి నిన్ను మాయచేసెనని వింటిని; ఎచ్చట నున్నాఁడో చూపుము. వాని నణఁగఁద్రొక్కెద ననియె. ప్రథమద్వారముకడ నున్నవాఁడే హరి యని చెప్పి బలి వానికి హరిమాహాత్మ్యము చెప్పెను.

దిగ్విజయము చేయుకోర్కెతో నితఁడు మాహిష్మతీపురమున కేగెను. దానిని గార్తవీర్యార్జునుఁడు పాలించుచుండెను. అతఁడు రావణుని జుట్టుపట్టుకొని పైకెత్తి నేలం ద్రోసి పిగ్గిలఁజేసి పంపెను. భాగ.

అచ్చటనుండి రావణుఁడు మేరుపర్వతముకడకేగి తనతో యుద్ధమునకు రమ్మని సూర్యునకు సందేశమంపెను. సూర్యుఁ డితనితో యుద్ధము చేయలేనని ప్రత్యుత్తరమంపెను. రావణునికడకు బర్వతుఁడువచ్చెను. ఈ మునివలన సత్కర్మలను జేయువారినిగూర్చియువారిమాహాత్మ్యమును వినియెను. పదపడి మాంధాతనృపతినిజూచి యాతనితో యుద్ధముచేయఁగోరెను. అతని నోడించెను. బ్రహ్మవచ్చి వారికి సంధిగావించెను. తరువాత నితఁడు చంద్రునిమీదకు వెళ్ళెను. అచ్చటకును బ్రహ్మవచ్చి చంద్రుని బాధింపకుమని వీనితోఁ జెప్పెను. రావణుఁడు స్త్రీలను చెఱఁబెట్టుట ప్రారంభించెను. ఇతఁడును, నితని వంశమును స్త్రీమూలముననే నాశనమయ్యెడుగాక యని వారు శపించిరి.

లంకేశ్వరుఁడు గృహమునకు మరలివచ్చెను. ఇతఁడు బలాత్కారమున స్త్రీలనుదెచ్చుటచూచి విభీషణుఁడు వానిని నిందించెను. మఱియు నితఁ డింటలేనిసమయమున మధుడువచ్చి కుంభీనసను నెత్తుకొనిపోవుటను దెల్పెను. రావణుఁడు పారపాటున శూర్పణఖభర్తను జంపియుండెనుగావున

నితఁ డిల్లుచేరఁగానే శూర్పణఖ వానియొద్దకు వచ్చి యేడ్చెను. రావణుఁడు సోదరి నోదార్చి దండకారణ్యములో నున్న ఖర దూషణులు సమస్తసౌఖ్యము లిచ్చెదరని యామె నచ్చటకుఁ బంపెను. పిమ్మట మధున కింత కావరమా ? యని యితఁడు వానిని సంహరించుట కేగెను. అచ్చటఁ గుంభీనస వాని కెదురుగా వచ్చి మధువు తనను దెచ్చుటచే భర్తయయ్యెఁ గావున వానిని జంపవలదని వేఁడెను. రావణుఁడు సమ్మతించి మధువుతో సఖ్యముచేసి వానిని దీసికొని యింద్రునితో యుద్ధమునకుఁ బయనమయ్యెను.

ఆ మార్గమందు నలకూబరునికొఱకేగుచుండిన రంభను బట్టి బలాత్కారమునఁ గ్రీడించెను. ఆ సంగతి రంభ నలకూబరునితోఁ జెప్పుకొనియెను. "రావణుఁ డేవనితనైన బలాత్కారమునఁ బట్టెనేని వాని శిరములు పగిలి చచ్చు" నని నలకూబరుఁడు శపించెను. అదియును రావణునకుఁ దెలిసెను. ఇతఁ డింద్రలోకమును జేరెను. దేవతలతో యుద్ధము చేసెను. వారోడి పాఱిపోయిరి. ఇంద్రుఁడు వచ్చి రావణు నోడించెను. అపుడు వీనికుమారుఁడు మేఘనాథుఁడువిజృంభించెను. రాక్షసమాయలచే నదృశ్యుఁడై యుద్ధము చేయుచు నింద్రుని బంధించి తన జనకుని విడిపించెను.

అచ్చటనుండి దశకంఠుఁ డరణ్యమార్గముల వచ్చుచు, దివ్యకాంతులతోఁ దేజరిల్లు నొక్క మహాపురుషుఁడు తపస్సు చేసికొనుచుండుట చూచి, వీఁడెవ్వఁడో మాయావి యని వానిపై నగ్నివర్షము కురియఁజేసెను. ఆ మహాపురుషుఁడు కపిలుఁడు. అతఁడు వీని నొక్క గ్రుద్దు గ్రుద్ది గుహలోని కరిగెను. ఇతఁడు మూర్ఛపోయి కొంతతడవునకుఁ దెప్పరిల్లి తనను గొట్టినవాఁడు గుహలోని కేగెనని తెలిసికొని తానును వెడలెను. కాని కపిలునిజూచుటతోడనే యితని శరీరము కంపించెను. రావణుఁడు భయ గౌరవములతో "అయ్యా! నీ వెవ్వరవో తెల్పు" మనియెను. కపిలుఁడు నోరు తెఱచెను. అందు దానవనాథునకు లోకములన్నియును గోచరించెను. అతఁడు విష్ణుమూర్తి కావచ్చునని తలఁచి రావణుఁడు సనత్కుమారుని కడకుఁ బోయి విష్ణుమాహాత్మ్యము తెలిసికొనియెను.

రావణుఁ డచ్చటనుండి తిరిగి వచ్చుచుండఁగా నారదుఁడు కనఁబడియెను. నేను పోరఁ దగినవా రెచ్చట నున్నారని యితఁడు వాని నడిగెను. శ్వేతద్వీపమునకు వెళ్ళుమని నారదుఁడు చెప్పెను. రావణుఁడు పుష్పకమునెక్కి వెళ్లెను. కొంతదూరము వెళ్ళినపిదప పుష్పకము నడచినది కాదు. రావణుఁడు దిగి నడువ నారంభించెను. అచ్చట నాతనికి స్త్రీలే కనబడిరి; నీవెవ్వఁడవని యడిగిరి. నేను రావణుఁడను. నాతో సమానముగఁ బోరువారిని వెదకుచు వచ్చితినని యితఁడనియెను. అంత నొక వనిత, ఇదే పదితలల వింతపురుగు వచ్చెనని రావణుని గుప్పిడిలోఁబట్టి మఱియొక స్త్రీచేతి కిచ్చెను. ఆమె ఇంకొకయాపె కిచ్చెను. రావణుఁడు వారి గుప్పిళ్ల సందునఁబడి నలిగిపోవుచుండెను. అతనిశరీరము నొప్పిపెట్టి తనను బట్టిన యామె చెయ్యి కఱచెను. ఆమె వీనిని పైకెగురవేసి సముద్రములో బడవేసెను. సముద్రములోనుండి రావణుఁడు మెల్లగా లంకకుఁ జేరఁగలిగెను.

లంకయును రాక్షసనగరమైనను మిక్కిలి నాగరికత చెందినది. అచ్చటి సౌధములు, జల యంత్రములు, ఇతర నాగరికత వసతులు అద్భుతమును గొలుపుచుండును. రావణుని రాజ్యపాలనమునందును నేలోటు లున్నట్లు కనఁబడవు. రావణుఁడు సీతారాముల వృత్తాంతము మొదట అనుకంపనునివలన వినెను. దండకారణ్యమున సంచరించుచు రాముఁడు ఖర దూషణులను జంపెనని యా రాక్షసుఁ డీతనికిఁ జెప్పెను.

అనుకంపనుని వెనుకనే శూర్పణఖ వచ్చి, యిద్దఱు నరులు తన ముక్కు, చెవులు కోసి, లంకేశ్వరుని చెలియలని యైనను దలఁపక తన నవమానపఱచిరనియును, వందుకు శిక్షగా వారితో నుండు సతిని జెఱపట్టుమనియును బోధించెను. రావణుఁడు మారీచుని దనకు సహాయముగాఁ గోరి మాయోపాయముచే రాముని, లక్ష్మణుని దూరముగఁ గొనిపొమ్మని యాజ్ఞయిచ్చెను. మారీచుఁడు సందేహించియు రావణునకు భయపడి వెళ్ళి కురంగమై సీతారాముల కంటఁబడి దూరముగాఁ బోయెను. దానిని దెచ్చుటకు రాముఁడు వెళ్ళెను. 'హా లక్ష్మణా!' అను కేక విని లక్ష్మణుఁ

జేగెను. సీత యొక్క_తెయఁ బరశాలలో నుండెను. అప్పుడు రావణుఁడు యతిరూపమున నామెకడకు వచ్చెను. తన వృత్తాంతమునుచెప్పి నిజరూపము చూపి తనతో రమ్మనియును, ఆమెను లంకకు రాణిని జేసెదననియునుజెప్పెను.

సీత వానిరూపముచూచి భయపడి మూర్ఛ నొందెను. ఆ మూర్ఛబడియున్నదానినే యెత్తుకొని రావణుఁ డాకాశమార్గమునఁ బోవుచుండెను. మార్గమందు వీనిని జటాయువుచూచి, "ఇదేమి? రాముని భార్య నెత్తుకొనిపోవుచుంటి" వని యడ్డగించెను; అతఁడువిడువకున్న నతనితోఁ బోరాడెను. రావణుఁడు జటాయువు ఱెక్క_లు విఱుగఁగొట్టి, క్రిందఁబడవేసి సీతను లంకకుఁ గొనిపోయెను.

దశగ్రీవుఁ డామెకు లంకానగరముచూపెను. కాంచనమణిమయసౌధములు, ఉద్యానవనములు చూపెను. ఆమెను బొగడుచుఁ, దన వైభవము బొగడుకొనుచు వారిద్దఱికే తగునని చెప్పుచుండెను. నరాధముఁడగు రాముని విడువుమని చెప్పుచుండెను. ఆమెను భయపెట్టి యొప్పింపఁ జూచుచుండెను. ఎంతచేసినను సీత రావణుని ధిక్క_రించుచునే యుండెను. ఆమె నశోకవనములోఁబెట్టి యామెకు రాక్షసాంగనలను గాపుపెట్టి వారిచే రావణునకు రాణివి కమ్మని బోధింపించుచుండువాఁడు.

ఇట్లుండఁగా హనుమంతుఁడు వచ్చెను. అతఁడు సీతను జూచి యా సంతోషముచే నుద్యానవనములందుఁ జెట్లను బాడుచేయుచు, జలయంత్రములను ధ్వంసముచేయుచుఁ, గావలివారలను హింపించుచు నెవ్వరికిని లొంగకుండెను. ఒక్క_ కోతిగానికి లక్ష్యముచేయుటేమి? యని రావణుఁ డుపేక్ష చేసెనుగాని హనుమంతుని యల్లరి యెక్కు_వగుటచేఁ దాము విలువఁజాలమని ప్రజలు రావణునితోఁ జెప్పుకొనిరి. అతఁడు హనుమంతుని బంధించుటకుఁ గొందఱను బంపెను. కాని వారితనిచేఁ జచ్చిరి. ఇంద్రజిత్తు హనుమంతుని బంధించెను. ఇతని వాలమునకు బట్టలుకట్టి యగ్నిని వానికంటించిరి. వాయుపుత్త్రుఁ డాయగ్నితో లంకయందలి సౌధముల నన్నిఁటిని గాల్చెను.

హనుమంతుఁడు వెళ్ళి రామాదులకు సీత వృత్తాంతము చెప్పెను. వారు యుద్ధసన్నద్ధులై వచ్చుచుండిరి. రావణుఁడు సభచేసి మంత్రుల నాలోచన యడిగెను. విభీషణుఁడు యుద్ధము వలదనెను. సీతను విడువుమనియెను. కాని మంత్రులందఱును యుద్ధముచేయఁ బ్రోత్సహించిరి. రావణుఁడు విభీషణుని నిందించి పొమ్మనియెను. విభీషణుఁడు సోదరుని విడిచి లంకదాఁటివచ్చి శ్రీరాముని శరణుచొచ్చెను. శుక సారణులు రావణుని గూఢచారులు. శత్రుసేనలను జూచివచ్చి రావణునకుఁ జెప్పిరి. రావణుఁ డంతఃపురమునకుఁ బోయి విద్యుజ్జిహ్వుఁ డనువానిని బిలిచి "బాణమున కొక శిరమును గ్రుచ్చి సీతకుఁ జూపి, "సీతా! ఇదుగో, నీ పతి చంపఁబడియెను. వానిశిరము చూడుము అని బెదరింపు" మని చెప్పెను. మఱియు రాముని విడిచి రావణునిఁగైకొనుమని చెప్పుమనియెను. కాని సీత వీనిమాటలకు మోసపోవునా?

రామాదులు సముద్రము దాఁటి వచ్చిరి. కపులును, రాక్షసులును ఘోరముగాఁ బోరుచుండిరి. సేనాధిపతులు యుద్ధముచేయుచుండిరి. అతికాయుఁడు, మహాకాయుఁడు, ఇంద్రజిత్తు మొదలగు మహావీరులు రణరంగమున మడిసిరి. ఇఁకనైన యుద్ధము మానుమని మండోదరి వచ్చి బోధించెను. రామునకు వెఱచి యుద్ధము మానినచో నింద్రుఁడుకూడ లోకువచేయు ననియును, యుద్ధము మాననియును రావణుఁ డనియె. తన కుమారుఁడు సంహరింపఁబడుటచే రావణునకు మిక్క_లి దుఃఖమువచ్చి కోపమాగక సీతను జంపెదనని వెళ్ళెను. కాని యచ్చటివారు "నీ యంతటివాఁడు స్త్రీని జంపుటా? యపకీర్తి కాదా?" యనిరి. అచ్చటినుండి రావణుఁడు మరలివచ్చి పటుతరరోషముతో శత్రుసేనపై శరవర్షము కురిపించుచుండెను. లక్ష్మణుఁడు శరహతుఁడై మూర్ఛనొందెను. వీనిని బ్రతికించుటకై రాముఁడు సంజీవని తెమ్మని హనుమంతునిఁ బంపెను. రావణుఁ డిది యెఱిఁగి హనుమంతునికంటె ముందుబోయి కాలనేమితో నచ్చటకు వచ్చు హనుమంతుని నెట్లైనఁ జంపుమని చెప్పెను. కాని హనుమంతుఁడు కాలనేమిని గెలిచి వచ్చెను. లక్ష్మణుఁడు లేచి మరల

యుద్ధమునకు వచ్చెను. అపుడురావణుఁడుశుక్రాచార్యునితో నాలోచించి పాతాళహోమము చేయఁబోవుచుండెను. అది పూర్తియైనచో నతఁడు అజేయుఁ డయ్యెడువాఁడు. రామునకు విభీషణుఁ డీ గుట్టు చెప్పెను. అంగదుఁడు మొదలగువారిని హోమము పాడుచేయుటకుఁ బంపిరి. అంగదుఁడు మండోదరిని జుట్టుపట్టి యీడ్చి 'ఇదిగో నీ భార్య నీడ్చుకొని వచ్చితి'ననియె. రావణుఁ డా కోపావేశమున హోమము పూర్తిచేయక లేచి భార్యను విడిపించి ప్రాణములపై నాశపెట్టుకొనక యుద్ధము చేయుచుండెను. వీనిని సంహరింపలేనని రాముని కధైర్యము తోఁచెను. ఒక శిరము కొట్టిన మఱి యొకటి వచ్చుచుండెను. ఒక హస్తము నఱికిన మఱి యొకటి వచ్చుచుండెను. అపుడు విభీషణుఁడు రామున కుపాయము చెప్పెను. రావణుని నాభికడ నమృతము కలదు. దానివలన మఱల శిరములు వచ్చుచున్నవి. నాభికడ గొట్టుము అనియెను. రాముఁడు సునిశిత బాణముతో రావణుని నాభికడఁ గొట్టెను. దాన రావణుఁడు మొదలునఱికిన తరువువలెఁ గ్రిందఁబడి ప్రాణములు విడిచెను.

రామా. వి. రా.

రాష్ట్రిడు:-కాశియొక్క కుమారుఁడు. ఇతని పుత్త్రిఁడు దీర తపుఁడు. భాగ.

రాహువు:-ఒక దానవుఁడు. సింహిక కుమారుఁడు. సముద్రమథన మైనపిమ్మట నమృతము గ్రోలుటకు దేవత లొకపంక్తిని, దానవు లొకపంక్తిని గూర్చుండిరి. విష్ణుమూర్తి జగన్మోహినీ రూపమున వచ్చి యమృతమును ముందుగా దేవతల కిచ్చుచుండెను. దానవులకు అమృతము మిగులునట్లు లేదు. ఆసంగతి రాహువుగ్రహించి తాను దేవతలబంతిలోఁ జేరి యమృతము పానము చేయుచుండెను. సూర్యచంద్రు లదిచూచి విష్ణువుతోఁజెప్పిరి. విష్ణుమూర్తి చక్రముతో రాహువును గొట్టెను. ఇతని కంఠము తెగెనుగాని యమృతపానము చేసియుండుటచే నది నశింపలేదు. అప్పటినుండియు రాహువు సూర్యచంద్రులతో వైరమువూని యుండెను. వారి నప్పుడప్పుడు కబళించుచుండెను. రాహువు కుమారుఁడు మేఘహాసుఁడు. భార. బ్ర. వై.

రాళ్ళవాన:- నందాదులు ఇంద్రయాగమును జేయఁబూనిరి. దానివలన నింద్రుఁడు సంప్రీతుఁడై వర్షములు కురిపించుననియును, దాన సస్యములు ఫలించుననియును శ్రీకృష్ణునితోఁ జెప్పిరి. "ఎవరికర్మవశమున నేమికావలయునో యది యగునుగాని యింద్రుఁ డేమిచేయును? కర్మను దాటువారు లేరు. అంతకంటె నీ శైలమునకును, బ్రాహ్మణులకును, ధేనువులకును బూజచేయుఁడు" అని ఇంద్రయాగమును మానిపించెను. 'ఇదే శైలము. దీని నర్చింప రం' డని తానొక శైలాకృతిని దైకొని వా రొనర్చిన పూజలు స్వీకరించెను. ఇంద్రునకుఁ గోపము వచ్చి తనను నిరాకరించిన గోపకులకు శిక్ష చేయవలెనని పెద్ద రాళ్ళవానను గురిపించెను. పశువులు, మనుజులు హతమగుచుండిరి. వారు శ్రీకృష్ణునిఁబ్రార్థింపఁగా నతఁడు గోవర్ధన పర్వతమును జేకత్తి గొడుగువలెఁబట్టి దానిక్రిందకుఁ బశువులను, గోపకులను రావించి సంరక్షించెను. ఏడుదినము లిట్లు రాళ్ళవాన యేకధారగా మిక్కిలి భయంకరముగాఁ గురిసినను వారొక్కింతయును జలింపలేదు. అంత శ్రీకృష్ణునిమహిమ నింద్రుఁడు తెలిసికొని వర్షించుట చాలించి శ్రీకృష్ణుని సందర్శించి 'తనను మన్నింపు' మని ప్రార్థించెను. "ఎవనిని రక్షింపఁ దలంతునో వానిని నిర్ధనునిఁ జేయుదును. నీ గర్వము పోఁగొట్టుట కిట్లు చేసితిని. నీవు నాయాజ్ఞల జేయుచు లోకపాలనమును జేయుచుండు" మని చెప్పి పంపెను. భాగ.

రి

రిపుంజయుఁడు:- సుచ్ఛాయా శిష్టులకుమారుఁడు. ఇతని భార్య వీరిణి. మత్స్య.

రిపుంజయుఁడు:- బృహద్రథునివంశములోఁ గడపటివాఁడు. వీనిని జంపి వీనిమంత్రి రాజయ్యెను.

రిపుంజయుఁడు:- మనువంశమువాఁడు. పూర్వ మఱువదియేండ్లు అనావృష్టికలుగుటచేఁ బంటలు లేకపోయెను. ఆహారములేక ప్రజలు మరణించిరి. రాజును లేకపోయెను. నాగులు, యక్షులు భూలోకము నాక్రమించుకొనిరి. అపుడు

బ్రహ్మ మనువంశములోనివాఁడగు రిపుంజయుని జూచి "నీవు రాజువై భూలోకమును బాలింపుము. దివోదాసుఁడ వను పేరునఁ గాశియందుండుము" అని చెప్పెను. ఆ నగరము నాగులు, యక్షులు, దేవతలచేతనే యాక్రమింపఁబడి యుండెను. వీరిని వెడలఁగొట్టినఁ గాని తాను పాలింపలేనని రిపుంజయుఁ డనియెను. వారిని దొలఁగిపొమ్మని బ్రహ్మ శాసించెను. శివుఁడుగూడఁ బ్రమథులతోఁ గాశినుండి వెడలిపోయెను. రిపుంజయుఁడు దివోదాసుఁడను పేరుతో రాజ్యమేలుచుండెను. అతనిపాలనములో ధర్మ మించుకేనియును వ్యత్యాసము నొందక యుండెను. దేవతల కీర్ష్యకలిగి వీనిని వంచింపవలెననుకొనిరి. అగ్ని, వరుణుఁడు, వాయువు కాశీ పట్టణమువిడిచివచ్చిరి. అగ్నియును, వాయువును లేకపోవుటచేఁ బ్రజలు బాధపడుచు రాజుతోఁ జెప్పికొనిరి. ఇతఁడు తన యోగశక్తిచే వర్షము కురిపించి, యగ్నిని గలుగఁజేసెను. ఈ రాజును గాశీనగరమునుండి వెడలఁగొట్టి తాను ప్రవేశింపవలయునని శివుఁడు తలంచెను. రిపుంజయుని వంచించుటకై శివుఁడు శక్తులను, సూర్యునిఁ గూడఁ బంపెను. వారికి సాధ్యమైనదిగాదు. విఘ్నేశ్వరుఁడు ఢుంఠిభట్టారకుఁడను పేరునఁ బోయి కొంత ధర్మవిపరీతము చేసెను. శివుఁడు విష్ణువునే దానిని జేయుమని కోరెను. విష్ణువు బ్రాహ్మణరూపమున వచ్చి బౌద్ధధర్మమును బోధించెను. ఈ బోధనమువలన వర్ణధర్మములు పోయెను. దివోదాసునకు విరక్తిపుట్టి యేమిచేయుమనెదవని ఢుంఠిభట్టారకు నడిగెను. కాశీనగరమును విడిచి వెళ్ళుమని యతఁడు చెప్పెను. రిపుంజయుఁడు పుత్త్రునకు రాజ్యమప్పగించి తాను గాశీనగరము విడిచివచ్చెను. కాశీ.

రిపుఁడు:-యదువు నాల్గవ కుమారుఁడు. భాగ.

రిపుఁడు:-భగ్రుని కుమారుఁడు. ఇతఁడు చక్షుషుని భార్యయగు బృహతియందు జాక్షుషునిఁ గనియెను. బ్రహ్మ.

రు

రుక్మ:-(రుక్మి) అర్జునుని సారథి. ధర్మరాజు చేయు రాజసూయమునకుఁ గావలసిన యజ్ఞోపకరణములగు ద్రవ్యములను దెచ్చుట కితఁడు నియమింపఁబడెను. భార.

రుక్మబాహువు:-రుక్మిసోదరుఁడు. భాగ.

రుక్మరథుఁడు:-శల్యుని కుమారుఁడు. అభిమన్యునితోఁ బోరి యోడెను. భార.

రుక్మరేఖ:- రభ్యునిభార్య. ఈమె కుమారిత ఏకావళి. దే. భా.

రుక్మలోచన:- రుక్మియొక్క మనుమరాలు. అనిరుద్ధునిభార్య. అనిరుద్ధచరిత్ర.

రుక్మవతి:-రుక్మియొక్క కుమారిత. ఈమెస్వయంవరము చాటునపుడు ప్రద్యుమ్నుఁడును వెళ్ళి వచ్చినరాజకుమారులు చూచుచుండ నీమెను రథముపై నెక్కించుకొని దీసికొనివచ్చి పరిణయమయ్యెను. భాగ.

రుక్మాంగదుఁడు:-ఒక రాజు. ఇతఁ డేకాదశీ వ్రతము సల్పుచు, నితనిరాజ్యమునఁగల ప్రజ లెల్లఁ జేఁగూడఁ జేయించుచుండువాఁడు. ఇతని వ్రతభంగము చేయుటకై దేవతలు మోహిని యను సుందరాంగిని బంపిరి. రుక్మాంగదుఁ డామెవలలోఁ జిక్కుకొని యుండెను. ఐనను ఏకాదశినాఁడు వ్రతముసేయఁగోరెను. తనను బాసిపోఁజనదని మోహిని పట్టుపట్టినది. ఆమె కోరినట్టులు రుక్మాంగదుఁడు తన కుమారునైనఁ జంపి యామె కొసంగ నొడంబడెను గాని వ్రతముమానుటకు ఇష్టపడలేదు. మోహిని వాని పుత్త్రుని ఖండింపుమనియెను. రుక్మాంగదుఁడు ఖడ్గమెత్తెను. అప్పుడే బ్రహ్మాదులు ప్రత్యక్షమై యాతనివ్రతనిష్ఠ పరీక్షింపఁగోరి యిట్లు చేసితిమని నుడివి యాతఁడు కోరిన వరము లొసంగిరి. రుక్మా.

రుక్మి:-రుక్మిణీసోదరుఁడు. భీముని పుత్త్రుఁడు. ఇతఁడు శిశుపాలుని మిత్త్రుఁడు. రుక్మి తన చెలియలిని శిశుపాలునకిచ్చి వివాహముచేయఁగోరుచుండెను. కాని కృష్ణుఁడువచ్చి రాక్షసవివాహమున నామెను దీసికొనివెళ్ళెను. కృష్ణునివెంట నితఁడు తఱుముకొనివెళ్ళెను. అతనితోఁ బోరాటమునకు సిద్ధపడెను. కృష్ణుఁడీతనిని సంహరింపఁ

బోయెను. అపుడు రుక్మిణి కృష్ణునిఁ బ్రార్థింపఁగా నతఁడు వీని జుట్టును, మీసములను గోసి విడిచిపెట్టెను. ఇట్లు చేయుమని బలరాముఁడు శ్రీకృష్ణునితోఁ జెప్పెను. కావున రుక్మికి బలరామునిపైఁ గోపము కలదు. పాండవులు యుద్ధప్రయత్నములో నుండఁగా నితఁ డర్జునునికడకు వచ్చి "అర్జునా! నీవు యుద్ధము చేయుటకు భయపడితివేని నాతోఁ జెప్పుము. నేనెవ్వరినైన నవలీలగ గెల్తు" నని చెప్పెను. "రుక్మీ! నీ బంటుతనము చూచితిని. రుక్మిణిని దీసికొనివచ్చు కృష్ణుని నెట్లు గెల్చితివో నేనెఱుఁగుదును. నీవు నాకు సహాయము చేయనక్కరలేదు. పొ" మ్మని యర్జునుఁడు బదులు చెప్పెను. అంతట నితఁడు దుర్యోధనునికడకుఁ బోయి యట్లే "నీవు గెలువలేకపోవుచో నీకు సహాయమయి గెలిపింతు"ననియెను. దుర్యోధనుండును "నీసహాయ మక్కఱలే" దనెను. రుక్మి చిన్నపుచ్చుకొని పోయెను. భారతయుద్ధములో నితఁ డెవ్వరి చేతను బిలువఁబడలేదు.

రుక్మి తన కూఁతురగు శుభాంగిని ప్రద్యుమ్నునకిచ్చి వివాహముచేసెను. ఆ వివాహమునకు బలరాముఁడును వెళ్ళెను. వెనుకఁ దనకు బలరాముఁడు గావించిన యవమానము జ్ఞాపకముంచుకొని రుక్మి యీ సమయమున వీనిని నవ్వులపాలు సేయఁగోరెను. ఆ తలఁపుతో బలరాముని జూదము నాడుటకుఁ బిలిచెను. వీరిద్దఱు నాడిరి. బలరాముఁడు గెలిచినను తానే గెల్చితినని రుక్మి గట్టిగాఁ గేకలు వేయఁ జొచ్చెను. అట్లు మూడునాలుగు మాటు లాడిరి. అట్లసత్యము నాడుటచే బలరామునకుఁ గోపము వచ్చి పోరాటమునకు దిగెను. రుక్మియు, బలరాముఁడును యుద్ధముచేసిరి. అందు రుక్మి బలరామునిచేతఁ జంపబడియెను. భార.

రుక్మిణి:-కుండిననగరమునకు రాజైన భీష్మకుని కూఁతురు. రుక్మి, రుక్మరథుఁడు, రుక్మబాహువు ఈమె సోదరులు. ఈమెకు యుక్తవయస్సు రాఁగా స్వయంవరమునకై తండ్రి రాజపుత్త్రులను రావించెను. ఈమెసోదరుఁ డగు రుక్మి శిశుపాలున కీమె నిచ్చి వివాహము చేయఁగోరుచుండెడివాఁడు. అది యీమె కిష్టము లేదు. కృష్ణుని గుణరూపములనుగూర్చి వినియుండుటచే వానినే వివాహము నాడఁ గోరుచుండెడిది. తన మనోహరుఁడు స్వయంవరమునకు వచ్చునో రాఁడో యని భయపడి రాక్షసవివాహమునైనను దనను గొనిపొమ్మని యొక బ్రాహ్మణునిచేఁ గృష్ణునకు వర్తమానము చేసినది. ఈమె స్వయంవరమునకుఁ గృష్ణుఁడువచ్చి శత్త్రురాజుల నోడించి రాక్షసవివాహముననే యీమెను దీసికొనిపోయెను. రుక్మిణిని రథము నెక్కించుకొనిపోవుచుండఁగా శ్రీకృష్ణునితోఁ బోరాడుటకు రుక్మి వచ్చెను. కృష్ణుఁ డాతనిని సంహరింపఁబోయెను గాని రుక్మిణి వానిని గాపాడుమని వేఁడెను. తన సోదరుఁడు బాణములతోఁ గొట్టఁబడుటయును, ప్రాణావశిష్టుఁడుగా విడువఁబడి పరాభవింపఁ బడుటయును జూచి రుక్మిణి దుఃఖించుచుండఁగా బలరాముఁడు తత్త్వబోధచేసి రుక్మిణియొక్క దుఃఖమును బోగొట్టెను.

ఈమె కృష్ణుని పెద్దభార్య. ఈమెకు ప్రద్యుమ్నుఁడు, చారుదేష్ణుఁడు, చారుభద్రుడు, సుదేష్ణుఁడు, సుచారువు, చారుదేహుఁడు, చారుగుప్తుఁడు, చారుచంద్రుఁడు, విచారువు, చారువు అను పదుగురు కుమారులు కలరు. సత్యభామ, మిత్త్రవింద మొదలగువా రీమె సవతులు. రుక్మిణిపై నీర్ష్య సత్యభామకే యెక్కువగా నుండెడిది.

ఒకసారి సత్యభామ నోముపట్టి కృష్ణునిఁ దులయం దొక వైపునుంచి రెండవవైపు తన యాభరణములు, తన సంపత్తినంతను నుంచెను. కాని కృష్ణునకు వీనిబరువు చాలినదికాదు. ఆమెకు వ్రతభంగము కలుగునని భయముకలిగెను. రుక్మిణి నాలోచన యడిగెను. రుక్మిణి సత్యభామవేసిన యాభరణములను తీసివేయించి శ్రీకృష్ణునే ధ్యానించుచు నొక తులసిదళ మందు వైచెను. కృష్ణునికంటె నీ దళమే బరువయ్యెను. శ్రీకృష్ణుఁడు నిర్యాణమొందినట్లు అర్జునుఁడు తెల్పఁగానే నీమెయు నగ్ని ప్రవేశమందెను.

రుచకుఁడు:-ఉశనుని పుత్త్రుఁడు. జ్యామఘాదు లితని పుత్త్రులు. భాగ.

రుచి:- అంగాధీశ్వరుఁడగు చిత్రరథుని భార్యకు సోదరి. ఈమెను దేవశర్మ యను బ్రాహ్మణుఁడు వివాహమయ్యెను. ఈమె రూపవతి. ఇంద్రుఁ డీమెనుగామించి తిరుగుచుండువాఁడు. దేవశర్మ యజ్ఞార్థ మరుగుచు నింద్రునివలన నపాయము రాకుండఁ జూచుచుండుమని, తన శిష్యుని విపులుని దనగృహమునఁ గాపువెట్టెను. కొన్ని దినములైనపిదప విపులుఁడు యోగబలముచేతఁ దన శరీరమును విడిచి యామెశరీరమునఁ బ్రవేశించి యీమెబుద్ధిని స్వాధీనముచేసికొని యుండెను. ఇంద్రుఁడు వచ్చి విపులుఁడు నిదురపోవుచున్నాఁడని తలఁచి రుచిని బలుకరించెను. ఆమె తిరస్కారముగాఁ (విపులుఁ డామె దేహమునం దుండుటచే విపులుఁడే) ప్రత్యుత్తరమిచ్చెను. పిమ్మట విపులుఁడు తన శరీరమునే ప్రవేశించి లేచివచ్చి, ఇంద్రుని దూషించి భస్మముచేయుదు ననియెను. ఇంద్రుఁ డంతర్ధానము నొందెను. భార.

రుచి:-ఒక రాజు. రౌచ్యమనువు తండ్రి. ఇతఁడు పెద్దకాలము వివాహమునాడక యుండుటచే పితృదేవతలు దుఃఖించిరి. వారి నరకబాధలు తప్పించుటకై వివాహము చేసికొనుమని రుచిని గోరిరి. "నేను వృద్ధుఁడను. నాకుఁ గన్యక నెవ్వరిత్తురు?"రని రుచి చింతించి బ్రహ్మనుగూర్చి తపస్సుచేసెను. బ్రహ్మ ప్రత్యక్షముకాఁగా రుచి తనకోరికను జెప్పెను. నీవు భార్యను బడసి పుత్త్రులను గనుమని ధాత పలికెను. పిమ్మట రుచి పితృదేవతలను స్తుతించెను. "అచిరకాలములోనే ప్రమోచన తనకూఁతును మాలిని యనుదానిని నీకిచ్చును. పరిగ్రహింపుము. నీకుఁ బుట్టువాఁడు మను వగును" అని పితరులు చెప్పిరి. రుచి ప్రమోచన యను నప్సరస పుత్రియైన మాలినిని వివాహమయ్యెను. ఆమె యందు రౌచ్యుఁడు జన్మించెను. మార్క.

రుచి:-ఒక ప్రజాపతి. ఇతఁడు స్వాయంభువుకూఁతురైన ఆకూతిని వివాహమయ్యెను. వీరికి యజ్ఞుఁ డను విష్ణ్వంశముగల కుమారుఁడును, లక్ష్మి యంశమున దక్షిణ యను కుమారితయును జన్మించిరి. భాగ.

రుచి:-బ్రహ్మముఖమువలనఁ బుట్టెను. బ్రం. వై.

రుచికుఁడు:-ఒక ముని. శునశ్శేపుని తండ్రి. అంబరీషుఁడను రాజు వచ్చి నీకు లక్షగోవుల నిచ్చెదను. నీపుత్త్రులలో నొకని యాగపశువుగానిమ్మని వీనిం గోరెను. పెదకుమారునియందుఁ బ్రీతి నాకు మెండు. వాని నేనీయఁజాలనని యితఁడనియెను. మూడవకుమారుఁడు నాకుఁ బ్రేమపాత్రుఁడు కావున వానినీయఁజాలనని తల్లి యనెను. లోకములోఁ బెద్దవానియందుఁ దండ్రికిని, కడసారి వానియందు దల్లికిని బ్రేమ మెండు. నేను మధ్యముఁడను. కావునఁ దల్లిదండ్రులకు ముఖ్యుఁడను గాను గావున రెండవకుమారుఁడు శునశ్శేపుఁడు తనను గొనిపొమ్మని వచ్చెను. రుచికునకు లక్షగోవుల నిచ్చి యంబరీషుఁడు శునశ్శేపుని దీసికొనిపోయెను. రామా.

రుచిరాశ్వుఁడు:- సేనజిత్తు కుమారుఁడు. ఇతని కుమారుఁడు ప్రాజ్ఞుఁడు. భాగ.

రుద్రసావర్ణి:-పండ్రెండవ మనువు. ఇతనిమన్వంతరమున ఋతధాముండనువాఁ డింద్రుఁడు. ద్యుతి, తపస్వి, సుతపుఁడు, తపోమూర్తి, తపోధనుఁడు, తపోనిధి, తపోధృతి యనువారలు సప్తఋషులైరి. వేదవంతుఁడు, ఉపదేవుఁడు, దేవశ్రేష్ఠుఁడు, విదూరథుఁడు, మిత్త్రవంతుఁడు, మిత్త్రకుమారుఁడు అను మనుపుత్త్రులు రాజులై వంశకర్తలైరి. మార్క.

రుద్రుఁడు:-బ్రహ్మ సృష్టినిగావింపఁబోయి యా విధానమును గానలేకపోయెను. అతనికిఁ గోపము వచ్చెను. ఆ కోపానలమువలన బ్రహ్మ కనుబొమలనుండి రుద్రుఁడు పుట్టెను. అంత బ్రహ్మ దక్షుని కుమారితయైన సతినిదెచ్చి రుద్రున కిచ్చి యామెవలన సృష్టి చేయుమనియెను.

తపస్సుచేయక సృజించుశక్తి కలుగదని రుద్రుఁడు తపస్సున కరిగెను. బ్రహ్మ సతిని దన శరీరములోనే దాఁచియుంచెను. ఇంతలో బ్రహ్మ మానసపుత్త్రులు దక్షునిపుత్త్రికలను వివాహమయి సంతానముఁ బడసిరి. దక్షుఁడు తన మనుమలు వర్ధిల్లుటకు సంతోషించి యజ్ఞముచేసెను. ఆ యజ్ఞమునకురుద్రుఁడుకూడ వచ్చెను. రుద్రున

కచ్చుట సత్కారము జరుగలేదు. హవ్యముల వాతని కొసంగలేదు; కావున నతనికిఁ గోపము వచ్చెను. అతనిశరీరమునుండి భూత పిశాచములు పుట్టెను. రౌద్రాస్త్రము ప్రయోగింపఁబడియెను. దక్షుఁడు విష్ణుమూర్తిని బ్రార్థించెను. విష్ణుమూర్తి నారాయణాస్త్రము బ్రయోగించెను. వీరి యుద్ధముచూచి బ్రహ్మ వచ్చి విష్ణు రుద్రులను శాంతపఱచెను. దేవతలు రుద్రునకు హవ్యభాగమిచ్చుట కంగీకరించిరి. మఱియు దేవతలు దక్షునిఁగూడి మేము పశువులమైతిమి. నీవు మమ్ముఁ గాపాడుము అని రుద్రుని బ్రార్థించిరి. వారి ప్రార్థనలకు సంతసించి రుద్రుఁడు దక్షుని యజ్ఞము కాచి, దక్షునిగూడి మీరు పశువులైరి. మిమ్ములను రక్షించుటచే నేను నేఁటి మొదలు పశుపతి యను పేరునఁ బరగుదునని చెప్పెను. బ్రహ్మ గాఁని రుద్రున కిచ్చెను. (చూడుము శివుఁడు.)

కల్పాదిని బ్రహ్మ సృష్టిచేయఁ బోవుచుండఁగా నొక బాలుఁడు పుట్టి యేడ్చెను. అతఁడే రుద్రుఁడు. నీవేల యేడ్చుచున్నావని బ్రహ్మ వాని నడిగెను. నాకుఁ బేరుపెట్టుమని యాబాలుఁడు కోరెను. వానికిబ్రహ్మ భవుఁడని పేరుపెట్టెను. ఆ బాలుఁడు మరల నేడ్చెను. బ్రహ్మ వానికి మరల శర్వుఁడని పేరుపెట్టెను. అట్లే యతనికి బ్రహ్మ ఈశానుఁడు, పశుపతి, భీముఁడు, ఉగ్రుఁడు, మహాదేవుఁడు అను పేరులు పెట్టెను. కూర్మ.

ఈ రుద్రుఁ డేకాదశమూర్తు లయ్యెను. అజుఁడు, ఏకపాదుఁడు, అహిర్బుధ్న్యుఁడు, త్వష్ట, రుద్రుఁడు, శంభుఁడు, హరుఁడు, త్ర్యంబకుఁడు, అపరాజితుఁడు, ఈశానుఁడు, త్రిభువనుఁడు అని వారి నామములు.

రుధిరుఁడు:– ఒక రాక్షసుఁడు. వీఁడే వసిష్ఠుని కుమారులైన శక్తి మొదలగువారిని భ్రమింగివేసెను. లింగ.

రుమ:– సుగ్రీవుని భార్య.

రురుఁడు:–చ్యవనపుత్త్రుఁడైన ప్రమతికి ఘృతాచి యందుఁ బుట్టిన కుమారుఁడు. ఇతఁడు ప్రమద్వర యను కన్యను వలచి యామెను వివాహము కాఁగోరి యుంచెను. కాని యొకనా డామె పాము కఱచుటచే, విగతప్రాణయై క్రిందఁ బడెను. ఈమెనుజూచి రురుఁడు శోకవ్యాకుల హృదయుఁడై వనమునకుఁ జని బ్రార్థింప మొదలిడెను. నీ యాయువునందు సగ మీమెకిచ్చుచో నీమె బ్రతుకునని యాకాశవాణి పలికెను. రురుఁ డట్లు గావించెను. ప్రమద్వర నిద్రనుండి లేచినట్లు లేచెను. రురుఁ డామెను వివాహమయి సుఖంబున నుండెను.

సర్పమొకటి ప్రమద్వరకు గావించిన యపకారము మఱవక రురుఁడు క్రోధమును వహించి కనబడిన ప్రతిపన్నగమును జంపుచు వచ్చెను. అతఁ డొకనాఁ డొక డుండుభమును గొట్టఁ బోఁగా నది నరుఁడై లేచి వానికి నమస్కరించెను. ఆ నరుఁడు తాను సహస్రపాదుఁడను బ్రాహ్మణుఁడ ననియును, శాపవశమున నట్టైతి ననియును జెప్పి జీవహింసచేయుట బ్రాహ్మణునకుఁ దగదని చెప్పెను. ఇతని బోధనము విని రురుఁడు పన్నగసంహారమును మానెను. భార.

రురుకుఁడు:– విజయుని పుత్త్రుఁడు. ఇతని తనయుఁడు వృకుఁడు. భాగ.

రురువు:– [illegible]రవులలో నొకఁడు. (చూడుము భైరవులు)

రే

రేణుక:–ప్రసేనజిత్తుని కుమారిక. జమదగ్ని భార్య. ఈమెకు రమణ్వతుఁడు, సుషేమణుఁడు, వసువు, విశ్వావసువు, రాముఁడు అను కుమారులు గలిగిరి.

ఈమె జలముతెచ్చుటకు నదికిఁబోయి యట స్నానము చేయుచున్న చిత్రరథునిఁ గొంత ప్రేమతోఁజూచుచు నిలుచుండి యాలస్యము చేసి, యాలస్యమునకు భర్త యేమనునో యని భయపడుచు జలమును గొనితెచ్చెను. భాగ.

ఈమె చిత్రరథుఁడను రాజుతో వ్యభిచరించెనని భర్త యామెపై ద్వేషముకలిగి యామెకు

దండనగాఁ గుమారులనుబిలచి యీమెను వధించి రండని యాజ్ఞాపించెను. నలువురు పెద్దకుమారులును మాతృవధ మేము సేయమనిరి. కాని రాముఁ డీమెను వధించెను. జమదగ్ని వాని కార్యమునకు మెచ్చుకొని వరము వేఁడుమనఁగా దల్లిని బ్రతికింపుమని యతఁడు కోరెను. జమదగ్ని యీమెను బ్రతికించెను. ఈమెభర్తను గార్తవీర్యుఁడు చంపఁగా నీమె భర్తతో సహగమనము చేయఁబోయెను. ఆ సమయమున నాకాశవాణి 'నీకు శుభమగుఁగాక' యని పలికెను. అది విని యాశ్చర్యమునొంది రేణుక యించుక యూరకుండఁగా నంతలో భృగుఁడువచ్చి జమదగ్నిని బ్రతికించెను. కాని కొంతకాలమునకుఁ గార్తవీర్యుని కుమారుఁడు శూరుఁడనువాఁడు జమదగ్నిని చంపెను. అపుడు భర్తతో నీమె సహగమనము చేసెను. భార. బ్రహ్మ.

రేణుక:–రేణువుయొక్క కుమారిత. భాగ.

రేణుమతి:–నకులుని భార్య. ఈమె పుత్త్రుఁడు నిరమిత్త్రుఁడు. భార.

రేవతి:–కకుద్మి కుమారిత; బలరాముని భార్య. (రేవతుని) ఆనర్తుని కుమారుఁడైన రైవతుని కుమారిత. ఈమెకుఁ దగినపతియెవ్వరని బ్రహ్మ నడుగుటకై రైవతుఁడు బ్రహ్మకడ కీమెను దీసికొని వెళ్ళెను. అచ్చటఁ గిన్నర కింపురుషులు నాట్యము చేయుచుండుటచే నితఁ డొక క్షణ మచ్చట నాగి తనపని బ్రహ్మతోఁ జెప్పెను. నీవిచ్చట ఆగినసమయములో భూలోకమున నేండ్లుపూండ్లు గతించినవి. ఈమెను వివాహము కోఁదలఁచినవారును, వారి వంశములు గూడ గతించినవి. ఇపుడు భూలోకమున నారాయణాంశముతోఁ బలరాముఁ డున్నాఁడు. వాని కిచ్చి వివాహముచేయుమని బ్రహ్మ చెప్పెను. రైవతుఁ డీమెను బలరామున కిచ్చి వివాహము చేసెను. విష్ణు. భాగ.

రేవతి:–నక్షత్రము. ఈ నక్షత్రముయొక్క నాల్గవ చరణమున ఋతుమంతుఁ డను మునికిఁ గుమారుఁడు పుట్టి దుర్మార్గుఁ డయ్యెను. దానికి రేవతీ నక్షత్ర చతుర్థపాదమే కారణమని ఋతుమంతుఁడు 'నీవు క్రిందఁబడు' మని నక్షత్రమును శపించెను. రేవతి కుముదగిరిమీఁదఁ బడెను. ప్రముచుఁ డా నక్షత్రమును దీసి పెంచెను. దానికి యుక్తవయస్సు వచ్చినపిదప దుర్దముఁ డను రాజున కిచ్చి వివాహముచేసెను. రేవతి తనకు రేవతీనక్షత్రమందు వివాహము సేయుమని కోరెను. నక్షత్రము పడిపోయెను. నేనెట్లు చేయువాఁడ ననిన, "నీ తపోమాహాత్మ్యముచేఁ జేయు" మని తండ్రిని వేఁడెను. ప్రముచుఁడు తన తపోమహత్త్వముచేత మఱల రేవతిని నక్షత్ర మండలమునఁ బెట్టెను. ఈమె కుమారుఁడు రైవతుఁడు. అతఁడు మనువయ్యెను. మార్క.

రేవుఁడు:– వతుని తండ్రి.

రై

రైక్వపరములు:–రైక్వునకిచ్చిన భూములు. భార.

రైక్వుఁడు:–(చూడుము జానశ్రుతి.)

రైభ్యుఁడు:–ఒక ముని. అర్వావసుఁడు, పరావసుఁడు ఇతని కుమారులు. వీరు విద్యాసంపన్నులు. వీరికడ కరిగి చదువుకొనుమని అవక్రీతుని వాని తండ్రి పంపెను. కాని యవక్రీతునకు వీరిని జూడఁగా నీర్ష్యకలిగెను. అవక్రీతుఁడు పరావసుని భార్యయగు కృష్ణను గామించెను. ఆమె రైభ్యునితోఁ జెప్పెను. రైభ్యుఁడు హోమముచేసి యొక సుందరాంగిని, రాక్షసునిఁ బుట్టించెను. అవక్రీతుని హస్తమందుదకమండల మున్నంతకాలము వానిని సంహరించుట యసంభవము. కాన, కమండలము పడవేయించుటకై రైభ్యుఁడు ముందుగాసుందరాంగిని బంపి, పిదప వానిని సంహరించుటకై రాక్షసునిఁ బంపెను. రాక్షసుఁడు అవక్రీతుని జంపెను. ఒకనాఁడు తెల్లవాఱుజామున వచ్చుచున్న రైభ్యుని బరావసుఁడు చూచి, చీఁకటిలోఁ దెలియలేక మృగమని భ్రమించి వానిని గొట్టెను. రైభ్యుఁడు మరణించెను. కాని అర్వావసుఁడు చేసిన హోమములకు దేవతలు మెచ్చుకొని వరము

లిచ్చిరి. అతఁడు రైభ్యుఁడు బ్రతుకునట్లు కోరెను. కావున రైభ్యుఁడు మఱల బ్రతికెను. ఇతఁడు "మోక్షము కర్మవలన గల్గునా? జ్ఞానము వలన గలుగునా?" యని బృహస్పతి నడిగి తెలిసికొనెను. భార.

రైభ్యుఁడు:-అంతిసారుని కుమారుఁడైన సుమతి తనయుఁడు. ఇతని కుమారుఁడే దుష్యంతుఁడు. భాగ.

రైవతము:- ఒక పర్వతము. మొదట కుముదగిరి యని దీనిపేరు. ఋతుమంతునిశాపముచే రేవతీ నక్షత్ర మీ నగముపైఁ బడెనుగాన దీనికి రైవతమను పేరువచ్చెను. మార్క.

రైవతుఁడు:-ఆనర్తుని కుమారుఁడు. ఇతఁడు సముద్రమధ్యమున కుశస్థలి యను పురమును నిర్మించెను. ఇతనికి రేవతి యను కుమారితగలదు. ఆమెకుఁ దగినపతిని నిర్ణయింపలేక బ్రహ్మ నడుగుటకుఁ గుమారితనుగూడ నితఁడు బ్రహ్మ లోకమునకుఁ దీసికొని వెళ్ళెను. అపుడు బ్రహ్మయెదుటను గిన్నర కింపురుషులు నాట్యము చేయుచున్నందున నితఁ డొక్క క్షణ మచ్చట వేచియుండెను. పిమ్మటఁ దామవచ్చిన కార్యము బ్రహ్మతోఁ జెప్పెను. "నీవు ఇచ్చట వేచియుండిన సమయములో భూలోకమున నాల్గు యుగములును నిఱువదేడు మారులు గడచినవి. ఈమెను వివాహము చేసికొనఁ దలఁచినవారును, వారి పుత్త్రులును, వారి వంశమువారునుగూడ గతించిరి. ఇపుడు భూలోకమున నారాయణాంశముతో బలభద్రుఁ డున్నాఁడు. వానికిచ్చి వివాహము చేయుము" అని బ్రహ్మ చెప్పెను. రైవతుఁడు మరలివచ్చి తన కుమారితను బలభద్రునికిచ్చి వివాహము చేసెను. ఇతనికిఁ గకుద్మి మొదలగు పుత్త్రులు కలిగిరి. భాగ.

రైవతుఁడు:-దుర్దమునకు రేవతియందుఁ బుట్టిన కుమారుఁడు. ఇతఁడు మనువయ్యెను. ఇతని మన్వంతరమున విభుండనువాఁ డింద్రుఁడయ్యెను. హిరణ్యరోముఁడు, వేదశ్రీ, ఊర్ధ్వబాహుఁడు, వశిష్ఠుఁడు మొదలగువారు సప్తఋషులైరి. రైవతుని కుమారులు బలుఁడు, బంధుఁడు, స్వయంభావ్యుఁడు, సత్యకుఁడు, ప్రతివింధ్యుఁడు, అర్జునుఁడు మొదలగువారు పుడమిపతులైరి. భాగ. మార్క.

ఈ మనువుకాలమున విష్ణుమూర్తి శుభ్రుఁ డనువానికి వికుంఠ యను నామెయందుఁ బుత్త్రుఁడై పుట్టెను. భాగ.

రో

రోచనుఁడు:-స్వారోచిష మనువు కాలమందు ఇంద్రుఁడు. భాగ.

రోచిష్మతుఁడు:- స్వాయంభువు మనువు కుమారుఁడు. భాగ.

రోమపాదుఁడు:-దివిరథుని కుమారుఁడైన ధర్మరథుని తనయుఁడు. ఇతని మొదటిపేరు చిత్రరథుఁడు. ఇతఁడు అంగదేశమును బాలించెను. దశరథుఁ డితని మిత్రుఁడు. రోమపాదునకు సంతానము లేకపోవుటచే దశరథుఁడు తన తనయయైన శాంతను వీని కిచ్చెను.

రోమపాదుఁడు సంతానమువడయు కోరికతో బ్రాహ్మణులను సంతుష్టులనుజేయఁదలఁచి వారికి దానము లిచ్చుచుండెను. ఒక బ్రాహ్మణుఁడు ధనముపుచ్చుకొని యింటికి వెళ్ళి మరలఁ దన కుమారుని దీసికొనివచ్చి యొక యావు నిమ్మని కోరెను. బ్రాహ్మణు లాశపాతకులని ఈ రాజు నవ్వెను. అంత నా బ్రాహ్మణునకు గోపము వచ్చి యితనిదేశమున ననావృష్టి కలుగునట్లు శపించెను.

బ్రాహ్మణులయెడల రోమపాదుఁ డపరాధము చేయుటచే నా రాతనిదేశమును విడిచి చనిరి. అంగదేశమున ననావృష్టి సంభవించెను. ప్రజలు బాధపడుచుండిరి. ఋశ్యశృంగుని రావించిన యెడల వర్షముకురియునని కొందఱాలోచన చెప్పిరి. ఋశ్యశృంగుఁడు తన యాశ్రమము తప్ప నన్యమెఱుఁగనివాఁడు. రోమపాదుఁడు ఋశ్యశృంగునికడకు వేశ్యలను బంపిఁ వారిచే

నతనిని దన నగరమునకు రావించెను. అతనికి శాంతనిచ్చి వివాహముచేసెను. ఋశ్యశృంగుఁ డితనిదేశమున నుండఁగా సువృష్టి కలిగెను. రోమపాదునకు సంతానముకలుగుటకే ఋశ్యశృంగుఁడు నింద్రునిఁగూర్చి యిష్టి చేసెను. రోమపాదునకుఁ జతురంగుఁడను కుమారుఁడు కలిగెను. విరా. భాగ. రామా.

రోమపాదుఁడు:-జ్యామఘుని తనయుఁడైన విదర్భుని కుమారుఁడు. ఇతని కుమారుఁడు బభ్రువు.

రోమశుఁడు:-ఒక ముని. పాశుపతాస్త్రమును బొందినపిదప నర్జునుఁడు ఇంద్రలోకమున కేగి యుండి యట నింద్రునితో నేకాసనమునఁ గూర్చొనియున్న యర్జునునిఁ జూచి 'ఈ మనుజుఁ డెవ్వఁ?' డని యడిగెను. అర్జునుఁడు పూర్వము నరుఁ డను ఋషి యగుటాదిగా నతని వృత్తాంతమును జెప్పి పుడమికేగి ధర్మజాదుల కితని క్షేమవృత్తాంతమును జెప్పుమనియెను. ధర్మరాజు తీర్థయాత్రచేయుట యింద్రుని యభిమతంబని తెల్పుమనియును, దీర్థయాత్రలయం దర్జునునివెంబడి యుండుమనియును నింద్రుఁ డితనిని బంపెను. భార. భాగ.

రోమశుఁడు:-ఒకపిల్లి. (చూడుము పలితుఁడు)

రోమశుఁడు:-ఒక ముని. ఇంద్రలోకమున కేగి యున్న యర్జునుని క్షేమసమాచారము ధర్మరాజునకుఁ దెల్పుట కింద్రుఁ డితనిని బంపెను. అతనితోఁ గలసి తీర్థయాత్రలుచేయుచు వాని వృత్తాంతమును ధర్మజునకుఁ జెప్పెను. భాగ.

రోమహర్షణి:-ఒక ముని. వ్యాసుని శిష్యుఁడు. ఉగ్రశ్రవసుని తండ్రి. భాగ.

రోమహర్షణుఁడు:-వ్యాసుని శిష్యుఁడు. సూతుని తండ్రి. వానివలన త్రయ్యారుణి, కశ్యపుఁడు, సావర్ణి, అకృతవ్రణుఁడు, వైశంపాయనుఁడు, హారీతుఁడు అనువారలు పురాణములు గ్రహించి యా పురాణములను లోకములందు వ్యాపింపఁ జేసిరి. భాగ.

రోహిణి:-ఒక నక్షత్రము. చంద్రునిభార్య.

రోహిణి:- (పూర్వజన్మమున సురభి, కద్రువ.) వసుదేవుని భార్య. ఈమెకు బలరాముఁడు, గదుఁడు, సారణుఁడు, దుర్మదుఁడు, విపులుఁడు, ధ్రువుఁడు జన్మించిరి. భాగ.

రోహితుఁడు:- హరిశ్చంద్రునకు వరుణప్రసాదమునఁ బుట్టిన కుమారుఁడు. కొడుకు కలిగెనేని వానిని బశువునుజేసి యాగమును జేయుదునని హరిశ్చంద్రుఁడు పలికి యుండుటచే రోహితుఁడు పుట్టగానే వరుణుఁడు వచ్చెను. పురుఁడువెళ్ళినతరువాత యాగమును జేయుదునని హరిశ్చంద్రుఁడు చెప్పెను. అప్పుడు వెళ్ళి వరుణుఁడు మఱల వచ్చెను. అట్లే యేదో యొక వంకను జెప్పుచు హరిశ్చంద్రుఁడు కాలయాపనమును జేయుచుండెను. రోహితుఁడు తండ్రితలంపునుగూర్చి చింతించి యిల్లువిడచి యడవికి వెళ్ళెను. హరిశ్చంద్రుఁడు వరుణగ్రస్తుఁడై ఉదరవ్యాధిపీడితుం డయ్యెను. అదివిని రోహితుఁడు వచ్చుచుండఁగా నింద్రుఁడు ముసలిమునివేషమున వచ్చి "నీవు తీర్థయాత్రలు చేయుము. పుణ్యనదులందుఁ గ్రుంకుము. మేలు కలుగు" నని చెప్పెను. రోహితుఁ డట్లుచేసి వచ్చుచుండఁగా నింద్రుఁడు మఱల వెనుకటి వలెనే చెప్పెను. అయిదేండ్లుగడచినవి. ఆఱవ యేడు వచ్చుచుండఁగా నితఁడు శునశ్శేఫుని యజ్ఞపశువునిఁగా దెచ్చి హరిశ్చంద్రున కిచ్చెను. హరిశ్చంద్రుఁడు పురుషమేధమును జేసెను. రోహితునికుమారుఁడు హారీతుఁడు. (చూడుము లోహితాస్యుఁడు.) భాగ.

రౌ

రౌచ్యుఁడు:-ఒకమనువు. రుచికుమారుఁడు. ఇతని తల్లి ప్రమోచనయొక్క కుమారితయైన మాలిని. రుచికిఁ బితరులు చెప్పినట్లు ఆతనికుమారుఁడైన రౌచ్యుఁడు మనువయ్యెను. ఇతని మన్వంతరమున బృహస్పతియనువాఁ డింద్రుఁడయ్యెను. మనుకుమారులైన చిత్రసేనుఁడు, దృఢుఁడు, సురథుఁడు మొదలగువారు రాజులై పరిపాలించిరి. మార్క.

రౌద్రాశ్వుఁడు:-సంయాతియొక్క కుమారుఁడు. ఇతనికి ఘృతాచియందు ఋతేపువు, కక్షేపువు, స్థలేపువు, ధర్మేపువు, వ్రతేపువు, వనేపువు అను కుమారులు కలిగిరి. భాగ.

రౌద్రుఁడు:-గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

రౌహిణము:-ఒక మహావృక్షము. గజ కచ్ఛపములను దీసికొనిపోవు గరుత్మంతునిఁ జూచి యాతిథ్యమిచ్చి తనకొమ్మలపై విశ్రమింపుమని కోరెను. గరుత్మంతుఁడు దీని కొమ్మపై వ్రాలఁగానే యది విఱిగెను. విఱిగినకొమ్మ నంటుకొని వాలఖిల్యాదు లుండుటచే వారికి దెబ్బ తగులకుండుటకై క్రిందఁబడకుండ ముక్కునఁ గఱచుకొని గరుత్మంతుఁ డరిగెను. భార.

ల

లంక:-ఒక ద్వీపము. ఇదియును సింహళము, పాంచజన్యము, మందేహారుణము అను ద్వీపములును, సగరపుత్త్రులు యాగాశ్వమునకై వెదకుచు జంబూద్వీపమును త్రవ్వినపు డేర్పడినవి.

ఆదిశేషువునకును, వాయువునకును దమ బలసత్త్వములను గుఱించి వివాదము పుట్టెను. వారిలో నెవరెక్కువ బలవంతులో నిర్ణయించుకొనఁగోరిరి. శేషుఁడు మేరువును జుట్టుకొని గట్టిగాఁ బట్టుకొని యుండెను. వాని పట్టు తప్పించుటకై వాయువు మిక్కిలి బలముతో వీచెను. శేషుఁడు పట్టువీడలేదు. కాని మేరువుయొక్క భాగము కొంత చెదిరి, యెగిరి సముద్రములోఁ బడెను. అదియే లంకయయ్యెను. అచ్చట బ్రహ్మ తపస్సు చేసికొనుచుండెను. అతనికి నూర్వశి కంటఁబడియెను. అంత నతనికి రేతఃపతన మయ్యెను. అందుండి పులస్త్యుఁడు జన్మించెను. అట్లు లంకయే పులస్త్యునకు జన్మస్థాన మయ్యెను. విరా.

లంక:-మాల్యవదాదులు దేవతలను గెల్చి విశ్వకర్మను బిలిచి తమ కొక మంచినగరమును నిర్మించి యిమ్మనిరి. మయుఁడే దక్షిణసముద్రమునఁ బసిడిప్రాకారములతోఁ బసిడిహర్మ్యములతో నొక సుందరాకారమగు లంకాపట్టణమును నిర్మించెను. అందుఁ బ్రవేశింపుమనియెను. వార లందుండిరి. విష్ణుమూర్తి వీరితో యుద్ధము చేసి వీరి నోడించినపుడు వీరు పాతాళమునకుఁ బోయిరి. కుబేరుఁడు తనకు నివాసముజూపుమని తండ్రినిఁ గోరఁగా నీవీ లంకలోఁ బ్రవేశింపుమని చెప్పెను. అంత నప్పటినుండియును నతఁడందు నివసించుచుండెను. పిమ్మట రావణుఁడు వాని నచ్చటినుండి తొలఁగి పొమ్మనెను. వానికి భయపడి కుబేరుఁడు లంకను విడిచి పోయెను. రావణుఁడును, రాక్షసులును నా లంకయందుఁ బ్రవేశించిరి.

లక్షణ:- మద్రదేశపురాజుయొక్క కూఁతురు; కృష్ణునిభార్య. భాగ.

లక్షణ:-బృహత్సేనుని కూఁతురు. శ్రీకృష్ణుని వివాహము చేసికొనఁగోరియుండెను. ఈమెయొక్క తలంపు తండ్రి యెఱింగి యొక మత్స్యయంత్రమును గల్పించెను. "ఆ మత్స్యము పైకిఁగనపడదు గాని క్రిందనీటిలోఁ గనఁబడును." అట్టిదానిని దా నటనుంచిన పెద్ద ధనుస్సుతోఁ గొట్టినవానికిఁ దనకుమార్తె నిత్తుననెను. పలువురు రాజకుమారులు వచ్చి యత్నించి విఫలులైరి. శ్రీకృష్ణుఁడు దానిని గొట్టి లక్షణను గైకొని రథమెక్కించుకొని ద్వారకకు వచ్చెను. అడ్డువచ్చిన శత్రురాజుల నోడించెను. బృహత్సేనుఁడు పిమ్మట ద్వారకాపట్టణమునకు వచ్చి లక్షణకును, శ్రీకృష్ణునకును వివాహ మొనరించెను.

లక్షణ:- దుర్యోధనుని కూమారిత. ఈమెను సాంబుఁడు వలచి తీసికొనిపోయెను. కౌరవవీరు లందఱును గలసి వానిని బంధించిరి. ఈ వార్త బలరాముఁడు విని హస్తినాపురము వచ్చి సాంబుని విడిపింపకుండిరేని హస్తినాపట్టణమును గంగలోఁగలిపెదననియెను. భీష్మాదులు లక్షణను, సాంబుని విడిపించి వానికి నీమెనిచ్చి వేసిరి. భాగ.

లక్ష్మణుఁడు:-దుర్యోధనుని పుత్త్రుఁడు. ఇతనికి బలరామపుత్త్రియైన శశిరేఖనిచ్చి వివాహము

చేయుటకు యత్నించిరి గాని యది సాగినది కాదు. ఘటోత్కచుఁ డామెను గొనిపోయి యభిమన్యున కప్పగించి తాను రాక్షసమాయచే వీనిని భయపెట్టెను. లక్ష్మణుఁడును భారత యుద్ధమునఁ బాల్గొనియెను. నలువురితోఁ గలసి యభిమన్యునితో యుద్ధముచేసెను. కాని యభిమన్యునిచేతనే చంపఁబడియెను.

లక్ష్మణుఁడు:-దశరథుని పుత్త్రుఁడు. దశరథుఁడు పుత్త్రులకొఱకు నిష్టిచేసి యజ్ఞపురుషుఁ డిచ్చిన పాయసము తన భార్యలగు కౌసల్య కైకల కిచ్చెను. వీరు తమ భాగములలో సగము సగము దశరథుని మూడవభార్యయైన సుమిత్త్రకునిచ్చిరి. ఆమెకు లక్ష్మణుఁడు, శత్రుఘ్నుఁడు జన్మించిరి. కౌసల్య యిచ్చిన పాయసభాగ ప్రభావముచే సుమిత్త్రయం దీతఁడు జన్మించెను. కాన నన్న దమ్ములలో నితనికిని, రామునకును మైత్త్రి మెండు. చిన్ననాఁటినుండియును వీరు సదా కలసియే యుండువారు. విశ్వామిత్త్రుఁడు తనయాగరక్షణమునకు రామునితోఁగూడ నీతనిని దీసికొని వెళ్ళెను. ఇతఁడును రామునితోఁగలసి ధనుర్విద్య నేర్చుకొనియెను. తాటకసంహారమందు రామునకు సహాయముచేసెను. ఈ బాలుర నిరువురను విశ్వామిత్త్రుఁడు మిథిలకుఁ గొనిపోయెను. రామునకు సీతనిచ్చి వివాహముచేయునపుడే యితనికి నూర్మిళ నిచ్చి పెండ్లిచేసిరి.

పెండ్లియై వచ్చినపిదప నితఁడు గృహమునఁ బెద్దకాలము సుఖంబున నుండలేదు. రామునకు యౌవరాజ్యపట్టాభిషేకము చేయనుండఁగా వాని నరణ్యమునకుఁ బంపుమని కైక కోరెను. రాముఁ డడవికేగుట నిశ్చయమయ్యెను. ఆతనియందున్న ప్రేమాతిశయముచే లక్ష్మణుఁడు తండ్రినిగూడ దూషించెను. తన భుజబలమున రామునకుఁ బట్టము కట్టెదనని పలికెను. కాని రాముఁడే యిది మంచిదికాదని యతనికిఁ జెప్పెను. లక్ష్మణుఁడు రాముని విడచియుండలేడు. అరణ్యములకు రావలదని రాముఁ డనుచుండినను వాని నెడఁబాయలేక యితఁడును దన భార్యను, సకలరాజ్యభోగములను విడచి సీతారాములవెంట నరిగెను.

వీరుముగ్గురు గంగానదిదాఁటి యరణ్యములకేగుచుండిరి. భరద్వాజాశ్రమముకడకుఁ బోఁగానే భరతుఁడు వచ్చుచుండుటను జూచి యాతఁడు యుద్ధమునకు వచ్చుచున్నాఁ డనుకొని లక్ష్మణుఁడు భయపడి రామునితో యుద్ధసన్నద్ధుఁడవై యుండుమని చెప్పెను. లక్ష్మణుఁడు చేసినవానిలో నిదియే చిన్నతనపు టాలోచన. భరతునకును రామునియందు మంచి భక్తిప్రేమలు కలవని మఱచెను.

సీతా రామలక్ష్మణులు ముగ్గురును వనములందు సంచరించుచు, మునులను దర్శించుచునుండిరి. మార్గమం దడ్డమువచ్చిన రాక్షసులను సోదరు లిరువురును ఖండించుచుండిరి. రాత్రి వేళలందు లక్ష్మణుఁడు విల్లు చేఁబూని సీతారాములను గాచుచుండును. వీరు పంచవట మను నరణ్యమును జేరిరి. అచ్చటఁ బర్ణశాల నిర్మించుటకై లక్ష్మణుఁడు వెదుళ్ళను గోయుచుండెను. అందు శూర్పణఖకుమారుఁడు జంబుకుమారుఁ డనువాఁడు తపస్సుచేసికొనుచుండెను. వానిని లక్ష్మణుఁడు చూడలేదు. వెదుళ్ళను నఱుకుటలోఁ గత్తివ్రేటు జంబుకుమారునకుఁ దగిలెను. అతఁడు మరణించెను. పుత్త్రుని నెవ్వరు చంపిరని యరయుచు వచ్చిన శూర్పణఖ రామలక్ష్మణులను జూచి వీరిని మోహించెను. తనను గైకొనుమని కోరెను. వీరు నిరాకరించుటచే వీరితోనున్న సీతను బాధింపఁజొచ్చెను. అంత లక్ష్మణుఁడు రాముని యానతిచొప్పున శూర్పణఖనుబట్టి యామె ముక్కును, చెవులను గోసెను. ఆమె యేడ్చుచుఁ బోయి ఖర దూషణులతోఁ జెప్పుకొనియెను. వారు యుద్ధమునకురాఁగా రామలక్ష్మణులు వారిని సంహరించిరి.

పిమ్మట రామలక్ష్మణులను వంచించుటకై మారీచుఁడు కనకమృగమై వారి యెదుట సంచరించుచుండెను. సీత ఆ మృగమును గావలెనని కోరెను. అది మాయామృగము; దానిని బట్టుకొనఁ బోకుఁడని లక్ష్మణుఁడు చెప్పెను గాని రాముఁడు వినక దానిని దఱిమి వెళ్ళెను. ఆ మృగము ప్రాణము విడుచుచు 'లక్ష్మణా!' యని యఱచెను. అదియు రాక్షసమాయయే యని లక్ష్మణుఁ డూరకుండెను గాని రామున కేదో యాపత్తు కలిగెనని సీత భయపడి యాతనిని వెళ్ళి చూడుమనియెను. రామున కట్టి భయమురాదని యితఁడు ధైర్యము

శబ్దముగాని సీత పిలిచినట్లు వికారాని కొట్టారము లాడెను. అప్పుడు వెదురాదలేక లక్ష్మణుఁడు పర్ణశాలను విడిచి వెళ్ళి రాముని జూచెను. వారు మరల వచ్చునప్పటికి సీత యచ్చట లేదయ్యెను. నలుమూలలు వెదకించిరి; ఎచ్చటను గానరాదయ్యె.

సీతకై రామలక్ష్మణు లరణ్యమంతయును వెదకుచుండిరి. వీరి కడ్డముగవచ్చిన కబంధుని సంహరించిరి. అతనికి శాపవిమోచన మయ్యెను. పంపాతీరమున సుగ్రీవుఁ డున్నాఁడు. అచ్చటి కేగుఁడని యతఁడు చెప్పెను. వీరువెళ్ళి సుగ్రీవునితో సఖ్యముచేసిరి. వీరికి సుగ్రీవుఁడుసహాయము చేయుదు ననియెను. వాలిని జంపి సుగ్రీవునకు రాముఁడు రాజ్య మిప్పించెను. వర్షకాల మంతయు వీరు కిష్కింధలో నేయుండిరి. సీతను వెదకుటకై సుగ్రీవుఁ డెట్టియత్నములను జేయుట లేదు. లక్ష్మణుఁడు సుగ్రీవునిఁజేరి "ఓ వానర రాజా! నీ కుపకారముచేసినను గృతఘ్నుఁడవై యుండెదవేల? సీతను వెదకుటకై వానరుల నేలపంప" వని సుగ్రీవుని బరుషము లాడెను. ఆంజనేయాదివానరులు సీతను వెదకుటకై వెళ్ళి వచ్చిరి. సీత లంకయందుండుట చెప్పిరి. రామలక్ష్మణులును, సుగ్రీవాదులును లంకయందుఁ బ్రవేశించిరి. రావణునితో యుద్ధమయ్యెను. లక్ష్మణుఁడు రాక్షసవీరులను బలువుర నుక్కడంచెను. అపు డింద్రజిత్తు వచ్చి నాగాస్త్రముచే రామలక్ష్మణులను బంధించెను. కాని వారు గరుడుని ప్రభావమున బంధ విముక్తులైరి. లక్ష్మణుఁడు మఱియొకసారి మూర్ఛపోయెను. రావణుఁడు యుద్ధమునకువచ్చి రామలక్ష్మణుల మీఁదనే బాణప్రయోగము చేసెను. ఆదిత్య హృదయము పఠించి రాముఁడు లేవఁగలిగెను. కాని లక్ష్మణుఁడు స్మృతితప్పి పడియుండెను. రాముఁడు హనుమంతుని బంపి సంజీవి తెప్పించి లక్ష్మణున కిచ్చి బ్రతికించెను. తుదకు రాఘవులు యుద్ధమునందు విజయము గాంచిరి. సీతతో మరల నయోధ్యకు వచ్చిరి.

అయోధ్యయందు శ్రీరామునకుఁ బట్టమును గట్టిరి. రాముఁడు రాజ్యపాలనము చేయుచుండెను. వారి కష్టములు దాఁటిన వనుకొనిరి. లక్ష్మణునకు అంగదుఁడు, చంద్రకేతుఁడు అను పుత్త్రులు కలిగిరి. వీరిని బశ్చిమదేశములకు రాజులను జేసిరి.

ఒకనాఁడు రామునికొలువులోఁ బౌరులాడు కొనుచుండు నిందావాక్యములను భద్రుఁడు చెప్పెను. తోడనే రాముఁడు లక్ష్మణుని రావించి సీతనుగుఱించివచ్చు నపవాదమునుదెల్పి యామఱునాఁడే జానకిని నరణ్యములో దిగవిడచి రమ్మనియెను. జానకి పరమసాధ్వియని లక్ష్మణుఁ డెఱుంగును. రాముఁ డెఱుంగును. ఏమైనను దనయాజ్ఞకు మాఱుపలుకవలదని రాముఁడు చెప్పెను. మఱునాఁడే రథమును సిద్ధముచేసిరి. సీత మునిపత్నులను జూచుటకై తనను బంపుచున్నారనుకొని సంతోషించెను. సీతతో లక్ష్మణుఁడును రథమెక్కెను; కాని యితఁడు కడుదీనుఁడైయుండెను. కంట నశ్రుధారలొలుకుచుండెను. సీతతో మాటాడకుండెను. రావణునితో యుద్ధమందైనను బెగడొందని వానికి విచారమేల? యని సీత తెలియలేక యుండెను. "లక్ష్మణా! యేల చింతించుచుంటి?" వని యడిగెను. లక్ష్మణునకు నోటినుండి ప్రత్యుత్తరము వచ్చినదికాదు. సీతపాదములు పట్టి పెద్ద పెట్టున నేడ్చెను. చేయరానికార్యము చేయబోవుచుంటినని రామునానతి యెఱుకపుచ్చెను. పాపము సీత యేమనును? "లక్ష్మణా! నీయన్న యాజ్ఞ నీవుచేయుచుంటివి. అది ధర్మమేకాని యధర్మముకాదు. నీవు విచారింపకుము" అని యీతనికి ధైర్యముచెప్పి యామె దుఃఖము నొందుచుండెను. సీత నరణ్యములో దిగవిడచి లక్ష్మణుఁడు మఱల నయోధ్యచేరెను.

సీతను నరణ్యములోదిగవిడచినప్పటినుండియు నయోధ్య వికలముగనేయుండెను. శ్రీరామాదుల యొక్క యవతారములు ముగియుట కారంభమైనవి. యముఁడు బ్రాహ్మణరూపమునవచ్చి రామునితోరహస్యముగా మాటాడఁగోరుచున్నాననియె. పరులురాకుండగుమ్మమునొద్దఁ గాపుంచుమనియె. ఎవరేని లోపలకువచ్చునో వారికి శిరశ్ఛేదముచేయుదునని శపథముచేయుమనియె. లేనిచో మాటాడననియెను. రాముఁడు సరేయనియెను. గుమ్మముయొద్ద లక్ష్మణునుంచెను. ఆబ్రాహ్మణుఁడు, రాముఁడుమాటాడుచుండిరి. అపుడు దుర్వాసుఁడు వచ్చి లోపలికి వెళ్ళఁబోయెను. లక్ష్మణుఁ డచ్చటనుండిరాముఁడెవ్వారినిరానీయ

వలదని యానతిచ్చెను. మీరిపుడు పోకుఁడని చెప్పెను. ఆఁకలిగొనివచ్చిన బ్రాహ్మణున కిట్లు అడ్డము చెప్పెదవా? పోనీయకుంటివేని నిన్నును, నీవంశమువారినందఱను శపింతునని మునియనియె. లక్ష్మణుఁడు తనవంశమువారందఱు శపింపఁబడుటకు భయపడి తానొక్కఁడు మరణించినను సరేయనుకొని లోపలికరిగి దుర్వాసుఁడు వచ్చెనని చెప్పెను. ఇతఁడు లోపలకు వెళ్ళఁగానే యముఁడువెళ్ళిపోయెను. లక్ష్మణుఁడువారిమాటలకు భంగముకావించెను. అప్పుడు రాముఁ డేమి చేయఁగలఁడు ? తనకై యన్నికష్టముల పాలైన లక్ష్మణుని శిరశ్ఛేదము చేయుటా ? తనయాజ్ఞను గొనసాగింపకుండుటా ? రాముఁడు బ్రాహ్మణుల నాలోచన యడిగెను. దేశమునుండి పంపివేయుటయు, మరణము నొందించుటయు సమానము గావున లక్ష్మణునిఁ బరదేశమునకుఁ బంపివేయుమని బ్రాహ్మణులు పలికిరి. రాముఁ డట్లులే యానతిచ్చెను. లక్ష్మణుఁ డయోధ్యను విడచి వెళ్ళి సరయూనదిలోఁ గ్రుంకి పరమపదము నొందెను.
రామా.

లక్ష్మి:—సృష్ట్యాదిని రాసలోకమునఁ గృష్ణుని వామభాగమునుండి యొకసుందరాంగి యేర్పడియెను. ఆమె మరల రెండుమూర్తులయ్యెను. ఒకయామె రాధ; రెండవయామె లక్ష్మి. ఆ పురుషరూపమును మరల రెండుమూర్తులయ్యెను. అందొకఁడు చతుర్బాహువులు కలిగిన నారాయణుఁడై స్వర్గలోకమున కేఁగెను; నారాయణునితో లక్ష్మి స్వర్గమును జేరెను. బ్ర. వై.

శక్రసంపద స్వరూపిణియగు లక్ష్మి దుర్వాసుని శాపముచే సముద్రమునఁ బడెను. సముద్రమును మథింపఁగా నందుండి లక్ష్మి పుట్టెను. విష్ణు వీమెను బరిణయమయ్యెను. విష్ణుమూర్తితో నీమెయు నవతారములు దాల్చుచుండెను. రామావతారమున నీమెయే సీత యయ్యెను. కృష్ణావతారమున రుక్మిణి యయ్యె.

లక్ష్మియును, విష్ణుమూర్తియును నొక్కచోట నుండఁగా విష్ణుమూర్తి యీమెనుజూచి నవ్వెను. లక్ష్మికిఁ గోపమువచ్చెను. తనకు సవతి యుండుటచేఁ దనను వంచించుటకు నవ్వుచున్నాఁడని యీమె యనుకొని "విష్ణుమూర్తియొక్క శిరమూడిపోవుఁగాక" యని శపించెను. విష్ణుమూర్తి తల యూడిపోవుట తటస్థించెను. అప్పుడే హయగ్రీవము అతికించిరి. దే. భా.

రేవతుఁ డనువాఁడు గుఱ్ఱమెక్కి పోవుచుండఁగా విష్ణుమూర్తి లక్ష్మిని బిలచి "చూచితివా? ఆ గుఱ్ఱ మెంత సౌంధర్యముగ నున్నదో!" యనియెను. లక్ష్మి తదేకధ్యానముతో గుఱ్ఱమును జూచుచుండెను. అంతఁగ జూచుచుంటివి. నీకు గుఱ్ఱపురూపు మనసైనదికాఁబోలు ఆఁడు గుఱ్ఱమవై పుట్టుమని విష్ణువు శపించెను. ఈ శాపమునకు ఈమె మిక్కిలి విచారించెను. అంత విష్ణువు నావంటిపుత్త్రుఁడు నీకుఁ బుట్టినపిమ్మట శాపవిమోచన మగును. నీవు పోయి శివునిఁ బ్రార్థింపు మనియెను. ఈమె కైలాసమేగి శివునిఁ బ్రార్థించి విష్ణుమూర్తి తనను వదలివేసినాఁడని చెప్పికొనియెను. ఈమె గుఱ్ఱముయొక్క రూపమును దాల్చి శివుని ధ్యానించుచుండెను. శివుఁడు ప్రత్యక్షమై "నీవు నీపతిని ధ్యానము చేయవలయునుగాని, నన్నుగూర్చియేలధ్యానింతువు?" అనెను. "హరి హరుల కభేదమగుట తెలిసి నిన్ను ధ్యానించితి" నని తన వృత్తాంతమును దెలిపెను. శివుఁ డామెను రక్షించెదనని యభయమిచ్చి విష్ణుమూర్తికి 'నీవేల లక్ష్మిని విడనాడితి?' వని కబురుపంపెను. విష్ణుమూర్తి గుఱ్ఱమై వచ్చి యామెను గలిసెను. ఈమె గర్భవతియై పుత్త్రునిఁ బడసెను. అంత లక్ష్మికి శాపవిమోచనమయ్యెను. ఈమెను విష్ణుమూర్తి తనతో రమ్మనెను గాని బిడ్డను విడిచి రాలేకయును, నీ నూతనరూపమున శిశువును బోషింపలేకయును నీమె విచారించుచుండెను. "తుర్వసుఁ డనువాఁడు పుత్త్రుని బోషించును. నీవు రమ్ము" అని విష్ణువు చెప్పెను. ఆ పుత్త్రుని విడిచి లక్ష్మి వెళ్ళెను. ఆ పుత్త్రుఁడే హైహయుఁడు. దే. భా.

లక్ష్మి:— స్వర్గమునఁ గౌశికుఁడు గానము చేయుచుండఁగా వినుటకు సఖీసమేతగా లక్ష్మివచ్చెను. దేవతలును, మునులును పలువురు వచ్చిరి. వీరిని దూరముగా నిల్వుఁడని వేత్రహస్తులై యా చేడియలు వారినిఁ దొలఁగఁజేసిరి. లక్ష్మి తుంబురునిఁ బిలచి నీవును గౌశికునితోఁ గలసి గానము

చేయుమని పిదప వానికిఁ బారితోషిక మిచ్చెను. దాన నారదునకుఁ దాను బరాభవింపఁబడినట్లు తోఁచి కోపమువచ్చి లక్ష్మిని దైత్యగర్భమునఁ బుట్టుమనియును, వేత్రహస్తులై బరికించిరి గావున రాక్షసులు ఆమెనుగూడ వదలింతురనియును శపించెను. పిమ్మట లక్ష్మి యతనినిఁజేరి నీశాప మమోఘము గావున మునినికాయముయొక్క శోణిత మే దానవకాంతకోరి క్రోలునో యామె గర్భమునఁబుట్టునట్లు అనుగ్రహింపుమని కోరెను.

అద్భుతరామాయణము ఉత్తరకాండము.

లక్ష్మి:- ధరణీ దక్షుల కూఁతురు. ధర్ముఁడను మనువును వివాహమయ్యెను. భార.

లజ్జ:- ధరణీ దక్షుల కుమారిత. ధర్ముని భార్య. భార.

లత:-ఒక అప్సరస. వంద, సమీచి మొదలగువారీమె చెలికత్తెలు. వీరు భూలోకమునుజూడవచ్చి తపస్సుచేసికొనుచున్న బ్రాహ్మణు నొకనిని జూచి వానితపస్సు విఘ్నము చేయదలఁచుకొని వానిని బరిహసించిరి. మీరు మొసళ్లుగండని యా బ్రాహ్మణుఁడు శపించెను. శాపవిమోచనము చేయుమని వారు ప్రార్థింపఁగా మిమ్ములను మడువునుండి బైటవేసినపుడు శాపవిమోచన మగునని యతఁడు చెప్పెను. వీరు మొసళ్లై యుండిన తీర్థములకు నారీ తీర్థములని పేరు వచ్చెను. తీర్థయాత్రచేయుచువచ్చిన అర్జునుఁడు స్నానము చేయుచుండగా మొసలి వానికాలు పట్టుకొనెను. అతఁడు లాగి బైటవేయఁగా నీమె స్త్రీరూపమునుదాల్చి వెడలిపోయెను.

లపిత:-మందపాలుని భార్య. భార.

లవణుఁడు:-ఒక రాక్షసుఁడు. మధునికుమారుఁడు. వీనితల్లి కుంభీనస. వీనితండ్రికి శివుఁడిచ్చిన శూలమును దండ్రి వీనికిచ్చెను. అది యుండుటచే లవణుఁడు గర్వించి దుర్మార్గుఁడై మునులను బాధించుచుండువాఁడు. వీనికి దినమునకు నూ ఱేనుఁగులును, రెండువందల గుఱ్ఱములును, ఆఱువందల పశువులును, వేయిదుప్పులును నాహారము. వీని దుండగములు భరింపఁజాలక చ్యవనాదులు శ్రీరామునొద్దకుఁబోయి వీనిని సంహరింపుమనికోరిరి. శత్రుఘ్నుఁడు తాఁబోయి చంపెదననియెను. మధుకైటభులను సంహరించుటకై బ్రహ్మచేసిన యాయుధము శ్రీరామునికడ నుండెను. రాముఁడు దానిని శత్రుఘ్నున కిచ్చి దాని ప్రయోగోపసంహారములు వాని కెఱింగించి లవణునికడ శూలములేనపుడే వానితోఁబోరి సంహరింపుమని చెప్పెను. శత్రుఘ్నుఁడు లవణునితోఁబోరి ఘోరయుద్ధమును గావించి తుదకు వానిని జంపెను. ఉ.రా.

లవుఁడు:- శ్రీరాముని కుమారుఁడు. (చూడుము కుశుఁడు.)

లి

లింగము:-దారుకవనమందు ఋషులు తపస్సుచేసికొనుచుండఁగా వారియెదుట శివుఁడు వికృతవేషములు దాల్చి యొకొక్కకచో నేడ్చుచు, నొకొక్కకచో నవ్వుచు, నొకప్పుడు దిగ్గఱగా నఱచుచు ఉన్మాదునివలె సంచరించుచు నుండెను. మఱియు దిగంబరుఁడై స్త్రీలున్న తావులకుఁబోయి వికటకృత్యములను జేయుచుండెను. ఈ రీతిని మునుల తపోభంగము కావించుటచే వీనిని ఈశ్వరుఁడని యెఱుఁగలేక నీవు "గార్దభమవుకమ్ము, నీవు రాక్షసుఁడవుకమ్ము" అని మునులు శపించిరి. కాని, శాపముచే నతఁ డెట్టిమార్పు నొందక వెనుకటివలెనే సంచరించుచుండెను. మునులు వీనిని బిలచి, "నీవు దిగంబరుఁడవుగ నుండజనదు. వస్త్రధారుఁడవుకమ్ము. కావేని చూడు నీ లింగము పతితమయ్యెడు" నని భయపెట్టిరి. "బ్రహ్మకైనను మీ రనినట్లు చేయుటకు సాధ్యముకా" దని పలికి శివుఁడు తన రూపమును మఱుఁగుపఱచి కేవలము లింగాకారమై వారి యెదుట నిలిచెను. అంత లోకము తల్లడిల్లఁ జొచ్చెను. ప్రపంచమున సంతానోత్పత్తిశక్తియే యుడిగిపోయెను. సూర్యుఁడు చల్లదనము పొందఁజొచ్చెను. ఇట్లు విపరీతములు పుట్టుచుండఁగా ఋషులు బ్రహ్మకడకుఁ బోయి చెప్పికొనిరి. ఆ లింగరూపుఁడు మహేశ్వరుఁడగుట బ్రహ్మయెఱిఁగి మునులకుఁ దెల్పి, భక్తిశ్రద్ధలతో లింగమును గొల్వుఁడని వారికిఁజెప్పి పంపెను. బ్రహ్మ.

బ్రహ్మయును, విష్ణువును నే నధికుడను, నే నధికుడ నని తమలోఁ దగవు లాడుకొను చుండిరి. ఆ సమయమున వారి యెదుట దివ్య కాంతులతో వెలుఁగు లింగ మొకటి యావిర్భ వించెను. దాని యాద్యంతములు తెలిసికొనుటకు విష్ణువును, బ్రహ్మయును లింగమును బ్రవేశించి చెరియొక వైపునకు జనిరి. కాని వారికదిసాధ్యము కాలేదు. అంత వారు బైటకు మరలివచ్చి తమ కంటె నధికుఁడైన (యీ లింగము) శివుఁడుకలఁడని గ్రహించిరి. బ్రహ్మ.

లింగము:-శివుని మూర్తియే. శివునిరూపమునకుఁ బూజలేదు. అతఁడు (లింగాకారముగనే అతని లింగమే) పూజింపఁబడును; దీనికి భృగువు శివున కిచ్చిన శాపమే కారణము.

లిఖితుఁడు:-ఒక బ్రాహ్మణుఁడు. బాహుదానదీ తీరమున నుండును. ఇతని అన్న శంఖుఁడు. శంఖుఁ డాశ్రమములో లేనపుడు లిఖితుఁ డచ్చోటి ఫలములు కొన్ని భక్షించి యన్న వచ్చినపిదప నతనితోఁ జెప్పెను. తాను లేనపు డచ్చటిఫలములను దీసికొని భక్షించుట దొంగతన మగునని శంఖుఁడు వచియించి యా నేరమునకుఁ బరిహారముగా రాజుకడకుఁ బోయి దండనము పొందుమని చెప్పెను. అంత, లిఖితుఁడు సుద్యుమ్నుఁడను రాజుకడకుఁ బోయి తాను చౌర్యముచేసితినని నుడివి దండింపుమని వేఁడెను. లిఖితుఁడు చేసినదానికై రాజు దండింప నని యెను. లిఖితుఁడు తాను శిక్షార్హుఁడనని రాజు నకు నొక్కిచెప్పి తన చేతులు రెండు నఱికించు కొనియెను. పిమ్మట లిఖితుఁడు నిజాశ్ర మమునకు వచ్చి తాను దండనము పొంది యుండుట యన్నకుఁ జెప్పెను. నఱకఁబడిన తనచేతులను జూపెను. అదియేధర్మమని శంఖుఁడు మెచ్చుకొని తమ్ముని దీవించి నదిలో స్నానము చేసిరమ్మని చెప్పెను. లిఖితుఁడు స్నానముచేసి రాఁగానే యతనిచేతులు యథాప్రకార మయ్యెను. భార.

లీ

లీలావతి:- యుధాజిత్తు కుమారిత. ధ్రువసింధు వను రాజుభార్య. ఈమె కుమారుఁడు శత్రుజిత్తు. దే. భా.

లీలావతి:- హిరణ్యకశిపునిభార్య. ఈమె గర్భిణిగా నుండగా హిరణ్యకశిపుఁడు తపస్సునకు వెళ్లెను. అదే మంచిసమయమని ఇంద్రుఁడు రాక్షస సంహారము ప్రారంభించెను. ఈమె గర్భమం దున్న బాలునిఁగూడఁ జంపవచ్చెను. కాని యప్పుడు నారదుఁ డడ్డుపడి యీమెగర్భమం దున్న బాలుఁడు పుణ్యాత్ముఁ డగునని ఇంద్రు నకుఁ దెల్పి యీమెను దనయాశ్రమమునకుఁ గొనిపోయి కాపాడెను. ఈమెకు నారదుఁడు విష్ణుమాహాత్మ్యమును బోధించెను. భార.

లో

లోపాముద్ర:- అగస్త్యుని తపః ప్రభావమున వైదర్భరాజునకుఁ బుట్టిన కూఁతురు. (కవేరుఁ డనురాజు తపస్సుచేయగా నతనికి విష్ణుమాయ కుమారితగా జన్మించెను.) ఈమె తపస్సుచేసెను. ఈమెయొక్క యంశమే లోపాముద్ర యయ్యెను. రెండవ యంశము కావేరినది యయ్యెను. ఈమెను దనకిచ్చి వివాహము చేయుమని రాజును అగస్త్యుఁడు కోరెను. అడవిలోఁ దిరుగుచుఁ గంద మూలములను దినుచుండెడి మునికిఁ దనతనయ నిచ్చు టెట్లని రాజుసందేహము నొందుచుండఁగా లోపాముద్ర వచ్చి, "తండ్రీ! నీవు సందేహింపకుము. నన్ను మునిపుంగవునకిమ్ము. నేను వానిభార్య నయ్యెద" నని చెప్పెను. రాజు లోపాముద్రను అగస్త్యున కిచ్చి వివాహముచేసెను. అగస్త్యుఁడు భార్యతో సంయోగము నొంద ముందుగోరఁగా నాకు మంచి వస్త్రములను, భూషణములను దెచ్చి యిమ్మని లోపాముద్ర కోరెను. అగస్త్యుఁడు తిరిగి తిరిగి ధనము తెచ్చి యా ధనమున

[illegible]

[illegible]

[illegible]

[illegible]

[illegible]

[illegible]

[illegible]

[illegible]

వ

వంగకాయలు ప్రాణలింగంబులయ్యె:— బసవన్న జంగముల కర్చనచేసి భోజనము లిడుచుండెను. లింగధారులకుఁగాని యన్యులకుఁ బ్రవేశములేదని చెప్పెను. కొందఱు దొంగలు వంగకాయలు తమ కొంగులలో ముడివేసికొని ప్రవేశించిరి. దండనాయకుఁడగు నా బసవన్న వచ్చి లింగధారులే ఈశ్వరాంగణమునకు రావచ్చు ననఁగా ఆ దొంగలు పట్టుపడితిమని భయపడిరి. బసవన్న యచ్చటివారి వందఱను "ఈశ్వరార్చన కొంకక చేయుఁడు. కూర్చుండుఁడు" అనెను. ఈ దొంగలును దిరిగిపోలేక కూర్చుండి లింగసహితులుపోలెఁ జేతులు చూపిరి. ఆ బసవయ్యయొక్క భావసంగతి ప్రభావమువల్ల వారి కొంగుననున్న వంగకాయలు ప్రాణలింగములయ్యెను. బస.

వంద:— ఒక యప్సరస. సౌరభేయి, సమీచి, బుద్బుద, లత యనువారీమె చెలికత్తెలు. ఈమె చెలికత్తెలతో భూలోకమునకు వచ్చి యొక బ్రాహ్మణుని తపస్సునకు విఘ్నము చేయ యత్నించెను. మొసలులై యుండుడని యా బ్రాహ్మణుఁడు వారిని శపించెను. తమ తప్పు సైచి శాపవిమోచనమును బ్రసాదింపుమని వారు కోరిరి. ఆ కొలనులలో స్నానముచేయువారెవరేని మిమ్ము బయటఁ బడవేయుచో మీ రూపములు మీకు వచ్చుననియెను. వారు వచ్చుచు మార్గమునఁ గలిసికొనిన నారదునకుఁ దమ వృత్తాంతమును జెప్పికొనిరి. "అర్జునుఁడు తీర్థయాత్రకై వచ్చి మీకు శాపవిమోచనమును జేయఁగలవాఁ"డని నారదుఁడు చెప్పెను. వీరు మొసలులై యుండిన తీర్థమునకు నారీతీర్థమని పేరువచ్చెను. అర్జునుఁడీ మొసలులను గట్టునవేయఁగానే వంద మొదలగువారలకు శాపవిమోచనమయ్యెను. భార.

వంది:— వరుణుని పుత్త్రుఁడు. ఇతఁడు జనకరాజు యొక్క సభయందుండి వచ్చినవారితోఁ బన్నిదము వేసి వాదించుచు, నోడినవారిని నీట ముంచుచుండెను. ఇతని నష్టావక్రుఁ డోడించెను. భార

వచక్నువు:— గార్గియొక్క తండ్రి.

వజ్రజ్వాల:— కుంభకర్ణుని భార్య. వైరోచనుని తనయ. రామా.

వజ్రదంష్ట్రుఁడు:— రావణుని మంత్రులలోనొకఁడు. రామునితో సంధిగాక యుద్ధమే చేయవలయునని యితఁడు రావణున కాలోచనచెప్పెను. రామా.

వజ్రదత్తుఁడు:— భగదత్తుని పుత్త్రుఁడు. పాండవులతోఁ బూర్వవైరమును దలంచి ధర్మజుని యాగాశ్వమును బట్టెను. కాని యర్జునునిచే నోడింపఁబడెను. భాగ.

వజ్రనాభుఁడు:— చలుని పుత్త్రుఁడు. ఇతని కుమారుఁడు శంఖనఖుఁడు. భాగ.

వజ్రనాభుఁడు:— ఒక దనుజుఁడు. వజ్రపురాధిపతి. ఇతఁడు తపస్సుచేసి దేవతల కజేయుఁ డగునట్లు బ్రహ్మవలన వరముపొందెను. ఇతని యనుమతిలేక వజ్రపుర మెవ్వరికిని జొరరాదు. ఆ వర గర్వమున నింద్రాదిదేవతలను బాధపెట్టుచు స్వర్గాధిపత్యము తన కిమ్మని యింద్రుని బలవంతపెట్టెను. ఇంద్రుఁ డితనితో యుద్ధము చేయుటకు వెఱచి కశ్యపుఁ డెట్లుచెప్పిన నట్లు చెసెదనని వీనితో ననియెను. వజ్రనాభుఁ డంగీకరించెను. ఇంద్రుఁడు రహస్యముగా వజ్రనాభుని సంహరించుమని కృష్ణుని వేఁడెను.

వజ్రనాభుని కుమారిత ప్రభావతి. ఈమె కృష్ణుని కుమారుఁడైన ప్రద్యుమ్నునిఁ బ్రేమించెను. వీరిద్దఱిమధ్య సందేశములు నడుపుచుండిన శుచిముఖి యను హంసి యితనియెదుట భద్రుఁడను నటునిఁ బొగడి వానిని జూడ వజ్రనాభునకుఁ గుతూహలము పుట్టించి ప్రద్యుమ్ననే నటరూపమున వీని నగరమునకు రావించెను. అట్లు వచ్చిన ప్రద్యుమ్నుఁడు రహస్యముగ నంతఃపురముచేరి ప్రభావతిని వివాహ మయ్యెను. ఆమెకుఁ గుమారుఁడు కలిగెను. ఆ వార్తవిని ప్రద్యుమ్నుని సంహరించుటకు సేనను బంపెను. ప్రద్యుమ్నుఁ డితనితో యుద్ధముచేసెను. ఇంద్రాదు లతనికి సహాయము

చేసిరి. ఆ యుద్ధములోఁ బ్రద్యుమ్నుఁ డితనిని సంహరించెను.

వజ్రబాహుఁడు:- దాశార్ణదేశపు రాజు. ఇతని పెద్దభార్య సుమతి. ఈమె గర్భవతిగానున్నపుడు చిన్నభార్య లామెకు మందుపెట్టిరి. పుట్టిన పిల్లవాఁడును, నీమెయును రోగార్తులై యేడ్చుచుండుటచేత వీరిని నరణ్యములోనికిఁ బంపెను. ఆ పుట్టిన కుమారుఁడే భద్రాయువు. (చూడుము భద్రాయువు.)

వజ్రమిత్త్రుఁడు:- ఘోషుఁడను రాజుయొక్క కుమారుఁడు. ఇతని తనయుఁడు భాగవతుఁ డనువాఁడు. భాగ.

వజ్రాంగుఁడు:-దితి కశ్యపుల కుమారుఁడు. మరుత్తులు పుట్టినపిదప నితఁడు జన్మించెను. ఇతని భార్య వరాంగి. ఇతఁడును దేవతలను బాధించుచుండువాఁడు. ఇతని కుమారుఁడు తారకాసురుఁడు. శివ.

వజ్రాయుధము:-ఇంద్రుని యాయుధము. వృత్రాసురునకు భయపడి యింద్రాదిదేవతలు విష్ణుమూర్తి కడకుఁ బోయి వేడుకొనినపుడు "దధీచిని బ్రార్థించి యాతని యెముకలతో నాయుధమును గావించుకొని, దానితో వృత్రుని సంహరింపవచ్చు" నని విష్ణువు చెప్పెను. విశ్వకర్మ దేవతలు తీసికొనివచ్చిన దధీచియొక్క యెముకలతో నొక మిక్కిలి శక్తిమంతమగు మంచి యాయుధమును జేసియిచ్చెను. దీనితో నింద్రుఁడు వృత్రుని సంహరించెను. ఇదియే 'వజ్రాయుధ' మని చెప్పఁబడినది. భాగ.

వజ్రుఁడు:- అనిరుద్ధునకు ఉషయందుఁ బుట్టిన కుమారుఁడు.. యాదవ వంశమునం దితనికి నింద్రప్రస్థము రాజ్యముగా నిచ్చిరి. - అనిరుద్ధ చరిత్రము.

వత్సంధ్రుఁడు:- వనందుని కుమారుఁడు. విదూరథుని కుమారులను, గూఁతురగు ముదావతిని గుజంభుఁడను దనుజుఁడు పాతాళలోకమునఁ గట్టిపెట్టెను. ఆ దనుజుని సంహరించి వారిని విడిపించినవానికి ముదావతి నిచ్చి వివాహము చేయుదుమని విదూరథుఁడు చాటించెను. వత్సంధ్రుఁడు వారిని విడిపించి ముదావతిని వివాహమయ్యెను. ఇతనికి ప్రాంశుఁడు, ప్రవీరుఁడు, శూరుఁడు, సుచక్రుఁడు, విక్రముఁడు, క్రముఁడు, బలి, బలాకుఁడు, చండుఁడు, ప్రచండుఁడు అను పుత్త్రులు పుట్టిరి. మార్క.

వత్సప్రీతి:-హలంధనుని పుత్త్రుఁడు. ఇతని కుమారుఁడు ప్రాంశువు. భాగ.

వత్సరాజు:-ఒక రాజు. రాజ్యమును గోలుపోయి వసిష్ఠాశ్రమమునకుఁ బోయెను. నారసింహ వ్రతము చేయుమని వసిష్ఠుఁడు బోధించెను. ఆ వ్రతము సలిపి రాజు తిరిగి తన రాజ్యమును బడసెను. వరా.

వత్సరుఁడు:- ధ్రువునకు భ్రమియందుఁ బుట్టిన కుమారుఁడు. ధ్రువునిపిమ్మట నితఁడే రాజ్యము చేసెను. సర్వర్థి ఇతని భార్య. పుష్పార్ణుఁడు, చంద్రకేతుఁడు, ఊర్ణువు, వసువు, జయుఁడు వీరి కుమారులు. భాగ.

వత్సాసురుఁడు:-ఒక రాక్షసుఁడు. రామకృష్ణులు యమునాతీరమున దూడలను మేపుచుండఁగా, వారిని హింసించుటకు నితఁడు నొక దూడవలె వచ్చి లేఁగలను నాకుచు వానిని జంపుచుండెను. శ్రీకృష్ణుఁడు వీనిని గుర్తించి సంహరించెను. భాగ.

వత్సుఁడు:-ప్రతర్దనుని పుత్త్రుఁడు. ఇతఁడు పరశురాముని ధాటికి ఆగలేక యడవియందు దాఁగి వత్సంబులను సంరక్షించుచుండువాఁడు. భార.

వధూసరి:-ఒక నది. భృగువునాశ్రమముదగ్గర పులోమను రాక్షసుఁ డెత్తుకొని పోయినపు డామె యేడ్చెను; కన్నీళ్ళు కాలువగట్టి పాఱెను. ఆ కాలువకు వధూసరియని పేరు. భార.

వదాన్యుఁడు:-ఒక తాపసుఁడు. సుప్రభయొక్క తండ్రి. అష్టావక్రుఁ డితనికడకువచ్చి సుప్రభను దనకిచ్చి వివాహము చేయుమని కోరెను. ఇతనిని ముందుగా నుత్తరదిశకుఁ బోయి రమ్మని వదాన్యుఁడు చెప్పి యచ్చట నితని నిష్ఠను బరీక్షించుటకై, యుత్తరదిశను సుందరాంగియైయుండి యష్టావక్రుని మోహపెట్టుమని

చెప్పెను. ఆ పరీక్షకు నష్టావక్రుఁడు ఆగి వచ్చినపిమ్మట వదాన్యుఁడు తనకూఁతు నిచ్చి వివాహము చేసెను.

వనాయువు:—పురూరవునకును, ఊర్వశికిని బుట్టిన కుమారుఁడు. భార.

వపువు:—ఒక అప్సరస. ఒకనాఁ డింద్రసభలో నప్సరసలు నృత్యము చేయుచుండఁగా వారిలో నెవ్వ రెక్కువయని ప్రశ్న వచ్చెను. నారదుఁడు వీరి యాధిక్యమును నిర్ణయించునని యింద్రుఁడు చెప్పెను. ఎవరు దుర్వాసుని జలింపఁ జేయఁ గలుగుదురో వారెక్కువగఁ దలంతునని నారదుఁడనియెను. అంత వపువు, ఆ పనికిఁ జాలినదానను నేనని వెడలి దుర్వాసుఁడు తపస్సు చేసికొనుచుండఁగా వానిని సమీపించి పాడఁ దొడఁగెను. తనతపోభంగము కావింప వచ్చినదని దుర్వాసుఁ డెఱింగి "నీవు పక్షివై పుడమియందుఁ జరింపుము. నీవు సుతులను బడసి, ఖడ్గముచేతఁ గొట్టఁబడి పిమ్మట నమరపురికి వత్తువు" అని శపించెను. ఆమె పక్షిగాఁబుట్టి తార్క్షి యను నామము నొందెను. (చూడుడు తార్క్షి.) మార్క.

వపుష్ట:—కాశిరాజు కూఁతురు. ఈమె పరీక్షిత్తు కుమారుఁడగు జనమేజయుని భార్య. భార.

వపుష్మంతుఁడు:—ప్రియవ్రతుని పుత్త్రుఁడు. శాల్మలీద్వీపమునకురాజు. శ్వేతుఁడు, హరితుఁడు, జీమూతుఁడు, వైద్యుతుఁడు, రోహితుఁడు, మానసుఁడు, సుప్రభువు ఇతనికుమారులు. బ్రహ్మ.

వమ్రి:—ఒక కీటకము. ఎక్కుపెట్టిన ధనుస్సుపైఁ దలపెట్టి విష్ణుమూర్తి నిదురించుచుండఁగ నీకీటకము బ్రహ్మపంపునఁ బోయి యా వింటినారిని గొఱికి త్రెంపెను. వింటిదెబ్బ విష్ణుమూర్తిశిరము నకుఁ దగిలి యది యూడిపోయెను. దే. భా.

వరదానము:— ఒక తీర్థము. ఇచ్చటనే దుర్వాసునకు విష్ణువు ప్రత్యక్షమై వరమిచ్చెను. అందువలన ఆ తీర్థమున కా పేరు వచ్చెను. భార.

వరమిత్త్రుఁడు:— ఒక బ్రాహ్మణుఁడు. సారస్వతుఁడనువాని మిత్త్రుఁడు. వీని కుమారుఁడు సుమేధుఁడు.

వరరుచి:— విష్ణుశర్మయను బ్రాహ్మణుని కుమార్తె యగు శీలవతికిని, జంద్రగుప్తునకును బుట్టినఁ కుమారుఁడు. ఈ చంద్రగుప్తుఁడను బ్రాహ్మణుని కితర భార్యలును గలరు. వారలయందు భట్టి, విక్రమార్కుఁడు మొదలగువారలు జన్మించిరి. విక్ర. చరి.

వరరుచి:— ఒక బ్రాహ్మణుఁడు. ఇతఁడు పూర్వ జన్మమునఁ బుష్పదంతుఁ డను యక్షుఁడు. అతఁడు పార్వతిశాపమువలనఁ బేదబ్రాహ్మణ దంపతులకు జన్మించెను. వరరుచికిఁ గాత్యాయనుఁడను మఱియొక పేరుకూడఁ గలదు. ఇతని కత్యద్భుతమైన తెలివి గలదు; దేనినైనను నొక్కసారి వినినంతనే గ్రహింపఁ గలుగువాఁడు. బాల్యమందే యితని తల్లి నడిగి వ్యాడీంద్రదత్తులు వరరుచిని వర్షునియొద్దకుఁ దీసికొనివెళ్ళిరి. ఇతఁడు వర్షునివలన సర్వవిద్యలను నేర్చుకొనియెను. ఉపవర్షుఁడు తన కుమారిత ఉపకోశను నితనికిచ్చి వివాహము చేసెను. వర్షునిశిష్యులలో నితఁడే యగ్రగణ్యుఁడుగ నుండెనుగాని పాణిని శివునిఁ బ్రార్థించి, యతని యనుగ్రహము వడసి వచ్చినతరువాతఁ బాణినికి వరరుచి యోడిపోయెను. పతంజలికృత భాష్యములో నొక భాగమునకు ఫక్కి యని పేరు. ఆ భాగము పతంజలికిఁ దప్ప నన్యులకుఁ దెలియదని సూచించుటకై దానిచుట్టు వరరుచి గీత గీసెనని ప్రసిద్ధి. వరరుచి కొంతకాలము యోగనందునకు మంత్రిగా నుండెను. క. సా.

వరాంగి:— సంయాతి భార్య. ఈమెకుమారుఁడు అహంయాతి. భార.

వరాంగి:— వజ్రాంగుని భార్య. శివ.

వరాహకల్పము:— సృష్టిలో నొక కాలము. ఒకప్పుడు భూమి రసాతలమునకుఁ గ్రుంకి పోయెను. అపుడు విష్ణుమూర్తి వరాహరూపమున వచ్చి దాని నుద్ధరించెను. అప్పటినుండి వరాహకల్పము ప్రారంభించెను. బ్ర. వై.

వరాహతీర్థము:— ఒక తీర్థము. ఇచ్చటనే విష్ణువు ఆదివరాహ మయ్యెను.

వరాహావతారము:- హిరణ్యాక్షుఁడు లోకోపద్రవకరంబుగా భూమిని జుట్టచుట్టి సముద్రమున ముంచెను. విష్ణువు వరాహరూపుఁడై యా దనుజుని సంహరించి పుడమిని లేవనెత్తెను.

ఈ యాదివరాహము హిరణ్యాక్షుని రక్తమును త్రావి మదించి తిరుగుచు లోకములను భయపెట్టుచుండెను. బ్రహ్మాదులు శివునితో మొఱపెట్టుకొనిరి. శివుఁడు శరభమై వచ్చి వరాహముకొమ్ము లాగివేసెను. భాగ. స్కాంద.

వరుణుఁడు:-పశ్చిమదిక్పాలకుఁడు. సముద్రాధిపతి. ఇతఁడు కర్దమప్రజాపతి కుమారుఁడు. శుచిష్మంతుఁడని యితని పేరు. శుచిష్మంతుఁడు మిత్రులతోఁ గలిసి యచ్ఛోదం బను కొలనులో నాడుకొనుచుండఁగా మొసలి యొకటి వీనిని మ్రింగి సముద్రాధిపతికడకుఁ గొనిపోయెను. తోడిబాలురు కర్దమునితో మొసలి శుచిష్మంతుని మ్రింగెనని చెప్పిరి. కర్దముఁడు చలింపక యట్లే జపము చేసికొనుచుండెను. ఇంతలో శివభటుఁ డొకఁడు సముద్రాధిపతికడకు వచ్చి శుచిష్మంతునిఁ జూచి, "ఇదేమి? కర్దముని పుత్త్రునిఁ దీసికొనివచ్చితివి, ఇది తగునా?" యని సముద్రాధిపతి నడిగెను. ఇతఁడు భయపడి యా బాలుని శివునికడకుఁ బంపెను. శివుఁడు కర్దమునికడకుఁ బంపెను. అపుడే కర్దముఁడు కన్నులు తెఱచి పుత్త్రునిఁ జూచి యానందమొందెను. శుచిష్మంతుఁడు తండ్రి యనుజ్ఞ వడసి కాశీపట్టణమున కేగి శివునిగూర్చి తపస్సు చేసెను. శివుఁడు ప్రసన్నుఁడై వరము వేఁడుకొమ్మనియెను. శుచిష్మంతుఁడు వరుణపదము వరముగాఁ గోరెను. అప్పటినుండియును నితఁడు వరుణుఁ డయ్యెను. కాశీ.

వరుణుఁడు:-రతీదేవిని బ్రహ్మ చూచినపుడు అతనికి రేతఃపతన మయ్యెను. బ్రహ్మ సిగ్గుపడి బట్టలో దానిని గప్పికొనెను. అగ్నిహోత్రుఁడు వచ్చి యా బట్టను దగులఁబెట్టెను. ఆ యగ్నిపై బ్రహ్మ నీరు చల్లెను. ఆ నీటినుండి వరుణుఁడు పుట్టెను. బ్ర. వై.

వరుణునిభార్య గౌరీదేవి. వంది, పుష్కరుఁడు మొదలగువా రితని పుత్త్రులు. వాయు. భార.

ఒకనాఁడు వరుణుఁడును, సూర్యుఁడును గలిసి వచ్చుచుండఁగా మార్గమున వారికి నూర్వశి కనఁబడియెను. ఆమెను జూడఁగా వీరికి రేతఃపతన మయ్యెను. ఊర్వశి యా రేతస్సును దీసి యొక కుంభమందుంచెను. అందుండి యగస్త్యుఁడు, వసిష్ఠుఁడు పుట్టిరి. ఉ. రా.

ఉతథ్యుఁడు నదికి స్నానమున కేగియున్నపుడు వరుణుఁ డతనిభార్య నెత్తుకొనిపోయెను. ఈ సంగతి నారదుఁ డుతథ్యునితోఁ జెప్పెను. ఈ ముని తన భార్యను విడువుమని వరుణునితోఁ జెప్పెను. కాని యతఁడు విడువలేదు. అంత నుతథ్యుఁడు సముద్రజలమంతయు నింకఁజేసెను. వరుణనగరము ధూళిధూసర మయ్యెను. అపుడు వరుణుఁడు ఉతథ్యునిభార్యను వానికి నప్పగించెను. భార.

వరూధిని:-ఒక గంధర్వకాంత. ఈమె నొక గంధర్వుఁడు వలచెనుగాని యాతనిపై నీమెకు వలపు లేదు. ప్రవరాఖ్యుఁడను బ్రాహ్మణుఁడు హిమవన్నగముపైఁ జరించుచుండఁగా వానిని జూచి వాని చక్కఁదనమునకు మక్కువపడి వరూధిని వానిని మోహించెను. అతఁడు తననగరమునకు మార్గము చెప్పుమని యీమెను గోరఁగా నీమె పరిహాసము లాడెను. తనమనస్సు వెల్లడించెను. అతనిని వలచి యుండుట తెల్పెను. తుదకాతని పైఁబడెను కాని ప్రవరాఖ్యుఁడీమెను ద్రోసిపోయెను. ఈమె విరహమున కోర్వలేకయుండెను. దీనినంతయుఁ జూచుచుండిన గంధర్వుఁడు ఆదే సమయమని తలఁచి ప్రవరాఖ్యుని రూపమును దాల్చి కొలనిలో స్నానముచేయుచు నిలుచుండెను. ఇతనిని జూచి ప్రవరాఖ్యుఁడే యని వరూధిని సంతసించెను. ఈమెతో సంభోగించుట కా కపటప్రవరాఖ్యుఁ డంగీకరించెను. కాని తన నిజరూపము గోచరించకుండ సురతసమయము నందు నీమెను కన్నులు మూసికొనుమనియెను. వరూధిని గర్భవతి యయ్యెను. ఈమెకు స్వారోచి జన్మించెను. మార్కం.

వర్చస్సు:-సోముఁడను వసువు కుమారుఁడు.

వర్ష:-శుకిరి భార్య. ఈమె కాలుగురు పుత్త్రిక. బ్రహ్మ తనపుత్త్రికతో రమించుచుండఁగా నీమె చూచి నవ్వెను. బ్రహ్మ దీని శపించెను. (బ్రహ్మ వైవర్తము.)

వలలుఁడు:—అజ్ఞాతవాసమున నున్న భీముని పేరు. భార.

వసంతసేన:—ఒకవారకాంత. ఈమె చారుదత్తుఁడను బ్రాహ్మణునియందే యనురక్తయై యుండెను. చారుదత్తుఁడు వర్తకములో ధనమంతయును పోఁగొట్టుకొనినను నీమె యాతనిని గౌరవించు చునే యుండెను. పేదతికమననుభవించుచున్న తన ప్రియున కుపకారముచేయఁగోరి వసంతసేన నగ నొకటి దాఁచుమని చారుదత్తున కిచ్చెను. వసంతసేనయొక్క పరిచారికను మదనికను ప్రేమించిన శర్విలకుఁడను బ్రాహ్మణుఁడు ఈ నగను దస్కరించి తన ప్రియ కిచ్చెను. ఆమె యా యాభరణము వసంతసేనదనిగుర్తించి యామె యేమనునో యని భయపడియెను. అందు కుపాయముగా నామె, "ఈనగను చారుదత్తుఁడు దాఁచలేక నీకే యిమ్మని చెప్పినాఁడు, అని చెప్పి వసంతసేనకిచ్చివేయుము"మని శర్విలకునితో జెప్పెను. ఈ మాటలు వసంతసేన వినెను. చారుదత్తుఁడు నగపోవుటకు విచారించి తన భార్య యాభరణమును వసంతసేనకుఁ బంపెను. ఈమె తన నగ తస్కరింపఁబడుటయు, దానికిఁ బ్రతిఫలముగఁ జారుదత్తుడు పంపెననియును గ్రహించి యాతనిగుణములు శ్లాఘించెను. శర్విలకుఁడు తనప్రియ చెప్పినట్లుచెప్పి యా నగను ఇచ్చెను. వీరి యన్యోన్యప్రేమ వసంతసేన యెఱింగియుండుటచే ఈ నగ తెచ్చినవానికి మదనికను నిమ్మని చారుదత్తుఁడు చెప్పినాఁడని నుడివి వసంతసేన తన పరిచారికన శర్విలకున కప్పగించెను.

ఒకనాఁడు చారుదత్తుఁడు వసంతసేనను దీసికొనివచ్చుటకై బండినిబంపెను. అప్పటికామె యలంకరించుకొనుచుండెను. బండివాడు బండిలో వేయు పరుపు మఱచివచ్చుటచే దానిని దెచ్చుటకు బండితోలుకొని వెళ్ళెను. ఇంతలో వసంతసేనను వలచియున్న శకారుని బండ యామె గృహముముందఱ ఆగెను. అదియే చారుదత్తుఁడు పంపిన బండియని తలఁచి వసంతసేన యెక్కెను. శకారుఁడు మిక్కిలి సంతోషించి బండిని దోలుకొని వెళ్ళి యామెతో సరసోక్తు లాడ మొదలిడెను. వసంతసేన వానిని నిందించెను. శకారుఁడామె కంఠము పిసికి యామెపై యెండుటాకులు కప్పి తనపై నిందరాకుండఁ "జారుదత్తుఁడామెను నగలకై చంపె" నని రాజుతోఁ జెప్పెను. చారుదత్తునిఁ గొఱతవేయ నాజ్ఞాపించిరి. ఇంతలో నీమె తెప్పిరిల్లెను. నిజమెఱిగి చారుదత్తుని విడిచిరి. అతనికి రాజ్యముకూడ లభించెను. వసంతసేన వానినిగూడి సుఖంబుగ నుండెను.

వసిష్ఠుఁడు:— బ్రహ్మకు రసనాప్రదేశమునందుండి పుట్టెను. బ్ర. వై.

వసిష్ఠుఁడు:—(చూడుము. కాళహస్తి)

వసిష్ఠుఁడు:—సప్తఋషులలో నొకఁడు. ఒకనాడు సూర్యుఁడును, వరుణుఁడును గలసి వచ్చుచు మార్గమున నూర్వశిని జూచిరి. ఆమె సుందరాకారము చూచుటతోడనే వారికి రేతఃపతన మయ్యెను. ఊర్వశి వారి వీర్యముల నొక కుంభమందు భద్రము చేసెను. అందుండియే వసిష్ఠుఁడును, నగస్త్యుఁడును బుట్టిరి.

వసిష్ఠుఁడు:—శ్లో॥ గణికాగర్భ సంభూతో
వసిష్ఠశ్చ మహామునిః
తపసా బ్రాహ్మణో జాత
స్సంస్కార స్తత్రకారణమ్.

శ్లో॥ జాతో వ్యాసస్తు కైవర్త్యా
శ్వపాక్యాస్తు పరాశరః
బహవోఽన్యేపి విప్రత్వం
ప్రాప్తాయే పూర్వ మద్విజాః.

గీ. "వేశ్యసుతుఁడు వసిష్ఠుండు విప్రుఁడయ్యెఁ
దపముచే సంస్కృతియె యందు ధర్మమగును"
"జాలరికి వ్యాసుఁడును బరాశరుఁడు మాలెతకు సుతులు ద్విజులైరి లెక్క కిది మించె."

ఇట్లు పూర్వము అద్విజులై పిమ్మట సంస్కారము ననుసరించి యెందఱో బ్రాహ్మణులైరి.

వసిష్ఠుఁడు:—నిమి యను రాజు యాగముచేయఁ దలఁచుకొని వసిష్ఠునిఁ బురోహితునిఁగ బిలిచెను. ఇంద్రునియాగము చేయించివచ్చెదనని యితఁడు చెప్పిచనియె. వసిష్ఠుఁడు మరలివచ్చువఱకు నిమి యాగఁదలఁచుకొనక గౌతమునిఁ బిలిచి యతనిచే యాగము చేయించుకొనెను. వసిష్ఠుఁడు మరలి

వచ్చెను. యజ్ఞదక్షిణ గౌతమునకే యొసంగఁబడెను. వసిష్ఠునకుఁ బట్టరానికోపమువచ్చి నిమిని విదేహుఁడవు కమ్మని శపించెను. నిమి వీనికిని వట్లే ప్రతిశాప మిచ్చెను. వసిష్ఠుఁడు శరీరమును బాసియుండి తన శాపవిమోచనము చేయుమని బ్రహ్మను ప్రార్థించెను. సూర్య వరుణులవలన మరలఁ బుట్టుదువని బ్రహ్మచెప్పెను. దే. భా.

వసిష్ఠుఁడు అరుంధతిని వివాహమయ్యెను. అరుంధతి పరమపతివ్రత. ఈ దంపతులకుఁ బలువుర కుమారులు కలిగిరి. వారిలో శక్తి యనువాఁడు పెద్దవాఁడు. ఈ శక్తిపుత్త్రుఁడే పరాశరుఁడు. సుతపుఁడు, సుతేజసుఁడు మొదలగు వీతని పుత్త్రులు ఉత్తమమనువు కాలమున సప్తఋషులైరి.

వసిష్ఠుఁడువనములోఁదపస్సుచేసికొనువాఁడు. ఒకనాఁడు విశ్వామిత్త్రుఁడను రాజు వేఁటాడియలసి యతని యాశ్రమమునకు వచ్చెను. వచ్చిన రాజునకును, వతనిపరివారమునకును వసిష్ఠుఁడు తన హోమధేనువుచే నిష్టాన్నంబులు కల్పించి యిచ్చెను. ఈ గోవుప్రభావమున కాశ్చర్యమొంది విశ్వామిత్త్రుఁడు దీనిని గొనిపోవఁ జూచెను. లక్షధేనువు లిచ్చెదనన్నను వసిష్ఠుఁడు దాని నొసంగుట కంగీకరింపలేదు. అంత విశ్వామిత్త్రుఁడు దానిని దస్కరించి కొని పోయెను. కాని యీ మునిప్రభావమువలన ధేనువునుండి శబరాదులుపుట్టి విశ్వామిత్త్రుని, వానిభటులను మోదిరి. అప్పటినుండియును విశ్వామిత్త్రుఁడు వసిష్ఠునితో వైరము పూని యుండెను. ఇతనితపఃప్రభావమువలననే తనకిట్టి పరాభవము కలిగెనని తాను దపస్సుచేయ మొదలిడెను. తాను మునియైయుండియు నవకాశము వచ్చినపుడెల్ల వసిష్ఠున కపకారము చేయయత్నించువాఁడు.

శాపహతుఁడైన కల్మాషపాదునకును, వసిష్ఠుని పుత్త్రుఁడైన శక్తికిని మార్గమున ఘర్షణము జరుగుచుండెను. అది విశ్వామిత్త్రుఁడు చూచి కల్మాషపాదునిచిత్తము దనుజునిచే నావహింపఁబడునట్లుచేసెను. కల్మాషపాదుఁడు శక్తి మొదలగు వసిష్ఠునిపుత్త్రుల నందఱను సంహరించెను.

వసిష్ఠుఁడు పుత్త్రశోకమును భరింపలేక ప్రాణత్యాగముచేయఁదలఁచుకొని యగ్నిహోత్రమునఁబడెను. కాని యతనితపోమహిమచే వహ్ని శీతలమయ్యెను. వసిష్ఠుఁడు పిమ్మట సముద్రములోఁబడెను. సముద్రుఁ డీతనిని గట్టునఁ జేర్చెను. ఇతఁడు పర్వతములపై కెక్కి క్రిందఁబడెను. కాని దేహమున కేమియును దెబ్బలుతగులలేదు. కాళ్ళు చేతులు బంధించుకొని నదిలోఁ బడెను. బంధనమువీడి గట్టునఁజేరెను. ఇట్లెన్నివిధముల యత్నించినను మరణము సంప్రాప్తము కాక పోవుటచే వసిష్ఠుఁడు తనయాశ్రమమునకు మగిడి చనియెను. అపుడు గర్భవతియై యుండిన కోడలిగర్భమునుండి వేదనాదములు వినబడెను. తన పౌత్త్రుని మోముఁ జూచినపిమ్మట మరణింపవలె ననుకొని కోడలిని దన యాశ్రమము నందుంచి కాపాడుచుండెను.

ఒకనాఁడు రాక్షసరూపమువనున్న కల్మాషపాదుఁ డీమెను భయపెట్టి తఱుముకొనివచ్చెను. వసిష్ఠుఁడు మంత్రపూతమైనజలమును వానిమీఁద జల్లఁగా వాఁడు శాపవిమోచన మొంది పూర్వరూపమును దాల్చెను.

ఒకనాఁ డింద్రసభయందు వసిష్ఠుఁడు, భూలోకమున నున్న రాజులలో హరిశ్చంద్రుఁడాడి తప్పనివాఁడని చెప్పెను. ఇతఁ డిట్లు చెప్పుటచే విశ్వామిత్రుఁడు హరిశ్చంద్రునిచేత నసత్యము పలికించెదనని పలికి తనపంతము నెఱవేర్చుటకు హరిశ్చంద్రునకుఁ గష్టములు కలుగఁజేసెను. ఇది వసిష్ఠునకు దెలిసెను. తనపుత్త్రుల మరణమునకును విశ్వామిత్త్రుఁడే కారణమని జ్ఞాపకము చేసికొనెను. ఆ కోపమున వసిష్ఠుఁడా రాజర్షిని బకమగునట్లు శపించెను. విశ్వామిత్త్రుఁ డీతనికి నాడేలవుకమ్మని ప్రతిశాప మిచ్చెను. వీరట్లు పక్షులై కొట్టుకొనుచుండిరి. బ్రహ్మవచ్చి వీరి పోరాటమును మాన్పించి పూర్వపురూపములు వీరికిచ్చి హరిశ్చంద్రుని మేలునకైయే యట్లు తటస్థించెనని చెప్పి వసిష్ఠుని శాంతపఱచెను.

వైవస్వతుఁడు పుత్త్రునిఁ బడయఁగోరి వసిష్ఠు నాలోచన యడిగి మిత్త్రావరుణులను గూర్చి యాగముచేసెను. కాని యాతనిపత్ని కుమారితను గోరి హోతనాశ్రయించి యట్లు వషట్కారములు పలుకుటచేఁ గూఁతురు పుట్టెను. వైవస్వతుఁడు

వశిష్ఠునికడకు వచ్చి నీవు బుత్త్రినిఁగోరఁగాఁ బుత్త్రిక యేల పుట్టెనని యడుగఁగా నతఁడు హోతచేసిన యపకారము, మోసము తెలిసికొని తానే నారాయణుని బ్రార్థించి యా పుత్త్రిక పుత్త్రుఁడగునట్లు చేసెను. అట్లు పుట్టినవాఁడే సుద్యుమ్నుఁడు. భాగ.

సుద్యుమ్నుఁడు తిరిగి శంకరుని శాపముచే స్త్రీయయ్యెను. ఈమె కొంతకాల మట్లుండి వసిష్ఠునిఁ దలఁచుకొనఁగా నీతఁ డామెకడకుఁ బోయి శంకరుని బ్రార్థించెను. ఈతని తపస్సునకు మెచ్చి యీశ్వరుఁడు ఇలను నొకమాసము స్త్రీగను, నొకమాసము పురుషుఁడుగను నుండునట్లు అనుగ్రహించెను. భాగ.

వసిష్ఠుఁడు సూర్యవంశపు రాజుల కుల గురువు. ఇక్ష్వాకు, దశరథుఁడు మొదలగువారిచే నితఁడు పుత్త్రేష్టి చేయించెను. సంవరణునకు నితఁడే పురోహితుఁడు. సంవరణుని నిమిత్త మితఁడు సూర్యునికడకుఁ బోయి బ్రార్థించి యతని పుత్త్రియైన తపతిని సంవరణున కిప్పించెను. సంవరణుఁడు సదా తపతితో భోగించుచుండుటచే నతనిరాజ్యమున ననావృష్టి కలిగెను. అంత వసిష్ఠుఁడే శాంతిక, పౌష్టిక క్రియలు గావించి దోషమును బోఁగొట్టెను.

వసిష్ఠుఁడు:–ఒకనాఁడు వసిష్ఠుఁడు మిత్త్రిసహుఁడను రాజునింటికి భోజనమునకు వెళ్ళెను. ఒక దనుజుఁడు గావించిన మాయచే నితనికి భోజనములో నరమాంసము వచ్చెను. వసిష్ఠునకుఁ గోపమువచ్చి యారాజును శపించెను. ఆ రాజట్టి పాపము నెఱుఁగడు. అతఁడును రాజుల కిఁక గురువుగ నుండఁ దగవని వసిష్ఠుని శపించి జలమును మంత్రించెను. అపుడు వసిష్ఠుఁడు దివ్యదృష్టిచే జరిగినవృత్తాంతము తెలిసికొనెను. మిత్త్రిసహుఁడు మంత్రజలమును దనపాదముల మీఁదనే చల్లుకొనెను. అతనికి భార్యతో సంభోగింపకుండ శాపము గలదు. కావున వసిష్ఠుని వలనఁ బుత్త్రినిఁ బడయుమని తన భార్యను నియోగించెను. ఆమెకు వసిష్ఠునివలన అశ్మకుఁడనువాఁడు జన్మించెను.

వసుద:–నర్మద యను గంధర్వస్త్రీ కుమారిత. మాలి భార్య. ఈమెకు నలుగురు కుమారులు. ఉ. రా.

వసుదేవ:–వికుంఠనుని భార్య. అజమీఢుని తల్లి.

వసుదేవుఁడు:–ఇతఁడు దేవభూతి యను రాజును జంపి రాజ్యమునుగైకొనెను. తత్పూర్వ మితఁడు కణ్వామాత్యుఁడైయుండెను. ఇతనికుమారుఁడు భూమిత్త్రుఁడు. భాగ.

వసుదేవుఁడు:–శూరసేనుని కుమారుఁడు. మాథురము, శూరసేనము అను దేశములకు రాజు. మధురానగరము రాజధాని. భాగ.

వసుదేవుఁడు:–హృదికిని కుమారుఁడైన దేవామీఢునకు మారిషయందుఁబుట్టిన కుమారుఁడు. ఇతఁడు పుట్టునపు డాకాశమున దుందుభులు మ్రోగెను. ఆ కారణమున నితనికి 'ఆనకదుందుభి' యను పేరుకూడఁ గలదు. ఇతనికి దేవభాగుఁడు, సృంజయుఁడు, ఆనకుఁడు మొదలగు తొమ్మండ్రు సోదరులు కలరు. పృథ, శ్రుతదేవ, రాజాధిదేవి మొదలగు నేవు రప్పచెల్లెండ్రును గలరు. వసుదేవుఁడు దేవకుని కుమారితలను – దేవకి, శాంతిదేవ, ధృతదేవ మొదలగు నేడ్వురు తోఁబుట్టువులను వివాహమయ్యెను. మఱియు నితనికి రోహిణి, కౌసల్య, పౌరవి మొదలగు నితర భార్యలునుగలరు. వసుదేవునకు రోహిణియందు బలరాముఁడు, గదుఁడు, సారణుఁడు మొదలగువారును; పౌరవియందు సుభద్రుఁడు మొదలగువారును; మదిరయందు నందోపనందాదులును; దేవరక్షితయందు గదాదులును; దేవకియందు కీర్తిమంతుఁడు, సుషేణుఁడు, భద్రసేనుఁడు, ఋజువు, సమదనుఁడు, భద్రుఁడు, సంకర్షణుఁడును; నష్టమగర్భంబునఁ గృష్ణుఁడును బుట్టిరి.

వసుదేవుఁడు దేవకినివివాహమయి, యామెను రథమునెక్కించి నిజనగరమునకుఁ దీసికొనివచ్చుచుండెను. ఆ సమయమున నాకాశవాణి దేవకి యష్టమపుత్త్రుఁడు కంసుని సంహరించు నని పలికెను. ఆ వచనము కంసుఁడు విని దేవకిని సంహరింపవచ్చెను. ఆమెకుఁ బుట్టు కుమారులను సంహారింపవచ్చునని చెప్పి యామెను విడువుమని

వసుదేవుఁడు కంసుని బ్రతిమాలెను. ఆ మాటల కంగీకరించి కంసుఁ డామెను జంపక విడిచెను.

వసుదేవుఁడు తనవచనము తప్పక తన ప్రథమ పుత్త్రుని గీర్తిమంతునిఁ గంసునకు సంహరింప నిచ్చెను. ఇతఁ డాడితప్పకుండుటకు సంతోషించి కంసుఁడు వానిని జంపక విడిచెను. కాని నారదుఁడు కంసునితో వసుదేవాదులు దేవతలనియును, నీవు రాక్షసుఁడవనియును, విష్ణువే నిన్నుఁజంపుటకై దేవకీగర్భమునఁ బుట్టు ననియును జెప్పెను. ఆ మాటలువిని కంసుఁడు వసుదేవసుతులను సంహరించి దేవకీవసుదేవులను గారాగృహమున నుంచెను. అందే దేవకికి శ్రీకృష్ణుఁడు జన్మించెను. ఆతఁడు విష్ణ్వంశతో జన్మించుటను వీరు గుర్తించి స్తుతించిరి. కావలి వారు నిదురించుచుండఁగా వసుదేవుఁడు తన చిన్ని శిశువును గొనిపోయి యశోదప్రక్కను బెట్టి, యామె ప్రసవించిన యాఁడుశిశువును దెచ్చి దేవకిప్రక్కను బెట్టెను. ఇది యశోద కూడ నెఱుంగకుండగనే జరిగెను. ఇతని మార్గమునఁ బ్రవహించు యమునానదియును నీ కార్యమందు వసుదేవునకుఁ ద్రోవ యొసంగెను. వసుదేవుఁడు శ్రీకృష్ణునిం గొనిపోవు సమయమున నొక గాడిద యఱచెను. దాని యఱపుచేఁ గావలివారు లేచెదరని భయపడి యది యఱవకుండ దానిపాదములు పట్టుకొనెను. శ్రీకృష్ణుఁడు యశోదగృహముననే పెరిగెను. ఆతఁడు కంసునిఁ జంపి దేవకీవసుదేవులను బంధ విముక్తులను గావించెను.

వసుదేవుఁడు పూర్వభవంబున సుతపుం డను ప్రజాపతి. ఆతఁడును, నతనిభార్యయును బెద్ద కాలంబు తపంబాచరించిన విష్ణువు ప్రసన్నుండై వరంబు వేఁడుకొనుఁడనియెను. వారు విష్ణువునే తమ కుమారునిఁగా జన్మించునట్లు కోరిరి. ఆ వరమువలన వసుదేవునకుఁ గృష్ణుఁడు జన్మించెను. భాగ.

వసుదేవుఁడు పూర్వజన్మమునఁ గశ్యపుఁడు. ఆతనిభార్యయైన అదితి ఆతనితో సంభోగింపఁ గోరివచ్చెను. ఆ సమయమున నతఁడు మఱియొక భార్యయైన కద్రువను గూడియుండెను. అశానంగమైన యదితికిఁ గోపమువచ్చి మీరు నరులై పుట్టుఁడని వారిని శపించెను. ఆ శాపమువలనఁ గశ్యపుఁడు వసుదేవుఁడుగ జన్మించెను. బ్ర. వై.

పూర్వము కశ్యపుఁడు సముద్రుని హోమ ధేనువులను బుచ్చుకొనెను. వాని నిచ్చివేయు మని సముద్రుఁ డడిగెను. కశ్యపుని భార్యలు సురభియు, నదితియు నీయమనుటచేఁ గశ్యపుఁ డీయలేదు. సముద్రుఁడు బ్రహ్మతోఁ జెప్పుకొనెను. కశ్యపుఁడు గోవుల నపహరించెనుగాన నతఁడు పుడమిపై గోపవర్యుఁడై పుట్టువని శపించెను. ఆ శాపమువలననే కశ్యపుఁడు వసుదేవుఁడుగా జన్మించి కంసునిగోవులకు నధిపతి యయ్యెను. హరి.

వసుపదుఁడు:- శుక్తిమతి యను నదికిఁ గోలాహల మను పర్వతమువలన గల్గిన కుమారుఁడు. వీనిని ఉపరిచరవసువునకు శుక్తిమతియిచ్చెను. ఇతఁడు ఉపరిచరవసువునకు సేనాధిపతి యయ్యెను. భార.

వసుమనుఁడు:- ఇక్ష్వాకునకు మాధవియందుఁ బుట్టిన కుమారుఁడు. భార.

వసుమనుఁడు:- ఒక రాజు. ఇతనికి వామదేవుఁడు సకలధర్మము లెఱింగించెను; అర్థసిద్ధికంటె ధర్మసిద్ధియే ఉత్తమంబని తెల్పెను. బృహస్పతి రాజధర్మములను దెల్పెను. భార.

వసుమిత్రుఁడు:- సుజ్యేష్ఠుఁ డను రాజుయొక్క కుమారుఁడు. ఇతనిపుత్త్రుఁడు భద్రకుఁడు. భాగ.

వసురాతుఁడు:-ధనందునిపినతండ్రి కుమారుఁడు. రాజ్య మంతయును నితఁడే పాలించుచుండెను. ధనంముఁడు తన తండ్రిభాగము తన కిమ్మని యడిగెను. వసురాతుఁడు నిరాకరించెను. వీనితో ధనంముఁడు యుద్ధముచేసి వీనిని సంహరించెను. మార్క.

వసువు:-(చూడుము ఉపరిచరవసువు)

వసువు:- భూతజ్యోతిపుత్త్రుఁడు. ఇతనికుమారుఁడు ప్రతీతుఁడు. భాగ.

వసువు:- కుశుని కుమారుఁడు; గిరివ్రజపురమునకు రాజు. రామా.

వసువు:- జమదగ్ని పుత్త్రుఁడు. తల్లిని వధింపుమని తండ్రి వీని నాజ్ఞాపించెను. ఇతఁడు తల్లిని జంప ననియెను. జమదగ్ని వీనినిశపించెను. కాని పరశు

రాముఁడు కోఁడటచే జమదగ్ని వీనిని శాపవిముక్తుని గావించెను. భార.

వసువు:- కాశ్మీరరాజు. ఇతఁడు రాజ్యము పుత్త్రున కప్పగించి వనమునకేగి తపస్సుచేసి పుండరీకాక్షపాఠస్తవము పఠించుచుండెను. అంత నీతని శరీరమునుండి వికృతరూపుఁ డొకఁడు వచ్చి నావలనఁ బనినిగైకొనుమనియెను. వసు వత్యాశ్చర్యము నొంది 'నీ వెవ్వఁడవు? ఇట్లేలవచ్చితి' వని యడిగెను. "నేను బ్రహ్మహత్యను. నీవు క్రిందటి జన్మమున చాంద్రవంశమునఁ బుట్టిన రాజువు. అపుడు జనస్థానపురము నీరాజధాని. నీవు వేఁటకుబోయి లేడియని భ్రమపడి మునిని గొట్టితివి. ఆ పాపము పోఁగొట్టుకొనుటకు నీ వనేకపూజలు చేసితివి; వ్రతములు సల్పితివి. కాని దాన నీకు ఉదరశూలరోగము వచ్చినది. నీ మరణకాలమున నీ భార్యయగు నారాయణిని దలఁచుకొంటివి. నీవు నారాయణనామ ముచ్చరించుటచే నిన్ను స్వర్గమునకుఁ గొనిపోవుటకు విష్ణుమాతలు వచ్చిరి. నే నష్టపడితిని. నన్ను వారు మోదిరి. నే నపుడు నీ శరీరరంధ్రములలో దాఁగియుంటిని. నీవు స్వర్గలోకమందున్నపుడును, బ్రహ్మ నిన్ను మరలఁ గాశ్మీరరాజుగా బుట్టించి నపుడును నట్లే యుంటిని. ఇప్పుడు నీవు 'పుండరీకాక్ష' పాఠస్తవము చేయుటచే నీశరీరమునుండి వెడలఁగొట్టఁబడితి" నని చెప్పెను. నీవలన నా పూర్వజన్మ వృత్తాంతమును వినగలిగితిని. నీవు ధర్మవ్యాధుఁడవై యుండుమనిచెప్పి వసువు స్వర్గమును బొందెను. వరా.

వసువులు:-ఆపుఁడు, ధ్రువుఁడు, సోముఁడు, ధరుఁడు, అనిలుఁడు, అనలుఁడు, ప్రత్యూషుఁడు, ప్రభాసుఁడు అను నెనమండుగురు భార్యాసహితులై వసిష్ఠునాశ్రమమునకుఁ జనిరి. అచ్చట వసిష్ఠుని హోమధేనువైన నందినినిజూచి దాని సుశీలమునకు విస్మయమందిరి. అష్టమ వసువగు ప్రభాసునిభార్య దానిని గొనిపోయి తన చెలికత్తెయగు జితవతి కీయగోరెను. ప్రభాసుఁడును, నితర వసువులును గలసి దానిని దస్కరించిరి. వసిష్ఠుఁడు తన ధేనువునకై వనమెల్లఁ దిరిగి, యెచ్చటనుగానక తన యోగదృష్టివలన వసువు లపహరించిరని గ్రహించి వారిని మర్త్యలోకమునఁ బుట్టుఁడని శపించెను. శాపము నెఱిఁగి వసువులు చిరకాలము మనుజలోకమున నుండఁజాలమని వసిష్ఠునితో మొఱలిడుకొనిరి. వీరిలో పెద్ద దోషము చేసినవాఁడు అష్టమవసువగు ప్రభాసుఁడుగావున నతఁడు చిరకాల మనపత్యుఁడై భూలోకమున నుండునట్లును, తక్కినవారచిరకాలములోనే మనుజలోకమునుండి వచ్చునట్లును వసిష్ఠుఁ డనుగ్రహించెను.

శాపమునొందిన వసువు లెనమండ్రుు మర్త్యలోకమునకు వచ్చుచుఁ ద్రోవయందు గంగను జూచిరి. మీ రెక్కడికి పోవుచున్నారని యామె వీరి నడిగెను. వీరు తమ వృత్తాంత మెఱింగించి, నీయందే శంతనునకుఁ బుట్టుదుమనిచెప్పి తమను మనుజలోకమునఁ జిరకాలముంచక పుట్టిన వెంటనే నదియందు వేయుమని కోరిరి. దీర్ఘాయుష్మంతుఁడగు కుమారుఁ డొక్కరుఁడైన నుండవలదాయని గంగ కోరఁగ నష్టమవసువు భూలోకమునఁ జిరకాల ముండుట కంగీకరించెను. ఇతఁడే భీష్ముఁడుగఁ బుట్టెను.

వసుసేనుఁడు:-కర్ణునకుఁ బెట్టిన మఱియొకపేరు. వసువర్మధరుండు కావున వసుసేనుఁడను పేరు పెట్టిరి. భార.

వసుహోముఁడు:-అంగదేశపురాజు. మాంధాతకు దండోత్పత్తిప్రకారం బెఱింగించెను. భార.

వా

వాజిసని:-(చూడుము దేవరాతుఁడు)

వాతవేగుఁడు:- గాంధారీధృతరాష్ట్రులపుత్త్రుఁడు. భాగ.

వాతశిఖి:-కద్రువ కుమారుఁడు. భాగ.

వాతాపి:-హ్లాదునకు దమనియను భార్యయందు వాతాపి, ఇల్వలుండు పుట్టిరి. భాగ.

వాతాపి:-ఒక రాక్షసుఁడు. సింహికావిప్రచిత్తుల కుమారుఁడు. ఇతని సోదరుఁడు ఇల్వలుఁడు. వీని

నగరము మణిమతిపురము. ఇల్వలుఁ డొకబ్రాహ్మణుని దనకు సకలకామసిద్ధికరమైన మంత్ర ముపదేశింపుమని వేఁడెను. కాని విఫలమనోరథుఁ డయ్యెను. ఆ కోపము వీరికిఁ గలదు. అప్పటి నుండియు బ్రాహ్మణులను వధించుట ప్రారంభించిరి. ఈ సోదరులు బ్రాహ్మణులను భోజనమునకుఁ బిలుచుచుండువారు. వాతాపి కామరూపుఁడు గావున వానిని మేఁకనుగఁ జేసి యిల్వలుఁడు బ్రాహ్మణులకు వండిపెట్టుచుండును. వారు భుజించినపిమ్మట నిల్వలుఁడు 'వాతాపీ! రమ్ము' అని పిలుచుచుండును. వాతాపి యాబ్రాహ్మణుల యుదరముచీల్చుకొని వచ్చుచుండును. ఇట్లు మాయోపాయంబున బ్రాహ్మణులు సంహరింపఁబడుచుండుటచే వా రగస్త్యునితోఁ జెప్పుకొనిరి. అగస్త్యుఁడును వీరింటికి వచ్చె. యథాప్రకారమే యిల్వలుఁడు గావించె. అగస్త్యుఁడు భోజనముచేసి యుదరము రాచుకొనుచు "జీర్ణము జీర్ణము, వాతాపి జీర్ణము" అనియె. అతనికుక్షిలోనుండినవాతాపి జీర్ణించెను. అట్లు వాతాపి మరణించెను. విష్ణు. భార.

వాత్స్యుఁడు:-శాకల్యుని శిష్యుఁడు. తా నుపదేశ మొందిన ఋగ్వేదశాఖను జాతుకర్ణి యనువాని కుపదేశించెను. భాగ.

వాత్స్యాయనుఁడు:-గౌతమ సూత్రములను భాష్యముచేసిన ముని.

వామదేవుఁడు:-ఒక బ్రాహ్మణుఁడు. ఇతనికడ మిక్కిలి శీఘ్రగమనముగల తురంగములు కలవు. వీని నొకసారి శలుఁడనురాజు ఎరవుపుచ్చుకొని, తిరిగి వామదేవుఁడు స్వయముగవెళ్ళి యడిగినను నిచ్చినవాఁడుకాఁడు. పైఁగానితని జంపబోయెను. అందువలన వామదేవుఁడు తన తపఃప్రభావముచే రాక్షసులనుపుట్టించి వానినిజంపించెను. శలుఁడు మరణించినపిమ్మట వానిసోదరుఁడు దలుఁడనువాఁడు రాజయ్యెను. తనశిష్యుని ఆత్రేయుఁడనువానినిఁ 'బంపి మఱల వామదేవుఁ డతనికడకు వచ్చి యాతని యశ్వములడిగెను. దలుఁడు కుపితుఁడై ఈబ్రాహ్మణుఁడు క్రొవ్వి పలుకుచున్నవాఁడు. వీని నిప్పుడే సంహరించెదను. విషదగ్ధ సాయకమును దెండనికింకరులతోఁ బలికెను. ఆ శర మప్పుడే యంతఃపురమునసున్న నీసుతుని సంహరించునని వామదేవుఁడు పల్కఁగా నంతలోనే యంతఃపురవాసు లేడ్చుచుఁ జచ్చిన కుమారునిఁ దీసికొని వచ్చిరి. దలునకుఁ గోప మాఁగక వామదేవునిఁ జంపుటకై బాణమును సంధింపఁబోఁగా వామదేవుని ప్రభావమువలన నాతని హస్తములట్లే స్తంభించిపోయెను. అపుడు దలుఁడు చిన్నవోయి బ్రాహ్మణప్రభావంబు గొప్పదని యొప్పికొని వామదేవునిఁ బ్రార్థించెను. ఇతని చేతులు వచ్చునట్లనుగ్రహించి మరల సుతుని బ్రతికించెను. దలుఁడు వాని గుఱ్ఱము లిచ్చి ప్రార్థించి పంపెను. భార.

వామదేవుఁడు:-ఒక ఋషి. దశరథుని పురోహితుఁడు. వసుమనుఁడను రాజునకు ధర్మము లెఱింగించెను. అర్థసిద్ధికంటె ధర్మసిద్ధి మేలనియె. భార.

వామనుఁడు:- అదితి గశ్యపులకు జన్మించిన కుమారుఁడు. కశ్యపునకుఁ బూర్వభవమునందు (చూడుము సుతపుఁడు) విష్ణు వొసంగిన వరము చొప్పున విష్ణువే వామనుఁడుగ జన్మించెను. ఇతఁడు మిక్కిలి పొట్టివాఁడు. ఉపనయనము కాఁగానే నితఁడు బ్రహ్మచారులట్లు భిక్షాటనము చేయుచు బలిచక్రవర్తికడకు వచ్చెను.

బలిచక్రవర్తి ముల్లోకముల నాక్రమించి పాలించుచుండెను. దేవతల ప్రభావము తగ్గిపోయెను. ఇంద్రుఁడును రాజ్యము పోఁగొట్టుకొనెను. దేవతలు విష్ణువుతో మొఱపెట్టుకొనగ రాక్షసుల నణఁచుటకై విష్ణువే యిట్లుజన్మించెను.

వామనుఁడు బలిచక్రవర్తికడకు వచ్చెను. 'నీకు గావలసిన దిచ్చెదను గోరుకొను' మని బలి యనియె. వామనుఁడు మూడడుగుల భూమి మాత్రమేకోరెను. ఇంతలో దానవాచార్యుఁడైన శుక్రుఁడు, వామనుఁడు బలి నణంచుటకు వచ్చిన మహానుభావుఁడని యెఱింగి బలియిచ్చిన దానము వలన నతనికే యాపదవచ్చునని తెలిసికొని యా దాన మొసంగకుండుమని బోధించెను. బలి యాడినమాట తప్పననియె. వామనునకు బలి మూడడుగులు ధారవోయుచుండఁగ శుక్రుఁ డల్పకీటకమై జారీకొమ్మున నడ్డుపడియె. వామనుఁడు దానిని బుల్లతోఁ బొడిచెను. అదితగులుటచే

శుక్రుని కన్నొకటి గ్రుడ్డిదయ్యె. పిమ్మట వామనుఁడు విజృంభించెను. విశ్వరూపము ధరించెను. ఒక్కపాదముతో భూమినంతను గప్పెను. రెండవ పాదముతో నాకాశమును గప్పెను. ఇకమూడవ యడుగు పెట్టుటకుఁ జోటు లేకపోయె. తన వచనము తప్పకుండ, మూడవ పాదము తన శిరస్సుపై బెట్టుమని బలి శిరము వంచెను. వామనుఁడు బలిని రసాతలమునకు వణఁగఁద్రొక్కెను. భాగ.

వామనుఁడు:- కద్రువ కుమారుఁడు.

వాయువు:- అష్టదిక్పాలురలో నొకఁడు. ఇతఁడు తొల్లి పూతాత్ముఁడను బ్రాహ్మణుఁడు. కశ్యపుని దాయాది. పూతాత్ముఁడు పెక్కేండ్లు కాశీపట్టణమున శివునిగూర్చి తపస్సుచేసెను. శివుఁడు ప్రసన్నుఁడై యితనికి దిక్పతిత్వంబును, ప్రాణాపానాది పంచమూర్తిత్వంబును, సర్వగత్వంబును, సర్వసత్త్వావబోధకత్వంబును నిచ్చెను. కాశీ.

పూర్వము దేవాసురులకు యుద్ధమైనపుడు దేవతలే గెలిచిరి. తమజయమునకుఁ దామే కారణమనుకొని సంతోషించుచుండిరి. ఆ సమయమున వారియెదుట బ్రహ్మము గోచరించెను. దేవతలు దాని నెఱుఁగలేకపోయిరి. దానిని దెలిసికొని వచ్చుటకై యగ్ని వెళ్ళెను గాని తెలిసికొనలేకపోయెను. పిమ్మట వాయువు వెళ్ళెను. నీవెవ్వరవని బ్రహ్మము వీనిం బ్రశ్నించెను. నేను వాయువును. సర్వమును వహించి కొనిపోఁగలనని యతఁడు చెప్పెను. అట్లైనచో దానిం గొనిపొమ్మని బ్రహ్మ మొక తృణము నిచ్చెను. వాయువు తన శక్తినంతను నుపయోగించెను గాని యా తృణమును నెత్తలేకపోయెను. తనకు గోచరించిన తేజము నెఱుఁగలేకపోయెను. అయినను పరబ్రహ్మను నితఁడు సమీపించుటచే వాయువు దేవతలలో శ్రేష్ఠుఁడయ్యెను. కే. ఉ.

వాయువును, శేషుఁడును దమలో నెవ్వరెక్కుడు బలవంతులని పన్నిదములు వేసికొనిరి. శేషుఁడు మేరువును జుట్టుకొని యుండెను. వాయువు ప్రచండముగవీచెను. పర్వతశిఖరములు కొన్నివిఱిగి సముద్రమున బడి ద్వీపము లయ్యెను.

వాయువున కంజనయందుఁ బుత్త్రుండు జన్మించెను. ఈ బాలుని నింద్రుఁడు వజ్రాయుధముతోఁ గొట్టెను. ఆ దెబ్బచే నాంజనేయుఁడు మూర్ఛనొందెను. వాయువునకు నింద్రునిపైఁ గోపమువచ్చి తనరూప ముపసంహరించుకొనెను. లోకమునం దెచ్చటను గాలి లేకపోయెను. బ్రహ్మయును, దేవతలును హనుమంతునకు వరములిచ్చి వాయువును బ్రతిమాలుకొనిరి. అపుడితఁడు మరల వ్యాపించెను.

వాయువునకుఁ గుంతియందు భీముఁడు జన్మించెను.

వాయువు కుశనాభుని పుత్త్రికలను జూచి తనను వివాహమగుఁడని కోరెను గాని వారు నిరాకరించిరి. వాయువునకుఁ గోపమువచ్చెను. వారు వికృతరూపులైరి.

వారిసారుఁడు:- చంద్రగుప్తుని పుత్త్రుఁడు; అశోకుని తండ్రి. భాగ.

వార్ష్ణేయుఁడు:- నలుని సారథి. నలదమయంతులు రాజ్యమును విడిచి యరణ్యములకేగునపుడు వారి కుమారుని, కుమారికను వార్ష్ణేయుఁడే దమయంతి జనకునిగృహమునకుఁ దీసికొనివెళ్ళెను. పిమ్మట నితఁడును ఋతుపర్ణునికొలువులోఁ జేరి బాహుకునితోఁ గలసి పనిచేసెనుగాని వానిని గుర్తింపలేకపోయెను. భార.

వాలఖిల్యులు:- బ్రహ్మపుత్త్రులు. పార్వతీపరమేశ్వరుల వివాహము చూచుటకు బ్రహ్మ వెళ్లెను. పీటలమీఁదఁ గూర్చుండిన ఆ దంపతులని జూడఁగా బ్రహ్మకు రేతఃపతనమయ్యెను. ఆ రేతస్సునుండియే వాలఖిల్యులు పుట్టిరి. బ్ర.వై.

బ్రహ్మ యొకనాఁడు స్వర్గమునకు వెళ్ళఁగా రంభాది యప్సరసలు వాని కెదురుగా వచ్చిరి. వారిని జూడ బ్రహ్మకు రేతఃపతన మయ్యెను. దానినతఁడుకాలితో గప్పిపుచ్చెను. ఆ రేతస్సులో నిసుకరేణువులు కలసెను. అందుండియే వాలఖిల్యులు పుట్టిరి.

వాలఖిల్యులు క్రతువనుమునియొక్క పుత్త్రులు. వీరితల్లి సన్నతి (క్రియ). వీరు నిత్యబ్రహ్మ

చారులు; ఊర్ధ్వరేతస్కులు; సూర్యునిరథమం దెక్కి సంచరించుచుందురు. బ్రహ్మ.

వాలఖిల్యులు అంగుష్ఠ ప్రమాణదేహులు. వీరు తలక్రిందుగనుండి తపస్సు చేయువారు. కశ్యపుఁడు పుత్త్రకామేష్టి చేయునపుడు వీరు వానికి సహాయముచేయుచుఁ బుష్పములను దెచ్చుచుండిరి. పుష్పభారము సహింపలేక వణఁకిరి. అట్లు వణకువారినిజూచి యింద్రుఁడు నవ్వెను. వీరు సిగ్గుపడిరి. రోషము వచ్చినది. కశ్యపునకుఁ బుట్టు పుత్త్రుఁడు రెండవ ఇంద్రుఁడగునని పలికిరి. ఇంద్రుఁడు భయపడియెను. వీరి మాట తిరుగదు కావునఁ గశ్యపునకుఁ బుట్టు పుత్త్రుఁడు ఖగేంద్రుఁ డగునట్లు కశ్యపుఁడు పలికి, వీరిని సమ్మతింపఁజేసి ఇంద్రునిభయము పోఁగొట్టెను. భార.

వాలి:- ఒక వానరుఁడు. ఋక్షవిరజుఁడను వానరుఁడు స్త్రీరూపముననుండగ నింద్రుఁడు చూచి మోహించెను. అతని వీర్యము ఋక్షవిరజుని వాలమందుఁ బడెను. ఆ వీర్యమువలనఁ బుట్టిన వాఁడేవాలి. వాలితమ్ముఁడు సుగ్రీవుఁడు. ఉ.రా.

వాలి:- ఇంద్రునివలన నహల్యయందుఁ బుట్టిన కుమారుఁడు. గౌతముఁ డింటలేనిసమయమున వాసవాదిత్యులు అహల్యతో రమించిరి. ఆమె కిద్దఱు పుత్త్రులు పుట్టిరి. వారు తనపుత్త్రులే యని గౌతముఁ డనుకొనెనుగాని వానిపుత్త్రులు కారని యంజన వారితోఁజెప్పెను. "నాపుత్త్రులుకారేని మీరు మర్కటరూపములను బొందుఁడు. నాపుత్త్రులేయైరేని సురూపులుగనే యుండుఁడు" అని గౌతముఁడు వారిని సముద్రమునఁ బడవేసెను. వారు మర్కటరూపములనుఁ బొందిరి. గౌతముఁడు వారిని విడిచి వెళ్ళెను. సముద్రతీరమున సంచరించు ఋక్షవిరజుఁడు వీరిని దీసి పెంచెను. వీరే వాలిసుగ్రీవులు. ఋక్షవిరజుఁడే వాలిని కిష్కింధకు రాజును జేసెను. వి. రా.

వాలిభార్య తార. ఈమెయం దీతనికి అంగదుఁడను కుమారుఁడు కలిగెను.

వాలి మిక్కిలి బలాఢ్యుఁడు. వీనితోఁబోరి గెల్చినవా రెవ్వరును లేరు. రావణుఁడు ధరాధిపతులను గెల్చి గర్వించి వాలికడకువచ్చి యుద్ధమునకుఁ బిలిచెను. వాలి వానిని యుద్ధముచేసి గర్వమును బోఁగొట్టెను. అప్పటినుండి రావణుఁడు వాలితో సఖ్యము చేసియుండెను. హిమాలయపర్వతమును ధిక్కరించి వచ్చిన దనుజుఁడు దుందుభి యనువాఁడు వాలిని యుద్ధమునకుఁ బిలిచెను. నగరమువెలుపల వీరిరువురుపోరాడిరి. వాలి దుందుభిని సంహరించెను. వాని కళేబరమెత్తి క్రిందఁ బడవేసెను. రక్తము చిమ్మి ఋశ్యమూకపర్వతముమీఁదఁ దపస్సుచేసికొనుచున్న మతంగమునిమీఁదఁ బడెను. అందుచే మతంగముని ఋశ్యమూకముపైకి వాలివచ్చుచో వానిశిరము వ్రయ్యలగునని శపించెను. ఈ శాపభయముచే వాలి యా పర్వతముచెంతకుఁ బోవువాఁడు కాఁడు.

మాయావి యను మఱియొక దనుజుఁడు వాలితోఁబోరి యోడి యొక బిలమునఁ దూరెను. ఆ బిలములోనే యుద్ధముచేసి వాలి మాయావిని సంహరించెను. బిలము వెలుపలనున్న సుగ్రీవుఁడు రక్తధారలు చూచి వాలియే సంహరింపఁబడెనని భయపడి బిలమును నొక ఱాతితో మూసి నగరమునకు వచ్చెను. వాలి బయటకు వచ్చి నగరమునుజేరి, తనభార్యతోఁ గలసియుండి రాజ్యము చేయుచున్న సుగ్రీవునిఁ జూచి తనను వంచించుటకే సుగ్రీవుఁ డట్లుచేసెననుకొని వీని నీడ్చి కొట్టి పంపెను. అదియే వాలి సుగ్రీవుల వైరమునకుఁ గారణము.

వాలిసుగ్రీవులు వైరులుగా నున్నపుడే సుగ్రీవుఁడు రామునితోఁ జెలిమిజేసెను. వాలిని సంహరింపుమని సుగ్రీవుఁడు కోరెను. ఇతఁడు వాలిని యుద్ధమునకుఁ బిలిచి వానితోఁ బోరాడుచుండెను. ఆ సమయమున రాముఁడు చెట్టుచాటుననుండి వాలిని గొట్టి సంహరించెను.

వాలితో నెవ్వరును నెదురుగనిలిచి పోరాడలేరు. అట్లు పోరుచో నెదుటివాని సగముబలము వాలిని జేరునట్లు వాలికి వరము కలదు. ఆ వరమువలననే నితఁడందఱను జయింపఁగలుగువాఁడు.

వంచనచేసి కొట్టఁబడినందుకే వాలి చింతించెను. రామునకు గావలసినసహాయము తనతోఁ జెప్పిన దా నవలీలగఁ జేయఁగలవాఁడు. అయినను శ్రీరాముని మాహాత్మ్య మెఱుంగుటచే వాని చేతులలో మరణించుటకు సంతోషమొంది వానికి నమస్కరించి ప్రాణములు విడిచెను.

రామా.

వాల్మీకి:- ప్రచేతసుని కుమారుఁడు; బ్రాహ్మణుఁడు. వీని మొదటిపేరు బుక్కఁడు. రామా.

వాల్మీకి:- ప్రచేతసునికుమారుఁడు బ్రహ్మపుత్త్రుఁడు. సత్యయుగంబున నొకనాఁడు బ్రహ్మ స్వర్గమును జూడ వెళ్ళెను. వాని కింద్రుఁడును, రంభాది సకల యప్సరసలును నెదురుగా వెళ్ళిరి. వారిని జూడఁగా బ్రహ్మకు రేతఃపతనమయ్యె. అది కొంత పంకముతోఁ గలసెను. అందుండియే వాల్మీకి జన్మించెను. అట్లు జన్మించి వాల్మీకి బ్రహ్మ కెదురుగఁ బోయి "ఇంద్రునిసభలో నే నీ రేతస్సు పంకముతోఁ గలియుటచే నేఁ బుట్టితిని. నా కాహారము సమకూర్పుము" అని యడిగెను. తన రహస్యము బైట బెట్టుటచే బ్రహ్మకుఁ గోపమువచ్చి "నీవు పతితుఁడవై, బోయలంగలసి, క్రూరకర్మలనుజేయుచుండు"మని శపించెను. శాపవిమోచనముచేయుమని వాల్మీకి ప్రార్థించెను. "రామనామమును జపించి శాప విమోచనము నొందుదు" వని బ్రహ్మ నుడివెను.

ఆ శాపమువలన వాల్మీకి చండాలురను గలసి తిరుగుచు నొకబోయకాంతను వివాహమయ్యెను. ఇతఁడు మార్గస్థులను గొట్టుచు, వారి ధన మపహరించుచు ఆలుబిడ్డలను బోషించుచుండెను. ఒక నాఁడు సప్తఋషులు వచ్చుచుండఁగ వారి నడ్డముగొట్టి వాల్మీకి వారి కమండలములను లాగుకొనఁబోయెను. "ఓ బోయా! నీ కుటుంబ పోషణకై యింతపాపమును జేయుచుంటివే! నీ వార్జించిన ధనముతోఁబాటు నీకు వచ్చు పాపముకూడ నీ యాలుబిడ్డలు పంచుకొందు రేమో కనుగొంటివా? నీ వింటికిఁ బోయి తెలిసికొని రమ్ము. నీవు మఱలి వచ్చువఱకు నే మిచ్చటనే యుందుము" అని మునులు చెప్పిరి. వాల్మీకి యింటికిఁ బోయి తన భార్య నడిగెను. "నీవు మమ్ము పోషించుట నీవిధి. ఆర్జించుటయం దుండు పాపపుణ్యములు నీవే కాని మాకు నిమిత్తము లేదు" అని యామె పలికెను. ఆ మాటలు విని వాల్మీకి విరక్తిజెంది మునులను జేరి తనకుఁ దరుణోపాయము చెప్పు డని ప్రార్థించెను. వారు వీనికి రామనామ ముపదేశించిరి. (రామనామ ముపదేశించుట కితఁ డర్హుఁడు కాఁడని యక్షరములు తలక్రిందుగఁ జెప్పిరి.) అప్పటినుండియు వాల్మీకి తపస్సు ప్రారంభించెను. పెక్కేండ్లు నిరాహారుఁడై తపస్సు చేయఁగ నతనిశరీరముపై పుట్టలుకూడ మొలచెను. ఆపుట్టలపైఁ జెట్లుకూడ మొలచెను.

విష్ణుమూర్తి రాముఁడుగ నవతరించునని నారదుఁడు వినెను. ఆ వార్త నెవ్వరకును దెల్పకుమని నారాయణుఁడు చెప్పెను. నారదుఁ డెవ్వరకును జెప్పకయుండలేక చెట్లకుఁ జెప్పుట తప్పుగాదని యీతనిచుట్టు పెరిగిన వృక్షముల కడ రామకథ చెప్పెను. అది వాల్మీకి వినియె.

వాల్మీకికి భరద్వాజాది శిష్యులు కలరు. వారితోఁగలసి వాల్మీకి నదిలో స్నానముచేసి వచ్చుచు మార్గమున క్రౌంచపక్షి మిథునములో నొకదానిని బోయవాఁ డొకఁడు చంపుట చూచెను. చూచి "ఓరీ! ఇంతటితో నీ ప్రతిష్ఠ యంతమగుఁగాక" యని శపించెను. అపు డితఁడు పల్కినవచనము ఛందోబద్ధమై రామాయణార్థముగల శ్లోకమయ్యెను. దాని కాశ్చర్యమొంది వాల్మీకాదులు నిజాశ్రమము చేరిరి. పిమ్మట బ్రహ్మవచ్చి "రామాయణము రచింపు" మని వాల్మీకితోఁ జెప్పెను.

ఒక అనన్యరూపవతియగు కాంతామణి యరణ్యములో సంచరించు చున్నదని వాల్మీకి శిష్యులు చెప్పిరి. ఆమె సీత యని వాల్మీకి దివ్యదృష్టిచే గ్రహించి వచ్చి యామె నాదరించి తన యాశ్రమమునకు దీసికొనివెళ్ళెను. ఆమె ప్రసవించిన పిదప బాలురకుఁ గుశలవులని నామకరణముచేసి పెంచి విద్యావంతులను జేసెను. రాముఁడు చేయు నశ్వమేధయాగమునకు గుశలవులనుగూడ గొంపోయి వారిచే రామాయణము గానము చేయించె. సీతను దలఁచుకొని రాముఁడు దుఃఖించుచుండఁగ "నామె తన యాశ్రమముకడ నున్నది. రప్పింప వచ్చు" నని యితఁడు చెప్పెను. సీతను దీసికొనివచ్చిరి. ఆమె శీలపరీక్షణము కోరిరి. ఆమె రసాతలమున కేగఁగ దిగులొందుచుండిన రాము నోదార్చి వాల్మీకి యాగముపూర్తిచేయుమని చెప్పెను.
ఉ. రా.

వాల్మీకి:- వరుణునకు చర్షణియను భార్యయందుఁ బుట్టెను. భాగ.

వాసుకి:- కద్రువకుమారుఁడు. క్షీరసాగరమథనమునకు దేవత లితని సహాయముగోరి మంధరపర్వ

తమునకుఁ గట్టుత్రాడుగ నితని నుపయోగించిరి. అందులకు సకలభయమోక్షణంబుగ నితనికి వర మిచ్చిరి. జరత్కారునిపుత్త్రుఁడు జనమేజ యుఁడు చేయు సర్పయాగమును మాన్పుమని బ్రహ్మ దేవతలతోఁ జెప్పినట్లు ఏలాపుత్త్రుఁ డితనితోఁ జెప్పెను గావున జరత్కారువు అను తన చెలియలిని భార్యగఁ బరిగ్రహింపుమని వాసుకి జరత్కారున కిచ్చెను. భార.

వి

విందానువిందులు:—కృష్ణుని మేనయత్తకుమాళ్ళు. వీరి చెలియలగు మిత్రవిందకు స్వయంవరము చాటింప శ్రీకృష్ణుండువచ్చి యామెను వివాహ మయ్యెను. భార.

వీనితండ్రి జయత్సేనుఁడు. తల్లి రాజాధిదేవి. వీ రవంతిదేశమును పాలించిరి. దుర్యోధనునకు వశులయి యుండిరి. భారతయుద్ధమున దుర్యోధనుని పక్షమునఁ బోరి అర్జునునిచే సంహరింపఁ బడిరి. భార.

విందుఁడు:—గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

వింధ్యపర్వతము:— భారతవర్షమున నార్యావర్తమునకు దక్షిణముననున్న పర్వతము. దీని పైనను దేవతలు సంచరించుచుందురు. కుల పర్వతములలో నిది యొకటి. సూర్యుఁడు మేరు పర్వతముచుట్టుఁ దిరుగుచుండుటచూచి సూర్యుని నీవు నా చుట్టు నేల తిరుగవని వింధ్యయడిగెను. "విధియోగమున ఆ దేవగిరిచుట్టుఁ దిరుగుదును" అని సూర్యుడుబదులుపలికెను. ఆమాటలకు వింధ్యకు కోపమువచ్చి సూర్యచంద్రుల గమనమున కాటంకము గలుగఁజేయుటకై విస్తారముగఁ బెరిగెను. సూర్యచంద్రులకు దిరుగుటకు సాధ్యము కాక పోయెను. ఆ కారణమున రాత్రింబవళ్ళు ఏర్పడుటలేదు. మునులు వింధ్య పెరుగుట మాన్పింపఁజూచిరి గాని వారికి సాధ్యము కాలేదు. వా రగస్త్యునికడకుఁ బోయి వానిని ఆ కార్యము చేయుమని ప్రార్థించిరి. అతఁడు వింధ్యకడకు వచ్చి నేను తీర్థయాత్రలకై దక్షిణమునకుఁ బోవలసియున్నది. మార్గమిమ్మని కోరెను. ఈ పర్వతము తనరూప ముపసంహరించుకొనియె. అగస్త్యుఁడు వింధ్యదాటి నేను మరల వచ్చువరకు నిట్లే యుండుమని చెప్పి వెడలెను. కాని యతఁ డా మార్గమున మరల రాలేదు. కావున వింధ్య యిప్పటికి నట్లే యుండెను. భార.

వింధ్యావళి:—బలియొక్క భార్య. భాగ.

వింశుఁడు:—ఇక్ష్వాకు పుత్త్రులలోఁ బెద్దవాఁడు. వీని కుమారుఁడు వివింశుఁడు. భార.

వికర్ణుఁడు:— గాంధారీధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. ద్రౌపదిని సభకుఁ దోడ్కొనిరమ్మని దుర్యోధనుఁడు ప్రాతికామిని పంపినపు డామె యొక ప్రశ్న వేసి ముందుగ దానికి సమాధానము తెమ్మనియె. కాని యెవరును ప్రత్యుత్తర మీయలేదు. దుశ్శాసనుఁ డామెనుసభలోనికి లాగికొని వచ్చెను. ఈ దురంతములకు వికర్ణుఁడు మిక్కిలి విచారించి భీష్మాదివృద్ధు లెవ్వరును నిపుడు పలుకకున్నారు. ద్రౌపదివేసిన ప్రశ్న ధర్మయుక్తమైనది. పెద్ద లెవ్వరు మాటాడనిచో నేనే ధర్మమునిర్ణయించెదనని తనయభిప్రాయము చెప్పి దుర్యోధనుని గర్హించెను. కాని వీనిమాట నెవరు వినరైరి. ఇతఁడును యుద్ధములోనే సంహరింపఁబడియె. భార.

వికుంఠ:— రైవతమనుకాలమున శుభ్రుఁడనువాని భార్య. విష్ణుమూర్తి యీమెకుఁ బుత్త్రుఁడుగాఁ బుట్టి వైకుంఠుఁడని ప్రఖ్యాతిగాంచెను.

వికుంఠనుఁడు:—హస్తికుమారుఁడు. ఇతనిభార్య వసుదేవ. వీరి పుత్త్రుఁడు అజమీఢుఁడు. భార.

వికుండలుఁడు:— (చూడుము శ్రీకుండలుఁడు.)

వికుక్షి:—(చూడుము శశాదుఁడు)

విక్రమార్కుఁడు:— శృంగారశేఖరుఁడను రాజకుమార్తెయగు రాగమంజరి చంద్రగుప్తుఁడను బ్రాహ్మణునివలచి తండ్రిచే నాతనికి వివాహము కాఁబడెను. ఆ రాజుయొక్క పురోహితుఁడగు

విష్ణుశర్మయను భాండాగారాధీశ్వరుండగు ధన గుప్తుఁడును, దండనాయకుఁడగు వీరవర్మఁడును దమ పుత్రికలను ఆ చంద్రగుప్తున కిచ్చిరి.

రాగమంజరియందు విక్రమార్కుండును, విష్ణుశర్మకూఁతురగు శీలవతియందు వరరుచియును, సుమతియందు భట్టియును, దండనాయకుని కూఁతురగు మదనరేఖయందు భర్తృహరియును జన్మించిరి. విక్ర. చరి.

విక్రమార్కుఁడు:-ఉజ్జయినిదేశమును బాలించిన రాజు. ఇతని సోదరుఁడు భర్తృహరి; అతఁడు రాజ్యమును బాలించి విరక్తిచెంది తపోవనమున కేగుచు విక్రమార్కునకు రాజ్య మప్పగించెను. అతని విరక్తికి మూలకారణమైనట్టియు, జరామరణములను బోఁగొట్టునట్టియు ఫలములను గూడ నితని కిచ్చెను.

ఆ ఫలవృత్తాంత మిది: ఒక బ్రాహ్మణుఁడు మిక్కిలి బీదవాఁడు. సదా దేవిని నిష్ఠతోఁ గొలుచుచుండెను. ఆమె వాని కొక ఫలమునిచ్చి "దీనిఁ గైకొనుము. దీనివలన జరామరణములు పోవు" నని చెప్పెను. "నేను చిరకాలము జీవించియు భిక్షాటనమేకదా చేసికొనవలయును. పరోపకారముచేయు రాజు చిరకాలము జీవించుట మంచిది" అని తలఁచి యాబ్రాహ్మణుఁడు దానిని భర్తృహరి కిచ్చెను. తాను జీవించియుండఁగ దనభార్య మరణమునొందుట కిష్టపడక యామె చిరకాలము జీవించియుండుటఁ గోరి రాజు ఫల మామె కిచ్చెను. ఆమెకు గుఱ్ఱములను దోలువాఁడు ప్రియుఁడు. ఆమె వాని కిచ్చెను. వాడు తన ప్రియమైనదాని కిచ్చెను. అదాని తన ప్రియుఁడైన గోపకున కిచ్చెను. ఒక పేడ ప్రోగుచేయుదానియందు వానికిఁ బ్రేమ. వాఁడు దాని కిచ్చెను. అది పేడలోఁ బెట్టి తీసికొని వెళ్ళుచుండఁగ భర్తృహరిచూచి యావద్వృత్తాంతము నెఱింగెను. ఆమెయొద్దనుండి యాఫలమును బుచ్చుకొని విక్రమార్కున కిచ్చెను.

విక్రమార్కుఁడు పాలించుచుండఁగ నొకఁడు వచ్చి "నేను యాగము చేయఁబోవుచున్నాను. నాకు సహాయము చేయు" మని కోరెను. విక్రమార్కుఁడు వానితోఁ బితృవనము ప్రవేశించెను. వీని నా దిగంబరుఁడు సంహరింపఁ బోయెను. కాని యితఁడే వానిని సంహరించెను. అది బేతాళుఁడు చూచెను. అప్పటినుండియు బేతాళుఁ డితనికి మిత్త్రుఁడయ్యె.

ఊర్వశీ రంభల నృత్యనైపుణ్యమును గుఱించి వివాదము వచ్చెను. దానిని దేవతలు తీర్పలేక పోయిరి. ఇంద్రుఁడు తనరథమును బంపి విక్రమార్కుని రప్పించి యితనిని నిర్ణయింపుమనెను. ఇతఁడు వారినృత్యమును చూచి "యూర్వశియే ఎక్కువ నైపుణ్యముగల"దని చెప్పెను. ఇంద్రుఁ డితనికి మణిమయసింహాసన మొక టిచ్చెను. ఆ సింహాసన మధిష్ఠించియే విక్రమార్కుఁడు పెద్దకాలము పాలించెను. అందు ముప్పది రెండు సాలభంజికలు గలవు.

సాహసౌదార్యాది సుగుణముల కితనికి సాటి వచ్చువారు లేరు. ఇతఁడు పరులకై తనప్రాణములు వీడుటకుఁగూడ సిద్ధమయ్యెడివాఁడు. ఈతఁ డొనరించిన మహత్తరకార్యములను ఆ సాలభంజికలే చెప్పినవి.

విక్రమార్కుఁడు గావించిన తపస్సునకు మెచ్చుకొని ఈశ్వరుఁ డమరత్వముకంటె వేరు వరము కోరుకొనుమనియె. రెండున్నర సంవత్సరముల వయస్సుగల బాలికకుఁ బుత్త్రుఁడు పుట్టినపుడు మరణముసంభవించునట్లు విక్రమార్కుఁడు కోరెను. కొంతకాలమునకు నొక కుంభకారునిగృహమున నొక బాలికకుఁ బుత్త్రుఁడు శాలివాహనుఁడు పుట్టెను. అపుడు భూకంపము కలిగెను. విక్రమార్కుఁడు బేతాళుని బంపి యెచ్చట నట్టిబాలుఁడు పుట్టెనో చూచి రమ్మనియె. పిదప నితఁడు నిజఖడ్గముచేత నే హతుఁడై ప్రాణములు విడిచెను. ఇతనిసింహాసన మధిష్ఠించుటకు దగినవాఁడు లేఁడని యాకాశవాణి పలికెను. అందుచే మంత్రులు దానిం దాఁచియుంచిరి. ఆ సింహాసనమును భోజరాజు గైకొనియె. విక్ర.

విక్రాంతుఁడు:-ఒకరాజు. ఇతనిభార్య హైమిని. ఈమె ప్రసవించియుండఁగ శిశువును జాతహారిణి యను బిడాల మెత్తుకొనిపోయి విశాలపురమున బోధుఁడను బ్రాహ్మణునింటఁ బెట్టి, గిరిభద్రకుమారుని దెచ్చి యామెప్రక్కలోఁ బెట్టెను.

ఈ కుమారునే తమయూరకుఁ దనుకొని పెంచి విక్రాంతుఁడు యానందుఁడని పేరుపెట్టెను. ఈ బాలుఁడు పెరిగి తాను వారిపుత్త్రుఁడను గాననియును, వారిపుత్త్రుఁడు బోధునింటనున్నాఁడనియును జెప్పెను. విక్రాంతుఁడు బోధునింట నున్న తనపుత్త్రునిఁ జైత్రుని రప్పించుకొనియెను. మార్క.

విశురుఁడు:-ఆనాయువు పుత్త్రుఁడు. భార.

విఘ్నేశ్వరుఁడు:-శివుని కుమారుఁడు. పార్వతి యును, శివుఁడును గ్రీడించుచుండఁగా దేవతలు వచ్చిరి. వీరిక్రీడకు భంగమయ్యెను. శివునివీర్యము నేలపైఁబడెను. అందుండియే పుత్త్రుఁడుపుట్టెను. వానిని పార్వతి పెంచెను. ఒకనాఁ డామె బాలు నెత్తుకొని నాపుత్త్రునిజూడుమని శివునిఁ బిలచెను. శివుఁడు బాలుని జూచినతోడనే యీ బాలుని శిరము వ్రయ్యలయ్యెను. పార్వతి దుఃఖముతో మిక్కిలివిలపించెను. దేవతలందఱు బయలువెడలి పుష్పభద్రతీరమున నున్న యేనుఁగుతలఁ దెచ్చి యా బాలునికంఠమున కంటించిరి. ఈ బాలుఁడే విఘ్నేశ్వరుఁడు. బ్ర. వై.

విఘ్నేశ్వరుఁడు:- పార్వతి కుమారుఁడు. పార్వతి తలంటుకొనఁదలఁచి పిండిబొమ్మ నొక దానిని జేసి దానికిఁ బ్రాణమువోసి యా బాలుని గుమ్మముయొద్దబెట్టి, యెవరిని లోపలకు రానీయ వలదని చెప్పెను. ఆమె లోపలఁ దలంటుకొను చుండెను. ఆమె స్నానము చేయుచుండఁగనే శివుఁడు సమరములో రాక్షసులను జయించి సంతోషముతోఁ బార్వతి కా వార్త చెప్పుటకై వచ్చుచుండెను. గుమ్మముకడ నీ బాలుఁడుండి శివునిలోపలకుఁబోనీయననియెను. తనయింటఁదన నిట్లాజ్ఞ పెట్టువాఁడు వీఁ డెవ్వఁ ? డని శివునకుఁ గోపమువచ్చినది. వానిని గెంటి లోపలకువెళ్ళఁ బోయెను. ఆబాలుఁ డెదురించెను. వానిని శివుఁడు శూలముతోఁ బొడిచి చంపి లోపలకుఁబోయెను. పార్వతి శివుని జూచెను. బాలకుని జంపెనని యామె తెలిసికొనెను. ఆమెకు మిక్కిలికోపము వచ్చినది. "నాముద్దులకుఱ్ఱనినీవుచంపితివి. వానిని బ్రతికించెదవా, బ్రతికింపుము. లేదా ప్రపంచ మంతయు బ్రళయముచేయుదు" నని యామె యనియెను. శివుఁడు తన భటులను బంపి యుత్తరదిశగాఁ దలపెట్టి పరుండిన ప్రాణితల నఱికి తెండని చెప్పెను. వారు చని యట్లు నిద్రించుచున్న యేనుఁగు నొకదానిని జూచి దానితలను నఱికి తెచ్చిరి. దాని నీ బాలుని కంటించి శివుఁడు వీనిని బ్రతికించెను. దేవత లందఱు వీనినిస్తుతించిరి. ఇతఁడేవిఘ్నేశ్వరుఁడు. వీనినే గణాధిపతిగాఁ జేసిరి.

విఘ్నేశ్వరుఁడు:-ఆకాశము నుండి యేర్పడి యెను. పూర్వము రాక్షసులబాధ మిక్కుట ముగా నున్నపుడు ఋషులును, దేవతలును శివుని యొద్దకుఁ జని యా బాధ పోఁగొట్టు నుపాయము చెప్పుమని కోరిరి. దానిని గూర్చి శివుఁ డాలోచించుచు నించుక తలయెత్తెను. ఎత్తగనే వానికంటికి మిక్కిలి సుందరమగు రూపముతోఁ బార్వతి కనబడెను. అపుడు "జలమునకును, బృథ్వికిని రూపముండఁగా నాకాశమున కేల లేకపోయె ?" నని శివుఁడు బ్రశ్నించెను. మనో హరాకార యగు పార్వతిని జూచి యాకాశ మును గూర్చి యట్లు ప్రశ్నించుటచే నాకాశము పుత్త్రరూపమున వానియెదుట గోచరించెను. వాని రూప మత్యంత మనోహరముగా నుండుటచేఁ బార్వతికూడ వానిని జంచల చిత్తముతోఁ జూచెను. ఆ బాలుఁడు దేవతాకామినుల చిత్త మునుగూడ నిట్లు భ్రమింపజేయుటచే శివునకుఁ గోపమువచ్చెను. ఆ బాలుని "నీవు ఏనుఁగుతల యును, బొజ్జకడుపును గలవాఁడవు కమ్ము. సర్పములు నీకు జన్నిదమగును" అని శపించెను. వెంటనే యా బాలుఁడట్లయ్యెను. అతఁడే విఘ్నేశ్వరుఁడు. ఇంకను శివునికోపము పోయినది కాదు. అతని దేహమంతయుఁ జెమర్చెను. చెమటబిందువులనుండి గజాస్యులు పుట్టిరి. దేవ తలు శివునిని బ్రార్థించి శాంతచిత్తుని జేసిరి. ఆ పుట్టిన గజాస్యులు విఘ్నేశ్వరుని పరివారమగు వనియును, బ్రతికార్యమందును వినాయకుఁడు ముందుగఁ బూజింపఁబడుననియును శివుఁ డనుగ్రహించి పలికెను. వరా.

విఘ్నేశ్వరునకును గుమారస్వామికిని బెండ్లిండ్లు చేయఁదలచుకొనిరి. కాని యెవరికి ముందుగఁ జేయవలెనని సందేహమువచ్చి ఈ భూలోకము చుట్టుఁదిరిగి యెవఁడు ముందుగవచ్చునో వానికి

ముందు వివాహముచేయుదుమనిరి. కుమారుఁడు నెమిలివాహనముమీఁద బయలుదేఱెను. విఘ్నేశ్వరునిది మూషికవాహనము. ఇతఁడు 'భూలోకము నెట్లుచుట్టివచ్చెదఁ?' నని చింతించుకొనెను. ఇతఁడు స్నానముచేసి వచ్చునప్పటికిఁ బార్వతీపరమేశ్వరులు దగ్గఱగఁ గూర్చుండి యుండిరి. వారికితఁ డేడుసారులు ప్రదక్షిణము చేసెను. 'నేను భూలోకమును దిరిగి వచ్చితి'నని చెప్పెను. తానుజేసిన ప్రదక్షిణములు భూలోక ప్రదక్షిణమునకు సమానమని శాస్త్రములు చెప్పుచుండుట నెఱింగించెను. పార్వతీ పరమేశ్వరులు వీనికే ముందుగ సిద్ధి, బుద్ధి అను కన్యల నిచ్చి వివాహము చేసిరి. విఘ్నేశ్వరునకు సిద్ధివలన క్షేముఁడు, బుద్ధివలన లాభుఁడు అను కుమారులు జన్మించిరి. శివ.

విఘ్నేశ్వరుఁడు:-కార్తవీర్యుని సంహరించి పరశురాముఁడు శివునిఁజూడవచ్చెను. ఆ సమయమున శివుఁడు పార్వతితో శయనమం దుండెను. గుమ్మముయొద్ద విఘ్నేశ్వరుఁ డుండి పరశురాముని లోపలకుఁ బోఁజనదని నివారించెను. "శివుని దర్శించుటకు నేఁ బోవుచుండ నీ వెవఁడవు వారించుట"కని పరశురాముఁడు ధిక్కరించెను. అంత వారిరువురకుఁ బోరాటమయ్యెను. విఘ్నేశ్వరుఁడు తొండముతో బరశురాముని పైకెత్తెను. ఇతని కూర్ధ్వలోకము లేడును గనఁబడియెను. పరశురాముఁడు భయపడియెను. తన పరశువుచే విఘ్నేశ్వరునిఁ గొట్టెను. ఆ దెబ్బచే వినాయకుని దండ మొకటి విరిగి క్రిందఁ బడియెను. అప్పటినుండియు నతఁ డేకదంతుఁ డయ్యెను. ఆ దంతము పడిన చప్పుడునకు బార్వతీపరమేశ్వరు లులికిపడి బయటకు వచ్చిరి. పార్వతి విఘ్నేశ్వరు నెత్తుకొని పరశురామునిపై గోపగించెను. బ్రహ్మ.

విఘ్నేశ్వరుఁడు:-ఒకనాఁడు భుజించి నడువలేక నడువలేక వచ్చుచుండఁగా చంద్రుఁడు చూచి నవ్వెను. దాన విఘ్నేశ్వరునకుఁ గోపము వచ్చినది. చంద్రునిఁ జూచినవారికి నపఖ్యాతి వచ్చునట్లు ఇతఁడు శపించెను. చంద్రుని జూడకుండనుండుట కష్టముగావున ఆ శాపముమరలింపుమని దేవతలుకోరిరి. తాను జన్మించిన దినమున జూచినవారి కట్టిదోషములు కలుగుననియును, నితరదినముల దోషము రాదనియును నితఁడు వచియించెను. ఇతని చీలినయుదరము మరల సర్పముతోఁ గుట్టఁబడెను.

విచింత్యుఁడు:- సాల్వుని సేనానాయకులలో నొకఁడు. యుద్ధములోఁ జారుదేష్ణుఁడు వీని నోడించెను. ఇతఁ డోడఁగనే సాల్వునిసేన యంతయు ధైర్యముచెదరి పాఱిపోయెను. భార.

విచిఖ్యుఁడు:-ఒకరాజు. యజ్ఞమున బ్రాహ్మణులచే వృషభము హింసింపఁబడుట చూచి జాలినొంది గోవులకు స్వస్తియగుఁగాకయని పలికెను. భార.

విచిత్రవీర్యుఁడు:- శంతనునకు సత్యవతివలనఁ బుట్టిన రెండవకుమారుఁడు. చిత్రాంగదుఁ డితని యన్న. యుద్ధములోఁ జిత్రాంగదుఁడు మరణించిన పిమ్మట భీష్ముఁ డితనినే రాజ్యాభిషిక్తుని జేసెను. అంబిక, అంబాలిక లను కాశిరాజు కూఁతులను భీష్ముఁడు దీసికొనివచ్చి విచిత్రవీర్యునకు వివాహముచేసెను. ఇతఁడు సదా భోగరసలాలసుఁడై శోషించి మృతినొందెను. పిమ్మట శంతనువంశము నిల్పుటకు సత్యవతి నియోగమున అంబికయు, అంబాలికయు వ్యాసుని వలన ధృతరాష్ట్రుని, పాండురాజునిఁ గనిరి. వీరు విచిత్రవీర్యున కట్లు క్షేత్రజకుమారులు. భార.

విజయ:-పాండుపుత్త్రుఁడైన సహదేవుని భార్య. ఈమెకుమారుఁడు సుహోత్రుఁడు. భార.

విజయ:-భుమన్యునిభార్య. ఈమె కుమారుఁడు సుహోత్రుఁడు. భార.

విజయుఁడు:-సుదేవుని కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు రురుకుఁడు. భాగ.

విజయుఁడు:-అజ్ఞాతవాసమున నున్న యర్జునుఁడు పెట్టుకొనిన సాంకేతికనామము. భార.

విజయుఁడు:-జయుని సోదరుఁడు. విష్ణుమూర్తి ద్వారపాలకుఁడు. (చూడుము జయుఁడు.)

విజయుఁడు:-ఒక రాజు. ఇతఁడు శూరసేనుఁడను రాజు మంత్రిచే వంచింపఁబడి తనకుమారితను శూరసేనునకుఁ బుట్టిన సర్పమున కిచ్చి వివాహము చేసెను. బ్రహ్మ.

విజితాశ్వుఁడు:-పృథుచక్రవర్తి పెద్ద కుమారుఁడు. ఇతనితల్లి అర్చి. ధూమ్రకేశుఁడు, హర్యశ్వుఁడు, ద్రవిణుఁడు, వృకుఁడు ఈతని సోదరులు. బ్రహ్మావర్తదేశమున సరస్వతీనదీ తీరమందు పృథుచక్రవర్తి తొంబదితొమ్మిది యాగములు చేసి నూఱవది చేయుచుండఁగా నింద్రుఁ డోర్వలేక యాగాశ్వము నపహరించెను. విజితాశ్వుఁ డింద్రుని దఱుముకొని వెళ్ళెను. ఇంద్రుఁడు వెఱచి తురగమును విడిచి మాయమైపోయెను. ఇతఁ డింద్రుని గెల్చి యశ్వమును దెచ్చెనుగాన నితనిని విజితాశ్వుఁ డనిరి. ఇంద్రుఁడు మరల వచ్చి మాయచేసి తురగము నపహరించెను. అది అత్రిమహాముని యెఱింగి వీనికిఁ జెప్పెను. విజితాశ్వుఁడు మరల నింద్రు నోడించి యశ్వమును దెచ్చెను. పృథుని పిమ్మట నితఁడే రాజయ్యెను. వీనికి అంతర్ధానుఁ డను పేరుకూడ నున్నది. విజితాశ్వుని భార్య శిఖండిని. వీరికి పావకుఁడు, పవమానుఁడు, శుచి అను ముగ్గురు కుమారులు కలిగిరి. వీరు వసిష్ఠునిశాపమున త్రేతాగ్నులే వీనికిఁ బుత్రులుగాఁ బుట్టినవారు. నభస్వతి విజితాశ్వుని రెండవ భార్య. ఈమెయందు హవిర్ధానుఁడు పుట్టెను. భాగ.

వితథుఁడు:-(విరథుఁడు) భరద్వాజుఁడు.

విదముఁడు:-ఒక దనుజుఁడు. శతశృంగుని కుమారుఁడు. వీని సోదరులు దముఁడు, సదముఁడు. వీరు అంబరీషుని రాజ్యముపై దండెత్తి సుదేవునిచేఁ జంపఁబడిరి.

విదర్భుఁడు:-తనకు సంతానము లేకపోవుటచే భార్యనుగాఁ బడయఁ దలఁచి యొక కన్యను దెచ్చెను. అతని భార్యయగు శైబ్య కోపించుటచే 'నిది కోడలగు' నని పలికెను. పిమ్మట నితనికి శైబ్యయందు విదురుఁడు జన్మించెను.

విదర్భుఁడు:-జ్యామఘుని కుమారుఁడు. ఇతఁడు పుట్టకపూర్వము జ్యామఘుఁడు శత్రురాజుల నోడించి తెచ్చిన కన్యనే యితనికి వివాహము చేసిరి. ఆమెయం దీతనికిఁ గైశికుఁడు, లోమపాదుఁడు, కశుఁడు, క్రథుఁడు అను పుత్త్రులు కలిగిరి. మత్స్య.

విదురుఁడు:- అంబిక ప్రథమపుత్త్రుఁడగు ధృతరాష్ట్రుఁడు గ్రుడ్డివాఁడగుటచే నామెను వ్యాసుని వలన నింకొక కుమారుని బడయుమని సత్యవతి నియోగించెను. అంబిక యా మునిని డాయ రోసి తనదాసిని బంపెను. ఆ దాసియందు వ్యాసునకుఁ బుట్టిన కుమారుఁడే విదురుఁడు.

యముఁడు మాండవ్యునిశాపమువలన విదురుఁడుగాఁ బుట్టెను. (చూడుము యముఁడు) ధృతరాష్ట్రుఁడును, పాండురాజును విదురుని దమ సోదరునట్లే చూచుకొనుచుండిరి. ఇతఁడును వారియెడ నట్లే మెలఁగువాఁడు. విదురుఁడు ధీశాలియు, నీతిపరుఁడు నగుటచే ధృతరాష్ట్రుఁడు వీనిసహాయము నపేక్షించుచుండువాఁడు.

పాండుపుత్త్రుల సుగుణములను విదురుఁడు మెచ్చుకొని వారియెడ ననురాగుఁడై యుండువాఁడు. దుర్యోధనాదులకు వారిపై ద్వేషమున్నదనియును, వారి కపకారములు చేయుదురనియును నితఁడెఱుఁగును. కాని దుర్యోధను నేమియు ననలేఁడు. పాండవులు కాశీనగరమునకుఁ బోవు మార్గమున దుర్యోధనుఁడు లక్కయిల్లు కట్టించి యందు వారిని దగులఁబెట్టించుటకై యాలోచించుట విదురుఁ డెఱుఁగును. అందువలననే నితఁడే ముందుగ నా లాక్షాగృహమునుండి పాండవులను గొనిపోవుట కొక ఖనకుని బంపెను. లాక్షాగృహమునఁ బాండవులు చనిపోయిరని ధృతరాష్ట్రుఁడు విచారించెను. అపుడు విదురుఁడు తాఁ జేసినది చెప్పలేదు. పాండవులు ద్రౌపదిని బరిణయమయిరని వినిన పిదపనే వారిక్షేమమును గూర్చి యితఁడు ధృతరాష్ట్రునకుఁ జెప్పెను. దుర్యోధనునకుఁ బాండవభీతి కలుగుచున్నదని ధృతరాష్ట్రుఁడు విచారించి యా భీతి వాపికొను టెట్లని విదురు నడిగెను. ఇఁకనైన బాండవులను వంచనచేయక వారిరాజ్యభాగము వారికిచ్చుటే తగినమార్గమని యితఁడు చెప్పెను. ఎట్టకేలకు ధృతరాష్ట్రుని సమ్మతిని బడసి విదురుఁడు ద్రుపదునగరమునకేగి పాండవులను దోడ్కొనివచ్చెను.

ధృతరాష్ట్రుఁడు పాండవుల కర్ధరాజ్య మిచ్చెను. వారు నగరమును నిర్మించుకొని యందుండిరి. విదురుఁడు వారితోఁగాక హస్తినాపురమందే యుండెను. అయినను వారి క్షేమ

పోరయుచు వారియభివృద్ధికిని, ధర్మరాజుచేసిన యాగమునకును మిక్కిలి యానందమునొందెను. దుర్యోధనునకుమాత్ర మసూయ హెచ్చగుచుండెను. ఇతఁడుపాండవులతో జూదమాడివారిని వంచనచేసి వారిరాజ్యమును గైకొనవలెననితలంచి తండ్రితోఁజెప్పెను. ధృతరాష్ట్రుఁడేకార్యమును విదురునకుఁజెప్పక చేయువాఁడుకాఁడు. ఇతఁడు జూదముమాట వినగనే యది వైరకారణ మగు ననియును, ఆ యత్నమును మాన్పింపుమనియును జెప్పెను. కాని ధృతరాష్ట్రుఁడు పుత్త్రున కెదురాడలేక జూదమువలన హానిరాదని వీనినే వెళ్ళి పాండవులను దోడ్కొనిరమ్మనియెను. విదురుఁడు భీష్మున కీ సంగతి యెఱింగించి పాండవుల యొద్ద కేగి వారిని దీసికొనివచ్చెను. జూదమున శకునిచేరి యన్యాయము చేయుచుండెను.

విదురునిమాటలు పాటిచేయఁబడుటలేదు. మఱియు నితనినిజిన్నపుచ్చుటకే దుర్యోధనుఁడు ద్రౌపదిని సభకు దోడ్కొనిరమ్మని వీనితోఁడనే చెప్పెను. ఆ నీచకార్యముచేయుటకు విదురుఁడు తిరస్కరించెను. సభయందు ద్రౌపది వేసిన ప్రశ్నలకు ముందుగా సమాధానము చెప్పుట ధర్మమని విదురుఁడు పలికెను. కాని యెవ్వరును మాటాడలేదు.

పాండవులు వనవాసమునకరిగిరి. వారిఁక నేమి చేయుదురని ధృతరాష్ట్రుఁడు విదురు నడిగెను. "యుద్ధముచేసి వారు రాజ్యమును గైకొందురు. జూదము మాన్పుమని నేను చెప్పినను నీవు వినవైతివి. ఇపుడైనను వారిరాజ్యము వారికిచ్చి కులదూషకుఁడైన దుర్యోధనుని దూషింపుము" అని విదురుఁడు పలికెను. ఆ మాటలకు ధృతరాష్ట్రుఁడు "నీ వెప్పుడు నిట్లే పలుకుచుందువు. నీవు నాయొద్ద నుండఁజనదు. ఎందేని పొమ్ము" అని కోపముతోఁ బలికెను. విదురుఁడు రథ మెక్కి కామ్యకవనమున కేగి పాండవులను గలిసియుండెను. విదురునివిడిచి ధృతరాష్ట్రుఁ డుండలేఁడుగావున నతఁడు వీనిని గొనిరమ్మని వెంటనే సంజయుని బంపెను. వీనిని వృద్ధరాజున కుపచారము చేయుచుండు మని ధర్మరాజనియెను. విదురుఁడు హస్తినాపురమునకు మరలివచ్చెను. వీనిని ధృతరాష్ట్రుఁడు గౌరవించి తాఁబలికినయప్రియంబుల క్షమియింపుమనియెను.

అరణ్యములోనున్న పాండవులతో యుద్ధము సేయుటకును, వారి యజ్ఞాతవాసమును భంగము చేయుటకును దుర్యోధనాదులు యత్నించిరి. ఆ కార్యములను గురించి వారుగాని, ధృతరాష్ట్రుఁడుగాని విదురునితో నేమియుఁ జెప్పుటలేదు. ఇతఁడును నీవిషయముల వారితో ప్రసంగింపకయే యుండెను. పాండవులయొక్క యజ్ఞాతవాసము ముగిసినపిమ్మటఁ గృష్ణుఁడు రాయబారిగ వచ్చెను. అతఁడు విదురునింటనే భుజియించెను. ఆ సమయమున నాతఁడు దుర్యోధనాదుల తెఱం గెఱింగించెను. సంధి పొసఁగదనియే చెప్పెను. ఇతఁ డనుకొనిన యట్లు యుద్ధమేసంభవించెను. ఆ యుద్ధమం దితఁ డేపక్షమును జేరలేదు. యుద్ధమునుజూచుచు నచ్చట నుండలేక విదురుఁ డా కాలమునఁ దీర్థయాత్రలు చేయవెడలెను. అతఁడు సకలతీర్థంబులు సేవించి మైత్రేయునివలన నాత్మవిజ్ఞానంబు తెలిసికొని మగిడివచ్చెను. అప్పటికి యుద్ధము ముగిసెను. ధర్మజాది పాండుపుత్త్రులు వీనిని గౌరవించిరి. ధృతరాష్ట్రుఁడును తన పుత్త్రులు మడియుట తలఁచుకొని దుఃఖించుచుండెను. విదురుఁడు వానికి సంసారనిస్సారం బెఱింగించి వైరాగ్యంబు కల్పించెను. ఇతఁడును వానితోడనే నగరమువిడిచి తపోవనమునకేగెను. పిమ్మట ధృతరాష్ట్రునిఁగూడ విడిచి యరిగి యాహారము, జలము,వాయువునుగొనకయే తపము చేయుచుండెను. ధృతరాష్ట్రుని జూడవచ్చిన ధర్మజుఁడు ఆ విదురునిఁగూడఁ జూడఁగోరి వానిని గానక 'విదురా!' యని గట్టిగఁబిలిచెను. దిగంబరుఁడైన విదురుఁడు ధర్మజునకుఁ గోచరించెను. కాని వీరున్న యాశ్రమము వైపునకు రాక తరువులచాటుననుండి పోవుచుండెను. వీని వెంట ధర్మజుఁడు పరుగెత్తి "ఓ విదురా! నేను ధర్మజుఁడను. నన్నొకసారి కన్నెత్తి చూడుము" అని వేఁడెను. విదురుఁ డాగి ధర్మజు నొకసారి గాంచెను. తన యోగబలమున శరీరమును విడిచి ధర్మజునితనువునందుఁ బ్రవేశించెను. ఆశరీమునకు ధర్మరాజు అగ్నికార్యములు గావింపఁబోగా, యతిత్వమొందిన వానిశరీరమున కగ్నికార్యము తగదని యాకాశవాణి పలుకుటచే ధర్మజుఁడు మాని యా విశేషంబు తనవారల కెఱిఁగించెను.

భార.

విదూరథుఁడు:-ఒక రాజు. సుమతి, సునీతి యను వార లితని పుత్త్రులు. ముదావతి ఇతని కుమారిత. వీరందఱు అరణ్యములోఁ జరించుచు నొక బిలమును గాంచిరి. అది కుజంభుఁడను దనుజుఁడు పాతాళలోకమునకుఁ బోవుటకై చేసికొనిన బిలమని యచ్చటి మునులు చెప్పి వానిని సంహరింపుమని వేడిరి.

ముదావతి వనమున విహరించుచుండఁగా గుజంభుఁ డామె నెత్తుకొనిపోయి పాతాళమున దాఁచెను. ఆమెను విడిపించుటకై విదూరథుఁడు తన కుమారులను బంపెను. వీరుకూడ రాక్షసునిచేఁ బాతాళముననే కట్టఁబడియుండిరి. అంత విదూరథుఁడు తన పుత్త్రిలను, బుత్త్రికను విడిపించినవానికిఁ దనకూఁతు నిచ్చెదనని చాటించెను. వత్సంధ్రుఁడు వచ్చి పాతాళమున కేగి, దనుజుని సంహరించి వారిని విడిపించెను. విదూరథుఁ డీతనికిఁ దన కుమారిత నిచ్చి వివాహము చేసెను. మార్క.

విదూరథుఁడు:-కురుని పుత్త్రుఁడు. ఇతని భార్య సంప్రియ. ఇతని పుత్త్రుఁడు అనశ్వుఁడు. భార.

విదేహుఁడు:-(చూడుము నిమి)

విదేహుఁడు:-ఒక రాజు. ఋషభుని పుత్త్రులైన కవి, హరి, అంతరిక్షుఁడు, ప్రబుద్ధుఁడు, పిప్పలాయనుఁడు, ఆవిర్హోత్రుఁడు, ద్రమిళుఁడు, చమసుఁడు, కరభాజనుఁడు అనువారలు బ్రహ్మవిద్యావిశారదులు. వానికి భగవద్విషయంబు లనేకములు బోధచేసిరి. భాగ.

విద్యావతి:-విశ్వావసుఁడను గంధర్వుని కుమారిత. దేవతాస్త్రీలలో నుత్తములా రెవ్వరని యీమె తండ్రిని అడిగెను. మధురయందున్న మీనాక్షి యని యతఁడు చెప్పెను. ఈమె మీనాక్షిని ప్రార్థించెను. ఆమె మూఁడేండ్ల బాలికగాఁ బ్రత్యక్ష మయ్యెను. వరము వేఁడుకొనుమని యీమె యనఁగా, నీవు నా కూఁతురవుగా జన్మింపుమని విద్యావతి కోరెను. ఈ జన్మమునఁ గాదు. నీవు మలయధ్వజుని భార్యవైనపుడు నీయందు జన్మించెదనని యీమె చెప్పెను. విద్యావతియే కాంచనమాలగా జన్మించి మలయధ్వజుని భార్యయయ్యెను. స్కాంద.

విద్యుజ్జిహ్వుఁడు:- ఒక దనుజుఁడు. శూర్పణఖ భర్త. ఇతఁడు రావణునితోఁ గలసి కాలకేయులమీఁదకు యుద్ధమునకు వెళ్ళెను. విద్యుజ్జిహ్వుఁడు రావణుని యాజ్ఞచొప్పున రాముని శిరము, చాపమువంటిదానినిఁజేసి రావణున కిచ్చెను. రావణుఁడు వీనిని సీతకుఁ జూపించి రాముఁడు యుద్ధమున మరణించెనని చెప్పెను. పిమ్మట నొకప్పుడు పొరపాటున వీనిని రావణుఁడు కొట్టి చంపెను. ఇతని కుమారుఁడు జంబుకుమారుఁడు. రామా.

విద్యుత్ప్రభ:-సుప్రతీకునిభార్య. దుర్దముని తల్లి. వరా.

విద్యుద్రూపుఁడు:-ఒక రాక్షసుఁడు. ఇతఁడు భార్యతో విహరించుచుండఁగాఁ గంకుఁడను పక్షి యచ్చటకుఁ జేరెను. వీనిని బట్టుకొని విద్యుద్రూపుఁడు చంపెను. ఈ వార్త కంసునిసోదరుఁడు కందరుఁడు విని విద్యుద్రూపునికై వెదకి వీనిని బట్టుకొని సంహరించెను. విద్యుద్రూపుని భార్య మదనికి పక్షిరూపము ధరించి కందరునకు భార్యయయ్యెను. మార్క.

విద్యున్మతి:-ఒక స్త్రీ. ఈమె దిగంబరియై కొలనులో స్నానముచేయుచుండఁగా సింధుద్వీపుఁడను రాజు చూచెను. అతనిచిత్తము చలించి రేతఃపతన మయ్యెను. వరా.

విద్యున్మాలి:-త్రిపురాసురులలో నొకఁడు. (చూడుము త్రిపురాసురులు.)

విద్రుముఁడు:- ఒక బ్రాహ్మణుఁడు. అనంతుని తండ్రి. విద్రుమునకు లేకలేక వార్ధక్యమున నొక కుమారుఁడు పుట్టెను. కాని వాఁడు షండుఁడయ్యెను. వానికిపుంస్త్వము వచ్చుటకై విద్రుముఁడు శివుని ప్రార్థించెను. అనంతునకుఁ బుంస్త్వమువచ్చెను. ఈబాలుఁడు సముద్రములో స్నానము చేయుచుండఁగా మొసలి యొక్కటి లాగుకొనిపోయెను. క.

విధాత:-భృగువుకుమారుఁడు. ధాత ఇతని సోదరుఁడు. ఇతఁడు మేరువుకుమార్తెయగు నియతిని పెండ్లియాడెను. వీరికి మృకండుఁడను పుత్త్రుఁడు కలిగెను. బ్రహ్మ.

విధిసారుఁడు:-ఒక రాజు. క్షేత్రజ్ఞునికుమారుఁడు. ఇతని కుమారుఁడు అజాతశత్రువు. భాగ.

విధూరథుఁడు:- దంతవక్త్రుని తమ్ముఁడు. శ్రీకృష్ణుఁడు దంతవక్త్రుని వధించుట చూచి యితఁడును యుద్ధమునుజేసి శ్రీకృష్ణునిచేఁ జంపఁబడెను. భాగ.

వినత:-ధరణీదక్షుల కుమారిత. కశ్యపప్రజాపతి భార్య. కద్రువ యీమెసవతి. వీరిద్దఱును గర్భవతులైరి. కద్రువకుఁ గలిగిన యండములు పగిలి పిల్లలు (సర్పములు) బయటకువచ్చిరి. కాని వినత యండము లట్లేయుండెను. వినత వేచి వేచి యెంతకును దన యండములనుండి పిల్లలేర్పడకుండుటచే నొక గ్రుడ్డును బగులఁగొట్టెను. అందుండి. శరీరముయొక్క క్రిందిభాగ మేర్పడకుండ నుండిన బాలుఁడు వచ్చెను. వానిని బూర్తిగా నెదుగనీయకుండఁ దొందఱపడి వినత గ్రుడ్డును విచ్చెనుగానఁ దల్లి వేయేండ్లు తన సవతికి దాసియైయుండునట్లు ఆబాలుఁడు శపించెను. రెండవగ్రుడ్డునైనను నందుండి పుత్త్రుఁడు వచ్చువఱకు ముట్టుకొనకుండుమని నుడివి తాను వెడలిపోయెను. ఇతఁడే అనూరుఁడు. ఈమె రెండవ కుమారుఁడు గరుత్మంతుఁడు.

పుత్త్రుని శాపవశమున నీమెకు దాసీత్వము తప్పదయ్యెను. ఒకనాఁడీమెయును, గద్రువయును సముద్రతీరమున విహరించుచు నుచ్చైశ్శ్రవమును జూచిరి. చూచి, "ఆహా! ఎంత నిర్మలముగ, ధవళముగ నున్నదే!" అని వినత యనెను. దానిశరీరమున నలుపుగలదని కద్రువ యనెను. వారిలో వారు వాదించుకొని తుదకు గుఱ్ఱముశరీరముపై నలుపుండెనేని వినత కద్రువకు దాసియగునట్లును, లేనియెడల కద్రువ వినతకు దాసియగునట్లును బందెములు వేసికొనిరి. ఆనాఁడు ప్రొద్దులేకుండుటచే మఱునాఁడువచ్చి చూతమనుకొని వెళ్ళిరి. ఆ రాత్రి కద్రువ తన పుత్త్రులను బ్రతిమాలియు, శపింతునని భయపెట్టియుఁ దన కుమారుని గుఱ్ఱముతోఁకను బట్టుకొనియుండి యచ్చట నల్లగా గనఁబడునట్లు చేయుటకు నేర్పాటుచేసి పంపెను. మఱునాఁడు కద్రూవినతలు వెడలిరి. వినత ఈ మాయ యెఱుఁగక యుచ్చైశ్శ్రవమునకు నలుపుగలదని యొప్పుకొని కద్రువకు దాసి యయ్యెను. అట్లుండగనే యామెకు గరుత్మంతుఁడు పుట్టెను. అతఁడును దల్లివలెఁ గద్రువకును, గాద్రవేయులకును సేవ చేయుచుండెను. ఒకనాఁడు కద్రువచే నవమానింపఁబడి విచారముతోఁ దల్లికడకువచ్చి "మనము వీరి కేల సేవచేయుచుండవలె?" నని యడిగిన, వినత తమయొక్క పందెపువృత్తాంతమంతయును దెల్పెను. తల్లియొక్క దాసిత్వము బాపఁగోరి కాద్రవేయులతోఁ బ్రసంగింపఁగా మా కమృతము దెచ్చియిచ్చితివేని మిమ్ములను దాస్యవిముక్తులను జేసెదమనిరి. గరుత్మంతుఁడు వారి కమృతమును దెచ్చి యిచ్చి తల్లిని దాసిత్వము నుండి విడిపించెను. భార.

వినతుఁడు:- సీతను వెదకుటకై సుగ్రీవునిచేఁ దూర్పుదెసకుఁ బంపఁబడిన వానరుఁడు. రామా.

వినశనము:-ఒక తీర్థము. ద్వితుఁడు నూతంబడి యజ్ఞము చేసెను. సరస్వతీనదీజల మా నూతి యందుఁ బ్రవేశించెను. అది పుణ్యతీర్థమయ్యెను. అదియే వినశనము. అది హీనజాతులవారి కగుబడక నశించును గావున ఆ పేరు వచ్చెను. బలరాముఁ డీ తీర్థమును సేవించెను. భార.

విపులుఁడు:-ఒక బ్రాహ్మణుఁడు. దేవశర్మయను ముని శిష్యుఁడు. దేవశర్మభార్యను రుచి యను నామెను నింద్రుఁడు కామించి తిరుగుచుండువాఁడు. ఈ ముని యాగార్థము గృహమును విడిచిపోవుచు నింద్రునివలన భయము రాకుండుటకై విపులునిఁ దన భార్యయొద్దఁ గాపు పెట్టెను. ఇతఁ డామెను సదా కనిపెట్టి తిరుగుచుండువాఁడు. ఇంతకంటె సులభముగాఁ గాపాడుచుండుటకై విపులుఁడు యోగబలముచేఁ దన శరీరమును విడిచి రుచిదేహము ప్రవేశించి యామె హృదయమును స్వాధీనము చేసికొని యుండెను. ఇంద్రుఁడు విపులునిశరీరము చూచి యతఁడు నిదురవోవుచున్నాఁడని తలంచి రుచిని బలుకరించెను. రుచి శరీరమందున్న విపులుఁడే ప్రత్యుత్తరమిచ్చి యామెదేహమును విడిచి తన దేహము ప్రవేశించి ఇంద్రుని నిందించెను. ఇంద్రుఁ డదృశ్యుఁడయ్యెను. ఈదేవశర్మ మరలి వచ్చిన తరువాత విపులుఁ డింద్రుఁడు వచ్చిన సంగతిచెప్పెను. దేవశర్మ విపులుని మెచ్చుకొని

వర మిచ్చెను. పిమ్మట నొకనాఁడు విపులుఁడు గురువుపంపునఁ బువ్వులకై పోవుచు మార్గమం దొక మిథునమును, మఱి యార్గురను జూచెను. వారు జూదము నాడుచుఁ బణము నొడ్డిరి. ఓడిన వారు విపులుఁడు బొందినగతియే పొందుదుమని పందెము వేసికొనిరి. ఆ మాటలు విపులుఁడు విని యాలోచించి గురుభార్యాశరీరము ప్రవేశించుటయు, నిది గురునకుఁ జెప్పకుండుటయుఁ దన దోషమని తెలిసికొనెను. విపులుఁడు తా వినిన వచనములను గురువునకుఁ దెల్పి 'యా పలికిన వా రెవ్వరి?' రని యడిగెను. వారు రాత్రిం బవళ్ళనియు, నాఱు ఋతువులనియు, నెంత రహస్యమునైనను వారు చూతురనియు దేవశర్మ విపులున కెఱింగించెను.

విపులుఁడు:- ఒక ముని. ఇతని కుమారులు సుకృశుఁడు, తుంబురుఁడు. మార్క.

విప్రచిత్తి:- (విప్రజిత్తి) దనువు కశ్యపుల కుమారుఁడు. ఇతఁడు హిరణ్యకశిపుని సోదరియైన సింహికను వివాహ మయ్యెను. శల్యుఁడు, నభుఁడు, వాతాపి, ఇల్వలుఁడు, అంధకుఁడు, నరకుఁడు, స్వర్భానుఁడు, దంభుఁడు ఇతని కుమారులు. ఇతనికి మాహిష్మతి యను కుమారితకూడఁ గలదు. విష్ణు. శివ. వరా.

విభండకుఁడు:- (చూడుము విభాండకుఁడు)

విభాండకుఁడు:- కశ్యపుని పుత్త్రుఁడు. ఇతఁడు బ్రహ్మచర్యమునే జరుపుచుఁ దపస్సు చేసికొను వాఁడు. ఒకనాఁ డితఁడు స్నానము చేయుచుండఁగా నూర్వశి యితనికంటఁ బడియెను. ఆ సుందరిని జూడఁగా విభాండకునకు రేతఃపతనమై యా వీర్యము జలమునఁ బడెను. ఆ నది యందు దాహము ద్రాగుచుండిన మృగమొకటి విభాండకుని వీర్యమును జలముతోఁ ద్రాగెను. ఆ మృగముగర్భమున నితని వీర్యము వలన ఋశ్యశృంగుఁడు పుట్టెను.

ఇతనిని, నితని యాశ్రమమును దప్ప నన్య మెఱుంగక ఋశ్యశృంగుఁడు తపము చేయుచుండువాఁడు. ఒకనా డగ్నిని వేల్వఁ బుత్త్రుని నియోగించి వనఫలములకై యితఁ డరిగెను. ఋశ్యశృంగుఁడు వేశ్యాంగనలను జూచి వారినిఁ గూర్చియే చింతించుచుండెను. కాలహరణము చేసెను. ఆ క్రొత్తఋషుల రూపములను, వారిచ్చిన ఫలములనుగూర్చి చింతించుచు నాలస్యము చేసితి నని ఋశ్యశృంగుఁడు చెప్పెను. "మన తపస్సును బాడుచేయుటకై రాక్షసు లనేకమాయలు కల్పింతురు. వారు ఇచ్చినవి మనము విసర్జింపవలయును" నని చెప్పి చనియెను. ఋశ్యశృంగుఁడు అంగదేశమునకుఁ బోయెను. తండ్రియగు నితఁడు పుత్త్రునికై వెదకి వెదకి వానినిఁ గానక తుద కట్లో వానినిగాంచి కొడుకును, గోడలిని దన యాశ్రమమునకుఁ గొనివచ్చెను. భార.

విభావసుఁడు:- ఒక బ్రాహ్మణుఁడు. పిత్రార్జిత విత్తమును బంచియిమ్మని వీనితమ్ముఁడు సుప్రతీకుఁడడుగగా నీతఁడీయక కోపించి యేనుఁగవై యుండుమని తమ్ముని శపించెను. సుప్రతీకుఁ డితనినిఁ గచ్ఛపమువై యుండుమని ప్రతిశాప మిచ్చెను. వీరిరువు రా వికృత రూపముల నొందియుఁ దగవు లాడుకొనుచునే యుండిరి. గరుత్మంతుఁ డమృతార్థ మరుగుచు వీనిని రెండింటిని బాదములతోఁ బట్టుకొని యాకాశ మార్గమున నెగసి నిర్జనారణ్యమునఁ బెట్టి భుజించెను. భార.

విభీషణుఁడు:- కైకసికి విశ్రవో బ్రహ్మవలనఁ బుట్టిన మూడవ కుమారుఁడు. తనకుఁ బుట్టు కుమారు లందఱు దుర్మార్గులే యయ్యెదరా యని కైకసి విచారింప, నామె కనిష్ఠపుత్త్రుఁడు సుగుణాఢ్యుఁ డయ్యెఁడు నని విశ్రవసుఁడు చెప్పెను. (విభీషణుఁడు మాలిని యనుదాని యందు విశ్రవసునకుఁ బుట్టిన కుమారుఁడు. రావణ కుంభకర్ణు లితని యేకోదరులు కారు. వారు పుష్పోత్కట కుమారులు.) విభీషణుఁడు తన సోదరులవలె దుర్మార్గుఁడు కాఁడు. అన్నల వలె నితఁడు బ్రహ్మనుగూర్చి తపస్సును జేసెను. ఇతఁడు శైలూషుఁడను గంధర్వునిపుత్త్రిక యైన సరమను వివాహమయ్యెను.

రావణుఁడు చేయు దుష్కార్యములలో విభీషణుఁడు చేరువాఁడు కాఁడు; మఱియు నాతఁ డొనరించిన క్రూరకార్యముల కాతని నిందసేయువాఁడు. రావణుఁడు పరాంగనలను దెచ్చినపు డది తగదని బోధించెను. కాని యాతఁ డీతని మాటను వినలేదు. రాముఁడు

యుద్ధముచేయుటకు వచ్చుచున్నాఁడని వినఁగానే రావణుఁడు మంత్రులతో సభచేసెను. సీతను రామునికిచ్చివేయుమనియు, రామునితో యుద్ధముచేసి గెలువలేమనియు విభీషణుఁడే చెప్పెను. ఆ మాటలకు రావణునకుఁ గోపము వచ్చి వీనిని గొట్టఁబోయెను. అంత విభీషణుఁడు లంకను విడిచి సముద్రముదాటివచ్చి రామునిఁ జేరెను.

సముద్రము నెట్లు దాటుటని రాముఁ డాలోచించుచుండఁగా నితఁడే సముద్రునిఁ బ్రార్థించుమని యాలోచనచెప్పెను. మఱియు నితఁడు లంకలోని గుట్టుమట్టుల నన్నియుఁ జెప్పుచుండువాఁడు. రావణుఁడు పాతాళహోమము చేయఁబోవుట నెఱింగి యా యాగము పూర్తియయ్యెనేని వానిని గెల్చుట యసాధ్యమనియును, యాగభంగము కావింపుమనియును జెప్పెను. మఱియు రాముఁ డెంత కొట్టినను రావణుఁడు మరణింపకుండుట కాతఁడు విషాదాశ్చర్యములను బొందుచుండ రావణుని నాభికడ నమృతము కలదనియును, వానిని నాభికడఁ గొట్టుమనియును నితఁడు చెప్పెను. ఇతని సహాయము లేకపోయెనేని రామునకు రావణుని జయించుట సాధ్యము కాకపోయెడిది. రావణుఁడు మరణించినపిదప విభీషణునకే లంకాపట్టాభిషేకము చేసిరి. ఇతఁడు చిరకాలము లంకను పాలించెను. విభీషణుఁడు రామభక్తుఁ డయ్యెను.

ధర్మరాజు రాజసూయము చేయునప్పుడు సహదేవుఁ డీతనికడకు దూతను బంపెను. విభీషణుఁడు పెక్కుధనము లిచ్చి పంపెను.

రామా. భార.

విభుఁడు:- స్వారోచిషమనుకాలమున విష్ణుమూర్తి వేదశిరుఁడను విప్రునికుమార్తె దుషిత యను నామెకు విభుఁడను పేరుతో జన్మించి "కౌమారిక బ్రహ్మచారి" యగుచు వ్రతమొనరించెను. భాగ.

విభువు:- ప్రత్యూషుఁడను వసువు కుమారుఁడు. మత్స్య.

విమర్దుఁడు:- ఒకరాజు. ఇతఁడు సురాష్ట్రు నోడించి యతనిరాజ్యమును గైకొనెను. మార్క.

విరజ:- గోలోకమం దొకవనిత. ఈమె పుత్త్రులే సప్తసముద్రము లైరి. ఈమెయును రాధవలెనే యుండును. ఈమెను శ్రీకృష్ణుఁడు వలచెను. శ్రీకృష్ణుని నీమె ప్రేమించెను. వీరిద్దఱు నొక్కచోట నుండఁగా రాధ వచ్చెను. కృష్ణుని పార్శ్వదుఁడు సుదాముఁడు ద్వారముకడనుండి, రాధను లోపలకు వెళ్ళవలదనెను. కాని రాధ ప్రవేశించెను. ఈమెను జూచి కృష్ణుఁ డంతర్ధానము నొందెను. విరజ నదీరూపమును దాల్చెను కృష్ణుఁడు విరజను వదలి విరహవేదనచే బాధపడుచు నదీరూపమున నున్న విరజకడ కేగి దుఃఖించుచుండెను. ఆమె స్త్రీరూపమున వచ్చి కృష్ణునిఁ గౌఁగిలించుకొనియెను. కృష్ణునివలన నీమె కేడ్వురుపుత్త్రులు పుట్టిరి. వీరందఱాడుకొనుచుండఁగాఁ గడపటివాఁడు అన్నలతోఁ బోరాడెను. వీఁడు తల్లికడకు వచ్చి యేడ్చెను. అపుడీమె శ్రీకృష్ణునితో నుండెను. పుత్త్రుని వాని యన్నలకడ దిగఁబెట్టుటకై యీమె కృష్ణుని వదలి వెళ్ళెను. విరజ మరలి వచ్చునప్పటికిఁ గృష్ణుఁ డచ్చటనుండి వెడలిపోయెను. శ్రీకృష్ణునితో నెడఁబాపున కామె పుత్త్రులే కారణమని కుమారులపైఁ గోపించి వారిని సప్తసముద్రములు కండని శపించెను. పిమ్మట నామె శ్రీకృష్ణునిగూర్చి కూడ పరుషములాడెను. అతని నేల నిందించెదవని సుదాముఁ డనఁగా వానినిగూడ నీవు రాక్షసుఁడవై పుట్టుమని శపించెను. అందువలన సుదాముఁడు శంఖచూడుఁడుగఁ బుట్టెను. బ్ర. వై.

విరజుఁడు:- కద్రువ కుమారుఁడు. భార.

విరజుఁడు:- గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు.

విరజుఁడు:- గంగ కుమారుఁడు. భాగ.

విరజుఁడు:- జాతుకర్ణి శిష్యుఁడు. ఋగ్వేదభాగము నుపదేశము నొందెను. భాగ.

విరజుఁడు:- విష్ణువుయొక్క మానస పుత్త్రుఁడు. నీతిశాస్త్రము పుట్టినతరువాత ఆ యాచారము నడుపుటకై విష్ణుమూర్తి వీనిని గలిగించెను. కాని విరజుఁడు భూలోకమునకు రానిచ్ఛగింపలేదు. ఇతనికుమారుఁడు కర్దముఁడు. భార.

విరాటుఁడు:-(చూడుము ధర్మపక్షులు.)

విరాటుఁడు:-మత్స్యదేశాధిపతి. శతానీకుఁడు, హేమవర్మ, సూర్యదత్తుఁడు ఇతని తమ్ములు. విరాటునిభార్య సుధేష్ణ. వీరికి ఉత్తరుఁడను కుమారుఁడును, నుత్తర యను కుమారికయును గలరు.

పాండవు లజ్ఞాతవాసముచేయుటకై మాఱు వేషములతో, మాఱుపేరులతో నీతని నగర మునకేవచ్చి యితనియొద్దనే సేవకులుగానుండిరి. విరాటుఁ డదివఱకే పాండవులనుగుఱించి విని యుండినను మాఱువేషములతో వచ్చినవారిని గుర్తింపలేకపోయెను.

విరాటరాజు బావమఱఁదియగు సింహబలుఁడు ద్రౌపదిని బలాత్కారముగఁ బట్టుకొనఁబోఁగా నామె పరుగిడివచ్చి విరాటునికొలువులోఁ బడెను. అతనితోఁ జెప్పికొనెను. కాని సింహ బలునకు భయపడినవాఁడగుటచే విరాటుఁడతని నేమియు ననలేకపోయెను. మఱియు సైరంధ్రి భర్తలు కీచకుని, నుపకీచకులను జంపిరని విని యామెను దన కొలువునం దుంచుకొనుటకు భయపడెను. ఆమె నెచ్చటికేని పొమ్మనిచెప్పు మని విరటుఁడు తన భార్యతోఁ జెప్పెను. ఇతఁ డంత ధైర్యసాహసములు గలవాఁడుగఁ దోఁచఁడు. ఇతనినగరముననే పాండవు లుండి యుందురని దుర్యోధనాదులు గ్రహించి దానిని స్పష్టము చేసికొనుటకై యితని గోవులను బట్టవచ్చిరి. ఇతఁడు వారితో యుద్ధముచేసి యోడిపోయెను. భీముఁ డీతనిని విడిపించి తీసికొనివచ్చెను. తిరిగి నగరమునకు వచ్చు నప్పటికి నుత్తరుఁడుకూడఁ గౌరవులతో యుద్ధముచేయుటకు వెడలెనని విని మిక్కిలి విచారించెను. బృహన్నల వెంటనుండఁగా నుత్తరున కెట్టిభయమునురాదని కంకుఁడు (ధర్మ రాజు) చెప్పెను. రాజకుమారునిగాక సారథిని బొగడుచుండుటచే విరాటునకుఁ గోపమువచ్చి కంకుని పాచికలతోఁ గొట్టెను.

పాండవుల యజ్ఞాతవాస మొక్క సంవత్సర మును ముగిసినది. మఱునాఁడు పాండవులు తమ యథారూపములతో వచ్చి కొలువుమందిరమునఁ జేరిరి. ధర్మరాజు సింహాసనముపైఁ గూర్చుండెను. విరాటుఁడు వచ్చి చూచి "కంకున కింత గర్వమేల వచ్చె ?" నని పలికెను. కాని యీతఁడు ధర్మ రాజగుటయును; వలలుఁడు, బృహన్నలయు భీమార్జునులగుటయును జెప్పఁబడియెను. అంత నితఁ డాశ్చర్యము, నానందము నొంది తాను తెలియక ధర్మరాజును గొట్టినందుకు మిక్కిలి విచారించి యీతప్పు సైరింపుమని ప్రార్థించి తన రాజ్యమునుకూడ నతనిని గైకొను మనియెను. తన కుమారితను నర్జునున కిత్తుననియెను. కాని యర్జునుఁడు తన కుమారునకిమ్మనిచెప్పెను. ఉత్తరను అభిమన్యునకిచ్చి వివాహముచేసిరి.

ఇతఁడు పాండవులకు మిత్రుఁడై యుద్ధ మందుఁగూడ సహాయముచేసెను. యుద్ధములో ద్రోణుఁ డీతనిని సంహరించెను. భార.

విరాధుఁడు:- ఒక రాక్షసుఁడు. తుంబురుఁ డను గంధర్వుఁడే కుబేరునిశాపమువలన నిట్లుపుట్టెను. ఈ రాక్షసుఁడు దండకారణ్యములో నుండు వాఁడు. సీతారామలక్ష్మణులు పోవుచుండఁగా వీఁడు చూచి జానకిని వరించెదనని వారిమీఁద కేగెను. రామలక్ష్మణులు వీనిని బాణములతోఁ గొట్టి చంపిరి. దానితో శాపవిమోచనమై తన పూర్వరూపమును ధరించి వీరికి నమస్కరించి శరభంగుఁడను మునికడకు వెళ్ళుఁడని వీరికిఁజెప్పి యితఁడు తనదారిని బోయెను. రామా.

విరాధుఁడు:- జయుని కుమారుఁడు. వీనితల్లి శతహ్రద. రామా.

విరూపాక్షుఁడు:- మధువ్రజపురమున నుండు నొక దనుజుఁడు; నాడీజంఘుఁడను బకునికి మిత్రుఁడు. నాడీజంఘుఁ డితనికడకు నొక ధనార్థియైన బ్రాహ్మణునిఁ బంపెను. ఆ బ్రాహ్మణుఁడు దుర్మార్గుఁడగుటచే వానికి నీయఁదలఁచుకొనక పోయినను మిత్రుఁడు పంపుటచే వానికి ధన మిచ్చెను. ఆబ్రాహ్మణునిచేతనే నాడీజంఘుఁడు చంపఁబడుట యితఁడు విని యా బ్రాహ్మణుని బట్టి భక్షింపుఁడని తన దనుజుల కాజ్ఞయిచ్చి మిత్రున కగ్నిసంస్కారములుగావించెను. బ్రహ్మ కృపచేఁ బాలు ద్రావుచుండిన దూడమూతినుండి నురుఁగు చితిపైఁ బడఁగా నాడీజంఘుఁడు బ్రతికి వచ్చెను. భార.

విరూపాక్షుఁడు:- మాల్యవంతుని పుత్త్రుఁడు: రావణునిపక్షముచేఁ బోరాడెను. యుద్ధములో వీనిని సుగ్రీవుఁడు సంహరించెను. రామా.

విరూపుఁడు:- అంబరీషుని పుత్త్రుఁడు. ఇతని కుమారుఁడు పృషదశ్వుఁడు. భాగ.

విరోచనుఁడు:- దుర్జయుఁడను రాజు యొక్క మంత్రి. రాజుతో వేఁటకు, గౌరముఖునియాశ్రమమునకును వెళ్ళెను. ఏ మణిప్రభావమువలన ముని యచ్చట నగరమునిర్మించి విందుచేయఁగలిగెనో, యామణిని దుర్జయుఁడుకోరఁగా నితఁడు వెళ్ళి మునినడిగెను. కాని ముని యీయలేదు.

విరోచనుఁడు:- ప్రహ్లాదునకు దేవి అను భార్య యందుఁగలిగిన పుత్త్రుఁడు. ఇతని కుమారుఁడు బలి.

విరోచనుఁడును, సుధన్వుఁడును నొక కన్యా ప్రతిగ్రహము నిమిత్తమున "నన్ని గుణములందును నేనుపెద్దను, నేను పెద్దను" అని తగవులాడి దానినిదీర్చుకొనుటకై ప్రహ్లాదునిదగ్గఱకుఁ బోయిరి. సుధన్వుఁడే పెద్దయని యతఁడు చెప్పెను. భాగ.

వివింశతి:-చాక్షుషుని కుమారుఁడు. ఇతనిపుత్త్రుఁడు రంభుఁడు. భాగ.

వివింశుఁడు:-వింశునికుమారుఁడు. వీనికిఁ బదుగురు పుత్త్రులు. వీరిలోఁ బెద్దవాఁడు ఖనినేత్రుఁడు. భార.

విశల్యకరణి:- ఒక యౌషధము. ఇంద్రజిత్తుచేఁ గొట్టఁబడిన రామలక్ష్మణుల శరీరములలో శల్యములను సుగ్రీవుఁడీ యౌషధమువలననే తీసివేసెను. భార.

విశాఖయూపుఁడు:- కల్కియొద్ద ధర్మములఁ నేర్చుకొనినవాఁడు. క

విశాఖరూపుఁడు:- ప్రద్యోతనుఁడను రాజు యొక్క కుమారుఁడు. ఇతనితర్వాత నితని పుత్త్రుఁడైన నందివర్ధనుఁడు రాజ్యమేలెను. భాగ.

విశాఖుఁడు:-ఇంద్రుఁడు కుమారస్వామితోఁ బోరాఁడి యాతనిపై వజ్రాయుధ మేసెను. అది కుమారస్వామి దక్షిణపార్శ్వము తాఁకెను. అందుండి కాంచనవర్ణుండును, మేషవదనుండును నగు నొకఁడు పుట్టెను. అతఁడే విశాఖుఁడు. భార.

విశాల:-విశాలరాజు కుమారిత. ఈమె స్వయంవరమునకు అవీక్షిత్తుకూడ వచ్చెను. ఇతనినిజూచి తక్కిన రాజపుత్త్రులోర్వఁజాలక వారంద ఱొక్కపై యితనితోడఁ బోరి యితనిని బంధించిరి. విశాల యవీక్షిత్తునుదప్ప నితర రాజకుమారుని వరింపదయ్యెను. అవీక్షిత్తుతండ్రి కరంధముఁడు వచ్చి కుమారుని బంధవిమోచనునిఁ గావించెను. విశాలవలపు నెఱిఁగి కరంధముఁడుకూడ నామెను బరిగ్రహింపుమని కుమారునితోఁ జెప్పెను గాని యామె కన్నులయెదుటనే తా నోటువడియెను గాన నామెను బరిణయముకానని, యవీక్షిత్తు బ్రహ్మచర్యవ్రతము పూని వెడలెను. తరువాత జన్మమునకైన నవీక్షిత్తే భర్తగా లభించుటకై తపముచేయఁగోరి విశాల తండ్రియనుజ్ఞనుగైకొని వనమునకేగి తపస్సుచేసికొనుచుండెను.

తపస్సుచే నీమె కృశించిపోవుచుండఁగా దేవదూత యొకఁడు వచ్చి "నీ కడుపున మహారాజొకఁడు పుట్టఁగలఁడు. నీ శరీరమును బోషణము చేయుము" అని చెప్పెను. తాను బరిణయము కాఁగోరిన రాజు బ్రహ్మచర్యవ్రతము పూని యుండఁగా నిది యెట్లు తటస్థించునని యీమె వెఱఁగొందియుండెను.

ఈమె యొకనాఁడు గంగానదిలో స్నానము చేయుచుండఁగా నాగేంద్రుఁడు వచ్చి యీమెను నాగలోకమునకుఁ గొనిపోయెను. అచ్చటఁ బన్నగము లీమెచుట్టును చేరి ప్రార్థించి "విశాలా! నీ కుమారుఁడు పన్నగవధ చేయఁబోవును. అప్పుడు వానిబుద్ధి మరలించి మమ్మును గాపాడుము" అని యురగములు కోరెను. విశాల సరే యనియెను. ఈమెకు భూషణాదులిచ్చి యురగులు పంపిరి.

ఈమె నాగలోకమునుండి వచ్చినపిమ్మట దృఢకేశుఁడను దనుజుఁ డీమెను బట్టుకొని బాధించుచుండెను. అంత నీమె "అవీక్షిత్తు భార్యను, కరంధముని కోడలను, నన్ను రక్షింపరే!"

యని బిగ్గఱగా నేడ్చెను. వేటకు వచ్చియున్న యవీక్షిత్తు ఈమె యార్తనాదము విని డగ్గఱి దనుజుని సంహరించెను. అవీక్షిత్తు దృఢకేశుని సంహరించి దేవతలను వరము వేఁడఁగా నీమె యందే యతనికిఁ బుత్త్రుఁడు పుట్టునని వా రనుగ్రహించిరి. దేవతలవలన నీమెయే విశాల యని యతఁ డెఱింగి యీమె వృత్తాంత మారసి యథాశాస్త్రముగా వివాహము చేసికొనుటకై తన నగరమునకుఁ బోవుండగా విశాలకుఁ బూర్వపుజన్మమునఁ దండ్రియైన గంధర్వరాజు వచ్చి వీరినిఁ దన నగరమునకుఁ గొనిపోయి పరిణయ మొనర్చెను. ఈమెకు మరుత్తు అను పుత్త్రుఁడు పుట్టెను. మరుత్తు సర్పములను సంహరించునపుడు ఆవివచ్చి విశాలను దనప్రతిన నిలుపుకొనుమని కోరెను. ఈమె తన భర్తతోఁ జెప్పి కుమారునకుఁ జెప్పించెను. ఈమె పూర్వ జన్మమున భామిని. (చూ. భామిని) మార్క.

విశాలపురము:–విశాలరాజ్యముయొక్క రాజధాని.

విశాలాక్షుఁడు:–విరూపాక్షుఁడే యీ నామమున నావిర్భవించెను. నీతిశాస్త్రము పూర్తిగఁ బఠించుటకు మనుజులకు నాయువు చాలదని యితఁడు దానిని బదివేల యధ్యాయములు మాత్రము కలదానినిగఁ జేసెను. భార.

విశాలాక్షుఁడు:–గాంధారీ ధృతరాష్ట్రులపుత్త్రుఁడు. భార.

విశాలుఁడు:– అలంబుసయందు ఇక్ష్వాకునకుఁ బుట్టిన కుమారుఁడు. ఇతఁడు నిర్మించిన నగరము విశాలనగరము. ఇచ్చటనే పూర్వము ఇంద్రుఁడు దితిని సేవించుచు ఆమెగర్భమును బ్రవేశించి పిండమును వధించెను. విశాలుని పుత్త్రుఁడు హేమచంద్రుఁడు. రామా.

విశాలుఁడు:–తృణబిందునకు సతిని మనుమరాలైన నలంబుసయందుఁ బుట్టిన కుమారుఁడు. ఇతఁడే వైశాలి యను నగరమును నిర్మించి పాలించెను. ఇతని పుత్త్రుఁడు హేమచంద్రుఁడు. విష్ణు. భార.

విశాలుఁడు:–విశాలపట్టణపురాజు. ఇతఁడు బ్రాహ్మణులను రావించి, "నే నెన్నో యన్నదానములు చేసితిని; అయినను నాకుఁ బుత్త్రులు కలుగలేదు. నేనేమిచేసినఁ బుత్త్రులను బడయఁగల్గుదును?" అని యడిగెను. "గయలోఁ బిండప్రదానము చేయు" మని వారు చెప్పిరి. విశాలుఁడు గయలోఁ బిండప్రదానము చేయఁగా సిత రక్త కృష్ణ వర్ణములు గలవారు ముగ్గు రాతనికి గోచరించిరి. మీ రెవ్వరని విశాలుఁ డడుగఁగా సితవర్ణము గలవాఁడు "నేను నీతండ్రిని. ఈ రక్తవర్ణముగల వాఁడు నీ తాత. మేము బ్రాహ్మణులను బాధ పెట్టి పరదారసంగమును గోరియుండుటచే నరకమున నుంటిమి. ఈకృష్ణవర్ణమువాఁడు నీ ప్రపితామహుఁడు. ఇతఁడును పాపములు చేయుటచే నరకముననే యుండెను. నాపుణ్యవశముననే నీవు గంగలోఁ బిండప్రదానము చేయుట కలిగెను. ఆ ఫలము పొందుటచే మేము నరకమునుండి వచ్చి పితృలోకమునకుఁ బోవుచు నిన్నుఁ జూడవచ్చితిమి" అని చెప్పిరి. పరా.

విశోకుఁడు:–భీముని సారథి. భార.

విశ్రవసుఁడు:–పులస్త్యునకుఁ దృణబిందుని కుమార్తెయందు జన్మించిన కుమారుఁడు. పులస్త్యుఁడు పఠియించు శ్రుతిని వినినపుడే యీ బాలుఁ డామె గర్భగుఁడయ్యెఁ గాపున వీనికి విశ్రవసు వను పేరువచ్చెను. (చూడుము పులస్త్యుఁడు) ఇతఁడు చిన్నవాఁడే నిష్ఠాపరుఁడై తపస్సుచేసి బ్రహ్మయయ్యెను. ఇతఁడు మూడవ బ్రహ్మ. భరద్వాజుఁడు తన పుత్త్రికను దేవవర్ణిని నీనికిచ్చి వివాహముచేసెను. ఆమెయం దితనికి వైశ్రవణుఁడు పుట్టెను. (విశ్రవసున కిలబిల యందుఁ గుబేరుఁడు పుట్టెను.)

పులస్త్యుని కుమారుఁడైన వైశ్రవణుఁడు తాత యగు బ్రహ్మనుగూర్చి తపముచేయుటచేఁ బులస్త్యునకుఁ గోపమువచ్చి నిజశరీరంబునం దర్ధంబున విశ్రవసుని సృజియించి వైశ్రవణున కపకారము చేయుమనెను. అది యా వైశ్రవణునకుఁ (కుబేరునకు) దెలిసి విశ్రవసునికడకువచ్చి, "దేవా! నేను నీకుఁ బుత్త్రుఁడ నగుదును. నను గరుణింపుము" అని వేఁడి యీతనికిఁ బుష్పోత్కట, మాలిని, పాక అను ముగ్గురు స్త్రీల నిచ్చెను. విశ్రవసునకుఁ బుష్పోత్కటయందు రావణ కుంభకర్ణులును, మాలినియందు విభీషణుఁడును, పాకయందు ఖరుఁడును, శూర్పణఖయును జన్మించిరి. భార.

విశ్రవసుఁడు:–తపస్సుచేసికొనుచుండఁగా సుమాలియు, సతనికూఁతురు కైకసియు రథమునీఁదఁ

బోవుచు నితనిని జూచిరి. ఇతనికిఁ దనకూఁతు నీయఁదలఁచుకొని సుమాలి యామెను నితని కడకుఁ బంపెను. కైకసి వచ్చి యితనికి బరిచర్యలు చేయుచుండఁగా నితఁడు నీ వెవ్వరివని యడిగెను. "నేను సుమాలి కూఁతురను. కైకసి యనుదానను. పుత్త్రునిఁగోరి వచ్చితిని. అనుగ్రహింపుము" అని యీమె పలికెను. సంధ్యాకాలమునం దట్లు కోరుటచే, నీకుఁ బుట్టువారలు రాక్షసు లగుదురని ఇతఁడుచెప్పెను. ఆమెయందితనికి రావణుఁడు, కుంభకర్ణుఁడు, విభీషణుఁడు, శూర్పణఖయుఁ బుట్టిరి. ఉ. రా.

విశ్వ:-దక్షునికూఁతురు. ధర్మునిభార్య. విశ్వదేవతల తల్లి. మత్స్య.

విశ్వకర్మ:- వస్తువు అను వసువునకు ఆంగిరసయందుఁ బుట్టిన కుమారుఁడు. ఇతనికి ఆకృతి యను సతియందుఁ జాక్షుఁడు అను మనువు జనించెను. భాగ.

విశ్వకర్మ:-ప్రజాపతి. ఇతనితనయ 'బర్హిష్మతి.' ఈమె ప్రియవ్రతుని భార్య. భాగ.

విశ్వకర్మ:-దేవశిల్పి. ప్రభాసుఁడనువసువు కుమారుఁడు. ఇతనితల్లి బృహస్పతి చెలియలగు యోగసిద్ధి (ప్రభ). ఇతఁడు ప్రహ్లాదిని వివాహమయ్యెను. సూర్యునిభార్య యగు సంజ్ఞ విశ్వకర్మ కుమారిత. సుగ్రీవునికొలువులోనుండిన నలుఁడను వానరుఁడు ఇతని కుమారుఁడు. ఇతనికి విశ్వరూపుఁడను మఱియొక కుమారుఁడు కలఁడు. విశ్వకర్మ దేవతలకుఁ గావలసిన హర్మ్యములు, నగరములు, రథములు, ఆయుధములు మొదలగునవి చేసి యిచ్చుచుండును. సంజ్ఞ సూర్యతేజస్సునకుఁ దాళలేకపోవుటచే సూర్యుని విశ్వకర్మ సానఁబట్టెను. ఆ రాలిన చూర్ణముతోడనే విష్ణుమూర్తి యాయుధమైన చక్రము చేయఁబడెను. ఇంద్రుఁడితనిని బిలిచి పాండవులకు నగరమును నిర్మించి యిమ్మనియెను. ఇతఁడు భూలోకమునకు వచ్చి యింద్రప్రస్థమును నిర్మించి యిచ్చెను.

ఒకనాఁడు విశ్వకర్మ రథమెక్కిపోవుచు సింగారించుకొని తనకొంకునింటికి బోవుచున్న ఘృతాచిని జూచెను. ఇతనిచిత్తము చలించెను. కోసుకేళికై ఘృతాచినిఁ బిలిచెను. కాని యామె నిరాకరించెను. విశ్వకర్మకుఁ గోపమువచ్చి ఘృతాచిని శూద్రయోనియందు జన్మింపుమని శపించెను. నీవు భూలోకమునఁ బడుదువని యామె ప్రతిశాపమిచ్చెను. శాపము మరలింపుమని యితఁడు వేఁడెను. భూలోకమున జన్మించినను నతఁడు బ్రాహ్మణుఁడుగాఁ బుట్టునని బ్రహ్మ చెప్పెను. ఇతఁడు బ్రాహ్మణుఁడుగాఁ బుట్టి ప్రయాగయందు జపముచేసికొనుచుండెను. ఘృతాచి యొక గోపకాంతగాఁ బుట్టెను. ప్రయాగతీర్థముకడ నీమె యా బ్రాహ్మణునకుఁ గనఁబడెను. అతఁడు పూర్వవృత్తాంతము జ్ఞాపకముచేసికొని యామె ఘృతాచియగుట తెలిసికొని యామెతో రమించెను. ఆమెకుఁ బుట్టిన పుత్త్రులే కంచరులు, వండ్రంగులు, కంసాలులు నయిరి. బ్ర. వై.

విశ్వగంధుఁడు:-అసేనసుని పుత్త్రుఁడగు పృథుని పుత్త్రుఁడు. ఇతనికుమారుఁడు చంద్రుఁడు. భాగ.

విశ్వరూపుఁడు:-విశ్వకర్మ కుమారుఁడు. ఇతఁడు సూర్యునిపుత్త్రికయైన విష్టిని వివాహమయ్యెను. గండుఁడు, అతిగండుఁడు, రక్తాక్షుఁడు, క్రోధనుఁడు, దుర్ముఖుఁడు అనుకుమారులును, హర్షణ యను కుమారితయుఁ బుట్టిరి. ఇతనికిఁ బ్రమతి యను కుమారుఁడుకూడఁ గలఁడు. బ్రహ్మ.

విశ్వరూపుఁడు:-ఇతని తల్లి దనుజకాంతయైన రచన. బృహస్పతికి నింద్రునిపై కోపమువచ్చి యంతర్ధానుండై యుండెను. ఆ సమయమున దానవు లింద్రుని పురముపైఁ బడిరి. తపస్సు చేసికొనుచున్న విశ్వరూపుని నింద్రాదిదేవతలు ప్రార్థించి తమకుఁ బురోహితునిఁగాఁ దెచ్చుకొనిరి. "శ్రీమన్నారాయణకవచ మంత్ర" ప్రభావంబున దేవతలయొక్క సంపదలు ద్విగుణంబులగునట్లితఁడు కావించెను. ఆ బలంబుచే దేవతలు దానవుల నవలఁద్రోలిరి. భాగ.

విశ్వరూపుఁడు:-త్వష్టప్రజాపతియొక్క కుమారుఁడు. ఇతనికి మూడుశిరస్సులు కలవు. వానితో గ్రమముగ నితఁడు సోమపానము, సురాపానము, అన్నపానము చేయుచుండును. ఇంద్రాదులితనిని గురువుగా భావించి పూజించుచుండిరి. దానవులుకూడ నితనికి దాయాదు లగుటచే

వారొసర్చిన పూజల నితఁడందుకొని దేవతలతోఁ గలసి కైకొనిన యజ్ఞభాగము వారికి నిచ్చుచుండెను. అయ్యది ఇంద్రుఁడు సహింపలేక వీని శిరములు ఖండించెను. ఒక తల కపింజల పక్షి యయ్యెను. రెండు శిరములు తిత్తిరిపిట్టలయ్యెను.

విశ్వరూపుఁడు:- ఇంద్రున కపకారము చేయు తలంపుతోడనే త్వష్టృప్రజాపతి విశ్వరూపుని సృజించెను. విశ్వరూపుఁ డింద్రపదవిని గోరి తపస్సు చేయుచుండెను. అది తెలిసికొని యింద్రుఁడు వీని తపోభంగము చేయుటకై రంభాది యప్సరసలను బంపెను. విశ్వరూపుఁడు వారికి లొంగకున్న నింద్రుఁడే స్వయముగ వెళ్ళి తపస్సుచేసికొనుచున్న వాని శిరమును ఖండించెను.

విశ్వసఖుఁడు:-వ్యుషితాశ్వుని కుమారుఁడు. ఇతని కుమారుఁడు హిరణ్యనాభుఁడు. రఘు.

విశ్వసహుఁడు:-మూలకుని కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు ఖట్వాంగుఁడు. భాగ.

విశ్వసాహ్వుఁడు:-మహాస్వంతుని కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు మహాబలుఁడు. భాగ.

విశ్వానరుఁడు:- ఒక బ్రాహ్మణుఁడు. ఇతని భార్య శుచిష్మతి. ఇతఁడు శివుని బ్రార్థించి యతని యనుగ్రహమునఁ గుమారుని బడసెను. అతఁడే వైశ్వానరుఁడు. కాశీ.

విశ్వామిత్త్రుఁడు:-గాధిపుత్త్రుఁడు. గాధికుమారిత సత్యవతి తన కొక కుమారుఁడును, దన తల్లి కొక కుమారుఁడును గలుగవలయునని వేఁడెను. ఋచీకుఁడు సత్యవతిని మేడిమ్రానును, నామె తల్లిని రావిమ్రానును గౌగిలించుకొనుఁడని చెప్పెను. వీరు దానికి భిన్నము గావించిరి. ఋచీకుఁడు సత్యవతికిని, నామె తల్లికిని వేఱు వేఱు చరువుల నిచ్చెను. సత్యవతి కిచ్చిన చరువును గాధిభార్య భక్షించెను. ఇట్లు విపరీతము చేయుటచే గాధి కుమారుఁడు క్షత్త్రియుఁడయ్యును బ్రాహ్మణ స్వభావము కలవాఁడయ్యెను.

విశ్వామిత్త్రుఁడు కృశాశ్వునికడ శస్త్త్ర విద్య నభ్యసించెను. గాధి యనంతర మితఁడే రాజ్యమేలెను. ఇతఁ డొకనాఁడు వేఁటకేగి డస్సి వసిష్ఠునాశ్రమము చేరెను. వసిష్ఠుఁడు తన హోమధేనువుచే నిష్టాన్నంబులు కల్పించి విశ్వామిత్త్రునకును, వాని పరివారమునకును బెట్టెను. ఈతనిగోవుప్రభావముచూచి విశ్వామిత్త్రుఁడు దానిని దన కిమ్మనియెను; దానికై లక్షగోవులనైన వసిష్ఠున కిచ్చెదననియెను. కాని వసిష్ఠుఁడు తన హోమధేనువు నీయననియెను. అంత విశ్వామిత్త్రుఁ డాధేనువును బలాత్కారమునఁ గొనిపోవఁజూచెను. కాని వసిష్ఠుని తపఃప్రభావముచే నాధేనువునుండి శబరాదులు పుట్టి విశ్వామిత్త్రుని పరివారమును మోదిరి. వారు పాఱిపోయిరి. అప్పటినుండియు విశ్వామిత్త్రునకు వసిష్ఠునిపై ద్వేషమును, నీర్ష్యయుఁ బుట్టెను. అతని మహిమకు నతని తపస్సే కారణమని గ్రహించి తాను నంతటిప్రభావము సంపాదించుటకై రాజ్యమును విడిచి తపస్సు చేయఁ బ్రారంభించెను. విశ్వామిత్త్రు నాశ్రమముపేరు సిద్ధాశ్రమము. భార.

విశ్వామిత్త్రుఁడుచేయు తపమునకు భంగము కలుగఁజేయుటకై యింద్రుఁడు మేనకనుబంపెను. ఇతఁ డామె వలలోఁ జిక్కుకొనియెను. మేనకయం దితని కొక కుమారిత జన్మించెను. ఈ బాలయే శకుంతల. విశ్వామిత్త్రుఁడు మరల సంసారబంధనములలో జిక్కువడుట తెలిసికొని విచారించి వానిని దప్పించుకొనుటకై మేనకను, దన పుత్త్రికనుగూడ విడనాడి వెళ్ళి తిరిగి తపస్సుచేసికొనెను.

విశ్వామిత్త్రుని వలన గాలవుఁడను ముని పుత్త్రుఁడు విద్యనేర్చుకొనెను. అతఁడు గురుకట్న మీయఁగోరి విశ్వామిత్త్రు నేదేని గోరుకొమ్మనియెను. ఇతఁడేమియు నక్కఱలేదనెను. కాని యెంతచెప్పినను వినక గాలవుఁడు బలవంతపెట్టుటచే, శరీరమంతయుఁదెలుపును,నొకకర్ణము మాత్రము నీలివర్ణమునుగల గుఱ్ఱముల నెనిమిది వందలనుగోరెను. అతఁడట్టి యశ్వములకై తిరిగి తిరిగి యాఱువందలగుఱ్ఱములను, యయాతిపుత్త్రిక యగు మాధవిని దెచ్చి కైకొనుమని కోరెను. విశ్వామిత్త్రుఁడు వానినిస్వీకరించెను. మాధవియం దితనికి అష్టకుఁడనుపుత్త్రుఁడు పుట్టెను. భార.

ఒకసంవత్సరముకఱవువచ్చి తినుటకాహారము లభింపకుండెను. విశ్వామిత్త్రుఁడు తన సంసారము

పోషింపలేకపోవుచుండెను. ఆతని కుమారుఁడగు గాలవుని కంఠమున కురివోసి యీబాలునిఁ బుచ్చుకొని యెవరైన గోవుల నిచ్చెదరా? యని వానిని వీధి వీధి త్రిప్పెను. సత్యవ్రతుఁడను రాజు విశ్వామిత్రునిసంసారమును పోషించెదనని గాలవునియురి విప్పించెను. భాగ.

త్రేతా ద్వాపర యుగములసంధిని మిక్కుటమైన క్షామము సంభవించెను. విశ్వామిత్రునకుఁ దినుట కాహారము దొరకినదికాదు. తిండికై వెదకుచు నితఁ డొకమాలపల్లెను జేరెను. అచ్చటివారొక కుక్కను జంపి కొంత తినిరి. వారు నిద్రించుచుండగా విశ్వామిత్రుఁడు కుక్కమాంసమును దినెను. ఒకఁడు మేల్కాంచి నీవెవ్వఁడవు? వని యతని నడిగెను. నేను విశ్వామిత్రుఁడ నని యతఁడు చెప్పెను. "అయ్యా! నీవు మునిసత్తముఁడవు కదా! కుక్కమాంసమును దినవచ్చునా?" యని యా మాలవాఁడు ప్రశ్నించెను. వీ రిరువురకును గొంతసంవాదము జరిగెను. ఎట్లైనను ప్రాణసంరక్షణము చేసికొనుట కర్తవ్య మని విశ్వామిత్రుఁడు చెప్పెను. భార.

(ఋచికుని) అజీగర్తుని కుమారుఁడైన శునశ్శేపుఁడు యాగపశువుగా వేల్వబడుటకై యంబరీషునిచేఁ గొనిపోఁబడుట విశ్వామిత్రుఁడు చూచెను. ఇతనితో నంబరీషుఁడు "నా తల్లిదండ్రులు లక్షగోవులను బుచ్చుకొని నన్ను యాగపశువుగఁ బంపిరి" అని చెప్పెను. విశ్వామిత్రునకు వానిపై జాలి కలిగెను. తన పుత్రులను బిలిచి వారిలో నొక్కని యాగపశువుగాఁ బొమ్మనియె. వారు పోమనిరి. ఇతఁడు శునశ్శేపునకు మంత్ర ముపదేశించి పంపెను. ఇతఁ డుపదేశించిన మంత్రమునే శునశ్శేపుఁడు పఠించుచుండెను. వానిని యూపస్తంభమునకుఁ గట్టిరి. కాని యింద్రాదులువచ్చి వానిని విడిపించిరి.

విశ్వామిత్రుఁడు హరిశ్చంద్రునకు యాగపశువుగా నమ్ముడువోయిన శునశ్శేపుని దన గృహమునకుఁ దీసికొనివచ్చి తన కుమారులతో "నేను వీనిని బెంచుకొనియెదను. ఇతఁడు మీకన్న యగును. వీనిని మీరు గౌరవింపుఁడు" అని చెప్పెను. వారు నవ్వి గేలిచేసిరి. విశ్వామిత్రునకు కోపము వచ్చి వారిని మ్లేచ్ఛులును, కుక్కమాంసము తినువారును అగునట్లు శపించెను. భాగ. రామా.

వానియొక్క నూర్గురు కుమారులలోను మధ్యవాఁడగు మధుచ్ఛందుఁడును, వాని తరువాతివారలును సునశ్శేపునిఁ దమకు నన్నగ గ్రహించుట కంగీకరించిరి. విశ్వామిత్రుని కుమారు లీ విధంబున రెండు తెగలగుటచేఁ బ్రవరాంతరంబు కలిగెను. భాగ.

ఎంత తపస్సుచేసినను విశ్వామిత్రునకుఁ గోపమును, క్రోధమును బోలేదు. వసిష్ఠుని నెట్లైన వంచించుటకే తలఁచువాఁడు. అందుకై యొకసారి సరస్వతీనదిని తలఁచుకొనెను. తలఁచినమాత్రముననే యామె వీని చెంగటకు వచ్చి తనతో పనియేమని యడిగెను. తనయొద్దకు వసిష్ఠుని గొనిరమ్మని యితఁ డాజ్ఞాపించెను. ఈ ముని కెదురాడ వెఱచి సరస్వతి వసిష్ఠుని కడకుఁ బోయి తానట్లు నియమింపఁబడిన తెఱంగు దెల్పెను. నన్నుఁ గొనిపొమ్మని వసిష్ఠుఁడు నదియొడ్డునఁ గూర్చుండెను. సరస్వతి వానిని దీసికొని వచ్చెను. విశ్వామిత్రుఁడు వానిని జంపుటకు సాధన మాలోచించుచుండెను. ఈలోపున నదీప్రవాహములో వసిష్ఠుఁడు కొట్టుకొనిపోయెను. విశ్వామిత్రునకు నదిపైఁ గోపమువచ్చి నీవు శోణితవు గమ్మని శపించెను. భాగ.

త్రిశంకువు (సత్యవ్రతుఁడు) బొందితో స్వర్గలోకమునకుఁ బోఁగోరి దానికిఁ దగినయజ్ఞము చేయించుమని వసిష్ఠు నడిగెను. అది యసాధ్యమని యా ముని పలికెను. త్రిశంకువు వసిష్ఠుని కుమారుల నడిగెను. వారును జేయింపమనిరి. ఈ రాజునకుఁ గోపమువచ్చి వారిని నిందింపఁగా మునిపుత్రులు నీవు చండాలుఁడవు కమ్మని శపించిరి. అంత త్రిశంకువు వసిష్ఠునిశత్రువైన విశ్వామిత్రునికడకు వచ్చెను. విశ్వామిత్రుని భార్యాపుత్రులకుఁ ద్రిశంకువు వెనుక సహాయము కూడఁ జేసెను. కావున నతఁడు గోరిన యాగము చేయించుదునని విశ్వామిత్రుఁడు చెప్పెను. ఇతని శిష్యులుకూడ చండాలుఁడుచేయు యాగమునకు మేము రా మనిరి. విశ్వామిత్రుఁ డొక్కఁడే తనతపస్సునుధారపోసి యాగముచేసి మంత్రించిన

దర్భలతో ద్రోసి త్రిశంకుని శరీరము తోడనే స్వర్గలోకమునకుఁ బంపెను. కాని యింద్రుఁడు వీని నచ్చట నిలువనీయక క్రిందికిఁ ద్రోపివేసెను. క్రిందఁబడుచుండిన త్రిశంకువు విశ్వామిత్రునిఁ దలఁచుకొని ప్రార్థించెను. విశ్వామిత్రుఁడు క్రిందఁబడుచుండిన త్రిశంకుని నచ్చటనే భూస్వర్గలోకములమధ్య నాపి యతనికై యొక స్వర్గలోకమును బ్రతిసృష్టిని జేయుచుండెను. ఇంద్రుఁ డది చూచి మఱియొక స్వర్గలోక ముండినచోఁ దన రాజ్యాధిపత్యము ఉండదని భయపడి విశ్వామిత్రుని బ్రతిమాలి త్రిశంకువు నచ్చట నుండున ట్లంగీకరించెను. ఆ మధ్యస్వర్గముననే త్రిశంకువుండెను. రామా.

విశ్వామిత్రుఁడును, వసిష్ఠుఁడును పక్షిరూపములతోగూడఁ బోరాడుకొనిరి. (చూడుము వసిష్ఠుఁడు)

వసిష్ఠునితోడి వైరము వలననే యితఁడు కొన్నియుపకారములైననేమి, యపకారములైన నేమి చేసెను. ఎప్పుడును సత్యము తప్పక పలుకువా రెవరేనికలరాయని ఇంద్రసభయందుఁ బ్రశ్నవచ్చెను. భూలోకంబున హరిశ్చంద్రుఁ డను రాజు కలఁడని వసిష్ఠుఁడు చెప్పెను. వసిష్ఠుఁడు చెప్పఁగనే నితనిమాట కాదనిపింపవలెనని విశ్వామిత్రుఁడు తలఁచుకొని "హరిశ్చంద్రుఁడుమాత్ర మెంతటివాఁడు ? అబద్ధము నాడకుండునా ?" అనియెను. వీరు పన్నిదములు పట్టుకొనిరి. విశ్వామిత్రుఁడు హరిశ్చంద్రునిచే నసత్యము నాడింపవలయునన్న ప్రతిజ్ఞతోడనే వానిని ధన మడిగి ధనమునకై, వానిని నగరము నుండి వెడలనడచి వానిని, వాని భార్యను అమ్మించి, సుతుని జంపించి యనేక యిడుములు కల్పించెను. (చూడుము హరిశ్చంద్రుఁడు.)

హరిశ్చంద్రుని భార్యయగు చంద్రమతిని నగరముపండిపొమ్మని యితఁడు కసరుచుండెను. ఆ దారిని బోవుచుండిన విశ్వులను దేవతలు వీనిపిఁజూచి యీ ముని యెంత నిర్దయుఁడు ! అని తమలో ననుకొనిరి. అది విశ్వామిత్రుఁడు విని వారిని భూలోకమున జన్మించునట్లు శపించెను. ఆ శాపము వలన వారు ఉపపాండవులుగా జన్మించిరి. మార్క.

విశ్వామిత్రుఁడు:-వసిష్ఠునితో సమానముగ బ్రహ్మర్షి యని యనిపించుకొనుటకు ఘోర తపస్సు చేయుచుండెను. తపోభంగము చేయుటకై ఇంద్రుఁడు రంభనుబంపెను. విశ్వామిత్రుఁడామెకు లొంగక రంభను పాషాణమవై యుండుమని శపించెను.

విశ్వామిత్రుఁడు:-బ్రహ్మర్షి యని పిలిపించుకొనుటకై ఘోరతపస్సు చేయుచుండెను. దేవతలు వచ్చి వారితనిని బ్రహ్మర్షి యని పిలుచుటకు సమ్మతింతుమనిరి. వసిష్ఠుఁడుకూడ నట్లు పిలిచిన యెడల విశ్వామిత్రుఁడు తప్పకుండ వందఱిచేతను నట్లే పిలువఁబడునని చెప్పిరి. విశ్వామిత్రుఁడు వసిష్ఠునికడకు వచ్చెను. ఓయి రాజర్షీ! యని వసిష్ఠుఁడు పిలిచెను. విశ్వామిత్రునకుఁ గోపమువచ్చి తన తపోమహిమను వినియోగించి వసిష్ఠునిపుత్త్రుని జంపెను. మరల విశ్వామిత్త్రుఁడు తపస్సుచేసి వసిష్ఠునికడకు వచ్చెను. మరల వసిష్ఠుఁడు రాజర్షీ ! యనియే పిలచెను. మరల విశ్వామిత్త్రుఁడు వసిష్ఠునికుమారుని జంపెను. అట్లు శక్తి యొక్కఁడుతప్ప వసిష్ఠుని పుత్త్రులందఱును జంపఁబడిరి. విశ్వామిత్త్రుఁడు మరల వచ్చెను. మరల వసిష్ఠుఁడు రాజర్షీ! యని పిలిచెను. వసిష్ఠునియొక్క కుమారుని మృతి నొందింప నిష్టపడక విశ్వామిత్త్రుఁడు వసిష్ఠునివైపు చూడకయే వెళ్ళిపోవుచుండెను. అపుడు వసిష్ఠుఁడు రావోయి బ్రహ్మఋషీ! యని పిలిచెను. ఇపుడేల యట్లు పిలచితివని విశ్వామిత్త్రుఁడడుగఁగా నిపుడుగదా నీవు కోపములేక వెళ్ళిపోవుచుంటివి. పూర్తిగఁ గోపములేనపుడే బ్రహ్మర్షివైతివని వసిష్ఠుఁడు చెప్పెను. వి.రా.

విశ్వామిత్త్రుని యాశ్రమముకడ మారీచాది రాక్షసులు మాయచేయుచు హోమములకు భంగములు కలుగజేయుచు రక్తమాంసముల నగ్నిగుండములఁ బడవైచుచుండిరి. వీరిని తపోమహిమచే నశింపజేయగల్గినను విశ్వామిత్త్రుఁడు తపోవ్యయము చేయదలఁచుకొనలేదు. ఇతఁడు దశరథునికడకు వచ్చి రాక్షసులను వధించుటకై రామలక్ష్మణులను బంపుమనెను. రామలక్ష్మణులు పసిబిడ్డలు. వీరు రాక్షసులను జంపుటెట్లు? దశరథుఁడు వారి నెడబాయఁ జాలకుండెను.

కాని విశ్వామిత్రునకుఁ గోపము వచ్చునని కుమారులను బంపెను. వీరికి విశ్వామిత్రుఁడే ధనుర్విద్య నుపదేశించెను. వారిని వెంటఁ బెట్టుకొని తన సిద్ధాశ్రమముకడకుఁ బోయెను. రామలక్ష్మణులు తాటక మారీచ సుబాహులను వధించిరి. పిమ్మట విశ్వామిత్రుఁడు పలుప్రదేశములను జూపుచు, వానివృత్తాంతములు చెప్పుచు దాశరథులను గొనిపోయెను. మార్గమందే రాముఁడు రాతిని ద్రొక్కుటయు, యది స్త్రీ యగుటయుఁ దటస్థించెను. ఆమె అహల్య యని యామె వృత్తాంతము చెప్పి విశ్వామిత్రుఁడు వీరలను మిథిలానగరమునకుఁ దీసికొని వెళ్ళి వీరిని జనకున కెఱింగించెను. జనకునింట నున్న శివచాపమును నెక్కుపెట్టుమని విశ్వామిత్రుఁడే చెప్పెను. రాముఁడు విల్లువిఱిచెను. రామునకు సీతనిచ్చి వివాహముచేసిరి. చిన్నతనముననే శ్రీరామునిమాహాత్మ్యమెఱింగి దానిని వెల్లడిచేయుటకు విశ్వామిత్రుఁడే ముఖ్యుఁడు. రామా.

విశ్వావసుఁడు:—ఒక గంధర్వుఁడు. ఇతఁడు దేవహూతిని జూచి విమోహితుఁడయ్యెను. ఆ పాపముచే స్థానముతప్పి క్రిందఁబడెను. భాగ.

విశ్వావసుఁడు:—ఒక గంధర్వరాజు. అతనికి మేనకవలన ప్రమద్వర అను కుమార్తె కలిగెను. కుమారితను దిగవిడచియే తల్లియును, దండ్రి యును వెడలిపోయిరి. విశ్వావసుని వీణయే బృహతి. భార.

విశ్వావసువు:—జమదగ్ని పుత్త్రుఁడు. తల్లి వ్యభిచరించెనుగాన నామెను వధింపుమని తండ్రి యాజ్ఞాపించెను. కావున జమదగ్ని వానిని శపించెను. కాని పరశురాముఁడు కోరఁగా మరల తండ్రి శాపవిముక్తునిగఁ జేసెను. భార.

విషయ:—దుష్టబుద్ధి కూఁతురు. ఈమె వనములో విహరించుచుఁ జెట్టునీడను నిదురించుచున్న సుందరాకారుఁడగు చంద్రహాసునిఁ జూచెను. చూచి వానిని డగ్గఱి వాని ప్రక్కనున్న యుత్తరము తీసి చదివెను. అది తన తండ్రి వ్రాసిన యుత్తరము. అందు "వానికి విషము నిమ్ము" అని వ్రాయఁబడియుండుటఁ జూచి వానిని గాపాడఁదలఁచి 'ము' ను 'య' గ దిద్దెను. ఆమెసోదరుఁడగు మదనువకా యుత్తరము చంద్రహాసుఁ డిచ్చెను.

అందు విషయ నిమ్ము అని యుండుటచే మదనుఁడు చంద్రహాసునకు విషయ నిచ్చి వివాహము చేసెను. జై. భా.

విష్టరకుఁడు:— ఒక బోయవాఁడు. వీఁడు మృగములను గొట్టఁబోవుచుండఁగా సంయమనుఁడను ముని చూచి మృగములను గొట్టకుము. జీవహింస చేయకుము, చేయకుముఅని యఱచుచు వచ్చెను.

మృగములను జంపుటకు నే నెవ్వఁడను ? నేను నిమిత్తమాత్ర మగుచుంటినిగాని పుట్టించిన బ్రహ్మయే చంపించుచుండును. ఈశ్వరాజ్ఞ యిట్టిది. ఎవరుచేసిన కర్మఫలము వారలనుభవింపక తీరదు అని వేదాంతమార్గమున వీఁడు బదులుచెప్పెను. వరా.

విష్టి:—సూర్యుని కూఁతురు. ఈమె కురూపి. భీకర రూపముకలది. ఈమె నెవరు వివాహమగుదురని సూర్యుఁడు విచారించుచుండెను. ఆమెయుఁ దనకు వివాహముచేయుమని తండ్రితోఁ జెప్పి కన్యాదానముచేయని దోషముగూడ వాని కెఱింగించెను. సూర్యుఁ డామెను విశ్వరూపున కిచ్చి వివాహముచేసెను.వీరికి గండుఁడు, అతిగండుఁడు, రక్తాక్షుఁడు, క్రోధనుఁడు, దుర్ముఖుఁడు అను కుమారులును, హర్షణ అను కూఁతురును బుట్టిరి. బ్రహ్మ.

విష్ణుమూర్తి:— క్రీడాసక్తులైన శివశక్తులవలన విష్ణుమూర్తి జన్మించెను. ఇతనిని దపముచేయుమని శివుఁ డానతిచ్చెను. విష్ణువొనర్చిన నిరంతర తపఃక్లేశమువలన వాని శరీరమునుండి జలము వచ్చెను. ఆ కారణముచే శివుఁడు విష్ణువును నారాయణుఁ డనియెను. శివ.

ఆదిశక్తివలననే బ్రహ్మ విష్ణు మహేశ్వరులు పుట్టిరి.

ప్రళయాంతమందు విష్ణువు నీరంబున శయనించి యుండఁగా నితని నాభినుండి బ్రహ్మయుఁ, జెవుల నుండి మధుకైటభులును బుట్టిరి. ఈ రాక్షసులు బ్రహ్మను బాధించుచుండుటచే నితఁడు విష్ణుమూర్తిని ప్రార్థించెను. విష్ణుమూర్తి మేల్కొనక పోవుటచే బ్రహ్మ ముందుగా యోగనిద్రను ప్రార్థించి యామెను విష్ణుమూర్తినుండి తొలఁగి పొమ్మని కోరెను. ఆమె లేచి దూరముగా నిలుచుండెను. అపుడు విష్ణువులేచి బ్రహ్మ వచ్చిన పని తెలిసికొని మధు కైటభులతో యుద్ధము చేసెను. ఎంతచేసినను నితఁడే యోడిపోవుచుండెను. కావున విష్ణుమూర్తి దానవులనుబిలచి, "నే నొక్కరుఁడను మీరిరువురతోఁ బోరుచుంటినిగదా, నాకు విశ్రాంతినొసంగుఁడు" అని కోరెను. అంత యుద్ధమాపిరి. ఈ విశ్రాంతి సమయమున విష్ణువు దేవిని స్తుతించెను. ఆమె ప్రత్యక్షమై నేను వారిని మోహితులుఁగ జేసెదను. అపుడు నీవు వారిని వంచించి గెలువుమనియెను. విశ్రాంతి ముగిసినపిమ్మట విష్ణువు మధుకైటభులను బిలిచి, "రాక్షసులారా! మీరు నాతోఁ బోరఁజాలరు. శరణు వేడుఁడు"అనియె. వారికిఁ గోపమువచ్చి "నీకు మేము చాలని వారము కాము. నీవే మమ్ము శరణువేఁడుము. నీకు వరమిచ్చెదము" అనిరి. "అట్లైనచో మీరు మరణించునట్లు వరమిండు" అని విష్ణువు వెంటనే యడిగెను. ఇతఁడిట్టి వరమడుగునని మధుకైటభులెంచక జరిగినదానికిఁ గించనొంది మరణము తప్పించుకొను నుపాయముగానక లోకమంతయు జలమయముగాన, మమ్ములను జలములేనిచోట సంహరింపుము అని కోరిరి. విష్ణువు తన యూరువులు పెంచి వానియందు మధుకైటభుల నుంచి, వారిని సంహరించెను. దే. భా.

విష్ణుమూర్తియుఁ, బ్రహ్మయుఁ దమ తమ యాధిక్యమునుగూర్చి తగవులాడుకొనుచుండిరి. వారిట్లు పోరాడుచుండఁగనే వారి యెదుట దివ్యప్రభలతో వెలుగొందుచు స్తంభమువలె లింగ మావిర్భవించెను. వారు దానియౌన్నత్యమునకు వెఱఁగుపడి దాని యాద్యంతములు పరీక్షింపఁ గోరిరి. విష్ణుమూర్తి వరాహ రూపమునఁ గ్రిందివైపునకును, బ్రహ్మ హంస రూపమున నూర్ధ్వమునకును వెళ్ళిరి. ఎవరు ముందుగనిది కనుఁగొందురో వారికి రెండవవారు వశ్యులై పూజించునట్లు గాఁబోయిరి. [uncertain reading of the right column's first two lines; printed: తుదకనుఁగొందురో వారికి రెండవవారు వశ్యులై పూజించునట్లొడంబడిరి.]

విష్ణుమూర్తి యెంతవెళ్ళినను స్తంభాది యగుపడినది కాదు. అతఁడు తిరిగివచ్చెను. బ్రహ్మ తాను అంతమును జూచివచ్చితినని చెప్పెను. బ్రహ్మకు విష్ణువు నమస్కరించెను. కాని శివుఁడు ప్రత్యక్షమై బ్రహ్మ యసత్యముపల్కెనని చెప్పెను. శివ.

విష్ణుమూర్తి వాహనము గరుడుఁడు. అతని యాయుధము చక్రము. సూర్యచంద్రు లతని కన్నులు. అతనిభార్య లక్ష్మి.

రేవతుఁడనువాఁడు గుఱ్ఱమెక్కి వెళ్లుచుండఁగ విష్ణువు లక్ష్మిని బిలచి, చూడు మా గుఱ్ఱ మెంత యందముగ నున్నదో యని చెప్పెను. లక్ష్మి యా గుఱ్ఱమును ఱెప్పవేయక చూచుచుండెను. "నీవు ఱెప్పవేయక యట్లు చూచుచుంటివి. నీకు గుఱ్ఱపురూపు మనపైనదికాఁబోలు. నీ వాడుగుఱ్ఱమవై పుట్టు" మని లక్ష్మిని విష్ణువు శపించెను. ఈ శాపమున కామె విచారించెను. "నీవు శివుని ప్రార్థించుము. నీకుఁ బుత్త్రుఁడు కల్గిన పిదప శాపవిముక్తి యగు" నని విష్ణువు పలికెను. లక్ష్మి కైలాసమున కేగి శివుని ప్రార్థించెను. శివుఁడు విష్ణువును రావించెను. విష్ణువు అశ్వ రూపముతోడనే వెళ్ళి యా యాఁడుగుఱ్ఱమును గూడెను. అది గర్భవతియై పుత్త్రునిఁ బడసెను. వెంటనే లక్ష్మికిశాపవిమోచనమయ్యెను. ఆపుట్టిన బాలుని లక్ష్మి విష్ణువు లచ్చటనే దిగవిడిచి చనిరి. ఆ పుత్త్రుఁడే హయహయుఁడు. దే.భా.

ఒకనాఁడు లక్ష్మి యీతనిచెంగటనుండఁగ లక్ష్మినిజూచి నవ్వెను. ఆమెకుఁ గోపమువచ్చి విష్ణువుయొక్క శిర మూడిపోవునట్లు శపించెను. ఇతని శిరమూడిపోయెను. అంత దేవతలు హయగ్రీవమును దెచ్చి వానిశరీరమున కతికించిరి. (చూడుము హయగ్రీవుఁడు.) దే. భా.

బ్రహ్మ,విష్ణు, మహేశ్వరులలో నెవ్వరుముక్తినీయఁగలుగుదు రని వాదమువచ్చెను. అది నిర్ధారణచేయుటకు మునులు భృగువునుబంపిరి. ఇతఁడు వచ్చునప్పటికి లక్ష్మి విష్ణుమూర్తి వక్షమున నుండెను. ఆమెను ద్రోసి విష్ణుమూర్తి లేచి

యతనికి నమస్కరించెను. భృగువు తన్నినను నించుకేని కోపమునొందక తనను మన్నింపుమని విష్ణువు వేఁడెను. త్రిమూర్తులలో విష్ణువే మోక్షమిచ్చువాఁడని తెలిసికొనిరి.

ఇదంతయు జూచుచుండిన లక్ష్మికిఁ గోపము వచ్చెను. భృగుఁడుతన్నుచుండినను నూరకుండుట విష్ణుమూర్తితనకవమర్యాదచేసిన ట్లెంచుకొనెను. ఆమె అచ్చటినుండి కొల్లాపురమునకుఁ బోయెను. విష్ణుమూర్తి శేషాద్రికి వెళ్ళెను. వేంక.

దేవతలు కాపత్కాలమందు దేయాలోచనయుఁ దోఁచకుండ నున్నపు డితనిని వచ్చి యడుగు చుందురు. ఇతనికి వారిరక్షణమే ప్రధానముగాన వారి కుపాయములు చెప్పుచుండును. వృత్రుఁడు తపస్సుచేసి పగటియందుఁగాని, రాత్రియందుఁ గాని, జలమందుఁగాని, స్థలమందుఁగాని, జీవము కలవానిచేఁగాని, జీవము లేనివానిచేఁగాని దనకు మరణములేకుండ బ్రహ్మవలన వరముపుచ్చుకొని ఇంద్రుని బాధించుచుండఁగా నతఁడు విష్ణుమూర్తిని శరణువేఁడెను. "అట్టివరము పొందిన వృత్రుని నెదిరించి గెల్చుట కష్టమనియును, నతనితో స్నేహము చేసినట్లుండి వంచనచే నతనిని సంహరింపవలయుననియు, సంధ్యాకాలమందు, సముద్రతీరమున నీటినుఱుఁగుతో వానినిగొట్టి చంపు" మనియును విష్ణుమూర్తి యాలోచన చెప్పెను.

జంభాసురుఁడు బాధ పెట్టుచున్నాఁడని యింద్రుఁ డితనితోఁ జెప్పుకొనియెను. "వజ్రాయుధముతోఁగాక యగ్నినివేఁడి యాయుధములు పుచ్చుకొని వానితో సంహరింపు" మని విష్ణుమూర్తి చెప్పెను.

తనచెయ్యి దేనిమీఁదఁబెట్టిననది నూఱుముక్కలగునట్లు వృకునకు (మురాసురునకు) శివుఁడు వరమిచ్చెను. ఆ వరముపుచ్చుకొని యారాక్షసుఁడు శివుని నెత్తిమీఁదనే చెయ్యి పెట్టవచ్చెను. శివుఁడు భయపడి విష్ణుమూర్తిని శరణు వేఁడెను. శివునిఁ దఱుముచు వృకుఁడుకూడ వచ్చెను. విష్ణుమూర్తి వృకుని నాపి వచ్చినకార్య మడిగి "నీవు శుచివై స్నానముచేసి, ఆచమనముచేసి వచ్చిన కాని శివుఁడు కనఁబడఁడు పోయి స్నానముచేసి రమ్ము"అనిచెప్పి పంపెను. విష్ణుమూర్తిమాటనమ్మి వృకుఁడు కొలనులో దిగి స్నానముచేయుచు తన చెయ్యి తన శిరస్సుమీఁదఁ బెట్టుకొని మృతి నొందెను. భాగ.

లోకసంరక్షణము చేయు వాఁడు విష్ణుమూర్తియే. తన్నిమిత్తమై యాతఁ డవతారముల నెత్తుచుండును. రామావతారమున నితఁడు పొందిన భార్యావియోగమునకు నీతఁడు పొందిన శాపములే కారణము.

పూర్వము దేవాసురయుద్ధమందు రాక్షసులు విష్ణుమూర్తికి భయపడి భృగుపత్నిచాటున డాఁగిరి. ఆమె వారిని మఱుఁగుపఱచెను. అందువలన విష్ణుమూర్తి యామెను సంహరించెను. ఆమె మరణించుచు "నీవు పత్నీవియోగము నొందుదువు గాక యనియును, నీ వవతారముల నెత్తుచు దేహధారివై బాధ లందుచుండు" మనియును శపించెను. దే. భా.

నారదుఁడును, పర్వతుఁడును నంబరీషుని పుత్త్రియైన శ్రీమతిని పెండ్లియాడఁగోరిరి. నారదునకుఁ దెలియకుండఁ బర్వతుఁడును, పర్వతునకుఁ దెలియకుండ నారదుఁడును విష్ణుమూర్తి కడకు వచ్చి నారదునిముఖము కోతిముఖముగ నగుపడునట్లు చేయుమని పర్వతుఁడును, పర్వతుని ముఖము కోతిముఖముగ నగుపడునట్లు చేయుమని నారదుఁడును గోరిరి. విష్ణుమూర్తి ప్రతివానితోడను సరే యని వారు కోరినట్లు చేసెను. తుదకు వారిద్దరి ముఖములు వానరముఖములయ్యెను. ఆ ముఖములతోడనే వారు శ్రీమతి స్వయంవరమునకు వెళ్ళిరి. అచ్చటకు విష్ణుమూర్తికూడ వెళ్ళి శ్రీమతికే కనఁబడెను. ఆమె పర్వత నారదులను గాక విష్ణుమూర్తినే వరించెను. పర్వత నారదులు విఫలమనోరథులైరి. పిమ్మట విష్ణునింట శ్రీమతిని జూచిరి. తాము వలచిన కన్యను విష్ణువు గొనివచ్చి వారికి వేదన కలుగఁ జేయుటచే, "నీవు భార్య నెడఁబాసి వియోగ దుఃఖము ననుభవించి తుదకు వానరుల మూలముననే నీ భార్యను బొందఁగలవు" అని శపించెను. అందువలననే విష్ణువు రాముఁడుగ నవతరించి భార్య నెడఁబాసి వానరుల సహాయమున నామెను దెచ్చుకొనియెను. లిం. శి.

జలంధరుఁ డను రాక్షసుఁడు ఇంద్రుని మీఁదకు యుద్ధమునకు వచ్చెను. ఇంద్రుఁ డపుడు విష్ణునిసహాయము కోరెను. విష్ణుమూర్తి వచ్చి యుద్ధముచేయుచుండెను. కాని యెంత పోరినను జలంధరుఁ డోడుటలేదు. అతని శక్తి సాహసములకు మెచ్చుకొని విష్ణు వతనిని వరము కోరుకొను మనియెను. లక్ష్మీసహితుఁడవై వచ్చి నాయింటఁ గాపురముండుమని జలంధరుఁడు కోరెను. విష్ణువు యుద్ధముమాని జలంధరునియింటి కేగెను. పిమ్మట జలంధరునకును, శివునకును యుద్ధము సంభవించెను. జలంధరుఁడు శివుని వంచనచేయఁదలంచుకొని తాను శివరూపమును ధరించి కొందఱు రాక్షసులకు గణపతుల వేషమువేసి పార్వతికడకు వెళ్ళెను. ఒక మాయాగణపతి, "ఓ పార్వతీ! నీకై శివుఁడు వచ్చియున్నాఁ"డని చెప్పెను. కాని వాఁడట్లే స్తంభించిపోయెను. ఇది రాక్షసమాయ యని పార్వతియెఱింగి విష్ణువును దలఁచుకొనియెను. విష్ణువువచ్చి నీ వేమికోరెదవు? నీవు చెప్పినది శిరసావహించి చేసెదననియె. నీవు జలంధరుని భార్య పాతివ్రత్యముచెఱుపు మని పార్వతి యనియెను. విష్ణువు సరే యని వెడలెను. అట్లుండఁగ జలంధరునిభార్యయగు వృందకు నొక చెడుకల వచ్చెను. తనభర్త మహిషము నెక్కి దక్షిణాపథమునకుఁ బోవుచున్నట్లును, వానినగరము తగులఁబడుచున్నట్లును కలను గనెను. ఆమె కన్నియు దుర్నిమిత్తములే తోఁచెను. మనస్సునకు స్వస్థతలేక వనములందుఁ దిరుగుచుండెను. అప్పుడు విష్ణుమూర్తి యొక ముసలిముని రూపమున నొక చెట్టుక్రిందఁ గూర్చుండెను. ఆ చెట్టుపైన రెండు వానరము లుండెను. వీనికడకు వృందవచ్చి "ఓ మునీంద్రా! మీవంటివారి కెఱుఁగరాని సంగతులు లేవు. నా భర్త క్షేమముగ నున్నాఁడా? చెప్పుఁడు" అని వేఁడెను. ఆ కపటముని శివునిచేత జలంధరుఁడు చచ్చెనని పల్కెను. ఆమె మిక్కిలి దీనయై యెట్లైనను వానిని బ్రతికింపుమని ప్రార్థనచేసెను. అతఁడు సరే యనియెను. తనమహత్త్వముచే నపుడే జలంధరుని రప్పించెద ననియెను. అచ్చటనున్న కొలనులో నతఁడు మునిఁగి తానే జలంధరరూపమున వచ్చెను. ఇతఁడు నిజముగఁ దనభర్తయే యనుకొని వృంద వానిని కౌఁగిలించుకొనెను. ఆ మాయాజలంధరుఁడు ముచ్చటలాడి యామెతో సురతసుఖములను దేలెను. అప్పుడతఁడు తన భర్తకాఁడని గ్రహించి దుఃఖమును, కోపమును రాఁగా "నీవు నీ భార్యతో వియోగము నొందుదువు. నీకు వానరులే సహాయము కాగలవారు" అని శపించి చితి కల్పించుకొని యందుఁ బ్రవేశించి దగ్ధయయ్యెను. విష్ణుమూర్తి యచ్చటనే నిలువఁబడిపోయెను. విమోహితుఁడై యచ్చటనుండి కదలలేకపోయెను. దేవతలందఱు వచ్చిరి. శివుఁడు, పార్వతియుఁ గూడ వచ్చి విష్ణునిఁ జూచిరి. వృంద దగ్ధమైనచోట గింజలు చల్లిరి. అచ్చటనే తులసి, ఉసిరి, మాలతి మొక్కలు మొలచెను. ఆమెశాపము వలననే విష్ణువు రామావతారమున భార్యనెడఁబాసి సుగ్రీవాది వానరుల సహాయమున భార్యను మరలఁ దెచ్చుకొనెను. శివ.

దంభుఁ డను దానవుఁడు తపస్సుచేయఁగా విష్ణుమూర్తి ప్రత్యక్షమై పుత్త్రుఁడు కలుగునట్లు వరమిచ్చెను. అతనికి శంఖచూడుఁడు జన్మించెను. శంఖచూడుఁడు తపస్సుచేయఁగా నితనికి బ్రహ్మ కృష్ణకవచ మిచ్చెను. ఈ కవచ ముండుటచే గర్వించి శంఖచూడుఁ డింద్రాదుల మీఁదకు యుద్ధమునకు వెళ్ళుచుండెను. అందువలన నీతనితో యుద్ధముచేయుటకు శివుఁడు వచ్చెను గాని యోడిపోవుచుండెను. అప్పుడు శివుఁడు విష్ణుమూర్తిని బ్రార్థించి శంఖచూడుని కవచము లాగికొమ్మనియె. విష్ణుమూర్తి వృద్ధబ్రాహ్మణ రూపమున వెళ్ళి శంఖచూడుని నాశ్రయించెను. ఆ దనుజుఁడు నీవు కోరినదాని నొసంగెదను. వేడుకొమ్మని బ్రాహ్మణునితో ననియె. కపట వృద్ధ బ్రాహ్మణుఁడు శంఖచూడుని కవచ మిమ్మనియెను. శంఖచూడుఁడు కవచమిచ్చి యుద్ధమునకు వెడలెను. అతనిని శివుఁడు సంహరించెను. పిమ్మట విష్ణుమూర్తి శంఖచూడుని రూపమును ధరించి యాకవచమును బూని శంఖచూడుని గృహమునకేగెను. అతని భార్య తులసి, తనభర్త యుద్ధములో జయము నొందినాఁడని సంతోషముతోఁ పంచభక్ష్యపరమాన్నములతోడను భోజనము పెట్టెను. ఈ మాయాశంఖచూడుఁడు భుజించి శయ్యనుజేరెను. తులసి వచ్చి కౌఁగిలించుకొనియెను. వారిరువురు నానందముతో రతికేళిఁ జేరిరి. అప్పుడే యతఁడు

నిజముగఁ దనభర్త కాఁడని తులసి గ్రహించెను. ఆమె వంచింపఁబడితినని గ్రహించి మిక్కిలి దుఃఖమునొంది యేడ్చి నీవు రాయివి కమ్మని విష్ణుమూర్తిని శపించెను. అప్పుడు విష్ణుమూర్తి శివునిని ప్రార్థించెను. శివుఁ డచ్చటకు వచ్చి తులసితో నిట్లనియె. "నీవు విష్ణుని సాంగత్య మపేక్షించి తపస్సుచేసితివి. అందువలన నీ కిపు డది లభించినది. శంఖచూడుఁడు కృష్ణుని పారిషదుఁ డగు సుదాముఁడు. నీ విచ్చిన శాప మమోఘము. కావున విష్ణువు సాలగ్రామ మగును. నీవు పుణ్యదాయకమగు గండకీనది వగుదువు. నీయందే యతఁ డుండును" అని చెప్పెను. అందువలన విష్ణుమూర్తి సాలగ్రామ మయ్యెను. శివ.

ఆర్యకుని మనుమఁడగు సుముఖుని జంపెదనని గరుడుఁడు భయపెట్టెను. సుముఖునకు నింద్రుని సారథి తన పుత్త్రిక నీయఁదలఁచుకొనెను. అతఁడు ప్రార్థింపఁగా నింద్రుఁడును, విష్ణుమూర్తియును సుముఖునిఁ జిరాయువుగఁ జేసిరి. గరుత్మంతునకు కోపము వచ్చి యింద్రునిఁ బరుషము లాడెను. సర్వమును దన యీకపై మోయుచున్నానని పలికెను. విష్ణుమూర్తికిఁ గోపము వచ్చి నేను నడుపుచుండఁగా నీవు నడచుట మఱచి గర్వించియుంటివని గరుడునిపై దనచేయి వేసెను. అంత గరుడుఁడు కదలలేక యణగారి గర్వము మానియుండెను. భార.

విష్ణుయశుఁడు:- కల్కి తండ్రి. ఇతని భార్య సుమతి. కల్కి.

విష్ణురాతుఁడు:- ఇతఁడు ద్వాదశాదిత్యులు సంచరించు క్రమంబును శుకుని నడిగి తెలిసికొనెను. భాగ.

విష్ణుశర్మ:- శృంగారశేఖరుని పురోహితుఁడు. (వరరుచియొక్క మాతామహుఁడు.) ఇతని కుమారితయగు శీలవతిని చంద్రగుప్తుఁడను బ్రాహ్మణున కిచ్చి వివాహముచేసెను. ఆమెకు వరరుచి జన్మించెను. విక్ర. చరి.

విష్ణుశర్మ:-కలియుగమున బ్రాహ్మణుఁడుగ నవతరించు విష్ణునినామము. భాగ.

విష్ణుసావర్ణి:- ధర్మసావర్ణి పుత్త్రుఁడు. ఇతని తనయుఁడు దేవసావర్ణి. బ్ర. వై.

విష్వక్సేనుఁడు:-శుకుని దౌహిత్రుఁడైన బ్రహ్మదత్తునకు గోదేవియందుఁ బుట్టిన కుమారుఁడు. ఇతని కుమారుఁడు ఉదక్సేనుఁడు.

విష్వక్సేనుఁడు:-విష్ణుమూర్తి సేనాధిపతి. భాగ.

వీ

వీతహవ్యుఁడు:- శర్యాతివంశమునఁ బుట్టిన యొకానొక రాజు. ఇతనికి హయహయుఁడను పేరుకూడఁగలదు. వీతహవ్యుఁడు వత్సదేశమును బాలించెను. ఇతనికిఁ బదుగురు భార్యలును, నూర్గురు పుత్త్రులును గలరు. ఈ పుత్త్రులు కాశీరాజైన హర్యశ్వునిని, వీని పుత్త్రుఁడగు సుదేవునిని జంపిరి. సుదేవుని పుత్త్రుఁడైన దివోదాసుని నోడించిరి. ఆ కారణమున దివోదాసుని పుత్త్రుఁడు ప్రతర్దనుఁడు వీతహవ్యుని పుత్త్రులను సంహరించి వీనినిగూడఁ జంప వచ్చెను. వీతహవ్యుఁడు పాఱిపోయి భృగు నాశ్రమములో దాఁగెను. అటకుఁ బ్రతర్దనుఁడు నేగెను. ఇతఁడు వీతహవ్యునిఁ జంప వచ్చితినని చెప్పెను. తన యాశ్రమములో క్షత్రియకులమందుఁ బుట్టినవాఁడు లేఁడని భృగువు చెప్పెను. "పుట్టినకులమున కెడఁ బాసినవాఁడయ్యెను. వీతహవ్యున కీ పరాభవమే చాలు" నని ప్రతర్దనుఁడు మరలిపోయెను. భృగునివచనమున వీతహవ్యుఁడు బ్రాహ్మణుఁ డయ్యెను. ఇతనికిఁ గృత్స్నమదుఁడను పుత్త్రుఁడు కలిగెను. భార.

వీతిహోత్రుఁడు:-ఇంద్రసేనుఁడను రాజుయొక్క కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు సుమతి. భాగ.

వీతిహోత్రుఁడు:-సుకుమారుని పుత్త్రుఁడు. ఇతని పుత్త్రుఁడు భర్గుఁడు. భాగ.

వీతిహోత్రుఁడు:-కార్తవీర్యునియొక్క వంశములోనివాఁడు. తాళజంఘునకు ఔర్వుని తేజము వలనఁ బుట్టినవారిలోఁ బెద్దకుమారుఁడు. భార.

వీరపాండ్యుఁడు:–మధురానగరము నేలిన రాజు. ఉగ్రపాండ్యుని కుమారుఁడు. స్కాంద.

వీరబాహుఁడు:– గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

వీరబాహుఁడు:–హరిశ్చంద్రునిఁ గొనిన శ్మశాన కాపరి.

వీరభద్రుఁడు:–దక్షునియజ్ఞము ధ్వంసము చేయుటకై శివుఁడు తన జటయందుండి వీరభద్రునిఁ బుట్టించెను. శివగణములతోఁ గలసి యితఁడును యజ్ఞవాటికనుద్రొక్కివైచి, సర్వపదార్థములను బాడుచేసి యజ్ఞమును ధ్వంసముచేసెను. శివ.

వీరవర్మ:–సారస్వతపురము నేలిన రాజు. ఇతఁడు ధర్మరాజుయొక్క యాగాశ్వమునుబట్టుకొనెను. కాని వీనిని కృష్ణార్జును లోడించిరి. ఇతని కూఁతురగు సుమాలిని యముని వరించెను. జై. భా.

వీరసేనుఁడు:–నిషధదేశపు రాజు. నలుని తండ్రి. భార.

వీరసేనుఁడు:– ఒక రాజు. ఇతఁడు వేఁటకువెళ్ళి లేళ్ళు అను భ్రాంతిచే లేడిచర్మము కప్పుకొని తిరుగుచున్న సంవర్తునికుమారులను జంపెను. వారిని దగ్గఱి, మునిపుత్త్రులగుట చూచి చింతిలి బ్రాహ్మణవధ గావించినందుకుఁ బ్రతీకారముగ వరాహవ్రత మాచరించెను. దాన నతఁడు మోక్షమును బొందెను. వరా.

వీరిణి:–రిపుంజయుని భార్య.

వీరుఁడు:–అనాయువు కుమారుఁడు. భార.

వృ

వృంద:–కాలనేమి పుత్త్రిక. జలంధరుని భార్య. జలంధరుఁడు పార్వతికడకు శివునిరూపమునఁ బోయి యామెను వంచింపఁ దలఁచుకొనెను. కాఁబట్టి పార్వతి విష్ణుమూర్తితో వృందయొక్క పాతివ్రత్యము చెఱుపుమని చెప్పెను. జలంధరునకును, శివునకును యుద్ధము జరుగుచుండెను. వృందకుఁ దనభర్త మహిషమునెక్కి దక్షిణాపథముగఁ బోవుచున్నట్లును, నతని నగరము తగులఁబడుచున్నట్లును గలవచ్చెను. ఆమె కన్నియును నపశకునములే తోఁచెను.

మనస్సు వ్యాకులత చెందుటచే నీమె యుద్యానవనములకుఁ బోయెను. అచ్చటను స్తిమితము లేకపోవుటచే మతిచలించినదానివలె కాననముల కరిగెను. ఒకచోటఁ జెట్టుక్రింద విష్ణుమూర్తి వృద్ధమునిరూపమునఁ గూర్చుండెను. ఆ చెట్టుపైన రెండు కోతులుకూడఁ గూర్చుండెను. ఈతనికడకు వృందవచ్చి ఓ మునీశ్వరా! మీవంటివారికిఁ దెలియనివిలేవు. నా భర్త క్షేమముగా నుండునా? చెప్పుఁడు అని వేఁడెను. ఆ కపటముని నీభర్త శివునిచేఁ జచ్చెననిచెప్పెను. ఆ మాట వినుటతోడనే యామె నేలంబడి మూర్ఛనొంది కొంతవడికిఁ దెలివితెచ్చుకొని అయ్యా! మీ మహత్తు సామాన్యముకాదు. నా భర్త నెటులయిన బ్రతికింపుఁడు అని దీనయై ప్రార్థించెను. అతఁడు వల్లెయని యామెను అచ్చటనే యుండుమని చెప్పి దగ్గఱనున్న కొలనులోమునిఁగి తానే జలంధరరూపమున వచ్చెను. వచ్చిన వీనిని తన భర్తయే యని నమ్మి వృంద కౌఁగిలించుకొనెను. ఈమెను ముద్దాడి యా మాయాజలంధరుఁ డీమెతో రతికేళిని దేలెను. అపు డామె తాను వంచింపఁబడినట్లు గ్రహించి యిఁక నా శరీరము నొల్లక చితిపేర్చుకొనెను. మఱియు నామెకుఁ గల్గినదుఃఖమును, గోపమును బట్టలేక వానిని నీవును నీ భార్యావియోగ దుఃఖమునుబొంది వానరులసహాయమునవే నీ భార్యను దెచ్చుకొనెదవని శపించి యా చితి నెక్కి దగ్ధయయ్యెను. విష్ణుమూర్తి యచట స్తబ్ధుఁడై స్తంభించి నిలుచుండెను. దేవతలందఱు వచ్చి పిలిచిరి. వృందశరీరముకాలి భస్మమై పడినచోట గింజలు చల్లిరి. అటఁ దులసి, ఉసిరి, మాలతి మొక్కలు మొలచెను.(చూడుము తులసి) శివ.

వృకతేజసుఁడు:–సుచ్ఛాయాశిష్టుల కుమారుఁడు. మత్స్య.

వృకరథుఁడు:- కర్ణుని తమ్ముఁడు. భీమునిచే నోడింపఁబడెను.

వృకుఁడు:- శకుని తమ్ముఁడు. వీని నర్జునుఁడు సంహరించెను. భార.

వృకుఁడు:- రురుకునియొక్క పుత్త్రుఁడు. ఇతని కుమారుఁడు బాహుకుఁడు. భాగ.

వృకుఁడు:-శకుఁడను దానవునియొక్క కుమారుఁడు. ఇతఁడు ఏ దేవుని నారాధించినచో ఫలితము త్వరగా వచ్చునని నారదు నడిగెను. త్వరలో ఫలితమిచ్చువాఁడు శివుఁడు. బాణాసురాదులు శివునిని ప్రార్థించి తమ కోరికలను బడసిరి. నీవును శివునిని ప్రార్థింపుమని యతఁడుచెప్పఁగా వృకుఁడు కేదారతీర్థమునకేగి శివునిఁ ప్రార్థించుచుఁ దన శరీరమునుకోసి హోమముచేయుచుఁ దుదకు శిరముకూడఁగోసి హోమము చేయఁబోవుచుండెను. అంత శివుఁడు ప్రత్యక్షమయ్యెను. నీకుఁ గావలసినవరము వేడుకొనుమని చెప్పెను. నేను దేనిపైన హస్తముపెట్టుదునో అది నూఱుముక్కలగునట్లుఁ వరమిమ్మ యని కోరెను. శివుఁ డిచ్చెను. వృకుఁడు వరప్రభావము పరిశీలించెదనని తన హస్తమును శివునిశిరముమీఁదనే పెట్టఁబోయెను. శివుఁడు పరుగెత్తి విష్ణులోకములోఁ డాఁగుకొనియెను. ఇతఁడు విష్ణులోకమునకుఁ బోయెను. అచ్చట విష్ణుమూర్తి నీవు వచ్చినపని యేమని వృకుని నడిగెను. వృకుఁడు చెప్పెను. నీవు స్నానముచేసి శుచివై యాచమనముచేసిన గాని శివుఁడు నీకుఁగనపడఁడు. పోయిస్నానము చేసి రమ్మ అని విష్ణుమూర్తి చెప్పఁగ వృకుఁడు నమ్మి కొలనులోదిగి స్నానము చేయుచుఁ దన చేతిని శిరముపైఁ బెట్టుకొనియెఁ. అందువలన నతఁడే నూఱుముక్కలయ్యెను. భాగ.

వృకుఁడు:-సుచ్ఛాయాశిష్టుల కుమారుఁడు. మత్స్య.

వృకుఁడు:-పాంచాలకుమారుఁడు. ఇతఁడు పాండవులకు సహాయముగవెళ్ళెను. యుద్ధములో సత్యజిత్తునకుఁ దోడ్పై ద్రోణునితోఁ బోరెను. ద్రోణుఁడే వీనిని జంపెను. భార.

వృష్ణుఁడు:-మధువు పుత్త్రుఁడు. ఇతనికి నూర్గురు పుత్త్రులు. వారిలోఁ బెద్దవాఁడు వృష్ణి.

వృషక:-భృగువుయొక్క కుమారిత. ఈమె చిన్నతనములోనే వైధవ్యమును బొందెను. ఈమె మాఘస్నానములుచేసి పుణ్యలోకము నొందెను. సుందోపసుందులు దేవతలను బాధపెట్టినపుడు వారి సంహారణమునకై బ్రహ్మ యీమెను దలఁచుకొనెను. వృషక మిక్కిలి సుందరాకారముతో వచ్చెను. ఈమెకు దిలోత్తమ యని బ్రహ్మ పేరుపెట్టెను. పద్మ.

వృతుఁడు:- అనాయువు పుత్త్రుఁడు. భార.

వృత్తుఁడు:- సుచ్ఛాయాశిష్టుల కుమారుఁడు. మత్స్య.

వృత్రాసురుఁడు:- త్వష్ట్ర ప్రజాపతిచే హోమగుండమునుండి పుట్టింపఁబడినవాఁడు. త్వష్ట సృజించిన విశ్వరూపుని నింద్రుఁడు సంహరించుటచే నింద్రుని సంహరించుటకై త్వష్ట వీనిని సృజించెను. వృత్రాసురుఁడు బ్రహ్మను ప్రార్థించి రాత్రిగాని, పగలుగాని, జీవముండినవానిచేఁగాని, జీవములేనివానిచేఁగాని, స్థలమునఁగాని, జలమునఁగాని తనకు మరణము లేకుండునట్లు వరమును వేఁడెను. బ్రహ్మ యా వరము నొసంగెను. ఇతనితో నింద్రుఁడు యుద్ధముచేసి యోడి పాఱిపోయి విష్ణుమూర్తిని శరణువేఁడెను. సమయము వచ్చినపు డితని నుపాయముచేఁ గొట్టవలయుననియును, నంతవరకు నితనితో స్నేహముగ నుండుమనియును విష్ణు వింద్రునితోఁ జెప్పెను. వృత్రునకును, నింద్రునకును మునులే చెలిమిచేసిరి. వృత్రుఁ డింద్రుని నమ్మియే యుండెను.

వృత్రాసురునిబలము యుద్ధమునందు మించుచుండును. మునులును, దేవతలును హరునిఁ బ్రార్థించిరి. వృత్రునిబలము మించుటకుఁ గారణము "ఇరువదివేలేండ్లు బ్రహ్మనుగూర్చి తపస్సు చేయుటచే వచ్చినది" అనిచెప్పి, అయినను నాచే నతనిశక్తియంతయు నడఁగునని శివుఁడు చెప్పెను. అంత నా తేజము జ్వరమై వృత్రునిఁ దాకెను.

అప్పు డింద్రుఁడు వానిని వజ్రాయుధముతోఁ గొట్టెను. వృత్రుండు జవసత్త్వములుడిగియుండెను. ఇట్లు వృత్రుం డోడియున్నప్పుడు శుక్రుండు వచ్చి "నీవోడియును వచలితుఁడవై యుంటి వేల?" యని యడిగెను. "కలిమిలేములు కాలవశం గతములు. బోధహీనులు వానికి సుఖ దుఃఖములు పొందుచుందురు. నా కావిచారములే" దనెను. అతనిని బరీక్షచేయుటకు శుక్రుండు వాదించెను. కాని అతని కే కోఁకయు లేదనియును, యుద్ధములో విష్ణువును జూచితిననియును, వాని మహిమను జెప్పి వానిని గనుమార్గమును దెలుపుమని కోరెను. అప్పుడే యక్కడకు సనత్కుమారుఁడు వచ్చెను. విష్ణుమాహాత్మ్యమును జెప్పుమని శుక్రుఁడు కోరెను. సనత్కుమారుఁడుచెప్పెను. వృత్రుఁడు ప్రాణములు విడిచి యనంతునిఁ జేరెను. ఇంద్రునకు వృత్రునిఁ జంపినందునఁ బ్రహ్మహత్యామహాపాతకము గలిగినది. భార.

ఒకనాఁటి సంధ్యాకాలమున వారు సముద్రపు టొడ్డునఁ బోవుచుండఁగా నింద్రుఁడు సముద్రపు నురుగుతో వీనిని గొట్టెను. ఇతఁడు పూర్వభవమునఁ జిత్రకేతువు. భార.

వృద్ధకన్యాశ్రమము:- ఒక తీర్థము. అచ్చట గర్గవంశమువాఁడగు ముని ఖని యనువాఁడు తపస్సుచే నొక కన్యను బడసి పెంచి దివమున కరిగెను. ఆమె వివాహముచేసికొనక తపస్సుచేసి కొనుచు వృద్ధురాలైనది. అట్లు దివమున కేగఁ గోరెను. అంతట నారదుఁడు వచ్చి పాణిగ్రహణము చేయక స్వర్గమునకుఁ బోరాదని చెప్పఁగా ఆమె తపస్సులో నర్థమునిచ్చి గాలవాత్మజుని వరించెను. ఒక రాత్రిమాత్రము సహవాసము చేయునట్లు అతఁడు సమయమును గావించుకొనెను. ఆమె తన తపోమహిమచే యౌవనరూపలావణ్య సమన్వితయై యా రేయి గడపి మనసమయంబు ప్రకారము గడపితిని. ఇంకఁ బోవుదాన నని వానిని విడిచి వెళ్ళెను. ఆ మునియును నా తీర్థంబున నొక్క నా డుపవసించి దేవఋషి పితృతర్పణపరుండైన ననేక సంవత్సరములయందలి నైష్ఠిక బ్రహ్మచర్యఫలము వచ్చుటచే దివంబున కరిగెను. భార.

వృద్ధక్షత్త్రుఁడు:- సైంధవుని తండ్రి. ఇతఁడు తపముచేసి పుత్త్రుని సైంధవుని బడసెను. సైంధవుఁడు చిన్నతనములో నాడుకొనుచుండఁగా నాకాశవాణి ఇతఁడు యుద్ధములో నేమఱియుండునపుడు చనిపోవును అని పలికెను. ఆ మాటలు వృద్ధక్షత్రుఁడు వినెను. తాను తపముచేసి కనిన పుత్త్రున కిట్లగుటకు మిక్కిలి విచారించెను. ఆ దుఃఖముతో ఎవఁడీ సైంధవునిశిరము నేలఁ గూల్చునో వానితల నూఱువ్రయ్య లగుఁగాక యని శపించెను. ఈ శాపము శ్రీకృష్ణునకుఁ దెలియును. అతఁడు సైంధవునిశిరము క్రిందఁబడకుండఁ గొట్టుమని యర్జునునకుఁ జెప్పుచుండువాఁడు. తుదకుఁ బాశుపతాస్త్ర ప్రభావమున సైంధవునిశిరమును నఱకించి దానిని జపముచేసికొనుచున్న ఈ వృద్ధక్షత్త్రునియొడిలోఁ బడవేయించెను. ఇతఁ డులికిపడి దానిని క్రిందకుఁ ద్రోసివేసెను. అది నేలమీఁదఁ బడఁగనే వృద్ధక్షత్త్రునితల నూఱుముక్కలయ్యెను. భార.

వృద్ధశర్మ:-కరూష వంశము వాఁడు. కుంతికిఁ దోఁబుట్టువగు శ్రుతదేవిని వివాహమయ్యెను. శిశుపాలుఁడు దంతవక్త్రుఁడు. భాగ.

వృద్ధశర్మ:-ఆయువు స్వర్భానుల పుత్త్రుఁడు. నహుషుని సోదరుఁడు. భార.

వృద్ధశర్మ:-ఒక బ్రాహ్మణుఁడు. సముద్రపు టొడ్డునఁ బడియుండిన అనంతునిఁ దీసికొనివెళ్ళి పెంచి తన కూఁతును జారుమతిని వానికిచ్చి వివాహము చేసెను.

వృషకుఁడు:-శకుని సోదరుఁడు. వీనిని యుద్ధములో నర్జునుఁ డోడించెను. భార.

వృషకేతుఁడు:-కర్ణుని కుమారుఁడు. ధర్మరాజు చేయు యాగమునకై యౌవనాశ్వుని యశ్వము తెచ్చుటకు భీముఁడును, మేఘవర్ణుఁడును వెడలిరి. మేఘవర్ణుఁడు వాతని రాక్షసబలముచే గుఱ్ఱమును సుగ్రహించెను. ఇది తెలిసి యౌవనాశ్వుఁడు యుద్ధమునకు వచ్చెను. ఆ యుద్ధములో వృషకేతుఁడు మేఘవర్ణునకు సహాయము చేసెను. యౌవనాశ్వుఁ డితనినిగూడఁగొట్టెను. వృష

కేతుఁడు మూర్ఛనొందెను. అపుడు భీముఁడు వచ్చి యౌవనాశ్వు నోడించెను. తండ్రిపాటు చూచి యౌవనాశ్వుని కుమారుఁడు సువేగుఁడు గదాయుద్ధముచేసెను. భీముఁడును, సువేగుఁడును ఒకరినొకరు కొట్టుకొని పడిపోయిరి. ఇంతలో యౌవనాశ్వుఁడు మరల లేచి యుద్ధముచేయఁ జొచ్చెను. వృషకేతుఁడును లేచి వానిని గొట్టెను. యౌవనాశ్వుఁడు నేలం గూలెను. అంత వృషకేతుఁడు జాలినొంది, ఈ మహా వీరుఁడు బ్రతుకునట్లు ప్రార్థించి రణమందు హతులైనవారి నుపశాంతులుగఁ జేసెను. యౌవనాశ్వుఁడు తనను గాపాడిన వృషకేతు నెఱింగి గౌరవించి వారు వచ్చినపని యెఱసి యశ్వమిచ్చి, ధనమిచ్చి పంపెను.

ధర్మజుని యాగాశ్వమును అనుసాళ్వుఁడు కట్టివేసెను. ప్రద్యుమ్నునితో వృషకేతుఁడు వెళ్ళి వాని నోడించి యశ్వమును దెచ్చెను. యాగాశ్వమువెంట నితఁడును వెళ్ళెను. ఇతఁడు తుదకు బభ్రువాహనునివలన మడిసెను.

జై. భా.

వృషదర్భానువు:-హిరణ్యాక్షుని భార్య.

వృషధ్రుఁడు:- మనువుపుత్త్రుఁడు. ఇతఁడు వేఁట కేగి మృగమను తలఁపున హోమధేనువును జంపెను. ఆ ధేనువును గాచుచుండిన ముని కుమారుఁడు బాభ్రవ్యుఁడనువాఁడు వీనిపై గోపించెను. శూద్రుని వట్లల కోపించెదవని వృషధ్రుఁ డనియెను. గోవును జంపుటేగాక పైగా నిట్లు దూషించుదువా ? నీవు శూద్రుఁడ వగుము అని మునిపుత్త్రుఁడు వీనిని శపించెను. ఇతఁడును వానికిఁ బ్రతిశాపమిచ్చెను. మార్క.

వృషధ్వజుఁడు:- రాజసావర్ణిపుత్త్రుఁడు. ఈశ్వర భక్తుఁడు. ఇతఁడు సూర్యుని హింసింపఁబోయె. సూర్యుఁడు బ్రహ్మతోడను, విష్ణువుతోడను జెప్పుకొనియెను. వృషధ్వజుఁడు శివభక్తుఁడు; మహాభక్తుఁడు. అతని కుమారులు బలశాలు రగుదురు. అతఁడు పరిభవము నొందఁజాలఁడని వారుచెప్పిరి. ఇతనికుమారుఁడు హంసధ్వజుఁడు.

బ్ర. వై.

వృషధ్వజుఁడు:-ఇతఁడు శివభక్తుఁడై విష్ణుపూజను, లక్ష్మీపూజను బరిహసించెను. దేవతః శతనిని శపింప వెఱచిరి. కాని సూర్యుఁడు లక్ష్మీహీనుఁడగునట్లు ఇతనిని శపించెను. తన భక్తుని శపించుటచే శివునకుఁ గోపమువచ్చి సూర్యునిమీఁదికి వెళ్ళెను. సూర్యుఁడు భయపడి, తండ్రియగు కశ్యపుని శరణుఁజొచ్చెను. కశ్యపుఁడు బ్రహ్మకడకుఁ బరుగిడెను. బ్రహ్మ నారాయణునికడకుఁ బోయెను. వీరల నందఱను దఱుముచు శివుఁడును వెళ్ళెను. ఇతఁడు వచ్చినపని తెలిసికొని "ఈలోపున భూలోకమునఁ బెక్కేండ్లు గడచి నవి. వృషధ్వజుండును మృతినొందెను. అతని పుత్త్రులు లక్ష్మీవిహీనులై లక్ష్మినిగుఱించి తపస్సు చేయుచున్నారు. నీవు శాంతింపుము" అని నారాయణుఁడు చెప్పెను. వృషధ్వజునిపుత్త్రులు ధర్మధ్వజుఁడు, వృషధ్వజుఁడు.

వృషపర్వుఁడు:- దానవేశ్వరుఁడు. దనుజకశ్యపుల కుమారుఁడు. శర్మిష్ఠ తండ్రి. ఇతని నగరమున శుక్రుఁ డుండువాఁడు. శర్మిష్ఠ శుక్రుని కూఁతు నవమానించుటచే నామె వృషపర్వునినగరము నకు రాననియెను. కుమారితను విడువలేక శుక్రుఁడు తానును వృషపర్వునినగరము విడిచి వెళ్ళెను. వృషపర్వుఁ డీవృత్తాంతమును దెలిసి కొని శుక్రుని బ్రతిమాలిఁ దనకుమారితను శుక్ర పుత్రికయగు దేవయానికి దాసిగఁ బంపి శుక్రా చార్యునిఁ దన నగరమునకు రావించెను. భార.

వృషపర్వుఁడు:-ఒక రాజర్షి. వీని యాశ్రమమునఁ నరణ్యవాసము చేయుచున్న పాండవులు కొన్ని దినంబు లుండిరి. భార

వృషభధ్వజుఁడు:- (చూడుము శివుఁడు)

వృషభాద్రి:- ఒక పర్వతము. వృషభుఁడను దాన వుఁడు ఈపర్వతముపైఁ జంపఁబడెను. ఇదియే వేంకటాచలము.

వృషభానుఁడు:- హరివంశమందుఁ బుట్టిన రాజు. ఇతఁడు భసందుని కుమారితయగు కళావతిని వివాహమయ్యెను. రాధ యితని కుమారిత.

బ్ర. వై.

వృషభాసురుఁడు:- ఒక రాక్షసుఁడు. కొండ యెత్తున వృషభరూపమున నుండువాఁడు. గోగోప గోపికాజనంబులతో విహరించు చున్నటువంటి శ్రీకృష్ణుని సంహరించుటకై వచ్చెను. కాని శ్రీకృష్ణునిచే సంహరింపఁ బడెను. భాగ.

వృషభాసురుఁడు:- ఒక రాక్షసుఁడు. విష్ణుమూర్తిని ప్రార్థించి యితఁడు ప్రత్యక్షము కాఁగాఁ దనతో యుద్ధముచేయుమని కోరెను. విష్ణుమూర్తి వీనిని యుద్ధములో సంహరించెను. ఈయసురుఁడు చంపబడినపర్వతము వృషభాద్రి. వేంక.

నృషభుఁడు:—నాభికి మేరుదేవి అను నామాంతరముగల సుదేవియందు విష్ణునంశమువలనఁ బుట్టి కుమారుఁడు. పరమహంసాభిగమ్యంబైన మార్గమిద్దియని మహర్షులకుఁ దెలియునట్లు బోధించెను. భాగ.

వృషభుఁడు:—(చూడుము ఋషభుఁడు.)

వృషలి:- అజామిళుఁడను బ్రాహ్మణుని దాసి. ఆ బ్రాహ్మణుఁడు భార్యను విడిచి సదా యీమెతోడనే రతిసుఖములఁ దేలుచుండు వాఁడు. భాగ.

వృషలుఁడు:- ఒక యాంధ్రజాతీయుఁడు. కణ్వవంశజుఁ డగు సుశర్ముఁ డను రాజుయొక్క భృత్యుఁడు. ఆ రాజును జంపి యితఁడే రాజ్యమేలెను. ఇతనితరువాత నితని తమ్ముఁడగు కృష్ణుఁడనువాఁడు రాజయ్యెను. భాగ.

వృషలుఁడు:—ఒక రాజు. కాళికి బలియిచ్చుటకై యొక మనుజునిఁ బట్టి తెచ్చుటకు నితఁడు భృత్యులను బంపెను. వారు అంగిరసుఁడు అను బ్రాహ్మణునియొక్క పుత్త్రుని నున్మాదునివలె సంచరించువానిని (ఇతఁడు పూర్వజన్మమున జ డ భ ర తు ఁ డు. ఋషభుని కుమారుఁడు.) బట్టి తెచ్చిరి. వీనిని గాళి గుడికిఁ గొనిపోయి బలి యీయఁబోఁగాఁ, గాళి ప్రత్యక్షమై వృషలుని, వాని భృత్యులను సంహరించి యా బ్రాహ్మణుని విడచెను. భాగ.

వృషసేనుఁడు:—కర్ణుని పుత్త్రుఁడు. ఇతఁడు యుద్ధములో నెక్కువగఁ బాల్గొనెను. వీని నర్జునుఁడు చంపెను. భార.

వృషాదర్భి:—ఒక రాజు. మహాకాటకము వచ్చి యాహారము దుర్లభమగుడు సప్తర్షులును, నరుంధతి యునుఁ దిరుగుచు ఆజ్యానిపుత్త్రుఁడైన నీలుని శవము కాలుచుండగా దానిని భక్షింపఁగోరి, కొప్పముచుట్టును జేరిరి. వృషాదర్భి వీరినిజూచి మీ కాహారము నేనిచ్చెదను రండని పిలిచెను. రాజుదగ్గఱనుండి మేము పరిగ్రహింపమనివారనిరి. రాజు తనగృహమున కరిగి కృత్రిమఫలములు బంగారుమయమైనవి తనయొక్క మంత్రికిచ్చి యా మునుల కిమ్మనియెను. మంత్రి వారికడకుఁ గొంపోయి యిచ్చెనుగాని వారు చూచి యందు బంగారముండుటచే వానిని నిరాకరించిరి. ఆసంగతి వృషాదర్భికి మంత్రి తెలియఁజేసెను. ఆతనికిఁ గోపమువచ్చి యాగంబు చేయించెను. అందుండి రాక్షసి యొకతె కృత్తి పుట్టెను. నీవు పోయి కశ్యపాదులను గొట్టుమని వృషాదర్భి చెప్పెను. అప్పటికి సప్తర్షులును, శునస్సఖుండనువానితోఁ గలసి తామరతూడు లేఱుకొనుచుండిరి. అచ్చటకుఁ గృత్తి రాఁగా శునస్సఖుఁడు దానిని సంహరించెను. ఈ సందడిలోఁ దామరతూడులు కనఁబడవాయెను. ఎవరుతీసినదియు ఋషులకుఁ దెలిసినదికాదు. నేను తీసితినేని ఇంతంత పాపినగుదునని వారు శపథము పట్టుచుండిరి. వానిని దీసినవాఁడు ఘనుఁడగునని శునస్సఖుఁడుపల్కెను. నీవే తీసితివని ఋషు లనిరి. శునస్సఖుఁడు తానింద్రుఁడగుట తెలిపి వారి నిష్కామత్వమునకు మెచ్చుకొని వారి నింద్రలోకమునకుఁ గొనిపోయెను. భార.

వృష్ణి:—సాత్వతుని కుమారుఁడు. భాగ.

వృష్ణి:—భజమానుని పుత్త్రుఁడు. నిమ్రోచి, కంకణుఁడు ఇతని సోదరులు. భాగ.

వృష్ణి:—వృష్ణుని నూర్గురు కుమారులలోఁ బెద్దవాఁడు. భాగ.

వృష్ణి:—కురుని కుమారుఁడు. విలోమ తనయుఁడు. భాగ

వే

వేంకటాచలము:- మేరుపర్వతము యొక్క కుమారుఁడు. శేషుఁడును, వాయువును దమలో నెవ్వరు బలాఢ్యులో యని పన్నిదము వేసికొనిరి. శేషుఁడు వచ్చి యీ వేంకటాద్రిని జుట్టుకొని గట్టిగ బిగ్గఁబట్టియుండెను. వాయువీపర్వతమునే విసరివేసెను. ఈ పర్వతమునందు విష్ణుమూర్తి వసించుచుండును. ఇతఁడే వేంకటేశ్వరుఁడు. ఈ వేంకటాచలమునకే త్రేతాయుగమునందు వృషభాద్రి యని పేరు. అంజనాద్రియనియును దీనికిఁ బేరుగలదు. వేంక.

వేంకటేశ్వరుఁడు:- భృగువు విష్ణుమూర్తి వవమానము చేసినను నతఁ డూరకుండుటచే. లక్ష్మికి గోపము వచ్చి కొల్లాపురము వెళ్ళిపోయెను. ఆమె వెళ్ళినపిదప విష్ణుమూర్తి శేషాద్రికివచ్చి యొక పుట్టలో నుండెను. అతఁడే వేంకటేశ్వరుఁడు. విష్ణువిట్లువచ్చుట యెఱిఁగి లక్ష్మి వీనికి సహాయముచేయుటకై వచ్చెను. బ్రహ్మయు, శివుఁడును ఆవును, దూడయునై యటకువచ్చిరి. వీనిని మనుష్యరూపమునమున్న లక్ష్మి చోళరాజున కమ్మెను. ఆవు, పాలన్నియు శేషాద్రిమీదనున్న పుట్టలోఁ గార్చి వచ్చుచుండెను. ఆవునకుఁ బాలు లేకుండుటచే రాజు గొల్లనుగోపపడియెను. అతఁ డా యావు పాలన్నియుఁ బుట్టమీఁదఁ గార్చుచుండుటఁజూచి దానిని గొడ్డలితోఁగొట్టఁ బోయెను. పుట్టలోనున్న విష్ణువు చూచి తనతల యావుతలపై నడ్డుపెట్టెను. ఇతనికి దెబ్బతగిలి రక్తము కారెను. ఆవు రక్తపుమఱకలతో వచ్చి రాజసభలోఁ దొర్లెను. దాని సంజ్ఞల గుర్తించి చోళరాజు దానివెంబడి చనియెను. అది విష్ణువుండిన కొండమీఁదకే వానిం దీసికొనిపోయెను. వేంకటేశ్వరుఁ డతనితో గొల్లవాఁడు చేసినపని చెప్పి యా గొల్లను పిశాచమై యుండుమని శపించెను. వాఁడతనిని గరుణింపుమని ప్రార్థించెను.

తరువాత విష్ణుమూర్తి బృహస్పతిని దలఁచుకొనియెను. అతఁడు వచ్చి గాయమునకు మందు చెప్పెను. వేంకటేశ్వరుఁడు జిల్లేడుదూదికై వెళ్లుచుండఁగా వరాహస్వామి కనఁబడెను. వానిని దనపుట్టకుఁ దీసికొనివెళ్ళెను. వకుళమాలి యనునామెయే వీరి కుపచారములు చేయుచుండెను. వేంకటేశ్వరుఁడు సదా విచారములో నుండుటచూచి వకుళమాలిక యాతని నాదరించి యాతనివిచారమునకుఁ గారణ మడిగెను. అతఁడు ఆకాశరాజుకూఁతురగు పద్మను జూచి మోహించుటయు, నామెపై పుష్పములు చల్లఁగా, నామె నీతనిని రాళ్ళతోఁగొట్టుటయు, నెట్లైనఁ బద్మను వివాహము చేసికొనగోరుటయుఁ జెప్పెను. వకుళమాలిక పద్మావతిని జూచి వచ్చెను. ఆమె జ్వరపీడితయై యుండెనని చెప్పెను. హరి యెఱుకలవేషము వేసికొని పద్మావతి తల్లికి ఎఱుకచెప్పుచుఁ బద్మావతి పుట్టలో నుండు హరినిఁ జూచి మోహించెననియు, నందువలననే యామెకు జ్వరము వచ్చెననియుఁ జెప్పెను. అతఁడు మరలిరాఁగానే వకుళమాలిక కూడ నామెకడకుఁబోయి పద్మావతిని హరికిచ్చి వివాహము చేయుమని చెప్పెను. ఆకాశరాజతనికిఁ గూఁతు నిచ్చుటకు సమ్మతించెను. పెండ్లికై కుబేరునికడ వేంకటేశ్వరుఁ డప్పు తెచ్చెను. కాని తన వివాహమునకు లక్ష్మి యే మనునో యని సంకోచించుచుండెను. సూర్యుఁడు లక్ష్మికడకేగి యామెను దీసికొని వచ్చెను. పద్మావతిని వివాహమాడుటకై లక్ష్మి సమ్మతించెను. వీరివివాహమైనపిమ్మట లక్ష్మి కొల్లాపురము వెళ్ళిపోయెను. వేంకటేశ్వరు కాకాశరాజు గుడి కట్టించెను. వేంక.

వేగవంతుఁడు:- సాల్వుని సైన్యములో నొక సరదారు. వీడు సాంబునిచేనోడింపఁబడెను. భార.

వేదదర్శుఁడు:- సుమంతుని శిష్యునివలన అథర్వణవేద మభ్యసించి దానిని కౌల్కాయని, బ్రహ్మబలి, నిర్ఘోషుఁడు, పిప్పలాయనుఁడు అనువారల కుపదేశించెను. భాగ.

వేదరాశి:- ఒక బ్రాహ్మణుఁడు. చంద్రకాంత భర్త. ఇతనిభార్య దుస్సహవాసమువలన జారిణి యయ్యెను. ఇతఁ డామెను ఇంటినుండి వెడలఁగొట్టెను. తు. కా.

వేదవంతుఁడు:- బంధుమంతుని కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు బంధుఁడు. భాగ.

వేదవతి:- కృశధ్వజుని కుమారిత. ఈమెతల్లి మాలావతి. కృశధ్వజుఁడు వేదము పఠించుచుండఁగా నీమె పుట్టెను. ఈమె జన్మించినపుడు సూతికాగృహమందు వేదధ్వని వినఁబడెను. కావున నీమెకు వేదవతియను పేరుపెట్టిరి. ఈమెను విష్ణుమూర్తికే యిచ్చి వివాహము చేయుదునని కృశధ్వజుఁడు చెప్పుచుండువాఁడు. ఒక దనుజుఁ డీమెను గామించెను. కాని కృశధ్వజుఁడు వాని కీమె నొసంగలేదు. ఆ కోపమున వాఁ డాతనిని జంపెను. భర్త పోయిన దుఃఖము పట్టజాలక మాలావతియు మరణించెను. అట్లు తలిదండ్రులను బోఁగొట్టుకొని వేదవతి తపస్సుచేయుటకు వచ్చెను. తపస్సు చేయుచున్న యామెను రావణుఁడు చూచెను. ఈమెయొక్క రూపమునకు విభ్రమము నొందెను. తనను బరిణయము కమ్మని కోరెను. విష్ణుమూర్తిని దప్ప నొరుని గైకొనననని యామె చెప్పెను. కాని మోహపారవశ్యముచే రావణుఁడు వేదవతిని బట్టుకొని ముద్దాడఁబోయెను. నీవు దుష్టుఁడవని యెఱిఁగియుండియు నీతో సంభాషించితిని. ఇఁక ఈ దేహముతో నుండఁజాలనని యోగాగ్ని కల్పించుకొని వేదవతి, "నామనస్సు నిజముగ హరిపై నుండెనేని నే నయోనిజగఁబుట్టి విష్ణుమూర్తిని బరిణయమై నీ వంశమును నాశనముచేసెద" నని రావణునితోఁబలికి యగ్నియందు దగ్ధమయ్యెను. పిమ్మట నామె లంకయందే యొక పద్మమున జన్మించెను; మొదట రావణునకే గనఁబడెను. కాని జ్యోతిష్కు లామెజన్మ మరిష్టసూచకమని చెప్పుటచే నామెను బెట్టెలోఁబెట్టి సముద్రములో వదలిరి. ఆమె మిథిలానగరము చేరెను. ఈమెయే సీత. బ్ర. వై.

వేదవ్యాసుఁడు:-వేదభేదన మొనరించిన ఋషి. ఇది యొక్కని పేరుకాదు. వేదములను బ్రసరింపఁజేసిన ముని వేదవ్యాసుఁ డనఁబడును. ప్రతి ద్వాపరమందును ఆర్షవిద్య లొకొక్కనిచే విస్తరింపఁబడుచుండును. ప్రథమద్వాపరంబున స్వాయంభువు వేదములను విభాగించెను. ద్వితీయ ద్వాపరంబునఁ బ్రజాపతి వ్యాసుఁడయ్యెను. తృతీయ ద్వాపరంబున శుక్రుఁడు వ్యాసుఁడయ్యెను. పదపడి బృహస్పతి, వసిష్ఠుఁడు త్రివర్షుఁడు, సనద్వాజుఁడు మొదలగువారు వ్యాసులైరి.

నారాయణుని నాభికమలమునఁబుట్టిన బ్రహ్మ ముఖములనుండి పుట్టిన వేదములను బ్రసరింపఁజేయుటకు నారాయణుఁడు అపాంతరతముఁడను మానసపుత్త్రినిఁ బుట్టించెను. నారాయణుఁడు వానిని బిలిచి నీవు వేదములను దృఢావధానుఁడవై విని వాని సంచితన్యాస మొందింపుమని చెప్పెను. అపాంతరతముఁడు వేదభేదన మొనరించెను. బ్రహ్మ యతనిని "వేదవ్యాసా! రమ్ము. నాకుఁ బుత్రుఁడవై యధికాహ్లాదము సమకూర్చితివి. ఇట్లే యన్నిమన్వంతరములను జేయుము. ఉత్తరకాలమున వసిష్ఠపౌత్రుఁడు పరాశరుఁడనువాఁడు పుట్టును. వానికిఁ గుమారుఁడవై పుట్టుము. నీవలనఁ గల్గిన కురుక్షేత్రరాజులు అన్యోన్యావిష్టరోషులై కులముచెఱచుదురు. అపుడును నీవు వేదములను వ్యాపక మొందింపుము. నీకు రాగవిదూరుఁడగు సుతుఁడు పుట్టును. నీవు నిశ్చేచ్ఛఁ బ్రవర్తింపుము" అనెను.

బ్రహ్మవచనముచొప్పున వసిష్ఠపౌత్త్రిఁడగు పరాశరునకు సత్యవతియందుఁ గృష్ణద్వైపాయనుఁడను పుత్త్రిఁడు పుట్టి వ్యాసుఁడయ్యెను. సత్యవతికిఁ గన్యాత్వమందే సద్యోగర్భమునఁ జన్మించి "తల్లీ! నావలన నీకుఁ బనిఁగలయప్పుడు నన్నుఁ దలఁచుకొనుము. తత్క్షణమే నేను వచ్చెద" నని చెప్పి యామె సెలవుగైకొని తపోవనమున కేగెను. ఇతనియాశ్రమము శమ్యాప్రాసము.

కృష్ణద్వైపాయనుఁడు సత్యవతికిని, నామె సంతతివారికిని బనిగలయప్పుడెల్ల గోచరించి హితవు సేయుచుండువాఁడు. సత్యవతి కుమారులు చిత్రాంగద విచిత్రవీర్యులు సంతానము వడయకయే చనిపోయిరి. భీష్ముఁడు వివాహము కావొల్లకుండెను. అపుడు జననికోరిక ననుసరించి వ్యాసుఁడు అంబిక, అంబాలికలయందు ధృతరాష్ట్ర, పాండురాజులను గనియెను. ఇతనిఁజేరిన అంబికయొక్క దాసియందు విదురుఁడు జన్మించెను.

పాండవులు లక్కయిల్లు దాటి వెళ్ళుచుండఁగా వ్యాసుఁడు వారల కగపడి ధర్మమును

పాటించి వర్తింపుడని హితవుచెప్పి ద్రుపదుఁడు తన కుమారితకు వివాహముఁ జేయఁబోవుచుండుట నెఱింగించి వాని నగరమున కేగుఁడనియెను. ద్రుపదుఁడు తనకూఁతును పాండవు లేవురకు నిచ్చి వివాహము సేయుటకు సంకోచించుసమయమున వ్యాసుఁడే తెంచి వానికి దివ్యదృష్టి నిచ్చి వానికిఁ బాండవుల యొక్క పూర్వరూపమును గనఁబఱచెను. పాండవు లింద్రప్రస్థమున కరిగిన పిమ్మటఁ గాని, వారు రాజ్యమోడినపుడుగాని, దుర్యోధన దుశ్శాసనులు ద్రౌపదిని వంచించినపుడు గాని యీతఁడు రాలేదు. వారు వనవాసమున కేగినపిదప దుర్యోధనుఁడు వారిని సంహరింపఁ దలఁచుకొనుట తన దివ్యదృష్టివలన నెఱింగి ధృతరాష్ట్రునికడకు వచ్చి యతనినిఁ గుమారునకు బుద్ధి చెప్పుమనియె. వనవాసము చేయుచున్న పాండవులను భావికార్యములనుగురించి యాలోచించుకొనుచు నధైర్యపడుచుండినపు డితఁ డరుదెంచి వారి భయము పోఁగొట్టి ధర్మజునకుఁ బ్రతిస్మృతి యను విద్య నుపదేశించి యర్జునుని దపస్సుచేసి యస్త్రములు వడయుమనియెను.

ధృతరాష్ట్రుఁడు చెప్పినను దుర్యోధనుఁడు సంధికంగీకరించుటలేదు. అపుడు ధృతరాష్ట్రుఁడు వ్యాసునిఁ దలఁచుకొనియెను. పాండవులబల మధికమా ? తనబల మధికమా ? యనియడిగెను. వాసుదేవుఁడు పాండవపక్షంబున నుండుటచే వారేబలవంతులగుదురని, సంధిగావించుకొనుటే మంచిదని చెప్పెను. కాని యుద్ధము తప్పదయ్యెను. ధృతరాష్ట్రుఁడు దుఃఖితుఁడైయుండె. ఆ సమయమున వ్యాసుఁడు ప్రత్యక్షమై కాలమాసన్నమైనది కావున సకల పృథ్వీపతులును దెగుదురని తెల్పి యుద్ధ మెట్లుజరుగునదియుఁ జూడఁగోరునెడల ధృతరాష్ట్రునకు దృష్టినిచ్చెద ననియెను. ఇతఁడు రాజులు తెగుట చూడలేక యచ్చటి వార్తలను వినుటమాత్రము కోరెను. ఏయపాయమును బొందకుండ యుద్ధభూమిని సంచరించు శక్తిని సంజయునకు వ్యాసుఁడిచ్చెను.

యుద్ధముజరుగునప్పుడును నితఁడప్పుడప్పుడు ప్రత్యక్ష మగుచుండువాఁడు. అభిమన్యుని మరణమునకు విచారించు ధర్మజునకు గోచరించి వానికి దుఃఖోపశమనము గావించెను. అశ్వత్థామకుఁ గృష్ణుని మహత్త్వము తెలియఁజేసెను. పుత్త్రశోకముచేఁ గుందుచుండిన గాంధారీ ధృతరాష్ట్రులకును, గుంతికిని దివ్యదృష్టి నిచ్చి మరణించినవారిని జూపించి వీరికి దుఃఖోపశమనము గావించెను. ధృతరాష్ట్రునిఁ దపోవనమున కేగుమని చెప్పెను.

తొల్లి వేదంబు లేకీభూతంబులై యేర్పఱుప రాకయున్నపుడు కృష్ణద్వైపాయనుఁడు వాని విభజనము గావించెను. అతఁ డిట్లు వేదవ్యాసుఁ డయ్యెను. పైల వైశంపాయనాదు లితనిశిష్యులు. ఇతఁడు భారతము నిర్మించి దానిని దేవలోకమున వక్కాణించుటకై నారదునిఁ, బితృలోకమున వక్కాణింప దేవలుని, గరుడ గంధర్వ యక్ష రాక్షసలోకంబుల వక్కాణింప శుకుని, మనుష్యలోకమున జనమేజయునకు వక్కాణించుటకై వైశంపాయనుని బంపెను.

రెండు చిలుకలు సంసారము చేయుచుఁ దమ పిల్లలకు మేఁత తెచ్చుచుండుటఁ జూచి వ్యాసుఁడు తనకును బిడ్డఁడుండిన బాగుండును గదా యనుకొని తన కోరిక నారదునితోఁ జెప్పెను. నారదుఁడు శక్తినిగూర్చి తపస్సు చేయుమని చెప్పఁగా వ్యాసుఁడు హిమాలయ పర్వతముమీఁది కేగి శక్తిని ధ్యానించుచుండెను. ఆ తపస్సువేడిమికి ఆగఁజాలక యింద్రాదులు శివునికడకు వెళ్ళిరి. ఆ వేడిమికిఁ గారణము వ్యాసుని తపస్సని శివుఁ డెఱింగి వ్యాసునికడకు వచ్చెను. (వ్యాసుఁడు మేరునగముపై దపస్సు చేసికొనుచుండఁగా శివుఁడు ప్రత్యక్షమయ్యెను.) ఇతఁడు పంచభూతములను బోలు పుత్త్రునిమ్మని శివుని బ్రార్థించెను. అట్టివాఁడే నీకుఁ గలుగునని శివుఁడు చెప్పి చనియెను.

వ్యాసుఁ డగ్నికార్యపరుఁడై అరణి మథించుచుండఁగా వానికి ఘృతాచి కనఁబడెను. ఇతఁడు కామహతుఁడై యుండుట యామె గ్రహించి యితనిని వంచనచేయుటకై శుకమై వీనియెదుటఁ జరించుచుండెను. దీనిని జూచుచు వ్యాసుఁడు అరణి మథించుచుండెను. అతని చిత్తము మోహాయత్త మగుటచే శుక్రము జాఱి యరణియందుఁ బడెను. అందుండియే శుకుఁడుపుట్టెను

కుమారునకు వేదశాస్త్రములు వ్యాసుఁడే నేర్పెను. ముక్తిమార్గమునుగూడఁ దెల్పుమని శుకుఁడు కోరఁగా జనకునికడకుఁ బోయి నేర్చుకొనుమని చెప్పెను.

వ్యాసుఁ డొకనాఁడు శుకునితోఁ గలసి యధ్యయనము చేయుచుండఁగ మహావాయువు వీవనారంభించెను. అది యనధ్యయనసమయమని వ్యాసుఁడు స్నానముచేయుటకై నది కేగెను. ఇంతలో నారదుఁడు శుకునికడకు వచ్చి నీకుపకారము చేయవలెనని వచ్చితినని వానికిఁ దత్త్వము బోధించెను. శుకుఁడు ముక్తసంగుఁడై కైలాసమునకుఁ బోవుట కాకాశమున కెగసెను. వ్యాసుఁడు వచ్చి శుకునికై వెదకుకొనుచు వానిం బిల్వఁగ ప్రకృతియంతయు 'ఓ' యని పలుకుచుండెను. పుత్త్రాన్వేషణముననే వ్యాసుఁడు పోవుచుండఁగా కొలనులో విగతవస్త్రలై స్నానముచేయుచుండినస్త్రీలు తత్తఱపాటు కలిగి వేగముగ వచ్చి వస్త్రములు ధరించిరి. నాకంటెఁ జిన్నవాఁడు పడుచువాఁడు శుకుఁ డీమార్గమునఁ బోయినపు డూరకున్నవారి కిపు డీతత్తఱపాటేల అని వ్యాసుఁడు వారల నడిగెను. శుకుఁడు నిర్వికారుఁడు, పరమార్థమును బొందిన విరాగి యని వారు దెల్పిరి. అచ్చటనే వ్యాసునకు శివుఁడు ప్రత్యక్షమై నీవు పంచభూతములవంటి కుమారుని గోరితివి కాన నట్టివానినే నిచ్చితిని. అతఁడు దేవతలైనఁ బొందలేనిపదవి నొందెను. విచారింపకు మని చెప్పి వెడలెను.

సకలధర్మములు చెప్పియును, భారతము రచియించియును, వేదవిభజన గావించియును నింకను నితని మనస్సునకు శాంతిలేకుండుటచేఁ దన యాశ్రమమునందే వ్యాకులమైనచిత్తుఁడయియే యుండెను. నారదుఁడు వచ్చి యిట్లుండుటకుఁ గారణము శ్రీవిష్ణుకథలు తెలుపమిచేఁ గలిగినదని చెప్పెను. అంత వ్యాసుఁడు భాగవతమును రచియించి శుకునిచేఁ బఠింపించెను.

రాఁబోవు సూర్యసావర్ణికమను కాలమున వ్యాసుఁడు సప్తఋషులలో నొక్కఁడగును. భాగ.

వ్యాసుఁడు కాశీపట్టణములో నివసించుచుండెను. అతని కొకనాఁ డెచ్చటను భిక్ష దొరకకుండెను. క్షుద్బాధ మిక్కుటముగ నుండెను. ఆకోపముచే నచ్చటిజనులను శపింపఁ బోయెను. అది పార్వతి యెఱింగి వానికి భిక్ష నిచ్చి నీ విచ్చటిజనులను శపింపఁదలఁచుకొంటివి గావున నిచ్చట నుండవలదు పొమ్మనియెను. అతఁడు పరితపించి ప్రతి యష్టమినాఁడును, చతుర్దశినాఁడును వచ్చి విశ్వేశ్వరుని సందర్శించుట కనుజ్ఞపొంది గంగానది దాటి వెడలెను. అతఁడు పిమ్మటఁ గాపురమున్న గ్రామమే వ్యాసకాశి. భార. భాగ. బ్ర. వై. ఉరా.

వేదశిరుఁడు:- మార్కండేయుని కుమారుఁడు. ఇతని భార్య పీవరి. మార్క. బ్రహ్మ.

వేదశిరుఁడు:-స్వారోచిషమనుకాలమందలి యొక విప్రుఁడు. ఇతని కుమారిత తుషిత. ఈమెయందు విష్ణుమూర్తి విభుఁడను పేరుతో నవతరించెను. భాగ.

వేదశిరుఁడు:- ఒక బ్రాహ్మణుఁడు. ఇతఁడు తపస్సుచేసికొనుచు నాకాశమార్గమునఁ బోవుచుండిన శుచి యను నప్సరసను జూచెను. దాన నింద్రియస్ఖలన మయ్యెను. అతఁ డా వీర్యమును ఆ యప్సరసచేతియందుఁ బోసి త్రాగుమనియె. దాని పానమువలన శుచి గర్భవతి యయ్యెను. ఆమెకు భూతపాప యను కుమారిత పుట్టెను. ఆమె నదియయ్యెను. కాశీ.

వేనుఁడు:-అనంగుని పుత్త్రుఁడైన నీతి యను రాజా యొక్క పుత్త్రుఁడు. భార.

వేనుఁడు:- అంగుఁడను రాజాయొక్క పుత్త్రుఁడు. ఇతని తల్లి సునీథ. వేనుఁడు భీషణరూపుఁడు. అధార్మికుఁడు. ఇతనిని రాజ్యాభిషిక్తునిఁజేసి తండ్రి తపోవనమున కరిగెను. ఇతఁడు రాజు కాఁగానే ప్రజలను రావించి, నేఁ జెప్పినదే ధర్మముకాని యితరధర్మములులేవు. నానుదువుల శిరసావహించి మీరు బద్ధులరు కావలసినదే. యజ్ఞములు చేయరాదు. బ్రాహ్మణ పూజ దోషము అని శాసించెను. మరీచి మొదలగు మును లాతనిపాలికిఁ బోయి రాజా! మేము నూఱుసంవత్సరము లేకదీక్షగా యాగము చేయ

దలంచినారము. పూర్వాచారములను, బూర్వపు ధర్మములను విడిచి నీవిట్లు శాసించుట యుక్తమగునా? ఆ శాసనముల మరలింపుము అని కోరిరి. రాజు మునులపైఁ గోపించి భూనాథుని యానతికంటె వేఱొకధర్మమున్నదే? యజ్ఞములందు మీరెవ్వరిని బూజించెదరు? నాకంటె మీకుఁ బూజ్యుఁ డెవఁడు? అని అధర్మ ప్రలాపములాడి మునులను దూలనాడెను. యాగములు చేయువారినందఱిని వేనుఁడు బాధించుచుండెను. బ్రాహ్మణులు శాంతులయ్యును వేనుని దుష్కృత్యమును సహింపఁజాలక వానిని బట్టుకొని వాని వామహస్తమును మథించిరి. (వానిని రోటిలోవేసి నలుగఁగొట్టిరి.) ఆ హస్తమునుండి మిక్కిలి పొట్టివాఁడు, నల్లనివాఁడు, వికృతరూపుఁడునగు నొకఁడుపుట్టెను. ఆతనిని నిషాదుఁడనిరి. వానివలన నిషాదులు పుట్టిరి. పిదప శుచిప్రాప్తికై మునులు వేనుని పృథుహస్తమును (పెద్దచెయ్యిని) మథించిరి. అందుండి రవిదీప్తులతోఁ బ్రకాశించు నొకఁడు పుట్టెను. పృథుహస్తమునఁ బుట్టుటచే నతనికిఁ బృథువు అని పేరిడిరి. బ్రహ్మం.

వై

వైకుంఠుఁడు:-విష్ణుమూర్తి రైవతమనువుకాలమున శుభ్రునిపత్నియగు వికుంఠకుఁ బుత్త్రుఁడుగ జన్మించెను. అతఁడు వైకుంఠలోకమును నిర్మించెను. భాగ.

వైతాళుఁడు:-జాతుకర్ణి శిష్యుఁడు. భాగ.

వైవస్వతుఁడు:- వివస్వంతుని (సూర్యుని) కుమారుఁడు. ఇతని తల్లి సంజ్ఞ. ఇతనిపేరు శ్రాద్ధదేవుఁడు. వైవస్వతుఁడు సప్తమమనువయ్యెను. ఇతనిమన్వంతరమున ఓజస్వియనువాఁడింద్రుఁడు. అత్రి, వసిష్ఠుఁడు, కాశ్యపుఁడు, గౌతముఁడు, భరద్వాజుఁడు, విశ్వామిత్త్రుఁడు, జమదగ్ని అనువారలు సప్తఋషులు. ఇతనికి శ్రద్ధయను కాంతయందు ఇక్ష్వాకు, నాభాగుఁడు,ధృష్టుఁడు, శంయాతి, కరుషుఁడు, వృషధ్రుఁడు, వసుమంతుఁడు, నరిష్యంతుఁడు, పృషధ్రుఁడు అనువారలు వైవస్వతుని పుత్త్రులు. వారు పుట్టకపూర్వము వైవస్వతుఁడు సుగుణ సుందరుండగు మఱియొక పుత్త్రుని బడయఁగోరి మిత్త్రావరుణుల నుద్దేశించి యాగముచేసెను. అతని భార్య పుత్త్రికనుగోరి హోత నాశ్రయించె. పుత్త్రిక పుట్టునట్లు వషట్కారంబులు పలుకఁబడియెను. ఇల యను పుత్త్రిక జన్మించెను. వైవస్వతుఁడు వసిష్ఠునికడకేఁగి నేను పుత్త్రుని గోరఁగాఁ బుత్త్రిక యేల పుట్టెనని యడిగెను. వసిష్ఠుఁడు హోత గావించినది తెల్పి తానే యీశ్వరునిఁ బ్రార్థించి, ఇలను బురుషుఁడుగఁ జేయుమని కోరెను. ఈ యిల కొంతకాలము స్త్రీగను, గొంతకాలము పురుషుఁడుగను నుండువాఁడు. పురుషరూపమున నున్నపుడు అతని పేరు సుద్యుమ్నుఁడు.

వైవస్వతుఁడు బహుకాలము రాజ్యమేలిన పిదప రాజ్యము పుత్త్రుల కప్పగించి తపస్సుచేసికొనుటకై యరణ్యమున కేఁగెను. ఇతని తపస్సునకు మెచ్చికొని బ్రహ్మ ప్రత్యక్షమై వరము వేఁడుకొనుమనియెను. ప్రళయకాలమందుఁ జరాచరముల నితఁడు రక్షింపఁగల్గునట్లు వరము వేఁడెను. ఒకనాఁడితఁ డర్ఘ్య మిచ్చుచుండఁగా మత్స్య మొకటి యితని దోసిటఁ బడెను. (చూడుము మత్స్యావతారము.)

వైవస్వతుఁడు పూర్వభవమున సత్యవ్రతుఁడు అను ద్రవిళదేశాధీశ్వరుఁడు. భాగ.

వైశంపాయనుఁడు:- ఒక ముని; వేదవ్యాసుని శిష్యుఁడు. తొలుత వేదంబు లేకీభూతములై యేర్పఱుపరాక యున్నపుడు వ్యాసు నానతి ప్రకార మితఁడు చతుర్వేదసూత్రముల నేర్పాటుచేసెను. ఇతఁడు యజుర్వేదమును బఠించెను. జనమేజయునకు భారతకథ చెప్పుటకై వ్యాసుఁ డీతనిని మనుష్యలోకమునకుఁ బంపెను. ఇతఁడు ఉగ్రశ్రవసునకు వివిధ పురాణకథలను జెప్పెను. యాజ్ఞవల్క్యుఁడితని శిష్యుఁడు. భార.

వైశంపాయనుఁ డొకనాఁడు ఇంద్రవజ్రస్తవాత్మకంబగుమంత్రములనుశిష్యులచేఁబఠింపించుచుండెను. వీనికిని, శిష్యులకును మధ్యగా నొక

విప్రబాలకుఁడు వచ్చుచుండెను. వానిని రావల దని నివారించుటకై యితఁడు దర్భలు చేతఁ బుచ్చుకొని రావద్దని సంజ్ఞగఁ ద్రిప్పుచుండెను. ఇంతలో మంత్రము నోటినుండి వెలువడఁగా నా దర్భలు మంత్రప్రభావమున వజ్రమై యా బాలుని సంహరించెను. బ్రహ్మహత్యాపాతకము వైశంపాయనునకు వచ్చెను. దీనిని దపముచేసి పోఁగొట్టుకొనెను.

వైశంపాయనుఁడు వ్యాసుని శిష్యుఁడగు రోమహర్షణునివలన సకలపురాణములు నేర్చి వానిని లోకమునఁ బ్రవర్తింపఁజేసెను. భాగ.

తొల్లి కొందఱు మునులు మేరునగంబున కరిగి, మునులందఱు నచ్చట కేడుదినములలోపల వచ్చి తీరవలయును. రానిచో బ్రహ్మహత్యాపాతకము చుట్టుకొనునని శాసించిరి. వైశంపాయనున కిది దెలిసియు వెళ్ళలేకపోయెను. బ్రహ్మహత్యాపాతక మితనిం బట్టుకొనియెను. వైశంపాయనుఁడు శిష్యులను బిలిచి నేనీ పాతక భారమును సహించలేకుంటిని. మీరు దానిని వహించి యుందురే? యని యడుగుచుండ యాజ్ఞవల్క్యుఁడు ముందరకు వచ్చి, గురువరా! ఇదెంతపని? నేనాభారమునువహించి నా విద్యమెయి నచిరకాలములో దానిని బాపికొందునని పలికెను. వైశంపాయనున కా మాటలకుఁ గోపమువచ్చి ఇంతమదముతోఁ బలికెదవుగా? నీవిచ్చట నుండఁదగవు. ఎటకేని పొమ్ము. నేఁజెప్పిన విద్య మఱల నాకే వచ్చుఁగాక అని శాసించెను. యాజ్ఞవల్క్యుఁడు వైశంపాయనునివలన నేర్చుకొనిన విద్య నచ్చటనే క్రక్కివేసి, వెడలి సూర్యు నారాధించి యజుస్సుల నుపదేశము పొందెను. బ్రహ్మ.

వైశాలిని:- విశాలరాజు కూఁతురు. ఈమెకును విశాలయను పేరుకలదు. (చూడుము విశాల)

వైశ్య:- ధృతరాష్ట్రుని భార్య. ఈమెకుమారుఁడే యుయుత్సుఁడు. భార.

వైశ్రవణుఁడు:- (చూడుము కుబేరుఁడు)

వైశ్వానరుఁడు:- దనువు కశ్యపుల కుమారుఁడు. కాలక, పౌలోమ యితని కుమారికలు. విష్ణు.

వైశ్వానరుఁడు:-విశ్వావరుని కుమారుఁడు. (చూడుము అగ్ని.)

వ్యా

వ్యాఘ్రదత్తుఁడు:-మగధదేశపు రాజు యొక్క కుమారుఁడు. భారతయుద్ధమునఁ గౌరవుల పక్షమునఁ బోరి మరణించెను. భార.

వ్యాఘ్రేశ్వరుఁడు:-(శివుఁడు) కాశీ క్షేత్రమున విశ్వేశ్వరునిగుడికివచ్చు భక్తులను దుందుభి అను రాక్షసుఁడు సంహరించి భక్షించుచుండువాఁడు. శివుఁడు భక్తులనుగాచుటకై వ్యాఘ్రరూపమున వచ్చి యా దుందుభిని సంహరించెను. అట్లు వచ్చిన శివుఁడే వ్యాఘ్రేశ్వరుఁడు. విష్ణు.

వ్యాసకాశి:-(చూడుము వేదవ్యాసుఁడు.)

వ్యాసుఁడు:-(చూడుము వేదవ్యాసుఁడు.)

వ్యు

వ్యుషితాశ్వుఁడు:-పౌరవంశజుఁడైన రాజు. ఇతఁడు నూఱు క్రతువులుచేసెను. కాని యనవరతము కామాసక్తుఁడై యుండుటచే రోగపీడితుఁడై చనిపోయెను. ఇతనిభార్య భద్ర యను నామె సంతానములేక బ్రతుకఁజాలనని భర్త శవముపైఁబడి మొఱలిడఁగా శవమునుండి యొక వాణి వెడలి ఆమె ఋతుమతియైన యెనిమిది పదునాల్గవ దినముల భర్తను దలఁచుకొనెనేని సంతానము గల్గునని చెప్పెను. ఆమె కట్లు సంతానముకలిగెను. అట్లు జన్మించిన పుత్త్రికయే కాక్షీవతి. భార.

వ్యుషితాశ్వుఁడు:- రఘువంశపురాజు. శంఖణుని కుమారుఁడు. ఇతఁడు విశ్వేశ్వరు నారాధించి పుత్త్రునిఁ బడసెను. ఆ పుత్త్రుఁడు విశ్వసఖుఁడు. రఘు.

వ్యో

వ్యోముఁడు:– మయాసురుని కుమారుఁడు. ఒక రాక్షసుఁడు. కృష్ణుని సంహరించుటకై కంసుఁ డీతనిని బంపెను. వీఁడు కొందఱు గోపకుమారుల నెత్తుకొనిపోయి కొండగుహలోఁ బెట్టి దానికి రాయి మూతపెట్టెను. శ్రీకృష్ణుఁడు వీనితో యుద్ధముచేసి వీనిని సంహరించి బాలకులను బైటకుఁ దీసెను. భాగ.

శ

శంకుఁడు:–పాండవ వంశమువాఁడైన జనమేజయుని కుమారుఁడు. భార.

శంఖచూడుఁడు:–ఒక దానవుఁడు. దంభునికుమారుఁడు. ఇతఁడు బ్రహ్మనుగుఱించితపస్సుచేసెను. బ్రహ్మ ప్రత్యక్షమై కృష్ణకవచమిచ్చి, యది యున్నంతకాలము నీకెట్టిభయమును రాదు. నీవు బదరికావనముననున్న తులసిని వివాహమగుము అని చెప్పెను. ఆ మాటలు విని శంఖచూడుఁడు బదరికావనమున కరిగెను. అచ్చట దపస్సుచేసికొనఁబోవుతులసిని జూచి యామె రూపమునకు మెచ్చుకొని యామెతో సంభాషింపఁ దొడంగెను. ఒకరిపై నొకరికి వలపు గలుగసాగెను. ఆ సమయమునకే యచ్చటకు బ్రహ్మవచ్చి మీరు వివాహమగుఁడని చెప్పెను. బ్రహ్మ యాజ్ఞానుసారము శంఖచూడుఁడు తులసిని బరిణయమయ్యెను.

వారి యన్యోన్యప్రేమ వర్ధిల్లుచుండెను. శంఖచూడుఁడు ఇంద్రాదులపై దండెత్తనుద్యమించుచుండెను. దేవతలు తమలో యుద్ధయత్నము మానుమని చెప్పుటకుఁ బుష్పదంతుఁ డను దూతను శంఖచూడునికడకుఁ బంపిరి. ఎంత చెప్పినను శంఖచూడుఁడు కృష్ణకవచ మున్న గర్వముచే యుద్ధముచేయుటకే నుంకించుచుండెను. దేవతలు శివునిసహాయము తీసికొనివచ్చిరి. ఇతఁ డెంత యుద్ధముచేసినను శంఖచూడునిఁ గొట్టలేక పోవుచుండెను. అపుడు శివుఁడు విష్ణుమూర్తిని ప్రార్థించి శంఖచూడునికవచమును లాగికొమ్మని కోరెను. విష్ణుమూర్తి బ్రాహ్మణరూపమునవచ్చి శంఖచూడుని యాశ్రయించెను. నీవు కోరిన దిచ్చెదను వేఁడుకొమ్మని శంఖచూడుఁ డా కపటబ్రాహ్మణునితోఁ జెప్పెను; ఆతఁడు కవచమును వేఁడుటచే వాని నిచ్చివేసెను. కవచమువిడిచి రాఁగానే శివుఁ డాతనిని యుద్ధములో గెలువగలిగెను. యుద్ధమున మరణించిన శంఖచూడుఁడు దహింపఁబడి శాపవిముక్తి నొందెను. అట్లు దహింపఁబడుటచేఁ గల్గిన భస్మమునుండియే యతఁడు తనదగు పూర్వరూపము నొంది సుదాముఁ డనువాఁడై చనియెను.

శంఖచూడుని యస్థులనుండియే శంఖములు పుట్టినవి. శివ. బ్ర. వై.

శంఖచూడుఁడు:– ఒక గుహ్యుఁడు. కుబేరుని భటుఁడు. కృష్ణబలరాములు గానము చేయుచుండఁగా నితఁడువచ్చి తన యోగమాయచేత గోపికలను నుత్తరదిశగఁ గొనిపోయెను. వారెంత దూరము నడచినను గృష్ణునిఁ గానలేక కృష్ణా! అని పిలిచిరి. వారి యార్తనాదమువిని కృష్ణుఁడు వెళ్ళి వారిని విడిపించి బలరామున కప్పగించి శంఖచూడునిఁ బట్టి చంపి వాని శిరోరత్నమును దెచ్చి బలరామున కిచ్చెను. భాగ.

శంఖణుఁడు:– వజ్రనాభుని కుమారుఁడు

శంఖము:–ఒక ఏనుఁగు. ఇది ప్రభాసతీర్థముననుండి యటకువచ్చిన మునులను బాధపెట్టుచుండెను. దీనిని కేసరి యను వానరుఁడు చంపెను. రామా.

శంఖములు:– శివునిచేఁ జంపబడిన శంఖచూడుని యస్థులనుండి పుట్టెను. బ్ర. వై.

శంఖుఁడు:– ఒక బ్రాహ్మణుఁడు; బాహుదానదీ తీరముననుండువాఁడు. ఇతనితమ్ముఁడు లిఖితుఁడు.

శంఖుఁ డాశ్రమములో లేనపుఁడు లిఖితుఁ డంపలి ఫలములు కొన్ని భక్షించి యితఁడు వచ్చినపిదప నితనితోఁ జెప్పెను. తాను లేనపుడు భక్షించుట దొంగతన మగును గావున రాజునొద్దకుఁ బోయి దండనముపొంది రమ్మని శంఖుఁడు చెప్పెను. లిఖితుఁడు వెళ్ళి చేతులు నఱకించుకొని వచ్చి వీనికిఁ జూపెను. అదియే ధర్మ మని శంఖుఁడు మెచ్చుకొని దీవించి నది లోనికిఁ బోయి స్నానముచేసి రమ్మనియెను. లిఖితుఁడు స్నానముచేసి రాఁగానే యతని హస్తములు మరల వచ్చెను. భార.

శంతనుఁడు:-భీమసేనుని పుత్త్రుఁడైన ప్రతీపుని తనయుఁడు. దేవాపి యితని యగ్రజుఁడు; బాహ్లికుఁ డితని తమ్ముఁడు. గంగ ప్రతీపుని వరించుటయును, దనకుమారునకు భార్యవుకమ్మని తాను నుడువుటయును ప్రతీపుఁడు శంతనునకుఁ దెల్పి, యీతని నెవ్వతెయైనను గంగాతీరమున వివాహమగుటకు వచ్చినచో నామెను బరిగ్రహింపుమని చెప్పెను. ప్రతీపుఁడు రాజ్యము విడిచి తపోవనమున కేఁగెను. దేవాపియు వనముల కేఁగెను. శంతనునే రాజునుజేసిరి. కాని యతని రాజ్యమునఁ బండ్రెండుసంవత్సరములు వర్షములు లేకపోయెను. ఇతఁడు బ్రాహ్మణులను రావించి వర్షము లేల లేకుండెనని యడిగెను. శంతనునికంటెఁ బెద్దవాఁడును, రాజ్యార్హుఁడైనవాఁడు నుండఁగా వానిని విడిచి శంతనుని రాజును జేయుటయే కారణమని వారు చెప్పిరి. అపుడు కాననములు వెదకించి దేవాపిని దీసికొనివచ్చిరి. కాని యతఁడు పాషండులను చేరియుండెను. ఆ కారణమున నతఁడు రాజ్యార్హుఁడు కాఁడని మరల శంతనునకే పట్టముకట్టిరి. పదపడి యతని రాజ్యమున సువృష్టికలిగెను.

ఇతఁడు ఏవృద్ధునైనను దన కరములతో నంటినయెడల నా వృద్ధుఁడు నిండుజవ్వనముతో నలరారుచుండును.

శంతనుఁ డొకనాఁడు గంగాతీరమున సంచరించుచుండఁగా గంగ స్త్రీరూపమునఁగోచరించెను. ఆమెరూపమును జూచి శంతనుఁడు కామశరపీడితుఁ డయ్యెను. వీని యభిప్రాయ మెఱిఁగి గంగయు "ఓ రాజా! నేఁ జేసినదాని కంతకును నొడంబడుచు నన్ను నిష్ఠురము లాడకుంటివేని నీ భార్యనై యుండెద. నన్నుఁ బరుషములు పల్కితివా నిన్ను విడచిపోయెద. ఇందుకు సమ్మతించితివేని నన్ను బరిగ్రహింపుము" అనియెను. అద్దానికి శంతనుఁ డంగీకరించి యామెను వివాహమయ్యెను. గంగ గర్భవతి యయ్యెను. శిశువు పుట్టఁగనే దానిని దీసికొనిపోయి యామె నదీజలములందుఁ బడవేసెను. శంతనుఁడు దానిని సహింపలేకయు, నామెను పరుషములు పలుకలేకయు నూరకుండెను; ఆమె అట్లేడుగురు శిశువులను జంపెను. అష్టమశిశువు జన్మించెను. శంతనుఁ డామెను జేరి, నీవు పుత్త్రఘాతినివై పుట్టిన కుమారులను జంపితివి. వీని నింకఁ జంపనీయనని యె. అదిగో నీశపథముతప్పి పరుషము లాడితివి. కాఁబట్టి నిన్ను విడచిపోయెదనని, గంగ తన వృత్తాంతమును, దన గర్భమందుఁ బుట్టిన వసువులవృత్తాంతమును జెప్పి అష్టమశిశువగు భీష్మునిదెచ్చి శంతనున కప్పగించి వెడలిపోయెను. భార.

శంతనుఁడు వేఁటకుఁబోయినపుడు శరస్తంభమునఁ బెరుగుచుండిన శిశువులను గృపతోఁదెచ్చి వారిని బెంచెను. వారుకృపియును, కృపాచార్యుఁడును అనువారలు.

శంతనుఁ డొకనాఁడు యమునాతీరమునందు వేఁటాడుచు నపూర్వసుగంధం బాఘ్రాణించి యది వచ్చినమార్గమునఁ బోయి యోజనగంధిని జూచెను. ఆమెరూపవిలాసములు చూచి మోహించి నీ వెవ్వరిదానవు? వని యడిగి తెలిసికొని పిమ్మట దాశరాజు కడకుఁ జని యోజనగంధిని తనకిచ్చి వివాహముచేయుమని కోరెను. శంతనున కిచ్చుట కాతఁడునుసమ్మతించెనుగాని, యీమెకుఁ బుట్టు కుమారునకే రాజ్యమొసఁగునట్లు శపథము చేయుమనెను. శంతనుఁడు తన పెద్దకుమారుఁ డగు భీష్మునిఁదలఁచుకొని యట్టి శపథము చేయలేకమగిడివచ్చి చింతాక్రాంతుఁడై యుండెను. చిన్నవోయి విచారముతో నుండిన తండ్రినిఁజూచి భీష్ముఁడు దాశరాజుకడకుఁ జని తాను రాజ్యమును గైకొననియును, వివాహము చేసికొననియును శపథముచేసి సత్యవతినిదెచ్చి తండ్రి కర్పించెను. సత్యవతివలన శంతనునకు

చిత్రాంగదుఁడు, విచిత్రవీర్యుఁడు అను నిరువురు పుత్రులను గల్గిరి. శరస్తంభమునఁ బెరుగుచుండిన కృపుని శంతనుఁడు పెంచెను. శంతనుఁడు పూర్వ భవమున మహాభిషుఁడనువాఁడు. భార.

శంబరాసురుఁడు:-జటాసురునిపుత్త్రుఁడు. కృష్ణుని కుమారుఁడగు ప్రద్యుమ్నునిచే వానికి మరణము వచ్చునని యాకాశవాణి పలుకుట వీఁడు వినెను. తనకుఁ బ్రాణభయము లేకుండఁ జేసికొనుటకు శంబరుఁడు ప్రద్యుమ్నుని పురిటి యొనిమిదవ నాఁడే రహస్యముగఁ బురిటిల్లు ప్రవేశించి యా శిశువు నెత్తుకొనిపోయి సముద్రములోఁ బడ వేసెను. ఈ శిశువు నొక చేఁప మ్రింగెను. జాలరివాఁడు చేఁపలు పట్టుచుండ నీ చేఁపయు వాని వలలోఁబడెను. ఈ చేఁప పెద్దదిగా నుండుటచే వాఁడు దానిని శంబరాసురుని కూఁతురున కిచ్చెను. ఆమె చేఁపను దఱుగుచుండఁగా బాలుఁడు గనఁబడియెను. ఆమె నివ్వెరపాటు నొంది చూచుచుండఁగా నారదుఁడు వచ్చి యీ బాలుఁడు ప్రద్యుమ్నుఁడని చెప్పెను. శంబరుఁడా మాటలు విని వానిని జంపుటకై వచ్చెను. శంబరుఁడును, బాలుఁడును బోరాడిరి. కాని శంబరుఁడు ప్రద్యుమ్నునిచేఁ జంపఁబడెను. విష్ణు.

శంబరుఁడు:-ఒకముని. మాహిష్మతి మహిషరూపమున వచ్చి హోమగుండములను బాధుచేయుచుండఁగా నీవును శంబరరూపముననే యుందువని యితఁడు శపించెను. ఆమె శాపవిమోచనమునకై ప్రార్థింపఁగా నామెకుఁ గుమారుఁడుపుట్టిన పిదప శాపవిమోచనమగుననియునితఁడుచెప్పెను. వరా.

శంబళపురము:-కలియుగమున విష్ణుమూర్తి విష్ణువర్మ యనుపేరుతో నవతరించు పట్టణము. భార.

శంబుఁడు:- (శాకల్యుఁడు.) హస్తినాపురమందలి యొక బ్రాహ్మణుఁడు. ధృతరాష్ట్రుఁ డరణ్యవాసము చేయుటకుఁ బురజనులతోఁ జెప్పెను. వారల వచనముగా నితఁడు ధృతరాష్ట్రునితో వారి తక్కువమియును లేదనియును, దుర్యోధనాదుల బరిపాలనమునందును దాము సుఖించితిమని యును జెప్పెను. భార.

శంబుకుఁడు:-ఒక శూద్రయోగి. శ్రీరాముఁడు రాజ్యముచేయునపుడు ఈ యోగి తపస్సుచేసి తన తపోమహిమచే నింద్రలోకమునకుఁ బోవ సిద్ధముగ నుండెను. ఈ శూద్రుఁడు తపస్సు చేయుటవలన బ్రాహ్మణబాలుఁడు చనిపోయెను. ఇట్లు వికృతము జరిగెనుగావున రాముఁడు శంబుకుని సంహరించెను. ఉ. రా.

శంభుఁడు:-అంబరీషుని పుత్త్రుఁడు. హరినిగూర్చి తపస్సుచేయుటకు వనమునకుఁబోయెను. భాగ.

శంభువు:-ధ్రువునిభార్య. శిష్టి, భవ్యుఁడు ఈమె కుమారులు. విష్ణు.

శంయుఁడు:-బృహస్పతికుమారుఁడు. ఇతనిభార్య సత్య. భరద్వాజుఁడు, భరతుఁడు ఇతనిపుత్త్రులు. భార.

శకుంతల:-విశ్వామిత్రునకును, మేనకకును బుట్టిన కూఁతురు. పుట్టిన యల్పకాలములోనే తల్లిదండ్రు లీమెను దిగవిడిచి వెళ్ళిపోయిరి. పక్షులే తమ ఱెక్కలనీడనిచ్చి యీమెను గాపాడుచుండెను. అట్లు శకుంతములచే రక్షింపఁబడు నా శిశువును గణ్వుఁడుచూచి తనయాశ్రమమునకుఁ గొనిపోయి పెంచి శకుంతల యను పేరుపెట్టెను. ఒకనాఁడు వేఁటకై వచ్చిన దుష్యంతుఁడు కణ్వుని జూడఁగోరి కణ్వాశ్రమమునకు వచ్చి యచ్చట నీమెను జూచి యెవ్వరిదానవని యడిగెను. శకుంతల వాని కాతిథ్యమిచ్చి తన జన్మవృత్తాంతము తాను వినినట్లు రాజునకుఁదెల్పి వనమునుండి కణ్వుఁడు వచ్చువఱకు నాగుమనియెను. దుష్యంతుఁ డీమెను దనదేవియై తనతోరమ్మని కోరెను. ఈమె కణ్వునిచే నీయఁబడక పరిణయముకాఁజాలనని చెప్పెను. గాంధర్వవివాహము క్షత్త్రియులకు ధర్మమే యని దుష్యంతుఁ డీమె నొడంబఱచెను. తనకుఁ బుట్టిన పుత్త్రునే యువరాజుగఁ జేయుమని శకుంతల కోరఁగా దుష్యంతుఁ డంగీకరించెను. వీ రిరువురును గాంధర్వమున వివాహముచేసికొనిరి. తాను రాజధానికిఁ బోయి యీమెను దోడితేరఁబంపెదనని దుష్యంతుఁడు వెడలిపోయెను. ఈమె తాఁ జేసిన కార్యమునకు గణ్వుఁడు యేమనునో యని చిన్నవోయి

యుండెను. కాని యతఁడు యోగదృష్టివలన నెఱింగి శకుంతల వివాహమయినందుకు సమ్మతించెను. ఎంతకాలము వేచియున్నను దుష్యంతునికడనుండి వర్తమానము లేదు. ఇట్లు జరుగుటకుఁ గారణముకలదు. ఒకనాఁడు దుర్వాసుఁడు వచ్చినపుడు దుష్యంతునే ధ్యానించుచుండిన శకుంతల యా మునిని జూడలేదు. అతనికిఁ గోపమువచ్చి నీ వెవరిని దలఁచుచు నుంటివో యాతఁడు నిన్ను మఱచిపోవునుగాక యని శపించెను. ఆమెచెలికత్తె శాపవిమోచనము చేయుమని మునిని వేఁడగా దుష్యంతుఁడిచ్చిన యుంగర మతఁడు చూచినపుడు జ్ఞాపకము వచ్చునని ప్రసాదించెను. శకుంతలకు భరతుఁడను బాలుఁడు పుట్టి పెరుగుచుండెను. తుదకుఁ గణ్వుఁడే యామెను, కుమారునిఁ దన శిష్యుల నిచ్చి దుష్యంతునికడకుఁ బంపెను. మొదట దుష్యంతుఁడు మీ రెవ్వరో నే నెఱుఁగను, పో పొండని నిరాకరించెను. కాని యీ సాధ్వి నీ భార్య, యీ బాలుఁడు నీ పుత్త్రుఁడు. వీరిని బరిగ్రహింపుము అని ఆకాశవాణి పలుకుటచే దుష్యంతుఁ డీమెను బరిగ్రహించెను. భార.

శకుని:-హిరణ్యాక్షుని పుత్త్రుఁడు. మత్స్య.

శకుని:- దుర్యోధనుని మేనమామ. వృషకుఁడు, అచలుఁడు ఇతనిసోదరులు. ఇతనిపుత్త్రుఁడు ఉలూకుఁడు. శకుని హస్తినాపురముననే యుండువాఁడు. దుర్యోధనాదుల దురాలోచనల కితఁడు తోడ్పడుచుండును. ధర్మజునిరావించి జూదమునాడుమని చెప్పినవాఁడితఁడే. ఆ జూదమందితఁడే వంచనచేసెను. వనవాసముచేయుచున్న పాండవులను నేదోయుపాయమున సంహరింపుమని యితఁడు బోధించెను. యుద్ధములోఁగూడ నితఁడు మాయలు చేయఁబోయెనుగాని యర్జునుఁడు వీనిమాయలకు మోసపోలేదు. వీనిని నకుల సహదేవులు సంహరించిరి. భార.

శక్తి:-వసిష్ఠుని పెద్దకుమారుఁడు. ఇతనిభార్య అదృశ్యంతి. ఇతనిని, నితని సోదరులను రుధిరుఁడను రాక్షసుఁడు మ్రింగివేసెను. అప్పటి కదృశ్యంతి గర్భవతియై యుండెను. పుత్త్రశోకముచేఁ బ్రాణములపై నాశ వదలినవారైనను వసిష్ఠుఁడును, నరుంధతియుఁ బౌత్త్రునిఁ జోషించుకొఱకు జీవించియుండిరి. అదృశ్యంతికిఁ బరాశరుఁడు జన్మించెను. లిం.

శక్తి:-కల్మాషపాదుఁడను రాజు వేఁటకు వచ్చి మార్గముతప్పి తిరుగుచుండఁగా నా త్రోవలో నితఁడు వచ్చుచుండెను. ఆ రాజు, "నేను వచ్చుచుండఁగా నీవేల తొలఁగవు? ఇంతకావరమా?" అని యడిగెను. "నేను బ్రాహ్మణుఁడను. వేదపారగుఁడను. అట్టివారు వచ్చినప్పుడు ఏరాజులైనను మార్గమిత్తురు" అని శక్తి పలుకఁగా శక్తిపై రాజునకు ఆగ్రహము వచ్చి "నీవు రాక్షసత్వమును బూనితివి గావున రాక్షసుఁడవై యుండు" మని శపించెను. వసిష్ఠునకు విరోధియగు విశ్వామిత్రుఁ డది యెఱింగి యుండెను. వాని యాదేశమునఁ గూడఁ గింకరుండగు రాక్షసుఁడు కల్మాషపాదు నంతరాత్మలో నావేశించెను. మఱియొక బ్రాహ్మణుఁడుకూడఁ గల్మాషపాదుని నీవు మనుజాశనుఁడ వగుమని శపించెను. ఈ శాపముగూడ శక్తిమూలముననే వచ్చినదనియు, శాపఫలితము నీవే ముందు భరింపుమనియు కల్మాషపాదుఁడు శక్తిని, వాని నూర్వురతమ్ములను మ్రింగివేసెను. భాగ.

శక్తిమతి:-సురథుఁ డను రాజు పాలించిన పట్టణము. జై. భా.

శక్రదేవుఁడు:- కళింగాధిపతియైన శ్రుతాయువు కుమారుఁడు. ఇతఁడు దుర్యోధనుని పక్షమున బోరెను. భీముఁ డీతనినిఁ గూల్చెను. భార.

శచి:-ఇంద్రుని భార్య. ఈమె కుమారుఁడు జయంతుఁడు. కుమారిత జయంతి.

నహుషుఁ డింద్రుఁడైనపుడు అతఁడు శచీదేవిని వలచి తన కోరికను దీర్పుమనెను. ఆ సమయమున నామెభర్త బ్రాహ్మణహత్యాపాతకమునకు వెఱచి డాఁగియుండుటచే నామె బృహస్పతితోఁ దనకుఁ గలుగఁబోవు హానిని జెప్పెను. మఱియు నుపశ్రుతి నాశ్రయించి తననాథునకు నహుషుఁ డాడినమాట తెలిపెను. పిమ్మట శచీదేవి, నహుషుఁడు సప్తఋషులు మోసికొనివచ్చిన పల్లకియెక్కి వచ్చినయెడల వానిని గూడెదనని సందేశమంపెను. ఆ మాటలకు నహుషుఁడు సంతోషించి అగస్త్యాది మునులను దనకుఁ బోయీలుగ రమ్మనియె.

మునుల నట్లు కూలవాడుటచే నహుషుని శపించిరి. శచీదేవి యట్లు తనకుఁ గలుగఁబోవు నాపదఁ బాపికొనియెను.

శచీదేవి:-కన్యకాంబయై వెలసెను. (చూడుము కన్యకాంబ.) భార.

శతగామి:-జటాయువు పుత్త్రుఁడు.

శతగోపుఁడు:- ఒక గొల్లవాఁడు. నందుని బావ మఱఁది. రాధతండ్రి. పాండు.

శతజిత్తు:-సహస్రజిత్తు యొక్క కుమారుఁడు. మహాహయుఁడు, వేణుహయుఁడు, హేహయుఁడు ఇతని కుమారులు. ఇతని సంతతివాఁడే కార్తవీర్యార్జునుఁడు. భాగ.

శతద్యుమ్నుఁడు:-చాక్షుషమనువు కుమారుఁడు. మత్స్య.

శతద్రు:-ఒక నది. వసిష్ఠుని నూర్వురు పుత్త్రులను గల్మాషపాదుఁడు సంహరించుటచే వసిష్ఠుఁడు పుత్త్రశోకమును భరించలేక దేహమును విడువఁగోరి నదిలోఁ బడఁగా నది వసిష్ఠుని నంటి వెఱచి శతవిధంబులఁ బరిద్రుతమయ్యెను. కావున నప్పటినుండియును నా స్థలమునకు 'శతద్రు' అని పేరుకలిగెను. భార.

శతధన్వుఁడు:-అశోకుని వంశములోనివాఁడగు సోమశర్మని పుత్త్రుఁడు. ఇతని కుమారుఁడు బృహద్రథుఁడు. భాగ.

శతధన్వుఁడు:-ఒకరాజు. సత్రాజిత్తు తనకుమార్తె యగు సత్యభామను మొదట నితని కిత్తుననియె; కాని యీయక యామెను శ్రీకృష్ణునకిచ్చి వివాహము చేసెను. దానిని శతధన్వుఁడు ఎగ్గుగాఁ దలఁపలేదు. కృతవర్మయు, నక్రూరుఁడును వీనికడకు వచ్చి, సత్రాజిత్తు నీకుఁజేసిన యవమానము నేల సహించి యూరకుందు? వని పురికొల్పి, వానిని సంహరింపుమనిరి. వారి మాటవిని శతధన్వుఁడు సత్రాజిత్తు నిద్రపోవుచుండఁగా వానిని జంపెను. తండ్రిమరణమునకు సత్యభామ మిక్కిలి దుఃఖించెను. శ్రీకృష్ణుఁడు శతధన్వునిమీఁదకు యుద్ధమునకు వచ్చెను. ఇతఁడు కృతవర్మను, అక్రూరుని సహాయము చేయుఁడని పిలిచెను. వారు రామనిరి. శతధన్వుఁడొక్కఁడే శ్రీకృష్ణునితోఁ బోరి వానిచేతఁ జంపఁబడెను. భాగ.

శతబిందువు:- బిందుమతి తండ్రి. ఇతఁడు తన కుమారితను మాంధాత కిచ్చి వివాహముచేసెను. భాగ.

శతయూపుఁడు:- ఒక రాజర్షి. కేకయవంశము వాఁడు. కురుక్షేత్రమున నితనియాశ్రమమున్నది. వనవాసముచేయుటకు ధృతరాష్ట్రుఁడు వచ్చుట విని యితఁడు తన యాశ్రమమునకు వారి నాహ్వానించెను. ఇతని పితామహుఁడగు సహస్రచిత్యుఁడను రాజు రాజ్యభారమును తన పెద్ద కొడుకగు శతద్యుతునందుఁ బెట్టి యిచ్చటనే తపముచేసెను. ఇతఁ డాశ్రమమున నుండఁగా నారదాదులు వచ్చి యితనినిఁ జూచిరి.

శతరూప:- బ్రహ్మమానసమునుండి సగము స్త్రీరూపముగను, సగము పురుషరూపముగను బుట్టిన శక్తి. మత్స్య.

శతవలి:- సుగ్రీవునిసేనలో నొక నాయకుఁడు. సీతను వెదకుటకై యుత్తరదిశగా వెళ్ళెను. రామా.

శతశృంగము:- ఒక పర్వతము. పాండురాజీపర్వతముచెంతనే తపస్సుచేసెను. భార.

శతశృంగుఁడు:- ఒక దానవుఁడు. సదముఁడు. విదముఁడు, దముఁడు అనువారల తండ్రి. భార.

శతహ్రాద:-జయుఁడను దనుజుని భార్య. విరాధుని తల్లి. రామా.

శతానందుఁడు:- అహల్యాగౌతముల కుమారుఁడు. జనకరాజునకుఁ పురోహితుఁడు. సత్యధృతి ఇతని పుత్త్రుఁడు. భార.

శతానీకుఁడు:- ఉప పాండవులలో నొకఁడు. ద్రౌపదీనకులుల పుత్త్రుఁడు. భార.

శతానీకుఁడు:- విరాటరాజు తమ్ముఁడు. రణమున భీష్మునిచేఁ జంపఁబడెను. భార.

శతానీకుఁడు:- జనమేజయుని కుమారుఁడు. ఇతనికి భూమి, వసుమతి అనునిద్దఱు భార్యలుకలరు. కాని సంతానము లేకపోవుటచే శాండిల్యమహామునిచేఁ బుత్త్రేష్టి చేయించెను. పిమ్మట సహస్రానీకుఁడను పుత్త్రుఁడు కలిగెను. ఈ పుత్త్రునికేఁ అశ్వమేధదత్తుఁడను పేరుకూడఁ గలదు. శతా

నీకుని మంత్రి యౌగంధరుఁడు. శతానీకుఁడు రాజ్యము పుత్త్రునికప్పగించి తపోవనమున కరిగెను. కాని యింద్రుఁ డసురులతోఁ జేయు యుద్ధమునఁ దనకు సహాయముగ రమ్మనఁగ నితఁడు వెళ్ళి యా యుద్ధములో మరణించెను. మాతలి యీతని శరీరమును భూలోకమునకుఁ దీసికొని వచ్చెను. వాని కగ్నికార్యములు గావించి వాని భార్యలు సహగమనము చేసిరి. భార. భాగ.

శతాయువు:-పురూరవునకు ఊర్వశియందుఁ బుట్టిన కుమారుఁడు. భార.

శత్రుఘాతి:-శత్రుఘ్నుని పుత్త్రుఁడు. వైదిశము అను పురి కితనిని రాజును జేసిరి. రామా.

శత్రుఘ్నుఁడు:- దశరథునకు సుమిత్రయందుఁ బుట్టిన కుమారుఁడు. ఇతని సోదరుఁడు లక్ష్మణుఁడు. కాని శత్రుఘ్నుఁడు సదా భరతునితోఁ గలిసి యుండువాఁడు. ఈ సోదరులు ముగ్గురకును రామునియందు భక్తిమెండు.

సీతకుఁ బినతండ్రియొక్క కుమారిత యగు శ్రుతకీర్తి యితని భార్య. సుబాహుఁడు, శ్రుతసేనుఁడు ఇతని కుమారులు. భాగ.

ఇతఁడును, లక్ష్మణుఁడు నగరము విడిచి చనిన పిమ్మట రామునితోఁ గలసి సరయూనదియందుఁ గ్రుంకి పరమపదము నొందెను. రామా.

శత్రుజిత్తు:-ఒక రాజు. ఋతధ్వజుని (కువలయాశ్వుని) తండ్రి.

శత్రుజిత్తు ఋతధ్వజుఁడనియును, శత్రుజిత్తు అనియును భీమరథుని పుత్త్రుఁడైన ప్రతర్దనుఁడే ప్రసిద్ధినిగాంచెను. ఇతని పుత్త్రుఁడు కువలయాశ్వుఁడు. మార్క.

శత్రుజిత్తు:-ధ్రువసింధువను రాజు కుమారుఁడు. ఇతనితల్లి లీలావతి. ధ్రువసింధువు చనిపోయిన పిమ్మట రాజ్యమును సవతితల్లి కుమారుఁడైన సుదర్శనున కీయఁదలఁచుకొనిరి. లీలావతి తండ్రి యుధాజిత్తు వచ్చి శత్రుజిత్తు పెద్దకుమారుఁడు గాన నీతనికీయవలయుననియె. అందుపైన సుదర్శనుని మాతామహునకును, యుధాజిత్తునకును యుద్ధమయ్యెను. యుధాజిత్తే గెలిచెను. కావున శత్రుజిత్తే రాజయ్యెను. దే. భా.

శబరి:- ఒక బోయకాంత. పంపాతీరమున గురువులను గొలుచుచు, భక్తినెఱపుచు యోగనిష్ఠలో నుండెను. ఆమె యోగనిష్ఠచే సమాధిని గల్పించుకొనదలఁచియును, శ్రీరాముఁడు చిత్రకూటమునకు వచ్చియున్నాఁడని విని వానిని జూడవలెనను నపేక్షతోడను జీవించియుండెను. ఈమెను గూర్చి కబంధుఁడు శ్రీరామునకుఁ జెప్పుటచే శ్రీరాముఁడీమెను జూడవచ్చెను. శ్రీరాముఁడు వచ్చినప్పటినుండియు వాతని కీయవలయునని యీమె ఫలములను సేకరించియుండెను. కావున వానికిచ్చి నమస్కరించి సంతృప్త హృదయయై యగ్నిని గల్పించుకొని దివికేగెను. రామా.

శబలము:-ఒక ఏనుఁగు. ప్రభాసతీర్థమున నుండి మునులను బాధపెట్టుచుండెను. దానిని కేసరి యను వానరుఁడు చంపెను.

శబళాశ్వులు:-అసిక్నియందు దక్షునకుఁ బుట్టిన కుమారులు. సృష్టిచేయుఁడని వారిని దండ్రినియమించెను. వారదానికి కడంగుచుండఁగా నారదుఁడు వచ్చి మీ కా సంసారబంధనమేల? ముక్తిసాధనము చూచుకొనుఁడు. మీ యన్నలు హర్యశ్వులు సృష్టిచేసిరా? వారు పోయిన మార్గముననే మీరునుబొండు అని చెప్పెను. వీరు నారదునిమాట విని సృష్టిచేయుటమాని తపోవనమున కరిగిరి. భాగ.

శమంతపంచకము:-పరశురాముఁడు వైరిక్షత్రియసంహారము గావించి యారక్తమైదు మడుగులుగఁజేసి పితృతర్పణము చేసెను. తత్సమీప ప్రదేశంబునకు శమంతకపంచకమని పేరు. ఆ తావునఁ గురుపాండవులు యుద్ధము సేయుటచె దానికిఁ గురుక్షేత్రమనియును పేరు వచ్చెను. భార.

శమఠుఁడు:- ఒక ముని. ధర్మరాజునకు గయా మాహాత్మ్యమును, అక్కడ యాగమును జేసిన గయునిఁగూర్చియును తెలియఁజేసెను. భార.

శమీకుఁడు:-ఒక ముని. పరీక్షిన్మహారాజు వేఁటాడి డస్సి జలమునకై వెదకుకొనుచు నితనియాశ్రమమును జేరి జలము నిమ్మని యితని నడిగెను. ఇతఁడు సమాధియం దుండుటచే ఆ మాటలు వినలేదు. కన్నులు తెఱచి చూడలేదు. దాన

రాజునకు మిక్కిలి కోపమువచ్చినది; ఆ ప్రక్కను చచ్చిపడియున్న సర్పమునుదెచ్చి యితని మెడలో పడవేసి చనియెను. రాజిట్లు చేసినని శమీకునికుమారుఁడైన శృంగి విని వచ్చి తండ్రి మెడలోనుండి సర్పమును దీసివేసి ఆ సర్పమును వేసినవాఁ డేడుదినములలో సర్పహతుఁడగునని శపించి తండ్రికన్నులు తెఱచినపిమ్మట నతనితో నీ వృత్తాంతమును జెప్పెను. రాజును శపించినందుకు శమీకుఁడు మిక్కిలి చింతనొందెను. తమ్మును గాపాడుచుండు భూపాలకుని శపింపరాదని చెప్పెను. కాని శాపము మరలించుట సాధ్యముకాదు. కావున ముందుజాగరూకతకై పరీక్షిత్తునకు శాపవృత్తాంతము చెప్పుమని తన శిష్యు నొక్కని బంపెను.

తార్క్షిగర్భమునుండి క్రిందఁబడిన గ్రుడ్లను నితఁడు దీసి కాపాడెను. (చూడుము తార్క్షి) భాగ.

శముఁడు:-ధర్ముఁడను మనువుపుత్త్రుఁడు. ప్రాప్తి ఇతని భార్య. భార.

శమ్యాకుఁడు:-ఒక బ్రాహ్మణుఁడు; భీష్మునితో ధనమునుగూర్చి వాదముచేసెను. భార.

శమ్యాప్రాసము:-వేదవ్యాసుని యాశ్రమము పేరు. సరస్వతీనదికిఁ బడమటితీరమున నున్నది. వేదవ్యాసుఁడు నారదునిచేఁ బ్రబోధితుఁడై ఇచ్చటనే భాగవతమును రచించెను. భాగ.

శరద్వంతుఁడు:-గౌతముని పుత్త్రుఁడు. ఇతఁడు వేదమునుగాక మొదటినుండియు ధనుర్వేదమునె యభ్యసించెను. పదపడి మహానిష్ఠతోఁ దపము సేయుచుండెను. ఇంద్రుఁ డితని తపోమహిమకు భయపడి తపోభంగముసేయుటకు జానపది యను సుందరాంగిని బంపెను. ఈమెను జూచి ముని కామపరవశుఁడై యుండ రేతఃపతనముకూడ సంభవించెను. శరద్వంతుఁ డచ్చోటుఁబాసి వేఱొకచోటికేఁగి తపస్సుచేసికొనుచుండెను. ఆ వీర్యము శరస్తంభమున ద్వివిధమై పడి బాలుఁడును, బాలికయు నయ్యెను. ఆ ప్రాంతములకు వేఁటకు వచ్చిన శంతనుఁ డీ శిశువులనుజూచి వారిని దన యింటికిఁ దోడ్కొనిపోయెను. ఇట్లేర్పడిన పుత్త్రునకుఁ గృపుఁడనియును, పుత్త్రికకుఁ గృపి యనియును పేరుపెట్టెను. పదపడి శరద్వంతుఁడు శంతనునికడకు వచ్చి వారిరువురు తన సంతానమని చెప్పి కృపునకు విలువిద్య నేర్పెను. భార.

శరభంగుఁడు:- ఒక ముని. దండకారణ్యములో నుండువాఁడు. ఇతఁడు చేసిన తపమునకు మెచ్చుకొని యితనిని స్వర్గలోకమునకుఁ దీసికొని వెళ్లుటకింద్రుఁడే వచ్చెను. కాని శ్రీరాముఁడు దండకారణ్యమునకు వచ్చెనని విని యతనిని జూచుటకై యింద్రునితో వెళ్ళక యితఁ డాగెను. సీతారామలక్ష్మణు లితని యాశ్రమమునకు వచ్చిరి. ఆ వనములోఁ దమకు నిలువఁదగినచోటు చెప్పుమని రాముఁ డితని నడిగెను. సుతీక్ష్ణుఁడను మునియొద్దకు వెళ్ళి యడుగుఁడని చెప్పి శ్రీరాముని దర్శించి కృతార్థుఁడయ్యెను. కాన శరభంగుఁడు వహ్నికల్పించి శరీరమును దహించుకొని స్వర్గముచేరెను. రామా.

శరవణము:- ఒక యరణ్యము. పార్వతీ పరమేశ్వరులు రహస్యముగ నచ్చట విహరింతురు. వారొకసారి యచ్చట రతిక్రీడలం దేలుచుండఁగాఁ గొందఱు పురుషు లచ్చటికి వచ్చిరి. పార్వతి వారిని జూచి సిగ్గుపడి తొలఁగెను. ఆమెకుఁ గ్రీడాభంగము కలుగుటచేఁ గోపము వచ్చి ఆ యరణ్యముచుట్టు దశయోజనముల మేరలో వచ్చువారికి స్త్రీత్వము వచ్చునని శపించెను. అచ్చటికి వచ్చి ఇలుఁడు స్త్రీ యయ్యెను. మత్స్య.

శర్మిష్ఠ:-వృషపర్వుఁడను దానవేశ్వరుని కుమార్తె. ఈమెయును, దేవయానియును, వీరి చెలికత్తెలును జలకము లాడఁజని కొలనుగట్టునఁ గట్టిన బట్టలు పెట్టుకొని స్నానము చేయుచుండిరి. ఇంతలో గాలివచ్చి వీరి బట్టలన్నియును గలసిపోయెను. శర్మిష్ఠ జలకములాడి వచ్చి తెలియక దేవయానిబట్ట కట్టుకొనియెను. దేవయాని వచ్చి తనబట్ట శర్మిష్ఠ కట్టుకొనుటఁ జూచి "నేను బ్రాహ్మణ బాలికనుగదా! మా తండ్రి మీ కులగురువు. నీవు విడిచిన బట్టలు నేను కట్టుకొందునా? యని పరుషముగఁ బలికెను. మా తండ్రికడ మీయయ్య సేవకుఁడని యెఱుఁగవా? నీకింత కావరము వచ్చెనని శర్మిష్ఠ—

దేవయానిని నూతిలోనికిఁ ద్రోసి తన యింటికి వెళ్ళిపోయెను. పిమ్మట దేవయానియును, శుక్రుఁడును వృషపర్వునినగరము విడిచి వెళ్ళిరి. ఈ సంగతి వృషపర్వుఁడు తెలిసికొని శుక్రుఁడు తన నగరముననేయుండుటఁ గోరి దేవయాని నొడంబఱచుటకై శర్మిష్ఠను నామెకు దాసిగాఁ బంపెను. అప్పటినుండియు శర్మిష్ఠ దాసియై దేవయానినే కొలుచుచుండెను. దేవయాని వివాహమయి, యతని నగరమునకు వెడలినపు డీమెయు దేవయానితో నరిగెను.

దేవయానికి సంతానము కలిగినపుడు తనకును బుత్త్రదానము చేయుమని యయాతి నీమె ప్రార్థించెను. వెనుక శుక్రునితో శర్మిష్ఠ శయనము చేరకుండుమని వచించి యిపు డామెతో సంభోగించుటకు యయాతి సందేహించెను. వధూజన సంగమమందును నసత్యదోషము రాదని యీమె రాజు నొడంబఱచి యాతని పొందును బడసెను. శర్మిష్ఠ కొక కుమారుఁడు కలిగెను. అది దేవయాని యెఱింగి, కన్యవుగదా నీకుఁ బుత్త్రుఁ డెట్లు కలిగెనని శర్మిష్ఠ నడిగెను. ఋతుమతియైన తనకు మునియొకఁడు పుత్త్రోత్పత్తి చేసెనని యీమె చెప్పెను. ఈమెకు యయాతివలననే ద్రుహ్యు, అనువు, పూరుఁడు అను కుమారులు కలిగిరి. యయాతి యనంతరము శర్మిష్ఠకుమారుఁడైన పూరుఁడే రాజయ్యెను. భార.

శర్యాతి:-బహుగతుని కుమారుఁడు.

శర్యాతి:-ఒకరాజు. వైవస్వతమనువుకుమారుఁడు. ఇతనిభార్య స్థవిష్ఠ. ఇతనికి సుకన్య యను కుమారితకలదు. ఒకనాఁ డితఁడు కుమారితను గూడఁ దనవెంటఁ గొంపోయి యరణ్యమునఁ ద్రిమ్మరుచుండెను. ఇతఁ డంగిరుని సత్త్రయాగమందు రెండవనాటి కర్మలెల్లఁ జెప్పెను. ఇతనితో నీతని కుమార్తెకూడఁ దపోవనమునకు వచ్చి యటఁ దిరుగుచు నొక పుట్టనుండి మిఱుమిట్లు గొలుపుచున్న కాంతులు వచ్చుట చూచి వానిని ముల్లుతోఁ బొడిచెను. అందుండి రక్తమువచ్చెను. పిమ్మట శర్యాతి పరిజనములకు మూత్రపురీషములు బద్ధమయ్యెను. ఇట్లగుటకు గారణము సుకన్య పుట్టను ద్రవ్వుటయేయని శర్యాతిగ్రహించి పుటయొద్దకు వచ్చి చూచెను. అందున్న చ్యవనునిఁ గాంచి నమస్కరించి తన కుమారిత చేసిన దోషము నా మన్నింపుమని వేఁడెను. సుకన్యను దనకిచ్చి వివాహముచేసినచో క్షమింతునని చ్యవనుఁడు నుడివెను. శర్యాతి తన కూఁతును చ్యవనునకిచ్చి వివాహమును గావించెను. శర్యాతి యాగమును జేయఁగోరి యల్లుని, కూఁతుని దీసికొనివచ్చుటకు జ్యవనుని యాశ్రమమునకుఁ బోయెను. అచ్చట ముదుసలి యగు చ్యవనుని గానక వయోరూపములతో నొప్పుచున్న పడుచువానినిఁ దన పుత్త్రిక ప్రక్కనఁ జూచెను. తనకుమారితయే ధర్మము తప్పి ముసలిపతిని విడచి యీవిటుకానిని గూడెనని విలపించెను. సుకన్య జరిగినదంతయును జెప్పెను. (చూడుము సుకన్య) ఈ పడుచువాఁడు సంప్రీతుఁడై యామెను దీవించి వారిని గొని పోయెను. శర్యాతిచేతఁ జ్యవనుఁడు యజ్ఞమును గావించె; ఆ యజ్ఞమందే చ్యవనుఁడు అశ్వినీదేవతలకు యజ్ఞభాగము నిప్పించెను. శర్యాతికి సంయాతి, ఆనర్తుఁడు, ఉత్తానబర్హి, భూరిషేణుఁడు అను కుమారులు కలిగిరి.

భార, భాగ, మత్స్య.

శర్యాతి:-పూరుని వంశములోనివాఁడగు సుద్యుత్స కుమారుఁడగు బహుగతుని తనయుఁడు. ఇతని పుత్త్రుఁడు సంయాతి. భాగ.

శర్వుఁడు:-మాధావంశుని కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు ఇంద్రసేనుఁడు. భాగ.

శలావంతుఁడు:-శలకుని తండ్రి. ఛాన్దో. ఉ.

శలుఁడు:-గాంధారి పుత్త్రుఁడు.

శలుఁడు:-సుశోభనా పరీక్షిత్తుల పుత్త్రుఁడు. ఇతఁ డొకనాఁడు వేఁటకేఁగి యొక మృగమును దఱిమెను. ఇతఁడెంత వేగముగ వెళ్ళినను ఇతనికంటె నది వేగముగాఁ బోవుచుండెను. ఇఁక ఇతని గుఱ్ఱములు పరుగిడలేవనియు, వామదేవుఁడను బ్రాహ్మణునికడ నున్న యశ్వములు మిక్కిలి శీఘ్రగమనము కలవనియు నితనిసారథి చెప్పఁగా శలుఁడు వామదేవునికడ కరిగి వానినడిగి గుఱ్ఱములను మరల వెంటనే యిత్తునని తెచ్చి తన రథమునకుఁగట్టి వెళ్ళి వేఁటాడెను. కాని వామదేవుని గుఱ్ఱములను దిరిగి వాని కీయలేదు. తురగములకై వామదేవుఁడు తన శిష్యునిఁబంపెను; తానుగూడ

వెళ్ళెను. కాని శలుఁడు బ్రాహ్మణుఁడవు. నీకు గుఱ్ఱము లేంగుకు? గండెద్దులను బుచ్చుకొని పొమ్ము అని పలికెను. వామదేవుఁడు వెళ్ళక యింకను గుఱ్ఱము లిమ్మని యడుగుచుండెను. వానిని శలుఁడు శూలముల(బొలియింపఁ బోయెను. అంత వామదేవుఁడు తన ప్రభావము వలన రాక్షసులను బుట్టించెను. వారు శలునిఁ జంపిరి. భార.

శల్యసారథ్యము:-(చూడుము శల్యుఁడు.)

శల్యుఁడు:-సంహ్లాదుఁడు శల్యుఁడుగఁ బుట్టెను. భార.

శల్యుఁడు:-మద్రదేశాధిపతి. పాండురాజు భార్యయైన మాద్రి యితని సోదరియే. ఇతని కుమారుఁడు రుక్మరథుఁడు. శల్యుఁడు నకుల సహదేవులకు మేనమామ యగుటచే యుద్ధమందుఁ దమపక్షమునే చేరునని పాండవులు తలఁచిరి. కృష్ణుఁడును వీరిని జేరుమని చెప్పుటకు శల్యుని కడకు దూతలను బంపెను. అతఁడు సేనా సమేతుఁడై వచ్చుచుండెను. ఈ సంగతి దుర్యోధనుఁడు తెలిసికొని మార్గమందు శల్యుని పరివారమున కనేక విధముల నుపచారములు చేయించెను. వానింజూచి శల్యుఁడు సంప్రీతుఁడై తన కిట్లు సదుపాయము చేయించినవారెవ్వరని యడిగెను. అదేసమయమని దుర్యోధనుఁడు వానియెదుటఁబడి యుద్ధమునఁ దనకు సహాయము చేయుమని వేడెను. శల్యుఁడు సరే యనియెను. కాని యొకసారి పాండవులనుజూచి వచ్చెద ననియెను. శల్యుఁడు పాండవులకడకు వచ్చి ప్రేమతో వీరి నాలింగనము చేసికొనెను. అపుడే ధర్మరాజు తమకు సహాయముగ రమ్మని కోరెను. మద్రాధిపతి యిదివఱకే దుర్యోధనునకు సహాయము చేయుదు ననియుండుట తెల్పెను. కావునఁ బాండవ పక్షమునకుఁ బోలేదు; కాఁబట్టి యతఁడు కర్ణునకు సారథిగఁ జేయఁబడినపుడు మాత్రము వాని మనస్సు వికలమగునట్లు చేయుమనియు, ఈమాత్ర ముపకారమైనఁ జేయుమనియు ధర్మరాజు వేడెను. శల్యుఁ డద్దాని కంగీకరించెను.

యుద్ధమున శల్యుఁడు దుర్యోధనునియెడ ద్రోహ మేమాత్రమును జేయక పాండవులతోఁ దన శత్రువులతోడవలెనే పోరాడెను. ఇతని కుమారుఁడగు రుక్మరథునిఁ బాండవులు వధించిరి.

కర్ణునకు సారథిగ నుండుమని దుర్యోధనుఁడు శల్యునిఁ గోరెను. శూద్రజాతివానికి మూర్ధాభిషిక్తుఁడగు రాజు సారథియగునా? ఇందఱు మేదినీపతులలో నన్నవమానము చేయుదువా? నేను మాదేశమునకుఁ బోవువాఁడనని శల్యుఁడు కోపములోఁ బలికెను. దుర్యోధనుఁడు వానిని బ్రతిమాలి "అర్జునునకుఁ బ్రతిగాఁ గర్ణునిఁ బెట్టితిని. వానికిఁ గృష్ణుఁడు సారథి. కృష్ణుని కంటె మేటియగు వాఁడవు నీవని నిన్నుఁ గోరితి" ననియె. రాజసభామధ్యంబున నన్ను గృష్ణునికంటె మేటియంటివి. ఇది చాలు. నేను సారథ్యమును జేయుదును. కాని నేను విచ్చలవిడిగ నాకుఁ దోచినమాటలు పలుకుచుందును. దీనికిఁ గర్ణుఁడొడంబడవలయుననియెను. అందుకు దుర్యోధన కర్ణు లంగీకరించిరి. శల్యుండు కర్ణునకు సారథి యయ్యెను. ఇతఁడు కర్ణుఁడు చెప్పిన దానికంటె మేలగు నుపాయము చెప్పినను గర్ణున కా మాటలు కష్టముగ నుండునట్లే చెప్పును. అర్జునుని బలము కొనియాడును. కాకహంసోపాఖ్యానము చెప్పి కర్ణునిమనస్సు నొప్పించెను. అందుచేఁ గర్ణుఁ డతనిని మిక్కుటముగ నిందించెను. ఏమైనను ధర్మజునితోఁ జెప్పినట్లు కర్ణునిమనస్సు నొప్పించి యాతని మృతికిఁ గొంత కారణమయ్యెను.

కర్ణుఁడు మరణించిన పిమ్మట శల్యుఁడే సేనాధిపతి యయ్యెను. ఇతఁడు భీమునితోడను, ధర్మరాజుతోడను యుద్ధముచేసెను. తుదకు ధర్మజునిచెతిలో మరణించెను.

శల్యుఁడు:-పూర్వభవమున సంహ్లాదుఁడు. భార.

శవస్తుఁడు:-యువనాశ్వుని కుమారుఁడు. ఇతఁడు శావస్తియను నగరమును నిర్మించెను. ఇతని పుత్రుఁడు బృహదశ్వుఁడు. భాగ.

శశాదుఁడు:- ఇక్ష్వాకుయొక్క పెద్దకుమారుఁడు. వీనిపేరు వికుక్షి. శ్రాద్ధమునకై శుద్ధమైన మాంసము తెమ్మని యిక్ష్వాకు వీనినిఁ బంపెను. ఇతఁడు వనమునకేగి శశములను వేటాడెను; కాని మిక్కిలి యలసియుండెను. అందు నొక శశమును భక్షించి తక్కినవానిని గొనిపోయెను. ఇతఁడు భక్షించినట్లు వసిష్ఠుఁడు గ్రహించి పితృకార్యమునకు నెంగిలి పనికిరాదని యతఁడు

తెచ్చిన మాంసమును నిరాకరించెను. ఇక్ష్వాకు నకుఁ గుమారునిపైఁ గోపమువచ్చినది. వీనిని నగరమునుండి వెడలఁగొట్టెను. వికుక్షి యట్లు శశమును భక్షించుటచే శశాదుఁడని పరగు చుండువాఁడు. ఇక్ష్వాకు మరణించినపిమ్మట శశాదుఁడు రాజై రాజ్యమేలెను. ఇతని కుమారుఁడు పురంజయుఁడు. విష్ణు. భాగ.

శశికళ:-సుబాహువను కాశీరాజుకూఁతురు. ఈమె ధ్రువసింధుని కుమారుఁడైన సుదర్శనుని గుణములు విని వానినే వలచియుండెను. ఈమె స్వయంవరమున కందఱురాజులు వచ్చియుండిరి. సుదర్శనుఁడుకూడ వచ్చెను. సుదర్శనుని జంపుటకుఁ గొందఱు యుధాజిత్తు మొదలగువారు వచ్చిరి. స్వయంవరమునాఁడు యుద్ధము సంభవించునట్లు తోఁచెను. సుదర్శనునిగాక యన్యుని వరింపుమని తండ్రి యీమెతోఁజెప్పెను. కాని ఈమె వినదయ్యెను. స్వయంవర మానాఁడు మానివేసి మఱునాఁడు జరుపఁబడునని సుబాహువు ప్రకటించెను. కాని ఆనాఁటి రాత్రియే శశికళనిచ్చి సుదర్శనునకు వివాహము చేసెను. మార్క.

శశిబిందుఁడు:-ఒక రాజు. ఇతనికి లక్షభార్యలు కలరు. ఒక్కొక్కతెకుఁ బెక్కుర పుత్త్రులు కలరు. అతఁడు అనేకయాగములు చేసెను.

శా

శాండిలి:-ప్రజాపతి భార్య. అగ్ని తల్లి. భార.

శాండిల్యుఁడు:-ఒక ముని. ఇతఁడు ధాన్యమాలి యను దివ్యాంగనను జూచి మోహించి యామెను బొందఁగోరెను. ఆమె రజస్వలయై యుండుటచే స్నానముచేసి వచ్చెదననియె. ఆమె స్నానము చేయఁగానే రావణుఁ డామెతో రమించెను. పిమ్మట నీమె యీ మునికడకువచ్చి యాసంగతి చెప్పెను. ఇతఁడు గోపముతో రావణుఁడు నశించునుగాక యనియును, నామెను మొసలివి కమ్మనియును శపించెను. ఈమె శాపవిమోచనమునకై వేఁడగా శ్రీరామకార్యమున హను మంతుఁడు వచ్చి నిన్నుఁ గొట్టువాఁడు. నీ శాప విమోచన మగునని చెప్పెను. రామా.

శాంత:-దశరథునకు సురభి యనుగ్రహమునఁ బుట్టిన కుమారిత. రోమపాదునకు సంతానము లేకపోవుటచే దశరథుఁ డీమెను బెంపిచ్చెను.

శాంత స్వయంవరము జరుగునని దశరథుఁడు చాటించెను. పరశురాముఁ డది వినివచ్చి దశరథుని సంహరించెదనని కత్తి తీసెను. వసిష్ఠుఁ డడ్డుపడి చంపవలదని ప్రతిమాలెను. శాంతను బ్రాహ్మణున కిచ్చుచోఁ జంపనని పరశురాముఁ డనియెను. దశరథుఁ డద్దాని కంగీకరించి శాంతను ఋశ్యశృంగున కిచ్చి వివాహముచేసెను. వి. రా.

రోమపాదునిదేశమునఁ గలిగిన యనావృష్టినిఁ బోఁగొట్టుటకు ఋశ్యశృంగుని రావించెను. ఇతనికి శాంత నిచ్చి రోమపాదుఁడు వివాహము చేసెను. రామా.

శాంతకర్ణుఁడు:- ఆంధ్రజాతీయుఁడైన రాజు. శ్రీకృష్ణుని కుమారుఁడు. ఇతనిపుత్త్రుఁడు పౌరమాసుఁడు. వీరివంశమువారు పెక్కేండ్లు పరిపాలించిరి. భాగ.

శాంతి:-దేవహూతి కర్దముల కుమారిత. అథర్వుని భార్య. భాగ.

శాంబుఁడు:-ఆపుఁ డను వసువుకుమారుఁడు. మత్స్య.

శాకల్యముని:-ఒక ఋషి. పరశు వను రాక్షసుఁ డొకఁడు బ్రాహ్మణరూపమున నితని యాశ్రమమునకు వచ్చి నా కాఁకలి యగుచున్నది. ఆహారముపెట్టుమనెను. ఈమునివడ్డించెను. పరశువు పరిషేచనముచేసి ఈ యన్నము నాకు చాలదు. నేను రాక్షసుఁడను. నిన్నుఁగూడ నమలివేసెదను అని పలికెను. నన్ను భక్షించుట నీకు సాధ్యము కాదు. ఆపాదమస్తకము నన్ను బ్రహ్మాదిదేవతలు కాపాడుచుందురు. నీకుఁ బెట్టిన యాహారము నీవు భుజించి పొమ్ము అని యీముని చెప్పెను. కాని రాక్షసుఁడు లేచి వీనిదగ్గఱగా వచ్చెను.

వానికి శాకల్యముని వేయి తలలు, రెండువేల చేతులు కలవాఁడుగఁ గనఁబడెను. వాఁ డీమునిని జూచి భయపడి నీవు సామాన్యుఁడవు కావు. నన్ను క్షమించుము. నాకు జ్ఞాన మొసంగుమని ప్రార్థించెను. గౌతమీతీరమున కేఁగి యందు స్నానముచేసి సరస్వతిని బ్రార్థింపుమని యితఁడు చెప్పెను. బ్రహ్మ.

జనకుఁడు యాగముచేయుచు మునులనందఱను బిలిచి వారిలో ఘనుఁడగువానిని మిక్కిలి సన్మానింపదలఁచి ధనరాసులొకచో నుంచి "అయ్యా! మీలో ఘనుఁ డెవఁడో మీరే నిర్ణయించుకొనుఁడు. అతఁ డీ ధనరాసులను బొందునుగాక" అనెను. బ్రాహ్మణు లందఱు నేను ఘనుఁడను, నేను ఘనుఁడను అని తగవులాడుకొనిరి. యాజ్ఞవల్క్యుఁడు నేనే ఘనుఁడనని తన శిష్యులచే ధనము తీయించెను. శాకల్యముని నీకంటె ఘనుఁడను నేను అని లేచెను. వీరిద్దఱును వాదమునకు దిగిరి. ఓడినవాఁడు ప్రాణత్యాగము చేసికొనుటకుఁ బన్నిదము. శాకల్యుఁడు వేసిన ప్రశ్నలకు యాజ్ఞవల్క్యుఁడు ప్రత్యుత్తర మిచ్చెనుగాని యాజ్ఞవల్క్యుఁడు వేసిన ప్రశ్నలకు శాకల్యుఁడు జవాబు చెప్పలేకపోయెను. ఇతఁడు వెంటనే పన్నిదముప్రకారము దేహమువిడచెను.

శాకల్యుఁడు:-సౌభరిపుత్త్రుఁడు. తా నభ్యసించిన ఋగ్వేదశాఖ నైదువిధములుగ విభజించి తన శిష్యులగు వాత్స్యుఁడు, మాద్గల్యుఁడు, శాలీయుఁడు, గోముఖుఁడు, శిఖరుఁడు అనువారలకు నుపదేశించెను. వీరు జాతుకర్ణి అనువాని కుపదేశించిరి. భాగ.

శాకల్యుఁడు:-(చూడుము శుంభుఁడు.)

శాతకర్ణుఁడు:-ఒక ముని దర్భలకొనలు తినుచు నిష్ఠతోఁ దపస్సు చేసికొనుచుండువాఁడు. ఒక కొలనులో స్నానము చేయుచుండువాఁడు. ఇతని తపస్సునకు భయపడి యింద్రుఁడు వీని తపోభంగమును జేయుటకై పంచాప్సరసలను బంపెను. ఆ కొలనులోను, మేడలోను వారితో విహరించుచుండెను. ఆ కొలనులకుఁ బంచాప్సరసములు అని పేరువచ్చినది. రఘు.

శారద:-ఒక బ్రాహ్మణుని కుమారిత. ఈమెకు వివాహముచేసిననాఁడే ఈమెవరుఁడు పాముచేఁ గరువఁబడి మృతినొందెను. ఆ కన్య తన యలంకారము లన్నియును దీసివేసి దుఃఖముతోఁ గ్రుంగియుండెను. జాత్యంధుండైన వృద్ధబ్రాహ్మణుం డొకఁడు ధ్రువుఁడనువాఁడు తమగృహమునకు రాఁగా నీమె వాని పాదములకు నమస్కరించెను. అతఁడు "దీర్ఘసుమంగలివి కమ్ము" అని ఆశీర్వచనము చేసెను. ఆమె తన పరిస్థితిని దెలిపెను. ఆమెరూపు చూడలేక పోయిన కారణమున నాతఁ డట్లు పలికితినని చెప్పి "శ్రీయుమామహేశ్వరునివ్రతము" చేయుమనియును, నావచనము సార్థకమగుననియును చెప్పెను. ఆ వ్రతవిధాన మా బ్రాహ్మణుని వలననే తెలిసికొని యత్యంత భక్తిశ్రద్ధలతో నీమె యీ వ్రత మాచరించుచుండెను. అంతఁ బార్వతి ప్రత్యక్షమై వరమును వేడుకొమ్మని పలుకఁగా ధ్రువుఁడు తన యాశీర్వాద ప్రకారమును దెలిపి యీమెను సుమంగలిని గావింపుమని కోరెను. పార్వతి యీమె పూర్వజన్మ మిట్టిదని తెలిపెను. ఈమె పాండ్యదేశమున నొక బ్రాహ్మణునియొక్క రెండవ భార్య. భర్త యీమెయం దత్యంతానురాగము కలవాఁడై పెద్దభార్యను జూడక యుండెను. ఆమె కొంతకాలమున కా దుఃఖముతో మరణించెను. ఈ రెండవభార్యయొక్క రూపవిలాసములు చూచి మఱియొక బ్రాహ్మణయువకుఁ డనేక విధముల నీమె పొందును గోరెను. కాని యీ పతివ్రతాతిలకము వానిని దరిచేరనీయలేదు. అతఁ డీమెపై దృష్టితో మరణించెను. ఈ జన్మమున భర్తయైనవాఁ డా బ్రాహ్మణుఁడు. వీనిని గఱచిన పాము పూర్వజన్మమున నీమెయొక్క సపత్నియైనదియే. సతీపతుల వియోగమునకు నీమెయే కారణమైనది గావునఁ జిన్నతనమునందే వైధవ్యము వచ్చెను. అయినను నీమెయొక్క భక్తికి నేను మెచ్చితిని. ఇట్లు వరమిచ్చుచున్నాను. ఈమెకుఁ బూర్వజన్మమున భర్తయైన బ్రాహ్మణుఁడు మఱలఁ బాండ్యదేశమున జన్మించియున్నవాఁడు. స్వప్నమునం దతనితో సంయోగ మగుచుండును. ఈమెకుఁ బుత్త్రుఁడు కలుగును. పిమ్మట నాతఁ డీమెను దీసికొనివెళ్ళి సుఖంబున నుండును"

అని వరమిచ్చి పార్వతి యంతర్ధాన మయ్యెను. ఆమెవరముప్రకార మీ యువతికి స్వప్నమందు సంయోగ మగుచుండెను. అచ్చట బ్రాహ్మణు నకు స్వప్నమునందు సంయోగ మగుచుండెను. అట్లు కొన్నిదినములు జరుగఁగా నీమె గర్భవతి యయ్యెను. జనులందఱును నీమెను నిందించి ముక్కు చెవులు కోయఁబోయిరి. అప్పు డాకాశ వాణి "యీమె మహాపతివ్రత. ఈమెపై నిందలు మోపువారి తలలు బ్రద్దలగు" నని పలి కెను. జనులు నిందలుచేయుట మానిరి. ఈమె యును సిగ్గుపడి జరిగినవృత్తాంత మంతయును జెప్పినది. పిమ్మట నీమెకుఁ గుమారుఁడు కలిగెను. కొంత కాలమునకు బాలుఁడును, దల్లియును గోకర్ణక్షేత్రమునకుఁ బోయిరి. తండ్రియును గోకర్ణక్షేత్రమునకు వచ్చెను. ఆ పర్వపుదినమున వచ్చిన బ్రాహ్మణులలో నీమె ప్రతి రాత్రి యును స్వప్నమందుగలసిన బ్రాహ్మణుఁ డుండెనని గుర్తుపట్టెను. ఆతఁడును బ్రతిరాత్రి యును గలలోఁ గలసిన దీమెయే యని గుర్తిం చెను. అంత నాతఁ డామెను జేరి ప్రశ్నించెను. క్రమక్రమముగా నొండొరులు తెలిసికొనిరి. ఆ బ్రాహ్మణుం డీమెను, నీపుత్రునిఁ దన గృహ మునకుఁ దీసికొని పోయెను. వా రందఱును సుఖముగా నుండిరి. బ్రహ్మ.

శారదాండాయని:–ఒకరాజు. ఇతనిభార్య శ్రుత సేన. ఇతనికి సంతానము కలుగకపోవుటచే భార్యను నియోగించెను. ఇతని క్షేత్రజకుమా రుఁడు తర్దముఁడు. భార.

శార్దూలుఁడు:–రావణునికొలువులో నుండు వేగు వాఁడు. ఇతఁడు సముద్రముదాటివచ్చి రామునిఁ జూచెను. లంకలోఁ బ్రవేశింపుమని సుగ్రీవుఁడు రామునితోఁజెప్పుట వినెను. ఆసంగతి యితఁడు రావణున కెఱింగించెను. రామా.

శాలంకాయనుఁడు:– కన్యకా పు రా ణ ము ను జెప్పిన ముని. కన్య.

శాలిశూకుఁడు:–అశోకుని మనుమఁడైన సంయ తుని కుమారుఁడు. ఇతని పుత్రుఁడు సోమ శర్మఁడు. భాగ.

శాలిహోత్రుఁడు:–ఒక ముని. ఇతఁడు తన ప్రభా వముచేత నొక కొలనును, నొక చెట్టును సంపా దించెను. ఆ కొలనునీరుద్రావినచో నాఁకలియు, దాహము నుండవు; ఆ చెట్టుక్రింద నుండిన వర్షమును, ఎండయుఁ దగులవు. పాండవుల నీ ముని తన యాశ్రమమున గౌరవించి కొంత కాల ముంచుకొని వారికి నీతిశాస్త్రములు బోధించెను. భార.

శాలీయుఁడు:–శా క ల్యు ని శిష్యుఁడు. తాను నేర్చిన ఋగ్వేదసంహితను జాతుకర్ణి అనువాని కుపదేశించెను. భాగ.

శావస్తి:–(శ్రావస్తి) శవస్తుఁడు నిర్మించిన నగరము. భాగ.

శాస్త:– శివునకు జగన్మోహినియందుఁ బుట్టిన కుమారుఁడు. ఇతఁడు దేవతలను గాపాడు చుండును. కాలభైరవుఁడును శాస్తకుమారుఁడే. స్కాంద.

శి

శింశుమారుఁడు:– ఒక రాజు. ఇతని కుమారిత భ్రమ. ఈమెను ధ్రువునకిచ్చివివాహముచేసెను.

శిఖండి:–అనమిత్రుని కుమారుఁడు.

శిఖండి:–శూరునిపుత్రుఁడు. విదూరథునిపౌత్రుఁడు. భాగ.

శిఖండి:– అంతర్ధానుని భార్య. హవిర్ధానుని తల్లి. విష్ణు.

శిఖండి:– ద్రుపదరాజునకుఁ బుట్టిన కూఁతురు. తల్లియుఁ, దండ్రియుఁ దమకు జన్మించినది కుమారుఁడే యని వెల్లడిచేసి యీ తమ కూఁతు రును గుమారునివలెనే పెంచుచుండిరి. ద్రోణుని యొద్ద శిఖండి శాస్త్రములను, విలువిద్యనుగూడ నేర్చుకొనెను. శిఖండికి యౌవనము వచ్చు చుండెను; తల్లిదండ్రులు వివాహమునుజేయఁ దలంచుకొనిరి. దశార్ణదేశాధిపతియైన హేమ వర్మ పుత్రికను దగువిధమునఁ బాణిగ్రహణము చేయించి తెచ్చిరి. ఈమె తనభర్త పురుషుఁడు కాకుండుట గ్రహించి తన దాసికిఁ జెప్పెను. ఆ దాసి హేమవర్మతోఁ జెప్పెను. అతఁడు ద్రుపదరాజును శిఖండినిగుఱించి ప్రశ్నించెను.

కాని సమాధానము రాలేదు. హేమవర్మ సేనా సమేతుఁడై ద్రుపదునినగరముపై దండెత్తెను. ద్రుపదరాజును, భార్యయు నొకచో దాగి కొనిరి. శిఖండి స్థూలకర్ణుఁడను యక్షునియరణ్యమున కేగెను. అచ్చటఁ బ్రాయోపవిష్టుఁడై యున్న శిఖండినిఁజూచి యక్షుఁడు "ఓయీ! నీవేల ప్రాణములు గోల్పోయెదవు? నీకేమి కావలయును జెప్పుము. సహాయముచేసెద" ననెను. శిఖండి తన వృత్తాంతము చెప్పి తనకుఁ బురుషత్వము వచ్చినఁగాని చింతపోదని నుడివెను. అపుడు యక్షుఁడు తన పుంస్త్వ మీమె కిచ్చి, యీమె స్త్రీత్వము తాను గ్రహించెను. శిఖండి గృహమున కరిగి జరిగిన వృత్తాంతము తల్లిదండ్రుల కెఱింగించెను. వారు నాగరిక మార్గములఁ దమ కుమారుని పుంస్త్వమును దశార్ణ దేశాధిపతికిఁ దెలియఁజూపిరి.

భారతయుద్ధమున శిఖండి బాండవులకు సహాయముచేసెను. భీష్మునకు షండులు, స్త్రీలు మొదలగువారితోఁ బోరనని వ్రతము కలదు. అది పాండవులు తెలిసికొనిరి. భీష్మునికెదురుగఁ బోయి వానితో యుద్ధముచేయుమని శిఖండిని గోరిరి. ఇతఁడట్లు కావించెను. వీని వెనుకనే యర్జునుఁడుండి బాణము వేయుచుండెను. శిఖండిని జూచుటతోటనే భీష్ముఁడస్త్రసన్న్యాసము చేసెను. అతఁడు వీరిబాణములచేఁ గొట్టఁబడెను.

శిఖండి:- పూర్వభవమున అంబ. అంబకు భీష్మునిపైఁ గోపముకలదు. ఆ కోప మిట్లు తీర్చుకొనెను. భార

శిఖండిని:- విజితాస్యుని భార్య. పావకుఁడు, పవమానసుఁడు, శుచి యను త్రేతాగ్ను లీమె గర్భమునఁ బుట్టిరి. భాగ.

శిఖండిని:- అక్షి భార్య. ఈమె పుత్త్రుఁడు హవిర్ధానుఁడు. బ్రహ్మ.

శిని:-యుధాజిత్తు కుమారుఁడు. ఇతనిసోదరుఁడనమిత్త్రుఁడు. వసుదేవునకుఁ బెండ్లిచేయుటకై శిని దేవకిని దెచ్చుచుండెను; త్రోవలో వీనిని సోమదత్తుఁ డడ్డగించెను. సోమదత్తు నోడించి సిగ్గుపఱచి పంపి, శిని దేవకిని వసుదేవున కిచ్చి వివాహముచేసెను. భాగ. భార.

శిని:-విదూరథుని కుమారుఁడు. ఇతని కుమారుఁడు భోజుఁడు. భాగ.

శిని:-అనమిత్త్రుని కుమారుఁడు. ఇతని కుమారుఁడు సత్యకుఁడు. భాగ.

శిని:-ఒకరాజు. మన్యుపుత్త్రుఁడైన గర్గుని కుమారుఁడు. ఇతనిపుత్త్రుఁడు గార్గ్యుఁడు. ఈ గార్గ్యుని నుండి వీరిది బ్రాహ్మణకులంబయ్యెను. భాగ.

శిబి:-ప్రహ్లాదుని కుమారుఁడు. మత్స్య.

శిబి:-ఉశీనరుని కుమారుఁడు. ఇతని తల్లి మాధవి. ఇతఁ డుశీనరదేశమును బాలించెను. ఇతఁ డేడు దీవులయందును దనకు శత్రువనుమాట వినుఁబడకుండఁ బరిపాలించెను. ప్రజలు సుఖులై యుండిరి. శివుఁ డీతనిని మెచ్చుకొని యక్షయ ధనము లిచ్చెను. గంగాతీరమునం దీతఁ డనేకాశ్వమేధయాగములు చేసెను. శరణాగత రక్షణమునకు శిబి మిక్కిలి ప్రసిద్ధిచెందియుండెను. ఇతనినిబరీక్షించుటకై యింద్రుఁడును, అగ్నియు నితఁడు యజ్ఞముచేయుసమయమున డేగ, పావురముల రూపములు ధరించి, పావురమును డేగ పట్టి భక్షించుటకై తఱుముకొని వచ్చుచున్నట్లు వచ్చిరి. పావురమును శిబిచక్రవర్తిని శరణు జొచ్చెను. శిబి దాని కభయమిచ్చెను. అంత డేగ సమీపించి "నీవు న్యాయ విదుఁడవు గదా! నా యాహారమగుదానికి అభయ మిచ్చితివను నెపమున నా యన్నమును బడఁగొట్టుట న్యాయమా" యని యడిగెను. "ఈ పావురము నన్ను శరణువేఁడినది; నీ కాహారముకదా కావలయును; దీనినిగాక వేఱొకదానిని గోరుకొను మిచ్చెద" నని శిబి పలికెను. పావురమంత బరువుగల యతని దేహమందలి మాంసమును డేగ కోరెను. పావురమును దక్కెడఁబెట్టి శిబి తన తొడనుండి మాంసముకోసి తక్కెడలో వేయించుచుండెను. ఎంతకోసినను పావురమే యెక్కువబరువుగ నుండుచుండెను. అయినను శిబి తనశరీరము నల్లే కోయించు చుండెను. అంత నింద్రుఁడును, నగ్నియును నిజరూపములు దాల్చి శిబికి దర్శనమిచ్చి వీనిని మెచ్చుకొని వీనిశరీరము యథాప్రకారము గావించి చనిరి. వృషదర్భ, సువీర, మద్ర, కేకయులు శిబి కుమారులు. భార. భాగ.

శిలకుఁడు:-శలావతుని పుత్త్రుఁడు. (చూడుము -ప్రవాహణుఁడు)

శిలాదుఁడు:-ఒక ముని. ఇతఁడు అయోనిజుఁడగు పుత్త్రునిబడయఁగోరి శివునిఁ బ్రార్థించెను. శివుఁడు ప్రత్యక్షమయ్యెను. తనకుఁ గలుగు కుమారుఁడు సదా యీశ్వరునిమీఁదనే ధ్యానము కలిగి యుండవలయు ననియు, లేనిచో వానిని సంహరించెద ననియుఁగూడ శిలాదుఁడు పలికెను. శివుఁ డద్దానికి సమ్మతించి యాదివృషభ రూపమున నున్న ధర్మునిఁబిలచి శిలాదునకుఁ బుత్త్రుఁడుగ జన్మింపుమని చెప్పెను. శిలాదుఁడు పొలము దున్నుచుండఁగ నతనికి నందిదొరకెను. వీనిందీసి శిలాదుఁడు పెంచెను. అట్లు నందియే శిలాదుని పుత్త్రుఁడయ్యెను. శ్రీ. శై.

శిలుఁడు:-ఒక రాజు. పారియాత్రుని కుమారుఁడు. ఇతఁడు తాతిపలకవంటి వక్షస్స్థలము కలవాఁడు. ఇతఁడు భోగములందుఁ దృప్తిపడక యింకను భోగము పొందగోరుచుండగనే ముదిమి వచ్చెను. ఇతని కుమారుఁడు ఉన్నాభుఁడు. రఘు.

శివ:- అనలుఁడను వసువు భార్య. మనోజవుఁడు, అవిజ్ఞాతగతి ఈమె కుమారులు. భార.

శివజ్వరము:-(చూడుము జ్వరము)

శివదూతి:-దేవి; ఈమెయే కౌశిక. శుంభనిశుంభులు దేవతలను బాధపెట్టుటచే దేవత లీశ్వరునితోఁ జెప్పుకొనిరి. ఆ దనుజులతోఁ బాతాళలోకము నకుఁ బొండనియు, పోకుంటిరేని సంహరింపఁ బడుదురనియుఁ జెప్పుటకుఁ గౌశిక దూతగ బంపఁబడెను. అందుచే నీమెకు శివదూతియను పేరువచ్చెను. మార్క.

శివబ్రాహ్మణుఁడు:-ఒక శివభక్తుఁడు. శ్రీకాళహస్తి యందు శివలింగము నర్చించుచుండువాఁడు. ఈ లింగమునే తిన్నఁడుగూడఁ గొల్చుచుండు వాఁడు. వీఁడు తాను రుచిచూచిన మాంసము నర్పించుచుండువాఁడు. శివబ్రాహ్మణుఁడు దీని నసహ్యించుకొనుచుండువాఁడు. శివుఁడు తిన్నని భక్తినిచూపెద ననిచెప్పి వీనిని రహస్యముగా నుండుమనియెను. అంత శివునిఁ దిన్నఁడర్చించుట, శివలింగమునుండి కన్నీరుకారుట, తిన్నఁడు తన కన్ను సమర్పించుట జరిగెను. ఒకప్పుడు పెద్ద క్షామము వచ్చెను. అప్పుడు మధురను నక్కీరుఁడు పరిపాలించుచుండెను. శివుఁడు శివ బ్రాహ్మణునకుఁ బద్యములుచెప్పి వానిని నా రాజుయొక్క సభలో జదువుమనెను. శివబ్రాహ్మణుఁడు చదివెనుగాని యిదేమి కవిత్వమని యాక్షేపించెను. ఆ సంగతి శివ బ్రాహ్మణుఁడు శివునితోఁ జెప్పికొనెను. శివుఁడు శివబ్రాహ్మణునకుఁ దుదకు సాయుజ్య మిచ్చెను.

శివుఁడు:-త్రిమూర్తులలో నొకఁడు. సృష్టికి బ్రహ్మయు, స్థితికి విష్ణువు ఎట్లో లయమున కితఁడట్లు. ఇతనికి భక్తులు పలువురు కలరు గాని యితఁ డెన్నఁడు అవతారములు దాల్చలేదు. శివుని వాసము కైలాసము. ఇతని భార్య పార్వతి. కుమారస్వామి, వినాయకుఁడు కుమారులు. ఇతని వాహనమును, ధ్వజమును నంది. శివునకు మూడునేత్రములు కలవు. మూడవకన్ను నుదుట నున్నది. ఆ కంటిచోఁ జూడఁబడిన దేదైన భస్మమగుచుండును.

బ్రహ్మయును, విష్ణువును నందఱికంటె నేనధికుఁడను, అందఱికంటె నే నధికుఁడను అని తగవు లాడుకొనుచుండిరి. ఇంతలో వారియెదుట దివ్యకాంతులతో శివుఁడు లింగ రూపమున నావిర్భవించెను. ఆ స్తంభము యొక్క యాద్యంతములు చూచి వచ్చుటకు వా రిరువురు కడంగిరి. హంసరూపమున బ్రహ్మ పైకివెళ్ళెను. వరాహరూపమున విష్ణుమూర్తి క్రిందకువెళ్ళెను. వా రెంతవెళ్ళినను నాద్యంత ములు చూడలేకపోయిరి. కాని బ్రహ్మ తాను జూచి వచ్చితినని యసత్యము పల్కెను. అపుడు శివుఁడు ప్రత్యక్షమయ్యెను. అసత్యము పలికెను గావున బ్రహ్మకుఁ బూజ లేకుండుఁ గాకయని యితఁడు శపించెను. బ్రహ్మవిష్ణువులు శివునకు నమస్కరించిరి. తనను గరుణింపుమని బ్రహ్మ వేఁడెను. యజ్ఞములందుఁ దప్ప నితర చోటులఁ బూజయుండునట్లు శివుఁ డనుగ్రహించెను. శివ.

బ్రహ్మయును, విష్ణువును నే నధికుఁడను నే నధికుఁడ నని తగవులాడుచుండఁగ శివుఁడు వచ్చి యా పోరాటము మాను మనియె.

విష్ణుమూర్తి మానెనుగాని బ్రహ్మ పంచమ శిరము శివునిదూషించెను. శివుఁడు కాలభైరవుని బుట్టించి యా పంచమశిరమును ఖండించు మనియెను. కాలభైరవునిఁ జూచుటతోడనే బ్రహ్మ భయపడెను. తన పంచమశిరము శివుని దగ్గఱ పడునట్లును, ఆ కపాలముతో శివుఁడు భిక్షాటనము చేయునట్లును గోరెను. శివుఁ డనుగ్రహించెను. స్కాంద.

శివుఁడు హిమాలయపర్వతముపైఁ దపస్సు చేసికొనుచుండెను. ఆ ప్రాంతముననే గోవులు, లేఁగలు విచ్చలవిడిగఁ దిరుగుచుండెను. ఒక లేఁగ యప్పుడే పాలుద్రావెను. దాని నోట నుండిన నుఱుగు గాలిచేఁ గొట్టుకొనివచ్చి శివునితలపైఁ బడెను. ఇతనికిఁ గోపమువచ్చి కన్ను తెఱచెను. గోవులన్నియు నల్లఁబడియెను. అవి భయపడి యచ్చటనుండి పరువెత్తుచుండెను. వీనిని బ్రహ్మ చూచి శివునికడకు వచ్చి నమస్కరించి, "అయ్యా! గోవుల కెంగిలి లేదు. దూడ త్రాగినపిదపఁ బాలుపిదికిన నవి పవిత్రవంతములే గాని లేఁగయెంగిలి తగిలినవగుటచే నపవిత్రములు కా" వనిచెప్పి శివున కొక వృషభ మిచ్చెను. ఆ మాటలకు శివుఁ డంగీకరించి తన దృష్టిచేఁ గపిలమైన గోవులు ఉత్తమమైన వగునట్లు ప్రసాదించి బ్రహ్మ యొసఁగిన వృషభమును వాహనముగఁ జేసికొని తనధ్వజము నందు వృషభము నుంచుకొనెను. గోపతి యను నామము శివునకు బ్రహ్మ ఇచ్చెను. భార.

క్రూరభూతములు ప్రజలను బాధించుచుండెను. దానికిఁ బ్రతీకారము చేయుమని బ్రహ్మ శివుని వేఁడెను. ఆ కార్యమునకై శివుఁడు విజనప్రదేశము కావలయు ననియెను. ఆకారణమున శివునకు శ్మశానవాటిక వాసస్థాన మయ్యెను. అచ్చటినుండియే శివుఁడు లోకములను రక్షించుచుండును. భార.

దేవతలును, దానవులును గలసి క్షీరసాగరమును మథించిరి. అందుండి హాలాహలము పుట్టఁగా వారు భయమొంది శివునికడకుఁ బరుగిడి ప్రార్థించిరి. శివుఁడు వారి కభయమిచ్చి యా విషము లోకములను దహింపకుండ నుండుటకై తానే మ్రింగి కంఠమం దుంచుకొనెను. అందువలన నతనికంఠము నీలవర్ణము కలదయ్యెను.

సుందోపసుందు లను రాక్షసులను వినాశమును గావించుటకై మయుఁడు తిలోత్తమను సృజించెను. ఆమె శివునకుఁ బ్రదక్షిణముచేసెను. ఇది దేవకార్యము చేయనోపును అని ఈ తరుణి పోయిన దిక్కుదిక్కునకును నొక్కొక్క మొగమును దాల్చి దానిని బరీక్షించెను. అప్పటి నుండియును శివుఁడు చతుర్ముఖుం డయ్యెను. భార.

కణ్వుఁడనుముని తపస్సుచేసికొనుచుండఁగా నాతనిపై పుట్టలు మొలిచెను. అందొక పెద్ద వెదురు మొలిచెను. దానిని బ్రహ్మ మూడు విండ్లుగాఁ జేసెను. అందొకటి శివున కిచ్చెను. అదియే పినాకధనుస్సు. భార.

విష్ణువు జగన్మోహినీరూపము ధరించి వచ్చుటచే దానవు లామెరూపము చూచి మోహపరవశతచే మైమఱచియుండి యమృతమును గోల్పోయిరని శివుఁడు వినెను. ఆ రూప మెట్లుండునో చూడవలెనని యితనికి కుతూహలము కలిగి తనకుఁ జూపుమని విష్ణువు నడిగెను. "నీ మతి చలించును. నీవు వికలమనస్కుఁడ వగుదువు. నీవు చూడఁజాల"వని విష్ణువు చెప్పెను గాని శివుఁడు బలవంత పెట్టెను. విష్ణువు వల్లెయని యంతర్ధానము నొందెను. ఇతఁ డెచ్చటి కేగెనని నాల్గుమూలలు శివుఁడు పరికించు చుండఁగా నింతలో జగన్మోహిని శివునియెదుట నిలచెను. శివునకు మతి చలించినది. ఆమెను బట్టుకొనఁబోయెను. ఆమె పరుగిడెను. ఆమెవెంట శివుఁడుపరుగిడెను. నదులు, పర్వతములు, అరణ్యములు సరకుసేయక జగన్మోహినియును, నామెవెనుక శివుఁడును పరుగులిడుచుండిరి. తుదకు శివునకు వీర్యము జాఱిపడెను. అపుడు హరిమాయ తెలిసికొని స్తుతించెను. విష్ణువు నిజస్వరూపముఁ దాల్చి గోచరించెను. భాగ.

శివునకు జగన్మోహినియందు శాస్తి యను కుమారుఁడు పుట్టెను.

కాలభైరవుఁడును నీసమయముననందే పుట్టెను. స్కాంద.

శివుఁడు దక్షునికుమార్తెయగు సతిని వివాహ మయ్యెను. తనకు మ్రొక్కఁడనియు, దన నవమానించుననియుఁ, బరిచర్య చేయఁడనియు

దక్షునకు శివునిపైఁ గోపముకలదు. ఆ కోపముచే దక్షుఁడు సతి చెప్పఁడును దన యింటికిఁ దీసి కొని పోయెడివాఁడుకాఁడు. అయినను ఆమె తోఁబుట్టువులను జూచు వేడుకతోఁ దండ్రి యింటికి వెళ్ళెను. దక్షుఁడామెను, ఆమెపతిని గూడ దూషించెను. పతిదూషణము సహింప లేక యామె యోగాగ్ని కల్పించుకొని శరీరము దహింపఁజేసికొనియెను. ఈ వృత్తాంతము శివునకుఁ దెలిసి "నీవు చాక్షుషమన్వంతరమున మారిష యను నంగనయందుఁ బుట్టుము. అపుడును దక్షుఁడను పేరుననే పరగుచుండుము. నీవు చేయఁబోవు ధర్మకార్యములకు నేను విఘ్నములు కల్పించుచుందు" నని పలికెను. "నన్ను నిష్కారణముగ శపించితివి కావునఁ ద్రిదశులతోడ నీవు హవ్యము పొందకుందువు గాక" యని దక్షుఁడు శివునకుఁ బ్రతిశాప మిచ్చెను. ఆ కోపముచేతనే దక్షుఁడు చేయు యజ్ఞమునకు శివుఁడు వెళ్ళి గణపతులను, వీర భద్రునిఁ బుట్టించి దక్షయజ్ఞము ధ్వంసము చేయించెను. దక్షునియజ్ఞముకడకు దేవతలతోఁ బాటు చంద్రుఁడుకూడ వచ్చెను. దక్షయజ్ఞ మును ధ్వంసముచేయుటకు వీరభద్రాదులు చిందులు త్రొక్కుచుండిరి. ఆ రభసములో శివుని కాలిక్రిందఁబడి చంద్రుఁడు నలిగెను. చంద్రుఁడు శివునిఁ బ్రార్థించెను. చంద్రునిపై జాలిగొని శివుఁడు వానిని దన లలాటమునఁ బెట్టుకొనెను. సతియే పార్వతిగ జన్మించెను. ఆమెను శివుఁడు పరిణయమయ్యెను. (చూడుము పార్వతి)

మార్క.

కైలాసమందున్న శివుండును, భవానియును జూచుచుండఁగా దేవతలా మార్గమునఁ బోవు చుండిరి. ఎచ్చటికిఁ బోవుచుండిరని శివుఁ డడి గెను. దక్షుఁడుచేయు యజ్ఞమున కనిరి. భవాని 'మీరేల పోవుటలే' దని భర్తనడుగఁగా నాకు యజ్ఞమున భాగము లేదనెను. అంత భవానికిఁ గష్టము కలిగెను. శివునకును గోపము వచ్చినది. దక్షునియొక్క మఖమును ధ్వంసముచేయుటకై వచ్చెను. భాగ.

క్షయము నొందునట్లు దక్షునిచే శపింపఁబడి చంద్రుఁడు భయపడుచు శివునికడకువచ్చి శరణు వేఁడెను. (చూడుము చంద్రుఁడు) శివుఁడు వాని కభయమిచ్చి తన నొసటను బెట్టుకొనియెను. దక్షుఁడు శివునికడకువచ్చి చంద్రుని విడిచిపెట్టు మనెను. శరణాగతుఁడగువానిని నేను విడువనని శివుఁడు తిరస్కరించెను. ఇతనిని దక్షుఁడు శపింపఁబోయెను. ఆ యుపద్రవము రాకుండ విష్ణువువచ్చి శివునకును, దక్షునకును సంధిచేసి చంద్రుని రెండుభాగములు చేసి, క్షయములేని దానిని శివునిలలాటమందుఁ బెట్టి, దక్షునిశాప మనృతముకాకుండ వృద్ధిక్షయములు పొందు రెండవభాగమును తారలకిచ్చెను. ఆ ప్పటి నుండియు శివుఁడు చంద్రుని దాల్చియుండును.

బ్ర. వై.

శివునకుఁ బార్వతియందుఁ బుట్టిన సంతానము లేదు. ఈ దంపతులకుఁ బుట్టు కుమారుఁ డెంతటివాఁడగునో యని భయపడి దేవతలు వీరి సురతమున కాటంకములు కలిగించిరి. ఒక సమయమున నగ్ని వచ్చి, క్రీడించుచుండిన వీరి కెదురుగ నిలచెను. అపుడు పార్వతి దూరముగ బోయెను. శివునివీర్యమును పార్వతిశాసనమున అగ్ని ధరించెను. దానినే గంగధరించి రెల్లులో విడిచెను. అందుండియే కుమారస్వామి పుట్టెను. విఘ్నేశ్వరుఁడు పార్వతి నలుగుపిండివలనఁ బుట్టిన పుత్త్రుఁడు. శివుఁడొకనాఁడు సూర్యునిఁ దన శూలముతోఁ గొట్టెను. సూర్యుఁడు ప్రాణములు విడచి క్రిందబడెను. సూర్యుని తండ్రి కశ్యపుఁడు చూచి తనకుమారుని బ్రతికించి, నీవు నీపుత్త్రుని జూచినపుఁడు వానికి నిట్లే తల పగులునని శపించెను. ఈ శాపము వచ్చిన కొంతకాలమునకు విఘ్నేశ్వరుని జూచుటకై పార్వతి శివునిఁ బిలచెను. శివుఁడు వెళ్ళి చూచెను. అపుడు విఘ్నేశ్వరునిశిరము పగిలెను. అదిచూచి పార్వతి విలపింపఁగా దేవతలు పుష్పభద్రతీర్థముకడనున్న ఏనుఁగుతల తెచ్చి యతికించిరి. బ్ర. వై.

శివునిఁ జూచుటకు నింద్రుఁడును, బృహస్పతియును మునులరూపమున వచ్చుచుండిరి. వీరిని బరీక్షింపఁగోరి శివుఁ డుగ్రరూపముధరించి దిగంబరుఁడై వారిమార్గమున కడ్డముగ నిలువ బడెను. ఇంద్రుఁడు వానిని గదలుమని కేకలు వేసెనుగాని యితఁడు కదలలేదు. ఇతనిని గొట్టుటకై ఇంద్రుఁడు తన వజ్రాయుధము నెత్తెను. కాని శివుఁడు వాని హస్తమును స్తంభింపఁజేసి వానిని దన చూపుచే భస్మము చేసెను. ఇతఁడే శివుఁడని బృహస్పతి గ్రహించి

నమస్కరించి ప్రార్థించి యింద్రుని బ్రతికింపు మని వేఁడెను. శివుఁ డింద్రుని బ్రతికించెను. ఇంద్రుఁడు భస్మముకాఁగా మిగిలిన నేత్రానలము కొంత లవణసముద్రములోను, గొంత గంగా సింధునదులందును బడెను. ఈ నేత్రాగ్ని వలన లవణసముద్రమునుండి జలంధరుఁడు పుట్టెను. తన సంపదల నన్నిఁటిని నీయవలసిన దనియును, లేకుండిన యుద్ధముచేసి తాఁ గొంపోయెద ననియును జలంధరుఁడు ఇంద్రునకు వర్తమానముచేసెను. ఇంద్రుఁడు వానిని దిరస్కరించెను. జలంధరుఁడు యుద్ధమునకు రాఁగా నింద్రుఁడు విష్ణుమూర్తిని బిలుచుకొని వచ్చెను. కాని జలంధరుని విష్ణువు గెలువలేక పోయెను. జలంధరుఁడు గర్వించి పార్వతిని దనకిమ్మని శివునికడకు దూతను బంపెను. ఆ మాటవిని శివుఁడు జలంధరుని మీదకు యుద్ధమునకు వచ్చెను. ఘోరయుద్ధము సాగుచుండెను. శివుఁడు దనుజుని గెలువలేక ఉండెను. ఆ సమయమున విష్ణువు మాయచేసి జలంధరుని భార్య పాతివ్రత్యము చెఱచెను. అపుడు జలంధరునిశక్తి క్షీణించెను. శివుఁ డప్పుడు జలంధరుని సంహరింపఁగలిగెను. శివ.

శుక్రుఁడు కుబేరునికడనుండి వంచనచేసి యతని ధన మంతయు నపహరించెను. ఆ సంగతి కుబేరుఁడు శివునితోఁ జెప్పుకొనియెను. శివుఁడు శుక్రుని శిక్షింపఁ జూచుచుండఁగా శుక్రుఁడు తుప్పలచాటున దాఁగియుండెను. కాని తుదకు శివునిచేతిలోఁ జిక్కెను. శివుఁడు వానిని మ్రింగివేసి శరీరద్వారములుబంధించెను. శిశ్నము మాత్రము మూయలేదు. శుక్రుఁడు బైటకుఁ గొనిపొమ్మని శివునిఁ బ్రార్థింపఁగ శిశ్నద్వారమున రమ్మని చెప్పెను. ఆ ద్వారముననే శుక్రుఁడు వచ్చెను. భాగ.

త్రిపురాసురులు మూడులోకములను బాధపెట్టుచుండిరి. వారివలన బాధను బోగొట్టుమని దేవతలు బ్రహ్మతోఁ జెప్పికొనిరి. బ్రహ్మ యేమియుఁ జేయజాలక వానిని దీసికొని శివుని కడకు వెళ్ళి యసురుల నణఁచుమని చెప్పెను. శివుఁడును నేనొక్కఁడను నేమియుఁ జేయలేనని యెను. మఱియుఁ దనతేజములో సగము దేవతల కిత్తుననియును.ముందువారినిసహాయముచేయుమనియును, శివునితేజమును ధరింప వారు సమర్థులు కారనియును జెప్పెను. కావి బ్రహ్మాదిదేవతలే వారితేజమును శివున కిత్తుమనిరి. శివుఁడు తాను పశుపతి కావలయుననియును, లోకములు పశుత్వమున కొడంబడవలయుననియును జెప్పెను. త్రిపురాసురులను సంహరించుటకుఁ దగిన యాయుధములు శివునికడ లేకుండెను. అపుఁడు పృథ్వియే రథమయ్యెను. వేదములు గుఱ్ఱములయ్యెను. సూర్యచంద్రులను జక్రములుగఁ జేసిరి. బ్రహ్మ రథసారథి యయ్యెను.

శివుఁ డా రథమునెక్కి యుద్ధమునకు వెడలెను. త్రిపురాసురు లొకరితో నొకరు కలసి యుండనంతకాలము వారిని జయించుట (వారు పొందిన వరములవలన) శక్యముకాదు. కావున శివుఁడు వారలను మనసూర్తిగఁ దలఁచుకొనెను. ఇతని మనఃప్రభావముచే వారు ముగ్గురు నొక్కచోఁ జేరిరి. అపుడు వారిని బాశుపతాస్త్రముచే ఖండించెను. త్రిపురములు దహనములయ్యెను. భార.

శివభక్తుఁడైన గజాసురుఁడు దేవహితమైన పనులు చేయుచుండెను. దేవతలు శివునితో జెప్పుకొనిరి. గజాసురుని దండించుటకై శివుఁడు వచ్చెను. ఇతనిని జూచి గజాసురుఁడు దేవా! నీచేతిలోఁ జావుగోరి యట్టిపనులను జేసితిని. నన్నుఁ జంపి నా చర్మమును నీవు ధరింపుము. నీ కపుడు కృత్తివాసుఁడను పేరు వచ్చును. ఇదియే నా కోరికయని వేఁడుకొనెను. శివుఁ డాతఁడు గోరినట్లే చేసెను. అందువలననే యతనికిఁ గృత్తివాసుఁడను పేరు వచ్చెను. శివ.

నృసింహావతార కార్యము ముగిసినపిదప నృసింహుఁడు గర్వముగా సంచరించుచు లోకములను బెగడొందఁ జేయుచుండెను. శివుఁ డపుడు శరభరూపమై నృసింహుని వధించి యా చర్మము తాను గప్పుకొనియెను. అందువలననే శివునకుఁ గృత్తివాసుఁ డను పేరు వచ్చినది. శివ.

వరాహావతారము హిరణ్యాక్షుని రక్తము త్రాగి మదముతోఁ దిరుగుచు లోకములను ఆ వరాహము భయపెట్టుచుండుటచే బ్రహ్మాదులు శివునితోఁ జెప్పుకొనిరి. శివుఁడు వచ్చి యా వరాహముకొమ్ము లాగివేసెను. స్కాంద.

వృకుఁడను రాక్షసుఁడు శివుని గూర్చి ప్రార్థించి తన దేహము కోసి హోమముచేసి తుదకుఁ దన శిరమునుగూడ వేల్వఁబోయెను. శివుఁడు ప్రత్యక్షమై వరము వేఁడుకొను మనియెను. నేను దేనిమీఁదఁ జెయ్యిపెట్టుదునో యది నూఱుముక్క లగునట్లు వర మిమ్మని వృకుఁడనియె. శివుఁ డిచ్చెను. వరప్రభావము పరిశీలించెద నని వృకుఁడు తన హస్తమును శివుని నెత్తిమీఁదనే పెట్టఁబోయెను. శివుఁడు భయపడి పాఱిపోయి విష్ణులోకములో డాఁగి కొనియెను. విష్ణువు ఉపాయముచే వృకుని ముక్కలుచేసెను. భాగ.

శివునిదర్శనమునకై యొకనాఁడు రావణుఁడు వచ్చెను. ద్వారముకడ నందియుండి యది శివునిఁ జూచుటకు సమయముకాదు పోవలదని చెప్పెను. రావణుఁడు నందిని నిందించెను; నంది వానిని శపించెను. రావణునకు నందిపైఁ గోపమువచ్చి నీ వన నెంత? నీ శివుఁడెంత? యని కైలాసమును బంతి యాడించినట్లు ఆడించెను. వనవిహారము చేయుచుండిన గౌరి భయపడి పరుగిడివచ్చి శివునిఁ గౌఁగిలించుకొనెను. శివుఁడు పార్వతిని ఆలింగనము చేసికొని రావణునకుఁ గొంతపరాభవము చేసినఁ గాని దర్పన మీయరాదనుకొని కైలాసమును బొటనవ్రేలితో నొక్కెను. రావణుని చేతులు పర్వతముక్రిందఁబడి నలిగెను. అపుడు రావణుఁడు మహేశ్వరుని స్తుతించెను. పిమ్మట వానికి శివుఁడు దర్శనమిచ్చెను. రామా.

అర్జునుఁడు వ్యాసునిచేఁ జెప్పఁబడిన ప్రతిస్మృతియనువిద్య నుపదేశముకొని శివునివలన దివ్యాస్త్రములు బడయుటకుఁ దపస్సు చేయుచుండెను. వీని తపస్సువేడిమిచే లోకములు బెగ్గడిల్లెను. దేవతలు శివునికడ కరిగి వానికి వరమిచ్చి తపము మాన్పుమని వేఁడిరి. శివుఁడు కిరాతవేషముఁ బూని ధనుర్బాణసహితుఁడై తన పరివారమును చెంచులట్లుగావించి మూకుఁ డను దైత్యుని సూకరంబుగఁ గావించి వేఁటకు వచ్చువానివలె నర్జునుఁడున్న వనమునకు వచ్చెను. ఆ సూకర మర్జునునిపైఁ బడఁబోయెను. దాని నర్జునుఁడు బాణముతోఁ గొట్టెను. అంత నా మాయా కిరాతుఁడు హాహాకారములు సేయుచు దాపునకువచ్చి నీవు దానిని గొట్టకుము, కొట్టకుమని కేకలువేసెను. కాని యర్జునుఁడు మానలేదు. కిరాతుఁడును దానిని గొట్టెను. పంది చచ్చెను. మూకుఁడు నిజరూపముగొని యంతర్ధానుఁడయ్యె. నీ వెవ్వఁడవు? నేను గొట్టుచున్న మృగమును నీవు కొట్టుటేల? యని యర్జునుఁడు కిరాతు నడిగెను. నా బాణముచే ఆ మృగము చచ్చెను గాని నీ ప్రతాపముచేఁ గాదు అని యొఱుక యనియె. వారిద్దఱు యుద్ధమునకుదిగిరి. అర్జునుఁ డేసిన బాణము లేవియు వానికిఁ దగులుటలేదు. అర్జునుఁడు దనకుఁగల దివ్యాస్త్రములను ప్రయోగించెను. గాండీవముతో నాతనిపై కేగెను. అదియు నదృశ్యమయ్యె. అదియుఁబోఁగా నర్జునుఁడు వృక్షములతోడను, రాళ్ళతోడను గొట్టెను. అతనితోఁ బెనగులాడి యుద్ధముచేసి క్రిందఁబడి మూర్ఛితుఁడయ్యె. అపుడు శివుఁడు వాని శౌర్యవిభవంబునకు మెచ్చుకొని నిజరూపమును జూపించెను. అర్జునుఁడు వానిని స్తోత్రము చేసెను. శివుఁడు వరము వేఁడుకొను మనఁగా నతఁడు పాశుపతాస్త్రము గోరెను. శివుఁడు మంత్ర ధ్యాన జప హోమపూర్వకంబుగ, సంధాన మోక్షణ సంహార సహితంబుగఁ బాశుపతాస్త్ర మిచ్చెను. భార.

బ్రహ్మ విష్ణు మహేశ్వరులలో నెవ్వరు ముక్తి నివ్వఁగలరని మునులలో వాదము రాఁగా దానిని నిర్ధారణచేయుటకై మునులు భృగువును బంపిరి. అతఁడు వచ్చునప్పటికి శివుఁడును, బార్వతియుఁ గ్రీడించుచుండిరి. చెప్పకుండ లోపలకేలవచ్చితివని శివుఁడు కోపపడియెను. నీవు రజోగుణ ప్రధానుఁడవు. ముక్తి నీయలేవు. నీశరీరమునకుఁ బూజలేకుండుఁగాక యని శపించి భృగువు వెడలెను. అందువలననే శివునిరూపముగాక లింగము మాత్రము పూజింపఁబడు చున్నది. (చూడుము లింగము.) వేంక.

శివుఁడు కాశీపట్టణములోఁ గాఁపురముండెను. అందుండుటకుఁ జాలయత్నము, అన్యాయమును జేసెను. (చూడు దివోదాసుఁడు) శివుఁడు శ్మశానములందు భూతభేతాళములతోఁ దిరుగువాఁడు. శివుఁడు భక్తులకుఁ బ్రత్యక్షమై వరము లిచ్చును గాని యొక్కొక్కెడఁ దన భక్తులను గ్రూరపరీ

క్షులుచేయును. భల్లాణుని బరీక్షించుటకై జంగమ రూపమునఁ బోయి రమించుట కొక వేశ్యను గోరెను.

శివునిచాపము:-దక్షునియజ్ఞమందు శివునికి భాగమివ్వక దేవతలే హవ్యములు గైకొనుచుండిరి. దక్షుఁడును శివునిని బిలువలేదు. ఇతనికి కోపము వచ్చి వానియజ్ఞము ధ్వంసము చేయుటకై చాపము తీసికొని వెళ్ళెను. దాని తోడనే దేవతలను గూడఁ గొట్టెను. వారు భయపడి శివునకు మ్రొక్కి శరణువేఁడిరి. అంత వారిని గొట్టుట మాని శివుఁ డాచాపమును వారికిచ్చెను. దేవతలు నిమికి నాఱవసంతతివాఁడైన దేవరాతున కిచ్చిరి. వానిసంతతివా రందఱును దానినిఁ బూజించుచుండిరి. అదే జనకునింట నుండెను. దానినే శ్రీరాముఁడు విఱిచెను. రామా.

శిశిరుఁడు:-సోముఁడను (ధీరుఁడను) వసువు కుమారుఁడు. మత్స్య. భార.

శిశిరుఁడు:-శాకల్యుని శిష్యుఁడు. తాను నేర్చిన ఋగ్వేద సంహితను జాతుకర్ణి అనువాని కుపదేశించెను. భాగ.

శిశునాగుఁడు:-బృహద్రథుని వంశము వాఁడైన నందివర్ధనునితర్వాత నితఁడు రాజ్యమేలెను. ఇతని కుమారుఁడు కాకవర్ణుఁడు. మహానంది తండ్రి యగు నందివర్ధనుఁడు వీనివంశమువాఁడు. భాగ.

శిశుపాలుఁడు:-దమఘోషుని పుత్త్రుఁడు. వీనితల్లి శ్రీకృష్ణుని మేనయత్తయగుసాత్వతి. ఇతఁడు తొల్లి హిరణ్యకశిపుఁడు. శిశుపాలుఁడుపుట్టినపుడు నాల్గు భుజములతోడను, లలాటమందు నేత్రముతోడను బుట్టెను. ఈవికృతరూపమును జూచి తల్లిదండ్రులు భయపడిరి కాని, ఆకాశవాణి ఈబాలుఁడు ఎత్తుకొన బడుచో లలాటమం దధికముగనున్న కన్నును, అధికముగనున్న బాహుయుగళమును నడగిపోవును. ఎవరెత్తుకొనఁగా నడఁగునో వారే యీ బాలుని కంతకు లగుదురు అని పలికెను. అధికముగనున్న యంగము అదృశ్యము లగుటకు వచ్చినవారిచేతి కెల్ల నీ బాలుని ఎత్తుకొనుఁడని శిశుపాలుని తల్లి దండ్రు లిచ్చుచుండిరి. ఒకనాఁడు బలరామ కృష్ణులు తమ మేనత్తను జూడవచ్చిరి. వీరి చేతికిని సాత్వతి తన కుమారుని ఎత్తుకొం డని యిచ్చెను. శ్రీకృష్ణుఁ డెత్తుకొనఁగనే బాహువులును, మూఁడవ కన్నును మాయమయి పోయెను. అపుడు సాత్వతి, యాకాశవాణి పలుకులు దలఁచుకొని శ్రీకృష్ణునిచేతనే తన కుమారుఁడు చంపఁబడునని తెలిసికొని కృష్ణా! ఈకుఱ్ఱఁడు దుర్మార్గుఁడై నీ కెగ్గుసేయవచ్చును. చేసినను, నీ మఱఁది గావున వీఁడు చేసెడు నపరాధ శతంబును సైపుము అని వేఁడెను. శ్రీకృష్ణుఁడు సరే యనియె. కావున శిశుపాలుఁ డితరులచేతఁగాని, కృష్ణునిచేనైనను నూఱు తప్పులు చేయకపూర్వము గాని వధ్యుఁడు గాఁడు. శిశుపాలుఁడు దుర్మార్గుఁడై, క్రూరుఁడై చరించుచుండెను. ప్రమత్తులై యుండిన భోజరాజులను వధించెను. వసుదేవుఁడు యజ్ఞము సేయఁబోవుచుండఁగా నశ్వము నపహరించి దానిని వధించి యాగము భగ్నముచేసెను. కృష్ణుఁడు లేని సమయమున ద్వారకకేగి యా పురము కాల్చెను. తాను రుక్మిణిని వివాహము కాఁగోరెను. బభ్రుభార్యను దనకు భార్యగఁ జేసికొనియెను. వీనిని సంహరించుటకై శ్రీకృష్ణుఁడు సమయముకొఱకు వేచియుండెను.

ధర్మరాజు రాజసూయము సేయఁబోవునపు డితఁడు పాలించు చేదిదేశమునకు దిగ్విజయార్థము భీముఁడు వచ్చెను. శిశుపాలుఁడు భీము నాదరించి ధర్మజుని యాగమునకై ధనమిచ్చి తానును విచ్చేసెను. రాజసభయందు ధర్మజునిచే నర్ఘ్యము గైకొనఁదగినవాఁడు శ్రీకృష్ణుఁడేయని భీష్ముఁడు పలికెను. యాదవుఁడు పూజ్యుఁడు గాఁడని శిశుపాలుఁడు భీష్మునిఁ, గృష్ణునిఁ బరుషము లాడెను. సభయందే కృష్ణుఁడు చక్రము బంపి శిశుపాలుని వధించెను. వీని శరీరము నేలపైఁ బడియెను. అందున్న తేజము శ్రీకృష్ణుని శరీరము ప్రవేశించెను. శిశుపాలుని పుత్త్రుఁడు ధృష్టకేతుఁడు. భార.

శిష్టి:-(శిష్టుఁడు) శంభువునందు (ధవ్యయందు) ధ్రువునకుఁ బుట్టిన కుమారుఁడు. ఇతనిభార్య సుచ్ఛాయ. వీనికి రిపుంజయుఁడు, కృపుఁడు, వృత్తుఁడు, వృకతేజసుఁడు, చక్షుషువు అను కుమారులు కలిగిరి. విష్ణు. మత్స్య.

శీ

శీఘ్రగుఁడు:—సంపాతి పుత్త్రుఁడు. మత్స్య.

శీఘ్రుఁడు:— అగ్నివర్ణుని పుత్త్రుఁడు. ఇతనికుమారుఁడు మరువు. యోగసిద్ధుండై కలాపగ్రామమున నుండువాఁడు. భాగ.

శీలవతి:— విష్ణుశర్మయొక్క కుమారిత. చంద్రగుప్తునిభార్య. ఈమెకుమారుఁడు వరరుచి. విక్ర. చరి.

శు

శుంగుఁడు:—అశోకునివంశములోనివాఁడగు బృహద్రథుని సేనాపతి. ఇతఁడారాజును జంపి రాజ్యమును గైకొనెను. ఇతని పుత్త్రుఁడు అగ్నిమిత్త్రుఁడు. భాగ.

శుంభనిశుంభులు:— దనుజులు. వీరు శివుని బ్రార్థించి, యతనియనుగ్రహమువలన బలాఢ్యులైరి. వీరికిఁ బురుషునివలన మృతిసంభవింపనటు వరము కలదు. ఈదనుజులు యజ్ఞభాగముల నపహరించుచుండుటచే వీరిని సంహరించుమని దేవతలు ప్రార్థించిరి. అంత, గౌరిశరీరమునుండి యొకదేవి పుట్టెను. ఆమెయే కౌశిక. ఈ కౌశికయంతటి రూపవతులు లేరనిచెప్పి యెట్లైన నామెను బరిణయము కండని చండ ముండులు శుంభనిశుంభులను బ్రోత్సాహపఱచిరి. తమను భర్తలుగ గ్రహించుమని చెప్పుటకై శుంభ నిశుంభులు కౌశికకడకు దూతను బంపిరి. తనతో యుద్ధము చేసి గెలిచినవానిని బరిణయ మయ్యెదనని కౌశికి ప్రత్యుత్తర మిచ్చెను. ఈమెను బలాత్కారమునఁ దీసికొనివచ్చుటకై యా దనుజులు తమ సేనాధిపతులను ధూమ్రలోచనునిఁ, జండముండులను, రక్తబీజునిఁ బంపిరి. వీరిని గౌరి వధించెను. పిమ్మట శుంభనిశుంభులే చనిరి. వీరితో దేవి యుద్ధముచేసి వీరిని సంహరించెను. దే. భా. మార్క.

శుకసారణులు:—రావణుని చారులు. సేనాసమేతుఁడై విడిసియున్న సుగ్రీవునికడకు వీరు వచ్చి రాముని విడిచిరమ్మని చెప్పిరి. రావణునితో యుద్ధముచేయకుమని బోధించిరి. మరల రామబల మెంతయున్నదో చూచుటకు వానరరూపమున వచ్చిరి. వీరిని విభీషణుఁడు గుర్తించి పట్టించెను. వానరులు వీరిని సంహరింపఁబోయిరి. కాని శ్రీరాముఁడు వీరిని జంపవలదని చెప్పి కాపాడెను. రామా.

శుకుఁడు:—ఒక దైత్యుఁడు. వృషుఁ డను వాని తండ్రి. భాగ.

శుకుఁడు:—వ్యాసుని కుమారుఁడు. వ్యాసుఁడు మేరునగముపైఁ దపస్సు చేసికొనుచుండఁగా శివుఁడు ప్రత్యక్షమయ్యెను. పంచభూతముల తోడను సమానుఁడైనపుత్త్రు నిమ్మని యా ముని శివుని వేఁడెను. ఈశ్వరుం డనుగ్రహించెను. ఈ వరమువలననే వ్యాసునకు శుకుఁడు జన్మించెను. వ్యాసుఁ డగ్ని కార్యపరుఁడై యరణి మథించుచున్న సమయమున ఘృతాచి వాని కంటఁబడియెను. ఈ ముని కామగోచరత్వము నొందియుండు టీమె యెఱిఁగి వానికి భయపడి (వానిని వంచించుటకై) శుకమై యచ్చటనే చరించుచుండెను. అరణి మథించుచున్నను వ్యాసుని చిత్తము మోహాయత్తమైనదగుటచే శుక్లము జాఱి యరణియందుఁ బడెను. అందుండి శుకుఁడు పుట్టెను. వ్యాసుఁడు మోహదృష్టితో ఆ శుకమును జూచుచుండఁగా రేతస్సు పతితమగుటచే శుకునకుఁ గొంత శుకరూపమువచ్చెను.

వ్యాసుఁడు మొదట శుకమిథునమును జూచి సంచలితుఁడై యుండి యా కారణమున నితఁడు జన్మించియుండుటచే నితని శుకనామము ... (see below)

కడనే వేదశాస్త్రములు నేర్చుకొని ముక్తిమార్గము గూడఁ జెప్పుమని కోరెను. అతఁడు జనకమహారాజుకడకుఁ బోయి నేర్చుకొమ్మని చెప్పెను. అంత శుకుఁడు హిమాలయపర్వతము దాఁటి భరతవర్షమునకు వచ్చి జనకునినగరము చేరెను. ఇతఁ డేపదార్థము చూచినను జూడనివానియట్లే యుండెను. వీనివర్తనము మిక్కిలి యాశ్చర్యము గొలుపుటచే ప్రతీహారులు వీని రాక రాజున కెఱింగించిరి. జనకుఁ డితనిని రావించి మిక్కిలి గౌరవించెను. జనకునియొద్ద శుకుఁడు కొంతవిద్య నేర్చుకొనెను. భార.

అవశ్యము సంసారము చేయవలసినదే యని జనకుఁడు బోధింపుటచే శుకుఁడు పీవరి యను దానిని బరిణయమయ్యెను. ఆమెయం దితనికిఁ గృష్ణుఁడు, గౌరప్రభుఁడు, భూరి, దేవశ్రవుఁడు అను కుమారులును, కీర్తి యను కుమారితయును బుట్టిరి.

శుకుఁ డెచ్చోటునను ఆవుపాలు పితుకు కాలముకంటె నెక్కువసేపు నిలువఁడు. కాని యెవ్వరేని యేప్రశ్ననైన నడుగుచో వారికి సమాధానము చెప్పికాని చనఁడు. ప్రాయోపవిష్టుఁడైన పరీక్షిన్మహారాజున కితఁ డేడుదినములు భాగవతము చెప్పెను. ఇతఁ డొక విషయమును దెల్పఁగనే రాజు మఱియొకప్రశ్న వేయువాఁడు.

శుకుఁ డొకనాఁడు తండ్రితో వేదాధ్యయనము చేయుచుండఁగా మహావాయువు వీవ నారంభించెను. అది యనధ్యయనసమయ మని వ్యాసుఁడు అధ్యయనము మాని స్నానమున కరిగెను. ఆసమయమున నారదుఁడువచ్చి నీ కుపకారము చేయవచ్చితినని యతనికిఁ దత్త్వము బోధించెను. శుకుఁడు ముక్తసంగుఁడై కైలాసమునకుఁ బోవుటకై యాకాశమునకెగసెను. ఇతఁడే మృగములను, పక్షులను, వృక్షములను, శిలలను, నదులను జూచి మాతండ్రి నాకొఱకు వెదకుచు నన్నుఁ బిలుచును. మీరు ఓ యని పలుకుఁడు అనిచెప్పి చనియెను. ఇతఁడు సిద్ధసేవ్యంబైన పట్టణముగుండఁ బోవుచుండెను. అందు దివ్యాంగనలు విగళవస్త్రలై జలకములాడుచుండిరి. వారు శుకునిఁజూచియు నగ్నలై స్నానముచేయుచుండిరి. శుకుఁడు వారిని జూచియుఁ జూడకయే యుండెను. వీనిని వెదకుచు వ్యాసుఁడువచ్చెను. వ్యాసునిఁజూచి స్త్రీలు తత్తరపడుచు వస్త్రములు ధరించిరి. శుకుఁడు నిర్వికారుఁడు, నిశ్చల తపోధనుఁడు, పరమార్థము పొందినవాఁడు. కావున శుకుఁడు చిన్నవాఁడైనను సామాన్యపురుషుఁడు కాఁడనియును, కావుననే వారు తత్తరపాటు లేకయుండిరనియును వ్యాసునితో ఆ స్త్రీలు చెప్పిరి.

శుకుఁ డట్లు కొంతదూర మరిగి పంచభూతాత్మకమైన ప్రకృతితోఁ గలిసెను. వ్యాసుఁడు శుకా! యని పిలువ వృక్షములు, నదులు, గిరులు ఓ యని ప్రత్యుత్తర మిచ్చెను. భార. భాగ.

శుక్తిమతి:- చేదిదేశము సమీపమునఁ బ్రవహించు నది. కోలాహలమను పర్వతము దీనిని గామించెను. వీరి సంగమమువలన వసుపదుఁ డను కుమారుఁడును, గిరిక యను కుమారితయును బుట్టిరి.

శుక్తిమతి ప్రవహించుటకుఁ. గోలాహలము అడ్డుగ నుండెను. చేదిదేశపు రాజైన వసువు ఆ పర్వతమును గాలితోఁ దన్ని యీ నదికి మార్గము చేసెను. ఇందుకుఁ బ్రత్యుపకారముగ నా రాజునకీ నది తన కుమారునిఁ, గుమారితను నిచ్చెను. భార.

శుక్రుఁడు:-హవిర్ధానుని పుత్త్రుఁడు. మత్స్య.

శుక్రుఁడు:- దానవుల గురువు. ఇతఁడు భృగువు (కవి) కుమారుఁడు; ఇతనితల్లి ఉశన. శుక్రుఁడు ప్రియవ్రతుని కుమారితయైన ఊర్జస్వతిని వివాహమయ్యెను. చండుఁడు, అమర్కుఁడు, త్వష్టృఁడు, ధరాత్రుఁడు శుక్రుని పుత్త్రులు.

శుక్రుఁడును, బృహస్పతియును బృహస్పతి తండ్రియగు నంగిరసునియొద్దఁ జదువుకొనుచుండిరి. అంగిరసుఁడు తన యీ శిష్యు లిరువుకకు వ్యత్యాసముగఁ జెప్పెను. అందువలన శుక్రుఁడు వీనినివిడిచి గౌతమునికడ కేగి తనకు విద్య నేర్పుమని కోరెను. లోకమంతకును గురువగువాఁడు శంభుఁడే; వానినే యారాధించుము. సర్వవిద్యలు నీ కలవాటుపడు నని గౌతముఁడు చెప్పెను. అంత శుక్రుఁడు గౌతమితీరమునకు వచ్చి శివుని ధ్యానించెను. శివుఁడు ప్రత్యక్షమై వీనికి 'మృతసంజీవని విద్య' నేర్పెను.

తాను నేర్చిన మృతసంజీవని విద్యచే శుక్రుఁడు చనిపోయినరాక్షసులను బ్రతికించుచుండెను. అందువలన దేవతలు యుద్ధమందు దానవులను గెలువలేక పోవుచుండిరి. ఎంత యత్నించినను అంధకాసురుని జంపలేకపోయిరి. అంత, దేవతలు శివునికడకుఁబోయి శుక్రుఁడు కావించునది చెప్పిరి. శివుఁడు శుక్రుని మ్రింగివేసెను. పిమ్మట నంధకాసురుఁడు చంపఁబడియెను. పదపడి శుక్లరూపంబున శుక్రుఁడు శివునిదేహమునుండి బైటకువచ్చి నిజరూపమును దాల్చెను. కాశీ.

శుక్రుఁడు కుబేరునికడనుండి వంచనచేసి యతని ధనమంతయును నపహరించెను. కుబేరుఁడు శివునితోఁ జెప్పుకొనియెను. శివునకు భయపడి శుక్రుఁడు తుప్పలచాటున దాగెను. కాని చిరకాలము దాఁగుకొనలేకపోయెను. తుదకు శివునిచేతిలోఁ జిక్కెను. అతఁడు శుక్రుని మ్రింగివేసెను. శుక్రుఁడు తనను బైటకు రప్పింపుమని ప్రార్థించెను. శివుఁడు తన శరీరమందలి యన్నిద్వారములు మూసెను గాని శిశ్నముమాత్రము మూయలేదు. ఆ ద్వారమున వానిని రమ్మని శివుఁడు పలికె. అట్లే శుక్రుఁడు బయటకు వచ్చెను.

అట్లితఁడు శివునిగర్భమునుండి వచ్చుటచే వానికిఁ గుమారుఁ డయ్యెనుగావున దనకును గుమారుఁ డయ్యెనని భవాని పలికి వానిని సుఖునిఁ జేయుమనెను. శివుఁ డంగీకరించి వానిని దేజోవంతునిఁ జేసి యతఁ డా మార్గమునుండి బయటకు వచ్చుటచే శుక్రుండను పేరును బొందునననెను. భార.

శుక్రుఁడు తపస్సుచేసికొనుచుండగా దానిని చెరుపుటకై యింద్రుఁడు తన కుమారిత యగు జయంతిని బంపెను. శుక్రుఁడు దన తపస్సు ముగిసి బ్రహ్మవలన వరము పుచ్చుకొనినపిమ్మట జయంతిని జూచి యామెను దీసికొనివచ్చి యామెతో భోగించెను. ఆమెయందే దేవయాని పుట్టెను. మత్స్య.

శుక్రుఁడు జయంతితో భోగించుచుండెను. ఆసమయమందే బృహస్పతిరాక్షసులనువంచించుటకై శుక్రునిరూపమున వచ్చి రాక్షసులమధ్య వసించుచుండెను. వీనినే తమగురువుగఁ దలంచి రాక్షసులు తమ మర్మములు చెప్పుచుండిరి. ఇంతలో శుక్రుఁడువచ్చెను. ఇరువురును నొక్క రీతిని నుండుటచే నెవరు తమ గురువో, ఎవఁడు వంచకుఁడో రాక్షసులు తెలిసికొనలేకపోయిరి. నేను నిజమైన శుక్రుఁడను. నేను నిజమైన శుక్రుఁడను అని యిరువురును బోరాడిరి. తుదకు బృహస్పతి యంతర్ధానము నొందెను. మత్స్య.

అసురులు దేవతలచే నోటువడి శుక్రునితోఁ జెప్పికొనిరి. ఇతఁడు శివునిబ్రార్థించి మంత్రమును దెత్తుననియెను. అంత నతఁడు దపస్సుచేసి మంత్రమును బొంది వచ్చెను. వీరి నెటులైనను వంచనచేయవలెనని యింద్రుఁడు తన కుమార్తె యగు జయంతిని వీనికడకుఁ బంపెను. శుక్రుండొకచో నామెతో సుఖము లనుభవించుచుఁ గొన్నియేడు లుండెను. అసురులు వీనిని వెదకి యెచ్చటనుగానక విలపించిరి. ఆ సమయమున గురుఁడు శుక్రునిరూపముతోవచ్చి తానే భార్గవుండనని యసురులను దప్పుత్రోవలఁ బెట్టుచుండెను. ఆ సమయమున శుక్రుండు వచ్చెను. వీరిద్దఱకు వివాదముజరిగెను. అసురులు మాయా శుక్రుని నిజమగు గురువునిఁగఁ దలంచిరి. శుక్రునకుఁ గోపమువచ్చి మీరు సురలచే నోటువడుడని శపించెను. దే. భా.

శుక్రుఁడు నేర్చిన మృతసంజీవనివిద్య నేర్చుకొనుమని దేవతలు కచునిఁ బంపిరి. కచుఁడు శుక్రునకు శుశ్రూషచేయుచుండెను. దేవతలకీ విద్య యలవాటగుట దానవుల కిష్టములేదు. వారు కచుని జంపిరి. కచునకును, శుక్రుని కుమారితయైన దేవయానికిని మైత్రి మెండు. దేవయాని కిష్టముచేయుటకై శుక్రుఁడు మృతసంజీవనిని బంపి కచుని బ్రతికించెను. మఱియొక సారి దానవులు కచునిఁ జంపి కాల్చి భస్మము చేసి యా భస్మము సురలోఁ గలిపి శుక్రున కిచ్చిరి. శుక్రుఁ డీ మోస మెఱుఁగకపోవుటచే దానిని ద్రావెను. కాననమున కేగిన కచుఁడు మరల రాకపోవుటచే దేవయాని భోజనము చేయననియెను. శుక్రుఁడు తన యోగదృష్టివలన రాక్షసులు చేసిన మాయ తెలిసికొనియెను. తన గర్భమందున్న కచునకు మృతసంజీవని నుపదేశించెను. అట్లు బ్రతికిన కచుఁడు శుక్రుని యుదరము చీల్చుకొని బైటకు వచ్చెను. ఇతఁ డిట్లు వచ్చుటచే శుక్రుఁడు మరణించెను. వీనిని

గచుణము బ్రతికించెను. తాగి సురాపానము చేయుటచే నింత వాటిల్లినది గావున నప్పటి నుండియు సురాపానము పాతకమగునట్లు శుక్రుఁడు శపించెను. భార.

శుక్రునకు దేవయానిపై బ్రేమ మెండు. ఆమెకై యెంతపనినైనఁ జేయువాఁడు. దేవయాని శర్మిష్ఠచే నవమానింపబడుటచే నామె తండ్రి యగు వృషపర్వుని నగరమునకు రాననియెను. ఆమెకై శుక్రుఁడును వృషపర్వుని నగరమును విడిచెను. వృషపర్వుఁడు శుక్రుని బ్రతిమాలి తన కూఁతును దేవయానికి దాసిగ నిచ్చి వారిని దన నగరమునకుఁ దీసికొనివచ్చెను.

దేవయాని యయాతిని వివాహము కాఁ గోరెను. దానికి శుక్రుఁడు సమ్మతించి యపక్రమ దోషము లేకుండఁ దా ననుమతి యిచ్చెను. మఱియును యయాతి తన నవ మానించెనని దేవయాని చెప్పుకొనఁగ వానిని శుక్రుఁడు శపించెను. భాగ.

బలిచక్రవర్తికడకు వామనుఁడు వచ్చి మూఁడడుగుల భూమి నడిగెను. అంతకంటె నధికమైన వరమును గోరుకొనుమని బలి చెప్పెను. ఆ యడుగుచుండినవాఁడు సామాన్య నరుఁడు కాఁడు. వానికేమియు నీయకుము. ఇచ్చెదనని చెప్పి యీయకుండినను నిట్టియెడ దోషము కాదు. "వారిజాక్షులందు వైవాహికములందుఁ బ్రాణ విత్త మాన భంగమందు" నసత్యము చెప్ప వచ్చును. దానఁ బాపమురాదని శుక్రుఁడు ఎంత చెప్పినను బలి యాడితప్పనని వామనుఁ డడిగిన మూడడుగుల భూమి ధారపోయు చుండెను. బలి కుపకారము చేయుటకై శుక్రుఁడు యీఁగయై నీటిధార పడకుండ జారీ కొమ్మున కడ్డముగా వచ్చెను. వామనుఁడు పుల్లతోఁ గొమ్మును కెలికెను. అది యీఁగ కంటిలో గ్రుచ్చుకొని కన్ను జితికెను. అందు వలననే శుక్రుని నేత్ర మొక్కటి గ్రుడ్డి దయ్యెను. భాగ.

శుచి:-ఒక వర్తకుఁడు. అరణ్యములో దమయంతిని విడిచి నలుఁడు చనినపిమ్మట వానికై యామె వెదకుచు నితనిం జూచి నలునిగూర్చి ప్రశ్నించెను. వీని సహాయమున నామె సుబాహు పురము చేరెను. భార.

శుచిష్మంతుఁడు:-(చూడుము వరుణుఁడు.)

శునకుఁడు:- సముద్రుని కుమారుడు. ఇతని కుమారుఁడు శౌనకుఁడు. భార.

శునకుఁడు:- పురంజయుఁడను రాజుయొక్క మంత్రి. ఇతఁడు రాజును జంపి తాను రాజ్య మేలెను. ఇతని కుమారుఁడు ప్రద్యోతనుఁడు. భాగ.

శునకుఁడు:- పథ్యుని శిష్యుఁడు. ఇతఁ డథర్వణ వేదమును బఠించెను. భాగ.

శునకుఁడు:- గృత్సమదుని కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు శౌనకుఁడు. భాగ.

శునఃపుచ్ఛుఁడు:- శునశ్శేఫుని సోదరుఁడు.

శునశ్శేఫుఁడు:- ఋచికుని రెండవ కుమారుఁడు. అంబరీషుఁడను రాజు ఋచికునియొద్దకు వచ్చి నీకు లక్షగోవుల నిచ్చెదను. నీకుమారుని నొక్కని యాగపశువుగ నిమ్ము అని కోరెను. పెద్దకుమారునియందు నాకుఁ బ్రీతి. వానిని నేనియ్యనని ఋచికుఁడనియె. కడసారివానియందు నాకుఁ బ్రీతి. వానినే నీయఁజాలనని యాతని భార్య పలికెను.

ఈ మాటలు వినుచుండిన శునశ్శేఫుఁడు వారియెదుటకు వచ్చి అంబరీషునితో నేను మధ్యవాఁడను. నా తండ్రికి లక్షగోవులనిచ్చి నన్నుఁగొనిపొమ్ము అని నుడివెను. అంబరీషుఁడు వీనింగొనిపోయె. మార్గమందు విశ్వామిత్రుఁడు వీనిని జూచి యెక్కడకరుగుచుంటివని యడిగెను. అంబరీషుని యాగపశువుగఁ బోవుచున్నానని శునశ్శేఫుఁడు చెప్పెను. వీనిని గాపాడఁ దలఁచి విశ్వామిత్రుఁడు తన పుత్త్రులఁజూచి మీలో నెవ్వఁడైనను యాగపశువుగఁ బోయి శునశ్శేఫుని విడిపింపుఁ డనియెను. కాని వారెవరును బోనొల్లరైరి. విశ్వామిత్రుఁడు శునశ్శేఫునకు మంత్ర ముపదేశించి దాని నే పఠింపుచుండుమని చెప్పెను. శునశ్శేఫుని యూపస్తంభమునకు గట్టిరి. ఇతఁడింకను విశ్వామిత్త్రుఁడు బోధించిన మంత్రము నే పఠించు చుండెను. ఇంద్రుఁడు ప్రత్యక్షమై యంబరీషునకు యాగఫలమిచ్చి వీనిని విడిపించెను. రామా.

శునశ్శేఫుఁడు:-అజీగర్తునికుమారుఁడు. క్షామము వచ్చుటచే నాహారములేక మిక్కిలి బాధపడుచు అజీగర్తుఁడు తనకుమారుఁడగు శునశ్శేఫుని హరిశ్చంద్రునకమ్మెను. శునశ్శేఫుఁడు యాగపశువుగఁజేయఁబడి యూపస్తంభమునకుఁ గట్టఁబడియె. ఇతఁడు బ్రహ్మను బ్రార్థించుచు నల్లేయుండెను. బ్రహ్మ ప్రత్యక్షమై వీనిని బంధవిముక్తుని గావించి హరిశ్చంద్రునకు యాగఫల మిచ్చెను.

దేవతలు వీనిని విడిపించుటచే వీనికి దేవరాతుఁడను పేరు వచ్చినది.

శునశ్శేఫునందు విశ్వామిత్రునకుఁ బ్రీతికలిగి తనకుఁ బెద్దకుమారునిఁగఁ గైకొనెను.

శునశ్శేఫుని అమ్ముటవలన నజీగర్తునకుఁ బిశాచత్వము వచ్చెను. అతఁడు యమభటులవలన బాధలొందుచుండెను. అది శునశ్శేఫుఁడు విని తనమూలమునఁ దనతండ్రి కిట్టిబాధలు కలిగెనని విచారించి గౌతమీతీరమునకేగి తపస్సుచేసెను. వీనికి శివ విష్ణులు ప్రత్యక్షమైరి. వీరి యనుగ్రహమున శునశ్శేఫుఁడు తండ్రియొక్క పిశాచత్వమును బోఁగొట్టెను.

శునాదేవి:-వరుణుని భార్య. వాయు.

శుభ:- గాంధారి తోఁబుట్టువు. ఈమెనుగూడ ధృతరాష్ట్రుఁడు వివాహమయ్యెను. భార.

శుభాంగి:- రుక్మి కుమారిత. ఈమె స్వయంవరమునఁ దన మేనయత్త కుమారుఁడగు ప్రద్యుమ్నుని వరించెను. ఈమె వివాహమునకు వచ్చిన బలరామునితో రుక్మి జూదము నాడి తుదకుఁ జంపఁబడియెను. భాగ.

శుభాంగి:-కురుని భార్య. విదూరథుని తల్లి. భార.

శుభాంగి:- కళింగాధిపతియైన చిత్రాంగదుఁడను రాజు కుమారిత. ఈమె స్వయంవరమునకు దుర్యోధనాది రాజులందఱును వచ్చిరి. ఈమె దుర్యోధనుని వరింపక పుష్పమాలికతో నతనిని దాటిపోవుట చూచి యతఁడు పట్టరానికోపము గల్గిన యీమె నెత్తుకొని తనరథముపై నెక్కించి రథము వేగముగఁ దోలించుకొని చనియెను. తక్కినరాజులు వానితో యుద్ధముచేయుటకు వచ్చిరి. వారందఱితోడను గర్ణుఁడు పోరాడి వారి నోడించెను. భార.

శుభ్రుఁడు:- హవిర్ధానుని పుత్త్రుఁడు. మత్స్య.

శుష్కుఁడు:-ఒక ముని. మహేంద్రపర్వతముపైఁ దపస్సుచేసుకొనుచుండిన పరశురామునికడ కరిగి, సముద్రుఁడు గోకర్ణక్షేత్రమును ముంచివేసెను. నీవు వచ్చి రక్షింపుము. నీవు తపస్సులో నుండినను దుష్టసంహారమునకై శరము వేయవచ్చును. దానివలనఁ బాతకమురాదు అని చెప్పి వానిని వేఁడెను. బ్రహ్మ.

శూ

శూన్యబంధుఁడు:- తృణబంధుని కుమారుఁడు. భాగ.

శూరపద్మాసురుఁడు:- సురసయందుఁ గశ్యపుని వలన జన్మించిన రాక్షసుఁడు. ఇతఁడు త్వష్టప్రజాపతి కూఁతురగు పద్మకోమలను వివాహమయ్యెను. ఈ యసురుఁడు శివునిని బ్రార్థించి యతనితోడను, విష్ణువుతోడను సఖ్యముచేసెను. ఇతనికుమారుఁడు భానుకోపుఁడు. శూరపద్మాసురుఁడు కుమారస్వామితో యుద్ధము చేయుటకు బయలుదేఱెను. కుమారస్వామి శివుని కుమారుఁడు. అతనితో యుద్ధమువలదని యితని సోదరుఁడు సింహవక్త్రుఁడు చెప్పినను వినక యితఁడు యుద్ధముచేసెను. ఆ యుద్ధములోఁ కుమారుఁడు వీనిని సంహరించెను. స్కాంద.

శూరసేనుఁడు:- కార్తవీర్యార్జునుని కుమారుఁడు. ఇతఁడు పరశురాముని దప్పించుకొని బ్రతికెను. భాగ.

శూరసేనుఁడు:- ఒకరాజు. కాంచనమాలతండ్రి. స్కాంద.

శూరసేనుఁడు:- నిశంతుని పుత్త్రుఁడు. ఇతఁడును, నితని సోదరులు శ్రుతసేనాదులును అజిత యనునొక్క కాంతను వివాహమయిరి. భార.

శూరసేనుఁడు:- మాథురము, శూరసేనము అను దేశములను బరిపాలించిన రాజు. మధురానగర మితని రాజధాని. ఇతని కుమారుఁడు. వసుదేవుఁడు. భాగ.

శూరసేనుఁడు:— ఒక చంద్రవంశపు రాజు. ఇతఁడును, భార్యయును సంతానముకొఱకు అనేకవ్రతములుచేసిరి; తుదకు వీరి కొక సర్పము జన్మించెను. ఈ సర్పమునే వీరు పెంచుచు వచ్చిరి. దీనికి మనుష్యభాషణములును వచ్చెను. అది తన కుపనయనము గావింపుమని కోరెను. శూరసేనుఁడు గావించెను. పిమ్మట కొన్ని సంవత్సరములకు ఆ సర్పము తనకు వివాహము చేయుమని బలవంతపెట్టెను. శూరసేనుఁడు తన మంత్రులతోఁ జెప్పెను. ఒక మంత్రి మాయచేసి ఖడ్గవివాహమున నొక రాకొమరితను విజయుఁడనువాని కూఁతును దీసికొని వచ్చెను. ఆమెయు, సర్పుఁడును ఏకశయ్యపై జేరిరి. నన్నుఁ జూచి యేలభయపడవని యీ సర్పుఁడడుగఁగ నితనిభార్య భర్త ఎట్టివాఁడైన దైవసముఁడు. దైవసమునిఁజూచి భయపడనేల? అని పలికెను. ఆ సర్పము శివునిశాపమువలన దా నట్లయితినని చెప్పి భార్యాసహితుఁడై గౌతమియందుస్నానముచేసి శివునిని ప్రార్థించి శాపవిముక్తుఁడై మనుష్యరూపమును దాల్చి వచ్చెను. దాన శూరసేనుఁడు మిక్కిలి యానందించెను. బ్రహ్మ.

శూరుఁడు:—కార్తవీర్యుని కుమారుఁడు. ఇతఁడు రాజ్యముచేయుచు వేఁటకువెళ్ళి జమదగ్ని యాశ్రమము చూచెను. తన తండ్రిని జంపిన పరశురాముని తండ్రి యా మునియే యని తెలిసికొని జమదగ్నిని పరశురాముఁడు లేని సమయమున వధించెను. ఇట్లు చేయుటచేఁ పరశురాముఁడు వానిని, వాని వంశమువారి వందఱిని సంహరించెను. బ్రహ్మ.

శూరుఁడు:—ఒక యాదవరాజు. కుంతి తండ్రి.

శూరుఁడు:— హృదికుమారుఁడైన దేవమీఢుఁడే శూరుఁ డనఁబరగును. ఇతఁడు మారిషను వివాహమయ్యెను. వసుదేవుఁడు, దేవభాగుఁడు మొదలగువా రీతని పుత్త్రులు. (చూడుము దేవమీఢుఁడు) కుంతి ఇతని పుత్త్రిక. భాగ.

శూర్పణఖ:— విశ్రవోబ్రహ్మకుఁ గైకసియందుఁ బుట్టిన కుమారిత. రావణుని చెల్లెలు. (విశ్రవోబ్రహ్మకుఁ రాకయందుఁ బుట్టినకూఁతురు. ఈమె సోదరుఁడు ఖరుఁడు.) ఈమెను విద్యుజ్జిహ్వున కిచ్చి పెండ్లిచేసిరి. రావణుఁడు కాలకేయులతో యుద్ధమునకుఁ బోయినపుడు విద్యుజ్జిహ్వుఁడు కూడ వెళ్ళెను. అచ్చట సంగ్రామములో రావణుఁడు పొరపాటున శత్రువులను తలఁపుతో విద్యుజ్జిహ్వునే చంపెను. శూర్పణఖ భర్త మరణమునకు నార్తినొందఁగ, నామె నోదార్చి దండకారణ్యమున ఖరదూషణు లున్నారు. నీకు వారు సకలసౌఖ్యములు నొసంగెదరు. అచ్చటి కేగుమని రావణుఁడు చెప్పెను. ఈమె దండకారణ్యములో నుండెను. ఈమెకు జంబుకాసురుఁడను కుమారుఁడు కలఁడు. ఇతఁడు పొదలలోఁజేరి తపస్సును జేసికొనుచుండఁగ లక్ష్మణుఁడు ఫలములను గోయుచు నితనిని జూడక కత్తితోఁ గొట్టెను. ఇతఁడు మరణించెను. తన పుత్త్రునిఁ జంపినవా రెవరని శూర్పణఖ వెదకుచు రాఁగా నరులు చంపిరని యీమెకుఁ జెప్పిరి. ఆ నరులను మ్రింగివేయవలయు నను నంతకోపముతో శూర్పణఖ వచ్చెను. వచ్చి శ్రీరామునిఁ జూచెను. అతనిరూపము చూడఁగానే యీమెచిత్తము చలించెను. రాముని మోహించెను. తన పుత్త్రునిమాట మఱచెను. తనను వరియింపుమనియెను. తాను భార్యతో నుండెననియు, లక్ష్మణుఁడు ఒంటరిగ నుండెననియును, గావున నతనిని వేఁడుమనియుఁ రాముఁడు పలికెను. లక్ష్మణుఁడుకూడ శూర్పణఖ వాంఛితము నెఱవేర్పలేదు. శూర్పణఖకుఁ దాప మెక్కుడయ్యెను. సీత యుండుటచేఁ దన కోఁకకు భంగముకలిగెనని యీర్ష్యచెంది యామెను బాధింపఁబోయెను. అపుడు లక్ష్మణుఁ డీమెను బట్టి ముక్కు చెవులు కోసివేసెను. ఆశాభంగమున కీ యవమానముకూడం గలియఁగ శూర్పణఖకు వచ్చిన దుఃఖ మింతింత కాదు. ఆమె తన యవమానమును ఖరదూషణులతోఁ జెప్పి వెంటనే లంకకు వచ్చి రావణునిఁ జేరి, అన్నా! నీ చెల్లెలనని యైన గౌరవింపక నరు లెట్లు చేసిరో చూచితివా? ఈ యపరాధము నెట్లు సైతువు? నన్నుఁ బరాభవించుట నిన్ను అవమానించుట గాదా? ఆ నరులతో నొక సుందరాంగి కలదు. ఆమెకు నీవే తగి యుందువు. ఆమె సౌందర్యమును వర్ణింప

వారరమా ? ఆ నరులకడనుండి యీ సుగాత్రిని దీసికొని రమ్ము. అదియే వారికి శిక్ష యని చెప్ప మొదలిడెను. సీత యెత్తుకొని పోబడుటకు శూర్పణఖయే కారణము. ఈమె చెప్పకపూర్వము రావణున కట్టి తలంపే లేదు. రామా.

శృ

శృంగ:—శమీకుఁడను మునిపుత్త్రుఁడు సమాధి యందు నున్న తన తండ్రిమెడపై పరీక్షిత్తు సర్పశవమును బడవేసెనని తెలిసికొని వచ్చి చూచి, యది జీవములో నుండెనా మాతండ్రిని గఱచి యుండునుగదా యని విచారించి, యీ సర్పశవమును మా తండ్రిపై వైచినరాజు నేఁడు మొదలు లేడుదినములలో సర్పదష్టుఁడై చనిపోవుఁగాక యని శపించెను. శమీకుఁ డీ శాపవృత్తాంతము తెలిసికొని యట్లు శపించుట మంచిదికాదని చెప్పెను. భార.

శృంగారశేఖరుఁడు:—ఒక రాజు. రాగమంజరి యొక్క తండ్రి. తనకూఁతురు చంద్రగుప్తుఁడను బ్రాహ్మణుని వలచియుండు టెఱింగి యాతనికి ముందుఁగా నాతని పురోహితుఁడైన విష్ణుశర్మ యొక్క పుత్త్రికనిప్పించి, పిదపఁ దనకూఁతు నిచ్చి వివాహముచేసెను. ఈమె కుమారుఁడే విక్రమార్కుఁడు. విక్ర. చరి.

శృంగిబేరిపురము:—రాముని మిత్త్రుఁడైన గుహుఁ డుండిన పురము.

శే

శేషాద్రి:—(చూడుము శేషుఁడు.)

శేషుఁడు:—కద్రువకుమారుఁడు. వీనితండ్రి కశ్యపుఁడు. వినతయెడఁ దన తల్లియుఁ, దమ్ములును జేసిన యధర్మమునకు రోసి యితఁడు వారిని విడిచి వెడలి బ్రహ్మనుగూర్చి తపస్సుచేసెను. అతఁడు ప్రత్యక్షమై నీవు నిత్యసత్యధర్మనిరతుఁడవు, భూభారము వహించుమనియును, గరుడు నితో సఖ్యము చేయుమనియును జెప్పెను. శేషుఁ డద్దాని కంగీకరించి వహించెను. భార.

శేషుఁడు స్వర్గములో విష్ణుని ద్వారము కాచుచుండెను. వాయువు వచ్చి లోపలకుఁ బ్రవేశింపఁబోయెను. శేషుఁడు వలదనియెను. విష్ణుమూర్తిని సందర్శించుటకు వచ్చితినని, పోవలదని చెప్పుటకు నీ వెవ్వఁడవని వాయువు తిరస్కరించి లోపలకుఁ బోయెను. శేషుఁడు వానిని గెంటివేసెను. వారిరువురకు నచ్చటఁ బోరాట మయ్యెను.

వారి బలములు పరీక్షించుకొనుచుండిరి. ఈ సందడి విష్ణుమూర్తి విని వెలుపలవచ్చి మీలో నెవ్వరు బలాఢ్యులో నిర్ణయించుట కింతయేల? శేషుఁడు మేరుపర్వతము కుమారుఁడైన వేంకటాద్రిని జుట్టుకొని యుండును. వాయువు దానిని గదల్పవలెను. కదల్పలేకపోయినచో శేషుఁడే బలవంతుఁడు అని చెప్పెను. వీరిరువురు సరే యనిరి. శేషుఁడు వేంకటాద్రిని జుట్టుకొని బిగ్గఁబట్టుకొనియుండెను. వాయు వాపర్వతమునే కదల్చి దూరముగ విసరెను. శేషుఁడు మిక్కిలి ఖిన్నదనము నొందె. స్వర్గమునకుఁ బో నిచ్చగింపలేదు. అచ్చటనే విచారములో నుండఁగా విష్ణువు వచ్చి యోదార్చెను. శేషుఁ డచ్చటఁ బర్వతముపైననే యుండెను. అదియే శేషాద్రి. వేంక.

శై

శైబ్య:—రుచికునిపుత్రుఁడగు జ్యామఘుని భార్య. (చూడుము జ్యామఘుఁడు)

శైబ్యము:—కృష్ణునిరథమునకుఁ గట్టఁబడిన యొక యశ్వము. భార.

శైలూషుఁడు:—ఒక గంధర్వుఁడు. విభీషణుని భార్యయైన సరమ తండ్రి. ఉ.రా.

శో

శోణపురము:-బాణాసురుని నగరము. భాగ.

శోణాశ్వుఁడు:-సుశర్మ చక్రరక్షకుఁడు. భార.

శౌ

శౌనకుఁడు:-ఒక మహర్షి. శునకుని కుమారుడు. ఇతఁడు నైమిశారణ్యమునఁ బండ్రెండేండ్లు సత్ర యాగముచేసి సూతునివలనఁ బుణ్యకథలనువినెను.

శౌనకుఁడు:-(చూడుము మంకణుఁడు) "ఒకపాఠములో మంకణునకు బదులు శౌనకుఁ" డని యున్నది.

శౌనకుఁడు:-గృత్సమదుని కుమారుడైన శునకుని పుత్త్రుఁడు. ఇతని పుత్త్రుఁడు బహ్వృచ ప్రవరుఁడు. భాగ.

శౌనకుఁడు:-ఒకఋషి. కపిగోత్రుఁడు. ఇతఁడును, కక్షసేనుని వంశమువాఁడైన అభిప్రతారి యను మునియును భోజనమునకుఁ గూర్చుండఁగ నొక బ్రహ్మచారి భిక్షకువచ్చెను. వీనికి సంవర్గవిద్య యందు నిష్ఠగలదో లేదో పరీక్షించుటకు వీరు వానికి భిక్షనీయలేదు. అతఁడు శౌనకునితోడ సంవర్గవిద్యయందు వాదమును సల్పెను. పిమ్మట వానికి భిక్ష నిచ్చిరి. భార.

శౌనహోత్రుఁడు:-శునహోత్రుని పుత్త్రుఁడు. ఇతఁడు యాగముచేయుచుండఁగా నింద్రుఁడు వచ్చెను. ఇటకు నొంటరిగవచ్చిన యింద్రుని సులభముగఁ బట్టుకొనవచ్చునని రాక్షసులును వచ్చిరి. వారినిజూచి యింద్రుఁడు శౌనహోత్రుని రూపము ధరించెను. రాక్షసులు ఇంద్రుని బట్టుకొనుటకై నిజమైనశౌనహోత్రునినే పట్టుకొనిరి. ఇతఁడు వారికి భయపడి యింద్రుని జూపించెను. ఇతఁడు తరువాత జన్మమున గృత్సమదుఁడు, శౌనకుఁడుగఁబుట్టెను. భార.

శౌల్కాయని:-వేదదర్శుని శిష్యుఁడు. అథర్వవేదము పఠించెను. భాగ.

శౌష్కలుఁడు:-రావణుని పురోహితుఁడు. రావణునికి సీతనిమ్మని కోరుటకై జనకునియొద్దకు వచ్చెను. మురారి.

శ్య

శ్యమంతకమణి:-ఒకమణి. ఈమణిని సూర్యుఁడు తనను స్తోత్రముచేసిన సత్రాజిత్తుభక్తికి మెచ్చుకొని వానికిచ్చెను. ఈమణివలన దినమున కెనిమిది బారువుల సువర్ణము కలుగుచుండును. సత్రాజిత్తుయొక్క సోదరుఁడగు ప్రసేనుఁ డీ మణి నిమ్మని కోరుటచే సత్రాజిత్తిచ్చెను.

ఇదివరలోఁ దనకిమ్మని శ్రీకృష్ణుఁడు సత్రాజిత్తును గోరెనుగాని యతఁ డీయలేదు. ఒక నాఁడు ప్రసేనుఁడు శ్యమంతకమణిని బుచ్చుకొని వనమార్గమునఁ బోవుచుండఁగా సింహమొకటి మణిచే నాకర్షింపఁబడి ప్రసేనుని సంహరించి దానిని గైకొనెను. ఈ సింహమును జాంబవంతుఁడుసంహరించి శ్యమంతకమును గొనిపోయి తనకూఁతురగు జాంబవతి కిచ్చెను.

మణికై శ్రీకృష్ణుఁడే ప్రసేనుని సంహరించె నని యపవాదము కలిగినది. ఆ యపవాదమును బోఁగొట్టుకొనుటకై మణిని వెదకుటకు శ్రీకృష్ణుఁడు బయలుదేఱెను. వనములోఁబడియున్న ప్రసేనుని, సింహమును జూచెను. అచ్చట నానవాలుగాఁ బడియున్న యడుగుల జాడనుబట్టి పోయి మణితో నాడుకొనుచున్న జాంబవతిని జూచెను. ఈమణికై జాంబవంతుఁడును, శ్రీకృష్ణుండును బోరాడిరి. తుదకోడి జాంబవంతుఁడు మణిని, దన కూఁతురగు జాంబవతిని శ్రీకృష్ణున కిచ్చెను. శ్రీకృష్ణుఁడు ఈమణిని దీసికొనివచ్చి సత్రాజిత్తునకిచ్చెను. సత్రాజిత్తు మఱల నీమణిని, సత్యభామయను తన కుమార్తెను శ్రీకృష్ణున కిచ్చెను. శ్రీకృష్ణుఁడు మణిని మఱల సత్రాజిత్తున కిచ్చెను.

పిమ్మట శతధన్వుఁడు సత్రాజిత్తుని మణినిదనకిమ్మని యడిగి యాతఁడీయకుండుటచే వానితోఁబోరి వానిని జంపెను. శ్రీకృష్ణుఁడు శతధన్వునితోఁబోరి వీనినిజంపెను. తదనంతరము శ్యమంతకమణిని దాఁచెద నిమ్మని బలరాముఁడు శ్రీకృష్ణునడిగెను. అది శ్రీకృష్ణునిదగ్గఱలేదు. శతధన్వుని కొడుకగు భోజునికడ నున్నది. మణి నాదగ్గఱ లేదు. అది వాని కుమారునియొద్దనే యున్నదని శ్రీకృష్ణుఁడు చెప్పఁగాఁ దనను శ్రీకృష్ణుఁడు మోసముచేసి యబద్ధము పల్కెనని కోపమువచ్చి బలరాముఁడు మిథిలకుఁబోయెను.

పిమ్మట భోజునిదగ్గఱనుండి యా శ్యమంతకమణిని అక్రూరుఁడు తెచ్చి శ్రీకృష్ణున కిచ్చెను.

ఇట్లు శ్యమంతకమణి యందఱిమరణములకును, వైరములకును గారణమయినది. భాగ. బ్రహ్మ.

శ్యై

శ్యైని:–అనూరుని భార్య. సంపాతిజటాయువులతల్లి. భార.

శ్ర

శ్రద్ధ:–కర్దమప్రజాపతికుమారిత. అంగిరసుని భార్య. సినీవాలి, కుహువు, రాక, అనుమతి యీమె కుమారితలు. భాగ.

శ్రద్ధ:–వైవస్వతుని భార్య. మనువున కీమెయందు ఇక్ష్వాకుఁడు, నృగుఁడు శర్యాతి, దిష్టుఁడు, ధృష్టుఁడు, కరూశకుఁడు, నరిష్యంతుఁడు, పృషధ్రుఁడు, నభగుఁడు, కవి అను పుత్త్రులు కలిగిరి. భాగ.

శ్రా

శ్రాద్ధదేవుఁడు:–సూర్యునకు సంజ్ఞయందుఁ బుట్టిన కుమారుఁడు. ఇతఁడే వైవస్వతమనువు. భాగ.

శ్రావస్తి:–(చూడుము శావస్తి) భాగ.

శ్రావస్తుఁడు:–యువనాశ్వునికుమారుఁడు. ఇతఁడే శావస్తియను పురమును నిర్మించెను. ఇతని కుమారుఁడు బృహదశ్వుఁడు. భాగ.

శ్రీ

శ్రీ:– ఒక సాలెపురుగు. పూర్వజన్మమున ఊర్ణనాభుఁడు. (చూడుము.)

ఇది గజారణ్యమున బిల్వవనములోనుండెను. తిన్నఁడు అను శివభక్తుఁడు శివపూజకై బిల్వదళము కోయఁగా నిది యాదళములమధ్యనుండి శివలింగమును జేరెను. దీనిపేరుననే 'శ్రీకాళహస్తి' యను పేరు వచ్చెను. (చూడుము)

శ్రీకాళహస్తి:–ఇది పూర్వము గజారణ్య మను పేరు కల్గియున్నది. ఇచ్చట వసిష్ఠునియాశ్రమముండెను. వీని కుమారులను విశ్వామిత్త్రుఁడు సంహరింపఁగా దుఃఖముచే నితఁడు ఆత్మహత్య గావించుకొనఁ గోరి కొండపై నెక్కి క్రిందఁ బడియెను. కాని భూదేవి యితనిని గాపాడెను. ఆమెయుపదేశమున నితఁడు శంకరునిఁ బ్రార్థింపఁగా నాతఁడు లింగాకారమునఁ బ్రత్యక్షమయ్యెను. అతనిని వరముపేడుకొను మనెను. తనకు బ్రహ్మవిద్య బోధించి లింగాకారమున నచ్చటనేయుండి భక్తులపూజలు గైకొనుచు, వారికి ముక్తినిచ్చుచుండుమని వసిష్ఠుఁడుకోరెను. శివుఁ డుపదేశముచేసి యంతర్ధానము నందెను. ఆ లింగ మచ్చటనే యుండెను. ఆ లింగమునకు అమృతలింగ మని పేరు. శివుఁ డిటకు వచ్చుట చూచి పార్వతియు వచ్చెను. ఆమెను జ్ఞానప్రసూనాంబ యని వసిష్ఠుఁడు కొలిచెను.

ఆ లింగమునకు శ్రీ అను సాలెపురుగు తన దేహమునుండి వచ్చు తంతువులచేఁ గప్పుచు దానిపై గోపురమువలె నల్లుచుండెను. దీనికిఁ బూర్వజన్మస్మృతి గలదు. దీనియొక్క భక్తిని బరీక్షించుటకు శివుఁడు దీపజ్వాలచే ఆ తంతువులు కాల్చెను. ఆ పురుగునకుఁ గోపమువచ్చి

యా దీపమును మ్రింగఁబోయెను. దానికి శివ సాయుజ్యము కలిగెను.

ఇదియట్లుండఁగ నొకసాలెపురుగు ఈలింగమునే పూజించుటకువచ్చుచు దానిపై నాకులు, నీళ్ళు చల్లుచుండుటచేఁ బాడగుచుండెను. ఈ సాలెపురుగు ఒకనాడు లింగముపై తానల్లుచుండిన గూటిని బాడుచేయు శత్రువును బట్టుకొనవలెనని కాచియుండి యా యేనుఁగు వచ్చి పూజించుచుండఁగా దాని తొండములో దూరెను. ఆ తొండములోనే యాలింగమును బూజించుచుండిన యొకపామును దూరెను.

ఆ పాము లింగమున కొండసోకకుండఁగప్పుచు మణులచేఁ బూజించుచుండెను. దాని నేనుఁగు తన పూజచేఁ బాడుచేయుచుండుటచే నీ పాము దీని తొండములో దూరెను. పాము పూర్వజన్మమున గాళము. (చూడుము)

వీనిబాధచే నేనుఁగు (పూర్వజన్మమున హస్తి యనునది) లింగముపై తలమోదుకొని మరణించెను. ఈ మూడింటియొక్క భక్తిని మెచ్చుకొని శివుఁడు సాయుజ్యమిచ్చెను. వీరిపేరుననే దీనికి 'శ్రీకాళహస్తి' అను పేరు వచ్చినది. (చూడుము హస్తి)

శ్రీకుండలుఁడు:- హేమకుండలుఁడను వైశ్యుని కుమారుఁడు. ఇతఁడును, నితని సోదరుఁడగు వికుండలుఁడును వేశ్యాలోలురై, దుర్వ్రతులై చరించిరి. వీరిద్దఱును పాముకాటువలన మరణము నొందిరి. వీరిని నరకమునకును, వికుండలుని స్వర్గమునకును గొనిపొమ్మని యముఁ డాన తిచ్చెను. సోదరు లిరువురు సమానపాపులై యొక్క విధముగనే మరణము పొందినను ఈ భేదము చేయుటేల యని వారు యముని నడిగిరి. వికుండలుఁడు మాఘ మాసములో స్నానము చేయుటచే ఆ పుణ్యము గలిగ ననియును, శ్రీకుండలుఁ డది యుఁ జేయక పోవుటచే వీనికి నరకమే వచ్చినదనియును యముఁడు చెప్పెను. పద్మ.

శ్రీదాముఁడు:-(చూడుము సుదాముఁడు.)

శ్రీమతి:-ఇక్ష్వాకువంశపు రాజగు అంబరీషుని కుమార్తె. ఈమెను పర్వతుఁడును, నారదుఁడును జూచి వలచి తమ కిమ్మని రాజును గోరిరి. మీలో నొక్కని కిత్తునని యంబరీషుఁడు చెప్పెను. ఈమె స్వయంవరమునాఁడు రాజకుమారులును, పర్వతుఁడును, నారదుఁడును గూడ వచ్చిరి. వీరిముఖములు వానరముఖములుగ నుండెను. విష్ణుమూర్తికూడ నీమె స్వయంవరమునకు వచ్చెను. అతఁడు శ్రీమతికిఁ దప్ప నితరులకు గోచరింపలేదు. ఈమె దివ్యసుందర రూపుఁడగు విష్ణుమూర్తినే వరించెను. అతఁ డీమెను దీసికొనివెళ్ళెను. లింగ.

శ్రీమతి:-కపిలుని భార్య. రామా.

శ్రీశైలము:-ఒకపర్వతము. శిలాదునికుమారుఁడు పర్వతుఁడనువాఁడు శివునిగూర్చి ప్రార్థించెను. అతఁడు ప్రత్యక్షముకాఁగాఁ దాను పర్వతాకారము పొందునట్లును, దనపైన శివుఁడు లింగరూపమున నుండునట్లును వరము వేఁడెను. శివుఁడనుగ్రహించెను. వసుమతి యను మునికన్య బ్రహ్మను వేఁడి శ్రీ యను నామమును బొంది వచ్చి ఈ పర్వతముమీఁద శివునిగూర్చి తపస్సు చేసెను. అందువలన దీనికి శ్రీశైల మని పేరు వచ్చెను. శ్రీ. శై.

శ్రు

శ్రుతకర్ముఁడు:-ఛాయయందు సూర్యునకుబుట్టిన కుమారుఁడు. ఇతఁడే శనిగ్రహమయ్యెను.

శ్రుతకీర్తి:-శత్రుఘ్నునిభార్య. బ్రహ్మ.

శ్రుతకీర్తి:-ఉపపాండవులలో నొకఁడు. ద్రౌపది యర్జునుల పుత్త్రుఁడు. భార.

శ్రుతకీర్తి:-వసుదేవుని తోఁబుట్టువు. ఈమె కేకయ రాజైన ధృతకేతుని వివాహమయ్యెను. ప్రతర్దనాదు లీమెపుత్త్రులు. భాగ.

శ్రుతకీర్తి:- ప్రజాపాలుని తండ్రి. వరా.

శ్రుతదేవ:- వసుదేవుని తోఁబుట్టువు. కారూష వంశమువాఁడైన వృద్ధశర్ముని వివాహమయ్యెను. ఈమె కుమారుఁడే దంతవక్త్రుఁడు.

శ్రుతదేవుఁడు:- ఒక బ్రాహ్మణుఁడు. మిథిలా నగరమున నున్నవాఁడు. సద్ధర్ముఁడు. అతి పావనమైన చరితముగలవాఁడు. వీనిని దర్శించుటకై శ్రీకృష్ణుఁడు కొందఱు ఋషులతోఁగూడి యితనిసేవ లందుకొనుచుఁ గొన్నిదినంబు లీతని గృహమందుండిరి. ఆ సమయముననే మిథిల రాజగు బహుళాశ్వునింటఁగూడనుండిరి. పిమ్మట మిథిలకు వెళ్ళెను. భాగ.

శ్రుతపర్వుఁడు:- ఒక రాజు. ఇతనికడకు అగస్త్యుఁడు వచ్చి నీ పోష్యవర్గమునకు పరిపోఁగా ధనము మిగిలెనేని నా కిమ్ము అని కోరెను. ఇతనికడ మిగులకపోవుటచే నితఁడును అగస్త్యునితోఁ గలసి బ్రధ్నశ్వుఁడను రాజుకడకు వెళ్ళెను. భార.

శ్రుతవర్మ:- ధృతరాష్ట్రుని కుమారుఁడు. వీనిని యుద్ధములో భీముఁడు చంపెను. భార.

శ్రుతశ్రవస:- వసుదేవుని చెలియలు. ఈమె దమఘోషుని వివాహమయ్యెను. ఈమె కుమారుఁడే శిశుపాలుఁడు. ఆకాశవాణిపలుకులువిని, వచ్చిన వారికెల్లరకుఁ దనపుత్త్రుని నెత్తుకొమ్మనని యిచ్చుచుండెడిది. (చూడుము శిశుపాలుఁడు.) భాగ.

శ్రుతశ్రవసువు:- సోమశ్రవసుని తండ్రి. భార.

శ్రుతశ్రవసువు:- ఒక మహాముని. సరమవాక్యములకు భయపడి జనమేజయుఁడు శాంతిక్రియలు చేయఁగోరి తగిన పురోహితునకై వెదుకవచ్చి యితనిని జూచి యితని పుత్త్రునిఁ బంపుమని కోరెను. ఇతఁడు పంపెను. భార.

శ్రుతశ్రవుఁడు:- ఛాయయందు సూర్యునకుఁబుట్టిన కుమారుఁడు. ఇతఁడే సావర్ణి యయ్యెను. బ్రహ్మ.

శ్రుతసేన:- శారదండాయని యను రాజుయొక్క భార్య. కుంతి చెలియలు. ఈమె భర్తచే నియోగింపఁబడి తర్దముఁడు, దుర్జయుఁడు అను పుత్త్రులను బడసెను. భార.

శ్రుతసేనుఁడు:- జనమేజయుని తమ్ముఁడు. సత్త్రయాగముచేయుచోటునకు సారమేయము రాఁగా దాని నితఁడు గొట్టెను. సరమ జనమేజయునితో నితఁ డట్లు కొట్టెనని చెప్పుకొనియెను. భార.

శ్రుతసేనుఁడు:- నితంతుని కుమారుఁడు. ఇతఁడు, ఇతని సోదరులు బిందుసారాదులును అజిత యను నొక్కకాంతనే వివాహమయిరి. భార.

శ్రుతసోముఁడు:- ఉపపాండవులలో నొకఁడు. ద్రౌపదీ సహదేవుల కుమారుఁడు. భార.

శ్రుతసేనుఁడు:- శత్రుఘ్నుని పుత్త్రుఁడు. భాగ.

శ్రుతసోముఁడు:- ఉపపాండవులలో నొకఁడు. ద్రౌపదీభీముల పుత్త్రుఁడు. భార.

శ్రుతాయుధుఁడు:- ఒకరాజు. వరుణుని కుమారుఁడు. వరుణుఁ డితని కొక గద నిచ్చెను. ఆ గద ధరించినవాఁడు రిపుల కజేయుఁ డగును; కాని పోటెక్కించుకొనినవానిపై బ్రయోగించెనేని యది మరలి, ప్రయోగించినవానినే జంపును. ఇదంతయు వరుణుఁ డీతని కెఱుకపఱచెను. కాని శ్రుతాయుధుఁడు కౌరవపక్షమున యుద్ధము చేయుచు దానిని మఱచెను. అర్జునుఁ డీతని రథాశ్వములను గూలసేయఁగ నితఁడు రథముదిగి కృష్ణునిపై గదను బ్రయోగించెను. అది పుష్పమాలయై శ్రీకృష్ణుని కంఠమునఁబడి మగిడివచ్చి శ్రుతాయుధునే చంపెను. భార.

శ్రుతాయువు:- కళింగాధిపతి. ఇతని కుమారుఁడు నియుతాయువు (శక్రదేవుఁడు). ఇతఁడు కౌరవపక్షమునఁ బోరెను. ఇతనిపుత్త్రుని భీముఁడు కూలం గూల్పఁగా నితఁడు భీమునితో రోష

ముతోఁ బోరాడెను గాని యోటుపడియె. వీని నర్జునుఁడు సంహరించెను. భార.

శ్రుతుఁడు:– భగీరథుని పుత్త్రుఁడు. ఇతని పుత్త్రుఁడు నాభావరుఁడు. భాగ.

శ్లి

శ్లిష్టి:– ధ్రువునికుమారుఁడు. ఇతనిభార్యసుచ్ఛాయ. రిపువు, రిపుంజయుఁడు, రిపువృకలుఁడు, వృకతేజస్సు ఇతని పుత్త్రులు. హరి.

శ్వ

శ్వఫల్కుఁడు:– అనమిత్త్రుని కుమారుఁడైన పృశ్ని తనయుఁడు. ఇతనిసోదరుఁడు చిత్రకుఁడు.

కాశీరాజుభార్య గర్భవతియై పండ్రెండు సంవత్సరములు గర్భమును ధరించెనుగాని ప్రసవింపలేదు. అచ్చటి బ్రాహ్మణులు శ్వఫల్కుని దీసికొని వచ్చినయెడల నామె ప్రసవించునని చెప్పుటచే నాతనిని గాశీపట్టణమునకు రావించిరి. కాశీరాజుభార్య గర్భమందున్నది ఆఁడుశిశువని యితఁడు గ్రహించి, "ఓతల్లీ! నీ మాతకు బాధ కలుగఁజేయక వెడలు"మని పలికెను. శ్వఫల్కుఁడు రాజుచే బ్రాహ్మణులకు గోదానములు చేయించెను. ఆమె ప్రసవించినకుమారిత పేరు గాందిని. ఆమెను శ్వఫల్కునకిచ్చివివాహముచేసిరి. హరి.

కాశీపట్టణమున వానలు లేకపోయెను. శ్వఫల్కుని దీసికొనివచ్చిన వర్షములు కురియునని బ్రాహ్మణులు చెప్పుటచే కాశీరాజు వీనిని రావించి, సత్కరించి తన కుమారిత యగు గాందినిని వీనికిచ్చి వివాహము చేసెను. కాశీపట్టణమున సువృష్టి కలిగెను. శ్వఫల్కుని కుమారుఁడే అక్రూరుఁడు. ఇతనికి మఱి పదునొకండుగురు కుమారులును, సుచారువను కూఁతురును గలరు. భాగ.

శ్వన:– ప్రజాపతి భార్య; అనిలుని తల్లి. భార.

శ్వే

శ్వేతకర్ణుఁడు:–ఒకరాజు. సత్యకర్ణుని కుమారుఁడు. ఇతనిభార్య మాలిని (మానిని). ఇతఁడు వార్ధకమున రాజ్యము మంత్రులకప్పగించి యరణ్యమునకేగెను. గర్భవతియైయుండిన యితనిభార్యయు నీతనితోడనే యరిగెను. అట నితనికిఁ గలిగిన కుమారుఁడు అజపార్శ్వుఁడు. (చూడుము అజపార్శ్వుడు.) హరి.

శ్వేతకి:–ఒక రాజర్షి. ఇతఁడు నూఱేండ్లొక్కరీతిని సత్రయాగము చేయఁదలఁచుకొని ఋత్విజులను బ్రార్థింపఁగా మేము నిరంతరక్లేశమునకోర్వలేము. దానిని భరించువాఁ డీశ్వరుఁ డొక్కఁడే; వానిని వేఁడుము అని వారుచెప్పిరి. ఇతఁడు ఈశ్వరుని గూర్చి తపముచేయఁగా నతఁడు ప్రత్యక్షమయ్యెను. శ్వేతకి ఈశ్వరుని దనకు ఋత్విజునిగ రమ్మనికోరెను. "ఆ పదవి బ్రాహ్మణులకుఁ గాని యన్యులకుఁ బొందఁదగదు. కావునఁ బండ్రెండు సంవత్సరము లేకధారగా నేతితో అగ్నిని సంప్రీతునిగఁజేయుము"అని ఈశ్వరుఁడు చెప్పెను. శ్వేతకి యట్లుగావించిన, నీశ్వరుఁడు మెచ్చుకొని దుర్వాసుని ఋత్విజునిగఁ బంపెను. ఆ కారణమువలనఁ గల్గిన మాంద్యమును బోఁగొట్టుకొనుటకే యగ్ని ఖాండవవనమును భక్షించెను. భార.

శ్వేతకేతుఁడు:– ఉద్దాలకుని పుత్త్రుఁడు. అష్టావక్రుఁ డితని మేనత్తకుమారుఁడు. ఇంటికివచ్చిన యతిథి యొకఁడు వీనితల్లిని గామించెను. శ్వేతకేతుఁ డది ధర్మవిరుద్ధంబని నుడివి యప్పటి నుండియుఁ బరపురుష సంగమము పాపంబని శాసించెను. భార.

శ్వేతకేతుఁడు:– అరుణుని పుత్త్రుఁడైన ఉద్దాలకుని తనయుఁడు. ఇతఁడు విద్యావంతుఁడు. ఒకనాఁ డితఁడు ప్రవాహనుఁడను రాజుసభలోనికి వెళ్ళఁగా నీవు విద్య నేర్చుకొంటివా? యని రాజు ప్రశ్నించెను. నేను బూర్తిగఁ జదివితినని యితఁడు నుడివెను. అయినచో మరణించినజీవు లెచ్చటకుఁబోవునో? పితృలోక మెట్లుండునో? మరల జీవు లెట్లు పుడమికి వచ్చునో? చెప్పుమని

రాజనియెను. శ్వేతకేతున కవి తెలియవయ్యెను. ఇంత మాత్రము తెలియనివాఁడవు విద్యావంతుఁడ వెట్లగుదువని రాజాక్షేపణము చేసెను. ఇతఁడు గృహమునకు మరలివచ్చి నాకీ విద్య యేల నేర్పితివికావని తండ్రి నడిగెను. ఆ విషయములు నేనే యెఱుఁగను అని యుద్దాలకుఁడు చెప్పి తానే ప్రవాహణునికడ కేగి జీవులు మేఘములై, జలమై, యోషధులై యే విధమున జన్మించినదియు ఆ రాజువలన నేర్చుకొనెను.

శ్వేతకేతుఁడు గురువునొద్ద విద్య నభ్యసించి గర్వించియుండెను. ఉద్దాలకుఁడు వీనిని బిలచి ఏ పదార్థము నెఱింగిన సర్వమును నెఱుఁగ వచ్చునో దానిని నీ గురువు నీకుఁ జెప్పెనా? యని యడిగెను. శ్వేతకేతుఁడు లేదనియె. తన తండ్రినే చెప్పుమని కోరెను. తండ్రి వీనికి బ్రహ్మజ్ఞాన ముపదేశించెను. ఛా. ఉ.

శ్వేతుఁడు:— సుదేవుఁడను విదర్భ రాజ కుమారుఁడు. ఇతఁడు పెక్కేండ్లు రాజ్యముచేసి సవతితమ్ముఁడైన సురథునకు రాజ్యమిచ్చి తపోవనమునకేగి వేయేండ్లు తపస్సు చేసెను. ఇతఁడు దేవత్వమును బొంది విమానము నెక్కి విహరించుచుండును. దేవకన్యలు వీనిని గొలుచుచునేయుండిరి. ఇంత భోగముండినను క్షుద్బాధచేఁ బీడితుఁడై యితఁడు దుఃఖము నొందుచు, బ్రహ్మకడకేగి నేనిన్నేండ్లు తపస్సుచేసితిని; దేవత్వము సిద్ధించినది; అయినను నాకీబాధయేలకలిగెనని యడిగెను. నీవు తపము చేసితివిగాని యొక్కనికిని నొక్కనాఁడైన భోజనము పెట్టియుంటివి కావు; దాహము తీర్చుకొనుట కొక్కనికైన జలమైన నిచ్చి యుంటివి కావు; అందువలన నీ కిట్లు కల్గినది. నీవు విడచిన శరీరమును దినుచుండుము. మరు నాఁటి కది మరలఁ బెరుగుచుండును. అగస్త్యుఁడు వచ్చి నీతో సంభాషించువఱకు నట్లు తినుచుండుము. పిమ్మట నీబాధ పోవునని బ్రహ్మ చెప్పెను. ఆ ప్రకారము శ్వేతుఁడు విమానము మీఁద వచ్చి తన దేహమునే తినుచుండెను. అగస్త్యుఁడు వనములోఁదిరుగుచు స్నానమునకై యొక కొలనియొద్దకు వచ్చి యొక శవమును జూచెను. అది మలినము నొందకుండ నుండుటఁ జూచి యచ్చెరువొందెను. అంతలో దివ్య పురుషుఁడు శ్వేతుఁడు విమానముమీఁద వచ్చి దిగి యా శవమును గోసికొని తినుచుండెను. అగస్త్యుఁడు విస్మయమంది నీవు దివ్యపురుషుఁడవు, ఇదేమి శవమును భక్షించుచుంటివి? అని యడిగెను. శ్వేతుఁడు తన చరిత్రము చెప్పి తనను బల్కరించినయాతఁ డగస్త్యుఁడని తెలిసికొని యతనికిఁ దన మాణిక్యమునిచ్చి చనియెను. ఉ. రా.

శ్వేతుఁడు:-ధృష్టద్యుమ్ను నిపేరు. శ్వేతవంశ జాతుఁడగుటచే నితని కీ పేరువచ్చెను. భార.

శ్వేతుఁడు:-కృతయుగమం దొక రాజు. కపాల గౌతముఁ డను ముని తనకుమారుఁడు చని పోయె ననియు, ఆ కాలమునను నిట్టి యకాల మృత్యువు లుండెననియుఁ జెప్పి చనిపోయిన తన బాలునిదేహమును శ్వేతునికడకుఁ దీసికొని వచ్చెను. నేను బ్రతికించెదనని ప్రతిజ్ఞపట్టి శ్వేతుఁ డీశ్వరారాధనము చేసి యా బాలుఁడు బ్రతుకునట్లు ప్రార్థించి వానిని బ్రతికించెను. బ్ర. వై.

శ్వేతుఁడు:-ఒక గుహ్యకుఁడు. ఇంద్రజిత్తు రాక్షస మాయలచే నదృశ్యుఁడై రామ లక్ష్మణులపై బాణములు వేయుచున్నప్పుడు కిన్నరనాథునిపంపున నితఁడు దివ్యతోయమును దెచ్చెను. దానిని విభీషణుఁడు శ్రీరామున కందించెను. ఈ జలముతో శ్రీరాముఁడు కన్నులు తుడుచుకొనఁగానే రాక్షసుఁడు చేయుచుండిన మాయలన్నియును వీనికి గోచరించెను.

స

సంకటుఁడు:- ధర్మునకుఁ గకుద్దేవియందుఁ బుట్టిన కుమారుఁడు.

సంకల్పుఁడు:-బ్రహ్మ మానసపుత్త్రులలో నొకఁడు.

సంకృతి:-మన్యువు కుమారుఁడైన నరునిపుత్త్రుఁడు. ఇతనికుమారుఁడే రంతిదేవుఁడు. భాగ.

సంజ్ఞ:-విశ్వకర్మ కుమారిత. ఈమెను సూర్యుఁడు వివాహమయ్యెను. సూర్యుని తేజస్సున కీమె యోగలేక కన్నులు మూసికొనియెను. నన్నుఁ జూచి నీవు కన్నులు మూసికొంటివి కాఁబట్టి నీకు నఖిలజనైకసంయమనుఁడగు సుతుఁడు పుట్టునని సూర్యుఁ డనియెను. అంతట నామె నేత్రములు తెఱచి చూచెను గాని యవి చంచలములయ్యెను. అట్లగుటచే నీకు విలోల యగు సుత కలుగునని భానుఁడు మరలఁ బలికెను. అతని వచనముప్రకారము సంజ్ఞ కొక కుమారుఁడు. యముఁడును, ఒక కుమారిత యమునా నదియును జన్మించిరి. సంజ్ఞ తనభర్త వేడిమికిఁ దాళలేకపోవుటచేఁ దన ఛాయను తనవంటి వనితగనే చేసి యీమెను సూర్యునికడనుంచి తనరహస్యము వెల్లడిచేయకు మని కోరి తాను పుట్టినింటి కరిగెను. సూర్యుఁడు చాలకాలము వఱకు ఈ సంగతి యెఱుఁగకుండెను. సంజ్ఞ పుట్టినింటఁ బెద్దకాలముండుటచే నట్లుండుట పడఁతులకుఁ దగదని విశ్వకర్మ యామెను భర్త యింటికిఁ జనుమనియెను. సంజ్ఞ తండ్రిగృహము విడిచి భర్తకడకుఁ బోలేక యుత్తరకురుదేశములకుఁబోయి యచ్చటఁబడబరూపమున నుండెను. ఈమెయట్లుండు టెఱింగి సూర్యుఁడును మగ గుఱ్ఱమురూపమున నిటకు వచ్చెను. సంజ్ఞ తన భర్తను గుర్తించెను. వీరి సంయోగమున అశ్వినులను కుమారులుపుట్టిరి. పిమ్మట విశ్వకర్మయుఁ దనకుమారిత భర్తయొక్క తేజము సహింపగలుగునట్లు సూర్యుని సానఁబట్టెను. సంజ్ఞా సూర్యులు తమ నిజరూపములనుబొంది కలసి యుండిరి. బ్రహ్మ.

సంజయుఁడు:-ఒక సూతపుత్త్రుఁడు. ఇతఁడు సదా ధృతరాష్ట్రుని చెంతనుండి యాతని. కుపచారములు చేయుచుండువాఁడు. ఆ యంధరాజునకు సర్వవృత్తాంతములను, భారతవర్ష విశేషములను నితఁడు చెప్పువాఁడు. ఇతఁడు సద్వర్తనుఁ డగుటవలననే యెన్నఁడును దుర్యోధనుని కార్యములందుగాని, యాలోచనలందుఁగాని పాల్గొనలేదు. పాండవుల యజ్ఞాతవాసము ముగిసినపిమ్మట ధృతరాష్ట్రుఁడు సంజయుని చేతనే ధర్మరాజునకు రాయబార మంపెను. ఈ యీ విధములనైనచో సంధి పొసఁగు ననుమాటలు లేక వారికిఁ దియ్యనగు పలుకులు పలికి యుద్ధమును మానుబుద్ధికలుగునట్లు తెలియఁ జెప్పుమని ధృతరాష్ట్రుఁడు బోధించెను. అట్లే సంజయుండు వారికిఁ జెప్పెను.

ధృతరాష్ట్రుఁడు భారతయుద్ధమునఁ గలుగు విశేషములను నెఱుఁగఁ గోరుటచే వ్యాసుఁడు సంజయున కొక దివ్యశక్తి నిచ్చెను. ఆ శక్తివలన సంజయుఁడు యుద్ధభూమియందు శరములు సోకక, పరులచేఁ జూడఁబడక ప్రతివారి సంభాషణములను వినఁగలుగువాఁడు. ఎవ్వరిచేతను జూడఁబడక సర్వమును దాను జూడఁ గలుగువాఁడు. అట్లు చూచుచు యుద్ధ మేతీరున జరుగువదియు నితఁడు ధృతరాష్ట్రునకుఁ జెప్పెను. అర్జునునకుఁ గృష్ణుఁడు బోధించిన తత్త్వమును, భగవద్గీతలను నితఁడు విని ధృతరాష్ట్రునకుఁ జెప్పెను. పదునెనిమిదవనాఁడు యుద్ధము జరుగుచుండఁగా నటఁ దిరుగుచుండిన సంజయుని సాత్యకి పట్టుకొని చంపఁబోయెను. అపుడు వ్యాసుఁడు వచ్చి వీనిని జంపవలదని చెప్పి కాపాడెను. ఇతఁడును ధృతరాష్ట్రునితోడఁ దపోవనమున కరిగెను. అట నొకనాఁడు మహానలము ప్రజ్వరిల్లి వీరిని జుట్టుకొనెను. ఏదో మార్గము చూచుకొని దానిని దాటిపొమ్మని కుంతీ గాంధారీ ధృతరాష్ట్రు లితనిని బలవంత పెట్టఁగా నితఁ డాయగ్నినిదాటి హిమాచలమున కేగెను. భార.

సంజయుఁడు:-ప్రీతియనువాని పుత్త్రుఁడు. ఇతని పుత్త్రుఁడు జయుఁడు. భాగ.

సంజయుఁడు:-సభానరుని బుత్త్రుఁడైన కాలానలుని తనయుఁడు. ఇతనిపుత్త్రుఁడు పురంజయుఁడు.

సంజీవని:-ఓషధి. గతప్రాణులకు మఱల బ్రాణమును గలిగింపఁజేయు శక్తిగలిగినది. తొల్లి దేవదానవులు యుద్ధము చేయునపుడు దానవులయొక్క బాణములచే దేవతలు ప్రాణములు విడుచుచుండఁగా బృహస్పతి దీనిని దెప్పించి దేవతలను జీవింపఁజేసెను. అది పాలసముద్రముయొక్క సమీపమునను, నమృతమును మథించినచోటున నున్నది. అట ద్రోణపర్వతముపైనను, చంద్రపర్వతముపైనను గలదు. ఈసంగతి సుషేణుఁడు మొదలగు వానరులకును, జాంబవంతునకును దెలియును.

రామ రావణ యుద్ధములో వానరసైన్యమును, లక్ష్మణుఁడును మూర్ఛపోయినపుడు హనుమంతుఁ డా పర్వతముతోడనే దానిని దెచ్చెను. దానిగాలి తగులగానే వారు లేచిరి. రామా.

సంధి:-ప్రశుశ్రుకుని కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు అమర్షణుఁడు. భాగ.

సంపాతి:-ఒక పక్షి. శ్యేనీఅనూరుల కుమారుఁడు. ఇతని తమ్ముఁడు జటాయువు. వీరిరువురును నిశాకరుఁడను మునియాశ్రమములోఁ బెరుగుచుండిరి. నిశాకరుఁడు సురలోకమున కేగినపిదప వీరు తమలో నెవరు సూర్యునిసమీపమునకుఁ బోఁగల్గుదురో యని పంతమువేసికొని పైకెగిరిరి. సంపాతి ఱెక్కలు కాలి క్రిందపడెను. ఇతఁడిక తన సోదరుని జూడలేకపోయెను. ఱెక్కలు లేకపోవుటచే నితఁడు మెల్ల మెల్లగఁ బోయి యొకగుహఁజేరి యందు వసించుచుండెను. దశరథ రాముఁ డరణ్యమునకు వచ్చుటయును, వానరులు సీతకై వెదకుచుండుటయును, రావణుఁడు హరుఁడగుటయును మొదలగుభవిష్యద్వృత్తాంతమును వీనికి నిశాకరుండు చెప్పెను. అప్పుడు వీనికి ఱెక్కలు మఱల వచ్చుననియును జెప్పెను. సంపాతికి సుపార్శ్వుఁడు, బభ్రువు, శీఘ్రగుఁడు అను కుమారులు కలరు. సీతను వెదకుటకై వచ్చిన వానరులు ఆమెను గానలేక విరాళులై యీతని గుహయెదుటఁ బ్రాయోపవిష్టులై యుండిరి. సంపాతి యీ వానరులను దన కాహారముగఁ జేసికొనఁ గోరి వీరిని సమీపించెను. వానరుల సంభాషణములో జటాయు వను మాట యీతనికి వినబడియె. తన సోదరునివార్త యిన్నినాళ్ళకు విని నందుకు సంతసపడుచు సంపాతి యా వానరుల వృత్తాంతమడిగి తనసంగతి వారి కెఱుకపఱచి సీతను రావణుఁడు లంక కెత్తుకొని పోయెనని యంగదాదులకుఁ జెప్పెను. మఱియుఁ దనకుమారులఁ గూడ లంకకు వెళ్ళి సీతను జూచిరమ్మనియె. వీనిఱెక్కలు తిరిగి వచ్చినవి.
రామా. మత్స్య.

సంపాతి:-మాలి కుమారుఁడు. ఉ. రా.

సంప్రియ:-విదూరథునిభార్య. అనశ్వునితల్లి. భార.

సంభవ:-గాంధారి తోఁబుట్టువు. ఈమెనుగూడ ధృతరాష్ట్రుఁడు వివాహమయ్యెను. భార.

సంయాతి:-ప్రాచీనుని కుమారుఁడు. ఇతనిభార్య వరాంగి. వీరి కుమారుఁడు అహంయాతి. భార.

సంయాతి:-నహుషుని కుమారుఁడు. యయాతి సోదరుఁడు. భార.

సంయాతి:-శర్యాతి కుమారుఁడు. ఇతనికుమారుఁడు రౌద్రాశ్వుఁడు. భాగ.

సంయోధకంటకుఁడు:- కుబేరుని భటుఁడు. రావణుఁ డలకాపట్టణముపైదండెత్తి వచ్చినపుడు సంయోధకంటకుఁడు వానితోఁ బోరాడెనుగాని యోటుపడి పాఱిపోయెను. ఉ. రా.

సంవరణుఁడు:-అజమీఢుని పుత్త్రుఁడు. (అజమీఢుని పుత్త్రుఁడైన ఋక్షుని తనయుఁడు.) ఇతఁడొకనాఁడు వనమునందుఁ గ్రుమ్మఱుచు సూర్యనందనయగు తపతినిజూచి మోహించి గాంధర్వమునఁ దనను వివాహ మగుమని యామెను గోరెను. తండ్రియనుమతిలేక యామెవివాహము కాదని చెప్పి యదృశ్య మయ్యెను. సంవరణుఁ డామెను దలఁచుకొని, తలఁచుకొని మూర్ఛవోయెను. ఇతనిమంత్రి వీనికుపచారములుగావించెను. సంవరణుఁడు మూర్ఛదేరియు నగరమున కేగక యచ్చటనే యుండి సూర్యు నారాధింప మొదలిడెను. తనపురోహితుఁడగు వసిష్ఠునిగూడ నచ్చటికే రావించి తనకోరిక నెఱింగించెను. వసిష్ఠుఁడు నిమిషమునకు మున్నూట యఱువది నాల్గు యోజనములు పఱచివచ్చి సూర్యునిరథముతో నక్షత్రమంబున నతనిని గలిసికొని సూర్యునకు దనవచ్చినపనిని జెప్పి తపతిని వెంటఁగొని వచ్చెను.

వసిష్ఠుఁడును సూర్యు నారాధించెను. సూర్యుఁడు ప్రత్యక్షమై తపతిని సంవరణున కిచ్చెను.

సంవరణుఁడు రాజ్యము విడిచి పండ్రెండు సంవత్సరములు సదా భార్యతోడనే భోగించుచుండెను. అతనిరాజ్యమున ననావృష్టి సంభవించెను. ఆ దోషమును బోగొట్టుటకై వసిష్ఠుఁడు సంవరణుని నగరమునకుఁ గొంపోయి శాంతికి పౌష్టిక క్రియలు చేయించెను. సంవరణునకుఁ గురుఁడను కుమారుఁడు జన్మించెను. భార.

సంవర్తనుఁడు:- (సంవర్తుఁడు) అంగిరసుని పుత్త్రుఁడు. బృహస్పతి సోదరుఁడు. (చూడుము మరుత్తు)

మరుత్తు అను రాజుచే యాగము చేయించు నపుడు రావణుఁ డా రాజును యుద్ధమునకుఁ బిలిచెను. రాజు వెడలఁబోయెను. యాగదీక్షలో నున్న రాజు యుద్ధము చేయరాదని ఇతఁడు మాన్పించెను. అటుపిమ్మట మరుత్తుయొక్క యాగమును జేయించెను. రామా.

సంవర్తుఁడు:- ఒక ముని. ఇతనిపుత్త్రు లైదుగురును వనమున కరిగి యపుడే పుట్టిన లేడిపిల్లలను జంకపెట్టుకొని వచ్చిరి. అవి చచ్చిపోయెను. ఈపాతక మెట్లు పోవునని వారు తండ్రి యగు సంవర్తు నడిగిరి. మీ కర్మఫల మనుభవింపక తప్పదు. మీరును లేడిచర్మము కప్పుకొని వనములో సంచరించు చుండుఁడని యితఁడు చెప్పెను. వారట్లుచేయుచుండఁగా వారినిజూచి లేడు లనుభ్రాంతిచే వేఁటకువచ్చిన వీరసేనుఁ డను రాజు వారిని జంపెను. (చూడుము సంవర్తనుఁడు) వరా.

సంశప్తకులు:- త్రిగర్తాధీశ్వరుఁడగు సుశర్మయును, అతని సోదరులు సత్యరథుఁడు, సత్యసేనుఁడు, సత్యకర్ముఁడు మొదలగువారు భారత యుద్ధమున దుర్యోధనునకు సహాయముచేసిరి. అర్జునుని జంపవలె నను దృఢప్రతిజ్ఞతో వీరు యుద్ధముచేసిరి గాని వీరే యోటువడిరి. భార.

సంహారుఁడు:- భైరవులలో నొకఁడు. (చూడుము భైరవులు.)

సంహిత:- గాంధారి తోఁబుట్టువు. ఈమెనుగూడ ధృతరాష్ట్రుఁడు వివాహమయ్యెను. భార.

సంహ్లాదుఁడు:- హిరణ్యకశిపుని కుమారుఁడు. ఇతని తల్లి జంభాసురునిపుత్త్రికయైన దత్త. సంహ్లాదుని భార్య గతి. ఇతనికిఁ బంచజనుఁడనుకుమారుఁడు కలిగెను. సంహ్లాదుఁడే తరువాతిజన్మమున శల్యుఁడుగఁ బుట్టెను. భాగ. మత్స్య. భార.

సక్తుప్రస్థుఁడు:- ఒక బ్రాహ్మణుఁడు. అతి పేద వాఁడు. ఆహారముదొరకకుండుటచేఉంఛవృత్తితో జీవించువాఁడు. మిక్కిలి సద్ధర్ముఁడు. ఇతఁడొక నాఁడుకుంచెడుపేలపిండిని సంపాదించుకొనియె. తానును, భార్యయుఁ, గుమారుఁడును,గోడలును దానిని సమముగాఁ బంచుకొని తినఁదలఁచిరి. ఇంతలో నతిథి యొకఁడు వచ్చెను. అతనికి సక్తుప్రస్థుఁడు తన భాగము నిచ్చెను. దానిం దినఁగా వానికి నాఁకలి తీరినది కాదు. వాని భార్యయుఁ, గ్రమముగఁ గుమారుఁడును, గోడలునుగూడ వారు తినఁదలఁచుకొనిన దంతయు నిచ్చివేసిరి. అపు డా యతిథి తన నిజస్వరూపమును జూపి తాను ధర్మదేవత యగుట తెల్పి వారిని స్వర్గలోకమునకుఁ గొంపోయెను. ఈ పేలపిండినలుసులు కొన్ని యొక ముంగి పాదములపైఁబడెను. ఆ పడినచోటు బంగారమయ్యెను. ధర్మరాజు యజ్ఞముచేయు చోటునకుఁ బోయి "ఇస్సీ, ఈ యజ్ఞము సక్తుప్రస్థుఁడు చేసినదానిని బోల" దని యా ముంగి యాక్షేపించెను. ఈ ముంగి పూర్వజన్మమున జమదగ్ని. (చూడుము నకులము.) భార.

సగరుఁడు:- ఒక రాజు. బాహువు (అసితుని) కుమారుఁడు. సగరుఁడు పుట్టకపూర్వమే హైహయులు వానితండ్రిని రాజ్యమునుండి వెడలఁగొట్టిరి. అతఁ డరణ్యములోనే మరణించెను. సగరునితల్లి గర్భవతియయ్యు భర్తతో సహగమనము చేయఁబోయెను. ఆసమయమున నౌర్వుఁడు (చ్యవనుఁడు) వచ్చి యామెను దన యాశ్రమములోనికిఁ దీసికొనివెళ్ళెను. అచ్చట సగరుఁడు జన్మించెను. సగరునితల్లి గర్భవతియగుట చూచి యామెసవతులు సహింపలేక యామెకు గరళముపెట్టిరి. ఆమెగర్భమున గరళమున్నను బుత్త్రుఁ డెట్టిబాధయుఁ బొందక గరళసహితుఁడై (విషముతో) పుట్టెను గావున వీనికి సగరుఁడని పేరుపెట్టిరి.

హైహయులవలనఁ దన తండ్రి రాజ్యభ్రష్టుఁడై విపత్తులనొందెనని సగరుఁడు వసిష్ఠుని వలన విని వారిని సంహరింప నిశ్చయించుకొనెను. ఇతఁ డశ్వమేధము చేసి యశ్వమును బట్టిన రాజును వధించుచు వచ్చెను. విదర్భరాజు తన కుమారితను కేశిని యనుదానిని సగరున కిచ్చి వివాహముచేసెను. ఇతఁడు సుమతి యను మఱియొక కన్యనుగూడఁ బరిణయమయ్యెను. వైదర్భి, శైబ్య అనువార లితనిభార్యలు. పిమ్మట నితఁడు తన తండ్రినగరమగు నయోధ్యకు మరలి వచ్చెను. పురజనులు తమ యేలికకుమారుఁడైన

సగరునకు స్వాగతమిచ్చిరి. ఇతఁ డయోధ్యను బాలించెను.

సగరునకు సంతానము కలుగలేదు. ఈ చింత యతని చిత్తమును బాధించుటచే భార్యాసహితుఁడై నగరమువిడిచి వనమునకేగి యౌర్వుని దర్శించెను. అతనిభార్యలలో నొక్కతెకు వనతి ధార్మికుఁ డగు పుత్త్రుఁడొక్కఁడు పుట్టుననియు, వీనివంశము కల్పాంతమువఱకు నుండుననియు, రెండవ యామెకు నఱువదివేలపుత్త్రులు పుట్టుదురనియు నౌర్వుఁడు చెప్పెను. ఇతఁడు భార్యలతోఁ గైలాసమునకేగి తపస్సుచేసెను. ఈశ్వరుఁడు ప్రత్యక్షమై, వైదర్భియం దఱువదివేలు, శైబ్యయందు వంశకరుఁడైన యొక పుత్త్రుఁడు కలుగునని వరమిచ్చెను. వీరు నగరమునకు మరలి వచ్చిరి. సుమతి కేశినులు గర్భములు ధరించిరి. ఇరువురకుఁ జెరియొక కుమారుఁడును బుట్టెను. ఔర్వుఁడు వచ్చి సుమతికిఁ బుట్టినవాని నఱువది వేల ఖండములుగఁ జేయించి వానిని గుంభమునఁ బెట్టించెను. అందుండి యఱువదివేల పుత్త్రులును వచ్చిరి.

కేశినిపుత్త్రుఁడైన యసమంజసుఁడు పిశాచ కృత్యములు చేయుచుండువాఁడు. ఇతని దుండగములనుగూర్చి ప్రజలు సగరునితోఁ జెప్పుకొనిరి. సగరుఁడు తన పుత్త్రుఁడనియైన గరుణింపక వానిని నగరమునుండి వెడలగొట్టించెను. సగరుఁడు మరల నశ్వమేధముచేసెను. యాగాశ్వము వెంటఁ దనయఱువదివేల పుత్త్రులను బంపెను. సముద్రతీరమునఁ జరియించుచుండఁగా నాకస్మికముగఁ దురగ మదృశ్యమయ్యెను. దానికై వెదకి వెదకి దానిని గానలేకవచ్చి యశ్వమెటకో పోయెనని పుత్త్రులు సగరునితోఁ జెప్పిరి. యాగాశ్వమును దీసికొనిరానిచో వారిని నగరమునకు రానీయనని యితఁడు కఠినముగఁ బలికెను. వారు తురగమునకై సముద్రమును త్రవ్వి తుదకుఁ గపిలునిచే మరణించిరి. ఈ సంగతి సగరునకు నారదుఁ డెఱింగించెను. సగరుఁడు పుత్త్రుల మరణమునకు విచారించి యశ్వమును దెచ్చుటకై యసమంజసునిపుత్త్రుని నంశుమంతుని బంపెను. ఇతఁడు కపిలుని బ్రతిమాలి యశ్వమునుదెచ్చి కపిలుని వచనంబులు తెలిపిన నతఁడు పుత్త్రశోకమునువిడచి సముద్రుని బుత్త్రునిగాఁ గల్పించుకొనెను. అది మొదలు సముద్రము సాగరమనఁ బరగెను. పిమ్మట సగరుఁడు యాగముపూర్తిచేసి యంశుమంతునకుఁ బట్టముకట్టి తాను దపోవనమున కరిగెను. బ్రహ్మ.

సగరుని పుత్త్రులు:—సగరునకుఁ గేశిని యను భార్య యందు నొకపుత్త్రుఁ డసమంజసుఁడనువాఁడును, సుమతియందొక పుత్త్రుఁడును బుట్టిరి. సుమతికిఁ బుట్టినవానియందు నఱువదివేల శిశువు లున్నారని యౌర్వుఁడుచెప్పి వాని నన్నిఖండములుగఁ గోయించి ఘృతకుంభమునఁ బెట్టించెను. అందుండి యఱువదివేల పుత్త్రులు కలిగిరి. అసమంజసుఁడును, వీరును మిక్కిలి దుర్మార్గులై మునులను, బ్రాహ్మణులను బాధపెట్టుచు, హోమములను బాడుచేయుచుండిరి. అసమంజసుఁడును. దక్కినవారికంటె నెక్కువగ బిశాచకార్యములు చేయువాఁడు. వానిని సగరుఁడు నగరమునుండి వెడలఁగొట్టెను.

సగరపుత్త్రుల దుండగములను గుఱించి దేవతలు బ్రహ్మతోఁ జెప్పుకొనిరి. విష్ణ్వంశమునఁ గపిలుఁడను ముని పుట్టును. వానివలన సగరపుత్త్రులు మరణ మొందుదురు. కపిలుని సమాధిభంగము సగరపుత్త్రులవలనఁ గలుగునట్లు చేయుఁడు. అపుడు వారిమరణము తప్పదు అని బ్రహ్మ దేవతల కెఱుకపఱిచెను.

ఇట్లుండఁగ సగరుఁడు యేదు అశ్వమేధములు చేయుచు యాగాశ్వమువెంటఁ బుత్త్రులను వెళ్ళుఁడనియు, అశ్వమును బంధించిన రాజు నోడించి యశ్వమును భద్రముగఁగొనిరండనియు జెప్పెను. వారా తురగముతో సకలదేశములు తిరిగిరి. యాగాశ్వము సముద్రతీరమునఁ బరుగిడుచు సముద్రములోఁ బ్రవేశించెను. అపుడు నీరంతయు నింకిపోయెను. అదే సమయమని ఇంద్రుఁడు వాయువును బిలిచి, సగరుని యాగాశ్వము కపిలుని యాశ్రమము కడఁ గట్టుమని చెప్పెను. క్షణములోనే వాయువా యశ్వమును గొంపోయెను. అది యింక సగరపుత్త్రులకు గోచరించువదికాదు. దానికై వెదకి వెదకి విసిగి వేసారి వారు తండ్రికడకు వచ్చి గుఱ్ఱము కనబడకుండఁబోయెనని చెప్పిరి. దానినిగొనివచ్చినఁగాని పురమునకు రానీయనని

తండ్రి చెప్పెను. సగరపుత్రులు శాఖము తెచ్చుకొని సముద్రములోపల నశ్వ ముండు నేమో యని సముద్రమును త్రవ్వనారంభించిరి. వేయి యోజనములు త్రవ్విరి. రసాతలము గనఁబడియె. అశ్వము గట్టఁబడియుండుట గాంచిరి. అచ్చటనే తేజస్సుతో నొప్పుచుండు కపిలుని గాంచిరి. వీఁడే యీ యశ్వము దొంగిలించి యుండునని యచ్చటఁ బరుషధ్వనులఁగావించిరి. కపిలుని యాగభంగము చేసిరి. కపిలమునికిఁ గోపము వచ్చెను. కన్నులు తెఱచి వారిని గాంచెను. అతని నేత్రానలము వారిపైఁ బడియె. దాన వారు భస్మమైపోయిరి. అసమంజసుని పుత్రుఁడైన అంశుమంతునకు సగరుఁడు రాజ్య మప్పగించెను. ఇతని కుమారుఁడైన భగీరథుఁ డీశ్వరుని ప్రార్థించి గంగను దివిజలోకమునుండి రావించి భస్మమైపడియుండిన తన పితరులపైఁ బ్రవహింపఁజేసెను. ఆ పవిత్ర జలము సోకఁగనే సగరపుత్రులు దివిజలోకమున కేగిరి. బ్రహ్మ.

సతి:—దక్షుని పెద్దకూఁతురు. ఈమెతల్లి అసిక్ని. సతి శివుని వివాహమయ్యెను. ఈమెచెల్లెండ్రను దక్షుఁడు తనయింటికిఁ బిలుచుకొనిపోయి వారికిఁ జీర లిచ్చి గౌరవించుచుండును. కాని శివుఁడు దనను నిర్లక్ష్యముచేయునను కోపమున నీమెనుమాత్రము పిలువకుండెను. సతి చాల కాలము తన భర్తకడనే యుండెను గాని, తోఁబుట్టువులను జూడఁగోరి యొకసారి పుట్టినింటికి వెళ్ళెను. నీ వేలవచ్చితివి? నీ పతి నన్నవమానించి ద్వేషించుచునె యుండును. నీవు నా కులగౌరవము చెఱుపఁ బుట్టితివి అని దక్షుఁ డీమెపైఁ గోపపడి యీమె పతిని దూషించెను. పతిదూషణము వినలేక యీమె పతినే స్మరించుకొనుచుఁ దిరిగి జన్మము కల్గనేని శివుఁడే భర్తయగుఁగాక యని దేవునకు మ్రొక్కుచు యోగాగ్ని కల్పించుకొని శరీరము దహింపఁ జేసికొనియెను. ఈమెయే పార్వతిగఁ బుట్టెను. బ్రహ్మ.

సత్య:—శంయునిభార్య. భరద్వాజుఁడు, భరతుఁడు ఈమె కుమారులు. భార.

సత్యకర్ణుఁడు:—జనమేజయుని పుత్రుఁడగు చంద్రాపీడుని కుమారుఁడు. ఇతఁడు హస్తినాపురము నేలెను. పిమ్మట రాజ్యమును కుమారుఁడగు శ్వేతకర్ణున కప్పగించి తపోవనమున కేగెను. భవిష్యపర్వము.

సత్యకర్ముఁడు:—త్రిగర్తాధిపతులలో నొకఁడు. భార.

సత్యకాముఁడు:—జబాలయను వనిత కుమారుఁడు. ఇతఁడు విద్య నేర్చుకొనుటకై యొక గురువు నొద్దకు వెళ్ళెను. నీగోత్ర మెయ్యది? యని గురువు వాని నడిగెను. సత్యకాముఁడు తన తండ్రినే యెఱుఁగడు. కావున దన గోత్రము నెఱుఁగక దానిని దెలిసికొనుటకై తల్లికడకు వచ్చి యామెనడిగెను. ఆమెకుఁ జిన్నతనమందే, వివాహమునకుఁ బూర్వమే, యితఁడు జన్మించెననియును, వీని గోత్ర మామెకును దెలియదనియును జబాల చెప్పెను. మఱియుఁ దా నతనిని సత్యకామా! యని పిలుచుచుండునని మాత్రము గురువునకుఁ జెప్పుమనియె. సత్యకాముఁ డిట్లే తన గురుఁడైన హారిద్రుమతుఁడను వానితోఁ జెప్పెను. అతఁడు వీని కుపనయనము గావించి కొన్ని గోవులను వీని కప్పగించి యా గోవులను గాచుచుండు మనియెను. ఇతఁడు హారిద్రుమతునకు శిష్యుఁడయ్యెను.

సత్యకాముఁడు గోవుల నరణ్యమునకుఁ దోలుకొనిపోయి యవి సహస్రసంఖ్య కలవి యగువఱకు నచ్చటనే యుంచెను. వానిలో నొక వృషభమందు వాయుదేవుఁ డావేశించెను. ఆ వృషభము, సత్యకామా! మేము సహస్రసంఖ్య కలవారమైతిమి. మమ్ము గురువునింటికిఁ దీసికొనిపొమ్ము. నీకు బ్రహ్మజ్ఞానము నేర్పెదము అనియె. అతఁడు గోవులను మఱలించుకొని వెళ్లుచుండెను. ఇతని కా వృషభము బ్రహ్మజ్ఞానమం దొక పాద మెఱింగించెను. అగ్ని యొక పాదము చెప్పెను. సూర్యుఁ డొక పాదము బోధచేసెను. మద్గుయను పక్షి యొక పాదము చెప్పెను. ఇతఁడు గురువునింటికి గోవులను దీసికొని వెళ్ళఁగా వీనిని గురువుచూచి, నీముఖమందు బ్రహ్మజ్ఞాన కళలు గలవు; నీకు నేర్పినవా రెవరు? అని యడిగెను. ఆచార్యా! దేవతలు నాకు నేర్పిరి. కాని బ్రహ్మజ్ఞానము గురువువలన నేర్చుకొనవలెను.

కావున నీ వుపదేశింపుము అని కోరి, అతనివలన సత్యకాముఁ డుపదేశ మొందెను.

సత్యకామునకు ఉపకోసలుఁ డను శిష్యుఁ డొకఁడు కలఁడు. ఇతఁడును బ్రహ్మజ్ఞానము మొదట నగ్నులవలన నేర్చుకొనియెను. సత్యకాముఁడు వీనిని బ్రహ్మజ్ఞానము నీ కెవరు నేర్పిరని ప్రశ్నవేసెను. తన శిష్యులకు జ్ఞానము నుపదేశించెను. ఛాన్దో.

సత్యకుఁడు:—అనమిత్రుని కుమారుఁడైన శిని తనయుఁడు. ఇతనిపుత్త్రుఁడు సాత్యకి. హరి.

సత్యజిత్తు:—ద్రుపదుని తమ్ముఁడు. మొదట ద్రుపదుని బట్టుటకై యర్జునుఁడు వచ్చినపు డితఁడును నర్జునునితో బోరాడెను. భారతయుద్ధమున ద్రోణుఁడు వీనిని సంహరించెను. భార.

సత్యజిత్తు:—ఉత్తమమనువుకాలమందు ఇంద్రుఁడు. భాగ.

సత్యతపుఁడు:—ఒక బోయవాఁడు. వీడు మార్గస్థులను హింసించి వారి ధనమపహరించి బ్రతుకుచుండువాఁడు. వీఁడొకనాఁడు అరుణి యను మునినిఁ గొట్టబోయెను. ఆముని వీనినిఁజూచియు భయపడక నిశ్చలుఁడై జపముచేసికొనుచుండెను. ఈ భిల్లున కిది యాశ్చర్యముకలిగించెను. దాన వీని బుద్ధి మారిపోయెను. వీఁడు మునికి నమస్కరించి నే నెందఱినో కొట్టితిని, ఎందఱినో చూచితినిగాని నీవంటివానినిఁజూచియుండలేను. నే నికపాపము చేయను. నాకు మోక్షసాధన మెఱింగింపుముఅని ప్రార్థించెను. వీనిమాటలు సరకుగొనక, వీనికిఁ బ్రత్యుత్తరమీయక యరుణి యచ్చటనుండి వెడలిపోవుచుండెను. వానివెంటనే సత్యతపుఁడు పోవుచు శిష్యునిరీతి సంచరించుచుండెను. మార్గమందొక పులివచ్చి యరుణిపై బడబోయెను. అపుడు సత్యతపుఁడు పులిని జంపి యా బ్రాహ్మణుని గాపాడెను. తనప్రాణము కాపాడినందులకు కృతజ్ఞుడై యరుణిఁబోయవానికి నీ వెన్నఁడును శకటవృక్షములను దినకుము. సత్యమే చెప్పుచుండుము. అదియే నీకు మోక్షసాధనమని యెఱింగించెను. ఈ బోయవాఁడు తపస్సుచేసికొనుటకు దృఢచిత్తుఁడై వచ్చెను. వాని కచ్చటఁ జూచినను శకటవృక్షములతప్ప రెండవ పదార్థమే గోచరించలేదు. కావున నిరాహారుఁడై తపస్సు చేయుచుండెను. ఒకనాఁ డితనికడకు దుర్వాసుఁడు రాఁగాఁ దన యాతిథ్యమును గైకొమ్మని వానిని వేఁడెను. ఈ తినుటకు లేనివాఁ డేమి పెట్టునో చూతమని దుర్వాసుఁ డాగెను. ఈ బోయముని యీశ్వరు నారాధించెను. ఇతని కొక మణిపాత్ర వచ్చెను. దానినుండి కోరిన సర్వపదార్థములును వచ్చుచుండెడివి. దాని మాహాత్మ్యముచే దుర్వాసునకు భోజనము పెట్టెను. ఇతని తపస్సున కచ్చెరువొంది నీవు సత్యతపుఁడవే యని దుర్వాసుఁడు వెడలెను. అప్పటినుండియు నితనికి సత్యతపుఁడని పేరు వచ్చెను.

సత్యతపుఁడు వనములో సమిధలు కోయుచుండఁగాఁ గత్తి వ్రేలుమీదఁబడి వ్రేలువిరిగి క్రిందఁబడెను. కాని వెంటనే వ్రేలు పైకివచ్చి దాని స్థానములో నది యంటుకొనియెను. ఆ చెట్టు పైనున్న కిన్నరు లీ చిత్రము చూచి యింద్ర సభలో నీ వృత్తాంతము చెప్పిరి. సత్యతపుని నిష్ఠ చూచుటకై యింద్రుఁడు, ఉపేంద్రుఁడు, కిటి ఎఱుకలవేషముల వచ్చిరి. ఆ మాయపంది బోయవాఁడు తనను దఱుముకొని వచ్చినట్లు భీతితోఁ బరుగిడివచ్చి సత్యతపునియాశ్రమమున డాఁగెను. ఎఱుకలవాఁడును నతని యాశ్రమమునకు వచ్చి "నాచేఁ గొట్టఁబడిన పంది నీ యాశ్రమమునకు వచ్చెను. అది యేమయ్యెను? చెప్పు" మని యడిగెను. తనకుఁ దెలిసినది చెప్పకుండినచో నసత్యదోషము వచ్చును. చెప్పినయెడల పంది ప్రాణములు బోవుటకుఁ గారణమైనవాఁడగును. అతని కేమి చేయుటకును దోఁచక కొంత వితర్కించి యేభంగము గాకుండ నిట్లు చెప్పెను. "అయ్యా! పందినిఁజూచినది కన్ను కాని అది మాట్లాడ లేదుకద! నీకుఁ జెప్పఁగల్గినది నోరు; అదినోరు చూడలేదు. చూడకుండఁ జూచితినని నోరెట్లు చెప్పఁగలుగు" ననెను. వాని సత్యదీక్షకు మెచ్చుకొని యింద్రుఁడు, నుపేంద్రుఁడు వారి నిజస్వరూపములను జూపి వరములిచ్చిరి. వరా.

సత్యధృతి:—అహల్యా కుమారుఁడైన శతానందుని తనయుఁడు. ఇతఁడు ధనుర్వేదమును నేర్చిన వాఁడు. ఒకనాఁ డూర్వశి యితని కంటఁబడఁగా

వితనికి రేతఃపతన మయ్యెను. అందుండియే కృపియును, కృపాచార్యుఁడును బుట్టిరి.

సత్యభామ:- సత్రాజిత్తు కుమారిత. శ్యమంతక మణిని సత్రాజిత్తు శ్రీకృష్ణునికిచ్చి తన కుమార్తెను గూడ నిచ్చి వివాహము చేసెను.

అరణ్యవాసము చేయుచున్న పాండవులను జూచుటకు శ్రీకృష్ణునితో నీమెయు నరిగి ద్రౌపదితో "నీపతులందఱును నీయందిష్టముగా నుందురు. వారిని మందులుపెట్టి వశపఱచు కొంటివా ? మంత్రతంత్రముల చేతనా ?" యని యడిగెను. ఆ మాటలు ద్రౌపదికిఁ గష్టము తోచెను. కాని యీమె వారి కనువర్తినియై వారి హితము చేయుటయేగాని, మందులు మాకులు కావనెను. ఈమెకుఁ బతివ్రతా ధర్మములు తెలిపెను.

సత్యభామ:-శ్రీకృష్ణుఁడు నరకునిపై యుద్ధమునకు వెడలినపు డీమె యితనితో వెళ్ళి నరకునిపై బాణములు వేసెను.

శ్రీకృష్ణుని నిర్యాణమును గుఱించి యరుజుఁడు చెప్పఁగా నీమె తపోవనమున కరిగెను.

సత్యయజ్ఞుఁడు:- పులుషుని కుమారుఁడు. వేద వేదాంగములు చదివెను. కాని బ్రహ్మస్వరూపము నెఱుఁగలేదు. ఇతఁడును, ప్రాచీన శాలుఁడును దాని నెఱుంగుటకై ఉద్దాలకునికడకుఁ బోయిరి. (చూడుము ఉద్దాలకుఁడు)

సత్యరథ:-త్రిశంకుని భార్య. బ్రహ్మ.

సత్యరథుఁడు:- ధర్మగుప్తుఁ డను రాజు తండ్రి. ఇతఁడు యుద్ధములో దుర్మర్షణుఁ డనువానిచేఁ జంపఁబడెను. బ్ర. స్కా.

సత్యవంతుఁడు:-ద్యుమత్సేనుని పుత్త్రుఁడు. ఇతనికి చిత్రాశ్వుఁడను పేరుకూడఁ గలదు. వీనితండ్రి రాజ్యము పోఁగొట్టుకొని యరణ్యములోనికి వచ్చెను. కావున నితఁడు నరణ్యములోనే చదువు కొనుచు నంధుఁడౌ తండ్రికిఁ బరిచర్యలుచేయు చుండెను. ఇతని సద్గుణములను జూచి సావిత్రి యితనిని వరించెను. ఆమెజనకుఁ డతని కామె నిచ్చి వివాహముచేసెను. సత్యవంతుఁడు బ్రాహ్మణవృత్తిని జరించుచు నడవికేగి సమిధలు దెచ్చుచుండును. వివాహమునాటి కొక్కసంవత్సరమే సత్యవంతునకాయువుకలదని సావిత్రికి తెలియును. అతఁడు సమిధలకై యడవికేగఁగా నామెయు వెళ్ళెను. అతఁడు సమిధలు కోసి, తల భారముగనున్నదనియు, నపరిమితబాధ నొందుచుంటిననియును చెట్టు దిగివచ్చి సావిత్రి తొడపై దలపెట్టిపరుండెను. అతనికి మరణకాల మాసన్నమైనదని సావిత్రి గ్రహించెను. సత్యవంతుని ప్రాణము గొనిపోవచ్చిన యముని జూచినది. సత్యవంతుని గొనిపోవుచున్న యాతనివెంబడి యరిగినది. యముఁ డెన్నివరము లిచ్చినను మరలి వచ్చినది కాదు. తుదకు యముఁడు సత్యవంతుని సజీవునిఁగ జేసెను. అపుడు సత్యవంతుఁడు నిద్దురనుండి లేచినవాని వలె లేచెను. భార.

సత్యవతి:-(చూడుము మత్స్యగంధి.)

సత్యవతి:-గాధికుమారిత. ఋచీకునిభార్య. ఈమె భక్తికి మెచ్చుకొని భర్త వరము వేడుకొనుమనెను. తన కొక పుత్త్రుఁడును, దన తల్లి కొక పుత్త్రుఁడును గలుగునట్లు వర మిమ్మని యీమె కోరెను. ఋచీకుఁడు సరే యని యీమెను మేడిమ్రానును, ఆమెతల్లిని రావిమ్రానును గౌగిలింపుఁడని చెప్పెను. అది వీరు మఱచి దానికి భిన్నముగఁజేసిరి. సత్యవతి రావిమ్రానును గౌగిలించుకొనెను. ఋచీకుఁడు సత్యవతి కొక చరువును, నామెతల్లి కొక చరువును నిచ్చెను. ప్రమాదమున సత్యవతి యామెతల్లి కీయబడిన దానిని భక్షించెను. ఋచీకుఁడు వారికి జలము మంత్రించి యిచ్చెను. సత్యవతి తల్లికిచ్చిన జలము పొరపాటున త్రాగెను. ఋచీకుఁ డిది యెఱింగి బ్రాహ్మణుఁడైనను నీకడుపున బుట్టువాఁడు క్షత్రియవీరునిస్వభావము కలవాఁడగు ననియెను. సత్యవతి యించుక విచారించి, నా కుమారుఁడు కాక, నాకుమారుని కుమారుఁ డట్లగున ట్లనుగ్రహింపుమని కోరెను. ఋచీకుఁ డట్లనుగ్రహించెను. సత్యవతికి ఋచీకునివలన జమదగ్ని పుట్టెను. జమదగ్నికి క్షత్రియ పౌరుషము గల కుమారుఁడు పరశురాముఁడు జన్మించెను. భార.

సత్యవతి హిమాలయముపై కెగి తన పావనశీలముచే మేనుతో స్వర్గలోకమునకుఁ బోయి లోకహితార్థము కౌశికీనదియై ప్రవహించెను. భాగ.

సత్యవ్రత:-గాంధారితోఁబుట్టువు. ఈమెను గూడ ధృతరాష్ట్రుఁడు వివాహమయ్యెను. భార.

సత్యవ్రతుఁడు:- ద్రవిడదేశాధీశ్వరుఁడు. ఇతఁడు కృతమాలి యను నదియొడ్డునఁ దర్పణమిచ్చుచుండఁగా నీతనిదోసిట మత్స్యమొకటి పడెను. అదియే మత్స్యావతారము. (చూడుము మత్స్యావతారము.) ఆ మత్స్యము వీరికిఁ బురాణము, సంహితల నుపదేశించెను. సత్యవ్రతుఁడే వివస్వంతునకు శ్రాద్ధదేవుఁడనుపేరునఁ గుమారుఁడుగఁ బుట్టి మనువయ్యెను. ఇతఁడే వైవస్వతమనువు. భార. మార్క.

సత్యవ్రతుఁడు:- దేవదత్తుఁడను బ్రాహ్మణుని కుమారుఁడు. ఇతని కెంత చెప్పినను నొక యక్షరమైనను రాకుండెను. వీనికిఁ దెలివితేటలు శూన్యము. గోబిలునిశాపమే దానికిఁ గారణము. తుదకుఁ దల్లిదండ్రులుకూడ నీతనిని విడనాడిరి. ఇతఁడు సత్యమునే పల్కుచుండెడివాఁడు. కావున సత్యవ్రతుఁడని పేరువచ్చినది. ఇతఁడు తపస్సు చేసికొనుచుండఁగా నచ్చటకు వేఁటకానిచేఁ దఱుమఁబడిన పంది యొకటి వచ్చెను. అది వచ్చునప్పుడు వాగ్బీజముధ్వనివంటి ధ్వని కలిగెను; బోయవాడు వచ్చి పంది యేమయ్యెనని వీనినడిగెను; పంది వచ్చినదో, రాలేదో చూచునది కన్ను. ఆ కన్ను మాటాడలేదు. మాటాడునది నోరు. ఆ నోరు చూడలేదు. ఏమని ? యెట్లు పలుకువాఁడ ? ననుకొనుచుండెను. నిజముచెప్పినచోఁ బందికి బ్రాణహాని కలుగఁజేసినవాఁడగును; చెప్పనియెడల నసత్యదోషము వచ్చును. కావున నతఁడు ప్రత్యుత్తరమీయక పందివచ్చినప్పుడు కలిగిన ధ్వని ననుసరించి పఠించుచుండెను. అయ్యది వాగ్బీజాక్షరధ్వనియే ! యయ్యెనుగాన సరస్వతి వచ్చి యతనికి విద్యయొసఁగి కవిత్వముకూడ నిచ్చెను. దే. భా.

సత్యవ్రతుఁడు:- సుశర్మసోదరుఁడు. ఇతఁడును, నితని సోదరులును యుద్ధమం దర్జునను గోడి వచ్చితిమేని గురువధ, స్త్రీవధ, గోవధ చేసినంత పాతకుల మగుదుమని శపథము చేసికొనిరి. కాని యర్జునుని గెలువలేకపోయిరి. భార.

సత్యవ్రతుఁడు:-త్రిబంధనుని కుమారుఁడు. ఇతఁడే త్రిశంకుఁడను పేరునఁ బరగెను. (చూడు త్రిశంకుఁడు) భాగ.

సత్యశ్రవుఁడు:-సుమతి (నరిష్యంతుని వంశమువాఁడు) కుమారుఁడు. ఇతనిపుత్త్రుఁడు ఉరుశ్రవుఁడు. భాగ.

సత్యసేన:-గాంధారి తోఁబుట్టువు. ఈమెనుగూడ ధృతరాష్ట్రుఁడు వివాహమయ్యెను. భార.

సత్యసేనుఁడు:-ఉత్తమమనువు కాలమున విష్ణుమూర్తియే యీ పేరుతో నవతరించెను. భాగ.

సత్యసేనుఁడు:-కర్ణుని కుమారుఁడు. భారతయుద్ధములోఁబోరి నకులునిచేఁ జంపఁబడియెను. భార.

సత్యసేనుఁడు:-త్రిగర్తపతి సోదరుఁడు. యుద్ధములో నర్జునునిచేఁ జంపఁబడెను.

సత్రాజిత్తు:-నిమ్నుని కుమారుఁడు. ఇతఁ డొకనాఁడు నదిలోస్నానముచేయుచు ఉదయించుచున్న బాల భాస్కరుని స్తోత్రముచేసెను. సూర్యుఁడు సంప్రీతుఁడై యితనికి శ్యమంతకమణి నిచ్చెను. ఆమణిని దనకిమ్మని శ్రీకృష్ణుఁడడుగుచు వచ్చెనుగాని సత్రాజిత్తియ్యలేదు. సత్రాజిత్తు సోదరుఁడు ప్రసేనుఁ డామణిని ధరించుచుండెను. వనములోఁ బోవుచుండిన ప్రసేనుని సింహ మొకటి చంపెను. మణికై శ్రీకృష్ణుఁడే వీనినిజంపెనని సత్రాజిత్తుతలఁచెను. ఆ యపవాదము పోఁగొట్టుకొనుటకుఁ గృష్ణుఁడు మణికై వెదకి జాంబవంతునికడనుండి దీనిని గైకొనివచ్చి సత్రాజిత్తునకిచ్చెను. సత్రాజిత్తు జరిగినవృత్తాంత మెఱింగి యా మణిని, తనకుమారితయగు సత్యభామను గృష్ణునకిచ్చెను. శ్రీకృష్ణుఁడు సత్యభామను బరిణయమై మణిని మరల సత్రాజిత్తునకే యిచ్చెను. ఈ మణికై శతధన్వుఁడు సత్రాజిత్తుతో యుద్ధముచేసి వీనిని జంపెను. భాగ.

సదముఁడు:-ఒకదనుజుఁడు. విదముని సోదరుఁడు. (చూడుము విదముఁడు.)

సనకసనందనాదులు:- మహర్షులు. ధర్మప్రజాపతి పుత్త్రులు. వీనితల్లి హింస. సృష్టిని కెంపాం

దింపుడని బ్రహ్మ వీరిని గోరెను. కాని వీరు సృష్టిచేయ నిష్టపడక తపస్సునే చేసికొను చుందువారు. వామ. కూర్మ.

సనత్కుమారులు:- బ్రహ్మ మానసపుత్త్రులు. సృష్టిచేయుటకుఁ దపస్సుచేసి బ్రహ్మ 'సన' అని పల్కుటచే వీరు పుట్టిరి. వీరు సర్వదా కౌమారంబున నుందురు. బ్రహ్మ.

సన్నతి:- దక్షప్రజాపతి కుమారిత. క్రతువు అను ముని భార్య. ఈమె పుత్త్రులే వాలఖిల్యులు. బ్రహ్మ.

సన్నతి:- అలర్కుని కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు సునీతుఁడు. భాగ.

సప్తమాతృకలు:- కాళి, కాళిక, ఉద్ధత, హవిషి, కారిక, ఆర్య, వైధాతి యనువారలు. కుమారస్వామి జన్మించినపు డాతనిని వీరు దర్శించి తమను లోకమాతృకలుగఁ జేయుమని కోరిరి. అతఁడు వీరిని బాలగ్రహములుగఁ జేసి మనుజులకుఁ బదునారేండ్లు వచ్చువఱకు వారిని ఈగ్రహములు బాధింపఁగలుగునట్లు వరమిచ్చెను. మఱియు మనుజులొసంగు బలులవలనఁ దృప్తి పొందుఁడని కుమారుఁ డానతిచ్చెను. భార.

సప్తసముద్రములు:- సూర్యుఁడు మేరుపర్వతము చుట్టుఁదిరుగుచు నపరదిశనుజేరునప్పుడు చీఁకటి కలుగుచుండెను. ఆ చీఁకటిని బోఁగొట్టుటకు ప్రియంవదుఁడు తపస్సుచేయుచు రథమెక్కి తిరిగెను. ఆ రథనేమిమార్గములే సప్తసముద్రములయ్యెను. భాగ.

సప్తసముద్రములు:- గోలోకమందు విరజ యను కాంతకుఁ గృష్ణునివలన నేడ్గురు కుమారులు పుట్టిరి. వారంద ఱాడుకొనుచుండఁగఁ గడపటి వాఁడన్నలతోఁబోరాడి తల్లియొద్దకు నేడ్చుచు వచ్చెను. ఆమె వీనిని అన్నలకడ దిగఁబెట్టుటకై శ్రీకృష్ణుని విడిచివెళ్ళెను. ఆమె మరల వచ్చు లోపలఁ గృష్ణుఁడు మాయమయ్యెను. శ్రీకృష్ణువితో విరహమునకుఁ గుమారులే కారణమని వారిని సప్తసముద్రములుకండని విరజ శపించెను. వారే సప్తసముద్రములైరి. బ్ర. వై.

సప్తసారస్వతము:- (చూడుము సరస్వతి)

సమీచి:- (చూడుము నారీతీర్థములు.)

సముద్రి:- ప్రాచీనబర్హి భార్య. ప్రచేతసుల తల్లి. మత్స్య.

సముద్రుఁడు:- ఒకనాఁడు బ్రహ్మయుఁ, గశ్యపుఁడును సముద్రతీరమున విహరించుచు మాట్లాడుకొనుచుండఁగా సముద్రుఁడు వారిని దడిపెను. సముద్రుఁడా! నీవు శాంతుఁడవుకమ్ము అని బ్రహ్మ పలికెను. బ్రహ్మకు భయపడి సముద్రుఁడొక రాజరూపమున వచ్చెను. నీవు రాజావలె వచ్చితివిగావున రాజువై పుట్టుమని చెప్పెను. సముద్రుఁడు బ్రహ్మకు నమస్కరించి మిమ్ములఁ దడుపుట నా స్వభావముచేతనే గాని నేను గర్వించియుండుటచేఁగాదు. నన్ను శపింపకుము అని వేడెను. నీవు రాజువైనను గంగయే నీకు భార్యయగును. నీకు సంతానము కలిగినపిదప శాపవిమోచనమగును అని బ్రహ్మనుడివెను. హర.

రాముఁడు లంకలోఁ బ్రవేశించుటకై సముద్రమును దాటవలసి యుండెను. దానికై సముద్రునిఁ బ్రార్థింపుమని విభీషణుఁడు చెప్పెను. రాముఁడు దర్భశయనుఁడై తదేకనిష్ఠతోఁ బ్రార్థించెను. కాని సముద్రుఁడు దర్శన మీయలేదు. రామునకు గోపమువచ్చి బాణములతోఁ గొట్టబోయెను. బడబాగ్ని బ్రజ్వరిల్లెను. సముద్రుఁడు భయపడి వచ్చి రామునకు నమస్కరించి తాను దశరథునకు స్నేహితుఁడనని చెప్పి శ్రీరామునకుఁ గావలసిన యుపకారము చేసెదనని విశ్వకర్మపుత్త్రుఁడైన నలునిచే సేతువు కట్టింపుమనియెను. నలుఁడు తాళ్ళుతెచ్చి సేతువు కట్టఁ బ్రారంభించెను. వానరు లందఱు కలిసి పూర్తిచేసిరి. రామా.

సరమ:- శైలూషుఁడను గంధర్వునికుమారిత. ఈమె విభీషణుని బరిణయమయ్యెను. ఈమె లంకయందు రాక్షసులమధ్యనుండినను, వారిదుర్గుణము లీమెకు లేవు. విభీషణునితో నీమె లంకవిడిచి యరుగ లేదు. కాని లంకయందుండి సీతకు హితవుగఁబల్కు చుండెడిది. రావణుఁడు సీతను భయపెట్టుటకై

మాయాశకుంతము వచ్చి "రామా! [illegible]. [illegible] వానిశకుము" అని చెప్పెను. సీత మిక్కిలి విచారించెను. ఆ సమయమున సరమ వచ్చి యది యంతయు రాక్షసమాయ యని యెఱింగించెను. రామా.

సరమ:-దేవతల శునకము. విద్యుత్తు, సువిద్యుత్తు అను దనుజులను సంహరింపఁగోరి తన్నిమిత్తమై యింద్రుఁడు గోమేధము చేయఁదలఁచి కొన్ని గోవులను దెచ్చియుంచెను. దనుజు లీ గోవుల నపహరింపకుండ నింద్రుఁడు సరమను గోవులకుఁ గాపుపెట్టెను. దనుజులు దీనికిఁ బాలుపోసి గోవుల నపహరించుకొని పోయిరి. గోవు లేమయ్యెనని యింద్రుఁడు సరమ నడిగెను. దనుజులకలన లంచము గొనినదగుటచే సరమ యసత్యము బలికెను. అవి మార్గము తప్పిపోయె నని నుడివెను. కాని దానివెంటనుండిన గూఢ చారులు సరమను దన్నినచో నిజము బయల్పడు నని చెప్పిరి. ఇంద్రుఁడు సరమయుదరముపైఁ దన్నెను. ఆ దెబ్బచే నది త్రాగిన పాలను గ్రక్కివైచెను. మఱియు నది భయపడి హిమవన్నగమునకుఁ బరుగిడెను. ఇంద్రుఁడు దానిని దఱుముకొని వెళ్ళెను. అచ్చట వానికి దనుజులు గోచరించిరి. వారిని ఇంద్రుఁడు సంహరించెను. వరా.

తాను యాగార్థము తెచ్చిన గోవు లేమయ్యె నని సరమను యింద్రుఁ డడిగెను. మఱియును వానిని వెదకుమనియె. తన పిల్లలకు గోవులు పాలిచ్చుట కంగీకరించుచో వెదకుదునని సరమ చెప్పెను. ఇంద్రుఁ డద్దాని కొడంబడియె.

జనమేజయుఁడు యజ్ఞము చేయుచోటునకు సరమకుమారు లేగిరి. జనమేజయుని తమ్ములు వీనిని గొట్టిరి. సరమ జనమేజయునొద్దకుఁ బోయి నీ తమ్ములు నా పుత్త్రులను గొట్టిరి. మంచిచెడ్డ లాలోచింపక నావంటి పేదవారల కగ్గులు చేయువారికి దుర్నిమిత్తము లగు నని చెప్పి యదృశ్యయయ్యెను. దీని వచనమువలనఁ గలుగు కీడు తొలఁగించుకొనుటకై జనమేజయుఁడు శాంతిక్రియలు చేయించెను. భార.

సరయూనది:-అయోధ్యచెంతఁ బ్రవహించు నొక నది. కైలాసమున విధాతచేనిర్మింపఁబడిన మానస సరస్సు అను తటాకముకలదు. ఈనది తత్సరఃపాళి నిర్గతమగుటచే దీనికి సరయూ అను పేరువచ్చెను. ఇది ప్రవహించి గంగానదిలోఁ బడును. ఈ నది యందే శ్రీరామలక్ష్మణులు మునిఁగి యవతార ములు చాలించిరి. రామా.

సరస్వతి:-విష్ణుమూర్తిభార్య. ఈమెయు, గంగయు, లక్ష్మియుఁ దమపతియైన విష్ణువు చెంగట నుండఁగా గంగ తెప్పవేయక భర్తవైపుచూచెను. అతఁడును గంగనే చూచెను. దానికి సరస్వతికి రోషము వచ్చెను. గంగను బరుషములాడెను. గంగకుఁ గోపమువచ్చి యామెను నదివి కమ్మని శపించెను. ఈమెయు గంగ కట్లే ప్రతి శాప మిచ్చెను. బ్ర. వై.

శివలింగాంతమును జూచివచ్చితినని బ్రహ్మ యసత్యము పలికెను. కావున నతనివాక్కు అగు సరస్వతిని నదివికమ్మని శివుఁడు శపించెను.

బ్రహ్మ.

సరస్వతి:-బ్రహ్మసరస్సు వలనఁ బుట్టిన నది. ఈ సరస్వతీనది తొల్లి బ్రహ్మచేసిన యాగంబు నకును, నైమిశారణ్యమున మునులుచేసిన యాగము నకును, గయుని క్రతువునకును, నుద్దాలకుని నధ్వరంబునకును, వసిష్ఠుని సప్తతంతువునకును, గురుని సవనంబునకును, మఱియొకసారి బ్రహ్మ యజ్ఞంబునకును, సుభద్ర, కనకాక్షి, విశాల, సురతన్వి, ఓఘమాల, సువేణి, విమలోదక యను నామంబులతో నారీవేషమునఁ బోయి వారివారిచే గౌరవంబులఁ బడసెను. అట్లు సప్తాకారంబుల వరించుటచే సప్తసారస్వతంబని యామెకుఁ బేరువచ్చెను. భార.

వసిష్ఠుని వంచించుటకై విశ్వామిత్త్రుఁడు సరస్వతిని స్మరించెను. ఈమె వానింగొనివచ్చెను. వానిని సంహరించుటకై విశ్వామిత్త్రుఁడుపకరణ ములకు వెదకుచుండఁగా నదిపొంగెను.వసిష్ఠుడు ప్రవాహములోఁ గొట్టుకొనిపోయెను. విశ్వామి త్త్రుఁడు మరలవచ్చునప్పటికి వసిష్ఠుడు కనఁబడ లేడు. సరస్వతియే యేదో మాయచేసి వనుకొని విశ్వామిత్త్రుఁ డామెను శోణితవు గమ్మని శపిం చెను. భార.

సరస్వతి:-దధీచిభార్య. దధీచిచేయు తపస్సునకు విఘ్నము కలుగఁజేయుటకై యింద్రుఁ డలంబుస యను నప్సరసను బంపెను. ఆమెను జూడ దధీచికి రేతఃపతనమయ్యెను. దానిని సరస్వతి ధరించెను. దాన జన్మించిన కుమారుఁడు సారస్వతుఁడు. వీఁడు నీపుత్త్రుఁడని సరస్వతి దధీచి కిచ్చెను. ఆ ముని తనకుమారుని ముద్దాడి వాని నామెకే యప్పగించెను.

సరస్వతి:-బ్రహ్మ మానసిక పుత్త్రిక. ఈమెను బ్రహ్మయేపరిణయమయ్యెను. వీరు ఆదిదంపతులు. ఈమె సకలవిద్యలు నేర్చినది. ఈమె వీణపేరు కచ్ఛపి.

సర్పములు:-కశ్యపునివలనఁ గద్రువకుఁ బుట్టిన సంతానము. వీరిలోఁ గొందఱు సన్మార్గులును గలరు. శేషుఁడు కద్రువశాపమునకు భయపడి తపస్సుచేసి బ్రహ్మయానతిచొప్పున భూభారమును వహించెను. మఱియు నతఁడు విష్ణువునకుఁ దల్పమయ్యెను. వాసుకి మందరపర్వతమునకు అల్లెత్రాడయ్యెను. కొందఱురగులు శివునిభటులు. సర్పములు శివునకు భూషణములయ్యెను. సర్పములు వాసముచేయుటకుఁ బ్రత్యేక మొక లోకము నాగలోకము గలదు.

సర్పములకు వారి సవతితల్లి యగు వినతయు, నామె పుత్త్రుఁడగు గరుడుఁడు వీరికి సేవచేయు చుండువారు. వీరు గరుడునిపైనెక్కి విహరించు చుండువారు. తమకమృతమును దెచ్చియిచ్చెనేని వినతాగరుడులదాస్యము వాపుదుమని యురగులు పలికిరి. గరుత్మంతుఁడు తెచ్చి దానిని దర్భలపైఁ బెట్టెను. అమృతమును పానముచేయుటకు సర్పములు స్నానముచేయ వెడలెను. ఈలోపున నింద్రుఁడు వచ్చి యమృత మపహరించుకొని పోయెను. సర్పము లిది యెఱుఁగకయే దర్భలను నాకెను. దానిచే వాని నాలుకలు చీలెను.

భార.

సర్పములు ఆఁకలిచే బాధపడుచుఁ దల్లికడకు వచ్చినవి. వానిలోఁ బెద్దది మాకుఁ దినుట కేమియు లభింపకున్నది. నిన్నే భక్షించెదము అని తల్లియగు కద్రువతోఁ జెప్పెను. వారిలోఁ గనిష్ఠుఁ డది కూడనిపని యని మందలించెను. ఈ పలుకులు వారి తండ్రి కశ్యపుఁడు విని అచ్చటకు వచ్చెను. దీనిని జూచి భయపడి సర్పములన్నియుఁ దల్లిచాటున దాగినవి. తల్లిని భక్షించు తలఁపుగలిగెను గాన మీరు రాక్షసత్వమునొంది నిశాచరులు కండు. మీ రాఁకలిచే బాధపడుచుంటిరిగాన మీ పన్ను ఎవరికైన సోకినయెడల వెంటనే వారికి రక్తమువచ్చును అని కశ్యపుఁడు శపించెను. బ్రహ్మ.

సర్పయాగము:- పరీక్షిత్తును తక్షకుఁడు కఱచి చంపెను. ఆ క్రోధము పరీక్షిత్తుకుమారుఁడగు జనమేజయునకుఁ గలదు. అతఁడు సర్పకులము నంతను సంహరింపఁదలఁచుకొనెను.

ఉదంకుఁడు తెచ్చుచున్న కుండలములను దక్షకుఁ డపహరించెను. ఆ కోప ముదంకునకుఁ గలదు. కావున నతఁడు జనమేజయునొద్దకు వచ్చి సర్పయాగము చేయుమని ప్రోత్సాహము చేసెను.

సర్పయాగమున నురగులు నశించునట్లు కద్రువశాపముకూడఁ గలదు. ఈ శాపమునకుఁ గారణ మేమనఁగా కద్రూ వినతలు పందెమువేసి కొని వచ్చినపిదప (చూడుము కద్రువ) తురగము వాలమును నల్లగాఁజేయుమని పుత్త్రులను గోరెను. తల్లి చెప్పినదికదా యని యధర్మమును జేయఁ మనిరి. వారిపై కద్రువకుఁ గోపమువచ్చి జనమేజయుఁడుచేయు సర్పయాగమునిమిత్తమున నన్ని పాములు మరణించునని శాపమిచ్చెను. ఈ సర్పనాశన మెట్లు తప్పించుకొనుట ? యని వాసుకి మొదలగువారు చింతించుచుండిరి. కొందఱు ఉరగులు తాము బ్రాహ్మణవేషమునఁ బోయి జనమేజయుని యాగము మానుమని కోరుద మనిరి. కొందఱు యాగముకాకుండ నచ్చటి వారిని భయపెట్టి చిందఱవందఱచేయుద మనిరి. బ్రాహ్మణమంత్రోదక దహనశిఖలను వీ రాగ లేరని కొందఱనిరి. ఏలాపుత్త్రుఁడను సర్పము "తల్లి శాపమిచ్చినపుఁడు తాను తల్లియొడిలో నుంటిననియును, అప్పుడు బ్రహ్మకును, దేవతలకును దీనినిగుఱించి సంభాషణము జరిగెనని యును, జగత్కారువునకును, జరత్కారు మహామునికిని బుట్టినకుమారుఁడు ఆస్తీకుఁ డను నతఁడు వారించుననియును బ్రహ్మ చెప్పె" ననియును నుడివెను. భార

ఈకారణము లన్నియుఁగలియుటచే జనమేజయుఁడు యాగముచేయుట తటస్థించెను. నాగులు గుంపులు గుంపులుగా వచ్చి యగ్నిలోఁ బడుచుండిరి. తక్షకుఁడు ఇంద్రునికడకుఁబోయి వాని నాశ్రయించి వానిసింహాసనము చుట్టుకొని యుండెను. ఇంద్రుఁడు వాని కభయమిచ్చెను. నాగకాంత పుత్త్రుఁడైన ఆస్తీకుఁడను బ్రాహ్మణుఁడువచ్చి తనవిద్యచే జనమేజయుని వలన మెప్పువడసి యాగము మాన్పించెను. భార.

సర్పయాగము:-రురుని ప్రేయసియగు ప్రమద్వరను పన్నగమొకటి కఱచుటచే నామె మరణించెను. ఆకోపమున రురుఁడు పాములను వెదకి వెదకి చంపుచుండెను. భార.

సర్వకర్ముఁడు:-సౌదాసవంశమందుఁ బుట్టినరాజు. ఇతఁడు పరశురాముని బాఱి కాగలేక పాఱి పోయి పరాశరునాశ్రమంబున డాఁగెను. వీని శూద్రప్రవర్తనంబున సర్వకర్మలను బరాశరుఁడు చేయించుకొనియె. కాన వీనికి సర్వకర్ముఁడను పేరు వచ్చినది. ఇతనికే రాజ్యమిమ్మని భూదేవి కశ్యపునితోఁజెప్పెను; కశ్యపుఁ డీతనికిచ్చెను. భార.

సర్వకాముఁడు:-ఋతుపర్ణుని కుమారుఁడు. ఇతని కుమారుఁడు సుదాముఁడు. (సుదాసుఁడు) భాగ. బ్రహ్మ.

సర్వగతుఁడు:-భీమునకుఁ గాళియను భార్య యందుఁబుట్టిన కుమారుఁడు. భాగ.

సర్వగుఁడు:-జలంధరయందు భీమునకుఁ బుట్టిన కుమారుఁడు. భార.

సర్వతేజుఁడు:- వ్యుష్టుఁడనువానికిఁ బుష్కరిణి యందుఁబుట్టిన కుమారుఁడు. ఇతనికి ఆకూతి యను భార్యయందుఁ జాక్షుషమనువు జన్మించెను. భాగ.

సర్వార్థి:-వత్సరునిభార్య. పుష్పార్ణుఁడు, చంద్రకేతుఁడు, ఉర్ణువు, వసువు, జయుఁడు ఈమె కుమారులు.

సవనుఁడు:-ప్రియవ్రతుని పుత్త్రుఁడు. పుష్కర ద్వీపమునకురాజు. ఇతనికి మహావీతుడు, ధాతకి అను పుత్త్రులు కలరు. బ్రహ్మ.

ససేమిరా:- విశాల నగరాధీశుఁడైన నందునకు జయంతుఁడను కుమారుఁడు గలఁడు. అతఁడు మంత్రులు వలదనుచున్నను వారిమాటలు వినక వేఁటకువెళ్ళెను. కొంతసేపు వేఁటాడి దప్పిగొని జలమునకై చాల దూరము తిరిగి తిరిగి యలసి యొకచోటఁ బరుండెను. అచ్చటికిఁ బులియొకటి యార్చుచు రాఁగా జయపాలుఁడు భయపడి దగ్గఱనున్న చెట్టునెక్కెను. కాని యా చెట్టు మీఁదనే యొక యెలుఁగుబంటి యుండెను. దానిని జూచి యతఁడు వణఁకనారంభించెను. ఆ భల్లూకము వాని కభయమిచ్చి తనయొద్దకు బిలిచి తన యంకమందే వానిని బరుండఁబెట్టుకొనెను. ఇతఁడు నిద్రించుచున్నపుడు పులి భల్లూకమును జూచి "నరులు నీకును, నాకును శత్రువులేకదా! వాని నేల కాపాడెదవు? నేను వానిని భక్షించెదను. వానిని ద్రోసి వేయుము" అనిచెప్పెను. "కాని శరణుజొచ్చిన వానిని గాపాడెదను గాని విడువ"నని భల్లూకము గట్టిగాఁ జెప్పెను.

జయంతుఁడు నిద్ర లేచినపిమ్మటఁ దాను నిద్రపోఁగోరి భద్రముగఁ జూచుచుండు మని భల్లూకము జయంతునితోఁ జెప్పెను. అతఁడు సరే యనియె. భల్లూకము నిద్రపోయినపిమ్మట ఆ పులి వీనిని బిలిచి "రాజపుత్రా! నీ వా భల్లూకమును నమ్మియుంటివా? ఎంత వెఱ్ఱివాఁడవు? అది నిన్ను మ్రింగివేయునుజుమా! అది నిద్రించు చుండఁగనే దానిని క్రిందకుఁ ద్రోయుము. నేను దానిని భక్షించి చనియెదను. నీవును నీ మార్గమునఁబోవచ్చును" అని చెప్పెను. జయంతుఁడు మంచిచెడ్డల నాలోచింపక ఎలుఁగు బంటిని క్రిందకుఁ ద్రోసెను. అది పడకుండఁ జెట్టుకొమ్మ పట్టుకొని కృతఘ్నుఁడగు నా రాజ కుమారుని మతిభ్రష్టుఁడగునట్లు శపించెను.

అప్పటినుండియు నతనికి 'ససేమిరా' యను మాటకంటె వేరుమాట రాదు. ఎవ్వ రేమడిగినను, ఏమన్నను. ససేమిరా యని మాత్ర మనుచుండును. ఇట్లు మతిచెడి చరించుచుండిన పుత్త్రునిఁ జూచి తండ్రి దుఃఖించి వీనికిఁ జికిత్స చేయించుటకై యనేక యత్నములఁ జేసెను. తుదకుఁ బూర్వ మతనిచే వెడలఁగొట్టఁబడిన మంత్రి శతానందుఁడనువాఁడు కన్యారూపమున వచ్చి స, సే, మి, రా యను నక్షరములతోఁ

ప్రారంభించు శ్లోకములతో బాభల్లాకథ చెప్పెను. అది విని జయంతుఁడు స్వస్థత పడియెను. వి. చ.

సహదేవుఁడు:- చ్యవనునిపుత్త్రుఁడైన సుదాసుని తనయుఁడు. వీని పుత్త్రుఁడు సోమకుఁడు. భాగ.

సహదేవుఁడు:- పాండురాజ క్షేత్రజకుమారుఁడు. మాద్రియందు అశ్వినులవలనఁ బుట్టిన కుమారుఁడు. (చూడుము నకులుఁడు.)

ఇతని స్వయంవరలబ్ధయగు భార్య విజయ. ఆమెయందు సుహోత్రుఁడను కుమారుఁడు కలిగెను. భార.

సహదేవుఁడు:- పాండవులు రాజ్యమును విడిచి పరీక్షిత్తున కప్పగించిపోయినపుడు ద్రౌపది వెనుక మార్గమునఁబడిపోయెను. తనకంటెఁ బ్రాజ్ఞుఁడు లేఁడని యితనికి గర్వముండుటచే నట్లుపడెను.

సహదేవుఁడు:- ధూమ్రాశ్వుని కుమారుఁడు. ఇతని కుమారుఁడు కృశాశ్వుఁడు. భాగ.

సహదేవుఁడు:-సృంజయుని కుమారుఁడు. రామా.

సహదేవుఁడు:- జరాసంధుని కుమారుఁడు. భీముఁడు జరాసంధునితోఁ బోరాడుటకు వచ్చినపుడు జరాసంధుఁ డితనికిఁ బట్టముకట్టి పోరాటమునకు వచ్చెను. ఇతఁడు భీమాదులతో సఖ్యముచేసెను. ఇతనినే వారు రాజుగ నుండ నిచ్చిరి. భారత యుద్ధమందు సహదేవుఁడు పాండవులకు సహాయముచేసి యొక యక్షౌహిణికి నధిపతిగఁగూడ నుండెను. ఇతని కుమారుఁడు మేఘసంధి (మార్జాలి.) భార. భాగ.

సహస్రకంఠుఁడు:- దశకంఠ రావణుని యన్న. పుష్కరద్వీపమున నుండువాఁడు. ఇతని ముందర రావణుఁడు కీటకప్రాయుఁడు. దశకంఠరావణుని సంహరించినపిదప మునులు శ్రీరాముని‌ఁ గొనియాడఁగా సీత నవ్వి వానిని గెల్చు టేమి గొప్ప? సహస్రకంఠుఁ డున్నాఁడని వానిచరిత్రమును జెప్పెను. రామాదులు వీనితో యుద్ధముచేసిరి. రాముఁడు వీనిచే మూర్ఛనొందింపఁబడియె. అంత సీత రౌద్రాకారమును దాల్చెను. ఆమెనుండి మాతృకలు అద్భుతరూపులు వెడలిరి. వారందఱును గందుకక్రీడలాడినట్లు సహస్రకంఠుని శిరములం దునుమాడేసిరి. ఆమెభారము భూమి మోయలేకపోవుటచే శివుఁడు ఆమె పాదముల క్రిందఁ బడెను. సహస్రకంఠునిఁ జంపినపిదప సీత విశ్వరూపదర్శనము చేసినది. శ్రీరాముఁడు మూర్ఛఁదేరి చూచి ఆమె యాదిశక్తి యని గ్రహించెను. ఇది యద్భుత మని యనఁబడుచు స్తుతింపఁబడుచున్నది.

సహస్రజిత్తు:-యదువు పెద్దకుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు శతజిత్తు. భాగ.

సహస్రపాదుఁడు:-ఒక బ్రాహ్మణుడు. పరిహాసమునకై తన సహాధ్యాయుఁడగు ఖగముఖుండనువానిమీఁద గడ్డిపామును వేయఁగా నాతఁడులికిపడి కోపగించి సహస్రపాదుని బలహీనమైన పామువు గమ్మని శపించెను. సహస్రపాదుఁడు తనకు శాపవిమోచనము కలుగఁజేయుమని ప్రార్థింపఁగా, రురుఁడనువాఁడు నిన్నుఁ గొట్టవచ్చినపుడు నీకు శాపవిమోచన మగునని చెప్పెను. అంతవఱకు నితఁడు శాపము ప్రకారము పామై డుండుభము అను పేర నుండెను. (చూడుము డుండుభము) భార.

సహస్రాక్షుఁడు:- పాండుదేశపు రాజు. ఇతఁడెల్లప్పుడు స్త్రీలతోఁగూడి యుండువాఁడు. ఒకనాఁ డితఁడు తుంగభద్రాతీరమున స్త్రీసహస్రములతోఁ గూడి, దిగంబరియై క్రీడించుచుండఁగా నచటకు దుర్వాసుఁడు వచ్చెను. వీనికి సహస్రాక్షుఁడు నమస్కరింపలేదు. మునికిఁ గోపమువచ్చి, నీవు రాక్షసుఁడవై పుట్టుమని శపించెను. అపుడు క్షమించుమని రాజు వేఁడుకొనఁగాఁ గృష్ణునిచేఁ దన్నఁబడి హతుఁడవై గోలోకమున కరిగి పూర్వసంపద నొందుదువని దుర్వాసుఁడు చెప్పెను. ఇతఁడే తృణావర్తుఁడై జన్మించెను. బ్ర. వై.

సహస్రానీకుఁడు:- జనమేజయుని కుమారుఁడైన శతానీకుని పుత్త్రుఁడు. ఇతని కుమారుఁడు అశ్వమేధజుఁడు. భాగ

సా

సాంగుఁడు:—హవిర్ధానుని పుత్త్రుఁడు. మత్స్య.

సాందీపుఁడు:—అవంతీపురనివాసి. ఒక బ్రాహ్మణుఁడు. ఇతనికడనే బలరామ కృష్ణులును, కుచేలుఁడును విద్యనభ్యసించిరి. బలరామ కృష్ణులు వేదవేదాంగములు, అఱువదినాలుగు విద్యలు నేర్చిన తర్వాత సాందీపుఁ డిట్లు కోరెను. సమర్థులగు శిష్యులు కలుగఁగా నాకుఁ బడయరాని దెద్ది ? నాపుత్త్రుఁడు ప్రభాసతీర్థమున స్నానముచేయుచు మునిగి తిరిగి రాలేదు. వానినిఁ దెప్పింపుఁడు అనఁగా బలరామకృష్ణులు రథారూఢులై వెళ్ళి సముద్రునిఁ బిలిచి, వాని పుత్త్రు నిమ్మనిరి. అతనివల్లఁ బంచజనునిచే మ్రింగఁబడి యమసదనమున నుండుట తెలిసికొని అటకేగి యముని నడిగిరి. యముఁడు వీరు విష్ణుస్వరూపులగుట తెలిసికొని సాందీపుని పుత్త్రుని బ్రదికించి తెచ్చియిచ్చెను. భాగ.

సాంబుఁడు:—జాంబవతియందుఁ గృష్ణునకుఁ బుట్టిన కుమారుఁడు. ఒకనాఁడు సాంబుఁడు బాలురతో నాడుకొను చుండఁగా వారికడకు నారదుఁడు వచ్చెను. బాలురు ఆ మునికి నమస్కరించిరి. కాని సాంబుఁడు మ్రొక్కఁడయ్యెను. నారదునకు వీనిపైఁ గోపమువచ్చినది. వీని కెట్లైనను బరాభవము చేయవలెనని తలఁచెను. మఱియొకనాఁడు శ్రీకృష్ణుఁ డంతఃపురములోఁ గాంతలతోఁ గ్రీడించుసమయమున నారదుఁడు వచ్చి తనరాక శ్రీకృష్ణుని కెఱింగించుమని సాంబునితోఁ జెప్పెను. సాంబుఁ డంతఃపురములోని కరిగెను. ఆసమయమున వచ్చుట కితఁడు వచ్చుటచే గృష్ణునకుఁ గోపమువచ్చి సాంబుని నీవు కుష్ఠువగుమని శపించెను. శాపవిమోచనము ప్రసాదింపుమని సాంబుఁడు వేఁడఁగా గాశియందు సూర్యు నారాధింపుమని శ్రీకృష్ణుఁడు చెప్పెను. సాంబుఁ డట్లుగావించి యారోగ్యము నొందెను. కాశీ.

సాంబుఁడు దుర్యోధనుని కుమారితయైన లక్షణను వలచియుండెను. దుర్యోధనునకుఁ దనకూఁతును వీనికిచ్చుటకిష్టములేదు. సాంబుఁడు హస్తినాపురమువచ్చి లక్షణను గొనిపోవుటకు యత్నించెను. కౌరవులాతనిబట్టుకొని బంధించిరి. ఈ వార్త బలరామునకుఁ దెలిసెను. అతఁడు హస్తినాపురమునకు వచ్చి సాంబుని విడువనిచో హస్తినాపురమును గంగలోఁ గలిపెదననియెను. దుర్యోధనాదులు భయపడి సాంబుని విడిచి వానికి లక్షణ నిచ్చిరి. భాగ.

ఒకనాఁడు కణ్వాదులు ద్వారకకు వచ్చుచుండఁగా యాదవబాలురుకొందఱు కొంటెతనముచే సాంబునకు స్త్రీవేషమువేసి, యా మునులతో, "అయ్యా ! ఈసతికి ఆఁడుశిశువు జన్మించునా? మగశిశువు జన్మించునా?"యని యడిగిరి. మునులు తమ దివ్యదృష్టిచే వీరుచేసిన కొంటెతనము గ్రహించిరి. ఆమెగర్భమున యాదవకులమునకు వినాశనకరమైన ముసలము పుట్టుననిరి. అట్లే సాంబునిగర్భమునుండి రోఁకలి పుట్టెను. భాగ.

సాగరము:—(చూడుము సగరుఁడు.)

సాత్యకి:—శిని కుమారుఁడైన సత్యకి పుత్త్రుఁడు. ఇతనికే యుయుధానుఁ డను పేరు గలదు. సాత్యకి సదా శ్రీకృష్ణునితోఁ గలసియుండువాఁడు. ఇతఁడును బాండవులకు హితుఁడు. విరాటసభయందుఁ బాండవులు కార్యాలోచనము చేయునపుడు బలరామునిసలహా నాక్షేపించి కౌరవులు దుర్మార్గులనియును, వారికడకు దూతను బంపనక్కఱలేదనియును, వారిని సంహరించి రాజ్యము గెలుచుటే యుక్తమనియు నితఁడు నుడివెను. భారతయుద్ధమునను నితఁడు మిక్కిలి సహాయముచేసెను. ద్రోణుఁడు ధర్మజునిఁబట్టుటకై యత్నించినపుడు సాత్యకి ధర్మరాజునకు సహాయముచేయ నేగెను. కాని ధర్మరాజు వీని నర్జునునకే సహాయము చేయుమనియెను. సాత్యకి పలువురు కురుకుమారుల నోడించెను. తనతోఁ బోరిన జలసంధుఁ డను రాజును సంహరించెను. సుదర్శనుఁ డితనివలననే మరణము నొందెను. దుశ్శాసనుఁ డోడి పాఱిపోయెను. పిమ్మట నితఁడు కర్ణునితోడను, గృపునితోడను బోరాడెను. ఇందఱితో యుద్ధముచేసి యలసియున్న సమయమున వీనితో భూరిశ్రవుఁడు దలపడి వీనిని నేలంబడవేసెను. ఆ సమయమున నర్జునుఁడు వీనికి సహాయము చేసెను.

సాత్యకి మరల లేచి యుద్ధముచేసి భూరిశ్రవునిఁ జంపెను. అపౌరుషకార్యములు సాత్యకికినచ్చవు. మృతిచెందిన ద్రోణుని శిరమును ఖండించిన దృష్టద్యుమ్నుని నితఁడు నిందించెను. యుద్ధ భూమిని సంచరించుచుండిన సంజయుని నితఁడు గొట్టఁబోయెను గాని యాసమయమున వ్యాసుఁడు కనఁబడి వలదనుటచే వానిని విడిచెను.

సాత్యకికుమారుఁడు జయుఁడు. భార.

సాత్వతి:– శ్రీకృష్ణుని మేనయత్త; దమఘోషుని భార్య. ఈమెపుత్త్రుఁడే శిశుపాలుఁడు. ఇతఁడు పుట్టినపుడు నాల్గుభుజములును, లలాటమందుఁ గూడ నొకనేత్రమును వీనికిఁ గలవు. ఆ బాలుఁ డెత్తుకొనఁబడుచో వాని కధికముగనున్న యవ యవములు పోవునని యాకాశవాణి పలుకుటచేఁ దమయింటికివచ్చిన ప్రతివారిచేతికిని తనపుత్త్రుని నెత్తుకొమ్మని యిచ్చుచుండెడిది. ఎవ రెత్తుకొనఁగా నవియడఁగునో వారివలననే శిశుపాలుఁడు మరణించునని యాకాశవాణి పలికెను. ఆ వాక్యములను సాత్వతి వినెను. శ్రీకృష్ణుఁ డెత్తుకొనఁగా నధికావయవము లంతరించెను గాన నాతఁడే శిశుపాలున కంతకుఁడగునని సాత్వతి గ్రహించెను. శిశుపాలుఁడు గావించు తప్పులు నూటినిసైరింపుమని శ్రీకృష్ణుని వేఁడెను. ఈమె రెండవపుత్త్రుఁడు సాల్వుఁడు. భాగ.

సాత్వతుఁడు:–పురుహోత్రునిపుత్త్రుఁడైన అంశువు కుమారుఁడు. భజమానుఁడు, భజదివ్యుఁడు, వృష్ణి, దేవావృధుఁడు, నందకుఁడు, మహాభోజుఁడు ఇతని కుమారులు. భాగ.

సామ్రాజ్ఞి:– ప్రియంవ్రతుని కుమారిత. బ్రహ్మ.

సారణుఁడు:– రోహిణీ వసుదేవుల కుమారుఁడు. భాగ.

సారణుఁడు:– రావణుని వేగులవాఁడు. (చూడుము శుకసారణులు)

సారస్వతుఁడు:– దధీచివీర్యమును సరస్వతి (నది) ధరించుటచే నామెగర్భమునఁబుట్టినకుమారుఁడు. వీనిని సరస్వతి దధీచి కొప్పగించెను. కాని యాతఁడు వీనికి సారస్వతుఁడని నామకరణము చేసి యనావృష్టికలిగినను నాపదరాకుండ నితఁడు రక్షింపఁగలఁడని చెప్పి వీనిని మరల సరస్వతికే యిచ్చెను. ఒకసారి పండ్రెండు సంవత్సరములు వర్షములేక క్షామము సంభవించినపుడు సారస్వతుఁడు మునులనందఱను గాపాడెను. బ్రహ్మ.

సారస్వతుఁడు:–ఒక బ్రాహ్మణుఁడు. ఇతఁడు అవంతీనగరమున జన్మించెను. ఇతఁడు సంసార భారము పుత్త్రులపైఁబెట్టి వనమునకేగి తపస్సు చేసెను. విష్ణువు ప్రసన్నుఁడై వరము వేఁడుకొనుమనఁగా నీసాయుజ్యమును బ్రసాదింపుమని వేఁడెను. నాతరువాత నుండువాఁడు బ్రహ్మ. నీవు బ్రహ్మకుజన్మించి నాసాయుజ్యమును బొందఁగలవు. నీవు పితృదేవతలకు నారము (జలము) సతతము నిచ్చుచుండుటచే నారదుఁడు అను పేరునఁ బరగుదువు అని విష్ణుమూర్తి చెప్పి వెడలెను. ఇతఁడే నారదుఁడుగ జన్మించెను. వరా.

సారస్వతుఁడు:–ఒక బ్రాహ్మణుఁడు. విని కుమారుఁడు సోమవంతుఁడు.

సార్వభౌముఁడు:–అహంయాతిపుత్త్రుఁడు. ఇతని భార్య కేకయరాజ పుత్త్రికయగు సునంద. జయత్సేనుఁడు వీరికుమారుఁడు. భార.

సాలగ్రామము:–గండకీనదియం దుండు విష్ణుస్వరూపమైన ఒకవిధమైన ఱాయి. తులసిని మాయచేసి, యామెభర్తయగు శంఖచూడుని వేషమునవచ్చి యామెతో విష్ణువు రమించెను. ఈ మాయతెలిసి తులసి విషుమూర్తిని ఱాయి వగుమని శపించెను. ఇతఁడు శివుని బ్రార్థించెను. శివుఁడు వచ్చి తులసి గండకీనది యగుననియును, విష్ణుమూర్తి సాలగ్రామ మగుననియును జెప్పెను. శివ.

సాలపోతకుఁడు:–ఒక సర్పరాజు. ఇతఁడు వనములోఁ గ్రుమ్మఱుచు నుత్తముని భార్యయగు బహుళను జూచి వలచి తన మాయాబలమున నామెను దన భవనమునకుఁ గొంపోయెను. ఇతని కుమారితయగు నంద, తన తలికి బహుళ సవతి కానున్నదని గ్రహించి దానిని వారించుటకై బహుళను దాచెను. ఎచ్చట దాచితివని ఎన్ని

సారులు సాలపోతకుఁ డడిగినను నామె చెప్ప లేదు. ఇతనికిఁ గోపమువచ్చి నీవు మూకవు కమ్మని కుమారితనుశపించెను. తుదకుబలాకుఁడు వచ్చి బహుళను గొనిపోయి యామె భర్త కొప్పగించెను. మార్క.

సాలెపురుగు:- (చూడుము శ్రీ.)

సాల్వుఁడు:-దమఘోషుని పుత్త్రుఁడు. శిశుపాలుని తమ్ముఁడు. ఇతఁడు కాశీరాజుకూఁతురగు అంబను వలచెను. అంబయు వీనిని వలచియుండెనుగాని యామె స్వయంవరమునకు వచ్చిన భీష్ముఁ డామె నెత్తుకొనిపోయెను. మార్గమందు సాల్వుఁడు భీష్మునితోఁ బోరాడెను గాని యోటువడి తన నగరమున కేగెను. అంబ తాను సాల్వుని వలచియుండుట భీష్మున కెఱింగించుటచే నతఁ డామెను మరల సాల్వునొద్దకుఁ బంపెను. కాని సాల్వుఁ డామెను గైకొనక పరగృహీత యని నిరాకరించెను. ఇతఁడు సాల్వదేశమునకురాజు.

శిశుపాలుని శ్రీకృష్ణుఁడు వధించుటచే సాల్వ నకుఁ గృష్ణునిపై రోష మధికముగ నుండెను. అందుచే నితఁడు శ్రీకృష్ణు నోడింపవలయునని యును, యదువంశము నాశనము చేయవలయు ననియునుదలంచి ఘోరమైనతపస్సుచేసి శివుఁడు ప్రత్యక్షముకాఁగాఁ దన కాకాశగమనము కల్గి గరుడ గంధర్వాదులకును అందని వాహనమును గోరెను. శివుఁడు అట్టిదానిని నిర్మించి యిచ్చు టకు మయున కాజ్ఞ యిచ్చెను. మయుఁడు లోహముతో నిర్మించి సౌభకమని దానికి పేరు పెట్టి సాల్వున కిచ్చెను. భాగ.

కామగమనముగల తన సౌభకనగరములో ద్వారకపై దండెత్తెను. అపుడు శ్రీకృష్ణుఁడు ద్వారకయందు లేఁడు. సాంబ ప్రద్యుమ్నాదులు నగరరక్షణమును గావించుచుండిరి. సాల్వుఁడు సాంబాది యదువీరుల నెక్కుండ్ర నోడించెను. కాని ప్రద్యుమ్నుఁడు వేసిన బాణములతో మూర్ఛనొందెను. అపుడే వీనిని జంపుటకుఁ బ్రద్యుమ్నుఁడు యత్నించెనుగాని వీనిని జంపవలసినవాఁడు శ్రీకృష్ణుఁడని నారదుఁడు చెప్పుటచే బ్రద్యుమ్నుఁడు వీనిని విడిచెను. ఇంతలో సాల్వుఁడు ద్వారకపై దండెత్తెనని శ్రీకృష్ణుఁడు విని వచ్చి వీనిని దఱిమెను. సాల్వుఁడు శ్రీకృష్ణునితో మాయాయుద్ధము చేయఁజొచ్చెను. శ్రీకృష్ణునిపై శాస్త్రవర్షము కురిపించెను. మాయావసుదేవుని గల్పించి, ఇదిగో నీతండ్రిని సంహరించుచుంటినని బెదరించెను. శ్రీకృష్ణుఁడు మొదట నిజమేయనుకొని దుఃఖము నొందెనుగాని తరువాత వానిమాయ తెలిసికొనియెను. వానిపై చక్రము ప్రయోగించి వానిని సంహరించెను. భార.

సాల్వేయుఁడు:-నితంతునికుమారుఁడు. ఇతఁడును, ఇతని సోదరులగు శూరసేనాదులు అజిత యను నొక్క కాంతనే వివాహమయిరి. భార.

సావిత్రి:-సావిత్రీదేవివరమున అశ్వపతికిఁ బుట్టిన కుమారిత. ఈమెతల్లి మాళవి. ఈమె ఏకపుత్రిక యగుటచేఁ దల్లిదండ్రులచే గారాబముతోఁ బెంపఁబడుచుండెను. ఈమెకు యుక్తవయస్సు వచ్చినపిమ్మట నీ యిచ్చవచ్చినవానిని వరింపుమని తండ్రిచెప్పెను. దగ్గఱనున్న యరణ్యములో జనువుకొను వయోరూప విద్యాగుణ సంపన్నుఁడు, ద్యుమత్సేనుని పుత్త్రుఁడు నగు సత్యవంతుని నీమె వరించెను. సత్యవంతుఁడు కులశీలముచేఁ దగినవాఁడు. కాని యతని కాయుష్కాల మిఁక నొక సంవత్సరము మాత్రము కలదని నారదుఁడు అశ్వపతితోఁ జెప్పెను. అప్పటినుండియు నశ్వపతి విచారమునొంది సత్యవంతునిఁగాక యన్యుని వరింపుమని తనకూఁతు ననేకవిధములఁ గోరెను. కాని సావిత్రి యిది వఱకే యాతనిని మనమునందు భర్తగఁ దలఁచెను గాన ఏమైనను సరే వేఱొకనినిగూర్చి తలఁప జాలనని చెప్పెను ద్యుమత్సేనుని, సత్యవంతుని రావించి యశ్వపతి తన గూఁతును సత్యవంతున కిచ్చి వివాహముచేసెను. సావిత్రి రాజకుమారిత లనుభవించు భోగములు మాని భర్తతో నరణ్యమునకేగి నారచీరలే ధరించుచుఁ బతికిని, నత్తమామలకును బరిచర్యలు చేయుచుండెను. నారదుఁడు చెప్పిన యాయుష్కాలము సంవత్సరముగడువు దగ్గఱకు వచ్చుచుండెను. ఇఁక నాల్గుదినములకు ముగియుననఁగా సావిత్రి యుపవాసములుచేసి వ్రతము ప్రారంభించెను. సత్యవంతుఁడు పుష్పములను, సమిధలను దెచ్చుటకై నరణ్యమునకు బయలుదేఱుచుండెను. సావిత్రి భర్తతోఁగూడ వత్తుననియె. ఉపవాసముచే డస్సియుంటివి, యరణ్యమువనవువ

లేవు. కావలదని భర్త చెప్పినను వర్థాంతి భర్తను కాపియుండుట యసంభవమని యామె భర్తతో నరిగెను. సత్యవంతుఁడు చెట్టెక్కి సమిధలను నఱికి తల భారముగ నున్నదనియు, వేదన కలుగుచున్నదనియు దిగివచ్చెను. సావిత్రి భర్త తల తనతొడపైఁ బెట్టుకొని పరుండఁబెట్టెను. అతనికి మరణకాల మాసన్నమగుచున్నదని గ్రహించెను. ఇంతలో సత్యవంతుని దీసికొని పోవుటకై యముఁడు వచ్చెను. సావిత్రి లేచి నిలుచుండి నమస్కరించి "అయ్యా! దివ్యపురుషునివలెఁ గనబడుచుంటివి, నీవెవ్వరవు ?" అని యడిగెను. "నీ భర్తప్రాణమును గొనిపోవుటకు వచ్చినవాఁడను; యముఁడను. నీ భర్త యాయుష్కాలము గతించినది. నీవిఁక వీనిని విడిచి నీ గృహమునకుఁ బొమ్ము" అని చెప్పి సత్యవంతునిప్రాణము దీసికొని పోవుచుండెను. సావిత్రి వానివెంటనే చనుచుండెను. యముఁడు వెనుకకుఁ దిరిగి చూచి "ఇదేమి! సావిత్రీ! నేఁబోవు మార్గము మిక్కిలి దుర్గమము. నీవు రాఁజాలవు. పొమ్ము" అనియె. "అయ్యా! భర్తను విడిచి పడఁతి యెట్లు పోఁగలదు? నా భర్త యెటకేగునో నేనును నచ్చటి కరుగుదాన"నని సావిత్రి పలికెను. "నీభర్తప్రాణముగాక నింకేదైన వరము వేఁడుము. ఇచ్చెదను" అని యముఁడు చెప్పఁగా "నా మామగారు అంధులై యున్నవారు. వారికి దృష్టి ప్రసాదింపుము" అని కోరెను. యముఁ డా వరము ప్రసాదించెను. సావిత్రి యింకను వానివెంటనే పోవుచుండెను. యముఁడు తిరిగి చూచి "నీ వింకను వచ్చుచుంటివా? మఱియొక వరము వేఁడుకొమ్ము" అనియె. "నా మామగారు రాజ్యము పోఁగొట్టుకొనిరి. వారికిఁ దిరిగి రాజ్యము చేకూరునట్లు వరమిమ్ము" అనియె. "ఇచ్చితిని. నీవింకఁ బొమ్ము. ఇక రాఁజాలవు" అని యముఁడు చెప్పెను. కాని సావిత్రి మానలేదు. సావిత్రితండ్రికిఁ బుత్త్రులు కలుగునట్లు గూడ యముఁడు వరమిచ్చెను. అయినను ఆమె వానిని విడువలేదు. నాభర్తను విడిచి నేఁ బోఁజాలననియెను. ఆమె పతిభక్తికి మెచ్చుకొని యముఁడు తుదకు సత్యవంతుని ప్రాణములుకూడ నిచ్చెను. అపుడు సత్యవంతుఁడు నిద్దురపోయి లేచినవానివలె లేచెను. భార్యాభర్తలిరువురు సంతోషముతో గృహమునకుఁ బోయిరి. భార.

సాహసికుఁడు:—బలి పుత్త్రుఁడు. ఇతఁడు శ్రీకృష్ణునిఁ గూర్చి తపస్సుచేసెను. ఇతఁడు గంధమాదన పర్వతముపై నుండగాఁ దిలోత్తమ చంద్రునికై పోవుచుండుటఁజూచి యామె నాపి రాత్రింబవళ్ళామెతోఁ గ్రీడించుచుండెను. వీరి యాహ్లాదారావముచేతను, గింకిణీనాదములచేతను ఆ సమీపమునఁ దపముచేసికొనుచున్న దుర్వాసుని వ్రతమునకు భంగము కలిగెను. ఆతనికిఁ గోపమువచ్చి సాహసికునిజూచి నీవు సిగ్గులేకుండ గాడిదవలె సంచరించుచుంటివి. రాక్షసుఁడవై గార్దభమవై చరింపుమని శపించెను. సాహసికుడు క్షమింపుమని ప్రార్థించెను. అతఁడు బలిపుత్త్రుఁడగుటచేతను, దానును భక్తుఁడగుటచేతను దుర్వాసుఁడు కరుణించి "నీవు బృందావనమందు జరించునపుడు శ్రీకృష్ణునిచే వధింపఁబడి శాపవిమోచనము నొందుదువని చెప్పెను. బ్ర.వై.

సి

సింధుద్వీపుఁడు:— ఒక రాజు, పార్శ్వుని కుమారుఁడు. మాహిష్మతి యను దనుజకన్య యీతనిని వరించియుండెను. ఇతఁడు విద్యున్మతి యను సుందరాంగి యొకతె దిగంబరియై కొలనులో స్నానముచేయుచుండఁగా నామెను జూచి చిత్తవిభ్రాంతినొందెను. దాన రేతఃపతనమయ్యెను. దానినే మహిషరూపముననున్న మాహిష్మతి త్రాగెను. ఇతనివీర్యము వలన నామెకు మహిషాసురుఁడు పుట్టెను. వరా.

సింధుద్వీపుఁడు:—నాభావరుని పుత్త్రుఁడు. ఇతని కుమారుఁడు అయుతాయువు. భార.

సింధుద్వీపుఁడు:— పూర్వజన్మమున వృత్రాసురుఁడు. ఇతఁడు శివుని జయింపవలెనని తపస్సు చేయుచుండఁగా వేత్రవతీనది స్త్రీరూపమున వచ్చెను. ఆమెను యితఁడును, నితని నామెయును గామించుకొనిరి. వీరికి వేత్రుఁడను కుమారుఁడు పుట్టెను. వరా.

సింహబలుఁడు:-కీచకులలోఁ బెద్దవాఁడు. మిక్కిలి బలాఢ్యుఁడు. విరాటరాజు భార్యయైన సుదేష్ణకుఁ దమ్ముఁడు. ఇతఁ డొకనాఁడు సుదేష్ణను జూడవచ్చి యచ్చట ద్రౌపదినిజూచి యామెను మోహించెను. ఆమెనుగూర్చి సుదేష్ణతోఁ బ్రసంగించెను. సుదేష్ణ వీనిమనస్సు మరలింప యత్నించి వీనికి బుద్ధులు గఱపెను. కాని సింహబలున కంతకంతకు మరులు హెచ్చుచుండెను. ద్రౌపదిపైఁబడ సాహసించెను. ఆమెకై ప్రాణములు కోలుపోవుటకుగూడ సిద్ధముగ నుండెను. అట్లుండిన తమ్ముని జూచి సుదేష్ణ జాలినొంది వానికోరిక తీర్పఁదలఁచుకొని కల్లు తెమ్మను నెపమున ద్రౌపదిని వీని యింటికిఁ బంపెను. అచ్చట సింహబలుఁ డామెపైఁబడ నుంకించెను. ద్రౌపది పరుగిడివచ్చి రాజసభలోఁబడి తనయెడఁ గావించిన యపకృతి తనవారితోఁ జెప్పికొనెను. ఆనాఁడురాత్రి భీముఁడును, ద్రౌపదియుఁ గపటోపాయంబున వానిని. సంహరింప నాలోచించిరి. మరునాఁడు సింహబలుఁడు మరల సుదేష్ణగృహమునకు వచ్చి ద్రౌపదినిచేరి చతుర్విధోపాయముల నామెను వశముచేసికొన యత్నించుచుండెను. ఆమె యిదివఱకే వీనివధకై పన్నాగము పన్నియుండెను గాన వీనిపైఁ బ్రేమకలిగినట్లునటించి వానిభవనమునకు సాయంకాలము వత్తుననియు, నచ్చట సాంకేతికస్థాన మేర్పఱుపుమనియుఁ జెప్పెను. ఆ మాటలు విని సింహబలుఁడు పట్టరాని సంతోషముతోఁ దన భవనమునకుఁబోయి యుద్యానవనములోఁ బొదరిండ్లయందు శయన మేర్పఱచుకొని ద్రౌపదికై వేచియుండెను. రాత్రియైనపిదప భీముఁడు స్త్రీవేషమున వెళ్ళి సింహబలుఁ డేర్పఱచిన శయ్యపైఁ బరుండెను. సింహబలుఁడు వచ్చి ద్రౌపదియేయని భ్రమించి భీమునిఁ గౌఁగిటఁదీసెను. తాను వంచింపఁబడుట దెలిసికొనెను. భీముఁడు వానితోఁ బోరాటము ప్రారంభించెను. వీ రిరువురును మల్లయుద్ధము చేసిరి. తుదకు భీముఁడు వానిని జంపెను. భార.

సింహళము:- ఒక ద్వీపము. సగరపుత్త్రులు యాగాశ్వమునకై వెదకుచు జంబూద్వీపమును ద్రవ్వినపు డీ ద్వీపమేర్పడినది. భార.

సింహవక్త్రుఁడు:-ఒకరాక్షసుఁడు. సురసయందుఁ గశ్యపునివలన జన్మించెను. తారకుఁడు, శూరపద్మాసురుఁడు ఇతని సహోదరులు. స్కాంద.

సింహిత:-హిరణ్యకశిపుని కూఁతురు; రాహువుతల్లి. భాగ.

సింహిత:-ధరణీదక్షులకుమారిత. కశ్యపునిభార్య. భార.

సింహిత:-హిరణ్యకశిపుని సోదరి. విప్రచిత్తిభార్య. శల్యుఁడు, నభుఁడు, వాతాపి, ఇల్వలుఁడు, నముచి వీరి పుత్త్రులు. విష్ణు.

సిద్ధార్థుఁడు:- దశరథుని మంత్రులలో నొకఁడు. రామా.

సిద్ధాశ్రమము:- ఇట విష్ణుమూర్తి తపస్సుచేసి సిద్ధిపొందెను.

కశ్యపుఁడు తపస్సుచేసి విష్ణువు ప్రసన్నుఁడు కాఁగా నాకు నీవు పుత్త్రుఁడుగాఁబుట్టి దేవతలను కాపాడుమనికోరెను. విష్ణు వంగీకరించెను. పిమ్మట వామనుఁడుగా జన్మించెను. ఇటఁ గశ్యపునితపస్సిద్ధియయ్యెనుగాన నప్పటినుండియు నా యాశ్రమము సిద్ధాశ్రమమని పేరుపొందెను. ఈవృత్తాంతమును శ్రీరామునకు విశ్వామిత్త్రుఁడు తెలిపెను. రామా.

సిరియాళుఁడు:-చిఱుతొండఁడను వైశ్యునికుమారుఁడు. ఇతనితల్లి తిరువెంగనాంచి. ఇతని తల్లిదండ్రులు శివభక్తులు. ఇతఁడును దల్లిదండ్రులయందును, శివునియెడలనుభక్తిగలవాఁడు. పార్వతీపరమేశ్వరులు వృద్ధయతిథులవలె వచ్చి వీని పితరుల భక్తిని పరీక్షించుటకై సిరియాళుని మాంసమువండిపెట్టుమనికోరిరి. వారు సరేయనిరి. శివుఁడు మఱియొకరూపమున నితనికడకు వచ్చి, ఓ బాలుఁడా! నీతండ్రి నిన్నిపుడు చంపఁదలఁచుకొనినాఁడు. నీమాంస మతిథులకుఁ బెట్టునఁట. నీవు నాతోడరమ్ము, నీప్రాణములు రక్షించెదను అని చెప్పెను. కాని సిరియాళుఁ డా మాటవినక నామాంసము అతిథులకుఁ దృప్తికలుగఁజేసెనేని నేను ధన్యుఁడనగుదును గదా! నా జన్మము సార్థకమగునుగదా! కావున మాతండ్రి యిచ్చ

వచ్చినట్లే చేయనిమ్ము. నీతోడరాను పొమ్మని, తాను శుచియై చంపఁబడుట కంగీకరించెను. తండ్రి వీనినిజంపెను. తల్లి వీనిమాంసమును వంట చేసి యతిథిరూపమున నున్న శివునకుఁ బెట్టెను. వీరిభక్తికి శివుఁడు మెచ్చుకొనెను. నీకుమారుఁడు వచ్చినఁగాని నేను భుజింపను. కావున బిలువు మని చిరుతొండనితో శివుఁడుచెప్పెను. అతఁడు 'సిరియాళా!' యని బిగ్గఱగాబిలచెను. ఈశ్వర ప్రభావముచేత సిరియాళుఁడు తన పూర్వరూప ముతో మరల వచ్చెను. హర.

సీ

సీత:-శ్రీరాముని భార్య. ఈమెయునులక్ష్మియొక్క యవతారము. ఈరూపమున సీత జనకమహారాజు యొక్క అయోనిజపుత్రిక. (ఈమెపూర్వవృత్తాంతము చూడుము వేదవతి) (చూడుము మందోదరి) జనకుఁడు సంతానములేక పుత్రేష్టి చేయఁదలఁచి భూమిని దున్నించుచుండెను. నాఁగటిచాలులో నొకబంగరపుపెట్టెయు, నందిమెయు జనకునకుఁ గనఁబడియెను. తాఁగోరినది యత్నములేకయే సమకూరెనని జనకుఁడు మిక్కిలి సంతోషించి నాఁగటిచాలులోదొరకుటచే సీతయనుపేరుపెట్టి యతిగారాబముతోఁ బెంచుచుండెను.

సీతకు వివాహవయస్సురాఁగా నామెను తనయింట నున్న శివునిచాపము నెక్కుపెట గల్గిన రాజకుమారున కిత్తునని జనకుఁడు శపథము చేసెను. సీతయొక్క గుణరూప సౌందర్యములను వినినప్రతిరాకుమారుఁడునునామెనువివాహమగు కోరికతో వచ్చి ధనుస్సునెక్కుపెట్ట యత్నించిరి గాని వారికి సాధ్యమగుటలేదు. తాటకాది రాక్షసులను సంహరించుటకై విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులనుదీసికొనివచ్చి యాకార్యములు ముగిసినపిమ్మట వారిని మిథిలానగరమునకు జనక రాజుకడకుఁ గొనివచ్చెను. విశ్వామిత్రుఁడే శివునిచాపము చూపి దాని నెక్కుపెట్టుమనియెను. రాముఁడు వివాహముగోరిరాలేదు. కాని గురువు నానతిప్రకారము ధనుస్సు చేఁబూని యెక్కుపెట్టుచుండఁగా నది ఫెళ్ళున విఱిగెను. జనకవాక్యము ప్రకారము రామునకే సీత భార్య యగుటకు నందఱు సంతోషమునొందిరి. జనకుఁడు దశరథు నకు శుభలేఖపంపి రావించి సీతను శ్రీరాముని కిచ్చి వివాహముచేసి పంపెను.

సీత భర్తతోనయోధ్యకువచ్చియతిముదంబుతో నుండెను. ఆమె పినతండ్రిపుత్రికలను గూడ శ్రీరాముని తమ్ములగు భరతాదుల కిచ్చిరి. వీరెల్లరు నతి సౌఖ్యముల బొందుచుండిరి. శ్రీరామునకు యువరాజ్య పట్టాభిషేకము చేయుట కేర్పరుపఁబడియెను. సీత మంగళ స్నానముచేసి సకలాభరణములను దాల్చి యుండెను. మఱునాఁడే మహోత్సవము జరుగవలసి యున్నది. కాని దానికి విఘ్నము కలిగెను. కైక రాముని నరణ్యములకు బంపుమనియెను. భరతునకుఁ బట్టము కట్టుమనియెను. శ్రీరాముఁడు తానరణ్యములకేగుదునని చెప్ప వచ్చెను. సీతయు వచ్చెదననెను. అరణ్యవాస క్లేశమును భరింపజాలవని యెంతచెప్పినను "సతులకు పతులను బాసియుండుట ధర్మముకా"దని శ్రీరామునితోఁ బయనమయ్యెను. వీరితో లక్ష్మణుఁడుగూడ వచ్చుచుండెను. వీరుముగ్గురు పట్టువస్త్రములు విడిచి నారబట్టలు గట్టి పదచారులై నగరమును విడిచి వెడలిరి.

సీతారామలక్ష్మణులు గంగానది దాటి యరణ్యము ప్రవేశించిరి. అందు మునులదర్శనము చేయుచు నొక్కొక్కని యాశ్రమముకడఁ గొన్నిదినము లుండుచుండిరి. అత్రిమహాముని యాశ్రమమునఁ గొంతకాలముండిరి. మునిపత్ని యగు ననసూయకు సీత తన వివాహవృత్తాంతము చెప్పెను. అనసూయ సీతను ఆశీర్వదించి సతీ ధర్మములు చెప్పెను. అచ్చటినుండి యగస్త్యుని యాశ్రమమునకు వెళ్ళిరి. వీరుండుటకుఁ దగిన ప్రదేశము గౌతమీతీరముననున్న పంచవటమను వనమని యగస్త్యుఁడు చెప్పఁగా వీరు ముగ్గురు నచ్చటి కరిగి యొక పర్ణశాల నిర్మించుకొని యందుండిరి. రామలక్ష్మణులు తెచ్చిన యాహార పదార్థము లీమె వండి పెట్టుచుండెను. ఎంత క్లేశము నొందుచుండినను సీత భారముగఁ దలఁచుటలేదు.

రామ లక్ష్మణులను జూచి కామించిన శూర్పణఖ సీతపై నీర్ష్యకలిగి సీతను బాధింపఁ బోయెను. అపుడు లక్ష్మణుఁడు ఆరాక్షసి ముక్కు చెవులు గోసి పంపెను. ఈమె నట్లవమానించి

నందుకు ఖరదూషణు లను రాక్షసులు వచ్చి పోరఁ దొడఁగిరి. రామలక్ష్మణులు వీరినిజంపిరి.

ఖరదూషణులను జంపుటయుఁ, దనముక్కును జెవులను గోసి యవమానము చేయుటయు శూర్పణఖ తన యన్నయగు రావణునితోఁ జెప్పెను. ఆ నరులకుఁ బ్రతీకారము చేయు మనియె; మఱియు వారితో నున్న వనితసౌందర్య మింతింతయని చెప్పనా యని సీతను వర్ణించి సీతను దీసికొనిరమ్మని రావణునకు బోధించెను. రావణుఁడు మారీచునిఁ బిలిపించి తనకు సహాయముగ రమ్మని, రామలక్ష్మణులను సీతకడనుండి దూరముగఁ దీసికొనిపోవు నుపాయము చేయు మనియెను. మారీచుఁడు కనకమృగమై సీత ముందఱ గంతులు వేయుచుండెను. ఈ మృగమును జూచి సీత మక్కువపడి దానిని దెచ్చి యిమ్మని కోరెను. రాముఁడు దానిని బట్టుకొనుటకై వెడలెను. ఆ లేడిపిల్ల పాఱిపోయెను. శ్రీరాముఁడు దానివెంబడివే పోవుచుండెను. తుదకు శ్రీరాముఁడు దానిని బాణముతోఁ గొట్టెను. ఆ లేడి ప్రాణములువిడచుచు మనుష్య వాక్యములతో 'హా లక్ష్మణా' యని యఱచెను. ఆ యఱపువిని సీత లక్ష్మణుని వెళ్లి చూడుమనియె. శ్రీరామునికెట్టి యాపదయురాదు, నిన్నొంటరిగ విడచి నే పోఁజనను అని లక్ష్మణుఁడు చెప్పఁగా సీతకు మిక్కిలి కోపము వచ్చెను. ఆ యఱపు శ్రీరామునిదే యని యామె విశ్వసించెను. అతని కేదో బాధకలిగెనని భీతినొందెను. లక్ష్మణునిఁ బోయి చూడుమనినఁ జూడకుండెను. భర్తపై యనురాగము చూపువనను, నామెకపుడు కల్గిన దుఃఖముచేతను ముందు వెనుక లాలోచింపక నిష్ఠురముగఁ బల్కెను. ఇఁక లక్ష్మణుఁడు మాఱుమాటాడక శ్రీరాముని జూచుటకు వెళ్ళెను. లక్ష్మణుఁడు కొంతదూరము చనఁగనే రావణుఁడు యోగిరూపమునవచ్చి తాను లంకకు రాజనియు, మూడులోకములను గజ గజ వణకించుశక్తి కలవాఁడ ననియు, శ్రీరామునివిడిచి తనకు రాణి వగుమనియుఁ జెప్పి తననిజరూపము చూపించెను. సీత భయపడెను; మూర్ఛనొందెను. అట్లు పడి యున్న సీతను రావణుఁ డెత్తుకొని యాకాశ మార్గమున లంకకు దీసికొని పోవుచుండెను. మార్గమందు జటాయువువచ్చి శ్రీరామభార్యను విడుపుమని రావణు నెదిరించెను గాని యా రాక్షసుఁడు జటాయువుని ఖడ్గముతోఁ గొట్టి పడగొట్టెను. సీత మూర్ఛదేరి రాక్షసునిచే నెత్తుకొని పోఁబడుట గ్రహించెను. ఆమె శరీరమందలి తొడవులు మూటగట్టి క్రింద పడవైచెను. రావణుఁ డీమెను దీసికొనివెళ్ళి లంకలో నశోకవనమునఁ బెట్టెను. అతఁడు తనను బరిణయము కమ్మని యొప్పించుట కెన్నెన్నో యత్నములుచేయుచుండెను. లంకకు రాణిని జేయుదుననియెను. తన సౌభాగ్య మెన్నుకొనెను. రాముని దూలనాడెను. ఆమె వినకున్న ఆమెనే భయపెట్టుచుండెను. ఆమెకు బోధచేయుఁడని రాక్షసకాంతలను గాపు పెట్టెను. వారెంత చెప్పినను సీతకు రామస్మరణ తప్ప నన్యములేదు. సీత యాహారము నొల్లక యట్లే కృశించి పోవుచుండెను. కొంతకాలమైనపిమ్మట హనుమంతుఁడు వచ్చి శ్రీరాముని యుంగరము చూపి తాను శ్రీరామ భటుఁడ ననియుఁ, దనతో వచ్చినయెడల శ్రీరాముని కడకుఁ గొంపోయెదననియుఁ జెప్పెను. తనను జూచినట్లానవాళ్ళు శ్రీరామునకుఁ జెప్పుమని సీత కొన్ని చెప్పి, "హనుమంతుఁడు తీసికొని వెళ్ళుట శ్రీరామునకు ఖ్యాతిగాదు. కావున శ్రీరామునితో రావణుని వధించి నన్ను గొనిపొమ్మని చెప్పు" మని యామె పలికెను. హనుమంతుఁడు లంకవిడిచి చనియెను.

సీతను గావలి గాచుచుండిన రాక్షసియొకతె త్రిజట యనునది కల గనియె. శ్రీరాముఁడు సముద్రముదాటి వచ్చినట్లును, రావణుని వధించినట్లును, సీతను రథముపై నెక్కించుకొని వెళ్ళినట్లును కలలోఁ జూచి మేల్కొని సీతకుఁ జెప్పెను. సీతకుఁ గొంతసంతోషము కలిగెను. శ్రీరాముఁడు వచ్చునని యెదురు చూచుచుండెను. ఆమె తలఁచినట్లుగ శ్రీరాముఁడు సైన్యసమేతుఁడై లంకకువచ్చెను. రావణుఁడు యుద్ధసన్నద్ధుఁడై యుండెను. అపుడుకూడ రావణుఁడు సీతను భయపెట్టుట మానలేదు. మాయశిర మొకటి బాణాగ్రమునకు గ్రుచ్చి విద్యుజ్జిహ్వుఁడను వాని చేతి కిచ్చి ఇదే శ్రీరాముని శిరము; శ్రీరాముఁడు వధింపఁబడియె; రావణుని బరిగ్రహింపుమని చెప్పఁబనిచెను. మొదట సీత నమ్మి శ్రీరాముఁడు

నిజముగ చనిపోయెనని యేడ్చెను. ఎంత భయపెట్టినను, యెట్టికాఁతియలుపెట్టినను నామె శ్రీరామస్మరణ మానలేదు. ఇంతలో సరమ వచ్చి యది మాయశిరముకాని శ్రీరామునిశిరము కాదని చెప్పెను. సీత యించుక ధైర్యముతో నుండెను. యుద్ధమందు అతికాయుఁడు, మహాకాయుఁడు మరణించిరి. ఇంద్రజిత్తు సంహరింపబడియె. రావణుఁడే యుద్ధమునకు వెళ్ళెను. శ్రీరామునితోఁ బోరుచుండెను. శరవర్షము కురిపించెను. శ్రీరాముఁడు మూర్ఛనొందెను. మరల రావణుఁడు రాముఁడు మరణించెనని చెప్పుమని త్రిజటను బంపెను. కాని త్రిజట సందేహము నొందెను. ఇదియు నసత్యమగునేమోయని యామె పుష్పకము నెక్కి వెళ్ళి శ్రీరాముఁడు మూర్ఛ తేరియుండుటను జూచి యీ సంగతి సీతకుఁ జెప్పెను. రణమందు తుదకు రావణుడుగూడ వధింపబడియె. బ్రహ్మాదులు వచ్చి శ్రీరాముని స్తుతించిరి. శ్రీరాముఁడు సీతనుజూచెను. ఆమెను దీసికొని వచ్చెను; కాని చాలకాలము రావణునింట నుండుటచే నామెను బరిగ్రహింప ననియె. సీత తాను శ్రీరామునే దైవముగనెంచి ఉండు దాననని యు, రామునిఁదప్ప నన్యము తలఁచి యుండలేదనియుఁ, దనను బరీక్షింపఁగోరి రేని యగ్నియందుఁ బ్రవేశించెద ననియుఁ బలికెను. అచ్చటనే చితిపేర్చిరి. సీత అగ్నియందుఁ బ్రవేశించెను. ఆమె పుష్పములమధ్య నున్నట్లుండెను. ఆమె మిక్కిలి పవిత్రురాలు, నిర్దోషిని. ఆమెను బరిగ్రహింపుమని యగ్ని పలికెను. అపుడు శ్రీరాముఁడు సీతను గ్రహించి యామెను బుష్పకమునెక్కించి యయోధ్యకుఁ దీసికొని వచ్చెను. సీతారాము లయోధ్యనుఁ జేరిరి. శ్రీరామునకుఁ బట్టముగట్టిరి. వెనుకటి కష్టములన్నియు మఱచి సుఖముగ నుండుచుండిరి. సీత గర్భవతియు నయ్యెను. ఒకనాఁడు శ్రీరాముఁడు సీతనుజేరి నీకుఁ గలుగు కోరికలు తెల్పుము తీర్చెద ననియె. సీత మునిపత్నులతోఁ గలసి విహరించుటఁ గోరుచుంటినని చెప్పెను. రేపే నీకోరిక తీర్చెదననియె. శ్రీరాముఁ డేలయడిగెనో? ఆమె ఈ కోరి కేల కోరెనో?

శ్రీరాముఁడు కొలువుకూటమునకువచ్చిజానకిని గూర్చియుఁ,దననుగూర్చియుఁ బ్రజలేమనుకొను వారని భద్రు నడిగెను. చిరకాలము రావణునింటనుండిన సీతను రాముఁ డేలుచున్నాఁడని నిందావాక్యము లాడుచుండిరని భద్రుఁడు చెప్పెను. సీత పవిత్రచరిత్రయైనట్లు శ్రీరాముఁ డెఱుఁగును. ఆమె పావనియని యగ్నిపలికెను. అయినను జను లట్లాడుకొను చున్నారు. శ్రీరాముఁడు వెంటనే లక్ష్మణునిఁబిలచి సీతను అరణ్యమునకుఁ గొనిపొమ్మనియె.

మఱునాఁడు లక్ష్మణుఁడు సీతకడకువచ్చెను. ఆమెను నిష్కారణ మరణ్యముల పాలుచేయుచుండుటలో లోలోనఁ గ్రుళ్ళిపోవుచుండెను. అయినను అన్నయాజ్ఞ మీరరాదు. సీతను అరణ్యములకుఁ బంపివేయుచున్నాఁడని పలుకలేఁదు. ఆమె కోరిన కోరిక తీర్చుటకై మునిపత్నుల కడకుఁ గొంపోయెద రమ్మనియె. పాపము ఆమె రాఁగల గతి యెఱుఁగదు. ఆమె మిక్కిలి సంతోషించెను.

మునిపత్నులఁజూచు వేడుకతో నాభరణములను దాల్చి, పట్టువస్త్రములు ధరించి, వారికై కానుకలుగైకొని లక్ష్మణునితో రథమెక్కెను. కాని మార్గమందన్నియు నపశకునములే తోఁచెను. వానిని సీతచూచెను. కాని యెట్టికీడు పుట్టునో తలఁపలేకుండెను. లక్ష్మణుఁడామెతో మాటాడనేరక, పలుకరించిన గన్నులయందు నీరుగ్రమ్ముచు శిరము వాల్చి కూర్చుండెను. సీత చూచి చూచి ఏమిలక్ష్మణా! అయోధ్య విడచి యరణ్యములకు వచ్చునాఁడు విచారింపవు. ఇంద్రజిత్తుకొట్టిననాఁడు దుఃఖింపవు. రావణుని శక్తి నీపైఁబడినపుడును జింతిల్లవే. ఇపు డేల యింతగఁ జిన్నవోయి విషణ్ణుఁడవై యుంటివి? నిజము చెప్పుము అనియె. లక్ష్మణుఁడు రహస్యము దాఁచలేకపోయెను. సీత కభిముఖుఁడై యామెపాదములబట్టి మాటాడక బిగ్గఱగ నేడ్చెను. దుఃఖ మించుక యాపికొని, తల్లీ! చేయరానికార్యము చేయఁబోవుచున్నాను. పౌరులాడు నపవాదములు విని శ్రీరాముఁడు నిన్నడవులయందు దిగఁబెట్టమనియె. నిన్నరణ్యములో వదలి నేనెట్లు పోఁగలుగుదును? అని శోకించుచుండెను. సీత దుఃఖము పైకిఁదోపనీక లక్ష్మణా! నీవేమి చేయుదువు? నీ యన్న చెప్పినపని చేయుట నీ ధర్మముకదా! అని లక్ష్మణునకుధైర్యముచెప్పఁ

బోయెనుగాని యామెయు శోకపరవశయయ్యెను. అన్నా! విధాత యిట్లు వ్రాసెనా? ఆ రాక్షసుని వధతో నిడుమలు గడచిన వనుకొంటిని. శ్రీరాము నెడబాయక యుండఁ గల్గుదు ననుకొంటిని. దైవ మిట్లు దలఁచెనా? నా కిది తెలిసియుండుచో నా మనోనాథునిఁ గడసారిచూచి నన్ను మఱువకుండుమని చెప్పి వచ్చియుందునే, హా శ్రీరామా! యని వగచుచున్నదానిని లక్ష్మణుఁ డరణ్యములో దిగఁబెట్టి యామెయొద్ద సెలవు గైకొని మఱలిచ్చెను.

అరణ్యములో వాల్మీకిశిష్యులు సీతను జూచి దివ్యభామినిని జూచితిమని తమ గురువున కెఱింగించిరి. అతఁడు తన దివ్యచిత్తమునఁ జూచి సీతయని గ్రహించి తన యాశ్రమమున కామెను దోడ్కొనివచ్చెను. అతఁడే సీతను దండ్రివలెఁ జూచుచుండెను. సీత యతని యాశ్రమములోనే ప్రసవించెను. ఆమెకుఁ గుశలవులు అను కవలసుతు లుద్భవించిరి. వారికి వాల్మీకియే విద్యనేర్పి రామాయణము గానముచేయుట నేర్పెను. రాముఁ డశ్వమేధము చేయుచు వాల్మీకిని బిలువఁగ నితఁడు కుశలవులనుగూడఁ దీసికొనివెళ్ళి వీరిచే రామాయణమును గానము చేయించెను. రాముఁడు సీతను దలఁచుకొని విచారించుచుండఁగా వాల్మీకి యామె తనయాశ్రమముకడ నున్నదనిచెప్పెను. ఆమెను దీసికొని వచ్చుటకై శత్రుఘ్నుఁడు వచ్చెను. సీత శత్రుఘ్నునితో వెళ్ళి రాజసభ ప్రవేశించి రామునకు మ్రొక్కి నిలుచుండెను.

ఆమె పవిత్రురాలని వాల్మీకి చెప్పెను. ఆమెయే శపథముచేయుట మంచిదని శ్రీరాముఁడు పలుకఁగా సీత ముందునకు వచ్చి, చేతులు జోడించి, నేను అకల్మషహృదయనై యుంటినేని శ్రీరామునిఁదప్ప నన్య మెఱుఁగకుంటినేని, ఈ భూదేవి నాకుఁ జోటిచ్చును గాక యని పలికెను. అంతట వచ్చట భూమి చీలి నాగకన్యలు రత్నసింహాసనము తెచ్చి సీత నందుఁ బెట్టుకొనిపోయిరి. రామా.

సీమంతిని:-చిత్రవర్మయనురాజుయొక్క కూఁతురు. ఈమెను గారాబముగఁ బెంచుకొనుచుఁ దండ్రి ఈమెజాతకమును జ్యోతిష్కులకుఁ జూపెను. ఈమెకు వైధవ్యము కలుగునని యొక బ్రాహ్మణుఁడు చెప్పెను. తండ్రి దుఃఖమునొంది దానిని గూఁతునకుఁ దెలియనీయకుండ నుంచవలె నను కొనియెను. కాని యెటులో సీమంతినికిఁగూడఁ దెలిసెను. ఈమె సోమవారము లుపవాసముండుచు శివుని నారాధించుచు వచ్చెను. ఈమెను చంద్రాంగదుఁ డను రాజపుత్త్రున కిచ్చి వివాహముచేసిరి. చిత్రవర్మ యీతనిని, సీమంతినినిగూడఁ దన యింటనే యుంచుకొనియెను. వారి కేవిధమైన యాపత్తు రాకుండఁ జూచుచుండెను. ఒకనాఁడు చంద్రాంగదుఁడు పడవయెక్కి సముద్రములోనికి వెళ్లెను. ఇతఁడు వెళ్ళగనే పెనుగాలివచ్చి యీ పడవను ముంచివేసెను. చంద్రాంగదుఁడు మరల నింటికి రాలేదు. అతఁడు మరణించెనను వార్త వ్యాపించెను. శత్రురాజులు దండెత్తి వచ్చిరి. సీమంతిని కడు విచారములో నున్నను శివుని నారాధించుచునే యుండెను. సముద్రములో మునిఁగిన చంద్రాంగదుని సర్పములు నాగలోకమునకుఁ గొంపోయినవి. తక్షకుఁడు చిత్రవర్మ స్నేహితుఁ డగుటచేఁ జంద్రాంగదుని గౌరవించి యితఁ డిచ్చటకు వచ్చెననియును, త్వరలో నిజనగరమునకు వచ్చుచున్నాఁడనియు నుత్తరము వ్రాసెను. చంద్రాంగదుఁడు మరలి వచ్చెను. వెలికత్తెలతో నున్న సీమంతినిని జూచి నీవెవ్వర విట్లేల దుఃఖించుచున్నా? వని యడిగెను. ఇతఁ డామెను గుర్తించెను గాని నామె యానవాలు పట్టలేకపోయెను. పిదప వచ్చినవాఁడు నిజముగఁజంద్రాంగదుఁడేయని తెలిసికొని శివప్రభావమువలన నాతఁడు బ్రతికివచ్చెనని సంతోషించెను.

భర్తవచ్చిన సంతోషములో సీమంతిని తన గృహమునకు వచ్చిన దంపతులకు లేదనకుండఁ గానుక లిచ్చుచుండెను. ఇద్దఱు సోదరులు ధనార్జనకై తిరుగుచున్నవారు దంపతులట్లు వేషము వేసికొని సీమంతినికడకుఁ బోయిరి. ఆమె వారిని బూజించి కానుక లిచ్చెను. కాని యాఁడువేషము వేసికొనినవాఁడు నిజముగ స్త్రీ యయ్యెను. వారును, వారి తండ్రియు మిక్కిలి యార్తినొందిరి. సీమంతిని దంపతులుగ వారిని భావించుటచే దంపతులే యైరి.

స్కాం. బ్ర

సు

సుందరి:–మాల్యవంతుని భార్య. ఉ. రా.

సుందరి:–శుకుని కూఁతురు. నీపుఁడను రాజును బరిణయమయ్యెను. ఈమెకుమారుఁడు బ్రహ్మదత్తుఁడు. భాగ.

సుందుఁడు:–నికుంభుఁ డను రాక్షసునిపుత్త్రుఁడు. ఉపసుందుఁ డితని తమ్ముఁడు. వీరిద్దఱు వింధ్యాటవియందు ఘోరమగు తపస్సుచేసిరి. బ్రహ్మ ప్రత్యక్షమై వరములు వేఁడుడనఁగాఁ, గామరూపత్వమును, సకలమాయావిత్వమును, నమరత్వమును గోరిరి. బ్రహ్మ అమరత్వము నొసంగక తక్కినవరములు ప్రసాదించెను. అది మొదలు వారు దేవతలను, మునులను బాధింపఁ జొచ్చిరి. వీరు బ్రహ్మకడకుఁ బోయి మొఱ లిడుకొనిరి. సుందోపసుందు లితరులచే వధ్యులు కారు. వా రొకరి నొకరు వధించుకొను నుపాయము చేయవలయునని బ్రహ్మ తెల్పి విశ్వకర్మను జక్కనిసుందరాంగి నొకతెను సృజింపుమనియెను. విశ్వకర్మ తిలోత్తమను బుట్టించెను. నీ కారణమున సుందోప సుందులకు వైరము, మరణము కలుగునట్లు చేయుమని బ్రహ్మ యామెను బంపెను. ఆమె వచ్చి వీరికంటఁ బడెను. వీరిరువురును మోహించిరి. మాలో నీ వెవ్వరిని జేపట్టెదవని నామెను యడిగిరి. మీలో నెవఁడు రెండవవానిని బొడిచి గెలువఁ గలుగునో వానిని గూడెద నని యామె ప్రత్యుత్తరమిచ్చెను. ఆమెను బొందవలెనని యొకరి నొకరు పొడుచుకొనిరి. ఇరువురును మరణించిరి. భార.

సుందుఁడు:–జంభుని కుమారుఁడు. ఇతని భార్య తాటక. ఇతఁడు యక్షుఁడు. అగస్త్యునిచేఁ జంపఁబడెను. సుందునికుమారుఁడు మారీచుఁడు.

సుందోపసుందులు:– (చూడుము సుందుఁడు.)

సుకన్య:–శర్యాతికుమారిత. ఒకనాఁడు తండ్రితో నీమెయు వనమునఁ గ్రుమ్మరుచు నొకపుట్టనుండి మెఱుపులు వచ్చుచుండుట చూచి దానిని బొడిపించెను. దాన నాపుట్టయందుఁ దపస్సుచేసికొనుచుండిన చ్యవనునిశరీరమునకు గాయములు తగిలెను. ఆతనికిఁ గోపమువచ్చి తనశక్తిచే శర్యాతి సైనికుల మూత్రపురీషములు బంధించెను. వీరి బాధకు సుకన్యచేసిన యపరాధమే కారణమని శర్యాతి యెఱింగి పుట్టకడకువచ్చి చ్యవనుని ప్రార్థించెను. సుకన్యను దన కిచ్చినయెడల క్షమింతు నని చ్యవనుఁడు నుడివెను. శర్యాతి సుకన్యను జ్యవనున కిచ్చి వివాహముచేసెను. పరమకోపనుఁడైన పెనిమిటిని సుకన్య తన పరిచర్యలచే మెప్పించెను.

సుకన్య చ్యవనునితో నుండఁగా నొకనాఁడు అశ్వినీదేవత లీమెను జూచి "ఓ సుందరీ! నీ కీ ముదుసలిభర్త యేల? మాతోడరమ్ము. నీకుఁ దగువానిని జూపెదము" అనిరి. సుకన్య కోపముతో వీరాడినమాటలు చ్యవనునకుఁ జెప్పెను. వారి యిష్టానుసారము చేయుమని చ్యవనుఁ డనియె. వీరికడకు సుకన్య మరలి వచ్చెను. వీరు నదిలో స్నానముచేయుటకై దిగిరి. ఇంతలోఁ జ్యవనుఁడు వచ్చి యచ్చోటనే దిగెను. (చ్యవనుఁడు తన యాశ్రమమునకు వచ్చిన యశ్వినీదేవతలను తన ముదిమిని బోఁగొట్టుమని కోరెను. వా రాతనినిఁ దమ వెంబడిఁగొంపోయి నదిలో స్నానముచేయించిరి.) స్నానముచేసి రాఁగానే ముగ్గురును సమాన రూపములతో నుండిరి; మాలో నీకు భర్తయగువాని నెన్నుకొనుమని వారు సుకన్యతోఁ బలికిరి. ఆమె చ్యవనుని నేర్పరుపలేక యశ్వినీదేవతలను ప్రార్థించెను; వారు సంప్రీతులై చ్యవను నొసంగిరి.

శర్యాతి యాగముచేయఁదలఁచుకొని తన యల్లుని, గూఁతునిఁ బిలుచుటకై చ్యవనుని యాశ్రమమునకు వచ్చెను. అచ్చట సుకన్య యొక సుందరాకారుఁడగు చిన్నవానితో నుండుట చూచి ముసలివానికిచ్చి వివాహము చేయుటచేతఁ దన కుమారిత జారిణియయ్యెనని దుఃఖించెను. కాని సుకన్య తన భర్తయే యశ్వినుల ప్రసాదమున సుందరాకారము పొందెనని చెప్పి తండ్రికి సంతోషము కలుగఁ జేసెను. సుకన్యకుఁ బ్రమతి యను కుమారుఁడు కలిగెను. భార. భాగ.

సుకర్ముఁడు:–జైమినిపుత్త్రుఁడైన సుకర్ముని తనయుఁడు; వేదశాస్త్రవేత్త. ఇతనికి సహస్రుఁడు, పౌష్యంజి, కౌశల్యుఁడు మొదలగుశిష్యులుగలరు.

సహస్రుని నకారణముగ నింద్రుఁడు దండించుటచే నింద్రునిపై నితనికిఁ గోపము వచ్చెను. బ్రాహ్మణకోపమున కింద్రుఁడు భయపడి యీ సుకర్మునియొద్దకు వచ్చి బ్రతిమాలి యితఁడు కోరిన వరమిచ్చెను. బ్రహ్మ.

సుకుమారి:- సృంజయుఁడను రాజుకుమారిత. పర్వతనారదు లీ రాజుకడకు రాఁగా వారి పరిచర్యకై సృంజయుఁ డీమెను నియోగించెను. ఈమెను నారదుఁడు వలఁచి తనకు వివాహము చేయుమని సృంజయుని గోరెను. సృంజయుఁ డొసంగెను. వివాహము కాఁగానే పర్వతుఁ డిచ్చిన శాపమువలన నారదునిముఖము వానరముఖ మయ్యెను. అయినను సుకుమారి పతిభక్తి కలిగి భర్తకుఁ బరిచర్యలు సల్పుచుండెను. పర్వతుఁడు మరల నారదుని నొకవనములోఁ గలిసికొనెను. అచ్చటఁ బరస్పర విమోచనము చేసికొనిరి. ఇంటికివచ్చిన నారదునిముఖము వేఱుగా నుండుటచే సుకుమారి వాని నన్యునిగా దలంచి పెడమొగమై చనియెను. ఆమె కపుడు తమ శాపములు నివృత్తి యయిన ప్రకారమును బర్వతుఁడు తెలియఁజేసెను. భార.

సుకుమారుఁడు:-సుమంతుని పుత్త్రుఁడు.

సుకుమారుఁడు:- ధర్మరాజుయొక్క చక్రరక్షకుఁడు. భార.

సుకృశుఁడు:- ఒక ముని. విపులుని కుమారుఁడు. ఇతని ధర్మశీలత పరీక్షించుటకై యింద్రుఁడు పక్షిరూపమున వచ్చి తనకు నరమాంస మాహారముగఁ బెట్టుమని కోరెను. సుకృశుఁడు తన పుత్త్రులను బిలిచి యా పక్షి కాహారముకండని శాసించెను. కాని వారు తిరస్కరించిరి. అట్లు తిరస్కరించుటచే సుకృశుఁడు తన పుత్త్రులను శపించి తన దేహమునే యా పక్షిని భక్షింపుమని యర్పించెను. జీవముండఁగా శరీరమును భక్షింపనని యా పక్షి యనఁగ సుకృశుఁడు యోగశక్తిచే మేనువిడిచెను. అపుడింద్రుఁడు నిజరూపముతోఁ బ్రత్యక్షమై సుకృశునకు వరమిచ్చి చనియెను. ఈ సుకృశుని కుమారులే ధర్మపక్షులైరి. మార్క.

సుకేతనుఁడు:-(సుకేతుఁడు) ఒక యక్షుఁడు. ఇతఁడు సంతానమునకై బ్రహ్మనుగూర్చి తపస్సుచేసెను. ఇతనికి వేయియేనుఁగుల బలము గల కుమారిత తాటక జన్మించెను. సుకేతుఁ డామెను సుందునకిచ్చి వివాహముచేసెను.

సుకేతుఁడు:- ఒక పాంచాలికుమారుఁడు. యుద్ధములోఁ గృపాచార్యుఁడు వీనినిఁ జంపెను. భార.

సుకేతుఁడు:-క్షేముని కుమారుఁడు.

సుకేశి:-హేతికుమారిక. ఈమెయుఁ, బ్రహేతి కుమారితయైన మిత్రకేశియుఁ గుబేరవనమున రత్నవతి, కదళిక మొదలగు చెలికత్తెలతో విహరించుచు దుర్జయుఁడను రాజును జూచి మోహించిరి. ఆ సంగతి యీమె చెలికత్తెలవలన హేతికిఁ దెలిసెను. అతం డీమెను దుర్జయునకిచ్చి వివాహముచేసెను. ఈమెకు సుప్రభుఁడను కుమారుఁడు కలిగెను. వరా.

సుకేశి:-విదర్భరాజు కూఁతురు. సగరుని భార్య. విష్ణు.

సుకేశుఁడు:-విద్యుత్కేశుని కుమారుఁడు. వీనిని మలయపర్వతముమీఁదఁ బ్రసవించి తల్లి యచ్చటనే వీనిని విడచి భర్తకడకుఁ బోయెను. పార్వతీ పరమేశ్వరు లీ శిశువును జూచి రూపరేఖా విలాసముల కానందించి వీఁడు తేజము, బలము, నగరము పొందునట్లు వరమిచ్చిరి. వీఁడు సుకేశుఁడను పేరుతో వర్ధిల్లెను. వీని వైభవముచూచి గ్రామణి యను గంధర్వుఁడు తనకుమార్తెను దేవవతి నిచ్చి వివాహము చేసెను. వీనికి మాల్యవంతుఁడు, సుమాలి, మాలి యను ముగ్గురు కుమారులు పుట్టిరి. ఉ. రా.

సుగ్రీవము:-కృష్ణుని రథాశ్వములలో నొకటి. భార.

సుగ్రీవుఁడు:-స్త్రీరూపమున నున్న ఋక్షవిరజాని యందు సూర్యునివలన జన్మించిన వానరుఁడు. వాలితమ్ముఁడు.

సుగ్రీవుఁడు గౌతమునిభార్యయైన అహల్య యందు సూర్యునివలనఁ బుట్టిన కుమారుఁడు.

గౌతము డింటలేనిసమయమున నింద్రాదిత్యులు వానిగృహముచేరి, యహల్యతో రమించిరి. ఆమె కిరువురు పుత్త్రులు సుందరాకారులు పుట్టిరి. వీరు తన పుత్త్రులేయనుకొని గౌతముఁడు పెంచుచుండెను; కాని యతని కుమారిత కారని చెప్పెను. (చూడుము అంజన) అంత గౌతముఁడీ బాలురను సముద్రమునఁ బడవేసి మీరు నాపుత్త్రులు కారేని మర్కటరూపములఁ బొందుఁడని శపించెను. ఆ శాపమున వీరు వానరులైరి. వీరే వాలి సుగ్రీవులు. వీరిని ఋక్షవిరజుఁడు పెంచెను. మందరనగమున సుగ్రీవుఁడు సంచరించుచుండఁగ దార చూచి మోహించి వీనిని బరిణయమయ్యెను. వి. రా.

వాలి కిష్కింధను పాలించుచుండెను. సుగ్రీవుఁ డన్న కనువర్తియై యుండెను. ఒకనాఁడు మాయావి యను దనుజుఁడు వాలిని యుద్ధమునకుఁ బిలిచెను. వీరు నగరము వెలుపలికేగి యుద్ధము చేయుచుండిరి. సుగ్రీవుండును, దారయు వాలివెంబడి వెళ్ళిరి. ఆ దనుజుఁ డొక బిలము ప్రవేశించెను. అందు వాలియుఁ బ్రవేశించి వానితో యుద్ధము చేయఁజొచ్చెను. రక్తధారలు బయటకు వచ్చుట చూచి వాలి సంహరింపఁ బడెనని సుగ్రీవుఁడు భయపడి మాయావి మరల బయటకు రాకుండునట్లు ఆ బిలమునకు ఱాయి మూతవెట్టి కిష్కింధకు వచ్చెను. తారాసహితుఁడై తానే రాజ్యమేలుచుండెను. ఇంతలో వాలివచ్చి తన భార్యతో నున్న సుగ్రీవునిఁజూచి, తనరాజ్యమును, భార్యను హరించుటకై సుగ్రీవుఁడట్లు వంచనచేసెనని తలఁచి వీనిని మోది నగరమునుండి వెడలఁ గొట్టెను. వాలిసుగ్రీవుల వైరమున కిదియే కారణము. సుగ్రీవుఁడు వాలికి భయపడి ఋశ్యమూక పర్వతముపై నుండువాఁడు. హనుమంతుఁడు, జాంబవంతుఁడు, మైందుఁడు, ద్వివిదుఁడు ఇతనికి మంత్రులుగా నుండిరి.

సీతను వెదకుచు వచ్చిన రామలక్ష్మణులను జూచి వారెవ్వరోయని సుగ్రీవుఁడు భయపడియె; వీరినెఱిఁగి వచ్చుటకు హనుమంతుని బంపెను. హనుమంతుఁడు వీరిరాకకుఁ గారణమారసి వీరికిఁ దమరేలిక సహాయము చేయగలవాఁడని చెప్పి రామలక్ష్మణులను సుగ్రీవునికడకుఁగొంపోయెను; సుగ్రీవుఁడు వీరలతో స్నేహముచేసెను. వీరు సీతను వెదకుచు వచ్చిరని వినఁగానే తాఁదివ దాఁచిన యాభరణములమూటఁ జూపెను. అవి సీతవేయగుట రాముఁడు గుర్తించి సీతను దలఁచు కొని విచారించెను. సుగ్రీవుఁడు దానును భార్య నెడఁబాసి యన్నచేఁ దఱుమఁబడియున్నవాఁడ నని చెప్పి తనకు సహాయము చేయుమని కోరి తానును శ్రీరామునకు సహాయము చేయుదునని చెప్పెను. శ్రీరాముఁడు సరేయనియె; కాని వాలిని సంహరించుటకు శ్రీరాముఁడు తగిన బలశాలియా ? యని సందేహమునొంది యేడు సాలవృక్షముల నొకసారికొట్టుమని శ్రీరాము నడి గెను. శ్రీరాముఁడు కొట్టెను. ఇఁక వాలిని జంప వచ్చునని నిశ్చయముచేసికొనెను. శ్రీరాముఁడు వాలిని జంపుదుననియె; సుగ్రీవుఁడు కిష్కింధకు వెళ్ళి వాలిని యుద్ధమునకుఁ బిలిచెను. వాలి వచ్చెను. వాలిసుగ్రీవులు పోరాడుచుండిరి. ఎవరు సుగ్రీవుఁడో, ఎవరు వాలియో రాముఁడానవాలు పట్టలేక యూరకుండెను. ఎంతసేపు శ్రీరాముఁడు సహాయము చేయకుండుటచే సుగ్రీవుఁడు వాలి దాడి కాగలేక పాఱిపోయి వచ్చెను. శ్రీరాముఁడు సహాయము చేయకుండుటకుఁ గారణము చెప్పెను. మఱల వాలిని యుద్ధమునకు బిలువుమని రామలక్ష్మణులు చెప్పిరి. ఈ సారి సుగ్రీవుని మెడలో పూలదండ వేసిరి. వాలి సుగ్రీవులుపోరాటము నారంభించిరి. శ్రీరాముఁడు చెట్టుచాటునడాఁగి బాణమువేసి వాలినిజంపెను. సుగ్రీవుఁడు వాలికి దహనాదిక్రియలు జరి పించెను. సుగ్రీవునకుఁ బట్టముగట్టిరి. ఇతఁడు తారను మరల గైకొనియెను. సీతను వెదకుట కే యత్నమును జేయకుండుటచే లక్ష్మణుఁడు వీనిపైఁ గోపించెను. పిమ్మట సీతను వెదకుటకై సుగ్రీవుఁడు నలుదిశలకును గపివరులను బంపెను. లంకకు వెళ్ళిన హనుమంతుఁడు సీతను జూచి వచ్చితినని చెప్పెను. అంత యుద్ధసన్నాహము చేసిరి. సుగ్రీవుఁడు తనసేనలతో రామునివెంబడి వెళ్ళి రాక్షసులతో యుద్ధముచేసెను. అట్లు రామునకు సహాయముచేసి రావణుఁడు వధింపఁ బడిన పిమ్మట సీతారాములతో నయోధ్యకు వెడలి యచ్చట సీతారాములకు బట్టాభిషేక మయినపిదపఁ గిష్కింధకు వచ్చి సుఖంబున రాజ్యమేలెను. రామా.

సుగ్రీవుఁడు:- ఒకదనుజుఁడు. కాళికఁ దనుఁ దమను బరిణయముచేసికొమ్మని చెప్పుటకై శుంభనిశుంభులచేఁ బంపఁబడిన దూత. మార్క.

సుఘోషము:- నలుని శంఖము.

సుచంద్రుఁడు:- హేమచంద్రుని పుత్త్రుఁడు. విశాలదేశపురాజు. ఇతనిపుత్త్రుఁడు ధూమ్రాశ్వుఁడు. రామా.

సుచంద్రుఁడు:- క్రూరయనుదాని పుత్త్రుఁడు. భార.

సుచంద్రుఁడు:- కళావతియొక్క భర్త. ఇతఁ డామెతోఁ జాలకాలము క్రీడించి క్రీడించి తుదకు సంసారమును రోసి, యామెనువిడిచి, యగస్త్యుని యాశ్రమమునఁ దపముచేసికొనియెను. బ్ర. వై.

సుచారువు:- రుక్మిణీకృష్ణుల కుమారుఁడు. భాగ.

సుచ్ఛాయ:- అగ్నికుమారిత. శిష్టిభార్య. ఈమెకుఁ గృపుఁడు, రిపుంజయుఁడు, వృత్తుఁడు, వృకుఁడు, వృకతేజసుఁడు, చక్షుషువు అను కుమారులు కలిగిరి. మత్స్య.

సుజన్మకృత్తు:- సోమకుని కుమారుఁడు. వీనికి నూర్గురు కుమారులు. కడపటివాఁడైన పృషతుని పుత్త్రుఁడే ద్రుపదుఁడు. భాగ.

సుజాత:- ఏకపాదుని భార్య; అష్టావక్రుని తల్లి. భార.

సుజ్యేష్ఠుఁడు:- అగ్నిమిత్త్రుఁడను రాజుయొక్క కుమారుఁడు. ఇతనిపుత్త్రుఁడు వసుమిత్త్రుఁడు. భాగ.

సుతపుఁడు:- స్వాయంభువు మన్వంతరమున నొక ప్రజాపతి. ఇతనిభార్య పృశ్ని. వీరు పెక్కేండ్లు శ్రీహరినిఁ బ్రార్థించి యాయన ప్రత్యక్షము కాఁగా మోక్షమును గోరక శ్రీహరి తమకు బిడ్డడగునట్లు కోరిరి. ఇతఁడే కశ్యపుఁడుగను, వసుదేవుఁడుగను జన్మించెను. భాగ.

సుతపుఁడు:- ఒక బ్రాహ్మణుఁడు. భరద్వాజ గోత్రమువాఁడు. ఇతనిభార్యతీర్థయాత్రకుఁబోవుచుండఁగా సూర్యునికుమారుఁడైనఅశ్విని కామమోహితుఁడై బలాత్కారమున సంభోగించెను. ఆమెసిగ్గుపడుచుఁ గుమారునితో భర్తయొద్దకు

వచ్చెను. ఇతఁడు భార్యను వదలిపెట్టెను. ఆమె గోదావరీనది యయ్యెను. ఇతఁడు అశ్వినీకుమారులను పూజలేకుండునట్లు శపించెను. తాను దపస్సునకుఁబోయెను. కొంతకాలము దారపరిగ్రహము చేసి, సంతానమును బడయుమని యాకాశవాణి పలికెను. విధాతయే పితృదేవతలకుమారితను వీని కిచ్చెను. ఆమెయం దితనికిఁ గళ్యాణమిత్త్రుఁడను కుమారుఁడు పుట్టెను. సుతపుని కడకు సూర్యుఁడు వచ్చి ప్రార్థించి తన కుమారునిశాపమును మఱలింపుమని కోరెను. వారును యజ్ఞభాగముల కర్హులగునట్లితఁడు మఱల వరమిచ్చెను. బ్ర. వై.

సుతపుఁడు:- నివృతచక్షుని కుమారుఁడు. ఇతఁడొక మృగమును గామించి, మృగరూపమును ధరించి క్రీడించుచుండెను. ఆ సమయమున నుత్పలావతి యను దృఢధన్వునికూఁతు రా మృగిని బెదరించెను. అపుఁడు సుతపుఁడు నిజరూపమును దాల్చి, నా భోగమునకు భంగ మొనరించితివి. నన్నుఁ బరిణయమగుము. లేదా, నిన్ను శపించెదను అని యామెతోఁ బలికెను. కాని యుత్పలావతి వీనిని ధిక్కరించెను. సుతపుఁ డామెను మృగివి కమ్మని శపించెను. అపుడామె సుతపునిఁ బ్రార్థించి శాపవిమోచనము చేయుమని కోరెను. మీఁదటిజన్మమున నామె మృగియై గర్భమును ధరించిన పిమ్మట శాపవిమోచనమగునని సుతపుఁడు నుడివెను. మార్క.

సుతపుఁడు:- వసిష్ఠునిపుత్త్రులలో నొకఁడు. ఉత్తమ మనువు కాలములో నితఁడు సప్తఋషులలో నొకఁడయ్యెను. మార్క.

సుతపుఁడు:- హేముని పుత్త్రుఁడు.

సుతీక్ష్ణుఁడు:- సుతీక్ష్ణుఁడు దండకారణ్యమునందు దపస్సు చేసికొనుచుండు నొకముని. ఈతని కడకు శ్రీరాముఁడువచ్చి యీ యరణ్యమున నుండుటకుఁ దమకుఁ దగినచోటు చెప్పుమని యడిగెను. రామా.

సుతేజసుఁడు:- వసిష్ఠుని పుత్త్రులలో నొకఁడు. ఉత్తమమనువు కాలములో నితఁడు సప్తఋషులలో నొకఁడయ్యెను. మార్క.

సుదక్షిణ:-దిలీపుని భార్య. సంతానముకొఱకు నీమెయును, భర్తయును నందినీధేనువును గొల్చిరి. వీరికుమారుఁడు రఘువు. రఘు.

సుదక్షిణుఁడు:- కాశీరాజుయొక్క కొడుకు. కాశీరాజు పౌండ్రక వాసుదేవునకు సహాయముగా శ్రీకృష్ణునితో యుద్ధముజేసెను. శ్రీకృష్ణుఁడు వానిని సంహరించెను. సుదక్షిణుఁడా కోపమున శ్రీకృష్ణునిఁ బరిమార్పఁదలంచి శివునిఁ బ్రార్థించెను. శివుఁడు ప్రత్యక్షముకాఁగాఁ దనకోర్కెను దెలిపెను. అభిచారహోమము చేయఁగా నీ కోర్కె యగ్ని తీర్చునుగాన నట్లు అభిచారహోమము చేయుమని శివుఁడు చెప్పఁగా సుదక్షిణుఁ డట్లుచేసెను. అంత నగ్నినుండి యతిభీకరమగు కృత్య వెడలివచ్చి ద్వారకానగరముపైఁ బడి దహింప మొదలిడెను. జనులందఱును భయపడి శ్రీకృష్ణుని శరణువేడిరి. అతఁడు చక్రమును కృత్యపైకిఁ బంపెను. కృత్య చక్రమునకుఁ దాళలేక వెంటనే కాశీనగరమునకువచ్చి ఋత్విజు సమేతముగా సుదక్షిణుని దహించివేసెను. ఇట్లు చక్రమా నగరమును దహించి మఱల ద్వారకకు వచ్చెను. భాగ.

సుదక్షిణుఁడు:-కాంభోజరాజు. ఇతఁడు యవనుఁడు. యుద్ధమునందు దుర్యోధనునకు సహాయము వచ్చెను. భార.

సుదర్శన:-దుర్యోధనుఁడను మనువంశపురాజునకు నర్మదయందుఁ బుట్టిన కుమారిక. ఈమెతండ్రి యగ్నిగృహంబునఁ బనులు చేయుచుండుట కీమెను బంపుచుండును. ఈమె సౌందర్యమును జూచి మోహించి యగ్ని బ్రాహ్మణవేషమున వచ్చి తనను బరిణయము కమ్మని కోరెను. తనను దల్లిదండ్రులిచ్చి వివాహము చేయవలయును గాని స్వతంత్రముగ నొకనిని జేపట్టఁజాలనని యామె చెప్పెను. అంతట నా కపటబ్రాహ్మణుఁడు దుర్యోధనుఁడుచేయు యజ్ఞసమయమున నక్కడకువచ్చి యతని కూఁతును సుదర్శనను తనకిచ్చి వివాహము చేయుమని కోరెను. సుదర్శనను అగ్నికిచ్చి వివాహముచేసిరి. ఈమెకు సుదర్శనుఁడు అను పుత్త్రుఁడు కలిగెను. భార.

సుదర్శనము:-మేరుపర్వతమునకు దక్షిణమున నున్న జంబూతరువుపేరు. దానినిబట్టియే యిది యున్న ద్వీపమునకు సుదర్శనద్వీపమని పేరువచ్చెను. ఇదియే జంబూద్వీపము. భార.

సుదర్శనద్వీపము:-దీనిపేరే జంబూద్వీపము. భార.

సుదర్శనము:- చక్రము. విష్ణుమూర్తియొక్క యాయుధము. వేయిసూర్యుల కాంతితో నది వెలుగుచుండును. శ్రీహరిచేత విముక్తమై శత్రువులను సంహరించి మఱల శ్రీహరినిఁ జేరుచుండును. అంబరీషునిపైఁగోపించిన దుర్వాసుని నిది తఱుముకొని వెళ్ళెను. గజేంద్రుని బాధించుచుండిన మొసలిని సంహరించెను. తాను ఖాండవవనమును దహించునపుడు శత్రు లడ్డురాకుండ నన్నుఁ గాపాడుమని కోరి యగ్నిదేవుఁ డీ చక్రమును శ్రీకృష్ణున కిచ్చెను. భార.

సుదర్శనుఁడు:- దుర్జయుని పుత్త్రుఁడు. వానితల్లి మిత్త్రకేశి.

సుదర్శనుఁడు:-ఒకవిద్యాధరుఁడు. మిక్కిలి రూపవంతుఁడు. ఒకనాఁడు విమానమెక్కి సంచరించుచు గురువులగు యాంగిరసులైన ఋషులను జూచినవ్వెను. రూపదర్పంబున మమ్ముఁ బరిహసించితివి. కావున నీవు సర్పమై యుండుమని వానిని శపించిరి. అతఁడు శాపవిమోచనమునకై ప్రార్థింపఁగా శ్రీవిష్ణువు యదుకులమందుఁబుట్టి యొకనాఁ డీ యడవికి రాగలఁడు. అప్పుడతని పాదనిహతిచే నీకుఁ బూర్వరూపము వచ్చునని యనుగ్రహించిరి. అతఁడు వెంటనే పామై యుండెను.

అంబికావనమున నొకనాడు శ్రీకృష్ణుఁడు మొదలగువారు జాతరకై వచ్చిరి. ఈ పాము ఆనందునిఁ బట్టుకొని విడువకుండెను. తుదకు శ్రీకృష్ణుఁడు దానినిఁ బాదములతోఁ దన్నుచు ద్రొక్కుచుండఁగా నది తన యప్పటి పాము రూపమును విడిచి పూర్వరూపమున లేచి శ్రీకృష్ణునకు నమస్కరించి చనెను. భాగ.

సుదర్శనుఁడు:- ధ్రువసంధియొక్క కుమారుఁడు. ఇతనిపుత్త్రుఁడు అగ్నివర్ణుఁడు భాగ.

సుదర్శనుఁడు:- సుదర్శనయొక్క కుమారుఁడు. వీనితండ్రి అగ్నిదేవుఁడు. ఇతనికి ఓఘవంతుఁడను

కుమారుఁడుఁగలఁడు. ఓఘవంతునకు ఓఘరథుఁడు అను కుమారుఁడును, ఓఘవతి యను కుమార్తె యును గలరు. ఓఘవతికిఁ దగిన భర్తకై తిరిగి తిరిగి యెచ్చటను గానలేక ఓఘవంతుఁడు సుదర్శనున కిచ్చి వివాహముచేసెను. సుదర్శనుఁడు గృహస్థాశ్రమమున నుండియే మృత్యువునుజయించెదనని ఓఘవతితోఁ గురుక్షేత్రమునఁ గాపుర ముండెను. అతిథిపూజచేయుచు నతిథి పూజయే ముఖ్యమని భార్యకుఁ జెప్పి యొకవేళ నతిథి తనను గోరినను వాని కోరికఁ దీర్పుమని సుదర్శనుఁడు చెప్పెను. ఇతఁడు స్నానమునకై వెడలఁగా ధర్మదేవత యతిథియై వచ్చెను. ఓఘవతి యాతనికి సత్కారములు గావించెను. వానిని మెచ్చక యా యతిథి యామెతోడి పొందును గోరెను. ఆమె వెనుక ముందు తట్టాడుచుండెను. ఎటు చేయుటకును నిర్ణయింప లేకుండెను. భర్తయాజ్ఞ దాటవెఱచి తుద కాయతిథితో నొక రహస్యప్రదేశమునఁ జేరెను. అపుడే సుదర్శనుఁడు వచ్చి భార్యను బిలిచెను. పలుకవలదని యామెతో నతిథి చెప్పెను. ఆమె పలుకనందున సుదర్శనుఁడు తొంగి చూచెను. ఆ యతిథి నీ భార్య నాకు సత్కారము చేయుచున్నదని చెప్పెను. అతిథులు సమ్మోదమొందుటే నాకు సంతోషము. నేను కృతార్థుఁడ నైతినని సుదర్శనుఁడు పలికెను. అపుడు ధర్మదేవత నిజరూపమును దాల్చి "నిన్నుఁ బరీక్షచేయుటకై వచ్చియుంటిని. నీవు నిజముగా మృత్యువును జయించితివి. నీవు కోరినపుడు నన్నుఁ దలఁచుకొనుము. నీవు శరీరముతోఁ బరలోకమును బొందుదు"వని చెప్పెను. భార.

సుదర్శనుఁడు:-కాశీరాజు కుమారుఁడు. కాశీరాజు పౌండ్రక వాసుదేవునకు సహాయముగ శ్రీకృష్ణునిమీఁదకు యుద్ధమునకు వెళ్ళినపుడు శ్రీకృష్ణుఁడు కాశీరాజును గూడఁ జంపెను. అతని తల కాశీనగరములోఁ బడెను. సుదర్శనుఁడు తండ్రితలను చూచి రోషము వహించి శ్రీకృష్ణునిఁ జంపుటకై శివునిఁ బ్రార్థించి అభిచార హోమమును జేసెను. పలునాలుకలు, నిప్పుల వంటి గ్రుడ్లు, భీకరాకారముగల కృత్య వచ్చి నగరమును దహింపఁజేయఁ జొచ్చెను. నగరవాసులు శ్రీకృష్ణునితోఁ జెప్పుకొనిరి. ఇది సుదర్శనునిచేష్టయని శ్రీకృష్ణుఁడు గ్రహించి చక్రమును బంపి కృత్యను, సుదర్శనుని సంహరించెను. భాగ.

సుదర్శనుఁడు:-ధ్రువసంధి యను రాజుయొక్క కుమారుఁడు. ధ్రువసంధి వేఁటకుఁబోయి సింహముచేఁ జంపఁబడెను. అప్పటికి సుదర్శనున కాఱవ యేడు. వానికే పట్టముకట్టిరి. ఇతఁడు చిన్న ప్రాయముననే దండనీతిని నేర్చుకొనెను. ఇతని కుమారుఁడు అగ్నివర్ణుఁడు. రఘు.

సుదర్శనుఁడు:- ధ్రువసింధువను రాజుయొక్క కుమారుఁడు. ఇతనితల్లి మనోరమ. వీనితండ్రి పోయిన తరువాత నితనికే పట్టమును గట్టఁ దలఁచుకొనిరి. కాని యితని సవతితల్లి తండ్రియైన యుధాజిత్తు వచ్చి తన మనుమఁడు శత్రుజిత్తు పెద్దవాఁడనియు, నతనికే రాజ్యమీయవలయుననియె. ఇతని మాతామహుఁడగు వీరసేనుఁడు వచ్చి సుదర్శనుఁడే పెద్దవాఁడు. ఇతనికే రాజ్యమీయవలెననియెను. వీరసేనునకును, యుధాజిత్తునకును యుద్ధము కూడనయ్యెను. అందు వీరసేనుఁడు చనిపోయెను. మనోరమ తన కుమారునిఁ గాపాడఁదలఁచి వానిని భారద్వాజాశ్రమమునకు రహస్యముగఁ దీసికొనిపోయి యచ్చటఁ గాపాడుచుండెను. సుదర్శనుఁడు దేవిని స్తుతించి విద్య నేర్చుకొనియె. యుధాజిత్తు ఇతని సంహరింపఁదలఁచి యితనిజాడ లరయుచు దుర్దమ్నుఁడను నొక యొఱుకలవానిని సహాయము తీసికొని భారద్వాజాశ్రమమునకు వచ్చెను. సుదర్శనునిఁ దన కప్పగించుమని ముని నడిగెను. కాని యతఁడు తిరస్కరించెను. యుధాజిత్తు మంచిమాటలచే సుదర్శనుని రావించి సంహరింపవలెనని చూచుచుండెను. కాశీరాజైన సుబాహునికూఁతురు శశికళ సుదర్శనునిగుణములు విని వానినేకాని పెండ్లియాడననియె. సుబాహువు తన కుమార్తెకు స్వయంవరము చాటించి రాజులను రావించెను. అచ్చటికి సుదర్శనుఁడుకూడ వచ్చెను. యుధాజిత్తు వీనినిజంపునని కొందఱు తలఁచిరి. ఇతని నచ్చటనుండి పొమ్మనిరి. అన్యుని వరింపుమని సుబాహువు తన కూఁతురితోఁ జెప్పెను గాని యామె వినదయ్యె. ఆనాఁడు యుద్ధమగునట్లు తోఁచెను. నాఁటికి స్వయంవర మాపినట్లును,

మఱునాఁడు జరుగుననియు సుబాహువు ప్రకటించెను. కాని యారాత్రియే శశికళను సుదర్శనున కిచ్చి వివాహముచేసెను. స్వయంవరమునకు వచ్చిన రాజులు దీని నెఱింగి సుబాహునిపై యుద్ధమునకుఁ గడంగిరి. అతఁడు వీరినందఱను క్షమింపుఁడనికోరెను. కాని కొందఱు మన్నింప లేరైరి. యుధాజిత్తు మొదలగువారు సమర సన్నద్ధులైరి. వీరితో సుదర్శనుఁ డొక్కఁడే పోరి వారిని సంహరించెను. అపుడు దేవి సుదర్శనునకుఁ బ్రత్యక్షమయ్యెను. ఇతఁడు మామగారిని బిలిచి దేవికి మ్రొక్కుమని చెప్పెను. సుదర్శనుఁడు భార్యాసమేతుఁడై యయోధ్యకు వెళ్ళి రాజయ్యెను. దేవి సదా తనను బూజింపుచుండుమని యితనితోఁ జెప్పెను. దే. భా.

సుదాముఁడు:-సర్వకాముని కుమారుఁడు. (చూడుము సుదాసుఁడు)

సుదాముఁడు:-మధురానగరమం దొక మాలాకారుఁడు. ఇతఁడు కంసునకుఁ బుష్పమాలిక లిచ్చుచుండును. కంసునిఁ జూడవెళ్ళిన బలరామకృష్ణులితనియింటికిఁ బోయిరి. వీరిని సుదాముఁడు పూజించి పూలదండ లిచ్చెను. భాగ.

శ్రీకృష్ణుండు సంప్రీతుఁడై నీవు కోరుకొనిన వరమిత్తును కోరుకొమ్మనెను. అంత నితఁడు "నీ పాదకమలసేవయు, నీ పాదార్చకులతోడి నెయ్యమును, నితాంతాపారభూతదయయును" గలుగునట్లు వరమిమ్మని కోరుకొనెను. శ్రీకృష్ణుఁడు వీని కోరికలిచ్చి బలము, ఆయుస్సు, కీర్తి, సంపదలుకూడ నిచ్చెను.

భాగ.

సుదాముఁడు:-శ్రీకృష్ణుని పార్శ్వదుఁడు. శ్రీకృష్ణుఁడు గోపికలతోఁ గూడియుండినపుడు రాధచూచి శ్రీకృష్ణుని పరుషములాడెను. (గోలోకమందు విరజ యను కాంత శ్రీకృష్ణుని వలచియుండెను. ఆతనిని వీడి మరల వానికై వచ్చులోపుననే శ్రీకృష్ణుఁ డదృశ్యుఁ డయ్యెను. విరజ విరహము సహింపలేక శ్రీకృష్ణునిఁ బరుషములాడెను.) శ్రీకృష్ణు నేల నిందించెదవని సుదాముఁ డామెను నిష్ఠురములాడెను. ఆమెకు వీనిపైఁ గోపమువచ్చి రాక్షసుఁడుగఁ బుట్టునట్లు వీనిని శపించెను. ఇతఁడే శంఖచూడుఁడుగఁ బుట్టెను. బ్ర. వై.

సుదామ్నుఁడు:-ఇతఁడేసుదాముఁడు. (చూడుము సుదాముఁడు.)

సుదాసుఁడు:-ఒక సూర్యవంశపురాజు. కల్మాషపాదుని తండ్రి. ఉ. రా.

సుదాసుఁడు:-సర్వకాముని కుమారుఁడు. ఇతనికి మిత్రసహుఁడను పేరు కలదు. (చూడుము మిత్రసహుఁడు.) భాగ.

సుదేవ:-దేవాతిథి పుత్త్రిఁడైన ఋచీకుని భార్య. ఋక్షుని తల్లి. భార.

సుదేవి:-నాభి భార్య. ఈమెయందు హరియే వృషభరూపమున జన్మించెను. ఆ కుమారునకు వృషభుఁడని పేరుపెట్టిరి. భాగ.

సుదేవుఁడు:-విదర్భరాజు; శ్వేతుని తండ్రి. ఇతని రెండవ కుమారుఁడు సురథుఁడు. ఉ. రా.

సుదేవుఁడు:- అంబరీషుఁడను రాజుయొక్క భటుఁడు. అంబరీషుఁ డింద్రలోకమునకుఁ బోవునప్పటికి సుదేవుఁ డట ఉజ్జ్వలవిమానారూఢుఁడై యుండుట చూచెను. "వీఁడు నా భటుఁడు. యాగములు నేను జేసితినిగాని వీఁడు చేయలేదు. ఎట్లు ఇక్కడికి వచ్చె?" నని యంబరీషుం డడుగ నింద్రుఁ డిట్లు చెప్పెను. "సదముఁడు, విదముఁడు, దముఁడు అను దనుజులు నీ నగరముపైఁ బడినపుడు నీవు వీనిని దునుముచేసి రమ్మని పంపితివి. ఇతఁడు తగినంతబలము తనకు లేదని తెలిసికొని శివునిఁ బ్రార్థించి వాని యనుగ్రహమున శస్త్రములను బొంది యాదనుజులను సంహరించెను. నీవు చేసిన యజ్ఞములవంటిదే యీరణయజ్ఞమును. కావుననే యితఁ డీలోకమునకు వచ్చెను" అని చెప్పెను. భార.

సుదేవుఁడు:-ఒక రాజు. ఇతఁడు నలుఁడను తన సఖునితోడను, భార్యలతోడను నొకనాఁడు వనమున కేగెను. అచ్చటఁ బ్రమతి యను మునియొక్కభార్యను జూచి నలుఁడు మోహించెను. ప్రమతి రాజుకడకు వచ్చి యిట్టి చెడుతలఁపులు కలిగి వర్తించుచున్న నలుని నీవు శిక్షింపవేయని ప్రశ్నించెను. సుదేవుఁడు హాస్యముగ, నేను రాజును గాను. నేనొక కోమటిని. వాని నెట్లు దండింపఁగలుగుదునని మునితోననియె. ఈ రాజు

అసత్యము పల్కుచున్నాఁడని ముని గ్రహించి నలుని నీయకమ్మని శపించి ఈ రాజును జూచి నీవు కోమటివై పుట్టుమనియెను. సుదేవుఁడపుడు పశ్చాత్తాపమునొంది ప్రమతిని ప్రార్థింపఁగా నీకుజన్మించు కుమారితను క్షత్రియుఁడు వివాహమగును. ఆమెకుజన్మించు కుమారుఁడు యుద్ధముచేయును. అపుడు నీకు వైశ్యత్వము పోవును అని చెప్పెను. సుదేవుఁడు కోమటియై పుట్టెను. అతనికి సుప్రభ యను కూఁతురు జన్మించెను. ఆమెకు భనందుఁడను కుమారుఁడు పుట్టెను. మార్క.

సుదేవుఁడు:- కాశీరాజైన హర్యశ్వుని కుమారుఁడు. ఇతని కుమారుఁడు దివోదాసుఁడు. సుదేవుని వీతహవ్యుఁడను రాజు చంపెను.

సుదేవుఁడు:- ఒక బ్రాహ్మణుఁడు; నలదమయంతులను వెదకుటకై భీమునిచేఁ బంపఁబడి సుబాహుపురమునకు వచ్చి యచ్చటఁ బుణ్యాహవచనము చేయింపఁబోవు బ్రాహ్మణులతో రాజగృహమునకుఁబోయి మలినవస్త్రయయ్యు గాంతితో విరాజిల్లునట్టి దమయంతినిజూచి భ్రూయుగమధ్యగతంబులగు సల్లక్షణములు పరీక్షించి దమయంతినిగా నెఱింగి యామెకుఁ దల్లిదండ్రుల వృత్తాంతమును, బిడ్డల క్షేమసమాచారమును చెప్పెను. ఋతుపర్ణుని రాజ్యమున నలుని వెదకుటకై యితఁడే పంపఁబడెను. భార.

సుదేవుఁడు:- చంపుని కుమారుఁడు. ఇతని కుమారుఁడు విజయుఁడు. భాగ.

సుద్యుమ్నుఁడు:- ఒక రాజు. ఇతనియొద్దకు లిఖితుఁడు వచ్చి తాను దొంగతనము చేసితినిగాన దండింపుమని కోరెను. లిఖితుఁడుచేసిన పని విని యది నేరముగాదని యితఁడు దండింప నని యెను. కాని లిఖితుఁడు తనయన్న లేనపుడు ఫలములు దినుట నేరమని చెప్పి దండింపుమని బలవంతపెట్టెను. లిఖితుఁడు కోరినట్లు సుద్యుమ్నుఁ డాతని చేతులు నఱికెను. సుద్యుమ్నుఁడును నీపుణ్యానుష్ఠానంబున, దండనీతివలన అపవర్గంబునొందెను. భార.

సుద్యుమ్నుఁడు: వైవస్వతునికుమారుఁడు. ఇతడు మొదట స్త్రీయై జన్మించెను. (చూడుము ఇల.) కాని వసిష్ఠుఁడు శివుని నారాధించి మగవానిఁగఁ జేయించెను. ఇతఁడు నాట్యముచేయుచు నొకసారి పార్వతీపరమేశ్వరులు విహరించు కుమారవనమున (శరవనమున) కేగెను. అట పార్వతీశాపవశమున తిరిగి స్త్రీ యయ్యెను.

ఈ స్త్రీ వనములోఁ దిరుగుచుఁ జంద్రుని కుమారుఁడైన బుధుని యాశ్రమమును జేరెను. ఒకరి నొకరు ప్రేమించుకొనిరి. బుధునివలన నీమెకుఁ బురూరవుఁడు పుట్టెను. ఈ వనిత స్త్రీయై యుండుటకు విసిగి విచారించుచు వసిష్ఠునిఁ దలంచుకొనెను. అంతలోనే వసిష్ఠుఁడు వచ్చి శంకరునిఁ గూర్చి ప్రార్థించెను. శంకరుఁడు మెచ్చి తానిదివఱకిచ్చిన శాపమునకు భంగము లేనట్లును, వసిష్ఠునికోరిక నెఱవేఱునట్లును, ఒక నెల స్త్రీగాను, ఒక నెల పురుషుఁడుగాను నుండున ట్లనుగ్రహించెను. సుద్యుమ్నుఁడు మఱల వచ్చి రాజ్యముచేసెను. ఇతని నగరము ప్రతిష్ఠాననగరము. సుద్యుమ్నునకు ఉత్కలుఁడు, గయుఁడు, విమలుఁడు అను కుమారులు గలరు. ఇతఁడు ముసలివాఁడై రాజ్యము పురూరవునకిచ్చి తపస్సునకుఁ బోయెను. భాగ.

సుద్యుమ్నుఁడు:-చాక్షుషమనువు కుమారుఁడు. మత్స్య.

సుద్యుమ్నుఁడు:- సుప్రతీకుఁడను రాజకుమారుఁడు. ఇతని తల్లి కాంతిమతి. ఇతని యన్న యగు దుర్జయునితోఁ గలిసి రాజ్యమేలుచు సర్వదేశములు జయించెను. వరా.

సుద్యువు:-పూరువంశమువాఁడైన చారువు తనయుఁడు. ఇతని కుమారుఁడు బహుగవుఁడు. భాగ.

సుధన్వుఁడు:- అంగిరసుఁడను విప్రుని కుమారుఁడు. ఇతఁడును, విరోచనుఁడును సుగుణులలో నెవ్వరు పెద్దయని పన్నిదమువేసికొనిరి. తమ హెచ్చుతగ్గులు నిర్ణయించుటకై ప్రహ్లాదుని కడకుఁ బోయిరి. నీవు న్యాయము చెప్పని యెడలఁ గులిశహతుఁడ వగుదువని భయపెట్టిరి. ప్రహ్లాదుఁడు వారినిఁ గశ్యపునిదగ్గఱకు వెళ్ళుఁడనియెను. మేము నీకడకు సందియముతో వచ్చితిమి; ఈ సంశయమును బాపక పొమ్మనుట పాతకమని వారు చెప్పిరి. అపుడు ప్రహ్లాదుఁడు

ధర్మము దలఁచి పుత్త్రప్రేమను దలఁపక, సుధన్వుఁడే శ్రేష్ఠుఁడని చెప్పెను. భార.

సుధన్వుఁడు:-త్రిగర్త దేశాధీశ్వరుఁడు. కామ్యక వనంబుననున్న ద్రౌపదిని సైంధవుఁడు చెఱఁగొన వచ్చినపుడు పాండవులు వానితో యుద్ధమునకు రాఁగా నతఁడు సైంధవునకు సహాయముచేసెను. ధర్మరాజుచే హతుఁడయ్యెను. భార.

సుధన్వుఁడు:-సాంకాశ్యదేశమునకు రాజు. ఇతఁడు సీతను దనకిచ్చి వివాహము చేయుమని జనకు నడిగెను. అతనిపైకి యుదమునకుఁగూడ వెళ్లెను. జనకుఁడు వీనిని సంహరించి వీనిరాజ్యమును దన తమ్ముఁడైన కుశధ్వజున కిచ్చెను. రామా.

సుధన్వుఁడు:- హంసధ్వజుఁడను రాజు కుమారుఁడు. హంసధ్వజుఁడు ధర్మజుని యాగాశ్వమును బట్టఁగా నర్జునుఁడు యుద్ధమునకువచ్చెను. హంసధ్వజుఁ డా యుద్ధమునకుఁ గుమారునిఁ గూడ రమ్మనెను.

సుధన్వుఁడు యుద్ధమునకుఁ బోఁదలఁచి తల్లికిమ్రొక్కి భార్యతోఁగూడ జెప్పి వెళ్ళవలెనని రాఁగా నామె ఋతుదానము చేయుమని వేఁడెను. సుధన్వుఁ డామె కోరికదీర్చి యుద్ధరంగమునకు వెళ్ళెను. ఇందువలన నాలస్యముగ వచ్చినందుకు రాజునకుఁ గోపమువచ్చి వీనిని గాచిననూనెలో వేయుఁడని యానతిచ్చెను. రాజభటు లట్లు గావించిరి. కాని సుధన్వుఁడు చెక్కుచెదరక యుండెను. ఆ వేడిమి కతని శరీరము కందనైనఁ గందలేదు. ఈతఁడు సామాన్యుఁడు కాఁడని యెఱిఁగి రాజునొద్దకుఁ దోడ్కొని పోయి యితఁడు లేశమును బాధ నొందక యున్నాఁడని చెప్పిరి. సుధన్వుఁడు హరిభక్తుఁ డగుటచే నట్లుండుట గ్రహించిరి. వీనిని సేనాధిపతిగఁ జేసిరి. ఇతఁడు ఘోరయుద్ధము చేసెను. కాని యర్జునునివలన మడిసెను. జై. భా.

సుధర్మ:-దేవేంద్రునిపట్టణములో నొక ముఖ్యమైన సభ. శ్రీకృష్ణునికై విశ్వకర్మ ద్వారకను నిర్మించినపుడు దేవేంద్రుఁడు సభనుద్వారకయందుంచుట కిచ్చెను. భాగ.

సుధృతి:-రాజవర్ధనుని కుమారుఁడు. ఇతనిపుత్త్రుఁడు సౌధృతేయుఁడు. భాగ.

సుధేష్ణ:-గాంధారితోఁబుట్టువు. ఈమెనుగూడ ధృతరాష్ట్రుఁడు వివాహమయ్యెను. భార.

సుధేష్ణ:-బలి యను రాజు భార్య. దీర్ఘతమునివలనఁ బుత్త్రులను బడయుమని భర్త యీమెను నియోగించెను. ఆ ముసలిని డాయ రోసి యీమె తన దాసిని బంపెను. దాసికిఁ బుట్టిన కుమారులు తన కుమారులే యని బలి తలఁచెను. కాని దాసీపుత్త్రులని దీర్ఘతముఁడు బలి కెఱుకపఱచెను. అతఁడు భార్యను దిరిగి నియోగించెను. ఆమె యంగములెల్లయంటిచూచి సుధేష్ణకు వంశకరుఁడును, బలసంపన్నుఁడు నగు పుత్త్రుఁడు కలుగునని అనుగ్రహించెను. అంగరాజు పుట్టెను. భార.

సుధేష్ణ:- విరాటరాజు భార్య. అజ్ఞాతవాసము చేయుటకై వచ్చిన ద్రౌపది రూపవికాసములను జూచి యీమె యాశ్చర్యము నొందెను. ద్రౌపది యీమెనుజేరి తనను దాసిగఁ గైకొమ్మని ప్రార్థించినను నామెను జూచి తనభర్త విరాటుఁడు చిత్తచలనము నొందునేమోయని యీమె సందేహించెను; కాని యామెను బరిచారికగా నంగీకరించెను. సుధేష్ణ ద్రౌపదిని దయతోడనే చూచుచుండెను. ఒకనాఁ డామె సోదరుఁడు సింహబలుఁడు ద్రౌపదిని జూచి మోహించి యామెను వలచియుండుట సుధేష్ణకుఁగూడఁ జెప్పెను. ఈమె సోదరున కది తగదని బోధించెను. కాని యతఁడు వినక ప్రాణములు కోలుపోవునంతవఱకును వచ్చెను. సోదరునిపైఁగల ప్రేమచే నీమె యెట్టకేలకు వానికోరిక నీడేర్పఁదలఁచి వానితో నట్లుచెప్పి కల్లు తెమ్మను నెపమున ద్రౌపదిని సింహబలు నింటికిఁ బంపెను. పిమ్మట జరిగిన చర్యలను జూచి భయపడి ద్రౌపదిని తనకొలువునందుండి తొలఁగిపొమ్మనియె. తరువాతఁ గొన్ని దినములకే పాండవుల యజాతవాసము ముగిసెను. అపుడు ద్రౌపదినెఱింగి సుధేష్ణ గౌరవించెను. ఈమెకు ఉత్తరుఁడను కుమారుఁడును, ఉత్తర యను కూఁతురును గలరు. భార.

సుధేష్ణుఁడు:- శ్రీకృష్ణునకు రుక్మిణియందుఁ బుట్టిన కుమారుఁడు. భాగ.

సునంద:- దుష్యంతుని పుత్త్రుఁడైన భరతునిభార్య. ఈమెకుమారుఁడు భుమన్యుఁడు. భార.

సునంద:– చేదిపురాధిశుని కూఁతురు; దమయంతి పెదతల్లి కుమారిత. వచ్చిన బ్రాహ్మణునితో మాట్లాడుచు సైరంధ్రి (దమయంతి) యేడ్చుచుండుట తన తల్లికిఁ జెప్పెను. భార.

సునంద:– ప్రతీపునిభార్య. దేవాపి, శంతనుఁడు, బాహ్లికుఁడు ఈమె కుమారులు. భార.

సునంద:– ఇందుమతియొక్క చెలికత్తె. ఈమె స్వయంవరమునకు వచ్చిన రాజకుమారుల నెల్లరను సునందయే ఇందుమతికిఁ దెలియఁజేసెను. రఘు.

సునంద:–సార్వభౌమునిభార్య. జయత్సేనుని తల్లి. భార.

సునంద:–ముదావతికి శేషుఁడు పెట్టినపేరు. మార్క.

సునందము:– విశ్వకర్మచే నిర్మింపఁబడిన ముసలాయుధము. కుజంభుఁడనుదనుజునికడ నుండునది. ఎంతటి శత్రువులనైన నీ యాయుధముచేతనే వతఁడు గెలుచుచుండును; కాని దీనికి స్త్రీకరస్పర్శనము తగిలెలేని దీనిశక్తిపోవును. కుజంభునిచే నపహరింపఁబడిన ముదావతి దీనిని స్పృశించెను. మార్క.

సునందుఁడు:– జంభుని కుమారుఁడు. ఇతఁడు తాటకను వివాహమయ్యెను. ఆమెయందు మారీచుఁడను పుత్త్రుఁడు కలిగెను.

సునందుఁడును, మారీచుఁడును నాఁకలిగొని యగస్త్యుని మ్రింగబోయిరి. మీరు రాక్షసులు కండని యతఁడు శపించెను. అప్పటినుండియు నితఁడును, దాటకయుఁ బ్రజలను బాధించుచు, మునులయాగములు ధ్వంసముచేయుచు రాక్షసకృత్యములన్నియు జేయుచుండిరి. రామా.

సునందుఁడు:– (చూడుము సుందుఁడు) మురారి.

సునీతి:– విదూరథుని కుమారుఁడు; సుమతి సోదరుఁడు. ఇతనిసోదరి ముదావతిని కుజంభుఁడను దనుజుఁ డపహరించెను. కాన వానిని వధించి యామెను విడిపించుటకై తండ్రిచేఁ బంపఁబడెను. దనుజునితో యుద్ధముచేసి తుద కితఁడే యోటుపడి యచ్చటఁ గట్టివేయబడెను. వానిని వత్సంధ్రుఁడు విడిపించెను. మార్క.

సునీతి:–ఉత్తానపాదునిభార్య. ధ్రువునితల్లి. భాగ.

సునీథ:–అంగుని భార్య. వేనుని తల్లి. వేనుఁడు మునులయొక్క క్రోధముచే మృతినొందఁగా సునీథ దుఃఖముచేత మరణించెను. భాగ.

సునీథుఁడు:–శిశుపాలుని సేనాపతి. ధర్మజుని రాజసూయమందు శిశుపాలునిపక్షమున యుద్ధమునకు సన్నద్ధుఁడయ్యెను. భార.

సుపరుఁడు:–గరుత్మంతుఁడు. ఇతని పర్ణములు మిక్కిలి బలాఢ్యములై ఇంద్రుఁడు వజ్రాయుధముతోఁ గొట్టినను నొక యీఁకమాత్ర మూడిపడుటచే వీని కీ పేరుకలిగెను. భార.

సుపార్శ్వుఁడు:–సంపాతి కుమారుఁడు. సీతజాడ చూచి వచ్చుటకై లంకకు వెళ్ళుమని వానితో సంపాతి చెప్పెను. ఇతఁడు వెళ్ళనంగీకరించెను. కాని యంగదాదులు తామే వెళ్ళెదమనిరి. రామా.

సుప్రష్ట:–మహాభౌమునిభార్య; అయుతానీకునితల్లి. భార.

సుప్రతీకము:–భగదత్తుని యేనుఁగు. భగదత్తుఁడీయేనుఁగును బాండవసేనపైఁ దోలించి కొంత సేనను చెల్లాచెదరు గావించెను. అర్జునుఁడు దానిని సంహరించెను. భాగ.

సుప్రతీకుఁడు:–ఒక రాజు. ఇతనికి విద్యుత్ప్రభ, కాంతిమతి యను నిద్దఱు భార్యలు గలరు. సుప్రతీకునకుఁ జిరకాలము పుత్త్రులు లేకపోవుటచే దపస్సుచేసెను. అంత సుప్రతీకునికడకు దుర్వాసుఁడు వచ్చెను. ఆ సమయముననే ఇంద్రుఁడుగూడ నైరావతమునెక్కి వచ్చెను. ఇతఁడు దుర్వాసునిఁ జూచియు నేనుఁగను దిగఁడయ్యెను. మునికిఁ గోపమువచ్చి నీవు పదభ్రష్టుఁడవు కమ్మని శపించెను. ఈ రాజుభార్యయగు విద్యుత్ప్రభ గర్భమునఁ బుట్టుదువని ఇంద్రుఁడు పలుక దుర్వాసుఁ డట్లనుగ్రహించెను. అంత దుర్జయుఁడను పేర విద్యుత్ప్రభ గర్భమున సుప్రతీకునకుఁ బుత్త్రుఁడు కలిగెను. మఱియుఁ గాంతిమతియందు సుప్రతీకునకు సుద్యుమ్నుఁడను పుత్త్రుఁడు కలిగెను. వరా.

సుప్రతీకుఁడు:-ఒక బ్రాహ్మణుఁడు. పిత్రార్జిత ధనమును బంచియిమ్మని సోదరు వడుగఁగా నతఁడు కోపించి యేనుఁగవై యుండుమని శపించెను. ఇతఁడతనిని తాబేలువై యుండుమని ప్రతిశాపమిచ్చెను. గరుత్మంతుఁ డమృతార్థము వరుగుచుఁ దన కాహార మనుగ్రహింపుమని కశ్యపుని గోరఁగ నీగజకచ్ఛపములను భక్షింపుమనిచెప్పెను. వీనిని రెండింటిని బట్టుకొనిపోయి గరుత్మంతుఁడు భక్షించెను. భార.

సుప్రభ:-వదాన్యునికూఁతురు. అష్టావక్రునిభార్య. భార.

సుప్రభ:-ఒక వైశ్యుని కూఁతురు. ఈమెను నాభాగుఁడను క్షత్రియకుమారుఁడు వలచి రాక్షసవివాహము చేసికొనియెను. ఈమెకు భనందుఁడను కుమారుఁడు జన్మించెను. ఈమెను కుమారుఁడు నేనేమిచేయవలయునని యడిగెను. గోవును బాలించుచుండుమని యామె చెప్పెను. భనందుఁడు హిమాలయపర్వతముమీఁది కేఁగి తపస్సుచేసి తన పినతండ్రి కుమారుఁడైన వసురాతుని నోడించి తండ్రికడకు వచ్చి యీ రాజ్యము పాలింపుమనియెను. వైశ్యకన్యకను బెండ్లియాఁడుటచేఁ దాను వైశ్యుఁడయ్యెను గానఁ దాను రాజ్యమునకుఁదగనని నాభాగుఁడు చెప్పెను. అపుడు సుప్రభ తాను వైశ్యబాలను కాదనియును, నాతండ్రి వైశ్యుఁడుకాఁడనియు, సుదేవుఁడను రాజనియు తమ పూర్వజన్మ వృత్తాంతము చెప్పెను. ఆమె పూర్వజన్మమునఁ గృపావతి (చూడుము కృపావతి). మార్క.

సుప్రభుఁడు:-దుర్జయుని పుత్త్రుఁడు; వీనితల్లి సుకేశి. వరా.

సుబలుఁడు:-గాంధార దేశాధిపతి; గాంధారి తండ్రి. ఇతనికి సత్యవ్రత, సత్యసేన, సుధేష్ణ, దశార్ణ మొదలగు కుమారితలును గలరు. వీరినిఁ గూడ ధృతరాష్ట్రునకే యిచ్చి వివాహము చేసెను. శకుని ఇతనికుమారుఁడే. భార.

సుబాహుఁడు:-అనిరుద్ధుని వంశమువాఁడు. ప్రతిబాహుని కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు ఉగ్రసేనుఁడు. భాగ.

సుబాహుఁడు:-శత్రుఘ్నుని కుమారుఁడు. భాగ.

సుబాహుఁడు:-సువందునియొక్కయును, తాటకయొక్కయును కుమారుఁడు. ఋషులయొక్క యజ్ఞములను బాధుచేయుచుండువాఁడు. రామా.

సుబాహుఁడు:- శత్రుఘ్నులయొక్క పెద్దకుమారుఁడు. ఇతనిని మధురకు రాజుగాజేసిరి. రామా.

సుబాహువు:-వీరబాహునిపుత్త్రుఁడు. దమయంతికిఁ బినతల్లి కుమారుఁడు. చేదిపురాధీశ్వరుఁడు. దమయంతి యితనితల్లికిఁ బరిచర్య చేయుచు నితని యింటియందే సైరంధ్రిగ నుండెను. ఈమెసంగతి నెఱింగినపిమ్మట మిక్కిలి మన్నించి, గౌరవించి విమానతుల్యమగు యానముమీఁద నీమెను బుట్టినింటికి విదర్భకుఁ బంపెను. భార.

సుబాహువు:-కువలయాశ్వుని పుత్త్రుఁడు; అలర్కుని సోదరుఁడు. అలర్కుఁడు స్త్రీలోలుఁడై రాజ్యకార్యములయం దశ్రద్ధకలిగి యుండెను. అంత సుబాహువు కాశిరాజుసహాయము గైకొని సోదరునిపై దాడివెడలెను. అలర్కుఁడుమాతృదత్తమైన యంగుళీయకమును జూచుకొని వైరాగ్యము నొంది రాజ్యము సుబాహువునకిచ్చెను. మార్క.

సుబాహువు:-కాశిరాజు. ఇతనికుమారిత శశికళ. ఈమెను సుదర్శనుఁడను రాకొమరుఁడు వలచి యుండెను. కుమార్తె స్వయంవరమునకు రాజుల నందఱను సుబాహు వాహ్వానించెను. సుదర్శనుని గూడఁ బిలిచినందుకుఁ గొందఱకుఁ గోపము వచ్చినది. యుధాజిత్తు సుదర్శనుని జంపదలఁచియే అచ్చటికి వచ్చెను. ఆనాఁడు స్వయంవరముగాక యుద్ధము జరుగునట్లు తోచెను. సుదర్శనుని మాని యన్యుని వరింపుమని సుబాహువు తనకుమారితతోఁ జెప్పెను గాని యామె వినదయ్యె. ఆనాఁటికి స్వయంవర మాపివేసి మఱునాఁడు జరుగునని ప్రకటించెను. కాని యారాత్రియందే ఇతఁడు శశికళను సుదర్శనున కిచ్చి వివాహముచేసెను. ఈసంగతి మఱునాడు రాజులకుఁ దెలిసినది. వారు సుబాహుమీఁదకు యుద్ధమునకుఁ గడంగిరి. సుబాహువు వారిని క్షమింపుఁడని వేఁడెను. కొందఱు యుద్ధమునకు గడంగియే వచ్చిరి. వారితో సుదర్శనుఁడొక్కడే యుద్ధముచేసి వారిని సంహరించెను. అతనికి దేవి ప్రత్యక్ష మయ్యెను. ఆమెకు సుబాహువు నమస్కరించి వరములొందెను. దే. భా.

సుభద్ర:-రోహిణీ వసుదేవుల పుత్త్రిక. ఈమె అర్జునునిఁ జూడకపోయినను నతనిగుణములు వినుటవల్ల నతనిని వలచియుండెను. కాని యీమె సోదరుఁడగు బలరామునకుఁ బాండవులతోటి బంధుత్వ మిష్టములేదు. శ్రీకృష్ణుఁడుమాత్ర మీమె ఈప్సితమెఱింగి యర్జునునకే యీమెనిచ్చి వివాహముచేయఁదలఁచి యతనిని యతిరూపమున రావించెను. బలరాముఁ డీ మాయ యెఱుగఁడు. ఆ యతికి నుపచారము చేయుట్ల యతఁడు సుభద్రను నియోగించెను. ఈమె యాతనికిఁ బరిచర్యచేయుచు నొకనాఁడు అర్జుననిగూర్చి ప్రశ్నించెను. ఆ కపటయతి తానే యర్జునుఁడగుట తెల్పెను. సుభద్ర లజ్జతో వానిని వీడివచ్చెను. శ్రీకృష్ణుఁ డంతర్ద్వీపములందు నుత్సవములు చేయుటకు నాజ్ఞాపించెను; బలరామాదు లచ్చట కేగియుండిరి. ఆ సమయమందే శ్రీకృష్ణుఁడు భూసురుల యెదుట సుభద్ర నర్జునునకిచ్చి వివాహముచేయించెను. అర్జునుఁడు సుభద్రను దీసికొని యింద్రప్రస్థమున కరుగుచు ద్రౌపది యేమనునో యని సందేహమునొంది ద్రౌపదికి నమస్కరింపుమని సుభద్రతోఁ జెప్పెను. సుభద్ర ద్రౌపదియెడఁగూడ మిక్కిలి గౌరవ భక్తులతో నుండెను. ఈమెకు అభిమన్యుఁ డను కుమారుఁడు జన్మించెను. అర్జునుఁ డరణ్యవాసమున కేగినపు డీమె భర్తతో నరుగలేదు. అజ్ఞాతవాసము ముగిసినపిమ్మట పుత్త్రినితో విరాటనగరమునకేగి యట భర్తను జేరెను.

భార.

సుమంతుఁడు:-కృష్ణద్వైపాయనుని శిష్యుఁడు. తొల్లి వేదంబు లేకీభూతంబులై యేర్పఱుపరాక యున్నప్పుడు సహాధ్యాయులగు పైల, వైశంపాయన, జైమినులతోఁగలసి చతుర్వేదసూత్రముల నేర్పాటుచేసెను. ఇతఁడు అథర్వవేదమును జదివెను.

భార.

సుమంతుఁడు:-కృష్ణద్వైపాయనుని శిష్యుండగు జైమినియొక్క తనయుఁడు. తండ్రియొద్ద సామవేదమును నేర్చి దానిని సహస్రశాఖలుగ విభజించి కోసలునికుమారుఁడైన హిరణ్యనాభునకును, తన కుమారుఁడగు పౌష్పంజికిని నుపదేశించెను.

భాగ.

సుమంత్రుఁడు:- దశరథునిరథము తోలువాఁడు. శ్రీరామునకును నితఁడే రథసారథి. తుదకు సీతను నరణ్యములో దింపునపుడును రథము తోలినవాఁ డితఁడే.

రామా.

సుమంత్రుఁడు:- దశరథుని ముఖ్యమంత్రులలో నొకఁడు. దశరథునకును, శ్రీరామునకును గూడ సర్వకార్యములందును దోడ్పడువాఁడు. ఋశ్యశృంగునిరప్పించుటకై వేశ్యలను బంపిన డితఁడే. ఇతఁడు శ్రీరామునితోఁగూడ వనవాసమునకు వచ్చెదననియెను గాని శ్రీరాముఁడే వలదనెను. ఏకార్యమునైన దశరథుఁడు గాని, పిమ్మట భరతుఁడు గాని, శ్రీరాముఁడు గాని యీతని యాలోచనలేక చేయువారు కారు.

రామా.

సుమతి:- ఋతేపువు కుమారుఁడైన అంతిసారుని తనయుఁడు. ఇతనికుమారుఁడు రైభ్యుఁడు.

భాగ.

సుమతి:- వృషభుని కుమారుఁడైన భరతుని పుత్త్రుఁడు. ఇతనిభార్య ధ్రువసేన. దేవతాజిత్తు ఇతని కుమారుఁడు. భరతునిపిదప నితఁడు రాజ్య మేలెను. బుద్ధునిఁ గొల్చినట్లు నిన్నుఁ గొలిచెదమని పాషండులు తమ మతమును బోధించిరి.

భాగ.

సుమతి:- విదూరథుని కుమారుఁడు. ఇతనిసోదరిని ముదావతిని కుజంభుఁ డపహరించి పాతాళలోకమునఁ బెట్టినపు డితఁ డామెను విడిపింపఁ బోయెను గాని యా దనుజునిచే నీతఁడును గట్టఁబడియెను.

మార్క.

సుమతి:-వినతాకశ్యపుల పుత్త్రిక. సగరుని భార్య. ఈమెయు, నీమెసవతియు భర్తతో నౌర్వుని కడకుఁ బోయిరి. సగరుఁడు సంతానముకోరి యౌర్వునిఁ బ్రార్థించెను. ఆతని భార్యలలో నొక్కతెకు నొక్క పుత్త్రుఁడు పుట్టుననియును, వాని సంతానము కల్పాంతము వఱకు నుండుననియును, రెండవ యామెకు నఱువదివేల పుత్త్రులుపుట్టి క్రూరులై యచిరకాలములో నశింతురనియును జెప్పెను. సుమతి యఱువదివేల పుత్త్రులను గోరెను. ఈమెకు మొదట నొక్కకుమారుఁడే జన్మిం

చెను గాని శౌర్యుఁడువచ్చి వాని నఱువదివేల ముక్కలుగఁ గావించెను. వానినుండి పుత్త్రిలు పెరిగిరి. విష్ణు. బ్రహ్మ.

సుమతి:-అరిష్టనేమి పుత్త్రిక.

సుమతి:- మకరధ్వజుఁ డను బ్రాహ్మణుని కుమారిత. కాశికుఁ డను బ్రాహ్మణుని భార్య. (మాఁడుము కౌశికపత్ని.) వి. రా.

సుమతి:-విష్ణుయశుని భార్య. కల్కి తల్లి. కల్కి.

సుమతి:- ధనగుప్తుని కుమారిత. చంద్రగుప్తుఁడను బ్రాహ్మణుని వివాహమయ్యెను. ఈమెపుత్త్రుఁడే భట్టి. విక్ర. చరి.

సుమతి:- వైవస్వతమనువు కుమారుఁడగు నృగుని వంశమువాఁడు. ఇతనిపుత్త్రుఁడు భూతజ్యోతి. భాగ.

సుమతి:- వైవస్వతమనువు కుమారుఁడైన నరిష్యంతుని వంశమువాఁడు. వీతిహోత్రుని పుత్త్రుఁడు. ఇతని తనయుఁడు సత్యశ్రవుఁడు. భాగ.

సుమతి:-సోమదత్తునికుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు జనమేజయుఁడు. భాగ.

సుమతి:- సోమదత్తుని కుమారుఁడైన కకుత్థ్సుని యొక్క కుమారుఁడు; విశాలదేశమునకు రాజు. విశ్వామిత్త్రునివెంట వచ్చుచుండిన రామలక్ష్మణుల కితఁ డాతిథ్య మిచ్చెను. రామా.

సుమతి:- దశార్ణదేశపురాజగు వజ్రబాహుని పెద్ద భార్య. ఈమె గర్భవతికాఁగా సవతు లోర్వలేక మందుపెట్టిరి. ఈమె కుమారునిఁ బ్రసవించెను. కాని తల్లి, పిల్లవాఁడు రోగార్తులై యుండుటచే భర్త చిరాకుపడి వనములో దిగవిడిచెను. ఈమె యటనుండి మెల్లమెల్లగా నొక వైశ్యునిపురమునకుఁ బోయి యచట వానిభార్యచే నాదార్పఁబడి గౌరవము నందెను. అంత నట నీమెకుమారుఁడు చనిపోయెను. మిక్కిలి విచారించుచున్న యీమె కడకు ఋషభయోగి వచ్చి తత్త్వోపదేశమును జేయుచుండెను. కాని యీమె దుఃఖమునాపికొనలేక మరణోపాయమునుజెప్పుమనికోరెను. యోగి యీమెపై జాలిపడి విగతప్రాణుఁడగు శిశువు యొక్క శరీరముపై భస్మమునుబూసి బ్రతికించి భద్రాయు వని పేరుపెట్టెను. భద్రాయువు యొక్క తండ్రిని మగధరాజు ఓడించి రాజ్యము లాగుకొనఁగా నీ భద్రాయువు మాగధునోడించి మఱలఁ దండ్రికి రాజ్యము నప్పగించెను.

వాని వివాహమగుసమయమునకు వజ్రనాభుఁడును వచ్చి భద్రాయువు తన కుమారుఁడగుటయును, సుమతి జీవించియుండుటయును దెలిసికొని మఱల వీనిని సగౌరవముగాఁ దీసికొనివచ్చి రాజ్యము నిచ్చెను. బ్రహ్మ.

సుమతి:-ఒక సాధువు. ఇతనిపేర నొక కవి నీతులు బోధించు పద్యములు వ్రాసెను.

సుమదుఁడు:-విశ్వామిత్త్రుని నూర్గురు కొడుకులలో మొదటి యేఁబదిలోనివాఁడు. శునశ్శేఫుని నన్నగా నెంచుటకు నిరాకరించి తండ్రిచే శపింపఁబడెను. భాగ.

సుమనసుఁడు:-ఊరుని కుమారుఁడు. మత్స్య.

సుమాలి:-సుకేశిపుత్త్రుఁడు. మాలి,మాల్యవంతుఁడు ఇతనిసోదరులు. ఇతఁడును, సోదరులును భోగమును, వైభవమునుబొందఁగోరి బ్రహ్మనుగూర్చి తపస్సుచేసి యాతనివలన వరములు గైకొని గర్వించియుండువారు. వీరు విశ్వకర్మ నిర్మించిన లంకాపట్టణములో నుండువారు. సుమాలి నర్మద యను గంధర్వపుత్త్రికయైన కేతుమతిని వివాహమయ్యెను. ప్రహస్తుఁడు, అకంపనుఁడు, వికటుఁడు, శకటీముఖుఁడు, ధూమ్రాక్షుఁడు, దండుఁడు, సుపార్శ్వుఁడు, సంహ్రాది, ప్రఘసుఁడు ఇతని కుమారులు. రాల, పుష్పోత్కట, కైకసి, కుంభీనస ఇతనిపుత్త్రికలు. సుమాలియు మాలితోఁ గలసి ఇంద్రలోకము మీఁదకు యుద్ధమున కేగెను. గరుత్మంతుఁడు మాలిని జంపెను. ఇతఁడు భయపడి రసాతలమునకుఁ బాఱిపోయెను. రావణుఁడు బ్రహ్మకడ వరము పుచ్చుకొని వచ్చినపిదప నతనికడ కేగి, రావణా! మేము పూర్వము లంకయందుండువారము. మమ్ము దేవతలు వెడలఁగొట్టిరి. ఇపుడు లంకలోఁ గుబేరుఁడున్నాఁడు. లంకను నీవు గైకొనుము అని చెప్పెను. రావణుఁడు కుబేరుని వెడలఁగొట్టి రాక్షసుల నందుఁ బ్రవేశపెట్టెను. అపుడు సుమాలియు లంకలోఁ జేరెను. రామా

సుమాలిని:–సారస్వతపురము రాజైన వీరవర్మ కూఁతురు. ఈమెకు యుక్తవయస్సురాఁగా నెవ్వరిని వరించెదవని తండ్రి యడిగెను. వరుల నెప్పుడో యొకప్పుడు యముఁడు గొనిపోవును గదా! కావున వీరినిగోరి దుఃఖము నొందనేల? ... మునినే వివాహ మయ్యెద నని ... మె చెప్పెను. ఈమె యమునిని గూర్చియే వ్రతములు సల్పుచుండెను. ఈ వృత్తాంతము నారదుఁడు యమునితోఁ జెప్పెను. యముఁ డచిరకాలములో వచ్చుచున్నాడని తెలియఁజేసి వరరూపమున వచ్చి, సుమాలిని యనునామెను వివాహమయ్యెను. అతఁడు నీకేమి కావలయునని యడుగఁగా నాకు శ్రీకృష్ణుని పాదాంబుజ దర్శనముతప్ప నొండేమియు నక్కఱలేదని యీమె చెప్పెను. ధర్మజుని యజ్ఞాశ్వము సారస్వతనగరమునకు రాఁగా వీరవర్మ దానిని గట్టెను. కృష్ణార్జునులు వచ్చి యుద్ధముచేసిరి. అపుడు శ్రీకృష్ణుని నీమె దర్శించెను. జై. భా.

సుమాల్యుఁడు:–మహాపద్మని కుమారులలో నొకఁడు. ఇతఁడును, నితనిసోదరు లేద్వురును ధరణిని బరిపాలించిరి.

సుమిత్త్రి:–దశరథుని భార్య. దశరథుఁడు యజ్ఞభాగమును గౌసల్యా కైకలకే యిచ్చెను. వారు చెరియొక సగము నీమె కిచ్చిరి. ఈమెకు లక్ష్మణ శత్రుఘ్నులు పుట్టిరి. రామా.

సుమిత్త్రుఁడు:– ఒక రాజు. వేఁటకేగి యొక మృగముపైన బాణమును వేయఁగా నది బాణముతోనే పరుగెత్తెను. దానివెంటనే యితఁడును బరువెత్తి పరువెత్తి డస్సి యొక ఋషివాటికనుజేరెను. అందు ఋషభుఁడనుఋషి యాతిథ్యమిచ్చి వచ్చినకారణము నడిగెను. మృగమం దాశవలన వచ్చితి ననెను. తాను పూర్వము "తీర్థయాత్రలుచేసి తనుఁడను ఋషి యాశ్రమమునకుఁబోఁగా నచ్చటికిఁ బుత్త్రినిఁ గోల్పోయివచ్చిన వీరద్యుమ్నుఁడను రాజునకు ఆశసన్నిధికిఁ బోకుండుటయే సుఖమని చెప్పిన సంగతులు" చెప్పెను. భార.

సుమిత్త్రుఁడు:–ఒక ముని. ఇతనిమిత్త్రుఁ డంగిరసుఁడనువాఁ డితనికి గోళర్కర నిచ్చెను. దానితో నితఁడు తన గోవును మేపెను. అదియు నొక వృషభంబు పొందువడసి గర్భిణి యయ్యెను. దాని సంతానము వృద్ధిచెందెను. సుమిత్త్రుఁడు గోవులను గాచుచు, వానిని మేపుచు లేఁగలు పాలుత్రాగిన పిమ్మట గోస్తనమునయున్న ఫేనముమాత్రము త్రావి యుండును. దానిచే నతనికి ఫేనపుఁడు అను పేరు కలిగెను. ఒక కాలమునలో మనుష్యస్త్రీ రూపములు ధరించి జలకము లాడుచున్న గోవులను జూచి సుమిత్త్రునిగోవులు మనుష్యభాషణముతో "మీకీ రూప మెట్లు వచ్చినది? మే మెట్లు పొందఁ గలవార" మని యడిగెను. "రంతిదేవుఁడు యాగము చేయఁబోవుచున్నాఁడు. మీరందు యజ్ఞపశువులు కండు" అని వారు చెప్పిరి. సుమిత్త్రునియాధీనమం దుండుటచే నతని సెలవు లేక పోరాదని యొక గోవు చెప్పఁగా వానిని వధింతుమని కొన్నికపిలగోవు లనెను. కామరూపిణులైన యా గోవులు రూపాంతరమున వానిచెంతకేగి మేము గోమాతలము. నీవు చేయు గోసమారాధనలకు మెచ్చితిమి. వర మిచ్చెద మనఁగా "ఇప్పటియట్లు గోవులవల్లనే భక్తి స్నేహంబులు కలుగునట్లు" వరమును గోరెను. అవి యిచ్చితిమనియును, ఈ లోక మేల? గోలోకమునకు రమ్మనియును జెప్పెనవి. అది యెట్లనఁగా నవి సుమిత్త్రునిఁ దమ యోగబలముచేత వాని చైతన్యమును బాపి వాని కళేబరమును నేలపైవేసి త్రొక్కి మఱలఁ బైకెత్తి క్రిందఁబడవైచి కొమ్ములతో డను, డెక్కలతోడను బొడిచి పిండిపిండిగఁ జేసెను. సుమిత్త్రుఁడు గోలోకమున కరిగెను. అచ్చట నుండి కొన్ని గోమాతలువచ్చి నుదతులై విహరించు గోవులయొక్కయు వృత్తాంత మెఱింగించెను. భార.

సుమిత్త్రుఁడు:–ఋణకుని కుమారుఁడైన సురథుని తనయుఁడు. వీనితో సూర్యవంశ మంతరించెను. భాగ.

సుముఖుఁడు:– ఆర్యకుఁ డను భుజంగరాజు మనుమఁడు, చికురునికుమారుఁడు. చికురుని గరుత్మంతుఁడు చంపి, యిఁక నెలలోగా సుముఖునిఁ గూడఁ జంపెదననియె. ఆలోపుననే మాతలి తనకూఁతును గుణకేశిని నితనికిచ్చి వివాహము చేయుదునని వచ్చెను. ఇతఁడు చిరకాలము జీవింపఁడు గావున నితనికి వివాహము చేయవని యార్యకుఁడు చెప్పెను. మాతలి యింద్రునిఁ

ప్రార్థించి సుముఖునిఁ జిరజీవితునిగఁ జేసెను. ఇతనికి గుణకేశిని నిచ్చి వివాహముచేసిరి. భార.

సుముఖుఁడు:-ఒక విద్యాధరుఁడు. ఇతఁడొకనాఁడింద్రునిఁ జూచి వచ్చుచుండఁగా బూర్వకర్మముచే నితనిముఖము పులిముఖ మయ్యెను. వీనిని భృగుమహర్షి చూచి యేలయిట్లుంటివి ? నీవెవరవని యడిగెను. సుముఖుఁడు తన వృత్తాంతము చెప్పికొనియె. మాఘమాసములో నేకాదశినాఁడుపవసించి ద్వాదశినాఁడు తలంటుకొనుటచే నిట్టిరూపము నీకు వచ్చినదని భృగుమహర్షి చెప్పెను. పద్మ.

సుమేధుఁడు:-వరమిత్రుఁడను బ్రాహ్మణుని కుమారుఁడు. ఇతనికిని, ఇతని మిత్రుఁడగు సోమవంతునకును నుపనయనమును గావించి, వేదాభ్యాసము చేయించి ధనార్జనమునకై తండ్రి యా దేశపు రాజును జూచుటకు వెళ్ళుఁడని చెప్పెను. వారు రాజుకడకుఁ బోఁగా "సీమంతిని దంపతులకు విశేషముగ దానములు చేయుచున్నది. మీరును దంపతులవలె వేషమువేసికొని పొందు" అని యా రాజు చెప్పెను. ఆ మాటలువిని యాశపడి సుమేధుఁడును, సోమవంతుఁడును భార్యాభర్తల వేషమున సీమంతినికడకుఁ బోయిరి. ఆమె వీరిని నిజముగ దంపతులుగ భావించి కానుకలిచ్చెను. కాని స్త్రీవేషమున నున్నవాఁడు నిజముగ స్త్రీయయ్యెను. అందుకు వీరును, వీరి తండ్రియు దుఃఖమునొంది తమ కుపాయము చెప్పవలయు రాజుతోఁ జెప్పికొని నీవలన నిట్లైనదని పలికిరి. అతఁడు శివునిఁ బ్రార్థించెను. కాని సీమంతిని యట్లు భావించుటచే వానికి స్త్రీత్వము తప్పదయ్యెను. స్కాం. బ్ర.

సుయజ్ఞుఁడు:- ఉశీనరదేశపు రాజు. ఇతఁడు యుద్ధములోఁ జంపఁబడఁగా నీతని భార్యలు శవముపైఁబడి యేడ్చుచుండిరి. యముఁడు బాలరూపమునవచ్చి వారికి జనన మరణములను గూర్చి బోధించెను. భాగ.

సుయజ్ఞుఁడు:- విష్ణుమూర్తియే రుచిప్రజాపతికి ఆకూతియందు దీపేరునఁ బుట్టెను. ఇతఁడు దక్షిణ యన్ను నతివను వివాహమయ్యెను. సుయమ నామదేవతలను గనియెను. సకలలోకములందలి యార్తిని హరించెను. భాగ.

సుయశ:-అసశ్వని కుమారుఁడగు పరీక్షిత్తుయొక్క భార్య. ఈమెకుమారుఁడు భీమసేనుఁడు. భార.

సుయశ:-నందికేశ్వరుని భార్య.

సుయశస్సు:-అశోకుని కుమారుఁడు. ఇతని కుమారుఁడు సంయతుఁడు. భాగ.

సురథుఁడు:- సుదేవుని పుత్రుఁడు. శ్వేతుని తమ్ముఁడు. శ్వేతునిపిదప నితఁడే విదర్భనేలెను. ఉ. రా.

సురథుఁడు:- శక్తిమతి యను పట్టణముయొక్క రాజు. శ్రీరాముఁ డశ్వమేధము చేయుచు నశ్వమువెంట హనుమంతునిఁ బంపెను. అశ్వమితని పట్టణమునకు వచ్చినపుడు సురథుఁడు దానిం బట్టుకొని బంధించెను. ఆ యశ్వమును విడిపించుటకు హనుమంతుఁ డితనితోఁ బోరెను గాని వానింగూడ సురథుఁడు బంధించెను. అపుడు శ్రీరాముఁడేవచ్చి విడిపించెను. జై.భా.

సురథుఁడు:- ఒక రాజు. శత్రువులవలనఁ దరుమఁబడి వనమునకేగి సుమేధుండను మునియొక్క యాశ్రమమును జేరెను. అతనిచే బోధితుఁ డయ్యెను. సమాధి యను వర్తకుఁడు కూడఁ దన భార్యాపుత్రులచే వెడలఁగొట్టఁబడి యిక్కడికే వచ్చెను. వీరిరువురును మిత్రులైరి. వీరికి దేవిని నారాధించువిధమును సుమేధుఁడు తెలిపెను. సురథుఁ డా దేవిని సమారాధించి మఱలఁ దనరాజ్యమును గైకొనెను. వర్తకుండు మాత్రము భాగ్యమును గోరక మోక్షమునేకోరి సఫలుండయ్యెను. దే. భా.

సురథుఁడు:-స్వారోచిష మన్వంతరమునఁ జైత్రుండను రాజువంశమునఁ బుట్టిన రాజు. ఇతఁడు శత్రురాజులచే నోడింపఁబడి యడవులకేగి దుఃఖించుచుండెను. సమాధి యను నొక వణిజుఁ డితనిని జూచి నీవేల దుఃఖించెదవని యడిగి తాను ధనలోభులైన తనకుమారులచే వెడలఁగొట్టఁబడుట చెప్పెను. వీరొక మునిని సందర్శించి వానిని సేవింపఁగా, నతఁడు దేవినిఁ బ్రార్థింపుఁడు, మీవాంఛితములు చేకూరుననియె. సురథుఁడు దేవిని గూర్చి తప మొనరించి జన్మాంతరమున సావర్ణిగ బుట్టి మనువయ్యెను. మార్క.

సురథుఁడు:-హంసధ్వజుని రెండవ కుమారుఁడు.
అన్నిటికంటె సత్యమునే యెక్కువగఁ బాటించు
వాఁడు. హంసధ్వజుఁడు ధర్మజుని యాగాశ్వ
మును గట్టిపెట్టినపు డతనికిని, నర్జునునకును
యుద్ధము జరిగెను. అందితనియన్న సుధన్వుఁడు
చనిపోయిన తరువాత నితఁడు యుద్ధముచేయఁ
గడంగెను. ఇతఁడు విరథుఁడైనను, హస్తములు
తెగిపోయినను బోరుచునే యుండెను. తుదకు
వీని శిరమునుగూడ నర్జునుఁడు ద్రుంచివైచెను.
ఈ బాలుఁడు సత్యవ్రతుఁడగుట శ్రీకృష్ణుఁ
డెఱుంగును. కావ వాని శిరమునకు నమస్క
రింపుమని యర్జునునితోఁ జెప్పి గరుత్మంతునిఁ
బిలిచి యా శిరమును బ్రయాగలో వేసిరమ్మని
పంపెను. శివుఁ డా శిరమును దీసికొని తన
కంఠమాలయందుఁ దాల్చుకొనెను. జై. భా.

సురభి:-దేవతల గోవు. దేవతలందఱును ఆఁకలి
పొంది బ్రహ్మకడ కేగిరి. అతఁడు వారి కమృత
మొసంగెను. ఆ సురభిత్వ సంపదచేత సురభి
పుట్టెను. దాని సంతానమే యెల్లయెడల
వ్యాపించెను. సురభికి మార్తాండునివలన నేకా
దశ రుద్రులు జన్మించిరి. దుర్బలములైన వృషభ
ములనుగూడ బలముగలవానితోఁ బూన్చి యవి
భారమును వహింపలేక యున్నచో వానిని
ములుకోలలతోఁ బొడిచి జనులు భారము
మోయించుచుండుట సురభి చూచి దుఃఖించి
ఇంద్రునితోఁ జెప్పికొనియెను. అతఁడు వర్ష
ములు కురిపించి గడ్డిమొలపించి వానికి బలము
నిత్తుననియె. భార.

సురభి:-విశ్వకర్మ తపోనియతుఁడై యజ్ఞార్థము
గాను, మోక్షార్థముగాను, నమృతమయమూర్తి
యును, గామరూపిణియునగు నొక కన్యకను
దన మనోవృత్తిచేఁ గల్పించెను. ఆమెయే
సురభి. మఱియు నతఁడు తేజోమయుఁడగు
నొక పురుషునిగూడ సృజించెను. ఇతఁడు
మార్తాండుఁడు. సురభియందు మార్తాండునకు
నేకాదశరుద్రులు జన్మించిరి. మఱియును వీరికి
జన్మించిన సౌరభేయములకు యాగాపవర్గార్థ
క్షీరజనకంబులై బ్రహ్మలోకంబుపై నివసించు
నట్లు బ్రహ్మ వరమిచ్చెను. భార.

సురస:-మహాసురుఁడను రాక్షసునికూఁతురు. ఈమె
శుక్రాచార్యునియొద్ద మాయవిద్యలను నేర్చు
కొనెను; కావున శుక్రుఁ డీమెకు మాయ యను
పేరుపెట్టెను. రాక్షసులను బుట్టింపుమని గురుఁ
డీమె కానతిచ్చెను. సురస తండ్రియనుమతి
పొంది తనవిద్యచే మాయానగరమొకటి నిర్మించి
తాను మనోహరరూప యౌవనయై యందుండెను.
కశ్యపుఁ డీ సుందరాంగిని జూచి మోహించెను.
అతనివలన నామెకు శూరపద్మ సురుఁడు,
తారకుఁడు, సింహవక్త్రుఁడు అను కుమారులును;
అజముఖి యను కూఁతురును బుట్టిరి. స్కాంద.

సురస:-(ఒక నాగమాత) ఆంజనేయుఁడు సముద్ర
మును దాటుచుండఁగా నితఁడు లంకకుఁబోయి
సీతను వెదుకగలఁడో లేఁడో పరీక్షించుట
కీమెను దేవతలు పంపిరి. హనుమంతునిమార్గమున
కడ్డముగ వచ్చి సురస మార్గావరోధము
కావించెను. ఈమెకంటె పెద్దశరీరము హను
మంతుఁడు పెంచెను. ఈమె వానికంటె విజృం
భించెను. అంతట హనుమంతుఁడు సూక్ష్మ
రూపుఁడై యీమెగర్భముఁజొచ్చి బయటకు
వచ్చెను. రామా.

సురాపానము:-మహాపాతక మగునని శుక్రుఁడు
తాను గచునిభస్మము కలసిన సురను బానముచేసి
నపుడు శపించెను. అప్పటినుండియు నిది పాతక
మయ్యెను. (చూడుము శుక్రుఁడు.) భార.

సురాష్ట్రుఁడు:-ఒకరాజు. వీనికి నూర్గురు భార్యలు
కలరు. వారిలో ఉత్పలావతియనునామె పట్ట
మహిషి. ఇందఱు భార్యలుండినను అతనికి
సంతానము కలుగకపూర్వమే వారు చనిపోయిరి.
మఱియు విమర్థుఁడను శత్రురాజువచ్చి సురాష్ట్రు
నోడించి వానిని నగరమునుండి వెడలఁగొట్టెను.
ఇతఁడొకనాఁ డరణ్యములోఁ బోవుచుండఁగా
నేండ్లు పూండ్లు నేకమగునట్లు వర్షము కురిసెను.
వనమంతయు నంధకారము గ్రమ్మెను. ఆ
చీఁకటిలో నితఁ డొక యేటఁబడి యీఁదుకొని
పోవుచుండెను. అం దితనిచేతి కొక లేడి
తగిలెను. ఇతఁ డా లేడితోఁకను బట్టుకొని
పోవుచుఁ దన చేతితోఁ బుచ్ఛమూలమును

దాకుచుండెను. అంత నా లేడి మనుష్యభాషణముల "ఓ రాజా! నీవు పొందరానిచోటుల నేల కామము పొందెదవు?" అని యడిగెను. దాని మాటల కితఁ డాశ్చర్యమునొంది నీవృత్తాంత మేమని యడిగెను. ఆలేడి తాను సురాష్ట్రుని పట్టమహిషియగు నుత్పలావతియగుటయు, శాపవశమున నిట్లగుటయుఁ జెప్పెను. సురాష్ట్రునిచే దాని పుచ్ఛమూలము తాఁకబడుటచేతనే యది గర్భవతి యయ్యెను. మార్క.

సురుచి:- ఉత్తానపాదుని భార్య. ఉత్తముని తల్లి. ధ్రువునకు సవతితల్లి. ఒకనాఁ డుత్తానపాదుని తొడయం దీమెకుమారుఁడు కూర్చొనియుండగా ధ్రువుఁడును వచ్చి తండ్రియొక్క రెండవ తొడమీఁద గూర్చుండఁబోయెను. అందుకు నీవు తగవని యీమె ధ్రువునిఁ ద్రోసివేసెను. ఆ రోషముచేతనే ధ్రువుఁడు తపమున కేగెను. ఈమె కుమారుఁడగు నుత్తముఁడు వివాహము లేకయేయుండి మృగయార్థము వనమున కేగఁగా యక్షులు వీనిని జంపిరి. భాగ.

సురేణువు:- మయుని భార్య. బ్రహ్మ.

సులక్షణ:- కాశీనగరమున నుండిన ప్రియవ్రతుఁ డనువాని కుమారిత. ఈమెతల్లి శుభవ్రత. ఈబాల కన్యగండమునఁబుట్టెనను చింతచే నీమె తండ్రి మరణించెను. పిమ్మట నీమెతల్లి మరణించెను. తల్లిదండ్రులుపోయిన దుఃఖముచే సులక్షణ ఉత్తరార్కునికడ కరిగి శివునిఁగూర్చి ప్రార్థించెను. ఆమె ధ్యానముచేయునపుడు సదా మేఁక యొకటి యామెచెంగటకు వచ్చి నిలుచుండెడిది. ఈమెకు శివుఁడు ప్రత్యక్షమై వరము వేఁడుకొను మనఁగా నీమె ముందుగా నీమేఁకకు వరమొసంగి, పిమ్మట నాకిమ్ము అని పలికెను. ఆ మేఁక కాశీరాజు కూఁతురుగఁ బుట్టునట్లు శివుఁడు వరమిచ్చెను. సులక్షణ శివునివరమువలనఁ బార్వతి చెలికత్తెలలో నొక్కతె యయ్యెను. ఈమెవలన బర్కరమునకు (మేఁకకు) వరము వచ్చినచోటు గాన, ఉత్తరార్కమునకు బర్కరీతీర్థమని పేరు వచ్చెను. కాశీ.

సులభ:- పరమతత్త్వార్థమెఱిఁగిన ఒకవనిత. సుందరాకారయైన సన్యాసివలె ఈమె జనకమహారాజు సభకువచ్చి యాతనితో వేదాంతవిషయములను వాదించెను.

వానిని బరీక్షింపఁగోరి తనయొక్క బుద్ధిబలముతో వానిమనస్సులోఁ బ్రవేశించెను. భార.

సువర్చల:- పరమేష్ఠి భార్య. ఈమె కుమారుఁడు ప్రతీహుఁడు. భాగ.

సువర్చల:- హనుమంతుని భార్య.

సువర్ణ:- సుహోత్రుని భార్య. హస్తితల్లి.

సువర :- గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు.

సువర్ణ:- అగ్ని కుమారిత. అగ్ని శివునివీర్యమును ధరించెను. (చూడుము అగ్ని.) పదపడి యగ్ని తన భార్యయగు స్వాహాదేవియందు దానిం గొంత యాధానముగావించెను. అగ్ని శివుల వీర్యములు కలసి స్వాహాగర్భమందు ఈ బాల జన్మించెను. కావున నీమె జారిణియయ్యె. కాని శివునికటాక్షమునఁ ద్వరలోనే సద్వర్తనము కలదయ్యెను. స్కాంద.

సువర్ణముఖి:- ఒక నది. దీనినే సువర్ణముఖరి యనియు నందురు. శ్రీ కాళహస్తి పుణ్యక్షేత్రముదగ్గర నున్నది. అగస్త్యుఁడు దక్షిణ కాశిని సేవింపవచ్చి యట నది లేకుండుటఁజూచి శివునిని బ్రార్థించి యట కాకాశగఁగను దెప్పించెను. అది సువర్ణచ్ఛాయలతోను, ధ్వనులతోను వచ్చుటచేత సువర్ణముఖి, సువర్ణముఖరి యను పేరులు వచ్చెను. శ్రీకాళహస్తి.

సువర్ణష్ఠీవి:- సృజయుని కుమారుఁడు. ఇతఁడు నారదుని వరమువలనఁ బుట్టెను. ఇతని మూత్రపురీషాశ్రుస్వేదములు సువర్ణమయములు కాఁగల పుత్త్రుఁడు కావలెనని రాజుకోరుటచే నారదుఁ డట్లనుగ్రహించెను. పర్వతుఁ డీబాలుఁడు అల్పాయుష్కుఁడగునని పలికెను. ఈ బాలుని నిష్ఠీవనాదులు (ఉమ్మి మొదలగునవి) బంగారు మయమగుటచే వానికి సువర్ణష్ఠీవి యని పేరుపెట్టిరి. వాని శరీరమున నమితమగు బంగార ముండునని తలఁచి చోరులు వీనిని సంహరించి శరీరమంత యునుబరిశీలించిరి. పాపకర్మవశమున నాచోరులు

పరస్పరము కొట్టుకొని మరణించిరి. సృంజయుఁడు నారదుని దలఁచుకొనెను. నారదుఁడు యమలోకమునకేగి యటనున్న యీ బాలుని దెచ్చి సృంజయున కిచ్చెను.

మఱియొకసారి తనకంటె నితఁడు గొప్పవాఁడగునని ఇంద్రుఁడు భయపడి తన వజ్రమును "శార్దూలరూపముతోఁబోయి వీనినిఁ జంపు" మనెను. సృంజయుఁడు భార్యాపుత్త్రులతో గూడి గంగాతీరమున విహరించుచుండఁగా శార్దూలము వీనిని జంపెను. సృంజయుఁడు మఱల నారదునిఁ దలఁచుకొనెను. అతఁడు మఱల వీనిని బ్రతికించెను. ఈ సువర్ణష్ఠివి పెక్కేండ్లు రాజ్యముచేసెను. భార.

సువర్ణుఁడు:-శివునివీర్యమును స్వాహాదేవియొక్క గర్భమందు అగ్ని యుంచుటచేఁ బుట్టిన కుమారుఁడు. బ్రహ్మ.

సువేగుఁడు:-భద్రావతి నగరాధిపతియైన యౌవనాశ్వుని కుమారుఁడు. వీరియశ్వమును గొని పోవుటకు భీముఁడురాఁగా నతనితో యౌవనాశ్వుఁడు యుద్ధముచేసి మూర్ఛనొందెను. సువేగుఁడుభీమునితోగదాయుద్ధముచేసెను. అన్యోన్యహతులై యిరువురు మూర్ఛనొందిరి. జై:భా.

సుశర్మ:-ఒక బ్రాహ్మణుఁడు. ఇతఁడు రాక్షసహననము దలఁచి క్రతువు చేయఁబోవుచుండగా దక్రతువు సల్పుట కనర్హునిఁగఁ జేయుటకై బలాకుఁ డను దనుజుఁడు సుశర్మ భార్యను అపహరించి యొకచో దాఁచెను. సుశర్మ రాజగు నుత్తమునికడకు వచ్చి తన భార్యను నెవ్వరో హరించిరని చెప్పి యామెను వెదకి యిమ్మని వేఁడెను. ఆమెకంటె సుందమగుదానిని వేఱొకదానిని వివాహమగుమని రాజుచెప్పెను. కాని రూపవతి యైనను, గాకుండినను భార్య భర్తచేఁ బోషింపఁబడవలయు ననియు, భార్య లేనివాఁడు కర్మార్హుఁడు కాఁడనియు నితఁడు చెప్పెను. రా జితనిభార్యను వెదకుటకై బయలు వెడలి త్రికాలజ్ఞుఁ డను మునివలన నామె యెచ్చట నుండినదియు గ్రహించి యచ్చటికేగి సుశర్మభార్యను సుశర్మ కిప్పించెను. ఆ కృతజ్ఞతచే నితఁడు రాజుచేత మిత్త్రకామేష్టిచేయించి యతని భార్య దౌశ్శీల్యమును హరింపజేసెను. మఱియు రాజభార్యయగు బహుళను దాఁచి యందువలన మూకీభావము పొందునట్లు శపింపఁబడిన నందయొక్క మూకీభావము పోవుటకై యితఁడు సరస్వతీక్రతువు చేసెను. మార్క.

సుశర్మ:-కర్ణునిపుత్త్రుఁడు. యుద్ధములో వీనిని నకులుఁడు సంహరించెను. భార.

సుశర్మ:-త్రిగర్తదేశాధీశ్వరుఁడు. సత్యవ్రతుఁడు. సత్యకర్ముఁడు, సత్యవర్ణుఁడు వీని సోదరులు. వీరు దుర్యోధనుని మిత్త్రులు. అజ్ఞాతవాసమున నున్న పాండవులను గుర్తెఱుంగుట కితఁ డాలోచనచేసి విరటునిగోవులను బట్టుకొనుటకు ముందుగఁ దనను బంపుమనియు, విరటుని నగరములో నిజముగ భీమాదులే యుండినచోఁ దనతోఁ బోరుటకు వత్తురనియు, నపుడు వారిని గుర్తింప వచ్చుననియు దుర్యోధనునితో జెప్పెను. పూర్వ మితనిని విరటుఁ డోడించి యుండెను. ఆ పగ తీర్చుకొనుట కవకాశము గలిగినదని సంతసించి విరటునిగోవులను బట్టుట కితఁడే ముందుగఁ బోయెను. అతఁడు సరేయని వీనిని సేనతోఁ బంపెను. సుశర్మ విరటు నోడించి వానిందెచ్చి తన రథమునం దుంచెను. ఇతనిని విడిపించుటకై ధర్మరాజు భీమునిఁ బంపెను. భీముఁడు వచ్చి సుశర్మ నోడించి వానిని ధర్మరాజుకడకుఁ లాగికొనిపోయెను. కాని ధర్మజుఁడు వీనిని వదలుమనియె. భారతయుద్ధమున వీని నర్జునుఁడు సంహరించెను. భార.

సుశర్ముఁడు:-కణ్వవంశజుఁడు. ఒక రాజు. ఇతని భృత్యుఁడు ఆంధ్రజాతీయుఁడైన వృషలుఁడను వాఁడు ఇతనిని జంపి రాజ్యమును గైకొనెను. భాగ.

సుశాంతి:-ఇతఁడుత్తమ మనువుకాలమున నింద్రుఁడయ్యెను. మార్క.

సుశీల:-కాశియందున్న హరిస్వామి యను బ్రాహ్మణుని కుమారిత. ఈమె సదా ఈశ్వరునికొలుచుచుండెడిది; మిక్కిలి రూపసి. ఈమెరూపమునకు వలచి యీమెను విద్యాధరుఁ డెత్తుకొని

పోయి మలయపర్వతమున నుంచెను. అప్పుడే యీమెను విద్యున్మాలి యను రాక్షసుఁడు చూచి కామించి యీమెకై విద్యాధరునితోఁ బోరాఁడెను. వారిద్దఱును జచ్చిరి. తన నాలింగనముచేసి తీసికొనివచ్చినవానినే యీమె భర్తగా దలఁచి యాతఁడు మరణించెనుగాన నికఁ దాను జీవింపఁజాలక యగ్నికల్పించుకొని తరువాతి జన్మంబునఁగూడ ఆ విద్యాధరుఁడే భర్త యగునట్లు కోరుచు అగ్నిలోఁ బ్రవేశించెను. ఈ సుశీలయే కళావతి యను కన్యకగ జన్మించెను. విద్యాధరుఁడు మలయకేతుఁడను రాజుగ జన్మించెను. మలయకేతునకు గళావతి భార్య యయ్యెను. ఈమెకుఁ బూర్వజన్మజ్ఞానముకూడ గలదు. కాశీ.

సుశోభన:—ఆయువను మండూకరాజు కుమారిత. ఈమె మనుజస్త్రీరూపమున వచ్చి రాజులను మోహపెట్టుచుండును. పరీక్షిత్తు అను రాజీమెను వేఁటకు వెళ్ళినప్పుడు వనములోఁ జూచి మోహించి తన యభిప్రాయ మెఱింగించెను. ఈమె నెప్పుడు జలమునందు దింపనని రాజు శపథముచేసినేని యా రాజును వివాహమగుదునని యామె ప్రత్యుత్తర మిచ్చెను. సుశోభనయుఁ, బరీక్షిత్తును గాపురముచేసిరి. ఒకనాఁడీమెను బరీక్షిత్తు తన శపథముమఱచి తనతోఁ గొలనునకుఁ దీసికొనిపోయి అందు దిగినతోడనే యీమె కనఁబడకుండఁ బోయెను. ఆకొలనులో నున్న కప్ప లీమెను సంహరించినవని యనుకొని రాజు కప్పలను జంపఁజొచ్చెను. ఆయువు బ్రాహ్మణ రూపమున రాజుకడకుఁ బోయి, కప్పలను జంపుట మానుమని ప్రార్థించెను. తాను కప్పలరాజు ననియును జెప్పికొనెను. వానిభార్యగ నున్నది తన కూఁతురని చెప్పెను. ఈమెను దెప్పించి యిమ్మని రాజు కోరఁగా వెంటనే యీమెను రప్పించి రాజున కిచ్చి యిట్లీమె యనేకరాజులను మోసగించెను గాన నీమె కుమారులు కపటవర్తను లగుదురని శపించెను. ఈమెను బరీక్షిత్తు స్వీకరించి యీమెయందు శలుఁడు, దలుఁడు, నలుఁడుఅను పుత్త్రులను బడసెను. భార.

సుశ్రవ:—గాంధారిలోఁబుట్టువు; ఈమెను గూడ ధృతరాష్ట్రుఁడు వివాహమయ్యెను. భార.

సుశ్రవస:—జయత్సేనుని భార్య. అవాచీను [illegible] భార.

సుషేణుఁడు:—గాంధారీ ధృతరాష్ట్రుల పుత్త్రుఁడు. భార.

సుషేణుఁడు:—వానరరాజు. తార తండ్రి. సీతను వెదకుటకై పడమటదిశకు వెళ్ళెను. రామా.

సుషేణుఁడు:—జమదగ్ని పుత్త్రుఁడు. తల్లిని వధించుమని జమదగ్ని వీని నాజ్ఞాపించెను గాని మాతృవధ చేయనని యతఁడు నిరాకరించెను. వీనిని తండ్రి శపించెను. కాని పరశురాముఁడుకోరగా శాపవిముక్తునిగఁ జేసెను. భార.

సుహోత్రుఁడు:— విజయయందు సహదేవునకుఁ బుట్టిన కుమారుఁడు. భార.

సుహోత్రుఁడు:— క్షత్రవృద్ధుని కుమారుఁడు. కాశ్యుఁడు, కుశుఁడు, కృత్స్నమదుఁడు ఇతని కుమారులు. భాగ.

సుహోత్రుఁడు:— (బ్రహ్మక్షత్త్రుని) భుమన్యుని కుమారుఁడు. ఇతనిభార్య సువర్ణ. హస్తినాపురము నిర్మించిన హస్తి యితని కుమారుఁడే. ఇతనిరాజ్యమున బంగారుచేఁపలతోడ వర్షము కురియుచుండెడిది. వాని నితఁడు ధనార్థుల కిచ్చువాఁడు. సుహోత్రుఁ డనేక రాజసూయములు చేసి దానములు చేసెను. భార.

సూ

సూతుఁడు:— పృథుచక్రవర్తి పితామహసంబంధమైన యజ్ఞములు చేయుచుండఁగ హరియు వచ్చి పౌరాణికుఁడై సూతుఁడనుపేరఁ బరగెను. అతనిసంతతివారి కందఱికి ఈ పేరే వచ్చెను.

సూతుఁడు:— రోమహర్షణుని పుత్త్రుఁడగు ఉగ్రశ్రవసుఁడు. ఇతఁడే శౌనకాదులకు సకల పురాణకథల నెఱింగించెను.

బ్రహ్మ. భాగ.

ఒకనాఁ డితఁడు పురాణ కథలు చెప్పు చుండఁగా బలరాముఁడు వచ్చెను. అతనిని జూచియు సూతుఁడు లేవలేదు. బలరామునకుఁ గోపమువచ్చి వీనినిసంహరించెను. కాని యచ్చటి మునులు వేఁడఁగా బలరాముఁడు సూతుని మరల బ్రతికించెను. మార్క.

సూనృత:-ధర్ముని పుత్త్రిక. ఉత్తానపాదుని భార్య. ఈమెకు ధ్రువుఁడు, కీర్తిమంతుఁడు, ఆయుష్మంతుఁడు, మహాద్యుతి అను కుమారులు కలిగిరి. హరి.

సూరిశర్మ:-శివదత్తుఁడను బ్రాహ్మణుని నాల్గవ కుమారుఁడు. ఇతఁడొకనాఁ డడవిలో సమిధలు కోయుచుఁ బులి యొకటి మృగమునుబట్టి సంహరించుట చూచి, భయపడి పరుగిడి వచ్చుచు రాళ్ళమీఁదఁ బడియెను. పులినోటఁ బడిన మృగినే తలఁచుకొనుచు నితఁడు ప్రాణములు విడిచెను. ఆ కారణమున నితఁడు మృగమై తిరిగి జన్మించెను. పులిచేతఁ జచ్చినలేడియుఁ దిరిగి మృగి యయ్యె. ఆ మృగమున కిది పెంటి యయ్యె. ఒక వ్యాధుఁ డీ మృగములను జంపఁ బోఁగా నవి పాఱిపోయెను; అందువలన నలసి యొక కొలనులో నీరుద్రాగుచుండెను. ఆకొలను కడకే పరశురాముఁడుకూడ వచ్చెను. ఇతనిని జూచి మృగము "మనకిఁక భయములేదు; ఇతఁడు పరశురాముఁడు. ఇతనితోఁగూడ నుండినవాఁడు అకృతవ్రణుఁడు. పరశురాముఁ డిపుడు శ్రీకృష్ణ కవచమునకై తపస్సు చేయఁబోవుచున్నాఁడు. కాని అగస్త్యాశ్రమమునకుఁ బోయి శ్రీకృష్ణ స్తోత్రము విననఁగాని యది లభింపదు" అని తన పెంటితోఁ జెప్పెను. పరశురాముఁ డా మాటలు విని యాశ్చర్యమునొంది అగస్త్యాశ్రమమునకు వెళ్ళుచుండెను. అతని వెనుకనే మృగములు వెళ్ళినవి. మార్గమందు వీనినిఁజంపవచ్చిన బోయ వాఁడు కనఁబడియె. వానిని బరశురాముఁడు వధించెను. మృగములుకూడ పరశురాముని వెనుకనే మునియాశ్రమమునకేగి శ్రీకృష్ణస్తోత్రము విని స్వర్గము చేరెను. బ్రహ్మ.

సూర్మి:-అనుహ్లాదుని భార్య. భాష్కలుఁడు, మహిషుఁడు ఈమె కుమారులు. బ్రహ్మ.

సూర్యదత్తుఁడు:-విరాటరాజు తమ్ముఁడు. యుద్ధములో ద్రోణుఁ డీతని సంహరించెను. భార.

సూర్యభానుఁడు:- కుబేరుని దౌవారికుఁడు. వీనిని దుత్తునియలుగఁ గొట్టి రావణుఁడు లోపలకుఁ బ్రవేశించెను. ఉ. రా.

సూర్యవర్మ:- త్రిగర్తదేశాధీశ్వరుఁడు. ధర్మజుని యాగాశ్వమును బట్టవలదని యశ్వమువెంట నరుగుచుండిన యర్జునుఁడు చెప్పుచున్నను వినక యితఁడును, నితనిసోదరులు కేతువర్మ, ధృతవర్మ మొదలగువారును బోరి యోడిరి. భార.

సూర్యసావర్ణి:- సూర్యునకు ఛాయయందుఁబుట్టిన కుమారుఁడు. ఇతఁడు మనువగును. నిర్మోహవారజ స్కాదులు ఇతని పుత్త్రులు. వీరు రాజు లగుదురు. సతపోవిరజోఽమృతప్రభులు దేవతలు. ఈ మనుకాలమున గాలవుఁడు, దీప్తిమంతుఁడు, పరశురాముఁడు, అశ్వత్థామ, కృపుఁడు, వ్యాసుఁడు, ఋశ్యశృంగుఁడు సప్తఋషులయ్యెదరు. బలి ఇంద్రుఁ డగును. భాగ.

సూర్యాపీడుఁడు:-కాశ్యయందు జనమేజయునకు బుట్టిన కుమారుఁడు.

సూర్యుఁడు:- అదితి కశ్యపుల కుమారుఁడు. (చూడుము మార్తాండుఁడు) ఇతఁడు రథమెక్కి మేరుపర్వతముచుట్టు తిరుగుచుండును. ఇతని సారథి అనూరుఁడు. హనుమంతుఁడు, యాజ్ఞవల్క్యుఁడు ఇతనికడ వేదశాస్త్రములు నేర్చుకొనిరి.

సూర్యునిభార్య విశ్వకర్మ కుమారితయైన సంజ్ఞ. ఆమెయం దీతనికి శ్రాద్ధదేవుఁడు (వైవస్వతుఁడు) పుట్టి మనువయ్యెను. సూర్యునితేజస్సు సహింపలేక సంజ్ఞ కన్నులుమూసికొనెను. తనను జూచి మూసికొనుటచే నితనికిఁ గోపమువచ్చి "నీకు సకలజనైక సంయమనుఁడైన సుతుఁడు పుట్టు" నని భార్యతోననెను. అందువలననామెకు యముఁడు పుట్టెను. పిమ్మట నామె చంచల దృష్టితోఁ జూచెను; ఇట్లు చూచుటచే నీకు

విలోలమైన కుమారిత పుట్టుననియెను. ఇతనివలన విలోలమైన యమునానది పుట్టెను. ఇఁక సంజ్ఞ సూర్యునకు భయపడి తనఛాయను వీనికడనుంచి యుత్తర కురుదేశములకేగి బడబరూపమున నుండెను. సూర్యుఁ డిది యెఱుఁగఁడు. ఛాయ యందు సూర్యునకు శని, సావర్ణి యనుపుత్త్రులును; తపతి యను కూఁతురును బుట్టిరి.

తనసవతితల్లి తననాదరించుటలేదని యముఁడు సూర్యునితోఁ జెప్పెను. అపుడు సూర్యుఁడు ఛాయనుజేరి యామెవృత్తాంత మారసి సంజ్ఞ బడబరూపమున నుండు టెఱింగి తానును అశ్వరూపముదాల్చి యామెకడ కేగెను. ఆమె భర్తను గుర్తించెను. వీరికలయికవలననే అశ్వినులుపుట్టిరి. మఱియు సూర్యున కపుడు శుక్లపాతంబయ్యెను. అందుండియే రేవతుఁ డేర్పడియెను. పిమ్మట సూర్యుఁడు సంజ్ఞను దీసికొనివచ్చెను. తన తేజస్సును తగ్గింపుమని దేవతలను గోరెను. విశ్వకర్మ వీనిని సానఁబట్టెను. ఆ రాలినచూర్ణములో విష్ణువు చక్రము, శివుని శూలము, వసువుల శంఖములు చేయఁబడెను.

అమృతమును పానముచేయుటకై దేవతల పంక్తిలో రాహువు కూర్చుండుట సూర్యుఁడు చూచి విష్ణువుతోఁజెప్పెను. విష్ణువు రాహువును చక్రముతోఁ గొట్టెను. ఆ కోపము రాహువునకుఁ గలదు. కావున నప్పుడప్పుడతఁడు సూర్యునిఁ గబళించుచుండును.

అట్లగుటకు జమదగ్నిశాపము కలదు. జమదగ్నియు, భార్యయు నర్మదానదీతీరమునఁ బగటియందే రమించుచుండిరి. సూర్యుఁడుబ్రహ్మరూపమునఁ బోయి నీ కిది తగునాయని యా ముని నడిగెను. వీరిక్రీడకు భంగము కలుగఁజేయుటచే జమదగ్నికిఁ గోపమువచ్చి నీ తేజమును మేఘములు కప్పివేయుచుండుఁగాక; నిన్ను రాహువు మ్రింగుచుండుఁగాక యని శపించెను. సూర్యునకును గోపమువచ్చి నీవు క్షత్రియునిచే మరణించెదవని వానికిఁ బ్రతిశాపమిచ్చెను. బ్రహ్మ.

సూర్యుఁడు మేరుపర్వతముచుట్టుతిరుగుచుండుననియుఁ, దనచుట్టు తిరుగఁడనియు వింధ్యకుఁ గోపమువచ్చి తనదేహముపెంచి సూర్యుని మార్గమున కడ్డుకలుగఁజేసెను. అపుడేఅగస్త్యుఁడు వింధ్యగర్వమణఁచెను.

సూర్యుఁడు విష్ణుమూర్తి నేత్రము. పద్మములకు మిత్త్రుఁడు.

ఒకనాఁడు సూర్యుఁడును, వరుణుఁడునుగలసి వచ్చుచు మార్గమం దూర్వశినిఁ జూచిరి. ఆమె సుందరాకారము చూచుటతోడనే సూర్యునకు రేతఃపతన మయ్యెను. ఊర్వశి దానిందీసి యొక కుంభమం దుంచెను. పిమ్మట వరుణుఁడును నామెను మోహదృష్టితోఁ దిలకించెను. ఆమె "నన్ను మొదట సూర్యుఁడు వలచెను. నీకుఁ దగునేని నీవును నాదేహమును దిలకించి సౌఖ్యము నొందుము" అని పలికెను. వరుణునకు రేతఃపతనము కాఁగా దానింగూడఁ దీసి యూర్వశి యా కుంభమందే యుంచెను. అట్లొనర్చుటచే నూర్వశిపై సూర్యునకు గోపమువచ్చి నీవు భూలోకమునకుఁ బోయి పురూరవునకు భార్యవై యుండుమని శపించెను. ఆ మిత్త్రావరుణుల వీర్యములనుండియే వసిష్ఠాగస్త్యులు పుట్టిరి.
ఉ. రా.

ఒక సాయంకాలము సూర్యుఁడు వచ్చుచు మార్గమందు స్త్రీరూపమునను్న ఋక్షవిరజునిఁ జూచెను. చూచుటతోడనే యితనికిఁ జిత్తము కరిగి రేతఃపతనమయ్యెను. అది యా స్త్రీకంఠమునఁ బడెను. దానివలన సుగ్రీవుఁడుజన్మించెను.
ఉ. రా.

దుర్వాసుఁ డుపదేశించిన మంత్రమును బఠించి కుంతి సూర్యునిఁ బ్రార్థించెను. సూర్యుఁ డామె కడ కేగెను. ఇతనిని జూచి కుంతి భయపడి పొమ్మనియెను. కాని పిలువఁబడిన పిమ్మట మంత్రోద్దేశము ప్రకార మామె కోరిక తీర్పకుండ వెళ్ళఁజాలనని సూర్యుఁడు పలికెను. తుదకు ఆమె కన్యాత్వము దూషితముకాదని యభయ మిచ్చి యామెతో సంయోగము నొందెను. కుంతికి సద్యోగర్భమునఁ గవచకుండలములతోఁ గర్ణుఁడు పుట్టెను. భార.

ఈ కవచకుండలము లుండుటచేఁ గర్ణుడజేయుఁ డగునుగాన వాని నపహరించుటకై ఇంద్రుఁడు వచ్చునని సూర్యుఁ డెఱింగి ముందుగాఁ దా నొక బ్రాహ్మణరూపమునఁ గర్ణునికడకు వచ్చి "నీ కవచకుండలము లొ

బ్రాహ్మణుఁ డిమ్మని కోరును. నీ వీయకుము" అనిచెప్పెను; కాని బ్రాహ్మణుఁడడిగినచో లేదవ లేనని కర్ణుఁడుచెప్పెను. ముందుగావానిశక్తి నడిగి పుచ్చుకొని తరువాత వానికిఁ గవచకుండలము లిమ్మని చెప్పి యంతర్థానమయ్యెను.

వనవాసము చేయుచుండిన ధర్మజుఁడు సూర్యు నారాధించెను. ఇతఁడు ప్రత్యక్షమై యొకస్థాలి నిచ్చెను. దానిలోవండిన సర్వవిధపాకములును సందఱకు సరిపోవునట్లు కలుగును. భార.

శివునిపంపున సూర్యుఁడు కాశీనగరము ప్రవే శించి యందుండి దివోదాసుని వెడలఁగొట్టుటకుఁ బ్రయత్నించెను. కాని కృతార్థుఁడు కాలేక పోయెను. కావున శివునికడకు మరలఁబోలేక కాశియందే లోలార్కుఁడు, ఉదయార్కుఁడు మొదలగు ద్వాదశరూపములతో నుండెను. కాశి.

సూర్యుఁడు:- (చూడుము ద్వా ద శా ది త్యు లు) మార్తాండుఁడు.

సృ

సృంజయుఁడు:- ఒక రాజు. ఇతనికడకుఁ బర్వత నారదులు వచ్చిరి. వారి పరిచర్యకై సృంజ యుఁడు తనకూఁతును (మదయంతి) సుకుమారిని నియోగించెను. నారదుఁ డా బాలికను వలచు టచే ఈ రాజామెనిచ్చి వివాహము చేసెను.

సృంజయుఁడు మూత్రపురీషములు కూడ బంగారమగునట్టి కుమారుని బడయఁగోరి బ్రాహ్మణులను బూజించి తనకోరిక నారదునితోఁ గూడఁ జెప్పెను. నారదుని యనుగ్రహమున నతని కట్టి కుమారుఁడే పుట్టెను. వానికి సువర్ణ ష్ఠీవియని పేరు. సృంజయునింట దినదినము బంగారము హెచ్చుచుండెను. క్రూరులు కొందఱు ధన మపేక్షించి యా బాలునిశరీరము లోపల బంగారముండునని తలఁచి వానిని జంపి చీల్చిరి. సృంజయున కపారమైన దుఃఖము కలిగెను. అతఁడు నారదుని దలఁచుకొనెను. నారదుఁ డతనికి మిత్త్రుఁడుకాన, వచ్చి వానికి షోడశరాజుల వృత్తాంతము చెప్పి దుఃఖమును బోఁగొట్టి వానిపుత్త్రుని బ్రతికించి తెచ్చి యిచ్చెను. భార.

పిమ్మటఁ గొంతకాలమునకు సృంజయుఁడును, భార్యయును, బుత్త్రుఁడును భాగీరథీతీరమునందు వనవిహారము చేయుచుండిరి. ఇంద్రుఁడు తనకంటె సువర్ణష్ఠీవి బలవంతుఁడగునని భయముకలవాఁ డగుటచేఁ దన వజ్రమును శార్దూలరూపమునఁ బోయి వానిని జంపుమనెను. వెంటనే వజ్రము శార్దూలరూపమై వచ్చి వీనిని జంపెను సృంజయుఁడు మఱల నారదునిఁ దలంచుకొనెను· నారదుఁడువచ్చి యితనిని మఱల బ్రతికించెను· భాగ·

సృంజయుఁడు:-యయాతి వంశమువాఁడు. కాల నాథుని పుత్త్రుఁడు. ఇతనికుమారుఁడు పురం జయుఁడు. భాగ.

సృగాలవాసుదేవుఁడు:-కరవీరంబను పురమున నుండువాఁడు. జరాసంధుని మి త్త్రుఁ డు. ఇతఁడును జరాసంధునితోఁ గూడి శ్రీకృష్ణు నె ది రిం చు వాఁ డు. వీనిని శ్రీకృష్ణుఁడు సంహరించెను. హరి.

సే

సేనాజిత్తు:- ఒకరాజు. శోకార్తుఁడైయుండి తన లోనే జ్ఞానముకలిగి "యొకరిని బాధపెట్టు చున్నాము. మనము బాధపడుచున్నాము అని యనుకొనట కాలప్రభావం బెఱుంగక పోవుట చేతనే. సకలము గాలాధీనము. కావున బుద్ధి మంతుఁడు శోకమునకుఁ దావీయఁడు" అని చెప్పెను. భార.

సేనాజిత్తు:-ఒకరాజు. పుత్త్రుఁడు చనిపోవుటచే దుఃఖించుచుండెను. తల్లిదండ్రులు, భార్య, పుత్త్రిలు, పుత్రికలు మొదలగువారు "ప్రవా హములోఁ గట్టెలుకలిసికొని మరల విడిపోవు నట్లు" కలిసికొని యెడఁబాయు చుందురు అనిచెప్పి శోకమునుబోఁగొటి మఱియును వానిని

వేశ్య పింగళ యనునది తలంచినరీతిని దలిపి దుఃఖమును బోఁగొట్టెను.

సేనాబిందుఁడు:-దేవప్రస్థమునకు రాజు. దిగ్విజయార్థము వచ్చిన యర్జునుని నితఁ డెదిరించి పోరాడెనుగాని వానిచే నోటువడియెను. భార.

సై

సైంధవుఁడు:-సింధుదేశాధిపతియైన వృద్ధక్షత్రుని కుమారుఁడు. వీనిపేరు జయద్రథుఁడు. ఇతఁడు చిన్నతనములో నాడుకొనుచుండఁగా నాకాశవాణి "ఈతఁ డేమఱుపాటున నున్నప్పు డితనితల నఱుకఁబడు" నని పలికెను. ఆ మాటలు వృద్ధక్షత్త్రిఁడు విని తాఁ బడసినకుమారున కిట్లగునా యని విచారించి యెవ్వఁ డీతనితల నేలపైఁ బడవేయునో వానిశిరము నూఱుముక్కలగుఁగాక యని శపించెను.

సైంధవుఁడు . ధృతరాష్ట్రుని పుత్రికయగు దుస్సలను వివాహమయ్యెను. మఱియు నితఁడు సాల్వకన్యకం బరిణయము కాఁబోవుచు మార్గమున వనములో నొంటరిగనున్న ద్రౌపదింజూచి వలచి యామె యెవ్వరో తెలిసికొనిరమ్మని కోటికాస్యునిఁ బంపెను. పదపడి తానేవచ్చి తనను వివాహమగుమని కోరెను. ద్రౌపది నిష్ఠురము లాడెను. సైంధవుఁ డామె కొంగు పట్టుకొని లాగెను. ఆమె వీనినిఁ బడద్రోసెను. ఇతఁడు లేచి ద్రౌపదిని తన రథమెక్కించుకొని పోవుచుండెను. పాండవులు ద్రౌపదిని గానక యామె పరిచారికవలన సైంధవుఁ డామెను నపహరించుట విని వానిని తఱిమి వానిసేనలతోఁ బోరాడి యోడించి ద్రౌపదిని దెచ్చిరి. మఱియు భీమార్జునులు వానివెన్నంటి చని సింధు, సౌవీర, శిబి సేనలను జెల్లాచెదరు కావించి సైంధవుని రథమునకుఁగట్టి తీసికొనివచ్చిరి. భీముఁడు వీనిని సంహరింపఁబోయెను. కాని, వీఁడు దుస్సలభర్త కావున ధర్మజుఁడు వలదనియెను. వీనిశిరమును గొఱిగి యవమానపఱిచిరి. పాండవులదాసుఁడ నని చెప్పికొని బ్రతుకుమనిరి. సైంధవుఁడు ధర్మరాజాదులకును, నచ్చటి మునులకును నమస్కరించి మీకు దాసుఁడనైతి నని చెప్పి చనెను.

సైంధవున కీపరాభవదుఃఖ మెక్కువయ్యెను. కావున గంగయొద్దునకేగి శివునిఁగూర్చి తపస్సు చేసి యతఁడు ప్రత్యక్షముకాఁగాఁ బాండవుల నేవురను రణములో గెల్చునట్లు వరము వేఁడెను. అర్జునునిఁదప్ప మిగిలినవారి నొక్కదిన మితఁడు గెలుచునట్లు శివుఁడు వరమిచ్చెను.

అభిమన్యుఁడు కౌరవుల పద్మవ్యూహము చొఱుచుకొని పోయెను. వానికి సహాయముగ వాని వెంబడి ధర్మరాజాదులు పోవుటకు యత్నించిరి. కాని వారికిసైంధవుఁ డడ్డుపడియె. అర్జునుఁడు వేఱొకచోఁ బోరుచుండెను. ధర్మజ, భీమ, నకుల, సహదేవులను, వారి సేనలను నభిమన్యుని గలియనీయకుండఁ జేసి సైంధవుఁడు వీరి నోడించి పంపెను. అభిమన్యుఁడును సంహరింపఁబడియె.

సైంధవుని మూలమున నభిమన్యునకు సహాయము చేరకపోవుటచే సైంధవుని మఱునాఁడు సూర్యాస్తమయములోపున సంహరించెదననియు, లేనిచోఁ దాను ప్రాణములు విడుతుననియు నర్జునుఁడు శపథముచేసెను. ఈ మాటలు కురువీరులు వినిరి. ద్రోణకర్ణాదులు సైంధవునిఁ గాపాడుచుండిరి. అర్జునుం డీతనిఁ జూడలేక పోవుచుండెను. అపుడు శ్రీకృష్ణుఁడు మాయా తిమిరము గావించెను. దానిచే సూర్యుఁ డస్తమించెనను భ్రాంతిలో సైంధవుఁడు పైకివచ్చెను. అప్పుడే యర్జునుఁడు వీనిశిరము తెగవేసెను. వానిశిరము భూమిపైఁ బడకుండఁ జేయుమని శ్రీకృష్ణుఁ డర్జునునితోఁ జెప్పుటచే నతఁడు బాణములువేసి యాకసముననే నిల్పెను. పిమ్మట బాశుపతాస్త్రముపంపి దానిని దపస్సుచేసికొను చున్న సైంధవునితండ్రి వృద్ధక్షత్రుని యొడిలో వేయించెను. అతఁ డులికిపడి దానినిఁ గ్రిందకుఁ ద్రోసెను. ఇది భూమిపైఁబడుటచే వృద్ధక్షత్రుని శిరము పగిలెను. భార.

సైరంధ్రి:- అజ్ఞాతవాసమునను్న ద్రౌపది పేరు. భార.

సో

సోమకుఁడు:- ఒక రాజర్షి. ఇతనికి నూర్గురు భార్యలుకలరుగాని పుత్త్రుఁడొక్కఁడే యుండెను. ఈ పుత్త్రున కొకనాఁడు చీమకుట్టి ఏడ్చుచుండఁగాఁ దల్లులందఱు వచ్చి యేడువ నారంభించిరి. సోమకుఁడును విచారించి, యీయొక్క పుత్త్రుని నమ్ముకొని యెట్లు జీవింపఁగలుగుదును ? నాకు నింకను బుత్త్రులు గలుగు నుపాయము చెప్పుఁడని మంత్రుల నాలోచన యడిగెను. అతని పుత్త్రుని యజ్ఞపశువుగ వేల్చినయెడల దేవతలు మెచ్చుకొని పుత్త్రుల నిత్తురని ఋత్విజుఁడు చెప్పెను. రాజు తన కుమారునిఁ బశువుగఁజేసి యజ్ఞము చేసెను. అతనిభార్యలందఱు గర్భవతులై పుత్త్రులను గాంచిరి. కాని సోమకుఁడు మరణించి నరకమున కరిగెను. అచ్చట నతని ఋత్విజుడుఁ జూచెను. ఇదేల నీవిట్లు వచ్చితివని రాజడుగగ ఇది నీకుమారుని యజ్ఞపశువుగ వేల్చిన ఫలము; నీకుఁ బుణ్యమువచ్చినది. నీవు స్వర్గలోకమునకుఁ బోయెదవు. నీతో నన్నుఁగూడఁ గొనిపొమ్మని ఋత్విజుఁడు గోరెను. సోమకుఁడు యమునితోఁ జెప్పి ఋత్విజునిగూడ నచ్చటనుండి గొంపోయెను. భార.

సోమద:-ఊర్మిళ యను గంధర్వాంగన కుమారిత. ఈమె చూలియను మునికిఁ బరిచర్య చేయుచుండెడిది. ఈ మునివలన నీమెకు బ్రహ్మదత్తుఁడను కుమారుఁడు కలిగెను. దేవకార్యము నిమిత్తము బ్రహ్మదత్తుని బంపుమని దేవత లీమె నడిగిరిగాని యీమె తన పుత్త్రి నెడబాయలేననియెను. రామా.

సోమదత్తుఁడు:-బాహ్లికునికుమారుఁడు. భూరిశ్రవుని తండ్రి. దేవకిస్వయంవరమునకు శిని యరిగి వసుదేవున కామెనిచ్చి వివాహముచేయుటకై యామెం దోడ్కొని వచ్చుచుండెను. మార్గమున సోమదత్తుఁడు వాని నడ్డగించెను. వీరిరువురును బోరాడిరి. సోమదత్తుఁ డోడింపబడియె. శిని వీనినిజంపక యవమానపఱచి తన్ని పంపెను. ఆ రోషముతో సోమదత్తుఁడు ప్రజలను జూడలేక వనమునకేగి శినినోడించుటకై తనకు శక్తి కలుగుటకు దపస్సుచేయ బ్రారంభించెను. ఇతనిదపస్సు ముగియునప్పటికి శినియు, నతని కుమారుఁడును మరణించిరి. కావున శినిసుమని నోడింపఁగల కుమారుఁడు తనకుఁ గలుగునట్లు వరమువేఁడెను. ఇతనికి భూరిశ్రవుఁడు జన్మించెను. భారత యుద్ధమున సోమదత్తుఁడు దుర్యోధనునిపక్షమున బోరాడెను. వీనిని సాత్యకి సంహరించెను. భార.

సోమదత్తుఁడు:-కృశాశ్వుని పుత్త్రుఁడు. ఇతని కుమారుఁడుకకుత్థ్సుఁడు. (రామా)సుమతియును, సోమదత్తుఁడును అశ్వమేధమునుజేసి పుణ్యమార్గమును బొందిరి. భాగ.

కకుత్థ్సుఁడు సుమతి కుమారుఁడు. రామా.

సోమవంతుఁడు:-సారస్వతుఁడను బ్రాహ్మణుని కుమారుఁడు. ఇతఁడును, నరమిత్త్రుఁడను బ్రాహ్మణుని తనయుఁడైన సుమేధుఁడనువాఁడును గలసి చదువుకొనిరి. సకలశాస్త్రము లభ్యసించిరి. వీరికిఁ బదునాఱేండ్లు నిండినతరువాత వీరల తండ్రులు "మీకు వివాహములు చేయుటకు మావద్ద ధనములేదు. మీరు విదర్భరాజును జూచి మీవిద్యచేమెప్పించి సొమ్ముతెచ్చుకొనుఁ" డనిరి. ఈ బాలురట్లే వెళ్ళి రాజు నర్థించిరి. ఆ రాజు కొంతపరిహాసముగా నిషధదేశపురాణి సీమంతిని సోమవారము వ్రతముచేసి, దంపతులను పూజించి వారికి ధనకనకము లిచ్చుచున్నది. మీర లా వేషముతోఁ బొందు. ఆమె మీకిచ్చునని చెప్పెను. అట్టి కపటవేషములు వేయమని మొదట వీరనిరి. కాని రాజాజ్ఞ పాటింపవలెనని రాజు చెప్పఁగా సోమవంతుఁడు స్త్రీవేషము వేసికొని సుమేధునియొక్క భార్యగా నటించుచు నిషధునిఁజేరిరి. సోమవారమీశ్వరునిఁ బూజించిన పిమ్మట సీమంతిని వచ్చినదంపతులకుఁ బూజచేసి కానుకలిచ్చి పంపెను. ఆమె నిజముగ ఆ కపటవనిత వనిత యనియే భావించెను. సుమేధుఁడు తన మోసమును బరులకుఁ దెలియకుండ రాత్రియే పయనము కాఁగోరెను. కాని సోమవంతుఁడు నిజముగ వనితయై సుమేధునందు వలపుఁగొని మన్మథవికారము లందెను.

సోమవతి:-సుమేధునితో సోమవంతుఁడు కలిసి బ్రహ్మచర్యవ్రతము చేయుచున్న బాలకుఁడని

జ్ఞాపకము చేసెను. మఱియు సోమవంతుఁడు వనితయై, సోమవతి యనుపేరుతో నుండుట కూడఁ దెలియఁజేసెను. వారల్లే సుమేధుండు సోమవతి యను రూపులతో గృహముల కేగిరి. సారస్వతునకుఁ దనయేకకుమారుఁ డిట్లు స్త్రీ యగుటకు వ్యసనపడి కోపముతో విదర్భరాజు దగ్గఱకుఁబోయి నీ మూలమున నాకుమారున కాఁడురూపము వచ్చినదని పలికెను. అతఁడు మిక్కిలి యాశ్చర్యమును, విచారమును జెంది పార్వతీపరమేశ్వరులం గూర్చి పూజించెను. పార్వతి ప్రత్యక్షమై వరము కోరుకొమ్మనెను. సోమవతిని మఱలఁ బురుషునిఁగఁ జేయుమని కోరెను. పార్వతి "యీ కోరిక నెఱవేఱదు. సీమంతినికి యీ వ్యక్తి స్త్రీగాఁ గనుపడినది గావున నీ స్త్రీరూపము మాత్రము మార్పు చెందదు. కాని యీ సోమవతికిని, సుమేధునకు నొక యోగ్యుండగు కుమారుఁడు పుట్టును అని చెప్పెను. వీరు పార్వతీదేవియిచ్చిన వరంబున కంగీకరించిరి. సారస్వతుఁడు సుమేధునకు సోమవతినిచ్చి వివాహముచేసెను. బ్రహ్మ.

సోమశర్మఁడు:- అశోకవంశములోని వాఁడైన శాలిశూకుని పుత్త్రుఁడు. ఇతనికుమారుఁడు శతధన్వుఁడు. భాగ.

సోమశ్రవసువు:- శ్రుతశ్రవసుని కుమారుఁడు. జనమేజయుని పురోహితుఁడు. భార.

సోముఁడు:-మనస్వినీ ప్రజాపతుల కుమారుఁడు. ఇతనిభార్య మనోహర. వర్చస్సు, శిశిరుఁడు, ప్రాణుఁడు, రమణుఁడు ఇతని కుమారులు. పృథ యితనికుమారిత. ఇతఁ డష్టవసువులలో నొకఁడు. భార. మత్స్య.

సౌ

సౌగంధికము:-మిక్కిలి పరిమళముగల యొకజాతి పుష్పము. ద్రౌపది ఈ పుష్పమును గోరుటచే భీముఁడు తెచ్చుటకు వెళ్ళెను. ఈ పుష్పము లుండిన కొలనును యక్షులు గాచుచుండిరి. వారితో యుద్ధముచేసి, సంహరించి భీముఁ డీ పుష్పమును దెచ్చెను.

సౌధృతేయుఁడు:-సుధృతియొక్క కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు కేవలుఁడు. భాగ.

సౌబలుఁడు:-ఉపరిచరవసువుయొక్క కుమారుఁడు. భార.

సౌభకము:-శిశుపాలుని మిత్త్రుఁడైన సాల్వుండు శివునిఁ గూర్చి తపస్సుచేసి గరుడ గంధర్వ రాక్షసాదులచే సాధ్యపడక నభమందుఁదిరిగెడి వాహనము వరముగఁ గోరి పొందెను. శివుఁ డనుగ్రహించి యిట్టి వాహనము నగరరూపమున నుండునది నిర్మింపుమని మయున కాజ్ఞయిచ్చెను. అతఁడు లోహనిర్మితమగు కామగమనముగల నగరమును నిర్మించెను. అతఁడే దానికి 'సౌభకము' అని పేరుపెట్టెను. సాల్వుండు నిజసైన్యముతో నందెక్కి ద్వారకపైఁబడి ఘోరసంగ్రామము జేసెను. తుదకు శ్రీకృష్ణుఁ డీ సౌభకమును దనగదతోఁ దుత్తునియలు చేసెను. భాగ.

సౌభద్ర:-నారీతీర్థములలో నొకటి. (చూడుము నారీ తీర్థములు)

సౌభరి:-దేవమిత్త్రుని శిష్యుఁడు. ఋగ్వేదశాఖను ఉపదేశ మొందెను. ఇతని కుమారుఁడు శాకల్యుఁడు. భాగ.

సౌభరి:- ఒక ముని. ఇతఁడు జలమధ్యమందుఁ గూర్చుండి తపస్సు చేసికొనుచుండువాఁడు. అందలి మత్స్యరాజు అనుభవించు భోగములను జూచి తానును సంసారసుఖములను బడయఁ గోరి మాంధాతకడకుఁ జని నేనును గృహస్థుఁడ నయ్యెద. నాకు నీ కుమార్తెలనిమ్ము అనికోరెను. నీవు వృద్ధుఁడవు. నిన్ను నాకుమార్తెలు మెచ్చరు అని రాజుచెప్పెను. నీయంతఃపురమునకుఁబోనిమ్ము. వారు మెచ్చిరేని పరిణయమయ్యెదనని సౌభరి తన తపోమహిమచే సుందరరూపము గలవాఁడై యంతఃపురములోనికిఁ బోయెను. మాంధాతృ కుమార్తె లందఱు వీనిని వలచిరి. సౌభరి వారిని వివాహమయి తన తపఃప్రభావమువలనఁ గనక

మఱు సౌధములను నిర్మించి వారి నందుంచి పెక్కేండ్లు భోగించెను.

కొంతకాలమైనపిదప నితఁడు తనస్థితి తలఁచుకొని విచారించి భార్యలును, దానును వానప్రస్థంబుననుండి, పిమ్మటఁ దపస్సుచేసి బ్రహ్మము పొందెను. విష్ణు.

ఈ మునికి దగ్గఱనున్న కొలనులోని మత్స్యములరాజును గరుత్మంతుఁడు పట్టుకొని భక్షించెను. చేఁపలన్నియు మిక్కిలి దుఃఖము నొంది యీ మునిచుట్టును జేరి ప్రార్థించినవి. వానిపై దయగొని "గరుత్మంతుఁడు మఱల ఆ కొలను ప్రవేశించెనేని యతఁడు మరణించునట్లు" సౌభరి శపించెను. భాగ.

సౌమిని:-ఒక బ్రాహ్మణస్త్రీ. ఈమె భర్తపోయిన పిదప జారిణియై తిరిగి గోమాంసమును భక్షించుచుండెడిది. అందువలనఁ దరువాత జన్మములోఁ జండాలకన్యకగ జన్మించెను. మఱియును దినుట కేమియునులేక తిరిపె మెత్తుకొను చుండెను. శివరాత్రితీర్థవాసులు వెళ్ళుచుండఁగా వారిని ముష్టి యడిగెను. వారిలో నొకఁడొక దండ యిచ్చెను. అది తినుటకుఁ బనికిరాదని కోపముతో నామె గిరాటువేసెను. అది శివలింగముపైఁ బడెను. అట్లు శివలింగముపైఁ బడుటచేతనే ఆమెకు బుణ్యలోకము వచ్చెను. శివ.

సౌరభేయి:-ఒక యప్సరస. వంద, సమీచి, బుద్బుద, లత యనువార లీమెచెలికత్తెలు. (చూడుము వంద.)

సౌవర్ణ:-ప్రాచీనబర్హి భార్య; ప్రచేతసుల తల్లి. విష్ణు.

స్త్రీ

స్త్రీలు:-రహస్యము. కుంతి కర్ణునిజన్మప్రకారము దాఁచియుంచి యతఁడు మరణించి యుద్ధము ముగిసిన పిమ్మట ధర్మరాజుతోఁ జెప్పెను. తత్పూర్వమే యామె దాని వెల్లడించి యుండినచో యుద్ధమే సంభవింపక పోయెడిదని ధర్మరాజు తలఁచెను. అతనికి దల్లిపైఁ గోపము కూడ వచ్చెను. అప్పుడే స్త్రీలు రహస్యమును దాఁపలేకుందురుగాక యని శపించెను. భార.

స్త్రీలు:-అలంకారము. ప్రద్వేషిణి అంధుండగు దీర్ఘతముని బరిణయమై గౌతముఁడు మొదలగు పుత్రులను బడసెను. అయినను నామె భర్తపైఁ గోపించుచుండినందున, 'నన్నేల మెచ్చవు?' అని భర్త యడిగెను. "భర్త భార్యను బోషింపవలయునుగాని, నిన్ను నేనుఁ బోషించుచుంటిని. ఎంతకాల మిట్లు? ఇంక నిన్నుఁ బోషింపజాల. ఎందేని నరుగుము" అని భార్య యనెను. దీర్ఘతమునకుఁ గోపమువచ్చి "పతిహీనలయిన వనితలు అతిధనవంతులైనను అనలంకృతలు, మాంగల్యరహితలు నగునట్లు" శాపమిచ్చెను. భార.

స్థ

స్థవిష్ట:-శర్యాతి యను రాజు భార్య. బ్రహ్మ.

స్థూ

స్థూలకర్ణుఁడు:-ఒకయక్షుఁడు. ఇతని యరణ్యమునకు శిఖండి వచ్చి ప్రాయోపవిష్టము చేయఁబోవ నితఁడు చూచి జాలిగొని సమీపించి కారణమడిగెను. శిఖండి తాను స్త్రీయగుటయు, దాను పురుషుఁడనిచెప్పి తనకొకకన్యను బెండ్లి చేయుటయుఁ జెప్పి దుఃఖించెను. స్థూలకర్ణుఁడు శిఖండికి సహాయముచేయుటకై తన పుంస్త్వము శిఖండికిచ్చి యామె స్త్రీత్వము తాను గ్రహించెను. శిఖండి పదిదినములలో మరలి వచ్చి స్థూలకర్ణుని పుంస్త్వము మరల నతని కిత్తునని వెడలెను. ఈలోపున ఆ యరణ్యమునకుఁ

కుబేరుఁడు వచ్చెను. స్త్రీత్వములో నుండిన స్థూలకర్ణుఁడు సిగ్గుచేఁ గుబేరుని దర్శనము చేయలేను. కావునఁ గుబేరునకుఁ గోపమువచ్చి శిఖండి జీవించియుండినంతకాలము స్థూలకర్ణునకు స్త్రీత్వమే యుండునని శపించెను. శిఖండి యనినప్రకారము వచ్చెను. కాని స్థూలకర్ణుఁడు నీవలన దోషములేదు; వెళ్ళుమనెను. భార.

స్థూలకేశుఁడు:-ఒకముని. విశ్వావసుఁడను గంధర్వునకును, మేనకకును బుట్టిన ప్రమద్వర యితని యాశ్రమములోనే పెరిగెను. భార.

స్థూలశిరుఁడు:-అశ్వశిరుని కుమారుఁడు. వరా.

స్యూమరశ్మి:-కపిలుఁడు అను ముని యొక గోవును గాంచి 'నీవు వేదస్వరూపముకావె' అని పలికెను. అతఁడు వేదములనుగూర్చి చులకనఁగఁ బల్కుచున్నాఁ డనుకొని స్యూమరశ్మి యను బ్రాహ్మణుఁడు ఆగోవులోఁ బ్రవేశించి వాదమునకు దిగెను. ఎల్లయాశ్రమములకును గృహస్థాశ్రమమే యాధారము. గృహస్థునకు యాగాది కర్మలు చేయుట యుచితము. అది వేదవిహితము. నీకు వేదములు ఆదరణపాత్రములు కావా? అని వాదింప మొదలిడెను. తుదకుఁ గపిలునివలన బోధితుఁడై గోవును వీడివచ్చి తనను నెఱింగించుకొని నీకు శిష్యుండ నగుదును, ధర్మము చెప్పుమని కోరెను. కపిలునివలన బోధను గాంచెను. భార.

స్వ

స్వయంప్రభ:-మేరుసావర్ణి కుమారిత. హేమ యొక్క చెలికత్తె. ఈమెయును హేమతోఁ గలిసి మయనిర్మితమయిన ఋక్షబిలముననుండెను. దీని సౌందర్యాదులు వర్ణనాతీతములు. సీతను వెదుకఁబోయిన హనుమదాదులు డస్సి దప్పిగొని యా బిలము ప్రవేశించి స్వయంప్రభను జూచి యామె వృత్తాంత మడిగి యటనే యాగిరి. సుగ్రీవునిచేఁ నొసఁగఁబడినగడువు దాటిపోవుచున్నదనియును, బిలమును దాటిపోవుటకై శక్తి చాలదనియును వారామెతో ననిరి. ఆమె వారిని గన్నులు మూసికొమ్మని యెను. వారు కన్నులు మూసికొనిరి. వారు కన్నులు తెఱచులోపలనే ప్రస్రవణములో నుండిరి. వానరులు సీతకై వెదకుచు మయనిర్మితమైన బిలములో బడఁగ నీమె వారిని బయటకుఁ దీసికొని వచ్చెను. రామా.

స్వర్ణముఖి:-కాళహస్తి దగ్గఱనున్న యొక నది. దక్షిణమున నది లేకపోవుటచే నగస్త్యుఁడు నదికై తపస్సు చేసెను. ఇతని తపస్సువలన లోకములు తపించెను. బ్రహ్మదులు శివునితోఁ జెప్పి యితని తపముచాలింపుమని కోరిరి. శివుఁ డాకాశగంగను గొంతయిచ్చెను. అదియే స్వర్ణముఖీనది యయ్యెను. శ్రీకాళ.

స్వర్భానవి:-ఆయువుయొక్క భార్య. నహుషుఁడు, గయుఁడు, అనేనసుఁడు, వృద్ధశర్మ ఈమె కుమారులు. భార.

స్వారోచి:-వరూధినికిఁ బ్రవరాఖ్య రూపమున వచ్చిన గంధర్వునివలనఁ బుట్టిన కుమారుఁడు. ఇతఁ డాటవికులకుఁ రాజైయుండెను. ఇతఁడొకనాఁడు వేఁటాడి వచ్చుచు మనోరమ యను కన్య రాక్షసునిచేఁ దఱుమఁబడి యేడ్చుచు వచ్చుచుండుట చూచి యా దనుజునితోఁ బోరాడి యా కన్యను గాపాడెను. స్వారోచిచేఁ గొట్టఁబడిన దనుజుఁడు శాపవిమోచన మొంది పూర్వరూపమును దాల్చి తాను మనోరమకుఁ దండ్రియగుట తెల్పి యామె నాతని కిచ్చి వివాహము చేసెను. ఆనాఁటిరాత్రి స్వారోచి భార్యతోఁ గ్రీడింపఁబోవుచుండ నామె దుఃఖించుచుఁ దన నెచ్చెలులు విభావసి, కళావతి యనువారలు రోగపీడితులై యుండఁ దనకు సంతోషము కలుగదని చెప్పి వారి బాధలను బోఁగొట్టుమనికోరెను. స్వారోచి వారి వృత్తాంతము లారసి వారిబాధలం బోఁగొట్టి వారిం బరిణయమయ్యెను. విభావసియుఁ, గళావతియుఁ దాము నేర్చినవిద్యలు స్వారోచికిఁ జెప్పిరి. ఒక యుత్తి తన నాశ్రయించిన లేళ్ళతో, మీతో సదా భోగించుటకు నేను

స్వారోచిని గాను అను పలుకులు ఇతఁడు వినెను. అయినను నితఁడు తనసతులఁ బాయలేక వారినూ ఱేండ్లు భోగించెను. స్వారోచికి మనోరమయందు విజయుండును, విభావసియందు మేరువందనుఁడును, కళావతియందు విభావసుండు నను పుత్త్రులు పుట్టిరి. పిమ్మట నితఁ డొకనాఁడు వనములో నొక వరాహమును గొట్టఁబోవుచుండ నొక జింక వచ్చి తనను గొట్టుమనెను. తాను స్వారోచిని వలచియుంటినని చెప్పెను. తన నాలింగనము చేయుమని కోరెను. స్వారోచి నివ్వెరపడియు నట్లు గావించెను. ఆ జింక దివ్యస్త్రీయై తాను వనదేవతననియును, దివిజులచే నట్లు పంపఁబడితిననియు, తనయందుఁ బుట్టుకుమారుఁడు మనువగుననియును జెప్పెను. ఈమెయందుఁ బుట్టినవాఁడే స్వారోచిషమనువు. మార్క.

స్వా

స్వాయంభువు:-బ్రహ్మపుత్త్రుఁడు. ఇతఁడు ప్రథమ మనువు. ఇతనిభార్య శతరూప (అనంతి). ప్రియవ్రతోత్తానపాదు లితనికుమారులు. నూతి, (ఆకూతి) ప్రసూతి, దేవహూతి యనువార లితని కుమార్తెలు. మత్స్య. మార్క.

ఈ మనువుకాలమున రోచనుఁ డనువాఁ డింద్రుఁడు. విష్ణుమూర్తి వేదశిరుఁడను విప్రుని కుమార్తెకు విభుఁడనుపేరుతో నవతరించెను. భాగ.

ఇతఁడు భూభరణము, భూభారము విడిచి సునందానదీతీరమునఁ దపస్సు చేసికొనుచుండెను. రాక్షసులు వీనిని దినవచ్చిరి. అప్పుడు యజ్ఞుండు వారిని సంహరించెను. యజ్ఞుండు స్వాయంభువు కుమార్తెకు జన్మించిన విష్ణుమూర్తి. ఈ మను కాలమున విష్ణుమూర్తి యజ్ఞుఁడు, కపిలుఁడు అను వారలుగా నవతరించి ధర్మజ్ఞానబోధచేసెను. ఇతని కూఁతురగు ఆకూతిని రుచిప్రజాపతి కిచ్చి వివాహముచేసెను. వారికి విష్ణునంశంబువలన యజ్ఞుండును, లక్ష్మ్యంశంబువలన దక్షిణ యను కన్యయును బుట్టిరి. ఆ యజ్ఞుని విష్ణువు పెంచెను. భాగ.

స్వారోచిషమనువు:-స్వారోచికి వనదేవతయందుఁ బుట్టిన కుమారుఁడు. ఇతఁడు పెద్దకాలము తప మాచరింప విష్ణుమూర్తి ప్రసన్నుఁడై రెండవమను వగుదువని చెప్పెను. ఇతనిమన్వంతరమున విపశ్చిత్తుండు ఇంద్రుఁడయ్యెను. ఊర్జుఁడు, స్తంభుఁడు, ప్రాణుఁడు, దత్తోళి, ఋషభుఁడు, నీవారుఁడు, అరివంతుఁడు అను వారలు సప్తఋషులైరి. చైత్రుఁడు, రోచిష్మదుఁడు, కింపురుషుఁడు మొదలగు మనుపుత్త్రులు రాజులైరి. మార్క. భాగ.

స్వాహా:-దక్షునికుమారిత. అగ్నిభార్య. అగ్ని మునిపత్నులను జూచి మోహించి చిత్తవిభ్రమము నొంది నిర్జనవనంబునకుఁ జనియెను. అచ్చటను మన్మథబాధకుఁ దాళలేక పోవుచుండెను. స్వాహాదేవి క్రమముగ మునిపత్నులరూపములు దాల్చుచు అగ్నిం జేరి, నిన్నువలచి వచ్చితి ననుగ్రహింపుమని యా యా రూపములతోడ నా వానితో రమించెను. కాని పతివ్రతాతిలకమగు అరుంధతిరూపముమాత్రము స్వాహా పొందలేక పోయెను. అట్లాఱుసార్లు ప్రస్కందితమైన యగ్ని వీర్యమును స్వాహాదేవి శ్వేతపర్వతమునఁ గాంచన భాండమునఁ బెట్టెను. అందుండియే కుమారస్వామిపుట్టెను. స్వాహాదేవి యట్లు మునిపత్నుల వేషంబునఁ బోవుటచే మునిపత్నులు వ్యభిచరించిరి యని యపవాదము వచ్చెను. మునులు తమభార్యలను విడచిపెట్టిరి. అపుడు స్వాహాదేవి మునులచెంతకుఁ బోయి నిజవృత్తాంత మెఱింగించెను. భార.

స్వాహా:- అగ్నియొక్క వామపార్శ్వమునుండి యొక కన్య యావిర్భవించెను. ఆమెయే స్వాహా. ఆమె యగ్నికిఁ బత్నియయ్యె. బ్ర. వై.

స్వాహా:-అగ్నివంశములోని క్రోధునిపుత్త్రుఁడైన రసునియొక్క కుమారిత. భార.

హ

హంసకూటము:-ఒక కొలను.

హంసధ్వజుఁడు:—ఒక రాజు. ఇతఁడు ధర్మజుని యాగాశ్వమును బట్టెను. అర్జునుఁ డితనిపై యుద్ధమునకు రాఁగా దన పెద్దకుమారుఁడగు సుధన్వునిఁగూడవచ్చియుద్ధముచేయుమనియెను. ఇతఁడు భార్యకు ఋతుదానముచేసి యాలస్యముగ వచ్చుటచే హంసధ్వజునకుఁ గోపమువచ్చి తనపుత్త్రునిఁ గాగుచున్న చమురులో వేయుఁడని యానతిచ్చెను. భటు లట్లుచేసిరి. కాని సుధన్వుఁడు చెక్కుచెదరక యుండెను. అది వాని మహత్త్వమని తలఁచి, వానిందీసి రాజుకడకుఁ గొంపోయిరి. అపుడు హంసధ్వజుఁడు తనకుమారుని సేనాధిపతిగఁ జేసెను. హంసధ్వజుని రెండవ కుమారుఁడు సురథుఁడు కూడ యుద్ధముచేసి మరణమొందెను. పిమ్మట నతఁడు సంధిగావించుకొని యాగాశ్వమును విడిచెను. జై. భా.

హంసధ్వజుఁడు:—వృషధ్వజుని కుమారుఁడు. ధర్మధ్వజుఁడు, కృశధ్వజుఁడు ఇతనికుమారులు. బ్ర. వై.

హంసుఁడు:—సాల్వదేశాధిపతియైన బ్రహ్మదత్తుని కుమారుఁడు. డిభకుని సోదరుఁడు. వీరిరువురు నతిస్నేహంబున నుండువారు. జరాసంధునకు మిత్త్రులు. వీరు వానితోఁగలసి మధురానగరముపై దండెత్తి శ్రీకృష్ణునితో యుద్ధముచేయుదురు. ఈ సోదరులు శివునిఁగూర్చి ప్రార్థించి యింద్రాదులచేనైన నోడకుండునట్లు వరము పుచ్చుకొని గర్వితులైయుండిరి. వీరు వేఁటకు వెళ్ళి దుర్వాసునిఁ జూచి సంసారసుఖములు పొందక యీ గోచులేలయని వానిని గేలిచేసి వాని గోచిలాగిరి. అట్లు మునుల నవమానించుచుండుటచే వీనిం బరిమార్పుమని దుర్వాసుఁడు శ్రీకృష్ణునితోఁ జెప్పెను. హంసుఁడు తండ్రిచే రాజసూయయాగము చేయింపఁగోరి లవణంబు కప్పంబుగాఁ దెమ్మనిచెప్పుటకై శ్రీకృష్ణునికడకు దూతనుబంపెను. శ్రీకృష్ణునికడనుండి ప్రత్యుత్తరము తెచ్చిన సాత్యకి నవమానించెను.

వీరు మిక్కిలి బలాఢ్యులు. వీరిని రణములో నోడించుట సాధారణముగ సాధ్యము కాదు. కావునఁ గృష్ణుఁడు వీరి నుపాయముచేత సంహరింపఁ దలఁచుకొని హంసుఁడు మరణించెనని డిభకునికెవినిబడునట్లు వార్త వ్యాపింపఁజేసెను. ఆ వార్త డిభకుఁడు నమ్మి హంసుఁడు లేని లోకమున నే నెట్లు జీవింపఁ గల్గుదునని నదియందు మునిఁగి ప్రాణములు విడిచెను. డిభకుఁ డిట్లు మరణించెనని విని హంసుఁడు తా నొక్కరుఁడును జీవించి యుండఁజాలక బలవన్మరణము నొందెను. ఉ. హ. భార.

హంసుఁడు:—ఒక గంధర్వరాజు. అరిష్టాపుత్త్రుఁడు. ఇతఁడే ధృతరాష్ట్రుఁడుగాఁ బుట్టెను. భార.

హతహవ్యుఁడు:—ధరుని కుమారుఁడు. ద్రవిణుని సోదరుఁడు. భార.

హనుమంతుఁడు:—అంజనపుత్త్రుఁడు. అంజన కేసరి యను వానరునిభార్య. కేసరి సంసారములో విసిగి తపస్సున కేగుచు, వాయువును గొలుచుచుండుమని తన భార్యతోఁ జెప్పెను. ఆమె వాయువును సేవించుచుండెను. అంజనభక్తికి వాయువు ప్రసన్నుఁడై తన గర్భమందున్న శివునివీర్య మామె కిచ్చెను. దాన నామె గర్భవతియై కుమారునిఁ గనెను. ఇతఁడే ఆంజనేయుఁడు. పుట్టినతోడనే యీ బాలుఁడు ఉదయించుచున్న సూర్యబింబమును జూచి ఫలమను భ్రాంతిచే దానిని మ్రింగఁబోయెను. అచ్చటికి రాహువు వచ్చి యీ బాలుని బెదరించెను. ఇతఁడు రాహువునే మ్రింగుటకు యత్నించెను. రాహువు భయపడి యింద్రునితో జెప్పుకొనియె. ఇంద్రుఁ డా బాలునిఁ గొట్టుటకై యైరావతము నెక్కి వచ్చెను. ఆంజనేయుఁ డాయైరావతముమీది కురికెను. అంతట నింద్రుఁ డీతనిని వజ్రాయుధముతోఁ గొట్టెను. ఇతని హనువులకు దెబ్బతగిలెను. క్రిందఁబడి మూర్ఛపోయెను. హనువులు గొట్టఁబడుటచే ఆంజనేయునకు హనుమంతుఁ డను పేరు వచ్చెను. తన పుత్త్రుఁ డట్లు కొట్టఁబడుట వాయువు చూచి యింద్రునిపైఁ గోపగించి తన రూపము నుపసంహరించుకొనెను.

లోకములో వాయువు లేకపోవుటచే దేవతలు బెగడొంది బ్రహ్మతోఁ జెప్పికొనిరి.

బ్రహ్మ దానికిఁ గారణము తెలిసికొని వాయువును స్తుతించెను. దేవత లందఱును వాయువును బొగడిరి. వాయువు తన పుత్త్రు నెత్తుకొని బ్రహ్మ కడకుఁ దీసికొని వచ్చెను. దేవత లందఱును వానికి వరమిచ్చిరి.

ఆంజనేయుఁడు విద్య నేర్చుకొనుటకు సూర్యునిదగ్గఱ కేగెను. నే నెచ్చోటను ఆగను కదా! నాయొద్ద నెట్లు నేర్చుకొనియెద వని సూర్యుఁడు వీనిని ప్రశ్నించెను. ఆ మాటలకు నుత్తరముగ హనుమంతుఁడు ఉదయాద్రిపై నొక కాలును, అస్తగిరిపై నొక కాలును నుంచి నిలువఁబడెను. ఇతని శక్తి కచ్చెరు వొంది సూర్యుఁడు వీనికి విద్యనేర్పుట కంగీకరించెను. హనుమంతుఁడు సూర్యునిముందు నడచుచు విద్య నేర్చుకొనియె. ఇతఁడు సంగీతమును నేర్చుకొని సంగీతశాస్త్రకర్త యయ్యెను.

హనుమంతుఁడు సుగ్రీవునకు మంత్రిగా నుండెను. సుగ్రీవుఁడు వాలిచేఁ దఱుమఁబడినపుడును నితఁడు సుగ్రీవునితోడనే యుండెను. వనములోఁ గ్రుమ్మరుచున్న రామలక్ష్మణులను జూచి సుగ్రీవుఁడు భయమునొంది వార లెవ్వరో కనుగొని వచ్చుటకు హనుమంతునిఁ బంపెను. ఇతఁడు వెళ్ళి వీరికి నమస్కరించి కుశలమడిగి తాను సుగ్రీవుని మంత్రినని తెల్పి వారిని సుగ్రీవునికడకుఁ గొంపోయెను; అతనికి శ్రీరామలక్ష్మణుల నెఱింగించెను. వారు వచ్చిన కార్య మాతఁ డారసి తన వృత్తాంతము చెప్పికొనియె. హనుమంతుఁడు రాముని దర్శించుట కదియే ప్రారంభము. అప్పటినుండియు శ్రీరామునకు హనుమంతుఁడు నమ్మినబంటయ్యెను. ఇతని సామర్థ్యము శ్రీరాముఁ డెఱిఁగెను. సీతను వెదకుటకై సుగ్రీవుఁడు కపివరులను నలుదిశలకుఁ బంపునపుడు సీత కానవాలుగ నిచ్చుటకుఁ దన యుంగరము శ్రీరాముఁడు హనుమంతుని చేతికే యిచ్చెను. వానరులు తిరిగి తిరిగి యెచ్చటను సీతను గానలేక దక్షిణ సముద్ర తీరమునుజేరి, సీతను జూడకయే కిష్కింధకుఁ బోవిచ్చగింపకయు ప్రాయోపవేశులై యుండిరి. వీరి మాటల సందడి విని సంపాతి వచ్చి సీతను లంకలో రావణుఁ డుంచెనని చెప్పెను. లంకను చేరుటకు సముద్రము దాటవలయును. దానికిఁ దగినవార లెవరని తమలోఁ దా మాలోచించుకొనుచుండిరి. సముద్రమును దాటఁగలిగినవాఁడు హనుమంతుఁడే యని జాంబవంతుఁ డెఱింగించెను.

హనుమంతుఁ డపుడు తనకంత శక్తికలదని తెలిసికొని సముద్రముదాట నుద్యుక్తుఁడయ్యెను. రింగున నెగిరి సముద్రముదాటుచుండెను. సముద్రములో దాఁగియుండిన మైనాకము పైకివచ్చి తనమీఁదఁ గొంతసేపు విశ్రమింపుమనియె. హనుమంతుఁడు కొంతతడవువిశ్రమించి మరల బయలు దేఱెను. ఇతనికి సురస యెదురుగవచ్చెను. ఆమె శరీరముపెంచి హనుమంతునకు మార్గములేకుండఁ జేసెను. ఇతఁడు సూక్ష్మరూపుఁడై ఆమెశరీరము చొచ్చి మరల బయటకువచ్చెను. వీనిని ఛాయాగ్రహమొకటి యడ్డగించెను; దానిని సంహరించి హనుమంతుఁడు లంకాపట్టణముచేరెను. ద్వారము కడనుండిన లంకయనురాక్షసి యితనిని లోపలకుఁ బోనీయలేదు. ఇతఁడు పోరాడి యామెను మోది లంకలో ప్రవేశించెను. లంకాపట్టణ మంతయుఁ గలయఁదిరిగెను. తుదకు అశోకవనములో రాక్షస పరివేష్టితయై దుఃఖించుచుండిన సీతను జూచి రాక్షసులు వెడలినపిమ్మట చెట్టుదిగి సీతనుజేరి తాను శ్రీరాముని భటుఁడనని తెల్పి యానవాలుగ నతనియుంగరమిచ్చి తనతో నామెను రమ్మని యెను. ఆమెవలన శ్రీరామునకై కొన్ని యానవాళ్ళను గ్రహించెను.

హనుమంతుఁడు సీతను జూచిన సంతోషము చేతను, రావణునెడఁగల నిర్లక్ష్యముచేతను రాక్షసేశ్వరుని నగరము పాడుచేయఁ జొచ్చెను. ఉద్యాన వనములయందలి మొలకలను పెఱికి వేసెను. జలయంత్రములు ధ్వంసముచేసెను. ఒక్క కపి యేమిచేయునని రాక్షసులు మొదట నుపేక్షచేసిరి. కాని హనుమంతుఁడు రావణుని భటులనుగూడ మోదెను. వారు రావణునితోఁ జెప్పికొనిరి. వానిని బట్టుకొనుటకుఁ గొందఱు భటులను బంపిరి. వారిని హనుమంతుఁడు సంహరించెను. వానితో యుద్ధముచేయుటకు జంబుమాలిని, అక్షయకుమారునిఁగూడఁ బంపిరి. వీరిరువురనుగూడ హనుమంతుఁడు చంపెను. అప్పు డింద్రజిత్తు వచ్చి బ్రహ్మాస్త్రము ప్రయోగించి వీనిని బంధించెను. హనుమంతుఁడు

బ్రహ్మను బ్రార్థించి ముక్తుఁడయ్యెను. ఇతనిని గట్టిపెట్టి రావణునికడకుఁ దీసికొని వెళ్ళిరి. వానరుఁ డింతపని చేయుటేమి యని రావణుఁడు నివ్వెరపడి వీనితో సంభాషించుచుండెను. హనుమంతుఁడు వానిని ధిక్కరించుచు సీతను దొంగతనముగఁ దెచ్చినందుకు నిందించుచుండెను. రావణునకుఁగోపమువచ్చి హనుమంతుని వాలమునకు బట్టలుచుట్టి వాని నంటించుమని యానతిచ్చెను. భటులట్లుగావించి వస్త్రమునకు నిప్పుపెట్టిరి. హనుమంతుఁడు అగ్నిని, వాయువును దలఁచుకొని బ్రార్థించి విభీషణుని గృహమును, సీతయున్న యశోకవనమును దప్ప లంకనంతను గాల్చెను. సీతను జూచివచ్చుటకుఁ బంపఁగా హనుమంతుఁ డట్లు లంకనుగాల్చె. పిమ్మట నితఁడు సీతకడ సెలవునుతీసికొని సముద్రము దాటివచ్చి కిష్కింధనుజేరి సీతను జూచిన వృత్తాంత మెఱుకపఱచెను.

శ్రీరామలక్ష్మణులును, సుగ్రీవుఁడును సేనలతో యుద్ధమునకు బయలుదేఱిరి. సముద్రమునకువారధికట్టి లంకలోఁ బ్రవేశించిరి. యుద్ధమారంభించిరి. హనుమంతుఁడు శ్రీరామునకు వాహనమయ్యెను. ఇతఁడును రాక్షసులతోఁబోరి వారిని సంహరించెను.

అతికాయ మహాకాయాది వీరులు మడిసిన పిమ్మట ఇంద్రజిత్తువచ్చి యుద్ధము చేయుచుండెను. అతని సునిశితబాణములకు లక్ష్మణుఁడు మూర్ఛవోయి లేవలేకపోయెను. హిమాలయపర్వతము దగ్గఱ చంద్రగిరి, ద్రోణగిరుల మధ్యను మహోదయాద్రియందు ఇంద్రుఁడు మందు దాఁచియుంచెను. దానిని దెమ్మని హనుమంతునిఁబంపిరి. హనుమంతుఁడుచనియెను. కాని యచ్చటఁగాపురమున్నవార లామందునీయమనిరి. అప్పుడు వానితోఁ బోరాడుట పనిగాదని హనుమంతుఁడు పర్వతమునే పెకలించి పట్టుకొని వచ్చెను. శ్రీరాముని సేనలోనివా రా మందు నుపయోగించిరి. మరలహనుమంతుఁడుపర్వతమును యథాస్థానమున నుంచెను. ఇంద్రజిత్తుకూడ మరణించినపిమ్మట రావణుఁడేవచ్చి యుద్ధము చేసెను. అతఁడు రామలక్ష్మణులతోడనే పోరుచుండెను. వారిపైబాణవర్షము కురిపించుచుండెను. లక్ష్మణుఁడు మూర్ఛపోయెను.

హనుమంతుఁడు మరల సంజీవిని దెచ్చుటకరిగెను. ఇతఁడు చనఁబోవుట రావణుఁ డెఱిఁగి వీని నుపాయంబుగఁ జంపుటకు మాల్యవంతుని కుమారుఁడగు కాలనేమిని బంపెను. కాలనేమి హనుమంతునికంటె ముందుగఁజని యొక ముని వేషమున ద్రోణపర్వత సమీపమునఁ దపస్సు చేసికొనువానివలెఁ గూర్చుండెను. ఇతనికడకు వచ్చిన హనుమంతునిఁ బల్కరించి తాను రామభక్తునట్లు మాట్లాడెను. హనుమంతుఁడు దప్పిగొని యుండుటెఱింగి యా సమీపమున నున్న కొలనులో జలమును ద్రావుమనెను. ఆ కొలనులో మొసలి కలదు. అది యెవరినైనను అందడుగిడఁగనే పట్టి సంహరించుచుండెను. అది యా మడువున దిగిన హనుమంతునిఁ బట్టుకొనెను. కాని యితఁడు దాని నుక్కడంచె. అది శాపవిమోచనమొంది, ధాన్యమాలియై లేచి తన వృత్తాంతమెఱింగించి రావణుఁడును, గాలనేమియు హనుమంతుని వంచించుటకుఁ జేసినయత్నము చెప్పెను. అటనుండి వచ్చుచు హనుమంతుఁడు కాలనేమిని జూచి వానిని సంహరించెను. పిమ్మట సంజీవనినిఁ దేరఁజనఁగా నటనున్న గంధర్వులు వాని కొటంకము కలిగించిరి. ఇతని నచ్చటనే యుండుమని బ్రతిమాలిరి. కాని హనుమంతుఁడు వారితోఁ బోరి వారినోడించి పర్వతమును బెకలించి దానిం గొనివచ్చుచుండె. దీని నెఱింగిన రావణుఁడు హనుమంతుని నడ్డగించుటకు మాల్యవంతునిఁ బంపెను. మాల్యవంతుఁడు పరివారసమేతుఁడై హనుమంతు నెదిరించెను. వారిల డను బోరి హనుమంతుఁడు వారిని దఱిమి సంజీవనియున్న ద్రోణపర్వతమును గొనివచ్చెను.

పిమ్మట హనుమంతుఁడు ఖడ్గరోమాది రాక్షసవీరులతోఁ బోరి వారిని సంహరించెను. రావణుఁడు సంహరింపఁబడినపిదప శ్రీరామవిజయము నితఁడే ముందుగ సీతకుఁ దెలియఁబఱచెను. మఱియు నితఁడు శ్రీరామునిపంపున ముందుగ శృంగిబేరిపుర మరిగి గుహునకును, నందిగ్రామ మరిగి భరతునకును శ్రీరామరాక నెఱింగించి, శ్రీరామునితో నయోధ్య చేరి సీతారాముల పట్టాభిషేకమైనపిదప వారి సెలవు గైకొని వచ్చెను.

భీముఁడు సౌగంధికహరణార్థ మేగినపుడు హనుమంతుఁడు తోఁకచాపుకొని త్రోవకడ్డముగఁ

గూర్చుండెను. భీముఁడు గ్రోవయిమ్మని యడిగెను. నేను వృద్ధుఁడను. నాలోఁక నీవే ప్రక్కకు దీసి వెళ్లుమని హనుమంతుఁడు చెప్పెను. ఇతఁడు హనుమంతుఁడని భీముఁ డెఱుఁగఁడు. భీముఁడు హేళనగ నెడమచేతితో దాని నెత్తఁబోయెను; అది కదలలేదు. రెండుచేతులతోడను బట్టెను; తన శక్తినంతయు వినియోగించెను. అయినను గదలలేదు. అప్పు డతఁడు హనుమంతుఁడని భీముఁడు తెలిసికొని నమస్కరించెను. భీముఁ డతనిని వేఁడఁగా హనుమంతుఁడు ప్రసన్నుఁ డయ్యెను. అతనికిఁ బూర్వరూపముకూడఁ జూపించెను. యుద్ధమునఁ బాండవులకు సహాయము చేసెదననియె. కాని అర్జునునిధ్వజముపైఁ లాంఛనముగ గ్రహింపఁబడియెను.

రామా. భార.

హయగ్రీవుఁడు:- విష్ణుమూర్తి. దానవులతో యుద్ధము చేసి చేసి డస్సి విష్ణుమూర్తి ఎక్కుపెట్టిన తన ధనుస్సుపైఁ దలపెట్టుకొని నిద్రించుచుండెను. ఇంతలో దేవతలు యజ్ఞములు చేసి, యజ్ఞభాగములను విష్ణుమూర్తి కర్పించుటకై చూచి యతనిని గానక వెదకి వెదకి నిదురించుచున్న వానినిఁ జూచిరి. కాని విష్ణుమూర్తిని లేపుట కందఱును సందేహించిరి. బ్రహ్మకూడ వెనుదీసెను. అపుడు శివుఁ డొకయుపాయము చెప్పెను. ధనుస్సుయొక్క నారిని త్రెంపి వైచుచో విష్ణుమూర్తి తల కదలి యతనికిఁ దప్పకుండ మెలకువ వచ్చునని చెప్పెను. ఆ పని చేయుటకై బ్రహ్మ వమ్రి యను నొక కీటకము నడిగెను. అదియు నిద్దురపోవువానిని లేపుట పాపమని సందేహించెను గాన దానికిఁ గావలసిన యాహార మనుదినము బ్రహ్మ యిచ్చుటకు నొడంబడెను. పిమ్మట ఆ కీటకము నారిని గొఱికివైచెను. ఎక్కుపెట్టఁబడి యుండిన ధనుస్సుయొక్కనారి కొఱుకఁబడి యుండుటచే ధనుస్సు త్రుళ్ళి విష్ణుమూర్తి మెడకుఁ దగిలెను. ఆ దెబ్బ వలన విష్ణుమూర్తి శిరమూడిపోయెను. (దీనికి లక్ష్మిశాపము కలదు. చూడుము లక్ష్మి.) ఇంద్రాది దేవతలు బెగడొంది వగచుచుండిరి. వీరి నోదార్చి బ్రహ్మ నిగమములచే దేవిని స్తుతింపుఁడని చెప్పెను. వారు దేవిని ప్రార్థించిరి. ఆమె ప్రసన్నయై వచ్చి కారణములేక కాదట్లగుట యని హయము తల విష్ణుమూర్తి శరీరమున గంటింపుఁడని చెప్పెను. విశ్వకర్మచేత హయగ్రీవము చేయించి దేవత లశ్వే హయము మెడను, దలను దెచ్చి యా మొండెమున కతికిరి. కావున విష్ణుమూర్తి హయగ్రీవుఁడయ్యెను. ఇతఁడు హయగ్రీవుఁడను దనుజుని సంహరించెను.

దే. భా.

విష్ణుమూర్తి జలరాశియందుఁ గొంతకాలము శయనించి మేల్కాంచి సృష్టి చేయఁదలఁచుకొనెను. అతని నాభినుండి కమలమును, నందుండి బ్రహ్మయును జన్మించిరి. బ్రహ్మ సృష్టికాదిగ నాల్గువేదములను సృజించెను. కాని మధుకైటభులు వీనిని హరించి రసాతలమునకుఁ గొంపోయి యచ్చట వానిని బంధించిరి. వేదములులేక సృష్టిసాగింపలేనని బ్రహ్మ మొఱపెట్టుకొనెను. అంత విష్ణుమూర్తి హయశిరంబునుదాల్చి పాతాళమునకుఁ జని ప్రణవరూపంబగునాదము ద్యోతితముచేసెను. దీనిని విని మధుకైటభులు నాదము బయలు వెడలిన చోటునకువచ్చిరి. ఈ లోపున విష్ణువు వేఱొక మార్గమునఁబోయి వేదములను గొనివచ్చెను. రాక్షసులు తాము పోయినచోటున నెవ్వరిని గానక మగిడివచ్చి వీనిచే వేదంబులు గొనిపోఁబడుట నెఱింగి యీ హయగ్రీవుని యుద్ధమునకు రమ్మనిరి. ఇతఁడు వారినివధించెను. అంతటనుండి సృష్టిపెరిగెను.

హయగ్రీవుఁడు:- ఒక దనుజుఁడు. ఇతఁడు పెక్కేండ్లు దేవినిఁ బ్రార్థింపఁగా నామె ప్రత్యక్షమై నీకేమికావలయును ? కోరుకొనుమని చెప్పెను. నాకు మృతిలేకుండఁ జేయుమని యతఁడు కోరెను. కాని యది యసంభవమని దేవి దెల్పి మఱియొకవరమును వేఁడుమనియెను. మృతివచ్చెనేని 'హయగ్రీవుఁడు'అనువానివలననే చచ్చునట్లు అతఁడు కోరెను. దేవి యట్లనుగ్రహించెను. ఆ వరమును గైకొని వీఁడు గర్వితుఁడై దేవతలను బాధపెట్టుచుండెను. వీనినిసంహరించుటకై విష్ణుమూర్తి హయగ్రీవుఁడయ్యెను.

దే. భా.

హయహయుఁడు:- లక్ష్మియు, విష్ణుమూర్తియు గుఱ్ఱపురూపములతోనుండి సంభోగింపఁగా బుట్టిన కుమారుఁడు. వీనిని తుర్వసునాశ్రమమున విడిచి వారు చనిరి. చపుఁడను విద్యాధరుఁ డీ బాలుని దీసి వీఁ డెవ్వఁడో తెలియక యింద్రునికడకుఁ

దీసికొనిపోయెను. ఇతనిని గాళిందీతీరమున విడువుమని ఇంద్రుఁడు చెప్పెను. యయాతి సూనుఁడు పుత్త్రునికై విష్ణువును బ్రార్థింపఁగా నీకుఁ బుత్త్రుఁడగువాఁడు గాళిందీతీరమున నున్నాఁడు, పెంచుకొనుమని విష్ణువు చెప్పెను. అతఁ డీ బాలుని దీసికొనివచ్చి పెంచెను. హయహయుఁ డొకనాఁడు గంగాతీరమున సంచరించుచు నొక కాంత యేడ్చుచుండుటఁ జూచెను. ఆమెను డగ్గఱి నీ వెవరవు ? ఏల యేడ్చుచుంటివి ? అని యడిగెను. "అయ్యా ! నాపేరు యశోమతి. రభ్యునికుమారిత యగు ఏకావళి యను నా చెలికత్తెను కాలకేతుఁడు హరించి పాతాళలోకమున దాఁచెను. ఆమెతో నేనుగూడ నరిగితిని. ఆ దనుజుఁ డామెకుఁ గాపుపెట్టి తనను బెండ్లియాడుమని నిర్బంధించుచుండెను. హయహయున కిచ్చి వివాహము చేసెదనని రభ్యుఁ డామెతోఁ జెప్పియుండుటచే హయహయునేకాని వివాహముకొనని నాచెలి చెప్పెను. నేనువచ్చి దేవిని బ్రార్థించితిని. హయహయుఁడే విడిపించునని యామెచెప్పెను" అని యశోమతి చెప్పఁగా నేనే హయహయుఁడను. పాతాళలోకమున కెట్లుపోవలయు ? నని యతఁ డడిగెను. యశోమతికి మంత్రశక్తికలదు. కావున నామె హయహయునిఁ బాతాళలోకమునకుఁ గొంపోయెను. ఇతఁడు కాలకేతుని సంహరించి యేకావళిని వివాహమయ్యెను. దే. భా.

హరి:- త్రిపురాసురులలో నొకఁడైన తారకాక్షుని కుమారుఁడు. ఇతఁడు విష్ణుమూర్తిని గూర్చి ప్రార్థింపఁగా విష్ణువు ప్రత్యక్షమయ్యెను. హరి యిట్టివరముకోరెను. "తమపురములలో నెవ్వరేని చనిపోయినచో వానిశవమును బావినీటదదుపఁగా నఁగుండి యట్టివారలే పదిమందిపుట్టిరావలయును. అట్టి ప్రభావముగల జలముతోఁ గూడిన బావి తమనగరములో నుండవలయు." ఆ వరము విష్ణు వొసంగెను. కాని శివునిచూడ్కిచే నగరము లన్నియు నొక్కసారి దహింపఁబడియె. భార.

హరికేశుఁడు:- ఒక యక్షుఁడు. పూర్ణభద్రుని పుత్త్రుఁడు. ఇతఁడుశివునిఁగూర్చి తీవ్రమైనతపస్సు చేసెను. దాన నితనిశరీరముపైఁ బుట్టలుకూడఁ గట్టెను. శివుఁడుప్రత్యక్షమై యితనికిఁ గాశీనగరమున దండనాయకపదవి నిచ్చెను. భార.

హరితుఁడు:- రోహితుని కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు చంపుఁడు. భాగ.

హరితుఁడు:- యువనాశ్వుని కుమారుఁడు. అంబరీషుని మనుమఁడు. ఇతనికుమారులు అంగిరసులు. విష్ణు.

హరివర్షుఁడు:- ఆగ్నీధ్రుని కుమారుఁడు. ఇతని పేరనే యితఁడు పాలించిన హరివర్షము పరగుచుండెను. విష్ణు.

హరివాసము:- ఉత్తరదేశమున నొక పురము. దిగ్విజయార్థ మరిగిన యర్జునుఁ డిచ్చటకును జనియెను. భార.

హరిశ్చంద్రుఁడు:- సూర్యవంశపు రాజు. త్రిశంకుని పుత్త్రుఁడు. ఇతఁ డయోధ్యను బాలించెను. ఇతని భార్య చంద్రమతి. కడుసాధ్వి. హరిశ్చంద్రుఁడు సంతానములేక విచారించుచుండగా నారదుఁడు వచ్చి వరుణవ్రతమును సేయుమని చెప్పెను. పుట్టిన కుమారునిఁ బశువుగఁజేసి యాగము చేయుదునని యితఁడు మ్రొక్కుకొని వ్రత మాచరించెను. హరిశ్చంద్రునకు రోహితుఁడను కుమారుఁడు కలిగెను. పుట్టఁగనే వరుణుఁడు వచ్చి యాగము చేయుమనియె. హరిశ్చంద్రుఁడు పురుడు వెళ్ళినతరువాతఁ జేసెదనని చెప్పెను. వరుణుఁడు మఱల వచ్చెను. కుమారునికిఁ బండ్లు వచ్చినతరువాత యాగముచేసెదను అని యితఁ డనియె. వరుణుఁడు మరల వచ్చెను. కాని పుత్త్రునిపైఁ బ్రేమచే హరిశ్చంద్రుఁ డట్లే యేదో వంక చెప్పుచుఁ గాలయాపన చేయుచుండెను. రోహితుఁడు తండ్రి తలఁపునుగూర్చి చింతించి ఇంటనుండక అడవికేగెను. వరుణునకు కోపము వచ్చెను. తండ్రికిఁ గలిగిన యనారోగ్యమును గూర్చి విని రోహితుఁడు వచ్చుచుండఁగా నింద్రుఁడు ముదుసలివానివలె వచ్చి నీవు పుణ్యకథలను వినుచు, బుణ్యనదులందు స్నానము చేయుము. నీకు మేలుకలుగునని చెప్పెను. రోహితుఁ డట్లుచేసి గృహముచేరునప్పటి కైదు సంవత్సరము లయ్యెను. ఆఱవ సంవత్సరమున రోహితుఁడు మరలి వచ్చుచు అజీగర్తుని మధ్యమపుత్త్రుని శునశ్శేపునిఁ దీసికొనివచ్చి హరిశ్చంద్రున కిచ్చెను. శునశ్శేపునితీసికొనివచ్చి యాగపశువుగఁ జేసి హరిశ్చంద్రుఁడు పురుష యాగమేధము చేసెను. యాగమునకు హోత

విశ్వామిత్రుఁడు, అధ్వర్యుఁడు భృగువు, బ్రహ్మ జమదగ్ని, సామగానము చేయువాఁడు వసిష్ఠుఁడు. ఇతని యాగమును నింద్రుఁడు, వరుణుఁడు మొదలగువారు కొనియాడిరి. ఇంద్రుఁ డితనికి కనకరథమును దెచ్చి యిచ్చెను. విశ్వామిత్రుఁ డత్యంతప్రీతుఁడై హరిశ్చంద్రునకు ముఖ్యజ్ఞానమును దయచేసెను. భాగ.

ఇంద్రసభయందు సత్యమునుదప్పక పల్కువాఁ డెవఁడని ప్రశ్నవచ్చెను. భూలోకమున హరిశ్చంద్రుఁడు కలడని వసిష్ఠుఁడు చెప్పెను. వసిష్ఠునకును, విశ్వామిత్రునకును వైరముగావున విశ్వామిత్రుఁడు లేచి, హరిశ్చంద్రుఁ డనఁగ నెంత? వసిష్ఠుఁ డాతని పురోహితుఁడు గాన నట్లు పలికెనుగాని, యతఁడు మాత్రము సత్యముదప్పనివాఁడా? నేను వానిచే నబద్ధము నాడించెదనని ప్రతిజ్ఞ చేసెను. వసిష్ఠుఁడును, విశ్వామిత్రుఁడును పన్నిదములు వేసికొనిరి. పిమ్మటఁ గొంతకాలమునకు విశ్వామిత్రుఁడు హరిశ్చంద్రునికడకువచ్చి తాను యాగము చేయఁబోవుచున్నాననియును, విశేషధనము కావలసి యున్నదనియును జెప్పెను. హరిశ్చంద్రుఁ డిచ్చెదను కొనిపొమ్మనియె. ఇప్పటికి నీయొద్దనే యుంచుము. నాకుఁ గావలసి వచ్చినపుడు తీసికొందు నని విశ్వామిత్రుఁడు వెళ్ళిపోయెను.

కొన్నిదినములు పోయినతరువాత పౌరులు కొందఱు వచ్చి మృగములు తమ పైరులను బాధచేయు చున్నవని చెప్పికొనఁగా నితఁడు వేఁటాడుటకై యరణ్యమున కేగెను. అచ్చట వేఁటాడి విశ్రమించి యుండినపుడు మాతంగకన్య లిరువురువచ్చి నాట్యము సల్పిరి. వారికి బహుమాన మీయఁబోఁగా వారు దానిని నిరాకరించి హరిశ్చంద్రునితోడి పొందును గోరిరి. ఇతఁడు వారికి బుద్ధిచెప్పి పంపెను. వారు విశ్వామిత్రునితో హరిశ్చంద్రుఁడు తమ్ము బాధించెనని చెప్పిరి. తన కుమారికల వంటి యీ కన్యలను బాధించువా? యని విశ్వామిత్రుఁడు హరిశ్చంద్రునిపైఁ గోపగించి వారిని సంతోషపెట్టుమని యీతనితో ననియె. తనరాజ్యమునైన నిచ్చెదనుగాని ఏకపత్నీవ్రతము తప్పనని హరిశ్చంద్రుఁడు చెప్పెను. అట్లైనఁ దెమ్ము నీరాజ్యమును అని విశ్వామిత్రుఁ డడిగెను. హరిశ్చంద్రుఁడు రాజ్యమును విశ్వామిత్రునకు ధారవోసి తానును, భార్యయును, కుమారుఁడును నగరము విడిచిరి. అపుడు విశ్వామిత్రుఁడు వచ్చి తనకిచ్చెదనన్న ధనము నిమ్మనియెను. రాజ్యమునంతయు నిచ్చివేసెను; ఇఁక నతనికడ ధనము లేకుండుటచేఁ దనభార్యనుఅమ్మి యిచ్చెదనని హరిశ్చంద్రుఁడు చెప్పెను. ధనమిచ్చుటకై కొంత గడువుంచి వారివెంట విశ్వామిత్రుఁడు తన శిష్యుని నక్షత్రకుఁ డనువానినిఁ బంపెను. వారందఱును గలసి కాశీపురమునకు బ్రయాణమైరి. మార్గమందు హరిశ్చంద్రునకుఁ గలిగిన బాధలు, నక్షత్రకుఁడు పెట్టిన బాధలు నింతింతగావు. "విశ్వామిత్రునకు ధనము ఇచ్చెదనని నేను చెప్పలేదనుము. నేను వెళ్లిపోయెదను. మీకీ కష్టములుండవు" అని యెన్నిసారులో నక్షత్రకుఁడు చెప్పి హరిశ్చంద్రునిచే నబద్ధము నాడింపఁ జూచెనుగాని హరిశ్చంద్రుఁ డట్లనిన వాఁడు కాఁడు.

కాశీనగరము చేరినతరువాత హరిశ్చంద్రుఁడు తనభార్యను గౌశికుఁడను బ్రాహ్మణున కమ్మివేసెను. అయినను విశ్వామిత్రుని యప్పు తీరలేదు. తనను గూడ నమ్మివేయుమని నక్షత్రకునితోఁ జెప్పెను. తుదకు వీరబాహుఁడను శ్మశానమును గాచు మాలవానికిఁ దా నమ్ముడువడి విశ్వామిత్రుని యప్పు తీర్చివేసెను.

ఇంకను నతని కష్టములు తీరలేదు. అతనిచే నసత్యము నాడించుటకు విశ్వామిత్రుఁ డింకను నతనికి బాధలు కల్పించుచుండెను. శ్మశానమునకు శవమును దీసికొనివచ్చినవారియొద్ద సుంకమును దీసికొని శవములను దగులఁబెట్టించుట యీతఁడు చేయుచుండినపని. రోహితుని పాము గఱచుటచే నతఁడు మరణించెను. చంద్రమతి తన యజమానునింటఁ బనులు గావించి రాత్రివేళ నా చనిపోయినకుమారుని శ్మశానమునకుఁ గొనివచ్చెను. కాని యీమెకడ సుంకము చెల్లించుట కేమియు లేదు. ఆమె మెడలోనుండిన మంగళసూత్రము నమ్మి డబ్బు తెమ్మని హరిశ్చంద్రుఁడు చెప్పెను. ఆమె మంగళసూత్రము ఆమెభర్తకుఁ దప్ప నన్యులకు

గోచరింపదు. కావున నీతఁడు హరిశ్చంద్రుఁడని యామె గుర్తించెను. ఒకరి నొక రెఱింగిరి. హరిశ్చంద్రునకుఁ గల్గిన దుఃఖమునకు మితి లేదు. యజమానుని యాజ్ఞను దాటరాదు. కావున మంగళసూత్ర మమ్మిరమ్మని యతఁడు భార్యను బంపెను. ఆమె నగరములో నడుచుచుండఁగా ఆ నగరాధిపతికుమారుని నీమెయే చంపెనని రాజభటు లీమెను పట్టుకొనిరి. ఈమె కురిశిక్ష విధింపఁబడెను. ఈమె తల నఱుకుటకై హరిశ్చంద్రునియొద్దకే యీమెను దీసికొని వచ్చిరి. చంద్రమతి యే పాప మెఱుఁగదని హరిశ్చంద్రుఁ డెఱుఁగును. అయినను దా నాజ్ఞాపింపఁ బడినట్లు చేయవలయును; కత్తిదీసి దనభార్య మెడపైఁ బెట్టెను. కాని యయ్యది పుష్పమాలయయ్యె. ఇంద్రాదులు హరిశ్చంద్రునకు ప్రత్యక్షమయిరి. విశ్వామిత్రుఁడు వచ్చి యతనిచే నసత్యము నాడింపలేకపోతినని యొప్పుకొనెను.
మార్క.

హారుఁడు:-ధర్ముఁడను మనువుకుమారుఁడు. ఇతని భార్య నంద. భాగ.

హర్యశ్వుఁడు:- దృఢాశ్వుని కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు నికుంభుఁడు. భాగ.

హర్యశ్వుఁడు:- అనరణ్యుని కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు అరుణుఁడు. భాగ.

హర్యశ్వులు:- అసిక్నియందు దక్షునకుఁ బుట్టిన కుమారులు. సృష్టి గావింపుఁడని వీరిని దండ్రి నియమించెను. అద్దానికై వీరు కడంగుచుండఁగా నారదుఁడువచ్చి మీ కీ సంసార బంధన మేల ? ముక్తిసాధనము చూచుకొనుఁడని చెప్పెను. వీరు సృష్టిచేయుట మానిరి.
భాగ.

హలంధనుఁడు:-నాభాగుఁడనువాని కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు వత్సప్రీతి. భాగ.

హవిర్ధానుఁడు:-విజితాశ్వుని కుమారుఁడు. ఇతని భార్య హవిర్ధాని. విజితాశ్వునిపిమ్మట నితఁడు రాజయ్యెను. బర్హిష్మనుఁడు, గయుఁడు, శుక్లుఁడు, కృష్ణుఁడు, సత్యుఁడు, జితవ్రతుఁడు అను నార్గురు ఇతనిపుత్త్రులు. భాగ.

హవిర్ధానుఁడు:-పృథువుయొక్క కుమారుఁడు. ఇతనిభార్య ధిషణ. ప్రాచీనబర్హి, శాంగుఁడు, యముఁడు మొదలగువా రితని పుత్త్రులు.
మత్స్య.

హవిర్ధానుఁడు:-అంతర్ధానునికుమారుఁడు. భాగ.

హవిర్ధానుఁడు:-అర్ధికుమారుఁడు. బ్రహ్మ.

హవిర్భువు:-కర్దముని కూఁతురు; పులస్త్యునిభార్య.
భాగ.

హవ్యవాహుఁడు:-ధరుఁడనువసువుకుమారుఁడు.
మత్స్య.

హవ్యుఁడు:-ప్రియవ్రతుని పుత్త్రుఁడు; శాకద్వీపమునకు రాజు. సుకుమారుఁడు, మణీవకుఁడు, కుసుమోత్తరుఁడు, మోదకుఁడు,మహాద్రుముఁడు ఇతనిపుత్త్రులు. బ్రహ్మ.

హస్తి:- సుహోత్రుని పుత్త్రుఁడు. ఇక్ష్వాకు కుమార్తెయైన సువర్ణ యితని తల్లి. ఇతని భార్య యశోధర. వికుంఠనుఁడు, అజమీఢుఁడు, ద్విమీఢుఁడు, పురుమీఢుఁడు ఇతనికుమారులు. ఇతని పేరిటనే హస్తినాపురము నిర్మింపఁబడెను.

హస్తి:-ఒక యేనుఁగు. పూర్వభవంబున హస్తియను పేరుగల శివకింకరుఁడు; ప్రమథుఁడు. పార్వతీ పరమేశ్వరు లంతఃపురమున నుండఁగా ద్వారపాలకులు వలదనుచున్నను నితఁడు కేళీగృహము లోపలి కరిగెను. పార్వతికి గోపమువచ్చి "నీవు రాఁగూడనిసమయమున మదించిన యేనుఁగువలె వచ్చితివి. నీవు మదపుటేనుఁగు వగు" మని శపించెను. అతఁడు శాపవిమోచనమునకై ప్రార్థించెను. పార్వతి "నీవు గజారణ్యమున శివలింగమును బూజించుచుండుము. నీవుంచిన పత్త్రములను, బుష్పములను కాళ మను సర్పము తీసివేయుచుండును. మీకు నన్యోన్యము పోరాటము కలిగి తుదకు మీరిర్వురును శివసాయుజ్యము బొందుదు రని చెప్పెను. (చూడుము శ్రీకాళహస్తి.)

హా

హాటకదేశము:-అర్జునుఁడు దిగ్విజయయాత్ర మరిగినపు డీ దేశమునకుఁగూడఁ బోయెను. ఇచట మానసము అను కొలను గలదు. భార.

హారీతుఁడు:-ఒకముని. మోక్షధర్మమును జెప్పెను. జనులయొక్క కీడును దలంపక మైత్రి, సమత, కరుణ కలిగి నిందాప్రశంసలకు ఖేదమోదములు పొందకుండుట మొదలగు ధర్మములు చెప్పెను. భార.

హారీతుఁడు:-విశ్వామిత్రుని నూర్గురు కొడుకులలో మొదటి యేబదిలోనివాఁడు. శునశ్శేపుని అన్నఁగా నెంచుటకు నిరాకరించి తండ్రిచే శపింపఁబడెను. భాగ.

హారీతుఁడు:-యౌవనాశ్వుని కుమారుఁడు. భాగ.

హాలాస్యము:-ఒక పుణ్యక్షేత్రము. మధురానగరముయొక్క పూర్వపు పేరు. సుందరేశ్వరుఁ డచ్చటి దేవుఁడు. స్కాంద.

హాలాహలము:- క్షీరసాగరమును మథించునపు డందుండి పుట్టిన విషము. అది పుట్టుటతోడనే రాక్షసులును, దేవతలును బెగడొంది శివునికడకు బోయి వానిని ప్రార్థించిరి. హాలాహలము లోకములను దహింపకుండఁ జేయుటకై శివుఁడు దానిని మ్రింగి కంఠమునం దుంచుకొనెను. అందువలన వాని కంఠము నీలమయ్యెను. భాగ.

హారిద్రుమతుఁడు:-సత్యకాముని గురువు. (చూడుము సత్యకాముఁడు.) మత్స్య. భాగ.

హి

హిడింబి:-హిడింబాసురుఁడను రాక్షసుని చెలియలు. లాక్షాగృహమును వెలువడివచ్చి నిద్రించుచున్న పాండవులను హిడింబుఁడు చూచి యీమెను బిలిచి వారినిబట్టుకొని చంపి దనకు వండిపెట్టుమనియె. హిడింబి వీరికడకు వచ్చి చెట్టుపైనున్న భీమునిజూచి మోహించి నరస్త్రీరూపధారిణియై తనను బరిగ్రహింపుమని భీమునిఁ గోరెను. భీముఁడు తిరస్కరించెను. కుంతిని, భీముని బ్రతిమాలి వారి కుపచారము చేయుదునని వారికి హితముగ అగతములుచెప్పి తన యన్న భీమునిచేఁ జంపఁబడుటకును సహించి తనను భార్యగా నంగీకరింపుమని ప్రార్థించెను. ఆమెకోర్కె తీర్పుమని ధర్మరాజు భీమునకుఁ జెప్పెను. పాండవులను జూడవచ్చిన వ్యాసుఁడు హిడింబినిజూచి దీనిపేరు కమలపాలిక. ఇది భీమునకు వశవర్తినియైయుండి వానివలనఁ బుత్రునిఁ బడయఁగలదు అని చెప్పెను. భీముఁ డా రాక్షసికోర్కె తీర్చెను. ఆమెకు ఘటోత్కచుఁడు అను కుమారుఁడు కలిగెను. భార.

హిడింబుఁడు:- ఒక రాక్షసుఁడు. లక్కయిల్లు వెలువడి వచ్చుచుండిన పాండవులను జూచి తన చెలియలు హిడింబిని బిలిచి నీవు సత్వరముగఁబోయి వారిని బట్టుకొనివచ్చి చంపి నాకు వండిపెట్టుమని చెప్పెను. ఆమె మసలుటచేఁ దానే పాండవులను జంపి తెచ్చుటకు వెడలెను. కాని భీముఁ డీతని నెదిరించి పోరాడి వీనినే చంపెను. భార.

హిమవంతుఁడు:- పర్వతరాజు. ఇతఁడు తపస్సు చేసి తన వంశమును విస్తరింపఁ జేసికొనుటను గోరెను. దేవతలందఱును పితరులకడ కేగి హిమవంతుఁడు వివాహముచేసికొనదలఁచినాడు. అది అందఱకును శ్రేయోదాయకము. అతఁడు మేనకను వివాహముచెసికొనున ట్లాజ్ఞనిండు అని కోరిరి. పితరులయానతిప్రకారము హిమవంతుఁడు మేనకను వివాహమయ్యెను. పిమ్మట నితనిగృహమునకు విష్ణ్వాదిదేవతలు వచ్చి శివుని భార్యయైన సతి యితనికి జన్మించునని చెప్పిరి. వారెల్లరు శివుని స్తుతించిరి. హిమవంతునకు మైనాకుఁడు మొదలగు పుత్రులును, పార్వతియు బుట్టిరి. నారదుఁ డితని గృహమునకు రాఁగా హిమవంతుఁ డతనికి పార్వతిజాతకము చూపి యెట్టిభర్త వచ్చువాఁడని యడిగెను. నారదుఁడు అన్నిలక్షణములు బాగున్నవి కా

దిగంబరుఁడు, శ్మశానమం దుండువాఁడు భర్త యగునని చెప్పెను. హిమవంతుఁడు, మేనకయు నించుక చింతించిరి. కాని నారదుఁడు పార్వతికి భర్తయగువాఁడు శివుఁడు. ఆతని కిచ్చియే వివాహముచేయుఁడని చెప్పెను. తపస్సు చేసి కొనుచున్న శివునికడకు హిమవంతుఁడు వచ్చి యాతని ప్రార్థించి తనగృహమునకుఁ దీసికొని వెళ్ళి పార్వతినిచ్చి పెండ్లిచేసెను. శివ.

హిరణ్యకశిపుఁడు:–దితికుమారుఁడు. ఇతఁడును, నీతని సోదరుఁడు హిరణ్యాక్షుఁడును బూర్వ భవమునందు విష్ణుమూర్తికి జయ విజయు లను ద్వారపాలకులు. శాపవశమున నిట్లు రాక్షస జన్మమెత్తిరి. రాక్షసులయందుఁగూడ వీరిని మించిన భయంకరులును, క్రూరులును లేరు. వీరు నరులను, దేవతలను దృణప్రాయముగ నదిమి వేయుచుండువారు. మూడులోకములను గజగజ వణకించిరి. హిరణ్యాక్షుఁడు భూమినిఁజుట్టుటచే విష్ణుమూర్తి వరాహరూపమున వచ్చి వానిని జంపెను. అదిమొదలు విష్ణుమూర్తిని సంహ రించుట కీతఁడు శపథముచేసెను.

హిరణ్యకశిపుఁడు బ్రహ్మనుగూర్చి పెక్కేండ్లు తపస్సుచేయఁగా బ్రహ్మప్రత్యక్షమై యితఁడు కోరినట్లు జీవమున్నవానిచేఁగాని, జీవములేని వానిచేఁగాని, దేవతలచేఁగాని, యసురులచేఁ గాని, నరులచేఁకాని, రాత్రిగాని, పగలుగాని, జలములోఁగాని, నేలపైఁగాని మరణము లేకుండునట్లు వరము పుచ్చుకొనెను. ఇతఁడు తపస్సుచేయు కాలములో నితనిభార్య లీలావతి నారదు నాశ్రమమున నుండెను. అచ్చటనే ఆమె ప్రహ్లాదునిఁ గనియెను.

హిరణ్యకశిపునకు జంభాసురుని కుమార్తె యగు దత్త యను మఱియొక భార్య గలదు. మఱియుఁబ్రహ్లాదుఁడుగాక నితనికి అనుహ్లాదుఁడు, సంహ్లాదుఁడు, హ్లాదుఁడు అను కుమారులుగలరు. హిరణ్యకశిపుఁడు తపస్సు ముగించి వచ్చి ముల్లోకములను మిక్కుటముగ బాధించుచుండెను. తానే పూజ్యుఁడననియు, విష్ణువు కాఁడనియుఁ జెప్పుచుండెను. విష్ణువును స్తుతించువారిని సంహ రించుచుండెను. ఇతనిపుత్త్రుఁడగు ప్రహ్లాదునకుఁ జదువు చెప్పఁడని చండామార్కులను నియో గించెను. వారేమి చెప్పినను బ్రహ్లాదుఁడు విష్ణువునే స్తుతించుచుండువాఁడు. వీని కెన్నో విధముల హిరణ్యకశిపుఁడు బోధించెను. తుదకు సర్పములచేఁ గఱపించెను; ఏనుఁగులచేఁ ద్రొక్కించెను. ఏమి చేసినను బ్రహ్లాదుఁడు చెక్కుచెదరక విష్ణువునే ధ్యానించుచుండెను. తుదకు హిరణ్యకశిపుఁడు విసిగి కుమారునితో నీ హరి యంతటను గలఁడేని యీ స్తంభమునఁ జూపుమని తన సభామంటపమున నున్న యొక స్తంభమును దన్నెను. దానిఁజీల్చుకొని విష్ణు మూర్తి నరసింహరూపమున వచ్చి హిరణ్యకశిపు నకుఁ దొలి బ్రహ్మయిచ్చిన వరములకు భంగము రాకుండ వానిని దనపాదములపైఁ బెట్టి, తన నఖములతోఁ జీల్చి వధించెను. భాగ.

హిరణ్యధన్వుఁడు:– ఎఱుకలరాజా. ఏకలవ్యుని తండ్రి. భార.

హిరణ్యనాభుఁడు:–కోసలుని కుమారుఁడు. జైమిని తనయుఁడైన సుమంతుని వలన సామ వేదము నేర్చి బ్రహ్మవేత్తలగు ఆవంత్యులు, ఉదీచ్యులు అను నేనూర్గుర కుపదేశించెను. భాగ.

హిరణ్యనాభుఁడు:–విధృతి కుమారుఁడు. ఇతఁడు జైమినిశిష్యుఁడైన యాజ్ఞవల్క్యముని వలన 'అధ్యాత్మ యోగము' నేర్చి యోగా చార్యుఁడయ్యెను. ఇతనికుమారుఁడు పుష్యుఁడు. భాగ.

హిరణ్యనాభుఁడు:– రఘువంశపురాజు. వ్యుషి తాశ్వుని కుమారుఁడు. ఇతఁడు సోమయాజి. వీని కుమారుఁడు కౌశల్యుఁడు. రఘు.

హిరణ్యబంధువు:–ఒక తీర్థము. భార.

హిరణ్యాక్షుఁడు:–దితి కుమారుఁడు; హిరణ్య కశిపుని సోదరుఁడు. వీరు పూర్వజన్మమున జయ విజయులను ద్వారపాలకులు; శాపవశమున నిట్లు పుట్టిరి. వీరతి క్రూరులై మూడులోకము లను బాధపెట్టువారు. వైశ్వానరుని కూఁతురగు ఉపదానవి ఇతనిభార్య. ఉలూకుఁడు, శకుని, భూతసంతాపనుఁడు, మహానాభుఁడు ఇతని కుమారులు. ఇతనిభార్య కృషద్భానువు.

హిరణ్యాక్షుఁడు భూమిని చాపచుట్టినట్లు చుట్టి దానిని పాతాళమునకుఁ ద్రోసెను.

మఱియు విష్ణుమూర్తిని సంహరించెద నని యితఁడు స్వర్గమునకు వెళ్ళుచుండెను. నారదుఁ డెదురుపడి విష్ణుమూర్తి యజ్ఞవరాహరూపమునఁ బాతాళమున నున్నాఁడని చెప్పెను. విష్ణుమూర్తి వీనిని జంపి భూమినుద్ధరించుటకై వరాహరూప మును దాల్చెను. హిరణ్యాక్షుఁడు మగిడివచ్చి యీ వరాహమూర్తితోఁ బోరాడి యాతనివలన సంహరింపఁబడెను. భాగ.

హిరణ్యుఁడు:–ఒకరాక్షసుఁడు. మహాశని యను వాని తండ్రి. బ్రహ్మ.

హిరణ్వంతుఁడు:– అగ్నీధ్రుని కుమారుఁడు. ఇతఁడు హిరణ్యవర్షము పాలించెను. విష్ణు.

హిరణ్వతి:– ఒక నది. ఈ నదీతీరముననే పాండవుల సేన యుద్ధమునందు విడిసెను. భార.

హూ

హూహూ:– ఒక గంధర్వుఁడు. దేవలున కితఁ డపకృతి గావించుటచే మకరమవు కమ్మని దేవలుఁ డితనిని శపించెను. ఇతఁడు మకరమై గజేంద్రునిఁబట్టుకొని హరిచే సంహరింపఁబడి శాపవిమోచనము నొందెను. భాగ.

హృ

హృషీకేశుఁడు:–భగవంతుఁడు. హృషీకమనఁగా విషయేంద్రియ ప్రపంచము. దీని కతీతుఁడై యున్నిక్షితముగ ధరించుటచే ఈ పేరువచ్చెను. హరి.

హే

హేతి:–స్వాయంభువు మనువు కుమారుఁడు. ప్రహేతి సోదరుఁడు. వీరిరువురును గలసి యింద్రాదుల నోడించిరి. వారు విష్ణుమూర్తితోఁ జెప్పికొనఁగా విష్ణుమూర్తివచ్చి వీరి నోడించెను. హేతి కాలుని సోదరియగు భయను బెండ్లి యాడెను. హేతికుమారిత సుకేశి. ఈమెయుఁ, బ్రహేతికుమారిత మిత్రకేశియు వనవిహారము చేయుచు దుర్జయుఁడను రాజును జూచి మోహించిరి. అది వీరు విని తమ కుమారితల నా రాజునకిచ్చి వివాహము గావించిరి. హేతి కుమారుఁడు విద్యుత్కేశుఁడు. వరా. ఉ.రా.

హేమ:– మయుని భార్య. మయునిగుణములకు దేవతలు మెచ్చుకొని వాని కీమె నొసంగిరి. ఈమెపేరిటనే మయుఁ డొక నగరము నిర్మిం చెను. ఈమెకు మాయావి, దుందుభి యను కుమారులు, మందోదరి యను కుమారితయుఁ బుట్టిరి. కొంతకాలమైనపిదప దేవతలు మరల నీమెను బిలిచిరి. భర్తను, బుత్త్రిలను విడిచి యీమె వెళ్ళిపోయెను. ఉ. రా.

హేమకుండలుఁడు:– కృతయుగమందు నైషధ పురములో నున్న యొక వైశ్యుఁడు. ధనికుఁడు. ధర్మశీలుఁడు. శ్రీకుండలుఁడు, వికుండలుఁడు అనువారల తండ్రి. పద్మ.

హేమకూటము:–ఒక పర్వతము.

హేమచంద్రుఁడు:–విశాలుని కుమారుఁడు. ఇతని పుత్త్రుఁడు సుచంద్రుఁడు. రామా.

హేమపద్మాకరము:–మధురాపురమునకు (కావేరీనదిదగ్గఱ) నాగ్నేయమూలనున్న సరస్సు. శివలింగాభిషేకమునకు జలము లభించుటలేదని యచ్చటిజనులు శివునిఁ బ్రార్థించుటచే శివుఁడు ప్రత్యక్షమై తన త్రిశూలముచే మడుగుచేసెను; అందుఁ దన శిరస్సునందలి గంగను బ్రవేశపెట్టి బంగారుపద్మములను మొలచునట్లు చేసెను. అదియే హేమపద్మాకరము. స్కాంద.

హేమవర్మ:–విరాటరాజు తమ్ముఁడు. భార.

హేమవర్మ:–దశార్ణదేశాధిపతి. ఇతని కుమారితయే వంచనచే స్త్రీయైనశిఖండికి వివాహము చేయఁబడెను. భార.

ఆ సంగతి దాసివలన నితనికిఁ దెలియఁగాఁ గోపముతో ద్రుపదునకు 'ఇట్లేలవంచనచేసితి' వని కబురుపంపెను. శిఖండిని జూచుటకుఁ

బంపినవానిని జూడనీయకుండ ద్రుపదుఁడు ఆ దూతను వెడలనంపెను. అంత మిక్కిలి కోపముతో హేమవర్మ ద్రుపదునిదేశముపై దండెత్తెను. ద్రుపదుఁడును, భార్యయును విచారించుచుండిరి. ఇంతలో స్థూలకర్ణునిదయచే శిఖండి మగవాఁడై వచ్చెను. అంత నాగరికమర్మంబుల వాని పుంస్త్వంబు తెలియఁబఱచి హేమవర్మకు విందుగావించి పంపిరి. భార.

హేహాయుఁడు:- యదువంశమువాఁడైన శత్రుజిత్తు కుమారుఁడు. భాగ.

హై

హైహాయుఁడు:- ఒకనాఁడు లక్ష్మి ఒక రాజు గుఱ్ఱమునెక్కి వెళ్లుచుండఁగాఁ జూచుచు నిలుచుండిపోయెను. "గుఱ్ఱమునుజూచి యిట్లేల నిలుచుంటివి? దానిరూపము నీకు మనసయ్యెను గాఁబోలు" నని విష్ణు వామెను బడబ వగుమని శపించెను. (చూడుములక్ష్మి) గుఱ్ఱమురూపమున వచ్చిన విష్ణుమూర్తివలన నీమెకుఁ గుమారుఁడు కలిగెను. అంతట లక్ష్మికిశాపవిమోచనమయ్యెను. ఈ పుత్రునిఁగూడఁ దీసికొనిపోవుదమని లక్ష్మి యనెను. "వీనినివిడువుము. తుర్వసుఁడు పుత్రునిఁ గోరి తపము చేయుచున్నాఁడు. అతఁడు వీనినిఁ బెంచు" నని చెప్పెను. ఈ బాలుఁడే హైహయుఁడు. ఇతఁడు కాలకేతునిఁజంపి 'ఏకావళిని' బెండ్లియాడెను. దేవీ. భాగ.

హైహాయుఁడు:-హైహాయదేశపు రాజు. ఇతఁడే కార్తవీర్యార్జునుఁడు. (చూడుము కార్తవీర్యుఁడు) ఇతఁడు పరశురామునిచే సంహరింపబడుట కట్టి శాపము గలదు. సూర్యుఁ డొకనాఁడు బ్రాహ్మణ వేషమున వచ్చి తన కాహారముగ స్థావరములను బెట్టుమని యతనిని గోరెను. ఇతఁ డొక వనము నిచ్చెను. దానినిసూర్యుఁడు భక్షించుచుండుటచే నది తగులఁబడియెను. అందున్న ఆపవుఁడనుముని యాశ్రమముగూడఁ దగులఁబడియెను. ఆపవునకుఁ గోపమువచ్చి హైహాయుని కారణమునఁ దన యాశ్రమము తగులఁబడియెఁగావున హైహయునే శపించెను.

హో

హోత్రవాహనుఁడు:- రాజర్షి. అంబయొక్క మాతామహుఁడు. (అంబతండ్రి) సాల్వునిచే నిరాకరింపఁబడిన యంబను గాననములో మునుల చెంతను జూచి యామెవృత్తాంతమును దెలిసికొని పరశురామునితోఁ దనసంగతి చెప్పికొనుమనెను. ఇంతలోఁ బరశురాముఁడే యటకు వచ్చెను. ఇతఁడు పరశురామునకు మిత్త్రుఁడు. ఇతం డీమె నాదరించి పరశురామునితో నీమె వృత్తాంతము చెప్పెను. భార.

హ్లా

హ్లాదుఁడు:-హిరణ్యకశిపుని కుమారుఁడు. ఇతని యొక్కభార్య దమని. వాతాపి, ఇల్వలుఁడు వీరి కుమారులు. భాగ.

AC No. 34649